శ్రీమహర్షి వేదవ్యాస ప్రణీత

శ్రీమద్భాగవతము

(దశమస్కంధ ఉత్తరార్ధము)

ఎనిమిదవ సంపుటము

స్వామి తత్త్వవిదానంద సరస్వతి

(బ్రహ్మవిద్యాకుటీర్, పాత అల్వాల్, సికింద్రాబాదు)

గారిచే రచింపబడిన "తత్త్వప్రకాశిక" అనే తెలుగు టీకతో కూడినది

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2025

SRIMADBHAGAVATAMU

Skandha X (Uttarardham) - Volume - VIII
with Telugu Commentary

By
SWAMI TATTVAVIDANANDA SARASWATI

T.T.D. Religious Publication Series No: 826
© All Rights Reserved

First Edition : 2009
Reprint : 2025

Copies: 500

Published by :
SRI ANIL KUMAR SINGHAL, I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

భారతీయ వాఙ్మయంలో పురాణాలు అత్యంత విశిష్టమైనవి. అవి లోకానికి మిత్రులవలె హితాన్ని ఉపదేశిస్తాయి. కాబట్టి, "మిత్ర సమ్మితములు"గా ప్రఖ్యాతి వహించాయి. పురాణాలు ప్రాచీనమైనవైనా ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా ప్రకాశిస్తూ వుంటాయి. అవి మన పురాతన విజ్ఞాన సర్వస్వాలు (Encyclopaedias) అటువంటి పదునెనిమిది పురాణాల్లో అగ్రగణ్యమైనది శ్రీమద్భాగవతము.

'భాగవత'మంటే భగవంతుని గూర్చి వివరించే గ్రంథమని భావం. ఇలాగే 'భగవత్' శబ్దంతో సంబంధించిన నామధేయం కల మరొక ప్రసిద్ధ గ్రంథం 'భగవద్గీత'. భగవంతుడు చెప్పింది భగవద్గీత; ఆ భగవంతుని గూర్చి పలికేది భాగవతము. ఇది ఈ రెంటికి గల అవినాభావ సంబంధం.

వేర్వేరు పురాణాలను, ఇతిహాసాలను రచియించిన వేదవ్యాసుడు బదరికావనంలో సరస్వతీనదీ తీరాన గల తన ఆశ్రమంలో ఒకప్పుడు చింతిస్తూ కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో అక్కడకు విచ్చేసిన నారదమహర్షి, ఆతని వ్యాకులత తెలిసికొని, వ్యాసునితో ఇలా అన్నాడు. 'మునీంద్రా! నీవు ఇంతవరకు ఎన్నో గ్రంథాలను రచించినప్పటికీ, భగవానుడైన శ్రీమహావిష్ణువు యొక్క గుణగుణాలను, మహిమలను, అవతారలీలలను వెల్లడించే కథలతో గూడిన సమగ్ర పురాణమును రచింపలేదు. కావున, అలాంటి ఉత్కృష్ట గ్రంథాన్ని రచిస్తే నీకు పరిపూర్ణమైన మనశ్శాంతి ఏర్పడుతుంది' – అని. ఆ విధంగా నారదుని

ఆదేశాన్ని పాటించి, వేదవ్యాస మహాముని రచించిన ఉదాత్తగ్రంథమే శ్రీమద్భాగవత మహాపురాణం!

ఈ గ్రంథానికి **'భక్తిశాస్త్ర'మని, 'సాత్వత సంహిత' అని, 'మోక్షగ్రంథ'మని, 'హయగ్రీవ బ్రహ్మవిద్య'** అని – అనేక నామములు పూర్వం నుండీ వాడుకలో ఉన్నాయి. ఇవన్నీ శ్రీమద్ భాగవత గ్రంథానికి గల ప్రశస్తిని చక్కగా చాటుతూ ఉన్నాయి.

ఈ సుప్రసిద్ధ గ్రంథానికి **"తత్త్వప్రకాశిక"** – అనే తెలుగు టీక సమకూర్పబడి ఉండటం ప్రస్తుత ప్రచురణలోని ముఖ్య విశేషం! ప్రతిపదార్థ తాత్పర్యాలతో కూడిన ఈ తెలుగు టీక సరళమైన భాషలో, సులభ సుందరశైలిలో, సామాన్య పాఠకులను సైతం ఆకట్టుకొనే రీతిలో సముచితంగా కొనసాగింది. సార్థక నామమయిన ఈ టీకను రచించిన సహృదయులు, సుగృహీత నామధేయులు, బ్రహ్మవిద్యావిదులు, బహుగ్రంథకర్తలు **పూజ్యశ్రీ తత్త్వవిదానంద సరస్వతీ స్వామివారు.** వారికి కృతజ్ఞతాపూర్వక అభివందనాలు.

పద్మపురాణంలో శ్రీమద్భాగవతం సాక్షాత్తు భగవంతుని స్వరూపంగా నిరూపించబడింది. తదనుగుణంగా భాగవతంలోని మొదటి, రెండు స్కంధాలు భగవంతుని పాదాలు; మూడు నాలుగు స్కంధాలు తొడలు; ఐదవ స్కంధం నాభి ప్రదేశం; ఆరవ స్కంధం హృదయం; ఏడు, ఎనిమిది స్కంధాలు బాహువులు; తొమ్మిదవ స్కంధం కంఠం; పదవ స్కంధం ముఖం; పదకొండవది లలాటం; పండ్రెండవ స్కంధం శిఖ.

పద్మపురాణంలో ప్రశంసింపబడిన క్రమాన్ని బట్టి ప్రస్తుతం ఇది శ్రీమద్భాగవత దశమస్కంధ ఉత్తరార్ధము. ఏకాదశ ద్వాదశ స్కంధాలు త్వరలో వెలువరించే ప్రయత్నాలు సాగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తున్న ఈ ధార్మిక గ్రంథాలు పాఠకుల ఆదరాభిమానాలను చూరగొనగలవని ఆకాంక్షిస్తున్నాను. పాఠకమహాశయులు ఈ పవిత్ర గ్రంథాన్ని ఎప్పటివలె ఆదరించగలరని మా ప్రగాఢవిశ్వాసం.

"భాగవత పురాణ ఫల రసాస్వాదన
పదవిఁగనుడుఁ రసిక భావవిదులు!"

కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

యోగివరేణ్యులు, శ్రీరామలాల ప్రభుజీ వారి
ప్రముఖ శిష్యులు, యోగ సంస్కృతముల
అధ్యయనమునకు స్ఫూర్తినిచ్చిన
పుణ్యమూర్తులు కీర్తిశేషులు
బ్రహ్మశ్రీ ఓరుగంటి నరసింహ యోగివర్యుల
పవిత్రస్మృతికి భక్తిపూర్వకముగా అంకితము.

విషయసూచిక

50. జరాసంధునితో యుద్ధము – శ్రీకృష్ణుడు ద్వారకను నిర్మించుట 1
51. కాలయవనుడు భస్మమగుట – ముచుకుంద స్తుతి 29
52. రుక్మిణి శ్రీకృష్ణునకు రహస్య సందేశమును పంపుట 60
53. శ్రీకృష్ణుడు రుక్మిణిని రక్షించుట 82
54. శిశుపాలాదులను ఓడించి శ్రీకృష్ణుడు రుక్మిణిని పరిణయమాడుట 109
55. ప్రద్యుమ్నుని జన్మ – శంబరాసురుని వధ 136
56. స్యమంతక మణి వృత్తాంతము 154
57. శతధన్వుడు మణిని అపహరించుట – శతధన్వుని ఉద్ధారము 174
58. శ్రీకృష్ణుడు కాళింది మొదలగువారిని పరిణయమాడుట 193
59. భౌమాసురుని ఉద్ధరించుట 220
60. రుక్మిణీ శ్రీకృష్ణ సంవాదము 245
61. అనిరుద్ధుని వివాహము – రుక్మి సంహారము 279
62. ఉషా–అనిరుద్ధుల సమాగమము 298
63. శ్రీకృష్ణుడు బాణాసురునితో యుద్ధము చేయుట 315
64. నృగమహారాజు వృత్తాంతము 340
65. బలరాముడు వ్రజమునకు వెళ్లుట 361
66. పౌండ్రకుని కాశిరాజుని ఉద్ధరించుట 375
67. ద్వివిదుని ఉద్ధరించుట 395
68. సాంబుని వివాహము 407
69. నారదుడు శ్రీకృష్ణుని గార్హస్థ్యమును దర్శించుట 431
70. జరాసంధుని బందీలు శ్రీకృష్ణుని వద్దకు దూతను పంపుట 454

71. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు విచ్చేయుట 478
72. ధర్మరాజు రాజసూయము – జరాసంధుని ఉద్ధారము 502
73. శ్రీకృష్ణభగవానుడు రాజులను బంధవిముక్తులను చేయుట 524
74. శ్రీకృష్ణభగవానుని అగ్రపూజ – శిశుపాలుని ఉద్ధారము 540
75. రాజసూయము సమాప్తమగుట – దుర్యోధనునకు అవమానము 564
76. యాదవులకు శాల్వునితో యుద్ధము 584
77. శాల్వుని ఉద్ధారము 598
78. దంతవక్త్ర, విదూరథుల ఉద్ధారము 617
79. బల్వలుని ఉద్ధారము – బలరాముని తీర్థయాత్ర 635
80. కుచేలోపాఖ్యానము – శ్రీకృష్ణుడు సుదాముని స్వాగతించుట 650
81. కుచేలోపాఖ్యానము – కుచేలుడు ఐశ్వర్యమును పొందుట 671
82. బలరామ శ్రీకృష్ణులను గోపాలకులు గోపికలు కలుసుకొనుట 690
83. శ్రీకృష్ణుని భార్యలతో ద్రౌపది సంతాపము 714
84. వసుదేవుని యజ్ఞోత్సవము 737
85. శ్రీకృష్ణుడు వసుదేవునకు బ్రహ్మజ్ఞానమునుపదేశించి మృతులైన అన్నలను బ్రతికించుట 771
86. సుభద్రాహరణ వృత్తాంతము – శ్రీకృష్ణుడు బహులాశ్వ శ్రుతదేవుల పూజలనందుకొనుట 800
87. వేదస్తుతి 828
88. వృకాసురుని వృత్తాంతము 865
89. భృగువు త్రిమూర్తులను పరీక్షించుట – శ్రీకృష్ణుడు మరణించిన బ్రాహ్మణ బాలకులను మరల బ్రదికించుట 884
90. శ్రీకృష్ణ భగవానుని లీలా విహారము 916

శ్రీమహర్షి వేదవ్యాస ప్రణీత

శ్రీమద్భాగవతము

(దశమస్కంధ ఉత్తరార్ధము)

ఎనిమిదవ సంపుటము

శ్రీగణేశాయ నమః
ఓం నమో భగవతే వాసుదేవాయ

శ్రీమద్భాగవత మహాపురాణమ్

దశమః స్కంధః (ఉత్తర భాగః)

అథ పంచాశత్తమోధ్యాయః

జరాసంధునితో యుద్ధము - శ్రీకృష్ణుడు ద్వారకను నిర్మించుట

శ్రీశుక ఉవాచ ।

అస్తిః ప్రాప్తిశ్చ కంసస్య మహిష్యౌ భరతర్షభ ।
మృతే భర్తరి దుఃఖార్తే ఈయతుస్స్మ పితుర్గృహాన్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భరత-ఋషభ= భరతవంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా!, కంసస్య= కంసుని, మహిష్యౌ= భార్యలగు, అస్తిః= అస్తి, ప్రాప్తిః చ= ప్రాప్తి కూడ, భర్తే= భర్తయగు కంసుడు, మృతే= మరణించగా, దుఃఖ-ఆర్తే= దుఃఖముచే పీడను పొందినవారై, పితుః= తండ్రియొక్క, గృహాన్= ఇంటిని గురించి, ఈయతుః స్మ= వెళ్లిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...కంసుడు మరణించిన తరువాత ఆతని భార్యలగు అస్తి, ప్రాప్తి దుఃఖముతో చాల పీడను పొందిరి. వారు తండ్రియగు జరాసంధుని యింటికి వెళ్లిరి.

పిత్రే మగధరాజాయ జరాసంధాయ దుఃఖితే ।
వేదయాంచక్రతు స్సర్వ మాత్మవైధవ్య కారణమ్ ॥ 2

దుఃఖితే= దుఃఖమును పొందియున్న వారిద్దరు, పిత్రే= తండ్రి యైనట్టియు, మగధరాజాయ= మగధదేశప్రభువగు, జరాసంధాయ=

జరాసంధుని కొరకు, ఆత్మ వైధవ్యకారణమ్= తమ వైధవ్యము యొక్క కారణమును, సర్వమ్= అంతనూ, వేదయాంచక్రతుః= విన్నవించిరి.

దుఃఖితలైన వారిద్దరు తమ తండ్రి మగధదేశప్రభువగు జరాసంధునకు, తమకు వైధవ్యము కలిగిన కారణమునంతనూ వివరించి చెప్పిరి.

స తదప్రియమాకర్ణ్య శోకామర్షయుతో నృప ।
అయాదవీం మహీం కర్తుం చక్రే పరమముద్యమమ్ ॥ 3

నృప= ఓ రాజా!, తత్= ఆ, అప్రియమ్= ఆపదను గురించి, ఆకర్ణ్య= విని, శోక-అమర్షయుతః= దుఃఖముతో కోపముతో కూడిన, సః= ఆ జరాసంధుడు, మహీమ్= భూమిని, అయాదవీమ్= యాదవులు లేనిదానినిగా, కర్తుమ్= చేయుటకు, పరమమ్= పెద్ద, ఉద్యమమ్= ఉద్యమమును, చక్రే= చేసెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ జరాసంధుడు ఆ ఆపదను గురించి విని దుఃఖమును, కోపమును పొందెను. ఆతడు భూమిపై యాదవులు లేకుండా చేయుటకు పెద్ద ఉద్యమమును మొదలు పెట్టెను.

అక్షౌహిణీభిర్వింశత్యా తిసృభిశ్చాపి సంవృతః ।
యదురాజధానీం మథురాం న్యరుణత్సర్వతోదిశమ్ ॥ 4

అక్షౌహిణీనామ్= అక్షౌహిణుల యొక్క, వింశత్యా తిసృభిః చ అపి= ఇరవై మూడింటితో, సంవృతః= చుట్టువారబడినవాడై, యదురాజధానీమ్= యాదవుల రాజధానియగు, మథురామ్= మథురను, సర్వత-దిశమ్= అన్ని దిక్కులనుండి, న్యరుణత్= ముట్టడించెను.

ఇరవై మూడు అక్షౌహిణీల సైన్యము చుట్టువారి రాగా, ఆతడు యాదవుల రాజధానియగు మథురను అన్ని దిక్కులనుండి ముట్టడించెను

(21,870 ఏనుగులు, 21,870 రథములు, 65,610 గుర్రములు, 1,09,350 పదాతులు కలిసి ఒక అక్షౌహిణి. కాని, ప్రస్తుతములో ఆ పదమునకు మరింత చిన్న సైన్యము అర్థము కావచ్చును).

నిరీక్ష్య తద్బలం కృష్ణ ఉద్వేలమివ సాగరమ్ ।
స్వపురం తేన సంరుద్ధం స్వజనం చ భయాకులమ్ ॥ 5

కృష్ణః= శ్రీకృష్ణుడు, ఉద్వేలమ్= చెలియలి కట్టను దాటిన, సాగరం ఇవ= సముద్రమువలె నున్న, తద్-బలమ్= వాని సైన్యమును, తేన= ఆ సైన్యముచే, సంరుద్ధమ్= ముట్టడించబడిన, స్వపురమ్= తమ నగరమును, భయ-ఆకులమ్= భయముతో కంగారుపడిన, స్వజనం చ= తన జనమును కూడ, నిరీక్ష్య= చూచి.

చెలియలి కట్టను దాటిన సముద్రమువలెనున్న ఆ సైన్యమును, దానిచే ముట్టడించబడిన తన మథురానగరమును, భయముతో తల్లడిల్లిన తన జనులను కూడ శ్రీకృష్ణుడు పరికించెను.

చింతయామాస భగవాన్ హరిః కారణమానుషః ।
తద్దేశకాలానుగుణం స్వావతారప్రయోజనమ్ ॥ 6

కారణమానుషఃః కారణముచే మానవరూపము గల, హరిః భగవాన్= శ్రీహరి భగవానుడు, తద్-దేశకాల-అనుగుణమ్= ఆ దేశమునకు కాలమునకు తగ్గట్లుగా, స్వ-అవతారప్రయోజనమ్= తన అవతారము యొక్క ప్రయోజనమును గురించి, చింతయామాస= తలపోసెను.

శ్రీహరి భగవానుడు భూభారమును తగ్గించాలనే కారణముగా మానవరూపముతో శ్రీకృష్ణుడై అవతరించెను. ఆయన ఆ దేశకాలములకు తగ్గట్లు తన అవతారముయొక్క ఉద్దేశ్యమును గురించి ఇట్లు తలపోసెను.

హనిష్యామి బలం హ్యేతద్భువి భారం సమాహితమ్ ।
మాగధేన సమానీతం వశ్యానాం సర్వభూభుజామ్ ॥ 7

అక్షౌహిణీభిస్సంఖ్యాతం భటాశ్వరథకుంజరైః ।

భువి= భూమిపై, హి= నిశ్చయముగా, భారమ్= బరువుగా, సమాహితమ్= తయారైనట్టియు, మాగధేన= మగధదేశరాజగు జరాసంధునిచే, సమానీతమ్= తీసుకురాబడినట్టియు, భట-అశ్వరథ కుంజరైః= భటులు గుర్రములు రథములు ఏనుగులతో, అక్షౌహిణీభిః= అక్షౌహిణీలతో, సంఖ్యాతమ్= లెక్కించబడినట్టియు, వశ్యానామ్= తనకు వశులైన, సర్వభూభుజామ్= అందరు రాజులయొక్క, ఏతత్= ఈ, బలమ్= సైన్యమును, హనిష్యామి= సంహరించెదను.

భటులు, గుర్రములు, రథములు, ఏనుగులతో ఇరవై మూడు అక్షౌహిణులుగా లెక్కించబడే ఈ సైన్యము మగధరాజగు జరాసంధునకు వశులై ఉండే రాజులందరికీ చెందినది. దీనినాతడు ఇక్కడకు తెచ్చినాడు. భూమికి బరువై ఉన్న ఈ సైన్యమును నిశ్చయముగా మట్టు పెట్టెదను.

మాగధస్తు న హంతవ్యో భూయః కర్తా బలోద్యమమ్ ॥ 8

ఏతదర్థోఽవతారోయం భూభారహరణాయ మే ।
సంరక్షణాయ సాధూనాం కృతోఽన్యేషాం వధాయ చ ॥ 9

మాగధః తు= మగధరాజైతే, న హంతవ్యః= చంపబడరాదు, భూయః= మరల, బల-ఉద్యమమ్= సైన్యసన్నాహమును, కర్తా= చేయగలడు, మే= నాచే, అయమ్= ఈ, అవతారః= అవతారము, ఏతద్-అర్థః= ఇదియే ప్రయోజనముగా గలదియై, కృతః= స్వీకరించ-బడినది, భూభారహరణాయ= భూమి బరువును తొలగించుట కొరకు, సాధూనామ్= సత్పురుషుల, సంరక్షణాయ= సంరక్షించుట కొరకు, అన్యేషామ్= ఇతరుల (దుష్టుల), వధాయ చ= వధ కొరకు కూడా.

మగధరాజగు జరాసంధుని మాత్రం చంపరాదు. ఎందుకంటే, అతడు మళ్లా - సైన్యాలను ప్రోగు చేస్తాడు. ఇదియే నా అవతారమునకు

ప్రయోజనము. భూమి బరువును తగ్గించి సత్పురుషులను రక్షించి దుష్టులను వధించుట కొరకే నేను అవతరించాను.

అన్యోఽపి ధర్మరక్షాయై దేహస్సంభ్రియతే మయా ।
విరామాయాప్యధర్మస్య కాలే ప్రభవతః క్వచిత్ ॥ 10

మయా= నాచే, ధర్మరక్షాయై= ధర్మమును రక్షించుట కొరకు, క్వచిత్= ఒకానొక, కాలే= కాలమునందు, ప్రభవతః= వర్ధిల్లే, అధర్మస్య= అధర్మముయొక్క, విరామాయ అపి= వినాశము కొరకు కూడ, అన్యః= ఇతరమైన, దేహః అపి= దేహము కూడ, సంభ్రియతే= స్వీకరింపబడును.

ఒకానొక కాలములో అధర్మము పెచ్చుమీరును. దానిని నశింప జేసి ధర్మమును రక్షించుటకై నేను ఇతరములైన (మత్స్యాది) దేహములను కూడ స్వీకరించెదను.

ఏవం ధ్యాయతి గోవింద ఆకాశాత్సూర్యవర్చసౌ ।
రథావుపస్థితౌ సద్యస్ససూతౌ సపరిచ్ఛదౌ ॥ 11

గోవిందే= శ్రీకృష్ణుడు, ఏవమ్= ఈ విధముగా, ధ్యాయతి= తలపోయుచుండగా, సద్యః= వెంటనే, ఆకాశాత్= ఆకాశము (వైకుంఠము) నుండి, సూర్యవర్చసౌ - సూర్యుని కాంతివంటి కాంతి గలవి, ససూతౌ= రథమును నడుపువానితో కూడినవి, సపరిచ్ఛదౌ= పరికరములతో కూడినవి, రథౌ= రెండు రథములు, ఉపస్థితౌ= దగ్గరకు వచ్చి నిలబడినవి.

శ్రీకృష్ణుడు ఈ విధముగా తలపోయుచుండగనే ఆకాశము (వైకుంఠము) నుండి రెండు రథములు వెంటనే వచ్చి నిలబడినవి. రథచోదకులతో కూడియున్న వాటియందు ధనుస్సు మొదలైన పరికరములు ఉండెను.

ఆయుధాని చ దివ్యాని పురాణాని యదృచ్ఛయా ।
దృష్ట్వా తాని హృషీకేశస్సంకర్షణమథాబ్రవీత్ ॥ 12

అథ= అనంతరం, యదృచ్ఛయా= అనుకోకుండా, పురాణాని= సనాతనములైన, చ= మరియూ, దివ్యాని= ప్రకాశించే, తాని ఆయుధాని= ఆ ఆయుధములను, చ= మరియు, దృష్ట్వా= చూచి, హృషీక–ఈశః= ఇంద్రియాంతర్యామియగు శ్రీకృష్ణుడు, సంకర్షణమ్= బలరాముని ఉద్దేశించి, అబ్రవీత్= పలికెను.

సనాతనములైన ప్రకాశించే ఆయుధములు కూడ అనుకోకుండా (ఈశ్వరేచ్ఛచే) ఉపస్థితములాయెను. వాటిని చూచి అప్పుడు ఇంద్రియాం–తర్యామియగు శ్రీకృష్ణుడు బలరామునితో నిట్లనెను.

పశ్యార్య వ్యసనం ప్రాప్తం యదూనాం త్వావతాం ప్రభో ।
ఏష తే రథ ఆయాతో దయితాన్యాయుధాని చ ॥ 13

ఆర్య= అన్నయ్యా!, త్వ–అవతామ్= నీవు రక్షకుడవుగా గల, యదూనామ్= యాదవులకు, వ్యసనమ్= ఆపద, ప్రాప్తమ్= వచ్చినది, పశ్య= చూడుము, ప్రభో= ఓ ప్రభూ!, తే= నీకొరకు, దయితాని= ఇష్టములైన, ఆయుధాని= ఆయుధములు, చ= మరియు, ఏషః= ఈ, రథః= రథము, ఆయాతః= వచ్చియున్నది.

అన్నయ్యా! సర్వసమర్థుడవగు నీవు యాదవులకు రక్షకుడవు. వారికి వచ్చిపడిన ఆపదను గమనించు. ఈ రథము నీ కొరకు వచ్చినది. నీకు ప్రియములైన ఆయుధములు కూడ వచ్చినవి.

యానమాస్థాయ జహ్యేతద్వ్యసనాత్త్వాన్ సముద్ధర ।
ఏతదర్థం హి నౌ జన్మ సాధూనామీశ శర్మకృత్ ॥ 14

త్రయోవింశత్యనీకాఖ్యం భూమేర్భారమపాకురు ।

యానమ్= రథమును, ఆస్థాయ= అధిష్ఠించి, ఏతత్= ఈ సైన్యమును, జహి= సంహరించుము, స్వాన్ = నీ వారిని, వ్యసనాత్= ఆపదనుండి, సముద్ధర= ఉద్ధరించుము, హి= ఏలయన, నౌ= మనిద్దరి, జన్మ= అవతారము, ఏతద్-అర్థమ్= ఇదియే ప్రయోజనముగా గలది, ఈశ= ఓ ప్రభూ!, సాధూనామ్= సజ్జనులకు, శర్మకృత్= సుఖమును కలిగించునది, త్రయః-వింశతి-అనీక-ఆఖ్యమ్= ఇరవై మూడు అక్షౌహిణీలనే పేరు గల, భూమేః= భూమి యొక్క, భారమ్= బరువును, అపాకురు= తొలగించుము.

నీవు రథమునెక్కి ఈ సైన్యమును మట్టుబెట్టి నీ వారిని ఆపదనుండి కాపాడుము. ఎందుకంటే, మనిద్దరి అవతారమునకు ప్రయోజనమిదియే. మనము సజ్జనులకు సుఖమును కలిగించుటకై అవతరించితిమి. ఇరవై మూడు అక్షౌహిణీల సేన రూపములోనున్న భూభారమును తొలగించుము.

ఏవం సంమంత్ర్య దాశార్హౌ దంశితౌ రథినౌ పురాత్ ॥ 15

నిర్జగ్మతు స్స్వాయుధాఢ్యౌ బలేనాల్పీయసావృతౌ ।
శంఖం దధ్మౌ వినిర్గత్య హరిర్దారుకసారథిః ॥ 16

దాశార్హౌ= దశార్హవంశీయులగు వారిద్దరు, ఏవమ్= ఈ విధముగా, సంమంత్ర్య= సంప్రదించుకొని, దంశితౌ= కవచములు దాల్చినవారై, రథినౌ= రథము గలవారై, సు-ఆయుధ-ఆఢ్యౌ= గొప్ప ఆయుధములతో సంపన్ను లై, పురాత్= నగరమునుండి, అల్పీయసా= చిన్న, బలేన= సైన్యముతో, ఆవృతౌ= చుట్టువారబడినవారై, నిర్జగ్మతుః= బయల్వెడలిరి, దారుకసారథిః= దారుకుడు సారథిగా గల, హరిః= శ్రీకృష్ణుడు, వినిర్గత్య= బయటకు వచ్చి, శంఖమ్= శంఖమును, దధ్మౌ= పూరించెను.

దశార్హవంశీయులగు బలరామకృష్ణులీ విధముగా సంప్రదించు-కొనిరి. అప్పుడు వారు కవచములను దాల్చి గొప్ప ఆయుధములతో

కూడినవారై రథముపై , మథురానగరము బయటకు వచ్చిరి. వారి చుట్టూ చిన్న సైన్యము ఉండెను. దారుకుడు రథమును నడుపగా, శ్రీకృష్ణుడు పాంచజన్యమును పూరించెను.

తతోఽ భూత్పరసైన్యానాం హృది విత్రాసవేపథుః ।
తావాహ మాగధో వీక్ష్య హే కృష్ణ పురుషాధమ ॥ 17

తతః= దాని వలన, పరసైన్యానామ్= శత్రువుల సైన్యములకు, హృది= హృదయమునందు, విత్రాసవేపథుః= అధికమగు భయము వలని వణుకు, అభూత్= కలిగెను, మాగధః= మగధ దేశరాజగు జరాసంధుడు, తౌ= వారిద్దరిని, వీక్ష్య= చూచి, ఆహ= పలికెను, హే కృష్ణ= ఓ కృష్ణా!, పురుష-అధమ= పురుషులలో అధముడా!

ఆ శంఖధ్వని వలన శత్రుసైనికుల గుండెలలో భయము వలని వణుకు పుట్టెను. మగధదేశప్రభువగు జరాసంధుడు వారిద్దరిని చూచెను. ఆతడు శ్రీకృష్ణుని సంబోధించి, నీవు పురుషులలో అధముడవని పలికెను.

నత్వయా యోద్ధుమిచ్ఛామి బాలేనైకేన లజ్జయా ।
గుప్తేన హి త్వయా మంద న యోత్స్యే యాహి బంధుహన్ ॥18

ఏకేన= ఒంటరియైనట్టియు, బాలేన= కుర్రవాడవైన, త్వయా= నీతో, లజ్జయా= సిగ్గుచే, యోద్ధుమ్= యుద్ధము చేయుటకు, న ఇచ్ఛామి= కోరను, హి= నిశ్చయము, మంద= ఓ సోమరీ!, గుప్తేన=దాచిపెట్టబడిన, త్వయా= నీతో, న యోత్స్యే= యుద్ధము చేయను, బంధుహన్= బంధువును చంపినవాడా!, యాహి= పో.

నీవు ఒంటరివి, కుర్రవాడివి. నీతో యుద్ధము చేయుట సిగ్గుచేటు. నీతో యుద్ధము నాకు సుతరాము ఇష్టము కాదు. నీవు దాగియుండి మేనమామను చంపినవాడివి. నీతో నేను యుద్ధము చేయను.

తవ రామ యది శ్రద్ధా యుధ్యస్వ ధైర్యముద్వహ ।
హిత్వా వా మచ్ఛరైశ్ఛిన్నం దేహం స్వర్యాహి మాం జహి ॥19

రామ= ఓ బలరామా!, తవ= నీకు, శ్రద్ధా యది= శ్రద్ధ ఉన్నచో, యుధ్యస్వ= యుద్ధము చేయుము, ధైర్యమ్= ధైర్యమును, ఉద్వహ= దాల్చుము, మత్-శరైః= నా బాణాలచే, ఛిన్నమ్= నరుకబడిన, దేహమ్= దేహమును, హిత్వా= విడిచి పెట్టి, స్వః= స్వర్గమును గురించి, యాహి= వెళ్లుము, వా= లేదా, మామ్= నన్ను, జహి= సంహరించుము.

ఓ బలరామా! నీకు శ్రద్ధ (శక్తి) ఉంటే ధైర్యము దాల్చి యుద్ధము చేయుము. నా బాణములు నీ దేహమును ముక్కలు ముక్కలు చేయగా, స్వర్గమునకు పోయెదవు. లేదా, నన్ను సంహరించుము.

శ్రీ భగవానువాచ ।

న వై శూరా వికత్థంతే దర్శయంత్యేవ పౌరుషమ్ ।
న గృహ్ణీమో వచో రాజన్నాతురస్య ముమూర్షతః ॥ 20

శ్రీ భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, శూరాః= శూరులు, న వికత్థంతే= గొప్పలు చెప్పరు, పౌరుషమ్= పౌరుషమును, దర్శయంతి ఏవ= తప్పక ప్రదర్శించెదరు, వై= నిశ్చయము, రాజన్= ఓ రాజా!, ఆతురస్య= దుఃఖితుడవైనట్టియు, ముమూర్షతః= మరణించ-బోయే (గోరే) నీ, వచః= మాటను, న గృహ్ణీమః= స్వీకరించము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మగధరాజా! శూరులు నిశ్చయముగా పౌరుషమును ప్రదర్శింతురే గాని, గొప్పలు చెప్పుకోరు. నీవు (అల్లుడి మరణముచే) దుఃఖిస్తున్నావు, మరణించ బోతున్నావు (గోరుచున్నావు). నీ మాటను మేము పట్టించుకోము.

శ్రీశుక ఉవాచ ।

జరాసుతస్తావభిసృత్య మాధవౌ మహాబలౌఘేన బలీయసావృణోత్।
ససైన్యయానధ్వజవాజిసారథీ సూర్యానలౌ వాయురివాభ్రరేణుభిః ॥ 21

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, జరాసుతః= జరాసంధుడు, మాధవా= మధువంశీయులైనట్టియు, ససైన్యయానధ్వజ–వాజిసారథీ= సైన్యము రథములు జెండాలు గుర్రములు సారథులతో కూడియున్న, తౌ= వారిద్దరిని, అభిసృత్య= ఎదురుగా వచ్చి, బలీయసా= బలము గల, మహాబల–ఓఘేన= పెద్ద సైన్యసమూహముతో, వాయుః = వాయువు, అభ్రరేణుభిః= మేఘములతో ధూళికణములతో, సూర్య–అనలౌ ఇవ= సూర్యుని అగ్నిని వలె, ఆవృణోత్= కప్పివేసెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...మధువంశీయులగు ఆ బలరామ–కృష్ణులను జరాసంధుడు (జరచే సంధించబడిన దేహము గలవాడు) బలశాలియగు పెద్ద సైన్య సమూహముతో – వాయువు మేఘములతో సూర్యుని, దుమ్ముతో అగ్నిని వలె – ఎదురుగా వచ్చి కప్పివేసెను. వారితోబాటు వారి సైన్యము, రథములు, సారథి, జెండాలు కూడ కనబడలేదు.

సుపర్ణతాలధ్వజచిహ్నితౌ రథా
వలక్షయంత్యో హరిరామయోర్మృధే ।
స్త్రియః పురాట్టాలకహర్మ్యగోపురం
సమాశ్రితాస్సంముముహుశ్శుచార్దితాః ॥ 22

పుర–అట్టాలకహర్మ్యగోపురమ్= నగరమునందలి బురుజుల మేడల నగరద్వారముల సముదాయమును, సమాశ్రితాః= ఆశ్రయించిన, స్త్రియః= స్త్రీలు, మృధే= యుద్ధమునందు, హరిరామయోః= శ్రీకృష్ణ బలరాముల యొక్క, సుపర్ణతాలధ్వజచిహ్నితౌ= గరుడుడు తాటి చెట్టు గల జెండాలచే గుర్తించబడే, రథౌ= రథములను, అలక్షయంత్యః=

కానరానివారై, శుచా= దుఃఖముతో, అర్దితాః= పీడించబడినవారై, సంముముహుః= మూర్ఛను పొందిరి.

నగరమునందలి బురుజులను, మేడలను, నగరద్వారములను ఎక్కి స్త్రీలు చూచుచుండిరి. వారికి యుద్ధములో గరుడుని గుర్తుతో కూడిన జెండా గల శ్రీకృష్ణుని రథముగాని, తాటిచెట్టు గుర్తుగల జెండాతో కూడిన బలరాముని రథము గాని కానరాలేదు. వారు దుఃఖముచే పీడించబడి మూర్ఛిల్లిరి.

హరిః పరానీకపయోముచాం
ముహుఃశిలీముఖాత్యుల్బణవర్షపీడితమ్ ।
స్వసైన్యమాలోక్య సురాసురార్చితం
వ్యస్ఫూర్జయాచ్ఛార్ఙ్గశరాసనోత్తమమ్ ॥ 23

ముహుఃపలుమార్లు, పర-అనీకపయోముచామ్= శత్రుసైన్యమనే మేఘముల యొక్క, శిలీముఖ-అతి-ఉల్బణవర్షపీడితమ్= బాణముల సుతరాము సహించ శక్యము కాని వర్షముచే పీడించబడిన, స్వసైన్యమ్= తన సైన్యమును, ఆలోక్య= చూచి, హరిః= శ్రీకృష్ణుడు, సుర-అసుర-అర్చితమ్= దేవతలచే రాక్షసులచే ఆదరించబడునట్టియు, ఉత్తమమ్= గొప్ప, శార్ఙ్గశర-ఆసనమ్= శార్ఙ్గమనే ధనుస్సును, వ్యస్ఫూర్జయత్= టంకారము చేసెను.

శత్రుసేనలనే మేఘములు మాటిమాటికీ తమ సేనపై కురిపిస్తున్న బాణముల వర్షము సుతరాము సహించ శక్యము కాకుండెను. సైన్యము పీడను పొందుట గాంచిన శ్రీకృష్ణుడు శార్ఙ్గమనే ధనుస్సును టంకారము చేసెను. ఆ ధనుస్సును దేవతలు, రాక్షసులు కూడ ఆదరించెదరు.

గృహ్ణన్నిషీదాదథ సందధచ్ఛరాన్వికృష్య ముంచఞ్ఛితబాణపూగాన్।
నిఘ్నన్ రథాన్ కుంజరవాజిపత్తీన్నిరంతరం యద్వదలాతచక్రమ్॥ 24

అథ= అప్పుడు, నిషీదాత్= అమ్ముల పొదినుండి, శరాన్= బాణములను, గృహ్ణన్= తీయువాడు, సందధత్= ఎక్కు పెట్టువాడు, వికృష్య= లాగి, శితబాణపూగాన్= వాడి బాణముల సమూహములను, ముంచన్= విడిచి పెట్టువాడు, రథాన్= రథములను, కుంజరవాజిపత్తీన్= ఏనుగులను గుర్రములను పదాతులను, నిరంతరమ్= ఎడతెరపి లేకుండా, నిఘ్నన్= కొట్టువాడు, అలాతచక్రం యద్వత్= గిర గిర తిరిగే కొరివి వలె.

అప్పుడు శ్రీకృష్ణుడు అమ్ముల పొదినుండి వాడి బాణముల గుట్టలను లాగి ధనుస్సుపై ఎక్కుపెట్టి విడిచిపెడ్తూ రథములను, ఏనుగులను, గుర్రములను, పదాతులను ఎడతెరపి లేకుండా కొట్టెను. ఆ ధనుస్సు గిర గిర తిరిగే కొరివివలె నుండెను.

నిర్భిన్నకుంభాः కరిణో నిపేతురనీకశోऽశ్వాశ్వరవృక్ణకంధరాः ।
రథా హతాశ్వధ్వజసూతనాయకాः పదాతయశ్ఛిన్నభుజోరుకంధరాः ॥ 25

నిర్భిన్నకుంభాः= పగులగొట్టబడిన తలలు గల, కరిణः= ఏనుగులు, శరవృక్ణకంధరాः= బాణములచే తెగగొట్టబడిన మెడలు గల, అశ్వాः= గుర్రములు, అనీకశः= రాశులుగా, నిపేతుः= నేలగూలినవి, రథాः= రథములు, హత–అశ్వధ్వజసూతనాయకాः= కొట్టబడిన గుర్రములు టెక్కెములు సారథులు రథికులు గలవి, పదాతయः= పదాతులు, ఛిన్న భుజ–ఊరుకంధరాः= తెగగొట్టబడిన చేతులు తొడలు మెడలు గలవారు.

ఆ బాణములచే ఏనుగుల కుంభస్థలములు, గుర్రముల మెడలు తెగి రాశులుగా నేలగూలినవి. రథముల టెక్కెములు విరిగి గుర్రములు, సారథులు, రథికులు హతులైరి. పదాతుల చేతులు, కాళ్లు, తలలు తెగినవి.

సంఛిద్యమానద్విపదేహవాజినామంగప్రసూతాశ్శతశోऽసృగాపగాः ।
భుజాహయः పూరుషశీర్షకచ్ఛపా హతద్విపద్వీపహయగ్రహాకులాः॥26

సంఛిద్యమానద్విపద-ఇభవాజినామ్= తెగగొట్టబడుచున్న పదాతుల ఏనుగుల గుర్రములయొక్క, అంగప్రసూతాః= దేహములనుండి పుట్టిన, అసృగ్-ఆపగాః= రక్తముల యేరులు, శతశః= వందలాదిగా, భుజ-అహయః= భుజములనే పాములు, పూరుషశీర్షకచ్ఛపాః= మానవుల తలలనే తాబేళ్లు, హతద్విపద్వీపహయగ్రహ-ఆకులాః= చంపబడిన ఏనుగులనే ద్వీపములు గుర్రములనే మొసళ్లచే వ్యాపించబడినవి.

పదాతులు, ఏనుగులు, గుర్రములు తెగగొట్టబడగా వాటి దేహములనుండి వందలాది రక్తపుటేరులు బయల్దేరినవి. వాటియందు పదాతుల భుజములు నీటి పాములను, వారి తలలు తాబేళ్లను పోలియుండెను. ఆ యేరులు చంపబడిన ఏనుగుల దేహములనే ద్వీపములచే, గుర్రములనే మొసళ్లచే వ్యాపించబడి యుండెను.

కరోరుమీనా నరకేశశైవలా ధనుస్తరంగాయుధగుల్మసంకులాః ।
అచ్ఛూరికావర్తభయానకా మహామణిప్రవేకాభరణాశ్మశర్కరాః ॥ 27

ప్రవర్తితా భీరుభయావహా మృధే మనస్వినాం హర్షకరీః పరస్పరమ్।

కర-ఊరుమీనాః= చేతులు తొడలనే చేపలు గలవి, నరకేశశైవలాః= మానవుల జుట్టులనే నాచులు గలవి, ధనుః-తరంగ-ఆయుధగుల్మసంకులాః = ధనుస్సులనే తరంగములచే ఆయుధములనే లతలచే వ్యాపించబడినవి, అచ్ఛూరిక-ఆవర్తభయానకాః= డాళ్లనే సుడిగుండములతో భయమును గొల్పునవి, మహామణిప్రవేక-ఆభరణ-అశ్మశర్కరాః= మిక్కిలి విలువైన గొప్ప మణుల ఆభరణములనే రాళ్లు మొరము గలవి, భీరుభయ-ఆవహాః= భయస్వభావము గలవారలకు భయమును గొల్పునవి, మనస్వినామ్= వీరులకు, పరస్పరమ్= పరస్పరము, హర్షకరీః= ఉత్సాహమును కలిగించునవి, మృధే= యుద్ధమునందు, ప్రవర్తితాః= పారునట్లు చేయబడినవి.

ఆ రక్తపుటేరులలో (తెగిన) చేతులు, తొడలే చేపలు కాగా, చచ్చిపడిన జనుల జుట్టే నాచు ఆయెను. అవి ధనుస్సులనే తరంగములచే, ఆయుధములనే లతలచే వ్యాపించబడి యుండెను. వాటియందలి డాళ్లు సుడిగుండములవలె భయమును గొల్పగా, యోధుల మిక్కిలి విలువైన గొప్ప మణుల ఆభరణములు యేరులలోని రాళ్లను, మొరమును పోలెను. శ్రీకృష్ణుడు యుద్ధములో భయస్వభావము గలవారికి భీతిని, వీరులకు పరస్పరము ఉత్సాహమును, కలిగించే రక్తపుటేరులు పారునట్లు చేసెను.

వినిఘ్నతాఽరీన్ముసలేన దుర్మదాన్సంకర్షణేనాపరిమేయతేజసా ॥28

బలం తదంగార్ణవదుర్గభైరవం దురంతపారం మగధేంద్రపాలితమ్।
క్షయం ప్రణీతం వసుదేవపుత్రయోర్విక్రీడితం తజ్జగదీశయోః పరమ్॥ 29

అంగ= ఓ రాజా!, దుర్మదాన్= మిక్కిలి గర్వించిన, అరీన్= శత్రువులను, ముసలేన= రోకలితో, వినిఘ్నతా= సంహరించుచున్నట్టియు, అపరిమేయతేజసా= హద్దులు లేని పరాక్రమము గల, సంకర్షణేన= బలరామునిచే, అర్ణవదుర్గభైరవమ్= సముద్రము వలె ప్రవేశించ శక్యము కానిదై భయమును గొల్పునట్టియు, దురంతపారమ్= అగాధమూ అనంతము అయినట్టియు, మగధ-ఇంద్రపాలితమ్= మగధప్రభువగు జరాసంధునిచే రక్షించబడిన, తత్= ఆ, బలమ్= సైన్యము, క్షయమ్= వినాశమును, ప్రణీతమ్= పొందించబడినది, తత్= అది, జగద్-ఈశయోః= జగన్నాయకులైనట్టియు, వసుదేవపుత్రయోః= వసుదేవుని పుత్రులగు శ్రీకృష్ణ బలరాములకు, పరమ్= కేవలము, విక్రీడితమ్= క్రీడ.

హద్దులు లేని పరాక్రమము గల బలరాముడు మిక్కిలి గర్వించిన శత్రువులను ముసలాయుధముతో చావగొట్టెను. ఓ రాజా! మగధప్రభు-

డగు జరాసంధునిచే రక్షించబడే ఆ సైన్యము సముద్రము వలె ప్రవేశించ శక్యము కానిది, భీతిని గొల్పునది, అగాధమైన విక్రమము గలది. అంతము కానరాని ఆ సైన్యమును వారు మట్టుబెట్టిరి. వసుదేవపుత్రులగు బలరామకృష్ణులు జగన్నాయకులు. వారికి ఆ పని కేవలము క్రీడ మాత్రమే.

స్థిత్యుద్భవాంతం భువనత్రయస్య యః
సమీహతేఽనంతగుణస్స్వలీలయా ।
న తస్య చిత్రం పరపక్షనిగ్రహః
తథాఽపి మర్త్యానువిధస్య వర్ణ్యతే ॥ 30

అనంతగుణః= అనంతములగు గుణములు గల, యః= ఏ భగవానుడు, స్వలీలయా= తన లీలచే, భువనత్రయస్య= ముల్లోకముల యొక్క స్థితి-ఉద్భవ-అంతమ్= స్థితిని సృష్టిని ప్రళయమును, సమీహతే= చేయుచున్నాడో, తస్య= ఆయనకు, పరపక్ష నిగ్రహః= శత్రువుల పక్షమును నశింపజేయుట, చిత్రమ్= విడ్డూరము, న= కాదు, తథా అపి= అయిన్పటికీ, మర్త్య-అనువిధస్య= మానవుల ననుకరించే ఆయనయొక్క (లీల), వర్ణ్యతే= వర్ణించబడుచున్నది.

జగ్రాహ విరథం రామో జరాసంధం మహాబలమ్
హతానీకావశిష్టాసుం సింహస్సింహమివౌజసా ॥ 31

రామః= బలరాముడు, విరథమ్= రథమును కోల్పోయినట్టియు, హత-అనీక-అవశిష్ట-అసుమ్= సంహరించబడిన సైన్యము కలిగినట్టియు మిగిలిన ప్రాణములు కలిగినట్టియు, మహాబలమ్= గొప్ప బలవంతుడగు, జరాసంధమ్= జరాసంధుని, ఓజసా= బలముతో, సింహః= సింహము, సింహం ఇవ= సింహమును వలె, జగ్రాహ= పట్టుకొనెను.

జరాసంధుడు గొప్ప బలవంతుడే. కాని, ఆతడు సైన్యము సంహరించబడగా రథమును కోల్పోయి ప్రాణములతో మిగిలి ఉండెను. బలరాముడాతనిని బలముతో సింహము సింహమును వలె పట్టుకొనెను.

బధ్యమానం హతారాతిం పాశైర్వారుణమానుషైః ।
వారయామాస గోవిందస్తేన కార్యచికీర్షయా ॥ 32

వారుణమానుషైః= వరుణ దేవతకు మరియు మానవులకు చెందిన, పాశైః= పాశములచే, బధ్యమానమ్= బంధించబడుచున్నట్టియు, హత–అరాతిమ్= సంహరించబడిన శత్రువులు కలిగిన (కొట్టబడిన శత్రువైన) జరాసంధుని, తేన= వానిచే, కార్యచికీర్షయా= పనిని చేయాలనే కోరికతో, గోవిందః= శ్రీకృష్ణుడు, వారయామాస= నివారించెను.

జరాసంధుడు శత్రువులను దునుమాడినవాడే. కాని ఇప్పుడు పరాజితుడైన శత్రువు అయినాడు. వానిని బలరాముడు వరుణపాశములతో మాత్రమే గాక, మనుష్యులు వాడే త్రాళ్లతో కూడ కట్టివేయుచుండగా, శ్రీకృష్ణుడు నివారించెను. వానిచే పని (దుష్టులను ప్రోగుచేయుట) జరగాలని ఆయన ఆకాంక్ష.

స ముక్తో లోకనాథాభ్యాం వ్రీడితో వీరసంమతః ।
తపసే కృతసంకల్పో వారితః పథి రాజభిః ॥ 33

వాక్యైః పవిత్రార్థపదైర్నయనైః ప్రాకృతైరపి ।
స్వకర్మబంధప్రాప్తోఽయం యదుభిస్తే పరాభవః ॥ 34

లోకనాథాభ్యామ్= లోకనాయకులగు బలరామకృష్ణులచే, ముక్తః= విడిచిపెట్ట బడినవాడు, వ్రీడితః – సిగ్గు పడినవాడు, వీరసంమతః= వీరులయందు గణించబడే, సః= ఆ జరాసంధుడు, తపసే= తపస్సు కొరకు, కృతసంకల్పః= చేయబడిన సంకల్పము గలవాడై, పథి=

మార్గమునందు, రాజభిః= రాజులచే, పవిత్ర-అర్థపదైః= తత్త్వమును చెప్పే అర్థము గల పదములు కలిగినట్టియు, నయనైః= రాజనీతితో కూడినట్టియు, ప్రాకృతైః అపి= లౌకికములు కూడా అగు, వాక్యైః= వాక్యములతో, వారితః= నివారించబడినవాడు, తే= నీకు, యదుభిః= యాదవులచే, అయమ్= ఈ, పరాభవః= పరాజయము, స్వకర్మబంధ ప్రాప్తః= నీ కర్మ అనే బంధము వలన పొందబడినది.

లోకనాయకులగు బలరామకృష్ణులు ఆ జరాసంధుని విడిచిపెట్టిరి. వీరులలో ఎన్నబడే ఆతడు సిగ్గుపడి తపస్సు చేయాలని సంకల్పించెను. కాని, దారిలో రాజులాతనిని నివారించిరి. నీకు యాదవుల చేతిలో ఈ పరాజయము నీ కర్మయొక్క బంధము వలననే ప్రాప్తమైనది, అని వారాతనికి యథార్థమును బోధించే పదములు గల వాక్యములతో నచ్చజెప్పిరి. వారాతనికి రాజనీతి వచనములను మాత్రమే గాక, లౌకికదృష్టాంతములను కూడ చెప్పిరి.

హతేషు సర్వానీకేషు నృపో బార్హద్రథస్తదా ।
ఉపేక్షితో భగవతా మగధాన్ దుర్మనా యయౌ ॥ 35

బార్హద్రథః= బృహద్రథుని పుత్రుడు, నృపః= మగధరాజు అగు జరాసంధుడు, సర్వ-అనీకేషు= సేనలన్నియు, హతేషు= సంహరించ-బడగా, తదా= అప్పుడు, భగవతా= శ్రీకృష్ణభగవానునిచే, ఉపేక్షితః= ఉపేక్షించ-బడినవాడై, దుర్మనాః= చెడిపోయిన మనస్సు గలవాడై, మగధాన్= మగధ దేశమును గురించి, యయౌ= వెళ్లెను.

సైన్యములన్నింటినీ సంహరించి శ్రీకృష్ణ భగవానుడు బృహద్రథ పుత్రుడగు మగధరాజును ఉపేక్ష చేసి విడిచిపెట్టెను. అప్పుడు జరాసంధుడు మనస్సు చెడి మగధదేశమును చేరెను.

ముకుందోఽప్యక్షతబలో నిస్తీర్ణారిబలార్ణవః ।
వికీర్యమాణః కుసుమైస్త్రిదశైరనుమోదితః ॥ 36

అక్షతబలః= చెక్కు చెదరని సైన్యము గలవాడు, నిస్తీర్ణ–అరిబల–అర్ణవః= తేలికగా దాటి వేయబడిన శత్రుసైన్యమనే సముద్రము గలవాడు, ముకుందః అపి= మోక్షప్రదాత అగు శ్రీకృష్ణుడు కూడ, కుసుమైః= పుష్పములచే, వికీర్యమాణః= చల్లబడువాడై, త్రిదశైః= దేవతలచే, అనుమోదితః= ప్రశంసించబడినవాడు.

శ్రీకృష్ణుడు తన సైన్యము చెక్కు చెదరకుండా సముద్రమువంటి శత్రుసైన్యమును తేలికగా దాటివేసెను. దేవతలాయనపై పూలవాన కురిపించి ప్రశంసించిరి.

మాథురైరుపసంగమ్య విజ్వరైర్ముదితాత్మభిః ।
ఉపగీయమానవిజయ స్సూతమాగధవందిభిః ॥ 37

విజ్వరైః= తొలగిన తాపము కలిగిన, ముదిత–ఆత్మభిః= ఆనందించిన మనస్సులు గల, మాథురైః= మథురానగరవాసులతో, ఉపసంగమ్య= కలుసుకొని, సూతమాగధవందిభిః= సూతులు మాగధులు వందులచే, ఉపగీయమానవిజయః= కీర్తించబడుచున్న విజయము గలవాడు.

మథురానగరవాసుల మనస్సులలోని భయము పోయి ఆనందము నిండెను. వారాయనను కలుసుకొనిరి. సూతులు (కథావాచకులు), మాగధులు (వంశమును పొగుడువారు), వందులు (స్తోత్రపాఠకులు) ఆయన కీర్తిని గానము చేయుచుండిరి.

శంఖదుందుభయో నేదు ర్భేరీతూర్యాణ్యనేకశః ।
వీణావేణుమృదంగాని పురం ప్రవిశతి ప్రభౌ ॥ 38

సిక్తమార్గాం హృష్టజనాం పతాకాభిరలంకృతామ్ ।
నిర్ఘుష్టాం బ్రహ్మఘోషేణ కౌతుకాబద్ధతోరణామ్ ॥ 39

ప్రభౌ= శ్రీకృష్ణ ప్రభుడు, సిక్తమార్గామ్= నీళ్లు చల్లబడిన వీధులు కలిగినట్టియు, హృష్టజనామ్= ఆనందముతో నిండిన జనులు కలిగినట్టియు, పతాకాభిః= పతాకలతో, అలంకృతామ్= అలంకరించ బడినట్టియు, బ్రహ్మఘోషేణ= వేదధ్వనితో, నిర్ఘుష్టామ్= మారు మ్రోగినట్టియు, కౌతుక-ఆబద్ధతోరణామ్= ఉత్సవముతో అంతటా కట్టబడిన వందనమాలలు కల, పురమ్= మథురానగరమును, ప్రవిశతి= ప్రవేశించుచుండగా, శంఖదుందుభయః= శంఖములు దుందుభులు, భేరీతూర్యాణి= భేరీలు వాద్యములు, వీణావేణుమృదంగాని= వీణలు పిల్లన గ్రోవులు మద్దెళ్లు, అనేకశః= అనేకములుగా, నేదుః= మ్రోగినవి.

ఆ శ్రీకృష్ణ ప్రభుడు మథురానగరమును ప్రవేశించుచుండగా పెద్ద సంఖ్యలో శంఖములు, దుందుభులు, భేరీలు, వాద్యములు, వీణలు, పిల్లనగ్రోవులు, మద్దెళ్లు మ్రోగినవి. ఆ నగరమును వీధులలో నీళ్లను జల్లి పతాకలతో అలంకరించిరి. ఉత్సవముతో అంతటా వందనమాలలను కట్టిరి.

నిచీయమానో నారీభి ర్మాల్యదధ్యక్షతాంకురైః ।
నిరీక్ష్యమాణ స్సస్నేహం ప్రీత్యుత్కలితలోచనైః ॥ 40

నారీభిః= స్త్రీలచే, మాల్య-దధి-అక్షత-అంకురైః= మాలకట్టిన పూలు పెరుగు అక్షతలు మొలకలతో, నిచీయమానః= చల్లబడుచున్న-వాడు, సస్నేహమ్= ప్రేమతో కూడుకున్నట్లుగా, ప్రీతి-ఉత్కలితలోచనైః= ప్రేమతో విప్పారిన కళ్లతో, నిరీక్ష్యమాణః= చూడబడుచున్నవాడు.

నగరములోని స్త్రీలు ఆయనపై పూలమాలలను, పెరుగును, అక్షతలను, మొలకలను చల్లిరి. వారు ప్రేమతో విప్పారిన కళ్లతో ఆయనను స్నేహపూర్వకముగా చూచుచుండిరి.

ఆయోధనగతం విత్తమనంతం వీరభూషణమ్ ।
యదురాజాయ తత్సర్వమాహృతం ప్రాదిశత్ప్రభుః ॥ 41

ప్రభుః= శ్రీకృష్ణ ప్రభుడు, ఆయోధనగతమ్= యుద్ధభూమియందు పడినట్టియు, ఆహృతమ్= తీసుకురాబడిన, అనంతమ్= అంతము లేని, విత్తమ్= ధనమును, వీరభూషణమ్= వీరుల ఆభరణమును, సర్వమ్= అంతను, యదురాజాయ= యాదవప్రభువగు ఉగ్రసేనుని కొరకు, ప్రాదిశత్= సమర్పించెను.

యుద్ధభూమియందు పడిన ధనము, వీరుల ఆభరణములు లెక్కలేనంత ఉండెను. దానినంతను తీసుకువచ్చి శ్రీకృష్ణ ప్రభుడు యాదవప్రభువగు ఉగ్రసేనుని కొరకు సమర్పించెను.

ఏవం సప్తదశకృత్వస్తావత్యక్షౌహిణీబలః ।
యుయుధే మాగధో రాజా యదుభిః కృష్ణపాలితైః ॥ 42

మాగధో రాజా= మగధప్రభువగు జరాసంధుడు, ఏవమ్= ఈ విధముగా, తావత్యక్షౌహిణీబలః= అంతే అక్షౌహిణీల సైన్యము గలవాడై, సప్తదశకృత్వః= పదిహేడు సార్లు, కృష్ణపాలితైః= శ్రీకృష్ణునిచే రక్షించబడిన, యదుభిః= యాదవులతో, యుయుధే= యుద్ధము చేసెను.

మగధప్రభువగు జరాసంధుడీ విధముగా అంతే అక్షౌహిణీల సేనతో యాదవులపై పదిహేడుసార్లు దండెత్తెను. వారిని శ్రీకృష్ణుడు రక్షించెను.

అక్షిణ్వంస్తద్బలం సర్వం వృష్ణయః కృష్ణతేజసా ।
హతేషు స్వేష్వనీకేషు త్యక్తోఽయాదరిభిర్నృపః ॥ 43

కృష్ణతేజసా= శ్రీకృష్ణుని తేజస్సుచే, వృష్ణయః= యాదవులు, తద్–బలమ్= వాని సైన్యమును, సర్వమ్= అంతనూ, అక్షిణ్వన్= మట్టుబెట్టిరి,

స్వేషు= తనవైన, అనీకేషు= సైన్యములు, హతేషు= సంహరించబడగా, అరిభిః= శత్రువులగు యాదవులచే, త్యక్తః= విడిచిపెట్టబడిన, నృపః= మగధరాజు, అయాత్= వెళ్లెను.

శ్రీకృష్ణుని తేజస్సు కారణముగా యాదవులు ఆ మగధరాజు సైన్యమునంతనూ మట్టుబెట్టిరి. కాని, జరాసంధుని శత్రువులైన యాదవులు ఆతనిని మాత్రము విడిచిపెట్టగా, ఆతడు తన నగరమునకు వెళ్లెను.

అష్టాదశమసంగ్రామే ఆగామిని తదంతరా ।
నారదప్రేషితో వీరో యవనః ప్రత్యదృశ్యత ॥ 44

అష్టాదశమసంగ్రామే= పద్దెనిమిదవ యుద్ధము, ఆగామిని= రాబోవుచుండ, తద్-అంతరా= ఆ మధ్యలో, నారదప్రేషితః= నారదునిచే పంపబడిన, వీరః= వీరుడగు, యవనః= కాలయవనుడు, ప్రత్యదృశ్యత= హఠాత్తుగా కానవచ్చెను.

జరాసంధునితో పద్దెనిమిదవ యుద్ధము రాబోవుచుండగా, ఆ మధ్యలో కాలయవనుడనే వీరుడు హఠాత్తుగా మథురలో దర్శనమిచ్చెను. వానినచటకు నారదుడే పంపెను.

రురోధ మథురామేత్య తిసృభిర్మ్లేచ్ఛకోటిభిః ।
నృలోకే చాప్రతిద్వంద్వో వృష్ణీఞ్ఛ్రుత్వాఽఽత్మసమ్మితాన్ ॥45

నృలోకే చ= మానవలోకమునందు, అప్రతిద్వంద్వః= సమాన బలము గలవాడు లేని కాలయవనుడు, వృష్ణీన్= యాదవులను గురించి, ఆత్మసమ్మితాన్= తనతో సమానమైనవారినిగా, శ్రుత్వా= విని, తిసృభిః= మూడు, మ్లేచ్ఛకోటిభిః= మ్లేచ్ఛుల కోట్లతో, ఏత్య= వచ్చి, మథురామ్= మథురను, రురోధ= ముట్టడించెను.

మానవలోకములో కాలయవనునితో సమానమైన బలము గలవాడు లేడు. కాని, యాదవులు తనతో సమానులని (నారదుని వలన) విని ఆతడు మూడుకోట్ల మ్లేచ్ఛులతో వచ్చి మథురానగరమును ముట్టడించెను.

తం దృష్ట్వాఽచింతయత్కృష్ణస్సంకర్షణసహాయవాన్ ।
అహో యదూనాం వృజినం ప్రాప్తం హ్యుభయతో మహత్ ॥ 46

సంకర్షణసహాయవాన్= బలరాముడు తోడుగా గల, కృష్ణః= శ్రీకృష్ణుడు, తమ్= వానిని, దృష్ట్వా= చూచి, అచింతయత్= తలపోసెను, అహో= అయ్యో!, యదూనామ్= యాదవులకు, ఉభయతః= రెండు వైపులనుండి, మహత్= పెద్ద, వృజినమ్= దుఃఖము, ప్రాప్తమ్= వచ్చినది, హి= నిశ్చితము.

బలరాముడు తోడుగా గల శ్రీకృష్ణుడా కాలయవనుని చూచి ఇట్లు తలపోసెను. అయ్యో! యాదవులకు నిశ్చితముగా రెండు (కాలయవన జరాసంధుల) వైపులనుండి పెద్ద దుఃఖము వచ్చి పడినది.

యవనోయం నిరుంధేఽస్మానద్య తావన్మహాబలః ।
మాగధోఽప్యద్య వా శ్వో వా పరశ్వో వాఽగమిష్యతి ॥ 47

మహాబలః= గొప్ప బలము గల, అయమ్= ఈ, యవనః= కాలయవనుడు, అద్య తావత్= ఈ నాడైతే, అస్మాన్= మనలను, నిరుంధే= ముట్టడించుచున్నాడు, మాగధః అపి= మగధదేశరాజగు జరాసంధుడు కూడ, అద్య వా= ఈనాడు గాని, శ్వః వా= రేపు గాని, పరశ్వః వా= ఎల్లుండి గాని, ఆగమిష్యతి= రాగలడు.

ఈ రోజు మనలను గొప్ప బలము గల ఈ కాలయవనుడు ముట్టడించుచున్నాడు. నేడో, రేపో, లేక ఎల్లుండో మగధరాజగు జరాసంధుడు కూడ రాగలడు.

ఆవయోర్యుధ్యతోరస్య యద్యాగంతా జరాసుతః ।
బంధూన్ వధిష్యత్యథవా నేష్యతే స్వపురం బలీ ॥ 48

అస్య= వీనితో, ఆవయోఃr= మనమిద్దరము, యుధ్యతోఃr= యుద్ధము చేయుచుండగా, బలీ= బలశాలియగు, జరాసుతఃr= జరాసంధుడు, యది ఆగంతా= వచ్చువాడైనచో, బంధూన్= బంధువులను, వధిష్యతి= సంహరించగలడు, అథవా= లేదా, స్వపురమ్= తన నగరమును గురించి, నేష్యతే= తీసుకుపోగలడు.

మనమిద్దరము వీనితో యుద్ధము చేయుచుండగా బలశాలియగు జరాసంధుడు వచ్చినచో, మన బంధువులను సంహరించును. లేదా, తన నగరమునకు బలాత్కారముగా తీసుకొనిపోవును.

తస్మాదద్య విధాస్యామో దుర్గం ద్విపదదుర్గమమ్ ।
తత్ర జ్ఞాతీన్ సమాధాయ యవనం ఘాతయామహే ॥ 49

తస్మాత్= అందువలన, అద్య= ఇప్పుడు, ద్విపదదుర్గమమ్= మానవులు ప్రవేశించ శక్యము కాని, దుర్గమ్= కోటను, విధాస్యామఃr= నిర్మించెదము, తత్ర= దానియందు, జ్ఞాతీన్= బంధువులను, సమాధాయ= చక్కగా ఉంచి, యవనమ్= కాలయవనుని, ఘాతయామహే= సంహరింప జేసెదము.

కాబట్టి ఈనాడే మానవులు ప్రవేశించ శక్యము కాని కోటను నిర్మించెదము. దానిలో బంధువులను చక్కగా ఉంచి, కాలయవనుని సంహరింపజేసెదము.

ఇతి సంమంత్ర్య భగవాన్ దుర్గం ద్వాదశయోజనమ్ ।
అంతస్సముద్రే నగరం కృత్స్నాద్భుతమచీకరత్ ॥ 50

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఇతి= ఈ విధముగా, సంమంత్ర్య= సంప్రదించి, సముద్రే= సముద్రమునందు, అంతః= లోపల, ద్వాదశ-యోజనమ్= పన్నెండు యోజనములు గల, దుర్గమ్= కోటను, కృత్స్న-అద్భుతమ్= సకలములైన అద్భుతములు గల, నగరమ్= నగరమును, అచీకరత్= నిర్మింపజేసెను.

శ్రీకృష్ణ భగవానుడీ విధముగా సంప్రదించి సముద్రమధ్యములో పన్నెండు యోజనముల నిడివి గల కోటను, అన్ని అద్భుతములతో కూడిన నగరమును నిర్మింపజేసెను.

దృశ్యతే యత్ర హి త్వాష్ట్రం విజ్ఞానం శిల్పనైపుణమ్ ।
రథ్యాచత్వరవీథీభిర్యథావాస్తు వినిర్మితమ్ ॥ 51

యత్ర= ఏ నగరమునందైతే, త్వాష్ట్రమ్= విశ్వకర్మకు చెందిన, విజ్ఞానమ్= జ్ఞానమును సూచించే, శిల్ప నైపుణమ్= శిల్పవిద్యయందలి చాతురి, హి= నిశ్చయముగా, దృశ్యతే= కానబడునో, రథ్యాచత్వరవీథీభిః = రాజమార్గములు కూడళ్లు వీథులతో, యథావాస్తు= వాస్తుశాస్త్రము నతిక్రమించకుండా, వినిర్మితమ్= నిర్మించబడినది.

ఆ నగరములో విశ్వకర్మయొక్క విజ్ఞానమును సూచించే శిల్పనైపుణ్యము నిశ్చయముగా దర్శనమిచ్చును. రాజమార్గములు, కూడళ్లు, వీథులు వాస్తుశాస్త్రమునుల్లంఘించకుండా నిర్మించబడెను.

సురద్రుమలతోద్యానవిచిత్రోపవనాన్వితమ్ ।
హేమశృంగైర్దివిస్పృగ్భిస్స్ఫటికాట్టాలగోపురైః ॥ 52

సురద్రుమలతా-ఉద్యానవిచిత్ర-ఉపవన-అన్వితమ్= దేవతల వృక్షములు తీగలు గల ఉద్యానములతో రంగు రంగుల సమీపమునందలి

అడవులతో కూడినది, హేమశృంగైః= బంగరు శిఖరములు కలిగినట్టియు, దివిస్పృగ్భిః= ఆకసమునంటే, స్ఫాటిక-అట్టాలగోపురైః= స్ఫటికములతో చేసిన బురుజులతో నగరద్వారములతో (కూడినది).

ఆ నగరమునందలి ఉద్యానములలో దేవతావృక్షములు (హరిచందనము, మందారము, పారిజాతము మొదలైనవి, లేదా మామిడి, కడిమి, మోదుగ మొదలైనవి), లతలు (పగడపు లతలు ఇత్యాదులు) ఉండెను. నగరసమీపములో రంగు రంగుల అడవులు ఉండెను. నగరములోని బురుజులు నగరద్వారములు స్ఫటికముతో చేయబడి బంగరు శిఖరములతో ఆకసమునంటుచుండెను.

రాజతారకుటైః కోష్ఠై ర్హేమకుంభైరలంకృతైః ।
రత్నకూటైర్గృహైర్హే మైర్మహామరకతస్థలైః ॥ 53

రాజత-ఆరకుటైః= వెండి ఇత్తడులతో చేసినట్టియు, హేమకుంభైః = బంగరు కలశములు కలిగినట్టియు, అలంకృతైః= అలంకరించబడిన, కోష్ఠైః= కొట్టులతో, రత్నకూటైః= రత్నముల శిఖరములు కలిగినట్టియు, మహామరకతస్థలైః= పెద్ద పచ్చల నేలలు గల, హేమైః= బంగరు, గృహైః = ఇళ్లతో (కూడినది).

ఆ నగరములో వెండి-ఇత్తడులతో చేసిన కొట్టులపై బంగరు కలశములతో అలంకరించిరి. బంగరు గృహములలో నేలలపై గొప్ప పచ్చలను పొదిగిరి.

వాస్తోష్పతీనాం చ గృహైర్వలభిభిశ్చ నిర్మితమ్ ।
చాతుర్వర్ణ్యజనాకీర్ణం యదుదేవగృహోల్లసత్ ॥ 54

వాస్తోష్పతీనామ్= వాస్తు దేవతలయొక్క, గృహైః చ= మందిరములతో కూడ, వలభీభిః చ= చంద్రశాలలతో కూడ, నిర్మితమ్= నిర్మించబడినది,

చాతుర్వర్ణ్యజన–ఆకీర్ణమ్= నాలుగు వర్ణముల జనులచే వ్యాపించబడినది, యదుదేవగృహ–ఉల్లసత్= యాదవనాయకుల ఇళ్ళతో ప్రకాశించునది.

ఆ నగరములో వాస్తుదేవతల మందిరములు, చంద్రశాలలు కూడ నిర్మించబడినవి. నాలుగు వర్ణముల జనులచే వ్యాపించబడియున్న ఆ నగరము యాదవనాయకుల ఇళ్ళతో శోభిల్లెను.

సుధర్మాం పారిజాతం చ మహేంద్రః ప్రాహిణోద్ధరేః ।
యత్ర చావస్థితో మర్త్యో మర్త్యధర్మైర్న యుజ్యతే ॥ 55

మహేంద్రః= మహేంద్రుడు, సుధర్మామ్= దేవసభను, పారిజాతం చ= పారిజాతవృక్షమును కూడ, హరేః= శ్రీహరికి, ప్రాహిణోత్= పంపించెను, యత్ర చ= ఏ సభయందైతే, అవస్థితః= కూర్చుండే, మర్త్యః = మానవుడు, మర్త్యధర్మైః= మరణించే స్వభావము గల దేహముయొక్క వృద్ధాప్యము మొదలైన ధర్మములచే, న యుజ్యతే= సంబంధమును పొందడో.

మహేంద్రుడు శ్రీహరికి సుధర్మ అనే దేవసభను, పారిజాత వృక్షమును కూడ పంపించెను. ఆ సభయందు కూర్చున్న మానవునకు వృద్ధాప్యము మొదలైన మర్త్యధర్మములనుండి విముక్తి కలుగును.

శ్యామైకకర్ణాన్ వరుణో హయాఞ్ఛుక్లాన్ మనోజవాన్ ।
అష్టౌ నిధిపతిః కోశాన్ లోకపాలో నిజోదయాన్ ॥ 56

వరుణః= వరుణుడు, శ్యామ–ఏకకర్ణాన్= నల్లని ఒక చెవి కలిగినట్టియు, శుక్లాన్= తెల్లనైనట్టియు, మనః–జవాన్= మనోవేగము గల, హయాన్= గుర్రములను, నిధిపతిః= కుబేరుడు, అష్టౌ= ఎనిమిది, కోశాన్= నిధులను, లోకపాలః= లోకపాలకుడు, నిజ–ఉదయాన్= తన విభూతులను (పంపెను).

వరుణుడు మనోవేగము గల తెల్లని గుర్రములను పంపెను. వాటికి ఒక చెవి నల్లగానుండును. కుబేరుడు ఎనిమిది నిధులను, ప్రతి లోకపాలుడు తన విభూతులను పంపెను.

యద్యద్భగవతా దత్తమాధిపత్యం స్వసిద్ధయే ।
సర్వం ప్రత్యర్పయామాసుర్హరౌ భూమిగతే నృప ॥ 57

నృప= ఓ రాజా!, హరౌ= శ్రీహరి, భూమిగతే= భూమియంద వతరించగా, యత్ యత్= ఏయే, ఆధిపత్యమ్= విభూతి, భగవతా= శ్రీహరి భగవానునిచే, స్వసిద్ధయే= తమ అధికారము సిద్ధించుటకై, దత్తమ్= ఈయబడినదో, సర్వమ్= సర్వమును, ప్రతి-అర్పయామాసుః= తిరిగి సమర్పించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! లోకపాలకులు తమ అధికారములను నిర్వహించుటకై శ్రీహరి భగవానుడు వారికి ఆయా శక్తులను, సిద్ధులను ఇచ్చియుండెను. ఆయన భూమియందవతరించగా, వారు వాటినన్నింటినీ ఆయనకు తిరిగి సమర్పించిరి.

తత్ర యోగప్రభావేణ నీత్వా సర్వజనం హరిః ।
ప్రజాపాలేన రామేణ కృష్ణస్సమనుమంత్రితః ॥
నిర్జగామ పురద్వారాత్పద్మమాలీ నిరాయుధః ॥ 58

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే పంచాశత్తమోఽధ్యాయః ॥

హరిః= దుఃఖములను పోగొట్టే, కృష్ణః= శ్రీకృష్ణుడు, ప్రజాపాలేన= ప్రజలను పాలించే, రామేణ= బలరామునితో, సమనుమంత్రితః= చేయబడిన సలహా సంప్రదింపులు గలవాడై, యోగప్రభావేణ= యోగమాయ

యొక్క మహిమచే, సర్వజనమ్= సకలజనమును, తత్ర= దానియందు, నీత్వా= తీసుకువెళ్లి, పద్మమాలీ= పద్మముల మాల గలవాడై, నిరాయుధః = ఆయుధములు లేనివాడై, పురద్వారాత్= నగరద్వారము నుండి, నిర్జగామ= నిష్క్రమించెను.

భక్తుల దుఃఖములను పోగొట్టే శ్రీకృష్ణుడు యోగమాయయొక్క మహిమచే సకలజనులను ఆ ద్వారకకు తీసుకుపోయెను. ఆయన బలరామునితో సంప్రదించి మథురలోని జనులకు రక్షకునిగా ఆయనను ఉంచెను. అపుడాయన, పద్మముల మాలను ధరించి ఆయుధములు లేకుండా నగరద్వారమునుండి నిష్క్రమించెను.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
శ్రీకృష్ణుడు ద్వారకను నిర్మించుటను వర్ణించే ఏబదియవ
అధ్యాయము ముగిసినది (50).

* * *

అథ ఏకపంచాశత్తమోధ్యాయః

కాలయవనుడు భస్మమగుట - ముచుకుంద స్తుతి

శ్రీశుక ఉవాచ ।

తం విలోక్య వినిష్క్రాంతముజ్జిహానమివోడుపమ్ ।
దర్శనీయతమం శ్యామం పీతకౌశేయవాససమ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఉజ్జిహానమ్= ఉదయించుచున్న, ఉడుపం ఇవ= చంద్రుడు వలె, వినిష్క్రాంతమ్= బయటకు వచ్చినట్టియు, దర్శనీయతమమ్= మిక్కిలి అందగాడైనట్టియు, పీతకౌశేయవాససమ్= పచ్చని పట్టు వస్త్రము గల, తమ్= ఆ, శ్యామమ్= నల్లనయ్యను, విలోక్య= చూచి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను... ఉదయించుచున్న చంద్రుడు వలె నగరము బయటకు వచ్చిన ఆ నల్లనయ్యను కాలయవనుడు చూచెను. మిక్కిలి అందగాడగు ఆయన పచ్చని పట్టు వస్త్రమును ధరించెను.

శ్రీవత్సవక్షసం భ్రాజత్కౌస్తుభాముక్తకంధరమ్ ।
పృథుదీర్ఘచతుర్బాహుం నవకంజారుణేక్షణమ్ ॥ 2

శ్రీవత్సవక్షసమ్= లక్ష్మీదేవియే అయిన పుట్టు మచ్చ వక్షఃస్థలము నందు కలిగినట్టియు, భ్రాజత్- కౌస్తుభ-ఆముక్తకంధరమ్= ప్రకాశించే కౌస్తుభమాణిక్యముచే అలంకరించబడిన మెడ కలిగినట్టియు, పృథుదీర్ఘ-చతుర్-బాహుమ్= బలిసిన పొడవాటి నాల్గు చేతులు కలిగినట్టియు, నవకంజ-అరుణ-ఈక్షణమ్= కొత్త పద్మము వంటి లేత యెరుపు కన్నులు గల (శ్రీకృష్ణుని కాలయవనుడు చూచెను).

శ్రీకృష్ణుని వక్షఃస్థలముపై లక్ష్మీదేవి పుట్టుమచ్చయై ఉన్నది. ఆయన మెడకు ప్రకాశించే కౌస్తుభ మాణిక్యము అలంకారము. ఆయన బలిసిన

పొడవాటి నాల్గు చేతులను, కొత్త పద్మము వంటి లేత యెరుపు కన్నులను కలిగియుండెను. (కాలయవనుడు చూచిన రూపమిది).

నిత్యప్రముదితం శ్రీమత్సుకపోలం శుచిస్మితమ్ ।
ముఖారవిందం బిభ్రాణం స్ఫురన్మకరకుండలమ్ ॥ 3

నిత్యప్రముదితమ్= సర్వకాలములలో హర్షము కలిగినట్టియు, శ్రీమత్-సుకపోలమ్= శోభాయుక్తమైన చక్కని చెక్కిళ్లు కలిగినట్టియు, శుచిస్మితమ్= స్వచ్ఛమైన చిరునగవు కలిగినట్టియు, స్ఫురత్-మకర-కుండలమ్= మెరిసిపోయే మొసలి ఆకారపు కుండలములు కలిగిన, ముఖ-అరవిందమ్= పద్మమువంటి ముఖమును, బిభ్రాణమ్= కలిగి-యున్న (శ్రీకృష్ణుని చూచెను).

శోభాయుక్తమైన చక్కని చెక్కిళ్లు గల ఆయన ముఖముపై సర్వకాలములలో ఆనందము తాండవించును. స్వచ్ఛమైన చిరునగవు గల ఆయన పద్మమువంటి ముఖముపై మెరిసిపోయే మొసలి ఆకారపు కుండలములను ధరించియుండెను.

వాసుదేవో హ్యయమితి పుమాఞ్శ్రీవత్సలాఞ్ఛనః ।
చతుర్భుజోఽరవిందాక్షో వనమాల్యతిసుందరః ॥ 4

అయమ్= ఈ, పుమాన్= పురుషుడు, వాసుదేవః= వాసుదేవుడు (శ్రీహరి), శ్రీవత్సలాంఛనః= శ్రీవత్సమనే పుట్టు మచ్చ గలవాడు, చతుర్-భుజః= నాల్గు చేతులవాడు, అరవింద-అక్షః= పద్మముల వంటి కన్నులవాడు, వనమాలీ= అడవి పూల మాల గలవాడు, అతిసుందరః = మిక్కిలి అందగాడు, ఇతి= అని (నిశ్చయించెను).

ఈ పురుషుడు శ్రీహరియే. ఎందుకంటే, ఈయన శ్రీవత్సమనే పుట్టు మచ్చ, నాల్గు చేతులు, పద్మములవంటి కన్నులు, అడవి పూల మాల ఉన్న గొప్ప అందగాడు (అని కాలయవనుడు నిశ్చయించుకొనెను).

లక్షణైర్నారదప్రోక్తైర్నాన్యో భవితుమర్హతి ।
నిరాయుధశ్చలన్ పద్భ్యాం యోత్స్యేఽనేన నిరాయుధః ॥ 5

నారదప్రోక్తైః= నారదునిచే వర్ణించబడిన, లక్షణైః= గుర్తులను బట్టి, అన్యః= మరియొకడు, భవితుమ్= అగుటకు, న అర్హతి= తగడు, నిరాయుధః= ఆయుధములు లేనివాడు, పద్భ్యామ్= కాళ్లతో, చలన్= నడచుచున్నవాడు, అనేన= వీనితో, నిరాయుధః= ఆయుధములు లేనివాడనై, యోత్స్యే= యుద్ధము చేసెదను.

నారద మహర్షి చెప్పిన లక్షణములను బట్టి ఈతడు మరియొకడు కాజాలడు. ఈయన ఆయుధములు లేకుండా కాలి నడకన పోవుచున్నాడు. నేను కూడ ఆయుధముల లేకుండా ఈతనితో యుద్ధము చేసెదను.

ఇతి నిశ్చిత్య యవనః ప్రాద్రవంతం పరాఙ్ముఖమ్ ।
అన్వధావజ్జిఘృక్షుస్తం దురాపమపి యోగినామ్ ॥ 6

యవనః= కాలయవనుడు, ఇతి= ఈ విధముగా, నిశ్చిత్య= నిశ్చయించి, ప్రాద్రవంతమ్= పరుగెత్తుచున్నట్టియు, పరాఙ్-ముఖమ్= త్రిప్పుకున్న ముఖము కలిగినట్టియు, యోగినాం అపి= యోగులకైననూ, దురాపమ్= కష్టముతో పొంద శక్యుడైన, తమ్= ఆయనను, జిఘృక్షుః = పట్టుకొన గోరువాడై, అను-అధావత్= వెనుక పరుగెత్తెను.

ఆయన ముఖము త్రిప్పుకొని పరుగెత్తుచుండెను. కాలయవనుడీ విధముగా నిశ్చయించి యోగులకైననూ కష్టముతో పొందబడే ఆయనను పట్టుకొనగోరి వెనుక పరుగెత్తెను.

హస్తప్రాప్తమివాత్మానం హరిణా స పదే పదే ।
నీతో దర్శయతా దూరం యవనేశోఽద్రికందరమ్ ॥ 7

పదే పదే= ప్రతి అడుగునందు, ఆత్మానమ్= తనను, హస్తప్రాప్తం ఇవ= చేతికందినాడా యన్నట్లు, దర్శయతా= చూపే, హరిణా= శ్రీకృష్ణునిచే, సః= ఆ, యవన-ఈశః= యవనుల ప్రభుడగు కాలయవనుడు, అద్రికందరమ్= పర్వతగుహను గురించి, దూరమ్= దూరమును, నీతః = తీసుకుపోబడినవాడు.

ఆయన యవనప్రభుడగు కాలయవనునికి ప్రతి అడుగుకి చేతికి చిక్కినట్లే కన్పట్టెను. ఈ విధముగా ఆయన వానిని చాల దూరమందలి పర్వత గుహవద్దకు తీసుకొని పోయెను.

పలాయనం యదుకులే జాతస్య తవ నోచితమ్ ।
ఇతి క్షిపన్ననుగతో నైనం ప్రాపాహతాశుభః ॥ 8

యదుకులే= యదువుయొక్క వంశమునందు, జాతస్య= పుట్టిన, తవ= నీకు, పలాయనమ్= పారిపోవుట, న ఉచితమ్= తగినది కాదు, ఇతి= అని, క్షిపన్= నిందించువాడై, అనుగతః= వెంట వెళ్లినవాడు, అహత-అశుభః= నశించని పాపములు గలవాడు, ఏనమ్= ఈ శ్రీకృష్ణుని, న ప్రాప= చేరుకోలేదు.

దీనికి యదువు యొక్క వంశములో పుట్టిన నీకు పారిపోవుట తగదు, అని నిందిస్తూ ఆతడు వెంటపడెను. కాని, ఆతని మనోమాలిన్యము లింకనూ నశించకపోవుటచే ఈ శ్రీకృష్ణుని ఆతడు చేరుకో (స్పృశించ) లేదు.

ఏవం క్షిప్తోఽపి భగవాన్ ప్రావిశద్గిరికందరమ్ ।
సోపి ప్రవిష్టస్తత్రాన్యం శయానం దదృశే నరమ్ ॥ 9

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, క్షిప్తః అపి= నిందించబడినవాడే ఐననూ, గిరికందరమ్= కొండ గుహను, ప్రావిశత్= ప్రవేశించెను, సః అపి= ఆ కాలయవనుడు కూడ, ప్రవిష్టః=

ప్రవేశించినవాడు, తత్ర= దానియందు, శయానమ్= పరున్న, అన్యమ్= మరియొక, నరమ్= మనిషిని, దదృశే= చూచెను.

ఈ విధంగా కాలయవనుడు నిందిస్తున్నా, శ్రీకృష్ణభగవానుడు కొండ గుహలో ప్రవేశించెను. కాలయవనుడు కూడ ప్రవేశించి ఆ గుహలో నిద్రిస్తున్న మరియొక మనిషిని చూచెను.

ననుసౌ దూరమానీయ శేతే మామిహ సాధువత్ ।
ఇతి మత్వాఽచ్యుతం మూఢస్తం పదా సమతాడయత్ ॥ 10

ననుసౌ= అరే!, అసౌ= ఈతడు, మామ్= నన్ను, దూరమ్= దూరముగా, ఇహ= ఇచటకు, ఆనీయ= తీసుకువచ్చి, సాధువత్= సత్పురుషుడు వలె, శేతే= నిద్రిస్తున్నాడు, ఇతి= అని, మూఢః= మూర్ఖుడగు కాలయవనుడు, తమ్= ఆ వ్యక్తిని, అచ్యుతమ్= శ్రీకృష్ణునిగా, మత్వా= తలచి, పదా= కాలితో, సమతాడయత్= గట్టిగా తన్నెను.

అరే! ఈతడు దూరముగా ఇక్కడికి నన్ను తీసుకువచ్చి తాను సజ్జనుడు వలె నిద్రిస్తున్నాడు, అని ఆ మూర్ఖుడు తలపోసెను. ఆ వ్యక్తి శ్రీకృష్ణుడేనని తలచి వాడు ఆతనిని కాలితో గట్టిగా తన్నెను.

స ఉత్థాయ చిరం సుప్తశ్శనైరున్మీల్య లోచనే ।
దిశో విలోకయన్ పార్శ్వే తమద్రాక్షీదవస్థితమ్ ॥ 11

చిరమ్= చిరకాలము, సుప్తః= నిద్రించిన, సః= ఆయన, ఉత్థాయ= నిద్రలేచి, శనైః= మెల్లగా, లోచనే= కళ్లను, ఉన్మీల్య= తెరిచి, దిశః= దిక్కులను, విలోకయన్= చూచువాడై, పార్శ్వే= ప్రక్కనే, అవస్థితమ్= నిలబడియున్న, తమ్= ఆ కాలయవనుని, అద్రాక్షీత్= చూచెను.

చాల కాలము నిద్రించిన ఆయన నిద్ర లేచి మెల్లగా కన్నులను తెరచి నలువైపులా చూస్తూ, ప్రక్కనే నిలబడియున్న ఆ కాలయవనుని చూచెను.

స తావత్తస్య రుష్టస్య దృష్టిపాతేన భారత ।
దేహజేనాగ్నినా దగ్ధో భస్మసాదభవత్ క్షణాత్ ॥ 12

భారత= ఓ భరతవంశీయుడా!, తావత్= అంతలో, రుష్టస్య= కోపించిన, తస్య= ఆయనయొక్క, దృష్టిపాతేన= చూపు పడుటచే, సః= ఆ కాలయవనుడు, దేహజేన= దేహమునుండి పుట్టిన, అగ్నినా= అగ్నిచే, క్షణాత్= క్షణములో, దగ్ధః= కాల్చబడినవాడై, భస్మసాత్= బూడిదగా, అభవత్= ఆయెను.

భరతవంశీయుడవగు ఓ రాజా! అంతలో (నిద్ర చెడగొట్టి-నందులకు) కోపించిన ఆయన చూపు ఆ కాలయవనునిపై పడెను. ఆతని దేహము నుండి అగ్ని పుట్టి క్షణములో ఆతనిని కాల్చి బూడిద చేసెను.

రాజోవాచ ।

కో నామ స పుమాన్ బ్రహ్మన్ కస్య కింవీర్య ఏవ చ ।
కస్మాద్గుహాం గతశ్శిశ్యే కింతేజో యవనార్దనః ॥ 13

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహర్షీ!, యవన-అర్దనః= కాలయవనుని సంహరించిన, సః= ఆ, పుమాన్= వ్యక్తి, కః నామ= ఎవరై యుండును?, కస్య= ఎవనివాడు?, కింవీర్యః ఏవ చ= ఎట్టి పరాక్రమము కూడ గలవాడు? కస్మాత్= ఎందువలన, గుహామ్= గుహను, గతః= చేరినవాడై, శిశ్యే= నిద్రించెను? కింతేజః= ఎవని పుత్రుడు?

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...ఓ మహర్షీ! కాలయవనుని మట్టుబెట్టిన ఆ పురుషుడెవరు? ఏ వంశము వాడు? ఆయన పరాక్రమ-మెట్టిది? ఆయన గుహను చేరి నిద్రించుటకు కారణమేమి? ఆయన ఎవని పుత్రుడు?

శ్రీశుక ఉవాచ ।

స ఇక్ష్వాకుకులే జాతో మాంధాతృతనయో మహాన్ ।
ముచుకుంద ఇతి ఖ్యాతో బ్రహ్మణ్యస్సత్యసంగరః ॥ 14

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సః= ఆ, మహాన్ - గొప్పవాడు, ఇక్ష్వాకుకులే= ఇక్ష్వాకువంశము నందు, జాతః= పుట్టిన వాడు, మాంధాతృతనయః= మాంధాత కుమారుడు, ముచుకుందః= ముచుకుందుడు, ఇతి= అని, ఖ్యాతః= ప్రసిద్ధి గాంచినవాడు, బ్రహ్మణ్యః = బ్రాహ్మణభక్తుడు, సత్యసంగరః= సత్యప్రతిజ్ఞ గలవాడు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఆ గొప్ప వ్యక్తి ఇక్ష్వాకువంశములో మాంధాతకు పుత్రుడై జన్మించి ముచుకుందుడని ప్రసిద్ధి గాంచినవాడు. ఆయన బ్రాహ్మణభక్తుడు, సత్యమైన ప్రతిజ్ఞ గలవాడు.

స యాచితస్సురగణైరింద్రాద్యైరాత్మరక్షణే ।
అసురేభ్యః పరిత్రస్తైస్తద్రక్షాం సోఽకరోచ్చిరమ్ ॥ 15

సః= ఆయన, అసురేభ్యః= రాక్షసుల వలన, పరిత్రస్తైః= భయపడిన, ఇంద్ర-ఆద్యైః= ఇంద్రుడు మొదలుగా గల, సురగణైః= దేవతల గణములచే, ఆత్మరక్షణే= తమను రక్షించుట (నిమిత్తము) యందు, యాచితః= కోరబడినవాడు, సః= ఆయన, చిరమ్= చాల కాలము, తద్-రక్షామ్= ఆ దేవతలకు రక్షణను, అకరోత్= కలిగించెను.

రాక్షసుల వలన భయపడిన ఇంద్రుడు మొదలైన దేవతలు తమను రక్షించుమని ఆయనను కోరిరి. ఆయన వారిని చాల కాలము రక్షించెను.

లబ్ధ్వా గుహం తే స్వఃపాలం ముచుకుందమథాబ్రువన్ ।
రాజన్ విరమతాం కృచ్ఛ్రాద్భవాన్నః పరిపాలనాత్ ॥ 16

తే= వారు, స్వఃపాలమ్= స్వర్గలోకరక్షకునిగా, గుహమ్= కుమారస్వామిని, లబ్ధ్వా= పొంది, అథ= అప్పుడు, ముచుకుందమ్=

ముచుకుందుని ఉద్దేశించి, అబ్రువన్= పలికిరి, రాజన్= ఓ రాజా!, భవాన్= నీవు, నః= మా, పరిపాలనాత్= రక్షించుట అనే, కృచ్ఛ్రాత్= కష్టమునుండి, విరమతామ్= విరమించుము.

వారికి స్వర్గలోకరక్షకునిగా కుమారస్వామి లభించెను. అప్పుడు వారు ముచుకుందునితో నిట్లనిరి – ఓ రాజా! మమ్ములను రక్షించుట అనే కష్టమును నీవు విరమించుము.

నరలోకే పరిత్యజ్య రాజ్యం నిహతకంటకమ్ ।
అస్మాన్ పాలయతో వీర కామాస్తే సర్వ ఉజ్ఝితాః ॥ 17

వీర= ఓ వీరుడా!, నరలోకే= మానవలోకమునందు, నిహత-కంటకమ్= సంహరించబడిన శత్రువులు గల, రాజ్యమ్= రాజ్యమును, పరిత్యజ్య= విడిచి పెట్టి, అస్మాన్= మమ్ములను, పాలయతః= రక్షించుచున్న, తే= నీ, సర్వే= అన్ని, కామాః= కామనలు, ఉజ్ఝితాః= విడిచి పెట్టబడినవి.

ఓ వీరుడా! నీవు మానవలోకమునందు నిష్కంటకమైన రాజ్యమును విడిచిపెట్టి మమ్ములను రక్షించుటకై సకలకామనలను విడిచి పెట్టినావు.

సుతా మహిష్యో భవతో జ్ఞాతయోఽమాత్యమంత్రిణః ।
ప్రజాశ్చ తుల్యకాలీయా నాధునా సంతి కాలితాః ॥ 18

భవతః= నీకు, తుల్యకాలీయాః= సమకాలీనులైన, సుతాః= పుత్రులు, మహిష్యః= భార్యలు, జ్ఞాతయః= బంధువులు, అమాత్య-మంత్రిణః= అమాత్యులు మంత్రులు, ప్రజాః చ= ప్రజలు కూడ, కాలితాః= కాలముచే కడతేర్చబడినవారు, అధునా= ఇప్పుడు, న సంతి = లేరు.

నీ సమకాలీనులగు పుత్రులు, భార్యలు, బందుగులు, కార్యదర్శులు, సలహాదారులు, ప్రజలు కూడ కాలము చేసినారు. వారిప్పుడు లేరు.

కాలో బలీయాన్ బలినాం భగవానీశ్వరోఽవ్యయః ।
ప్రజాః కాలయతే క్రీడన్ పశుపాలో యథా పశూన్ ॥ 19

బలినామ్= బలవంతులలో, కాలః= కాలము, బలీయాన్= బలశాలి, భగవాన్= సర్వసమర్థము (భగవత్స్వరూపము), ఈశ్వరః= సర్వమును శాసించునది, అవ్యయః= వినాశము లేనిది, క్రీడన్= క్రీడించుచున్నదై, పశుపాలః= పశుల కాపరి, పశూన్ యథా= పశువులను వలె, ప్రజాః= ప్రాణులను, కాలయతే= వశములోనుంచును.

సర్వసమర్థమగు కాలము బలవంతులలోకెల్లా బలమైనది. వినాశము లేని కాలము సర్వమును శాసించును. భగవత్స్వరూపమగు కాలము క్రీడిస్తూ, పశుల కాపరి పశువులను వలె, ప్రాణులను వశములోనుంచును.

వరం వృణీష్వ భద్రం తే ముతే కైవల్యమద్య నః ।
ఏక ఏవేశ్వరస్తస్య భగవాన్ విష్ణురవ్యయః ॥ 20

అద్య= ఇప్పుడు, నః= మా సన్నిధినుండి, కైవల్యం ముతే= మోక్షమును మినహాయించి, వరమ్= వరమును, వృణీష్వ= కోరుకొనుము, తే= నీ కొరకు, భద్రమ్= మంగళమగు గాక!, తస్య= ఆ మోక్షమునకు, ఈశ్వరః= ఈయ సమర్థుడు, అవ్యయః= కాలాతీతుడగు, భగవాన్ విష్ణుః= శ్రీహరి భగవానుడు, ఏకః ఏవ= ఒక్కడు మాత్రమే.

నీవు ఇప్పుడు మానుండి మోక్షమును మినహాయించి ఏదేని వరమును కోరుకొనుము. నీకు మంగళమగు గాక! ఆ మోక్షమునిచ్చే సమర్థుడు కాలాతీతుడగు శ్రీహరి భగవానుడొక్కడు మాత్రమే.

ఏవముక్తస్స వై దేవానభివంద్య మహాయశాః ।
అశయిష్ట గుహాఽఽవిష్టో నిద్రయా దేవదత్తయా ॥ 21

మహాయశాః= గొప్ప కీర్తి గల, సః వై= ఆ ముచుకుందుడైతే, ఏవమ్= ఈ విధముగా, ఉక్తః= చెప్పబడినవాడై, దేవాన్= దేవతలను, అభివంద్య= ప్రణమిల్లి, గుహా-ఆవిష్టః= గుహను ప్రవేశించినవాడై, దేవదత్తయా= దేవతలచే ఈయబడిన, నిద్రయా= నిద్రతో, అశయిష్ట= నిద్రించెను.

గొప్ప కీర్తి గల ఆ ముచుకుందునితో దేవతలిట్లు పలికి నిద్రను వరముగానిచ్చిరి. ఆయన వారికి ప్రణమిల్లి గుహను ప్రవేశించి నిద్రించెను.

స్వపం యాతం యస్తు మధ్యే బోధయేత్త్వామచేతనః ।
సత్వయా దృష్టమాత్రస్తు భస్మీభవతు తత్క్షణాత్ ॥ 22

స్వాపమ్= నిద్రను, యాతమ్= పొందిన, త్వాం తు= నిన్నైతే, యః= ఏ, అచేతనః= మూర్ఖుడు, మధ్యే= మధ్యయందు, బోధయేత్= నిద్ర లేపునో, సః తు= వాడైతే, త్వయా= నీచే, దృష్టమాత్రః= కేవలము చూడబడినవాడై, తత్క్షణాత్= అదే క్షణములో, భస్మీభవతు= బూడిద యగుగాక!

నీవు నిద్ర పోతూండగా మధ్యలో ఏ మూర్ఖుడైతే నిద్ర లేపునో, వాడు నీవు కేవలము చూచినంత మాత్రాన ఆ క్షణమే బూడిద యగుగాక! (అని దేవతలు వరమునిచ్చిరి).

యవనే భస్మసాన్నీతే భగవాన్ సాత్వతర్షభః ।
ఆత్మానం దర్శయామాస ముచుకుందాయ ధీమతే ॥ 23

యవనే= కాలయవనుడు, భస్మసాత్= బూడిదగా, నీతే= చేయబడగా, సాత్వత-ఋషభః= యాదవశ్రేష్ఠుడగు, భగవాన్= శ్రీకృష్ణ

భగవానుడు, ధీమతే= బుద్ధిశాలియగు, ముచుకుందాయ= ముచుకుందుని కొరకు, ఆత్మానమ్= తనను, దర్శయామాస= కనబడునట్లు చేసెను.

కాలయవనుడు బూడిద కాగానే బుద్ధిశాలియగు ముచుకుందునకు యాదవ శ్రేష్ఠుడగు శ్రీకృష్ణ భగవానుడు తన దర్శనమునిచ్చెను.

తమాలోక్య ఘనశ్యామం పీతకౌశేయవాససమ్ ।
శ్రీవత్సవక్షసం భ్రాజత్కౌస్తుభేన విరాజితమ్ ॥ 24

ఘనశ్యామమ్= మేఘము వలె నల్లనైనట్టియు, పీతకౌశేయ-వాససమ్= పచ్చని పట్టు వస్త్రములు కలిగినట్టియు, శ్రీవత్సవక్షసమ్= శ్రీదేవి రేఖారూపముగా వక్షఃస్థలమునందు కలిగినట్టియు, భ్రాజత్-కౌస్తుభేన= మెరిసిపోయే కౌస్తుభమాణిక్యముతో, విరాజితమ్= ప్రకాశించే, తమ్= ఆ శ్రీకృష్ణుని, ఆలోక్య= చూచి.

ముచుకుందుడు మేఘము వలె నల్లనైన శ్రీకృష్ణుని చూచెను. పచ్చని పట్టు వస్త్రములను దాల్చిన ఆయన వక్షఃస్థలముపై రేఖారూపిణి యగు శ్రీతో, మెడలో కౌస్తుభమాణిక్యముతో విరాజిల్లెను.

చతుర్భుజం రోచమానం వైజయంత్యా చ మాలయా ।
చారు ప్రసన్నవదనం స్ఫురన్మకరకుండలమ్ ॥ 25

చతుర్-భుజమ్= నాల్గు చేతులు కలిగినట్టియు, వైజయంత్యా= వైజయంతి అనే, మాలయా చ= మాలతో కూడ, రోచమానమ్= ప్రకాశించుచున్నట్టియు, చారుప్రసన్నవదనమ్= అందమైన ప్రసన్నమగు ముఖము కలిగినట్టియు, స్ఫురత్-మకరకుండలమ్= మెరిసిపోయే మకరకుండలములు కలిగిన (శ్రీకృష్ణుని చూచెను).

నాల్గు చేతులు గల ఆ శ్రీహరి వైజయంతి అనే పంచరత్నమాలతో ప్రకాశించుచుండెను. ఆయన ప్రసన్నమగు ముఖము మెరిసిపోయే మకరకుండలములతో అందముగా నుండెను.

ప్రేక్షణీయం నృలోకస్య సానురాగ స్మితేక్షణమ్ ।
అపీచ్యవయసం మత్తమృగేంద్రోదారవిక్రమమ్ ॥ 26

నృలోకస్య= మానవలోకమునకు, ప్రేక్షణీయమ్= దర్శించదగి-నట్టియు, స-అనురాగస్మిత-ఈక్షణమ్= ప్రేమతో చిరునవ్వుతో కూడిన చూపు కలిగినట్టియు, అపీచ్యవయసమ్= సుందరమైన యౌవనము కలిగినట్టియు, మత్తమృగ-ఇంద్ర-ఉదారవిక్రమమ్= మదించిన సింహము వలె గంభీరమగు నడక కలిగిన (శ్రీకృష్ణుని చూచెను).

మానవలోకమునకు దర్శించదగిన శ్రీకృష్ణుడు ప్రేమతో, చిరునవ్వుతో చూచుచుండెను. సుందరయువకుడగు ఆయన మదించిన సింహము వలె గంభీరముగా నడచును.

పర్యపృచ్ఛన్మహాబుద్ధిస్తేజసా తస్య ధర్షితః ।
శంకితశ్చనకై రాజా దుర్ధ ర్షమివ తేజసా ॥ 27

తస్య= ఆయనయొక్క, తేజసా= తేజస్సుచే, ధర్షితః= పరాభూతుడై, శంకితః= సందేహము గలవాడు, మహాబుద్ధిః= గొప్ప బుద్ధిశాలి అగు ముచుకుందుడు, తేజసా= తేజస్సుచే, దుర్ధర్షం ఇవ= సుతరాము చకితుని చేయుట శక్యము కాని శ్రీకృష్ణుని, పర్యపృచ్ఛత్= ప్రశ్నించెను.

శ్రీకృష్ణుని తేజస్సుచే ముచుకుందుడు పరాభూతుడయ్యెనే గాని, శ్రీకృష్ణుని ఎవ్వరైననూ తమ తేజస్సుచే చకితుని చేయలేరు. గొప్ప బుద్ధిశాలియగు ముచుకుందునకు సందేహము కలిగి కృష్ణుని ప్రశ్నించెను.

ముచుకుంద ఉవాచ ।
కో భవానిహ సంప్రాప్తో విపినే ఘోరగహ్వరే ।
పద్భ్యాం పద్మపలాశాభ్యాం విచరస్యురుకంటకే ॥ 28

ముచుకుందః= ముచుకుందుడు, ఉవాచ= పలికెను, ఇహ= ఈ, ఘోరగహ్వరే= భయంకరమై ప్రవేశించ శక్యము కాని, విపినే= నిర్జనమగు

అడవియందు, సంప్రాప్తుఃడ= వచ్చిన, భవాన్= నీవు, కుఃడ= ఎవరివి?, పద్మపలాశాభ్యామ్= పద్మములవలె కోమలములైన, పద్భ్యామ్= పాదములతో, ఉరుకంటకే= అధికమగు ముళ్లు గల స్థానమునందు, విచరసి= సంచరించుచున్నావు.

ముచుకుందుడిట్లు పలికెను...ఈ నిర్జనమగు అడవి భయంకర-మైనది, ప్రవేశించ శక్యము కానిది. దీనిలో ప్రవేశించి, పద్మములవలె కోమలములైన పాదములతో నీవు అధికమగు ముళ్లు గల స్థానమునందు సంచరించుచున్నావు. నీవెవరివి?

కిం స్విత్తేజస్వినాం తేజో భగవాన్ వా విభావసుఃడ।
సూర్యస్సోమో మహేంద్రో వా లోకపాలోపరోపి వా ॥ 29

తేజస్వినామ్= తేజశ్శాలురలో, తేజుఃడ= తేజోమూర్తియగు, భగవాన్= పూజనీయుడగు, విభావసుఃడ కిం స్విత్= అగ్నివా?, వా= లేక, సూర్యుఃడ= సూర్యుడవా?, సోముఃడ= చంద్రుడవా?, మహా-ఇంద్రుఃడ వా= మహేంద్రుడవా?, వా= లేక, అపరుఃడ= మరియొక, లోకపాలుఃడ= లోకపాలుడవా?

తేజశ్శాలురలోకెల్లా మూర్తీభవించిన తేజస్సు, పూజనీయుడు అగు ఆ అగ్నివా? సూర్యుడవా? చంద్రుడవా? లేక, మరియొక లోకపాలకుడవా?

మన్యే త్వాం దేవదేవానాం త్రయాణాం పురుషర్షభమ్ ।
యద్బాధసే గుహాధ్వాంతం ప్రదీపుఃడ ప్రభయా యథా ॥ 30

త్వామ్= నిన్ను, దేవదేవానామ్= దేవతలకు కూడ దేవుడైన, త్రయాణామ్= బ్రహ్మ విష్ణుమహేశ్వరులలో, పురుష-ఋషభమ్= పురుషోత్తముడగు విష్ణువునిగా, మన్యే= తలంచుచున్నాను, యత్= ఏలయన, ప్రభయా= కాంతిచే, ప్రదీపుఃడ యథా= దీపము వలె, గుహాధ్వాంతమ్= గుహయందలి చీకటిని, బాధసే= పోగొట్టుచున్నావో.

బ్రహ్మ విష్ణుమహేశ్వరులు దేవతలకు కూడ దేవులు. నీవు వారిలో పురుషోత్తముడగు శ్రీహరివని తలంచుచున్నాను. ఏలయన, నీవు కాంతిచే గుహయందలి చీకటిని పరాస్తము చేయుచున్నావు.

శుశ్రూషతామవ్యలీకమస్మాకం నరపుంగవ ।
స్వజన్మ కర్మ గోత్రం వా కథ్యతాం యది రోచతే ॥ 31

నరపుంగవ= ఓ పురుషోత్తమా!, రోచతే యది= ఇష్టమైనచో, శుశ్రూషతామ్= వినగోరే, అస్మాకమ్= మాకు, స్వజన్మ= నీ పుట్టుక, కర్మ= క్రియ, గోత్రం వా= గోత్రము (పేరు) గాని, అవ్యలీకమ్= నిష్కపటముగా, కథ్యతామ్= చెప్పబడుగాక!

ఓ పురుషోత్తమా! మీకిష్టమైనచో వినగోరే మాకు మీ పుట్టుక, చేసే పని, పేరు, మీ వంశప్రవర్తకుల గురించి దాచి పెట్టకుండా చెప్పుడు.

వయం తు పురుషవ్యాఘ్ర ఐక్ష్వాకాః క్షత్రబంధవః ।
ముచుకుంద ఇతి ప్రోక్తో యౌవనాశ్వాత్మజః ప్రభో ॥ 32

పురుషవ్యాఘ్ర= పురుషోత్తమా, వయం తు= నేను, ఐక్ష్వాకాః= ఇక్ష్వాకు వంశానికి చెందిన, క్షత్రబంధవః= క్షత్రియుడను, ప్రభూ!, ముచుకుందః= ముచుకుందుడు, ఇతి= అని, ప్రోక్తః= పిలువబడువాడను, యౌవనాశ్వ–ఆత్మజః= యౌవనాశ్వుని కుమారుడైన మాంధాత యొక్క పుత్రుడను.

ఓ పురుషోత్తమా! నేనైతే ఇక్ష్వాకు వంశమునకు చెందిన క్షత్రియుడను. ఓ ప్రభూ! నన్ను ముచుకుందుడంటారు. నేను యౌవనాశ్వుని పుత్రుడగు మాంధాతయొక్క పుత్రుడను.

చిరప్రజాగరశ్రాంతో నిద్రయోపహతేంద్రియః ।
శయేస్మిన్ విజనే కామం కేనాప్యుత్థాపితోధునా ॥ 33

చిరప్రజాగరశాంతః= చాల కాలము తెలివిగా నుండుటచే అలసిన నేను, నిద్రయా= నిద్రచే, ఉపహత–ఇంద్రియః= పరవశమైన ఇంద్రియములు

గలవాడనై, అస్మిన్= ఈ, విజనే= నిర్జన ప్రదేశమునందు, కామమ్= యథేచ్ఛగా, శయే= నిద్రించితిని, కేన అపి= ఎవడో ఒకనిచే, అధునా= ఇప్పుడు, ఉత్థాపితః= నిద్ర లేపబడితిని.

నేను చాల కాలము తెలివిగా ఉండి, అలసిపోతిని. నా ఇంద్రియములు స్వాధీనత తప్పినవి. నేనీ నిర్జనప్రదేశమునందు యథేచ్ఛగా నిద్రించగా, ఎవడో ఒకడు నన్ను నిద్ర లేపినాడు.

సోఽపి భస్మీకృతో నూనమాత్మీయేనైవ పాప్మనా ।
అనంతరం భవాఞ్శ్రీమాన్ లక్షితోఽమిత్రశాతనః ॥ 34

సః అపి= అతడైతే, నూనమ్= నిశ్చయముగా, ఆత్మీయేన=తనదైన, పాప్మనా ఏవ= పాపము చేతనే, భస్మీకృతః= బూడిద చేయబడినవాడు, అనంతరమ్= వెనువెంటనే, శ్రీమాన్= శోభాయుక్తుడవు, అమిత్రశాతన= శత్రుసంహారకుడవు అగు, భవాన్= తమరు, లక్షితః= చూడబడితిరి.

ఆతడైతే తన పాపము చేతనే నిశ్చయముగా బూడిద చేయబడినాడు. వెనువెంటనే శోభాయుక్తులగు తమరు నాకు కనబడిరి. తమరు శత్రుసంహారకులు.

తేజసా తేఽవిషహ్యేణ భూరి ద్రష్టుం న శక్నుమః ।
హతౌజసో మహాభాగ మాననీయోఽసి దేహినామ్ ॥ 35

మహాభాగ= ఓ మహాతేజశ్శాలీ!, తే= నీయొక్క, అవిషహ్యేణ= సహించ శక్యము కాని, తేజసా= తేజస్సుచే, హత-ఓజసః= విహతమైన దర్శనశక్తి గల మేము, భూరి= చాల సేపు, ద్రష్టుమ్= చూచుటకు, న శక్నుమః= సమర్థులము కాము, దేహినామ్= ప్రాణులకు, మాననీయః= పూజించ దగినవాడవు, అసి= అగుచున్నావు.

ఓ మహాతేజశ్శాలీ! సహించ శక్యము కాని నీ తేజస్సుచే నా దర్శనశక్తి విహతమై నేను చాలసేపు చూడ లేకున్నాను. కాని, నీవు ప్రాణులకు పూజనీయుడవని మాత్రము తెలియుదును.

ఏవం సంభాషితో రాజ్ఞా భగవాన్ భూతభావనః ।
ప్రత్యాహ ప్రహసన్ వాణ్యా మేఘనాదగభీరయా ॥ 36

భూతభావనః= ప్రాణులకు రక్షకుడైన, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, రాజ్ఞా= రాజుచే, సంభాషితః= సంభాషించబడిన వాడై, ప్రహసన్= నవ్వుచున్నవాడై, మేఘనాదగభీరయా= మేఘగర్జన వలె గంభీరమైన, వాణ్యా= వాక్కుతో, ప్రత్యాహ= బదులు చెప్పెను.

ప్రాణులకు రక్షకుడగు శ్రీకృష్ణ భగవానునితో ముచుకుంద మహారాజు ఈ విధముగా సంభాషించెను. ఆపుడాయన నవ్వుతూ మేఘగర్జన వలె గంభీరమైన వాక్కుతో ఇట్లు బదులు చెప్పెను.

శ్రీభగవానువాచ ।

జన్మకర్మాభిధానాని సంతి మేఽంగ సహస్రశః ।
న శక్యంతేఽనుసంఖ్యాతుమనంతత్వాన్మయాఽపి హి ॥ 37

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, అంగ= ఓయీ!, మే= నాకు, జన్మకర్మ-అభిధానాని= జన్మలు క్రియలు పేర్లు, సహస్రశః= వేల కొలది, సంతి= ఉన్నవి, అనంతత్వాత్= అనంతములగుట వలన, మయా అపి= నాచే కూడా, అనుసంఖ్యాతుమ్= లెక్కించుటకు, న శక్యంతే= శక్యము కావు, హి= నిశ్చయము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను... ఓయీ! నాకు జన్మలు, క్రియలు, పేర్లు వేలకొలదీ ఉన్నవి. అవి అనంతములగుట వలన, నేను కూడా వాటిని లెక్కించలేననేది నిశ్చయము.

క్వచిద్రజాంసి విమమే పార్థివాన్యురుజన్మభిః ।
గుణకర్మాభిధానాని న మే జన్మాని కర్హిచిత్ ॥ 38

క్వచిత్= ఒకప్పుడు, పార్థివాని= పృథివికి చెందిన, రజాంసి= ధూళికణములను, ఉరుజన్మభిః= అనేకజన్మలచే, విమమే= లెక్కించెను, మే= నా, గుణకర్మ-అభిధానాని= గుణములను క్రియలను పేర్లను, జన్మాని= జన్మలను, కర్హిచిత్= ఏనాడైననూ, న= లెక్కించలేదు.

ఎవడైననూ ఒకప్పుడు భూగోళము యొక్క ధూళికణములను బహుజన్మలచే లెక్కించవచ్చునేమో గాని, నా జన్మలను, గుణములను, కర్మలను, పేర్లను మాత్రము ఏనాడైననూ లెక్కించలేదు.

కాలత్రయోపపన్నాని జన్మకర్మాణి మే నృప ।
అనుక్రమంతో నైవాంతం గచ్ఛంతి పరమర్షయః ॥ 39

నృప= ఓ రాజా!, పరమ-ఋషయః= మహర్షులు, కాలత్రయ-ఉపపన్నాని= మూడు కాలములయందు సిద్ధములైన, మే= నా, జన్మ కర్మాణి= అవతారములను లీలలను, అనుక్రమంత= క్రమముగా వర్ణించు వారై, అంతమ్= అంతమును, న ఏవ గచ్ఛంతి= సుతరాము చేరుట లేదు.

ఓ మహారాజా! భూతవర్తమానభవిష్యత్కాలములలో సిద్ధములైన నా అవతారములను, లీలలను మహర్షులు వరుసగా వర్ణించియు అంతము చేరలేకున్నారు.

తథాఽప్యద్యతనాన్యంగ శృణుష్వ గదతో మమ ।
విజ్ఞాపితో విరించేన పురాఽహం ధర్మగుప్తయే ।
భూమేర్భారాయమాణానామసురాణాం క్షయాయ చ ॥ 40

అంగ= ఓయీ!, తథా అపి= అయినప్పటికీ, మమ= నేను, గదతః = చెప్పుచుండగా, అద్యతనాని= వర్తమానములైన జన్మకర్మలను గురించి, శృణుష్వ= వినుము, పురా= పూర్వము, అహమ్= నేను, విరించేన= బ్రహ్మదేవునిచే, ధర్మగుప్తయే= ధర్మరక్షణ కొరకు, భూమేః= భూమికి, భారాయమాణానామ్= బరువగుచున్న, అసురాణామ్= అసురుల, క్షయాయ చ= వినాశము కొరకు కూడ, విజ్ఞాపితః= విన్నవించబడితిని.

ఓయీ! అయినప్పటికీ ఈ వర్తమానములోని జన్మకర్మలను గురించి చెప్పెదను, వినుము. పూర్వము బ్రహ్మదేవుడు భూమికి బరువగుచున్న అసురులను సంహరించి ధర్మమును రక్షింపుమని నాకు విన్నవించెను.

అవతీర్ణో యదుకులే గృహ ఆనకదుందుభేః ।
వదంతి వాసుదేవేతి వసుదేవసుతం హి మామ్ ॥ 41

యదోఃʹ= యదువు యొక్క, వంశేʹ= వంశమునందు, ఆనక-దుందుభేఃʹ= వసుదేవుని, గృహేʹ= ఇంటి (భార్య) యందు, అవతీర్ణఃʹ= అవతరించిన వాడను, వసుదేవసుతమ్ʹ= వసుదేవుని పుత్రుడనగు, మామ్ʹ= నన్ను, హిʹ= నిశ్చయముగా, వాసుదేవేతిʹ= వాసుదేవుడని, వదంతిʹ= పిలిచెదరు.

యదువు వంశమునందు దేవకీవసుదేవులకు పుత్రుడనై నేను అవతరించితిని. వసుదేవుని పుత్రుడనగు నన్ను వాసుదేవుడని పిలిచెదరు.

కాలనేమిర్హతః కంసః ప్రలంబాద్యాశ్చ సద్విషః ।
అయం చ యవనో దగ్ధో రాజంస్తే తిగ్మచక్షుషా ॥ 42

రాజన్ʹ= ఓ రాజా! కంసఃʹ= కంసుడైన, కాలనేమిఃʹ= కాలనేమి, హతఃʹ= సంహరించబడినవాడు, సద్-ద్విషఃʹ= సత్పురుషులను ద్వేషించే, ప్రలంబ ఆద్యాʹ: చʹ= ప్రలంబుడు మొదలుగా గలవారు కూడ, అయమ్ʹ= ఈ, యవనఃʹ చʹ= కాలయవనుడు కూడ, తేʹ= నీ, తిగ్మచక్షుషాʹ= తీక్ష్ణమగు చూపుచే, దగ్ధఃʹ= దహించబడినవాడు.

ఓ పరీక్షిన్మహారాజా! కంసుని రూపములోనున్న కాలనేమి, సత్పురుషులను ద్వేషించే ప్రలంబుడు, అఘుడు మొదలగు రాక్షసులు సంహరించబడినారు. నీవీ కాలయవనుని నీ తీక్ష్ణమగు చూపుతో దహించితివి.

సోహం తవానుగ్రహార్థం గుహామేతాముపాగతః ।
ప్రార్థితః ప్రచురం పూర్వం త్వయాఽహం భక్తవత్సలః ॥ 43

సః= అట్టి, అహమ్= నేను, తవ= నిన్ను, అనుగ్రహ-అర్థమ్= అనుగ్రహించుట కొరకు, ఏతామ్= ఈ, గుహామ్= గుహను గురించి, ఉపాగతః= వచ్చినవాడను, పూర్వమ్= పూర్వజన్మయందు, త్వయా= నీచే, భక్తవత్సలః= భక్తవత్సలుడనగు, అహమ్= నేను, ప్రచురమ్= అధికముగా, ప్రార్థితః= ఆరాధించబడితిని.

అట్టి నేను నిన్ను అనుగ్రహించుటకై ఈ గుహకు వచ్చితిని. పూర్వజన్మలో నీవు భక్తవత్సలుడనగు నన్ను అధికముగా ఆరాధించితివి.

వరాన్ వృణీష్వ రాజర్షే సర్వాన్ కామాన్ దదామి తే ।
మాం ప్రపన్నో జనః కశ్చిన్న భూయోఽర్హతి శోచితుమ్ ॥ 44

రాజ-ఋషే= ఓ రాజర్షీ!, వరాన్= వరములను, వృణీష్వ= కోరుకొనుము, తే= నీ కొరకు, సర్వాన్= అన్ని, కామాన్= కోరికలను, దదామి= ఇచ్చెదను, మామ్= నన్ను, ప్రపన్నః= శరణు పొందిన, కశ్చిత్= ఏ, జనః= జనుడైననూ, భూయః= మరల, శోచితుమ్= దుఃఖించుటకు, న అర్హతి= తగడు.

ఓ రాజర్షీ! వరములను కోరుము. నీ కోరికలనన్నింటినీ తీర్చెదను. నన్ను శరణు పొందినవాడే జనుడైననూ మరల దుఃఖించుటకు తగడు.

శ్రీశుక ఉవాచ ।

ఇత్యుక్తస్తం ప్రణమ్యాహ ముచుకుందో ముదాఽన్వితః ।
జ్ఞాత్వా నారాయణం దేవం గర్గవాక్యమనుస్మరన్ ॥ 45

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, ఉక్తః= పలుకబడిన, ముచుకుందః= ముచుకుందుడు, ముదా=

ఆనందముతో, అన్వితః= కూడుకున్నవాడై, ప్రణమ్య= ప్రణమిల్లి, గర్గవాక్యమ్= గర్గాచార్యుని వచనమును, అనుస్మరన్= స్మరించువాడై, నారాయణం దేవమ్= నారాయణ దేవునిగా, జ్ఞాత్వా= గుర్తించి, ఆహ= పలికెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణుడిట్లు పలుకగా ముచుకుందుడు ఆనందమును పొంది ప్రణమిల్లెను. ఆతనికి గర్గాచార్యుని మాట గుర్తుకు వచ్చి శ్రీకృష్ణుడు నారాయణ దేవుడేనని గుర్తించెను.

ముచుకుంద ఉవాచ ।

విమోహితోఽయం జన ఈశ మాయయా
త్వదీయయా త్వాం న భజత్యనర్థదృక్ ।
సుఖాయ దుఃఖప్రభవేషు సజ్జతే
గృహేషు యోషిత్పురుషశ్చ వంచితః ॥ 46

ముచుకుందః= ముచుకుందుడు, ఉవాచ= పలికెను, ఈశ= ఓ ఈశ్వరా!, యోషిత్= స్త్రీ, పురుషః చ= పురుషుడు అనే, అయమ్= ఈ, జనః= జనుడు, త్వదీయయా= నీకు చెందిన, మాయయా= మాయచే, విమోహితః= వ్యామోహమును పొందించబడిన వాడు, అనర్థదృక్= అనర్థమగు సంసారమునందు దృష్టి గలవాడు, త్వామ్= నిన్ను, న భజతి= సేవించుట లేదు, వంచితః= మోసగించబడిన వాడై, సుఖాయ= ఆ సుఖము కొరకు, దుఃఖప్రభవేషు= దుఃఖమునకు జన్మస్థానమగు, గృహేషు= ఇంటియందు, సజ్జతే – ఆసక్తుడగుచున్నాడు.

ముచుకుందుడిట్లు పలికెను... స్త్రీలు గాని, పురుషులు గాని ఈ మానవులు నీ మాయచే వ్యామోహమును పొందినారు. వారు అనర్థమగు సంసారమునందు దృష్టి గలవారై నిన్ను ఆరాధించుట లేదు. వారు మోసపోయి సుఖము కొరకు దుఃఖనిలయములగు గృహవ్యవహారముల యందు ఆసక్తులగుచున్నారు.

లబ్ధ్వా జనో దుర్లభమత్ర మానుషం
కథంచిదవ్యంగమయత్నతోఽనఘ ।
పాదారవిందం న భజత్యసన్మతిర్గృహాంధకూపే
పతితో యథా పశుః ॥ 47

అనఘ= పాపసంబంధము లేనివాడా!, జనః= మానవుడు, అత్ర= ఈ లోకము (కర్మభూమి) నందు, దుర్లభమ్= పొందుట కష్టమైనట్టియు, అవ్యంగమ్= అంగవైకల్యము లేని, మానుషమ్= మనుష్య జన్మను, కథంచిత్= ఏదోవిధముగా, అయత్నతః= ప్రయత్నము లేకుండానే, లబ్ధ్వా= పొంది, అసత్-మతిః= దుష్టమగు (విషయసుఖమునందు) బుద్ధి గలవాడై, గృహ-అంధకూపే= ఇల్లు అనే చీకటి కూపమునందు, పతితః= పడినవాడై, పశుః యథా= పశువు వలె, పాద-అరవిందమ్= పాదపద్మమును, న భజతి= సేవించుట లేదు.

పాపసంబంధము లేని ఓ దేవా! మానవుడీ లోకము (కర్మభూమి) లో అంగవైకల్యము లేని మానవజన్మను ఏదోవిధముగా ప్రయత్నము లేకుండానే పొందినాడు. ఇట్టి జన్మ దుర్లభము. అయిననూ, దుష్టమగు (భోగములయందు తగుల్కున్న) బుద్ధిగల మానవుడు సంసారమనే చీకటి నూతిలో పడినవాడై పశువు వలె నీ పాదపద్మమును సేవించుట లేదు.

మమైష కాలోఽజిత నిష్ఫలో గతో రాజ్యశ్రియోన్నద్ధమదస్య భూపతేః ।
మర్త్యాత్మబుద్ధేస్సుతదారకోశభూష్వాసజ్జమానస్య దురంతచింతయా॥ 48

అజిత= పరాజయము లేనివాడా!, రాజ్యశ్రియా= రాజ్యము యొక్క సంపదచే, ఉన్నద్ధమదస్య= పెరిగిన గర్వము కలిగినట్టియు, భూపతేః= రాజునైనట్టియు, మర్త్య-ఆత్మబుద్ధేః= మరణించే దేహమునందు ఆత్మాభిమానము కలిగినట్టియు, దురంతచింతయా= అంతము లేని చింతనతో, సుతదారకోశభూషు= సంతానము భార్య సంపద భూముల

యందు, ఆసజ్జమానస్య= ఆసక్తిని పెంచుకున్న, మమ= నాకు, ఏషః= ఈ, కాలః= కాలము, నిష్ఫలః= వ్యర్థమై, గతః= వెళ్లినది.

ఓ అపరాజితా! రాజునై రాజ్యము యొక్క సంపదచే బాగా గర్వించితిని. దేహమే ఆత్మ అనే అభిమానముతో సంతానము, భార్య, సంపద, భూమి అనువాటియందు ఆసక్తిని పెంచుకొని అంతులేని చింతనతో నా ఈ కాలము వ్యర్థముగా వెళ్లిపోయినది.

కలేవరేఽస్మిన్ ఘటకుడ్యసన్నిభే నిరూఢమానో నరదేవ ఇత్యహమ్।
వృతో రథేభాశ్వపదాత్యనీకైర్గాం పర్యటంస్త్వాఽగణయన్ సుదుర్మదః ॥ 49

ఘటకుడ్యసన్నిభే= కుండను గోడను పోలిన, అస్మిన్= ఈ, కలేవరే= దేహమునందు, నరదేవః= రాజు, ఇతి= అని, నిరూఢమానః= పాదుకున్న అభిమానము గల, సుదుర్మదః= మిక్కిలి గర్వించిన, అహమ్= నేను, రథ-ఇభ-అశ్వపదాతి-అనీకైః= రథములు ఏనుగులు గుర్రములు పదాతుల సైన్యములచే, వృతః= చుట్టువారబడినవాడనై, గామ్= భూమిని, పర్యటన్= పర్యటించువాడనై, త్వా= నిన్ను, అగణయన్= లెక్క చేయని వాడను.

కుండ, గోడల వలె దృశ్యమగు ఈ దేహమునందు రాజునని పాదుకున్న అభిమానము కలిగి నేను బాగా గర్వించితిని. రథములు, ఏనుగులు, గుర్రములు, పదాతుల సైన్యములు చుట్టువారి రాగా భూమిని పర్యటిస్తూ (కాలరూపుడవగు) నిన్ను లెక్క చేయకుంటిని.

ప్రమత్తముచ్చైరితికృత్యచింతయా ప్రవృద్ధలోభం విషయేషు లాలసమ్।
త్వమప్రమత్తస్సహసాఽభిపద్యసే క్షుల్లేలిహానోఽహిరివాఖుమంతకః ॥ 50

కృత్యచింతయా= చేయవలసిన పనుల గురించి చింతనతో, ఉచ్చైః= అధికముగా, ప్రమత్తమ్= అసావధానుడైనట్టియు, ప్రవృద్ధలోభమ్= బాగా పెరిగిన లోభము కలిగినట్టియు, విషయేషు= ఇంద్రియభోగములయందు,

లాలసమ్= అధికమగు స్పృహగల మానవుని, అప్రమత్తుఃమ్= సావధానుడ వైన, అంతకుఃమ్= కాలరూపుడవగు, త్వమ్= నీవు, సహసా= వేగముగా, క్షుత్-లేలిహానుఃమ్= ఆకలిచే నాలుకలతో పెదవులనాస్వాదించే, అహిుఃమ్= పాము, ఆఖుం ఇవ= ఎలుకను వలె, అభిపద్యసే= బలముగా మ్రింగెదవు.

చేయవలసిన పనుల గురించి చింతతో మానవుడు భగవద్భజనము విషయములో అసావధానుడై యుండును. బాగా పెరిగిన లోభము గలవాడై మానవుడు ఇంద్రియభోగములయందు అధికమగు స్పృహతో నుండును. కాని, కాలరూపుడవగు నీకు మరుపు తెలియదు. ఆకలిచే నాలుకలతో పెదవులను ఆస్వాదించే పాము ఎలుకను వలె, నీవు వానిని వేగముగా సమీపించి మ్రింగి వేసెదవు.

పురా రథైర్హేమపరిష్కృతైశ్చరన్మతంగజైర్వా నరదేవసంజ్ఞితః ।
స ఏవ కాలేన దురత్యయేన తే కలేవరో విట్కృమిభస్మసంజ్ఞితః ॥ 51

పురా= పూర్వము, హేమపరిష్కృతైుఃమ్= బంగారముతో అలంకరించ బడిన, రథైుఃమ్= రథములచే, వా= లేక, మతంగజైుఃమ్= ఏనుగులచే, చరన్= సంచరించువాడనై, నరదేవసంతుఃమ్= రాజు అనే పేరు కలిగిన, సుఃమ్ ఏవ= అదే, కలేవరుఃమ్= దేహము, తే= నీయొక్క, దురత్యయేన= అతిక్రమించ శక్యము కాని, కాలేన= కాలముచే, విట్-కృమిభస్మసంజ్ఞితుఃమ్= పక్షుల రెట్ట పురుగులు బూడిద అనే పేర్లు గలది.

ఒకప్పుడీ దేహము రాజు అనే పేరుతో బంగారముతో అలంకరించ బడిన రథములపై, ఏనుగులపై సంచరించెడిది. నీ స్వరూపమైన కాలమును ఎవ్వరూ అతిక్రమించలేరు. అదే దేహము కాలప్రభావముచే (బయట పారవేసినచో) పక్షుల రెట్ట, (నేలలో పాతినచో) క్రిములు, (కాల్చినచో) బూడిద అనే పేర్లు గలది యగును.

నిర్జిత్య దిక్చక్రమభూతవిగ్రహో
వరాసనస్థస్సమరాజవందితః ।
గృహేషు మైథున్యసుఖేషు యోషితాం
క్రీడామృగః పూరుష ఈశ నీయతే ॥ 52

ఈశ= ఓ ఈశ్వరా!, దిక్-చక్రమ్= దిక్కుల మండలమును, నిర్జిత్య= జయించి, అభూతవిగ్రహః= ఊహలోనైననూ లేని విరోధము గలవాడు, వర-ఆసనస్థః= సార్వభౌమ సింహాసనమునధిష్ఠించినవాడు, సమరాజవందితః= సమానులైన రాజులచే నమస్కరించబడినవాడు అగు, పూరుషః= వ్యక్తి, మైథున్యసుఖేషు= సంభోగసుఖములు గల, గృహేషు= గృహమునందు, యోషితామ్= యువతులకు, క్రీడామృగః= ఆటబొమ్మ వలె, నీయతే= ఆడించబడును.

ఓ ఈశ్వరా! ఒక వ్యక్తి నాల్గు దిక్కులను జయించి ఊహకైననూ విరోధులు లేనివాడై సార్వభౌమసింహాసనమునధిష్ఠించి సమానులైన రాజులచే సమ్మానించబడినవాడు కావచ్చును. అదే వ్యక్తి సంభోగ సుఖములు విశేషముగా గల గృహమునందు యువతులచే ఆటబొమ్మ (కోతి) వలె ఆడించబడును.

కరోతి కర్మాణి, తపస్సు నిష్ఠతో నివృత్తభోగస్తదపేక్షయా దదత్ ।
పునశ్చ భూయేయమహం స్వరాడితి ప్రవృద్ధతర్షో న సుఖాయ కల్పతే॥ 53

తపస్సు= వ్రతములయందు, నిష్ఠితః= నిష్ఠగలవాడు, నివృత్తభోగః= తొలగిన భోగములు గలవాడు, తద్-అపేక్షయా= వాటియందలి అపేక్షచే, కర్మాణి= వైదికకర్మలను, కరోతి= చేయును, దదత్= దానము చేయువాడు, అహమ్= నేను, పునః చ= మరల కూడ, స్వరాట్= చక్రవర్తిని, భూయేయమ్= అగుదును గాక!, ఇతి= అని, ప్రవృద్ధతర్షః= పెచ్చు మీరిన తృష్ణ గలవాడు, సుఖాయ= సుఖము కొరకు, న కల్పతే= అర్హుడు కాడు.

మానవుడు భోగములయందలి అపేక్ష చేతనే భోగములనుండి నివృత్తుడై దానధర్మములను, వ్రతనియమములను, వైదికకర్మలను అనుష్ఠించును. మరల తాను చక్రవర్తి కావాలని ఈ పుణ్యముల నాచరించును. అట్టి పెచ్చు మీరిన తృష్ణ గలవాడు సుఖమునకు అర్హుడు కాజాలడు.

భవాపవర్గో భ్రమతో యదా భవేజ్జనస్య తర్హ్యచ్యుత సత్సమాగమః ।
సత్సంగమో యర్హి తదైవ సద్గతౌ పరావరేశే త్వయి జాయతే మతిః ॥ 54

అచ్యుత= ఓ శ్రీహరీ!, భ్రమతః= సంసారములో తిరుగాడుచున్న, జనస్య= మానవునకు, యదా= ఎప్పుడైతే, భవ-అపవర్గః= సంసారము నుండి మోక్షమో, తర్హి= అప్పుడు, సత్-సమాగమః= సత్పురుషుల తోడి సమావేశము, యర్హి= ఎప్పుడైతే, సత్-సంగమః= సత్పురుషుల తోడి సమావేశమో, తదా ఏవ= అప్పుడు మాత్రమే, సద్-గతౌ= సత్పురుషులకు గతి ఐనట్టియు, పర-అవర-ఈశే= కారణకార్యములకు ప్రభుడవగు, త్వయి= నీయందు, మతిః= భక్తి, జాయతే= కలుగును.

ఓ శ్రీహరీ! సంసారములో పరిభ్రమించే మానవునకు ఎప్పుడైతే సంసారమునుండి మోక్షమునకు సమయము వచ్చునో, అప్పుడే సత్సంగము లభించును. ఏ కాలమునందైతే సత్సంగము కలుగునో, అప్పుడే మానవునకు నీయందు భక్తి కలుగును. మాయాశక్తికి, జగత్తునకు ప్రభుడవగు నీవే సత్పురుషులకు శరణము.

మన్యే మమానుగ్రహ ఈశ తే కృతో
రాజ్యానుబంధాపగమో యదృచ్ఛయా ।
యః ప్రార్థ్యతే సాధుభిరేకచర్యయా
వనం విశద్భిరఖండభూమిభిః ॥ 55

ఈశ= ఓ ఈశ్వరా!, మమ= నాకు, యదృచ్ఛయా= అనుకోకుండా, రాజ్య-అనుబంధ-అపగమః= రాజ్యమనే పాశముయొక్క నివృత్తి, తే= నీచే, కృతః= చేయబడిన, అనుగ్రహః= అనుగ్రహమని, మన్యే= తలచెదను, యః= ఏ నివృత్తియైతే, సాధుభిః= సాధు స్వభావము కలిగినట్టియు, ఏకచర్యయా= ఏకాంతనిష్ఠచే, వనమ్= అడవిని, వివిషద్భిః = ప్రవేశించగోరే, అఖండభూమిపైః= చక్రవర్తులచే కూడ, ప్రార్థ్యతే= కోరబడునో.

ఓ ఈశ్వరా! నాకు అనుకోకుండా రాజ్యమనే పాశమునుండి విముక్తి కలిగినది. ఇది నీచే చేయబడిన అనుగ్రహమేనని తలచెదను. సాధుస్వభావులగు సార్వభౌములు కూడ ఏకాంతములో నిన్ను భజించుటకై అడవిని ప్రవేశించగోరి ఇట్టి రాజ్యాధికారనివృత్తినే ప్రార్థించెదరు.

న కామయేఽన్యం తవ పాదసేవనా
దకించనప్రార్థ్యతమాద్వరం విభో ।
ఆరాధ్య కస్త్వాం హ్యపవర్గదం హరే
వృణీత ఆర్యో వరమాత్మబంధనమ్ ॥ 56

విభో= ఓ ప్రభూ!, అకించనప్రార్థ్యతమాత్= ఏమీ లేనివారిచే కూడ కోరదగినవాటిలో శ్రేష్ఠమైన, తవ= నీ, పాదసేవనాత్= పాదముల సేవకంటె, అన్యమ్= మరియొక, వరమ్= వరమును, న కామయే= కోరను, హరే= ఓ శ్రీహరీ!, హి= ఏలయన, ఆర్యః= వివేకియగు, కః= ఎవ్వాడు, అపవర్గదమ్= మోక్షమునొసగే, త్వామ్= నిన్ను, ఆరాధ్య= ఆరాధించి, ఆత్మబంధనమ్= తనకు బంధమైన, వరమ్= వరమును, వృణీత= కోరును?

ఓ ప్రభూ! ఏమీ లేనివారు కూడ కోరదగినవాటిలో శ్రేష్ఠమైనది. నీ పాదముల సేవ. అది తక్క మరియొక వరమును నేను కోరను. ఓ

శ్రీహరీ! ఎందుకంటే, వివేకియగు ఎవ్వాడు తనను సంసారములో బంధించే వరములను కోరును? (ఎవడైననూ కోరడు).

తస్మాద్విసృజ్యాశిష ఈశ సర్వతో
రజస్తమస్సత్త్వగుణానుబంధనాః ।
నిరంజనం నిర్గుణమద్వయం పరం
త్వాం జ్ఞప్తిమాత్రం పురుషం వ్రజామ్యహమ్ ॥ 57

ఈశ= ఓ ఈశ్వరా!, తస్మాత్= అందువలన, అహమ్= నేను, రజస్-తమః-సత్త్వగుణ-అనుబంధనాః= రజస్తమస్సత్త్వగుణములతో సంసర్గము కలిగి ఉండే, ఆశిషః= కామనలను, సర్వతః= అన్ని విధములుగా, విసృజ్య= విడిచి పెట్టి, నిరంజనమ్= సంసారసంబంధము లేశమైననూ లేనట్టియు, నిర్గుణమ్= గుణములు లేనట్టియు, అద్వయమ్= రెండవది లేనట్టియు, పరమ్= ప్రకృతికి అతీతమైనట్టియు, జ్ఞప్తిమాత్రమ్= అఖండ చైతన్యస్వరూపుడవైనట్టియు, పురుషమ్= పూర్ణుడవైన, త్వామ్= నిన్ను, వ్రజామి= శరణు పొందెదను (చేరెదను).

ఓ ఈశ్వరా! కావున (కామనలు బంధిస్తాయి గనుక), నేను సత్త్వరజస్తమోగుణముల సంసర్గము గల సాంసారికకామనలను పూర్తిగా విడిచిపెట్టెదను. నేను పూర్ణుడవగు నిన్ను శరణు వేడుచున్నాను. సంసారసంబంధము లేశమైననూ లేని నీయందు గుణములు లేవు. రెండవది లేని నీవు ప్రకృతికి అతీతమైన అఖండచైతన్యస్వరూపుడవు.

చిరమిహ వృజినార్తస్తప్యమానోఽనుతాపైః
అవితృషషడమిత్రోఽలబ్ధశాంతిః కథంచిత్ ।
శరణద సముపేతస్త్వత్పదాబ్జం పరాత్మన్,
అభయమృతమశోకం పాహి మాఽఽపన్నమీశ ॥ 58

శరణద= శరణునిచ్చువాడా!, పరాత్మన్= ఓ పరమాత్మా!, ఈశ= ఓ ఈశ్వరా!, ఇహ= ఈ లోకమునందు, చిరమ్= చాల కాలము, వృజిన-ఆర్తః= కర్మఫలములచే పీడను పొందినవాడను, అనుతాపైః= వాటి వాసనలచే, తప్యమానః= తపింపజేయబడుచున్నవాడను, అవితృషషడ్-అమిత్రః= తొలగని తృష్ణ గల ఆర్గురు శత్రువులు గలవాడను, కథంచిత్= ఏ విధముగానైననూ, అలబ్ధశాంతిః= పొందబడని శాంతి గలవాడను, అభయమ్= భయము లేనట్టియు, ఋతమ్= సత్యమైనట్టియు, అశోకమ్= శోకము లేని, త్వత్-పద-అబ్జమ్= నీ పద్మమువంటి పాదమును, సముపేతః= చేరుకున్నవాడను, ఆపన్నమ్= ఆపదలచే వ్యాపించబడిన, మా= నన్ను, పాహి= కాపాడుము.

శరణునిచ్చే ఓ పరమాత్మా! నేనీ లోకములో చిరకాలమునుండి కర్మఫలములచే పీడించబడి, వాటి వాసనలచే తపింపజేయబడుచున్నాను. నాలోని కామక్రోధములు మొదలైన అంతశ్శత్రువులకు ఇంకనూ తృష్ణ తీరలేదు. నా కేవిధముగానైననూ శాంతి లభించలేదు. ఓ ఈశ్వరా! పద్మమువంటి నీ పాదము వద్ద భయమునకు, శోకమునకు తావు లేదు. సత్యమైన నీ పాదమును నేను చేరితిని. ఆపదలతో సతమతమయ్యే నన్ను కాపాడుము.

శ్రీభగవానువాచ ।

సార్వభౌమ మహారాజ మతిస్తే విమలోర్జితా ।
వరైః ప్రలోభితస్యాపి న కామైర్విహతా యతః ॥ 59

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, సార్వభౌమ= సార్వభౌమా!, మహారాజ= ఓ మహారాజా!, తే= నీ, మతిః= బుద్ధి, విమలా= నిర్మలమైనది, ఊర్జితా= ఉన్నతకోటికి చెందినది, యతః=

ఏలయన, వరైః= వరములచే, ప్రలోభితస్య అపి= ప్రలోభ పెట్టబడిననూ నీయొక్క బుద్ధి, కామైః= కామనలచే, న విహతా= కుంఠితము కాలేదు.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...సార్వభౌముడవైన ఓ మహారాజా! నీ బుద్ధి నిర్మలము, ఉన్నతకోటికి చెందినది. ఎందుకంటే, నేను వరములతో ప్రలోభపెట్టితిని. ఐనా నీ బుద్ధి కామనలచే కుంఠితమవలేదు.

ప్రలోభితో వరైర్యత్త్వమప్రమాదాయ విద్ధి తత్ ।
న ధీర్మయ్యేకభక్తానామాశీర్భిర్భిద్యతే క్వచిత్ ॥ 60

త్వమ్= నీవు, వరైః= వరములతో, ప్రలోభితః= ప్రలోభ పెట్టబడితివి, యత్= అనేది యేది గలదో, తత్= అది, అప్రమాదాయ= సావధానత కొరకు అని, విద్ధి= తెలియుము, మయి= నాయందు, ఏకభక్తానామ్= అనన్యమైన భక్తి గలవారలకు, క్వచిత్= ఏ నాడైననూ, ధీః= బుద్ధి, ఆశీర్భిః= కామనలచే, న భిద్యతే= భేదమును పొందదు.

భక్తులను సావధానులను చేయుట కొరకు (నీ సావధానతను పరీక్షించుట కొరకు) మాత్రమే నేను నిన్ను వరములతో ప్రలోభపెట్టితినని తెలియుము. నాయందు అనన్యమగు భక్తి గలవారల బుద్ధి ఏనాడైననూ కామనలచే భేదమును పొందదు.

యుంజానానామభక్తానాం ప్రాణాయామాదిభిర్మనః ।
అక్షీణవాసనం రాజన్ దృశ్యతే పునరుత్థితమ్ ॥ 61

రాజన్= ఓ రాజా!, ప్రాణ-ఆయామ-ఆదిభిః= దీర్ఘశ్వాస మొదలగువాటిచే, మనః= మనస్సును, యుంజానానామ్= ఏకాగ్రము చేసే, అభక్తానామ్= భక్తులు కానివారలకు, అక్షీణవాసనమ్= క్షయము కాని వాసనలు గల మనస్సు, పునః= మరల, ఉత్థితమ్= విషయాభిముఖమై, దృశ్యతే= కానవచ్చుచున్నది.

ఓ రాజా! భక్తి లేకుండా కొందరు ప్రాణాయామము-ధారణ మొదలగువాటిచే మనస్సును ఏకాగ్రము చేసెదరు. కాని, వారి మనస్సులోని వాసనలు క్షయము కాకుండుటచే, అది మరల విషయ భోగములవైపు పరుగెత్తుట అనుభవములోనున్న విషయమే.

విచరస్వ మహీం కామం మయ్యావేశితమానసః ।
అస్త్వేవ నిత్యదా తుభ్యం భక్తిర్మయ్యనపాయినీ ॥ 62

మయి= నాయందు, ఆవేశితమానసః= ప్రవేశ పెట్టబడిన మనస్సు గలవాడవై, కామమ్= యథేచ్ఛగా, మహీమ్= భూమిని, విచరస్వ= సంచరించుము, తుభ్యమ్= నీ కొరకు, మయి= నాయందు, అనపాయినీ= తొలగిపోని, భక్తిః= భక్తి, నిత్యదా= సర్వకాలములయందు, ఏవ= నిశ్చయముగా, అస్తు= కలుగుగాక!

నీవు నాయందు మనస్సు నిలిపి భూలోకములో యథేచ్ఛగా సంచరించుము. నీకు నాయందు ఏనాడైననూ తొలగిపోని భక్తి నిశ్చయముగా కలుగుగాక!

క్షాత్రధర్మస్థితో జంతూన్ న్యవధీర్మృగయాదిభిః ।
సమాహితస్తత్తపసా జహ్యఘం మదుపాశ్రితః ॥ 63

క్షాత్రధర్మస్థితః= క్షత్రియధర్మమునందు నిలిచియున్న నీవు, మృగయా-ఆదిభిః= వేట మొదలగువాటిచే, జంతూన్= ప్రాణులను, న్యవధీః= నిశ్చయముగా చంపితివి, మద్-ఉపాశ్రితః= నన్ను ఆశ్రయించిన వాడవై, సమాహితః= ఏకాగ్రమగు చిత్తము గలవాడవై, తపసా= తపస్సుతో, తత్= ఆ, అఘమ్= పాపమును, జహి= పోగొట్టుకొనుము.

క్షత్రియధర్మమును పాలించిన నీవు వేట-ఆహారము మొదలగు సందర్భములలో ప్రాణులను నిశ్చయముగా చంపితివి. నన్ను శరణు

పొంది ఏకాగ్రమగు చిత్తముతో తపస్సు చేసి ఆ పాపమును పోగొట్టు-కొనుము.

జన్మన్యనంతరే రాజన్ సర్వభూతసుహృత్తమః ।
భూత్వా ద్విజవరస్త్వం వై మాముపైష్యసి కేవలమ్ ॥ 64

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకపంచాశత్తమోఽధ్యాయః ॥

రాజన్= ఓ రాజా!, త్వమ్= నీవు, అనంతరే= వెంటనే రాబోయే, జన్మని= జన్మయందు, సర్వభూతసుహృత్-తమః= సకల ప్రాణులయందు అతిశయించిన ప్రేమ గల, ద్విజవరః= బ్రాహ్మణశ్రేష్ఠుడవు, భూత్వా= అయి, వై= నిశ్చయముగా, కేవలమ్= అద్వయుడనగు, మామ్= నన్ను, ఉపైష్యసి= పొందగలవు.

ఓ రాజా! నీవు వెంటనే రాబోయే జన్మలో సకలప్రాణులయందు అతిశయించిన ప్రేమ గల బ్రాహ్మణ శ్రేష్ఠుడవు కాగలవు. అప్పుడు నీవు అద్వితీయుడనగు నన్ను నిశ్చయముగా పొందగలవు.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
కాలయవనుడు భస్మమగుటను, ముచుకుందస్తుతిని వర్ణించే
ఏబది ఒకటవ అధ్యాయము ముగిసినది (51).

* * *

అథ ద్విపంచాశత్తమోఽధ్యాయః

రుక్మిణి శ్రీకృష్ణునకు రహస్య సందేశమును పంపుట

శ్రీశుక ఉవాచ ।

ఇత్థం సోఽనుగృహీతోఽంగ కృష్ణేనేక్ష్వాకునందనః ।
తం పరిక్రమ్య సన్నమ్య నిశ్చక్రామ గుహాముఖాత్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అంగ= ఓయీ!, ఇత్థం= ఈ విధముగా, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, అనుగృహీతః= అనుగ్రహించబడిన, ఇక్ష్వాకునందనః= ఇక్ష్వాకు వంశమునానందింప-జేసే, సః= ఆ ముచుకుందుడు, తమ్= ఆయనను, పరిక్రమ్య= ప్రదక్షిణము చేసి, సన్నమ్య= ప్రణమిల్లి, గుహాముఖాత్= గుహయొక్క ముఖమునుండి, నిశ్చక్రామ= నిష్క్రమించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! ఇక్ష్వాకు-వంశమును ఆనందింపజేసే ఆ ముచుకుందుని శ్రీకృష్ణుడు ఈ విధముగా అనుగ్రహించెను. అపుడాయన శ్రీకృష్ణునకు ప్రదక్షిణ నమస్కారములను చేసి గుహయొక్క ముఖమునుండి నిష్క్రమించెను.

స వీక్ష్య క్షుల్లకాన్ మర్త్యాన్ పశూన్ వీరుద్వనస్పతీన్ ।
మత్వా కలియుగం ప్రాప్తం జగామ దిశముత్తరామ్ ॥ 2

సః= ఆయన, క్షుల్లకాన్= చిన్న, మర్త్యాన్= మానవులను, పశూన్= పశువులను, వీరుద్-వనస్పతీన్= లతలను చెట్లను, వీక్ష్య= చూచి, కలియుగమ్= కలియుగమును, ప్రాప్తమ్= వచ్చినదానినిగా, మత్వా= తెలుసుకొని, ఉత్తరాం దిశమ్= ఉత్తరదిక్కును గురించి, జగామ= వెళ్లెను.

ఆయన చిన్న చిన్న మనుష్యులను, పశువులను, లతలను, చెట్లను చూచి కలియుగము వచ్చినదని గ్రహించి ఉత్తరదిక్కునకు వెళ్లెను.

తపఃశ్రద్ధాయుతో ధీరో నిస్సంగో ముక్తసంశయః ।
సమాధాయ మనః కృష్ణే ప్రావిశద్గంధమాదనమ్ ॥ 3

తపఃశ్రద్ధాయుతః= తపస్సునందు శ్రద్ధతో కూడినవాడు, ధీరః= వివేకము గలవాడు, నిస్సంగః= ఆసక్తి లేనివాడు, ముక్తసంశయః= విడువబడిన సందేహములు గలవాడు, మనః= మనస్సును, కృష్ణే= శ్రీకృష్ణునియందు, సమాధాయ= నిలిపి, గంధమాదనమ్= గంధమాదన పర్వతమును, ప్రావిశత్= ప్రవేశించెను.

ఆయన తపస్సునందు శ్రద్ధ, వివేకము, అనాసక్తి గలవాడై, సందేహములను విడిచిపెట్టి మనస్సును శ్రీకృష్ణునిపై ఏకాగ్రము చేసి గంధమాదన పర్వతమును చేరుకొనెను.

బదర్యాశ్రమమాసాద్య నరనారాయణాలయమ్ ।
సర్వద్వంద్వసహశ్శాంతస్తపసాఽఽరాధయద్ధరిమ్ ॥ 4

నరనారాయణ-ఆలయమ్= నరనారాయణులకు నివాసమైన, బదరీ-ఆశ్రమమ్= బదరికాశ్రమమును, ఆసాద్య= చేరి, సర్వద్వంద్వసహః= అన్ని ద్వంద్వములను సహించువాడు, శాంతః= శాంతుడు, తపసా= తపస్సుతో, హరిమ్= శ్రీహరిని, ఆరాధయత్= ఆరాధించెను.

ఆయన నరనారాయణుల నిలయమైన బదరికాశ్రమమును చేరి, శీతోష్ణాది సకలద్వంద్వములను సహిస్తూ శాంతుడై తపస్సుతో శ్రీహరిని ఆరాధించెను.

భగవాన్ పునరావ్రజ్య పురీం యవనవేష్టితామ్ ।
హత్వా మ్లేచ్ఛబలం నిన్యే తదీయం ద్వారకాం ధనమ్ ॥ 5

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, పునః= తిరిగి, యవన వేష్టితామ్= యవనులచే చుట్టువారబడిన, పురీమ్= మథురానగరమును గురించి,

ఆవ్రజ్య= వచ్చి, మ్లేచ్ఛబలమ్= మ్లేచ్ఛుల సైన్యమును, హత్వా= సంహరించి, తదీయమ్= ఆ సైన్యమునకు చెందిన, ధనమ్= సంపదను, ద్వారకామ్= ద్వారకను గురించి, నిన్యే= తీసుకువెళ్లెను.

శ్రీకృష్ణ భగవానుడు మథురా నగరమునకు తిరిగి వచ్చి, ఆ నగరమును చుట్టువారియున్న మ్లేచ్ఛుల సైన్యమును సంహరించెను. ఆయన వారి సంపదను ద్వారకకు తీసుకు వెళ్లెను.

నీయమానే ధనే గోభిర్నృభిశ్చాచ్యుతచోదితైః ।
ఆజగామ జరాసంధస్త్రయోవింశత్యనీకపః ॥ 6

అచ్యుతచోదితైః= శ్రీకృష్ణునిచే పురమాయించబడిన, నృభిః= వ్యక్తులచే, ధనే= సంపద, గోభిః= ఎద్దులచే, నీయమానే= తీసుకొని పోబడుచుండగా, త్రయోవింశతి-అనీకపః= ఇరవై మూడు సేనల ప్రభుడగు, జరాసంధః= జరాసంధుడు, ఆజగామ= వచ్చెను.

శ్రీకృష్ణుడు పురమాయించిన వ్యక్తులు ఆ సంపదను ఎద్దులపై తీసుకు వెళ్లుచుండిరి. ఇంతలో ఇరవై మూడు సైన్యముల నాయకుడై జరాసంధుడు వచ్చెను.

విలోక్య వేగరభసం రిపుసైన్యస్య మాధవౌ ।
మనుష్యచేష్టామాపన్నౌ రాజన్ దుద్రువతుర్ద్రుతమ్ ॥ 7

రాజన్= ఓ రాజా!, రిపుసైన్యస్య= శత్రుసైన్యముయొక్క వేగరభసమ్= వేగము యొక్క ఉద్రేకమును, విలోక్య= చూచి, మాధవౌ= మధు వంశీయులగు బలరామ కృష్ణులు, మనుష్యచేష్టామ్= మానవుల చేష్టను, ఆపన్నౌ= స్వీకరించువారై, ద్రుతమ్= వేగముగా, దుద్రువతుః= పరుగెత్తిరి.

ఓ పరీక్షిన్మహారాజా! శత్రుసైన్యముయొక్క అధికమగు వేగమును మధువంశీయులగు బలరామకృష్ణులు చూచిరి. వారు మానవుల చేష్టను స్వీకరించి (లీలగా అనుకరిస్తూ) వేగముగా పలాయనము చిత్తగించిరి.

విహాయ విత్తం ప్రచురమభీతౌ భీరుభీతవత్ ।
పద్భ్యాం పద్మపలాశాభ్యాం చేరతుర్బహుయోజనమ్ ॥ 8

అభీతౌ= భయము నెరుగని బలరామకృష్ణులు, భీరుభీతవత్= భయపడువాని వలన కూడ భయపడినట్లుగా, ప్రచురమ్= అధికమగు, విత్తమ్= సంపదను, విహాయ= విడిచిపెట్టి, పద్మపలాశాభ్యామ్= పద్మములవలె కోమలములైన, పద్భ్యామ్= పాదములతో, బహుయోజనమ్= చాల యోజనముల దూరమును, చేరతుః= పారిపోయిరి.

బలరామకృష్ణులు భయమునెరుగరు. కాని, వారు చాల భయపడిన వారు వలె ఆ అధికమగు ధనమును విడిచి పెట్టి, పద్మములవలె కోమలములైన కాళ్లతో నడుస్తూ చాల మైళ్ల దూరము పారిపోయిరి.

పలాయమానౌ తౌ దృష్ట్వా మాగధః ప్రహసన్ బలీ ।
అన్వధావద్రథానీకైరీశయోరప్రమాణవిత్ ॥ 9

పలాయమానౌ= పారిపోవుచున్న, తౌ= వారిద్దరిని, దృష్ట్వా= చూచి, బలీ= బలశాలి, ఈశయోఃఅ= సర్వసమర్థులగు వారిద్దరి, అప్రమాణవిత్= ప్రభావము నెరుగనివాడు, మాగధః= మగధప్రభుడు అగు జరాసంధుడు, ప్రహసన్= విరగబడి నవ్వుచున్నవాడై, రథ-అనీకైఃఅ= రథికుల సైన్యములతో, అను-అధావత్= వెనుక తరిమెను.

సర్వసమర్థులగు బలరామకృష్ణుల ప్రభావము మగధప్రభుడగు జరాసంధునకు తెలియదు. వారిద్దరు పారిపోవుచుండుటను గాంచి బలశాలియగు ఆతడు విరగబడి నవ్వి, రథికుల సైన్యములతో వెంట తరిమెను.

ప్రద్రుత్య దూరం సంశ్రాంతౌ తుంగమారుహతాం గిరిమ్ ।
ప్రవర్షణాఖ్యం భగవాన్నిత్యదా యత్ర వర్షతి ॥ 10

దూరమ్= దూరమును, ప్రద్రుత్య= గట్టిగా పరుగెత్తి, సంక్రాంతౌ= బాగా అలసిపోయిన బలరామకృష్ణులు, తుంగమ్= ఎత్తైన, ప్రవర్షణ-ఆఖ్యమ్= ప్రవర్షణమనే పేరు గల, గిరిమ్= పర్వతమును, ఆరుహతామ్= ఎక్కిరి, యత్ర= ఎక్కడనైతే, భగవాన్= ఇంద్రదేవుడు, నిత్యదా= సర్వకాలములయందు, వర్షతి= వర్షించునో.

దూరము పరుగెత్తి బలరామకృష్ణులు బాగా అలసిపోయిరి. వారు ప్రవర్షణము (ఎక్కువ వర్షము గలది) అనే ఎత్తైన పర్వతమునెక్కిరి. అచట ఇంద్రదేవుడు సర్వకాలములలో వర్షించును.

గిరౌ నిలీనావాజ్ఞాయ నాధిగమ్య పదం నృప ।
దదాహ గిరిమేధోభిస్సమంతాదగ్నిముత్సృజన్ ॥ 11

నృప= ఓ రాజా!, గిరౌ= పర్వతము పై, నిలీనౌ= దాగుకున్న వారినిగా, ఆజ్ఞాయ= గమనించి, పదమ్= స్థానము (కాలి గురుతు)ను, న అధిగమ్య= కనుగొనలేక, సమంతాత్= అన్నివైపులా, అగ్నిమ్= నిప్పును, ఉత్సృజన్= వేయువాడై, గిరిమ్= పర్వతమును, ఏధోభిః= కట్టెలతో, దదాహ= కాల్చెను.

ఓ పరీక్షిన్మహారాజా! పర్వతముపై వారిద్దరు దాగుకున్న చోటును, వారి కాలి గురుతులను కూడ జరాసంధుడు కనుగొనలేకపోయెను. అపుడాతడు పర్వతము చుట్టూ కట్టెలను పేర్చి నిప్పుపెట్టి కాల్చెను.

తత ఉత్పత్య తరసా దహ్యమానతటాదుభౌ ।
దశైకయోజనోత్తుంగాన్ని పేతతురధో భువి ॥ 12

దహ్యమానతటాత్= దహించబడుచున్న ప్రాంతభాగములు కలిగినట్టియు, దశ-ఏకయోజన-ఉత్తుంగాత్= పదకొండు యోజనములు ఎత్తు గల, తతః= ఆ పర్వతమునుండి, తరసా= వేగముగా, ఉత్పత్య= పైకెగిరి, అధః= క్రింద, భువి= నేలపై, నిపేతతుః= గెంతిరి.

పదకొండు యోజనముల నిడివి గల, ఆ పర్వతము యొక్క ప్రాంతభాగములు దహించబడుచుండెను. అపుడు వారిద్దరు ఆ పర్వతము నుండి వేగముగా పైకెగిరి క్రింద నేల పైకి దుమికిరి.

అలక్ష్యమాణౌ రిపుణా సానుగేన యదూత్తమౌ ।
స్వపురం పునరాయాతౌ సముద్రపరిఖాం నృప ॥ 13

నృప= ఓ రాజా!, స-అనుగేన= అనుచరులతో కూడియున్న, రిపుణా= శత్రువుచే, అలక్ష్యమాణౌ= కానబడనివారు, యదు-ఉత్తమౌ= యాదవశ్రేష్ఠులు అగు వారిద్దరు, సముద్రపరిఖామ్= సముద్రమే అగడ్తగా గల, స్వపురమ్= తమ ద్వారకానగరమును గురించి, పునఃర= తిరిగి, ఆయాత్= వచ్చినవారు.

ఓ పరీక్షిన్మహారాజా! యాదవశ్రేష్ఠులగు బలరామకృష్ణులు శత్రువగు జరాసంధునికి, వాని అనుచరులకు కనబడకుండా ద్వారకానగరమునకు తిరిగి వచ్చిరి. ఆ నగరమునకు సముద్రమే అగడ్త.

సోఽపి దగ్ధావితి మృషా మన్వానో బలకేశవౌ ।
బలమాకృష్య సుమహన్మగధాన్మగధో యయౌ ॥ 14

సఃర= ఆ, మాగధఃర అపి= మగధదేశప్రభుడగు జరాసంధుడు కూడ, బలకేశవౌ= బలరామకృష్ణులు, దగ్ధౌ= దహించబడినవారు, ఇతి= అని, మృషా= తప్పుగా, మన్వానఃర= తలపోయుచున్నవాడై, సుమహత్= చాల పెద్దదైన, బలమ్= సైన్యమును, ఆకృష్య= వెనుకకు మళ్లించి, మగధాన్= మగధదేశమును గురించి, యయౌ= వెళ్లెను.

మగధ దేశప్రభుడగు ఆ జరాసంధుడు కూడ బలరామకృష్ణులు దహించబడినారని తప్పుగా తలపోసెను. ఆతడు మిక్కిలి పెద్దదైన తన సైన్యమును మళ్లించుకొని మగధదేశమునకు వెళ్లిపోయెను.

ఆనర్తాధిపతిశ్శ్రీమాన్ రైవతో రేవతీం సుతామ్ ।
బ్రహ్మణా చోదితః ప్రాదాద్బలాయేతి పురోదితమ్ ॥ 15

ఆనర్త–అధిపతిః= ఆనర్త దేశాధిపతి, శ్రీమాన్= శ్రీమంతుడు అగు, రైవతః= రేవతుని పుత్రుడగు కకుద్మి, బ్రహ్మణా= బ్రహ్మదేవునిచే, చోదితః = ప్రేరేపించబడినవాడై, సుతామ్= కుమార్తెయగు, రేవతీమ్= రేవతిని, బలాయ= బలరాముని కొరకు, ప్రాదాత్= ఇచ్చెను, ఇతి= అని, పురా= ఇదివరలో, ఉదితమ్= చెప్పబడినది.

రేవతుని పుత్రుడగు కకుద్మి ఆనర్తదేశాధిపతి, శ్రీమంతుడు. ఆయన బ్రహ్మదేవుని ప్రోత్సాహముచే తన కుమార్తెయగు రేవతిని బలరామునకిచ్చి వివాహము చేసెనని ఇదివరలో (9వ స్కంధము) చెప్పడమైనది.

భగవానపి గోవింద ఉపయేమే కురూద్వహ ।
వైదర్భీం భీష్మకసుతాం శ్రియో మాత్రాం స్వయంవరే ॥ 16

ప్రమథ్య తరసా రాజ్ఞశ్శాల్వాదీంశ్చైద్యపక్షగాన్ ।
పశ్యతాం సర్వలోకానాం తార్క్ష్యపుత్రస్సుధామివ ॥ 17

కురు–ఉద్వహ= కురువంశశ్రేష్ఠా!, భగవాన్ గోవిందః అపి= శ్రీకృష్ణ భగవానుడు కూడ, సర్వలోకానామ్= సకలజనులు, పశ్యతామ్= చూచుచుండగా, తరసా= బలముచే, చైద్యపక్షగాన్= చేదిదేశాధిపతియగు శిశుపాలుని పక్షమునకు చెందిన, శాల్వ–ఆదీన్= శాల్వుడు దంతవక్త్రుడు మొదలగువారిని, ప్రమథ్య= పరాభవించి, తార్క్ష్యపుత్రః= కశ్యపుని పుత్రుడగు గరుడుడు, సుధాం ఇవ= అమృతమును వలె, స్వయంవరే= స్వయంవరమునందు, భీష్మకసుతామ్= భీష్మకుని కుమార్తెయైనట్టియు, శ్రియః= లక్ష్మీదేవియొక్క, మాత్రామ్= అవతారమైన, వైదర్భీమ్= విదర్భ రాజకుమారియగు రుక్మిణిని, ఉపయేమే= వివాహమాడెను.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణభగవానుడు కూడ సకలజనులు చూచుచుండగా చేదిదేశాధిపతియగు శిశుపాలుని పక్షమునకు చెందిన శాల్వుడు, దంతవక్త్రుడు మొదలగు రాజులను తన బలముచే పరాభవించెను. అపుడాయన, కశ్యపుని పుత్రుడగు గరుడుడు అమృతమును పొందినట్లుగా, స్వయంవరమునందు రుక్మిణిని వివాహమాడెను. భీష్మకుని కుమార్తెయగు రుక్మిణి లక్ష్మీదేవి అవతారము.

రాజోవాచ ।

భగవాన్ భీష్మకసుతాం రుక్మిణీం రుచిరాననామ్ ।
రాక్షసేన విధానేన ఉపయేమ ఇతి శ్రుతమ్ ॥ 18

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, భీష్మకసుతామ్= భీష్మకుని కుమార్తెయైనట్టియు, రుచిర-ఆననామ్= అందమగు ముఖముగల, రుక్మిణీమ్= రుక్మిణిని, రాక్షసేన విధానేన= రాక్షసవిధానముచే, ఉపయేమే= వివాహమాడెను, ఇతి= అని, శ్రుతమ్= వినబడినది.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...శ్రీకృష్ణభగవానుడు భీష్మకుని కుమార్తె, అందమగు ముఖము గలది అగు రుక్మిణిని రాక్షసవిధానము (యుద్ధములో శత్రువులను జయించి)చే వివాహమాడెనని వినియున్నాను.

భగవఞ్ఛ్రోతుమిచ్ఛామి కృష్ణస్యామితతేజసః ।
యథా మాగధశాల్వాదీన్ జిత్వా కన్యాముపాహరత్ ॥ 19

భగవన్= పూజనీయా!, అమితతేజసః= అమితమగు తేజస్సు గల, కృష్ణస్య= శ్రీకృష్ణుని (చరితమును), యథా= ఏ విధముగానైతే, మాగధశాల్వ-ఆదీన్= మగధదేశాధిపతియగు జరాసంధుడు శాల్వుడు మొదలగువారిని, జిత్వా= జయించి, కన్యామ్= కన్యను, ఉపాహరత్= తీసుకుపోయెనో, శ్రోతుమ్= వినుటకు, ఇచ్ఛామి= కోరుచున్నాను.

పూజనీయుడవగు ఓ శుకమహర్షీ! శ్రీకృష్ణుడు అమితమగు తేజస్సు గలవాడు. ఆయన మగధదేశప్రభుడగు జరాసంధుడు, శాల్వుడు, దంతవక్త్రుడు మొదలగువారిని జయించి కన్యయగు రుక్మిణిని తీసుకు-పోయిన వృత్తాంతమును వినగోరుచున్నాను.

బ్రహ్మన్ కృష్ణకథాః పుణ్యా మాధ్వీర్లోకమలాపహాః ।
కో ను తృప్యేత శృణ్వానశ్రుతజ్ఞో నిత్యనూతనాః ॥ 20

బ్రహ్మన్= ఓ మహర్షీ!, కృష్ణ కథాః= శ్రీకృష్ణుని గాథలు, పుణ్యాః= పావనములు, మాధ్వీః= తియ్యనివి, లోకమల-అపహాః= జనుల పాపములను పోగొట్టునవి, నిత్యనూతనాః= సర్వదా కొత్తగా నుండునవి, శ్రుతజ్ఞః= విద్యల మర్మము తెలిసినవాడు, కః ను= ఎవ్వాడు, శృణ్వానః= వినుచున్నవాడై, తృప్యేత= తృప్తిని చెందును?

ఓ శుకమహర్షీ! శ్రీకృష్ణుని గాథలు పావనములు, తియ్యనివి, జనుల పాపములను పోగొట్టునవి, నిత్యనూతనములు. విద్యల మర్మము తెలిసినవాడెవ్వాడు వాటిని వింటూ తృప్తిని జెందును? (చెందడు). -

శ్రీశుక ఉవాచ ।

రాజాఽఽసీద్భీష్మకో నామ విదర్భాధిపతిర్మహాన్ ।
తస్య పంచాభవన్ పుత్రాః కన్యకా చ వరాననా ॥ 21

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భీష్మకః నామ= భీష్మకుడని ప్రసిద్ధి జెందినవాడు, విదర్భ-అధిపతిః= విదర్భదేశాధిపతి, మహాన్= గొప్ప, రాజా= రాజు, ఆసీత్= ఉండెను, తస్య= ఆయనకు, పంచ= ఐదుగురు, పుత్రాః= పుత్రులు, వర-ఆననా= అందమగు మోముగల, కన్యకా చ= అమ్మాయి కూడ, అభవన్= కలిగిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...విదర్భదేశమును భీష్మకుడని ప్రసిద్ధి చెందిన గొప్ప రాజు పాలించెను. ఆయనకు ఐదుగురు కొడుకులు, ఒక అమ్మాయి కలిగిరి. ఆమె గొప్ప సుందరి.

రుక్మగ్రజో రుక్మరథో రుక్మబాహురనంతరః ।
రుక్మకేశో రుక్మమాలీ రుక్మిణ్యేషాం స్వసా సతీ । 22

రుక్మీ= రుక్మి, అగ్రజః= పెద్ద కొడుకు, అనంతరః= తరువాతివాడు, రుక్మరథః= రుక్మరథుడు, రుక్మబాహుః= రుక్మబాహుడు, రుక్మకేశః= రుక్మకేశుడు, రుక్మమాలీ= రుక్మమాలి, ఏషామ్= వీరికి, సతీ= ఉత్తమురాలగు, రుక్మిణీ= రుక్మిణి, స్వసా= సోదరి.

పెద్దకొడుకు రుక్మి. రుక్మరథుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మమాలి తరువాతి వారు. ఉత్తమురాలగు రుక్మిణి వారి సోదరి.

సోపశ్రుత్య ముకుందస్య రూపవీర్యగుణశ్రియః ।
గృహాగతైర్గీయమానాస్తం మేనే సదృశం పతిమ్ । 23

సా= ఆమె, గృహ-ఆగతైః= ఇంటికి వచ్చినవారిచే, గీయమానాః= గానము చేయబడుచున్న, ముకుందస్య= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుని, రూపవీర్యగుణశ్రియః= అందము పరాక్రమము గుణములు సంపదలను గురించి, ఉపశ్రుత్య= దగ్గరగా విని, సదృశమ్= తగిన, పతిమ్= భర్తనుగా, మేనే= తలచెను.

ఇంటికి వచ్చినవారు మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుని అందమును, పరాక్రమమును, గుణములను, సంపదను గానము చేయుచుండగా ఆమె దగ్గరగానుండి వినెను. ఆమె ఆయనయే తనకు తగిన భర్తయని తలచెను.

తాం బుద్ధిలక్షణౌదార్యరూపశీలగుణాశ్రయామ్ ।
కృష్ణశ్చ సదృశీం భార్యాం సముద్వోఢుం మనో దధే । 24

కృష్ణః చ= శ్రీకృష్ణుడు కూడ, బుద్ధిలక్షణ-ఔదార్యరూపశీలగుణ-ఆశ్రయామ్= తెలివి తేటలు సౌభాగ్యచిహ్నములు దాతృత్వము అందము

సచ్ఛీలము సద్గుణములకు నిలయమగు, తామ్= ఆమెను, సదృశీమ్= తగిన, భార్యామ్= భార్యనుగా, సముద్వోఢుమ్= వివాహమాడుటకు, మనః= మనస్సును, దధే= ధరించెను.

తెలివితేటలు, సౌభాగ్యచిహ్నములు, దాతృత్వము, అందము, సచ్ఛీలము, సద్గుణములు అనువాటికి ఆమె నిధి. ఆమె తనకు తగిన భార్య అని, ఆమెను వివాహమాడవలెననియు శ్రీకృష్ణుడు కూడ నిశ్చయించెను.

బంధూనామిచ్ఛతాం దాతుం కృష్ణాయ భగినీం నృప ।
తతో నివార్య కృష్ణద్విడ్రుక్మీ చైద్యమమన్యత ॥ 25

నృప= ఓ రాజా!, బంధూనామ్= బంధువులు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, భగినీమ్= సోదరిని, దాతుమ్= ఇచ్చుటకు, ఇచ్ఛతామ్= కోరుచుండగా, కృష్ణద్విట్= శ్రీకృష్ణుని ద్వేషించే, రుక్మీ= రుక్మి, తతః= దానినుండి, నివార్య= తప్పించి, చైద్యమ్= చేదిదేశాధిపతియగు శిశుపాలుని, అమన్యత= తలపోసెను.

ఓ పరీక్షిన్మహారాజా! రుక్మిణిని శ్రీకృష్ణునకిచ్చి వివాహము చేయాలని బంధువుల ఆకాంక్ష. శ్రీకృష్ణుని ద్వేషించే రుక్మి వారి ఆకాంక్షను నిరాదరణ చేసెను. సోదరిని శ్రీకృష్ణునకు కాకుండా చేదిదేశాధిపతియగు శిశుపాలునకిచ్చి వివాహము చేయాలని ఆతని సంకల్పము.

తదవేత్యాసితాపాంగీ వైదర్భీ దుర్మనా భృశమ్ ।
విచింత్యాప్తం ద్విజం కంచిత్కృష్ణాయ ప్రాహిణోద్రుతమ్ ॥ 26

అసిత-అపాంగీ= నల్లని కనుకొలకులు గల (నల్లనయ్యపై చూపుగల), వైదర్భీ= విదర్భదేశాధిపతి పుత్రికయగు రుక్మిణి, తత్= ఆ విషయమును, అవేత్య= తెలుసుకొని, భృశమ్= మిక్కిలి, దుర్మనాః= చెడిన మనస్సు గలదై, విచింత్య= ఆలోచించి, ఆప్తమ్= ఆప్తుడైన,

కంచిత్= ఒకానొక, ద్విజమ్= బ్రాహ్మణుని, ద్రుతమ్= శీఘ్రముగా, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, ప్రాహిణోత్= పంపెను.

విదర్భరాజకుమారియగు రుక్మిణి సుందరి. ఆమె చూపు నల్లనయ్యపై ఉండెను. రుక్మి తలంపు తెలిసి ఆమె మనస్సు చాల చెడిపోయెను. ఆమె ఆలోచించి ఆప్తుడైన ఒకానొక బాపని వెంటనే శ్రీకృష్ణుని వద్దకు పంపెను.

ద్వారకాం స సమభ్యేత్య ప్రతీహారైః ప్రవేశితః ।
అపశ్యదాద్యం పురుషమాసీనం కాంచనాసనే ॥ 27

సః= ఆయన, ద్వారకామ్= ద్వారకను, సమభ్యేత్య= చేరి, ప్రతీహారైః = ద్వారపాలకులచే, ప్రవేశితః= ప్రవేశపెట్టబడినవాడై, కాంచన-ఆసనే= బంగరు ఆసనమునందు, ఆసీనమ్= కూర్చున్న, ఆద్యమ్= జగత్కారణుడైన, పురుషమ్= పురుషోత్తముని, అపశ్యత్= చూచెను.

ఆ బ్రాహ్మణుడు ద్వారకానగరమును చేరెను. ద్వారపాలకులు ఆయనను లోపలికి ప్రవేశపెట్టిరి. బంగరు సింహాసనముపై కూర్చున్న జగత్కారణుడగు పురుషోత్తముడు ఆయనకు కనబడెను.

దృష్ట్వా బ్రహ్మణ్యదేవస్తమవరుహ్య నిజాసనాత్ ।
ఉపవేశ్యార్హయాంచక్రే యథాఽఽత్మానం దివౌకసః ॥ 28

బ్రహ్మణ్యదేవః= బ్రాహ్మణభక్తులలో శ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడు, తమ్= ఆయనను, దృష్ట్వా= చూచి, నిజ-ఆసనాత్= తన ఆసనమునుండి, అవరుహ్య= దిగి, ఉపవేశ్య= కూర్చుండబెట్టి, ఆత్మానమ్= తనను, దివ-ఓకసః= స్వర్గలోకస్థులగు దేవతలు వలె, అర్హయాంచక్రే= పూజించెను.

శ్రీకృష్ణుడు బ్రాహ్మణభక్తులలో అగ్రేసరుడు. ఆయన ఆ బ్రాహ్మణుని చూడగానే తన ఆసనమునుండి దిగివచ్చి ఆయనను కూర్చుండబెట్టెను.

ఆయన తనను స్వర్గలోకవాసులగు దేవతలు పూజించే విధముగా, ఆ బ్రాహ్మణుని పూజించెను.

తం భుక్తవంతం విశ్రాంతముపగమ్య సతాం గతిః ।
పాణినాఽభిమృశన్ పాదావవ్యగ్రస్తమపృచ్ఛత ॥ 29

సతామ్= సత్పురుషులకు, గతిః= శరణమైన శ్రీకృష్ణుడు, భుక్తవంతమ్= భుజించినట్టియు, విశ్రాంతమ్= విశ్రమించిన, తమ్= ఆయనను, ఉపగమ్య= సమీపించి, పాదౌ= పాదములను, పాణినా= చేతితో, అభిమృశన్= మెల్లగా నొక్కువాడై, అవ్యగ్రః= కంగారు పడనివాడై, తమ్= ఆయనను, అపృచ్ఛత= ప్రశ్నించెను.

ఆ బ్రాహ్మణుడు భుజించి విశ్రాంతి తీసుకొనెను. సత్పురుషులకు శరణు అగు శ్రీకృష్ణుడు ఆయన వద్దకు వచ్చి చేతితో కాళ్లను కంగారు పడకుండా మెల్లగా నొక్కుతూ ఇట్లు ప్రశ్నించెను.

కచ్చిద్ద్విజవరశ్రేష్ఠ ధర్మస్తే వృద్ధసంమతః ।
వర్తతే నాతికృచ్ఛ్రేణ సంతుష్టమనసస్సదా ॥ 30

ద్విజవరశ్రేష్ఠ= బ్రాహ్మణశిరోమణీ!, న-అతికృచ్ఛ్రేణ= ఎక్కువ కష్టపడకుండా లభించినదానితో, సదా= ఎల్లప్పుడు, సంతుష్టమనసః= సంతోషించే మనస్సు గల, తే= నీకు, వృద్ధసంమతః= పెద్దలకు అంగీకారమైన, ధర్మః= ధర్మము, కచ్చిత్ వర్తతే= ఉన్నదా?

ఓ బ్రాహ్మణశిరోమణీ! ఎక్కువ కష్టపడకుండా లభించినదానితో తమరి మనస్సు ఎల్లప్పుడు సంతోషపడును. పెద్దలకు సమ్మతమైన ధర్మమును తమరు తేలికగా ఆచరించగల్గుతున్నారా?

సంతుష్టో యర్హి వర్తేత బ్రాహ్మణో యేన కేనచిత్ ।
అహీయమానస్యాద్ధర్మాత్స హ్యస్యాకిలకామధుక్ ॥ 31

హి= ఏలయన, యర్హి= ఎప్పుడైతే, బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, యేన కేనచిత్= ఏదో ఒకదానితో, సంతుష్టః= సంతోషించువాడై, స్వాత్= తనదైన, ధర్మాత్= ధర్మమునుండి, అహీయమానః= జారిపోనివాడై, వర్తేత= జీవించునో అప్పుడు, సః= ఆ ధర్మము (ఆ బ్రాహ్మణుడు), అస్య= వీనికి (ఈ జగత్తునకు), అఖిలకామధుక్= అన్ని కోర్కెలను పిదుకును.

ఎందుకంటే, ఎప్పుడైతే బ్రాహ్మణుడు ఏదో ఒకదానితో సంతోషపడి తన ధర్మమునుండి జారిపోకుండా జీవించునో, అప్పుడా ధర్మము వీనికి సకలకామనలను సంపాదించి పెట్టును. ఆ బ్రాహ్మణుడీ జగత్తునకు సకలకామనలను సంపాదించి పెట్టును.

అసంతుష్టోఽసకృల్లోకానాప్నోత్యపి సురేశ్వరః ।
అకించనోఽపి సంతుష్టశ్శేతే సర్వాంగవిజ్వరః ॥ 32

సుర-ఈశ్వరః అపి= దేవేంద్రుడైననూ, అసంతుష్టః= సంతోషము లేనివాడై, లోకాన్= లోకములను, అసకృత్= పలుమార్లు, ఆప్నోతి= పర్యటించును, అకించనః అపి= ఏమీ లేనివాడైననూ, సంతుష్టః= సంతోషము గలవాడై, సర్వ-అంగవిజ్వరః= అన్ని అవయవములయందు తాపము లేనివాడై, శేతే= సుఖముగనుండును.

దేవేంద్రుడైననూ సంతోషము లేనివాడై మరల మరల లోకములను తిరగవలసియుండును. ఏమీ లేనివాడైననూ సంతోషము గలవాడై అవయవములయందే విధమైన తాపము లేకుండా సుఖముగా నుండును.

విప్రాన్ స్వలాభసంతుష్టాన్ సాధూన్ భూతసుహృత్తమాన్ ।
నిరహంకారిణశ్శాంతాన్ నమస్యే శిరసాఽసకృత్ ॥ 33

స్వలాభసంతుష్టాన్= తనంత తానుగా లభించినదానితో సంతోషించునట్టియు, సాధూన్= సదాచారపరులైనట్టియు, భూత సుహృత్తమాన్= ప్రాణులకు మిక్కిలి హితమును చేయునట్టియు, నిరహంకారిణః= అహంకారము లేనట్టియు, శాంతాన్= రాగద్వేషములు లేని, విప్రాన్= వేదవేత్తలను, అసకృత్= పలుమార్లు, శిరసా= శిరస్సుతో, నమస్యే= నమస్కరించుచున్నాను.

తనంత తానుగా లభించినదానితో సంతోషించి, సదాచారనిష్ఠులై ప్రాణులకు మిక్కిలి హితమును చేస్తూ, అహంకారము లేకుండా శాంతులై ఉండే వేదవేత్తలకు నేను పలుమార్లు తలవంచి నమస్కరించుచున్నాను.

కచ్చిద్వః కుశలం బ్రహ్మన్ రాజతో యస్య హి ప్రజాః ।
సుఖం వసంతి విషయే పాల్యమానాస్స మే ప్రియః ॥ 34

బ్రహ్మన్= ఓ బ్రాహ్మణా!, వః= తమకు, రాజతః= రాజు వలన, కచ్చిత్ కుశలమ్= కుశలమేనా?, యస్య= ఏ రాజు యొక్క విషయే= దేశమునందు, పాల్యమానాః= పాలించబడే, ప్రజాః= ప్రజలు, సుఖమ్= సుఖముగా, వసంతి= నివసించెదరో, సః= ఆ రాజు, మే= నా కొరకు, హి= నిశ్చయముగా, ప్రియః= ప్రీతిపాత్రుడు.

ఓ బ్రాహ్మణా! మీకు రాజు వలన సుఖము కలుగుచున్నదా? ఏ దేశములోనైతే పాలించబడే ప్రజలు సుఖముగా జీవించెదరో, ఆ రాజు నాకు నిశ్చయముగా ప్రీతిపాత్రుడగును.

యతస్త్వమాగతో దుర్గం నిస్తీర్యేహ యదిచ్ఛయా ।
సర్వం నో బ్రూహ్యగుహ్యం చేత్కిం కార్యం కరవామ తే ॥35

యత్= ఎక్కడనుండి, యద్-ఇచ్ఛయా= దేనిని కోరుటచే, దుర్గమ్= తరింప కష్టమైన సముద్రమును, నిస్తీర్య= దాటి, ఇహ= ఇచటకు, త్వమ్=

నీవు, ఆగతః= వచ్చితివో, సర్వమ్= ఆ సర్వమును, అగుహ్యం చేత్= రహస్యము కానిచో, నః= మాకు, బ్రూహి= చెప్పుము, తే= నీకు, కిమ్= ఏ, కార్యమ్= పనిని, కరవామ= చేయుదుము?

తమరు దేనిని కోరి ఎక్కడనుండి ఇక్కడకు తరింప కష్టమైన సముద్రమును దాటి వచ్చిరో, ఆ సర్వమును నాకు – రహస్యము కానిచో చెప్పుడు. నేను మీకు ఏమి పనిని చేసి పెట్టవలెను ?

ఏవం సంపృష్టసంప్రశ్నో బ్రాహ్మణః పరమేష్ఠినా ।
లీలాగృహీతదేహేన తస్మై సర్వమవర్ణయత్ ॥ 36

లీలాగృహీతదేహేన= లీల కారణముగా స్వీకరించబడిన దేహము కలిగినట్టియు, పరమేష్ఠినా= పరమేశ్వరుడగు శ్రీకృష్ణునిచే, ఏవమ్= ఈ విధముగా, సంపృష్టసంప్రశ్నః= అడుగబడిన ప్రశ్నించదగిన విషయము గల, బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, తస్మై= ఆయన కొరకు, సర్వమ్= అంతనూ, అవర్ణయత్= వర్ణించెను.

లీల నిమిత్తముగా శ్రీకృష్ణుడై అవతరించిన పరమేశ్వరుడీ విధముగా అడుగదగిన ప్రశ్నలను అడుగగా, ఆ బ్రాహ్మణుడు ఆయనకు విషయమునంతనూ వివరించి చెప్పెను.

రుక్మిణ్యువాచ ।

శ్రుత్వా గుణాన్ భువనసుందర శృణ్వతాం తే
నిర్విశ్య కర్ణవివరైర్హరతోఽంగ తాపమ్ ।
రూపం దృశాం దృశిమతామఖిలార్థలాభం
త్వయ్యచ్యుతావిశతి చిత్తమపత్రపం మే ॥ 37

రుక్మిణిః= రుక్మిణి, ఉవాచ= పలికెను, భువనసుందర= లోకములలో అందమైనవాడా!, అచ్యుత= ఓ అచ్యుతా!, అంగ= ఓయీ!, శృణ్వతామ్=

వినువారల, కర్ణవివరైఃⁿ చెవి రంధ్రముల గుండా, నిర్విశ్యⁿ లోపల ప్రవేశించి, తాపమ్ⁿ దుఃఖమును, హరతఃⁿ పోగొట్టే, తేⁿ నీయొక్క, గుణాన్ⁿ గుణములను గురించి, శ్రుత్వాⁿ విని, మేⁿ నాయొక్క, అపత్రపమ్ⁿ తొలగిన లజ్జ గల, చిత్తమ్ⁿ చిత్తము, త్వయిⁿ నీయందు, ఆవిశతిⁿ ఆసక్తమగుచున్నది.

రుక్మిణి ఇట్లు పలికెను...ఓ అచ్యుతా! నీవు త్రిలోకసుందరుడవు. నీ గుణములు వినువారల హృదయములో చెవి రంధ్రముల గుండా ప్రవేశించి తాపమును పోగొట్టునని విన్నాను. చూపు గలవారి కళ్లకు నిన్ను చూచుట సకలపురుషార్థ ప్రాప్తియని విన్నాను. నా మనస్సు సిగ్గు విడిచి నిన్ను ప్రేమించుచున్నది.

కా త్వా ముకుంద మహతీ కులశీలరూప
విద్యావయోద్రవిణధామభిరాత్మతుల్యమ్ ।
ధీరా పతిం కులవతీ న వృణీత కన్యా
కాలే నృసింహ నరలోకమనోఽభిరామమ్ ॥ 38

ముకుంద= మోక్షప్రదాతా!, నృసింహ= ఓ మానవశ్రేష్ఠా, కులశీలరూపవిద్యావయఃద్రవిణధామభిఃⁿ కులము శీలము రూపము విద్య వయస్సు సంపద తేజస్సులచే, ఆత్మతుల్యమ్ⁿ తానే సాటియై-నట్టియు, నరలోకమనఃఅభిరామమ్ⁿ మానవలోకము యొక్క మనస్సులకు ఆహ్లాదకరుడవైన, త్వాⁿ నిన్ను, మహతీⁿ గొప్పది, ధీరాⁿ ధైర్యము గలది, కులవతీⁿ కులస్త్రీ అగు, కాⁿ ఏ, కన్యాⁿ కన్య, కాలేⁿ కాలము నందు, న వృణీతⁿ వరించకుండును ?

ఓ శ్రీకృష్ణా! మోక్షప్రదాతవగు నీవు మానవులలో శ్రేష్ఠుడవు. కులము, శీలము, రూపము, విద్య, వయస్సు, సంపద, తేజస్సు

అనువాటిలో నీకు నీవే సాటి. మానవలోకము యొక్క మనస్సులకు నీవు ఆహ్లాదమును కలిగించెదవు. సద్గుణ సంపన్న, ధైర్యము గలది, కులస్త్రీ అగు ఏ కన్య యుక్త వయస్సు వచ్చినప్పుడు నిన్ను వరించకుండును? (నిన్నే వరించును).

తన్మే భవాన్ ఖలు వృతః పతిరంగ జాయాం
ఆత్మార్పితశ్చ భవతోఽత్ర విభో విధేహా ।
మా వీరభాగమభిమర్శతు చైద్య ఆరాద్
గోమాయువన్మృగపతేర్బలిమంబుజాక్ష ॥ 39

అంగ= ఓయీ!, విభో= ఓ ప్రభూ!, తత్= అందువలన, మే= నాచే, భవాన్= నీవు, ఖలు= నిశ్చయముగా, పతిః= భర్తగా, వృతః= వరించబడితివి, ఆత్మా= దేహేంద్రియసంఘాతము, భవతః= నీకు, అర్పితః చ= సమర్పించబడినది కూడా, అత్ర= ఇచట, భవతః= నీ, జాయామ్= భార్యనుగా, విధేహి= చేసుకొనుము, అంబుజ-అక్ష= పద్మములవంటి కన్నులు గలవాడా!, చైద్యః= చేదిదేశాధిపతియగు శిశుపాలుడు, వీరభాగమ్= వీరుడవైన నీ దాననగు నన్ను, మృగపతేః = మృగరాజగు సింహము యొక్క, బలిమ్= భాగమును, గోమాయువత్= నక్కవలె, ఆరాత్= దగ్గరగా, మా అభిమర్శతు= స్పృశించకుండు గాక!

ఓ ప్రభూ! కాబట్టి నేను నిన్నే భర్తగా వరించి నా దేహేంద్రి-యాదులను కూడ నీకే సమర్పించినాను. నీవిచటకు విచ్చేసి నన్ను నీ భార్యగా చేసుకొనుము. పద్మములవంటి కన్నులు గల ఓ శ్రీకృష్ణా! నేను వీరుడవగు నీ దానను. మృగరాజగు సింహముయొక్క భాగమును నక్కవలె, చేదిదేశాధిపతియగు శిశుపాలుడు దగ్గరకు వచ్చి నన్ను స్పృశించరాదు.

పూర్తేష్టదత్తనియమవ్రతదేవవిప్ర -
గుర్వర్చనాఽఽదిభిరలం భగవాన్ పరేశః ।
ఆరాధితో యది గదాగ్రజ ఏత్య పాణిం
గృహ్ణాతు మే న దమఘోషసుతాదయోఽన్యే ॥ 40

పూర్త-ఇష్టదత్తనియమవ్రతదేవవిప్రగురు-అర్చనా-ఆదిభిః= పూర్తకర్మలు ఇష్టకర్మలు దానములు నియమములు వ్రతములు, దేవతలు-బ్రాహ్మణులు-గురువులను= పూజించుట మొదలగువాటిచే, పర-ఈశః= ప్రకృతికి ప్రభువగు, భగవాన్= భగవానుడు, యది ఆరాధితః = ఆరాధించబడినవాడైనచో, గద-అగ్రజః= గదుని సోదరుడగు శ్రీకృష్ణుడు, ఏత్య= వచ్చి, మే= నా, పాణిమ్= చేతిని, గృహ్ణాతు= పట్టుకొను గాక!, దమఘోషసుత-ఆదయః= దమఘోషుని పుత్రుడగు శిశుపాలుడు మొదలైన, అన్యే= ఇతరులు, న= కాదు.

నూతులు త్రవ్వించుట మొదలగు సేవాకార్యములు, యజ్ఞయాగాది కర్మలు, దానములు, నియమములు, వ్రతములు, దేవతలను బ్రాహ్మణులను గురువులను పూజించుట, తీర్థస్నానము మొదలగువాటి ద్వారా నేను ప్రకృతికి ప్రభువగు భగవానుని ఆరాధించి యున్నచో, గదుని సోదరుడగు శ్రీకృష్ణుడు వచ్చి నన్ను వివాహమాడు గాక! దమఘోషుని పుత్రుడగు శిశుపాలుడు, శాల్వుడు మొదలగువారు నన్ను స్పృశించరాదు.

శ్వో భావిని త్వమజితోద్వహనే విదర్భాన్
గుప్తస్సమేత్య పృతనాపతిభిః పరీతః ।
నిర్మథ్య చైద్యమగధేంద్రబలం ప్రసహ్య
మాం రాక్షసేన విధినోద్వహ వీర్యశుల్కామ్ ॥ 41

అజిత= పరాజయము లేనివాడా!, ఉద్వహనే= వివాహము, శ్వః = రేపు, భావిని= జరుగబోగా, త్వమ్= నీవు, గుప్తః= గోపితుడవై, పృతనాపతిభిః= సేనాధ్యక్షులచే, పరీతః= చుట్టువారబడినవాడవై, విదర్భాన్= విదర్భదేశమును గురించి, సమేత్య= వచ్చి, చైద్యమగధేంద్ర బలమ్= చేదిరాజగు శిశుపాలుని మగధరాజగు జరాసంధుని సైన్యమును, నిర్మథ్య= పరాభవించి, ప్రసహ్య= బలాత్కారముగా, వీర్యశుల్కామ్= పరాక్రమమే కట్నముగా గల, మామ్= నన్ను, రాక్షసేన విధినా= రాక్షసవిధానముచే, ఉద్వహ= వివాహమాడుము.

ఓ శ్రీకృష్ణా! నీకు పరాజయము లేదు. నా పెళ్లికి ముహూర్తము రేపు. సేనాధ్యక్షులు చుట్టువారి రాగా నీవు రహస్యముగా విదర్భ దేశమునకు రమ్ము. చేదిరాజగు శిశుపాలుని, మగధరాజగు జరాసంధుని, వారి సైన్యములను పరాభవించుము. పరాక్రమమే నాకు కట్నము. నన్ను బలాత్కారముగా తీసుకుపోయి రాక్షసవిధి (పెద్దల అభిమతమును త్రోసిపుచ్చి బలప్రదర్శనతో చేసుకునే పెళ్లి) చే వివాహమాడుము.

అంతఃపురాంతరచరీమనిహత్య బంధూన్
త్వాముద్వహే కథమితి ప్రవదామ్యుపాయమ్ ।
పూర్వేద్యురస్తి మహతీ కులదేవియాత్రా
యస్యాం బహిర్నవవధూర్గిరిజాముపేయాత్ ॥ 42

బంధూన్= బంధువులను, అనిహత్య= సంహరించకుండా, అంతఃపుర-అంతరచరీమ్= అంతఃపురము లోపల సంచరించే, త్వామ్= నిన్ను, కథమ్= ఏ విధముగా, ఉద్వహే= నేను వివాహమాడవలెను?, ఇతి= అన్నచో, ఉపాయమ్= ఉపాయమును, ప్రవదామి= చెప్పుచున్నాను, పూర్వేద్యుః= ముందు రోజు, మహతీ= గొప్ప, కుల దేవియాత్రా= కుల

దేవిని గురించి యాత్ర, అస్తి= కలదు, యస్యామ్= ఏ యాత్రయందైతే, నవవధూః= కొత్త పెళ్లి కూతురు, బహిః= బయట, గిరిజామ్= పార్వతీదేవిని గురించి, ఉపేయాత్= వెళ్లునో.

బంధువులను సంహరించకుండా అంతఃపురములో సంచరించే నిన్ను నేను యెట్లు వివాహమాడవలెను? అని అంటావేమో! ఉపాయమును చెప్పెదను. ముందు రోజు కొత్త పెళ్లి కూతురు కులదేవి దర్శనమునకై వెళ్లును. ఈ యాత్ర చాల గొప్పది. ఈ సందర్భములో కొత్త పెళ్లికూతురు అంతఃపురము బయటకు వచ్చి పార్వతీదేవి దర్శనమునకు వెళ్లును.

యస్యాంఘ్రిపంకజరజస్స్నపనం మహాంతో
వాంఛంత్యుమాపతిరివాత్మతమోఽపహత్యై ।
యర్హ్యంబుజాక్ష న లభేయ భవత్ప్రసాదం
జహ్యామసూన్ వ్రతకృశాన్ శతజన్మభిస్స్యాత్ ॥ 43

మహాంతః= మహాత్ములు, ఉమాపతిః ఇవ= పార్వతీపతియగు శివుడు వలె, ఆత్మతమః-అపహత్యై= తమ అజ్ఞానమును పోగొట్టు కొనుటకై, యస్య= ఎవ్వాని, అంఘ్రిపంకజరజః-స్నపనమ్= పద్మముల వంటి పాదముల ధూళితో స్నానమును, వాంఛంతి= కోరెదరో, అంబుజ-అక్ష= పద్మముల వంటి కన్నులు గలవాడా!, భవత్-ప్రసాదమ్= నీ అనుగ్రహమును, యర్హి= ఏ కాలమునందైతే, న లభేయ= పొందజాలనో, వ్రతకృశాన్= వ్రతముచే చిక్కిన, అసూన్= ప్రాణములను, జహ్యామ్= విడిచి పెట్టెదను గాక!, శతజన్మభిః= వంద జన్మలచే, స్యాత్= కలుగుగాక!

పద్మములవంటి కన్నులు గల ఓ శ్రీకృష్ణా! మహాత్ములు తమ అజ్ఞానమును పోగొట్టుకొనుటకై ఉమాపతియగు శివుడు వలె నీ పద్మములవంటి పాదముల ధూళితో స్నానమును కోరెదరు. అట్టి నీ

అనుగ్రహము నాకు లభించని పక్షములో నేను ప్రాణములను విడిచెదను. నా ప్రాణములు వ్రతోపవాసముచే చిక్కియే యున్నవి. ఈ జన్మలో కాకున్ననూ, నీ అనుగ్రహము నాకు వంద జన్మలచేనైననూ కలుగుగాక!

బ్రాహ్మణ ఉవాచ ।

ఇత్యేతే గుహ్యసందేశా యదుదేవ మయాఽఽహృతాః ।
విమృశ్య కర్తుం యచ్చాత్ర క్రియతాం తదనంతరమ్ ॥ 44

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ద్విపంచాశత్తమోఽధ్యాయః ॥

బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, ఉవాచ= పలికెను, యదుదేవ= ఓ యాదవప్రభూ!, ఇతి= ఈ విధముగా, ఏతే= ఈ, గుహ్యసందేశాః= రహస్యసందేశములు, మయా= నాచే, ఆహృతాః= తీసుకురాబడినవి, విమృశ్య= ఆలోచించి, అత్ర= ఈ విషయమునందు, యత్= ఏది, కర్తుమ్= చేయుటకు (తగినదో), తత్ చ= అది, అనంతరమ్= వెను వెంటనే, క్రియతామ్= చేయబడుగాక!

బ్రాహ్మణుడిట్లు పలికెను...ఓ యాదవప్రభూ! నేను తీసుకువచ్చిన ఈ విధమైన ఈ రహస్యసందేశములను తమరు విచారించి, ఈ విషయములో ఏది కర్తవ్యమో దానిని వెనువెంటనే అమలు చేయుడు.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
రుక్మిణి శ్రీకృష్ణునకు రహస్యసందేశమును పంపుటను వర్ణించే
ఏబది రెండవ అధ్యాయము ముగిసినది (52).

* * *

అథ త్రిపంచాశత్తమోఽధ్యాయః

శ్రీకృష్ణుడు రుక్మిణిని రక్షించుట

శ్రీశుక ఉవాచ ।

వైదర్భ్యాస్తు సందేశం నిశమ్య యదునందనః ।
ప్రగృహ్య పాణినా పాణిం ప్రహసన్నిదమబ్రవీత్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, యదునందనః= యాదవవంశమునకు ఆనందమును కలిగించే, సః తు= ఆ శ్రీకృష్ణుడైతే, వైదర్భ్యాః= విదర్భరాజకుమార్తె యొక్క, సందేశమ్= సందేశమును, నిశమ్య= విని, పాణినా= చేతితో, పాణిమ్= చేతిని, ప్రగృహ్య= పట్టుకొని, ప్రహసన్= నవ్వుచున్నవాడై, ఇదమ్= ఈ మాటను, అబ్రవీత్= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...యాదవవంశనందనుడగు ఆ శ్రీకృష్ణుడు విదర్భరాజకుమారియగు రుక్మిణి యొక్క సందేశమును విని నవ్వెను. ఆయన ఆ బ్రాహ్మణుని చేతిని చేతితో పట్టుకొని ఇట్లనెను.

శ్రీభగవానువాచ ।

తథాఽహమపి తచ్చిత్తో నిద్రాం చ న లభే నిశి ।
వేదాహం రుక్మిణా ద్వేషాన్మమోద్వాహో నివారితః ॥ 2

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, తథా= అదే విధముగా, అహం అపి= నేను కూడా, తత్–చిత్తః= ఆమెయందే మనస్సు గలవాడనై, నిశి= రాత్రియందు, నిద్రాం చ= నిద్రను కూడ, న లభే= పొందను, రుక్మిణా= రుక్మిచే, ద్వేషాత్= ద్వేషము వలన, మమ= నా, ఉద్వాహః= పెళ్లి, నివారితః= అడ్డుకొనబడినది, అహమ్= నేను, వేద= ఎరుగుదును.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఆమెకు వలెనే నాకు కూడా ఆమెయందే మనస్సు లగ్నమై రాత్రి నిద్రకూడ పట్టుటలేదు. రుక్మి

నాయందలి ద్వేషము వలన రుక్మిణికి నాతో వివాహము కాకుండా అడ్డు పడినాడని నాకు తెలుసు.

తామానయిష్య ఉన్మథ్య రాజన్యాపసదాన్ మృధే ।
మత్పరామనవద్యాంగీమేధసోఽగ్నిశిఖామివ ॥ 3

మృధే= యుద్ధమునందు, రాజన్య-అపసదాన్= క్షత్రియులలో అధములైన వారిని, ఉన్మథ్య= పరాభవించి, మత్-పరామ్= నేనే శరణముగా కలిగినట్టియు, అనవద్య-అంగీమ్= నిర్దుష్టమైన అవయవములు గల, తామ్= ఆ రుక్మిణిని, ఏధసః= కట్టెనుండి, అగ్నిశిఖాం ఇవ= అగ్నిజ్వాలను వలె, ఆనయిష్యే= తీసుకురాగలను.

శిశుపాలాదులు క్షత్రియాధములు. వారిని యుద్ధములో పరాభవించి గొప్ప సుందరియగు ఆ రుక్మిణిని, కట్టెనుండి అగ్నిజ్వాలను వలె, తీసుకు వచ్చెదను. ఆమె నన్నే శరణు వేడినది.

శ్రీశుక ఉవాచ ।
ఉద్వాహర్క్షం చ విజ్ఞాయ రుక్మిణ్యా మధుసూదనః ।
రథస్సంయుజ్యతామాశు దారుకేత్యాహ సారథిమ్ ॥ 4

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, మధుసూదనః= మధువనే రాక్షసుని సంహరించిన శ్రీకృష్ణ భగవానుడు, రుక్మిణ్యాః= రుక్మిణి యొక్క, ఉద్వాహ-ఋక్షం చ= వివాహ నక్షత్రమును గురించి కూడా, విజ్ఞాయ= తెలుసుకొని, దారుక= దారుకా!, ఆశు= వెంటనే, రథః= రథము, సంయుజ్యతామ్= సిద్ధము చేయబడు గాక!, ఇతి= అని, సారథీమ్= సారథిని గురించి, ఆహ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...మధువును సంహరించిన శ్రీకృష్ణ భగవానుడు రుక్మిణి యొక్క వివాహ నక్షత్రము (రెండు రోజుల పిదప)ను గురించి తెలుసుకొని, ఓ దారుకా! వెంటనే రథమును సిద్ధము చేయుము, అని సారథితో పలికెను.

స చాశ్వైశ్శైవ్యసుగ్రీవమేఘపుష్పబలాహకైః ।
యుక్తం రథముపానీయ తస్థౌ ప్రాంజలిరగ్రతః ॥ 5

సః చ= ఆ దారుకుడు కూడ, శైవ్యసుగ్రీవ మేఘపుష్పబలాహకైః = శైవ్యము (చిలుక పచ్చనిది) సుగ్రీవము (బంగరు వర్ణము గలది) మేఘపుష్పము (నల్లనిది) బలాహకము (తెల్లనిది) అనే, అశ్వైః= గుర్రములతో, యుక్తమ్= పూన్చబడిన, రథమ్= రథమును, ఉప= దగ్గరకు, ఆనీయ= తీసుకువచ్చి, అగ్రతః= ఎదుట, ప్రాంజలిః= దోసిలి యొగ్గినవాడై, తస్థౌ= నిలబడెను.

శైవ్య సుగ్రీవ మేఘపుష్ప బలాహకములనే గుర్రములతో పూన్చిన రథమును ఆ సారథి దగ్గరగా తెచ్చి, దోసిలి యొగ్గి ఎదుట నిలబడెను.

ఆరుహ్య స్యందనం శౌరిర్ద్విజమారోప్య తూర్ణగైః ।
ఆనర్తాదేకరాత్రేణ విదర్భానగమద్ధయైః ॥ 6

శౌరిః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు, ద్విజమ్= బ్రాహ్మణుని, స్యందనమ్= రథమును, ఆరోప్య= ఎక్కించి, ఆరుహ్య= ఎక్కి, తూర్ణ గైః= వేగముగా వెళ్లే, హయైః= గుర్రములతో, ఆనర్తాత్= ఆనర్తదేశమునుండి, విదర్భాన్= విదర్భ దేశమును గురించి, ఏకరాత్రేణ= ఒక రాత్రిచే, అగమత్= వెళ్లెను.

శూరపుత్రుడగు శ్రీకృష్ణుడు బ్రాహ్మణుని రథమెక్కించి తాను ఎక్కెను. వేగముగా నడిచే గుర్రములు లాగగా వారా రథముపై ఒక్క రాత్రి గడచు సరికి ఆనర్త దేశమునుండి విదర్భదేశమును చేరుకొనిరి.

రాజా స కుండినపతిః పుత్రస్నేహవశం గతః ।
శిశుపాలాయ స్వాం కన్యాం దాస్యన్ కర్మాణ్యకారయత్ ॥ 7

కుండినపతిః= కుండినపురప్రభువగు, సః= ఆ, రాజా= భీష్మక మహారాజు, పుత్ర స్నేహవశమ్= పుత్రునియందలి ప్రేమచే పరవశమును, గతః= పొందినవాడు, స్వామి= తన, కన్యామ్= కుమార్తెను, శిశుపాలాయ= శిశుపాలుని కొరకు, దాస్యన్= ఈయబోవువాడై, కర్మాణి= కర్మలను, అకారయత్= చేయించెను.

కుండినపురమునకు ప్రభువగు ఆ భీష్మక మహారాజు పుత్రుని యందలి ప్రేమచే పరవశుడాయెను. ఆయన తన కుమార్తెయగు రుక్మిణిని శిశుపాలునకు ఇచ్చి వివాహము చేయబోవువాడై, ఏర్పాట్లను చేయించెను.

పురం సమ్మృష్టసంసిక్తమార్గరథ్యాచతుష్పథమ్ ।
చిత్రధ్వజపతాకాభిస్తోరణైస్సమలంకృతమ్ ॥ 8

పురమ్= నగరము, సమ్మృష్టసంసిక్తమార్గరథ్యాచతుష్పథమ్= తుడువబడి నీళ్లు చల్లబడిన మార్గములు రథమార్గములు కూడళ్లు గలది, చిత్రధ్వజపతాకాభిః= రంగు రంగుల టెక్కెములతో పతాకలతో, తోరణైః= తోరణములతో, సమలంకృతమ్= చక్కగా అలంకరించబడినది.

ఆ నగరములోని దారులు, రాజమార్గములు, కూడళ్లను తుడిచి నీళ్లను చల్లిరి. నగరమును రంగు రంగుల టెక్కెములతో, పతాకలతో, తోరణములతో బాగుగా అలంకరించిరి.

స్రగ్గంధమాల్యాభరణైర్విరజోఽంబరభూషితైః ।
జుష్టం స్త్రీపురుషైశ్శ్రీమద్గృహైరగురుధూపితైః ॥ 9

స్రగ్-గంధమాల్య-ఆభరణైః= పుష్పమాలలు గంధములు పుష్పములు ఆభరణములు కలిగినట్టియు, విరజః-అంబరభూషితైః= నిర్మలమగు వస్త్రములచే అలంకరించబడిన, స్త్రీపురుషైః= స్త్రీలచే పురుషులచే, అగురుధూపితైః= అగురు ధూపము వేయబడిన, శ్రీమద్-గృహైః= సంపన్నములైన గృహములచే, జుష్టమ్= సేవించబడినది.

ఆ నగరమునందలి స్త్రీలు, పురుషులు పుష్పమాలలను, పూలను, సుగంధద్రవ్యములను ఆభరణములను కలిగియుండిరి. అచటి గృహములు సంపన్నములై అగురు ధూపమును కలిగియుండెను.

పితౄన్ దేవాన్ సమభ్యర్చ్య విప్రాంశ్చ విధివన్నృప ।
భోజయిత్వా యథాన్యాయం వాచయామాస మంగలమ్ ॥10

నృప= ఓ రాజా!, పితౄన్= పితరులను, దేవాన్= దేవతలను, విధివత్= యథావిధిగా, సమభ్యర్చ్య= చక్కగా పూజించి, విప్రాన్ చ= వేదవేత్తలను కూడ, భోజయిత్వా= భుజింపజేసి, యథాన్యాయమ్= నియమమునతిక్రమించకుండా, మంగలం వాచయామాస= పుణ్యాహ–వాచనమును చేయించెను.

ఆయన పితృదేవతలను, దేవతలను చక్కగా యథావిధిగా పూజించి, వేదవేత్తలను భుజింపజేసి, నియమానుసారముగా పుణ్యాహ–వాచనమును చేయించెను.

సుస్నాతాం సుదతీం కన్యాం కృతకౌతుకమంగలామ్ ।
అహతాంశుకయుగ్మేన భూషితాం భూషణోత్తమైః ॥ 11

సుస్నాతామ్= చక్కగా స్నానము చేసినట్టియు సుదతీమ్= చక్కని దంతములు కలిగినట్టియు, కృతకౌతుకమంగలామ్= చేయబడిన రక్షచే మంగళము కలిగిన, కన్యామ్= కన్యను, అహత–అంశుకయుగ్మేన= కొత్త వస్త్రముల జంటచే, భూషణ–ఉత్తమైః= గొప్ప ఆభరణములచే, భూషితామ్= అలంకరించబడినదానినిగా (చేయించెను)

అందమైన పలువరుసలు గల రుక్మిణి చక్కగా స్నానము చేసెను. ఆ కన్య చేతులకు మంగళము కొరకై రక్షలను కట్టిరి. ఆమెను కొత్త వస్త్రముల జంటతో, గొప్ప ఆభరణములతో అలకరించిరి.

చక్రుస్సామర్గ్యజుర్మంత్రైర్వధ్వా రక్షాం ద్విజోత్తమాః ।
పురోహితోఽథర్వవిద్వై జుహావ గ్రహశాంతయే ॥ 12

ద్విజ-ఉత్తమాః= బ్రాహ్మణోత్తముల, సామ-ఋగ్-యజుః-మంత్రైః= సామవేదము ఋగ్వేదము యజుర్వేదముల మంత్రములతో, వధ్వాః= పెళ్లి కూతురికి, రక్షామ్= రక్షను, చక్రుః= చేసిరి, అథర్వవిత్= అథర్వవేదము తెలిసిన, పురోహితః వై= పురోహితుడైతే, గ్రహశాంతయే= గ్రహముల శాంతి కొరకు, జుహావ= హోమము చేసెను.

బ్రాహ్మణోత్తములు పెళ్లికూతురునకు ఋగ్వేద యజుర్వేద సామవేదమంత్రములతో రక్షను కట్టిరి. అథర్వవేదపండితుడైన పురోహితుడు గ్రహముల శాంతికొరకు హోమమును చేసెను.

హిరణ్యరూప్యవాసాంసి తిలాంశ్చ గుడమిశ్రితాన్ ।
ప్రాదాద్ధేనూశ్చ విప్రేభ్యో రాజా విధివిదాం వరః ॥ 13

విధివిదాం వరః= విధి తెలిసినవారిలో శ్రేష్ఠుడగు, రాజా= రాజు, విప్రేభ్యః= వేదవేత్తల కొరకు, హిరణ్యరూప్యవాసాంసి= బంగారము వెండి వస్త్రములను, గుడమిశ్రితాన్= బెల్లము కలిపిన, తిలాన్ చ= నువ్వులను కూడ, ధేనూః చ= పాలిచ్చే ఆవులను కూడ, ప్రాదాత్= ఇచ్చెను.

దానవిధి తెలిసినవారిలో శ్రేష్ఠుడగు ఆ రాజు వేదవేత్తలకు బంగారము, వెండి, వస్త్రములు, బెల్లము కలిపిన నువ్వులు, పాలిచ్చే ఆవులు అనువాటిని దానము చేసెను.

ఏవం చేదిపతీ రాజా దమఘోషస్సుతాయ వై ।
కారయామాస మంత్రజ్ఞైస్సర్వమభ్యుదయోచితమ్ ॥ 14

ఏవమ్= ఇదే విధముగా, చేదిపతిః= చేదిదేశప్రభువగు, దమఘోషః రాజా వై= దమఘోష మహారాజైతే, సుతాయ= పుత్రుడగు

శిశుపాలుని కొరకు, మంత్రజ్ఞైః= మంత్రవేత్తలచే, అభ్యుదయ-ఉచితమ్= వివాహమునందు యోగ్యమైన, సర్వమ్= సకలకర్మను, కారయామాస= చేయించెను.

ఇదేవిధముగా చేదిదేశప్రభువగు దమఘోష మహారాజు కూడ తన పుత్రుడగు శిశుపాలుని కొరకు వివాహమునకు యోగ్యమైన (నాందీశ్రాద్ధాది) మంగళకర్మలనన్నింటినీ మంత్రవేత్తలచే చేయించెను.

మదచ్యుద్భిర్గజానీకైస్స్యందనైర్హేమమాలిభిః ।
పత్త్యశ్వసంకులైస్సైన్యైః పరీతః కుండినం యయౌ ॥ 15

మదచ్యుద్భిః= మదమును స్రవించే, గజ-అనీకైః= ఏనుగుల సైన్యములతో, హేమమాలిభిః= బంగరు మాలలు గల, స్యందనైః= రథములతో, పత్తి-అశ్వసంకులైః= పదాతులతో గుర్రములతో వ్యాపించ బడిన, సైన్యైః= సేనలతో, పరీతః= చుట్టువారబడినవాడై, కుండినమ్= కుండిననగరమును గురించి, యయౌ= వెళ్లెను.

మదమును స్రవించే ఏనుగులు, బంగరు మాలలు గల రథములు, పదాతులు, గుర్రములు అనువాటిచే వ్యాపించబడిన సైన్యములు చుట్టువారి రాగా ఆయన కుండిననగరమునకు పయనమయ్యెను.

తం వై విదర్భాధిపతిస్సమభ్యేత్యాభిపూజ్య చ ।
నివేశయామాస ముదా కల్పితాన్యనివేశనే ॥ 16

విదర్భ-అధిపతిః వై= విదర్భ ప్రభుడగు భీష్మకుడైతే, తమ్= ఆయనను, సమభ్యేత్య= ఎదు రేగి, అభిపూజ్య చ= సమ్మానము చేసి, ముదా= ఆనందముతో, కల్పిత-అన్యనివేశనే= ఏర్పాటు చేయబడిన మరియొక మహలునందు, నివేశయామాస= విడిది చేయించెను.

విదర్భరాజగు భీష్మకుడైతే ఆ దమఘోషునకు ఎదురేగి ఆనందముతో సమ్మానించి, ముందే ఏర్పాటు చేసిన మహలులో విడిది చేయించెను.

తత్ర శాల్వో జరాసంధో దంతవక్త్రో విదూరథః ।
ఆజగ్ముశ్చైద్యపక్షీయాః పౌండ్రకాద్యాస్సహస్రశః ॥ 17

కృష్ణరామద్విషో యత్తాః కన్యాం చైద్యాయ సాధితుమ్ ।

తత్ర= ఆ కుండిననగరమునందు, శాల్వాః= శాల్వుడు, జరాసంధః = జరాసంధుడు, దంతవక్త్రః= దంతవక్త్రుడు, విదూరథః= విదూరథుడు, చైద్యపక్షీయాః= చేదిదేశప్రభువగు శిశుపాలుని పక్షమునకు చెందిన, పౌండ్రక-ఆద్యాః= పౌండ్రకుడు మొదలగువారు, కృష్ణ రామద్విషః= శ్రీకృష్ణ బలరాములను ద్వేషించువారు, కన్యామ్= కన్యయగు రుక్మిణిని, చైద్యాయ= చేది రాజకుమారుడగు శిశుపాలుని కొరకు, సాధితుమ్= సాధించి పెట్టుటకై, యత్తాః= ప్రయత్నము గలవారై, సహస్రశః= వేలాదిగా, ఆజగ్ముః= విచ్చేసిరి.

శాల్వుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు, విదూరథుడు, పౌండ్రకుడు మొదలుగా గల వేలాది మంది చేదిదేశనాయకుడగు శిశుపాలుని పక్షమునకు చెందినవారు. వారు శ్రీకృష్ణ బలరాములను ద్వేషింతురు. వారందరు పెళ్లి కూతురగు రుక్మిణికి శిశుపాలునితో వివాహమును సాధించుటకై యుద్ధమునకు సన్నద్ధులై ఆ కుండిన నగరమునకు వచ్చిరి.

యద్యాగత్య హరేత్కృష్ణో రామాద్యైర్యదుభిర్వృతః ॥ 18

యోత్స్యామస్సంహతాస్తేన ఇతి నిశ్చితమానసాః ।
ఆజగ్ముర్భూభుజస్సర్వే సమగ్రబలవాహనాః ॥ 19

కృష్ణః= శ్రీకృష్ణుడు, రామ-ఆద్యైః= బలరాముడు మొదలుగా గల, యదుభిః= యాదవులచే, వృతః= చుట్టువారబడినవాడై, ఆగత్య=

వచ్చి, యది హరేత్= కొనిపోయే పక్షములో, సంహతాఃన= ఒక్కటిగా ఐనవారమై, తేన= ఆయనతో, యోత్స్యామఃన= యుద్ధము చేసెదము, ఇతి= అని, నిశ్చితమానసాఃన= నిశ్చయించబడిన మనస్సులు గలవారై, సర్వే= అందరు, భూభుజఃన= రాజులు, సమగ్రబలవాహనాఃన= సంపూర్ణమైన సైన్యము వాహనములు గలవారై, ఆజగ్ముఃన= విచ్చేసిరి.

ఒకచో శ్రీకృష్ణుడు బలరాముడు-సాత్యకి మొదలైన యాదవులతో కూడి వచ్చి రుక్మిణిని కొనిపోయే పక్షములో, ఒక్కటిగా అయి ఆయనతో యుద్ధము చేసెదము, అని ఆ రాజులందరు మనస్సులో నిశ్చయించు కొనిరి. వారు సంపూర్ణమైన సైన్యముతో, వాహనములతో విచ్చేసిరి.

శ్రుత్వైతద్భగవాన్ రామో విపక్షీయనృపోద్యమమ్ ।
కృష్ణం చైకం గతం హర్తుం కన్యాం కలహశంకితః ॥ 20

ఏతత్= ఈ, విపక్షీయనృప-ఉద్యమమ్= శత్రుపక్షీయులగు రాజుల సైన్యసన్నాహమును గురించి, కన్యామ్= పెళ్లికూతురుని, హర్తుమ్= కొనిపోవుటకై, ఏకమ్= ఒంటరియై, గతమ్= వెళ్లిన, కృష్ణం చ= శ్రీకృష్ణుని గురించి కూడ, శ్రుత్వా= విని, రామఃన భగవాన్= బలరామ భగవానుడు, కలహశంకితఃన= యుద్ధమునందు శంక గలవాడు.

శత్రుపక్షీయులగు రాజుల ఈ సైన్యసన్నాహమును గురించి, శ్రీకృష్ణుడు పెళ్లి కూతురును కొనిపోవుటకై ఒంటరిగా వెళ్లుటను గురించి విని, బలరామ భగవానునకు యుద్ధము వచ్చుననే శంక కలిగెను.

బలేన మహతా సార్ధం భ్రాతృస్నేహపరిప్లుతః ।
త్వరితః కుండినం ప్రాగాద్గజాశ్వరథపత్తిభిః ॥ 21

భ్రాతృస్నేహపరిప్లుతఃన= తమ్మునియందలి ప్రేమచే ముంచెత్తబడిన వాడు, త్వరితఃన= తొందర గలవాడు, మహతా= పెద్ద, బలేన= సైన్యముతో, గజ-అశ్వరథపత్తిభిఃన సార్ధమ్= ఏనుగులు, గుర్రములు,

రథములు పదాతులతో కూడి, కుండినమ్= కుండిన నగరమును గురించి, ప్రాగాత్= వెళ్లెను.

తమ్మునియందలి ప్రేమ బలరాముని ముంచెత్తెను. ఆయన ఏనుగులు, గుర్రములు, రథములు, పదాతులు గల పెద్ద సైన్యము తోడు రాగా వేగముగా కుండిన నగరమును చేరెను.

భీష్మకన్యా వరారోహా కాంక్షంత్యాగమనం హరేః ।
ప్రత్యాపత్తిమపశ్యంతీ ద్విజస్యాచింతయత్తదా ॥ 22

వరారోహా= సుందరి, భీష్మకన్యా= భీష్మకుని కుమార్తె అగు రుక్మిణి, హరేః= శ్రీకృష్ణ భగవానుని, ఆగమనమ్= రాకను, కాంక్షంతీ= కోరునది, ద్విజస్య= బ్రాహ్మణుని యొక్క, ప్రత్యాపత్తిమ్= తిరిగి రాకను, అపశ్యంతీ= కానరానిదై, తదా= అప్పుడు, అచింతయత్= తలపోసెను.

భీష్మకుని కుమార్తెయగు రుక్మిణి సుందరి. ఆమె శ్రీకృష్ణుని రాకను కోరుచుండెను. తాను పంపిన బ్రాహ్మణుడు ఇంకనూ తిరిగి రాలేదు. అప్పుడామె ఇట్లు తలపోసెను.

అహో త్రియామాంతరిత ఉద్వాహో మేల్పరాధసః ।
నాగచ్ఛత్యరవిందాక్షో నాహం వేద్మ్యత్ర కారణమ్ ।
సోఽపి నావర్తతేఽద్యాపి మత్సందేశహరో ద్విజః ॥ 23

అహో= అయ్యో!, అల్పరాధసః= తక్కువ భాగ్యము గల, మే= నా, ఉద్వాహః= వివాహము, త్రియామ-అంతరితః= మూడు జాముల వ్యవధి గలది, అరవింద-అక్షః= పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు, న ఆగచ్ఛతి= వచ్చుట లేదు, అత్ర= ఈ విషయమునందు, కారణమ్= కారణమును, అహమ్= నేను, న వేద్మి= ఎరుగను, మత్-సందేశహరః= నా సందేశమును కొనిపోయిన, సః= ఆ, ద్విజః అపి= బ్రాహ్మణుడు కూడ, అద్య అపి= ఈనాటికి కూడా, న ఆవర్తతే= తిరిగి వచ్చుటలేదు.

అయ్యో! అల్పభాగ్యురాలగు నా వివాహమునకు ఇంక మూడుజాముల వ్యవధి మాత్రమే గలదు. పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడింకనూ రాలేదు. ఆయన రాకుండుటకు కారణము నాకు తెలియదు. నా సందేశమును కొనిపోయిన బ్రాహ్మణుడైననూ ఈ నాటికి కూడ తిరిగి రాలేదు.

అపి మయ్యనవద్యాత్మా దృష్ట్వా కించిజ్జుగుప్సితమ్ ।
మత్పాణిగ్రహణే నూనం నాయాతి హి కృతోద్యమః ॥ 24

అనవద్య–ఆత్మా= దోషములు లేని మనస్సు గల శ్రీకృష్ణుడు, మయి= నాయందు, కించిత్= ఏదో ఒక, జుగుప్సితమ్= ఏవగించు–కొనదగిన దోషమును, దృష్ట్వా= చూచి, కృత–ఉద్యమః= చేయబడిన ఉద్యమము గలవాడై, మత్–పాణిగ్రహణే= నాతోడి వివాహము నందు, న ఆయాతి హి= వచ్చుట లేదు గదా! నూనమ్= నిశ్చయము.

శ్రీకృష్ణుని మనస్సు నిర్దుష్టమైనది. ఆయన ప్రయత్నమును చేసి నన్ను వివాహమాడుటకై వచ్చుట లేదు. ఆయన నిశ్చయముగా నాలో ఏవగించుకొనదగిన దోషమును దేనినో చూచియుండును.

దుర్భగాయా న మే ధాతా నానుకూలో మహేశ్వరః ।
దేవీ వా విముఖా గౌరీ రుద్రాణీ గిరిజా సతీ ॥ 25

దుర్–భగాయాః= దురదృష్టవంతురాలనగు, మే= నాకు, ధాతా= విధాత, మహా–ఈశ్వరః= మహేశ్వరుడు, న అనుకూలః= అనుకూలుడు కాడా?, రుద్రాణీ= రుద్రుని పత్ని, గిరిజా= పర్వతపుత్రి, సతీ= సతీదేవి అగు, గౌరీ దేవీ= గౌరీదేవి, విముఖా వా= అప్రసన్నురాలా యేమి?

దురదృష్టవంతురాలనగు నాకు విధాత, మహేశ్వరుడు అనుకూలురు కారా? రుద్రుని పత్ని, పర్వతపుత్రి, సతీదేవి అగు గౌరీదేవి నా యెడల అప్రసన్నురాలా యేమి?

ఏవం చింతయతీ బాలా గోవిందహృతమానసా ।
న్యమీలయత కాలజ్ఞా నేత్రే చాశ్రుకలాఽఽకులే ॥ 26

గోవిందహృతమానసా= శ్రీకృష్ణుని చే దోచబడిన మనస్సు గల, బాలా= పెళ్లికూతురగు రుక్మిణి, ఏవమ్= ఈ విధముగా, చింతయతీ= తలపోయుచున్నదై, కాలజ్ఞా= ఈ సమయమును గుర్తించినదై, అశ్రుకలా-ఆకులే= కన్నీటి బిందువులతో నిండిన, నేత్రే= కళ్లను, న్యమీలయత= మూసుకొనెను.

పెళ్లికూతురగు రుక్మిణియొక్క మనస్సును శ్రీకృష్ణుడు దోచెను. ఆమె ఈ విధముగా తలపోస్తూ ఇంకనూ సమయమున్నదని తెలిసి, కన్నీటితో నిండిన కన్నులను మూసుకొనెను.

ఏవం వధ్వాః ప్రతీక్షంత్యా గోవిందాగమనం నృప ।
వామ ఊరుర్భుజో నేత్రమస్ఫురన్ ప్రియభాషిణః ॥ 27

నృప= ఓ రాజా!, ఏవమ్= ఈ విధముగా, గోవింద-ఆగమనమ్= శ్రీకృష్ణుని రాకను, ప్రతీక్షంత్యాః= ఎదురు చూచుచున్న, వధ్వాః= పెళ్లి కూతురగు రుక్మిణి యొక్క, వామః= ఎడమ, ఊరుః= తొడ, భుజః= చేయి, నేత్రమ్= కన్ను, అస్ఫురన్= అదిరినవి, ప్రియభాషిణః= ప్రియమును సూచించునవి.

ఓ పరీక్షిన్మహారాజా! ఈ విధముగ పెళ్లికూతురగు రుక్మిణి శ్రీకృష్ణుని రాకకై ఎదురుచూచుచుండగా, ఆమె ఎడమ తొడ, చేయి, కన్ను అదిరి రాబోయే శుభమును సూచించినవి.

అథ కృష్ణవినిర్దిష్టస్స ఏవ ద్విజసత్తమః ।
అంతఃపురచరీం దేవీం రాజపుత్రీం దదర్శ హ ॥ 28

అథ= తరువాత, కృష్ణ వినిర్దిష్టః= శ్రీకృష్ణునిచే పంపబడిన, సః= ఆ, ద్విజసత్-తమః ఏవ= ఉత్తమ బ్రాహ్మణుడే, అంతఃపురచరీమ్=

అంతఃపురమునందు సంచరించుచున్నట్టియు, దేవీమ్= ప్రకాశించుచున్న, రాజపుత్రీమ్= రాజపుత్రియగు రుక్మిణిని, దదర్శ హ= చూచెను.

తరువాత శ్రీకృష్ణునిచే పంపబడిన ఆ బ్రాహ్మణోత్తముడే అంతఃపురము నందు సంచరిస్తూ ప్రకాశిస్తున్న రాజపుత్రియగు రుక్మిణిని చూచెను.

సా తం ప్రహృష్టవదనమవ్యగ్రాత్మగతిం సతీ ।
ఆలక్ష్య లక్షణాభిజ్ఞా సమపృచ్ఛచ్ఛుచి స్మితా ॥ 29

సతీ= పుణ్యాత్మురాలగు, సా= ఆ రుక్మిణి, ప్రహృష్టవదనమ్= హర్షముతో నిండిన ముఖము కలిగినట్టియు, అవ్యగ్ర-ఆత్మగతిమ్= తొట్రుపాటు లేని దేహము యొక్క చలనము కలిగిన, తమ్= ఆయనను, ఆలక్ష్య= చూచి, లక్షణ-అభిజ్ఞా= లక్షణములను గుర్తు పట్టినదై, శుచిస్మితా= స్వచ్ఛమగు చిరునగవు గలదియై, సమపృచ్ఛత్= ప్రశ్నించెను.

హర్షముతో నిండిన ఆ బ్రాహ్మణుని నడకలో తొట్రుపాటు లేదు. ఆయనను చూచి పుణ్యాత్మురాలగు రుక్మిణి లక్షణములను గుర్తుపట్టెను. ఆమె స్వచ్ఛమగు చిరునగవుతో ప్రశ్నించెను.

తస్యా ఆవేదయత్ప్రాప్తం శశంస యదునందనమ్ ।
ఉక్తం చ సత్యవచనమాత్మోపనయనం ప్రతి ॥ 30

తస్యై= ఆ రుక్మిణి కొరకు, యదునందనమ్= యదనందనుడగు శ్రీకృష్ణుని, ప్రాప్తమ్= వచ్చినవానినిగా, ఆవేదయత్= విన్నవించెను, (శశంస - స్తుతించెను), ఆత్మోపనయనం ప్రతి= తనను తీసుకువెళ్లుటను గురించి, ఉక్తమ్= చెప్పబడిన, సత్యవచనం చ= యథార్థమగు మాటను గురించి కూడ, శశంస= చెప్పెను.

యదునందనుడగు శ్రీకృష్ణుడు వచ్చినాడనియు, ఆయన రుక్మిణిని తీసుకువెళ్లెదనని చెప్పిన యథార్థమగు వచనమును కూడ ఆ బ్రాహ్మణుడు రుక్మిణికి విన్నవించి, శ్రీకృష్ణుని స్తుతించెను.

తమాగతం సమాజ్ఞాయ వైదర్భీ హృష్టమానసా ।
న పశ్యంతీ బ్రాహ్మణాయ ప్రియమన్యన్ననామ సా ॥ 31

తమ్= ఆ శ్రీకృష్ణుని, ఆగతమ్= వచ్చినవానినిగా, సమాజ్ఞాయ= తెలిసి, హృష్టమానసా= హర్షించిన మనస్సు గల, సా= ఆ, వైదర్భీ= విదర్భరాజపుత్రి, బ్రాహ్మణాయ= బ్రాహ్మణుని కొరకు, అన్యత్= మరియొక, ప్రియమ్= ఇష్టమైనదానిని, న పశ్యంతీ= కానరానిదై, ననామ= నమస్కరించెను.

శ్రీకృష్ణుడు వచ్చాడని తెలిసి విదర్భరాజపుత్రి మహానందమును పొందెను. ఆ బ్రాహ్మణునకు ఇష్టమైన మరొకదానిని దేనిని ఈయవలెనో తెలియక ఆమె ఆయనకు నమస్కరించెను.

ప్రాప్తౌ శ్రుత్వా స్వదుహితురుద్వాహప్రేక్షణోత్సుకౌ ।
అభ్యయాత్తూర్యఘోషేణ రామకృష్ణౌ సమర్హణైః ॥ 32

స్వదుహితుః= తన కుమార్తె యొక్క, ఉద్వాహప్రేక్షణ-ఉత్సుకౌ= వివాహమును చూచుటయందు ఉత్సాహము గలవారై, ప్రాప్తౌ= వచ్చిన, రామకృష్ణౌ= బలరామ శ్రీకృష్ణులను గురించి, శ్రుత్వా= విని, తూర్య ఘోషేణ= వాద్యముల శబ్దముతో, సమర్హణైః= ఉపహారములతో, అభ్యయాత్= ఎదురేగెను.

బలరామ శ్రీకృష్ణులు తన కుమార్తె యొక్క వివాహమును చూడాలనే ఉత్సాహముతో వచ్చినారని విని, భీష్మక మహారాజు ఉపహారములను తీసుకొని వాద్యముల ధ్వనితో వారికి యెదురేగెను.

మధుపర్కముపానీయ వాసాంసి విరజాంసి సః ।
ఉపాయనాన్యభీష్టాని విధివత్సమపూజయత్ ॥ 33

సః= ఆయన, మధుపర్కమ్= మధురద్రవ్యములను, విరజాంసి= నిర్మలమైన, వాసాంసి= వస్త్రములను, అభీష్టాని= అభీష్టములైన, ఉపాయనాని= ఉపహారములను, ఉపానీయ= దగ్గరకు తీసుకువచ్చి, విధివత్= యథావిధిగా, సమపూజయత్= చక్కగా పూజించెను.

ఆయన మధురద్రవ్యములను, నిర్మలమైన వస్త్రములను, అభీష్టములైన ఉపహారములను తీసుకువచ్చి యథావిధిగా చక్కగా పూజించెను.

తయోర్నివేశనం శ్రీమదుపకల్ప్య మహామతిః ।
ససైన్యయోస్సానుగయోరాతిథ్యం విదధే యథా ॥ 34

మహామతిః= గొప్ప బుద్ధిశాలియగు భీష్మకుడు, ససైన్యయోః= సైన్యముతో కూడినట్టియు, స-అనుగయోః= అనుచరులతో కూడిన, తయోః= వారిద్దరికి, శ్రీమత్= శోభాయుక్తమైన, నివేశనమ్= నివాస గృహమును, ఉపకల్ప్య= ఏర్పాటు చేసి, యథా= యథావిధిగా, ఆతిథ్యమ్= అతిథిసత్కారమును, విదధే= చేసెను.

గొప్ప బుద్ధిశాలియగు ఆ భీష్మకుడు వారిద్దరికి, వారి సైన్యమునకు, వారి అనుచరులకు శోభాయుక్తమైన నివాసము నేర్పాటుచేసి యథావిధిగా అతిథిమర్యాదలను చేసెను.

ఏవం రాజ్ఞాం సమేతానాం యథావీర్యం యథావయః ।
యథాబలం యథావిత్తం సర్వైః కామైస్సమర్హయత్ ॥ 35

ఏవమ్= ఈ విధముగా, సమేతానామ్= సమావేశమైన, రాజ్ఞామ్= రాజులకు, యథావీర్యమ్= పరాక్రమమునతిక్రమించకుండా,

యథావయః= వయస్సునతిక్రమించకుండా, యథాబలమ్= సైన్యము-నతిక్రమించకుండా, యథావిత్తమ్= ధనమునతిక్రమించకుండా, సర్వైః = సకలములైన, కామైఃr= కోరదగిన వస్తువులతో, సమర్హయత్= గొప్ప పూజ చేసెను.

ఆయన ఈ విధముగా సమావేశమైన రాజులకు వారి వారి పరాక్రమము, వయస్సు, సైన్యము, సంపదలకు తగ్గట్లుగా సకలములైన భోగ్యములతో గొప్ప మర్యాద చేసెను.

కృష్ణమాగతమాకర్ణ్య విదర్భపురవాసినః ।
ఆగత్య నేత్రాంజలిభిః పపుస్తన్ముఖపంకజమ్ ॥ 36

ఆగతమ్= వచ్చిన, కృష్ణమ్= శ్రీకృష్ణుని గురించి, ఆకర్ణ్య= విని, విదర్భపురవాసినః= విదర్భదేశపు కుండినపురములోని పౌరులు, ఆగత్య= వచ్చి, నేత్ర-అంజలిభిఃr= కళ్లనే దోసిళ్లతో, తత్-ముఖపంకజమ్= ఆయనయొక్క పద్మమువంటి ముఖమును, పపుఃr= పానము చేసిరి.

శ్రీకృష్ణుడు వచ్చినాడని విని కుండిననగరవాసులు వచ్చి ఆయనయొక్క పద్మమువంటి ముఖమును కళ్లతో తనివి తీరా చూచిరి.

అస్యైవ భార్యా భవితుమ్ రుక్మిణ్యర్హతి నాపరా ।
అసావప్యనవద్యాత్మా భైష్మ్యాస్సముచితః పతిః ॥ 37

అస్య= ఈయనకు, భార్యా= భార్య, భవితుమ్= అగుటకు, రుక్మిణీ ఏవ= రుక్మిణి మాత్రమే, అర్హతి= తగియున్నది, అపరా= మరియొకామె, న= కాదు, అనవద్య-ఆత్మా= దోషములు లేని దేహము మనస్సు గల, అసౌ అపి= ఈయన కూడా, భైష్మ్యాఃr= భీష్మకుని పుత్రికకు, సముచితఃr= బాగా తగియున్న, పతిఃr= భర్త.

ఈయనకు భార్య అగుటకు తగిన యువతి రుక్మిణియే గాని మరియొకరు కాదు. దేహమునందు, మనస్సునందు దోషములులేని ఈయన కూడ భీష్మకపుత్రికయగు రుక్మిణికి బాగా తగిన భర్త.

కించి త్సుచరితం యన్న స్తేన తుష్టస్త్రిలోకకృత్ ।
అనుగృహ్ణాతు గృహ్ణాతు వైదర్భ్యాః పాణిమచ్యుతః ॥ 38

నః= మన, యత్= ఏ, కించిత్= ఏదో కొంచెము, సుచరితమ్= పుణ్యకర్మ గలదో, తేన= దానిచే, త్రిలోకకృత్= ముల్లోకముల సృష్టికర్త, తుష్టః= ప్రీతి జెందినవాడై, అనుగృహ్ణాతు= అనుగ్రహించు గాక!, అచ్యుతః = శ్రీకృష్ణ భగవానుడు, వైదర్భ్యాః= విదర్భరాజపుత్రి యొక్క, పాణిమ్= చేతిని, గృహ్ణాతు= పట్టుకొను గాక!

మనమేదైనా కొంచెము పుణ్యకర్మలను చేసి ఉన్నట్లైతే, దానితో ముల్లోకముల సృష్టికర్త ప్రీతి జెంది అనుగ్రహించు గాక! విదర్భరాజపుత్రిని శ్రీకృష్ణ భగవానుడు వివాహమాడు గాక!

ఏవం ప్రేమకలాబద్ధా వదంతి స్మ పురౌకసః ।
కన్యా చాంతఃపురాత్ప్రాగాద్భటై ర్గుప్తాఽంబికాఽఽలయమ్ ॥ 39

ప్రేమకలాబద్ధాః= ప్రేమ యొక్క ఉత్కర్షచే కట్టివేయబడిన, పుర–ఓకసః= నగరవాసులు, ఏవమ్= ఈ విధముగా, వదంతి స్మ= చెప్పుకొనిరి, భటైఃః= భటులచే, గుప్తా= రక్షించబడిన, కన్యా చ= పెళ్లికూతురైతే, అంతఃపురాత్= అంతఃపురమునుండి, అంబికా–ఆలయమ్= దేవియొక్క ఆలయమును గురించి, ప్రాగాత్= వెళ్లెను.

అతిశయించిన ప్రేమచే కట్టివేయబడిన కుండినపురజనులు ఈ విధముగా చెప్పుకొనిరి. ఇంతలో రక్షకభటులు చుట్టువారి రాగా పెళ్లి కూతురు రుక్మిణి అంతఃపురమునుండి దేవి ఆలయమునకు వెళ్లెను.

పద్భ్యాం వినిర్యయౌ ద్రష్టుం భవాన్యాః పాదపల్లవమ్ ।
సా చానుధ్యాయతీ సమ్య ఙ్ముకుంద చరణాంబుజమ్ ॥ 40

సా చ= ఆ రుక్మిణియైతే, ముకుందచరణ-అంబుజమ్= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుని పద్మమువంటి పాదమును, సమ్యక్= ఏకాగ్రముగా, అనుధ్యాయతీ= ధ్యానించుచున్నదై, భవాన్యాః= గౌరీదేవి యొక్క, పాదపల్లవమ్= చిగురుటాకువంటి పాదమును, ద్రష్టుమ్= దర్శించుటకు, పద్భ్యామ్= పాదములతో, వినిర్యయౌ= బయటకు వచ్చెను.

ఆ రుక్మిణియైతే మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుని పద్మమువంటి పాదమును ఏకాగ్రముగా ధ్యానించుచుండెను. ఆమె చిగురుటాకువంటి గౌరీదేవి పాదమును దర్శించుటకై కాలి నడకన బయటకు వచ్చెను.

యతవాఙ్మాతృభి స్సార్ధం సఖీభిః పరివారితా ।
గుప్తా రాజభటైశ్శూరై స్సన్నద్ధై రుద్యతాయుధైః ।
మృదంగ శంఖ పణవా స్తూర్య భేర్యశ్చ జఘ్నిరే ॥ 41

యతవాక్= నియమించబడిన వాక్కు గలది, మాతృభిః సార్ధమ్= తల్లులతో గూడి, సఖీభిః= చెలికత్తెలతో, పరివారితా= చుట్టువారబడినది, శూరైః= శూరులైనట్టియు, సన్నద్ధైః= కవచధారులైనట్టియు, ఉద్యత-ఆయుధైః= సంసిద్ధములైన ఆయుధములు గల, రాజభటైః= రాజభటులచే, గుప్తా= రక్షించబడినది, మృదంగశంఖపణవాః= మద్దెళ్లు శంఖములు తప్పెట్లు, తూర్యభేర్యః చ= వాద్యములు భేరీలు కూడ, జఘ్నిరే= మ్రోగించబడినవి.

ఆ రుక్మిణి తల్లులతో కూడి చెలికత్తెలు చుట్టువారి రాగా మౌనముగా నడచుచుండెను. శూరులగు రాజభటులు కవచములను

దాల్చి ఆయుధములను సిద్ధముగా పట్టుకొని ఆమెను రక్షించుచుండిరి. మద్దెళ్లు, శంఖములు, తప్పెట్లు, వాద్యములు, భేరీలు అనువాటిని మ్రోగించిరి.

నానోపహార బలిభి ర్వారముఖ్యా స్సహస్రశః ।
స్రగ్గంధ వస్త్రాభరణై ర్ద్విజపత్న్య స్సులంకృతాః ॥ 42

గాయంతశ్చ స్తువంతశ్చ గాయకా వాద్యవాదకాః ।
పరివార్య వధూం జగ్ము స్సూతమాగధవందినః ॥ 43

వారముఖ్యాః= గొప్ప వారాంగనలు, సహస్రశః= వేలాదిగా, నానా-ఉపహారబలిభిః= పలు రకముల ఉపహారములతో నైవేద్యములతో, స్రగ్-గంధవస్త్ర-ఆభరణైః= మాలలు గంధము వస్త్రములు ఆభరణములతో, సు-అలంకృతాః= బాగుగా అలంకరించబడిన, ద్విజపత్న్యః= బ్రాహ్మణ పత్నులు, గాయంతః= గానము చేయుచున్న, గాయకాః చ= గాయకులు కూడ, స్తువంతః= స్తోత్రపాఠములను చేయుచున్న, సూతమాగధవందినః చ= సూతులు మాగధులు వందులు కూడ, వధూమ్= పెళ్లికూతురును, పరివార్య= చుట్టువారి, జగ్ముః= వెళ్లిరి.

గొప్ప వారాంగనలు పెద్ద సంఖ్యలో పలు రకముల ఉపహారములతో నైవేద్యములతో నడిచిరి. మాలలు, గంధము, వస్త్రములు, ఆభరణములతో అలంకరించుకున్న బ్రాహ్మణపత్నులు తోడు నడిచిరి. గాయకులు గానము చేయుచుండగా, సూతులు మాగధులు వందులు స్తోత్రపాఠములను చేయుచుండిరి. వీరందరు పెళ్లి కూతురుని చుట్టువారి వెళ్లిరి.

ఆసాద్య దేవీసదనం ధౌత పాదకరాంబుజా ।
ఉపస్పృశ్య శుచిశ్శాంతా ప్రవివేశాంబికాఽంతికమ్ ॥ 44

దేవీ సదనమ్= గౌరీదేవి ఆలయమును, ఆసాద్య= చేరి, ధౌతపాదకర అంబుజా= కడుగుకొనబడిన పద్మములవంటి కాళ్లు చేతులు గలదియై, ఉపస్పృశ్య= ఆచమనము చేసి, శుచిః= శుచియై, శాంతా= శాంతురాలై, అంబికా-అంతికమ్= జగన్మాత సన్నిధిని, ప్రవివేశ= ప్రవేశించెను.

ఆమె గౌరీదేవి ఆలయమును చేరి పద్మములవంటి కాళ్లను, చేతులను కడుగుకొని ఆచమనము చేసి శుచి ఆయెను. అపుడామె ఏకాగ్రచిత్తయై జగన్మాత సన్నిధిని ప్రవేశించెను.

తాం వై ప్రవయసో బాలాం విధిజ్ఞా విప్రయోషితః ।
భవానీం వందయాం చక్రు ర్భవపత్నీం భవాన్వితామ్ ॥ 45

ప్రవయసః= పెద్ద వయసువారు, విధిజ్ఞాః= విధి తెలిసినవారు అగు, విప్రయోషితః వై= బ్రాహ్మణపత్నులైతే, తామ్= ఆ, బాలామ్= పెళ్లి కూతురిని, భవపత్నీమ్= శివుని అర్ధాంగియైనట్టియు, భవ-అన్వితామ్= శివునితో కూడియున్న, భవానీమ్= గౌరీదేవిని, వందయాం-చక్రుః= నమస్కారము చేయించిరి.

పెద్ద వయస్సు గల బ్రాహ్మణపత్నులు విధివిధానము తెలిసినవారు. వారు ఆ పెళ్లికూతురుచే శివుని అర్ధాంగియగు గౌరీదేవికి, శివునకు నమస్కారమును చేయించిరి.

నమస్యే త్వాఽంబికేఽభీక్ష్ణం స్వసంతానయుతాం శివామ్ ।
భూయాత్పతిర్మే భగవాన్ కృష్ణ స్తదనుమోదతామ్ ॥ 46

అంబికే= ఓ జగన్మాతా!, స్వసంతానయుతామ్= తన సంతానముతో కూడినట్టియు, శివామ్= మంగళప్రదయగు, త్వా= నిన్ను, అభీక్ష్ణమ్=

పలుమార్లు, నమస్యే= నమస్కరించుచున్నాను, మే= నాకు, భగవాన్ కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, పతిః= భర్త, భూయాత్= అగుగాక!, తత్= దానిని, అను మోదతామ్= అనుమోదించెదవు గాక!

ఓ జగన్మాతా! గణేశునితో కుమారస్వామితో కూడియున్న నీకు పలుమార్లు నమస్కరించుచున్నాను. నీవు మంగళములనిచ్చెదవు. నాకు శ్రీకృష్ణభగవానుడు భర్తయగుగాక! నా ఆ కోర్కెను అనుమోదించుము.

అద్భి ర్గంధాక్షతై ర్ధూపై ర్వాస స్రగ్భూల్యభూషణైః ।
నానోపహార బలిభిః ప్రదీపావలిభిః పృథక్ ॥ 47

విప్రస్త్రియః పతిమతీ స్తథా తై స్సమపూజయత్ ।
లవణాపూప తాంబూల కంఠసూత్ర ఫలేక్షుభిః ॥ 48

అద్భిః= జలములతో, గంధ-అక్షతైః= గంధముతో అక్షతలతో, ధూపైః= ధూపములతో, వాసః-స్రగ్-మాల్యభూషణైః= వస్త్రములు పుష్పమాలలు రత్నాల మాలలు భూషణములతో, నానా-ఉపహారబలిభిః = అనేకములగు ఉపహారములతో నైవేద్యములతో, ప్రదీప-ఆవలిభిః= దీపముల వరుసలతో, పృథక్= వేర్వేరుగా, తథా= అదే విధముగా, తైః= వాటితో, లవణ-అపూప తాంబూలకంఠసూత్రఫల-ఇక్షుభిః= ఉప్పు అప్పములు తాంబూలము కంఠహారములు పళ్లు చెరుకు ముక్కలతో, పతిమతీః= భర్త గల, విప్రస్త్రియః= బ్రాహ్మణ స్త్రీలను, సమపూజయత్= చక్కగా పూజించెను.

జలములు, గంధము, అక్షతలు, ధూపములు, వస్త్రములు, పుష్పమాలలు, రత్నాల మాలలు, అలంకారములు, పలు రకముల ఉపహారములు, నైవేద్యములు, దీపపు వరుసలు అనువాటితో రుక్మిణి

భవానిని, శివుడిని వేర్వేరుగా పూజించెను. అదే విధముగా ఆమె ఆ ద్రవ్యములతో మరియు ఉప్పు, అప్పములు, తాంబూలము, కంఠ-హారములు, పళ్లు, చెరుకు ముక్కలు అనువాటితో భర్త ఉన్న బ్రాహ్మణ స్త్రీలను చక్కగా పూజించెను.

తస్యై స్త్రియ స్తాః ప్రదదు శ్శేషాం యుయుజు రాశిషః ।
తాభ్యో దేవ్యై నమశ్చక్రే శేషాం చ జగృహే వధూః ॥ 49

తాః= ఆ, స్త్రియః= బ్రాహ్మణ స్త్రీలు, తస్యై= ఆమె కొరకు, శేషామ్= ప్రసాదమును, ప్రదదుః= ఇచ్చిరి, ఆశిషః= ఆశీస్సులను, యుయుజుః= ఇచ్చిరి, వధూః= పెళ్లికూతురు, తాభ్యః= వారి కొరకు, దేవ్యై= దేవి కొరకు, నమః= నమస్కారమును, చక్రే= చేసెను, శేషాం చ= ప్రసాదమును కూడ, జగృహే= స్వీకరించెను.

ఆ బ్రాహ్మణ స్త్రీలు పెళ్లి కూతురికి ప్రసాదమునిచ్చి ఆశీర్వదించిరి. ఆమె వారికి, గౌరీదేవికి నమస్కరించి ప్రసాదమును స్వీకరించెను.

మునివ్రత మథ త్యక్త్వా నిశ్చక్రా మాంబికా గృహాత్ ।
ప్రగృహ్య పాణినా భృత్యాం రత్నముద్రోపశోభినా ॥ 50

అథ= తరువాత, మునివ్రతమ్= మౌనవ్రతమును, త్యక్త్వా= విడిచి పెట్టి, రత్నముద్రా-ఉపశోభినా= రత్నాంగుళీయకముతో శోభిల్లే, పాణినా= చేతితో, భృత్యామ్= పరిచారికను, ప్రగృహ్య= పట్టుకొని, అంబికాగృహాత్= గౌరి ఆలయమునుండి, నిశ్చక్రామ= బయటకు వచ్చెను.

తరువాత ఆమె మౌనవ్రతమును విడిచి రత్నాంగుళీయకముతో శోభిల్లే చేతితో పరిచారికను పట్టుకొని గౌరి ఆలయమునుండి బయటకు వచ్చెను.

తాం దేవమాయా మివ వీర మోహినీం
సుమధ్యమాం కుండలమండితాననామ్ ।
శ్యామాం నితంబార్పితరత్నమేఖలాం
వ్యంజత్స్తనీం కుంతలశంకితేక్షణామ్ ॥ 51

శుచిస్మితాం బింబఫలాధర ద్యుతి
శోణాయమాన ద్విజకుందకుడ్మలామ్ ।
పదా చలంతీం కలహంసగామినీం
శింజత్కలానూపురధామశోభినా।
విలోక్య వీరా ముముహు స్సమాగతా
యశస్వినా స్తత్కృత హృచ్ఛయార్దితాః ॥ 52

దేవమాయాం ఇవ= శ్రీహరి మాయ వలె, వీరమోహినీమ్= వీరులను కూడ మోహపెట్టునట్టియు, సుమధ్యమామ్= చక్కని నడుము కలిగినట్టియు, కుండలమండిత-ఆననామ్= కుండలములచే అలంకరించ బడిన మోము కలిగినట్టియు, నితంబ-అర్పితరత్నమేఖలామ్= కటిభాగము నందు కట్టబడిన మొలనూలు కలిగినట్టియు, వ్యంజక్-స్తనీమ్= యౌవనమును ప్రకటించే స్తనములు కలిగినట్టియు , కుంతలశంకిత ఈక్షణామ్= ముంగురుల కారణముగా చంచలమైన చూపులు కలిగినట్టియు, శుచిస్మితామ్= స్వచ్ఛమగు చిరునగవు కలిగి నట్టియు, బింబఫల-అధరద్యుతిశోణాయమానద్విజకుందకుడ్మలామ్= దొండపండు వంటి క్రింది పెదవియొక్క కాంతిచే ఎఱ్ఱనగుచున్న మల్లె మొగ్గలవంటి దంతములు కలిగినట్టియు, శింజత్-కలానూపురధామ-శోభినా= ధ్వని చేస్తూ ప్రకాశించే అందెల కాంతితో శోభిల్లే, పదా= పాదముతో, చలంతీమ్= నడుచుచున్నట్టియు, కలహంసగామినీమ్= రాజహంస వలె నడుచుచున్న, తామ్= ఆ, శ్యామామ్= సుందరిని, విలోక్య= చూచి,

సమాగతాఃⁿ వచ్చియున్న, యశస్వినఃⁿ కీర్తిమంతులగు, వీరాⁿ వీరులు, తత్-కృతహృచ్ఛయ- అర్దితాఃⁿ ఆమెచే కలిగించబడిన కామనచే పీడించబడినవారై, ముముహుఃⁿ మోహమును పొందిరి.

ఆ సుందరి శ్రీహరి మాయవలె వీరులను మోహపెట్టెను. చక్కని నడుము, కుండలములచే అలంకరించబడిన మోము, నడుమునందు కట్టబడిన రత్నాల మొలనూలు అనువాటితో ఆమె శోభిల్లెను. ఆమె స్తనములు యౌవనమును ప్రకటించుచుండ, చూపులు ముంగురుల కారణముగా చంచలములాయెను. స్వచ్ఛమగు చిరునగవు గల ఆమె క్రింది పెదవి దొండపండు వలె నుండెను. దాని కాంతిచే మల్లె మొగ్గలవంటి దంతములు ఎర్రనగుచుండెను. ధ్వనిస్తూ ప్రకాశించే అందెల కాంతితో శోభిల్లే పాదములతో ఆమె రాజహంస వలె నడచుచుండగా, అచటకు వచ్చియున్న కీర్తిమంతులగు వీరులు చూచిరి. ఆమెను చూడగానే కలిగిన కామనచే పీడించబడిన ఆ వీరులు మోహమును పొందిరి.

యాం వీక్ష్య తే నృపతయ స్తదుదారహాస
వ్రీడాఽవలోక హృతచేతస ఉజ్ఝితాస్త్రాఃⁿ ।
పేతుఃⁿ క్షితౌ గజరథాశ్వగతా విమూఢా
యాత్రాచ్ఛలేన హరయేఽర్పయతీం స్వశోభామ్ ॥53

యాత్రా ఛలేనⁱ= ఉత్సవయాత్ర అనే మిషతో, స్వశోభామ్ⁱ= తన సౌందర్యమును, హరయేⁱ= శ్రీకృష్ణ భగవానుని కొరకు, అర్పయతీమ్ⁱ= అర్పించుచున్న, యామ్ⁱ= ఏ రుక్మిణిని, వీక్ష్యⁱ= చూచి, తద్-ఉదారహాస వ్రీడా-అవలోక హృతచేతసఃⁱ= ఆమెయొక్క సుఖకరమైన నవ్వుచే సిగ్గుతో కూడిన చూపులచే దోచివేయబడిన మనస్సులు గలవారు, ఉజ్ఝిత-అస్త్రాఃⁱ= విడిచి పెట్టబడిన ఆయుధములు గలవారు, గజరథ-అశ్వగతాఃⁱ=

ఏనుగులు రథములు గుర్రములనధిష్ఠించినవారు అగు, తే= ఆ, నృపతయః= రాజులు, విమూఢాః= మోహమును పొందినవారై, క్షితౌ= నేలపై, పేతుః= పడిరి.

ఆమె ఉత్సవయాత్ర అనే మిషతో తన సౌందర్యమును శ్రీకృష్ణ భగవానుని కొరకు సమర్పించుచుండెను. రాజుల మనస్సులు ఆమెయొక్క సుఖకరమైన నవ్వుచే, సిగ్గుతో కూడిన చూపులచే దోచివేయబడినవి. ఏనుగులు, గుర్రములు, రథముల పైనున్న ఆ రాజులు ఆమెను చూచి మోహితులై ఆయుధములను విడిచి పెట్టి నేలపై పడిరి.

సైవం శనై శ్చలయతీ చలపద్మకోశౌ
ప్రాప్తిం తదా భగవతః ప్రసమీక్షమాణా ।
ఉత్సార్య వామకరజై రలకానపాంగైః
ప్రాప్తాన్ ప్రియైక్షత నృపాన్ దదృశేఽచ్యుతం సా ॥ 54

తదా= అప్పుడు, సా= ఆమె, ఏవమ్= ఈ విధముగా, చలపద్మకోశౌ= పద్మపు మొగ్గలవంటి కాళ్లను, శనైః= మెల్లగా, చలయతీ= కదిలించు-చున్నది, భగవతః= శ్రీకృష్ణ భగవానునియొక్క, ప్రాప్తిమ్= రాకను, ప్రసమీక్షమాణా= ఎదురు చూచుచున్నది, వామకరజైః= ఎడమ చేతి గోళ్లతో, అలకాన్= ముంగురులను, ఉత్సార్య= ప్రక్కకు తీసి, ప్రాప్తాన్= వచ్చియున్న, నృపాన్= రాజులను, ప్రియా= సిగ్గుతో, అపాంగైః= కడగంటి చూపులతో, ఐక్షత= చూచెను, సా= ఆమె, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, దదృశే= (చూచెను).

ఆమె ఈ విధముగా పద్మపు మొగ్గలవంటి కాళ్లతో మెల్లగా అడుగులు వేస్తూ శ్రీకృష్ణ భగవానుని రాకకై ఎదురు చూచుచుండెను. ఆమె ఎడమ చేతి గోళ్లతో ముంగురులను సవరిస్తూ సిగ్గుతో కడగంటి

చూపులతో, వచ్చి నేలగూలియున్న రాజులను చూచెను. అప్పుడామెకు శ్రీకృష్ణ భగవానుడు కనబడెను.

తాం రాజకన్యాం రథ మారురుక్షతీం
జహార కృష్ణో ద్విషతాం సమీక్షతామ్ ।
రథం సమారోప్య సుపర్ణలక్షణం
రాజన్యచక్రం పరిభూయ మాధవః ॥ 55

రథమ్= రథమును, ఆరురుక్షతీమ్= ఎక్క గోరుచున్న, తామ్= ఆ, రాజకన్యామ్= రాజపుత్రిని, ద్విషతామ్= శత్రువులు, సమీక్షతామ్= చూచుచుండగా, మాధవః= లక్ష్మీపతియగు, కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, రాజన్యచక్రమ్= రాజుల సముదాయమును, పరిభూయ= తిరస్కరించి, సుపర్ణలక్షణమ్= గరుడుడు జెండాపై గల, రథమ్= రథమును, సమారోప్య= ఎక్కించి, జహార= తీసుకొనిపోయెను.

ఆ రాజపుత్రి రథమునెక్కబోవుచుండగా లక్ష్మీపతియగు శ్రీకృష్ణ భగవానుడు గరుడుడు ధ్వజమునందు గల రథముపై ఆమెనెక్కించి తీసుకొని వెళ్లెను. ఆయన తనను చూచుచున్న శత్రువులను లెక్కచేయ లేదు. ఈ విధముగా ఆయన రాజుల మండలమును తిరస్కరించెను.

తతో యయౌ రామ పురోగమై శ్శనై స్సృగాల మధ్యాదివ భాగహృద్ధరిః॥56

తతః= అక్కడనుండి, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, రామపురోగమైః= బలరాముడు మొదలగువారితో గూడి, శనైః= మెల్లగా, సృగాలమధ్యాత్= నక్కల మధ్యనుండి, భాగహృత్= భాగమును తీసుకువెళ్లే, హరిః ఇవ= సింహము వలె, యయౌ= వెళ్లెను.

సింహము తన భాగమును తీసుకొని తోడేళ్ల మధ్యనుండి వెళ్లినట్లుగా, శ్రీకృష్ణభగవానుడు బలరాముడు మొదలగువారితో గూడి అక్కడనుండి తాపీగా వెళ్లెను.

తం మానిన స్స్వాభిభవం యశఃక్షయం పరే జరాసంధవశాన సేహిరే।
అహో ధిగస్మాన్యశ ఆత్త ధన్వనాం గోపైర్హృతం కేసరిణాం మృగైరివ॥ 57

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే త్రిపంచాశత్తమోధ్యాయః

మానినః= అహంకారులైన, జరాసంధవశాః= జరాసంధుని చెప్పుచేతలలోనుండే, పరే= శత్రువులను, తమ్= ఆ, స్వ–అభిభవమ్= తమ పరాభవమును, యశఃక్షయమ్= కీర్తి క్షయమగుటను, న సేహిరే= సహించలేదు, అహో= అయ్యో!, అస్మాన్= మనలను గురించి, ధిక్= నింద యగుగాక!, ఆత్మధన్వనామ్= ధనుర్ధారులమగు మన, యశః= కీర్తి, గోపైఃr= గోపాలకులచే, కేసరిణామ్= సింహముల (కీర్తి), మృగైఃr ఇవ= లేళ్లచే వలె, హృతమ్= అపహరించబడినది.

జరాసంధుని చెప్పుచేతలలో ఉంటూ అహంకరించిన శత్రువులకు ఆ రుక్మిణీహరణము పెద్ద పరాభవమయ్యెను. వారికి ఆ అపకీర్తి సహింపరానిదాయెను. వారు ఇట్లు తలపోసిరి. అయ్యో! మనకు నింద యగుగాక! ధనుర్ధారులమగు మన కీర్తిని గోపాలకులు, సింహముల కీర్తిని లేళ్లు వలె, అపహరించిరి.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
శ్రీకృష్ణుడు రుక్మిణిని కొనిపోవుటను వర్ణించే
ఏబది మూడవ అధ్యాయము ముగిసినది (53).

* * *

అథ చతుఃపంచాశత్తమోఽధ్యాయః

శిశుపాలాదులను ఓడించి శ్రీకృష్ణుడు రుక్మిణిని పరిణయమాడుట

శ్రీశుక ఉవాచ ।

ఇతి సర్వే సుసంరబ్ధా వాహా నారుహ్య దంశితాః ।
స్వైస్స్వై ర్బలైః పరిక్రాంతా అన్వీయు ర్ధృతకార్ముకాః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, సుసంరబ్ధాః= చాల కోపము గలవారు, దంశితాః= కవచధారులు, వాహాన్= వాహనములను, ఆరుహ్య= ఎక్కి, ధృతకార్ముకాః= ధరించబడిన ధనుస్సులు గలవారై, స్వైః స్వైః= తమ తమ, బలైః= సైన్యములతో, పరిక్రాంతాః= చుట్టువారబడినవారై, అన్వీయుః= వెనుక తరిమిరి.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను... ఈ విధముగా ఆ రాజులకు చాల కోపము వచ్చెను. వారు కవచములను ధరించి, ధనుస్సులను చేతబట్టి, వాహనములనెక్కి, తమ తమ సైన్యములు చుట్టువారి రాగా, శ్రీకృష్ణుని వెనుకనుండి తరిమిరి.

తానాపతత ఆలోక్య యాదవానీక యూథపాః ।
తస్థు స్తత్సంముఖా రాజన్ విస్ఫూర్జ్య స్వధనూంషి తే ॥ 2

రాజన్= ఓ రాజా!, యాదవ-అనీకయూథపాః= యాదవ సైన్యముల అధ్యక్షులు, ఆపతతః= మీదకు వచ్చుచున్న, తాన్= వారిని, ఆలోక్య= చూచి, తే= వారు, స్వధనూంషి= తమ ధనుస్సులను, విస్ఫూర్జ్య= టంకారము చేసి, తత్-సంముఖాః= వారిని ఎదుర్కొనువారై, తస్థుః= నిలిచిరి.

ఓ పరీక్షిన్మహారాజా! వారు తమ మీదకు వచ్చుటను ఆ యాదవ సైన్యముల అధ్యక్షులు చూచి తమ ధనుస్సులను టంకారము చేసి నిలిచి వారిని ఎదుర్కొనిరి.

అశ్వపృష్ఠే గజస్కంధే రథోపస్థే చ కోవిదాః ।
ముముచు శ్శరవర్షాణి మేఘా అద్రిష్వపో యథా ॥ 3

కోవిదాః= యుద్ధనిపుణులగు రాజులు, అశ్వపృష్ఠే= గుర్రముల పైనున్నవారిపై, గజపృష్ఠే= ఏనుగులపై నున్నవారిపై, రథ-ఉపస్థే చ= రథము మధ్యయందు కూడ, శరవర్షాణి= బాణముల వానలను, మేఘాః = మేఘములు, అద్రిషు= పర్వతములపై, అపః యథా= జలములను వలె, ముముచుః= విడిచిపెట్టిరి.

యుద్ధనిపుణులగు ఆ రాజులు గుర్రములపై, ఏనుగులపై, రథములలో ఉన్న యాదవులపై బాణముల వర్షములను, మేఘములు కొండలపై జలములను వలె, కురిపించిరి.

పత్యు ర్బలం శరసారై శ్ఛన్నం వీక్ష్య సుమధ్యమా ।
సవ్రీడ మైక్ష త్తద్వక్త్రం భయవిహ్వలలోచనా ॥ 4

సుమధ్యమా= చక్కని నడుము గల రుక్మిణి, శర-ఆసారైః= బాణముల వానలచే, ఛన్నమ్= కప్పివేయబడిన, పత్యుః= భర్తయగు శ్రీకృష్ణుని, బలమ్= సైన్యమును, వీక్ష్య= చూచి, భయవిహ్వలలోచనా= భయముతో వ్యాకులమైన కన్నులు గలదియై, తద్-వక్త్రమ్= ఆయన ముఖమును, సవ్రీడమ్= సిగ్గుతో కూడుకొనునట్లుగా, ఐక్షత్= చూచెను.

భర్తయగు శ్రీకృష్ణుని సైన్యము బాణముల ధారలతో కప్పి వేయబడుటను చూచి రుక్మిణి కన్నులు భయముతో వ్యాకులమయ్యెను. ఆమె సిగ్గుపడుతూ ఆయన ముఖమును చూచెను.

ప్రహస్య భగవానాహ మా స్మ భై ర్వామలోచనే ।
వినంక్ష్య త్యధునై వైతత్తావకై శ్శాత్రవం బలమ్ ॥ 5

ప్రహస్య= నవ్వి, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, ఆహ= పలికెను, వామలోచనే= అందమైన కన్నుల దానా!, మా స్మ భైఃీ= భయపడకుము, అధునా ఏవ= ఇప్పుడే, ఏతత్= ఈ, శాత్రవమ్= శత్రువులకు చెందిన, బలమ్= సైన్యము, తావకైఃీ= నీ సైనికులచే, వినంక్ష్యతి= నశించగలదు.

శ్రీకృష్ణభగవానుడు నవ్వి యిట్లనెను - ఓ అందమైన కన్నులదానా! భయపడకుము. ఇప్పుడే నీ వారలు (మేము) ఈ శత్రుసైన్యమును మట్టుబెట్టగలరు.

తేషాం తద్విక్రమం వీరా గద సంకర్షణాదయః ।
అమృష్యమాణా నారాచై ర్జఘ్నుర్హయ గజాన్ రథాన్ ॥ 6

వీరాఃీ= వీరులగు, గదసంకర్షణ-ఆదయఃీ= గదుడు బలరాముడు మొదలగువారు, తేషామ్= వారియొక్క, తద్-విక్రమమ్= ఆ పరాక్రమమును, అమృష్యమాణాఃీ= సహించనివారై, నారాచైఃీ= వాడి బాణములతో, హయగజాన్= గుర్రములను, ఏనుగులను, రథాన్= రథములను, జఘ్నుఃీ= కొట్టిరి.

గదుడు, బలరాముడు, సాత్యకి మొదలగు వీరులు జరాసంధాదుల ఆ పరాక్రమమును సహించరైరి. వారు గుర్రములు, ఏనుగులు, రథములపై యుద్ధము చేయువారిని వాడి బాణములతో కొట్టిరి.

పేతు శ్శిరాంసి రథినా మశ్వినాం గజినాం భువి ।
సకుండలకిరీటాని సోష్ణీషాణి చ కోటిశః ॥ 7

రథినామ్= రథికులయొక్క, అశ్వినామ్= గుర్రపు రౌతులయొక్క, గజినామ్= ఏనుగుపై యుద్ధము చేయువారి యొక్క, సకుండలకిరీటాని=

కుండలములతో కిరీటములతో కూడిన, స–ఉష్ణీషాణి= పాగలతో కూడిన, శిరాంసి= తలలు, కోటిశః= కోట్లాది, భువి= నేలపై, పేతుః చ= పడినవి.

రథికుల, గుర్రపు రౌతుల, ఏనుగులపై యుద్ధము చేయువారల తలలు కోట్లాదిగా నేలపై కూలినవి. ఆ తలలకు కుండలములు, కిరీటములు, తలపాగలు ఉండెను.

హస్తా స్సాసిగదేష్వాసాः కరభా ఊరవోంఘ్రయః ।
అశ్వాశ్వతర నాగోష్ట్ర ఖరమర్త్యశిరాంసి చ ॥ 8

స–అసిగదా–ఇషు–ఆసాः= కత్తులు గదలు ధనుస్సులతో కూడిన, హస్తాः= చేతులు, కరభాः= ముంజేతులు, ఊరవః= తొడలు, అంఘ్రయః = కాళ్లు, అశ్వ–అశ్వతర–నాగ–ఉష్ట్ర–ఖర–మర్త్య–శిరాంసి–చ= గుర్రములు కంచర గాడదలు ఏనుగులు ఒంటెలు గాడిదలు మనుష్యుల తలలు కూడ (పడినవి).

కత్తులు, గదలు, ధనుస్సులతో కూడిన చేతులు, ముంజేతులు, తొడలు, కాళ్లు నేలపై పడినవి. గుర్రములు, కంచర గాడిదలు, గాడిదలు, ఏనుగులు, ఒంటెలు, మనుష్యులు అనువాటి తలలు కూడ నేల గూలినవి.

హన్యమానబలానీకా వృష్ణి భిర్జయకాంక్షిభిः ।
రాజానో విముఖా జగ్ముర్జరాసంధపురస్సరాः ॥ 9

జయకాంక్షిభిः= జయము కోరే, వృష్ణిభిः= యాదవులచే, హన్య–మానబల–అనీకాः= సంహరించబడుచున్న సైన్యముల సమూహములు గల, జరాసంధపురస్సరాः= జరాసంధుడు మొదలుగా గల, రాజానః= రాజులు, విముఖాः= వెనుదిరిగినవారై, జగ్ముః= వెళ్లిరి.

జయమును కోరే యాదువులు జరాసంధుడు, శిశుపాలుడు మొదలుగా గల రాజుల సైన్యసమూహములను సంహరింప జొచ్చిరి. అపుడా రాజులు వెనుదిరిగి వెళ్లిపోయిరి.

శిశుపాలం సమభ్యేత్య హృతదార మివాతురమ్ ।
నష్టత్విషం గతోత్సాహం శుష్కద్వదనమబ్రువన్ ॥ 10

హృతదారం ఇవ= అపహరించబడిన భార్య గలవాడు వలె, ఆతురమ్= దుఃఖితుడైనట్టియు, నష్టత్విషమ్= నశించిన కాంతి కలిగినట్టియు, గత-ఉత్సాహమ్= తొలగిన ఉత్సాహము కలిగినట్టియు, శుష్యద్-వదనమ్= పాలిపోయిన ముఖము గల, శిశుపాలమ్= శిశుపాలుని, సమభ్యేత్య= సమీపించి, అబ్రువన్= పలికిరి.

శిశుపాలుడు భార్యను పోగొట్టుకున్నవాడు వలె దుఃఖితుడై యుండెను. ఆతనిలో కాంతి గాని, ఉత్సాహము గాని లేవు. ముఖములో రక్తము లేకుండెను. ఆ రాజులు ఆతని వద్దకు వచ్చి ఇట్లు పలికిరి.

భో భోః పురుషశార్దూల దౌర్మనస్య మిదం త్యజ ।
న ప్రియప్రియయో రాజన్నిష్ఠా దేహిషు దృశ్యతే ॥ 11

భోః భోః= ఓయీ!, పురుషశార్దూల= పురుషశ్రేష్ఠా!, ఇదమ్= ఈ, దౌర్మనస్యమ్= మనస్సు చెడుటను, త్యజ= విడిచిపెట్టుము, రాజన్= ఓ రాజా!, దేహిషు= ప్రాణులయందు, ప్రియ-అప్రియయోః= ఇష్టానిష్టములయొక్క, నిష్ఠా= స్థిరత్వము, న దృశ్యతే= కానరాదు.

ఓయీ! రాజా! నీవు మానవులలో శ్రేష్ఠుడవు. ఈ నిరుత్సాహమును విడిచిపెట్టుము. ప్రాణుల జీవితములలో సుఖము గాని, దుఃఖము గాని స్థిరముగా ఉండవని అందరికి అనుభవమే.

యథా దారుమయీ యోషి న్నృత్యతే కుహకేచ్ఛయా ।
ఏవ మీశ్వరతంత్రోఽయమీహతే సుఖదుఃఖయోః ॥ 12

యథా= ఏ విధముగానైతే, దారుమయీ= చెక్కతో చేసిన, యోషిత్= స్త్రీ, కుహక-ఇచ్ఛయా= బొమ్మలాడించువాని ఇచ్ఛచే, నృత్యతే=

నాట్యమాడునో, ఏవమ్= ఇదే విధముగా, ఈశ్వరతంత్రః= ఈశ్వరునకు వశవర్తియై ఉండే, అయమ్= ఈ జీవుడు, సుఖదుఃఖయోఃr= సుఖ దుఃఖములయందు, ఈహతే= చేష్టను చేయును.

చెక్కతో చేసిన యువతి బొమ్మ దానినాడించేవాని ఇచ్ఛకు తగ్గట్లుగా నాట్యమాడును. అదే విధముగా ఈశ్వరునకు వశవర్తియైన జీవుడు కూడా సుఖదుఃఖముల విషయములో (అస్వతంత్రుడై) ప్రవర్తిల్లును.

శౌరే స్సప్తదశాహం వై సంయుగాని పరాజితః ।
త్రయోవింశతిభి స్సైన్యై ర్జిగ్య ఏకమహం పరమ్ ॥ 13

అహం వై= నేనైతే, శౌరేః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుని వలన, త్రయోవింశతిభిఃr= ఇరవై మూడు, సైన్యైఃr= సేనలతో, సప్తదశ= పదిహేడు, సంయుగాని= యుద్ధములను, పరాజితఃr= జయించబడినవాడను, పరమ్= కాని, అహమ్= నేను, ఏకమ్= ఒకదానిని, జిగ్యే= జయించితిని.

నేనైతే ఇరవై మూడు అక్షౌహిణీల సైన్యముతో శూరవంశీయుడగు శ్రీకృష్ణునిపై పదిహేడు పర్యాయములు దండెత్తి ఓడిపోతిని. కాని, నేను ఒక్క యుద్ధమును జయించితిని (అని జరాసంధుడు ఓదార్చెను).

తథాఽపహం న శోచామి న ప్రహృష్యామి కర్హిచిత్ ।
కాలే దైవయుక్తేన జానన్ విద్రావితం జగత్ ॥ 14

తథా అపి= అయినప్పటికీ, అహమ్= నేను, కర్హిచిత్= ఏ కాలమునందైనా, న శోచామి= దుఃఖించను, న ప్రహృష్యామి= హర్షించను, దైవయుక్తేన= ప్రారబ్ధముచే ప్రవర్తిల్లజేయబడే, కాలేన= కాలముచే, విద్రావితమ్= క్షోభిల్లజేయబడే, జగత్= జగత్తును, జానన్= తెలియువాడను.

అయినప్పటికీ, నేనే కాలమునందైననూ దుఃఖమును గాని, హర్షమును గాని పొందను. ఎందుకంటే, ప్రారబ్ధముచే ప్రవర్తిల్ల జేయబడే కాలము జగత్తును క్షోభపెట్టుచుండునని నాకు తెలియును.

అధునాఽపి వయం సర్వే వీరయూథపయూథపాః ।
పరాజితాః ఫల్గుతంత్రై ర్యదుభిః కృష్ణపాలితైః ॥ 15

అధునా= ఈనాడు, వీరయూథపయూథపాః అపి= వీరులము సేనానాయకులకు నాయకులము అయినా, వయమ్= మనము, సర్వే= అందరము, ఫల్గుతంత్రైః= తక్కువ సైన్యము కలిగినట్టియు, కృష్ణపాలితైః= శ్రీకృష్ణునిచే రక్షించబడే, యదుభిః= యాదవులచే, పరాజితాః= ఓడించబడితిమి.

యాదవుల సైన్యము చిన్నదే. కాని వారిని శ్రీకృష్ణుడు రక్షిస్తున్నాడు. మనమందరము వీరులము, సేనానాయకులకు కూడ నాయకులము. అయినప్పటికీ, వారు మనలను ఓడించినారు.

రిపవో జిగ్యు రధునా కాల ఆత్మానుసారిణి ।
తదా వయం విజేష్యామో యదా కాలః ప్రదక్షిణః ॥ 16

కాలే= కాలము, ఆత్మానుసారిణి= తమకు అనుకూలించగా, అధునా= ఈనాడు, రిపవః= శత్రువులు, జిగ్యుః= జయించిరి, యదా= ఎప్పుడైతే, కాలః= కాలము, ప్రదక్షిణః= అనుకూలమో, తదా= అప్పుడు, వయమ్= మనము, విజేష్యామః= జయించగలము.

కాలము తమకు అనుకూలించుటచే ఈనాడు శత్రువులు జయించినారు. కాలము అనకూలమైనప్పుడు మనము జయించగలము.

ఏవం ప్రబోధితో మిత్రై శ్చైద్యోఽగా త్సానుగః పురమ్ ।
హతశేషాః పునస్తేఽపి యయుస్స్వం స్వం పురం నృపాః ॥17

ఏవమ్= ఈ విధముగా, మిత్రైః= మిత్రులచే, ప్రబోధితః= నచ్చజెప్పబడిన, చైద్యః= చేదిదేశ రాజకుమారుడగు శిశుపాలుడు, స-అనుగః= అనుచరులతో కూడినవాడై, పురమ్= నగరమును గురించి, అగాత్= వెళ్లెను, హతశేషాః= సంహరించబడగా మిగిలిన, తే= ఆ, నృపాః అపి= రాజులు కూడ, స్వం స్వమ్= తమ తమ, పురమ్= నగరమును గురించి, యయుః= వెళ్లిరి.

మిత్రులీ విధముగా నచ్చజెప్పగా, చేదిదేశ రాజకుమారుడగు శిశుపాలుడు అనుచరులతో కూడి తన నగరమునకు వెళ్లెను. సంహరించ బడగా మిగిలిన ఆ రాజులు కూడ తమ తమ నగరములకు వెళ్లిరి.

రుక్మీ తు రాక్షసోద్వాహం కృష్ణద్విడసహన్ స్వసుః ।
పృష్ఠతోఽన్వగమ త్కృష్ణమ క్షౌహిణ్యా వృతో బలీ ॥ 18

కృష్ణద్విట్= శ్రీకృష్ణుని ద్వేషించే, బలీ= బలశాలియగు, రుక్మీ తు= రుక్మియైతే, స్వసుః= చెల్లెలియొక్క, రాక్షస-ఉద్వాహమ్= రాక్షస వివాహమును, అసహన్= సహించనివాడై, అక్షౌహిణ్యా= అక్షౌహిణీ సేనతో, వృతః= చుట్టువారబడినవాడై, కృష్ణమ్= శ్రీకృష్ణుని, పృష్ఠతః= వెనుకనుండి, అన్వగమత్= తరిమెను.

బలశాలియగు రుక్మికైతే శ్రీకృష్ణునియందు ద్వేషము. చెల్లెలిని శ్రీకృష్ణుడపహరించి వివాహమాడుటనాతడు సహించలేకపోయెను. ఆతడు అక్షౌహిణీ సైన్యము వెంటరాగా ఆయనను వెనుకనుండి తరిమెను.

రుక్మమర్షీ సుసంరబ్ధ శ్శ్రుణ్వతాం సర్వభూభుజామ్ ।
ప్రతిజజ్ఞే మహాబాహు ర్దంశిత స్సశరాసనః ॥ 19

అమర్షీ= సహనము లేనివాడు, సుసంరబ్ధః= అధికమగు కోపము గలవాడు, మహాబాహుః= బలమగు భుజములు గలవాడు అగు, రుక్మీ= రుక్మి, దంశితః= కవచధారియై, సశర-ఆసనః= ధనుస్సుతో కూడినవాడై,

సర్వభూభుజామ్= సకలరాజులు, శృణ్వతామ్= వినుచుండగా, ప్రతిజజ్ఞే= ప్రతిజ్ఞ చేసెను.

రుక్మి గొప్ప బలశాలియే కాని, ఆతనికి సహనము లేదు, కోపము ఎక్కువ. ఆతడు కవచమును వేసుకొని, ధనుస్సును చేతబట్టి, రాజులందరు వినుచుండగా ప్రతిజ్ఞ చేసెను.

అహత్వా సమరే కృష్ణ మప్రత్యూహ్య చ రుక్మిణీమ్ ।
కుండినం న ప్రవేక్ష్యామి సత్య మేత ద్ధ్రువీమి వః ॥ 20

సమరే= యుద్ధమునందు, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అహత్వా= సంహరించకుండా, రుక్మిణీం చ= రుక్మిణిని కూడ, అప్రత్యూహ్య= వెనుకకు తీసుకురాకుండా, కుండినమ్= కుండిన నగరమును, న ప్రవేక్ష్యామి= ప్రవేశించను, ఏతత్= ఈ, సత్యమ్= సత్యమును, వః= మీకు, బ్రవీమి= చెప్పుచున్నాను.

యుద్ధములో శ్రీకృష్ణుని సంహరించి రుక్మిణిని వెనుకకు తీసుకువచ్చెదను. అట్లు చేయలేని పక్షములో నేను కుండిన నగరమును ప్రవేశించను. నేను మీకీ మాటను యథార్థముగా చెప్పుచున్నాను.

ఇత్యుక్త్వా రథమారుహ్య సారథిం ప్రాహ సత్వరః ।
చోదయాశ్వాన్ యతః కృష్ణస్తస్య మే సంయుగం భవేత్ ॥21

ఇతి= అని, ఉక్త్వా= పలికి, సత్వరః= వేగము గల రుక్మి, రథమ్= రథమును, ఆరుహ్య= ఎక్కి, సారథిమ్= సారథిని ఉద్దేశించి, ప్రాహ= పలికెను. యతః= ఎక్కడనైతే, కృష్ణః= శ్రీకృష్ణుడు గలడో అక్కడికి, అశ్వాన్= గుర్రములను, చోదయ= తోలుము, తస్య= వానికి, మే= నాకు, సంయుగమ్= యుద్ధము, భవేత్= జరుగును.

రుక్మి ఇట్లు పలికి వేగముగా రథమునెక్కి సారథితో నిట్లనెను. కృష్ణుడున్నచోటికి గుర్రములను తోలుము. నాకు, ఆయనకు యుద్ధము జరుగనున్నది.

అద్యాహం నిశితై ర్బాణై ర్గోపాలస్య సుదుర్మతేః ।
నేష్యే వీర్యమదం యేన స్వసా మే ప్రసభం హృతా ॥ 22

యేన= ఎవరిచేత, మే స్వసా= నా చెల్లెలు, ప్రసభం= బలాత్కారంగా, హృతా= అపహరించబడినదో, ఆ, సుదుర్మతేః= మిక్కిలి దుర్బుద్ధి కలిగిన, గోపాలస్య= గోపాలునియొక్క, వీర్యమదం= పరాక్రమంవలన కలిగిన గర్వాన్ని, అద్య= నేడు, అహం= నేను, నిశితైః= పదునైన, బాణైః= బాణాలతో, నేష్యే= తీసివేస్తాను.

దుర్మతి అయిన ఆ గోపాలుడు నా చెల్లెలిన బలవంతంగా అపహరించాడు. ఈరోజు అతడి వీర్యగర్వాన్ని నా పదునైన బాణాలతో తొలగిస్తాను అని రుక్మి పలికెను.

వికత్థమానః కుమతి రీశ్వరస్యాప్రమాణవిత్ ।
రథేనైకేన గోవిందం తిష్ఠ తిష్ఠేత్యథాహ్వయత్ ॥ 23

అథ= తరువాత, ఈశ్వరస్య= సర్వసమర్థుడగు శ్రీకృష్ణునియొక్క, అప్రమాణవిత్= ప్రభావమునెరుగని వాడు, వికత్థమానః= గొప్పలు చెప్పుకునువాడు, కుమతిః= దుర్బుద్ధి అగు రుక్మి, ఏకేన= ఒక్క, రథేన= రథముతో, గోవిందమ్= గోవిందుని, తిష్ఠ= నిలుము, తిష్ఠ= నిలుము, ఇతి= అని, ఆహ్వయత్= యుద్ధమునకు కాలు దువ్వెను.

సర్వసమర్థుడగు శ్రీకృష్ణుని ప్రభావము తెలియని దుర్బుద్ధియగు రుక్మి గొప్పలు చెప్పుకొనెను. ఆతడా తరువాత ఒకే రథముతో శ్రీకృష్ణుని వెంబడించి, నిలు నిలుమంటూ యుద్ధమునకు కాలు దువ్వెను.

ధను ర్వికృష్య సుదృఢం జఘ్నే కృష్ణం త్రిభి శ్శరైః ।
ఆహ చాత్ర క్షణం తిష్ఠ యదూనాం కులపాంసన ॥ 24

ధనుఃస= ధనుస్సును, సుదృఢమ్= చాల గట్టిగా, వికృష్య= లాగి, కృష్ణమ్= శ్రీకృష్ణుని, త్రిభిఃస= మూడు, శరైఃస= బాణములతో, జఘ్నే= కొట్టెను, ఆహ చ= పలికెను కూడా, అత్ర= ఇచట, క్షణమ్= క్షణకాలము, తిష్ఠ= నిలుము, యదూనామ్= యాదువుల, కులపాంసన= వంశమునకు కళంకమైనవాడా!

ఆతడు ధనుస్సును గట్టిగా లాగి శ్రీకృష్ణుని మూడు బాణములతో కొట్టి, ఇట్లు పలికెను. ఓయీ! నీవు యాదవంశమునకు కళంకమవు. ఇచట క్షణకాలము నిలుము.

కుత్ర యాసి స్వసారం మే ముషిత్వా ద్వాంక్షవద్ధవిః ।
హరిష్యేఽద్య మదం మంద మాయినః కూటయోధినః ॥25

హవిఃస= హోమద్రవ్యమును, ధ్వాంక్షవత్= కాకి వలె, మే= నా, స్వసారమ్= చెల్లెలిని, ముషిత్వా= అపహరించి, కుత్ర= ఎచటకు, యాసి= వెళ్లెదవు?, మంద= ఓ మందుడా!, మాయినఃస= మాయావియైనట్టియు, కూటయోధినఃస= కపటయుద్ధమును చేసే నీ, మదమ్= గర్వమును, అద్య= ఈనాడు, హరిష్యే= తొలగించెదను.

ఓరీ మందుడా! హోమద్రవ్యమును కాకి వలె నా చెల్లెలిని అపహరించి ఎచటకు వెళ్లెదవు? నీవు మాయావివి. కపటయుద్ధము చేసెదవు. నేనీనాడు నీ గర్వమునడంచెదను.

యావన్న మే హతో బాణై శ్శయీథా ముంచ దారికామ్ ।
స్మయన్ కృష్ణో ధను శ్ఛిత్వా షడ్భి ర్విధ్యాధ రుక్మిణమ్ ॥ 26

యావత్= ఎంతలో, మే= నా, బాణైఃr= బాణములచే, హతఃr= కొట్టబడినవాడవై, న శయీథాఃr= నేల గూలవో అంతలో, దారికామ్= కన్యను, ముంచ= విడువుము, కృష్ణఃr= శ్రీకృష్ణుడు, స్మయన్= నవ్వుచున్న వాడై, షడ్భిఃr= ఆరు బాణములతో, ధనుఃr= ధనుస్సును, ఛిత్వా= విరుగకొట్టి, రుక్మిణమ్= రుక్మిని, వివ్యాధ= కొట్టి పీడించెను.

ఎంతలో నా బాణములచే కొట్టబడి నీవు నేల గూలెదవో, ఆ లోపులోనే కన్యను విడువుము, అని (రుక్మి పలికెను). శ్రీకృష్ణుడు నవ్వుతూ ఆరు బాణములతో వాని ధనుస్సును విరుగకొట్టి వానిని కూడ కొట్టి పీడింతును.

అష్టభి శ్చతురో వాహాన్ ద్వాభ్యాం సూతం ధ్వజం త్రిభిః ।
స చాన్య ద్ధనురాదాయ కృష్ణం వివ్యాధ పంచభిః ॥ 27

అష్టభిఃr= ఎనిమిదింటితో, చతురఃr= నాలుగు, వాహాన్= గుర్రములను, ద్వాభ్యామ్= రెండింటితో, సూతమ్= సారథిని, త్రిభిఃr= మూడింటితో, ధ్వజమ్= జెండాను (కొట్టెను), సఃr చ= ఆ రుక్మి కూడ, అన్యత్= మరియొక, ధనుఃr= ధనుస్సును, ఆదాయ= తీసుకొని, కృష్ణమ్= శ్రీకృష్ణుని, పంచభిఃr= అయిదింటితో, వివ్యాధ= కొట్టెను.

శ్రీకృష్ణుడు ఎనిమిది బాణములతో నాలుగు గుర్రములను, రెండింటితో సారథిని, మూడింటితో జెండాలను కొట్టగా, ఆ రుక్మి కూడ ఇంకో ధనుస్సును తీసుకొని ఆయనను ఐదు బాణములతో కొట్టెను.

తై స్తాడిత శ్శరౌఘైస్తు చిచ్ఛేద ధనురచ్యుతః ।
పునరన్యదుపాదత్త తదప్యచ్ఛినదవ్యయః ॥ 28

తైఃr= ఆ, శర-ఓఘైఃr= బాణముల సమూహములచే, తాడితఃr= కొట్టబడిన, అచ్యుతఃr తు= శ్రీకృష్ణ భగవానుడైతే, ధనుఃr= ధనుస్సును, చిచ్ఛేద= విరుగకొట్టెను, పునఃr= మరల, అన్యత్= మరియొకదానిని,

ఉపాదత్త= తీసుకొనెను, తత్ అపి= దానిని కూడ, అవ్యయః= వినాశము లేని భగవానుడు, అచ్ఛినత్= విరుగ కొట్టెను.

ఆ బాణముల గుంపులచే కొట్టబడిన శ్రీకృష్ణ భగవానుడైతే వాని ధనుస్సును (బాణముతో) విరుగకొట్టెను. ఆతడు మరల ఇంకో ధనుస్సును తీసుకోగా, వినాశము లేని భగవానుడు దానిని కూడ విరుగకొట్టెను.

పరిఘం పట్టిశం శూలం చర్మాసీ శక్తితోమరౌ ।
యద్యదాయుధమాదత్త తత్సర్వం సోఽచ్ఛినద్ధరిః ॥ 29

పరిఘమ్= ఇనుప గుదియను, పట్టిశమ్= అడ్డ కత్తిని, శూలమ్= శూలమును, చర్మ-అసీ= డాలును, కత్తిని, శక్తితోమరౌ= శక్తి అనే ఆయుధమును చిల్లకోలను, యత్ యత్= ఏయే, ఆయుధమ్= ఆయుధమును, ఆదత్త= తీసుకొనెనో, తత్= దానిని, సర్వమ్= సర్వమును, సః= ఆ, హరిః= శ్రీకృష్ణభగవానుడు, అచ్ఛినత్= విరుగకొట్టెను.

ఇనుప గుదియ, అడ్డ కత్తి, శూలము, డాలు, కత్తి, శక్తి, చిల్లకోల మొదలైన ఏయే ఆయుధములను రుక్మి తీసుకొనెనో, వాటినన్నింటినీ ఆ శ్రీకృష్ణభగవానుడు (బాణములతో) విరుగకొట్టెను.

తతో రథాదవప్లుత్య ఖడ్గపాణిర్జిఘాంసయా ।
కృష్ణ మభ్యద్రవ త్క్రుద్ధః పతంగ ఇవ పావకమ్ ॥ 30

తతః= తరువాత, ఖడ్గపాణిః= కిత్త చేతియందు గలవాడు, క్రుద్ధః= కోపించినవాడు అగు రుక్మి, జిఘాంసయా= సంహరించే కోరికతో, రథాత్= రథమునుండి, అవప్లుత్య= క్రిందకు దుమికి, పతంగః= మిడత, పావకం ఇవ= అగ్నినివలె, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అభ్యద్రవత్= అభిముఖముగా పరుగెత్తెను.

తరువాత రుక్మి కోపించి చేతిలో కత్తితో రథమునుండి క్రిందకు దుమికి, శ్రీకృష్ణుని సంహరించే కోరికతో, మిడత అగ్నిలోకి వలె, ఆయనకు అభిముఖముగా పరుగెత్తెను.

తస్య చాపతతః ఖడ్గం తిలశ శ్చర్మ చేషుభిః ।
ఛిత్త్వాఽసిమాదదే తిగ్మం రుక్మిణం హంతుముద్యతః ॥ 31

ఆపతతః= మీద పడుచున్న, తస్య= వాని, ఖడ్గమ్= కత్తిని, చర్మ చ= డాలును కూడ, ఇషుభిః= బాణములతో, తిలశః= నుగ్గు నుగ్గుగా, ఛిత్త్వా= విరుగకొట్టి, రుక్మిణమ్= రుక్మిని, హంతుమ్= సంహరించుటకు, ఉద్యతః= సంసిద్ధుడై, తిగ్మమ్= వాడియైన, అసిమ్= కత్తిని, ఆదదే= తీసుకొనెను.

శ్రీకృష్ణుడు మీదకు దుముకుచున్న ఆ రుక్మియొక్క కత్తిని, డాలును, బాణములతో నుగ్గు నుగ్గుగా విరుగకొట్టెను. ఆయన వానిని సంహరించుటకు సంసిద్ధుడై పదునైన కత్తిని చేతిలోనికి తీసుకొనెను.

దృష్ట్వా భ్రాతృవధోద్యోగం రుక్మిణీ భయవిహ్వలా ।
పతిత్వా పాదయో ర్భర్తు రువాచ కరుణం సతీ ॥ 32

భ్రాతృవధ-ఉద్యోగమ్= అన్నను సంహరించే ప్రయత్నమును, దృష్ట్వా= చూచి, భయవిహ్వలా= భయముతో కంగారు పడిన, సతీ= పతివ్రతయగు, రుక్మిణీ= రుక్మిణి, భర్తుః= భర్తయొక్క, పాదయోః= పాదములపై, పతిత్వా= పడి, కరుణమ్= దీనముగా, ఉవాచ= పలికెను.

భర్త తన అన్నను సంహరించుటకు సిద్ధపడుటను చూచి పతివ్రత యగు రుక్మిణి భయముతో కంగారు పడెను. ఆమె భర్తపాదములపై పడి దీనముగా ఇట్లు పలికెను.

యోగేశ్వరాప్రమేయాత్మన్ దేవదేవ జగత్పతే ।
హంతుం నార్హసి కల్యాణ భ్రాతరం మే మహాభుజ ॥ 33

యోగ-ఈశ్వర= యోగులకు ప్రభువా!, అప్రమేయ-ఆత్మన్= తెలియ శక్యము కాని స్వరూపము గలవాడా!, దేవదేవ= దేవతలకు

ప్రభువా!, జగత్-పతే= జగత్తును కాపాడువాడా!, కల్యాణ= మంగళ-స్వరూపా! మహాభుజ= గొప్ప బాహుబలము గలవాడా!, మే= నా, భ్రాతరమ్= అన్నను, హంతుమ్= సంహరించుటకు, న అర్హసి= తగవు.

ఓ మంగళస్వరూపా! యోగులకు ప్రభుడవగు నీ స్వరూపమును తెలియుట అసంభవము. దేవతలకు ప్రభుడవగు నీవు జగత్తును పాలించెదవు. నీ భుజబలము గొప్పది. నీవు నా అన్నను సంహరించుట తగదు.

శ్రీశుక ఉవాచ ।

తయా పరిత్రాస వికంపితాంగయా శుచాఽవశుష్య న్ముఖరుద్ధకంఠయా ।
కాతర్య విస్రంసిత హేమమాలయా గృహీతపాదః కరుణో న్యవర్తత॥ 34

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, పరిత్రాసవికంపిత-అంగయా= భయముతో అధికముగా కంపించిన అవయవములు కలిగినట్టియు, శుచా= దుఃఖముచే, అవశుష్యత్- ముఖరుద్ధకంఠయా= ఎండిపోయిన ముఖము గద్గదమైన కంఠము కలిగినట్టియు, కాతర్య విస్రంసిత హేమమాలయా= ఆదుర్దాచే జారిపోయిన బంగరు మాల కల, తయా= ఆ రుక్మిణిచే, గృహీతపాదః= పట్టుకొనబడిన పాదములు గలవాడు, కరుణః= దయాళువు అగు శ్రీకృష్ణుడు, న్యవర్తత= విరమించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఆ రుక్మిణి అవయవములు భయము వలన విశేషముగా కంపించెను. దుఃఖముచే ఆమె ముఖములో రక్తము లేకుండెను. ఆమె కంఠము గద్గదమాయెను. ఆదుర్దాచే బంగరు మాల జారిపోవుచుండగా ఆమె ఆయన పాదములను పట్టుకొనెను. దయాళువగు శ్రీకృష్ణుడు రుక్మియొక్క వధనుండి విరమించెను.

కైలేన బద్ధ్వా తమసాధుకారిణం స శ్మశ్రుకేశం ప్రవపన్వ్యరూపయత్ ।
తావన్మమర్దుః పరసైన్యమద్భుతం యదుప్రవీరా నలినీం యథా గజాః॥ 35

సః= ఆ శ్రీకృష్ణుడు, అసాధుకారిణమ్= అపరాధియగు, తమ్= ఆ రుక్మిని, చైలేన= వస్త్రముతో, బద్ధ్వా= కట్టివేసి, శ్మశ్రుకేశమ్= గడ్డము మీసముల కేశములను, ప్రవపన్= గొరుగువాడై, వ్యరూపయత్= వికృతరూపునిగా చేసెను, తావత్= అంతలో, యదుప్రవీరాః= యాదవ వీరులు, పరసైన్యమ్= శత్రువుల సైన్యమును, అద్భుతమ్= ఆశ్చర్యము కలిగే విధముగా, గజాః= ఏనుగులు, నలినీం యథా= సరస్సును వలె, మమర్దుః= కలిచివేసిరి.

ఆ శ్రీకృష్ణుడు అపరాధియగు రుక్మిని వస్త్రముతో కట్టివేసి మీసమును గడ్డమును గొరిగి వికృతరూపునిగా చేసెను. అంతలో యాదవవీరులు శత్రువుల సైన్యమును, ఏనుగులు సరస్సును వలె, ఆశ్చర్యము కలిగే విధముగా కలిచి వేసిరి.

కృష్ణాంతిక ముపవ్రజ్య దదృశు స్తత్ర రుక్మిణమ్ ।
తథాభూతం హతప్రాయం దృష్ట్వా సంకర్షణో విభుః ।
విముచ్య బద్ధం కరుణో భగవాన్ కృష్ణమబ్రవీత్ ॥ 36

కృష్ణ–అంతికమ్= శ్రీకృష్ణుని సమీపమును గురించి, ఉపవ్రజ్య= వచ్చి, తత్ర= ఆచట, రుక్మిణమ్= రుక్మిని, దదృశుః= చూచిరి, తథాభూతమ్= ఆ విధముగా ఉన్నట్టియు, హతప్రాయమ్= చచ్చినవానితో సమానమైనట్టియు, బద్ధమ్= బంధించబడిన రుక్మిని, దృష్ట్వా= చూచి, విభుః= సర్వసమర్థుడు, కరుణః= దయాళువు అగు, సంకర్షణః భగవాన్= బలరామ భగవానుడు, విముచ్య= విడిపించి, కృష్ణమ్= శ్రీకృష్ణుని ఉద్దేశించి, అబ్రవీత్= పలికెను.

వారందరు శ్రీకృష్ణుని వద్దకు వచ్చి బంధించబడిన రుక్మిని చూచిరి. ఆతడు ఆ విధముగా వికృతరూపుడై చచ్చినవానితో సమానముగా నుండెను. సర్వసమర్థుడు, దయాళువు అగు బలరామ భగవానుడు వానిని విడిపించి, శ్రీకృష్ణునితో నిట్లనెను.

అసాధ్విదం త్వయా కృష్ణ కృత మస్మ జ్జుగుప్సితమ్ ।
వపనం శ్మశ్రుకేశానాం వైరూప్యం సుహృదో వధః ॥ 37

కృష్ణ= ఓ కృష్ణా!, త్వయా= నీచే, కృతమ్= చేయబడిన, ఇదమ్= ఇది, అసాధు= మంచిది కాదు, అస్మత్-జుగుప్సితమ్= మనచే ఏవగించుకొనబడునది, సుహృదః= బంధువు యొక్క, శ్మశ్రుకేశానామ్= గెడ్డము మీసముల కేశములయొక్క, వపనమ్= గొరుగుట, వైరూప్యమ్= విరూపునిగా చేయుట, వధః= సంహరించుటయే.

ఓ శ్రీకృష్ణా! నీవు చేసిన ఈ పని మంచిది కాదు. ఇది మనము ఏవగించుకునే పని. బంధువును గడ్డమును, మీసమును గొరిగి విరూపునిగా చేయుట ఒక విధముగా వానిని చంపుటయే.

మైవాస్మాన్ సాధ్వ్యసూయేథా భ్రాతుర్వైరూప్య చింతయా ।
సుఖదుఃఖదో న చాన్యోఽస్తి యత స్స్వకృతభుక్ పుమాన్ ॥ 38

సాధ్వి= ఓ సాధ్వీ!, భ్రాతుః= సోదరుని, వైరూప్యచింతయా= వికృతరూపుని చేయుటను గురించి తలపోయుట ద్వారా, అస్మాన్= మమ్ములను, మా అసూయేథాః= తప్పు ఎన్నకుము, సుఖదుఃఖదః= సుఖదుఃఖములనిచ్చువాడు, అన్యః= మరియొకడు, న అస్తి= లేడు, యతః= ఏలయన, పుమాన్= జీవుడు, స్వకృతభుక్= తన కర్మల ఫలముననుభవించువాడు.

ఓ సాధ్వీ! రుక్మిణీ! నీ సోదరుని విరూపుని చేసినారని మాయందు తప్పును ఎన్నకుము. మనిషికి సుఖదుఃఖములను మరియొకడు ఈయడు. ఎందుకంటే, జీవుడు తన కర్మల ఫలమునే అనుభవించును.

బంధు ర్వధార్హదోషోఽపి న బంధోర్వధమర్హతి ।
త్యాజ్యస్స్నైవ దోషేణ హతః కిం హన్యతే పునః ॥ 39

బంధుః= బంధువు, వధ-అర్హదోషః అపి= వధించుటకు తగిన తప్పు గలవాడే ఐననూ, బంధోః= బంధువు వలన, వధమ్= వధను, న అర్హతి= తగదు, త్యాజ్యుః= విడువదగినవాడు, స్వేన= తన, దోషేణ ఏవ= తప్పు చేతనే, హతః= సంహరించబడినవాడు, పునః= మరల, కిం హన్యతే= సంహరించబడునా?

బంధువు వధించదగిన తప్పే చేసినా, బంధువు బంధువును సంహరించరాదు. బంధువును విడిచి పెట్టవలెను. ఎందుకంటే, వాడు తన తప్పు చేతనే చంపబడినాడు. వానిని మరల వధించవలెనా? (కూడదు).

క్షత్రియాణా మయం ధర్మః ప్రజాపతి వినిర్మితః ।
భ్రాతాఽపి భ్రాతరం హన్యాద్యేన ఘోరతరస్తతః ॥ 40

అయమ్= ఇది, క్షత్రియాణామ్= క్షత్రియులకు, ప్రజాపతివినిర్మితః = ప్రజాపతిచే ఏర్పాటు చేయబడిన, ధర్మః= ధర్మము, యేన= దేనిచేనైతే, భ్రాతా అపి= సోదరుడు కూడ, భ్రాతరమ్= సోదరుని, హన్యాత్= చంపునో, తతః= అందువలన, ఘోరతరః= చాల భయంకరమైనది.

క్షత్రియులకీ ధర్మమును ప్రజాపతి ఏర్పాటు చేసినాడు. దాని ప్రకారముగా సోదరుని సోదరుడే సంహరించవచ్చును. కాబట్టి ఈ క్షత్రియ ధర్మము మిక్కిలి ఘోరమైనది.

రాజ్యస్య భూమే ర్విత్తస్య స్త్రియో మానస్య తేజసః ।
మానినోఽన్యస్య వా హేతో శ్శ్రీమదాంధాః క్షిపంతి హి ॥41

శ్రీమద-అంధాః= ధనగర్వముచే గ్రుడ్డియైన, మానినః= దురభిమానులు, రాజ్యస్య= రాజ్యము యొక్క, భూమేః= భూమి యొక్క, విత్తస్య= ధనముయొక్క, స్త్రియః= స్త్రీయొక్క, మానస్య= అభిమానము యొక్క, తేజసః= అవమానమును సహించకుండుట యొక్క, వా= లేదా,

అన్యస్య= మరియొకదానియొక్క, హేతోః= కారణము వలన, క్షిపంతి= తిరస్కారము చేసెదరు, హి= నిశ్చయము.

దురభిమానులు ధనగర్వముచే వివేకజ్ఞానమును కోల్పోయి రాజ్యము, భూమి, ధనము, స్త్రీ, అభిమానము, అవమానమును సహించకుండుట ఇత్యాది కారణములతో (బంధువునైననూ) తిరస్కారము చేసెదరు. ఇది నిశ్చయము.

తవేయం విషయా బుద్ధి స్సర్వభూతేషు దుర్హృదామ్ ।
యన్మన్యసే సదా భద్రం సుహృదాం భద్రమజ్ఞవత్ ॥ 42

సర్వభూతేషు= సకలప్రాణుల విషయమై, దుర్హృదామ్= దుర్బుద్ధి గలవారికి, సదా= ఎల్లవేళలా, భద్రమ్= మంగళమును, అజ్ఞవత్= అజ్ఞాని వలె, మన్యసే= నీవు భావించుచున్నావనేది యేది గలదో, ఇయమ్= ఈ, తవ= నీ, బుద్ధిః= తలంపు, విషమా= సరైనది కాదు, సుహృదామ్= బంధవులకు, భద్రమ్= మంగళమే.

ఓ రుక్మిణీ! నీ సోదరులు సకలప్రాణులయందు దుర్బుద్ధిని కలిగియున్నారు. కాని నీవు అజ్ఞాని వలె వారికి ఎల్లవేళలా మంగళమే కలగాలని తలపోయుచున్నావు. ఈ నీ తలంపు సరైనది కాదు. బంధువులకైనా చేసిన తప్పుకి శిక్షను వేయుటయే మంగళము.

ఆత్మమోహో నృణా మేష కల్ప్యతే దేవమాయయా ।
సుహృద్దుర్హృదుదాసీన ఇతి దేహాత్మమానినామ్ ॥ 43

దేహ-ఆత్మమానినామ్= దేహమే ఆత్మ అని తలపోసే, నృణామ్= మానవులకు, సుహృత్= బంధువు, దుర్హృత్= శత్రువు, ఉదాసీనః= ఉదాసీనుడు, ఇతి= అనే, ఏషః= ఈ, ఆత్మమోహః= బుద్ధివ్యామోహము, దేవమాయయా= శ్రీహరి మాయచే, కల్ప్యతే= కల్పించబడుచున్నది.

దేహమే ఆత్మ అని తలపోసే జనులకు విష్ణుమాయ మిత్ర–శత్రు–ఉదాసీనులు అనే ఈ బుద్ధిమోహమును కలిగించుచున్నది.

ఏక ఏవ పరో హ్యాత్మా సర్వేషామపి దేహినామ్ ।
నానేవ గృహ్యతే మూఢైర్యథా జ్యోతిర్యథా నభః ॥ 44

హి= ఏలయనగా, పరః= ప్రకృతికి అతీతమైన, ఆత్మా= ఆత్మ, సర్వేషామ్= సకలములైన, దేహినాం అపి= ప్రాణులకు కూడా, జ్యోతిః యథా= ప్రకాశము వలె, నభః యథా= ఆకాశము వలె, ఏకః ఏవ= ఒక్కటియే, మూఢైః= అజ్ఞానులచే, నానా ఇవ= అనేకమా యన్నట్లు, గృహ్యతే= గ్రహించబడుచున్నది.

ఎందుకంటే, సకల ప్రాణులకు కూడ ఆత్మ, ప్రకాశించే సూర్యాదులు వలె, ఆకాశము వలె, ఒక్కటియే. అది ప్రకృతికి అతీతము. అజ్ఞానులు ఆత్మలు అనేకమా అన్నట్లు తలపోయుదురు.

దేహ ఆద్యంతవానేష ద్రవ్యప్రాణగుణాత్మకః ।
ఆత్మన్యవిద్యయా క్లుప్తస్సంసారయతి దేహినమ్ ॥ 45

ద్రవ్యప్రాణగుణ–ఆత్మకః= పంచభూతములు పంచప్రాణములు పంచతన్మాత్రలు మూడు గుణములచే నిర్మితమైన, ఏషః= ఈ, దేహః= దేహము, ఆది–అంతవాన్= పుట్టుక నాశము గలది, అవిద్యయా= అజ్ఞానముచే, ఆత్మని= ఆత్మయందు, క్లుప్తః= కల్పించబడినది, దేహినమ్= దేహధారిని, సంసారయతి= సంసారిగా చేయుచున్నది.

పంచభూతములు, పంచప్రాణములు, పంచతన్మాత్రలు, మూడు గుణముల సమాహారమైన ఈ దేహము పుట్టుక, మరణము గలది. అజ్ఞానముచే ఈ దేహము ఆత్మయందు ఆరోపించబడి (ఆత్మగా గ్రహించబడి) దేహధారిని సంసారిని చేయుచున్నది.

నాత్మనోఽన్యేన సంయోగో వియోగ శ్చాసతస్సతి ।
తద్ధేతుత్వా త్తత్ప్రసిద్ధే ర్దృగ్రూపాభ్యాం యథా రవేః ॥ 46

సతి= ఓ సాధ్వీ!, ఆత్మనః= ఆత్మకు, అన్యేన= ఇతరముతో, అసతః = మిథ్య యగుట వలన, సంయోగః= కలయిక, వియోగః= విడిపోవుట, న= లేవు, దృగ్-రూపాభ్యామ్= చూపు రూపములకంటె, రవేః యథా= సూర్యునకు వలె, తత్-ప్రసిద్ధేః= దాని ఉనికికి ప్రకాశమునకు, తద్-హేతుత్వాత్= ఆత్మయే కారణమగుట వలన.

ఓ సాధ్వీ! చూపు-రూపముల ఉనికి, ప్రసిద్ధి (తెలియుట) సూర్యుని వలననే. అయిననూ, సూర్యుడు వాటికంటె విలక్షణుడే. అదే విధముగా, దేహముయొక్క ఉనికి, ప్రకాశము ఆత్మమూలకములే. కాని, ఆత్మ దేహముకంటె విలక్షణము. ఆత్మకు మిథ్యాభూతములైన దేహాదులతో యథార్థమైన సంయోగము గాని, వియోగము గాని లేవు.

జన్మాదయస్తు దేహస్య విక్రియా నాత్మనః క్వచిత్ ।
కలానామివ నైవేందో ర్మృతి ర్వ్యస్య కుహూరివ ॥ 47

జన్మ-ఆదయః= పుట్టుక మొదలైన, విక్రియాః తు= వికారములైతే, కలానాం ఇవ= కళలకు వలె, దేహస్య= దేహమునకు, ఇందోః న ఏవ= చంద్రునకు సుతరాము లేనట్లుగానే, క్వచిత్= ఏనాడైననూ, ఆత్మనః= ఆత్మకు, న= లేవు, హి= నిశ్చయము, మృతిః= కళల అంతము, అస్య= ఈ చంద్రునకు, కుహూః ఇవ= అమావాస్యయా యన్నట్లు.

వృద్ధిక్షయములు కళలకే గాని చంద్రునకు లేవు. అదే విధముగా, పుట్టుక, ఉండుట, పెరుగుట, పరిణామమును చెందుట, క్షీణించుట, నశించుట అనే వికారములైతే దేహమునకే గాని, ఆత్మకు ఏనాడైననూ లేవు. కళల అంతము చంద్రునకే అమావాస్యయా యన్నట్లు వ్యవహారము. అదేవిధముగా దేహము యొక్క మృతి ఆత్మపై ఆరోపించబడును.

యథా శయాన ఆత్మానం విషయాన్ ఫలమేవ చ ।
అనుభుంక్తేఽ ప్యసత్యర్థే తథాఽ ఽ పోత్యబుధో భవమ్ ॥ 48

యథా= ఎల్లాగైతే, అర్థే= యథార్థమగు వస్తువు, అసతి అపి= లేకున్ననూ, శయానః= నిద్రించువాడు, ఆత్మానమ్= దేహమును, విషయాన్= భోగ్యములను, ఫలం ఏవ చ= వాటి భోగమును కూడ, అనుభుంక్తే= అనుభవించునో, తదా= అదే విధముగా, అబుధః= అజ్ఞాని, భవమ్= సంసారమును, ఆపోతి= పొందుచున్నాడు.

నిద్రించే వ్యక్తి స్వప్నములో యథార్థమగు వస్తువులు లేకున్నా దేహమును, భోగ్యములను, వాటి భోగమును కూడ అనుభవించును. అదే విధముగా, అజ్ఞాని కూడ సంసారముననుభవించును.

తస్మాదజ్ఞానజం శోక మాత్మశోష విమోహనమ్ ।
తత్త్వజ్ఞానేన నిర్ధృత్య స్వస్థా భవ శుచిస్మితే ॥ 49

శుచిస్మితే= స్వచ్ఛమగు చిరునగవు గల ఓ రుక్మిణీ!, తస్మాత్= అందువలన, అజ్ఞానజమ్= అజ్ఞానము వలన పుట్టునట్టియు, ఆత్మశోష విమోహనమ్= అంతఃకరణమును కృశింపజేసి మోహపెట్టే, శోకమ్= శోకమును, తత్త్వజ్ఞానేన= ఆత్మతత్త్వమును తెలియుటచే, నిర్ధృత్య= నశింపజేసి, స్వస్థా= శాంతమగు చిత్తము గలదానవు, భవ= అగుము.

స్వచ్ఛమగు చిరునగవు గల ఓ రుక్మిణీ! శోకము అజ్ఞానమునుండి పుట్టి అంతఃకరణమును కృశింపజేసి మోహపెట్టును. కాబట్టి నీవు ఆత్మతత్త్వము నెరింగి ఆ శోకమును పారద్రోలి శాంతమగు చిత్తమును కలిగియుండుము.

శ్రీశుక ఉవాచ ।
ఏవం భగవతా తన్వీ రామేణ ప్రతిబోధితా ।
వైమనస్యం పరిత్యజ్య మనో బుద్ధ్యా సమాదధే ॥ 50

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, తన్వీ= సుందరియగు రుక్మిణి, రామేణ భగవతా= బలరామ భగవానునిచే, ఏవమ్= ఈ విధముగా, ప్రతిబోధితా= ఉపదేశించబడినదై, వైమనస్యమ్= శోకమును, పరిత్యజ్య= విడిచి పెట్టి, మనః= మనస్సును, బుద్ధ్యా= వివేకజ్ఞానముచే, సమాదధే= శాంతముగా చేసెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను... బలరామ భగవానుడిట్లు ఉపదేశించగా, సుందరియగు రుక్మిణి శోకమును విడిచి వివేకబుద్ధితో మనస్సును ప్రసన్నము చేసుకొనెను.

ప్రాణావశేష ఉత్సృష్టో ద్విడ్భి ర్హృతబలప్రభః ।
స్మరన్ విరూపకరణం వితథాత్మమనోరథః ॥ 51

ద్విడ్భిః= శత్రువులచే, ప్రాణ-అవశేషః= ప్రాణములు మాత్రమే మిగిలియున్నవాడుగా, ఉత్సృష్టః= విడిచి పెట్టబడినవాడు, హృతబలప్రభుః= విధ్వస్తమైన బలము కాంతి గలవాడు, విరూపకరణమ్= తనను వికృతరూపునిగా చేయుటను, స్మరన్= గుర్తు చేసుకొనువాడు, వితథ-ఆత్మమనః-రథః= వ్యర్థమైన తన మనోరథములు గలవాడు.

శత్రువులు రుక్మియొక్క బలమును, కాంతిని విధ్వస్తము చేసి ప్రాణములను మాత్రమే మిగిల్చి విడిచి పెట్టినారు. ఆతడు తాను వికృతరూపునిగా చేయబడిన విషయమును గుర్తు చేసుకొనుచుండెను. ఆతని మనోరథములు వ్యర్థమాయెను.

చక్రే భోజకటం నామ నివాసాయ మహత్పురమ్ ।
అహత్వా దుర్మతిం కృష్ణ మప్రత్యూహ్య యవీయసీమ్ ।
కుండినం న ప్రవేక్ష్యా మీత్యుక్త్వా తత్రావస ద్రుషా ॥ 52

భోజకటమ్= భోజకటము అని, నామ= ప్రసిద్ధి చెందిన, మహత్= పెద్ద, పురమ్= నగరమును, నివాసాయ= నివాసము కొరకు, చక్రే= చేసెను, దుర్మతిమ్= దుర్బుద్ధియగు, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అహత్వా=

సంహరించకుండా, యవీయసీమ్= చెల్లెలిని, అప్రత్యూహ్య= వెనుకకు తీసుకురాకుండా, కుండినమ్= కుండిన నగరమును, న ప్రవేక్ష్యామి= ప్రవేశించబోను, ఇతి= అని, ఉక్త్వా= పలికి, రుషా= రోషముతో, తత్ర= అచట, అవసత్= నివసించెను.

ఆతడు భోజకటము (భోజుని శపథము) అని ప్రసిద్ధి గాంచిన పెద్ద నగరమును నివాసముకొరకు నిర్మించుకొనెను. శ్రీకృష్ణుని సంహరించకుండా, చెల్లెలిని వెనుకకు తీసుకురాకుండా కుండిన నగరమును ప్రవేశించను, అని చెప్పి ఆతడు రోషముతో అక్కడనే నివసించెను.

భగవాన్ భీష్మకసుతా మేవం నిర్జిత్య భూమిపాన్ ।
పురమానీయ విధివ దుపయేమే కురూద్వహ ॥ 53

కురు-ఉద్వహ= కురువంశశ్రేష్ఠా!, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, భూమిపాన్= రాజులను, నిర్జిత్య= జయించి, భీష్మకసుతామ్= భీష్మకుని పుత్రియగు రుక్మిణిని, పురమ్= ద్వారకా నగరమును గురించి, ఆనీయ= తీసుకువచ్చి, విధివత్= యథావిధిగా, ఉపయేమే= వివాహమాడెను.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ భగవానుడీ విధముగా రాజులను జయించి, భీష్మకుని పుత్రియగు రుక్మిణిని ద్వారకా నగరమునకు తీసుకువచ్చి, యథావిధిగా వివాహమాడెను.

తదా మహోత్సవో నౄణాం యదుపుర్యాం గృహే గృహే ।
అభూ దనన్యభావానాం కృష్ణే యదుపతౌ నృప ॥ 54

నృప= ఓ రాజా!, తదా= అప్పుడు, యదుపుర్యామ్= యాదవుల నగరియగు ద్వారకయందు, గృహే గృహే= ప్రతి ఇంటి యందు, యదుపతౌ= యాదవప్రభువగు, కృష్ణే= శ్రీకృష్ణునియందు,

అనన్యభావానామ్= నిష్కపటమగు ప్రేమ గల, నృణామ్= మానవులకు, మహా-ఉత్సవః= గొప్ప ఉత్సవము, అభూత్= ఆయెను.

ఓ పరీక్షిన్మహారాజా! యాదవుల నగరియగు ద్వారకయందు ప్రతి ఇంట్లో జనులకు శ్రీకృష్ణునిపై నిష్కపటమగు ప్రేమ. అప్పుడు వారందరు పెద్ద ఉత్సవమును చేసుకొనిరి.

నరా నార్యశ్చ ముదితాః ప్రమృష్టమణికుండలాః ।
పారిబర్హ ముపాజహ్రు ర్వరయో శ్చిత్రవాససోః ॥ 55

నరాః= మగవారు, నార్యః చ= స్త్రీలు కూడ, ముదితాః= ఆనందించినవారు, ప్రమృష్టమణికుండలాః= స్వచ్ఛమైన మణుల కుండలములు గలవారు, చిత్రవాససోః= రంగు రంగుల వస్త్రములు గల, వరయోః= కొత్త దంపతులకు, పారిబర్హమ్= పెళ్లిలో ఇచ్చే బహుమానమును, ఉపాజహ్రుః= సమర్పించిరి.

ఏ స్వచ్ఛమగు మణులు పొదిగిన కుండలములను దాల్చిన స్త్రీలు, పురుషులు కూడ ఆనందముతో ఆ కొత్త దంపతులకు బహుమతుల నిచ్చిరి. ఆ దంపతులు రంగురంగుల వస్త్రములను ధరించిరి.

సా వృష్ణిపుర్యుత్తభితేంద్ర కేతుభి ర్విచిత్ర మాల్యాంబర రత్నతోరణైః ।
బభౌ ప్రతిద్వార్యుపక్లప్తమంగలై రాపూర్ణకుంభాగురు ధూపదీపకైః ॥56

సా= ఆ, వృష్ణిపురీ= యాదవుల నగరము, ఉత్తభిత-ఇంద్రకేతుభిః= బాగా ఎత్తున ఎగురవేయబడిన పంచవన్నెల జెండాలతో, విచిత్రమాల్య-అంబరరత్నతోరణైః= రంగు రంగుల పుష్పమాలలతో వస్త్రములతో రత్నతోరణములతో, ప్రతిద్వారి= ప్రతిద్వారమునందు, ఉపక్లప్తమంగలైః= స్థాపించబడిన మంగళద్రవ్యములతో, ఆపూర్ణకుంభ-అగురుధూపదీపకైః= పూర్తిగా నిండిన కడవలతో అగురు ధూపములతో దీపములతో, బభౌ= ప్రకాశించెను.

యాదవుల నగరమగు ఆ ద్వారక బాగా ఎత్తున ఎగురవేయబడిన పంచవన్నెల జెండాలతో, రంగు రంగుల పుష్పమాలలతో, వస్త్రములతో, రత్నాల తోరణాలతో ప్రకాశించెను. అచట ప్రతి ద్వారమునందు మంగళద్రవ్యముల కడవలు పూర్తిగా నీరు నింపి ఏర్పాటు చేయబడినవి. వాటి చుట్టూ అగురు ధూపములు, దీపములు పెట్టబడినవి.

సిక్తమార్గా మదచ్యుద్భి రాహూత ప్రేష్ఠ భూభుజామ్ ।
గజైర్ద్వాస్సు పరామృష్ట రంభాపూగోపశోభితా ॥ 57

సిక్తమార్గా= నీరు చల్లబడిన మార్గములు గలది, ద్వాస్సు= ద్వారములయందు, ఆహూతప్రేష్ఠభూభుజామ్= ఆహ్వానించబడిన మిత్రులైన రాజులయొక్క, మదచ్యుద్భిః= మదమును స్రవించే, గజైః= ఏనుగులచే, పరామృష్ట రంభాపూగ–ఉపశోభితా= స్పృశించబడిన అరటి పోక చెట్లతో శోభిల్లునది.

ద్వారకలోని మార్గములలో నీటిని చల్లిరి. ఆహ్వానమునందుకొని విచ్చేసిన రాజుల ఏనుగులు మదమును స్రవిస్తూ, ద్వారములయందు అలంకరించబడిన అరటి, పోక చెట్లను స్పృశించుచుండెను.

కురు సృంజయ కైకేయ విదర్భ యదు కుంతయః ।
మిథో ముముదిరే తస్మిన్ సంభ్రమా త్పరిధావతామ్ ॥ 58

తస్మిన్= ఆ నగరమునందు, సంభ్రమాత్= కంగారు వలన, పరిధావతామ్= ఇటునటు పరుగెత్తే జనుల మధ్యలో, కురుసృంజయ కైకేయవిదర్భయదుకుంతయః= కురుసృంజయకైకేయవిదర్భయదుకుంతి వంశముల వారు, మిథః= పరస్పరము, ముముదిరే= ఆనందించిరి.

ఆ నగరమునందు కురుసృంజయకైకేయవిదర్భయదుకుంతి వంశముల వారు ఇటునటు కంగారుగా తిరుగుతూ పరస్పరము కలిసి ఆనందించిరి.

రుక్మిణ్యా హరణం శ్రుత్వా గీయమానం తతస్తతః ।
రాజానో రాజకన్యాశ్చ బభూవు ర్భృశ విస్మితాః ॥ 59

తతః తతః= ఆయా స్థానములయందు, గీయమానమ్= గానము చేయబడుచున్న, రుక్మిణ్యాః= రుక్మిణి యొక్క, హరణమ్= హరణమును గురించి, శ్రుత్వా= విని, రాజానః= రాజులు, రాజకన్యాః చ= రాజకన్యలు కూడ, భృశవిస్మితాః= మిక్కిలి ఆశ్చర్యపడినవారు, బభూవుః= ఐరి.

రుక్మిణిని శ్రీకృష్ణుడు తీసుకొని వెళ్లినాడని జనులు అక్కడక్కడ కీర్తించుచుండగా విని రాజులు, రాజకన్యలు కూడ చాల ఆశ్చర్యపడిరి.

ద్వారకాయా మభూద్రాజ న్మహాఽ ఽమోదః పురౌకసామ్ ।
రుక్మిణ్యా రమయోపేతం దృష్ట్వా కృష్ణం శ్రియః పతిమ్ ॥ 60

ఇతి శ్రీమద్భాగవతపురాణే దశమస్కంధే
చతుఃపంచాశత్తమోఽధ్యాయః

రాజన్= ఓ రాజా!, రమయా= లక్ష్మియగు, రుక్మిణ్యా= రుక్మిణితో, ఉపేతమ్= కూడియున్న, శ్రియః పతిమ్= లక్ష్మీపతియగు, కృష్ణమ్= శ్రీకృష్ణ భగవానుని, దృష్ట్వా= చూచి, ద్వారకాయామ్= ద్వారకయందు పుర-ఓకసామ్= నగరవాసులకు, మహా-ఆమోదః= గొప్ప ఆనందము, అభూత్= కలిగెను.

ఓ పరీక్షిన్మహారాజా! లక్ష్మీపతి శ్రీకృష్ణుడు కాగా, లక్ష్మియే రుక్మిణి ఆయెను. ద్వారకయందు వారిద్దరి కలయికను చూచి నగరవాసులు మహానందమును పొందిరి.

శ్రీమద్భాగవత దశమస్కంధము
ఏబది నాల్గవ అధ్యాయము ముగిసినది (54).

* * *

అథ పంచపంచాశత్తమోఽధ్యాయః

ప్రద్యుమ్నుని జన్మ - శంబరాసురుని వధ

శ్రీశుక ఉవాచ ।

కామస్తు వాసుదేవాంశో దగ్ధః ప్రాగ్రుద్రమన్యునా ।
దేహోపపత్తయే భూయ స్తమేవ ప్రత్యపద్యత ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, వాసుదేవ అంశః= వాసుదేవుని అంశయగు, కామః తు= కాముడైతే, ప్రాక్= పూర్వము, రుద్రమన్యునా= రుద్రుని కోపము చే, దగ్ధః= తగుల పెట్టబడినవాడు, భూయః= మరల, దేహ-ఉపపత్తయే= దేహమును పొందుట కొరకై, తం ఏవ= ఆ వాసుదేవునే, ప్రత్యపద్యత= ఆశ్రయించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...వాసుదేవుని అంశయగు కాముడు పూర్వము రుద్రుని కోపముచే తగులపెట్టబడినాడు. ఆతడు మరల దేహమును పొందుటకై వాసుదేవునే ఆశ్రయించెను.

స ఏవ జాతో వైదర్భ్యాం కృష్ణవీర్యసముద్భవః ।
ప్రద్యుమ్న ఇతి విఖ్యాత స్సర్వతోఽనవమః పితుః ॥ 2

సః ఏవ= ఆ కాముడే, వైదర్భ్యామ్= విదర్భరాజపుత్రియగు రుక్మిణియందు, జాతః= పుట్టినవాడు, కృష్ణవీర్యసముద్భవః= శ్రీకృష్ణుని వీర్యమునుండి పుట్టినవాడు, ప్రద్యుమ్నః= ప్రద్యుమ్నుడు, ఇతి= అని, విఖ్యాతః= ప్రసిద్ధి చెందినవాడు, సర్వతః= అన్నింటిచే, పితుః= తండ్రికంటె, అనవమః= తక్కువ కానివాడు.

ఆ కాముడే శ్రీకృష్ణుని వీర్యము వలన విదర్భరాజపుత్రికయగు రుక్మిణియందు జన్మించి ప్రద్యుమ్నుడని ప్రసిద్ధి గాంచెను. ఆతడు సకలగుణములచే తండ్రికి తీసిపోనివాడు.

తం శంబరః కామరూపీ హృత్వా తోకమనిర్దశమ్ ।
స విదిత్వాఽఽత్మన శ్శత్రుం ప్రాస్యోదన్వత్యగాద్గృహమ్ ॥ 3

కామరూపీ= కోరిన రూపమును దాల్చే, సః= ఆ, శంబరః= శంబరుడు, అనిర్దశమ్= పదిరోజుల వయస్సు లేని, తోకమ్= పసిపిల్ల వాడగు, తమ్= ఆ ప్రద్యుమ్నుని, ఆత్మనః= తనకు, శత్రుమ్= శత్రువగు కామునిగా, విదిత్వా= తెలిసి, హృత్వా= అపహరించి, ఉదన్వతి= సముద్రమునందు, ప్రాస్య= పారవైచి, గృహమ్= ఇంటిని గురించి, అగాత్= వెళ్లెను.

కోరిన రూపుదాల్చే శంబరునకు తన శత్రువైన కాముడు ప్రద్యుమ్నుడుగా పుట్టినాడని తెలిసెను. ఇంకనూ ప్రద్యుమ్నుడు పది రోజులు నిండని పసివాడు. శంబరుడా పసివానిని అపహరించి సముద్రములో పారవైచి ఇంటికి వెళ్లెను.

తం నిర్జగార బలవా న్మీనస్సోఽప్యపరై స్సహ ।
వృతో జాలేన మహతా గృహీతో మత్స్యజీవిభిః ॥ 4

బలవాన్= బలవంతమైన, మీనః= చేప, తమ్= ఆ శిశువును, నిర్జగార= మ్రింగెను, మత్స్యజీవిభిః= మత్స్యకారులచే, మహతా= పెద్ద, జాలేన= వలచే, సః అపి= ఆ చేప కూడ, అపరైః సహ= ఇతరములగు చేపలతో బాటుగా, వృతః= చిక్కుకున్నదై, గృహీతః= పట్టుకొనబడినది.

బలవంతమైన చేప ఆ శిశువును మ్రింగెను. మత్స్యకారులు పెద్ద వల వేయగా, ఆ చేపతోబాటుగా మరికొన్ని చేపలు దానిలో చిక్కి పట్టుబడినవి.

తం శంబరాయ కైవర్తా ఉపాజహ్రు రుపాయనమ్ ।
సూదా మహానసం నీత్వాఽవద్యన్ స్వధితినాఽద్భుతమ్ ॥5

కైవర్తాః= మత్స్యకారులు, అద్భుతమ్= ఆశ్చర్యకరమగు, తమ్= ఆ చేపను, శంబరాయ= శంబరుని కొరకు, ఉపాయనమ్= ఉపహారముగా, ఉపాజహ్రుఃr= సమర్పించిరి, సూదాః= వంటవాళ్లు, మహానసమ్= వంట శాలను గురించి, నీత్వా= తీసుకువెళ్లి, స్వధితినా= కత్తితో, అవద్యన్= కోసిరి.

మత్స్యకారులు ఆ వింత చేపను శంబరునికి ఉపహారముగా సమర్పించిరి. వంటవాళ్లు దానిని వంటశాలకు తీసుకువెళ్లి కత్తితో కోసిరి.

దృష్ట్వా తదుదరే బాలం మాయావత్యై న్యవేదయన్ ।
నారదోఽకథయ త్సర్వం తస్యా శ్శంకిత చేతసః ।
బాలస్య తత్త్వముత్పత్తిం మత్స్యోదరనివేశనమ్ ॥ 6

తద్–ఉదరే= ఆ చేప పొట్టయందు, బాలమ్= పిల్లవానిని, దృష్ట్వా= చూచి, మాయావత్యై= మాయావతి కొరకు, న్యవేదయన్= విన్నవించిరి, శంకితచేతసః= శంక కలిగిన మనస్సు గల, తస్యాఃr= ఆమెకు, నారదః = నారదుడు, బాలస్య= పిల్లవాని, తత్త్వమ్= స్వరూపమును, ఉత్పత్తిమ్= పుట్టుకను, మత్స్య–ఉదరనివేశనమ్= చేప పొట్టను చేరుటను గురించి, సర్వమ్= సర్వమును, అకథయత్= చెప్పెను.

ఆ చేప పొట్టలో పిల్లవానిని చూచి ఆ వంటవారు శంబరుని దాసియగు మాయావతికి విన్నవించిరి. ఆమెకు మనస్సులో శంక కలిగెను. అపుడు నారదుడామెకు ఆ బాలుడు కాముని అవతారమని, రుక్మిణికి జన్మించిన విషయమును, చేప పొట్టను చేరిన వైనమును సర్వమును చెప్పెను.

సా చ కామస్య వై పత్నీ రతిర్నామ యశస్వినీ ।
పత్యుర్నిర్దగ్ధదేహస్య దేహోత్పత్తిం ప్రతీక్షతీ ॥ 7

సా చ= ఆమెయైతే, యశస్వినీ= పతివ్రత, కామస్య= కాముని, పత్నీ= భార్య, రతిః= రతి అని, నామ= ప్రసిద్ధి చెందినది, నిర్దగ్ధ దేహస్య= దహించబడిన దేహము గల, పత్యుః= భర్తకు, దేహ-ఉత్పత్తిమ్= దేహము యొక్క ఉత్పత్తిని గురించి, ప్రతీక్షతీ= వేచిచూచుచున్నది.

ఆమె రతి అని ప్రసిద్ధి చెందిన కాముని పత్ని, పతివ్రత. వాని దేహము దహించబడగా, మరియొక దేహము కలుగుటకై ఆమె వేచి చూచుచుండెను.

నిరూపితా శంబరేణ సా సూపౌదన సాధనే ।
కామదేవం శిశుం బుద్ధ్వా చక్రే స్నేహం తదాఽర్భకే ॥ 8

సా= ఆమె, శంబరేణ= శంబరునిచే, సూప-ఓదనసాధనే= పప్పు అన్నమును వండుటయందు, నిరూపితా= నియోగించబడినది, శిశుమ్= పిల్లవానిని, కామదేవమ్= కామదేవునిగా, బుద్ధ్వా= తెలుసుకొని, తదా= అప్పుడు, అర్భకే= పిల్లవానియందు, స్నేహమ్= ప్రేమను, చక్రే= చేసెను.

ఆమె శంబరునిచే పప్పు-అన్నమును తయారు చేసే పనియందు నియోగించబడినది. ఆ పిల్లవాడు కామదేవుడేనని తెలిసి ఆమె అప్పుడా పిల్లవానియందు ప్రేమను కలిగియుండెను.

నాతిదీర్ఘేణ కాలేన స కార్ష్ణి రూధయౌవనః ।
జనయామాస నారీణాం వీక్షంతీనాం చ విభ్రమమ్ ॥ 9

సః= ఆ, కార్ష్ణిః= కృష్ణుని పుత్రుడగు ప్రద్యుమ్నుడు, న-అతిదీర్ఘేణ= మిక్కిలి పొడవు కాని, కాలేన= కాలముచే, రూధయౌవనః= ఉదయించిన యౌవనము గలవాడై, వీక్షంతీనామ్= చూచుచున్న, నారీణాం చ= యువతులకు, విభ్రమమ్= సమ్మోహమును, జనయామాస= కలిగించెను.

కృష్ణుని పుత్రుడగు ఆ ప్రద్యుమ్నుడు కొంత కాలమునకే యువకుడాయెను. ఆతనిని చూచే యువతులకు సమ్మోహము కలిగెడిది.

సా తం పతిం పద్మదలాయతేక్షణం
ప్రలంబబాహుం నరలోక సుందరమ్ ।
సవ్రీడహాసోత్తభితభ్రువేక్షతీ
ప్రీత్యోపతస్థే రతిరంగ సౌరతైః ॥ 10

అంగ= ఓయీ!, పద్మదల-ఆయత-ఈక్షణమ్= పద్మపు రేకులవలె విశాలమైన కన్నులు కలిగినట్టియు, ప్రలంబబాహుమ్= పొడవాటి చేతులు కలిగినట్టియు, నరలోకసుందరమ్= మానవలోకమునందు అందగాడైన, తమ్= ఆ, పతిమ్= భర్తను, సా= ఆ, రతిః= మాయావతి, సవ్రీడహాస-ఉత్తభితభ్రువా= సిగ్గుతో కూడిన చిరునవ్వుచే నాట్యమాడే కను బొమలు గల చూపులతో, ఈక్షతీ= చూచుచున్నదై, ప్రీత్యా= ప్రేమతో, సౌరతైః = ప్రేమను ప్రకటించే భావములతో, ఉపతస్థే= సేవించెను.

ఓ పరీక్షిన్మహారాజా! పొడవాటి చేతులు గల ఆ ప్రద్యుమ్నుడు పద్మపు రేకులవలె విశాలమైన కన్నులతో మానవలోకమునందే అందగాడుగ నుండెను. ఆ మాయావతి అట్టి భర్తను సిగ్గుతో కూడిన చిరునవ్వుతో కనుబొమలు నాట్యమాడుచుండగా ప్రేమతో చూస్తూ, ప్రేమను ప్రకటించే హావభావములతో సేవించెను.

తామాహ భగవాన్ కార్ష్ణిర్మాతస్తే మతిరన్యథా ।
మాతృభావమతిక్రమ్య వర్తసే కామినీ యథా ॥ 11

కార్ష్ణిః= కృష్ణుని పుత్రుడగు, భగవాన్= ప్రద్యుమ్న భగవానుడు, తామ్= ఆమెను ఉద్దేశించి, ఆహ= పలికెను, మాతః= అమ్మా!, తే= నీ, మతిః= బుద్ధి, అన్యథా= విపరీతము, మాతృభావమ్= తల్లి ప్రేమను, అతిక్రమ్య= అతిక్రమించి, కామినీ యథా= కాముకురాలు వలె, వర్తసే= ప్రవర్తిల్లుచున్నావు.

కృష్ణుని పుత్రుడగు ప్రద్యుమ్న భగవానుడామెతో నిట్లనెను – అమ్మా! నీ బుద్ధి విపరీతముగా నున్నది. నీవు తల్లి ప్రేమను అతిక్రమించి కాముకురాలు వలె ప్రవర్తిల్లుచున్నావు.

రతిరువాచ ।

భవాన్నారాయణ సుత శ్శంబరేణాహృతో గృహాత్ ।
అహం తేఽధికృతా పత్నీ రతిః కామో భవాన్ ప్రభో ॥ 12

రతిః= రతి, ఉవాచ= పలికెను, భవాన్= నీవు, నారాయణసుతః = నారాయణుని పుత్రుడవు, గృహాత్= ఇంటినుండి, శంబరేణ= శంబరునిచే, ఆహృతః= తీసుకురా–బడినవాడవు, ప్రభో= ఓ ప్రభూ!, అహమ్= నేను, తే= నీకు, అధికృతా= యోగ్యతచే పొందబడిన, పత్నీ= భార్యను, భవాన్= నీవు, కామః= కాముడవు.

రతి ఇట్లు పలికెను – ఓ ప్రభూ! శ్రీకృష్ణభగవానుని పుత్రుడవగు నిన్ను శంబరుడు ఇంటి నుండి అపహరించి తెచ్చినాడు. నేను పూర్వజన్మ యందు నీ ధర్మపత్నినగు రతీదేవిని. నీవు కాముడవు.

ఏష త్వాఽనిర్దశం సింధావాక్షిప చ్ఛంబరోఽసురః ।
మత్స్యోఽగ్రసీత్తదుదరాదిహ ప్రాప్తో భవాన్ ప్రభో ॥ 13

అనిర్దశమ్= పదిరోజుల వయసు లేని, త్వా= నిన్ను, ఏషః= ఈ, శంబరః అసురః= శంబరాసురుడు సింధౌ= సముద్రమునందు, ఆక్షిపత్= పారవైచెను, మత్స్యః= చేప, అగ్రసీత్= మ్రింగెను, ప్రభో= ఓ ప్రభూ!, భవాన్= నీవు, తద్–ఉదరాత్= దాని పొట్టనుండి, ఇహ= ఇచటకు, ప్రాప్తః= చేరినవాడవు.

ఓ ప్రభూ! పది దినముల వయస్సు కూడ లేని నిన్ను శంబరాసురుడు సముద్రములో పారవేయగా చేప మ్రింగెను. ఆ చేపపొట్టలోనున్న నీవు ఇచటకు చేరుకుంటివి.

తమిమం జహి దుర్ధర్షం దుర్జయం శత్రుమాత్మనః ।
మాయాశతవిదం త్వం చ మాయాభి ర్మోహనాదిభిః ॥ 14

దుర్ధర్షమ్= వశము చేసుకొనుట కష్టమైనట్టియు, దుర్జయమ్= జయించుట కష్టమైనట్టియు, ఆత్మనః= నీకు, శత్రుమ్= శత్రువైనట్టియు, మాయాశతవిదమ్= మాయల వందలనెరింగిన, తమ్= అట్టి, ఇమమ్= ఈ శంబరుని, త్వం చ= నీవు కూడ, మోహన-ఆదిభిః= మోహనము మొదలైన, మాయాభిః= మాయలతో, జహి= సంహరించుము.

నీ శత్రువగు అట్టి ఈ శంబరుని వశము చేసుకొనుట గాని, జయించుట గాని కష్టమే. ఈతడు వందల మాయలు తెలిసినవాడు. నీవు కూడ మోహనము (శత్రువునకు మూర్ఛ వచ్చునట్లు చేయుట), శోషణము (శత్రువునకు తీరని దప్పిక కలుగుట) మొదలైన మాయలచే వధించుము.

పరిశోచతి తే మాతా కురరీవ గత ప్రజా ।
పుత్రస్నేహాకులా దీనా వివత్సా గౌరివాతురా ॥ 15

గతప్రజా= పోయిన సంతానము గలది, పుత్ర స్నేహ-ఆకులా= పుత్రునియందలి ప్రేమచే వ్యాకులపడునది, దీనా= దీనురాలు అగు, తే= నీ, మాతా= తల్లి, కురరీ ఇవ= లకుముకి పిట్ట వలె, వివత్సా= పోయిన దూడ గల, గౌః ఇవ= ఆవు వలె, ఆతురా= దుఃఖితురాలు.

తన కొడుకు దూరము కాగా కొడుకునందలి ప్రేమచే వ్యాకులపడు చున్న నీ దీనురాలగు తల్లి లకుముకి పిట్ట వలె, దూడను పోగొట్టుకున్న ఆవువలె, దుఃఖించుచున్నది.

ప్రభాస్యైవం దదౌ విద్యాం ప్రద్యుమ్నాయ మహాత్మనే ।
మాయావతీ మహామాయాం సర్వమాయావినాశినీమ్ ॥ 16

మాయావతీ= మాయావతి, ఏవమ్= ఈ విధముగా, ప్రభాష్య= పలికి, మహాత్మనే= మహాత్ముడగు, ప్రద్యుమ్నాయ= ప్రద్యుమ్నుని కొరకు, సర్వమాయావినాశినీమ్= సకలమాయలను నశింపజేసే, మహామాయామ్= మహామాయారూపమైన, విద్యామ్= విద్యను, దదౌ= ఇచ్చెను.

మాయావతి ఇట్లు పలికి మహాత్ముడగు ప్రద్యుమ్నునకు మహామాయ అనే విద్యను ఉపదేశించెను. ఆ విద్య సకలమాయలను నశింప జేయును.

స చ శంబర మభ్యేత్య సంయుగాయ సమాహ్వయత్ ।
అవిషహ్యై స్తమాక్షేపైః క్షిపన్ సంజనయన్ కలిమ్ ॥ 17

సః చ= ఆ ప్రద్యుమ్నుడు కూడ, శంబరమ్= శంబరుని, అభ్యేత్య= ఎదురుగా వచ్చి, తమ్= వానిని, అవిషహ్యైఃఃః

చెడు మాటలతో నిందించబడిన ఆ శంబరుడు కాలితో తొక్కబడిన పాము వలె నుండెను. కోపముతో ఎర్రనైన కన్నులు గల ఆతడు గద చేతితో పట్టుకొని బయటకు వచ్చెను.

గదామావిధ్య తరసా ప్రద్యుమ్నాయ మహాత్మనే ।
ప్రక్షిప్య వ్యనద న్నాదం వజ్రనిష్పేష నిష్ఠురమ్ ॥ 19

గదామ్= గదను, ఆవిధ్య= త్రిప్పి, మహాత్మనే= మహాత్ముడగు, ప్రద్యుమ్నాయ= ప్రద్యుమ్నుని కొరకు, తరసా= వేగముగా, ప్రక్షిప్య= విసిరి, వజ్రనిష్పేషనిష్ఠురమ్= పిడుగు పాటు వలె కఠోరమైన, నాదమ్= నాదమును, వ్యనదత్= నినదించెను.

శంబరుడు గదను త్రిప్పి మహాత్ముడగు ప్రద్యుమ్నునిపై వేగముగా విసిరి, పిడుగుపాటు వలె మిక్కిలి కఠోరమైన నాదమును చేసెను.

తామాపతంతీం భగవాన్ ప్రద్యుమ్నో గదయా గదామ్ ।
అపాస్య శత్రవే క్రుద్ధః ప్రాహిణోత్స్వగదాం నృప ॥ 20

నృప= ఓ రాజా!, ఆపతంతీమ్= మీదకు వచ్చి పడుచున్న, తామ్= ఆ, గదామ్= గదను, ప్రద్యుమ్నుఃభగవాన్= ప్రద్యుమ్న భగవానుడు, గదయా= గదతో, అపాస్య= త్రోసివేసి, క్రుద్ధఃకోపించిన వాడై, శత్రవే= శత్రువు కొరకు, స్వగదామ్= తన గదను, ప్రాహిణోత్= విసిరెను.

ఓ రాజా! మీదకు వచ్చి పడుచున్న ఆ గదను ప్రద్యుమ్న భగవానుడు గదతో త్రోసివేసి కోపముతో తన గదను శత్రువగు శంబరునిపై విసిరెను.

స చ మాయాం సమాశ్రిత్య దైతేయీం మయదర్శితామ్ ।
ముముచేఽస్త్రమయం వర్షం కార్ష్ణౌ వైహాయసోఽసురః ॥ 21

సః= ఆ, అసురః చ= శంబరాసురుడు కూడ, దైతేయీమ్= రాక్షసులకు చెందినట్టియు, మయదర్శితామ్= మయునిచే కనుగొనబడిన, మాయామ్= మాయను, సమాశ్రిత్య= ఆశ్రయించి, వైహాయసః= ఆకాశమునందున్న వాడై, కార్ష్ణి= కృష్ణపుత్రుడగు ప్రద్యుమ్ననిపై, అస్త్రమయమ్= ఆయుధములతో నిండిన, వర్షమ్= వర్షమును, ముముచే= విడిచిపెట్టెను.

ఆ శంబరాసురుడున్నూ రాక్షసమాయనాశ్రయించి ఆకసము-నందున్నవాడై శ్రీకృష్ణని పుత్రుడగు ప్రద్యుమ్ననిపై ఆయుధముల వర్షమును కురిపించెను. ఆ మాయను మయుడు కనుగొనెను.

బాధ్యమానోఽస్త్ర వర్షేణ రౌక్మిణేయో మహారథః ।
సత్త్వాత్మికాం మహావిద్యాం సర్వమాయోపమర్దినీమ్ ॥ 22

రౌక్మిణీయః= రుక్మిణి పుత్రుడు, మహారథః= గొప్ప రథికుడు అగు ప్రద్యుమ్నుడు, అస్త్రవర్షేణ= ఆయుధముల వర్షముచే, బాధ్యమానః= పీడించబడుచున్నవాడై, సత్త్వ-ఆత్మికామ్= సత్త్వగుణ ప్రధానమైనట్టియు, సర్వమాయా-ఉపమర్దినీమ్= అన్ని మాయలను మట్టుబెట్టే, మహావిద్యామ్= గొప్ప విద్యను (ప్రయోగించెను).

రుక్మిణి పుత్రుడగు ప్రద్యుమ్నుడు గొప్ప రథికుడు. ఆయన ఆయుధముల వర్షముచే పీడించబడినవాడై మహావిద్యను ప్రయోగించెను. సత్త్వగుణప్రధానమగు ఆ విద్య సకలమాయలను మట్టుబెట్టును.

తతో గౌహ్యక గాంధర్వ పైశాచోరగ రాక్షసీః ।
ప్రాయుంక్త శతశో దైత్యః కార్ష్ణి ర్వ్యధమయత్స తాః ॥ 23

తతః= తరువాత, దైత్యః= శంబరాసురుడు, గౌహ్యక గాంధర్వ పైశాచ ఉరగరాక్ష సీః= యక్షులు గంధర్వులు పిశాచములు నాగములు రాక్షసులకు చెందిన మాయలను, శతశః= వందలాదిగా, ప్రాయుంక్త=

ప్రయోగించెను, కార్ష్ణిః= శ్రీకృష్ణుని పుత్రుడగు, సః= ఆ ప్రద్యుమ్నుడు, తాః= వాటిని, వ్యధమయత్= చెల్లాచెదరు చేసెను.

తరువాత శంబరాసురుడు యక్ష-గంధర్వ-పిశాచ-నాగ-రాక్షసులకు చెందిన వందలాది మాయలను ప్రయోగించగా, శ్రీకృష్ణపుత్రుడగు ఆ ప్రద్యుమ్నుడు వాటిని చెల్లాచెదరు చేసెను.

నిశాతమసి ముద్యమ్య సకిరీటం సకుండలమ్ ।
శంబరస్య శిరః కాయా త్తామ్రశ్మశ్వోజసాఽహరత్ ॥ 24

నిశాతమ్= వాడియైన, అసిమ్= కత్తిని, ఉద్యమ్య= పైకెత్తి, సకిరీటమ్= కిరీటముతో కూడినట్టియు, సకుండలమ్= కుండలములతో కూడినట్టియు, తామ్రశ్మశ్రు= ఎర్రని గడ్డము మీసములు గల, శంబరస్య= శంబరుని, శిరః= తలను, ఓజసా= బలముతో, కాయాత్= మొండెము నుండి, అహరత్= ఊడగొట్టెను.

ప్రద్యుమ్నుడు వాడి కత్తితో శంబరుని తలను బలముగా మొండెమునుండి వేరు చేసెను. ఆ తలకు కిరీటము, కుండలములు, ఎర్రని గడ్డము మీసములు ఉండెను.

ఆకీర్యమాణో దివిజైః స్తువద్భిః కుసుమోత్కరైః ।
భార్యయాఽంబర చారిణ్యా పురం నీతో విహాయసా ॥ 25

స్తువద్భిః= స్తోత్రము చేయుచున్న, దివిజైః= దేవతల చే, కుసుమ-ఉత్కరైః= పుష్పముల దోసిళ్లతో, ఆకీర్యమాణః= చల్లబడుచున్న ప్రద్యుమ్నుడు, అంబరచారిణ్యా= ఆకసమునందు సంచరించే, భార్యయా= భార్యయగు మాయావతిచే, విహాయసా= ఆకాశము గుండా, పురమ్= నగరమును గురించి, నీతః= కొనిపోబడినవాడు.

దేవతలు ప్రద్యుమ్నుని స్తుతిస్తూ దోసిళ్లతో పూలను కురిపించిరి. ఇంతలో మాయావతి ఆకాశమునందు సంచరిస్తూ ఆయనను ఆకాశమార్గము గుండా ద్వారకానగరమునకు తీసుకు వెళ్లెను.

అంతఃపురవరం రాజన్ లలనాశతసంకులమ్ ।
వివేశ పత్న్యా గగనాద్విద్యుతేవ బలాహకః ॥ 26

రాజన్= ఓ రాజా!, లలనాశతసంకులమ్= యువతుల వందలతో రద్దీగానున్న, అంతఃపురవరమ్= గొప్ప అంతఃపురమును, పత్న్యా= భార్యతో, గగనాత్= ఆకాశమునుండి, విద్యుతా= మెరుపుతో, బలాహకఃఇవ= మేఘము వలె, వివేశ= ప్రవేశించెను.

ఓ పరీక్షిన్మహారాజా! ప్రద్యుమ్నుడు భార్యతో గూడి వందలాది యువతులతో హడావుడిగానుండే గొప్ప (రుక్మిణి) అంతఃపురమును ఆకాశమునుండి, మెరుపుతో కూడిన మేఘమువలె, ప్రవేశించెను.

తం దృష్ట్వా జలదశ్యామం పీతకౌశేయ వాససమ్ ।
ప్రలంబ బాహుం తామ్రాక్షం సుస్మితం రుచిరాననమ్ ॥ 27

స్వలంకృతముఖాంభోజం నీలవక్రాలకాలిభిః ।
కృష్ణం మత్వా స్త్రియో ప్రీతా నిలిల్యుస్తత్ర తత్ర హ ॥ 28

జలదశ్యామమ్= మేఘము వలె నల్లనైనట్టియు, పీతకౌశేయ వాససమ్= పచ్చని పట్టువస్త్రము కలిగినట్టియు, ప్రలంబబాహుమ్= పొడవాటి చేతులు కలిగినట్టియు, తామ్ర-అక్షమ్= తేనె రంగు కన్నులు కలిగినట్టియు, సుస్మితమ్= చక్కని చిరునవ్వు కలిగినట్టియు, రుచిర-ఆననమ్= అందమైన మోము కలిగినట్టియు, నీలవక్ర-అలక-అలిభిఃనల్లని గిరజాల ముంగురులనే తుమ్మెదలచే, సు-అలంకృతముఖ-అంభోజమ్= చక్కగా అలంకరించబడిన పద్మమువంటి మోము కలిగిన,

తమ్= ఆ ప్రద్యుమ్నుని, దృష్ట్వా= చూచి, స్త్రీయః= స్త్రీలు, కృష్ణమ్= శ్రీకృష్ణునిగా, మత్వా= తలచి, ప్రీతాః= సిగ్గుపడినవారై, తత్ర తత్ర= అక్కడక్కడ, నిలిల్యుః హ= దాగిరట.

మేఘము వలె నల్లని ఆ ప్రద్యుమ్నుడు పచ్చని పట్టు వస్త్రమును దాల్చెను. పొడవాటి చేతులు గల ఆయన కన్నులు తేనె రంగు కలిగియుండెను. ఆయన మోము చక్కని చిరునవ్వుతో అందముగా నుండెను. నల్లని గిరజాల ముంగురులనే తుమ్మెదలే పద్మమును పోలిన ఆయన ముఖమునకు చక్కని అలంకారములాయెను. ఆయనను చూచి అంతఃపురస్త్రీలు శ్రీకృష్ణుడని తలచి లోపల అక్కడక్కడ నక్కిరట.

అవధార్య శనైరీషద్వైలక్షణ్యేన యోషితః ।
ఉపజగ్ముః ప్రముదితా స్సస్త్రీరత్నం సువిస్మితాః ॥ 29

యోషితః= స్త్రీలు, ఈషత్= కొంచెము, వైలక్షణ్యేన= తేడాచే, శనైః= మెల్లగా, అవధార్య= నిశ్చయించుకొని, ప్రముదితాః= చాల ఆనందించినవారై, సువిస్మితాః= గొప్ప ఆశ్చర్యమును పొందినవారై, సస్త్రీరత్నమ్= శ్రేష్ఠమైన యువతి (మాయావతి)తో కూడియున్న ప్రద్యుమ్నుని గురించి, ఉపజగ్ముః= సమీపమునకు వచ్చిరి.

ఆ స్త్రీలు మెల్లగా ప్రద్యుమ్నునికి శ్రీకృష్ణునికి కొద్ది తేడాను నిశ్చయముగా గుర్తించి దగ్గరగా వచ్చిరి. గొప్ప యువతితో కూడియున్న ఆతనిని చూచి వారు గొప్ప ఆశ్చర్యమును, ఆనందమును కూడ పొందిరి.

అథ తత్రాసితాపాంగీ వైదర్భీ వల్గుభాషిణీ ।
అస్మరత్స్వసుతం నష్టం స్నేహస్నుత పయోధరా ॥ 30

అథ= అప్పుడు, తత్ర= అచట, అసిత-అపాంగీ= నల్లని కనుకొనలు గలది, వల్గుభాషిణీ= మధురముగా మాటలాడునది, వైదర్భీ= విదర్భరాజకుమారి అగు రుక్మిణి, స్నేహస్నుతపయః-ధరా= ప్రేమచే

స్రవించే పాలిండ్లు గలదియై, నష్టమ్= తప్పిపోయిన, స్వసుతమ్= తన పుత్రుని, అస్మరత్= గుర్తుకు తెచ్చుకొనెను.

నల్లని కనుకొనలతో మధురముగా మాటలాడే విదర్భరాజకుమారి రుక్మిణి అపుడచటకు వచ్చెను. ఆమె పాలిండ్లు ప్రేమతో పాలను స్రవించెను. ఆమెకు తప్పిపోయిన తన పుత్రుడు గుర్తుకు వచ్చెను.

కో న్వయం నరవైదూర్యః కస్య వా కమలేక్షణః ।
ధృతః కయా వా జఠరే కేయం లబ్ధా త్వనేన వా ॥ 31

నరవైదూర్యః= మానవులలో శ్రేష్ఠుడగు, అయమ్= ఈతడు, కః ను= ఎవడైయుండును?, కమల-ఈక్షణః= కలువ కన్నులవాడు, కస్య వా= ఎవనివాడై యుండును?, జఠరే= గర్భమునందు, కయా వా= ఎవతెచే, ధృతః= ధరించబడినవాడు?, అనేన= ఈతనిచే, లబ్ధా= పొందబడిన, ఇయమ్= ఈమె, కా వా= ఎవరై యుండును?

మానవులలో శ్రేష్ఠుడగు ఈతడు ఎవడు? ఈ కలువ కన్నులవాడు ఎవరివాడు? ఈతనిని నవమాసాలు మోసిన కన్న తల్లి యెవరో? ఈతడు భార్యగా పొందిన ఈ యువతి ఎవరై యుండును?

మమ చాప్యాత్మజో నష్టో నీతో య స్సూతికాగృహాత్ ।
ఏతత్తుల్య వయో రూపో యది జీవతి కుత్రచిత్ ॥ 32

మమ చ అపి= నాకు కూడ, ఆత్మజః= పుత్రుడు, నష్టః= తప్పిపోయినవాడు, యః= ఎవడైతే, సూతికాగృహాత్= పురిటి యింటి నుండి, నీతః= అపహరించబడినవాడు, కుత్రచిత్= ఎక్కడో ఒకచోట, యది జీవతి= జీవించి యున్నచో, ఏతత్-తుల్యవయః-రూపః= ఈతనితో సమానమైన వయస్సు రూపు గలవాడు.

నా పుత్రుడు కూడ తప్పిపోయినాడు. పురిటి యింటినుండియే అపహరించబడిన ఆ బాలుడు ఎక్కడో అక్కడ జీవించియున్నచో, వయస్సు, రూపు ఈతనిని పోలియుండును.

కథం త్వనేన సంప్రాప్తం సారూప్యం శార్ఙ్గధన్వనః ।
ఆకృత్యాఽవయవై ర్గత్యా స్వర హాసావలోకనైః ॥ 33

అనేన తు= ఈతనిచేనైతే, ఆకృత్యా= ఆకారముచే, అవయవైః= అవయవములచే, గత్యా= నడకచే, స్వరహాస-అవలోకనైః= మాట నవ్వు చూపులచే, శార్ఙ్గధన్వనః= శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీకృష్ణ భగవానుని, సారూప్యమ్= సమానమైన రూపమును కలిగియుండుట, కథమ్= ఏ విధముగా, సంప్రాప్తమ్= పొందబడినదో?

ఆకారము, అవయవములు, నడక, మాట, నవ్వు, చూపులు అనువాటిలో ఈతడు శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీకృష్ణ భగవానునితో సమానముగా ఉన్నాడు. ఇది ఎట్లు ఘటిల్లినది?

స ఏవ వా భవేన్నూనం యో మే గర్భే ధృతోఽర్భకః ।
అముష్మిన్ ప్రీతిరధికా వామస్ఫురతి మే భుజః ॥ 34

నూనమ్= నిశ్చయముగా, సః ఏవ= ఆ బాలుడే, భవేత్ వా= అగునేమో? యః= ఏ, అర్భకః= పిల్లవాడు, మే= నా, గర్భే= గర్భము నందు, ధృతః= ధరించబడినవాడో, అముష్మిన్= వీనియందు, అధికా= అధికమగు, ప్రీతిః= ప్రేమ, మే= నా, వామః= ఎడమ, భుజః= చేయి, స్ఫురతి= అదురుచున్నది.

నాకు వీనియందు అధికమగు ప్రీతి కలుగుచున్నది. నా ఎడమ చేయి అదురుచున్నది. నేను గర్భములో ధరించిన పిల్లవాడు నిశ్చయముగా ఈతడే అయి ఉండును.

ఏవం మీమాంసమానాయాం వైదర్భ్యాం దేవకీసుతః ।
దేవక్యానకదుందుభ్యాముత్తమశ్లోక ఆగమత్ ॥ 35

వైదర్భ్యామ్= విదర్భ రాజకుమారి, ఏవమ్= ఈ విధముగా, మీమాంసమానాయామ్= తర్కించుచుండగా, దేవకీసుతః= దేవకి పుత్రుడు, ఉత్తమశ్లోకః= పవిత్రమగు కీర్తి గలవాడు అగు శ్రీకృష్ణుడు, దేవకీ-ఆనకదుందుభ్యామ్= దేవకీ వసుదేవులతో, ఆగమత్= వచ్చెను.

విదర్భరాజకుమారియగు రుక్మిణి ఈ విధముగా తర్కించుచుండెను. ఇంతలో దేవకి పుత్రుడు, పవిత్రకీర్తి అగు శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులతో గూడి విచ్చేసెను.

విజ్ఞతార్థోఽపి భగవాంస్తూష్ణీమాస జనార్దనః ।
నారదోఽకథయత్సర్వం శంబరాహరణాదికమ్ ॥ 36

జన-అర్దనః= దుష్టజనశిక్షకుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, విజ్ఞాత-అర్థః అపి= తెలియబడిన సత్యము గలవాడే ఐననూ, తూష్ణీం ఆస= మిన్నకుండెను, నారదః= నారదుడు, శంబర-ఆహరణ-ఆదికమ్= శంబరుడు అపహరించుట మొదలైన, సర్వమ్= సర్వమును, అకథయత్= చెప్పెను.

దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణభగవానుడు విషయమంతా తెలిసినా మిన్నకుండెను. శంబరుడు పిల్లవానిని అపహరించుట, మాయావతిని కలుసుకొనుట మొదలగు వివరములనన్నింటినీ నారదుడు వివరించెను.

తచ్ఛ్రుత్వా మహదాశ్చర్యం కృష్ణాంతఃపుర యోషితః ।
అభ్యనందన్ బహూనబ్దాన్ నష్టం మృతమివాగతమ్ ॥ 37

తత్= ఆ, మహత్= గొప్ప, ఆశ్చర్యమ్= అద్భుతమును, శ్రుత్వా= విని, కృష్ణ-అంతఃపురయోషితః= శ్రీకృష్ణుని అంతఃపురములోని స్త్రీలు,

బహూన్= చాల, అబ్దాన్= సంవత్సరములను, నష్టమ్= తప్పిపోయి నట్టియు, మృతమ్= మరణించినట్టియు, ఆగతం ఇవ= తిరిగి వచ్చిన వాని వలెనున్న ప్రద్యుమ్నుని, అభ్యనందన్= అభినందించిరి.

ఆ గొప్ప అద్భుతమును శ్రీకృష్ణుని అంతఃపురములోని స్త్రీలు విని ప్రద్యుమ్నుని అభినందించిరి. ఆతడు చాల సంవత్సరములు తప్పిపోయి, మరణించినవాడే తిరిగి వచ్చినాడా యన్నట్లుండెను.

దేవకీ వసుదేవశ్చ కృష్ణరామౌ తథా స్త్రియః ।
దంపతీ తౌ పరిష్వజ్య రుక్మిణీ చ యయు ర్ముదమ్ ॥ 38

దేవకీ= దేవకి, వసుదేవః చ= వసుదేవుడు కూడ, కృష్ణరామౌ= శ్రీకృష్ణబలరాములు, తథా= అదే విధముగా, స్త్రియః= స్త్రీలు, రుక్మిణీ చ= రుక్మిణి కూడ, తౌ= ఆ, దంపతీ= దంపతులను, పరిష్వజ్య= కౌగిలించి, ముదమ్= ఆనందమును, యయుః= పొందిరి.

దేవకి, వసుదేవుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు, రుక్మిణి, అంతఃపురస్త్రీలు కూడ ఆ దంపతులను కౌగిలించి ఆనందించిరి.

నష్టం ప్రద్యుమ్నమాయాతమాకర్ణ్య ద్వారకౌకసః ।
అహో మృత ఇవాయాతో బాలో దిష్ట్యేతి హాబ్రువన్ ॥ 39

నష్టమ్= తప్పిపోయి, ఆయాతమ్= తిరిగి వచ్చిన, ప్రద్యుమ్నమ్= ప్రద్యుమ్నుని గురించి, ఆకర్ణ్య= విని, ద్వారకా-ఓకసః= ద్వారకా నగరవాసులు, అహో= ఆహా!, దిష్ట్యా= మంగళము, మృతః= మరణించిన, బాలః= పిల్లవాడు, ఆయాతః ఇవ= వచ్చినాడా యన్నట్లు, ఇతి= అని, అబ్రువన్ హ= పలికిరట.

తప్పిపోయిన ప్రద్యుమ్నుడు తిరిగి వచ్చినాడని విని ద్వారకా నగరవాసులు ఇట్లు పలికిరట - ఆహా! మంగళము. మరణించిన పిల్లవాడు తిరిగి వచ్చినాడా అన్నట్లున్నది.

యం వై ముహుః పితృసరూప నిజేశభావాః
తన్మాతరో యదభజన్ రహరూఢభావాః ।
చిత్రం న తత్ఖలు రమాస్పద బింబ బింబే
కామే స్మరేఽక్షివిషయే కిముతాన్యనార్యః ॥ 40

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే పంచపంచాశత్తమోఽధ్యాయః ॥

యమ్= ఎవనిని గురించి, ముహుః= పలుమార్లు, పితృసరూపనిజ-ఈశభావాః= తండ్రితో పోలిక వలన తమ భర్త అనే భావము గల, తత్-మాతరః= ఆతని తల్లులు, రహరూఢభావాః= ఏకాంతమునందు కలిగిన ప్రేమ గలవారై, అభజన్= ప్రేమించినారనేది, యత్= ఏది గలదో, తత్= అది, రమాస్పదబింబబింబే= లక్ష్మీదేవికి నిలయమగు శ్రీహరియొక్క అవతారమైన శ్రీకృష్ణుని పుత్రుడగు, కామే= కాముని విషయములో, చిత్రమ్= ఆశ్చర్యము, న ఖలు= కానే కాదు, స్మరే= కాముడు, అక్షి విషయే - కన్నులకు కనబడుచుండగా, అన్యనార్యః= ఇతర స్త్రీలు, కిం ఉత= వేరుగా చెప్పవలయునా?

ప్రద్యుమ్నుడు పూర్తిగా తండ్రియగు శ్రీకృష్ణుని పోలియుండెను. ఆతనిని చూచి కృష్ణపత్నులు పలుమార్లు తమ భర్త అని తలపోసి ఏకాంతమునందు ప్రేమను భావన చేసెడివారు. కాని, వెంటనే తెలుసుకొని ఆతనితో యథోచితముగా వ్యవహరించెడివారు. లక్ష్మీదేవికి పెనిమిటియగు శ్రీహరియొక్క అవతారమైన శ్రీకృష్ణునకు పుత్రుడగు కాముని విషయములో ఇట్టి భ్రాంతి కలుగుట విచిత్రము కానే కాదు. సాక్షాత్తు కాముడు ఎదురుగా నుండగా, ఇతర స్త్రీలు ప్రేమను పొందిరని వేరుగా చెప్పవలయునా?

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
ప్రద్యుమ్నుని జన్మను, శంబరాసురుని వధను వర్ణించే
ఏబది యైదవ అధ్యాయము ముగిసినది (55).

అథ షట్పంచాశత్తమోఽధ్యాయః

స్యమంతకమణి వృత్తాంతము

శ్రీశుక ఉవాచ ।

సత్రాజిత స్స్వ తనయాం కృష్ణాయ కృతకల్బిషః ।
స్యమంతకేన మణినా స్వయముద్యమ్య దత్తవాన్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, కృతకిల్బిషః= చేయబడిన అపరాధము గల, సత్రాజితః= సత్రాజిత్తు, స్వయమ్= స్వయముగా, ఉద్యమ్య= ప్రయత్నము చేసి, స్వతనయామ్= తన కుమార్తెను, స్యమంతకేన= స్యమంతకమనే, మణినా= మణితో, దత్తవాన్= ఇచ్చిన వాడు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణుని యెడల అపరాధము చేసిన సత్రాజిత్తు స్వయముగా ప్రయత్నము చేసి తన కుమార్తెను స్యమంతకమనే మణితో సహా ఆయనకిచ్చి వివాహము చేసెను.

రాజోవాచ ।

సత్రాజితః కిమకరో ద్బ్రహ్మన్ కృష్ణస్య కిల్బిషమ్ ।
స్యమంతకః కుతస్తస్య కస్మాద్దత్తా సుతా హరేః ॥ 2

రాజుః= రాజు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహర్షీ!, సత్రాజితః = సత్రాజిత్తు, కృష్ణస్య= శ్రీకృష్ణునకు, కిమ్= ఏ, కిల్బిషమ్= అపరాధమును, అకరోత్= చేసెను?, తస్య= వానికి, స్యమంతకః= స్యమంతకమణి, కుతః = ఎక్కడిది?, హరేః= శ్రీకృష్ణ భగవానునకు, సుతా= కుమార్తె, కస్మాత్= ఎందువలన, దత్తా= ఈయబడినది?

రాజు ఇట్లు పలికెను... ఓ మహర్షీ! సత్రాజిత్తు శ్రీకృష్ణుని యెడల చేసిన అపరాధమెట్టిది? ఆతనికి స్యమంతకమణి ఎక్కడిది? ఆయన శ్రీకృష్ణభగవానునకు కుమార్తెనిచ్చి వివాహము చేయుటకు కారణమేమి?

శ్రీశుక ఉవాచ ।

ఆసీత్సత్రాజిత స్సూర్యో భక్తస్య పరమస్సఖా ।
ప్రీతస్తస్మై మణిం ప్రాదాత్సూర్యస్తుష్ట స్యమంతకమ్ ॥ 3

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భక్తస్య= భక్తుడైన, సత్రాజితః= సత్రాజిత్తునకు, సూర్యః= సూర్యుడు, పరమః= గొప్ప, ప్రీతః = ప్రియుడైన, సఖా= మిత్రుడై, ఆసీత్= ఉండెను, తుష్టః= సంతోషించిన, సూర్యః= సూర్యుడు, తస్మై= వాని కొరకు, స్యమంతకమ్= స్యమంతకమనే, మణిమ్= మణిని, ప్రాదాత్= ఇచ్చెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను - సత్రాజిత్తు గొప్ప సూర్యభక్తుడు. సూర్యునికి కూడ ఆయనంటే ప్రీతి. ఆయన భక్తికి సంతోషించి సూర్యుడాయనకు స్యమంతక మణిని ఇచ్చెను.

స తం బిభ్రన్మణిం కంఠే భ్రాజమానో యథా రవిః ।
ప్రవిష్టో ద్వారకాం రాజంస్తేజసా నోపలక్షితః ॥ 4

రాజన్= ఓ రాజా!, సః= ఆతడు, తమ్= ఆ, మణిమ్= మణిని, కంఠే= కంఠమునందు, బిభ్రత్= ధరించువాడై, రవిః యథా - సూర్యుడువలె, భ్రాజమానః= ప్రకాశించువాడై, ద్వారకామ్= ద్వారకానగరమును, ప్రవిష్టః = ప్రవేశించినవాడు, తేజసా= తేజస్సుచే, న ఉపలక్షితః= కానరానివాడు.

ఓ పరీక్షిన్మహారాజా! ఆతడా మణిని మెడలో దాల్చి సూర్యుడు వలె ప్రకాశిస్తూ ద్వారకకు వచ్చెను. తేజస్సు కారణముగా జనులాతనిని కన్నెత్తి చూడ (గుర్తించ) లేకపోయిరి.

తం విలోక్య జనా దూరాత్తేజసా ముష్టదృష్టయః ।
దీవ్యతేఽక్షైర్భగవతే శశంసుస్సూర్యశంకితాః ॥ 5

జనాః= జనులు, తమ్= ఆయనను, దూరాత్= దూరమునుండి, విలోక్య= చూచి, తేజసా= తేజస్సుచే, ముష్టదృష్టయః= అపహరించబడిన

చూపుగలవారై, సూర్యశంకితాఃⁿ సూర్యుడేమోననే సందేహము గలవారై, అక్షైఃⁿ పాచికలతో, దివ్యతేⁿ ఆడుచున్న, భగవతేⁿ శ్రీకృష్ణభగవానుని కొరకు, శశంసుఃⁿ చెప్పిరి.

జనులాయనను దూరమునుండి చూచి సూర్యుడేమోనని తలపోసిరి. ఎందుకంటే, ఆయన తేజస్సు వారి చూపును అపహరించెను. వారు పాచికలాడుచున్న శ్రీకృష్ణ భగవానునకు విన్నవించిరి.

నారాయణ నమస్తేస్తు శంఖచక్రగదాధర ।
దామోదరారవిందాక్ష గోవింద యదునందన ॥ 6

నారాయణⁿ ఓ నారాయణా!, శంఖచక్రగదాధరⁿ శంఖచక్ర గదలను ధరించువాడా!, దామ–ఉదరⁿ యశోదచే ఉదరము నందు త్రాడు కట్టబడినవాడా!, అరవింద–అక్షⁿ పద్మములవంటి కన్నులు గలవాడా!, గోవిందⁿ ఓ గోవిందా!, యదునందనⁿ యాదవవంశమునా నందింప జేయువాడా!, తేⁿ నీ కొరకు, నమఃⁿ నమస్కారము, అస్తుⁿ అగుగాక!

ఓ నారాయణా! నీవు శంఖచక్రగదాధారివి. నిన్ను యశోద త్రాటితో నడుమునందు కట్టివేసెను. గోవిందా! పద్మములవంటి కన్నులు గల నీవు యదువంశమునానందింప జేయుచున్నావు. నీకు నమస్కారమగు గాక!

ఏష ఆయాతి సవితా త్వాం దిదృక్షుర్జగత్పతే ।
ముష్ణన్ గభస్తిచక్రేణ నృణాం చక్షూంషి తిగ్మగుఃⁿ ॥ 7

జగత్–పతేⁿ ఓ జగన్నాథా!, ఏషఃⁿ ఈ, తిగ్మగుఃⁿ వాడి కిరణములు గల, సవితాⁿ సూర్యుడు, త్వామ్ⁿ నిన్ను, దిదృక్షుఃⁿ చూడగోరువాడై, గభస్తిచక్రేణⁿ కాంతిమండలముచే, నృణామ్ⁿ జనుల, చక్షూంషిⁿ చూపులను, ముష్ణన్ⁿ అపహరించువాడై, ఆయాతిⁿ వచ్చుచున్నాడు.

ఓ జగన్నాథా! వాడి కిరణములు గల ఈ సూర్యుడు నిన్ను చూడగోరి వచ్చుచున్నాడు. ఆయన కాంతి మండలము జనుల కన్నులకు మిరుమిట్లు గొల్పి చూడలేకుండా చేయుచున్నది.

నన్వన్విచ్ఛంతి తే మార్గం త్రిలోక్యాం విబుధర్షభాః ।
జ్ఞాత్వాఽద్య గూఢం యదుషు ద్రష్టుం త్వాం యాత్యజః ప్రభో ॥ 8

ప్రభో= ఓ ప్రభూ!, విబుధ-ఋషభాః= దేవశ్రేష్ఠులు, త్రిలోక్యామ్= ముల్లోకములయందు, తే= నీ, మార్గమ్= పొందే ఉపాయమును, అన్విచ్ఛంతి ననుసరించుచుందురు గదా!, అజః= సూర్యుడు, యదుషు= యాదవులయందు, గూఢమ్= రహస్యముగానున్న, త్వామ్= నీ గురించి, జ్ఞాత్వా= తెలిసి, ద్రష్టుమ్= చూచుటకు, యాతి= వస్తున్నాడు.

ఓ ప్రభూ! గొప్ప గొప్ప దేవతలు కూడ ముల్లోకములలో నిన్ను పొందే ఉపాయమును గురించి అన్వేషించెదరు సుమా!

శ్రీశుక ఉవాచ ।

నిశమ్య బాలవచనం ప్రహస్యాంబుజలోచనః ।
ప్రాహ నాసౌ రవి ర్దేవ స్సత్రాజిన్మణినా జ్వలన్ ॥ 9

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అంబుజలోచనః= పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు, బాల వచనమ్= అమాయకుల మాటను, నిశమ్య= విని, ప్రహస్య= నవ్వి, ప్రాహ= పలికెను, అసౌ= ఈతడు, రవిః దేవః= సూర్య భగవానుడు, న= కాడు, మణినా= మణితో, జ్వలన్= ప్రకాశిస్తున్న, సత్రాజిత్= సత్రాజిత్తు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను - పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు అమాయకులగు ఆ జనుల మాటను విని నవ్వి, ఇట్లు చెప్పెను - ఈతడు సూర్యభగవానుడు కాడు; మణితో ప్రకాశించుచున్న సత్రాజిత్తు.

సత్రాజి త్స్వగృహం శ్రీమత్కృత కౌతుక మంగలమ్ ।
ప్రవిశ్య దేవసదనే మణిం విప్రైర్న్యవేశయత్ ॥ 10

సత్రాజిత్= సత్రాజిత్తు, శ్రీమత్= శోభాయుక్తమైనట్టియు, కృతకౌతుకమంగలమ్= చేయబడిన మంగళోత్సవము గల, స్వగృహమ్= తన యింటిని, ప్రవిశ్య= ప్రవేశించి, దేవసదనే= దేవుని పూజాగృహము నందు, మణిమ్= మణిని, విప్రైః= వేదవేత్తలచే, న్యవేశయత్= స్థాపింపజేసెను.

సత్రాజిత్తు రాకను పురస్కరించుకొని ఆతని ఇంటిలో మంగళోత్సవము చేయబడెను. ఆయన శోభాయుక్తమైన స్వగృహములో ప్రవేశించి, దేవుని పూజామందిరములో వేదవేత్తలచే స్యమంతకమణిని స్థాపింపజేసెను.

దినే దినే స్వర్ణభారానష్టౌ స సృజతి ప్రభో ।
దుర్భిక్షమార్యరిష్టాని సర్పాధివ్యాధయోఽశుభాః ।
న సంతి మాయినస్తత్ర యత్రాస్తేఽభ్యర్చితో మణిః ॥ 11

ప్రభో= ఓ రాజా!, సః= ఆ మణి, దినే దినే= ప్రతి దినము, అష్టౌ= ఎనిమిది, స్వర్ణభారాన్= బంగారము యొక్క బారువులను, సృజతి= ఉత్పన్నము చేయును, యత్ర= ఎక్కడనైతే, అభ్యర్చితః= పూజించబడే, మణిః = స్యమంతకమణి, ఆస్తే= ఉండునో, తత్ర= అచట, దుర్భిక్షమారీ-అరిష్టాని= కరువు మారకరోగములు గ్రహపీడలు, సర్ప-ఆధివ్యాధయః= పాములు మనోవ్యాధులు రోగములు, అశుభాః= అమంగళములు, మాయినః= చోరులు, న సంతి= ఉండరు.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ స్యమంతకమణి ప్రతిదినము ఎనిమిది బారువుల బంగారమును ఉత్పన్నము చేయును. దానిని ఎక్కడ స్థాపించి పూజిస్తారో అక్కడ కరువు, మారకరోగములు, గ్రహపీడలు, పాములు, మనోవ్యాధులు, రోగములు, అమంగళములు, చోరులు ఉండరు.

స యాచితో మణిం క్వాపి యదురాజాయ శౌరిణా ।
నైవార్థకామకుకః ప్రాదాద్యాచ్ఞాభంగమతర్కయన్ ॥ 12

క్వాపి= ఒకప్పుడు, అర్థకాముకః= ధనమునందు కామన గల, సః= ఆ సత్రాజిత్తు, యదురాజాయ= యాదవప్రభువగు ఉగ్రసేనుని కొరకు, మణిమ్= మణిని గురించి, శౌరిణా= శూరవంశీయుడగు శ్రీకృష్ణునిచే, యాచితః= కోరబడినవాడై, యాచ్ఞాభంగమ్= కోరికకు భంగమును గూర్చి, అతర్కయన్= ఆలోచించనివాడై, న ప్రాదాత్ ఏవ= ఈయనే లేదు.

ఒకప్పుడు శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు సత్రాజిత్తును ఆ మణిని యాదవ ప్రభుడగు ఉగ్రసేనుని కొరకు ఇండని కోరెను. ఆయన కోరికకు భంగమును కలిగించకూడదనే వివేకము ధనలోభియగు సత్రాజిత్తునకు లేకుండెను. ఆతడా కోరికను మన్నించనే లేదు.

తమేకదా మణిం కంఠే ప్రతిముచ్య మహాప్రభమ్ ।
ప్రసేనో హయమారుహ్య మృగయాం వ్యచరద్వనే ॥ 13

ఏకదా= ఒకనాడు, ప్రసేనః= ప్రసేనుడు, మహాప్రభమ్= గొప్ప కాంతి గల, తమ్= ఆ, మణిమ్= మణిని, కంఠే= కంఠమునందు, ప్రతిముచ్య= కట్టుకొని, హయమ్= గుర్రమును, ఆరుహ్య= ఎక్కి, వనే= అడవియందు, మృగయామ్= వేటను గురించి, వ్యచరత్= సంచరించెను.

ఒకనాడు ప్రసేనుడు (సత్రాజిత్తు సోదరుడు) గొప్ప కాంతి గల ఆ మణిని మెడలో కట్టుకొని గుర్రమెక్కి అడవిలో వేటాడుతూ సంచరించెను.

ప్రసేనం సహయం హత్వా మణిమాచ్ఛిద్య కేసరీ ।
గిరిం విశన్ జాంబవతా నిహతో మణిమిచ్ఛతా ॥ 14

కేసరీ= సింహము, సహయమ్= గుర్రముతో కూడియున్న, ప్రసేనమ్= ప్రసేనుని, హత్వా= చంపి, మణిమ్= మణిని, ఆచ్ఛిద్య= లాగుకొని, గిరిమ్= పర్వతమును, విశన్= ప్రవేశించుచున్నవై, మణిమ్= మణిని, ఇచ్ఛతా= కోరే, జాంబవతా= జాంబవంతునిచే, నిహతః= చంపబడినది.

ఒక సింహము ప్రసేనుని, గుర్రమును చంపి ఆ మణిని లాగుకొని కొండ ఎక్కుతూంటే, ఆ మణిని కోరి జాంబవంతుడు దానిని చంపెను.

సోఽపి చక్రే కుమారస్య మణిం క్రీడనకం బిలే ।
అపశ్యన్ భ్రాతరం భ్రాతా సత్రాజిత్పర్యతప్యత ॥ 15

సః అపి= ఆ జాంబవంతుడు కూడ, మణిమ్= మణిని, బిలే= గుహయందు, కుమారస్య= పిల్లవానికి, క్రీడనకమ్= ఆట వస్తువునుగా, చక్రే= చేసెను, భ్రాతా= సోదరుడగు, సత్రాజిత్= సత్రాజిత్తు, భ్రాతరమ్= సోదరుని, అపశ్యన్= కాననివాడై, పర్యతప్యత= దుఃఖించెను.

ఆ జాంబవంతుడున్నూ మణిని గుహలో తన పిల్లవానికి ఆట వస్తువుగా చేసెను. అన్నగారు సత్రాజిత్తు తన తమ్ముడు కానరాకుండుటచే చాల దుఃఖమును పొందెను.

ప్రాయః కృష్ణేన నిహతో మణిగ్రీవో వనం గతః ।
భ్రాతా మమేతి తచ్ఛ్రుత్వా కర్ణే కర్ణేఽజపన్ జనాః ॥ 16

మమ= నా, భ్రాతా= తమ్ముడు, మణిగ్రీవః= మణి మెడయందు గలవాడై, వనమ్= అడవిని గురించి, గతః= వెళ్లినవాడు, ప్రాయః= బహుశః, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, నిహతః= చంపబడినవాడు, ఇతి= అనే, తత్= ఆ మాటను, శ్రుత్వా= విని, జనాః= జనులు, కర్ణే కర్ణే= ప్రతి చెవియందు, అజపన్= గుసగుసలాడిరి.

నా తమ్ముడు మణిని మెడలో పెట్టుకొని అడవికి వెళ్లినాడు. వానిని బహుశః శ్రీకృష్ణుడే చంపి ఉండును, అని ఆ సత్రాజిత్తు అనెను. ఆ మాటను విని జనులు ప్రతివాని చెవిలో గుసగుసలాడిరి.

భగవాంస్తదుపశ్రుత్య దుర్యశో లిప్తమాత్మని ।
మార్ష్టుం ప్రసేనపదవీ మన్వపద్యత నాగరైః ॥ 17

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఆత్మని= తనయందు, లిప్తమ్= అంటించబడిన, తత్= ఆ, దుర్-యశః= అపకీర్తిని గురించి, ఉపశ్రుత్య= విని, మార్ష్టుమ్= తుడిచివేయుటకై, నాగరైః= పౌరులతో కూడి, ప్రసేనపదవీమ్= ప్రసేనుని ఆచూకీ గురించి, అన్వపద్యత= వెదికెను.

శ్రీకృష్ణ భగవానుడు తనపై చల్లబడిన ఆ బురద (అపకీర్తి)ను గురించి వినెను. ఆయన దానిని తుడిచివేయుటకై కొందరు పురజనులతో కూడి ప్రసేనుని ఆచూకీని వెదుక్కుంటూ అడవికి వెళ్లెను.

హతం ప్రసేన మశ్వం చ వీక్ష్య కేసరిణా వనే ।
తం చాద్రిపృష్ఠే నిహతమృక్షేణ దదృశు ర్జనాః ॥ 18

వనే= అడవియందు, కేసరిణా= సింహముచే, హతమ్= చంపబడిన, ప్రసేనమ్= ప్రసేనుని, అశ్వం చ = గుర్రమును కూడ, వీక్ష్య= చూచి, అద్రి పృష్ఠే= కొండ శిఖరమునందు, ఋక్షేణ= జాంబవంతునిచే, నిహతమ్= చంపబడిన, తం చ= ఆ సింహమును కూడ, జనాః= జనులు, దదృశుః= చూచిరి.

అడవిలో సింహముచే చంపబడిన ప్రసేనుని, వాని గుర్రమును జనులు చూచిరి. ఆ తరువాత కొండ శిఖరము పై జాంబవంతునిచే చంపబడిన ఆ సింహమును కూడ జనులు చూచిరి.

ఋక్షరాజబిలం భీమమంధేన తమసాఽఽవృతమ్ ।
ఏకో వివేశ భగవానవస్థాప్య బహిః ప్రజాః ॥ 19

భీమమ్= భయంకరమైనట్టియు, అంధేన= గ్రుడ్డివానిని చేసే, తమసా= చీకటితో, ఆవృతమ్= ఆవరించబడియున్న, ఋక్షరాజబిలమ్= జాంబవంతుని గుహను, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏకః= ఒక్కడే, ప్రజాః= జనులను, బహిః= బయట, అవస్థాప్య= నిలబెట్టి, వివేశ= ప్రవేశించెను.

జాంబవంతుని గుహ కళ్లు పొడుచుకున్నా కానరాని చీకటితో నిండి భయమును గొల్పుచుండెను. శ్రీకృష్ణభగవానుడు జనులను బయట నిలబెట్టి తానొక్కడే ఆ గుహలో ప్రవేశించెను.

తత్ర దృష్ట్వా మణిశ్రేష్ఠం బాలక్రీడనకం కృతమ్ ।
హర్తుం కృతమతి స్తస్మి న్నవతస్థేఽర్భకాంతికే ॥ 20

తత్ర= దానియందు, బాలక్రీడనకమ్= పిల్లవానికి ఆటవస్తువుగా, కృతమ్= చేయబడిన, మణి శ్రేష్ఠమ్= గొప్ప మణిని, దృష్ట్వా= చూచి, హర్తుమ్= తీసుకొనుటకు, కృతమతిః= చేయబడిన నిశ్చయము గలవాడై, తస్మిన్= ఆ గుహయందు, అర్భక-అంతికే= పిల్లవాని సమీపమునందు, అవతస్థే= నిలబడెను.

ఆ గుహలో పిల్లవానికి ఆటవస్తువుగా చేయబడిన ఆ గొప్ప మణిని ఆయన చూచెను. దానిని తీసుకొన నిశ్చయించి, ఆయన పిల్లవాని దగ్గరకు వెళ్లి నిలబడెను.

తమపూర్వం నరం దృష్ట్వా ధాత్రీ చుక్రోశ భీతవత్ ।
తచ్ఛ్రుత్వాఽభ్యద్రవ త్క్రుద్ధో జాంబవాన్ బలినాం వరః ॥21

అపూర్వమ్= ఇదివరలో ఎన్నడూ చూడని, తమ్= ఆ, నరమ్= మానవుని, దృష్ట్వా= చూచి, ధాత్రీ= దాది, భీతవత్= భయపడినది వలె, చుక్రోశ= అరిచెను, తత్= ఆ అరుపును, శ్రుత్వా= విని, బలినామ్=

బలవంతులలో, వరః= శ్రేష్ఠుడగు, జాంబవాన్= జాంబవంతుడు, క్రుద్ధః= కోపించినవాడై, అభ్యద్రవత్= పరుగెత్తుకు వచ్చెను.

ఇదివరలో ఎన్నడూ చూడని ఆ మనిషిని చూచి దాది భయపడినది వలె అరిచెను. బలవంతులలో శ్రేష్ఠుడగు జాంబవంతుడు ఆ అరుపు విని కోపించి పరుగెత్తుకు వచ్చెను.

స వై భగవతా తేన యుయుధే స్వామినాఽఽత్మనః ।
పురుషం ప్రాకృతం మత్వా కుపితో నానుభావవిత్ ॥ 22

కుపితః= కోపించినవాడు, అనుభావవిత్= మహిమ తెలిసినవాడు, న= కాడు, సః వై= ఆ జాంబవంతుడైతే, ప్రాకృతమ్ సామాన్యుడైన, పురుషమ్= మనిషినిగా, మత్వా= తలచి, ఆత్మనః= తనకు, స్వామినా= ప్రభువైన, తేన= ఆ, భగవతా= శ్రీకృష్ణ భగవానునితో, యుయుధే= యుద్ధము చేసెను.

ఆ జాంబవంతుడు కోపించిన కారణముగా, రామావతారములో) తన ప్రభువగు శ్రీకృష్ణభగవానుని ప్రభావమును గుర్తించలేకపోయెను. ఆయన మామూలు మనిషి అని తలచి, ఆతడాయనతో యుద్ధమునకు దిగెను.

ద్వంద్వ యుద్ధం సుతుముల ముభయో ర్విజిగీషతోః ।
ఆయుధాశ్మ ద్రుమై ర్దోర్భిః క్రవ్యార్థే శ్యేనయోరివ ॥ 23

విజిగీషతోః= జయించగోరే, ఉభయోః= ఇద్దరికి, క్రవ్య-అర్థే= మాంసము అనే ప్రయోజనమునందు, శ్యేనయోః ఇవ= డేగలకు వలె, సుతుములమ్= మిక్కిలి సంకులమైన, ద్వంద్వయుద్ధమ్= ద్వంద్వయుద్ధము, ఆయుధ-అశ్మద్రుమైః= ఆయుధములతో రాళ్లతో చెట్లతో, దోర్భిః= భుజములతో (ఆయెను).

ఒకరినొకరు జయించగోరే వారిద్దరు, మాంసము కొరకు డేగల వలె, మిక్కిలి సంకులమైన ద్వంద్వయుద్ధమును చేసిరి. ఆయుధములతో ప్రారంభమైన ఆ యుద్ధము రాళ్ళతో, చెట్లతో, భుజములతో కొనసాగెను.

ఆసీత్తదష్టావింశాహ మితరేతర ముష్టిభిః ।
వజ్రనిష్పేషపరుషై రవిశ్రమ మహర్నిశమ్ ॥ 24

వజ్రనిష్పేషపరుషైః= పిడుగుపాటు వలె కఠోరమైన, ఇతర-ఇతరముష్టిభిః= ఒకరిని మరియొకరు కొట్టే పిడిగుద్దులతో, తత్= ఆ యుద్ధము, అహః-నిశమ్= రాత్రింబగళ్లు, అవిశ్రమమ్= విశ్రాంతి లేకుండా, అష్టావింశ-అహమ్= ఇరవై ఎనిమిది రోజులు, ఆసీత్= జరిగెను.

వారు ఒకరినొకరు పిడుగుపాటువంటి పిడిగుద్దులతో కొట్టుకుంటూ రాత్రింబగళ్లు విశ్రాంతి లేకుండా ఇరవై ఎనిమిది రోజులు యుద్ధము చేసిరి.

కృష్ణ ముష్టి వినిష్పాత నిష్పిష్టాంగోరు బంధనః ।
క్షీణసత్త్వ స్స్విన్నగాత్ర స్తమాహాతీవ విస్మితః ॥ 25

కృష్ణముష్టివినిష్పాతనిష్పష్ట-అంగ-ఉరుబంధనః= శ్రీకృష్ణుని పిడిగుద్దులచే నుగ్గు నుగ్గు అయిన అవయవముల పలు కీళ్లు కలిగిన వాడు, క్షీణసత్త్వః= క్షీణించిన బలము గలవాడు, స్విన్నగాత్రః= చెమటతో తడిసిన దేహము గలవాడు అగు జాంబవంతుడు, అతీవ= చాల, విస్మితః = ఆశ్చర్యపడినవాడై, తమ్= ఆయనను ఉద్దేశించి, ఆహ= పలికెను.

శ్రీకృష్ణుని పిడిగుద్దులచే జాంబవంతుని అవయవములు, కీళ్లు నుగ్గు నుగ్గు ఆయెను. ఆతనికి బలము క్షీణించి, దేహము చెమటతో తడిసి ముద్దాయెను. ఆతడు చాల ఆశ్చర్యపడి శ్రీకృష్ణునితో నిట్లనెను.

జానే త్వాం సర్వభూతానాం ప్రాణ ఓజస్సహో బలమ్ ।
విష్ణుం పురాణపురుషం ప్రభవిష్ణు మధీశ్వరమ్ ॥ 26

సర్వభూతానామ్= సకల ప్రాణుల, ప్రాణః= ప్రాణము, ఓజః= ఇంద్రియ శక్తి, సహః= అంతఃకరణ శక్తి, బలమ్= శరీరశక్తి ఏది గలదో అది, త్వామ్= నీవేనని, పురాణపురుషమ్= సకలజగత్తునకు కారణమైన పూర్ణబ్రహ్మ యైనట్టియు, ప్రభవిష్ణుమ్= సర్వసమర్థుడవైనట్టియు, అధీశ్వరమ్= సర్వ జగత్పాలకుడవైన, విష్ణుమ్= విష్ణువునుగా, జానే= తెలియుచున్నాను.

సకలప్రాణులలోని ప్రాణశక్తి, ఇంద్రియ శక్తి, మనశ్శక్తి, దేహశక్తి నీవే. సకలజగత్తును సృష్టించి పాలించే సర్వసమర్థుడగు విష్ణువు నీవేనని నేను గుర్తు పట్టుచున్నాను. పూర్ణబ్రహ్మవు నీవే.

త్వం హి విశ్వసృజాం స్రష్టా సృజ్యానామపి యచ్చ సత్ ।
కాలః కలయతామీశః పర ఆత్మా తథాఽఽత్మనామ్ ॥ 27

విశ్వసృజామ్= జగత్తును సృష్టించే ప్రజాపతులకు, స్రష్టా= సృష్టించువాడవు, సృజ్యానామ్= సృష్టించబడే పంచభూతములు మొదలగువాటి, యత్= ఏ, సత్ అపి= సత్త గలదో అది కూడ, త్వం హి= నీవే, కలయతామ్= శాసకులకు, ఈశః= శాసించే, కాలః= కాలస్వరూపుడవు, తథా= అదే విధముగా, ఆత్మనామ్= జీవుల, పరః= అంతరతమమగు, ఆత్మా= ఆత్మవు.

జగత్తును సృష్టించే ప్రజాపతులను సృష్టించేది నీవే. సృష్టించబడే పంచభూతములు మొదలగువాటి సత్త యేది గలదో అది నీవే. కాలస్వరూపుడవగు నీవు ఇంద్రాదిప్రభువులను కూడ శాసించెదవు. జీవుల అంతరతమమగు ఆత్మవు నీవే.

యస్యేషదుత్కలిత రోష కటాక్ష మోక్షైః ।
వర్త్మాదిశత్ క్షుభిత నక్రతిమింగిలోఽబ్ధిః ।
సేతుః కృత స్స్వయశ ఉజ్జ్వలితా చ లంకా
రక్ష శ్శిరాంసి భువి పేతు రిషుక్షతాని ॥ 28

యస్య= ఏ నీయొక్క, ఈషద్-ఉత్కలితరోషకటాక్షమోక్షైః= కొంచెము ఉద్దీపితమైన కోపముతోడి చూపుల విసరుటచే, క్షుభితనక్రతి-మింగిలః= క్షోభిల్లిన మొసళ్లు తిమింగిలములు గల, అబ్ధిః= సముద్రము, వర్త్మ= మార్గమును, ఆదిశత్= ఇచ్చెనో, స్వయశః= నీ కీర్తియైన, సేతుః = సేతువు, కృతః= చేయబడినదో, లంకా చ = లంక కూడ, ఉజ్జ్వలితా= దహించబడినదో, ఇషుక్షతాని= బాణములచే కొట్టబడిన, రక్షః-శిరాంసి= రాక్షసుల తలలు, భువి= నేలపై, పేతుః= పడినవో.

కొంచెము పైకి వచ్చిన కోపముతో నీవు చూసిన చూపులకు సముద్రములోని మొసళ్లు, తిమింగిలములు క్షోభిల్లగా, సముద్రుడు దారిని ఇచ్చెను. దానిపై కట్టిన సేతువు నీ కీర్తిని చాటుచునే యున్నది. నీవు లంకను నాశము చేసితివి. నీ బాణములచే కొట్టబడిన రాక్షసుల తలలు నేల గూలినవి.

ఇతి విజ్ఞాత విజ్ఞాన మృక్షరాజాన మచ్యుతః ।
వ్యాజహార మహారాజ భగవాన్ దేవకీసుతః ॥ 29

మహారాజ= ఓ మహారాజా!, ఇతి= ఈ విధముగా, విజ్ఞాత-విజ్ఞానమ్= తెలియబడిన స్వరూపము గల, ఋక్షరాజానమ్= జాంబవంతుని ఉద్దేశించి, దేవకీసుతః= దేవకి పుత్రుడగు, అచ్యుతః భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, వ్యాజహార= పలికెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఈ విధముగా శ్రీకృష్ణ భగవానుని స్వరూపమును జాంబవంతుడు గుర్తించెను. దేవకీసుతుడగు అచ్యుతుడాయనతో నిట్లనెను.

అభిమృశ్యారవిందాక్షః పాణినా శంకరేణ తమ్ ।
కృపయా పరయా భక్తం ప్రేమగంభీరయా గిరా ॥ 30

అరవింద-అక్షః= పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు, పరయా= గొప్ప, కృపయా= దయతో, శంకరేణ= సుఖమును కలిగించే, పాణినా= చేతితో, తమ్= ఆ, భక్తమ్= భక్తుడైన జాంబవంతుని, అభిమృశ్య= స్పృశించి, ప్రేమగంభీరయా= ప్రేమతో గంభీరమైన, గిరా= వాక్కుతో-

పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు గొప్ప దయతో తన సుఖకరమైన చేతితో భక్తు డైన ఆ జాంబవంతుని దేహమును స్పృశించి, ప్రేమతో గంభీరమైన వాక్కుతో నిట్లనెను.

మణిహేతోరిహ ప్రాప్తా వయ మృక్షపతే బిలమ్ ।
మిథ్యాఽభిశాపం ప్రమృజన్నాత్మనో మణినామునా ॥ 31

ఋక్షపతే= ఓ జాంబవంతా!, వయమ్= మేము, మణి హేతోఃమణి కారణముగా, ఇహ= ఇచట, బిలమ్= గుహను గురించి, ప్రాప్తాఃవచ్చితిమి, అమునా= ఈ, మణినా= మణితో, ఆత్మనఃనా, మిథ్యా-అభిశాపమ్= అసత్యమగు అపవాదును, ప్రమృజన్= తుడిచి వేయువాడను.

ఓ జాంబవంతా! నేను మణికొరకై ఈ గుహకు వచ్చితిని. నేనీ మణితో నాకు కలిగిన అసత్యమగు అపవాదును తుడిచివేసెదను.

ఇత్యుక్త స్స్వాం దుహితరం కన్యాం జాంబవతీం ముదా ।
అర్హణార్థం స మణినా కృష్ణాయోపజహార హ ॥ 32

ఇతి= అని, ఉక్తఃపలుకబడిన, సఃఆ జాంబవంతుడు, అర్హణ-అర్థమ్= పూజించుట కొరకై, స్వామ్= తనదైన, దుహితరమ్= కుమార్తెయైన, కన్యామ్= కన్యయగు, జాంబవతీమ్= జాంబవతిని, ముదా= ఆనందముతో, మణినా= మణితో బాటుగా, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, ఉపజహార హ= సమర్పించెనట.

శ్రీకృష్ణుడిట్లు పలుకగా, ఆ జాంబవంతుడు ఆయనను పూజించుటకై మణితోబాటుగా తన పెళ్లి కాని కుమార్తెయగు జాంబవతిని ఆనందముతో సమర్పించెనట.

అదృష్ట్వా నిర్గమం శౌరేః ప్రవిష్టస్య బిలం జనాః ।
ప్రతీక్ష్య ద్వాదశాహాని దుఃఖితా స్స్వపురం యయుః ॥ 33

జనాఃⁿ జనులు, ద్వాదశ= పన్నెండు, అహాని= దినములను, ప్రతీక్ష్య= ఎదురుచూచి, బిలమ్= గుహను, ప్రవిష్టస్య= ప్రవేశించిన, శౌరేః= శూరవంశీయుడగు శ్రీకృష్ణునియొక్క, నిర్గమమ్= బయటకు వచ్చుటను, అదృష్ట్వా= కానక, దుఃఖితాఃⁿ దుఃఖించినవారై, స్వపురమ్= తమ నగరమును గురించి, యయుఃⁿ వెళ్లిరి.

జనులు పన్నెండు రోజులు వేచి చూచినా గుహలో ప్రవేశించిన శ్రీకృష్ణుడు బయటకు రాలేదు. అప్పుడు వారు దుఃఖితులై తమ నగరమునకు తిరిగి వెళ్లిరి.

నిశమ్య దేవకీ దేవీ రుక్మిణ్యానకదుందుభిః ।
సుహృదో జ్ఞాతయోఽశోచన్ బిలాత్కృష్ణమనిర్గతమ్ ॥ 34

బిలాత్= గుహనుండి, అనిర్గతమ్= బయటకు రాని, కృష్ణమ్= శ్రీకృష్ణుని గురించి, నిశమ్య= విని, దేవకీ దేవీ= దేవకీదేవి, రుక్మిణీ= రుక్మిణి, ఆనకదుందుభిఃⁿ వసుదేవుడు, సుహృదఃⁿ మిత్రులు, జ్ఞాతయఃⁿ బంధువులు, అశోచన్= దుఃఖించిరి.

శ్రీకృష్ణుడు గుహనుండి బయటకు రాలేదని విని దేవకీదేవి, రుక్మిణి, వసుదేవుడు, మిత్రులు, బంధువులు దుఃఖించిరి.

సత్రాజితం శపంతస్తే దుఃఖితా ద్వారకౌకసః ।
ఉపతస్థు ర్మహామాయాం దుర్గాం కృష్ణోపలబ్ధయే ॥ 35

దుఃఖితాఃⁿ దుఃఖితులైన, తే= ఆ, ద్వారకా-ఓకసఃⁿ ద్వారకానగర వాసులు, సత్రాజితమ్ⁿ సత్రాజిత్తును, శపంతఃⁿ తిట్టుచున్నవారై, కృష్ణ-ఉపలబ్ధయేⁿ శ్రీకృష్ణుని శీఘ్రముగా పొందుటకై, మహామాయామ్ⁿ జగత్కారణమైన మాయాశక్తియగు, దుర్గామ్ⁿ దుర్గా దేవిని, ఉపతస్థుఃⁿ ప్రార్థించిరి.

దుఃఖితులైన ఆ ద్వారకానగరవాసులు సత్రాజిత్తును తిట్టిపోసిరి. వారు జగత్కారణమగు మాయాశక్తియైన దుర్గాదేవిని, శ్రీకృష్ణుడు శీఘ్రముగా తిరిగి రావాలని ప్రార్థించిరి.

తేషాం తు దేవ్యుపస్థానా త్ప్రత్యాదిష్టాశిషా స చ ।
ప్రాదుర్బభూవ సిద్ధార్థ స్సదారో హర్షయన్ హరిః ॥ 36

తేషామ్ⁿ వారి యొక్క, దేవీ-ఉపస్థానాత్ⁿ దేవిని ప్రార్థించుట వలన, ప్రత్యాదిష్ట-ఆశిషాⁿ ఈయబడిన ఆశీస్సుతో బాటుగా, సిద్ధ-అర్థఃⁿ సిద్ధించిన ప్రయోజనము గల, సఃⁿ ఆ, హరిఃⁿ చⁿ శ్రీహరి కూడ, సదారఃⁿ భార్యతో కూడినవాడై, హర్షయన్ⁿ ఆనందింప జేయువాడై, ప్రాదుఃⁿ-బభూవⁿ ఆవిర్భవించెను.

వారు దేవిని ప్రార్థించగా ఆమె ఆశీస్సులనిచ్చెను. దానిచే ఆ శ్రీకృష్ణభగవానుడు సిద్ధించిన ప్రయోజనము (అపవాదును తుడిచివేయుట) గలవాడై భార్యయగు జాంబవతితో సహా వారికి కనబడెను. వారు చాల ఆనందించిరి.

ఉపలభ్య హృషీకేశం మృతం పునరివాగతమ్ ।
సహ పత్న్యా మణిగ్రీవం సర్వే జాత మహోత్సవాః ॥ 37

మృతమ్ⁿ మరణించినట్టియు, పునఃⁿ తిరిగి, ఆగతం ఇవⁿ వచ్చినట్లున్నట్టియు, మణిగ్రీవమ్ⁿ మణి మెడ యందున్న, హృషీక-

ఈశమ్= ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుని, పత్న్యా సహ= భార్యతో బాటుగా, ఉపలభ్య= చూచి, సర్వే= అందరు, జాతమహా–ఉత్సవాః= కలిగిన గొప్ప ఉత్సవము గలవారు.

ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుడు మరణించినవాడు తిరిగి వచ్చినాడా యన్నట్లు వారికి మెడలో మణితో భార్యతో సహా కనబడెను. వారందరు గొప్ప ఉత్సవమును చేసుకొనిరి.

సత్రాజితం సమాహూయ సభాయాం రాజసన్నిధౌ ।
ప్రాప్తిం చాఖ్యాయ భగవాన్మణిం తస్మై న్యవేదయత్ ॥ 38

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, సత్రాజితమ్= సత్రాజిత్తును, సభాయామ్= సభయందు, రాజసన్నిధౌ= ఉగ్రసేనమహారాజుయొక్క సన్నిధియందు, సమాహూయ= ఆహ్వానించి, ప్రాప్తిమ్= లభించుటను గురించి, ఆఖ్యాయ= చెప్పి, మణిం చ= మణిని కూడ, తస్మై= ఆయన కొరకు, న్యవేదయత్= సమర్పించెను.

శ్రీకృష్ణ భగవానుడు ఉగ్రసేన మహారాజు సన్నిధిలో సభకి సత్రాజిత్తుని ఆహ్వానించి, మణి దొరికిన విధమును చెప్పి, ఆయనకు సమర్పించెను.

స చాతివ్రీడతో రత్నం గృహీత్వాఽవాఙ్ముఖస్తతః ।
అనుతప్యమానో భవనమగమత్స్వేన పాప్మనా ॥ 39

సః చ= ఆ సత్రాజిత్తైతే, అతివ్రీడితః= మిక్కిలి సిగ్గు పడినవాడై, తతః= ఆయననుండి, రత్నమ్= మణిని, గృహీత్వా= తీసుకొని, స్వేన= తన, పాప్మనా= తప్పుచే, అనుతప్యమానః= పశ్చాత్తాపపడుచున్నవాడై, అవాఙ్ముఖః= వంచబడిన తల గలవాడై, భవనమ్= తన భవనమును గురించి, అగమత్= వెళ్లెను.

ఆ సత్రాజిత్తైతే శ్రీకృష్ణుని వద్దనుండి మణిని తీసుకొని చాల సిగ్గుపడి తన తప్పునకు పశ్చాత్తాపపడుతూ తల వంచుకొని తన భవనానికి వెళ్లెను.

సోఽనుధ్యాయం స్తదేవాఘం బలవ ద్విగ్రహాకులః ।
కథం మృజామ్యాత్మరజః ప్రసీదేద్వాఽచ్యుతః కథమ్ ॥ 40

బలవద్-విగ్రహ-ఆకులః= బలవంతులతోడి విరోధముచే వ్యాకులుడైన, సః= ఆ సత్రాజిత్తు, తత్= ఆ, అఘం ఏవ= అపరాధమును గురించియే, అనుధ్యాయన్= తలపోయువాడు, ఆత్మరజః= నా తప్పును, కథమ్= ఏ విధముగా, మృజామి= తుడిచివేయుదును?, అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, కథం వా= ఏ విధముగా, ప్రసీదేత్= ప్రసన్నుడగును?

బలవంతులగు యాదవులతోడి విరోధము వలన ఆ సత్రాజిత్తు మనస్సు వ్యాకులమాయెను. ఆయన తన ఆ అపరాధమును గురించియే తలపోయుచుండెను. నా తప్పును ఏ విధముగా తుడిచివేయవలెను? శ్రీకృష్ణభగవానుడు ప్రసన్నుడయ్యే విధమెద్ది? అని చింతిల్లెను.

కిం కృత్వా సాధు మహత్యం స్యాన్న శపేద్వా జనో యథా ।
అదీర్ఘదర్శనం క్షుద్రం మూఢం ద్రవిణలోలుపమ్ ॥ 41

కిమ్= దేనిని, కృత్వా= చేసి, మహ్యమ్= నా కొరకు, సాధు= మంచి, స్యాత్= కలుగును?, యథా= ఏ విధముగానైతే, జనః= జనము, అదీర్ఘదర్శనమ్= ముందు చూపు లేనట్టియు, క్షుద్రమ్= అల్పుడనైనట్టియు, మూఢమ్= అవివేకి నైనట్టియు, ద్రవిణలోలుపమ్= ధనమునందు లోభము గల నన్ను, న శపేత్ వా= తిట్టకుండును?

నేను ముందు చూపులేని అవివేకిని, ధనమునందు లోభము గల అల్పుడను. నేను ఏమి చేసినచో, నాకు మంగళము కలుగును? జనము నన్ను తిట్టకుందురు?

దాస్యే దుహితరం తస్మై స్త్రీరత్నం రత్నమేవ చ ।
ఉపాయోఽయం సమీచీ నస్తస్య శాంతిర్న చాన్యథా ॥ 42

తస్మై= ఆయన కొరకు, స్త్రీరత్నమ్= స్త్రీలలో రత్నమైన, దుహితరమ్= కుమార్తెను, రత్నం ఏవ చ= స్యమంతకమణిని కూడ, దాస్యే= ఇచ్చెదను, అయమ్= ఈ, ఉపాయః= ఉపాయము, సమీచీనః= బాగున్నది, అన్యథా= అట్లుగానిచో, తస్య= ఆ అపరాధమునకు, శాంతిః= తొలగుట, న చ= కానే కాదు.

ఆయనకు స్త్రీలలో రత్న మైన కుమార్తెను, స్యమంతకమణిని కూడ ఇచ్చెదను. ఇదియే చక్కని ఉపాయము. ఇట్లు చేయనిచో, నా అపరాధమును ఇంకో విధముగా తుడిచివేయుట సంభవము కానే కాదు.

ఏవం వ్యవసితో బుద్ధ్యా సత్రాజి త్స్వసుతాం శుభామ్ ।
మణిం చ స్వయ ముద్యమ్య కృష్ణాయోపజహార హ ॥ 43

బుద్ధ్యా= బుద్ధిచే, ఏవమ్= ఈ విధముగా, వ్యవసితః= నిశ్చయించుకున్న, సత్రాజిత్= సత్రాజిత్తు, స్వయమ్= తనంత తానుగా, ఉద్యమ్య= ప్రయత్నము చేసి, శుభామ్= కల్యాణియగు, స్వసుతామ్= తన కుమార్తెను, మణిం చ= స్యమంతకమణిని కూడ, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, ఉపజహార హ= సమర్పించెనట.

సత్రాజిత్తు తన మనస్సులో ఈ విధముగా నిశ్చయించుకొని తనంత తానే పూనుకొని (వసుదేవాదులను సంప్రదించి) కల్యాణియగు కుమార్తె సత్యభామను, స్యమంతకమణిని కూడ శ్రీకృష్ణునకు సమర్పించెను.

తాం సత్యభామాం భగవా నుపయేమే యథావిధి ।
బహుభి ర్యాచితాం శీలరూపౌదార్యగుణాన్వితామ్ ॥ 44

బహుభిః= చాలమందిచే, యాచితామ్= కోరబడినట్టియు, శీలరూప-ఔదార్యగుణ-అన్వితామ్= సచ్ఛీలము అందము పెద్ద మనసు

అనే గుణములతో కూడియున్న, తామ్= ఆ, సత్యభామామ్= సత్యభామను, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, యథావిధి=- యథావిధిగా, ఉపయేమే= వివాహమాడెను.

ఆ సత్యభామను వివాహము చేసుకొనవలెనని ఇదివరలో (కృతవర్మ మొదలగువారు) చాలమంది ఉవ్విళ్ళూరిరి. సచ్ఛీలము, అందము, పెద్ద మనసు అనే గుణములను కలిగియున్న ఆమెను శ్రీకృష్ణ భగవానుడు యథావిధిగా వివాహము చేసుకొనెను.

భగవానాహ న మణిం ప్రతీచ్ఛామో వయం నృప ।
తవాస్తాం దేవభక్తస్య వయం చ ఫలభాగినః ॥ 45

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే షట్పంచాశత్తమోఽధ్యాయః ॥

నృప= ఓ రాజా!, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఆహ= పలికెను, వయమ్= మేము, మణిమ్= స్యమంతకమణిని, న ప్రతీచ్ఛామః= స్వీకరించము, దేవభక్తస్య= సూర్యదేవుని భక్తుడవగు, తవ= నీకు, ఆస్తామ్ = ఉండుగాక!, వయం చ= మేమైతే, ఫలభాగినః= ఫలమును పొందువారము.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను - నేను స్యమంతకమును తీసుకోను. సూర్యదేవుని భక్తుడవగు తమరివద్దనే అది ఉండవలెను. కాని, దాని ఫలము (బంగారము) మాకు లభించుచునే యుండును.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
స్యమంతక వృత్తాంతమును వర్ణించే
ఏబది ఆరవ అధ్యాయము ముగిసినది (56).

అథ సప్తపంచాశత్తమోఽధ్యాయః

శతధన్వుడు మణిని అపహరించుట - శతధన్వుని ఉద్ధారము

శ్రీశుక ఉవాచ ।

విజ్ఞాతార్థోఽపి గోవిందో దగ్ధానాకర్ణ్య పాండవాన్ ।
కుంతీం చ కుల్యకరణే సహరామో యయౌ కురూన్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, గోవిందః= శ్రీకృష్ణ భగవానుడు, విజ్ఞాత-అర్థః అపి= తెలియబడిన విషయము గలవాడే అయినా, దగ్ధాన్= దహించబడిన, పాండవాన్= పాండవులను గురించి, కుంతీం చ= కుంతిని గురించి కూడా, ఆకర్ణ్య= విని, కుల్యకరణే= వంశమునకు ఉచితమైన పరామర్శాదికమును చేయుట విషయమై, సహరామః= బలరామునితో గూడినవాడై, కురూన్= కురుదేశమును గురించి, యయౌ= వెళ్లెను.

శ్రీశుకమహర్షి ఇట్లు చెప్పెను...లాక్షాగృహములో పాండవులు దహించబడలేదని శ్రీకృష్ణభగవానునకు తెలియును. కాని, వారు కుంతితో సహా దహించబడినవారనే జనప్రవాదమును విని ఆయన బలరామునితో సహా వంశోచితమైన పరామర్శను చేయుటకై కురుదేశమునకు వెళ్లెను.

భీష్మం కృపం సవిదురం గాంధారీం ద్రోణమేవ చ ।
తుల్యదుఃఖౌ చ సంగమ్య హా కష్టమితి ఊచతుః ॥ 2

తుల్యదుఃఖౌ= సమానమైన దుఃఖము గల బలరామకృష్ణులు, భీష్మమ్= భీష్ముని, సవిదురమ్= విదురునితో కూడియున్న, కృపమ్= కృపాచార్యుని, గాంధారీమ్= గాంధారిని, ద్రోణం ఏవ చ= ద్రోణాచార్యుని కూడ, సంగమ్య= కలుసుకొని, హా= అయ్యో!, కష్టమ్= కష్టము!, ఇతి= అని, ఊచతుః= పలికిరి.

బలరామకృష్ణులు భీష్ముని, కృపాచార్యుని, విదురుని, ద్రోణాచార్యుని, గాంధారిని కూడ కలిసి వారితో సమానమైన దుఃఖము గలవారై అయ్యో! ఎంత కష్టము! అని (లాక్షాగృహదహనమును గురించి) పలికిరి.

లబ్ధ్వైత దంతరం రాజన్ శతధన్వాన మూచతుః ।
అక్రూర కృతవర్మాణౌ మణిః కస్మాన్న గృహ్యతే ॥ 3

రాజన్= ఓ రాజా! ఏతత్= ఈ, అంతరమ్= అవకాశమును, లబ్ధ్వా= పొంది, అక్రూరకృతవర్మాణౌ= అక్రూరుడు కృతవర్మ, శతధన్వానమ్= శతధన్వనుద్దేశించి, ఊచతుః= పలికిరి, మణిః= స్యమంతకమణి, కస్మాత్= ఎందువలన, న గృహ్యతే= లాగుకొనబడుట లేదు?

ఓ పరీక్షిన్మహారాజా! ఈ సందు చూసుకొని అక్రూరుడు కృతవర్మ శతధన్వనితో, స్యమంతకమణిని ఏల లాగుకొనవు? అని అడిగిరి.

యోఽస్మభ్యం సంప్రతిశ్రుత్య కన్యారత్నం విగర్హ్య నః ।
కృష్ణాయాదాన్న సత్రాజి త్కస్మా ద్భ్రాతర మన్వియాత్ ॥ 4

యః= ఎవడైతే, అస్మభ్యమ్= మన కొరకు, కన్యారత్నమ్= శ్రేష్ఠమగు కన్యయగు సత్యభామను, సంప్రతిశ్రుత్య= మాట యిచ్చి, నః= మనలను, విగర్హ్య= అనాదరము చేసి, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, అదాత్= ఇచ్చెనో, సత్రాజిత్= అట్టి సత్రాజిత్తు, కస్మాత్= ఎందువలన, భ్రాతరమ్= తమ్ముని, అన్వియాత్= అనుసరించి వెళ్లరాదు?

సత్రాజిత్తు శ్రేష్ఠకన్యయగు సత్యభామను మనలో ఒకనికిచ్చి వివాహము చేసెదనని మాట యిచ్చి, మనలను అనాదరము చేసి శ్రీకృష్ణునికిచ్చి పెళ్లి చేసినాడు. ఆతడు తమ్ముడగు ప్రసేనుని వెంట (యమపురికి) ఏల వెళ్లరాదు? (వెళ్లకుండుటకు కారణమేమీ లేదు).

ఏవం భిన్నమతి స్తాభ్యాం సత్రాజిత మసత్తమః ।
శయాన మవధీ ల్లోభాత్స పాపః క్షీణజీవితః ॥ 5

ఏవమ్= ఈ విధముగా, తాభ్యామ్= వారిద్దరిచే, భిన్నమతిః= చెడగొట్టబడిన మనస్సు గలవాడు, అసత్-తమః= పరమదుష్టుడు, పాపః= పాపి, క్షీణజీవితః= క్షయమైన ఆయుష్షు గలవాడు అగు, సః= ఆ శతధన్వుడు, శయానమ్= నిద్రించుచున్న, సత్రాజితమ్= సత్రాజిత్తును, లోభాత్= లోభము వలన, అవధీత్= చంపెను.

శతధన్వుడు పరమదుష్టుడు, పాపి. వాని ఆయువు మూడినది. పైగా, వారిద్దరు వాని మనస్సును చెడగొట్టిరి. ఆతడు మణియందలి లోభము వలన నిద్రిస్తున్న సత్రాజిత్తును చంపెను.

స్త్రీణాం విక్రోశమానానాం క్రందంతీనా మనాథవత్ ।
హత్వా పశూన్ సౌనికవన్మణిమాదాయ జగ్మివాన్ ॥ 6

స్త్రీణామ్= స్త్రీలు, అనాథవత్= అనాథలు వలె, విక్రోశమానానామ్= ఆక్రోశించుచుండగా, క్రందంతీనామ్= ఏడ్చుచుండగా, పశూన్= పశువులను, సౌనికవత్= కసాయి వలె, హత్వా= చంపి, మణిమ్= మణిని, ఆదాయ= తీసుకొని, జగ్మివాన్= వెళ్లినవాడు.

స్త్రీలు అనాథలవలె ఆక్రోశిస్తూ రోదిస్తూంటే ఆతడు వారిని లెక్క చేయకుండా, కసాయి పశువులను వలె, సత్రాజిత్తుని చంపి స్యమంతక మణిని తీసుకొని వెళ్లెను.

సత్యభామా చ పితరం హతం వీక్ష్య శుచార్పితా ।
వ్యలప త్తాత తాతేతి హా హతాఽస్మీతి ముహ్యతీ ॥ 7

హతమ్= సంహరించబడిన, పితరమ్= తండ్రిని, వీక్ష్య= చూచి, సత్యభామా చ= సత్యభామయైతే, శుచా= దుఃఖము చే, అర్పితా=

వ్యాపించబడినదై, ముహ్యతీ= మోహమును పొందుచున్నదై, తాత= తండ్రీ!, తాత= తండ్రీ!, ఇతి= అని, హా= అయ్యో!, హతా= చంపబడిన దానను, అస్మి= అగుచున్నాను, ఇతి= అని, వ్యలపత్= విలపించెను.

చంపబడిన తండ్రిని చూచి సత్యభామ మోహమును పొందెను. ఆమె మనస్సు దుఃఖముతో నిండిపోగా, తండ్రీ! తండ్రీ! అయ్యో! నేను చంపబడితిని! అంటూ విలపించెను.

తైలద్రోణ్యాం మృతం ప్రాస్య జగామ గజసాహ్వయమ్ ।
కృష్ణాయ విదితార్థాయ తప్తాఽఽచఖ్యౌ పితుర్వధమ్ ॥ 8

తప్తా= దుఃఖితురాలైన సత్యభామ, మృతమ్= మరణించిన సత్రాజిత్తును, తైల ద్రోణ్యామ్= నూనె దోనియందు, ప్రాస్య= పెట్టి, గజసాహ్వయమ్= హస్తినాపురమును గురించి, జగామ= వెళ్లెను, విదిత-అర్థాయ= తెలియబడిన విషయము గల, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, పితుః= తండ్రియొక్క, వధమ్= చంపుటను గురించి, ఆచఖ్యౌ= వివరించి చెప్పెను.

సత్రాజిత్తు దేహమును నూనె దోనియందుంచిరి. దుఃఖితురాలైన సత్యభామ హస్తినాపురమునకు వెళ్లి తండ్రి వధ గురించి శ్రీకృష్ణునకు చెప్పెను. ఆయనకు అన్నీ తెలుసు.

తదాకర్ణ్యేశ్వరౌ రాజ న్ననుసృత్య నృలోకతామ్ ।
అహో నః పరమం కష్ట మిత్యశ్రాక్షౌ విలేపతుః ॥ 9

రాజన్= ఓ రాజా!, తత్= ఆ వార్తను, ఆకర్ణ్య= విని, ఈశ్వరౌ= సర్వేశ్వరులగు బలరామకృష్ణులు, నృలోకతామ్= మానవలీలను, అనుసృత్య= అనుకరించి, అహో= అయ్యో!, నః= మనకు, పరమమ్=

పెద్ద, కష్టమ్= ఆపద, ఇతి= అని, అస్ర-అక్షౌ= నీరు నిండిన కన్నులు గలవారై, విలేపతుః= విలపించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! మానవలీలను అనుకరించే సర్వేశ్వరులైన బలరామకృష్ణులు ఆ వార్తను విని కళ్లనిండా నీరు పెట్టుకొని, అయ్యో! మనకు పెద్ద ఆపద వచ్చినది, అంటూ విలపించిరి.

ఆగత్య భగవాం స్తస్మా త్సభార్య స్సాగ్రజః పురమ్ ।
శతధన్వాన మారేభే హంతుం హర్తుం మణిం తతః ॥ 10

స-అగ్రజః= అన్నగారితో కూడియున్నవాడు, సూర్యః= భార్యతో కూడినవాడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తస్మాత్= అక్కడ నుండి, పురమ్= నగరమును గురించి, ఆగత్య= వచ్చి, శతధన్వానమ్= శతధన్వుని, హంతుమ్= సంహరించుటకు, తతః= వానినుండి, మణిమ్= మణిని, హర్తుమ్= లాగుకొనుటకు, ఆ రేభే= ఆరంభించెను.

శ్రీకృష్ణ భగవానుడు అన్నగారితో, భార్యయగు సత్యభామతో కలిసి ఆ హస్తిననుండి ద్వారకకు వచ్చెను. శతధన్వుని సంహరించి వానినుండి స్యమంతకమణిని లాగుకొనే ఉద్యమమును ఆయన ఆరంభించెను.

సోఽపి కృష్ణోద్యమం జ్ఞాత్వా భీతః ప్రాణపరీప్సయా ।
సాహాయ్యే కృతవర్మాణ మయాచత స చాబ్రవీత్ ॥ 11

సః అపి= ఆ శతధన్వుడు కూడ, కృష్ణ-ఉద్యమమ్= శ్రీకృష్ణుని ప్రయత్నమును గురించి, జ్ఞాత్వా= తెలుసుకొని, భీతః= భయపడినవాడై, ప్రాణపరీప్సయా= ప్రాణములను కాపాడుకునే కోరికతో, కృతవర్మాణమ్= కృతవర్మను, సాహాయ్యే= సహకారము విషయములో, అయాచత= కోరెను, సః చ= ఆతడైతే, అబ్రవీత్= పలికెను.

ఆ శతధన్వునికి శ్రీకృష్ణుని ప్రయత్నము గురించి తెలిసి భయము కలిగెను. ఆతడు ప్రాణములను కాపాడుకునే కోరికతో సహకారము కొరకు కృతవర్మను కోరెను. కృతవర్మ ఇట్లు పలికెను.

నాహ మీశ్వరయోః కుర్యాం హేలనం రామకృష్ణయోః ।
కో ను క్షేమాయ కల్పేత తయో ర్వృజిన మాచరన్ ॥ 12

ఈశ్వరయోః= సర్వసమర్థులగు, రామకృష్ణయోః= బలరామ కృష్ణులకు, అహమ్= నేను, హేలనమ్= ప్రతికూలమును, న కుర్యామ్= చేయను, తయోః= వారిద్దరి యెడల, వృజినమ్= అపరాధమును, ఆచరన్= చేయువాడు, కః ను= ఎవ్వాడు, క్షేమాయ= క్షేమము కొరకు, కల్పేత= సమర్థుడగును?

సర్వసమర్థులగు బలరామకృష్ణులకు నేను ప్రతికూలమును చేయను. వారిద్దరి యెడల అపరాధమును చేసి ఎవ్వాడు క్షేమముగా ఉండగల్గును?

కంస స్సహానుగోపీతో యద్ద్వేషా త్త్యాజిత శ్శ్రియా ।
జరాసంధ స్సప్తదశ సంయుగాన్ విరథో గతః ॥ 13

యద్-ద్వేషాత్= ఎవరియందలి ద్వేషము వలన, సహ-అనుగః= అనుచరులతో కూడిన, కంసః= కంసుడు, శ్రియా= సంపదచే, త్యాజిత= విడువబడునట్లు చేయబడినవాడై, అపీతః= వినాశమును పొందినవాడు, జరాసంధః= జారసంధుడు, సప్తదశ= పదిహేడు, సంయుగాన్= యుద్ధములను, విరథః= రథము లేనివాడై, గతః= వెళ్లినవాడో.

వారిద్దరి యందలి ద్వేషము వలన కంసుడు సంపదను పోగొట్టుకొని తన అనుచరులతో సహా వినాశమును పొందినాడు. జరాసంధుడు పదిహేడు యుద్ధములలో రథమును కూడ కోల్పోయి మరలి వచ్చినాడు.

ప్రత్యాఖ్యాత స్తు చాక్రూరం పార్ష్ణిగ్రాహ మయాచత ।
సోఽప్యాహ కో విరుధ్యేత విద్వానీశ్వరయో ర్బలమ్ ॥ 14

ప్రత్యాఖ్యాతః= తిరస్కరించబడిన, సః= ఆ శతధన్వుడు, అక్రూరమ్= అక్రూరుని, పార్ష్ణి గ్రాహమ్= వెనుకనుండి రక్షణను, అయాచత= కోరెను, సః అపి= ఆయన కూడ, ఆహ= పలికెను, ఈశ్వరయోః= సర్వసమర్థులగు వారిద్దరి, బలమ్= బలమును గురించి, విద్వాన్= తెలిసినవాడు, కః= ఎవ్వాడు, విరుధ్యేత= వైరము పూనును?

కృతవర్మచే తిరస్కరించబడి ఆ శతధన్వుడు అక్రూరుని తనను వెనుక నుండి రక్షించుమని కోరెను. ఆయన కూడ, సర్వసమర్థులగు వారిద్దరి బలము తెలిసినవాడెవ్వడు వారితో విరోధించును? అని చెప్పెను.

య ఇదం లీలయా విశ్వం సృజత్యవతి హంతి చ ।
చేష్టాం విశ్వసృజో యస్య న విదుర్మోహితాఽజయా ॥ 15

యః= ఎవడైతే, ఇదమ్= ఈ, విశ్వమ్= జగత్తును, లీలయా= లీలచే, సృజతి= సృష్టించునో, అవతి= రక్షించునో, హంతి చ= ఉపసంహారమును కూడ చేయునో, విశ్వసృజః= జగత్తును సృష్టించే, యస్య= ఎవని, చేష్టామ్= లీలను, అజయా= పుట్టుక లేని మాయచే, మోహితాః= మోహితులైనవారు, న విదుః= తెలియరో.

ఆ శ్రీకృష్ణ భగవానుడు జగత్తును లీలచే సృష్టించి, పాలించి, ఉపసంహారమును కూడ చేయును. ఆయన మాయచే మోహమును పొందినవారలు ఆయన లీలను తెలియజాలరు.

యస్సప్తహాయన శ్శైలముత్పాట్యైకేన పాణినా ।
దధార లీలయా బాల ఉచ్ఛిలీంధ్ర మివార్భకః ॥ 16

సప్తహాయన= ఏడేళ్ల వయస్సు గల, బాలః= పిల్లవాడైన, యః= ఏ శ్రీకృష్ణుడైతే, ఏకేన= ఒక, పాణినా= చేతితో, శైలమ్= పర్వతమును, లీలయా= అవలీలగా, ఉత్పాట్య= పెకిలించి, అర్భకః= పిల్లవాడు, ఉచ్ఛిలీంధ్రం ఇవ= కుక్క గొడుగును వలె, దధార= ఎత్తి పట్టుకొనెనో.

ఏడేళ్ల బాలుడుగ నుండగనే శ్రీకృష్ణుడు కొండను అవలీలగా పెకిలించి ఒకే చేతితో పైకెత్తి పిల్లవాడు కుక్కగొడుగును వలె, పట్టుకొనెను.

నమస్తస్మై భగవతే కృష్ణాయాద్భుతకర్మణే ।
అనంతాయాదిభూతాయ కూటస్థాయాత్మనే నమః ॥ 17

అద్భుతకర్మణే= ఆశ్చర్యమును గొల్పే లీలలు కలిగినట్టియు, అనంతాయ= అనంతుడైనట్టియు, ఆదిభూతాయ= జగత్కారణమైనట్టియు, కూటస్థాయ= అవికారియైనట్టియు, ఆత్మనే= ఆత్మరూపుడైన, తస్మై= ఆ, భగవతే కృష్ణాయ= శ్రీకృష్ణ భగవానుని కొరకు, నమః నమః= పలు నమస్కారములు.

ఆద్యంతములు లేని శ్రీకృష్ణభగవానుని లీలలు ఆశ్చర్యకరములు. అవికారియగు ఆత్మరూపుడైయున్న ఆయనకు పలు నమస్కారములు.

ప్రత్యాఖ్యాత స్స తేనాపి శతధన్వా మహామణిమ్ ।
తస్మిన్న్యస్యాశ్వ మారుహ్య శతయోజనగం యయౌ ॥ 18

తేన అపి= ఆ అక్రూరునిచే కూడ, ప్రత్యాఖ్యాతః= తిరస్కరించ బడిన, సః= ఆ, శతధన్వా= శతధన్వుడు, మహామణిమ్= గొప్ప మణిని, తస్మిన్= ఆయన వద్ద, న్యస్య= ఉంచి, శతయోజనగమ్= వంద యోజనములను వెళ్లే, అశ్వమ్= గుర్రమును, ఆరుహ్య= ఎక్కి, యయౌ= వెళ్లెను.

ఆ అక్రూరుడు కూడ తిరస్కరించగా శతధన్వుడు ఆ గొప్ప మణిని ఆయన వద్ద ఉంచి వంద యోజనముల దూరము పోగలిగే గుర్రము నెక్కి పారిపోయెను.

గరుడధ్వజ మారుహ్య రథం రామజనార్ధనౌ ।
అన్వయాతాం మహావేగై రశ్వై రాజన్ గురుద్రుహమ్ ॥ 19

రాజన్= ఓ రాజా!, రామజనార్ధనౌ= బలరామకృష్ణులు, గరుడధ్వజమ్= గరుడుడు ధ్వజమునందు గల, రథమ్= రథమును, ఆరుహ్య= ఎక్కి, మహావేగైః= గొప్ప వేగము గల, అశ్వైః= గుర్రములతో, గురుద్రుహమ్= మామగారిని చంపిన శతధన్వుని, అన్వయాతామ్= వెనుకనుండి తరిమిరి.

ఓ పరీక్షిన్మహారాజా! బలరామకృష్ణులు గొప్ప వేగము గల గుర్రములు లాగే రథము పైనెక్కి తమ మామగారిని చంపిన శతధన్వుని వెంబడి తరిమిరి. ఆ రథముయొక్క జెండాపై గరుడుడు ఉండెను.

మిథిలాయా ముపవనే విసృజ్య పతితం హయమ్ ।
పద్భ్యా మధావత్సంత్రస్తః కృష్ణోఽప్యన్వద్రవ ద్రుషా ॥ 20

సంత్రస్తః= చాల భయపడిన శతధన్వుడు, మిథిలాయామ్= మిథిలానగరమునందు, ఉపవనే= సమీపమునందలి ఉద్యానమునందు, పతితమ్= పడిపోయిన, హయమ్= గుర్రమును, విసృజ్య= విడిచిపెట్టి, పద్భ్యామ్= పాదములతో, అధావత్= పరుగెత్తెను, కృష్ణః అపి= శ్రీకృష్ణుడు కూడ, రుషా= కోపముతో, అన్వద్రవత్= వెనుక పరుగెత్తెను.

చాల భయపడిన శతధన్వుడు మిథిలా నగరపు బాహ్యోద్యానము నందు పడిపోయిన గుర్రమును విడిచిపెట్టి కాళ్లకు బుద్ధి చెప్పగా, శ్రీకృష్ణుడు కూడ కోపముతో వెనుక తరిమెను.

పదాతే ర్భగవాం స్తస్య పదాతి స్తిగ్మనేమినా ।
చక్రేణ శిర ఉత్కృత్య వాససోర్వ్యచినోన్మణిమ్ ॥ 21

పదాతిః= పాదచారియగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, పదాతేః= పాదచారియగు, తస్య= వానియొక్క, శిరః= తలను, తిగ్మనేమినా= తీక్ష్ణమైన పదును గల, చక్రేణ= చక్రముతో, ఉత్కృత్య= నరికి, వాససోః= వస్త్రములు రెండింటియందు, మణిమ్= మణిని, వ్యచినోత్= వెదికెను.

పాదచారియగు శ్రీకృష్ణభగవానుడు పరుగెత్తుతూ పారిపోతున్న ఆ శతధన్వుని తలను వాడి పదును గల చక్రముతో నరికి, క్రింది మరియు పై వస్త్రములలో మణికొరకు వెదికెను.

అలబ్ధమణి రాగత్య కృష్ణ ఆహాగ్రజాంతికమ్ ।
వృథా హత శ్శతధనుర్మణి స్తత్ర న విద్యతే ॥ 22

అలబ్ధమణిః= దొరకని మణి గల, కృష్ణః= శ్రీకృష్ణుడు, అగ్రజ-అంతికమ్= అన్నగారి సమీపమును గురించి, ఆగత్య= వచ్చి, ఆహ= పలికెను, శతధనుః= శతధన్వ, వృథా= వ్యర్థముగా, హతః= చంపబడిన వాడు, తత్ర= వాని వద్ద, మణిః= మణి, న విద్యతే= లేదు.

శ్రీకృష్ణునకు మణి దొరకలేదు. ఆయన అన్నగారి వద్దకు వచ్చి ఇట్లు పలికెను - శతధన్వుని చంపుట వ్యర్థమైనది. ఆతని వద్ద మణి లేదు.

తత ఆహ బలో నూనం స మణి శ్శతధన్వనా ।
కస్మింశ్చి త్పురుషే న్యస్త స్తమన్వేష పురం వ్రజ ॥ 23

తతః= అప్పుడు, బలః= బలరాముడు, ఆహ= పలికెను, శతధన్వనా= శతధన్వునిచే, సః= ఆ, మణిః= మణి, నూనమ్=

నిశ్చయముగా, కస్మింశ్చిత్= ఎవరో ఒక, పురుషే= వ్యక్తి వద్ద, న్యస్తః= దాచబడినది, తమ్= వానిని, అన్వేష= వెదుకుము, పురమ్= నగరమును గురించి, వ్రజ= వెళ్లుము.

అప్పుడు బలరాముడిట్లు పలికెను – శతధన్వుడు నిశ్చయముగా మణిని ఎవరో ఒక వ్యక్తి వద్ద దాచియుండును. నీవు నగరమునకు వెళ్లి ఆ వ్యక్తి గురించి అన్వేషించుము.

అహం విదేహమిచ్ఛామి ద్రష్టుం ప్రియతమం మమ ।
ఇత్యుక్త్వా మిథిలాం రాజన్ వివేశ యదునందనః ॥ 24

రాజన్= ఓ రాజా!, అహమ్= నేను, మమ= నాకు, ప్రియతమమ్= మిక్కిలి ప్రియుడైన, విదేహమ్= విదేహరాజును, ద్రష్టుమ్= చూచుటకు, ఇచ్ఛామి= కోరుచున్నాను, ఇతి= అని, ఉక్త్వా= పలికి, యదునందనః= యాదవవంశమును అనందింపజేసే బలరాముడు, మిథిలామ్= మిథిలానగరమును, వివేశ= ప్రవేశించెను.

ఓ పరీక్షిన్మహారాజా! విదేహరాజు నాకు మిక్కిలి ప్రియుడు, నేనాయనను చూడగోరుచున్నాను, అని పలికి యాదవవంశనందనుడగు బలరాముడు మిథిలను ప్రవేశించెను.

తం దృష్ట్వా సహసోత్థాయ మైథిలః ప్రీతమానసః ।
అర్హయామాస విధివదర్హణీయం సమర్హణైః ॥ 25

మైథిలః= మిథిలాధిపతి, అర్హణీయమ్= పూజించదగిన, తమ్= ఆ బలరాముని, దృష్ట్వా= చూచి, ప్రీతమానసః= ప్రీతి జెందిన మనస్సు గలవాడై, సహసా= వెంటనే, ఉత్థాయ= నిలబడి, విధివత్= యథావిధిగా, సమర్హణైః= ఉత్తమపూజాద్రవ్యములతో, అర్హయామాస= పూజించెను.

మిథిలాధిపతి ఆ బలరాముని చూచి మనస్సులో చాల సంతోషించెను. ఆయన వెంటనే లేచి నిలబడి పూజకు అర్హుడైన బలరాముని ఉత్తమమగు పూజాద్రవ్యములతో యథావిధిగా పూజించెను.

ఉవాస తస్యాం కతిచి న్మిథిలాయాం సమా విభుః ।
మానితః ప్రీతియుక్తేన జనకేన మహాత్మనా ।
తతోఽశిక్ష ద్గదాం కాలే ధార్తరాష్ట్ర స్సుయోధనః ॥ 26

ప్రీతియుక్తేన= ప్రేమతో కూడినట్టియు, మహాత్మనా= మహాత్ముడగు, జనకేన= జనకునిచే, మానితః= సమ్మానించబడిన, విభుః= బలరామ ప్రభుడు, తస్యామ్= ఆ, మిథిలాయామ్= మిథిలయందు, కతిచిత్= కొన్ని, సమాః= సంవత్సరములను, ఉవాస= నివసించెను, కాలే= ఆ కాలమునందు, ధార్తరాష్ట్రః= ధృతరాష్ట్ర పుత్రుడగు, సుయోధనః= దుర్యోధనుడు, తతః= ఆ బలరాముని నుండి, గదామ్= గదా యుద్ధమును, అశిక్షత్= నేర్చుకొనెను.

మహాత్ముడగు జనకుడు ప్రేమతో కూడినవాడై బలరామప్రభుని సమ్మానించెను. ఆయన ఆ మిథిలయందు కొన్ని సంవత్సరములు నివసించెను. అదే కాలములో ధృతరాష్ట్రపుత్రుడగు దుర్యోధనుడు ఆయన వద్ద గదాయుద్ధములో శిక్షణ పొందెను.

కేశవో ద్వారకామేత్య నిధనం శతధన్వనః ।
అప్రాప్తిం చ మణేః ప్రాహ ప్రియాయాః ప్రియకృద్విభుః ॥27

ప్రియాయాః= ప్రియురాలగు సత్యభామకు, ప్రియకృత్= ప్రియమును చేయువాడు, విభుః= సర్వసమర్థుడు అగు, కేశవః= శ్రీకృష్ణభగవానుడు, ద్వారకామ్= ద్వారకానగరమును గురించి, ఏత్య= వచ్చి, శతధన్వనః= శతధన్వుని, నిధనమ్= మరణమును గురించి, మణేః= మణియొక్క, అప్రాప్తిం చ= దొరకకపోవుటను గురించి కూడ, ప్రాహ= చెప్పెను.

సర్వసమర్థుడగు శ్రీకృష్ణుడు ప్రియురాలగు సత్యభామకు ప్రియమును చేయును. ఆయన ద్వారకకు వచ్చి శతధన్వుడు మరణించినాడనియు, కాని, ఆతని వద్ద మణిదొరకలేదనియు ఆమెకు చెప్పెను.

తతస్స కారయామాస క్రియా బంధోర్హతస్య వై ।
సాకం సుహృద్భి ర్భగవాన్ యా యా స్స్యు స్సాంపరాయికాః ॥ 28

తతః= తరువాత, సః= ఆ, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, సుహృద్భిః సాకమ్= బంధువులతో గూడి, హతస్య= సంహరించబడిన, బంధోః వై= మామగారగు సత్రాజిత్తునకైతే, క్రియాః= కర్మలను, కారయామాస= చేయించెను, సాంపరాయికాః= మరణించిన వ్యక్తికి పుణ్యలోకములనిచ్చే, యాః యాః= ఏయే కర్మలు, స్యుః = ఉండునో.

తరువాత ఆ శ్రీకృష్ణ భగవానుడు బంధువులతో గూడి, సంహరించబడిన సత్రాజిత్తునకైతే, మరణించిన వ్యక్తికి ఏయే కర్మలు పుణ్యలోకములను కలిగించునో, వాటిని చేయించెను.

అక్రూరః కృతవర్మా చ శ్రుత్వా శతధనోర్వధమ్ ।
వ్యూషతు ర్భయవిత్రస్తౌ ద్వారకాయాః ప్రయోజకౌ ॥ 29

ప్రయోజకౌ= పురిగొల్పిన, అక్రూరః= అక్రూరుడు, కృతవర్మా చ= కృతవర్మ కూడ, శతధనోః= శతధన్వుని, వధమ్= వధను గురించి, శ్రుత్వా= విని, భయవిత్రస్తౌ= భయము వలన వణికిపోవుచున్నవారై, ద్వారకాయాః = ద్వారకనుండి, వ్యూషతుః= వలస పోయిరి.

శతధన్వుని పురిగొల్పిన అక్రూరకృతవర్మలు వాని వధను గురించి విని, భయముతో వణికిపోతూ ద్వారకను విడిచి పెట్టి వెళ్లిపోయిరి.

అక్రూరే ప్రేషితేఽరిష్టాన్యాసన్ వై ద్వారకౌకసామ్ ।
శారీరా మానసా స్తాపాః ముహు ర్దైవిక భౌతికాః । ।30

అక్రూరే= అక్రూరుడు, ప్రేషితే= వలస పోగా, ద్వారకా-ఓకసాం వై= ద్వారకావాసులకైతే, అరిష్టాఃఅరిష్టములు, శారీరాఃశరీరమునందు కలిగేవి, మానసాఃమనస్సునందు పుట్టేవి, దైవికభౌతికాఃదేవతల వలన కలిగేవి చుట్టూ ప్రపంచంలో కలిగేవి అగు, తాపాఃదుఃఖములు, ముహుఃమరల మరల, ఆసన్= కలిగినవి.

అక్రూరుడు వలసపోగా ద్వారకావాసులకైతే అరిష్టములు ఆధ్యాత్మిక-ఆధిభౌతిక-ఆధిదైవికతాపములు మరల మరల కలిగినవి.

ఇత్యంగోపదిశంత్యేకే విస్మృత్య ప్రాగుదాహృతమ్ ।
మునివాస నివాసే కిం ఘటేతారిష్ట దర్శనమ్ ॥ 31

అంగ= ఓయీ!, ప్రాక్= ఇదివరలో, ఉదాహృతమ్= చెప్పబడిన దానిని, విస్మృత= విస్మరించి, ఏకే= కొందరు, ఇతి= ఈ విధముగా, ఉపదిశంతి= చెప్పుచున్నారు, మునివాసనివాసే= మునులు నివసించే శ్రీకృష్ణుడు నివసించే ద్వారకయందు, అరిష్టదర్శనమ్= అరిష్టముల కానవచ్చుట, కిం ఘటేత= సంభవమా?

ఓ పరీక్షిన్మహారాజా! నేనిదివరలో చెప్పిన శ్రీకృష్ణ మాహాత్మ్యమును విస్మరించి కొందరీ విధముగా (అరిష్టములను గురించి) చెప్పుచున్నారు. మునులు ఏ భగవానునియందు నివసించెదరో, ఆ భగవానుడు నివసించే ద్వారకలో అరిష్టములు కనబడుట సంభవమా? (కాదు).

దేవేఽవర్షతి కాశీశ శ్శ్వఫల్కాయాగతాయ వై ।
స్వసుతాం గాందినీం ప్రాదా త్తతోఽవర్షత్పు కాశిషు ॥ 32

దేవే= వానదేవుడు, అవర్షతి= వర్షించకపోగా, కాశీ-ఈశఃకాశీ ప్రభువు, ఆగతాయ= వచ్చిన, శ్వఫల్కాయ= శ్వఫల్కుని కొరకు, స్వసుతామ్= తన కుమార్తెయగు, గాందినీమ్= గాందినిని, ప్రాదాత్= ఇచ్చెను, తతఃతరువాత, కాశిషు= కాశీ దేశమునందు, అవర్షత్= వర్షించెను.

ఒకప్పుడు కాశీదేశములో వానదేవుడు వర్షించలేదు. అప్పుడక్కడకు వచ్చిన (అక్రూరుని తండ్రియగు) శ్వఫల్కునకు కాశీరాజు తన కుమార్తె యగు గాందినిని ఇచ్చి వివాహము చేయగా, దేవుడు వర్షించెను.

తత్సుత స్తత్ప్రభావోఽసావక్రూరో యత్ర యత్ర హ ।
దేవోఽభివర్షతే తత్ర నోపతాపా న మారికాః ॥ 33

తత్–సుతః= ఆయన కుమారుడు, తత్–ప్రభావః= ఆయనయొక్క మహిమవంటి మహిమ గలవాడు అగు, అసౌ= ఈ, అక్రూరః= అక్రూరుడు, యత్ర యత్ర హ= ఎక్కడెక్కడనుండునో, తత్ర= అక్కడ, దేవః= వానదేవుడు, అభివర్షతే= బాగా వర్షించును, ఉపతాపాః= తాపములు, న= ఉండవు, మారికాః= అంటువ్యాధులు, న= ఉండవు.

ఆ శ్వఫల్కుని పుత్రుడగు ఈ అక్రూరునకు కూడ అటువంటి మహిమ గలదు. ఈతడు ఎక్కడ ఉంటే అక్కడ దేవుడు వర్షించుటయే గాక, తాపములు గాని అంటువ్యాధులు గాని ఉండవు.

ఇతి వృద్ధవచఃశ్రుత్వా నైతావదిహ కారణమ్ ।
ఇతి మత్వా సమానాయ్య ప్రాహాక్రూరం జనార్దనః ॥ 34

ఇతి= అనే, వృద్ధవచః= పెద్దల మాటను, శ్రుత్వా= విని, జన–అర్దనః= దుష్టజనశిక్ష కుడగు శ్రీకృష్ణ భగవానుడు, ఇహ= ఈ విషయమునందు, ఏతావత్= ఇంతమాత్రమే, కారణమ్= కారణము, న= కాదు, ఇతి= అని, మత్వా= తలచి, అక్రూరమ్= అక్రూరుని, సమానాయ్య= రప్పించి, ఆహ= పలికెను.

పెద్దలు ఈ రకముగా పలుకుటను దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానుడు వినెను. కేవలము అక్రూరుడు మాత్రమే లేకుండుట అరిష్టహేతువు కాదని (మణి లేకుండుట కూడ హేతువని) ఆయన తలచెను. ఆయన అక్రూరుని రప్పించి ఇట్లు పలికెను.

పూజయిత్వాఽభిభాష్యైనం కథయిత్వా ప్రియాః కథాః ।
విజ్ఞాతాఖిలచిత్తజ్ఞ స్స్మయమాన ఉవాచ హ ॥ 35

విజ్ఞాత–అఖిలచిత్తజ్ఞుఁ= తెలియబడిన సర్వము గలవాడు మనస్సాక్షి అగు శ్రీకృష్ణుడు, ఏనమ్= ఈతనిని, పూజయిత్వా= పూజించి, ప్రియాఁ= ప్రీతికరములగు, కథాఁ= మాటలను, కథయిత్వా= చెప్పి, స్మయమానఁ= నవ్వుచున్నవాడై, అభిభాష్య= సంబోధించి, ఉవాచ హ= పలికెను.

సకల ప్రాణుల అంతఃకరణసాక్షియగు శ్రీకృష్ణునకు సర్వము దెలియును. ఆయన ఈ అక్రూరుని సమ్మానించి ప్రీతికరములగు మాటలను చెప్పి చిరునవ్వుతో సంబోధించి ఇట్లు పలికెను.

నను దానపతే న్యస్త స్త్వయ్యాస్తే శతధన్వనా ।
స్యమంతకో మణి శ్శ్రీమాన్ విదితఃపూర్వమేవ నఃఁ ॥ 36

దానపతే= ఓ దానప్రభూ!, శ్రీమాన్= శోభాయుక్తమైన, స్యమంతకఁ మణిఁ= స్యమంతకమణి, శతధన్వనా= శతధన్వునిచే, త్వయి= నీయందు, న్యస్తఁ= భద్రపరచబడినదై, నను ఆస్తే= ఉన్నది గదా!, నఁ= మాకు, పూర్వం ఏవ= పూర్వమే, విదితఁ= తెలియబడినది.

ఓ దానప్రభూ! గొప్పగా ప్రకాశించే స్యమంతకమణిని శతధన్వుడు తమరి వద్ద భద్రపరచినాడు. అది మీ వద్దనే ఉన్నది గదా! ఈ విషయము మాకిదివరకే తెలియును.

సత్రాజితోఽనపత్యత్వా ద్భృహ్ణీయు ర్దుహితు స్సుతాఁ ।
దాయం నినీయాపఁ పిండాన్ విముచ్యర్ణం చ శేషితామ్ ॥37

సత్రాజితఁ= సత్రాజిత్తునకు, అనపత్యత్వాత్= సంతానము లేనందువలన, దుహితుఁ= కుమార్తె యొక్క, సుతాఁ= పుత్రులు, ఆపఁ= తర్పణములను, పిండాన్= పిండములను, నినీయ= సమర్పించి, ఋణం

చ= అప్పును కూడ, విముచ్య= తీర్చి, శేషితమ్= మిగిలిన, దాయమ్= ఆస్తిని, గృహ్ణీయుః= పొందెదరు.

సత్రాజిత్తునకు పుత్రసంతానము లేనందువలన, ఆమె కుమార్తె యొక్క పుత్రులే ఆయనకు తర్పణములను పిండములను సమర్పించి, అప్పులను కూడ తీర్చి, మిగిలిన ఆస్తిని పొందెదరు.

తథాఽపి దుర్ధర స్తస్మై స్త్వయ్యాస్తాం సుప్రతే మణిః ।
కిం తు మామగ్రజ స్సమ్యఙ్న ప్రత్యేతి మణిం ప్రతి ॥ 38

తథాపి= అయినప్పటికీ, అన్యైఃఽ= ఇతరులచే, దుర్ధరః= ధరింప కష్టమైన, మణిః= మణి, సుప్రతే= మంచి నియమనిష్ఠలు గల, త్వయి= నీవద్ద, ఆస్తామ్= ఉండుగాక!, కిం తు= కానైతే, మణిం ప్రతి= మణిని గురించి, అగ్రజః= అన్నగారు, మామ్= నన్ను, సమ్యక్= పూర్తిగా, న ప్రత్యేతి= నమ్ముట లేదు.

అయినప్పటికీ మంచి నియమనిష్ఠలు గల నీ వద్దనే మణిని ఉండనిండు. దానిని ఇతరులు భద్రము చేయలేరు. కానైతే, ఆ మణి విషయములో అన్న బలరామునకు నాపై పూర్తి నమ్మకము కలుగకున్నది.

దర్శయస్వ మహాభాగ బంధూనాం శాంతిమావహ ।
అవ్యుచ్ఛిన్నా మఖాసేఽద్య వర్తంతే రుక్మవేదయః ॥ 39

మహాభాగ= ఓ గొప్ప భాగ్యవంతుడా!, బంధూనామ్= బంధువులకు, దర్శయస్వ= చూపించుము, శాంతిమ్= శాంతిని, ఆవహ= కలిగించుము, అద్య= ఈనాడు, రుక్మవేదయః= బంగరు వేదులు గల, తే= నీ, మఖాః= యజ్ఞములు, అవ్యుచ్ఛిన్నాఃఽ= నిరంతరములై, వర్తంతే= ప్రవర్తిల్లుచున్నవి.

ఓ అక్రూరా! మణిని చూపించి బంధువులకు శాంతిని కలిగించుము. ఈ కాలంలో నీవు బంగరు వేదులు గల యజ్ఞములను నిరంతరముగా చేయుచున్నావు. (మణి బంగారమును పెట్టుచుండును).

ఏవం సామభి రాలబ్ధ శ్ఛ్వఫల్కతనయో మణిమ్ ।
ఆదాయ వాససా చ్ఛన్నం దదౌ సూర్యసమప్రభమ్ ॥ 40

ఏవమ్= ఈ విధముగా, సామభిః= అనునయవచనములతో, ఆలబ్ధః= హృదయమునందు స్పృశించబడినవాడై, శ్వఫల్కతనయః= శ్వఫల్కుని పుత్రుడగు అక్రూరుడు, వాససా= వస్త్రముచే, ఛన్నమ్= కప్పబడినట్టియు, సూర్యసమప్రభమ్= సూర్యునితో సమానమైన కాంతి గల, మణిమ్= మణిని, ఆదాయ= పైకి తీసి, దదౌ= ఇచ్చెను.

ఈ విధముగా శ్రీకృష్ణుడు సాంత్వవచనములతో నచ్చజెప్పగా, శ్వఫల్కుని పుత్రుడగు అక్రూరుడు సూర్యునితో సమానముగా వెలిగిపోయే స్యమంతకమణిని వస్త్రము చాటు నుండి పైకి తీసి యిచ్చెను.

స్యమంతకం దర్శయిత్వా జ్ఞాతిభ్యో రజ ఆత్మనః ।
విమృజ్య మణినా భూయ స్తస్మై ప్రత్యర్పయ త్ప్రభుః ॥ 41

ప్రభుః= శ్రీకృష్ణ ప్రభుడు, జ్ఞాతిభ్యః= బంధువుల కొరకు, స్యమంతకమ్= స్యమంతకమణిని, దర్శయిత్వా= చూపించి, మణినా= మణినిమిత్తముగా, ఆత్మనః= తనకు కలిగిన, రజః= కళంకమును, విమృజ్య= తుడిచివేసి, భూయః= మరల, తస్మై= వాని కొరకు, ప్రత్యర్పయత్= సమర్పించెను.

శ్రీకృష్ణ ప్రభుడు బంధువులకు స్యమంతకమణిని చూపించి, దాని కారణముగా తనకు కలిగిన అపవాదును తుడిచివేసి, మరల దానిని ఆ అక్రూరునకు సమర్పించెను.

యస్త్వేతద్భగవత ఈశ్వరస్య విష్ణోః
వీర్యాఢ్యం వృజినహరం సుమంగలం చ ।
ఆఖ్యానం పఠతి శృణోత్యనుస్మరేద్వా
దుష్కీర్తిం దురితమపోహ్య యాతి శాంతిమ్ ॥ 42

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే సప్తపంచాశత్తమోఽధ్యాయః ॥

యః తు= ఎవడైతే, ఈశ్వరస్య= అంతర్యామియైనట్టియు, విష్ణోః= సర్వవ్యాపకుడగు, భగవతః= శ్రీకృష్ణ భగవానుని, వీర్య-ఆఢ్యమ్= పరాక్రమముచే సంపన్నమైనట్టియు, వృజినహరమ్= పాపములను పోగొట్టునట్టియు, సుమంగలం చ= గొప్ప మంగళములను చేయునది కూడా అగు, ఆఖ్యానమ్= వృత్తాంతమును, పఠతి= పఠించునో, శృణోతి= వినునో, వా= లేక, అనుస్మరేత్= స్మరించునో అట్టివాడు, దుష్కీర్తిమ్= అపవాదును, దురితమ్= పాపమును, అపోహ్య= పోనాడి, శాంతిమ్= శాంతిని, యాతి= పొందును.

సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు అగు శ్రీకృష్ణభగవానుని ఈ పరాక్రమముతో సంపన్నమైన వృత్తాంతము పాపములను పోగొట్టి మంగళములను కలిగించును. ఎవడైతే దీనిని చదువునో, వినునో, లేదా స్మరించునో, అట్టివాడు అపవాదును, పాపమును తుడిచివేసి శాంతిని పొందును.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
శతధన్వుడు మణిని అపహరించుటను, శతధన్వుని ఉద్ధారమును
వర్ణించే ఏబది ఏడవ అధ్యాయము ముగిసినది (57).

* * *

అథాష్టపంచాశత్తమోఽధ్యాయః

శ్రీకృష్ణుడు కాళింది మొదలగువారిని పరిణయమాడుట

శ్రీశుక ఉవాచ ।

ఏకదా పాండవాన్ ద్రష్టుం ప్రతీతాన్ పురుషోత్తమః ।
ఇంద్రప్రస్థం గత శ్శ్రీమాన్ యుయుధానాదిభి ర్వృతః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి ఉవాచ= పలికెను, ఏకదా= ఒకనాడు, శ్రీమాన్= శోభాయుక్తుడైన, పురుషోత్తమః= శ్రీకృష్ణభగవానుడు, యుయుధాన-ఆదిభిః= యుయుధానుడు మొదలగు వారితో, వృతః= చుట్టువారబడినవాడై, ప్రతీతాన్= లోకప్రఖ్యాతి పొందిన, పాండవాన్= పాండవులను, ద్రష్టుమ్= చూచుటకు, ఇంద్రప్రస్థమ్= ఇంద్రప్రస్థమును గురించి, గతః= వెళ్లినవాడు.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను... అతిశయించిన శోభగల శ్రీకృష్ణ భగవానుడు ఒకనాడు యుయుధానుడు, సాత్యకి మొదలగువారు చుట్టువారి రాగా, లోకప్రఖ్యాతులైన పాండవులను చూచుటకు ఇంద్రప్రస్థము వెళ్లెను.

దృష్ట్వా తమాగతం పార్థా ముకుంద మఖిలేశ్వరమ్ ।
ఉత్తస్థు ర్యుగపద్వీరాః ప్రాణా ముఖ్యమివాగతమ్ ॥ 2

వీరాః= వీరులగు, పార్థాః= కుంతీపుత్రులు, ఆగతమ్= విచ్చేసిన, ముకుందమ్= మోక్షప్రదాతయైనట్టియు, అఖిల-ఈశ్వరమ్= సర్వేశ్వరుడగు, తమ్= ఆ శ్రీకృష్ణుని, దృష్ట్వా= చూచి, యుగపత్= ఒక్కసారిగా, ఆగతమ్= తిరిగి వచ్చిన, ముఖ్యమ్= ముఖ్యప్రాణమును, ప్రాణాః ఇవ= ఇంద్రియములు వలె, ఉత్తస్థుః= లేచి నిలబడిరి.

దేహములోనికి ముఖ్యప్రాణము రాగానే కన్ను మొదలగు ఐదు ఇంద్రియములు చేతనములగును. అదేవిధముగా మోక్షప్రదాత, సర్వేశ్వరుడు అగు శ్రీకృష్ణుడు వచ్చుచుండుటను గాంచి వీరులగు కుంతీపుత్రులు ఒక్కసారిగా లేచి నిలబడిరి.

పరిష్వజ్యాచ్యుతం వీరా అంగసంగహతైనసః ।
సానురాగస్మితం వక్త్రం వీక్ష్య తస్య ముదం యయుః ॥ 3

వీరాః= వీరులగు పాండవులు, అచ్యుతమ్= శ్రీకృష్ణభగవానుని, పరిష్వజ్య= కౌగిలించి, అంగసంగహత-ఏనసః= దేహముతోడి స్పర్శ వలన నశింపజేయబడిన దోషములు గలవారు, స-అనురాగస్మితమ్= ప్రేమతో కూడిన చిరునవ్వు గల, తస్య= ఆయనయొక్క, వక్త్రమ్= ముఖమును, వీక్ష్య= చూచి, ముదమ్= ఆనందమును, యయుః= పొందిరి.

వీరులగు పాండవులు శ్రీకృష్ణుని కౌగిలించిరి. ఆయన దేహము యొక్క స్పర్శచే వారి దోష (దుఃఖ)ములు దూరమయ్యెను. ప్రేమ నిండిన చిరునవ్వుతో కూడిన ఆయన ముఖమును చూచి వారు ఆనందమును పొందిరి.

యుధిష్ఠిరస్య భీమస్య కృత్వా పాదాభివందనమ్ ।
ఫాల్గునం పరిరభ్యాథ యమాభ్యాం చాభివందితః ॥ 4

యుధిష్ఠిరస్య= ధర్మరాజునకు, భీమస్య= భీమునకు, పాద-అభివందనమ్= పాదములకు నమస్కారమును, కృత్వా= చేసి, ఫాల్గునమ్= అర్జునుని, పరిరభ్య= కౌగిలించి, అథ= తరువాత, యమాభ్యామ్= కవలలచే, అభివందితః= నమస్కరించబడినవాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజభీముల పాదములను నమస్కరించి అర్జునుని కౌగిలించగా, నకుల సహదేవులు ఆయనకు నమస్కరించిరి.

పరమాసన ఆసీనం కృష్ణా కృష్ణ మనిందితా ।
నవోఢా వ్రీడితా కించి చ్ఛనై రేత్యాభ్యవందత ॥ 5

పరమ-ఆసనే= శ్రేష్ఠమగు ఆసనమునందు, ఆసీనమ్= కూర్చున్న, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అనిందితా= దోషములు లేనిది, నవ-ఊఢా= కొత్తగా పెళ్లైనది అగు, కృష్ణా= ద్రౌపది, కించిత్= కొంచెము, వ్రీడితా= సిగ్గు పడినదై, శనైః= మెల్లగా, ఏత్య= వచ్చి, అభ్యవందత= నమస్కరించెను.

శ్రేష్ఠమగు ఆసనముపై కూర్చున్న శ్రీకృష్ణుని, కొత్తగా పెళ్లి అయి కొంచెము సిగ్గుపడుతున్న ద్రౌపది మెల్లగా వచ్చి నమస్కరించెను.

తథైవ సాత్యకిః పార్థైః పూజితశ్చాభివందితః ।
నిషసాదాసనేఽన్యే చ పూజితాః పర్యుపాసత ॥ 6

తథా ఏవ= అదే విధముగా, సాత్యకిః= సాత్యకి, పార్థైః= కుంతీపుత్రులచే, పూజితః= పూజించబడినవాడు, అభివందితః చ= నమస్కారము కూడ చేయబడినవాడు, ఆసనే= ఆసనమునందు, నిషసాద= కూర్చుండెను, అన్యే చ= ఇతరులు కూడ, పూజితాః= పూజించబడినవారు, పర్యుపాసత= (శ్రీకృష్ణుని) చుట్టూ కూర్చుండిరి.

అదే విధముగా, పాండవులు సాత్యకిని, పూజించి నమస్కరించి, ఇతరులను కూడ పూజించిరి. వారు చుట్టూ ఆసనములలో కూర్చుండిరి.

పృథాం సమాగత్య కృతాభివాదనః
తయాఽతిహార్దార్ద్రదృశాఽభిరంభితః ।
అపృష్టవాంస్తాం కుశలం సహస్నుషాం
పితృష్వసారం పరిపృష్టబాంధవః ॥ 7

పృథామ్= కుంతిని, సమాగత్య= కలిసి, కృత-అభివాదనః= చేయబడిన నమస్కారము గలవాడు, అతిహార్ద-ఆర్ద్రదృశా= అతిశయించిన

ప్రేమచే నీళ్లు నిండిన కన్నులు గల, తయా= ఆ కుంతిచే, అభిరంభితః = కౌగిలించుకొనబడినవాడు, సహస్నుషామ్= కోడలితో కూడియున్న, తామ్= ఆ, పితృష్వసారమ్= తండ్రి సోదరిని, కుశలమ్= క్షేమమును, ఆపృష్టవాన్= అడిగినవాడు, పరిపృష్టబాంధవః= ప్రశ్నించబడిన బంధువులు గలవాడు.

శ్రీకృష్ణుడు కుంతిని కలిసి నమస్కరించెను. ఆమె అతిశయించిన ప్రేమచే కన్నులలో నీళ్లు నిండగా కౌగిలించి, బంధువుల క్షేమమును గురించి ప్రశ్నించెను. తన తండ్రి సోదరియగు ఆమెను, ఆమె కోడలు అగు ద్రౌపదిని కూడ శ్రీకృష్ణుడు కుశలమును అడిగి తెలుసుకొనెను.

తమాహ ప్రేమవైక్లబ్య రుద్ధకంఠాశ్రులోచనా ।
స్మరంతీ తాన్ బహూన్ క్లేశాన్ క్లేశాపాయాత్మదర్శనమ్ ॥ 8

తాన్= అట్టి, బహూన్= అనేకములైన, క్లేశాన్= కష్టములను, స్మరంతీ= గుర్తు చేసుకొనుచున్నదై, ప్రేమవైక్లబ్యరుద్ధకంఠ–అశ్రులోచనా= ప్రేమ వలని కంగారుచే బొంగురువోయిన కంఠము నీరు నిండిన కన్నులు గల కుంతి, క్లేశ–అపాయ–ఆత్మదర్శనమ్= కష్టములను పోగొట్టుటకై తనను ప్రకటించే, తమ్= ఆ శ్రీకృష్ణుని ఉద్దేశించి, ఆహ= పలికెను.

ఆయా కష్టములు గుర్తుకు రాగా కుంతి కన్నులలో నీరు నిండెను. ప్రేమ వలని కంగారుచే ఆమె కంఠము బొంగురు వోయెను. తన దర్శనమునిచ్చి కష్టములను బాపే ఆ శ్రీకృష్ణునితో ఆమె యిట్లనెను.

తదైవ కుశలం నోఽభూత్సనాథా స్తే కృతా వయమ్ ।
జ్ఞాతీ న్నస్స్మరతా కృష్ణ భ్రాతా మే ప్రేషితస్త్వయా ॥ 9

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, జ్ఞాతీన్= బంధువులమగు, నః= మమ్ములను, స్మరతా= స్మరించే, త్వయా= నీచే, మే= నా, భ్రాతా= సోదరుడగు

అక్రూరుడు, ప్రేషితః= ఎప్పుడైతే పంపబడినాడో, తదా ఏవ= అప్పుడే, నః= మాకు, కుశలమ్= క్షేమము, అభూత్= కలిగెను, తే= నీచే, వయమ్= మేము, సనాథాః= నాథుడు గలవారుగా, కృతాః= చేయబడినవారము.

ఓ శ్రీకృష్ణా! ఎప్పుడైతే నీవు బంధువులమగు మమ్ములను స్మరించి నా సోదరుడగు అక్రూరుని (క్షేమమునరయుటకై) పంపితివో, అప్పుడే మేము క్షేమము గలవారమైతిమి. మాకు నీవు నాథుడవైతివి.

న తేఽస్తి స్వపరభ్రాంతి ర్విశ్వస్య సుహృదాత్మనః ।
తథాపి స్మరతాం శశ్వత్ క్లేశాన్ హంసి హృది స్థితః ॥ 10

విశ్వస్య= జగత్తునకు, సుహృద్-ఆత్మనః= హితకారి ఆత్మయగు, తే= నీకు, స్వపరభ్రాంతిః= తనవారు పరాయివారు అనే భ్రమ, న అస్తి= లేదు, తథాపి= అయినప్పటికీ, స్మరతామ్= స్మరించువారల, హృది= హృదయమునందు, శశ్వత్= ఎల్లవేళలా, స్థితః= ఉన్నవాడవై, క్లేశాన్= కష్టములను, హంసి= పోగొట్టెదవు.

నీవు జగత్తునకు హితకారివి. ఆత్మస్వరూపుడవు. నీకు నావారు, పరాయివారు అనే భ్రాంతి లేదు. అయినప్పటికీ, నిన్ను స్మరించువారల హృదయములో నీవు ఎల్లవేళలా ఉండి ఇడుముల బాపెదవు.

యుధిష్ఠిర ఉవాచ ।

కిం న ఆచరితం శ్రేయో న వేదాహమధీశ్వర ।
యోగేశ్వరాణాం దుర్దర్శో యన్నో దృష్టః కుమేధసామ్ ॥ 11

యుధిష్ఠిరః= ధర్మరాజు, ఉవాచ= పలికెను, అధీశ్వర= ఓ సర్వేశ్వరా!, నః= మాచే, కిమ్= ఏమి, శ్రేయః= పుణ్యము, ఆచరితమ్= చేయబడినదో, అహమ్= నేను, న వేద= ఎరుగను, యత్= ఏలయన,

యోగ–ఈశ్వరాణామ్= గొప్ప యోగులకు, దుర్దర్శః= దర్శించుట కష్టమైన నీవు, కుమేధసామ్= భోగపరాయణుల మగు, నః= మాకు, దృష్టః= కనబడితివి.

ధర్మరాజు ఇట్లు పలికెను...ఓ సర్వేశ్వరా! మేమేమి పుణ్యమును చేసితిమో నాకు తెలియకున్నది. ఎందుకంటే, గొప్ప యోగులకు కూడ దర్శించుట కష్టమైన నీవు భోగపరాయణులమగు మాకు దర్శనమిచ్చితివి.

ఇతి వై వార్షికాన్ మాసాన్ రాజ్ఞా సోఽభ్యర్థిత స్సుఖమ్ ।
జనయ న్నయనానంద మింద్రప్రస్థౌకసాం విభుః ॥ 12

ఇతి= ఈ విధముగా, రాజా= ధర్మరాజు చే, అభ్యర్థితః= కోరబడిన, విభుః= సర్వసమర్థుడగు, సః= ఆ శ్రీకృష్ణుడు, ఇంద్రప్రస్థ ఓకసామ్= ఇంద్రప్రస్థనివాసులకు, వై= నిశ్చయముగా, నయన–ఆనందమ్= కళ్లకు ఆనందమును, జనయన్= కలిగించువాడై, వార్షికాన్= వర్షకాలమునకు చెందిన, మాసాన్= మాసములను (నివసించెను).

ధర్మరాజు ఈ విధముగా కోరగా, సర్వసమర్థుడగు శ్రీకృష్ణుడు వర్షకాలము నాల్గు మాసములు పూర్తిగా అక్కడనే గడిపెను. ఆయన ఇంద్రప్రస్థవాసుల కళ్లకు ఆనందమును కలిగించెను.

ఏకదా రథమారుహ్య విజయో వానరధ్వజమ్ ।
గాండీవం ధనురాదాయ తూణౌ చాక్షయసాయకౌ ॥ 13

సాకం కృష్ణేన సన్నద్ధో విహర్తుం విపినం వనమ్ ।
బహువ్యాలమృగాకీర్ణం ప్రావిశ త్పరవీరహా ॥ 14

ఏకదా= ఒకనాడు, పరవీరహా= శత్రువీరులను సంహరించే, విజయః= అర్జునుడు, సన్నద్ధః= కవచధారియై, గాండీవమ్= గాండీవమనే, ధనుః= ధనుస్సును, అక్షయసాయకౌ= తరిగిపోని బాణములు గల,

తూణౌ= అంబుల పొదులను, ఆదాయ= తీసుకొని, కృష్ణేన సాకమ్= శ్రీకృష్ణునితో గూడి, వానరధ్వజమ్= వానరుడు ధ్వజమునందు గల, రథమ్= రథమును, ఆరుహ్య= ఎక్కి, విపినమ్= గహనమైనట్టియు, బహు వ్యాలమృగ-ఆకీర్ణమ్= అనేకములగు క్రూరమృగములతో నిండియున్న, వనమ్= అడవిని, విహర్తుమ్= విహరించుటకు, ప్రావిశత్= ప్రవేశించెను.

శత్రువీరులను సంహరించే అర్జునుడు ఒకనాడు కవచమును వేసుకొని శ్రీకృష్ణునితో గూడి రథమునెక్కి విహరించుటకై అడవిలో ప్రవేశించెను. ఆయన గాండీవధనుస్సును, తరిగిపోని అంబుల పొదులను కూడ తీసుకొని వెళ్లెను. ఆయన రథముపై ధ్వజమునందు కపిచిహ్నము ఉండును. ఆ గహనమైన అడవి అనేక క్రూరమృగములతో నిండియుండెను.

తత్రావిధ్య చ్ఛరై ర్వ్యాఘ్రాన్ సూకరా న్మహిషాన్ రురూన్ ।
శరభాన్ గవయాన్ ఖడ్గాన్ హరిణాఞ్ఛశల్లకాన్ ॥ 15

తత్ర= ఆ అడవియందు, వ్యాఘ్రున్= పెద్ద పులులను, సూకరాన్= అడవి పందులను, మహిషాన్= అడవి దున్నలను, రురూన్= దుప్పులను, శరభాన్= మీగండ్ల మెకములను, గవయాన్= గురుపోతులను, ఖడ్గాన్= ఖడ్గమృగములను, హరిణాన్= జింకలను, శశశల్లకాన్= కుందేళ్లను, ఏదుపందులను, అవిధ్యత్= వేటాడెను.

ఆతడా అడవిలో పెద్ద పులులు, అడవి పందులు, అడవి దున్నలు, దుప్పులు, మీగండ్ల మెకములు, గురుపోతులు, ఖడ్గమృగములు, జింకలు, కుందేళ్లు, ఏదుపందులు అనువాటిని వేటాడెను.

తాన్నిన్యుః కింకరా రాజ్ఞే మేధ్యాన్ పర్వణ్యుపాగతే ।
తృట్పరీతః పరిశ్రాంతో బీభత్సు ర్యమునామగాత్ ॥ 16

పర్వణి= పర్వకాలము, ఉపాగతే= సంప్రాప్తము కాగా, మేధ్యాన్= కర్మకు అర్హములైన, తాన్= ఆ మృగములను, కింకరాఃన= సేవకులు, రాజ్ఞే= ధర్మరాజు కొరకు, నిన్యుఃన= చేరవేసిరి, పరిశ్రాంతఃన= అలసిపోయిన, బీభత్సుఃన= అర్జునుడు, తృట్-పరీతఃన= దప్పికచే వ్యాపించబడినవాడై, యమునామ్= యమునానదిని గురించి, అగాత్= వెళ్లెను.

పర్వ (యజ్ఞ) కాలము సంప్రాప్తము కాగా, సేవకులా పశువులలో కర్మకు యోగ్యమైన వాటిని ధర్మరాజుగారి వద్దకు చేర్చిరి. అలసిపోయిన అర్జునుడు అధికమగు దప్పిక గలవాడై యమునానదికి వెళ్లెను.

తత్రోపస్పృశ్య విశదం పీత్వా వారి మహారథౌ ।
కృష్ణౌ దదృశతుఃన కన్యాం చరంతీం చారుదర్శనామ్ ॥ 17

మహారథౌ= గొప్ప రథికులగు, కృష్ణౌ= శ్రీకృష్ణార్జునులు, తత్ర= ఆ యమునయందు, ఉపస్పృశ్య= స్నానము చేసి, విశదమ్= స్వచ్ఛమైన, వారి= నీటిని, పీత్వా= త్రాగి, చరంతీమ్= సంచరించుచున్నట్టియు, చారుదర్శనామ్= సుందరమైన రూపము గల, కన్యామ్= కన్యను, దదృశతుఃన= చూచిరి.

మహారథికులగు శ్రీకృష్ణార్జునులా యమునలో స్నానమాడి మంచి నీరు త్రాగి, అక్కడ సంచరించుచున్న సుందరరూపిణియగు కన్యను చూచిరి.

తామాసాద్య వరారోహాం సుద్విజాం రుచిరాననామ్ ।
పప్రచ్ఛ ప్రేషితస్సఖ్యా ఫాల్గునఃన ప్రమదోత్తమామ్ ॥ 18

సఖ్యా= మిత్రుడగు శ్రీకృష్ణునిచే, ప్రేషితఃన= పంపబడిన, ఫాల్గునఃన= అర్జునుడు, వరారోహామ్= సుందరియైనట్టియు, సుద్విజామ్= చక్కని దంతములు కలిగినట్టియు, రుచిర-ఆననామ్= అందమైన మోము గల, తామ్= ఆ, ప్రమదా-ఉత్తమామ్= ఉత్తమమగు యువతిని, ఆసాద్య= సమీపించి, పప్రచ్ఛ= ప్రశ్నించెను.

ఆ ఉత్తమయువతి గొప్ప సుందరి. ఆమె అందమైన మోము చక్కని దంతములతో ప్రకాశించెను. శ్రీకృష్ణుడు పంపగా అర్జునుడు ఆమె వద్దకు వెళ్లి ఇట్లు ప్రశ్నించెను.

కా త్వం కస్యాసి సుశ్రోణి కుతోఽసి కిం చికీర్షసి ।
మన్యే త్వాం పతిమిచ్ఛంతీం సర్వం కథయ శోభనే ॥ 19

త్వమ్= నీవు, కా= ఎవతెవు?, కస్య= ఎవనికి చెంది, అసి= ఉన్నావు? సుశ్రోణి= ఓ సుందరీ!, కుతః= ఎక్కడనుండి, అసి= వచ్చిన దానవు?, కిమ్= దేనిని, చికీర్షసి= చేయగోరుచున్నావు?, త్వామ్= నిన్ను, పతిమ్= భర్తను, ఇచ్ఛంతీమ్= కోరుచున్నదానినిగా, మన్యే= తల చెదను, శోభనే= ఓ కల్యాణీ!, సర్వమ్= సర్వమును, కథయ= చెప్పుము.

ఓ సుందరీ! నీవెవతెవు? ఎవరిదానవు? ఎక్కడనుండి వచ్చితివి? ఓ కల్యాణీ! ఏమి చేయగోరుచున్నావు? నీవు భర్తను కోరుచున్నావని నాకు అనిపిస్తోంది. సర్వమును చెప్పుము.

కాళింద్యువాచ ।

అహం దేవస్య సవితు ర్దుహితా పతిమిచ్ఛతీ ।
విష్ణుం వరేణ్యం వరదం తపః పరమమాస్థితా ॥ 20

కాళిందిః= కాళింది, ఉవాచ= పలికెను, అహమ్= నేను, సవితుః దేవస్య= సూర్యదేవుని, దుహితా కుమార్తెను, వరేణ్యమ్= సర్వోత్తము-డైనట్టియు, వరదమ్= వరములనిచ్చే, విష్ణుమ్= శ్రీహరిని, పతిమ్= భర్తనుగా, ఇచ్ఛతీ= కోరుదాననై, పరమమ్= కఠోరమైన, తపః= తపస్సును, ఆస్థితా= చేయుచున్నదానను.

కాళింది ఇట్లు పలికెను... నేను సూర్యదేవుని కుమార్తెను. సర్వోత్తముడు, వరములనిచ్చువాడు అగు శ్రీహరిని భర్తగా పొందాలనే కోరికతో నేను కఠోరమగు తపస్సును చేయుచున్నాను.

నాన్యం పతిం వృణే వీర తమృతే శ్రీనికేతనమ్ ।
తుష్యతాం మే స భగవాన్ ముకుందోఽనాథసంశ్రయః ॥21

వీర= ఓ వీరుడా!, శ్రీనికేతనమ్= లక్ష్మికి నివాసస్థానమగు, తం ఋతే= ఆయనను మినహాయించి, అన్యమ్= మరియొకనిని, పతిమ్= భర్తనుగా, న వృణే= కోరను, ముకుందః= మోక్షమునిచ్చువాడు, అనాథ-సంశ్రయః= అనాథులకు ఆశ్రయమైనవాడు అగు, సః= ఆ, భగవాన్= శ్రీహరి భగవానుడు, మే= నా కొరకు, తుష్యతామ్= ప్రీతుడగు గాక!

ఓ వీరుడా! లక్ష్మీదేవికి నివాసస్థానమగు ఆ శ్రీహరిని తక్క నేను మరియొకనిని భర్తగా కోరను. మోక్షప్రదాత, అనాథలకు ఆశ్రయము ఆగు ఆ శ్రీహరి భగవానుడు నా యెడల ప్రీతిని జెందుగాక!

కాళిందీతి సమాఖ్యాతా వసామి యమునాజలే ।
నిర్మితే భవనే పిత్రా యావదచ్యుత దర్శనమ్ ॥ 22

కాళిందీ= కాళింది, ఇతి= అని, సమాఖ్యాతా= పిలువబడుదానను, యమునాజలే= యమునానది యొక్క నీటియందు, పిత్రా= తండ్రిచే, నిర్మితే= కట్టబడిన, భవనే= భవనమునందు, అచ్యుతదర్శనం యావత్= శ్రీహరి దర్శనమయ్యేంతవరకు, వసామి= నివసించుచున్నాను.

నన్ను కాళింది అంటారు. నేను యమునానదిలో మా తండ్రిచే నిర్మించబడిన భవనములో శ్రీహరి దర్శనమయ్యేంతవరకు నివసించు-చున్నాను.

తథావదద్గుడాకేశో వాసుదేవాయ సోఽపి తామ్ ।
రథమారోప్య తద్విద్వాన్ ధర్మరాజముపాగమత్ ॥ 23

గుడాకా-ఈశః= నిద్రను నిర్జించిన అర్జునుడు, తథా= అదే విధముగా, వాసుదేవాయ= శ్రీకృష్ణుని కొరకు, అవదత్= చెప్పెను, తద్-

విద్వాన్= ఆ విషయము తెలిసిన, సః అపి= ఆయన కూడ, తామ్= ఆమెను, రథమ్= రథమును, ఆరోప్య= ఎక్కించి, ధర్మరాజమ్= ధర్మరాజును గురించి, ఉపాగమత్= వెళ్లెను.

నిద్రను నిర్జించిన అర్జునుడు ఆమె చెప్పిన విషయమును యథాతథముగా శ్రీకృష్ణునకు చెప్పెను. ఈ సంగతి శ్రీకృష్ణునకు ముందే తెలియును. ఆయన ఆమెను రథమెక్కించి ధర్మరాజు వద్దకు వెళ్లెను.

యదైవ కృష్ణస్సందిష్టః పార్థానాం పరమాద్భుతమ్ ।
కారయామాస నగరం విచిత్రం విశ్వకర్మణా ॥ 24

యదా= ఎప్పుడైతే, కృష్ణః= శ్రీకృష్ణుడు, సందిష్టః= విన్నవించబడిన వాడో, ఏవ= అప్పుడే, పారానామ్= కుంతీపుత్రులకు, విశ్వకర్మణా= విశ్వకర్మచే, పరమ-అద్భుతమ్= గొప్ప ఆశ్చర్యమును కలిగించునట్టియు, విచిత్రమ్= రంగు రంగుల, నగరమ్= నగరమును, కారయామాస= నిర్మింపజేసెను.

ఇదివరలో పాండవులు శ్రీకృష్ణునకు ఒక విన్నపమును చేసిరి. వెంటనే ఆయన విశ్వకర్మచే రంగు రంగుల నగరము (ఇంద్రప్రస్థములో భాగము)ను నిర్మింపజేసెను. ఆ నగరము గొప్ప ఆశ్చర్యమును కలిగించెను.

భగవాంస్తత్ర నివసన్ స్వానాం ప్రియచికీర్షయా ।
అగ్నయే ఖాండవం దాతుమర్జునస్యాస సారథిః ॥ 25

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, స్వానామ్= తనవారికి, ప్రియచికీర్షయా= ప్రియమును చేయు కోరికతో, తత్ర= అక్కడ, నివసన్= నివసించుచున్నవాడై, అగ్నయే= అగ్నికొరకు, ఖాండవమ్= ఖాండవ వనమును, దాతుమ్= ఇచ్చుటకై, అర్జునస్య= అర్జునునకు, సారథిః= సారథి, ఆస= ఆయెను.

శ్రీకృష్ణ భగవానుడు తన వారైన పాండవులకు ఆనందమును కలిగించుటకై అక్కడ నివసిస్తూ, అగ్నికి ఖాండవమనే (ఇంద్రుని) అడవిని ఇచ్చుటకై అర్జునుని సారథి ఆయెను.

సోఽగ్నిస్తుష్టో ధను రదాద్ధయాఞ్శ్వేతాన్ రథం నృప ।
అర్జునాయాక్షయౌ తూణౌ వర్మ చాభేద్యమస్త్రిభిః ॥ 26

నృప= ఓ రాజా!, సః= ఆ, అగ్నిః= అగ్నిదేవుడు, తుష్టః= సంతోషించినవాడై, అర్జునాయ= అర్జునుని కొరకు, ధనుః= ధనుస్సును, శ్వేతాన్= తెల్లని, హయాన్= గుర్రములను, రథమ్= రథమును, అక్షయ్= తరిగిపోని, తూణా= అంబుల పొదులను, అస్త్రిభిః= ఆయుధధారులగు వీరులచే, అభేద్యమ్= పగులగొట్ట శక్యము కాని, వర్మ చ= కవచమును కూడ, అదాత్= ఇచ్చెను.

ఓ పరీక్షిన్మహారాజా! సంతోషించిన అగ్నిదేవుడు అర్జునునకు ధనుస్సు, తెల్లని గుర్రములు, రథము, తరిగిపోని అంబుల పొదులు, ఆయుధ ధారులగు వీరులు పగులగొట్టలేని కవచము అనువాటిని యిచ్చెను.

మయశ్చ మోచితో వహ్నేస్సభాం సఖ్య ఉపాహరత్ ।
యస్మిన్ దుర్యోధనస్యాసీజ్జలస్థలదృశిభ్రమః ॥ 27

వహ్నేః= అగ్నినుండి, మయః చ= మయుడు కూడ, మోచితః= విడిపించబడినవాడు, సఖ్యే= మిత్రుని కొరకు, సభామ్= సభను, ఉపాహరత్= బహుమానముగా నిచ్చెను, యస్మిన్= దేనియందైతే, దుర్యోధనస్య= దుర్యోధనునకు, జలస్థలదృశిభ్రమః= నేల నీరుల చూపు యొక్క భ్రమ, ఆసీత్= కలిగెనో.

ఖాండవవనములోని దావాగ్నినుండి అర్జునుడు మయుని విడిపించెను. అప్పుడు మయుడు అర్జునునితో స్నేహము చేసి ఆతనికి

సభను బహుమానముగా నిచ్చెను. ఆ సభయందే దుర్యోధనుడు నీటిని చూచి నేలయని, నేలను నీరుగను భ్రమపడెను.

స తేన సమనుజ్ఞాతస్సుహృద్భిశ్చానుమోదితః ।
ఆయయౌ ద్వారకాం భూయస్సాత్యకిప్రముఖైర్వృతః ॥ 28

సః= ఆ శ్రీకృష్ణుడు, తేన= ఆ అర్జునునిచే, సమనుజ్ఞాతః= అనుమతించబడినవాడై, సుహృద్భిః చ= మిత్రులచే కూడ, అను మోదితః = అనుమతించబడినవాడై, సాత్యకిప్రముఖైః= సాత్యకి మొదలగువారిచే, వృతః= కూడినవాడై, భూయః= మరల, ద్వారకామ్= ద్వారకను గురించి, ఆయయౌ= వచ్చెను.

అర్జునుని, ఇతరమిత్రుల (ధర్మరాజాదుల) అనుమతిని పొంది ఆ శ్రీకృష్ణుడు సాత్యకి మొదలగువారితో గూడి మరల ద్వారకకు వచ్చెను.

అథోపయేమే కాలిందీం సుపుణ్యర్క్ష ఊర్జితే ।
వితన్వన్ పరమానందం స్వానాం పరమమంగలమ్ ॥ 29

పరమమంగలమ్= పరమమంగళస్వరూపుడైన శ్రీకృష్ణుడు, అథ= తరువాత, స్వానామ్= తన వారలకు, పరమ-ఆనందమ్= గొప్ప ఆనందమును, వితన్వన్= విస్తరింపజేయుచున్నవాడై, సుపుణ్య-ఋతు-ఋక్షే= మిక్కిలి పవిత్రమగు ఋతువు నక్షత్రము కలిగినట్టియు, ఊర్జితే= గ్రహముల బలము గల ముహూర్తమునందు, కాలిందీమ్= కాలిందిని, ఉపయేమే= వివాహమాడెను.

పరమమంగళస్వరూపుడగు శ్రీకృష్ణుడు తరువాత మిక్కిలి పవిత్రమగు ఋతువు, నక్షత్రము, గ్రహబలము గల ముహూర్తమునందు కాలిందిని వివాహమాడి తన వారలకు గొప్ప ఆనందమును విస్తరిల్లజేసెను.

విందానువిందావావంత్యౌ దుర్యోధన వశానుగౌ ।
స్వయంవరే స్వభగినీం కృష్ణే సక్తాం న్యషేధతామ్ ॥ 30

ఆవంత్యౌ= అవంతీదేశప్రభువులు, దుర్యోధనవశ-అనుగౌ= దుర్యోధనుని వశములోనుండే అనుయాయులు అగు, వింద-అనువిందౌ= విందుడు అనువిందుడు, స్వయంవరే= స్వయంవరము నందు, కృష్ణే= శ్రీకృష్ణునియందు, సక్తామ్= ప్రేమగల, స్వభగినీమ్= తమ సోదరియగు మిత్రవిందను, న్యషేధతామ్= నిషేధించిరి.

అవంతీదేశప్రభువులగు విందుడు, అనువిందుడు దుర్యోధనుని వశములోనుండే అనుచరులు. వారి సోదరి మిత్రవింద స్వయంవరములో శ్రీకృష్ణుని ప్రేమించగా, వారు అడ్డుపడిరి.

రాజాధిదేవ్యా స్తనయాం మిత్రవిందాం పితృష్వసుః ।
ప్రసహ్య హృతవాన్ కృష్ణో రాజన్ రాజ్ఞాం ప్రపశ్యతామ్ ॥31

రాజన్= ఓ రాజా!, కృష్ణః= శ్రీకృష్ణుడు, పితృష్వసుః= తండ్రి సోదరియగు, రాజాధిదేవ్యాః= రాజాధిదేవియొక్క, తనయామ్= కుమార్తెయగు, మిత్రవిందామ్= మిత్రవిందను, రాజ్ఞాం= రాజులు, ప్రపశ్యతామ్= చూచుచుండగా, ప్రసహ్య= బలవంతముగా, హృతవాన్= తీసుకొని వెళ్లినవాడు.

ఓ పరీక్షిన్మహారాజా! మిత్రవింద వసుదేవుని సోదరియగు రాజాధిదేవి కుమార్తె. శ్రీకృష్ణుడు రాజులందరు చూచుచుండగా లెక్కచేయకుండా, ఆమెను బలాత్కారముగా తీసుకొని వెళ్లెను.

నగ్నజిన్నామ కౌసల్య ఆసీద్రాజాఽతిధార్మికః ।
తస్య సత్యాఽభవత్కన్యా దేవీ నాగ్నజితీ నృప ॥ 32

నృప= ఓ రాజా! కౌసల్యః= కోసల దేశాధిపతి, అతిధార్మికః= గొప్ప ధార్మికుడు, నగ్నజిత్= నగ్నజిత్తు అని, నామ= ప్రసిద్ధి చెందినవాడు అగు, రాజా= రాజు, ఆసీత్= ఉండెను, తస్య= ఆయనకు, నాగ్నజితీ= నగ్నజిత్తు కుమార్తె అని ప్రసిద్ధి గాంచిన, సత్యాదేవీ= సత్యాదేవి అనే, కన్యా= కుమార్తె, అభవత్= ఉండెను.

ఓ పరీక్షిన్మహారాజా! నగ్నజిత్తు అని ప్రసిద్ధి గాంచిన గొప్ప ధార్మికుడు కోసల దేశమునకు ప్రభువుగా నుండెను. ఆయనకు నాగ్నజితి అని ప్రసిద్ధి గాంచిన సత్యాదేవి అనే కుమార్తె ఉండెను.

న తాం శేకుర్నృపా వోఢు మజిత్వా సప్త గోవృషాన్ ।
తీక్ష్ణశృంగాన్ సుదుర్ధర్షాన్ వీరగంధాసహాన్ ఖలాన్ ॥ 33

నృపాఃః= రాజులు, తీక్ష్ణశృంగాన్= వాడి కొమ్ములు కలిగినట్టియు, సుదుర్ధర్షాన్= సుతరాము లొంగదీయుట శక్యము కానట్టియు, వీరగంధ-అసహాన్= వీరపురుషుల గంధమునైననూ సహించనట్టియు, ఖలాన్= పొగరుమోతులైన, సప్త= ఏడు, గోవృషాన్= ఎద్దులను, అజిత్వా= ఓడించకుండా, తామ్= ఆమెను, వోఢుమ్ = వివాహమాడుటకు, న శేకుఃః= సమర్థులు కాకుండిరి.

నగ్నజిత్తు వద్ద ఏడు పొగరుబోతు ఎద్దులు గలవు. వాడి కొమ్ములు గల ఆ ఎద్దులు వీరపురుషుల గంధమునైననూ సహించకుండెడివి. వాటిని లొంగదీయుట సుతరాము శక్యము కాకుండెను. వాటిని జయించి సత్యను వివాహమాడవలెను. రాజులకు ఆ పని శక్యము కాలేదు.

తాం శ్రుత్వా వృషజిల్లభ్యాం భగవాన్ సాత్వతాం పతిః ।
జగామ కౌసల్యపురం సైన్యేన మహతా వృతః ॥ 34

వృషజిత్-లభ్యామ్= ఎద్దులను లొంగదీసినవానిచే పొందదగిన, తామ్= ఆమెను గురించి, శ్రుత్వా= విని, సాత్వతామ్= యాదవులకు

(భక్తులకు), పతిః= పాలకుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, మహతా= పెద్ద, సైన్యేన= సైన్యముతో, వృతః= కూడినవాడై, కౌసల్యపురమ్= కోసలరాజధానియగు అయోధ్యను గురించి, జగామ= వెళ్లెను.

ఎద్దులను లొంగదీసినవానిని మాత్రమే సత్య వివాహమాడునని భక్తపాలకుడు, యాదవప్రభుడు అగు శ్రీకృష్ణభగవానుడు వినెను. ఆయన పెద్ద సైన్యముతో కూడి కోసలరాజధానియగు అయోధ్యకు వెళ్లెను.

స కోసలపతిః ప్రీతః ప్రత్యుత్థానాసనాదిభిః ।
అర్హణేనాపి గురుణా పూజయన్ ప్రతినందితః ॥ 35

సః= ఆ, కోసలపతిః= కోసలదేశపు రాజు, ప్రీతః= సంతోషించిన వాడై, ప్రతి-ఉత్థాన-ఆసన-ఆదిభిః= ఎదురేగుట ఆసనమునిచ్చుట మొదలగువాటిచే, గురుణా= గొప్ప, అర్హణేన అపి= సత్కారముతో కూడ, పూజయన్= పూజించువాడై, ప్రతినందితః= అభినందించబడిన వాడు.

కోసలదేశప్రభుడగు ఆ నగ్నజిత్తు సంతోషముతో శ్రీకృష్ణునకు ఎదురేగి తీసుకువచ్చి ఆసనము, అర్ఘ్యము మొదలగువాటితో పెద్ద సత్కారమును చేసెను. శ్రీకృష్ణుడు కూడ ఆయనను అభినందించెను.

వరం విలోక్యాభిమతం సమాగతం
నరేంద్రకన్యా చకమే రమాపతిమ్ ।
భూయాదయం మే పతిరాశిషోఽమలాః
కరోతు సత్యా యది మే ధృతో వ్రతైః ॥ 36

సమాగతమ్= వచ్చినట్టియు, అభిమతమ్= ఇష్టుడైన, వరమ్= వరుడైన, రమాపతిమ్= లక్ష్మీపతియగు శ్రీకృష్ణుని, విలోక్య= చూచి, నర-ఇంద్రకన్యా= మహారాజపుత్రి, చకమే= ప్రేమించెను, మే= నాచే, వ్రతైః= నియమనిష్ఠలతో, ధృతః యది= హృదయమునందు నిలుపబడిన

వాడైనచో, అయమ్= ఈతడు, మే= నాకు, పతిః= భర్త, భూయాత్= అగుగాక!, అమలాః= గొప్పవైన, ఆశిషః= కామనలను, సత్యాః= యథార్థములనుగా, కరోతు= చేయుగాక!

లక్ష్మీపతియగు శ్రీకృష్ణభగవానుని రాకను చూచి సత్య ఆయనను ప్రేమించెను. ఆమెకు నచ్చిన వరుడాయనయే. నేను నియమనిష్ఠలతో ఈయనను నా హృదయములో నిల్పి యున్నచో, ఈయన నాకు భర్తయై నా గొప్ప మనోరథములను యథార్థము చేయుగాక! (అని తలచెను).

యత్పాదపంకజ రజ శ్శిరసా బిభర్తి
శ్రీరబ్జజ స్సగిరిశ స్సహ లోకపాలైః ।
లీలాతనూ స్స్వకృత సేతుపరీప్సయేశః
కాలే దధత్స భగవాన్మమ కేన తుష్యేత్ ॥ 37

యత్-పాదపంకజరజః= ఎవ్వాని పద్మములవంటి పాదముల ధూళిని, శ్రీః= లక్ష్మీదేవి, సగిరిశః= కైలాసవాసియగు శివునితో కూడిన, అబ్జజః= పద్మసంభవుడగు బ్రహ్మదేవుడు, లోకపాలైః సహ= లోకపాలకులతో సహా, శిరసా= శిరస్సుతో, బిభర్తి= దాల్చునో, స్వకృత- సేతుపరీప్సయా= తనచే చేయబడిన ధర్మమర్యాదలను పాలించుటకై, కాలే= ఆయా కాలమునందు, లీలాతనూః= లీలావతారములను, దధత్= ధరించే, సః= ఆ, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, కేన= దేనిచే, మమ= నాకు, తుష్యేత్= ప్రీతిని జెందును?

శ్రీకృష్ణ భగవానుని పద్మములవంటి పాదముల ధూళిని లక్ష్మీదేవి, పద్మసంభవుడగు బ్రహ్మదేవుడు, కైలాసవాసియగు శివుడు, లోకపాలకులతో సహా తలపై దాల్చెదరు. ఆయన తాను సృష్టించిన ధర్మమర్యాదలను కాపాడుటకై లీలావతారములను దాల్చుచుండును. ఏ వ్రతముచే ఆయనకు నాపై ప్రీతి కలుగును? (ఊహించుట శక్యము కాదు).

అర్చితం పునరిత్యాహ నారాయణ జగత్పతే ।
ఆత్మానందేన పూర్ణస్య కరవాణి కిమల్పకః ॥ 38

అర్చితమ్= పూజించబడిన శ్రీకృష్ణుని ఉద్దేశించి, ఇతి పునఃఈ విధముగా మరలా, ఆహ= పలికెను, నారాయణ= ఓ నారాయణా!, జగత్-పతే= జగన్నాథా!, అల్పకః= అల్పుడనగు నేను, ఆత్మానందేన= ఆత్మానందముతో, పూర్ణస్య= పూర్ణుడవగు నీకు, కిమ్= దేనిని, కరవాణి= చేయుదును?

శ్రీకృష్ణుని పూజించి నగ్నజిత్తిట్లనెను: ఓ నారాయణా! నీవు జగన్నాథుడవు. ఆత్మానందముతో పూర్ణుడవు అగు నీకు అల్పుడనగు నేనేమి చేయుదును?

శ్రీశుక ఉవాచ ।

తమాహ భగవాన్ హృష్టః కృతాసన పరిగ్రహః ।
మేఘగంభీరయా వాచా సస్మితం కురునందన ॥ 39

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కురునందన= కురువంశమును ఆనందింపజేయువాడా!, హృష్టః= ఆనందించినవాడు, కృత-ఆసన పరిగ్రహః= చేయబడిన ఆసనముయొక్క స్వీకారము గలవాడు అగు, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, సస్మితమ్= చిరునవ్వుతో కూడుకున్నట్లుగా, మేఘగంభీరయా= మేఘగర్జనవలె గంభీరమైన, వాచా= వాక్కుతో, తమ్= ఆ రాజును ఉద్దేశించి, ఆహ= పలికెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...కురువంశనందనుడవగు ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణభగవానుడు ఆనందముతో ఆసనమును స్వీకరించెను. ఆయన చిరునవ్వుతో మేఘగర్జనవంటి స్వరముతో ఆ రాజును ఉద్దేశించి ఇట్లు పలికెను.

శ్రీభగవానువాచ ।

నరేంద్ర యాచ్ఞా కవిభి ర్విగర్హితా
రాజన్యబంధో ర్నిజధర్మవర్తినః ।
తథాఽపి యాచే తవ సౌహృదేచ్ఛయా
కన్యాం త్వదీయాం న హి శుల్కదా వయమ్ ॥ 40

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, నర-ఇంద్ర= ఓ మహారాజా! నిజధర్మవర్తినః= స్వధర్మమును పాలించే, రాజన్యబంధోః = నికృష్టక్షత్రియున కైననూ, యాచ్ఞా= యాచన, కవిభిః= విద్వాంసులచే, విగర్హితా= నిందించబడినది, తథాపి= అయిన్పటికీ, తవ= నీ, సౌహృద-ఇచ్ఛయా= బంధుత్వమునందలి ఇచ్ఛచే, త్వదీయామ్= నీకు చెందిన, కన్యామ్= కుమార్తెను, యాచే= కోరుచున్నాను, వయమ్= మేమైతే, శుల్కదాః= కన్యాశుల్కము నిచ్చువారము, న హి= కానే కాము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మహారాజా! స్వధర్మమును పాలించే అధమక్షత్రియునకు కూడ యాచన విద్వాంసులచే నిందించ-బడినది. అయినా నీతో బంధుత్వమునందలి ఇచ్ఛచే నేను నీ కుమార్తెను యాచించుచున్నాను. మేము కన్యాశుల్కమునిచ్చువారము కానే కాము.

రాజోవాచ ।

కోఽన్యస్తేఽభ్యధికో నాథ కన్యావర ఇహేప్సితః ।
గుణైకధామ్నో యస్యాంగే శ్రీ ర్వసత్యనపాయినీ ॥ 41

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, నాథ= ఓ ప్రభూ!, ఇహ= ఈ లోకమునందు, కన్యావరః= కన్యకువరుడు, తే= నీకు, అభ్యధికః= గొప్పవాడు, అన్యః= మరియొకడు, కః= ఎవడు, ఈప్సితః = కోరబడును? గుణ-ఏకధామ్నః= గుణములకు ఏకైకనిధానమైన, యస్య= ఏ నీయొక్క, అంగే= దేహమునందు, అనపాయినీ= తొలగిపోని, శ్రీః= లక్ష్మీదేవి, వసతి= నివసించుచున్నదో.

నగ్నజిన్మహారాజు ఇట్లు పలికెను...ఓ ప్రభూ! ఈ లోకములో కన్యకు వరుడు నీకంటె గొప్పవానిని మరియొకనిని ఎవడు కోరును? (ఎవ్వడూ కోరడు). సకలకల్యాణగుణములకు ఏకైకనిధానము నీవే. నీ దేహమునందు లక్ష్మీదేవి తొలగిపోకుండా నిత్యనివాసము చేయుచున్నది.

కిం త్వస్మాభిః కృతః పూర్వం సమయ స్సాత్వతర్షభ ।
పుంసాం వీర్య పరీక్షాఽర్థం కన్యావరపరీప్సయా ॥ 42

సాత్వత-ఋషభ= యదువంశీయులలో శ్రేష్ఠుడా! కిం తు= కానైతే, కన్యావరపరీప్సయా= కన్యకు వరుని పొందే కోరికతో, పుంసామ్= పురుషులయొక్క, వీర్యపరీక్షా-అర్థమ్= పరాక్రమమును పరీక్షించుట కొరకై, అస్మాభిః= మాచే, పూర్వమ్= ఇదివరలో, సమయః= నియమము, కృతః= చేయబడినది.

యదువంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ శ్రీకృష్ణా! కానైతే కన్యకు వరుని పొందే కోరికతో పురుషుల పరాక్రమమును పరీక్షించుటకై మేము ఇదివరలో ఒక నియమమును పెట్టితిమి.

సప్తైతే గోవృషా వీర దుర్దాంతా దురవగ్రహాః ।
ఏతై ర్భగ్నా స్సుబహవో భిన్నగాత్రా నృపాత్మజాః ॥ 43

వీర= ఓ వీరుడా!, ఏతే= ఈ, సప్త= ఏడు, గోవృషాః= ఎద్దులు, దుర్దాంతాః= లొంగదీసుకొన శక్యము కానివి, దురవగ్రహాః= వశము లోనికి తెచ్చుట శక్యము కానివి, సుబహవః= చాలమంది, నృప-ఆత్మజాః = రాజకుమారులు, ఏతైః= వీటిచే, భగ్నాః= భంగపాటు కావించబడిరి, భగ్నగాత్రాః= విరుగగొట్టబడిన అవయవములు గలవారు.

ఓ వీరా! ఈ ఏడు ఎద్దులను లొంగదీసి వశములోనికి తెచ్చుట చాల కష్టము. చాలమంది రాజకుమారులు అవయవములను విరుగ-కొట్టుకొని వీటిచే భంగపాటు చెందిరి.

యదీమే నిగృహీతాస్స్యు స్త్వయైవ యదునందన ।
వరో భవానభిమతో దుహితుర్మే శ్రియః పతే ॥ 44

యదునందన= యాదవవంశమునానందింపజేయువాడా! శ్రియః= లక్ష్మీదేవియొక్క, పతే= పతీ!, ఇమే= ఈ ఎద్దులు, త్వయా= నీచే, ఏవ= నిశ్చయముగా, నిగృహీతాః= నిగ్రహించబడినవి, యది స్యుః= అయినచో, మే= నా, దుహితుః= కుమార్తెకు, భవాన్= నీవు, అభిమతః= ప్రియుడవగు, వరః= వరుడవు.

యదువంశమునానందింప జేస్తున్న ఓ లక్ష్మీపతీ! ఈ ఎద్దులను నీవు నిగ్రహించినచో, నీవే నిశ్చయముగా నా కుమార్తెకు ప్రియమగు వరుడవు.

ఏవం సమయమాకర్ణ్య బద్ధ్వా పరికరం ప్రభుః ।
ఆత్మానం సప్తధా కృత్వా న్యగృహ్ణల్లీలయైవ తాన్ ॥ 45

ప్రభుః= శ్రీకృష్ణప్రభుడు, ఏవమ్= ఈ విధముగా, సమయమ్= నియమమును, ఆకర్ణ్య= విని, పరికరమ్= నడుము కట్టును, బద్ధ్వా= బిగించి, ఆత్మానమ్= తనను, సప్తధా= ఏడు ప్రకారములుగా, కృత్వా= చేసి, తాన్= వాటిని, లీలయా ఏవ= సునాయాసముగానే, న్యగృహ్ణాత్= లొంగదీసెను.

ఈ విధమైన నియమమును గురించి విన్న శ్రీకృష్ణప్రభుడు నడుము కట్టును బిగించెను. ఆయన తనను తాను ఏడు రూపములుగా మలుచుకొని, ఆ ఎద్దులను అవలీలగా వశము చేసుకొనెను.

బద్ధ్వా తాన్ దామభి శ్శౌరి ర్భగ్నదర్పాన్ హతౌజసః ।
వ్యకర్ష ల్లీలయా బద్ధాన్ బాలో దారుమయాన్ యథా ॥ 46

శౌరిః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు, భగ్నదర్పాన్= భగ్నము చేయబడిన పొగరు గల, తాన్= వాటిని, దామభిః= త్రాళ్లతో, బద్ధ్వా= కట్టి, బద్ధాన్= కట్టబడినవాటిని, బాలః= పిల్లవాడు, దారుమయాన్ యథా= చెక్కతో చేసినవానిని వలె, లీలయా= అవలీలగా, వ్యకర్షత్= లాగెను.

శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు ఆ ఎద్దుల పొగరునడంచి త్రాళ్లతో కట్టి, పిల్లవాడు చెక్కతో చేసిన బొమ్మలను వలె, సునాయాసముగా లాగెను.

తతః ప్రీతస్సుతాం రాజా దదౌ కృష్ణాయ విస్మితః ।
తాం ప్రత్యగృహ్ణా ద్భగవాన్ విధివత్సదృశీం ప్రభుః ॥ 47

తతః= తరువాత, ప్రీతః= సంతోషించినవాడు, విస్మితః= ఆశ్చర్య-పడినవాడు అగు, రాజా= రాజు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, సుతామ్= కుమార్తెను, దదౌ= ఇచ్చెను, ప్రభుః= సర్వసమర్థుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, సదృశీమ్= తనకు తగియున్న, తామ్= ఆమెను, విధివత్= యథావిధిగా, ప్రత్యగృహ్ణాత్= పాణిగ్రహణము చేసెను.

తరువాత ఆ రాజు ఆనందాశ్చర్యములను పొంది శ్రీకృష్ణునకు కుమార్తెనిచ్చి వివాహము చేసెను. సర్వసమర్థుడగు శ్రీకృష్ణభగవానుడు తనకు తగియున్న ఆమెను యథావిధిగా పాణిగ్రహణము చేసెను.

రాజపత్న్యశ్చ దుహితుః కృష్ణం లబ్ధ్వా ప్రియం పతిమ్ ।
లేభిరే పరమానందం జాతశ్చ పరమోత్సవః ॥ 48

రాజపత్న్యః చ= రాజపత్నులు కూడా, దుహితుః= రాజకుమార్తెకు, కృష్ణమ్= శ్రీకృష్ణుని, ప్రియమ్= ప్రియుడైన, పతిమ్= భర్తనుగా, లబ్ధ్వా= పొంది, పరమ-ఆనందమ్= మహానందమును, లేభిరే= పొందిరి, పరమ-ఉత్సవః చ= గొప్ప ఉత్సవము కూడ, జాతః= జరిగెను.

రాజకుమార్తెకు శ్రీకృష్ణుడు ప్రియుడైన భర్తగా లభించినందులకు రాజపత్నులు కూడ మహానందముతో గొప్ప ఉత్సవమును కూడ చేసిరి.

శంఖభేర్యానకా నేదు ర్గీతవాద్య ద్విజాశిషః ।
నరా నార్యః ప్రముదితాస్సువాసస్స్రగలంకృతాః ॥ 49

శంఖభేరీ-ఆనకాఃశంఖములు భేరీలు తప్పెటలు, గీతవాద్య-ద్విజ-ఆశిషఃపాటలు వాద్యములు వేదవేత్తల ఆశీస్సులు, నేదుఃధ్వనించినవి, సువాసనఃమంచి వస్త్రములు గలవారు, స్రగ్-అలంకృతాఃమాలలచే అలంకరించబడినవారు అగు, నరాఃపురుషులు, నార్యఃస్త్రీలు, ప్రముదితాఃమహానందము గలవారు.

శంఖములు, భేరీలు, తప్పెటలు, వాద్యములతో బాటుగా పాటలు, వేదవేత్తల ఆశీస్సులు మారు మ్రోగినవి. మంచి వస్త్రములను, మాలలను ధరించిన స్త్రీలు, పురుషులు మహానందమును పొందిరి.

దశధేనుసహస్రాణి పారిబర్హ మదాద్విభుః ।
యువతీనాం త్రిసాహస్రం నిష్కగ్రీవసువాససామ్ ॥ 50

విభుఃనగ్నజిన్మహారాజు, దశధేనుసహస్రాణిపదివేల పాడి ఆవులను, నిష్కగ్రీవసువాససామ్హారములు మెడలయందు మంచి వస్త్రములు గల, యువతీనామ్యువతుల, త్రిసాహస్రమ్మూడు వేలను, పారిబర్హమ్పెళ్లికానుకగా, అదాత్ఇచ్చెను.

మహారాజు పదివేల పాడి ఆవులను, మెడలో హారములను మంచి వస్త్రములను దాల్చిన మూడు వేల చెలికత్తెలను కట్నము యిచ్చెను.

నవనాగసహస్రాణి నాగాచ్ఛతగుణాన్ రథాన్ ।
రథాచ్ఛతగుణానశ్వానశ్వాచ్ఛతగుణాన్నరాన్ ॥ 51

నవనాగసహస్రాణి= తొమ్మిది వేల ఏనుగులను, నాగాత్= ఏనుగుకంటె, శతగుణాన్= వంద రెట్లు, రథాన్= రథములను, రథాత్= రథము కంటె, శతగుణాన్= వందరెట్లు, అశ్వాన్= గుర్రములను, అశ్వాత్= గుర్రము కంటె, శతగుణాన్= వంద రెట్లు, నరాన్= సైనికులను (ఇచ్చెను).

ఆ రాజు తొమ్మిది వేల ఏనుగులను వాటికి వంద రెట్లు రథములను, వాటికి వంద రెట్లు గుర్రములను, వాటికి వంద రెట్లు సైనికులను ఇచ్చెను.

దంపతీ రథమారోప్య మహత్యా సేనయా వృతౌ ।
స్నేహప్రక్లిన్నహృదయో యాపయామాస కోసలః ॥ 52

స్నేహప్రక్లిన్నహృదయః= ప్రేమతో అర్ద్రమైన హృదయము గల, కోసలః= కోసలదేశప్రభుడు, మహత్యా= పెద్ద, సేనయా= సేనతో, వృతౌ= కూడియున్న, దంపతీ= దంపతులను, రథమ్= రథమును, ఆరోప్య= ఎక్కించి, యాపయామాస= పంపించెను.

కోసలదేశప్రభుడగు నగ్నజిత్తు ప్రేమతో ఆర్ద్రమైన హృదయము గలవాడై కొత్త దంపతులను రథమెక్కించి పెద్ద సేనతో బాటు పంపించెను.

శ్రుత్వైత ద్రురుధు ర్భూపా నయంతం పథి కన్యకామ్ ।
భగ్నవీర్యా స్సుదుర్మర్షా యదుభి ర్గోవృషైః పురా ॥ 53

పురా= పూర్వము, యదుభిః= యాదవులచే, గోవృషైః= ఎద్దులచే, భగ్నవీర్యాః= భగ్నము చేయబడిన పరాక్రమము గల, భూపాః= రాజులు, ఏతత్= ఈ వార్తను, శ్రుత్వా= విని, సుదుర్మర్షాః= మిక్కిలి అసహనము గలవారై, కన్యకామ్= పెళ్లికూతురును, నయంతమ్= తోడ్కొని చనుచున్న కృష్ణుని, పథి= దారియందు, రురుధుః= అడ్డగించిరి.

పూర్వము యాదవులచే మరియు ఎద్దులచే భగ్నము చేయబడిన పరాక్రమము గల రాజులీ వృత్తాంతమును విని అధికమగు కోపముతో, పెళ్లికూతురును దోడ్కొని వెళ్లుచున్న శ్రీకృష్ణుని దారిలో నిలువరించిరి.

తానస్యత శ్శరవ్రాతాన్ బంధుప్రియకృ దర్జునః ।
గాండీవీ కాలయామాస సింహః క్షుద్రమృగానివ ॥ 54

శరవ్రాతాన్= బాణముల గుంపులను, అస్యతః= ప్రయోగించుచున్న, తాన్= వారిని, బంధుప్రియకృత్= బంధువులకు ప్రీతిని కలిగించే, గాండీవీ= గాండీవధారియగు, అర్జునః= అర్జునుడు, సింహః= సింహము, క్షుద్రమృగాన్ ఇవ= చిన్న జంతువులను వలె, కాలయామాస= పారద్రోలెను.

బాణముల గుంపులను ప్రయోగిస్తున్న ఆ రాజులను గాండీవధారి యగు అర్జునుడు, సింహము అల్పజంతువులను వలె, పారద్రోలి బంధువులకు ప్రీతిని కలిగించెను.

పారిబర్హ ముపాగృహ్య ద్వారకామేత్య సత్యయా ।
రేమే యదూనామృషభో భగవాన్ దేవకీసుతః ॥ 55

యదూనామ్= యదువంశీయులలో, ఋషభః= శ్రేష్ఠుడు, దేవకీసుతః= దేవకీపుత్రుడు అగు, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, పారిబర్హమ్= కట్నమును, ఉపాగృహ్య= తీసుకొని, సత్యయా= సత్యతో, ద్వారకామ్= ద్వారకను గురించి, ఏత్య= వచ్చి, రేమే= రమించెను.

యదువంశశిరోమణి, దేవకీనందనుడు అగు శ్రీకృష్ణభగవానుడు సత్యతో బాటుగా కట్నమును తీసుకొని ద్వారకకు వచ్చి రమించెను.

శ్రుతకీర్తే స్సుతాం భద్రా ముపయేమే పితృష్వసుః ।
కైకేయీం భ్రాతృభి ర్దత్తాం కృష్ణ స్సంతర్దనాదిభిః ॥ 56

కృష్ణః= శ్రీకృష్ణుడు, పితృష్వసుః= తండ్రి సోదరియగు, శ్రుతకీర్తేః= శ్రుతకీర్తియొక్క, సుతామ్= కుమార్తెయైనట్టియు, కైకేయీమ్= కేకయరాజ కుమార్తె యైనట్టియు, సంతర్దన-ఆదిభిః= సంతర్దనుడు మొదలుగా గల, భ్రాతృభిః= సోదరులచే, దత్తామ్= ఈయబడిన, భద్రామ్= భద్రను, ఉపయేమే= వివాహమాడెను.

శ్రీకృష్ణుని తండ్రి సోదరియగు శ్రుతకీర్తి కేకయదేశపు రాణి. ఆమె కుమార్తెయగు భద్రను సోదరులగు సంతర్దనుడు మొదలగువారు సమర్పించగా శ్రీకృష్ణుడు వివాహమాడెను.

సుతాం చ మద్రాధిపతే ర్లక్ష్మణాం లక్షణై ర్యుతామ్ ।
స్వయంవరే జహారైకస్స సుపర్ణ స్సుధామివ ॥ 57

మద్ర-అధిపతేః= మద్రదేశపు రాజుయొక్క, సుతామ్= కుమార్తె యైనట్టియు, లక్షణైః= మంచి లక్షణములతో, యుతామ్= కూడిన, లక్ష్మణామ్= లక్ష్మణను, స్వయంవరే= స్వయంవరమునందు, సః= ఆ శ్రీకృష్ణుడు, ఏకః= ఒక్కడే, సుపర్ణః= గరుడుడు, సుధాం ఇవ= అమృతమును వలె, జహార= ఎత్తుకొని వెళ్లెను.

మద్రదేశపు రాజు బృహత్సేనుడు. ఆయన కుమార్తెయగు లక్ష్మణ మంచి లక్షణములు గలది. ఆ శ్రీకృష్ణుడొక్కడే ఆమెను స్వయంవరములో, గరుడుడు అమృతమును వలె, తీసుకు వెళ్లి వివాహమాడెను.

అన్యా శ్చైవంవిధా భార్యాः కృష్ణస్యాసన్ సహస్రశः ।
భౌమం హత్వా తన్నిరోధాదాహృతాశ్చారదర్శనాः ॥ 58

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే అష్టపంచాశత్తమోఽధ్యాయः

కృష్ణస్య= శ్రీకృష్ణునకు, ఏవంవిధాః= ఇటువంటి, అన్యాః= ఇతరులైన, భార్యాః చ= భార్యలు కూడ, భౌమమ్= భౌమాసురుని, హత్వా= సంహరించి, తత్-నిరోధాత్= వాని అంతఃపురమునుండి, ఆహృతాః= తీసుకురాబడిన, చారుదర్శనాః= సుందరరూపులు, సహస్రశః = వేలాదిగా, ఆసన్= ఉండిరి.

శ్రీకృష్ణుడు భౌమాసురుని సంహరించి వాని అంతఃపురమునుండి సుందరమైన రూపము గల యువతులను వేలాదిమందిని తీసుకువచ్చి వివాహమాడెను. ఆ విధముగా ఆయనకు ఎందరో భార్యలు ఉండిరి.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
శ్రీకృష్ణుడు కాళింది మొదలగువారిని వివాహమాడుటను వర్ణించే
ఏబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (58)

* * *

అథైకోనషష్టితమోఽధ్యాయః

భౌమాసురుని ఉద్ధరించుట

రాజోవాచ ।

యథా హతో భగవతా భౌమో యేన చ తాః స్త్రియః ।
నిరుద్ధా ఏతదాచక్ష్వ విక్రమం శార్ఙ్గధన్వనః ॥ 1

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, భగవతా= శ్రీకృష్ణ భగవానునిచే, భౌమః= భౌమాసురుడు, యథా= ఏ విధముగా, హతః = సంహరించబడినాడో, యేన చ= ఏ భౌమునిచేనైతే, తాః= ఆ, స్త్రియః = యువతులు, నిరుద్ధాః= బంధించబడినారో, ఏతత్= ఈ, శార్ఙ్గధన్వనః = శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీహరియొక్క, ఏతత్= ఈ, విక్రమమ్= చరితమును, ఆచక్ష్వ= వివరించి చెప్పుడు.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...ఆ స్త్రీలను బందీ చేసిన భౌమాసురుని శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీహరి భగవానుడు సంహరించిన విధమెట్టిది? ఆ శ్రీకృష్ణుని ఈ చరితమును వివరించి చెప్పుడు.

శ్రీశుక ఉవాచ ।

ఇంద్రేణ హృతఛత్రేణ హృతకుండలబంధునా ।
హృతామరాద్రిస్థానేన జ్ఞాపితో భౌమచేష్టితమ్ ।
సభార్యో గరుడారూఢః ప్రాగ్జ్యోతిషపురం యయౌ ॥ 2

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, హృతఛత్రేణ= అపహరించబడిన (వరుణుని) ఛత్రము కలిగినట్టియు, హృతకుండల-బంధునా= అపహరించబడిన కుండలముల గల అదితి బంధువు (తల్లి) అయినట్టియు, హృత-అమర-అద్రిస్థానేన= అపహరించ బడిన దేవతల మేరుపర్వతస్థానము గల, ఇంద్రేణ= ఇంద్రునిచే, భౌమచేష్టితమ్=

భౌమాసురుని చేష్టను గురించి, జ్ఞాపితః= విన్నవించబడిన శ్రీహరి, సభార్యః = భార్యతో గూడినవాడై, గరుడ- ఆరూఢః= గరుడుని అధిష్ఠించినవాడై, ప్రాగ్జ్యోతిషపురమ్= ప్రాగ్జ్యోతిష పురమును గురించి, యయౌ= వెళ్లెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...భౌమాసురుడు వరుణుని ఛత్రమును, ఇంద్రుని తల్లియగు అదితి కుండలములను, దేవతల స్థానమగు మణిపర్వతమును అపహరించెను. ఇంద్రుడు శ్రీకృష్ణునకు భౌమాసురుని చేష్టలను విన్నవించెను. ఆయన సత్యభామతో గూడి గరుడుని అధిష్ఠించి ప్రాగ్జ్యోతిషపురమునకు వెళ్లెను.

గిరిదుర్గైశ్శస్త్రదుర్గైర్జలాగ్న్యనిల దుర్గమమ్ ।
మురపాశాయుతై ర్ఘోరై ర్దృఢై స్సర్వత ఆవృతమ్ ॥ 3

గిరిదుర్గైః= నిలువరించే పర్వతములతో, శస్త్రదుర్గైః= ఆటంకములను కలిగించే ఆయుధములతో, జల-అగ్ని- అనిలదుర్గమమ్= నీరు అగ్ని వాయువుల ఆటంకములు కలిగినట్టియు, ఘోరైః= భయంకరము లైనట్టియు, దృఢైః= గట్టి మురపాశ-అయుతైః= మురాసురుని పాశముల పదివేలచే, సర్వతః= అన్ని వైపులనుండియు, ఆవృతమ్= చుట్టువారబడి యున్న (నగరమునకు వెళ్లెను).

ఆ నగరమునకు చుట్టూ దాటి వెళ్లలేని పర్వతములు, ఆయుధముల ఆటంకములు, నీటి అగడ్త, అగ్ని వలయము, వాయువలయము ఉన్న కారణముగా దానిలో ప్రవేశించుట దుర్ఘటము. పైగా, మురాసురుడు దాని చుట్టూ దృఢములై భయమును గొల్పే పదివేల పాశములను అమర్చెను.

గదయా నిర్బిభేదాద్రీన్ శస్త్రదుర్గాణి సాయకైః ।
చక్రేణాగ్నిం జలం వాయుం మురపాశాంస్తథాఽసినా ॥ 4

అద్రీన్= పర్వతములను, గదయా గదతో, శస్త్రదుర్గాణి= దారికి ఆటంకములైన ఆయుధములను, సాయకైః= బాణములతో, చక్రేణ=

చక్రముతో, అగ్నిమ్= అగ్నివలయమును, జలమ్= అగడ్తను, వాయుమ్= వాయువలయమును, తథా= అదేవిధముగా, అసినా= కత్తితో, మురపాశాన్= మురాసురుని త్రాళ్లను, నిర్బిభేద= పగులగొట్టెను.

ఆయన పర్వతములను గదతో పగులగొట్టి, దారికి ఆటంకములైన ఆయుధములను బాణములతో ఛిన్నాభిన్నము చేసెను. చక్రముతో అగ్నివాయువలయములను, నీటి అగడ్తను ఛేదించి, కత్తితో మురాసురుని త్రాళ్లను తెగగొట్టెను.

శంఖనాదేన యంత్రాణి హృదయాని మనస్వినామ్ ।
ప్రాకారం గదయా గుర్వ్యా నిర్బిభేద గదాధరః ॥ 5

గదాధరః= గదాధారియగు శ్రీకృష్ణుడు, శంఖనాదేన= శంఖము యొక్క నాదముతో, యంత్రాణి= యంత్రములను, మనస్వినామ్= అభిమానవంతుల, హృదయాని= హృదయములను, గుర్వ్యా= పెద్దదైన, గదయా= గదతో, ప్రాకారమ్= ప్రాకారమును, నిర్బిభేద= పగులగొట్టెను.

గదాధారియగు శ్రీకృష్ణుడు శంఖముయొక్క నాదముతో వీరులమనే అభిమానము గలవారి హృదయములను, పెద్ద నగరముయొక్క ప్రాకారమును, దాని మీదనుండే యంత్రములను పగులగొట్టెను.

పాంచజన్యధ్వనిం శ్రుత్వా యుగాంతాశని భీషణమ్ ।
మురశ్శయాన ఉత్తస్థౌ దైత్యః పంచశిరా జలాత్ ॥ 6

యుగ-అంత-అశనిభీషణమ్= ప్రళయకాలమునందలి పిడుగువలె భయంకరమైన, పాంచజన్యధ్వనిమ్= పాంచజన్యమనే శంఖముయొక్క ధ్వనిని, శ్రుత్వా= విని, శయానః= పరున్న, పంచశిరాః= ఐదు తలలు గల, మురః= మురుడనే, దైత్యః= రాక్షసుడు జలాత్= నీటినుండి, ఉత్తస్థౌ= లేచి నిలబడెను.

పాంచజన్యమనే శంఖముయొక్క ధ్వని ప్రళయకాలమునందలి పిడుగును పోలియుండెను. దానిని విని (అగడ్తలోని) నీటియందు నిద్రిస్తున్న ఐదు తలల మురాసురుడు లేచి నిలబడెను.

త్రిశూల ముద్యమ్య సుదుర్నిరీక్షణో
యుగాంత సూర్యానలరోచి రుల్బణః ।
గ్రసంస్త్రిలోకీమివ పంచభి ర్ముఖై
రభ్యద్రవ త్తార్క్ష్యసుతం యథోరగః ॥ 7

యుగ-అంతసూర్య-అనలరోచిః= ప్రళయకాలసూర్యునియొక్క అగ్ని యొక్క కాంతివంటి కాంతి గలవాడు, సుదుర్నిరీక్షణః= సుతరాము కన్నెత్తి చూడ శక్యము కానివాడు, ఉల్బణః= భయమును గొల్పువాడు అగు మురుడు, పంచభిః= ఐదు, ముఖైః= నోళ్లతో, త్రిలోకీమ్= ముల్లోకములను, గ్రసన్ ఇవ= మ్రింగుచున్నాడా యన్నట్లు, త్రిశూలమ్= త్రిశూలమును, ఉద్యమ్య= పైకెత్తి, ఉరగః= పాము, తార్క్ష్యసుతం యథా= కశ్యపప్రజాపతి పుత్రుడగు గరుడుని వలె, అభ్యద్రవత్= ఎదురుగా పరుగెత్తెను.

మురుడు ప్రళయకాలమునందలి సూర్యుడు వలె అగ్ని వలె ప్రకాశిస్తూ కన్నెత్తి చూడరాకుండ నుండెను. ఆతడు త్రిశూలము పైకెత్తి భయమును గొల్పుతూ ఐదు నోళ్లతో ముల్లోకములను మ్రింగివేయు-చున్నాడా యన్నట్లు, పాము గరుడుని పైకి వలె, శ్రీకృష్ణుని వైపు పరుగెత్తుకు వచ్చెను.

ఆవిధ్య శూలం తరసా గరుత్మతే
నిరస్య వక్త్రై ర్వ్యనద త్స పంచభిః ।
స రోదసీ సర్వదిశోఽంతరం మహా
నాపూరయ న్నండకటాహ మావృణోత్ ॥ 8

సః= ఆతడు, శూలమ్= శూలమును, తరసా= వేగముగా, ఆవిధ్య= త్రిప్పి, గరుత్మతే= గరుత్మంతుని కొరకు, నిరస్య= వేసి కొట్టి, పంచభిః= ఐదు, వక్త్రైః= నోళ్లతో, వ్యనదత్= నాదము చేసెను, మహాన్= పెద్ద సః= ఆ నాదము, రోదసీ= స్వర్గభూలోకములను, సర్వదిశః= సకలదిక్కులను, అంతరమ్= పాతాళమును, అపూరయన్= నింపుచున్నదై, అండకటాహమ్= గంగాళమువంటి బ్రహ్మాండమును, ఆవృణోత్= ఆవరించెను.

ఆతడు వేగముగా శూలమును త్రిప్పి గరుత్మంతుని కొట్టి ఐదు నోళ్లతో నాదము చేసెను. ఆ పెద్ద నాదము స్వర్గభూపాతాళములను సకలదిక్కులను నింపి గంగాళమువంటి బ్రహ్మాండమునావరించెను.

తదాపతద్వై త్రిశిఖం గరుత్మతే ।
హరి శ్శరాభ్యా మభిన త్త్రిధౌజసా ।
ముఖేషు తం చాపి శరై రతాడయత్
తస్మై గదాం సోఽపి రుషా వ్యముంచత ॥ 9

గరుత్మతే= గరుత్మంతుని కొరకు, ఆపతత్= వచ్చి పడుచున్న, తత్= ఆ, త్రిశిఖమ్= త్రిశూలమును, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, ఓజసా= వేగముగా, శరాభ్యామ్= రెండు బాణములతో, త్రిధా= మూడుగా, అభినత్= విరగకొట్టెను, తం చ అపి= ఆ ముని కూడ, ముఖేషు= ముఖములయందు, శరైః= బాణములతో, అతాడయత్= కొట్టెను, సః అపి= ఆ ముడు కూడ, రుషా= కోపముతో, తస్మై= ఆయన కొరకు, గదామ్= గదను, వ్యముంచత= ప్రయోగించెను.

గరుత్మంతుని మీదకు వచ్చుచున్న ఆ త్రిశూలమును శ్రీకృష్ణ భగవానుడు వేగముగా రెండు బాణములతో కొట్టి మూడు ముక్కలు చేసెను. పైగా, ఆయన ఆ ముని అయిదు ముఖములను బాణములతో కొట్టెను. వాడు కూడ కోపముతో శ్రీకృష్ణునిపై గదను ప్రయోగించెను.

తామాపతంతీం గదయా గదాం మృధే
గదాగ్రజో నిర్బిభిదే సహస్రధా ।
ఉద్యమ్య బాహూ నభిధావతోఽజిత
శ్శిరాంసి చక్రేణ జహార లీలయా ॥ 10

గద-అగ్రజః= గదుని అన్నగారగు శ్రీకృష్ణుడు, మృధే= యుద్ధము నందు, ఆపతంతీమ్= మీదకు వచ్చుచున్న, తామ్= ఆ, గదామ్= గదను, గదయా= గదతో, సహస్రధా= వేయి ముక్కలుగా, నిర్బిభిదే= పగుల గొట్టెను, అజితః= అపరాజితుడగు శ్రీకృష్ణుడు, బాహూన్= చేతులను, ఉద్యమ్య= పైకెత్తి, అభిధావతః= ఎదురుగా పరుగెత్తి వచ్చుచున్న మురుని, శిరాంసి= తలలను, లీలయా= సునాయాసముగా, చక్రేణ= చక్రముతో, జహార= ఊడగొట్టెను.

గదుని అన్నగారగు శ్రీకృష్ణుడు యుద్ధములో పరాజయము నెరుగడు. ఆయన మీదకు వచ్చుచున్న ఆ గదను తన గదతో వేయి ముక్కలుగా పగుల గొట్టెను. చేతులను పైకెత్తి మీదకు పరుగుతో వచ్చుచున్న మురుని తలలను ఆయన చక్రముతో సునాయాసముగా ఊడగొట్టెను.

వ్యసుః పపాతాంభసి కృత్తశీర్ష్ణో
నికృత్త శృంగోఽద్రిరివేంద్రతేజసా ।
తస్యాత్మజా స్సప్త పితు ర్వధాతురాః
ప్రతిక్రియామర్షజుష స్సముద్యతాః ॥ 11

కృత్తశీర్ష్ణః= నరుకబడిన తలలు గల మురుడు, వి-అసుః= పోయిన ప్రాణములు గలవాడై, ఇంద్రతేజసా= ఇంద్రుని వజ్రముచే, నికృత్తశృంగః = తెగగొట్టబడిన శిఖరము గల, అద్రిః ఇవ= పర్వతము వలె, అంభసి= నీటియందు, పపాత= పడెను, పితుః= తండ్రియొక్క, వధ-ఆతురాః= వధచే దుఃఖితులైన, తస్య= ఆ మురుని, సప్త= ఏడ్గురు, ఆత్మజాః=

పుత్రులు, ప్రతిక్రియా-అమర్షజుషః= ప్రతీకారము కొరకై కోపముచే ఆవేశించబడినవారై, సముద్యతాఃఁ= యుద్ధమునకు ఉద్యమించువారు.

తల నరుకబడిన ముఱుడు ప్రాణములను కోల్పోయి, ఇంద్రుని వజ్రముచే తెగగొట్టబడిన శిఖరము గల పర్వతము వలె, నీటియందు పడెను. వాని ఏడ్గురు పుత్రులు తండ్రి వధచే దుఃఖితులై ప్రతీకారము చేయాలనే కోపముతో ఆవేశించబడి యుద్ధమునకు సంసిద్ధులైరి.

తామ్రోఽంతరిక్ష శ్రవణో విభావసుః
వసు ర్నభస్వా వరుణశ్చ సప్తమః ।
పీఠం పురస్కృత్య చమూపతిం మృధే
భౌమప్రయుక్తా నిరగన్ ధృతాయుధాః ॥ 12

తామ్రఃఁ= తామ్రుడు, అంతరిక్షఃఁ= అంతరిక్షుడు, శ్రవణఃఁ= శ్రవణుడు, విభావసుఃఁ= విభావసువు, వసుఃఁ= వసువు, నభస్వాన్= నభస్వంతుడు, సప్తమఃఁ= ఏడవవాడగు, అరుణఃఁ చ= అరుణుడు కూడ, చమూపతిమ్= సేనానాయకుడగు, పీఠమ్= పీఠుని, పురస్కృత్యఁ= ముందిడుకొని, మృధేఁ= యుద్ధమునందు, భౌమప్రయుక్తాఃఁ= భౌమాసురునిచే ఆదేశించబడినవారై, ధృత-ఆయుధాఃఁ= ధరించబడిన ఆయుధములు గలవారై, నిరగన్= బయటకు వచ్చిరి.

తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావసువు, వసువు, నభస్వంతుడు, అరుణుడు అనే ఏడ్గురు ముఱుని పుత్రులను భౌమాసురుడు ఆదేశించెను. వారు ఆయుధములను ధరించి పీఠుడనే సేనాపతిని ముందిడుకొని యుద్ధము కొరకై బయటకు వచ్చిరి.

ప్రాయుంజతాసాద్య శరానసీన్గదా
శక్తృష్టిశూలాన్యజితే రుషోల్బణాః ।
తచ్ఛస్త్రకూటం భగవాన్ స్వమార్గణై
రమోఘవీర్య స్తిలశశ్చకర్త హ ॥ 13

ఉల్బణాఃఁ= భయమును గొల్పే ఆ ఏడ్గురు, ఆసాద్య= దగ్గరకు వచ్చి, రుషా= కోపముతో, అజితే= పరాజితుడు కాని శ్రీకృష్ణునిపై, శరాన్= బాణములను, అసీన్= కత్తులను, గదాఃఁ= గదలను, శక్తి-ఋష్టిశూలాని= చిల్లకోలలను ఈటెలను శూలములను, ప్రాయుంజత= ప్రయోగించిరి, అమోఘవీర్యఃఁ= మొక్కవోని పరాక్రమము గల, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, స్వమార్గణైఃఁ= తన బాణములతో, తత్= ఆ, శస్త్రకూటమ్= ఆయుధముల సమూహమును, తిలశఃఁ= నుగ్గు నుగ్గుగా, చకర్త హ= తెగగొట్టెను.

ఆ ఏడ్గురు కోపముతో అపరాజితుడగు శ్రీకృష్ణభగవానుని సమీపించి ఆయనపై బాణములను, కత్తులను, గదలను, చిల్లకోలలను, ఈటెలను, శూలములను ప్రయోగించిరి. మొక్కవోని పరాక్రమముగల ఆయన తన బాణములతో ఆ ఆయుధసముదాయమును నుగ్గు నుగ్గుగా తెగగొట్టెను.

తాన్ పీఠముఖ్యాననయద్యమక్షయం
నికృత్తశీర్షోరుభుజాంఘ్రివర్మణఃఁ ।

నికృత్తశీర్ష-ఊరుభుజ-అంఘ్రివర్మణఃఁ= తెగగొట్టబడిన తలలు తొడలు చేతులు కాళ్లు కవచములు గల, తాన్= ఆ, పీఠముఖ్యాన్= పీఠుడు మొదలగువారిని, యమక్షయమ్= యమపురిని గురించి, అనయత్= పంపించెను.

శ్రీకృష్ణుడు ఆ పీఠుడు మొదలగువారి తలలను, తొడలను, చేతులను, కాళ్లను, కవచములను తెగగొట్టి యమపురికి పంపించెను.

స్వానీకపా నచ్యుతచక్రసాయకై
స్తథా నిరస్తా స్సురకో ధరాసుతఃఁ ॥ 14

నిరీక్ష్య దుర్మర్షణ ఆస్రవన్మదై
ర్గజైఃఁ పయోధి ప్రభవై ర్నిరాక్రమత్ ।

ధరాసుతః= భూదేవి పుత్రుడగు, నరకః= నరకాసురుడు, అచ్యుతచక్ర సాయకైః= శ్రీకృష్ణ భగవానుని చక్రముచే బాణములచే, తథా= ఆ విధముగా, నిరస్తాన్= సంహరించబడిన, స్వ-అనీకపాన్= తన సేనానాయకులను, నిరీక్ష్య= చూచి, దుర్మర్షణః= సహించనివాడై, ఆప్రవత్-మదైః= అంతటా స్రవించే, మదము= కలిగినట్టియు, పయోధిప్రభవైః= సముద్రతీరమున పుట్టిన, గజైః= ఏనుగులతో, నిరాక్రమత్= బయటకు వచ్చెను.

భూదేవి పుత్రుడగు నరకుడు తన సేనాపతులు ఆ విధముగా శ్రీకృష్ణభగవానుని చక్రముచే మరియు బాణములచే సంహరించబడుటను చూచి సహించలేకపోయెను. ఆతడు సముద్రతీరమున పుట్టి అంతటా మదమును స్రవించుచున్న ఏనుగులతో కూడి బయటకు వచ్చెను.

దృష్ట్వా సభార్యం గరుడోపరి స్థితం
సూర్యోపరిష్టా త్సతడిద్ఘనం యథా ।
కృష్ణం స తస్మై వ్యసృజ చ్ఛతఘ్నీం
యోధాశ్చ సర్వే యుగపత్స్మ వివ్యధుః ॥ 15

సభార్యమ్= భార్యతో కూడినట్టియు, గరుడ-ఉపరి= గరుత్మంతునిపై, సూర్య-ఉపరిష్టాత్= సూర్యుని పైన, సతడిద్-ఘనం యథా= మెరుపుతో కూడిన మేఘము వలె, స్థితమ్= ఉన్న, కృష్ణమ్= శ్రీకృష్ణుని, దృష్ట్వా= చూచి, సః= ఆ నరకుడు, తస్మై= ఆయన కొరకు, శతఘ్నీమ్= ఫిరంగిని, వ్యసృజత్= విడిచిపెట్టెను, సర్వే= అందరు, యోధాః చ= యోధులు కూడ, యుగపత్= ఒక్కసారిగా, వివ్యధుః స్మ= కొట్టిరి.

గరుత్మంతునిపై భార్యయగు సత్యభామతో గూడి కూర్చున్న శ్రీకృష్ణుడు సూర్యునిపై మెరుపుతో కూడిన మేఘమువలె నుండెను. ఆయనను చూచి ఆ నరకుడు ఆయనపై ఫిరంగిని ప్రయోగించెను. ఆతని సైనికులందరు కూడ ఒక్కసారిగా ఆయుధములతో కొట్టిరి.

తద్భౌమసైన్యం భగవాన్ గదాగ్రజో
విచిత్రవాజై ర్నిశితై శ్శిలీముఖైః ।
నికృత్త బాహూరుశిరోధ్రవిగ్రహం
చకార తర్హ్యేవ హతాశ్వకుంజరమ్॥ 16

తర్హి ఏవ= అదే సమయమునందు, గద-అగ్రజః= గదుని అన్నగారైన, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తత్= ఆ, భౌమసైన్యమ్= నరకాసురుని సైన్యమును, విచిత్రవాజైః= రంగు రంగుల రెక్కలు గల, నిశితైః= వాడి, శిలీముఖైః= బాణములతో, నికృత్తబాహు- ఊరుశిరోధ్ర విగ్రహమ్= నరకబడిన చేతులు తొడలు మెడలు దేహములు గలదిగను, హత-అశ్వకుంజరమ్= చంపబడిన గుర్రములు ఏనుగులు కలదిగా, చకార= చేసెను.

అదే సమయములో గదుని అన్నయగు శ్రీకృష్ణభగవానుడు రంగు రంగుల రెక్కలు గల వాడి బాణములతో ఆ నరకాసురుని సైన్యములోని సైనికుల చేతులను, తొడలను, మెడలను, దేహములను నరికి, గుర్రములను, ఏనుగులను సంహరించెను.

యాని యోధైః ప్రయుక్తాని శస్త్రాస్త్రాణి కురూద్వహ ।
హరి స్తాన్యచ్ఛిన త్తీక్ష్ణై శ్శరై రేకైకశస్త్రిభిః ॥ 17

కురు-ఉద్వహ= కురువంశశ్రేష్ఠా!, యోధైః= యోధులచే, యాని= ఏ, శస్త్ర-అస్త్రాణి= ఆయుధములు అస్త్రములు, ప్రయుక్తాని= ప్రయోగించ బడినవో, తాని= వాటిని, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, ఏక-ఏకశః= ఒక్కొక్కటిగా, తీక్ష్ణైః= వాడియైన, త్రిభిః= మూడు, శరైః= బాణములతో, అచ్ఛినత్= ఛేదించెను.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! నరకుని యోధులు ఏ ఆయుధములను, అస్త్రములను ప్రయోగించిరో, వాటిని శ్రీకృష్ణ భగవానుడు ఒక్కొక్కదానిని మూడేసి వాడి బాణములతో ఛేదించెను.

ఉహ్యమాన స్సుపర్ణేన పక్షాభ్యాం నిఘ్నతా గజాన్ ।
గరుత్మతా హన్యమానా స్తుండపక్షనఖై ర్గజాః ॥ 18

పక్షాభ్యామ్= రెక్కలతో, గజాన్= ఏనుగులను, నిఘ్నతా= సంహరించుచున్న, సుపర్ణేన= గరుత్మంతునిచే, ఉహ్యమానః= మోయబడు చున్నవాడు, గరుత్మతా= గరుత్మంతునిచే, తుండపక్షనఖైః= ముక్కు రెక్కలు గోళ్లతో, గజాః= ఏనుగులు, హన్యమానాః= చంపబడుచున్నవి.

శ్రీకృష్ణుని తనపై మోస్తూనే గరుత్మంతుడు రెక్కలతో ఏనుగులను కొట్టెను. ముక్కు, రెక్కలు, గోళ్లతో గరుత్మంతుడు ఏనుగులను చంపెను.

పురమేవావిశన్నార్తా నరకో యుధ్యయుధ్యత ।
దృష్ట్వా విద్రావితం సైన్యం గరుడేనార్దితం స్వకమ్ ॥ 19

ఆర్తాః= పీడితులైన సైనికులు, పురం ఏవ= నగరమునే, ఆవిశన్= ప్రవేశించిరి, యుధి= యుద్ధమునందు, గరుడేన= గరుత్మంతునిచే, అర్దితమ్= పీడించబడినదై, విద్రావితమ్= పారిపోయిన, స్వకమ్= తనదైన, సైన్యమ్= సైన్యమును, దృష్ట్వా= చూచి, నరకః= నరకుడు, అయుధ్యత= యుద్ధము చేసెను.

యుద్ధములో గరుత్మంతునిచే పీడించబడిన నరకుని సైనికులు నగరములోనికే పారిపోయిరి. ఆ దృశ్యమును చూచి నరకుడు యుద్ధమును కొనసాగించెను.

తం భౌమః ప్రాహర చ్ఛక్త్యా వజ్రః ప్రతిహతో యతః ।
నాకంపత తయా విద్ధో మాలాహత ఇవ ద్విపః ॥ 20

భౌమః= నరకుడు, తమ్= ఆ గరుడుని, శక్త్యా= శక్తితో, ప్రాహరత్= కొట్టెను, యతః= దేనిచే, వజ్రః= వజ్రము, ప్రతిహతః= విఫలమైనదో, తయా= దానిచే, విద్ధః= కొట్టబడిన గరుడుడు, మాలాహతః= మాలచే కొట్టబడిన, ద్విపః ఇవ= ఏనుగు వలె, న అకంపత= చలించలేదు.

నరకుడు ఆ గరుడుని శక్తితో కొట్టెను. ఆ శక్తి ఒకప్పుడు వజ్రమును కూడ విఫలము చేసెను. కాని, దానిచే కొట్టబడిన గరుత్మంతుడు, మాలచే కొట్టబడిన ఏనుగు వలె, చలించలేదు.

శూలం భౌమోఽచ్యుతం హంతు మాదదే వితథోద్యమః ।
తద్విసర్గా త్పూర్వమేవ నరకస్య శిరో హరిః ।
అపాహర ద్గజస్థస్య చక్రేణ క్షురనేమినా ॥ 21

వితథ-ఉద్యమః= వ్యర్థమైన ప్రయత్నము గల, భౌమః= నరకుడు, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, హంతుమ్= కొట్టుటకు, శూలమ్= శూలమును, ఆదదే= తీసుకొనెను, తద్-విసర్గాత్= దానిని విడిచి పెట్టుటకు, పూర్వం ఏవ= ముందే, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, గజస్థస్య= ఏనుగుపైనున్న, నరకస్య= నరకుని, శిరః= తలను, క్షురనేమినా= చురకత్తి వలె వాడియైన ధారగల, చక్రేణ= చక్రముతో, అపాహరత్= ఊడగొట్టెను.

గరుత్మంతుని కొట్టాలనే నరకుని ప్రయత్నము వ్యర్థమాయెను. అపుడాతడు శ్రీకృష్ణ భగవానుని కొట్టుటకై శూలమును తీసుకొనెను. ఆతడు దానిని విడుచుటకు ముందే శ్రీకృష్ణ భగవానుడు ఏనుగుపైనున్న వాని తలను చురకత్తివలె వాడియైన ధార గల చక్రముతో ఊడగొట్టెను.

సకుండలం చారుకిరీటభూషణం
బభౌ పృథివ్యాం పతితం సముజ్జ్వలత్ ।
హా హేతి సాధ్వ్యృషయ స్సురేశ్వరా
మాల్యైర్ముకుందం వికిరంత ఈడిరే ॥ 22

సకుండలమ్= కుండలములతో కూడినది, చారుకిరీటభూషణమ్= అందమైన కిరీటము అలంకారములు గలది, సముజ్జ్వలత్= గొప్పగా ప్రకాశించుచున్న తల, పృథివ్యామ్= నేలపై, పతితమ్= పడినదై, బభౌ=

భాసించెను, హా= అయ్యో!, హా= అయ్యో!, ఇతి= అని, ఋషయః= మహర్షులు, సుర–ఈశ్వరాః= దేవనాయకులు, సాధు= బాగు!, ఇతి= అని, ముకుందమ్= మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణుని, మాల్యైః= పుష్పములతో, వికిరంతః= చల్లుచున్నవా రై, ఈడి రే= స్తుతించిరి.

కుండలములు, అందమైన కిరీటము, అలంకారములతో గొప్పగా ప్రకాశించే ఆ తల నేలపై పడి భాసించెను. నరకుని అనుయాయులు అయ్యో! అయ్యో! అని వాపోయిరి. మహర్షులు, దేవనాయకులు బాగు! అంటూ మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణ భగవానునిపై పూలను చల్లుతూ స్తుతించిరి.

తతశ్చ భూః కృష్ణముపేత్య కుండలే
ప్రతప్త జాంబూనద రత్నభాస్వరే ।
సవైజయంత్యా వనమాలయార్పయత్
ప్రాచేతసం ఛత్రమథో మహామణిమ్ ॥ 23

తతః= తరువాత, భూః చ= భూదేవియైతే, కృష్ణమ్= శ్రీకృష్ణుని, ఉపేత్య= దగ్గరకు వచ్చి, ప్రతప్త జాంబూనదరత్నభాస్వరే= పుటము పెట్టిన బంగారమునందు పొదిగిన రత్నములతో ప్రకాశించే, కుండలే= రెండు కుండలములను, ప్రాచేతసమ్= వరుణునకు చెందిన, ఛత్రమ్= గొడుగును, అథో= మరియు, మహామణిమ్= పెద్ద మణిని, సవైజయంత్యా= ఎనిమిది రకముల రత్నముల మాలతో కూడిన, వనమాలయా= అడవి పూల మాలతో, అర్పయత్= సమర్పించెను.

తరువాత భూదేవి శ్రీకృష్ణుని వద్దకు వచ్చి పుటము పెట్టిన బంగారమునందు పొదిగిన రత్నములు గల కుండలముల జత (అదితివి)ను, ఎనిమిది రకముల రత్నముల మాలయగు వైజయంతిని, అడవి పూల మాలను, వరుణుని ఛత్రమును, పెద్ద మణిని సమర్పించెను.

అస్తౌషీదథ విశ్వేశం దేవీ దేవవరార్చితమ్ ।
ప్రాంజలిః ప్రణతా రాజన్ భక్తిప్రవణయా ధియా ॥ 24

రాజన్= ఓ రాజా!, అథ= తరువాత, ప్రాంజలిః= దోసిలి యొగ్గిన, దేవీ= భూదేవి, దేవవర-అర్చితమ్ = దేవనాయకులచే పూజించబడిన, విశ్వఈశమ్= జగన్నాథుడగు శ్రీకృష్ణుని, ప్రణతా= నమస్కరించినదై, భక్తి ప్రవణయా= భక్తితో నిండిన, ధియా= హృదయముతో, అస్తౌషీత్= స్తుతించెను.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత భూదేవి దేవనాయకులచే పూజించబడిన జగన్నాథుడగు శ్రీకృష్ణునకు దోసిలి యొగ్గి నమస్కరించి, భక్తిభావముతో నిండిన హృదయముతో స్తుతించెను.

భూమిరువాచ ।
నమస్తే దేవదేవేశ శంఖచక్రగదాధర ।
భక్తేచ్ఛోపాత్తరూపాయ పరమాత్మన్నమోఽస్తుతే ॥ 25

భూమిః= భూదేవి, ఉవాచ= పలికెను, దేవదేవ-ఈశ= దేవతలకు దేవులగు బ్రహ్మాదులకు కూడ శాసకుడా!, శంఖచక్రగదాధర= శంఖచక్ర గదలను ధరించువాడా!, పరమ-ఆత్మన్= ఓ పరమాత్మా!, భక్త-ఇచ్ఛా-ఉపాత్త రూపాయ= భక్తుల ఇచ్ఛచే స్వీకరించబడిన అవతారములు గల, తే= నీ కొరకు, నమః= నమస్కారము, అస్తు= అగుగాక!

భూదేవి ఇట్లు పలికెను...ఓ పరమాత్మా! దేవతలకు ప్రభువులగు బ్రహ్మాదులకు కూడ నీవు శాసకుడవు. శంఖమును, చక్రమును, గదను ధరించే నీవు భక్తుల ఇచ్ఛచే అవతారములను స్వీకరించెదవు. నీకు నమస్కారమగు గాక!

నమః పంకజనాభాయ నమః పంకజమాలినే ।
నమః పంకజనేత్రాయ నమస్తే పంకజాంఘ్రయే ॥ 26

పంకజనాభాయ= పద్మము నాభియందున్నట్టియు, పంకజమాలినే= పద్మముల మాల కలిగినట్టియు, పంకజనేత్రాయ= పద్మములవంటి కన్నులు కలిగినట్టియు, పంకజ-అంఘ్రయే= పద్మములవంటి పాదములు (పద్మములు పాదములయందు) గల, తే= నీ కొరకు, నమః నమః నమః నమః= అనేక నమస్కారములు.

పద్మముల మాల గల నీయొక్క నాభినుండి పద్మము పుట్టినది. నీ కన్నులు, పాదములు పద్మములను పోలియుండును. నీ పాదములలో పద్మపు గుర్తులు ఉండును. నీకు అనేక నమస్కారములు.

నమో భగవతే తుభ్యం వాసుదేవాయ విష్ణవే ।
పురుషాయాదిబీజాయ పూర్ణబోధాయ తే నమః ॥ 27

భగవతే విష్ణవే= విష్ణుభగవానుడవైనట్టియు, వాసుదేవాయ= వసుదేవపుత్రుడవైన, తుభ్యమ్= నీ కొరకు, నమః= నమస్కారము, పురుషాయ= పూర్ణబ్రహ్మవైనట్టియు, ఆదిబీజాయ= సర్వజగత్కారణమైనట్టియు, పూర్ణబోధాయ= దేశకాలపరిచ్ఛేదములు లేని చైతన్యమైన, తే= నీ కొరకు, నమః= నమస్కారము.

విష్ణుభగవానుడవగు నీవు వసుదేవపుత్రుడవై అవతరించితివి. పూర్ణ బ్రహ్మవైన నీవే జగత్కారణము. దేశకాలపరిచ్ఛేదములు లేని చైతన్యమే నీ స్వరూపము. నీకు అనేక నమస్కారములు.

అజాయ జనయిత్రేఽస్య బ్రహ్మణేఽనంతశక్తయే ।
పరావరాత్మన్ భూతాత్మన్ పరమాత్మన్ నమోఽస్తు తే ॥ 28

పర-అవర-ఆత్మన్= కారణకార్యముల సారమైనవాడా!, భూత-ఆత్మన్= భూతముల రూపముగా ప్రకటమైనవాడా!, పరమ-ఆత్మన్= ఓ పరమాత్మా!, అజాయ= పుట్టుక లేనట్టియు, అస్య= ఈ జగత్తునకు, జనయిత్రీ= సృష్టికర్త యైనట్టియు, బ్రహ్మణే= పరబ్రహ్మ యైనట్టియు,

అనంతశక్తయే= అనంతమగు శక్తి గల, తే= నీ కొరకు, నమః= నమస్కారము, అస్తు= అగుగాక!

ఓ పరమాత్మా! కారణకార్యముల సారము నీవే. పంచభూతముల రూపముగా ప్రకటమైనది నీవే. పుట్టుక లేని నీవీ జగత్తును సృష్టించినావు. అనంతశక్తి గల పరబ్రహ్మవు నీవే. నీకు నమస్కారము.

త్వం వై సిసృక్షూ రజ ఉత్కటం ప్రభో
తమో నిరోధాయ బిభర్ష్యసంవృతః ।
స్థానాయ సత్త్వం జగతో జగత్పతే
కాలః ప్రధానం పురుషో భవాన్ పరః ॥ 29

ప్రభో= ఓ ప్రభూ!, సిసృక్షుః= సృష్టి చేయగోరిన, త్వం వై= నీవైతే, ఉత్కటమ్= కార్యోన్ముఖమైన, రజః = రజోగుణమును, నిరోధాయ= ప్రళయము కొరకు, తమః= తమోగుణమును, జగతః= జగత్తు యొక్క, స్థానాయ= స్థితి కొరకు, సత్త్వమ్= సత్త్వగుణమును, బిభర్షి= స్వీకరించెదవు, జగత్-పతే= ఓ జగన్నాథా!, అసంవృతః= స్వతంత్రుడవు, కాలః= కాలము, ప్రధానమ్= ప్రధానము, పురుషః= జీవుడు, పరః= గుణాతీతుడవగు, భవాన్ - నీవే.

ఓ ప్రభూ! సృష్టి చేయగోరిన నీవు కార్యోన్ముఖమగు రజోగుణమును, ప్రళయమునకై తమోగుణమును, జగత్తు యొక్క స్థితి కొరకు సత్త్వగుణమును ఉపాధిగా స్వీకరించెదవు. కాని, గుణాతీతుడవగు నీవు స్వతంత్రుడవే. ఓ జగన్నాథా! కాలము, ప్రకృతి, జీవుడు నీవే.

అహం పయో జ్యోతి రథానిలో నభో
మాత్రాణి దేవా మన ఇంద్రియాణి ।
కర్తా మహానిత్యఖిలం చరాచరం
త్వయ్యద్వితీయే భగవన్నయం భ్రమః ॥ 30

భగవన్= ఓ భగవానుడా!, అహమ్= నేను (పృథివి), పయః= నీరు, జ్యోతిః= అగ్ని, అథ= మరియు, అనిలః= వాయువు, నభః= ఆకాశము, మాత్రాణి= శబ్దస్పర్శరూపరసగంధములనే సూక్ష్మభూతములు, దేవాః= ఇంద్రియాధిష్ఠాన దేవతలు, మనః= మనస్సు, ఇంద్రియాణి= ఇంద్రియములు, కర్తా= అహంకారము, మహాన్= మహత్తత్త్వము, ఇతి= అని, చర-అచరమ్= కదిలే మరియు కదలని, సర్వమ్= సర్వము, అద్వితీయే= రెండవది లేని, త్వయి= నీయందు, అయమ్= ఈ, భ్రమః= భ్రమయే.

ఓ భగవానుడా! పృథివ్యప్తేజోవాయ్వాకాశములనే పంచభూతములు, శబ్దస్పర్శరూపరసగంధములనే సూక్ష్మభూతములు, సూర్యుడు మొదలైన ఇంద్రియాధిష్ఠానదేవతలు, సమష్టి మనస్సు, అహంకారము, మహత్తత్త్వము అనే ఈ స్థావరజంగమాత్మకమగు జగత్తు సర్వము రెండవది లేని నీయందు వేరుగా యథార్థముగా ఉన్నట్లు ఇది భ్రమ మాత్రమే.

తస్యాత్మజోఽయం తవ పాదపంకజం
భీతః ప్రపన్నార్తిహరోపసాదితః।
తత్పాలయైనం కురు హస్తపంకజం
శిరస్యముష్యాఖిల కల్మషాపహమ్॥ 31

ప్రపన్న-ఆర్తిహర= శరణు జొచ్చినవారి దుఃఖములను బాపువాడా!, అయమ్= ఈతడు, తస్య= ఆ నరకాసురుని, ఆత్మజః= పుత్రుడు, భీతః= భయపడినవాడై, తవ= నీ, పాదపంకజమ్= పద్మమువంటి పాదమును, ఉపసాదితః= పొందించబడినవాడు, తత్= అందువలన, ఏనమ్= వీనిని, పాలయ= కాపాడుము, అముష్య= వీనియొక్క, శిరసి= తలపై, అఖిలకల్మష-అపహమ్= సకలపాపములను పోగొట్టే, హస్త పంకజమ్= పద్మమువంటి చేతిని, కురు= ఉంచుము.

శరణు జొచ్చినవారి దుఃఖములను బాపే ఓ శ్రీకృష్ణా! భయపడిన ఈ పిల్లవాడు ఆ నరకాసురుని కొడుకు. నేను వీనిని పద్మమువంటి నీ పాదముపై పడవేసినాను. కాబట్టి నీవు వీనిని కాపాడుము. సకల పాపములను పోగొట్టే నీ చేతిని వీని తల పైనుంచుము.

శ్రీశుక ఉవాచ ।

ఇతి భూమ్యాఽర్థితో వాగ్భిర్భగవాన్ భక్తినమ్రయా ।
దత్త్వాఽభయం భౌమగృహం ప్రావిశత్సకలర్ద్ధిమత్ ॥ 32

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భక్తినమయా= భక్తిచే వినమ్రురాలైన, భూమ్యా= భూదేవిచే, ఇతి= ఈ విధముగా, వాగ్భిః= వాక్కులతో, అర్థితః= ప్రార్థించబడిన, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, అభయమ్= అభయమును, దత్త్వా= ఇచ్చి, సకల-ఋద్ధిమత్= సకల-సంపదలు గల, భౌమగృహమ్= నరకాసురుని ఇంటిని, ప్రావిశత్= ప్రవేశించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను... భక్తిచే వినమ్రురాలైన భూదేవి ఈ విధముగా వాక్కులతో ప్రార్థించగా, శ్రీకృష్ణ భగవానుడు ఆ పిల్లవానికి అభయమునిచ్చి, సకలసంపదలతో నిండిన నరకుని ఇంటిని ప్రవేశించెను.

తత్ర రాజన్యకన్యానాం షట్సహస్రాధికాయుతమ్ ।
భౌమాహృతాం విక్రమ్య రాజభ్యో దదృశే హరిః ॥ 33

హరిః= శ్రీకృష్ణ భగవానుడు, తత్ర= అచట, విక్రమ్య= పరాక్రమించి, రాజభ్యః= రాజులనుండి, భౌమ-ఆహృతానామ్= నరకాసురునిచే ఎత్తుకు రాబడిన, రాజన్యకన్యానామ్= రాజపుత్రికల యొక్క, షట్-సహస్ర-అధిక-అయుతమ్= ఆరు వేలు అధికముగా గల పది వేలను, దదృశే= చూచెను.

నరకాసురుడు పరాక్రమించి రాజులనుండి ఎత్తుకు వచ్చిన పదహారు వేల రాజపుత్రికలు అచట శ్రీకృష్ణ భగవానునకు కనబడిరి.

తం ప్రవిష్టం స్త్రియో వీక్ష్య నరవీరం విమోహితాః ।
మనసా వవ్రిరేభీష్టం పతిం దైవోపసాదితమ్ ॥ 34

ప్రవిష్టమ్= ప్రవేశించినట్టియు, నరవీరమ్= మానవులలో వీరుడైన, తమ్= ఆ శ్రీకృష్ణుని, వీక్ష్య= చూచి, స్త్రియః= యువతులు, విమోహితాః= మోహమును పొందినవారై, మనసా= మనస్సు చే, దైవ-ఉపసాదితమ్ = దైవముచే పొందించబడిన, అభీష్టమ్= ప్రియతముడైన, పతిమ్= భర్తనుగా, వవ్రిరే= వరించిరి.

రాజప్రాసాదములో ప్రవేశించిన శ్రీకృష్ణుడు మానవులలో వీరుడు. ఆ యువతులు ఆయనను చూచి మోహమును పొందిరి. ఆయనను దైవము సమకూర్చిన ప్రియతముడగు భర్తగా వారు మనస్సులో వరించిరి.

భూయాత్పతి రయం మహ్యం ధాతా తదనుమోదతామ్ ।
ఇతి సర్వాః పృథక్ కృష్ణే భావేన హృదయం దధుః ॥ 35

అయమ్= ఈయన, మహ్యమ్= నా కొరకు, పతిః= భర్త, భూయాత్= అగుగాక!, ధాతా= సృష్టికర్త, తత్= దానిని, అనుమోదతామ్= అనుమోదించుగాక!, ఇతి= అని, సర్వాః= అందరు యువతులు, పృథక్= వేర్వేరుగా, కృష్ణే= శ్రీకృష్ణునియందు, భావేన= ప్రేమతో, హృదయమ్= హృదయమును, దధుః= నిలిపిరి.

ఈయన నాకు భర్త యగుగాక! ఈశ్వరుడు నా అభిలాషను అనుమోదించుగాక! అని ఆ యువతులందరు ఎవరికి వారే శ్రీకృష్ణుని యందు ప్రేమతో హృదయమును నిలిపిరి.

తాః ప్రాహిణో ద్ద్వారవతీం సమృష్టవిరజోఽంబరాః ।
నరయానై ర్మహాకోశాన్ రథాశ్వాన్ ద్రవిణం మహత్ ॥ 36

సుమృష్ట విరజః-అంబరాః= అందమైన స్వచ్ఛమైన వస్త్రములు గల, తాః= ఆ యువతులను, ద్వారవతీమ్= ద్వారకానగరమును గురించి, నరయానైః= మనుష్యులు మోసే పల్లకీలతో, ప్రాహిణోత్= పంపించెను, మహాకోశాన్= గొప్ప ఖజానాలను, రథ-అశ్వాన్= రథములను గుర్రములను, మహత్= గొప్ప, ద్రవిణమ్= ధనమును (పంపెను).

శ్రీకృష్ణుడా యువతులకు అందమైన స్వచ్ఛమైన వస్త్రములనేర్పాటు చేసి పల్లకీలపై ద్వారకకు పంపెను. ఆయన గొప్ప ఖజానాలను, రథములను, గుర్రములను, గొప్ప సంపదను కూడ పంపెను.

ఐరావతకులేభాంశ్చ చతుర్దంతాంస్తరస్వినః ।
పాండురాంశ్చ చతుష్షష్టిం ప్రేషయామాస కేశవః ॥ 37

కేశవః= శ్రీకృష్ణ భగవానుడు, చతుః-దంతాన్= నాలుగు దంతములు కలిగినట్టియు, తరస్వినః= వేగవంతములైనట్టియు, పాండురాన్= తెల్లనైనట్టియు, చతుష్షష్టిమ్= అరవై నాలుగు, ఐరావతకుల-ఇభాన్ చ= ఐరావతముయొక్క కులమునకు చెందిన ఏనుగులను కూడ, ప్రేషయామాస= పంపించెను.

నాలుగు దంతములు కలిగి తెల్లని వేగవంతములైన అరవై నాలుగు ఏనుగులను కూడ ఆ శ్రీకృష్ణభగవానుడు ద్వారకకు పంపెను. ఆ ఏనుగులు, ఐరావతముయొక్క వంశములో పుట్టినవి.

గత్వా సురేంద్రభవనం దత్త్వాఽదిత్యై చ కుండలే ।
పూజిత స్త్రిదశేంద్రేణ సహేంద్రాణ్యా చ సప్రియః ॥ 38

సప్రియః= ప్రియురాలగు సత్యభామతో కూడియున్న శ్రీకృష్ణ భగవానుడు, సుర-ఇంద్రభవనమ్= దేవేంద్రుని భవనమును గురించి,

గత్వా= వెళ్లి, అదిత్యై= అదితి కొరకు, కుండలే= కుండలముల జతను, దత్వా చ= ఇచ్చి, ఇంద్రాణ్యా సహ= శచీదేవితో కూడి, త్రిదశ– ఇంద్రేణ= దేవేంద్రునిచే, పూజితః చ= పూజించబడినవాడు.

ప్రియురాలగు సత్యభామతో గూడి శ్రీకృష్ణ భగవానుడు దేవేంద్రుని భవనమునకు వెళ్లి అదితికి కుండలముల జతను ఇచ్చెను. మహేంద్రుడు శచీదేవితో గూడి ఆయనను పూజించెను.

చోదితో భార్యయోత్పాట్య పారిజాతం గరుత్మతి ।
ఆరోప్య సేంద్రాన్ విబుధా న్నిర్జిత్యోపానయత్పురమ్ ॥ 39

భార్యయా= భార్యయగు సత్యభామచే, చోదితః= ప్రేరేపించబడిన శ్రీకృష్ణుడు, స–ఇంద్రాన్= ఇంద్రునితో కూడిన, విబుధాన్= దేవతలను, నిర్జిత్య= జయించి, పారిజాతమ్= పారిజాతవృక్షమును, ఉత్పాట్య= ఊడబీకి, గరుత్మతి= గరుత్మంతునిపై, ఆరోప్య= ఎక్కించి, పురమ్= ద్వారకానగరమును గురించి, ఉపానయత్= తీసుకువచ్చెను.

సత్యభామ ప్రేరేపించగా శ్రీకృష్ణుడు ఇంద్రునితో సహా దేవతలను జయించి, పారిజాత వృక్షమునూడబెరకి, గరుత్మంతునిపై ఎక్కించి ద్వారకకు కొని తెచ్చెను.

స్థాపిత స్సత్యభామాయా గృహోద్యానోపశోభనః ।
అన్వగుర్భ్రమరాస్స్వర్గా త్తద్గంధాసవలంపటాః ॥ 40

సత్యభామాయాః= సత్యభామయొక్క, గృహ–ఉద్యాన–ఉపశోభనః= ఇంటిని ఆనుకునియున్న ఉద్యానమునకు శోభను కల్గించునదిగా, స్థాపితః= పాతబడినది, స్వర్గాత్= స్వర్గమునుండి, తద్–గంధ– ఆసవలంపటాః= దాని పరిమళభరితమగు తేనెయందు లోభము గల, భ్రమరాః= తుమ్మెదలు, అన్వగుః= వెంట వెళ్లినవి.

ఆ చెట్టు సత్యభామ ఇంటిని ఆనుకొని ఉన్న ఉద్యానమునందు పాతబడి దానికి శోభను తెచ్చినది. దాని పరిమళముతో కూడిన తేనెయందలి లోభము చే స్వర్గమునుండి తుమ్మెదలు వెంట వచ్చినవి.

యయాచ ఆనమ్య కిరీటకోటిభిః
పాదౌ స్పృశ న్నచ్యుత మర్థసాధనమ్ ।
సిద్ధార్థ ఏతేన విగృహ్యతే మహాన్
అహో సురాణాం చ తమో ధిగాద్యతామ్ ॥ 41

ఆనమ్య= తల వంచి, కిరీటకోటిభిః= కిరీటము యొక్క కొనలచే, పాదౌ= రెండు పాదములను, స్పృశన్= స్పృశించువాడై, అర్థసాధనమ్= పనులను సాధించి పెట్టిన, తమ్= ఆ శ్రీకృష్ణుని, యయాచే= కోరెను, మహాన్= గొప్పవాడైన ఇంద్రుడు, సిద్ధ-అర్థః= సిద్ధించిన పనిగలవాడై, ఏతేన= ఈయనతో, విగృహ్యతే= విరోధించును, అహో= ఆహా!, సురాణామ్= దేవతల యొక్క, తమః= అజ్ఞానమును గురించి, ఆద్యతాం చ= ధనికులై యుండుటను గురించి, ధిక్= నింద యగుగాక!

ఇంద్రుడు తలవంచి కిరీటము యొక్క కొనలతో శ్రీకృష్ణుని రెండు పాదములను తాకి నరకుని వధను గురించి ప్రార్థించెను. ఆయన ఆ పనిని చేసి పెట్టెను. ఇంద్రుడు గొప్పవాడే అయినా, తన పని అయిన పిదప ఈ శ్రీకృష్ణునితో (చెట్టు గురించి) విరోధము పెట్టుకొనెను. దేవతల యొక్క ఈ అజ్ఞానము, తాము సంపన్నులమనే గర్వము నిందార్హములు.

అథో ముహూర్త ఏకస్మిన్నానాగారేషు తాః స్త్రియః ।
యథోపయేమే భగవాంస్తావద్రూపధరోఽవ్యయః ॥ 42

అథో= తరువాత, ఏకస్మిన్ - ఒక, ముహూర్తా= ముహూర్తము నందు, అవ్యయః= వినాశము లేనివాడు, తావద్-రూపధరః= అన్ని

రూపములను దాల్చినవాడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తాః= ఆ, స్త్రియః= యువతులను, నానా-ఆగారేషు= వివిధములగు భవనములయందు, యథా= యథావిధిగా, ఉపయేమే= వివాహమాడెను.

తరువాత ఒకానొక ముహూర్తమునందు అవినాశియగు శ్రీకృష్ణభగవానుడు ఆ యువతులను అన్ని రూపములను దాల్చి వివిధ భవనములయందు యథావిధిగా వివాహమాడెను.

గృహేషు తాసా మనపాయ్యతర్కృ
న్నిరస్త సామ్యాతిశయేష్వవస్థితః ।
రేమే రమాభి ర్నిజకామసంప్లుతో
యథేతరో గార్హకమేధికాంశ్చరన్ ॥ 43

తాసామ్= వారియొక్క, నిరస్తసామ్య-అతిశయేషు= నిరాకరించ-బడిన సమత్వము ఆధిక్యము గల, గృహేషు= భవనముల యందు, అవస్థితః= ఉన్నవాడు, అనపాయీ= వియోగము లేనివాడు, అతర్క్యకృత్= ఊహకందని లీలలను చేయువాడు, నిజకామసంప్లుతః= తనవారి ఇచ్ఛచే వశము చేసుకొనబడినవాడు, ఇతరః యథా= ఇతరుడు వలె, గార్హకమేధి-కాన్= గృహస్థధర్మములను, చరన్= ఆచరించువాడు, రమాభిః= లక్ష్మీదేవి అంశలగు ఆ యువతులతో, రేమే= రమించెను.

ఆ యువతుల భవనములతో సమానమైనవి గాని, గొప్పవి గాని భవనములు లేవు. శ్రీకృష్ణుడు ఆ భవనములలో నిరంతరముగా ఉంటూ సామాన్యజనుల వలె గృహస్థధర్మములను పాటిస్తూ ఆ యువతులతో రమించెను. ఊహకు అందని లీలలను చేసే ఆ శ్రీకృష్ణుడు తన భక్తుల ఇచ్ఛకు వశుడై యుండును. ఆ యువతులు లక్ష్మీదేవియొక్క అంశలు.

ఇత్థం రమాపతి మవాప్య పతిం స్త్రియస్తా
బ్రహ్మాదయోఽపి న విదుః పదవీం యదీయామ్ ।
భేజు ర్ముదాఽవిరతమేధితయాఽనురాగ
హాసావలోక నవసంగమజల్పలజ్జాః ॥ 44

ఇత్థమ్= ఈ విధముగా, తాః= ఆ స్త్రీలు, రమాపతిమ్= లక్ష్మీపతి శ్రీకృష్ణుని, పతిమ్= భర్తనుగా, అవాప్య= పొంది, యదీయామ్= ఏ శ్రీకృష్ణునకు చెందిన, పదవీమ్= స్వరూపమును, బ్రహ్మా-ఆదయః అపి= బ్రహ్మదేవుడు మొదలగువారు కూడ, న విదుఃన= తెలియకున్నారో, అవిరతమ్= నిరంతరముగా, ఏధితయా= వర్ధిల్ల జేయబడిన, ముదా, ఆనందముతో, అనురాగహాస-అవలోకనవసంగమజల్పలజ్జఃన= ప్రేమతోడి చిరునవ్వు గల చూపు కొత్త కలయికయందలి ప్రేమ ఊసులలోని సిగ్గు గలవారై, భేజుఃన= సేవించిరి.

శ్రీకృష్ణుని స్వరూపమును బ్రహ్మదేవుడు, ఇంద్రుడు మొదలగువారు కూడ తెలియ లేకున్నారు. కాని, ఈ విధముగా ఆ యువతులు లక్ష్మీపతి యగు ఆ శ్రీకృష్ణుని భర్తగా పొందిరి. వారి ఆనందము నిరంతరముగా వర్ధిల్లుచుండెను. వారు ప్రేమతో కూడిన చిరునవ్వులతో, చూపులతో, కొత్త కలయికయందలి ప్రేమ ఊసుల సిగ్గులతో ఆయనను సేవించిరి.

ప్రత్యుద్గ మాసనవరార్హణ పాదశౌచ
తాంబూల విశ్రమణ వీజనగంధమాల్యైః ।
కేశప్రసార శయన స్నపనోపహార్యైః
దాసీశతా అపి విభో ర్విదధుస్ముదాస్యమ్ ॥ 45

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకోనషష్టితమోఽధ్యాయః

దాసీశతాః అపి= దాసీల వందలు ఉన్నవారే అయిననూ, విభోః= శ్రీకృష్ణ ప్రభునకు, ప్రతి-ఉద్గమ-ఆసనవర-ఆర్హణపాదశౌచతాంబూల విశ్రమణవీజగంధమాల్యైః= ఎదురేగుట, ఆసనమునిచ్చుట, శ్రేష్ఠమగు అర్ఘ్యాదులనిచ్చుట, పాదములను కడుగుట, తాంబూలము, శ్రమను తొలగించుట, వీచుట, గంధమును, పుష్పములను ఇచ్చుటలచే, కేశప్రసార శయన్నస్నపన-ఉపహార్యైః= జుట్టు దువ్వుట, శయ్యను అమర్చుట, స్నానము భోజనములతో, దాస్యమ్= సేవను, విదధుః= చేసిరి.

ఆ శ్రీకృష్ణభార్యల వద్ద వందలాది దాసీలు ఉండిరి. అయినా, ఆ ప్రభునకు ఎదు రేగుట, ఆసనమునిచ్చుట, త్రాగే నీరు మొదలగు శ్రేష్ఠమగు ఉపచారములను చేయుట, కాళ్లను కడుగుట, తాంబూలము నిచ్చుట, కాళ్లను నొక్కి శ్రమను తొలగించుట, వీచుట, గంధమునలదుట, పుష్పములనిచ్చుట, జుట్టు దువ్వుట, ప్రక్కనమర్చుట, స్నానమునకు వ్యవస్థ చేయుట, భోజనమును ఫలహారమును ఇచ్చుట మొదలగు పరిచర్యలతో వారే సేవ చేసిరి.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో,
శ్రీకృష్ణుడు భౌమాసురుని ఉద్ధరించుటను వర్ణించే
ఏబది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (59).

* * *

అథ షష్టితమోఽధ్యాయః

రుక్మిణీ శ్రీకృష్ణ సంవాదము

శ్రీశుక ఉవాచ ।

కర్హిచిత్సుఖమాసీనం స్వతల్పస్థం జగద్గురుమ్ ।
పతిం పర్యచరద్భైష్మీ వ్యజనేన సఖీజనైః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కర్హిచిత్= ఒకనాడు, సుఖమ్= సుఖముగా, ఆసీనమ్= కూర్చు-న్నట్టియు, స్వతల్పస్థమ్= తన శయ్యపైనున్నట్టియు, జగద్- గురుమ్= జగత్తునకు గురువు (తండ్రి) అయినట్టియు, పతిమ్= భర్తయైన శ్రీకృష్ణుని, భైష్మీ= భీష్మకుని పుత్రికయగు రుక్మిణి, సఖీజనైః= చెలికత్తెలతో గూడి, వ్యజనేన= విసిరే కర్రతో, పర్యచరత్= సేవ చేసెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఒకనాడు జగత్తునకు గురువు, తండ్రి అగు శ్రీకృష్ణుడు తన తల్పముపై సుఖముగా కూర్చుని యుండెను. అపుడు భీష్మకుని పుత్రియగు రుక్మిణి చెలికత్తెలతో గూడి ఆయనకు గాలి విసురుతూ సేవచేసెను.

యస్త్వేతల్లీలయా విశ్వం సృజత్యత్త్యవతీశ్వరః ।
స హి జాత స్స్వసేతూనాం గోపీథాయ యదుష్వజః ॥ 2

యః= ఏ, ఈశ్వరః తు= ఈశ్వరుడైతే, ఏతత్= ఈ, విశ్వమ్= జగత్తును, లీలయా= అవలీలగా, సృజతి= సృష్టించునో, అత్తి= ఉపసంహరించునో, అవతి= పాలించునో, అజః= పుట్టుకలేని, సః హి= ఆ ఈశ్వరుడే, స్వసేతూనామ్= తన ధర్మమర్యాదలయొక్క, గోపీథాయ= రక్షణకొరకై, యదుషు= యాదవులయందు, జాతః= అవతరించినవాడు.

పుట్టుకలేని ఏ ఈశ్వరుడీ జగత్తును అవలీలగా సృష్టించి పాలించి ఉపసంహరించునో, ఆయనయే తాను సృష్టించిన ధర్మమర్యాదల రక్షణకై యాదవవంశమునందు అవతరించినాడు.

తస్మిన్నంతర్గృహే భ్రాజన్ము క్తాదామవిలంబినా ।
విరాజితే వితానేనే దీపైర్మణిమయైరపి ॥ 3

భ్రాజత్–ముక్తాదామవిలంబినా= ప్రకాశించే ముత్యాల త్రాళ్ల వ్రేలాడే గుత్తులు గల, వితానేన= మేలుకట్టుతో, మణిమయైః= మణులతో చేసిన, దీపైః అపి= దీపములతో కూడ, విరాజితే= విరాజిల్లే, తస్మిన్= ఆ, అంతః–గృహే= మధ్యగృహమునందు.

రుక్మిణీదేవి అంతఃపురముయొక్క మధ్యగృహము ప్రకాశించే ముత్యాల త్రాళ్ల గుత్తులు గల మేలుకట్టుతో, మణులతో నిండిన దీపములతో విరాజిల్లుచుండెను.

మల్లికాదామభిః పుష్పై ర్ద్విరేఫకుల నాదితైః ।
జాలరంధ్రప్రవిష్టైశ్చ గోభి శ్చంద్రమసోఽమలైః ॥ 4

ద్విరేఫకులనాదితైః= తుమ్మెదల గుంపులచే ధ్వనించే, మల్లికాదా–మభిః= మల్లెల హారములతో, పుష్పైః= పూలతో, జాలరంధ్రప్రవిష్టైః= కిటికీ సందులనుండి ప్రవేశించిన, చంద్రమసః= చంద్రుని, అమలైః= స్వచ్ఛమైన, గోభిః= కిరణములతో.

ఆ మధ్యగృహము తుమ్మెదల గుంపులతో ధ్వనించే (ద్వారములకు కట్టిన) మల్లెల, హారములతో మరియు పూలతో, కిటికీ సందులగుండా ప్రవేశించిన చంద్రుని స్వచ్ఛమైన వెన్నెలలతో విరాజిల్లెను.

పారిజాతవనామోద వాయునోద్యానశాలినా ।
ధూపై రగురుజై రాజన్ జాలరంధ్రవినిర్గతైః ॥ 5

రాజన్= ఓ రాజా!, ఉద్యానశాలినా= ఉద్యానవనమునందు శోభిల్లే, పారిజాతవన-ఆమోదవాయునా= పారిజాతముల గుంపుయొక్క పరిమళము గల గాలిచే, అగురుజైఃఅగురునుండి పుట్టినట్టియు, జాలరంధ్రవినిర్గతైఃకిటికీల చిల్లుల గుండా బయటకు వచ్చుచున్న, ధూపైఃధూపములతో (విరాజిల్లెను)

ఓ పరీక్షిన్మహారాజా! ఉద్యానమునందు శోభిల్లే పారిజాతముల గుంపు (స్వర్గమునుండి తెచ్చినది మాత్రమే గాక ఇతరపారిజాతములు కూడ గలవు) యొక్క పరిమళమును తెచ్చే వాయువు లోపలికి వీచుచుండెను. లోపలికి అగురు ధూపము కిటికీ చిల్లులనుండి బయటకు వచ్చుచుండెను.

పయఃఫేననిభే శుభ్రే పర్యంకే కశిపూత్తమే ।
ఉపతస్థే సుఖాసీనం జగతామీశ్వరం పతిమ్ ॥ 6

పయఃఫేననిభే= పాల నురుగును పోలిన, శుభ్రే= స్వచ్ఛమైన, పర్యంకే= మంచమునందు, కశిపు-ఉత్తమే= శ్రేష్ఠమగు పరుపుపై, సుఖ-ఆసీనమ్= సుఖముగా కూర్చున్నట్టియు, జగతామ్= జగత్తులకు, ఈశ్వరమ్= శాసకుడైన, పతిమ్= భర్తను, ఉపతస్థే= సేవించెను.

పాల నురుగు వంటి స్వచ్ఛమగు మంచముమీద శ్రేష్ఠమగు పరుపుపై సుఖముగా కూర్చున్న జగన్నాథుడగు తన భర్తను రుక్మిణి సేవించెను.

వాలవ్యజనమాదాయ రత్నదండం సఖీకరాత్ ।
తేన వీజయతీ దేవీ ఉపాసాంచక్ర ఈశ్వరమ్ ॥ 7

దేవీ= రుక్మిణీదేవి, రత్నదండమ్= రత్నముల కర్ర గల, వాలవ్య-జనమ్= వింజామరను, సఖీకరాత్= చెలికత్తె చేతినుండి, ఆదాయ= తీసుకొని, తేన= దానితో, వీజయతీ= వీచుచున్నదై, ఈశ్వరమ్= శ్రీకృష్ణభగవానుని, ఉపాసాంచక్రే= సేవించెను.

రుక్మిణీదేవి రత్నములు పొదిగిన కర్ర గల వింజామరను చెలికత్తె చేతినుండి తీసుకొని దానితో వీచుతూ శ్రీకృష్ణభగవానుని సేవించెను.

సోపాచ్యుతం క్వణయతీ మణినూపూరాభ్యాం
రేజేఽంగులీయ వలయ వ్యజనాగ్రహస్తా ।
వస్త్రాంత గూఢ కుచకుంకుమ శోణహార
భాసా నితంబధృతయా చ పరార్ధ్యకాంచ్యా ॥ 8

అంగులీయవలయవ్యజన–అగ్రహస్తా= ఉంగరములు, కంకణములు, వింజామర చేతులయందు గల, సా= ఆ రుక్మిణి, ఉప– అచ్యుతమ్= శ్రీకృష్ణభగవానునకు దగ్గరగా, మణినూపురాభ్యామ్= మణుల కాలియందెలతో, క్వణయతీ= శబ్దము చేయుచున్న దై, వస్త్ర– అంతగూఢ–కుచకుంకుమశోణహారభాసా= కోక కొంగుచే కప్పబడిన వక్షఃస్థలమునందలి కుంకుమచే ఎర్రనైన హారముల కాంతితో, నితంబధృతయా= నడుమునందు దాల్చబడిన, పర–అర్ధ్యకాంచ్యా చ= మిక్కిలి విలువైన మొలనూలుతో కూడ, రేజే= ప్రకాశించెను.

ఆ రుక్మిణి శ్రీకృష్ణ భగవానునకు దగ్గరగా ఉంగరములు, కంకణములు గల చేతితో వింజామర వీస్తూంటే మణులు పొదిగిన కాలియందెలు గలగలలాడుచుండెను. ఆమె కోక కొంగు కప్పిన వక్షఃస్థలమునందలి కుంకుమచే ఎర్రనైన హారములతో, నడుమునందు దాల్చబడిన మిక్కిలి విలువైన మొలనూలుతో ప్రకాశించెను.

తాం రూపిణీం శ్రియమనన్యగతిం నిరీక్ష్య
యా లీలయా ధృతతనోరనురూపరూపా ।
ప్రీతస్స్మయన్నలకకుండలనిష్కకంఠ
వక్త్రోల్లసత్స్మితసుధాం హరిరాబభాషే ॥ 9

రూపిణీమ్= రూపు దాల్చిన, శ్రియమ్= లక్ష్మియైనట్టియు, అనన్య గతిమ్= ఇతరులను ఆశ్రయించనట్టియు, అలకకుండలనిష్కకంఠవక్త ఉల్లసత్-స్మితసుధామ్= ముంగురులు కుండలములు హారముతో కూడిన కంఠము గల ముఖముపై వెలిగే చిరునవ్వు అనే అమృతము గల, తామ్= ఆ రుక్మిణిని, యా= ఏ రుక్మిణియైతే, లీలయా= లీలచే, ధృత తనోః= ధరించబడిన దేహముగల శ్రీహరికి, అనురూపరూపా= తగిన రూపము గలదియో, నిరీక్ష్య= చూచి, ప్రీతః= ఆనందించిన, హరిః= శ్రీకృష్ణుడు, స్మయన్= చిరునవ్వు నవ్వుచున్నవాడై, ఆబభాషే= పలికెను.

శ్రీహరి లీలచే శ్రీకృష్ణుడై అవతరించగా, ఇతరులకు పొంద శక్యము కాని లక్ష్మీదేవియే ఆయనకు తగ్గ రూపముతో రుక్మిణియై అవతరించెను. ముంగురులు, కుండలములు, మెడలో హారములతో వెలిగిపోయే ఆమె ముఖముపై చిరునవ్వు అనే అమృతమును చూచి ప్రీతి జెందిన శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఇట్లు పలికెను.

శ్రీభగవానువాచ ।

రాజపుత్రీప్సితా భూపైర్లోకపాలవిభూతిభిః ।
మహానుభావైశ్శ్రీమద్భిః రూపౌదార్యబలోర్జితైః ॥ 10

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, రాజపుత్రి= ఓ రాజకుమారీ!, లోకపాలవిభూతిభిః= లోకపాలకుల సంపదలు కలిగినట్టియు, మహా-అనుభావైః= గొప్ప ప్రభావము కలిగినట్టియు, శ్రీమద్భిః= శోభతో కూడినట్టియు, రూప-ఔదార్యబల-ఊర్జితైః= అందము పెద్ద మనస్సు బలములచే గొప్పవారైన, భూపైః= రాజులచే, ఈప్సితా= కోరబడినదానవు.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ రాజకుమారీ! లోకపాలకుల సంపదలు, గొప్ప ప్రభావము, శోభ, అందము, పెద్ద మనస్సు, బలము గల గొప్ప రాజులు నిన్ను వివాహమాడవలెనని కోరిరి.

తాన్ ప్రాప్తానర్థినో హిత్వా చైద్యాదీన్ స్మరదుర్మదాన్ ।
దత్తా భ్రాత్రా స్వపిత్రా చ కస్మాన్నో వవృషేఽసమాన్ ॥ 11

ప్రాప్తాన్= వచ్చినట్టియు, అర్థినః= కోరుచున్నట్టియు, స్మరదుర్మ-దాన్= కామనచే మిక్కిలి గర్వించియున్న, తాన్= ఆ, చైద్య-ఆదీన్= చేది రాజగు శిశుపాలుడు మొదలగువారిని, హిత్వా= విడిచి పెట్టి, అసమాన్= అనురూపము కాని, నః= మమ్ములను, కస్మాత్= ఎందు-వలన, వవృషే= వరించితివి?, భ్రాత్రా= సోదరునిచే, స్వపిత్రా చ= నీ తండ్రిచే కూడ, దత్తా= ఈయబడినదానవు.

నీ సోదరుడు, తండ్రి కూడ నిన్ను ఆ చేదిరాజగు శిశుపాలుడు మొదలగువారిలో ఒకరికి ఈయవలెనని సంకల్పించినారు. నీయందలి కామనచే గర్వించిన ఆ రాజులు నిన్ను కోరి వచ్చినారు. నీవు వారితో సరి దూగని మమ్ములను ఏల వరించితివి?

రాజభ్యో బిభ్యత స్సుభ్రూ స్సముద్రం శరణం గతాన్ ।
బలవద్భిః కృతద్వేషాన్ ప్రాయస్త్యక్త నృపాసనాన్ ॥ 12

సుభ్రూః= అందమైన కనుబొమలు గలదానా!, రాజభ్యః= రాజుల వలన, బిభ్యతః= భయపడుచున్నట్టియు, సముద్రమ్= సముద్రమును, శరణమ్= ఆశ్రయమునుగా, గతాన్= పొందినట్టియు, బలవద్భిః= బలవంతులతో, కృతద్వేషాన్= చేయబడిన వైరము కలిగినట్టియు, ప్రాయః= ఇంచుమించుగా, త్యక్తనృప-ఆసనాన్= విడిచి పెట్టబడిన రాజసింహాసనము గల (మమ్ములను ఏల వరించితివి?)

ఓ సుందరీ! రాజులకు భయపడే నేను సముద్రము నాశ్రయించితిని. బలవంతులతో వైరము గల నేను రాజ్యాధికారమును ఇంచుమించుగా విడిచి పెట్టితిని. నన్నేల వరించితివి?

అస్పష్టవర్త్మనాం పుంసా మలోకపథ మీయుషామ్ ।
ఆ స్థితాః పదవీం సుభ్రూః ప్రాయ స్సీదంతి యోషితః ॥ 13

సుభ్రూః= అందమైన కనుబొమలు గలదానా!, అస్పష్టవర్త్మనామ్= తెలియని ఆచారములు కలిగినట్టియు, అలోకపథమ్= లోకాతీతమైన మార్గమును, ఈయుషామ్= పొందిన, పుంసామ్= వ్యక్తులయొక్క, పదవీమ్= మార్గమును, ఆస్థితాః= అనుసరించే, యోషితః= యువతులు, ప్రాయః= తరుచుగా, సీదంతి= క్లేశమును పొందెదరు.

ఓ సుందరీ! లోకమునకు అతీతముగా నేను అనుసరించే మార్గము అందరికీ తెలిసినది కాదు. నావంటి (స్త్రీకి వశవర్తులు కాని) వారిని అనుసరించే యువతులు తరుచుగా ఇడుముల పాల బడెదరు.

నిష్కించనా వయం శశ్వన్నిష్కించనజనప్రియాః ।
తస్మాత్ప్రాయేణ న హ్యాఢ్యా మాం భజంతి సుమధ్యమే ॥ 14

వయమ్= మేము, శశ్వత్= సర్వకాలములయందు, నిష్కించనాః = ఏమీ లేనివారము, నిష్కించనజనప్రియాః= ఏమీ లేని వారియందు ప్రీతి గలవారము (జనులకు ప్రియమైనవారము), సుమధ్యమే= అందమైన నడుము దానా!, తస్మాత్= అందువలన, ఆఢ్యాః= సంపన్నులు, ప్రాయేణ= తరుచుగా, మామ్= నన్ను, న భజంతి= సేవించరు, హి= నిశ్చయము.

ఓ సుందరీ! మేము సర్వకాలములలో ఏమీ లేనివారము. మాకు ఏమీ లేనివారియందు ప్రీతి. ఏమీ లేనివారు కూడ మమ్ములను ప్రేమించెదరు. కాబట్టి, సంపన్నులు తరుచుగా నన్ను అనుసరించరు. ఇది నిశ్చయము.

యయోరాత్మసమం విత్తం జన్మైశ్వర్యాకృతిర్భవః ।
తయోర్వివాహో మైత్రీ చ నోత్తమాధమయోః క్వచిత్ ॥ 15

యయోఃఏ స్త్రీపురుషులిద్దరికి, విత్తమ్= సంపద, జన్మ= పుట్టిన వంశము, ఐశ్వర్య= ఐశ్వర్యము, ఆకృతిః= రూపము, భవః= పుట్టుక (వయస్సు), ఆత్మసమమ్= పరస్పరము తగియున్నదో, తయోఃవారిద్దరికి, వివాహఃపెళ్లి, మైత్రీ చ= మైత్రి కూడ, క్వచిత్= ఏనాడైననూ, ఉత్తమ-అధమయోఃగొప్ప తక్కువ స్త్రీపురుషులిద్దరికి, న= కాదు.

ఏ యువతీయువకులిద్దరికి సంపద, పుట్టిన వంశము, ఐశ్వర్యము, రూపము, వయస్సు పరస్పరము అనురూపముగనుండునో, వారిద్దరికి పెళ్లి, మైత్రి శోభిల్లును. వారిలో ఒకరు గొప్ప, మరియొకరు తక్కువ అయినచో, అవి ఏనాటికీ శోభిల్లవు.

వైదర్భ్యేతదవిజ్ఞాయ త్వయాఽదీర్ఘసమీక్షయా ।
వృతా వయం గుణైర్హీనా భిక్షుభిః శ్లాఘితా ముధా ॥ 16

వైదర్భి= ఓ విదర్భరాజపుత్రీ!, అదీర్ఘసమీక్షయా= దూరదృష్టిలేని, త్వయా= నీచే, ఏతత్= ఈ విషయమును, అవిజ్ఞాయ= తెలియకుండా, గుణైఃగుణములచే, హీనాఃహీనులము, భిక్షుభిఃయాచకులచే, ముధా= వ్యర్థముగా, శ్లాఘితాఃకొనియాడబడినవారము, వయమ్= మేము, వృతాఃవరించబడినవారము.

విదర్భరాజపుత్రివగు ఓ రుక్మిణీ! మాయందు గుణములు లేవు. యాచకులు ధనలోభముచే మమ్ములను వ్యర్థముగా కొనియాడెదరు. దూరదృష్టి లేకుండుటచే నీవీ విషయమును తెలుసుకోకుండా మమ్ములను వరించితివి.

అథాత్మనోఽనురూపం వై భజస్వ క్షత్రియర్షభమ్ ।
యేన త్వమాశిష స్సత్యా ఇహాముత్ర చ లప్స్యసే ॥ 17

అథ= ఇప్పుడైననూ, ఆత్మనఃనీకు, అనురూపమ్= తగిన, క్షత్రియ-ఋషభమ్= శ్రేష్ఠుడగు రాజును, వై= నిశ్చయముగా, భజస్వ=

సేవించుము, యేన= ఎవనిచే, త్వమ్= నీవు, ఇహ= ఈ లోకమునందు, అముత్ర చ= పరలోకమునందు కూడ, ఆశిషః= కామనలను, సత్యాః= యథార్థములుగా, లప్స్యసే= పొందగలవో.

ఇప్పుడైనా నీకు తగిన శ్రేష్ఠుడైన రాజును నిశ్చయముగా సేవించుము. ఆతని ద్వారా ఇహపరలోకములలో నీ కామనలు పూర్ణము కాగలవు.

చైద్య శాల్వ జరాసంధ దంతవక్త్రాదయో నృపాః ।
మమ ద్విషంతి వామోరు రుక్మీ చాపి తవాగ్రజః ॥ 18

వామోరు= ఓ సుందరీ!, వైద్యశాల్వజరాసంధదంతవక్త్ర-ఆదయః = చేదిదేశరాజగు శిశుపాలుడు శాల్వుడు జరాసంధుడు దంతవక్త్రుడు మొదలైన, నృపాః= రాజులు, తవ= నీ, అగ్రజః= అన్నగారగు, రుక్మీ చ అపి= రుక్మీ కూడ, మమ= నన్ను, ద్విషంతి= ద్వేషించుచున్నారు.

ఓ సుందరీ! చేదిదేశరాజగు శిశుపాలుడు, శాల్వుడు, జరాసంధుడు, దంతవక్త్రుడు, పౌండ్రకుడు మొదలగు రాజులు మాత్రమే గాక, నీ అన్నయైన రుక్మి కూడా నన్ను ద్వేషించును.

తేషాం వీర్యమదాంధానాం దృప్తానాం స్మయనుత్తయే ।
ఆనీతాసి మయా భద్రే తేజోఽపహరతాఽసతామ్ ॥ 19

భద్రే= ఓ కల్యాణీ!, వీర్యమద-అంధానామ్= పరాక్రమము వలని గర్వముచే గ్రుడ్డివారైనట్టియు, దృప్తానామ్= పొగరెక్కిన, తేషామ్= వారి యొక్క, స్మయనుత్తయే= గర్వమునడంచుటకై, అసతామ్= దుష్టులయొక్క, తేజః= తేజస్సును, అపహరతా= అపహరించే, మయా= నాచే, ఆనీతా= తీసుకురాబడినదానవు, అసి= అగుచున్నావు.

ఓ కల్యాణీ! తాము పరాక్రమవంతులమనే గర్వముచే అంధులై ఆ శిశుపాలాదులు పొగరెక్కి యుండిరి. దుష్టుల గర్వమునడంచే నేను వారి గర్వమునడంచుటకై నిన్ను తీసుకువచ్చితిని.

ఉదాసీనా వయం నూనం న స్త్రపత్యార్థకామకాః ।
ఆత్మలబ్ధ్యా ఽ ఽస్మహే పూర్ణా గేహయోర్జ్యోతిరక్రియాః ॥ 20

వయమ్= మేము, నూనమ్= నిశ్చయముగా, ఉదాసీనాః= ఆసక్తి లేనివారము, స్త్రీ-అపత్య-అర్థకామకాః= స్త్రీ సంతానము ధనముల యందు కోరిక గలవారము, న= కాము, గేహయోః= ఇంటియందు దేహమునందు, జ్యోతిః-అక్రియాః= దీపము వలె క్రియ లేనివారమై, ఆత్మలబ్ధ్యా= ఆత్మానుభవముచే, పూర్ణాః= పూర్ణులమై, ఆస్మహే= ఉండెదము.

మేము నిశ్చయముగా ఆసక్తి లేనివారము. స్త్రీ, సంతానము, ధనములయందు మాకు కోరిక లేదు. మేము ఇంటియందు, దేహము నందు దీపము వలె కేవలసాక్షియై ఆత్మనిష్ఠతో పూర్ణులమై ఉండెదము.

శ్రీశుక ఉవాచ ।

ఏతావదుక్త్వా భగవానాత్మానం వల్లభామివ ।
మన్యమానామవిశ్లేషాత్తద్దర్పఘ్న ఉపాహరత్ ॥ 21

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అవిశ్లేషాత్= వియోగము లేకుండుట వలన, ఆత్మానం ఇవ= తననే, వల్లభామ్= మిక్కిలి ప్రియురాలినిగా, మన్యమానామ్= తలపోయుచున్న రుక్మిణిని గురించి, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏతావత్= ఇంత మాత్రము, ఉక్త్వా= పలికి, తద్-దర్పఘ్నః= ఆమెయొక్క గర్వమును పోగొట్టువాడై, ఉపాహరత్= విరమించెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణునితో క్షణమైనా ఎడబాటు లేనందువలన తానే ఆయనకు అందరిలో అతిశయించి ప్రియురాలనని రుక్మిణి భావించెను. ఆమె గర్వమును పోగొట్టుటకై శ్రీకృష్ణ భగవానుడు ఇంత మాత్రమే పలికి మిన్నకుండెను.

ఇతి త్రిలోకేశపతేస్తదాఽఽత్మనః ।
ప్రియస్య దేవ్యశ్రుతపూర్వమప్రియమ్ ।
ఆశ్రుత్య భీతా హృది జాతవేపథుః
చింతాం దురంతాం రుదతీ జగామ హ ॥ 22

తదా= అప్పుడు, ఇతి= ఈ విధముగా, త్రిలోక-ఈశపతేః= ముల్లోకములకు ప్రభువులగు ఇంద్రాదులను కూడ శాసించునట్టియు, ఆత్మనః= తనకు, ప్రియస్య= ప్రియుడైన శ్రీకృష్ణుని, అశ్రుతపూర్వమ్= ఇదివరలో వినబడని, అప్రియమ్= భేదమును కలిగించే మాటను, ఆశ్రుత్య= విని, దేవీ= రుక్మిణీదేవి, భీతా= భయపడినదై, హృది= హృదయమునందు, జాతవేపథుః= పుట్టిన వణుకు గలది, రుదతీ= ఏడ్చునది, దురంతామ్= అంతము లేని, చింతామ్= దుఃఖమును, జగామ హ= పొందెను.

శ్రీకృష్ణుడు ముల్లోకములను శాసించే ఇంద్రాదులకు కూడ శాసకుడే అయినా రుక్మిణీదేవికి ప్రియుడే. కాని, ఆయన ఇదివరలో ఎన్నడూ లేని విధముగా అప్పుడు పలికిన పరుషవాక్యములను విని ఆమె హృదయములో భయముతో వణికిపోతూ హద్దులేని దుఃఖముతో విలపించెను.

పదా సుజాతేన నఖారుణశ్రియా
భువం లిఖంత్యశ్రుభిరంజనాసితైః,
ఆసించతీ కుంకుమరూషితౌ స్తనౌ
తస్థావధోముఖ్యతిదుఃఖరుద్ధవాక్ ॥ 23

సుజాతేన= కోమలమైనట్టియు, నఖ-అరుణశ్రియా= గోళ్ల ఎఱ్ఱని శోభగల, పదా= కాలితో, భువమ్= నేలను, లిఖంతీ= వ్రాయుచున్నది, అంజన-అసితైఃr= కాటుకతో నల్లనైన, అశ్రుభిఃr= కన్నీళ్లతో, కుంకుమ-రూషితౌ= కుంకుమ అలదబడిన, స్తనౌ= స్తనములను, ఆసించతీ= తడుపుచున్నది, అధోముఖీ= క్రిందకు దించబడిన ముఖము గలది, అతిదుఃఖరుద్ధవాక్= అధికమగు దుఃఖముచే అడ్డుకొనబడిన మాట గలది, తస్థౌ= నిలబడెను.

రుక్మిణి కోమలమై గోళ్ల కాంతితో శోభిల్లే కాలి బొటనవ్రేలితో నేలపై వ్రాయుచుండెను. కాటుకతో నల్లనైన కన్నీళ్లు కుంకుమ అలదిన ఆమె స్తనములను తడుపుచుండెను. ఆమె తల వంచుకొని అధికమగు దుఃఖముతో నోట మాటరాక నిలబడి యుండెను.

తస్యా స్సుదుఃఖ భయశోక వినష్టబుద్ధేః
హస్తాచ్ఛ్లథ ద్వలయతో వ్యజనం పపాత ।
దేహశ్చ విక్లవధియ స్సహసైవ ముహ్యన్
రంభేవ వాయువిహతా ప్రవికీర్య కేశాన్ ॥ 24

సుదుఃఖభయశోకవినష్టబుద్ధేః= అధికమగు దుఃఖముచే భయముచే తాపముచే నిలకడ తప్పిన బుద్ధి గల, తస్యాఃr= ఆమెయొక్క, శ్లథద్-వలయతఃr= జారిపోవుచున్న కంకణములు గల, హస్తాత్= చేతినుండి, వ్యజనమ్= వింజామర, పపాత= పడెను, విక్లవధియఃr= వ్యాకులమైన బుద్ధిగల ఆమె యొక్క, దేహఃr చ= దేహము కూడ, సహసా ఏవ= వెనువెంటనే, ముహ్యన్= మూర్ఛిల్లునదై, కేశాన్= కేశములను, వికీర్య= విరబోసి, వాయువిహతా= గాలిచే కదిల్చివేయబడిన, రంభా ఇవ= అరటిచెట్టు వలె (పడెను).

అధికమగు దుఃఖము, భయము, తాపములచే ఆమె బుద్ధి విచారశక్తిని కోల్పోయెను. దుఃఖముచే కృశించి పోవుటచే ఆమె చేతినుండి కంకణములు జారిపోయెను. ఆమె చేతిలోని వింజామర క్రిందబడెను. వ్యాకులమైన బుద్ధిగల ఆమె దేహము కూడ వెనువెంటనే మూర్ఛిల్లెను. జుట్టు ముడి విడిపోగా ఆమె, గాలిచే కూల్చబడిన అరటిచెట్టు వలె, పడిపోయెను.

తద్దృష్ట్వా భగవాన్ కృష్ణః ప్రియాయాః ప్రేమబంధనమ్ ।
హాస్యప్రౌఢిమజానంత్యాః కరుణస్సోఽన్వకంపత ॥ 25

హాస్యప్రౌఢిమ్= హాస్యముయొక్క గాంభీర్యమును, అజానంత్యాఃఎరుగని, ప్రియాయాఃప్రియురాలగు రుక్మిణియొక్క, తత్= ఆ, ప్రేమబంధనమ్= ప్రేమపాశమును, దృష్ట్వా= చూచి, కరుణఃదయాళువగు, సఃఆ, కృష్ణఃభగవాన్= శ్రీకృష్ణభగవానుడు, అన్వకంపత= కృపను చేసెను.

రుక్మిణి హాస్యముయొక్క గాంభీర్యమునెరుంగని ప్రియురాలు. ఆమెయొక్క ఆ అవస్థను చూచి దయాళువగు ఆ శ్రీకృష్ణభగవానుడు కృపను చూపెను.

పర్యంకాదవరుహ్యాశు తాముత్థాప్య చతుర్భుజః ।
కేశాన్ సముహ్య తద్వక్త్రం ప్రామృజ త్పద్మపాణినా ॥ 26

చతుర్-భుజఃనాలుగు చేతులతో ప్రకటమైన శ్రీహరి, ఆశువెంటనే, పర్యంకాత్= మంచమునుండి, అవరుహ్య= క్రిందకు దిగి, తామ్= ఆమెను, ఉత్థాప్య= లేవదీసి, కేశాన్= కేశములను, సముహ్యముడివేసి, పద్మపాణినా= పద్మమువంటి చేతితో, తద్-వక్త్రమ్= ఆమె మోమును, ప్రామృజత్= తుడిచెను.

వెంటనే శ్రీహరి నాల్గుచేతులతో ప్రకటమై మంచమునుండి క్రిందకుదిగి ఆమెను లేవదీసి జుట్టు ముడివేసి పద్మమువంటి చేతితో ఆమె ముఖమును తుడిచెను.

ప్రమృజ్యాశ్రుకలే నేత్రే స్తనౌ చోపహతౌ శుచా ।
ఆశ్లేష్య బాహునా రాజన్ననన్యవిషయాం సతీమ్ ॥ 27

రాజన్= ఓ రాజా!, అశ్రుకలే= నీటి బిందువులు గల, నేత్రే= రెండు కళ్లను, శుచా= శోకముచే, ఉపహతౌ= తడిసిన, స్తనౌ= స్తనములను, ప్రమృజ్య= తుడిచి, అనన్యవిషయామ్= ఇతరమగు ఆశ్రయములేని, సతీమ్= పతివ్రతయగు రుక్మిణిని, బాహునా= చేతితో, ఆశ్లిష్య= కౌగిలించి.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీహరి నాల్గుచేతులతో ప్రకటమై రుక్మిణి రెండు కళ్లను ఒత్తి, కన్నీటితో తడిసిన స్తనములను తుడిచి ఆమెను చేతితో కౌగిలించెను. ఆమె మరియొక ఆశ్రయమునెరుగని పతివ్రత.

సాంత్వయామాస సాంత్వజ్ఞః కృపయా కృపణాం ప్రభుః ।
హాస్యప్రౌఢిభ్రమ చ్చిత్తామతదర్హాం సతాం గతిః ॥ 28

సాంత్వజ్ఞః= అనునయించుట తెలిసినవాడు, సతామ్= సజ్జనులకు, గతిః= పాలకుడు అగు, ప్రభుః= శ్రీకృష్ణ ప్రభుడు, కృపణామ్= దీనురాలైనట్టియు, హాస్యప్రౌఢిభ్రమత్-చిత్తామ్= హాస్యముయొక్క గాంభీర్యముచే భ్రమించుచున్న మనస్సు కలిగినట్టియు, అతద్-అర్హామ్= దానికి తగని రుక్మిణిని, కృపయా= దయతో, సాంత్వయామాస= అనునయించెను.

సజ్జనరక్షకుడగు శ్రీకృష్ణప్రభుడు అనునయించుటలో దిట్ట. అట్టి హాస్యమును తట్టుకోలేని రుక్మిణి గంభీరమగు హాస్యముచే చిత్తము భ్రమించి దీనురాలైయుండగా, ఆయన దయతో అనునయించెను.

శ్రీభగవానువాచ ।

మా మా వైదర్భ్యసూయేథా జానే త్వాం మత్పరాయణామ్ ।
త్వద్వచ శ్శ్రోతుకామేన క్ష్వేల్యాఽఽచరితమంగనే ॥ 29

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, వైదర్భి= ఓ విదర్భరాజపుత్రీ!, మా= నన్ను, మా అసూయేథాః= తప్పుపట్టకుము, త్వామ్= నిన్ను, మత్పర-అయణామ్= నేనే సర్వాతిశాయి ఆశ్రయముగా గలదానినిగా, జానే= తెలియుదును, అంగనే= ఓ సుందరీ! త్వద్-వచః= నీ సమాధానమును, శ్రోతుకామేన= వినాలనే కోరికగల నాచే, క్ష్వేల్యా= పరిహాసముచే, ఆచరితమ్= చెప్పబడినది.

ఓ విదర్భరాజపుత్రీ! నన్ను తప్పుగా భావించవద్దు. నీవు సర్వాతిశాయిగా నన్నే ఆశ్రయించెదవని నేనెరుగుదును. ఓ సుందరీ! నీ సమాధానమును వినగోరి నేను పరిహాసముగా పలికితిని.

ముఖం చ ప్రేమసంరంభస్ఫురితాధర మీక్షితుమ్ ।
కటాక్షేపారుణాపాంగం సుందర భ్రుకుటీతటమ్ ॥ 30

ప్రేమసంరంభస్ఫురిత-అధరమ్= ప్రణయకోపముచే వణకిన క్రింది పెదవి కలిగినట్టియు, కట-ఆక్షేప-అరుణ-అపాంగమ్= ప్రక్క చూపులయందలి తిరస్కారముచే ఎర్రనైన కను కొలుకులు కలిగినట్టియు, సుందరభ్రుకుటీతటమ్= అందమైన కనుబొమల ముడివడుట గల ఫాల భాగము గల, ముఖమ్= ముఖమును, ఈక్షితుం చ= చూచుటకు కూడ.

ప్రణయకోపముతో క్రింది పెదవి వణుకుచుండగా, వాలు చూపులయందలి తిరస్కారముచే ఎర్రనైన కనుకొలుకులు గల నీ ముఖము కనుబొమలు ముడివడుటచే అందమైన ఫాలభాగమును కలిగియున్నది. ఇట్టి నీ ముఖమును చూచుటకే నేను హాస్యమాడితిని.

అయం హి పరమో లాభో గృహేషు గృహమేధినామ్ ।
యన్నర్మై ర్నీయతే యామః ప్రియయా భీరు భామిని ॥ 31

భీరు= భయస్వభావము గలదానా!, భామిని= కోపము గలదానా!, గృహమేధినామ్= గృహస్థులకు, గృహేషు= ఇంటియందు, అయం హి= ఇదియే, పరమఃలాభః= గొప్ప, ఫలము, యత్= ఏదనగా, యామః = జాము, ప్రియయా= ప్రియురాలితో, నర్మ్మః= పరిహాసములతో, నీయతే= గడుపబడునో.

ఓ సుందరీ! నీకు భయముతో బాటు కోపము కూడ ఎక్కువే. గృహస్థుడు ఇంటిలో ప్రియురాలితో హాస్యమాడుతూ జాము గడుపవచ్చును. ఇదియే గృహస్థులకు ఇంటిలో లభించే గొప్ప ఫలము.

శ్రీశుక ఉవాచ ।

సైవం భగవతా రాజన్ వైదర్భీ పరిసాంత్వితా ।
జ్ఞాత్వా తత్పరిహాసోక్తిం ప్రియత్యాగభయం జహౌ ॥ 32

శ్రీశుకఃశ్రీశుకమహర్షి ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, ఏవమ్= ఈ విధముగా, భగవతా= శ్రీకృష్ణ భగవానునిచే, పరిసాంత్వితా= అనునయించబడిన, సా= ఆ, వైదర్భీ= విదర్భ రాజపుత్రి, తత్–పరిహాస–ఉక్తిమ్= ఆ శ్రీకృష్ణుని హాస్యవచనమును, జ్ఞాత్వా= తెలిసి, ప్రియత్యాగ–భయమ్= ప్రియుడు విడిచి పెట్టుననే భయమును, జహౌ= విడిచిపెట్టెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ భగవానుడీ విధముగా అనునయించగా, ఆ విదర్భరాజపుత్రి ఆయన పరిహాసము కొరకే మాటలాడినాడని తెలిసి, ప్రియుడు తనను విడిచి పెట్టునేమో అనే భయమును విడనాడెను.

బభాష ఋషభం పుంసాం వీక్షంతీ భగవన్ముఖమ్ ।
సవ్రీడహాసరుచిరస్నిగ్ధాపాంగేన భారత ॥ 33

భారత= భరతవంశీయుడవగు ఓ రాజా!, సవ్రీడహాసరుచిరస్నిగ్ధ–అపాంగేన= సిగ్గుతో కూడిన చిరునవ్వుతో అందమైన ప్రేమ నిండిన

వాలు చూపుతో, భగవత్-ముఖమ్= శ్రీకృష్ణభగవానుని ముఖమును, వీక్షంతీ= చూచుచున్న దై, పుంసాం ఋషభమ్= పురుషోత్తముని ఉద్దేశించి, బభాషే= పలికెను.

భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! ఆమె సిగ్గుతో కూడిన చిరునవ్వుతో, అందమైన ప్రేమ నిండిన వాలు చూపుతో పురుషోత్తముడగు శ్రీకృష్ణభగవానుని చూస్తూ ఇట్లు పలికెను.

రుక్మిణ్యువాచ ।

నన్వేవ మేతదరవిందవిలోచనాహ
యద్వై భవాన్ భగవతోఽసదృశీ విభూమ్నః ।
క్వ స్వే మహిమ్న్యభిరతో భగవాంస్త్రయధీశః
క్వాహం గుణప్రకృతి రజ్జగృహీతపాదా ॥ 34

రుక్మిణిః= రుక్మిణి, ఉవాచ= పలికెను, అరవిందవిలోచన= పద్మములవంటి కన్నులు గలవాడా!, విభూమ్నుః= పరబ్రహ్మస్వరూపుడ-వైనట్టియు, భగవతః= భగవానుడవైన నీకు, అసదృశీ= నేను తగినదానను కానని, భవాన్= నీవు, యత్ వై= ఏ మాటనైతే, ఆహ= పలికితివో, ఏతత్= ఇది, నను= నిశ్చయముగా, ఏవమ్= ఇటులనే, స్వే= తనదైన, మహిమ్ని= ఆనందస్వరూపమునందు, అభిరతః= రమించువాడు, త్రి-అధి-ఈశః= మూడు గుణములను నియంత్రించువాడు అగు, భగవాన్= భగవానుడు, క్వ= ఎక్కడ?, గుణప్రకృతిః= గుణములే స్వరూపముగా కలిగినట్టియు, అజ్ఞగృహీత- పాదా= అజ్ఞానులచే పట్టుకొనబడే పాదములు గల, అహమ్= నేను, క్వ= ఎక్కడ?

రుక్మిణి ఇట్లు పలికెను...పద్మములువంటి కన్నులు గల ఓ శ్రీకృష్ణా! నీవు పరబ్రహ్మవు, భగవానుడవు. నీకు నేను తగినదానను కానని నీవు చెప్పిన మాట యేది గలదో, అది నిశ్చయముగా యథార్థము. నీవు నీ

ఆనందస్వరూపము నందు రమించే భగవానుడవు, సత్త్వరజస్తమో గుణములను నియంత్రించువాడవు. గుణములే స్వరూపముగా గల నా పాదములను అజ్ఞానులు మాత్రమే పట్టుకొనెదరు. నీవెక్కడ? నేనెక్కడ?

సత్యం భయాదివ గుణేభ్య ఉరుక్రమాంతః
శేతే సముద్ర ఉపలంభనమాత్ర ఆత్మా ।
నిత్యం కదింద్రియగణైః కృతవిగ్రహస్త్వం
త్వత్సేవకైర్నృపపదం విధుతం తమోఽంధమ్ ॥ 35

ఉరుక్రమ= పెద్ద అడుగులతో జగత్తును కొలిచినవాడా!, గుణేభ్యః = గుణముల వలన, భయాత్ ఇవ= భయము వలనా యన్నట్లు, అంతః సముద్రే= అంతఃకరణమనే సముద్రమునందు, ఉపలంభనమాత్రః= చైతన్యఘనమగు, ఆత్మా= ఆత్మవై, శేతే= నిలిచియుండెదవు, సత్యమ్= యథార్థము, త్వమ్= నీవు, కదింద్రియగణైః= దుష్టములగు ఇంద్రియముల సమూహములతో, నిత్యమ్= ఎల్లవేళలా, కృతవిగ్రహః= చేయబడిన విరోధము గలవాడవు, త్వత్-సేవకైః= నీ భక్తులచే, అంధమ్= గాఢమైన, తమః= అజ్ఞానమైన, నృపపదమ్= రాజపదవి, విధుతమ్= తిరస్కరించ-బడినది.

మూడడుగులతో జగత్తును కొలిచిన 'ఓ దేవా! నీవు సత్త్వరజస్తమో గుణముల కార్యములగు శబ్దాదులకు భయపడినావా యన్నట్లు అంతఃకరణమనే సముద్రములో చైతన్యఘనమగు ఆత్మవై నిలిచియుందువు (రాజులకు భయపడి సముద్రములో తల దాచుకున్నాను అనే శ్రీకృష్ణుని మాటకు సమాధానము). నీకు దుష్టములగు ఇంద్రియముల గణములతో ఎల్లవేళలా విరోధమే (బలవంతులతో నాకు విరోధము అన్న మాటకు ఉత్తరము). గాఢమగు అజ్ఞానమునకు నిలయమైన రాజపదవిని నీ భక్తులే తిరస్కరించినారు (రాజపదవిని విడిచినవాడననే మాటకు ఉత్తరము).

త్వత్పాదపద్మమకరందజుషాం మునీనాం
వర్త్మాస్ఫుటం నృపశుభిర్నను దుర్విభావ్యమ్ ।
యస్మాదలౌకికమివేహితమీశ్వరస్య
భూమంస్తవేహితమథో అను యే భవంతమ్ ॥ 36

యస్మాత్= ఎందువలనైతే, త్వత్-పాదపద్మమకరందజుషామ్= నీ పద్మమువంటి పాదముల తేనెను సేవించే, మునీనామ్= ధ్యానయోగుల యొక్క, యే= ఎవరైతే, భవంతమ్= నిన్ను, అను= అనుసరించెదరో, వర్త్మ= మార్గము, అస్ఫుటమ్= స్పష్టము కానిది, అలౌకికం ఇవ= లోకాతీతమా అన్నట్లుండే, ఈహితమ్= చేష్ట, నృపశుభిః= పశుసమాను లైన మానవులచే, దుర్విభావ్యమ్= ఊహ చేయ శక్యము కానిది, నను= నిశ్చయము, అథో= అందువలన, భూమన్= ఓ పరబ్రహ్మ!, ఈశ్వరస్య= ఈశ్వరుడవగు, తవ= నీ, ఈహితమ్= చేష్ట.

ఓ పరబ్రహ్మ! నిన్నే అనుసరిస్తూ పద్మమువంటి నీ పాదముల ధ్యానముయొక్క ఆనందముననుభవించే ధ్యానయోగుల మార్గము కూడ అస్పష్టముగనే యుండును. వారి చేష్ట లోకాతీతముగనుండును. వారి మార్గమును, చేష్టను పశువులవంటి మానవులు ఊహకూడ చేయలేరనేది నిశ్చయము. అట్టిచో సర్వేశ్వరుడవగు నీ స్వరూపముగాని, చేష్టగాని ఊహకందనిదని వేరుగా చెప్పవలయునా? (13వ శ్లోకమునకు ఉత్తరము).

నిష్కించనో నను భవాన్న యతోఽస్తి కించిత్
యస్మై బలిం బలిభుజోఽపి హరంత్యజాద్యాః ।
న త్వా విదంత్యసుతృపోఽంతకమాధ్యతాఽంధాః
ప్రేష్ఠో భవాన్ బలిభుజామపి తేఽపి తుభ్యమ్ ॥ 37

భవాన్= నీవు, నను= నిశ్చయముగా, నిష్కించనః= ఏమీ లేనివాడవు, యతః= ఏ నీకంటె, కించిత్= ఏదీ, న అస్తి= లేదో, యస్మై=

ఏ నీ కొరకు, బలిభుజః అపి= పూజలనందుకునే, అజ–ఆద్యాః అపి= బ్రహ్మదేవుడు మొదలైనవారు కూడ, బలిమ్= పూజను, హరంతి= సమర్పించెదరో, అసుతృపః= ఇంద్రియభోగలోలురు, ఆధ్యతా–అంధాః= సంపన్నులమనే అభిమానముతో వివేకమును కోల్పోయినవారు, అంతకమ్= సర్వమును అంతము చేసే, త్వా= కాలరూపుడవగు నిన్ను, న విదంతి= తెలియరు, బలిభుజాం అపి= పూజలనందుకునే బ్రహ్మాదులకు కూడ, భవాన్= నీవు, ప్రేష్ఠః= ప్రియతముడవు, తే అపి= వారు కూడ, తుభ్యమ్= నీ కొరకు.

నీవు నిశ్చయముగా ఏమీ లేనివాడవే. ఎందుకంటే, నీ కంటె భిన్నముగా ఏదీ లేనే లేదు. పూజలనందుకునే స్వయంభువుడగు బ్రహ్మదేవుడు, ఇంద్రుడు మొదలగువారు కూడ నీకు పూజను సమర్పించెదరు. ఇంద్రియభోగలోలురు, సంపన్నులమనే అభిమానము చే వివేకమును కోల్పోయినవారు సర్వసంహారక కాలరూపుడవగు నిన్ను తెలియజాలరు. పూజలనందుకునే బ్రహ్మాదులకు కూడ నీవు ప్రియతముడవు (ఆత్మవు). వారు కూడ నీకు ప్రియతములు. (14 వ శ్లోకమునకు సమాధానము).

త్వం వై సమస్త పురుషార్థమయః ఫలాత్మా
యద్వాంఛయా సుమతయో విసృజంతి కృత్స్నమ్ ।
తేషాం విభో సముచితో భవతస్సమాజః
పుంసః స్త్రియాశ్చ రతయోస్సుఖదుఃఖినోర్నః ॥ 38

త్వమ్= నీవు, వై= నిశ్చయముగా, సమస్తపురుష–అర్థమయః= సకల పురుషార్థరూపుడవు, ఫల–ఆత్మా= ఫలస్వరూపుడవు, యద్–వాంఛయా= ఏ నీయందలి కోరికచే, సుమతయః= విచారశీలురు, కృత్స్నమ్= సర్వమును, విసృజంతి= త్యజించెదరో, విభో= ఓ ప్రభూ!, తేషామ్= వారికి, భవతః= నీ, సమాజః= సంబంధము, సముచితః=

బాగా తగియున్నది, రతయోఃన పరస్పరము ఆసక్తి కలిగినట్టియు, సుఖదుఃఖినోఃన సుఖదుఃఖములు గల, స్త్రీయాఃన పుంసఃన చన స్త్రీపురుషులకు, నన కాదు.

ధర్మార్థకామమోక్షములనే పురుషార్థరూపములో ఉన్నది నిశ్చయముగా నీవే. వాటి ఫలము కూడ నీవే. నిన్ను కోరి వివేకవంతులు సర్వమును త్యజించెదరు. ఓ ప్రభూ! అట్టి వివేకులకు నీతోడి (స్వస్వామి) సంబంధమే తగియున్నది. పరస్పరాసక్తితో సుఖదుఃఖములననుభవిస్తూ ఉండే స్త్రీపురుషులతోడి సంగము వారికి సముచితము కాదు. (15కి ఉత్తరము).

త్వం న్యస్తదండమునిభి ర్గదితానుభావ
ఆత్మాఽఽత్మదశ్చ జగతామితి మే వృతోఽసి ।
హిత్వా భవద్భ్రువ ఉదీరితకాలవేగ
ధ్వస్తాశిషోఽబ్జభవనాకపతీన్ కుతోఽన్యే ॥ 39

న్యస్తదండమునిభిఃన విడువబడిన ప్రాణిహింస గల మునులచే, గదిత-అనుభావఃన కొనియాడబడిన మహిమగల, త్వమ్న నీవు, జగతామ్న ప్రాణులకు, ఆత్మాన ఆత్మవు, ఆత్మదఃన చన నిన్ను నీవు ఇచ్చువాడవు కూడ, ఇతిన అనే కారణముగా, మేన నాచే, భవద్-భ్రువఃన నీ కనుబొమనుండి, ఉదీరితకాలవేగధ్వస్త-ఆశిషఃన ప్రేరితమైన కాలము యొక్క వేగముచే నశింపజేయబడిన భోగములు గల, అబ్జభవనాకపతీన్న పద్మసంభవుడగు బ్రహ్మదేవుని లోకపాలకులను, హిత్వాన విడిచిపెట్టి, వృతఃన వరించబడినవాడవు, అసిన అగుచున్నావు, అన్యేన ఇతరులు, కుతఃన ఎక్కడివారు?

ప్రాణిహింసను విడిచిపెట్టిన మహర్షులు నీ మహిమను కొనియాడు చుందురు. నీవు ప్రాణులకు ఆత్మవు. నీవు నీ భక్తులకు నిన్నే సమర్పించు-

కొనెదవు. ఈ సంగతి తెలిసియే నేను నిన్ను వరించినాను. నీ కనుబొమల సైగచే ప్రవర్తిల్లే కాలము మహావేగముతో బ్రహ్మదేవుని మరియు లోకపాలకుల భోగములను ఖండించును. నేను వారిని కూడ విడిచిపెట్టి నిన్ను వరించగా, శిశుపాలాదుల గురించి చెప్పేదేమున్నది? (16,17 శ్లోకములకు ఉత్తరము).

జాడ్యం వచస్తవ గదాగ్రజ యస్తు భూపాన్
విద్రావ్య శార్ఙ్గనినదేన జహర్థ మాం త్వమ్ ।
సింహో యథా స్వబలిమీశ పశూన్ స్వభాగం
తేభ్యో భయాద్యదుదధిం శరణం ప్రపన్నః ॥ 40

గద–అగ్రజ= గదుని అన్నయగు ఓ శ్రీకృష్ణా!, ఈశ= ఓ ఈశ్వరా!, యః= ఏ, త్వం తు= నీవైతే, సింహః= సింహము, పశూన్= పశువులను, విద్రావ్య= తరిమి, స్వబలిం యథా= తన భాగమును వలె, శార్ఙ్గనినదేన = శార్ఙ్గమనే ధనుస్సుయొక్క ధ్వనిచే, భూపాన్= రాజులను, విద్రావ్య= తరిమి, మామ్= నన్ను, జహర్థ= తీసుకువెళ్లితివో, తేభ్యః= వారి వలన, భయాత్= భయము వలన, ఉదధిమ్= సముద్రమును, శరణమ్= ఆశ్రయమునుగా, ప్రపన్నః= పొందినవాడవు అనే, యత్= ఏ, తవ= నీ, వచః= మాట గలదో అది, జాడ్యమ్= యుక్తియుక్తము కాదు.

గదుని అన్నయగు ఓ శ్రీకృష్ణా! ఈశ్వరుడవగు నీవు, సింహము పశువులను తరిమి తన భాగమును తీసుకున్నట్లుగా, శిశుపాలాదులను శాస్త్రమనే ధనుస్సుయొక్క ధ్వనిచేతనే తరిమికొట్టి నన్ను తీసుకువచ్చితివి. నీవా రాజులకు భయపడి సముద్రమును శరణు జొచ్చితివని నీవు చెప్పిన మాట యుక్తియుక్తముగా లేదు.

యద్వాంఛయా నృపశిఖామణయోఽంగవైన్య
జాయంతనాహుషగయాదయ ఐకపత్యమ్ ।
రాజ్యం విసృజ్య వివిశుర్వనమంబుజాక్ష
సీదంతి తేఽనుపదవీం త ఇహాస్థితాః కిమ్ ॥ 41

అంబుజ-అక్ష= పద్మములవంటి కన్నులు గలవాడా!, యద్-వాంఛయా= ఎవనియందలి ఇచ్ఛచే, అంగవైన్యజాయంతనాహుషగయ-ఆదయః= అంగుడు వేనుని పుత్రుడగు పృథువు జయంతుని పుత్రుడగు భరతుడు నహుషుని పుత్రుడగు యయాతి గయుడు మొదలగు, నృప-శిఖామణయః= శ్రేష్ఠులగు రాజులు, ఐకపత్యమ్= ఏకచ్ఛత్రాధిపత్యము గల, రాజ్యమ్= రాజ్యమును, విసృజ్య= విడిచిపెట్టి, వనమ్= అడవిని, వివిశుః= ప్రవేశించిరో, తే= నీ, పదవీమ్= మార్గమును, అను= అనుసరించి, ఆస్థితాః= ఆశ్రయించిరో, తే= వారు, ఇహ= ఈ సంసారమునందు, సీదంతి కిమ్= క్లేశపడుచున్నారా యేమి?

పద్మములవంటి కన్నులు గల ఓ శ్రీకృష్ణా! అంగుడు (వేనుని తండ్రి), వేనుని పుత్రుడగు పృథువు, జయంతుని పుత్రుడగు భరతుడు, నహుషుని పుత్రుడగు యయాతి, గయుడు, సగరుడు మొదలైన గొప్ప రాజులు నిన్ను పొందగోరి ఏకచ్ఛత్రాధిపత్యమగు సామ్రాజ్యమును విడిచిపెట్టి అడవికి వెళ్లి నీ మార్గమునే అనుసరించిరి. వారీ సంసారములో ఇడుముల పాలైనారా యేమి? (లేదు).

కాఽన్యం శ్రయేత తవ పాదసరోజగంధం
ఆఘ్రాయ సన్ముఖరితం జనతాఽపవర్గమ్ ।
లక్ష్మ్యాలయం త్వవిగణయ్య గుణాలయస్య
మర్త్యాసదోరుభయమర్థ వివిక్తదృష్టిః ॥ 42

సత్-ముఖరితమ్= మహాత్ములచే కీర్తించబడునట్టియు, జనతా-అపవర్గమ్= జనసముదాయమునకు మోక్షరూపమైనట్టియు, లక్ష్మీ-

ఆలయమ్= లక్ష్మీదేవికి కూడ ఆశ్రయమైన, గుణ–ఆలయస్య= గుణనిధాన మగు, తవ= నీ, పాదసరః–జ గంధమ్= పద్మములవంటి పాదముల పరిమళమును, ఆఘ్రాయ= ఆఘ్రాణించి, అర్థవివిక్తదృష్టిః= తత్త్వము నందు వివేకముతో కూడిన బుద్ధిగల, కా తు= ఏ స్త్రీయైతే, అవిగణయ్య= లెక్క చేయకుండా, మర్త్య–ఆ–సదా–ఉరుభయమ్= మరణించునట్టియు ఎల్లవేళలా అధికమగు భయముగల, అన్యమ్= మరియొకనిని, శ్రయేత= ఆశ్రయించును?

కల్యాణగుణనిధానమగు నీ పద్మములవంటి పాదముల పరిమళము (పాదముల మహిమ)ను మహాత్ములు కీర్తించుచుందురు. మానవులకు మోక్షమునిచ్చే నీ పాదపద్మములు లక్ష్మీదేవికి కూడ నివాసస్థానము. వాటి మహిమ తెలిసి కూడా వాటిని కాదని, తత్త్వవివేచనము చేయగల బుద్ధిగల ఏ స్త్రీ ఇతర వ్యక్తిని ఆశ్రయించును? (ఎవరైననూ ఆశ్రయించరు). ఇతరమానవులు మరణించే స్వభావము గలవారై, ఎల్లవేళలా అధికమగు భయమును కలిగియుందురు గదా! (17వ శ్లోకమునకు ఉత్తరము).

తం త్వాఽనురూపమభజం జగతామధీశం
ఆత్మానమత్ర చ పరత్ర చ కామపూరమ్ ।
స్యాన్మే తవాంఘ్రిరరణం సృతిభిర్భ్రమంత్యా
యో వై భజంతముపయాత్యనృతాపవర్గః ॥ 43

జగతామ్= జగత్తులకు, అధి–ఈశమ్= ఈశ్వరుడవైనట్టియు, ఆత్మానమ్= ఆత్మస్వరూపుడవైనట్టియు, అత్ర చ= ఈ లోకమునందు, పరత్ర చ= పరలోకమునందు కూడ, కామపూరమ్= కామనలను పూర్ణము చేసే, తమ్= అట్టి, త్వా= నిన్ను, అనురూపమ్= తగిన భర్తనుగా, అభజమ్= సేవించితిని, అనృత–అపవర్గః= మిథ్యాసంసారమునుండి మోక్షమును కలుగజేసే, యః వై= ఏ నీవైతే, భజంతమ్= సేవించువానిని,

ఉపయాతి= ఆత్మస్వరూపమునిచ్చెదవో, తవ= అట్టి నీ, అంఘ్రిః= పాదము, సృతిభిః= జన్మలతో, భ్రమంత్యాః= పరిభ్రమిస్తున్న, మే= నాకు, అరణమ్= శరణము, స్యాత్= అగుగాక!

నీవు జగత్తులకు అధీశ్వరుడవే గాక, ఆత్మస్వరూపుడవు కూడా. ఇహపరలోకములలో కామనలను పూర్ణము చేసే నిన్ను నేను వరునిగా సేవించి మంచి పనే చేసితిని. నీవు నిన్ను సేవించువారలకు నీ స్వరూపమునే యిచ్చి మిథ్యాసంసారమునుండి మోక్షమును కలిగించెదవు. అట్టి నీ పాదము జననమరణప్రవాహములో పరిభ్రమిస్తున్న నాకు శరణము అగు గాక!

తస్యాస్యురచ్యుత నృపా భవతోపదిష్టాః
స్త్రీణాం గృహేషు ఖరగోశ్వబిడాలభృత్యాః ।
యత్కర్ణమూలమరికర్షణ నోపయాయాద్
యుష్మత్కథా మృడవిరించసభాసు గీతా ॥ 44

అచ్యుత= ఓ అచ్యుతా!, అరికర్శన= శత్రువులను కృశింపజేయువాడా!, భవతా= నీచే, ఉపదిష్టాః= స్తుతించబడిన, నృపాః= రాజులు, స్త్రీణామ్= స్త్రీలయొక్క, గృహేషు= ఇంటియందు, ఖరగోశ్వబిడాల భృత్యాః = గాడిదలు ఎద్దులు కుక్కలు పిల్లులు సేవకులు, తస్యాః= ఆమెకు, స్యుః= అగుదురు గాక!, యత్-కర్ణమూలమ్= ఎవతెయొక్క చెవుల మార్గమును, మృడవిరించసభాసు= శివుని బ్రహ్మదేవుని సభలయందు, గీతా= గానము చేయబడే, యుష్మత్-కథా= నీ గాథ, న ఉపయాయాద్= ప్రవేశించలేదో.

ఓ అచ్యుతా! నీవు శత్రువులను కృశింపజేసెదవు. నీవు గొప్పవారని పొగిడిన శిశుపాలాదులు స్త్రీల ముంగిట, తిరస్కరించినా వెనుకపడే గాడిదలను, బరువులను మోసే ఎద్దులను, కాపలా కుక్కలను, ఉచ్ఛిష్టమును

తినే పిల్లులను పోలెదరు. నీ గాథను శంకరబ్రహ్మదేవుల సభలలో గానము చేసెదరు. అట్టి నీ గాథ ఏ స్త్రీయొక్క చెవుల మార్గమును ప్రవేశించలేదో, అట్టి స్త్రీకి ఆ రాజులు భర్తలు అగుదురు గాక!

త్వక్శ్మశ్రురోమనఖకేశపినద్ధ మంతఃమాంసాస్థి రక్తకృమివిట్కఫపిత్తవాతమ్ ।
జీవచ్ఛవం భజతి కాంతమతిర్విమూఢాయా తే పదాబ్జమకరందమజిఘ్రతీ స్త్రీ ॥ 45

త్వక్–శ్మశ్రురోమనఖకేశపినద్ధమ్= చర్మము మీసములు గెడ్డము రోమములు గోళ్లు జుట్టులచే కప్పబడినట్టియు, అంతఃమ= లోపల, మాంస–అస్థిరక్తకృమివిట్–కపిత్తవాతమ్= మాంసము ఎముకలు రక్తము క్రిములు మాలిన్యములు కఫము పిత్తము వాతములు కలిగిన, జీవత్–శవమ్= జీవిస్తున్న శవమును, కాంతమతిః= ప్రియుడనే బుద్ధిగలదై, భజతి= సేవించును, విమూఢా= పరమమూర్ఖురాలగు, యా= ఏ, స్త్రీ= స్త్రీ, తే= నీ, పద–అబ్జమకరందమ్= పాదములనే పద్మముల తేనెను, అజిఘ్రతీ= ఆఘ్రాణించుట లేదో.

నీ పాదపద్మముల తేనెను ఆఘ్రాణించని (నీ పాదముల మహిమను వినని) స్త్రీ పరమమూర్ఖురాలు. అట్టి స్త్రీ చర్మము, మీసములు, గెడ్డము, రోమములు, గోళ్లు, జుట్టులచే కప్పబడి, మాంసము, ఎముకలు, రక్తము, క్రిములు, మాలిన్యములు, కఫము, పిత్తము, వాతములను కలిగి జీవిస్తున్న శవమును ప్రియుడనే భావనతో సేవించును. (నేనైతే విమూఢను కాను).

అస్త్వంబుజాక్ష మమ తే చరణానురాగఆత్మన్ రతస్య మయి చానతిరిక్తదృష్టిః ।
యర్హ్యస్య వృద్ధయ ఉపాత్తరజోతిమాత్రోమామీక్షసే తదు హ నః పరమానుకంపా ॥ 46

అంబుజ-అక్ష= పద్మములవంటి కన్నులు గలవాడా!, మయి చ= నా యందు కూడ, అనతిరిక్తదృష్టేః= అతిశయించిన దృష్టి లేనట్టియు, ఆత్మన్= తన స్వరూపమునందు, రతస్య= రమించే, తే= నీ, చరణ-అనురాగః= పాదములయందు ప్రేమ, మమ= నాకు, అస్తు= కలుగు గాక!, యర్హి= ఏ కాలమునందైతే, అస్య= ఈ జగత్తుయొక్క, వృద్ధయే= అభివృద్ధి కొరకు, ఉపాత్తరజః-అతిమాత్రః= స్వీకరించబడిన రజోగుణము యొక్క ఉద్రేకము గలవాడవై, మామ్= నన్ను, ఈక్షసే= చూచెదవో, తత్ ఉహ= అదియే, నః= మాకు, పరమ-అనుకంపా= గొప్ప కృప.

పద్మములవంటి కన్నులు గల ఓ శ్రీకృష్ణా! నీవు ఆత్మారాముడవు గనుక నాయందు నీకు అతిశయమగు దృష్టి ఉండదు. కాని, నాకు మాత్రము నీ పాదములయందు ప్రేమ కలుగుగాక! సృష్టికాలమునందు ఈ జగత్తుయొక్క అభివృద్ధికొరకై నీవు ఉత్కటమగు రజోగుణమును స్వీకరించి నా (ప్రకృతి) వైపు చూచెదవు. అదియే మాకు గొప్ప అనుగ్రహము. (20వ శ్లోకమునకు ఉత్తరము).

నైవాలీకమహం మన్యే వచస్తే మధుసూదన ।
అంబాయా ఇవ హి ప్రాయః కన్యాయాస్స్యాద్రతిః క్వచిత్ ॥47

మధుసూదన= మధువును సంహరించినవాడా!, అహమ్= నేను, తే= నీ, వచః= మాటను, అలీకమ్= అసత్యమునుగా, న ఏవ మన్యే= తలచుటనే లేదు, హి= ఏలయన, ప్రాయః= తరుచుగా, కన్యాయాః= కన్యకు, అంబాయాః ఇవ= అంబకు వలె, క్వచిత్= ఏదో ఒక పురుషుని యందు, రతిః= ప్రేమ, స్యాత్= కలుగును.

మధువు అనే రాక్షసుని సంహరించిన ఓ శ్రీకృష్ణా! నీ మాట - అసత్యమని నేను సుతరాము తలచుట లేదు. ఎందుకంటే, కాశిరాజ పుత్రికయగు అంబను తీసుకువెళ్లినది భీష్ముడే అయినా, ఆమె మనస్సు

శాల్వునిపై నుండెను. కన్యకు తరుచుగా ఏదో ఒక పురుషునియందు ప్రేమ కలుగుచుండును. (కాని నేను అట్లు కాదు).

వ్యూఢాయాశ్చాపి పుంశ్చల్యా మనోభ్యేతి నవం నవమ్ ।
బుధోసతీం న బిభృయాత్తం బిభ్రదుభయచ్యుతః ॥ 48

పుంశ్చల్యాఃᳬ కులటకు, వ్యూఢాయాఃᳬ అపిᳬ వివాహమైనదే అయినా, మనఃᳬ మనస్సు, నవం నవమ్ᳬ కొత్త కొత్త పురుషుని, అభ్యేతిᳬ అభిముఖముగా ప్రసరించును, బుధఃᳬ వివేకి, తామ్ᳬ అట్టి, అసతీమ్ᳬ దుష్టురాలిని, న బిభృయాత్ᳬ స్వీకరించరాదు, బిభ్రత్ᳬ స్వీకరించువాడు, ఉభయచ్యుతఃᳬ ఇహపరములు రెండింటికీ భ్రష్టుడు.

పెళ్లి అయిన తరువాత కూడా కులట మనస్సు కొత్త కొత్త పురుషులపైకి ప్రసరించును. వివేకి అట్టి దుష్టురాలిని వివాహమాడరాదు. వివాహమాడినవాడు ఇహపరముల రెండింటికీ భ్రష్టుడగును.

శ్రీభగవానువాచ ।

సాధ్వేతద్భ్రోతుకామైస్త్వం రాజపుత్రి ప్రలంభితా ।
మయోదితం యదన్వాత్థ సర్వం తత్సత్యమేవ హి ॥ 49

శ్రీభగవాన్ᳬ శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచᳬ పలికెను, సాధ్విᳬ ఓ పతివ్రతా!, రాజపుత్రిᳬ ఓ రాజకుమారీ!, ఏతత్ᳬ ఈ మాటను, శ్రోతుకామైఃᳬ వినగోరిన మాచే, త్వమ్ᳬ నీవు, ప్రలంభితాᳬ పరిహాసము చేయబడితివి, హిᳬ ఏలయన, మయాᳬ నాచే, ఉదితమ్ᳬ చెప్పబడిన మాటను, అనుᳬ అనుసరించి, యత్ᳬ ఏ మాటను, ఆత్థᳬ పలికితివో, తత్ᳬ అది, సర్వమ్ᳬ సర్వము, సత్యం ఏవᳬ సత్యమే.

శ్రీకృష్ణభగవానుడిట్లు పలికెను... ఓ రాజకుమారీ! నీవు పతివ్రతవు. నీ నోటినుండి ఈ మాటలను వినుటకే మేము నిన్ను పరిహాసము చేసితిమి. ఎందుకంటే, నేను చెప్పిన మాటకు బదులుగా నీవు చెప్పిన ప్రతి మాట యథార్థమే.

యాన్ యాన్ కామయసే కామాన్మయ్యకామాయ భామిని ।
సంతి హ్యేకాంతభక్తాయాస్తవ కల్యాణి నిత్యదా ॥ 50

భామిని= ప్రణయకోపము గలదానా!, కల్యాణి= ఓ కల్యాణీ!, యాన్ యాన్= ఏయే, కామాన్= కామనలను, కామయసే= కోరెదవో అవి, అకామాయ= కామనలు లేని మోక్షము కొరకు, మయి= నాయందు, ఏకాంతభక్తాయాః= పరమభక్తురాలవగు, తవ= నీకు, నిత్యదా= ఎల్లవేళలా, సంతి= కలవు, హి= నిశ్చయము.

ప్రణయకోపము గల ఓ కల్యాణీ! నాయందు చేయబడిన కామనలు మోక్షమునిచ్చేవే గాని సంసారబంధమును కలిగించేవి కావు. నీకు నాయందు పరమభక్తి గలదు. నీవు ఏయే కామనలను కోరెదవో అవి నీకు ఎల్లవేళలా ప్రాప్తములే. (నీవు కోరనక్కరయే లేదు).

ఉపలబ్ధం పతిప్రేమ పాతివ్రత్యం చ తేనఘే ।
యద్వాక్యై శ్చాల్యమానాయా న ధీ ర్మయ్యపకర్షితా ॥ 51

అనఘే= ఓ పుణ్యాత్మురాలా!, తే= నీ, పతిప్రేమ= భర్తయందు ప్రేమ, పాతివ్రత్యం చ= భర్తయందు పూర్ణమగు నిష్ఠను కలిగియుండుట కూడ, ఉపలబ్ధమ్= అనుభవించబడినది, యత్= ఏలయన, వాక్యైఃః= వాక్యములచే, చాల్యమానాయాఃః= విచలితము చేయబడుచున్న నీ, మయి= నాయందలి, ధీఃః= బుద్ధి, న అపకర్షితా= ఇంకో వైపు లాగబడలేదు.

ఓ పుణ్యాత్మురాలా! నీకు భర్తనగు నాయందుండే ప్రేమ, నీ పాతివ్రత్యము కూడ నిరూపితమైనవి. ఎందుకంటే, నిన్ను విచలితము చేసినా, నాయందలి నీ మనస్సు మరోవైపు లాగబడలేదు.

యే మాం భజంతి దాంపత్యే తపసా వ్రతచర్యయా ।
కామాత్మానోపవర్గేశం మోహితా మమ మాయయా ॥ 52

కామ–ఆత్మానః= కామనతో నిండిన ఆంతఃకరణము గల, యే= ఎవరైతే, అపవర్గ–ఈశమ్= మోక్షమునకు ప్రభుడనగు, మామ్= నన్ను, దాంపత్యే= దాంపత్య సుఖము విషయమునందు, తపసా= తపస్సుచే, వ్రతచర్యయా= వ్రతానుష్ఠానముచే, భజంతి= సేవించెదరో వారు, మమ= నా, మాయయా= మాయ చే, మోహితాః= మోహింపజేయబడినవారు.

నేను మోక్షమునిచ్చే ప్రభుడను. కాని, ఎవరైతే కామనతో నిండిన అంతఃకరణము గలవారై తపస్సును, వ్రతములను చేసి దాంపత్య సుఖముకొరకై నన్ను సేవింతురో, వారు నా మాయచే మోహితులైనారు.

మాం ప్రాప్య మానిన్యపవర్గసంపదం
వాంఛంతి యే సంపద ఏవ తత్పతిమ్ ।
తే మందభాగ్యా నిరయేపి యే నృణాం
మాత్రాత్మకత్వాన్నిరయస్సుసంగమః ॥ 53

మానిని= ఓ అభిమానవతీ!, అపవర్గసంపదమ్= మోక్షమునకు సంపదలకు ఆశ్రయమగు, మామ్= నన్ను, ప్రాప్య= పొంది, యే= ఎవరైతే, తత్–పతిమ్= వాటికి ప్రభుడనగు నన్ను, సంపదః ఏవ= సంపదలను మాత్రమే, వాంఛంతి= కోరెదరో, తే= వారు, మందభాగ్యాః= అల్పమగు భాగ్యము గలవారు, యే= ఏ సంపదలు, నిరయే అపి= నరకమువంటి నికృష్టజన్మయందు కూడ, నృణామ్= మానవులకు, మాత్రా–ఆత్మకత్వాత్= శబ్దాది విషయములే స్వరూపముగా గలది అగుట వలన, నిరయః= నరకము, సుసంగమః= మంచిది గనుక పొందదగినది.

అభిమానవతియగు ఓ రుక్మిణీ! మోక్షమునకు, సంపదలకు కూడ నేనే ప్రభుడను. కాని, నన్ను చేరుకొని ఎవరైతే సంపదలను మాత్రమే కోరెదరో, వారి భాగ్యము అల్పము మాత్రమే. ఎందుకంటే, భోగములు నరకమువంటి నికృష్టజన్మలో కూడ ఉండును. మానవులకు శబ్దాది

విషయములే ప్రధానమైనచో, అవి నరకములో కూడ ఉండును గనుక, నరకము కూడ మంచిది, పొందదగినదియే అగును.

దిష్ట్యా గృహేశ్వర్యసకృన్మయి త్వయా
కృతానువృత్తి ర్భవమోచనీ ఖలైః ।
సుదుష్కరాసౌ సుతరాం దురాశిషో
హ్యసుంభరాయా నికృతింజుషః స్త్రియాః ॥ 54

గృహ–ఈశ్వరి= ఓ ఇంటికి రాణీ!, త్వయా= నీచే, అసకృత్= నిరంతరము, మయి= నాయందు, భవమోచనీ= సంసారమునుండి విడిపించే, అనువృత్తిః= సేవ, కృతా= చేయబడినది, దిష్ట్యా= మంగళము, అసౌ= ఈ సేవ, ఖలైః= దుష్టులచే, సుదుష్కరా= మిక్కిలి చేయ శక్యము కానిది, దురాశిషః= దురభిప్రాయము కలిగినట్టియు, అసుంభరాయాః= ఇంద్రియభోగపరయైన, నికృతింజుషః= వంచనపరురాలైన, స్త్రీయాః= స్త్రీకి, సుతరామ్= సుతరాము (దుష్కరము), హి= నిశ్చయము.

ఓ రుక్మిణీ! నీవు ఇంటికి రాణివై నిరంతరముగా నాకు సేవను చేసితివి. ఇది మంగళము. ఇట్టి నా సేవ సంసారబంధమునుండి విముక్తినిచ్చును. దుష్టులు ఇట్టి సేవను చేయలేరు. దురభిప్రాయము కలిగి ఇంద్రియ భోగపరాయణురాలై వంచనాపరురాలగు స్త్రీ ఇట్టి సేవను చేయుట నిశ్చయముగా సుతరాము దుష్కరము.

న త్వాదృశీం ప్రణయినీం గృహిణీం గృహేషు
పశ్యామి మానిని యయా స్వవివాహకాలే ।
ప్రాప్తాన్ నృపానవగణయ్య రహోహరో మే
ప్రస్థాపితో ద్విజ ఉపశ్రుతసత్కథస్య ॥ 55

మానిని= ఓ అభిమానవతీ!, త్వాదృశీమ్= నీవంటి, ప్రణయినీమ్= ప్రేమ గల, గృహిణీమ్= గృహిణిని, గృహేషు= గృహములయందు, న

పశ్యామి= కానరాను, యయా= ఏ నీచే, స్వవివాహకాలే= తన వివాహసమయమునందు, ప్రాప్తాన్= వచ్చియున్న, నృపాన్= రాజులను, అవగణయ్య= తిరస్కరించి, ఉపశ్రుతసత్-కథస్య= వినబడిన మంచి గాథలు గల, మే= నాకు, రహః-హరః= రహస్యసందేశమును తెచ్చే, ద్విజః= బ్రాహ్మణుడు, ప్రస్థాపితః= పంపించబడినవాడో.

ఓ అభిమానవతీ! గృహములలో నీవంటి ప్రేమ గల గృహిణి నాకు కానరాదు. నాగురించి మంచి సమాచారమును విన్న నీవు స్వయంవరమునకు వచ్చియున్న రాజులను తిరస్కరించి, రహస్యమగు ప్రేమ సందేశముతో బ్రాహ్మణుని నావద్దకు పంపితివి.

భ్రాతుర్విరూపకరణం యుధి నిర్జితస్య
ప్రోద్వాహపర్వణి చ తద్వధమక్షగోష్ఠ్యామ్ ।
దుఃఖం సముత్థమసహోస్మదయోగభీత్యా
నైవాబ్రవీః కిమపి తేన వయం జితాస్తే ॥ 56

యుధి= యుద్ధమునందు, నిర్జితస్య= జయించబడిన, భ్రాతుః= సోదరుని, విరూపకరణమ్= విరూపునిగా చేయుటను గురించి, చ= మరియు, ప్రోద్వాహపర్వణి= వివాహముయొక్క ఉత్సవమునందు, అక్షగోష్ఠ్యమ్= జూదముయొక్క సమావేశమునందు, తద్-వధమ్= వానిని వధించుటను గురించి, సముత్థమ్= పెల్లుబికిన, దుఃఖమ్= దుఃఖమును గురించి, అస్మద్-అయోగభీత్యా= మాతోడి వియోగము వలని భయముచే, అసహః= సహించితివి, కిం అపి= దేనినైననూ, న అబ్రవీః ఏవ= సుతరాము చెప్పలేదు, తేన= దానిచే, తే= నీచే, వయమ్= మేము, జితాః= జయించబడితిమి.

యుద్ధములో జయించబడిన నీ సోదరుడగు రుక్మిని నేను విరూపునిగా చేయుట, అనిరుద్ధుని వివాహమహోత్సవములో జూదపు సమావేశములో రుక్మిని బలరాముడు వధించుట, ఈ విషయములు

గుర్తుకు వచ్చినప్పుడు దుఃఖము పెల్లుబుకుట అనే ఈ సందర్భములను నీవు సహించితివి. నాతో వియోగము వచ్చునేమో అనే భయముతో నీవా సందర్భములలో ఒక్క మాటనైననూ నాతో అనలేదు. నీ ఆ ప్రేమచే నేను జయించబడితిని.

దూతస్త్వయాత్మలభనే సువివిక్తమంత్రః
ప్రస్థాపితో మయి చిరాయతి శూన్యమేతత్ ।
మత్వా జిహాస ఇదమంగమనన్యయోగ్యం
తిష్ఠేత తత్త్వయి వయం ప్రతినందయామః ॥ 57

ఆత్మనః= నాయొక్క, లభనే= పొందుటయందు, సువివిక్తమంత్రః= బాగా వివేచించబడిన రహస్యము గల, దూతః= దూత, త్వయా= నీచే, ప్రస్థాపితః= పంపించబడినవాడు, మయి= నేను, చిరాయతి= విలంబము చేయుచుండగా, ఏతత్= ఈ జగత్తును, శూన్యమ్= శూన్యమునుగా, మత్వా= తలచి, అనన్యయోగ్యమ్= మరియొకనికి తగినది కాని, ఇదమ్= ఈ, అంగమ్= దేహమును, జిహాసే= విడువగోరుచున్నాను అనే, తత్= ఆ నిశ్చయము, త్వయి= నీయందు, తిష్ఠేత= ఉండుగాక!, వయమ్= మేము, ప్రతినందయామః= అభినందించెదము.

నన్ను పొందుటకై నీవు రహస్యసందేశమును బాగా వివేచించి చెప్పి దూతను పంపితివి. నేను వచ్చుటలో కొంత విలంబము కాగా, నీకీ జగత్తు శూన్యముగా భాసించినది. నీ దేహము మరియొకనికి తగినది కాదని నీవు తలచి ప్రాణత్యాగమునకు సిద్ధపడితివి. ఆ నిశ్చయము నీయందే ఉండుగాక! నిన్ను అభినందించుట తప్ప మేము ప్రతికృతిని చేయలేము.

శ్రీశుక ఉవాచ ।
ఏవం సౌరత సంలాపై ర్భగవాఞ్జగదీశ్వరః ।
స్వరతో రమయా రేమే నరలోకం విడంబయన్ ॥ 58

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, జగద్–ఈశ్వరః= జగత్తును శాసించువాడు, స్వరతః= ఆత్మారాముడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, నరలోకమ్= మానవలోకమును, విడంబయన్= అనుకరించువాడై, రమయా= రుక్మిణీ దేవితో, సౌరతసం–లాపైఃలాపైః= ప్రేమ కబుర్లతో, రేమే= రమించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...జగత్తును శాసించువాడు, ఆత్మారాముడు అగు శ్రీకృష్ణభగవానుడీ విధముగా మానవలోకముననుకరిస్తూ, లక్ష్మి అవతారమగు రుక్మిణీ దేవితో ప్రేమ కబుర్లను చెబుతూ రమించెను.

తథాన్యాసామపి విభుర్నహేషు గృహవానివ ।
ఆస్థితో గృహమేధీయాన్ ధర్మాన్ లోకగురుర్హరిః ॥ 59

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే షష్టితమోధ్యాయః ॥

విభుః= సర్వసమర్థుడు, లోకగురుః= జగద్గురువు, హరిః= శ్రీహరి, తథా= అదే విధముగా, అన్యాసామ్= ఇతరభార్యలయొక్క, గృహేషు అపి= ఇళ్లయందు కూడా, గృహవాన్ ఇవ= గృహస్థు వలె, గృహమేధీ–యాన్= గృహస్థాశ్రమమునకు చెందిన, ధర్మాన్= ధర్మములను, ఆస్థితః = అనుష్ఠించువాడు.

సర్వసమర్థుడు, జగద్గురువు అగు శ్రీకృష్ణ భగవానుడు గృహస్థువలె ఇతర భార్యల ఇళ్లలోకూడ అదేవిధముగా గృహస్థాశ్రమధర్మముల–ననుష్ఠించెను.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
రుక్మిణీ శ్రీకృష్ణ సంవాదమును వర్ణించే
అరువదియవ అధ్యాయము ముగిసినది (60).

* * *

అథ ఏకషష్టితమోఽధ్యాయః

అనిరుద్ధుని వివాహము - రుక్మిసంహారము

శ్రీశుక ఉవాచ ।

ఏకైకశస్తాః కృష్ణస్య పుత్రాన్ దశ దశాబలాః ।
అజీజన న్నవమాన్ పితుస్సర్వాత్మసంపదా ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, తాః= ఆ, అబలాః= యువతులు, కృష్ణస్య= శ్రీకృష్ణునకు, ఏక- ఏకశః= ప్రతి ఒక్కరుగా, సర్వ-ఆత్మసంపదా= సమస్తమైన తమయందలి సంపదతో, పితుః= తండ్రికంటె, అనవమాన్= తీసిపోని, దశ దశ= పది పదిమంది, పుత్రాన్= పుత్రులను, అజీజనన్= కనిరి.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...ఆ యువతులు ప్రతి ఒక్కరు శ్రీకృష్ణునకు పదేసిమంది చొప్పున పుత్రులను కనిరి. వారు తమయందలి సమస్తమైన రూపాదిసంపత్తిచే తండ్రికి తీసిపోనివారు.

గృహాదనపగం వీక్ష్య రాజపుత్ర్యోచ్యుతం స్థితమ్ ।
ప్రేష్ఠం న్యమంసత స్వం స్వం న తత్తత్త్వవిదః స్త్రియః ॥ 2

గృహాత్= ఇంటినుండి, అనపగమ్= దూరము కానట్టియు, స్థితమ్= స్థిరముగానున్న, అచ్యుతమ్= శ్రీకృష్ణభగవానుని, వీక్ష్య= చూచి, రాజపుత్ర్యః= రాజకుమార్తెలు, స్వం స్వమ్= తనను తనను, ప్రేష్ఠమ్= ప్రియ తమనుగా, న్యమంసత= తలపోసిరి, స్త్రియః= ఆ యువతులు, తత్ తత్త్వవిదః= ఆయన యథార్థస్వరూపమును తెలిసినవారు, న= కాదు.

శ్రీకృష్ణభగవానుడు ఆ రాజకుమార్తెల ఇళ్లలో దూరము కాకుండా స్థిరముగా నుండెను. దానిని చూచి ఆ యువతులు ప్రతివారు తామే ఆయనకు మిక్కిలి ప్రియమైనవారని తలపోసిరి. వారికి ఆయన ఆత్మారాముడని తెలియదు.

చార్వబ్జకోశవదనాయతబాహునేత్ర
సప్రేమహాసరసవీక్షితవల్గుజల్పైః ।
సమ్మోహితా భగవతో న మనో విజేతుం
స్వైర్విభ్రమైస్సమశకన్ వనితా విభూమ్నః ॥ 3

భగవతః= శ్రీకృష్ణ భగవానుని, చారు–అబ్జకోశవదన ఆయత–బాహునేత్ర సప్రేమహాసరసవీక్షితవల్గుజల్పైః= అందమైన పద్మపు మొగ్గవంటి ముఖము, పొడవాటి చేతులు, కళ్లు, ప్రేమతో కూడిన చిరునవ్వు రసమయ మగు చూపు, మనోహరమగు పలుకులచే, సంమోహితాః= సమ్మోహమును పొందిన, వనితాః= ఆ యువతులు, స్వైః= తమ, విభ్రమైః= విలాసాలచే, విభూమ్నః= పరిపూర్ణుడగు ఆయనయొక్క, మనః= మనస్సును, విజేతుమ్= జయించుటకు, న సమశకన్= సమర్థులు కాలేదు.

శ్రీకృష్ణభగవానుని అందమైన పద్మపు మొగ్గవంటి ముఖము, పొడవాటి చేతులు, విశాలమైన కళ్లు, ప్రేమతో కూడిన చిరునవ్వు, రసమయమగు చూపు, మనోహరమగు పలుకులు ఆ యువతులను సమ్మోహపరచినవి. కాని, వారు మాత్రము తమ విలాసాలచే పరిపూర్ణుడగు ఆయన మనస్సును జయించలేకపోయిరి.

స్మాయావలోకలవదర్శిత భావహారి
భ్రూమండల ప్రహిత సౌరతమంత్రశౌండైః ।
పత్న్యస్తు షోడశసహస్ర మనంగబాణైః
యస్యేంద్రియం విమథితుం కరణైర్న శేకుః ॥ 4

షోడశసహస్రమ్= పదునారు వేలు, పత్న్యః తు= భార్యలైతే, స్మాయ అవలోక లవదర్శితభావహారిభ్రూమండల ప్రహితసౌరతమంత్రశౌండైః= చిరునవ్వుతో కూడిన ప్రక్కచూపుచే సూచించబడిన అభిప్రాయముతో

మనస్సును హరించే కనుబొమల మండలముచే పంపబడిన ప్రేమ మంత్రములయందు దిట్టలైన, అనంగబాణైఃr= మన్మథుని బాణములచే, కరణైఃr= హావభావములు మొదలైన ఉపాయములచే, యస్య= ఏ శ్రీకృష్ణుని, ఇంద్రియమ్= మనస్సును, విమథితుమ్= కల్లోలపరచుటకు, న శేకుఃr= సమర్థులు కాలేదో.

పదునారువేల 'భార్యలైతే చిరునవ్వుతో కూడిన ప్రక్క చూపులతో ప్రేమను సూచిస్తూ, కనుబొమల త్రిప్పుటలచే మనస్సును దోచివేసెడి వారు. ప్రేమమంత్రమునందు సమర్థములైన మన్మథబాణములను వారు చూపుల ద్వారా విసిరెడివారు. ఇంతేగాక, హావభావములు మొదలైన ఇతరోపాయములను కూడ ప్రయోగించెడివారు. కాని, వారు ఆయన మనస్సును కల్లోలపరచలేకపోయిరి.

ఇత్థం రమాపతి మవాప్య పతిం స్త్రియస్తాః
బ్రహ్మాదయోపి న విదుః పదవీం యదీయామ్ ।
భేజు ర్ముదావిరత మేధితయానురాగ
హాసావలోక నవసంగమ లాలసాద్యమ్ ॥ 5

తాఃr= ఆ, స్త్రియఃr= యువతులు, ఇత్థమ్= ఈ విధముగా, రమాపతిమ్= లక్ష్మీపతియగు శ్రీకృష్ణభగవానుని, పతిమ్= భర్తనుగా, అవాప్య= పొంది, యదీయామ్= ఎవనికి చెందిన, పదవీమ్= పొందే ఉపాయమును, బ్రహ్మ-ఆదయఃr అపి= బ్రహ్మదేవుడు మొదలగువారు కూడ, న విదుఃr= తెలియరో, అవిరతమ్= నిరంతరముగా, ఏధితయా= వర్ధిల్లజేయబడిన, ముదా= ఆనందముతో, అనురాగహాస- అవలోక నవ-సంగమలాలస-ఆద్యమ్= ప్రేమతోడి నవ్వు చూపులు కొత్త కలయిక యందలి ఉత్కంఠ మొదలగుదానిని, భేజుఃr= చేసిరి.

బ్రహ్మదేవుడు, ఇంద్రుడు మొదలగువారు లక్ష్మీపతియగు శ్రీకృష్ణభగవానుని పొందే ఉపాయమును తెలియకున్నారు. కాని, ఆ

యువతులు మాత్రము ఆయననీ విధముగా భర్తగా పొందిరి. వారి ఆనందము నిరంతరముగా వర్ధిల్లుచుండెను. వారు ప్రేమతోడి నవ్వు, అనురాగపు చూపులు, కొత్త కలయికయందలి ఉత్కంఠ మొదలగు హావభావముల నాయన యెడల నెరపిరి.

ప్రత్యుద్గమాసన వరార్హణపాదశౌచ
తాంబూల విశ్రమణ వీజన గంధమాల్యైః ।
కేశప్రసార శయన స్నపనోపహార్యైః
దాసీశతా అపి విభో ర్విదధుస్స్మ దాస్యమ్ ॥ 6

దాసీశతాః అపి= దాసీల వందలు ఉన్నవారే అయిననూ, విభోః= శ్రీకృష్ణ ప్రభునకు, ప్రతి–ఉద్గమ–ఆసనవర– అర్హణపాదశౌచతాంబూల విశ్రమణవీజనగంధమాల్యైః= ఎదురేగుట, ఆసనమునిచ్చుట, శ్రేష్ఠమగు అర్ఘ్యాదులనిచ్చుట, పాదములను కడుగుట, తాంబూలము శ్రమను తొలగించుట వీచుట గంధమును పుష్పములను ఇచ్చుటచే, కేశప్రసార–శయనస్నపన–ఉపహార్యైః= జుట్టు దువ్వుట శయ్యను అమర్చుట స్నానము భోజనములతో, దాస్యమ్= సేవను, విదధుః స్మ= చేసిరి.

ఆ శ్రీకృష్ణభార్యల వద్ద వందలాది దాసీలు ఉండిరి. అయినా, ఆ ప్రభునకు ఎదురేగుట, ఆసనమునిచ్చుట, త్రాగే నీరు మొదలగు శ్రేష్ఠమగు ఉపచారములను చేయుట, కాళ్లను కడుగుట, తాంబూలమునిచ్చుట, కాళ్లను నొక్కి శ్రమను తొలగించుట, వీచుట, గంధమునలదుట, పుష్పములనిచ్చుట, జుట్టు దువ్వుట, ప్రక్కనమర్చుట, స్నానమునకు వ్యవస్థచేయుట, భోజనమును ఫలహారమును ఇచ్చుట మొదలగు పరిచర్యలతో సేవ చేసిరి.

తాసాం యా దశపుత్రాణాం కృష్ణస్త్రీణాం పురోదితాః ।
అష్టౌ మహిష్య స్తత్పుత్రాన్ ప్రద్యుమ్నాదీన్ గృణామి తే ॥ 7

దశపుత్రాణామ్= పదిమంది కొడుకులు గల, తాసామ్= ఆ, కృష్ణస్త్రీణామ్= శ్రీకృష్ణుని భార్యలలో, యాఃఏ, అష్టౌ= ఎనమండుగురు, మహిష్యః= పట్టమహిషులు, పురా= ఇదివరలో, ఉదితాఃచెప్పబడినారో, తత్-పుత్రాన్= వారి పుత్రులైన, ప్రద్యుమ్న-ఆదీన్= ప్రద్యుమ్నుడు మొదలగువారిని గురించి, తే= నీ కొరకు, గృణామి= చెప్పుచున్నాను.

శ్రీకృష్ణుని భార్యలకు పదేసి పుత్రులు గలరు. ఆ భార్యలలో ఎనమండుగురు పట్టమహిషుల గురించి ఇదివరలో చెప్పడమైనది. వారి పుత్రులైన ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు మొదలగువారి గురించి నీకు చెప్పెదను.

చారుదేష్ణస్సుదేష్ణశ్చ చారుదేహశ్చ వీర్యవాన్ ।
సుచారుశ్చారుగుప్తశ్చ భద్రచారుస్తథాపరః ॥ 8

చారుచంద్రో విచారుశ్చ చారుశ్చ దశమో హరేః ।
ప్రద్యుమ్నప్రముఖా జాతా రుక్మిణ్యాం నావమాః పితుః ॥ 9

హరేః= శ్రీహరికి, రుక్మిణ్యామ్= రుక్మిణియందు, వీర్యవాన్= పరాక్రమశాలియగు, చారుదేష్ణఃచారుదేష్ణుడు, సుదేష్ణఃచ= సుదేష్ణుడు, చారుదేహఃచ= చారుదేహుడు, సుచారుఃచ= సుచారుడు, చారుగుప్తఃచ= చారుగుప్తుడు, తథా= మరియు, అపరఃతరువాతివాడు, భద్రచారుఃభద్రచారుడు, చారుచంద్రఃచారుచంద్రుడు, విచారుఃచ= విచారుడు, దశమఃపదవవాడగు, చారుఃచ= చారుడు, ప్రద్యుమ్నప్రముఖాఃప్రద్యుమ్నుడు పెద్దవాడుగా గలవారు, పితుఃతండ్రికంటె, న అవమాఃతక్కువవారు కారు.

శ్రీకృష్ణ భగవానునకు రుక్మిణియందు పెద్దకొడుకు ప్రద్యుమ్నుడు, తరువాత పరాక్రమశాలురగు చారుదేష్ణుడు, సుదేష్ణుడు, చారుదేహుడు, సుచారుడు, చారుగుప్తుడు, భద్రచారుడు, చారుచంద్రుడు, విచారుడు, చారుడు అనే పదిమంది కొడుకులు, తండ్రికి తీసిపోనివారు, కలిగిరి.

భానుస్సుభాను స్స్వర్భానుః ప్రభాను ర్భానుమాంస్తథా ।
చంద్రభాను ర్బృహద్భాను రతిభాను స్తథాష్టమః ॥ 10

శ్రీభానుః ప్రతిభానుశ్చ సత్యభామాత్మజా దశ ।

భానుః= భానుడు, సుభానుః= సుభానుడు, స్వర్భానుః= స్వర్భానుడు, ప్రభానుః= ప్రభానుడు, తథా= అదే విధముగా, భానుమాన్= భానుమంతుడు, చంద్రభానుః= చంద్రభానుడు, బృహద్భానుః= బృహద్భానుడు, తథా= అదే విధముగా, అష్టమః= ఎనిమిదవవాడగు, అతిభానుః= అతిభానుడు, శ్రీభానుః= శ్రీభానుడు, ప్రతిభానుః చ= ప్రతిభానుడు అనే, దశ= పదిమంది, సత్యభామా–ఆత్మజాః= సత్యభామ యొక్క పుత్రులు.

భానుడు, సుభానుడు, స్వర్భానుడు, ప్రభానుడు, భానుమంతుడు, చంద్రభానుడు, బృహద్భానుడు, అతిభానుడు, శ్రీభానుడు, ప్రతిభానుడు అనే పది మంది సత్యభామయొక్క పుత్రులు.

సాంబ స్సుమిత్రః పురుజిచ్ఛతజిచ్చ సహస్రజిత్ ॥ 11

విజయ శ్చిత్రకేతుశ్చ వసుమాన్ ద్రవిడః క్రతుః ।
జాంబవత్యా స్సుతా హ్యేతే సాంబాద్యాః పితృసమ్మతాః ॥ 12

సాంబః= సాంబుడు, సుమిత్రః= సుమిత్రుడు, పురుజిత్= పురుజిత్తు, శతజిత్ చ= శతజిత్తు, సహస్రజిత్= సహస్రజిత్తు, విజయః= విజయుడు, చిత్రకేతుః చ= చిత్రకేతుడు, వసుమాన్= వసుమంతుడు, ద్రవిడః= ద్రవిడుడు, క్రతుః= క్రతువు, ఏతే= ఈ, సాంబ–ఆద్యాః= సాంబుడు మొదటివాడుగా గలవారు, జాంబవత్యాః= జాంబవతి యొక్క, సుతాః= పుత్రులు, పితృసమ్మతాః= తండ్రికి ప్రియమైనవారు.

జాంబవతి పెద్దకొడుకు సాంబుడు. సుమిత్రుడు, పురుజిత్తు, శతజిత్తు, సహస్రజిత్తు, విజయుడు, చిత్రకేతువు, వసుమంతుడు,

ద్రవిడుడు, క్రతువు అనే తొమ్మిదిమంది తరువాతి వారు. వీరియందు తండ్రికి ప్రేమ యెక్కువ.

వీర శ్చంద్రోశ్వసేనశ్చ చిత్రగు ర్వేగవాన్ వృషః ।
ఆమ శ్శంకు ర్వసుశ్శ్రీమాన్ కుంతి ర్నాగ్నజితే స్సుతాః ॥ 13

వీరుః= వీరుడు, చంద్రుః= చంద్రుడు, అశ్వసేనుః చ= అశ్వసేనుడు, చిత్రగుుః= చిత్రగుడు, వేగవాన్= వేగవంతుడు, వృషుః= వృషుడు, ఆముః = ఆముడు, శంకుుః= శంకుడు, వసుుః= వసువు, శ్రీమాన్= శోభాయుక్తుడగు, కుంతిుః= కుంతి, నాగ్నజితేుః= నగ్నజిన్మహారాజు యొక్క పుత్రియగు సత్యయొక్క పుత్రులు.

వీరుడు, చంద్రుడు, అశ్వసేనుడు, చిత్రగుడు, వేగవంతుడు, వృషుడు, ఆముడు, శంకుడు, వసువు, శోభాయుక్తుడగు కుంతి అనువారలు నగ్నజిన్మహారాజుయొక్క కుమార్తెయగు సత్యయొక్క పుత్రులు.

శ్రుతుుః కవిర్వృషో వీర స్సుబాహుర్భద్ర ఏకలుుః ।
శాంతిర్దర్శుుః పూర్ణమాసుుః కాలింద్యా స్సోమకోవరుుః ॥ 14

వీరుుః= వీరుడగు, శ్రుతుుః= శ్రుతుడు, కవిుః= కవి, వృషుుః= వృషుడు, సుబాహుుః= సుబాహుడు, భద్రుుః= భద్రుడు, ఏకలుుః= ఏకలుడు, శాంతిుః = శాంతి, దర్శుుః= దర్శుడు, పూర్ణమాసుుః= పూర్ణమాసుడు, అవరుుః= చిన్నవాడు, సోమకుుః= సోమకుడు, కాలింద్యాుః= కాలిందియొక్క పుత్రులు.

శ్రుతుడు, కవి, వృషుడు, సుబాహుడు, భద్రుడు, ఏకలుడు, శాంతి, దర్శుడు, పూర్ణమాసుడు, ఆఖరివాడగు సోమకుడు అనే వీరులు కాలింది యొక్క పుత్రులు.

ప్రఘోషో గాత్రవాన్ సింహో బలుః ప్రబల ఊర్ధ్వగుుః ।
మాద్ర్యాుః పుత్రా మహాశక్తిస్సహ ఓజో పరాజితుుః ॥ 15

ప్రఘోషః= ప్రఘోషుడు, గాత్రవాన్= గాత్రవంతుడు, సింహః= సింహుడు, బలః= బలుడు, ప్రబలః= ప్రబలుడు, ఊర్ధ్వగః= ఊర్ధ్వగుడు, మహాశక్తిః= మహాశక్తి, సహః= సహుడు, ఓజః= ఓజుడు, అపరాజితః= అపరాజితుడు, మాద్ర్యాః= మద్రరాజకుమారియగు లక్ష్మణయొక్క, పుత్రాః= పుత్రులు..

ప్రఘోషుడు, గాత్రవంతుడు, సింహుడు, బలుడు, ప్రబలుడు, ఊర్ధ్వగుడు, మహాశక్తి, సహుడు, ఓజుడు, అపరాజితుడు అనువారు మద్రరాజకుమారియగు లక్ష్మణయొక్క పుత్రులు.

వృకో హర్షోఽనిలో గృధ్రో వర్ధనోఽన్నాద ఏవ చ ।
మహాశః పావనో వహ్ని ర్మిత్రవిందాత్మజాః క్షుధిః ॥ 16

వృకః= వృకుడు, హర్షః= హర్షుడు, అనిలః= అనిలుడు, గృధ్రః= గృధ్రుడు, వర్ధనః= వర్ధనుడు, అన్నాదః ఏవ చ= అన్నాదుడు, మహాశః= మహాశుడు, పావనః= పావనుడు, వహ్నిః= వహ్ని, క్షుధిః= క్షుధి, మిత్రవిందా–ఆత్మజాః= మిత్రవిందయొక్క పుత్రులు.

వృకుడు, హర్షుడు, అనిలుడు, గృధ్రుడు, వర్ధనుడు, అన్నాదుడు, మహాశుడు, పావనుడు, వహ్ని, క్షుధి అనువారు మిత్రవిందయొక్క పుత్రులు.

సంగ్రామజిద్బృహత్సేన శ్శూరః ప్రహరణోఽరిజిత్ ।
జయస్సుభద్రో భద్రాయా వామ ఆయుశ్చ సత్యకః ॥ 17

సంగ్రామజిత్= సంగ్రామజిత్తు, బృహత్సేనః= బృహత్సేనుడు, శూరః= శూరుడు, ప్రహరణః ప్రహరణుడు, అరిజిత్ – అరిజిత్తు, జయః= జయుడు, సుభద్రః= సుభద్రుడు, వామః= వాముడు, ఆయుః చ= ఆయువు, సత్యకః= సత్యకుడు, భద్రాయాః= భద్రయొక్క (పుత్రులు).

దీప్తిమాంస్తామ్రతప్తాద్యా రోహిణ్యాస్తనయా హరేః ।
ప్రద్యుమ్నాచ్చానిరుద్ధోభూద్రుక్మవత్యాం మహాబలః ।
పుత్ర్యాం తు రుక్మిణో రాజన్నామ్నా భోజకటే పురే ॥ 18

రాజన్= ఓ రాజా! దీప్తిమాన్= దీప్తిమంతుడు, తామ్రతప్త-ఆద్యాః = తామ్రతప్తుడు మొదలగువారలు, రోహిణ్యాః= రోహిణి వలన, హరేః = శ్రీకృష్ణ భగవానునియొక్క, తనయాః= పుత్రులు, ప్రద్యుమ్నాత్ చ= ప్రద్యుమ్నుని వలన కూడ, రుక్మిణః= రుక్మియొక్క, పుత్ర్యామ్= కుమార్తెయగు, రుక్మవత్యాం తు= రుక్మవతియందైతే, నామ్నా= పేరుచే, భోజకటే= భోజకటమైన, పురే= నగరమునందు, మహాబలః= గొప్ప బలశాలియగు, అనిరుద్ధః= అనిరుద్ధుడు, అభూత్= కలిగెను.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ భగవానునకు పదునారు వేలమందిలో ఒకరగు రోహిణి వలన దీప్తిమంతుడు, తామ్రతప్తుడు మొదలగు పుత్రులు కలిగిరి. ప్రద్యుమ్నునకు రుక్మియొక్క కుమార్తెయగు రుక్మవతి అనే భార్యయందు భోజకటమని ప్రసిద్ధమైన నగరములో అనిరుద్ధుడు కలిగెను.

ఏతేషాం పుత్రపౌత్రాశ్చ బభూవుః కోటిశో నృప ।
మాతరః కృష్ణజాతానాం సహస్రాణి చ షోడశ ॥ 19

నృప= ఓ రాజా!, ఏతేషామ్= వీరియొక్క, పుత్రపౌత్రాః చ= కొడుకులు మనుమలు కూడ, కోటిశః= కోట్ల కొలది, బభూవుః= కలిగిరి, కృష్ణజాతానామ్= శ్రీకృష్ణుని వలన పుట్టిన వారికి, మాతరః= తల్లులు, షోడశ= పదునారు, సహస్రాణి చ= వేలు కంటె ఎక్కువ.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణునికి జన్మించిన సంతానమునకు తల్లుల సంఖ్య పదునారు వేలు మించెను. వీరి కొడుకులు, మనుమలు కోట్లాదులు ఉండిరి.

రాజోవాచ ।

కథం రుక్మ్యరిపుత్రాయ ప్రాదాద్దుహితరం యుధి ।
కృష్ణేన పరిభూతస్తం హంతుం రంధ్రం ప్రతీక్షతే ।
ఏతదాఖ్యాహి మే విద్వన్ ద్విషోర్వైవాహికం మిథః ॥ 20

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను,యుధి= యుద్ధము నందు, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, పరిభూతః= పరాభవించబడిన, రుక్మీ= రుక్మి, అరిపుత్రాయ= శత్రువుయొక్క పుత్రుని కొరకు, దుహితరమ్= కుమార్తెను, కథమ్= ఎట్లు, ప్రాదాత్= ఇచ్చెను?, తమ్= ఆయనను, హంతుమ్= సంహరించుటకు, రంధ్రమ్= అవకాశమును, ప్రతీక్షతే= ఎదురు చూచుచుండును, విద్వన్= ఓ విద్వాంసుడా!, ద్విషోః= శత్రువులగు శ్రీకృష్ణరుక్మిలయొక్క, మిథః= పరస్పరము, ఏతత్= ఈ, వైవాహికమ్= వివాహబంధమునకు నిమిత్తమును, ఆఖ్యాహి= చెప్పుము.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...జ్ఞానివగు ఓ మహర్షీ! రుక్మి యుద్ధములో శ్రీకృష్ణునిచే పరాభవించబడి, ఆయనను హతమార్చుటకు అవకాశమునకై ఎదురు చూచుచుండెను. అట్టివాడు కుమార్తెను శత్రువు పుత్రునికిచ్చి వివాహమునెట్లు చేసెను? శత్రువులైన శ్రీకృష్ణరుక్మిల మధ్యలో పరస్పరము వివాహసంబంధము ఎట్లు కలిగెనో చెప్పుడు.

అనాగతమతీతం చ వర్తమానమతీంద్రియమ్ ।
విప్రకృష్టం వ్యవహితం సమ్యక్ పశ్యంతి యోగినః ॥ 21

యోగినః= జ్ఞానులు, అనాగతమ్= భవిష్యత్తును, అతీతమ్= భూతమును, వర్తమానం చ= వర్తమానమును కూడ, అతి-ఇంద్రియమ్= ఇంద్రియగోచరము కానిదానిని, విప్రకృష్టమ్= దూరముగ నున్నదానిని, వ్యవహితమ్= కప్పబడినదానిని, సమ్యక్= చక్కగా, పశ్యంతి= కనెదరు.

జ్ఞానులు భూతభవిష్యద్వర్తమానములను, ఇంద్రియములకు అతీతమైనవాటిని, దూరమునందున్న వాటిని, కప్పివేయబడినవాటిని కూడ సాక్షాత్తుగా దర్శించెదరు.

శ్రీశుక ఉవాచ ।

వృతస్స్వయంవరే సాక్షాదనంగోంగయుతస్తయా ।
రాజ్ఞస్సమేతా న్నిర్జిత్య జహారైకరథో యుధి ॥ 22

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సాక్షాత్= సాక్షాత్తుగా, అంగయుతః= దేహముతో కూడిన, అనంగఃః= మన్మథుడైన ప్రద్యుమ్నుడు, తయా= ఆ రుక్మవతిచే, స్వయంవరే= స్వయంవరమునందు, వృతఃః= వరించబడినవాడు, ఏకరథఃః= ఒక్క రథము మాత్రమే గలవాడై, సమేతాన్= వచ్చిన, రాజ్ఞఃః= రాజులను, నిర్జిత్య= జయించి, జహార= తీసుకువెళ్లెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...దేహము లేని మన్మథుడు దేహము పొంది సాక్షాత్తుగా ప్రద్యుమ్నుడైనాడు. రుక్మవతి ఆయనను స్వయంవరములో వరించెను. ఆయన ఒక్కడు రథము మాత్రమే గలవాడై, స్వయంవరమునకు వచ్చిన రాజులను జయించి, ఆమెను దోడ్కొని వెళ్లెను.

యద్యప్యనుస్మరన్ వైరం రుక్మీ కృష్ణావమానితః ।
వ్యతరద్భాగినేయాయ సుతాం కుర్వన్ స్వసుః ప్రియమ్ ॥23

కృష్ణ-అవమానితఃః= శ్రీకృష్ణునిచే అవమానించబడిన, రుక్మీ= రుక్మి, వైరమ్= వైరమును, యది అపి అనుస్మరన్= స్మరించువాడే అయిననూ, స్వసుఃః= చెల్లెలికి, ప్రియమ్= ప్రీతిని, కుర్వన్= చేయువాడై, భాగినేయాయ= చెల్లెలి కొడుకు కొరకు, సుతామ్= కుమార్తెను, వ్యతరత్= ఇచ్చి పెళ్లి చేసెను.

ఒకప్పుడు శ్రీకృష్ణుడు తనకు చేసిన అవమానము రుక్మికి గుర్తు ఉండెను. అయినా, ఆతడు చెల్లెలు రుక్మిణికి ప్రీతిని కలిగించుటకై ఆమె కొడుకగు ప్రద్యుమ్ననకు తన కుమార్తెనిచ్చి వివాహము చేసెను.

రుక్మిణ్యాస్తనయాం రాజన్ కృతవర్మసుతో బలీ ।
ఉపయేమే విశాలాక్షీం కన్యాం చారుమతీం కిల ॥ 24

రాజన్= ఓ రాజా!, రుక్మిణ్యాః= రుక్మిణి యొక్క, తనయామ్= కుమార్తె అయినట్టియు, విశాల-అక్షీమ్= నిడివి కన్నులు గల, చారుమతీమ్= చారుమతి అనే, కన్యామ్= కన్యను, కృతవర్మసుతః= కృతవర్మ యొక్క పుత్రుడగు, బలీ= బలి, ఉపయేమే కిల= వివాహమాడెను.

ఓ పరీక్షిన్మహారాజా! రుక్మిణికి చారుమతి అనే నిడివి కన్నుల కుమార్తె ఉండెను. ఆ కన్యను కృతవర్మ పుత్రుడగు బలి వివాహమాడెను.

దౌహిత్రాయానిరుద్ధాయ పౌత్రీం రుక్మ్యదదాద్ధరేః ।
రోచనాం బద్ధవైరోపి స్వసుః ప్రియచికీర్షయా ।
జాతన్నధర్మం తద్యోనం స్నేహపాశానుబంధనః ॥ 25

రుక్మీ= రుక్మి, స్నేహపాశ-అనుబంధనః= ఆసక్తి అనే పాశముచే కట్టబడినవాడై, స్వసుః= చెల్లెలికి, ప్రియచికీర్షయా= ప్రీతిని కలిగించే కోరికతో, తత్= ఆ, యోనమ్= వివాహసంబంధము, అధర్మమ్= అధర్మ మని, జానన్= తెలిసినవాడైననూ, పౌత్రీమ్= పుత్రుని కుమార్తెయగు, రోచనామ్= రోచనను, దౌహిత్రాయ= కూతురి కొడుకైనట్టియు, హరేః= శ్రీకృష్ణ భగవానుని (పౌత్రుడగు), అనిరుద్ధాయ= అనిరుద్ధుని కొరకు, అదదాత్= ఇచ్చెను.

ఆసక్తి అనే పాశమునకు బద్ధుడైన రుక్మి చెల్లెలు రుక్మిణికి ప్రీతిని కలిగించగోరెను. అట్టి వివాహము అధర్మము (ఒక వైపు ద్వేషము, రెండో వైపు పెళ్లి) అని తెలిసి కూడా ఆతడు శ్రీకృష్ణ భగవానుని

(రుక్మిణియొక్క) కొడుకు కొడుకగు అనిరుద్ధుని కొరకు తన పుత్రుని కుమార్తెయగు రోచననిచ్చి వివాహము చేసెను.

తస్మిన్నభ్యుదయే రాజన్ రుక్మిణీ రామకేశవౌ ।
పురం భోజకటం జగ్ముస్సాంబప్రద్యుమ్నకాదయః ॥ 26

రాజన్= ఓ రాజా!, తస్మిన్= ఆ, అభ్యుదయే= మంగళకార్యము నిమిత్తముగా, రుక్మిణీ= రుక్మిణి, రామ కేశవౌ= బలరాముడు శ్రీకృష్ణ భగవానుడు, సాంబప్రద్యుమ్నక-ఆదయః= సాంబుడు ప్రద్యుమ్నుడు మొదలగువారు, భోజకటమ్= భోజకటమనే, పురమ్= నగరమును గురించి, జగ్ముః= వెళ్లిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ మంగళకార్యము నిమిత్తముగా రుక్మిణి, బలరాముడు, శ్రీకృష్ణ భగవానుడు, సాంబుడు, ప్రద్యుమ్నుడు, చారు దేష్ణుడు మొదలగువారు భోజకటనగరమునకు వెళ్లిరి.

తస్మిన్నివృత్త ఉద్వాహే కాలింగప్రముఖా నృపాః ।
దృప్తాస్తే రుక్మిణం ప్రోచుర్బలమక్షైర్వినిర్జయ ॥ 27

తస్మిన్= ఆ, ఉద్వాహే= వివాహము, నివృత్తే= పూర్తి కాగా, దృప్తాః = గర్వించిన, తే= ఆ, కాలింగప్రముఖాః= కలింగదేశాధిపతి మొదలైన, నృపాః= రాజులు, రుక్మిణమ్= రుక్మిని ఉద్దేశించి, ప్రోచుః= పలికిరి, బలమ్ = బలరాముని, అక్షైః= పాచికల చే, వినిర్జయ= జయించుము.

ఆ వివాహము సమాప్తమయ్యెను. అప్పుడు గర్వించియున్న కలింగదేశాధిపతి మొదలగు రాజులు రుక్మితో, బలరాముని జూదములో జయించుము, అని ప్రోత్సహించిరి.

అనక్షజ్ఞో హ్యయం రాజన్నపి తద్వ్యసనం మహత్ ।
ఇత్యుక్తో బలమాహూయ తేనాక్షై రుక్మ్యదీవ్యత ॥ 28

రాజన్= ఓ రాజా!, అయమ్= ఈ బలరాముడు, అనక్షజ్ఞః హి= జూదము తెలిసినవాడు కానే కాదు, అపి= కాని, తత్= ఆ, వ్యసనమ్= వ్యసనము, మహత్= బలమైనది, ఇతి= ఈ విధముగా, ఉక్తః= చెప్పబడిన, రుక్మీ= రుక్మి, బలమ్= బలరాముని, ఆహూయ= పిలిచి, తేన= ఆయనతో, అక్షైః= పాచికలతో, అదీవ్యత= జూదమాడెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఈ బలరాముడు జూదము తెలిసినవాడు కానే కాదు. కాని, ఆ వ్యసనము బలమైనది. ఈ విధముగా రాజులచే ప్రోత్సహించబడిన రుక్మి ఆయనను పిలిచి పాచికలతో జూదమాడెను.

శతం సహస్రమయుతం రామస్తత్రాదదే పణమ్ ।
తం తు రుక్మ్యజయత్తత్ర కాలింగః ప్రాహసద్బలమ్ ।
దంతాన్ సందర్శయన్నుచ్చై ర్నామృష్యత్తద్ధలాయుధః ॥ 29

తత్ర= దానియందు, రామః= బలరాముడు, శతమ్= వందను, సహస్రమ్= వేయిని, అయుతమ్= పదివేలను, పణమ్= పందెమునుగా, ఆదదే= ఉంచెను, తం తు= ఆ ధనమునైతే, రుక్మీ= రుక్మి, అజయత్= నెగ్గెను, తత్ర= అప్పుడు, కాలింగః= కలింగదేశరాజు, దంతాన్= పళ్లను, సందర్శయన్= చూపించువాడై, బలమ్= బలరాముని, ఉచ్చైఃర= బిగ్గరగా, ప్రాహసత్= పరిహాసము చేసెను, హల–ఆయుధః= నాగలి ఆయుధముగా గల ఆయన, తత్= దానిని, న అమర్షత్= సహించలేదు.

ఆ జూదములో బలరాముడు వరుసగా వంద, వెయ్యి, పదివేల వరహాలను పందెము కాసెను. కాని రుక్మి ఆ పందెములను నెగ్గెను. అప్పుడు కలింగదేశరాజు విరగబడి నవ్వుతూ నాగలి ఆయుధముగా గల బలరాముని పరిహసించగా, ఆయనకు కోపము వచ్చెను.

తతో లక్షం రుక్మ్యగృహ్ణాద్ గ్లహం తత్రాజయద్బలః ।
జితవానహ మిత్యాహ రుక్మీ కైతవమాశ్రితః ॥ 30

తతః= తరువాత, రుక్మీ= రుక్మి, లక్షమ్= లక్షను, గ్లహమ్= పందెమునుగా, అగృహ్ణాత్= ఉంచెను, తత్ర= దానియందు, బలః= బలరాముడు, అజయత్= నెగ్గెను, రుక్మీ= రుక్మి, కైతవమ్= మోసమును, ఆశ్రితః= ఆశ్రయించినవాడై, అహమ్= నేను, జితవాన్= నెగ్గినవాడను, ఇతి= అని, ఆహ= పలికెను.

తరువాత రుక్మి లక్ష వరహాలను పందెము కాయగా, బలరాముడా పందెమును నెగ్గెను. కాని, రుక్మి మోసము చేసి తానే నెగ్గితినని చెప్పెను.

మన్యునా క్షుభిత శ్శ్రీమాన్ సముద్ర ఇవ పర్వణి ।
జాత్యారుణాక్షోఽతిరుషా న్యర్బుదం గ్లహమాదదే ॥ 31

మన్యునా= కోపముచే, పర్వణి= పర్వదినమునాడు, సముద్రః ఇవ= సముద్రము వలె, క్షుభితః= క్షోభిల్ల జేయబడినవాడు, జాత్యా= పుట్టుక చేతనే, అరుణ-అక్షః= ఎఱ్ఱని కన్నులు గలవాడు, శ్రీమాన్= శోభాయుక్తుడు అగు బలరాముడు, అతిరుషా= అధికమగు కోపముతో, న్యర్బుదమ్= పది కోట్లను, గ్లహమ్= పందెమునుగా, ఆదదే - ఉంచెను.

సహజముగా ఎఱ్ఱని కన్నులు గల శోభాయుక్తుడగు బలరాముడు కోపముచే, పర్వదినమునాడు సముద్రము వోలె, కల్లోలితుడాయెను. ఆయన అధికమగు కోపముతో పది కోట్ల వరహాలను పందెము ఉంచెను.

తం చాపి జితవాన్ రామో ధర్మేణ చ్ఛలమాశ్రితః ।
రుక్మీ జితం మయాత్రేమే వదంతు ప్రాశ్నికా ఇతి ॥ 32

రామః= బలరాముడు, తం చ అపి= ఆ పందెమును కూడ, ధర్మేణ= న్యాయముచే, జితవాన్= నెగ్గినవాడు, ఛలమ్= మోసమును, ఆశ్రితః= ఆశ్రయించిన, రుక్మీ= రుక్మి, మయా= నాచే, అత్ర= ఈ పందెమునందు, జితమ్= జయించబడినది, ఇమే= ఈ, ప్రాశ్నికాః= ప్రక్కనున్న సాక్షులు, వదంతు= చెప్పెదరు గాక!, ఇతి= అని.

బలరాముడు ఆ పందెమును కూడ న్యాయముగా జయించెను. కాని, మోసము చేయుచున్న రుక్మి – ఈ పందెములో కూడ నేనే నెగ్గితిని; ఈ ప్రక్కనున్న సాక్షులు సాక్ష్యమును చెప్పెదరు గాక! – అని పలికెను.

తదాబ్రవీ న్నభోవాణీ బలేనైవ జితో గ్లహః ।
ధర్మతో వచనేనైవ రుక్మీ వదతి వై మృషా ॥ 33

తదా= అప్పుడు, నభః వాణీ= ఆకాశవాణి, అబ్రవీత్= పలికెను, గ్లహః= పందెము, బలేన ఏవ= బలరామునిచే మాత్రమే, ధర్మతః= ధర్మమును బట్టి, జితః= జయించబడినది, రుక్మీ= రుక్మి, మృషా ఏవ= అసత్యము గనే, వచనేన= మాటతో, వదతి= చెప్పుచున్నాడు, వై= నిశ్చయము.

అప్పుడాకాశవాణి ఇట్లు పలికెను – ధర్మముగా బలరాముడే పందెము గెలిచినాడు. కాని రుక్మి నిశ్చయముగా అసత్యమును చెప్పు-చున్నాడు.

తామనాదృత్య వైదర్భో దుష్టరాజన్యచోదితః ।
సంకర్షణం పరిహసన్ బభాషే కాలచోదితః ॥ 34

దుష్టరాజన్యచోదితః= దుష్టులగు రాజులచే ప్రేరితుడైన, వైదర్భః = విదర్భరాజకుమారుడగు రుక్మి, తామ్= ఆ మాటను, అనాదృత్య= నిరాకరించి, కాలచోదితః= మృత్యువుచే ప్రేరితుడై, సంకర్షణమ్= బలరాముని, పరిహసన్= పరిహరించువాడై, బభాషే= పలికెను.

దుష్టులగు రాజులచే ప్రేరితుడైన విదర్భరాజకుమారుడగు రుక్మి ఆ మాటను నిరాకరించెను. ఆతడు మృత్యువుచే ప్రేరితుడై బలరాముని పరిహసిస్తూ ఇట్లు పలికెను.

నైవాక్షకోవిదా యూయం గోపాలా వనగోచరాః ।
అక్షైర్దీవ్యంతి రాజానో బాణైశ్చ న భవాదృశాః ॥ 35

యూయమ్= మీరు, అక్ష కోవిదాః= జూదములో నేర్పరులు, న ఏవ= కానే కారు, గోపాలాః= గోవుల కాపరులు, వనగోచరాః= అడవిలో తిరుగువారు, రాజానః= రాజులు, అక్షైః= పాచికలతో, బాణైః చ= బాణములతో కూడ, దీవ్యంతి= క్రీడించెదరు, భవాదృశాః= నీవంటివారు, న= కాదు.

అడవులలో తిరుగుతూ పశువులను కాచుకునే మీకు జూదములో నేర్పు లేదు. పాచికలతో మరియు బాణములతో క్రీడించేది రాజులు గాని, మీవంటివారు కాదు.

రుక్మిణైవమధిక్షిప్తో రాజభిశ్చోపహాసితః ।
క్రుద్ధః పరిఘముద్యమ్య జఘ్నే తం నృమ్ణసంసది ॥ 36

రుక్మిణా= రుక్మిచే, ఏవమ్= ఈ విధముగా, అధిక్షిప్తః= నిందించ-బడినవాడు, రాజభిః= రాజులచే, ఉపహసితః చ= పరిహాసము కూడ చేయబడినవాడు, క్రుద్ధః= కోపించినవాడు అగు బలరాముడు, నృమ్ణసంసది= ఉత్సవసమాజమునందు, పరిఘమ్= ఇనుప గుదియను, ఉద్యమ్య= పైకెత్తి, తమ్= వానిని, జఘ్నే= సంహరించెను.

రుక్మి ఈ విధముగా తిట్టుటచే మరియు రాజులు పరిహసించుటచే కోపించిన బలరాముడు ఇనుపగుదియను పైకెత్తి వానిని సంహరించెను.

కలింగరాజం తరసా గృహీత్వా దశమే పదే ।
దంతానపాతయత్క్రుద్ధో యోఽహస ద్వివృతైర్ద్విజైః ॥ 37

క్రుద్ధః= కోపించిన బలరాముడు, కలింగరాజమ్= కలింగరాజును, తరసా= వేగముగా, దశమే= పదవ, పదే= అడుగునందు, గృహీత్వా=

పట్టుకొని, దంతాన్= పళ్లను, అపాతయత్= ఊడగొట్టెను, యః= ఎవడైతే, వివృతైః= తెరువబడిన, ద్విజైః= పళ్లతో, అహసత్= నవ్వెనో.

కలింగరాజు పళ్లను బయటపెట్టి నవ్వుతూ పరిహసించెను గదా! ఆతడు పారిపోవుచుండగా కోపించియున్న బలరాముడు పది అడుగుల లోనే వానిని పట్టుకొని పళ్లను ఊడగొట్టెను.

అన్యే నిర్భిన్నబాహూరుశిరసో రుధిరోక్షితాః ।
రాజానో దుద్రువు ర్భీతా బలేన పరిఘార్దితాః ॥ 38

బలేన= బలరామునిచే, పరిఘ-అర్దితాః= గుదియతో పీడించ బడినవారు, నిర్భిన్నబాహు-ఊరుశిరసః= విరుగకొట్టబడిన చేతులు తొడలు తలలు గలవారు, రుధిర-ఉక్షితాః= రక్తముచే తడుపబడినవారు, భీతాః= భయపడినవారు అగు, అన్యే= ఇతరులగు, రాజానః= రాజులు, దుద్రువుః= పారిపోయిరి.

బలరాముడు ఇనుపగుదియతో మిగిలిన రాజుల చేతులను, తొడలను, తలలను విరుగకొట్టి పీడించెను. వారు రక్తము స్రవించు-చుండగా భయపడి పారిపోయిరి.

నిహతే రుక్మిణి శ్యాలే నాబ్రవీ త్సాధ్వసాధు వా ।
రుక్మిణీబలయో రాజన్ స్నేహభంగభయాద్ధరిః ॥ 39

రాజన్= ఓ రాజా! హరిః= శ్రీకృష్ణ భగవానుడు, శ్యాలే= బావమరదియగు, రుక్మిణి= రుక్మి, నిహతే= సంహరించబడగా, రుక్మిణీబలయోః= రుక్మిణీబలరాములయొక్క, స్నేహభంగభయాత్= ప్రేమకు భంగము వలని భయము వలన, సాధు= బాగు అని గాని, అసాధు వా= బాగు కాదని గాని, న అబ్రవీత్= చెప్పలేదు.

ఓ పరీక్షిన్మహారాజా! బలరాముడు తన బావమరదియగు రుక్మిని సంహరించగా, శ్రీకృష్ణ భగవానుడు రుక్మిణియొక్క ప్రేమకు భంగము కలుగునేమోననే భయముతో బాగున్నది అని గాని, బలరాముని ప్రేమకు భంగము కలుగుననే భయముతో బాగులేదు అని గాని చెప్పలేదు.

తతోనిరుద్ధం సహ సూర్యయా వరం
రథం సమారోప్య యయుుః కుశస్థలీమ్ ।
రామాదయో భోజకటాద్దశార్హాుః
సిద్ధాఖిలార్థా మధుసూదనాశ్రయాుః ॥ 40

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకషష్టితమోధ్యాయుః

తతుః= తరువాత, మధుసూదన-ఆశ్రయాుః= శ్రీకృష్ణ భగవానుడు ఆశ్రయముగా గలవారు, సిద్ధ-అఖిల-అర్థాుః= సిద్ధించిన సకలప్రయోజనములు గలవారు, రామ-ఆదయుః= బలరాముడు మొదలైనవారు అగు, దశార్హాుః= యాదవులు, వరమ్= పెళ్లికొడుకు అగు, అనిరుద్ధమ్= అనిరుద్ధుని, సూర్యయా సహ= పెళ్లి కూతురుతో సహా, రథమ్= రథమును, సమారోప్య= ఎక్కించి, భోజకటాత్= భోజకటము నుండి, కుశస్థలీమ్= ద్వారకానగరమును గురించి, యయుుః= వెళ్లిరి.

బలరాముడు, సాంబుడు మొదలుగా గల యాదవులకు శ్రీకృష్ణ భగవానుడే ఆశ్రయము. వారికి సకలప్రయోజనములు సిద్ధించినవి. వారప్పుడు పెళ్లికొడుకు అగు అనిరుద్ధుని పెళ్లి కూతురుతో సహా రథమెక్కించి, భోజకటమునుండి ద్వారకానగరమునకు వెళ్లిరి.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
అనిరుద్ధుని వివాహమును, రుక్మి సంహారమును వర్ణించే
అరువది ఒకటవ అధ్యాయము ముగిసినది (61).

అథ ద్విషష్టితఽమోధ్యాయః

ఉషా-అనిరుద్ధుల సమాగమము

రాజోవాచ ।

బాణస్య తనయాముషా ముపయేమే యదూత్తమః ।
తత్ర యుద్ధమభూద్ఘోరం హరిశంకరయోర్మహత్ ।
ఏతత్సర్వం మహాయోగిన్ సమాఖ్యాతుం త్వమర్హసి ॥ 1

రాజఃⳆ పరీక్షిన్మహారాజు, ఉవాచⳆ పలికెను, మహాయోగిన్Ⳇ ఓ గొప్ప యోగీ!, యదు-ఉత్తమఃⳆ యాదవశ్రేష్ఠ డగు అనిరుద్ధుడు, బాణస్యⳆ బాణాసురుని, తనయామ్Ⳇ కుమార్తెయగు, ఉషామ్Ⳇ ఉషను, ఉపయేమేⳆ వివాహమాడెను, తత్రⳆ ఆ వివాహ-నిమిత్తమునందు, హరిశంకరయోఃⳆ శ్రీకృష్ణ భగవానునకు శంకరునకు, ఘోరమ్Ⳇ భయంకరమైన, మహత్Ⳇ గొప్ప, యుద్ధమ్Ⳇ యుద్ధము, అభూత్Ⳇ ఆయెను, త్వమ్Ⳇ నీవు, ఏతత్Ⳇ ఈ, సర్వమ్Ⳇ అంతనూ, సమాఖ్యాతుమ్Ⳇ వివరించి చెప్పుటకు, అర్హసిⳆ తగుదువు.

పరీక్షిత్తు ఇట్లు పలికెను...మహాయోగివగు శుకమహర్షి! యాదవశ్రేష్ఠ డగు అనిరుద్ధుడు బాణాసురుని కుమార్తెయగు ఉషను వివాహమాడెను. ఆ సందర్భములో శ్రీకృష్ణ భగవానునకు శంకరునితో భయంకరమైన గొప్ప యుద్ధము జరిగెను. ఆ వివరములనన్నింటినీ తమరు చెప్పదగుదురు.

శ్రీశుక ఉవాచ ।

బాణః పుత్రశతజ్యేష్ఠో బలేరాసీన్మహాత్మనః ।
యేన వామనరూపాయ హరయేదాయి మేదినీ ॥ 2

శ్రీశుకఃⳆ శ్రీశుకమహర్షి, ఉవాచⳆ పలికెను, మహాత్మనఃⳆ మహాత్ముడగు, బలేఃⳆ బలియొక్క, పుత్రశత జ్యేష్ఠఃⳆ పుత్రుల వందలో పెద్దవాడు, బాణఃⳆ బాణుడు, ఆసీత్Ⳇ ఉండెను, యేనⳆ ఎవనిచేనైతే,

వామనరూపాయ= వామనరూపుడైన, హరయే= శ్రీహరి కొరకు, మేదినీ= భూమండలము, అదాయి= ఈయబడెనో,

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...మహాత్ముడగు బలి చక్రవర్తి వామనరూపుడైన శ్రీహరికి భూమిని ఇచ్చెను. ఆ బలికి వందమంది కొడుకులు గలరు. వారిలో బాణుడు పెద్దవాడు.

తస్యౌరసస్సుతో బాణశ్శివభక్తిరతస్సదా ।
మాన్యో వదాన్యో ధీమాంశ్చ సత్యసంధో దృఢవ్రతః ॥ 3

తస్య= ఆ బలికి, ఔరసః= ధర్మపత్నియందు జన్మించిన, సుతః= పుత్రుడు, బాణః= బాణుడు, సదా= ఎల్లవేళలా, శివభక్తిరతః= శివభక్తియందు ప్రీతి గలవాడు, మాన్యః= సమ్మానించదగినవాడు, వదాన్యః = దాత, ధీమాన్ చ= బుద్ధిశాలి కూడ, సత్యసంధః= సత్యమునకు కట్టుబడినవాడు, దృఢవ్రతః= గట్టి నియమనిష్ఠలు గలవాడు.

ఆ బలికి ధర్మపత్నియందు జన్మించిన పుత్రుడగు బాణుడు సర్వకాలములలో శివభక్తియందు ప్రీతి గలవాడు, సమ్మానించదగినవాడు, దాత, బుద్ధిశాలి, సత్యమునకు కట్టుబడినవాడు గట్టి నియమనిష్ఠలు గలవాడు.

శోణితాఖ్యే పురే రమ్యే స రాజ్యమకరోత్పురా ।
తస్య శంభోః ప్రసాదేన కింకరా ఇవ తేఽమరాః ।
సహస్రబాహు ర్వాద్యేన తాండవేఽతోషయన్మృడమ్ ॥ 4

సః= ఆతడు, పురా= పూర్వము, శోణిత-ఆఖ్యే= శోణితమని పేరుగల, రమ్యే= అందమైన, పురే= నగరమునందు, రాజ్యమ్= రాజ్యమును, అకరోత్= చేసెను, తస్య= వానికి, శంభోః= శివుని, ప్రసాదేన= అనుగ్రహముచే, తే= ఆ, అమరాః= దేవతలు, కింకరాః ఇవ= సేవకులవలె,

సహస్రబాహుః= వేయి చేతులు గల ఆతడు, వాద్యేన= వాద్యముచే, తాండవే= తాండవమునందు, మృడమ్= శివుని, అతోషయత్= ప్రీతుని చేసెను.

వేయి చేతులు గల ఆ బాణుడు పూర్వము శోణితమనే పేరు గల నగరమునందు రాజ్యమునేలెను. ఆతనికి శివుని అనుగ్రహముచే దేవతలు సేవకుల వలె నుండెడివారు. శివుడు తాండవము చేయుచుండగా, ఆతడు వేయి చేతులతో వాద్యములను వాయించి ఆయనను ప్రీతుని చేసెను.

భగవాన్ సర్వభూతేశశ్శరణ్యో భక్తవత్సలః ।
వరేణ ఛ్ఛందయామాస స తం వవ్రే పురాధిపమ్ ॥ 5

సర్వభూత-ఈశః= సకలప్రాణులకు శాసకుడు, శరణ్యః= శరణు జొచ్చినవారిని పాలించువాడు, భక్తవత్సలః= భక్తులయందు గొప్ప ప్రేమగలవాడు అగు, భగవాన్= శివ భగవానుడు, వరేణ= వరముతో, ఛందయామాస= ప్రోత్సహించెను, సః= ఆతడు, తమ్= ఆ శివుని, పుర-అధిపమ్= నగరాధ్యక్షునిగా, వవ్రే= వరము కోరెను.

సకలప్రాణులను శాసించే శివభగవానుడు శరణు జొచ్చినవారిని పాలించును. భక్తులయందు గొప్ప ప్రేమ గల ఆ దేవుడు బాణుని వరమును కోరుకొమ్మని ప్రోత్సహించగా, ఆతడు ఆయనను తన నగరమునకు రక్షకుడవు కమ్మని కోరెను.

స ఏకదాహ గిరిశం పార్శ్వస్థం వీర్యదుర్మదః ।
కిరీటే నార్కవర్ణేన సంస్పృశంస్తత్పదాంబుజమ్ ॥ 6

ఏకదా= ఒకనాడు, వీర్యదుర్మదః= పరాక్రమముచే మిక్కిలి గర్వించిన, సః= ఆతడు, అర్కవర్ణేన= సూర్యుని వలె ప్రకాశించే, కిరీటేన= కిరీటముతో, తత్-పద-అంబుజమ్= ఆయనయొక్క పద్మమువంటి పాదమును, సంస్పృశన్= స్పృశించువాడై, పార్శ్వస్థమ్= ప్రక్కనే ఉన్న, గిరిశమ్= కైలాసవాసియగు శివుని ఉద్దేశించి, ఆహ= పలికెను.

పరాక్రమముచే మిక్కిలి గర్వించియున్న ఆ బాణుడు ఒకనాడు సూర్యుని వలె ప్రకాశించే కిరీటముతో పద్మములవంటి శివుని పాదములను స్పృశించి ప్రణమిల్లెను. అపుడాతడు తన ప్రక్కనే ఉన్న శివునితో నిట్లనెను.

నమస్యే త్వాం మహాదేవ లోకానాం గురుమీశ్వరమ్ ।
పుంసామపూర్ణకామానాం కామపూరామరాంఘ్రిపమ్ ॥ 7

మహాదేవ= ఓ మహాదేవా!, లోకానామ్= లోకములకు, గురుమ్= తండ్రివైనట్టియు, ఈశ్వరమ్= శాసకుడవైనట్టియు, అపూర్ణకామానామ్= తీరని కామనలు గల, పుంసామ్= వ్యక్తులకు, కామపూర-అమర-అంఘ్రిపమ్= కోరికలను దీర్చే కల్పవృక్షమైన, త్వామ్= నిన్ను నమస్యే= నమస్కరించుచున్నాను.

ఓ మహాదేవా! నీవు లోకములకు తండ్రివి, శాసకుడవు. కోరికలు తీరని వ్యక్తులకు నీవు కోరికలను తీర్చే కల్పవృక్షమవు. నీకు నమస్కారము.

దోస్సహస్రం త్వయా దత్తం పరం భారాయ మేఽభవత్ ।
త్రిలోక్యాం ప్రతియోద్ధారం న లభే త్వదృతే సమమ్ ॥ 8

త్వయా= నీవే, మే= నా కొరకు, దత్తమ్= ఈయబడిన, దోః-సహస్రమ్= చేతుల వేయి, పరమ్= కేవలము, భారాయ= బరువు కొరకు, అభవత్= ఆయెను, త్రిలోక్యామ్= ముల్లోకములయందు, త్వత్ ఋతే= నిన్ను మినహాయించి, సమమ్= సముడైన, ప్రతియోద్ధారమ్= యుద్ధవీరుని, న లభే= పొందకున్నాను.

నీవు నాకిచ్చిన వేయి చేతులు కేవలము బరువు మాత్రమే ఆయెను. ముల్లోకములలో నిన్ను మినహాయిస్తే, నాతో సమానుడైన యుద్ధవీరుడు నాకు దొరకుట లేదు.

కండూత్యా నిభృతై ర్దోర్భి ర్యుయుత్సు ర్దిగ్గజానహమ్ ।
ఆద్యాయాం చూర్ణయన్నద్రీన్ భీతాస్తేఽపి ప్రదుద్రువుః ॥ 9

ఆద్య= ఓ జగత్కారణా!, కండూత్యా= దురదతో, నిభృతైః= నిండిన, దోర్భిః= చేతులతో, యుయుత్సుః= యుద్ధం చేయగోరుచున్న, అహమ్= నేను, అద్రీన్= పర్వతములను, చూర్ణయన్= పిండి చేయుచున్నవాడనై, దిగ్-గజాన్= దిగ్గజములను గురించి, అయామ్= వెళ్లితిని, తే అపి= అవి కూడా, భీతాః= భయపడినవై, దుద్రువుః= పారిపోయినవి.

జగత్కారణుడవగు ఓ శివా! దురదతో నిండిపోయిన చేతులతో నేను యుద్ధమును చేయగోరి కొండలను పిండి చేస్తూ దిగ్గజముల వద్దకు వెళ్లితిని. అవి కూడా భయపడి పారిపోయినవి.

తచ్ఛ్రుత్వా భగవాన్ క్రుద్ధః కేతుస్తే భజ్యతే యదా ।
త్వద్దర్పఘ్నం భవేన్మూఢ సంయుగం మత్సమేన తే ॥ 10

తత్= ఆ మాటను, శ్రుత్వా= విని, క్రుద్ధః= కోపించిన, భగవాన్= శివభగవానుడు, మూఢ= ఓరీ మూర్ఖా!, యదా= ఎప్పుడైతే, తే= నీ, కేతుః= జెండా, భజ్యతే= విరుగునో అప్పుడు, తే= నీకు, మత్-సమేన= నాతో సమానమైనవానితో, త్వద్-దర్పఘ్నమ్= నీ పొగరును అడంచే, సంయుగమ్= యుద్ధము, భవేత్= అగును.

ఆ మాటను విని శివభగవానుడు కోపించి యిట్లనెను - ఓరీ మూర్ఖా! ఏనాడైతే నీ జెండా విరిగిపడునో, ఆనాడు నాతో సమానమైన వానితో నీకు యుద్ధము జరుగును. దానితో నీ పొగరు అణిగిపోవును.

ఇత్యుక్తః కుమతిర్హృష్ట స్స్వగృహం ప్రావిశన్నృప ।
ప్రతీక్షన్ గిరిశాదేశం స్వవీర్యనాశనం కుధీః ॥ 11

నృప= ఓ రాజా!, కుమతిః= దుర్బుద్ధియగు బాణుడు, ఇతి= ఈ విధముగా, ఉక్తః= పలుకబడినవాడై, హృష్టః= హర్షించినవాడు, స్వగృహమ్= తన యింటిని, ప్రావిశత్= ప్రవేశించెను, కుధీః= దుర్బుద్ధియగు బాణుడు,

స్వవీర్యనాశనమ్= తన పరాక్రమమును నశింపజేసే, గిరిశ-ఆదేశమ్= కైలాసవాసియగు శివుని ఆదేశమును, ప్రతీక్షన్= ఎదురుచూచువాడు.

ఓ పరీక్షిన్మహారాజా! కైలాసవాసియగు శివుడిట్లు ఆదేశించగా, దుర్బుద్ధియగు బాణుడు హర్షముతో తన ఇంటికి వెళ్లి, తన పరాక్రమమును నశింపజేసే శివుని ఆదేశము (జెండా పడుట) కొరకు ప్రతీక్షించుచుండెను.

తస్యోషా నామ దుహితా స్వప్నే ప్రాద్యుమ్నినా రతిమ్ ।
కన్యాలభత కాంతేన ప్రాగదృష్టశ్రుతేన సా ॥ 12

తస్య= వానికి, ఉషా నామ= ఉష అని ప్రసిద్ధి జెందిన, దుహితా= కుమార్తె, సా= ఆ, కన్య, స్వప్నే= కలయందు, ప్రాక్= పూర్వము, అదృష్ట-శ్రుతేన= కనబడని వినబడని, కాంతేన= అందగాడైన, ప్రాద్యుమ్నినా= ప్రద్యుమ్నుని పుత్రుడగు అనిరుద్ధునితో, రతిమ్= ప్రేమను, అలభత= పొందెను.

వానికి ఉష అని ప్రసిద్ధి జెందిన కుమార్తె గలదు. ఆ కన్య కలలో పూర్వమెప్పుడూ వినని కనని అందగానితో ప్రేమలో పడెను. ఆ అందగాడు ప్రద్యుమ్నుని పుత్రుడగు అనిరుద్ధుడు.

సా తత్ర తమపశ్యంతీ క్వాసి కాంతేతి వాదినీ ।
సఖీనాం మధ్య ఉత్తస్థౌ విహ్వలా వ్రీడితా భృశమ్ ॥ 13

సా= ఆమె, తత్ర= ఆ స్వప్నమునందు, తమ్= వానిని, అపశ్యంతీ= కానరానిదై, కాంత= ఓ ప్రియుడా!, క్వ= ఎక్కడ, అసి= ఉన్నావు?, ఇతి= అని, వాదినీ= పలుకుచున్నదై, సఖీనామ్= చెలికత్తెల, మధ్యే= మధ్యయందు, ఉత్తస్థౌ= లేచి నిలబడెను, విహ్వలా= కంగారు పడినది, భృశమ్= మిక్కిలి, వ్రీడితా= సిగ్గుపడినది.

ఆమెకు ఆ స్వప్నములోనే ఆ ప్రియుడు కనబడలేదు. ఓ ప్రియుడా! ఎక్కడున్నావు? అని పలవరిస్తూ ఆమె సఖుల మధ్యలో నిద్రలేచి నిలబడెను. అప్పుడామె కంగారునకు, అధికమగు సిగ్గునకు వశమయ్యెను.

బాణస్య మంత్రీ కుంభాండ శ్చిత్రలేఖా చ తత్సుతా ।
సఖ్యపృచ్ఛత్సఖీముషాం కౌతూహలసమన్వితా ॥ 14

బాణస్య= బాణుని, మంత్రీ= మంత్రి, కుంభాండః= కుంభాండుడు, తత్-సుతా చ= ఆయన కుమార్తె, చిత్రలేఖా= చిత్రలేఖ, సఖీ= చెలికత్తె, కౌతూహలసమన్వితా= కుతూహలముతో కూడినది, సఖీమ్= మిత్రురాలైన, ఉషామ్= ఉషను, అపృచ్ఛత్= అడిగెను.

బాణుని మంత్రియైన కుంభాండుని కుమార్తె చిత్రలేఖ ఉషకు చెలికత్తె. ఆమె కుతూహలముతో కూడినదై మిత్రురాలైన ఉషను ప్రశ్నించెను.

కం త్వం మృగయసే సుభ్రూః కీదృశస్తే మనోరథః ।
హస్తగ్రాహం న తేద్యాపి రాజపుత్ర్యుపలక్షయే ॥ 15

సుభ్రూః= అందమైన కనుబొమలు గలదానా!, త్వమ్= నీవు, కమ్= ఎవనిని, మృగయసే= వెదుకుచున్నావు?, తే= నీయొక్క, మనోరథః= అభిలాష, కీదృశః= ఎట్టిది?, రాజపుత్రి= ఓ రాజకుమారీ!, తే= నీకు, అద్య అపి= ఈనాటికీ, హస్తగ్రాహమ్= పాణిగ్రహణము చేసే భర్త (వివాహము)ను, న ఉపలక్షయే= కానరాను.

అందమైన కనుబొమలు గల రాజకుమారీ! (కలలో) నీవెవరిని వెదుకుచున్నావు? నీ అభిలాష యెట్టిది? ఈనాటి వరకు నీకు వివాహము కాలేదు, పాణిగ్రహణము చేసిన భర్త లేడు.

ఉషోవాచ ।

దృష్టః కశ్చిన్నర స్స్వప్నే శ్యామః కమలలోచనః ।
పీతవాసా బృహద్బాహు ర్యోషితాం హృదయంగమః ॥ 16

ఉషః= ఉష, ఉవాచ= పలికెను, కశ్చిత్= ఒకానొక, నరః= మానవుడు, శ్యామః= నల్లనివాడు, కమలలోచనః= కలువలవంటి కన్నులు గలవాడు, పీతవాసాః= పచ్చని వస్త్రము గలవాడు, బృహద్-బాహుః= పెద్ద చేతులు గలవాడు, యోషితామ్= యువతులకు, హృదయంగమః= హృదయమును దోచువాడు, స్వప్నే= కలయందు, దృష్టః= కనబడినాడు.

ఉష ఇట్లు పలికెను - నల్లనివాడు, కలువ కన్నులవాడు, పచ్చని వస్త్రమువాడు, పొడవాటి చేతులవాడు, అతివల హృదయమును దోచే ఒకానొక మానవుడు కలలో కనబడినాడు.

తమహం మృగయే కాంతం పాయయిత్వాధరం మధు ।
క్వాపి యాతస్స్పృహయతీం క్షిప్త్వా ఘాం వృజినార్ణవే ॥ 17

తమ్= ఆ, కాంతమ్= ప్రియుని, అహమ్= నేను, మృగయే= వెదుకుచున్నాను, మధు= మధురమైన, అధరమ్= అధరమును, పాయయిత్వా= అందజేసి, స్పృహయతీమ్= ప్రేమించుచున్న, మామ్= నన్ను, వృజిన-అర్ణవే= దుఃఖసముద్రమునందు, క్షిప్త్వా= పారవైచి, క్వ అపి= ఎక్కడికో, యాతః= వెళ్లినవాడు.

నేనా ప్రియుని వెదుకుచున్నాను. నాకు మధురమైన అధరము నందించి, ప్రేమించుచున్న నన్ను దుఃఖసముద్రములో పారవైచి అతడెక్కడికో వెళ్లినాడు.

చిత్రలేఖోవాచ ।

వ్యసనం తేపకర్షామి త్రిలోక్యాం యది భావ్యతే ।
తమానేష్యే నరం యస్తే మనోహర్తా తమాదిశ ॥ 18

చిత్రలేఖ= చిత్రలేఖ, ఉవాచ= పలికెను, తే= నీ, వ్యసనమ్= దుఃఖమును, అపకర్షామి= తొలగించెదను, త్రిలోక్యామ్= ముల్లోకముల యందు, యది భావ్యతే= ఉండబడినచో, తమ్= ఆ, నరమ్= మానవుని,

ఆనేష్యే= తీసుకురాగలను, యః= ఎవడైతే, తే= నీ, మనః-హర్తా= మనస్సును దోచినవాడో, తమ్= వానిని గురించి, ఆదిశ= చెప్పుము.

చిత్రలేఖ ఇట్లు పలికెను...నీ దుఃఖమును పోగొట్టెదను. నీ మనస్సును దోచిన ఆ మానవుడు ముల్లోకములలో ఉన్నట్లైతే, ఆతనిని తీసకువచ్చెదను. వాని గురించి చెప్పుము (వానిని గుర్తించుము).

ఇత్యుక్త్వా దేవగంధర్వసిద్ధచారణపన్నగాన్ ।
దైత్యవిద్యాధరాన్ యక్షాన్ మనుజాంశ్చ యథాలిఖత్ ॥ 19

ఇతి= అని, ఉక్త్వా= పలికి, దేవగంధర్వసిద్ధచారణపన్నగాన్= దేవతలను గంధర్వులను సిద్ధులను చారణులను నాగులను, దైత్యవిద్యా-ధరాన్= రాక్షసులను విద్యాధరులను, యక్షాన్= యక్షులను, మనుజాన్ చ= మానవులను కూడ, యథా= ఉన్నవారిని ఉన్నట్లుగా, అలిఖత్= చిత్రించెను.

ఇట్లు పలికి ఆమె దేవతలను, గంధర్వులను, సిద్ధులను, చారణులను, నాగులను, రాక్షసులను, విద్యాధరులను, యక్షులను, మానవులను కూడ ఉన్నవారిని ఉన్నట్లుగా బొమ్మలను గీసెను.

మనుజేషు చ సా వృష్ణీన్ శూరమానకదుందుభిమ్ ।
వ్యలిఖద్రామకృష్ణౌ చ ప్రద్యుమ్నం వీక్ష్య లజ్జితా ॥ 20

మనుజేషు చ= మనుష్యులయందు కూడ, సా= ఆమె, వృష్ణీన్= యాదవులను, శూరమ్= శూరుని, ఆనకదుందుభిమ్= వసుదేవుని, రామకృష్ణౌ= బలరామ శ్రీకృష్ణులను, ప్రద్యుమ్నం చ= ప్రద్యుమ్నుని కూడ, వ్యలిఖత్= చిత్రించెను, వీక్ష్య= చూచి, లజ్జితా= సిగ్గుపడినది.

మానవులలో కూడ యాదవులను, వారిలో శూరుని, వసుదేవుని, బలరాముని, శ్రీకృష్ణుని, ప్రద్యుమ్నుని కూడ చిత్రించెను. ఉష ప్రద్యుమ్నుని చూచి (పోలికచే ప్రియుని తండ్రియని) సిగ్గుపడెను.

అనిరుద్ధం విలిఖితం వీక్ష్యోషావాఙ్ముఖీ హ్రియా ।
సోఽసావసావితి ప్రాహ స్మయమానా మహీపతే ॥ 21

మహీపతే= ఓ మహారాజా! విలిఖితమ్= చిత్రించబడిన, అనిరుద్ధమ్= అనిరుద్ధుని, వీక్ష్య= చూచి, హ్రియా= సిగ్గుతో, అవాఙ్-ముఖీ= దించబడిన ముఖము గల, ఉషా= ఉష, సః= ఆతడు, అసౌ= ఈతడు, అసః= ఈతడు, ఇతి= అని, స్మయమానా= చిరునవ్వు నవ్వుచున్నదై, ప్రాహ= పలికెను.

ఓ పరీక్షిన్మహారాజా! అనిరుద్ధుని చిత్రపటమును చూచి ఉష సిగ్గుతో తలవంచి చిరునవ్వుతో, (కలలోని) ఆతడు ఈతడే, ఈతడే, అని పలికెను.

చిత్రలేఖా తమాజ్ఞాయ పాత్రం కృష్ణస్య యోగినీ ।
యయౌ విహాయసా రాజన్ ద్వారకాం కృష్ణపాలితామ్ ॥ 22

రాజన్= ఓ రాజా!, యోగినీ= మహిమలు తెలిసిన, చిత్రలేఖా= చిత్రలేఖ, తమ్= వానిని, కృష్ణస్య= శ్రీకృష్ణుని, పౌత్రమ్= మనుషునిగా, ఆజ్ఞాయ= గుర్తెరిగి, విహాయసా= ఆకాశముచే, కృష్ణపాలితామ్= శ్రీకృష్ణునిచే రక్షించబడిన, ద్వారకామ్= ద్వారకానగరమును గురించి, యయౌ= వెళ్లెను.

ఓ పరీక్షిన్మహారాజా! చిత్రలేఖకు మహిమలు తెలియును. ఆతడు శ్రీకృష్ణుని కొడుకు కొడుకని ఆమె గుర్తించి, ఆకాశమార్గమున శ్రీకృష్ణునిచే రక్షించబడే ద్వారకకు వెళ్లెను.

తత్ర సుప్తం సుపర్యంకే ప్రాద్యుమ్నిం యోగమాస్థితా ।
గృహీత్వా శోణితపురం సఖ్యై ప్రియమదర్శయత్ ॥ 23

తత్ర= అచట, సుపర్యంకే= మంచి మంచముపై, సుప్తమ్= నిద్రించిన, ప్రాద్యుమ్నిమ్= ప్రద్యుమ్నుని పుత్రుడగు అనిరుద్ధుని, యోగమ్= యోగ మహిమను, ఆస్థితా= ఆశ్రయించినదై, శోణితపురమ్= శోణిత

పురమును గురించి, గృహీత్వా= తీసుకువెళ్లి, సఖ్యే= మిత్రురాలగు ఉష కొరకు, ప్రియమ్= ప్రియుని, అదర్శయత్= చూపించెను.

ఆమె మాయాశక్తినాశ్రయించి, ఆ ద్వారకలో మంచి మంచముపై నిద్రించుచున్న ప్రద్యుమ్నపుత్రుడగు అనిరుద్ధుని శోణితపురమునకు తీసుకువెళ్లి, మిత్రురాలగు ఉషకు ఆమె ప్రేమించినవానిని చూపించెను.

సా చ తం సుందరవరం విలోక్య ముదితాననా ।
దుష్ప్రేక్ష్యే స్వగృహే పుంభీ రేమే ప్రాద్యుమ్నినా సమమ్ ॥ 24

సా చ= ఆ ఉష కూడ, సుందరవరమ్= అందగాళ్లలో అందగాడగు, తమ్= ఆ అనిరుద్ధుని, విలోక్య= చూచి, ముదిత–ఆసనా= ఆనందముతో నిండిన ముఖము గలదై, పుంభిః= మగవాళ్లచే, దుష్ప్రేక్ష్యే= చూడ శక్యము కాని, స్వగృహే= తన ఇంటియందు, ప్రాద్యుమ్నినా సమమ్= ప్రద్యుమ్నుని పుత్రుడగు అనిరుద్ధునితో గూడి, రేమే= రమించెను.

అందగాళ్లలో అందగాడగు ఆ ప్రద్యుమ్నపుత్రుని చూచి ఉష ముఖము ఆనందముతో నిండెను. ఆమె అంతఃపురము మగవాళ్లకు చూడ శక్యము కానిది. ఆమె దానిలో ఆ అనిరుద్ధునితో గూడి రమించెను.

పరార్ధ్యవాస స్రగ్గంధధూపదీపాసనాదిభిః ।
పానభోజనభక్ష్యైశ్చ వాక్యైశ్శుశ్రూషయార్చితః ॥ 25

పర–అర్ధ్యవాసః–స్రగ్–గంధధూపదీప–ఆసన–ఆదిభిః= మిక్కిలి విలువైన వస్త్రములు పుష్పములు ధూపము దీపము ఆసనము మొదలగువాటితో, పానభోజనభక్ష్యైః= పానీయములతో నమిలి తినదగిన మ్రింగదగిన ఆహారపదార్థములతో, వాక్యైః= కబుర్లతో, శుశ్రూషయా చ= సేవతో కూడ, అర్చితః= పూజించబడినవాడు.

ఆమె అనిరుద్ధునకు మిక్కిలి విలువైన వస్త్రములు, పుష్పమాలలు, ధూపము, దీపము, ఆసనము, తాంబూలము మొదలగువాటిని

సమర్పించెను. ఆతనికి పానీయములను, నమిలి తినదగిన మరియు మ్రింగదగిన ఆహారములను సమకూర్చెను. ఆమె ఆతనితో కబుర్లాడి సేవను చేసి ఆరాధించెను.

గూఢః కన్యాపురే శశ్వత్ప్రవృద్ధస్నేహయా తయా ।
నాహర్గణాన్ స బుబుధే ఉషయాపహృతేంద్రియః ॥ 26

కన్యాపురే= అంతఃపురమునందు, గూఢః= రహస్యముగానున్నవాడు, శశ్వత్= నిత్యము, ప్రవృద్ధస్నేహయా= వర్ధిల్లిన ప్రేమగల, తయా= ఆ, ఉషయా= ఉషచే, అపహృత-ఇంద్రియః= దోచివేయబడిన మనస్సు గలవాడు అగు, సః= ఆ అనిరుద్ధుడు, అహఃగణాన్= రోజుల సమూహములను, న బుబుధే= గుర్తించలేదు.

ఆ అనిరుద్ధుడు అంతఃపురములో రహస్యముగా ఉండెను. నిత్యము వర్ధిల్లుచున్న ప్రేమ గల ఉష ఆతని మనస్సును దోచివేసెను. ఆతనికి చాల దినములు గడిచిన విషయమే తెలియలేదు.

తాం తథా యదువీరేణ భుజ్యమానాం హతవ్రతామ్ ।
హేతుభి ర్లక్షయాంచక్రు రాప్రీతాం దురవచ్ఛదైః ॥ 27

తథా= ఆ విధముగా, యదువీరేణ= యాదవవీరుడగు అనిరుద్ధునితో గూడి, భుజ్యమానామ్= రమించబడుచున్నట్టియు, ఆప్రీతామ్= మిక్కిలి హర్షముతోనున్న, తామ్= ఆమెను, హతవ్రతామ్= కోల్పోబడిన కన్యాత్వము గలదానినిగా, దురవచ్ఛదైః= దాచ శక్యము కాని, హేతుభిః= గుర్తులచే లక్షయాంచక్రుః= గుర్తుపట్టిరి.

ఆ విధముగా ఆమె యాదవవీరుడగు అనిరుద్ధునితో కలిసి రమిస్తూ మహానందముతో నుండెను. ఆమె కన్యాత్వమును కోల్పోయినదని దాచశక్యము కాని గుర్తులను బట్టి అంతఃపురభటులు గుర్తించిరి.

భటా ఆవేదయాంచక్రూ రాజంస్తే దుహితుర్వయమ్ ।
విచేష్టితం లక్షయామః కన్యాయాః కులదూషణమ్ ॥ 28

భటాఃⁿ భటులు, ఆవేదయాంచక్రుఃⁿ విన్నవించిరి, రాజన్ⁿ ఓ రాజా! కన్యాయాఃⁿ కన్యగు, తేⁿ నీ, దుహితుఃⁿ కుమార్తెయొక్క, కులదూషణమ్ⁿ కులమును చెడగొట్టే, విచేష్టితమ్ⁿ ప్రవృత్తిని, వయమ్ⁿ మేము, లక్షయామఃⁿ కనుచున్నాము.

రాజభటులు బాణాసురునితో ఇట్లు విన్నవించిరి – ఓ రాజా! కన్యయగు నీ కుమార్తె ప్రవృత్తి కులమును చెడగొట్టుచున్నదని మేము గుర్తించినాము.

అనపాయిభి రస్మాభి ర్గుప్తాయాశ్చ గృహే ప్రభో ।
కన్యాయా దూషణం పుంభి ర్దుష్ప్రేక్ష్యాయా న విద్మహే ॥ 29

ప్రభోⁿ ప్రభూ!, అనపాయిభిఃⁿ తొలగిపోని, అస్మాభిఃⁿ మాచే, గృహేⁿ అంతఃపురమునందు, గుప్తాయాఃⁿ రక్షించబడినట్టియు, పుంభిఃⁿ మగవాళ్లచే, దుష్ప్రేక్ష్యాయాఃⁿ చూడ శక్యము కాని, కన్యాయాఃⁿ కన్యయొక్క, దూషణమ్ⁿ చెడగొట్టుటను, న విద్మహేⁿ తెలియకున్నాము.

ఓ ప్రభూ! మేము క్షణము కూడా తొలగిపోకుండా జాగ్రత్తగా అంతఃపురమును కాపాడితిమి. మగవాళ్లకు చూడ శక్యము కాని అంతఃపురములో కన్యను మగవాడు చెడగొట్టిన తీరు మాకు తెలియకున్నది.

తతః ప్రవ్యథితో బాణో దుహితుశ్శ్రుతదూషణః ।
త్వరితః కన్యకాగారం ప్రాప్తోద్రాక్షీద్యదూద్వహమ్ ॥ 30

తతఃⁿ తరువాత, దుహితుఃⁿ కుమార్తెయొక్క, శ్రుతదూషణఃⁿ వినబడిన చెడిపోవుట గలవాడు, ప్రవ్యథితఃⁿ చాల దుఃఖమును

పొందినవాడు అగు, బాణుఁ= బాణుడు, త్వరితుఁ= వేగము గలవాడై, కన్యకా-ఆగారమ్= కన్యయొక్క అంతఃపురమును, ప్రాప్తుఁ= చేరినవాడై, యదు-ఉద్వహమ్= యాదవశ్రేష్ఠుడగు అనిరుద్ధుని, అద్రాక్షీత్= చూచెను.

అప్పుడు కుమార్తె చెడిపోయినదనే వార్త విని చాల దుఃఖమును పొందిన బాణుడు వేగముగా కన్యకయొక్క అంతఃపురమునకు వెళ్లెను. అచట ఆయనకు యాదవశ్రేష్ఠుడగు అనిరుద్ధుడు కనబడెను.

కామాత్మజం తం భువనైకసుందరం
శ్యామం పిశంగాంబరమంబుజేక్షణమ్ ।
బృహద్భుజం కుండలకుంతలత్విషా
స్మితావలోకేన చ మండితాననమ్ ॥ 31

కామ-ఆత్మజమ్= మన్మథుని పుత్రుడైనట్టియు, భువన-ఏకసుందరమ్= భువనములలో ఒకే అందగాడైనట్టియు, శ్యామమ్= నల్లనివాడైనట్టియు, పిశంగ-అంబరమ్= పచ్చని వస్త్రము కలిగినట్టియు, అంబుజ-ఈక్షణమ్= పద్మములవంటి కన్నులు కలిగినట్టియు, బృహద్-భుజమ్= పెద్ద చేతులు కలిగినట్టియు, కుండలకుంతలత్విషా= కుండలముల ముంగురుల కాంతితో, స్మిత-అవలోకేన చ= చిరునవ్వుతో కూడిన చూపుతో కూడ, మండిత-ఆననమ్= అలంకృతమైన ముఖముగల (అనిరుద్ధుని చూచెను).

మన్మథుని పుత్రుడైన ఆ అనిరుద్ధునితో సమానమైన అందగాడు ముల్లోకములలో లేడు. నల్లని ఆతడు పచ్చని వస్త్రమును దాల్చెను. పద్మములవంటి కన్నులు, పొడవాటి చేతులు గల ఆతని ముఖమునకు కుండలములు, ముంగురులు, చిరునవ్వుతో కూడిన చూపులే అలంకారములాయెను.

దీవ్యంతమక్షైః ప్రియయాఽభినృమ్ణయా
తదంగసంగస్తనకుంకుమస్రజమ్ ।
బాహ్వోర్ధధానం మధుమల్లికాఽఽశ్రితాం
తస్యాగ్ర ఆసీనమవేక్ష్య విస్మితః ॥ 32

అభినృమ్ణయా= అంతటా రమ్యముగానున్న, ప్రియయా= ప్రియురాలితో, అక్షైః= పాచికలతో, దీవ్యంతమ్= ఆడుచున్నట్టియు, మధుమల్లికా–ఆశ్రితామ్= వసంతకాలమునందలి మల్లెలచే గ్రుచ్చబడిన, తద్–అంగసంగస్తనకుంకుమస్రజమ్= ఆమెయొక్క దేహముతోడి సంగముచే స్తనములయందలి కుంకుమ గల మాలను, బాహ్వోః= చేతులయందు, దధానమ్= ధరించినట్టియు, తస్యాః= ఆమెయొక్క, అగ్రే= ఎదుట, ఆసీనమ్= కూర్చున్న అనిరుద్ధుని, అవేక్ష్య= చూచి, విస్మితః= ఆశ్చర్యపడిన వాడు.

అనిరుద్ధుడు సర్వాంగసుందరియగు ప్రియురాలి యెదుట కూర్చుండి ఆమెతో పాచికలాడుచుండెను. ఆతడు ఆమె దేహముతోడి సంగముచే స్తనములయందలి కుంకుమ గల మాలను వక్షఃస్థలముపై దాల్చెను. ఆ మాల వసంతకాలమునందలి మల్లెలతో గ్రుచ్చినది. ఆతనిని చూచి బాణుడు ఆశ్చర్యమును పొందెను.

స తం ప్రవిష్టం వృతమాతతాయిభిః
భటైరనీకైరవలోక్య మాధవః ।
ఉద్యమ్య మౌర్వం పరిఘం వ్యవస్థితో
యథాఽంతకో దండధరో జిఘాంసయా ॥ 33

మాధవః= మధువంశీయుడగు, సః= ఆ అనిరుద్ధుడు, ప్రవిష్టమ్= ప్రవేశించినట్టియు, ఆతతాయిభిః= పైకెత్తబడిన ఆయుధములు గల, అనేకైః = అనేకులగు, భటైః= భటులచే, వృతమ్= చుట్టువారబడిన, తమ్= ఆ

బాణుని, అవలోక్య= చూచి, మౌర్వమ్= లోహమిశ్రమముతో చేసిన, పరిఘమ్= గుదియను, ఉద్యమ్య= పైకెత్తి, జిఘాంసయా= సంహరించే కోరికతో, దండధరః= దండమును ధరించిన, అంతకః యథా= యముడు వలె, వ్యవస్థితః= నిలిచి యున్నవాడు.

ఆయుధములను పైకెత్తి పట్టుకున్న అనేకభటులు చుట్టువారి రాగా ప్రవేశించిన బాణుని చూచి, మధువంశీయుడగు ఆ అనిరుద్ధుడు లోహమిశ్రమపు గుదియను పైకెత్తి నిలబడెను. ఆయన సంహరించుటకై కాలదండమును ధరించిన యముని పోలియుండెను.

జిఘృక్షయా తాన్ పరితః ప్రసర్పతః
శునో యథా సూకరయూథపోఽహనత్ ।
తే హన్యమానా భవనాద్వినిర్గతా
నిర్భిన్నమూర్ధోరుభుజాః ప్రదుద్రువుః ॥ 34

జిఘృక్షయా= పట్టుకొన గోరికతో, పరితః= చుట్టూ, ప్రసర్పతః= మీదకు వచ్చుచున్న, తాన్= ఆ భటులను, సూకరయూథపః= గుంపుకు నాయకుడైన వరాహము, శునః యథా= కుక్కలను వలె, అహనత్= కొట్టెను, హన్యమానాః= కొట్టబడుచున్న, తే= వారు, నిర్భిన్నమూర్ధ-ఊరుభుజాః= పగులగొట్టబడిన తలలు తొడలు చేతులు గలవారై, భవనాత్= భవనమునుండి, వినిర్గతాః= బయటకు వచ్చినవారై, ప్రదుద్రువుః= పారిపోయిరి.

అనిరుద్ధుని పట్టుకొనగోరి ఆ రాజభటులు చుట్టుముట్టిరి. అపుడాతడు, గుంపుకు నాయకత్వము వహించే వరాహము కుక్కలను వలె, వారిని గుదియతో మోదెను. తలలు పగిలి తొడలు, చేతులు విరుగుచుండ వారు భవనమునుండి బయటకు వచ్చి పలాయనము చిత్తగించిరి.

తం నాగపాశైర్బలినందనో బలీ
ఘ్నంతం స్వసైన్యం కుపితో బబంధ హ ।
ఊషా భృశం శోకవిషాదవిహ్వలా
బద్ధం నిశమ్యాశ్రుకలాక్ష్యరౌదిషీత్ ॥ 35

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ద్విషష్టితమోఽధ్యాయః

బలీ= బలశాలి, బలినందనః= బలిచక్రవర్తియొక్క పుత్రుడు అగు బాణుడు, కుపితః= కోపించివాడై, స్వసైన్యమ్= తన సైన్యమును, ఘ్నంతమ్= సంహరించుచున్న, తమ్= ఆ అనిరుద్ధుని, నాగపాశైః= నాగపాశములతో, బబంధ హ= కట్టివేసెను, బద్ధమ్= బంధించబడిన అనిరుద్ధుని గురించి, నిశమ్య= విని, ఊషా= ఉష, భృశమ్= మిక్కిలి, శోకవిషాదవిహ్వలా= మానసిక దుఃఖముతో శరీరమునందలి నీరసముతో వ్యాకులపడినదై, అశ్రుకలా–అక్షీ= నీటి బిందువులు గల కళ్లు గలదై, అరౌదిషీత్= విలపించెను.

బలిచక్రవర్తియొక్క పుత్రుడగు బాణుడు బలశాలి. ఆతడు తన సైన్యమును సంహరించుచున్న అనిరుద్ధుని నాగపాశముతో కట్టివేసెను. తన ప్రియుడు బంధించబడినాడని విని ఉష మానసిక దుఃఖముతో, శరీరమునందలి నీరసముతో వ్యాకులపడెను. ఆమె కళ్లనిండా నీళ్లు పెట్టుకొని విలపించెను.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
ఉష–అనిరుద్ధుల సమాగమమును వర్ణించే
అరువది రెండవ అధ్యాయము ముగిసినది (62).

* * *

అథ త్రిషష్టితమోఽధ్యాయః

శ్రీకృష్ణుడు బాణాసురునితో యుద్ధము చేయుట

శ్రీశుక ఉవాచ ।

అవశ్యతాం చానిరుద్ధం తద్బంధూనాం చ భారత ।
చత్వారో వార్షికా మాసా వ్యతీయురనుశోచతామ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భారత= ఓ భరత–వంశీయుడా!, అనిరుద్ధం చ= అనిరుద్ధునైతే, అపశ్యతామ్= కానరానట్టియు, అనుశోచతామ్= దుఃఖించుచున్న, తద్–బంధూనామ్= ఆతని బంధువులకు, వార్షికాః= వర్షాకాలమునకు చెందిన, చత్వారః= నాలుగు, మాసాః= నెలలు, వ్యతీయుః= గడచినవి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! అనిరుద్ధుని బంధువులకు ఆతడు కనబడక దుఃఖిస్తూ ఉండగానే వర్షాకాలపు నాలుగు నెలలు గడిచిపోయినవి.

నారదాత్తదుపాకర్ణ్య వార్తాం బద్ధస్య కర్మ చ ।
ప్రయయు శ్శోణితపురం వృష్ణయః కృష్ణదేవతాః ॥ 2

కృష్ణదేవతాః= శ్రీకృష్ణుడే దైవముగా గల, వృష్ణయః= యాదవులు, బద్ధస్య= బంధించబడిన అనిరుద్ధునియొక్క, వార్తామ్= వార్తను, తత్= ఆ, కర్మ చ= చేసిన పనిని కూడ, నారదాత్= నారదుని వలన, ఉపాకర్ణ్య= విని, శోణితపురమ్= శోణితపురమును గురించి, ప్రయయుః= వెళ్లిరి.

యాదవులకు శ్రీకృష్ణుడే దైవము. అనిరుద్ధుడు బంధించబడుట, ఆతడు చేసిన ఆ యుద్ధము అనువాటిని గురించి నారదుడు చెప్పగా విని, వారు శోణితపురమునకు వెళ్లిరి.

ప్రద్యుమ్నో యుయుధానశ్చ గదాస్సాంబోఽథ సారణః ।
నందోపనందభద్రాద్యా రామకృష్ణానువర్తినః ॥ 3

ప్రద్యుమ్నుఁ= ప్రద్యుమ్నుడు, యుయుధానుఁ చ= యుయుధానుడు, గదుఁ= గదుడు, సాంబుఁ= సాంబుడు, అథ= మరియు, సారణుఁ= సారణుడు, రామకృష్ణ-అనువర్తినుఁ= బలరామ శ్రీకృష్ణుల అనుమాయులైన, నంద-ఉపనందభద్ర-ఆద్యుఁ= నందుడు ఉపనందుడు భద్రుడు మొదలగువారు (శోణితపురమునకు వెళ్లిరి).

ప్రద్యుమ్నుడు, యుయుధానుడు, గదుడు, సాంబుడు, సారణుడు, బలరామ శ్రీకృష్ణులననుసరించే నందుడు, ఉపనందుడు, భద్రుడు మొదలగు వారు శోణితపురమునకు వెళ్లిరి.

అక్షౌహిణీభి ర్ద్వాదశభి స్సమేతా స్సర్వతోదిశమ్ ।
రురుధు ర్బాణనగరం సమంతా త్సాత్వతర్షభాఁ ॥ 4

ద్వాదశభిఁ= పన్నెండు, అక్షౌహిణీభిఁ= అక్షౌహిణీలతో, సమేతాఁ= కూడుకున్న, సాత్వత-ఋషభాఁ= యాదవశ్రేష్ఠులు, సర్వతోదిశమ్= అన్ని దిక్కులయందు, సమంతాత్= లోపల బయట, బాణనగరమ్= బాణుని రాజధానిని, రురుధుఁ= ముట్టడించిరి.

యాదవశ్రేష్ఠులు పన్నెండు అక్షౌహిణీల సైన్యముతో కూడి బాణుని రాజధానిని అన్ని దిక్కులయందు లోపల బయట ముట్టడించిరి.

భజ్యమాన పురోద్యాన ప్రాకారాట్టాలగోపురమ్ ।
ప్రేక్షమాణో రుషాఽఽవిష్ట స్తుల్య సైన్యోఽభినిర్యయౌ ॥ 5

భజ్యమానపుర-ఉద్యానప్రాకార-అట్టాలగోపురమ్= విరుగకొట్టబడుచున్న నగరముయొక్క ఉద్యానములు ప్రాకారములు కోట బురుజులు ఎత్తైన కట్టడములు గల నగరమును, ప్రేక్షమాణఁ= చూచుచున్న బాణుడు, రుషా= కోపముతో, ఆవిష్టఁ= ఆవేశించబడినవాడై, తుల్యసైన్యఁ= సమానమగు సైన్యము గలవాడై, అభినిర్యయౌ= బయల్వెడలెను.

తన నగరముయొక్క ఉద్యానములు, ప్రాకారములు, కోట బురుజులు, ఎత్తైన కట్టడములు విరుగకొట్టబడుచుండగా చూచుచున్న బాణునకు కోపము ఆవేశించెను. ఆతడు సమానమైన సైన్యముతో యుద్ధమునకై నగరమునుండి బయల్వెడలెను.

బాణార్థే భగవాన్ రుద్రస్ససుతైః ప్రమథైర్వృతః ।
ఆరుహ్య నందివృషభం యుయుధే రామకృష్ణయోః ॥ 6

భగవాన్ రుద్రః= శివ భగవానుడు, బాణ-అర్థే= బాణుని ప్రయోజనము నిమిత్తముగా, ససుతైః= పుత్రుడగు కుమారస్వామితో కూడిన, ప్రమథైః= ప్రమథగణములచే, వృతః= చుట్టువారబడినవాడై, నందివృషభమ్= నంది అనే ఎద్దును, ఆరుహ్య= ఎక్కి, రామకృష్ణయోః= బలరామ శ్రీకృష్ణులతో, యుయుధే= యుద్ధము చేసెను.

శివభగవానుడు బాణుని ప్రయోజనము నిమిత్తముగా నంది అనే యెద్దునెక్కి బలరామ శ్రీకృష్ణులతో యుద్ధము చేసెను. ఆయనను పుత్రుడగు కుమారస్వామి ప్రమథగణములు చుట్టువారి యుండిరి.

ఆసీత్సుతుములం యుద్ధమద్భుతం రోమహర్షణమ్ ।
కృష్ణశంకరయో రాజన్ ప్రద్యుమ్నగుహయోరపి ॥ 7

రాజన్= ఓ రాజా!, కృష్ణశంకరయోః= శ్రీకృష్ణ శంకరులకు, ప్రద్యుమ్నగుహయోః అపి= ప్రద్యుమ్న కుమారస్వాములకు కూడ, సుతుములమ్= మిక్కిలి సంకులమైనట్టియు, అద్భుతమ్= అద్భుతమైనట్టియు, రోమహర్షణమ్= శరీరమునకు గగుర్పాటును కలిగించే, యుద్ధమ్= యుద్ధము, ఆసీత్= జరిగెను.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ శంకరులకు, ప్రద్యుమ్న కుమార-స్వాములకు కూడ దొమ్మి యుద్ధము జరిగెను. అద్భుతమగు ఆ యుద్ధము చూచువారలకు గగుర్పాటును కలిగించెను.

కుంభాండ కూపకర్ణాభ్యాం బలేన సహ సంయుగః ।
సాంబస్య బాణపుత్రేణ బాణేన సహ సాత్యకేః ॥ 8

కుంభాండకూపకర్ణాభ్యామ్= కుంభాండ కూపకర్ణులతో (ఒకవైపు), బలేన సహ= బలరామునితో గూడి (ఇంకో వైపు), సాంబస్య= సాంబునకు, బాణపుత్రేణ= బాణుని పుత్రునితో, సాత్యకేః= సాత్యకికి, బాణేన సహ= బాణునితో కూడి, సంయుగః= యుద్ధము (జరిగెను).

కుంభాండ కూపకర్ణులకు బలరామునితో, సాంబునకు బాణుని పుత్రునితో, సాత్యకికి బాణునితో యుద్ధము జరిగెను.

బ్రహ్మాఽఽదయస్సురాధీశా మునయస్సిద్ధచారణాః ।
గంధర్వాప్సరసో యక్షా విమానైర్ద్రష్టుమాగమన్ ॥ 9

బ్రహ్మా-ఆదయః= బ్రహ్మదేవుడు మొదలుగా గల, సుర-అధీశాః= దేవనాయకులు, మునయః= మునులు, సిద్ధచారణాః= సిద్ధులు చారణులు, గంధర్వ-అప్సరసః= గంధర్వులు అప్సరసలు, యక్షాః= యక్షులు, విమానైః = విమానములచే, ద్రష్టుమ్= చూచుటకు, ఆగమన్= వచ్చిరి.

బ్రహ్మదేవుడు, ఇంద్రుడు మొదలగు దేవనాయకులు, మునులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, అప్సరసలు, యక్షులు విమానములపై యుద్ధమును చూచుటకు వచ్చిరి.

శంకరానుచరాశ్చారి ర్భూతప్రమథగుహ్యకాన్ ।
డాకినీర్యాతుధానాంశ్చ వేతాలాన్ సవినాయకాన్ ॥ 10

ప్రేతమాతృపిశాచాంశ్చ కూష్మాండాన్ బ్రహ్మరాక్షసాన్ ।
ద్రావయామాస తీక్ష్ణాగ్రైశ్శరై శ్శార్ఙ్గధనుశ్చ్యుతైః ॥ 11

శౌరిః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు, శార్ఙ్గధనుః-చ్యుతాన్= శార్ఙ్గమనే ధనుస్సునుండి విడిచిపెట్టబడిన, తీక్ష్ణ-అగ్రైః= వాడి మొనలు

గల, శరైః= బాణములచే, శంకర-అనుచరాన్= శంకరుని అనుయాయు లైన, భూతప్రమథగుహ్యకాన్= భూతములను ప్రమథగణములను యక్షులను, డాకినీ= డాకినీలను, యాతుధానాన్ చ= రాక్షసులను, సవినాయకాన్= వినాయకులతో కూడిన, వేతాలాన్= భేతాళులను, ప్రేతమాతృపిశాచాన్ చ= ప్రేతగణములను, మాతృకాగణములను, పిశాచములను కూడ, కూష్మాండాన్= దేవతాగణములను, ద్రావయామాస= తరిమివేసెను.

శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు శార్ఙ్గమనే ధనుస్సునుండి వాడి మొనలు గల బాణములను ప్రయోగించి శంకరుని అనుయాయులగు భూతములను, ప్రమథగణములను, యక్షులను, డాకినీలను, రాక్షసులను, భేతాళులను, వినాయకులను, ప్రేతగణములను, మాతృకాగణములను, పిశాచములను, దేవతాగణములను, బ్రహ్మరాక్షసులను కూడ తరిమి వేసెను.

పృథగ్విధాని ప్రాయుంక్త పినాక్యస్త్రాణి శార్ఙ్గిణే ।
ప్రత్యస్త్రై శ్శమయామాస శార్ఙ్గపాణి రవిస్మితః ॥ 12

పినాకీ= పినాకమనే ధనుస్సును ధరించే శివుడు, శార్ఙ్గిణే= శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీకృష్ణుని కొరకు, పృథగ్-విధాని= పలురకము లైన, అస్త్రాణి= అస్త్రములను, ప్రాయుంక్త= ప్రయోగించెను, శార్ఙ్గపాణిః = శార్ఙ్గధనుస్సు చేతియందు గల శ్రీకృష్ణుడు, అవిస్మితః= భయము గర్వము లేనివాడై, ప్రతి-అస్త్రైః= విరుగుడు అస్త్రములతో, శమయామాస= చల్లారునట్లు చేసెను.

పినాకమనే ధనుస్సును ధరించిన శివుడు శార్ఙ్గమనే ధనుస్సును ధరించిన శ్రీకృష్ణునిపై పలు రకములు అస్త్రములను ప్రయోగించెను. ఆయన భయము, గర్వము లేకుండా శార్ఙ్గధనుస్సు చేతియందు గలవాడై విరుగుడు అస్త్రములతో వాటిని నిర్వీర్యము చేసెను.

బ్రహ్మాస్త్రస్య చ బ్రహ్మాస్త్రం వాయవ్యస్య చ పార్వతమ్ ।
ఆగ్నేయస్య చ పార్జన్యం నైజం పాశుపత్యస్య చ ॥ 13

బ్రహ్మ–అస్త్రస్య చ= బ్రహ్మాస్త్రమునకైతే, బ్రహ్మాస్త్రమ్= బ్రహ్మాస్త్రమును, వాయవ్యస్య చ= వాయవ్యాస్త్రమునకు, పార్వతమ్= పర్వతాస్త్రమును, ఆగ్నేయస్య చ= ఆగ్నేయాస్త్రమునకైతే, పార్జన్యమ్= పర్జన్యాస్త్రమును, పాశుపతస్య చ= పాశుపతాస్త్రమునకు, నైజమ్= తనదైన నారాయణాస్త్రమును (ప్రయోగించెను).

శివుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు విరుగుడుగా బ్రహ్మాస్త్రమును, వాయవ్యాస్త్రమునకు పర్వతాస్త్రమును, ఆగ్నేయాస్త్రమునకు పర్జన్యాస్త్రమును, పాశుపతాస్త్రమునకు తనదైన నారాయణాస్త్రమును శ్రీకృష్ణుడు ప్రయోగించెను.

మోహయిత్వా తు గిరిశం జృంభణాస్త్రేణ జృంభితమ్ ।
బాణస్య పృతనాం శౌరి ర్జఘానాసిగదేషుభిః ॥ 14

శౌరిః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు జృంభణ–అస్త్రేణ= జృంభణాస్త్రముతో, జృంభితమ్= ఆవులించుచున్న, గిరిశమ్= కైలాసవాసియగు శివుని, మోహయిత్వా= మోహము కలుగునట్లు చేసి, బాణస్య= బాణాసరుని, పృతనామ్= సైన్యమును, అసిగదా–ఇషుభిః= కత్తి గద బాణములతో, జఘాన= కొట్టెను.

శూరవంశీయుడగు శ్రీకృష్ణుడు కైలాసవాసియగు శివునిపై జృంభణాస్త్రమును ప్రయోగించి ఆయన ఆవులిస్తూ మోహమును పొందునట్లు చేసెను. తరువాత ఆయన బాణాసురుని సైన్యమును కత్తితో, గదతో, బాణములతో సంహరించెను.

స్కందః ప్రద్యుమ్నబాణౌఘైరర్ద్యమానస్సమంతతః ।
అసృగ్విముంచన్ గాత్రేభ్యశ్శిఖినాఽపాక్రమద్రణాత్ ॥ 15

సమంతతః= అన్ని వైపులనుండి, ప్రద్యుమ్నబాణ-ఓఘైుః= ప్రద్యుమ్ననియొక్క బాణముల సమూహములచే, అర్ద్యమానః= పీడించబడుచున్న, స్కందః= కుమారస్వామి, గాత్రేభ్యః= అవయవముల నుండి, అసృక్= రక్తమును, విముంచన్= విడిచిపెట్టుచున్నవాడై, శిఖినా= నెమలితో, రణాత్= యుద్ధమునుండి, అపాక్రమత్= తొలగిపోయెను.

ప్రద్యుమ్నుడు కుమారస్వామిని అన్ని వైపుల బాణముల సమూహములచే పీడించెను. ఆయన అవయవములనుండి రక్తము స్రవించుచుండగా, నెమలితో సహా యుద్ధమునుండి తొలగిపోయెను.

కుంభాండః కూపకర్ణశ్చ పేతతుర్ముసలార్దితౌ ।
దుద్రువుస్తదనీకాని హతనాథాని సర్వతః ॥ 16

ముసల-అర్దితౌ= ముసలముచే పీడించబడిన, కుంభాండః= కుంభాండుడు, కూపకర్ణః చ= కూపకర్ణుడు కూడ, పేతతుః= నేలపై పడిరి, హతనాథాని= కొట్టబడిన నాయకుడు గల, తద్-అనీకాని= వారి సేనలు, సర్వతః= అన్ని వైపులా, దుద్రువుః= పారిపోయినవి.

బలరాముడు ముసలముచే కొట్టగా కుంభాండ కూపకర్ణులు గాయపడి నేలపై పడిరి. నాయకులు కొట్టబడుటచే వారి సైన్యములు అన్ని వైపులా పారిపోయినవి.

విశీర్యమాణం స్వబలం దృష్ట్వా బాణోఽత్యమర్షణః ।
కృష్ణమభ్యద్రవత్సంఖ్యే రథీ హిత్వైవ సాత్యకిమ్ ॥ 17

రథీ= రథము పై యుద్ధము చేయుచున్న, బాణః= బాణుడు, విశీర్యమాణమ్= చెల్లా చెదరగుచున్న, స్వబలమ్= తన సైన్యమును, దృష్ట్వా= చూచి, అతి-అమర్షణః= అధికముగ కోపము గలవాడై, సంఖ్యే= యుద్ధమునందు, సాత్యకిమ్= సాత్యకిని, హిత్వా= విడిచి పెట్టి, కృష్ణం ఏవ= శ్రీకృష్ణుని గురించియే, అభ్యద్రవత్= అభిముఖముగా దూసుకువెళ్లెను.

రథము పై యుద్ధము చేయుచున్న బాణుడు తన సైన్యము చెల్లాచెదరగుటను చూచి అధికమగు కోపమును పొందెను. ఆతడు సాత్యకితో యుద్ధమును విడిచిపెట్టి శ్రీకృష్ణుని మీదకే దూసుకు వెళ్లెను.

ధనూంష్యాకృష్య యుగపద్బాణః పంచశతాని వై ।
ఏకైకస్మిఞ్ఛరౌ ద్వౌ ద్వౌ సందధే రణదుర్మదః ॥ 18

రణదుర్మదః= యుద్ధమునందు బాగా గర్వించిన, బాణః= బాణుడు, యుగపత్= ఒకేసారి, పంచశతాని= అయిదు వందల, ధనూంషి= ధనుస్సులను, ఆకృష్య వై= గట్టిగా లాగి, ఏక-ఏకస్మిన్= ఒక్కొక్కదాని యందు, ద్వౌ ద్వౌ= రెండు రెండు, శరౌ= బాణములను, సందధే= ఎక్కుపెట్టెను.

యుద్ధములో తాను మొనగాడనని బాగా గర్వించియున్న బాణుడు అయిదు వందల ధనుస్సులను ఒక్కసారిగా బలముగా లాగి, ఒక్కొక్క ధనుస్సునందు రెండేసి బాణములను సంధించెను.

తాని చిచ్ఛేద భగవాన్ ధనూంషి యుగపద్ధరిః ।
సారథిం రథమశ్వాంశ్చ హత్వా శంఖమపూరయత్ ॥ 19

హరిః= పాపములను పోగొట్టే, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తాని= ఆ, ధనూంషి= ధనుస్సులను, యుగపత్= ఒకేసారి, చిచ్ఛేద= ఛేదించెను, సారథిమ్= సారథిని, రథమ్= రథమును, అశ్వాన్ చ= గుర్రములను కూడ, హత్వా= కొట్టి, శంఖమ్= శంఖమును, అపూరయత్= పూరించెను.

పాపహారియగు శ్రీకృష్ణభగవానుడు ఒకేసారి ఆ ధనుస్సులను విరుగకొట్టి, సారథిని, రథమును, గుర్రములను కూడ కొట్టి, శంఖమును పూరించెను.

తన్మాతా కోటరా నామ నగ్నా ముక్తశిరోరుహా ।
పురోఽవతస్థే కృష్ణస్య పుత్రప్రాణరిరక్షయా ॥ 20

కోటరా నామ= కోటరయని ప్రసిద్ధి గాంచిన, తత్-మాతా= ఆ బాణుని తల్లి, నగ్నా= నగ్నయై, ముక్తశిరః-రుహా= విరబోయబడిన జుట్టు గలదై, పుత్రప్రాణరిరక్షయా= పుత్రుని ప్రాణములను రక్షించే కోరికతో, కృష్ణస్య= శ్రీకృష్ణుని, పురః= ఎదుట, అవతస్థే= నిలబడెను.

బాణుని తల్లి కోటరయని ప్రసిద్ధి గాంచినది. ఆమె పుత్రుని ప్రాణములను కాపాడాలనే కోరికతో శ్రీకృష్ణుని ముందు జుట్టు విరబోసుకుని నగ్నముగ నిలబడెను.

తతస్తిర్యఙ్ముఖో నగ్నామనిరీక్షన్ గదాగ్రజః ।
బాణశ్చ తావద్విరథ శ్ఛిన్నధన్వాఽవిశత్పురమ్ ॥ 21

తతః= అప్పుడు, గద-అగ్రజః= గదుని సోదరుడగు శ్రీకృష్ణుడు, నగ్నామ్= నగ్నయగు ఆమెను, అనిరీక్షన్= చూడనివాడై, తిర్యఙ్-ముఖః= అడ్డముగా ముఖము గలవాడు, తావత్= అంతలో, విరథః= పోయిన రథము గలవాడు, ఛిన్నధన్వా= విరిగిన ధనుస్సులు గలవాడు అగు, బాణః చ= బాణుడైతే, పురమ్= నగరమును, అవిశత్= ప్రవేశించెను.

అప్పుడు గదుని సోదరుడగు శ్రీకృష్ణుడు నగ్నయగు ఆమెను చూడకుండుటకై ముఖమును అడ్డముగా తిప్పుకొనెను. అంతలో, రథము పోయి ధనుస్సులు విరిగియున్న బాణుడు నగరములోనికి ప్రవేశించెను.

విద్రావితే భూతగణే జ్వరస్తు త్రిశిరాస్త్రిపాత్ ।
అభ్యధావత దాశార్హం దహన్నివ దిశో దశ ॥ 22

భూతగణే= భూతముల సమూహము, విద్రావితే= తరిమి వేయబడగా, త్రిశిరాః= మూడు తలలు గలది, త్రిపాత్= మూడు కాళ్లు గలది అగు, జ్వరః తు= జ్వరమైతే, దశ= పది, దిశః= దిక్కులను, దహన్

ఇవ= దహించుచున్నదా యన్నట్లు, దాశార్హమ్= దశార్హవంశీయుడగు శ్రీకృష్ణుని గురించి, అభ్యధావత= ఎదురుగా పరుగెత్తెను.

భూతగణము తరిమివేయబడెను. అప్పుడు మూడు తలలు, మూడు కాళ్లు ఉండే జ్వరము పది దిక్కులను కాల్చుచున్నదా యన్నట్లు, దశార్హవంశీయుడగు శ్రీకృష్ణునికి ఎదురుగా పరుగెత్తుకు వచ్చెను.

అథ నారాయణో దేవస్తం దృష్ట్వా వ్యసృజ జ్జ్వరమ్ ।
మాహేశ్వరో వైష్ణవశ్చ యుయుధాతే జ్వరావుభౌ ॥ 23

అథ= అప్పుడు, నారాయణః దేవః= నారాయణ దేవుడైన శ్రీకృష్ణభగవానుడు, తమ్= ఆ జ్వరమును, దృష్ట్వా= చూచి, జ్వరమ్= జ్వరమును, వ్యసృజత్= విడిచిపెట్టెను, మాహేశ్వరః= మహేశ్వరునకు చెందినది, వైష్ణవః చ= విష్ణువునకు చెందినది కూడ, ఉభౌ= రెండు, జ్వరౌ= జ్వరములు, యుయుధాతే= యుద్ధమును చేసినవి.

అప్పుడు శ్రీకృష్ణుని రూపములోనున్న నారాయణ దేవుడు ఆ జ్వరమును చూచి తన జ్వరమును విడిచి పెట్టెను. మహేశ్వరునకు, శ్రీకృష్ణభగవానునకు చెందిన ఆ రెండు జ్వరములున్నూ యుద్ధము చేసినవి.

మాహేశ్వర స్సమాక్రందన్ వైష్ణవేన బలార్దితః ।
అలబ్ధ్వాకభయమన్యత్ర భీతో మాహేశ్వరో జ్వరః ।
శరణార్థీ హృషీకేశం తుష్టావ ప్రయతాంజలిః ॥ 24

వైష్ణవేన= విష్ణువునకు చెందిన జ్వరముచే, బల–అర్దితః= బలముచే పీడించబడిన, మాహేశ్వరః= మహేశ్వరునకు చెందిన జ్వరము, సమాక్రందన్= గట్టిగా ఆక్రోశించుచున్నది, అన్యత్ర= మరియొకచోట, అభయమ్= అభయమును, అలబ్ధ్వా= పొందలేక, భీతః= భయపడిన, మాహేశ్వరః= మహేశ్వరునకు చెందిన, జ్వరః= జ్వరము, శరణ–అర్థీ=

శరణు కోరునదై, ప్రయత-అంజలిః= దోసిలి యొగ్గినదై, హృషీక-ఈశమ్= ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుని, తుష్టావ= స్తుతించెను.

విష్ణుజ్వరము మహేశ్వరజ్వరమును బలముగా పీడించెను. భయపడిన మహేశ్వరజ్వరము మరియొక అభయస్థానము లభించక ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుని శరణు వేడ గోరెను. అది దోసిలి యొగ్గి ఆయనను స్తుతించెను.

జ్వర ఉవాచ ।

నమామి త్వా_నంతశక్తిం పరేశం
సర్వాత్మానం కేవలం జ్ఞప్తి మాత్రమ్ ।
విశ్వోత్పత్తిస్థానసంరోధహేతుం
యత్తద్బ్రహ్మ బ్రహ్మలింగం ప్రశాంతమ్ ॥ 25

జ్వరః= జ్వర, ఉవాచ= పలికెను, అనంత శక్తిమ్= అనంతమగు శక్తి కలిగినట్టియు, పర-ఈశమ్= సర్వేశ్వరుడవైనట్టియు, సర్వ-ఆత్మానమ్ సర్వమునకు ఆత్మయైనట్టియు, కేవలమ్= అద్వయుడవైనట్టియు, జ్ఞప్తిమాత్రమ్= శుద్ధచైతన్యస్వరూపుడ వైనట్టియు, విశ్వ-ఉత్పత్తిస్థాన సంరోధహేతుమ్= జగత్తుయొక్క సృష్టి స్థితిలయములకు కారణమైన, యత్= ఏ, బ్రహ్మ= పరబ్రహ్మ గలదో, తత్= అది యైనట్టియు, బ్రహ్మలింగమ్= వేదములచే సూచించబడు నట్టియు, ప్రశాంతమ్= వికారరహితుడవగు, త్వా= నిన్ను, నమామి= నమస్కరించుచున్నాను.

మహేశ్వర జ్వరమిట్లు పలికెను...అనంతమగు శక్తి గల సర్వేశ్వరుడవు నీవే. సర్వమునకు ఆత్మవగు నీ స్వరూపము అద్వయమగు శుద్ధచైతన్యము. జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు కారణమైనది అని వేదములచే సూచించబడే పరబ్రహ్మ యేది గలదో అది నీవే. వికారరహితుడ వగు నీకు నమస్కారము.

కాలో దైవం కర్మ జీవస్స్వభావో ద్రవ్యం క్షేత్రం ప్రాణ ఆత్మా వికారః ।
తత్సంఘాతో బీజరోహ ప్రవాహస్త్వన్మాయైషా తన్నిషేధం ప్రపద్యే॥ 26

కాలః= కాలము, దైవమ్= అదృష్టము, కర్మ= కర్మ, జీవః= జీవుడు, స్వభావః= అజ్ఞానము, ద్రవ్యమ్= ద్రవ్యము, క్షేత్రమ్= శరీరము, ప్రాణః= ప్రాణశక్తి, ఆత్మా= అహంకారము, వికారః= ఇంద్రియములు పంచభూతములు, తత్-సంఘాతః= వాటి సమాహారమైన లింగదేహము, బీజరోహప్రవాహః= విత్తు మొలకవంటి ప్రవాహము, ఏషా= ఇది, త్వత్-మాయా= నీ మాయ, తత్-నిషేధమ్= వాటి నిషేధము గల నిన్ను, ప్రపద్యే= శరణు వేడుచున్నాను.

కాలము, అదృష్టము, కర్మ, జీవుడు, అజ్ఞానము, ద్రవ్యము, శరీరము, ప్రాణశక్తి (సూత్రాత్మ), అహంకారము, ఇంద్రియములు, పంచభూతములు, వాటి సమాహారమైన లింగదేహము అనేవి నీ మాయ. విత్తునుండి మొలక, మొలకనుండి విత్తు వచ్చినట్లుగా, దేహమునుండి కర్మ, కర్మనుండి దేహము అనే ప్రవాహము కూడ నీ మాయయే. కాని, నీ స్వరూపమునందు మాయ లేనే లేదు. అట్టి నిన్ను శరణు వేడుచున్నాను.

నానాభావై ర్లీలయైవోపపన్నై ర్దేవాన్ సాధూన్ లోకసేతూన్ బిభర్షి ।
హంస్యున్మార్గాన్హింసయా వర్తమానాఞ్జన్మైతత్తే భారహారాయ భూమేః ॥27

లీలయా ఏవ= లీలగానే, ఉపపన్నైఃఃః

నీవు లీలగా అవతారములనెత్తి దేవతలను, సజ్జనులను రక్షించి, లోకములోని ధర్మమర్యాదలను బలోపేతము చేసెదవు. ధర్మమార్గము నుల్లంఘించి హింసను చేయువారిని నీవు సంహరించెదవు. నీ అవతారము భూమియొక్క భారమును తగ్గించుటకై ఉద్దేశించబడినది.

తపోహం తే తేజసా దుస్సహేన శాంతోగ్రేణాత్యుల్బణేన జ్వరేణ ।
తావత్తాపో దేహినాం తేంఘ్రిమూలం నో సేవేరన్యావదాశాఽనుబద్ధాः ॥28

దుస్సహేన= సహించ శక్యము కానట్టియు, శాంత-ఉగ్రేణ= చల్లని మరియు దహించునట్టియు, అతి-ఉల్బణేన= మిక్కిలి భయంకరమైన, జ్వరేణ= జ్వరము రూపములోనున్న, తే= నీ, తేజసా= తేజస్సుచే, అహమ్= నేను, తప్తుः= తపింప జేయబడినదానను, దేహినామ్= ప్రాణులకు, తావత్= అంతవరకు, తాపుः= తాపము, యావత్= ఎంతవరకైతే, ఆశా-అనుబద్ధాः = ఆశచే కట్టివేయబడినవారై, తే= నీ, అంఘ్రిమూలమ్= పాదముల మూలమును, నోసేవేరన్= సేవించరో.

నీ జ్వరరూపమైన తేజస్సు సహించ శక్యము కానిది. ముందు చల్లగా తరువాత దహించే ఆ జ్వరము చాల భయమును గొల్పును. దానిచే నేను తాపమును పొంది యున్నాను. ప్రాణులు ఎంతవరకైతే ఆశచే కట్టివేయబడి నీ పాదమూలమును శరణువేడరో, అంతవరకు వారికి తాపము తప్పదు.

శ్రీభగవానువాచ ।

త్రిశిరస్తే ప్రసన్నోస్మి వ్యేతు తే మజ్జ్వరాద్భయమ్ ।
యో నౌ స్మరతి సంవాదం తస్య త్వన్న భవేద్భయమ్ ॥ 29

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, త్రిశిరుः= ఓ మూడు తలల జ్వరమా!, తే= నీ కొరకు, ప్రసన్నుः= ప్రసన్నుడను, అస్మి=

అగుచున్నాను, తే= నీకు, మత్-జ్వరాత్= నా జ్వరము వలన, భయమ్= భయము, వ్యేతు= తొలగుగాక!, యః= ఎవడైతే, నౌ= మనిద్దరి, సంవాదమ్= సంవాదమును, స్మరతి= స్మరించునో, తస్య= వానికి, త్వత్= నీ వలన, భయమ్= భయము, న భవేత్= కలుగదు.

కృష్ణ భగవానుడిట్లు పలికెను...మూడు తలల ఓ జ్వరమా! నేను నీపై ప్రసన్నుడనైతిని. నీకు నా జ్వరము వలని భయము దూరమగును. మనిద్దరి సంవాదమునెవడైతే స్మరించునో, వానికి నీ వలన భయముండదు.

ఇత్యుక్తోచ్యుతమానమ్య గతో మాహేశ్వరో జ్వరః ।
బాణస్తు రథమారూఢః ప్రాగాద్యోత్స్యఞ్జనార్దనమ్ ॥ 30

మాహేశ్వరః= మహేశ్వరునకు చెందిన, జ్వరః= జ్వరము, ఇతి= ఇట్లు, ఉక్తః= పలుకబడినదై, అచ్యుతమ్= శ్రీకృష్ణభగవానుని, ఆనమ్య= ప్రణమిల్లి, గతః= వెళ్లినది, బాణః తు= బాణుడైతే, జన-అర్దనమ్= దుష్టశిక్షకుడగు శ్రీకృష్ణభగవానుని, యోత్స్యన్= యుద్ధము చేయబోవువాడై, రథమ్= రథమును, ఆరూఢః= ఎక్కినవాడై, ప్రాగాత్= వెళ్లెను.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలుకగా మహేశ్వరజ్వరము ప్రణమిల్లి నిష్క్రమించెను. బాణుడైతే దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానునితో యుద్ధము చేయుటకై రథము నెక్కి వెళ్లెను.

తతో బాహుసహస్రేణ నానాఽఽయుధధరోసురః ।
ముమోచ పరమక్రుద్ధో బాణాంశ్చక్రాయుధే నృప ॥ 31

నృప= ఓ రాజా!, తతః= తరువాత, నానా-ఆయుధధరః= అనేకములగు ఆయుధములను ధరించిన, అసురః= బాణాసురుడు, పరమక్రుద్ధః= చాల కోపించినవాడై, చక్ర-ఆయుధే= చక్రము ఆయుధముగా గల శ్రీకృష్ణునిపై, బాణాన్= బాణములను, ముమోచ= విడిచిపెట్టెను.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత మహాకోపముతోనున్న బాణాసురుడు అనేకములగు ఆయుధములను ధరించి చక్రాయుధుడగు శ్రీకృష్ణునిపై బాణములను ప్రయోగించెను.

తస్యాస్యతోఽస్త్రాణ్యసకృచ్చక్రేణ క్షురనేమినా ।
చిచ్ఛేద భగవాన్ బాహూన్ శాఖా ఇవ వనస్పతేః ॥ 32

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, క్షురనేమినా= పదునైన ధార గల, చక్రేణ= చక్రముతో, అసకృత్= ఎడతెరపి లేకుండా, అస్త్రాణి= అస్త్రములను, అస్యతః= ప్రయోగించుచున్న, తస్య= ఆ బాణునియొక్క, బాహూన్= చేతులను, వనస్పతేః= పెద్ద చెట్టు యొక్క, శాఖాః ఇవ= కొమ్మలను వలె, చిచ్ఛేద= నరికెను.

ఎడతెరపి లేకుండా అస్త్రములను ప్రయోగించుచున్న ఆ బాణుని చేతులను శ్రీకృష్ణ భగవానుడు పదునైన ధార గల చక్రముతో, పెద్ద చెట్టు కొమ్మలను వలె, నరికెను.

బాహుషు చ్ఛిద్యమానేషు బాణస్య భగవాన్ భవః ।
భక్తానుకంప్యుపవ్రజ్య చక్రాయుధ మభాషత ॥ 33

బాణస్య= బాణుని యొక్క, బాహుషు= చేతులు, ఛిద్యమానేషు= నరుకబడుచుండగా, భక్త-అనుకంపీ= భక్తులయందు దయగల, భవః భగవాన్= శివ భగవానుడు, చక్ర-ఆయుధమ్= చక్రము ఆయుధముగా గల శ్రీకృష్ణుని, ఉపవ్రజ్య= దగ్గరకు వచ్చి, అభాషత= పలికెను.

శివ భగవానునకు భక్తులపై దయ మెండు. శ్రీకృష్ణ భగవానుడు చక్రాయుధముతో బాణుని చేతులను నరుకుచుండగా, శివుడు ఆయన దగ్గరకు వచ్చి ఇట్లు పలికెను.

శ్రీరుద్ర ఉవాచ ।

త్వం హి బ్రహ్మ పరం జ్యోతి ర్గూఢం బ్రహ్మణి వాఙ్మయే ।
యం పశ్యంత్యమలాత్మాన ఆకాశమివ కేవలమ్ ॥ 34

శ్రీరుద్రుఁ= శ్రీరుద్రుడు, ఉవాచ= పలికెను, త్వమ్= నీవు, హి= నిశ్చయముగా, జ్యోతిఁ= చైతన్యస్వరూపుడ వైనట్టియు, వాక్-మయే= శబ్దరూపమగు, బ్రహ్మణి= బ్రహ్మయగు వేదమునందు, గూఢమ్= రహస్యమైన, పరం బ్రహ్మ= పరబ్రహ్మవు, అమల-ఆత్మానఁ= శుద్ధమైన అంతఃకరణము గలవారలు, యమ్= ఏ పరబ్రహ్మను, ఆకాశం ఇవ= ఆకాశము వలె, కేవలమ్= రెండవది లేనిదిగా, పశ్యంతి= తెలియుదురో.

శ్రీరుద్రుడిట్లు పలికెను...చైతన్యస్వరూపమగు పరబ్రహ్మను శబ్దబ్రహ్మ యగు వేదము రహస్యము (వాక్కునకు, మనస్సునకు గోచరము కానిది)గా ప్రతిపాదించును. ఆ పరబ్రహ్మ ఆకాశము వలె అద్వయమని శుద్ధమైన అంతఃకరణము గలవారలు తెలియుదురు. అట్టి పరబ్రహ్మ నిశ్చయముగా నీవే.

నాభిర్నభోఽగ్ని ర్ముఖమంబు రేతో
ద్యౌశ్శీర్షమాశా శ్రుతిరంఘ్రి రుర్వీ ।
చంద్రో మనో యస్య దృగర్క ఆత్మా
అహం సముద్రో జఠరం భుజేంద్రః ॥ 35

యస్య= ఏ నీకు, నభఃఁ= ఆకాశము, నాభిఃఁ= నాభియో, అగ్నిఃఁ= అగ్ని, ముఖమ్=నోరో, అంబు= జలము, రేతఃఁ= రేతస్సో, ద్యౌఃఁ= ద్యులోకము, శీర్షమ్= తలయో, ఆశాఃఁ= దిక్కులు, శ్రుతిఃఁ= చెవియో, ఉర్వీ = పృథివి, అంఘ్రిఃఁ= పాదమో, చంద్రఃఁ= చంద్రుడు, మనఃఁ= మనస్సో, అర్కఃఁ= సూర్యుడు, దృక్= చూపో, అహమ్= నేను, ఆత్మా= అహంకారమో, సముద్రఃఁ= సముద్రము, జఠరమ్= జఠరమో, ఇంద్రఃఁ= ఇంద్రుడు, భుజాఁ= భుజమో.

నీకు ఆకాశము నాభి, అగ్ని నోరు, జలము రేతస్సు, ద్యులోకము తల, దిక్కులు చెవి, పృథివి పాదము, చంద్రుడు మనస్సు, సూర్యుడు చూపు, నేను అహంకారము, సముద్రము జఠరము, ఇంద్రుడు భుజము.

రోహిణి యస్యౌషధయోఽంబువాహాః కేశా విరించో ధిషణా విసర్గః ।
ప్రజాపతిర్హృదయం యస్య ధర్మస్స వై భవాన్ పురుషో లోకకల్పః ॥ 36

యస్య= ఏ నీకు, ఓషధయః= చెట్టు చేమలు, రోమాణి= రోమములో, అంబువాహాః= మేఘములు, కేశాః= కేశములో, విరించః= బ్రహ్మ దేవుడు, ధిషణా= బుద్ధియో, ప్రజాపతిః= ప్రజాపతి, విసర్గః= జననేంద్రియమో, యస్య= ఏ నీకు, ధర్మః= ధర్మము, హృదయమ్= హృదయమో, సః= అట్టి, భవాన్= నీవు, వై= నిశ్చయముగా, లోకకల్పః = లోకములచే కల్పించబడే, పురుషః= పురుషుడవు.

నీకు చెట్టు చేమలు రోమములు, మేఘములు కేశములు, బ్రహ్మదేవుడు బుద్ధి, ప్రజాపతి జననేంద్రియము, ధర్మము హృదయము. నీవీ తీరున నిశ్చయముగా లోకములచే కల్పించబడే విరాట్ పురుషుడవు.

తవావతారోఽయమకుంఠధామన్ ధర్మస్య గుప్త్యై జగతో భవాయ ।
వయం చ సర్వే భవతానుభావితా విభావయామో భువనాని సప్త ॥ 37

అకుంఠధామన్= జారిపోవుట లేని స్వరూపము గలవాడా!, తవ= నీ యొక్క, అయమ్= ఈ, అవతారః= అవతారము, ధర్మస్య= ధర్మము యొక్క, గుప్త్యై= రక్షణ కొరకు, జగతః= జగత్తు యొక్క, భవాయ= అభ్యుదయము కొరకు, వయమ్= మేము, సర్వే చ= అందరము కూడ, భవతా= నీచే, అనుభావితాః= సమర్థులుగా చేయబడినవారమై, సప్త= ఏడు, భువనాని= లోకములను, విభావయామః= పాలించుచున్నాము.

ఓ శ్రీకృష్ణా! నీకు స్వరూపమునుండి చ్యుతి లేదు. నీ ఈ అవతారము ధర్మరక్షణ కొరకు, జగత్తు యొక్క అభ్యుదయము కొరకు ఉద్దేశించబడినది. మేమందరము నీచే ఈయబడిన శక్తితో ఏడు లోకములనేలుచున్నాము.

త్వమేక ఆద్యః పురుషోఽద్వితీయ స్తుర్య స్స్వదృగ్హేతు రహేతురీశః ।
ప్రతీయ సేఽథాపి యథావికారం స్వమాయయా సర్వగుణప్రసిద్ధ్యై ॥ 38

త్వమ్= నీవు, ఏకః= ఒక్కడివి, ఆద్యుఃఁ= కాలమునకు కారణము, పురుషః= పూర్ణుడవు, అద్వితీయుఃఁ= రెండవది లేనివాడవు, తుర్యుఃఁ= నాల్గవవాడవు, స్వదృక్= స్వయంప్రకాశస్వరూపుడవు, హేతుఃఁ= కారణము, అహేతుఃఁ= కారణము లేనివాడవు, ఈశుఃఁ= ఈశ్వరుడవు, అథ= అయినప్పటికీ, సర్వగుణ ప్రసిద్ధ్యై= సకలగుణముల వైషమ్యము ప్రకట-మగుటకై, స్వమాయయా= నీ మాయాశక్తిచే, యథావికారమ్= వివిధ దేహముల రూపముగా, ప్రతీయసే= కానవచ్చుచున్నావు.

నీవు రెండవది లేని ఒక్కడివి. కాలము నీనుండి ఆవిర్భవించును. నీవు జాగ్రత్స్వప్నసుషుప్తులనే మూడు అవస్థలకు మూలమైనా వాటికి అతీతమైన స్వయంప్రకాశచైతన్యస్వరూపుడవు. సర్వమునకు నీవే కారణము; కాని, నీకు కారణము లేదు. నీవు సర్వేశ్వరుడవు. అయిననూ, నీవు సత్త్వ రజస్తమోగుణములయందు వైషమ్యము ప్రకటమగుటకై నీ మాయాశక్తిచే పశుపక్ష్యాది రూపములలో ప్రకాశించుచున్నావు.

యథైవ సూర్యః పిహితశ్ఛాయయా స్వయా
ఛాయం చ రూపాణి చ సంచకాస్తి ।
ఏవం గుణేనాపిహితో గుణాంస్త్వం
ఆత్మప్రదీపో గుణినశ్చ భూమన్ ॥ 39

భూమన్= ఓ సర్వవ్యాపకా!, యథా= ఏ విధముగానైతే, సూర్యుఃఁ= సూర్యుడు, స్వయా= తనదైన, ఛాయయా= నీడచే, పిహితుఃఁ= కప్పబడువాడై, ఛాయాం చ= నీడను, రూపాణి చ= రూపములను కూడ, సంచకాస్తి= ప్రకాశింపజేయునో, ఏవమ్= ఇదే విధముగా, గుణేన= అహంకారముచే, అపిహితుఃఁ= కప్పివేయబడే, ఆత్మప్రదీపుఃఁ= స్వయంప్రకాశస్వరూపుడవైన,

త్వమ్= నీవు, గుణాన్= గుణములను, గుణినః= గుణములచే ఉపహితులైన జీవులను కూడ.

సర్వవ్యాపకుడవగు ఓ పరబ్రహ్మ! సూర్యుడు తన నీడచే కప్పివేయ-బడినా ఆ నీడను, రూపములను కూడ ప్రకాశింపజేయును. ఇదే విధముగా, అహంకారము స్వయంప్రకాశమగు ఆత్మరూపుడవై ఉన్న నిన్ను కప్పి-వేయును. అయినా, నీవు ఆ అహంకారమును, సత్త్వరజస్తమోగుణకార్యము లగు బుద్ధ్యాదులను, వాటిచే ఉపహితులైన జీవులను కూడ ప్రకాశింప జేయుచున్నావు.

యన్మాయామోహితధియః పుత్రదారగృహాదిషు ।
ఉన్మజ్జంతి నిమజ్జంతి ప్రసక్తా వృజినార్ణవే ॥ 40

యత్-మాయామోహితాః= ఎవ్వాని మాయచే మోహమును పొందిన జనులు, పుత్రదారగృహ-ఆదిషు= సంతానము భార్య ఇల్లు మొదలగువాటి యందు, ప్రసక్తాః= తగుల్కున్నవారై, వృజిన-అర్ణవే= దుఃఖసముద్రము నందు, ఉన్మజ్జంతి= పైకి తేలెదరో, నిమజ్జంతి= మునిగెదరో.

ఆ పరమేశ్వరుని మాయచే మోహితులైన జనులు సంతానము, భార్య, ఇల్లు, ధనము మొదలగువాటిలో తగుల్కొని యుందురు. వారు ఒకసారి దుఃఖమనే సముద్రములో తేలినా, మరల దానిలో మునిగి-పోవుదురు.

దేవదత్తమిమం లబ్ధ్వా నృలోకమజితేంద్రియః
యో నాద్రియేత త్వత్పాదౌ స శోచ్యో హ్యాత్మవంచకః ॥ 41

యః= ఎవడైతే, దేవదత్తమ్= కర్మాధ్యక్షుడవగు నీచే ఈయబడిన, ఇమమ్= ఈ, నృలోకమ్= మానవ దేహమును, లబ్ధ్వా= పొంది, అజిత-ఇంద్రియః= జయించబడని ఇంద్రియములు గలవాడై, త్వత్-పాదౌ= నీ పాదములను, న ఆద్రియేత= ఆదరించడో, సః= అట్టివాడు, శోచ్యః= శోకించదగినవాడు, హి= ఏలయన, ఆత్మవంచకః= తనను తాను మోసగించుకున్నవాడు.

ఎవడైతే కర్మాధ్యక్షుడవగు నీచే ఈయబడిన ఈ మనుష్య-దేహమును పొంది కూడా ఇంద్రియజయము లేక నీ పాదములను ఆరాధించడో, అట్టివాడు జాలిపడదగ్గవాడు. ఎందుకంటే, ఆతడు ఆత్మవంచన చేసుకున్నాడు.

యస్త్వాం విసృజతే మర్త్య ఆత్మానం ప్రియమీశ్వరమ్ ।
విపర్యయేంద్రియార్థార్థం విషమత్త్యమృతం త్యజన్ ॥ 42

యః ఏ, మర్త్యః= మరణశీలుడగు మానవుడైతే, ఆత్మానమ్= ఆత్మయైనట్టియు, ప్రియమ్= ప్రియుడవైనట్టియు, ఈశ్వరమ్= అంతర్యామి-వగు, త్వామ్= నిన్ను, విపర్యయ-ఇంద్రియ-అర్థ-అర్థమ్= అనాత్మలగు ఇంద్రియభోగముల కొరకై, విసృజతే= విడిచి పెట్టునో అట్టివాడు, అమృతమ్= అమృతమును, త్యజన్= విడుచువాడై, విషమ్= విషమును, అత్తి= తినుచున్నాడు.

నీవు ప్రియమగు ఆత్మవు, అంతర్యామివి. మరణశీలుడగు ఏ మానవుడైతే అనాత్మలు, అప్రియములు అగు ఇంద్రియభోగముల కొరకై అట్టి నిన్ను విడిచి పెట్టునో, అట్టివాడు అమృతమును విడిచి పెట్టి విషమును భక్షించుచున్నవానితో సమానము.

అహం బ్రహ్మాథ విబుధా మునయ శ్చామలాశయాః ।
సర్వాత్మనా ప్రపన్నా స్త్వామాత్మానం ప్రేష్ఠమీశ్వరమ్ ॥ 43

అహమ్= నేను, బ్రహ్మా= బ్రహ్మదేవుడు, అథ= మరియు, విబుధాః = దేవతలు, అమల-ఆశయాః= పవిత్రమగు అంతఃకరణము గల, మునయః చ= మహర్షులు కూడ, ప్రేతమ్= ప్రియతమమగు, ఆత్మానమ్= ఆత్మవైనట్టియు, ఈశ్వరమ్= అంతర్యామివగు, త్వామ్= నిన్ను, సర్వాత్మనా= అన్ని విధములుగా (సర్వాత్మభావముతో), ప్రపన్నాః= శరణు వేడుచున్నారు.

నీవు ప్రియతమమగు ఆత్మవు, అంతర్యామివి. నేను, బ్రహ్మదేవుడు, దేవతలు, పవిత్రమగు అంతఃకరణము గల మహర్షులు కూడ నిన్ను అన్ని విధములుగా సర్వాత్మభావముతో శరణు వేడుచున్నారు.

త్వం త్వా జగత్స్థిత్యుదయాంతహేతుం
సమం ప్రశాంతం సుహృదాత్మదైవమ్ ।
అనన్యమేకం జగదాత్మ కేతం
భవాపవర్గాయ భజామ దేవమ్ ॥ 44

జగత్-స్థితి-ఉదయ-అంతహేతుమ్= జగత్తు యొక్క సృష్టి స్థితిలయములకు కారణమైనట్టియు, సమమ్= ద్వంద్వములకు అతీతుడ-వైనట్టియు, ప్రశాంతమ్= వికారములు లేనట్టియు, సుహృత్= హితకారి-యైనట్టియు, ఆత్మదైవమ్= ఆత్మయు దైవము అయినట్టియు, అనన్యమ్= రెండవది లేని, ఏకమ్= ఒక్కటియైనట్టియు, జగద్-ఆత్మకేతమ్= జగత్తునకు జీవులకు ఆశ్రయమైనట్టియు, దేవమ్= స్వయంప్రకాశస్వరూపుడవగు, తమ్= అట్టి, త్వా= నిన్ను, భవ-అపవర్గాయ= సంసారమునుండి విముక్తి కొరకై, భజేమ= సేవించెదము.

జగత్తు యొక్క సృష్టిస్థితిలయములకు కారణమైన నీవు ద్వంద్వములకు అతీతుడవు, నిర్వికారుడవు. హితకారివగు నీవు ఆత్మవు మరియు దైవమవు. రెండవది లేని ఒకే ఒక స్వయంప్రకాశచైతన్యము నీ స్వరూపము. జగత్తు, జీవులు నీయందే ఆశ్రయించి ఉన్నారు. అట్టి నిన్ను సంసారమునుండి విముక్తి కొరకై సేవించెదము.

అయం మమేష్టో దయితోనువర్తీ మయాఽభయం దత్తమముష్య దేవ।
సంపాద్యతాం తద్భవతః ప్రసాదో యథా హి తే దైత్యపతౌ ప్రసాదః ॥45

అయమ్= ఈ బాణుడు, మమ= నాకు, ఇష్టః= ప్రియుడు, దయితా= కృపకు పాత్రుడు అగు, అనువర్తీ= అనుచరుడు, దేవ= ఓ దేవా!, మయా= నాచే, అముష్య= వీనికి, అభయమ్= అభయము, దత్తమ్= ఈయబడినది,

తత్= అందువలన, తే= నీకు, దైత్యపతౌ= రాక్షసరాజగు ప్రహ్లాదునియందు, యథా= ఏ విధముగానైతే, హి= నిశ్చయముగా, ప్రసాదః= అనుగ్రహమో అదే విధముగా, భవతః= నీ, ప్రసాదః= అనుగ్రహము, సంపాద్యతామ్= చేయబడుగాక!

ఈ బాణుడు నాకు ఇష్టుడు, కృపాపాత్రుడు అగు అనుచరుడు. ఓ దేవా! నేను వీనికి అభయమునిచ్చి యుంటిని. కాబట్టి, నీవే విధముగానైతే రాక్ష సరాజగు ప్రహ్లాదునిపై నిశ్చయముగా అనుగ్రహమును చూపితివో, అదే విధముగా వీని పై అనుగ్రహమును చూపుము.

శ్రీభగవానువాచ ।

యదాత్థ భగవంస్త్వం నః కరవామ ప్రియం తవ ।
భవతో యద్వ్యవసితం తన్మే సాధ్వనుమోదితమ్ ॥ 46

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, భగవన్= ఓ శివ భగవానుడా!, నః= మమ్ములనుద్దేశించి, త్వమ్= నీవు, యత్= ఏ మాటను, ఆత్థ= పలికితివో అదే విధముగా, తవ= నీకు, ప్రియమ్= ప్రియమును, కరవామ= చేసెదము, యత్= ఏదైతే, భవతః= నీచే, వ్యవసితమ్= నిశ్చయించబడినదో, తత్= అది, సాధు= బాగు, మే= నాచే, అనుమోదితమ్= అనుమోదించబడినది.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ శివ భగవానుడా! నీవు మాతో చెప్పిన విధముగానే నీకు ప్రియము (బాణుని అభయము)ను చేసెదము. వీని బాహువులు నరకబడవలెనని నీవు చేసిన నిశ్చయము బాగున్నది. నేను దానిని అనుమోదించినాను.

అవధ్యోఽయం మమాప్యేష వైరోచనిసుతోసురః ।
ప్రహ్లాదాయ వరో దత్తో న వధ్యో మే తవాన్వయః ॥ 47

అయమ్= ఈ, అసురః= బాణాసురుడు, మమ అపి= నాకు కూడ, అవధ్యః= వధించ దగనివాడు, ఏషః= ఈతడు, వైరోచనిసుతః= విరోచనుని పుత్రుడగు బలి యొక్క పుత్రుడు, మే= నాచే, తవ= నీ, అన్వయః= వంశము, వధ్యః= వధించబడేది, న= కాదు అని, ప్రహ్లాదాయ= ప్రహ్లాదుని కొరకు, వరః= వరము, దత్తః= ఈయబడినది.

ఈ బాణాసురుడు ప్రహ్లాదపుత్రుడగు విరోచనుని పుత్రుడైన బలియొక్క పుత్రుడు. నీ వంశములో పుట్టినవానిని నేను సంహరించనని నేను ప్రహ్లాదునకు వరమిచ్చితిని. కావున, ఈతడు నాకైననూ వధ్యుడు కాడు.

దర్పోపశమనాయాస్య ప్రవృక్ణా బాహవో మయా ।
సూదితం చ బలం భూరి యచ్చ భారాయితం భువః ॥ 48

అస్య= వీని, దర్ప-ఉపశమనాయ= గర్వమునడంచుటకై, మయా= నాచే, బాహవః= చేతులు, ప్రవృక్ణాః= నరకబడినవి, భూరి= పెద్ద, బలం చ= సైన్యము కూడ, సూదితమ్= సంహరించబడినది, యత్ చ= ఏదైతే, భువః= భూమికి, భారాయితమ్= బరువు అయినదో.

వీని గర్వమునడంచుటకై నేను చేతులను నరికితిని. భూమికి బరువగుటచే వీని సైన్యమును కూడ సంహరించితిని.

చత్వారోఽస్య భుజాశ్శిష్టా భవిష్యం త్యజరామరాః ।
పార్షదముఖ్యో భవతో నకుతశ్చిద్భయోఽసురః ॥ 49

అస్య= వీనికి, శిష్టాః= మిగిలిన, చత్వారః= నాలుగు, భుజాః= చేతులు, అజర-అమరాః= ముసలిదనము మరణము లేనివి, భవిష్యంతి= కాగలవు, నకుతశ్చిద్-భయః= దేనివలనైననూ భయములేని, అసురః= బాణాసురుడు, భవతః= నీకు, పార్షదముఖ్యః= అనుచరులలో ప్రముఖుడు.

వీనికి మిగిలియున్న నాలుగు చేతులకు ముసలిదనము గాని, మరణము గాని ఉండదు. ఈ బాణాసురుడు నీ అనుచరులలో ప్రముఖుడు కాగలడు. వీనికి దేనివలనైననూ భయము ఉండదు.

ఇతి లబ్ధ్వాఽభయం కృష్ణం ప్రణమ్య శిరసాసురః ।
ప్రాద్యుమ్నిం రథమారోప్య స వధ్వా సముపానయత్ ॥ 50

(సః – ఆ), అసురః= బాణాసురుడు, ఇతి= ఈ విధముగా, అభయమ్= అభయమును, లబ్ధ్వా= పొంది, కృష్ణమ్= శ్రీకృష్ణుని, శిరసా= శిరస్సుతో, ప్రణమ్య= ప్రణమిల్లి, ప్రాద్యుమ్నిమ్= ప్రద్యుమ్నుని పుత్రుడగు అనిరుద్ధుని, (స)వధ్వా= పెళ్లి కూతురగు ఉషతో సహా, రథమ్= రథమును, ఆరోప్య= ఎక్కించి, సముపానయత్= చక్కగా దగ్గరకు తీసుకువచ్చెను.

ఆ బాణాసురుడీ విధముగా అభయమును పొంది శ్రీకృష్ణునకు తలవంచి నమస్కరించెను. ఆతడు ప్రద్యుమ్నపుత్రుడగు అనిరుద్ధుని పెళ్లికూతురగు ఉషతో సహా రథమెక్కించి ఆదరముతో తీసుకు వచ్చెను.

అక్షౌహిణ్యా పరివృతం సువాసస్సమలంకృతమ్ ।
సపత్నీకం పురస్కృత్య యయౌ రుద్రానుమోదితః ॥ 51

అక్షౌహిణ్యా= అక్షౌహిణి సేనతో, పరివృతమ్= చుట్టువారబడి నట్టియు, సువాసః–సమలంకృతమ్= మంచి వస్త్రములచే చక్కగా అలంకరించబడినట్టియు, సపత్నీకమ్= భార్యయగు ఉషతో కూడియున్న అనిరుద్ధుని, పురస్కృత్య= ముందిడుకొని, రుద్ర–అనుమోదితః= శివునిచే అనుమోదించబడినవాడై శ్రీకృష్ణుడు, యయౌ= వెళ్లెను.

అనిరుద్ధుడు మంచి వస్త్రములతో బాగుగా అలంకరించుకొనెను. ఒక అక్షౌహిణీ సేన ఆతనిని చుట్టువారి ముందు నడువగా, శ్రీకృష్ణుడు శివుని అనుమతి తీసుకొని వెళ్లెను.

స్వరాజధానీం సమలంకృతాం ధ్వజై
స్తోరణై రుక్షితమార్గచత్వరామ్ ।
వివేశ శంఖానకదుందుభిస్వనై
రభ్యుద్యతః పౌరసుహృద్ద్విజాతిభిః ॥ 52

సః= ఆ శ్రీకృష్ణుడు, పౌరసుహృద్-ద్విజాతిభిః= పౌరులచే మిత్రులచే బ్రాహ్మణులచే, శంఖ-ఆనకదుందుభిస్వనైః= శంఖముల తప్పెట్ల భేరీల ధ్వనులతో, అభి-ఉద్యతః= ఎదురేగబడినవాడై, తోరణైః= తోరణములతో, ధ్వజైః= జెండాలతో, సమలంకృతామ్= బాగుగా అలంకరించబడినట్టియు, ఉక్షితమార్గచత్వరామ్= నీరు చల్లబడిన వీథులు కూడళ్లు కలిగిన, స్వరాజధానీమ్= తన రాజధానిని, వివేశ= ప్రవేశించెను.

రాజధానియగు ద్వారకలో పౌరులు, మిత్రులు, బ్రాహ్మణులు శంఖముల, తప్పెట్ల, భేరీల ధ్వనులతో శ్రీకృష్ణునకు ఎదురేగిరి. వీథులలో, కూడళ్లలో నీరు చల్లి, జెండాలతో, తోరణములతో చక్కగా అలంకరించ-బడిన నగరమును ఆయన ప్రవేశించెను.

య ఏవం కృష్ణ విజయం శంకరేణ చ సంయుగమ్ ।
సంస్మరేత్ప్రాతరుత్థాయ న తస్య స్యాత్పరాజయః ॥ 53

ఇతి శ్రీ మద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే త్రిషష్టితమోఽధ్యాయః ॥

ఏవమ్= ఈ విధముగా, కృష్ణవిజయమ్= శ్రీకృష్ణుని విజయమును, శంకరేణ చ= శివునితో గూడ, సంయుగమ్= యుద్ధమును, యః= ఎవడైతే, ప్రాతః= ఉదయమే, ఉత్థాయ= లేచి, సంస్మరేత్= చక్కగా స్మరించునో, తస్య= వానికి, పరాజయః= అపజయము, న స్యాత్= కలుగదు.

ఈ విధముగా శ్రీకృష్ణుడు విజయమును పొందుటను, శంకరునితో యుద్ధము చేయుటను గూడ ఎవడైతే ఉదయమే నిద్రలేచి మంచిగా స్మరించునో, వానికి పరాజయము ఉండదు.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
బాణాసురునితో శ్రీకృష్ణుని యుద్ధమును వర్ణించే
అరువది మూడవ అధ్యాయము ముగిసినది (63).

అథ చతుష్షష్టితమోఽధ్యాయః

నృగ మహారాజు వృత్తాంతము

శ్రీశుక ఉవాచ ।

ఏకదోపవనం రాజన్ జగ్ము ర్యదుకుమారకాః ।
విహర్తుం సాంబప్రద్యుమ్నచారుభానుగదాదయః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజన్= ఓ పరీక్షిన్మహారాజా!, ఏకదా= ఒకనాడు, సాంబప్రద్యుమ్న చారుభానుగద-ఆదయః= సాంబుడు ప్రద్యుమ్నుడు చారుభానుడు గదుడు మొదలుగా గల, యదుకుమారకాః= యాదవ యువకులు, విహర్తుమ్= విహరించుటకై, ఉపవనమ్= ఉద్యానవనమును గురించి, జగ్ముః= వెళ్లిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! ఒకనాడు సాంబుడు, ప్రద్యుమ్నుడు, చారుభానుడు, గదుడు, అనిరుద్ధుడు మొదలైన యాదవ యువకులు విహరించుటకై ఉద్యానవనమునకు వెళ్లిరి.

క్రీడిత్వా సుచిరం తత్ర విచిన్వంతః పిపాసితాః ।
జలం నిరుదకే కూపే దదృశు స్సత్త్వమద్భుతమ్ ॥ 2

తత్ర= అచట, సుచిరమ్= చాల సేపు, క్రీడిత్వా= ఆటలాడి, పిపాసితాః= దప్పిక గొన్నవారై, జలమ్= నీటిని, విచిన్వంతః= వెదుకుచున్న వారై, నిరుదకే= నీరు లేని, కూపే= నూతియందు, అద్భుతమ్= అచ్చెరువును గొలిపే, సత్త్వమ్= ప్రాణిని, దదృశుః= చూచిరి.

వారచట చాలసేపు ఆటలాడి దప్పిక గొన్నవారై నీటికొరకు వెదుకుచుండగా, వారికి నీరు లేని నూతిలో అద్భుతమైన ప్రాణి ఒకటి కనబడెను.

కృకలాసం గిరినిభం వీక్ష్య విస్మితమానసాః ।
తస్య చోద్ధరణే యత్నం చక్రుస్తే కృపయాన్వితాః ॥ 3

గిరినిభమ్= కొండను పోలిన, కృకలాసమ్= ఊసరవెల్లిని, వీక్ష్య= చూచి, విస్మితమానసాఃఆశ్చర్యముతో నిండిన మనస్సులు గల, తే= వారు, కృపయా= దయతో, అన్వితాఃకూడినవారై, తస్య= దానియొక్క, ఉద్ధరణే చ= పైకి తీయుటయందు కూడ, యత్నమ్= ప్రయత్నమును, చక్రుఃచేసిరి.

కొండను పోలిన ఆ ఊసరవెల్లిని చూచి వారి మనస్సులు ఆశ్చర్యముతో నిండెను. వారికి దానిపై దయ కలిగి, దానిని పైకి తీసే ప్రయత్నమును కూడ చేసిరి.

చర్మజై స్తాంతవైఃపాశై ర్బద్ధ్వా పతితమర్భకాఃఁ
నాశక్నువన్ సముద్ధర్తుం కృష్ణాయాచఖ్యురుత్సుకాఃఁ ॥ 4

అర్భకాఃపిల్లలు, పతితమ్= పడిపోయిన ఆ ప్రాణిని, చర్మజైఃచర్మమయములైనట్టియు, తాంతవైఃపేనబడిన, పాశైఃత్రాళ్లతో, బద్ధ్వా= కట్టి, సముద్ధర్తుమ్= పైకి తీయుటకు, న అశక్నువన్= సమర్థులు కాకుండిరి, ఉత్సుకాఃఉత్కంఠ గలవారై, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, ఆచఖ్యుఃవివరించి చెప్పిరి.

ఆ యువకులు చర్మమయములైనట్టియు, పేనబడిన త్రాళ్లతో నూతిలో పడ్డ ఆ ఊసరవెల్లిని పైకి తీసే ప్రయత్నము చేసి విఫలమైరి. అపుడు వారా విషయమును ఉత్కంఠతో శ్రీకృష్ణునకు వివరించి చెప్పిరి.

తత్రాగత్యారవిందాక్షో భగవాన్ విశ్వభావనఃఁ
వీక్ష్యోజ్జహార వామేన తం కరేణ స లీలయా ॥ 5

అరవింద-అక్షఃఁ= - పద్మములవంటి కన్నులు గలవాడు, విశ్వ-భావనఃఁ= జగత్తును పాలించువాడు అగు, సఃఆ, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తత్ర= అచటకు, ఆగత్య= వచ్చి, తమ్= దానిని, వీక్ష్య=

చూచి, లీలయా= అవలీలగా, వామేన= ఎడమ, కరేణ= చేతితో, ఉజ్జహార= పైకి తీసెను.

పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణభగవానుడు జగత్తునకు రక్షకుడు. ఆయనకు అచటకు వచ్చి దానిని చూచి అవలీలగా ఎడమ చేతితో పైకి తీసెను.

స ఉత్తమశ్లోకకరాభిమృష్టో విహాయ సద్యః కృకలాసరూపమ్ ।
సంతప్తచామీకరచారువర్ణ స్స్వర్గ్యద్భుతాలంకరణాంబరస్రక్ ॥ 6

ఉత్తమశ్లోకకర–అభిమృష్టః= పవిత్రకీర్తియగు శ్రీకృష్ణభగవానుని చేతితో స్పృశించబడిన, సః= ఆ ప్రాణి, సద్యః= వెంటనే, కృకలాసరూపమ్= ఊసరవెల్లి రూపమును, విహాయ= విడిచిపెట్టి, సంతప్తచామీకరచారువర్ణః = పుటము పెట్టిన బంగారము వలె అందమైన కాంతి గలవాడు, అద్భుత–అలంకరణ–అంబరస్రక్= ఆశ్చర్యమును కలిగించే ఆభరణములు, వస్త్రములు మాలలు గలవాడు అగు, స్వర్గీ= దేవత (ఆయెను).

పవిత్రకీర్తియగు శ్రీకృష్ణ భగవానుడు చేతితో స్పృశించిన వెంటనే ఆ ఊసరవెల్లి ఆ రూపమును విడిచి పెట్టి, పుటము పెట్టిన బంగారము వలె అందమైన కాంతి గల దేవత ఆయెను. ఆ దేవతయొక్క ఆభరణములు, వస్త్రములు, మాలలు అచ్చెరువు గొలుపుచుండెను.

పప్రచ్ఛ విద్వానపి తన్నిదానం
జనేషు విఖ్యాపయితుం ముకుందః ।
కస్త్వం మహాభాగ వరేణ్యరూపో
దేవోత్తమం త్వాం గణయామి నూనమ్ ॥ 7

ముకుందః= మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుడు, తత్–నిదానమ్= ఆ ఊసరవెల్లి పుట్టుకకు కారణమును, విద్వాన్ అపి= తెలిసినవాడే అయిననూ, జనేషు= జనులయందు, విఖ్యాపయితుమ్=

ప్రసిద్ధముగా చేయుటకై, పప్రచ్ఛ= ప్రశ్నించెను, మహాభాగ= ఓ గొప్ప భాగ్యవంతుడా!, వరేణ్యరూపః= మిక్కిలి శ్రేష్ఠమగు రూపము గల, త్వమ్= నీవు, కః= ఎవడివి?, త్వామ్= నిన్ను, నూనమ్= నిశ్చయముగా, దేవ-ఉత్తమమ్= దేవతలలో ఉత్తమునిగా, గణయామి= పరిగణించుచున్నాను.

ఊసరవెల్లికి ఆ జన్మ వచ్చుటకు గల కారణము మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణునకు తెలిసినదే. అయినా, జనులలో ప్రసిద్ధమగుటకై ఆయన ఇట్లు ప్రశ్నించెను - ఓయీ! చాల శ్రేష్ఠమగు రూపము గల నీవు గొప్ప భాగ్యవంతుడవు. నీవు నిశ్చయముగా దేవతోత్తముడవని నా అభిప్రాయము.

దశమిమాం వా కతమేన కర్మణా
సంప్రాపితోస్యతదర్హ స్సుభద్ర ।
ఆత్మానమాఖ్యాహి వివిత్సతాం నో
యన్మన్యసే నః క్షమమత్ర వక్తుమ్ ॥ 8

సుభద్ర= ఓ మంగళమూర్తీ!, అతద్-అర్హః= దానికి తగని నీవు, ఇమామ్= ఈ, దశామ్= దశను, కతమేన= ఏ, కర్మణా= కర్మచే, సంప్రాపితః = పొందించబడినవాడవు, అసి వా= అగుచున్నావు? అత్ర= ఈ విషయమునందు (ఇప్పుడు), వివిత్సతామ్= తెలియ గోరే, నః= మాకు, వక్తుమ్= చెప్పుటకు, క్షమమ్= తగినదని, యత్ మన్యసే= నీవు తలపోసే పక్షములో, ఆత్మానమ్= నీ గురించి, ఆఖ్యాహి= చెప్పుము.

ఓ మంగళమూర్తీ! నీవు ఏ కర్మను చేసి ఈ (ఊసరవెల్లి) స్థితిని పొందితివి? ఇది నీకు తగి లేదు. నీ గురించి తెలియాలని మా కోరిక. మేము చెప్పదగ్గవారమని నీకనిపిస్తే ఇప్పుడు నీ గురించి చెప్పుము.

శ్రీశుక ఉవాచ ।
ఇతి స్మ రాజా సంపృష్టః కృష్ణేనానంతమూర్తినా ।
మాధవం ప్రణిపత్యాహ కిరీ టేనార్కవర్చసా ॥ 9

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= అని, అనంతమూర్తినా= అనంతమగు రూపములు గల, కృష్ణేన= శ్రీకృష్ణ భగవానునిచే, సంపృష్టః= మంచిగా ప్రశ్నించబడిన, రాజా= నృగమహారాజు, అర్కవర్చసా= సూర్యుడు వలె వెలిగిపోయే, కిరీటేన= కిరీటముతో, మాధవమ్= లక్ష్మీపతియగు శ్రీకృష్ణుని, ప్రణిపత్య= ప్రణమిల్లి, ఆహ స్మ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...అనంతమైన రూపములు గల శ్రీకృష్ణ భగవానుడీ తీరున మంచిగా ప్రశ్నించెను. ఆయన పూర్వజన్మలో నృగమహారాజు ఆయన సూర్యుడు వలె వెలిగిపోయే కిరీటమును నేలకు ఆన్చి ఆ లక్ష్మీపతికి ప్రణమిల్లి ఇట్లు పలికెను.

నృగ ఉవాచ ।

నృగో నామ నరేంద్రోఽహమిక్ష్వాకుతనయః ప్రభో ।
దానిష్వాఖ్యాయమానేషు యది తే కర్ణమస్పృశమ్ ॥ 10

నృగఃనృగుడు, ఉవాచ= పలికెను, ప్రభో= ఓ ప్రభూ!, అహమ్= నేను, నృగఃనామ= నృగుడని ప్రసిద్ధి గాంచిన, ఇక్ష్వాకుతనయఃఇక్ష్వాకువు యొక్క పుత్రుడైన, నర-ఇంద్రఃరాజును, దానిషు= దాతలు, ఆఖ్యాయమానేషు= కీర్తించబడుచుండగా, తే= నీ, కర్ణమ్= చెవిని, యది అస్పృశమ్= స్పృశించినానా యేమి ?

నృగుడిట్లు పలికెను...ఓ ప్రభూ! నేను నృగుడని ప్రసిద్ధి గాంచిన మహారాజును, ఇక్ష్వాకువు యొక్క పుత్రుడను. దాతల గురించి పొగిడే సందర్భములో నేను నీ చెవిన పడినానా యేమి? (నీవు వినే ఉంటావు).

కిం ను తేఽవిదితం నాథ సర్వభూతాత్మ సాక్షిణః ।
కాలేనావ్యాహతదృశో వక్ష్యేఽథాపి తవాజ్ఞయా ॥ 11

నాథ= ఓ ప్రభూ!, సర్వభూత-ఆత్మసాక్షిణః= సకల ప్రాణులలో బుద్ధి సాక్షి వైనట్టియు, కాలేన= కాలముచే, అవ్యాహతదృశః= ప్రతిహతము కాని జ్ఞానము కలిగిన, తే= నీకు, అవిదితమ్= తెలియనిది, కిం ను= ఏమి ఉండును?, అథ అపి= అయినప్పటికీ, తవ= నీ, ఆజ్ఞయా= ఆదేశముచే, వక్ష్యే= చెప్పగలను.

ఓ ప్రభూ! సకల ప్రాణులలో బుద్ధివృత్తులకు సాక్షిగా ఉండే నీ జ్ఞానము ఏ కాలమునందైననూ మొక్కవోదు. నీకు తెలియనిది ఏమి ఉండును? అయినప్పటికీ, నీ ఆదేశానుసారముగా చెప్పెదను.

యావత్య స్సికతా భూమే ర్యావత్యో దివి తారకాః ।
యావత్యో వర్షధారాశ్చ తావతీరదదాం స్మ గాః ॥ 12

భూమేః= భూమి యొక్క, సికతాః= ఇసుక రేణువులు, యావత్యః = ఎన్నియో, దివి= ద్యులోకమునందు, తారకాః= నక్షత్రములు, యావత్యః = ఎన్నియో, వర్షధారాః చ= వర్షధారలు కూడ, యావత్యః= ఎన్నియో, తావతీః= అన్ని, గాః= గోవులను, అదదాం స్మ= దానము చేసితిని.

భూమిపై ఇసుక రేణువులు ఎన్నో, దివిలో తారకలెన్నో, వర్షధారలు ఎన్ని పడునో, అన్ని గోవులను నేను దానము చేసితిని.

పయస్వినీ స్తరుణీ శ్శీలరూప
గుణోపపన్నాः కపిలా హేమశృంగీः ।
న్యాయార్జితా రూప్యఖురా స్సవత్సా
దుకూలమాలాఽఽభరణా దదావహమ్ ॥ 13

అహమ్= నేను, పయస్వినీః= పాలిచ్చునట్టియు, తరుణీః= వయస్సులోనున్నట్టియు, శీలరూపగుణ-ఉపపన్నాః= మంచి నడవడి రూపము జాతిగుణములతో కూడినట్టియు, హేమశృంగీః= బంగరు కొమ్ములు కలిగినట్టియు, న్యాయ-ఆర్జితాః= న్యాయముగా సంపాదించ-

బడినట్టియు, రూప్యఖురాఃᳫ వెండి డెక్కలు కలిగినట్టియు, సవత్సాఃᳫ దూడలతో కూడినట్టియు, దుకూలమాలా-ఆభరణాఃᳫ వస్త్రము మాల ఆభరణములు కలిగిన, కపిలాఃᳫ కపిలగోవులను, దదౌᳫ ఇచ్చితిని.

నేను వయస్సులో ఉండి పాలిచ్చే కపిలగోవులను దూడలతో సహా దానము చేసితిని. నేను న్యాయముగా సంపాదించిన ఆ గోవులు మంచి జాతికి చెందినవి. అందమైన ఆ గోవులు మంచి నడవడి గలవి. వాటి కొమ్ములకు బంగారముతో, డెక్కలకు వెండితో తొడుగులను వేసి, వస్త్రములను కప్పి, మాలలను ఆభరణములను అలంకరించి దానము చేసితిని.

సువలంకృతేభ్యో గుణశీలవద్భ్య స్సీదత్కుటుంబేభ్య ఋతవ్రతేభ్యఃᳫ,
తపశ్శ్రుతబ్రహ్మవదాన్యసద్భ్యః ప్రాదాం యువభ్యో ద్విజపుంగవేభ్యఃᳫ. 14

సు-అలంకృతేభ్యఃᳫ బాగుగా అలంకరించబడినట్టియు, గుణశీల-వద్భ్యఃᳫ మంచి గుణములు శీలము కలిగినట్టియు, సీదత్-కుటుంబేభ్యఃᳫ = కష్టపడే కుటుంబములు కలిగినట్టియు, ఋతవ్రతేభ్యఃᳫ కపటము లేని నియమ నిష్ఠలు కలిగినట్టియు, తపఃᳫ-శ్రుతబ్రహ్మవదాన్య సద్భ్యఃᳫ తపస్సుచే ఖ్యాతి గాంచినవారు వేదమును చెప్పుటయందు వెనుదీయని వారు సమచిత్తులు అయినట్టియు, యువభ్యఃᳫ యువకు లైనట్టియు, ద్విజపుంగ-వేభ్యఃᳫ శ్రేష్ఠులైన బ్రాహ్మణుల కొరకు, ప్రాదామ్ᳫ దానము చేసితిని.

నేను యువకులైన శ్రేష్ఠబ్రాహ్మణులకు అలంకారములనిచ్చి గోవులను దానము చేసితిని. వారి కుటుంబములు దారిద్ర్యముచే కష్టపడుచున్ననూ, వారు సద్గుణములు శీలము గలవారు. కపటము లేని నియమనిష్ఠలు గల ఆ బ్రాహ్మణులు తపస్సునకు పెట్టిన పేరు. వారు సమచిత్తులై దానుకోకుండా వేదమును బోధించెడివారు.

గోభూహిరణ్యాయతనాశ్వహస్తినఃᳫ కన్యా స్సదాసీ స్తిలరూప్యశయ్యాఃᳫ ।
వాసాంసి రత్నాని పరిచ్ఛదాన్రథానిష్టం చ యజ్ఞైశ్చరితం చ పూర్తమ్ᳫ॥ 15

గోభూహిరణ్య-ఆయతన-అశ్వహస్తినః= ఎద్దులు భూమి బంగారము ఇళ్లు గుర్రములు ఏనుగులను, సదాసీః= దాసీలతో కూడిన, కన్యాః= కన్యలను, తిలరూప్యశయ్యాః= నువ్వులను వెండిని శయ్యలను, వాసాంసి= వస్త్రములను, రత్నాని= రత్నములను, పరిచ్ఛదాన్= ఇంటి సామానులను, రథాన్= రథములను (ఇచ్చితిని), యజ్ఞైః= యజ్ఞములచే, ఇష్టం చ= ఆరాధన కూడ చేయబడినది, పూర్తం చ= పూర్తకర్మ కూడ, చరితమ్= ఆచరించబడినది.

నేను ఎద్దులను, భూమిని, బంగారమును, ఇళ్లను, గుర్రములను, ఏనుగులను, దాసీలతో కూడిన కన్యలను, నువ్వులను, వెండిని, శయ్యలను, వస్త్రములను, రత్నములను, ఇంటి సామగ్రిని, రథములను దానము చేసితిని. యజ్ఞములను చేసి ఈశ్వరుని ఆరాధించితిని. నూతులను త్రవ్వించుట మొదలైన పూర్తకర్మలను కూడ అనుష్ఠించితిని.

కస్యచిద్ద్విజముఖ్యస్య భ్రష్టా గౌర్మమ గోధనే ।
సంపృక్తాఽవిదుషా సా చ మయా దత్తా ద్విజాతయే ॥ 16

కస్యచిత్= ఒకానొక, ద్విజముఖ్యస్య - శ్రేష్ఠ బ్రాహ్మణునియొక్క, గౌఃగోవు, భ్రష్టా= దారి తప్పినదై, మమ= నాయొక్క, గోధనే= గోసంపద యందు, సంపృక్తా= కలిసినది, సా చ= ఆ గోవైతే, అవిదుషా= తెలియని, మయా= నాచే, ద్విజాతయే= బ్రాహ్మణుని కొరకు, దత్తా= ఈయబడినది.

ఒక శ్రేష్ఠ బ్రాహ్మణుని గోవు దారితప్పి నా గోవుల మందలో కలిసినది. ఆ విషయము తెలియని నేను దానిని బ్రాహ్మణునకు దానము చేసితిని.

తాం నీయమానాం తత్స్వామీ దృష్ట్వోవాచ మమేతి తమ్ ।
మమేతి ప్రతిగ్రాహ్యాహ నృగో మే దత్తవానితి ॥ 17

నీయమానామ్= తోలుకుపోబడుచున్న, తామ్= ఆ గోవును, దృష్ట్వా= చూచి, తత్-స్వామీ= దాని స్వామియగు బ్రాహ్మణుడు, తమ్= ఆ బ్రాహ్మణుని ఉద్దేశించి, మమ= నాది, ఇతి= అని, ఉవాచ= పలికెను, ప్రతిగ్రహీ= గోదానమును తీసుకున్న బ్రాహ్మణుడు, మమ= నాది, ఇతి= అని, నృగః= నృగమహారాజు, మే= నా కొరకు, దత్తవాన్= ఇచ్చినవాడు, ఇతి= అని, ఆహ= పలికెను.

దానమును తీసుకున్న బ్రాహ్మణుడు ఆ గోవును తోలుకొనిపోవు-చుండగా దాని స్వామియగు బ్రాహ్మణుడు చూచి, ఈ గోవు నాది అని చెప్పెను. ఆ బ్రాహ్మణుడు, ఇది నాది, నాకు నృగమహారాజు ఇచ్చినాడు, అని బదులు చెప్పెను.

విప్రౌ వివదమానౌ మామూచతు స్స్వార్థసాధకౌ ।
భవాన్ దాతాఽపహర్తేతి తచ్ఛ్రుత్వా మేభవద్భ్రమః ॥ 18

స్వ-అర్థసాధకౌ= తమ పనిని చక్కబెట్టుకొనే, విప్రౌ= బ్రాహ్మణు-లిద్దరు, వివదమానౌ= వివాదపడుచున్నవారై, మామ్= నన్ను ఉద్దేశించి, ఊచతుః= పలికిరి, దాతా= దాతవగు, భవాన్= నీవు, అపహర్తా= చోరుడవు, ఇతి= అనే, తత్= ఆ మాటను, శ్రుత్వా= విని, మే= నాకు, భ్రమః= భ్రమ, అభవత్= కలిగెను.

తమ పనిని చక్కబెట్టుకొనే ఆ బ్రాహ్మణులిద్దరు దెబ్బలాడుకుంటూ నాతో - నీవు చోరీ చేసి దానము చేసితివి - అని పలికిరి. వారి ఆ మాటను విని నాకు తల తిరిగిపోయెను.

అనునీతావుభౌ విప్రౌ ధర్మకృచ్ఛ్రగతేన వై ।
గవాం లక్షం ప్రకృష్టానాం దాస్యామ్యేషా ప్రదీయతామ్ ॥ 19

ధర్మకృచ్ఛ్రగతేన= ధర్మసంకటములో పడిన నాచే, ఉభౌ= ఇద్దరు, విప్రౌ= బ్రాహ్మణులు, వై= నిశ్చయముగా, అనునీతౌ= అనునయించబడిరి,

ప్రకృష్టానామ్= గొప్పవైన, గవామ్= గోవులయొక్క, లక్షమ్= లక్షను, దాస్యామి= ఈయగలను, ఏషా= ఈ గోవు, ప్రదీయతామ్= ఈయబడుగాక!

ధర్మసంకటములో పడిన నేను ఆ బ్రాహ్మణులిద్దరినీ జాగ్రత్తగా అనునయించే యత్నమును చేసితిని. లక్ష గొప్ప గోవులనిచ్చెదను, ఈ గోవును నాకిమ్ము, అని వారిని కోరితిని.

భవంతావనుగృహ్ణీతాం కింకరస్యావిజానతః ।
సముద్ధరత మాం కృచ్ఛ్రాత్పతంతం నిరయేఽశుచౌ ॥ 20

కింకరస్య= సేవకుడనైనట్టియు, అవిజానతః= తెలియని నాకు, భవంతౌ= మీరిద్దరు, అనుగృహ్ణీతామ్= అనుగ్రహమును చూపెదరు గాక!, అశుచౌ= అమంగళకరమగు, నిరయే= నరకమునందు, పతంతమ్= పడిపోవుచున్న, మామ్= నన్ను, కృచ్ఛ్రాత్= ఆపదనుండి, సముద్ధరత= పైకి తీయుడు.

నేను మీ సేవకుడను. తెలియక తప్పు చేసితిని. మీరిద్దరు నన్ను అనుగ్రహించుడు. అమంగళకరమగు నరకములో పడిపోవుచున్న నన్ను మీరు ఆపదనుండి గట్టెక్కించుడు.

నాహం ప్రతీచ్ఛే వై రాజన్నిత్యుక్త్వా స్వామ్యపాశ్రమత్ ।
నాన్యద్గవామయుత మిచ్ఛామీత్యపరో యయౌ ॥ 21

రాజన్= ఓ రాజా!, అహమ్= నేను, వై= నిశ్చయముగా, న ప్రతీచ్ఛే= స్వీకరించను, ఇతి= అని, ఉక్త్వా= పలికి, స్వామీ= గోవుయొక్క యజమాని, అపాశ్రమత్= తొలగిపోయెను, అపరః= రెండవవాడు, గవామ్= గోవుల యొక్క, అన్యత్= మరియొక, అయుతం అపి= పదివేలను కూడ, న ఇచ్ఛామి= ఇష్టపడను, ఇతి= అని, యయౌ= వెళ్లెను.

ఓ రాజా! నేను నిశ్చయముగా ఈ గోవుకు బదులుగా లక్ష గోవులనైననూ తీసుకోను, అని చెప్పి ఆ గోవుయొక్క యజమాని వెడలిపోయెను. లక్షకంటే అధికముగా మరో పదివేల గోవులనిచ్చినా నాకు అక్కర లేదు, అంటూ రెండవ బ్రాహ్మణుడు నిష్క్రమించెను.

ఏతస్మిన్నంతరే యామ్యై ర్దూతైర్నీతో యమక్షయమ్ ।
యమేన పృష్టస్తత్రాహం దేవదేవ జగత్పతే ॥ 22

దేవదేవ= ఓ దేవాధిదేవా!, జగత్–పతే= జగన్నాథా!, ఏతస్మిన్= ఈ, అంతరే= మధ్యయందు, యామ్యైఃr= యమునకు చెందిన, దూతైఃr= దూతలచే, యమక్షయమ్= యమసదనమును గురించి, నీతఃr= కొనిపో–బడినవాడను, తత్ర= అచట, అహమ్= నేను, యమేన= యమునిచే, పృష్టఃr= ప్రశ్నించబడితిని.

ఓ దేవాధిదేవా! నీవు జగన్నాథుడవు. ఇంతలో నా జీవితము సమాప్తమైనది. నన్ను యముని కింకరులు యమలోకమునకు కొనిపోయిరి. అచట యముడు నన్నిట్లు ప్రశ్నించెను.

పూర్వం త్వమశుభం భుంక్షే ఉతాహో నృపతే శుభమ్ ।
నాంతం దానస్య ధర్మస్య పశ్యే లోకస్య భాస్వతః ॥ 23

నృపతే= ఓ రాజా!, త్వమ్= నీవు, పూర్వమ్= ముందుగా, అశుభమ్= పాపమును, భుంక్షే= అనుభవించెదవా?, ఉతాహో= లేక, శుభమ్= పుణ్యమునా?, దానస్య= దానమునకు, ధర్మస్య= ధర్మమునకు, భాస్వతఃr = ప్రకాశించే, లోకస్య= లోకమునకు, అంతమ్= హద్దును, న పశ్యే= కానరాకున్నాను.

ఓ రాజా! నీవు ముందుగా పాపముననుభవించెదవా? లేక, పుణ్యమునా? నీవు చేసిన దానధర్మములకు, నీకు లభించే ప్రకాశవంతమైన లోకములకు అంతము నాకు కనబడుట లేదు.

పూర్వం దేవాశుభం భుంజ ఇతి ప్రాహ పతేతి సః ।
తావదద్రాక్షమాత్మానం కృకలాసం పతన్ ప్రభో ॥ 24

దేవ= ఓ దేవా!, పూర్వమ్= ముందుగా, అశుభమ్= పాపమును, భుంజే= అనుభవించెదను, ఇతి= అని, సః= ఆ యముడు, పత= పడుము, ఇతి= అని, ప్రాహ= పలికెను, ప్రభో= ఓ ప్రభూ!, తావత్= అంతలో, పతన్= పడుచున్నవాడనై, ఆత్మానమ్= నన్ను, కృకలాసమ్= ఊసరవెల్లినిగా, అద్రాక్షమ్= కనుగొంటిని.

ఓ దేవా! ముందుగా నేను పాపముననుభవించెదనని నేను చెప్పగా, పడిపో! అని యముడు పలికెను. ఓ శ్రీకృష్ణప్రభూ! అంతలో నేను పడిపోతూ, ఊసరవెల్లి రూపమును పొందితినని గుర్తించితిని.

బ్రహ్మణ్యస్య వదాన్యస్య తవ దాసస్య కేశవ ।
స్మృతి ర్నాద్యాపి విధ్వస్తా భవత్సందర్శనార్థినః ॥ 25

కేశవ= ఓ శ్రీకృష్ణా!, బ్రహ్మణ్యస్య= బ్రాహ్మణభక్తుడనైనట్టియు, వదాన్యస్య= దాతనైనట్టియు, తవ= నీ, దాసస్య= సేవకుడనైనట్టియు, భవత్-సందర్శన-అర్థినః= నీ దర్శనమును కోరే నాకు, అద్య అపి= ఈ నాటికీ, స్మృతిః= పూర్వజన్మస్మరణము, న విధ్వస్తా= నశించలేదు.

శ్రీకృష్ణా! నేను బ్రాహ్మణభక్తుడనైన దాతను. నీ సేవకుడనగు నేను నీ దర్శనమును కోరుచుంటిని. నాకిప్పటికీ పూర్వజన్మస్మృతి నశించలేదు.

స త్వం కథం మమ విభోఽక్షిపథః పరాత్మా
యోగేశ్వరై శ్రుతిదృశామలహృద్విభావ్యః ।
సాక్షాదధోక్షజ ఉరువ్యసనాంధబుద్ధేః
స్యాన్మేఽనుదృశ్య ఇహ యస్య భవాపవర్గః ॥ 26

విభో= ఓ ప్రభూ!, పర–ఆత్మా= పరమాత్మవు, యోగ–ఈశ్వరైః= గొప్ప యోగులచే, శ్రుతిదృశా= ఉపనిషత్తు అనే చూపుతో, అమలహృద్–విభావ్యః= పవిత్రమగు అంతఃకరణమునందు భావన చేయబడే, సః= అట్టి, త్వమ్= నీవు, ఉరువ్యసన–అంధబుద్ధేః= పెద్ద ఆపదచే వివేకమును కోల్పోయిన బుద్ధి గల, మమ= నాకు, కథమ్= ఏ విధముగా, అక్షిపథః= దర్శనమునకు విషయము ఐతివి?, అధోక్షజః= ఇంద్రియజ్ఞానమునకు అతీతుడవైన నీవు, మే= నాకు, సాక్షాత్= ప్రత్యక్షము, ఇహ= ఈ సంసారము నందు, యస్య= ఎవనికైతే, భవ–అపవర్గః= సంసారబంధము నుండి విముక్తియో వానికి, అనుదృశ్యః= చూడదగినవాడవు, స్యాత్= అగుదువు.

ఓ ప్రభూ! గొప్ప యోగులు ఉపనిషత్తు (అభేదదృష్టి) అనే దృష్టితో పవిత్రమైన అంతఃకరణమునందు పరమాత్మవగు నిన్ను భావన చేసెదరు. అట్టి నీవు పెద్ద ఆపదచే వివేకమును కోల్పోయి ఉన్న నా కంట ఎట్లు బడితివి? ఇంద్రియగోచరము కాని దేవుడు నాకు ప్రత్యక్షమైనాడు. ఎవనికైతే సంసారబంధమునుండి విముక్తి కలిగే వేళ వచ్చునో, వానికి నీవు దర్శనమిచ్చెదవు.

దేవ దేవ జగన్నాథ గోవింద పురుషోత్తమ ।
నారాయణ హృషీకేశ పుణ్యశ్లోకాచ్యుతావ్యయ ॥ 27

దేవదేవ= ఓ దేవాధిదేవా!, జగత్–నాథ= ఓ జగన్నాథా!, గోవింద= ఓ గోవిందా!, పురుష–ఉత్తమః= ఓ పురుషోత్తమా!, నారాయణ= ఓ నారాయణా!, హృషీక–ఈశ= ఓ ఇంద్రియాంతర్యామీ!, పుణ్యశ్లోక= పవిత్ర మగు కీర్తి గలవాడా!, అచ్యుత= ఓ అచ్యుతా!, అవ్యయ= అవ్యయా!

ఓ దేవాధిదేవా! నీవు జగన్నాథుడవు. ఓ గోవిందా! పురుషోత్తమా! నారాయణా! ఇంద్రియములను ప్రవర్తిల్లజేసేది నీవే. నీ కీర్తి పావనము చేయును. నీకు స్వరూపచ్యుతి గాని, నాశము గాని లేవు.

అనుజానీహి మాం కృష్ణ యాంతం దేవగతిం ప్రభో ।
యత్ర క్వాపి సతశ్చేతో భూయాన్మే త్వత్పదాస్పదమ్ ॥ 28

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, దేవగతిమ్= స్వర్గలోకమును గురించి, యాంతమ్= వెళ్లుచున్న, మామ్= నన్ను, అనుజానీహి= అనుమతించుము, యత్ర క్వ అపి= ఎక్కడనైననూ, సతః= ఉండే, మే= నాయొక్క, చేతః= మనస్సు, త్వత్-పద-ఆస్పదమ్= నీ పాదము ఆశ్రయముగా గలది, భూయాత్= అగుగాక!

ఓ శ్రీకృష్ణా! నేను స్వర్గలోకమునకు వెళ్లుచున్నాను. ఓ ప్రభూ! నాకు అనుమతినిమ్ము. నేను ఎక్కడ ఉన్నా, నా మనస్సు నీ పాదములనే ఆశ్రయించుగాక!

నమస్తే సర్వభావాయ బ్రహ్మణేఽనంతశక్తయే ।
కృష్ణాయ వాసుదేవాయ యోగానాం పతయే నమః ॥ 29

సర్వభావాయ= సర్వమునకు ఉపాదానమైనట్టియు, బ్రహ్మణే= పరబ్రహ్మ వైనట్టియు, అనంతశక్తయే= అనంతమగు శక్తి కలిగిన, తే= నీ కొరకు, నమః= నమస్కారము, వాసుదేవాయ= వసుదేవపుత్రుడైనట్టియు, యోగానామ్= యోగులకు, పతయే= ప్రభువగు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, నమః= నమస్కారము.

సర్వమునకు ఉపాదానమైన అనంతశక్తి గల పరబ్రహ్మ నీవే. నీవు వసుదేవుని పుత్రుడగు శ్రీకృష్ణుడవై అవతరించి యోగులను కాపాడుచున్నావు. నీకు అనేక నమస్కారములు.

ఇత్యుక్త్వా తం పరిక్రమ్య పాదౌ స్పృష్ట్వా స్వమౌలినా ।
అనుజ్ఞాతో విమానాగ్ర్యమారుహత్పశ్యతాం నృణామ్ ॥ 30

ఇతి= అని, ఉక్త్వా= పలికి, తమ్= ఆయనను, పరిక్రమ్య= ప్రదక్షిణము చేసి, స్వమౌలినా= తన శిరస్సుతో, పాదౌ= పాదములను, స్పృష్ట్వా= స్పృశించి, అనుజ్ఞాతః= అనుమతి ఈయబడినవాడై, నృణామ్= మానవులు, పశ్యతామ్= చూచుచుండగా, విమాన–అగ్ర్యమ్= శ్రేష్ఠమగు విమానమును, ఆరుహత్= అధిరోహించెను.

నృగుడిట్లు పలికి ఆ శ్రీకృష్ణునకు ప్రదక్షిణముచేసి, ఆయన పాదములను శిరస్సుతో స్పృశించి నమస్కరించి, అనుమతి తీసుకొనెను. జనులు చూచుచుండగనే ఆయన గొప్ప విమానము నధిష్ఠించెను.

కృష్ణః పరిజనం ప్రాహ భగవాన్ దేవకీసుతః ।
బ్రహ్మణ్యదేవో ధర్మాత్మా రాజన్యాననుశిక్షయన్ ॥ 31

దేవకీసుతః= దేవకి పుత్రుడు, బ్రహ్మణ్యదేవః= బ్రాహ్మణులపై పరమ ప్రేమ గలవాడు, ధర్మ–ఆత్మా= ధర్మాత్ముడు అగు, కృష్ణః భగవాన్= కృష్ణభగవానుడు, రాజన్యాన్= క్షత్రియులను, అనుశిక్షయన్= శిక్షణనిచ్చు వాడై, పరిజనమ్= చుట్టూ ఉన్న జనమునుద్దేశించి, ప్రాహ= పలికెను.

దేవకి పుత్రుడగు శ్రీకృష్ణ భగవానునకు బ్రాహ్మణుల యెడల ప్రేమ మెండు. ఆ ధర్మాత్ముడు క్షత్రియులకు శిక్షణనిచ్చుటకై చుట్టూ ఉన్న జనమునుద్దేశించి ఇట్లు పలికెను.

దుర్జరం బత బ్రహ్మస్వం భుక్తమగ్నే ర్మనాగపి ।
తేజీయసోఽపి కిముత రాజ్ఞా మీశ్వరమానినామ్ ॥ 32

భుక్తమ్= భుజించబడిన, బ్రహ్మస్వమ్= బ్రాహ్మణుల సొత్తు, మనాక్ అపి= కొంచెమైననూ, అగ్నేః= అగ్నికి (వంటి), తేజీయసః అపి= తేజశ్శాలి–కైననూ, దుర్జరమ్= జీర్ణము చేసుకొనుట కష్టమైనది, ఈశ్వరమానినామ్= మేము ప్రభువులమని గర్వించే, రాజ్ఞామ్= రాజులకు, కిం ఉత= కష్టమని వేరుగా చెప్పవలయునా?

బ్రాహ్మణుల సొత్తును కొంచెము అనుభవించినా, అది అగ్నికైననూ, అగ్నివంటి తేజశ్శాలురకైననూ, జీర్ణము చేసుకొనుట చాల కష్టము. మేము ప్రభువులమని విర్రవీగే రాజులకు మరింత కష్టమని వేరుగా చెప్పవలెనా?

నాహం హాలాహలం మన్యే విషం యస్య ప్రతిక్రియా ।
బ్రహ్మస్వం హి విషం ప్రోక్తం నాస్య ప్రతివిధిర్భువి ॥ 33

అహమ్= నేను, హాలాహలమ్= హాలాహలమును, విషమ్= విషమునుగా, న మన్యే= తలపోయను, యస్య= దేనికైతే, ప్రతిక్రియా= విరుగుడు గలదో, బ్రహ్మస్వమ్= బ్రాహ్మణుని సొత్తు, హి= నిశ్చయముగా, విషమ్= విషమని, ప్రోక్తమ్= చెప్పబడినది, అస్య= దీనికి, భువి= భూలోకమునందు, ప్రతివిధిః= విరుగుడు, న= లేదు.

హాలాహలమునకు విరుగుడు కలదు. కావున, అది విషమని నేను అనుకోను. కాని, ఈ భూలోకములో బ్రాహ్మణుని సొత్తు అనేది నిశ్చయముగా విషము. దానికి విరుగుడు లేదు.

హినస్తి విషమత్తారం వహ్నిరద్భిః ప్రశామ్యతి ।
కులం సమూలం దహతి బ్రహ్మస్వారణిపావకః ॥ 34

విషమ్= విషము, అత్తారమ్= భక్షించినవానిని, హినస్తి= హింసించును, వహ్నిః= నిప్పు, అద్భిః= జలములతో, ప్రశామ్యతి= చల్లారును, బ్రహ్మస్వ-అరణిపావకః= బ్రాహ్మణుని సొత్తు అనే అరణి (మథించి నిప్పు పుట్టించే కొయ్య) నుండి పుట్టే అగ్ని, సమూలమ్= మూలముతో కూడిన, కులమ్= వంశమును, దహతి= నశింపజేయును.

విషము భక్షించినవానిని మాత్రమే హింసించును. నీళ్ల చల్లితే నిప్పు చల్లారును. కాని, బ్రాహ్మణుని సొత్తు అనే అరణినుండి పుట్టే అగ్ని సమూలముగా వంశమును నశింపజేయును.

బ్రహ్మస్వం దురనుజ్ఞాతం భుక్తం హంతి త్రిపూరుషమ్ ।
ప్రసహ్య తు బలాద్భుక్తం దశ పూర్వాన్ దశాపరాన్ ॥ 35

దురనుజ్ఞాతమ్= సరిగా అనుమతించబడనట్టియు, భుక్తమ్= అనుభవించబడిన, బ్రహ్మస్వమ్= బ్రాహ్మణుని సొత్తు, త్రిపూరుషమ్= మూడు తరములను, హంతి= నశింపజేయును, బలాత్= బలము వలన, ప్రసహ్య= హఠము చేసి, భుక్తం తు= భోగించబడినదైతే, పూర్వాన్= గడచిన తరములను, దశ= పదింటిని, అపరాన్= రాబోవువాటిని, దశ= పదింటిని.

ఎవడైతే బ్రాహ్మణుని పూర్తి అనుమతి లేకుండా ఆయన సొత్తును అనుభవించునో, ఆతడు, వాని సంతానము, వారి సంతానము అనే మూడు తరములు నశించును. బ్రాహ్మణుని సొత్తును హఠము చేసి బలప్రయోగముతో అనుభవించినచో, పది గడచిన తరములు, పది రాబోవు తరములు వినాశమును పొందును.

రాజానో రాజలక్ష్మ్యాఽంధా నాత్మపాతం విచక్షతే ।
నిరయం యేకభిమన్యంతే బ్రహ్మస్వం సాధు బాలిశాః ॥ 36

రాజలక్ష్మ్యా= రాజ్యముయొక్క సంపదచే, అంధాః= వివేకమును కోల్పోయినవారు, బాలిశాః= మూర్ఖులు అగు, యే= ఏ, రాజానః= రాజులు, నిరయమ్= నరకమునకు హేతువగు, బ్రహ్మస్వమ్= బ్రాహ్మణుని సొత్తును, సాధు= మంచిదని, అభిమన్యంతే= తలపోయుదురో వారు, ఆత్మపాతమ్= తమ పతనమును, న విచక్షతే= తెలుసుకోరు.

కొందరు మూర్ఖులైన రాజులు రాజసంపదచే వివేకమును కోల్పోయి నరకమునకు హేతువైన బ్రాహ్మణుని సొత్తును మంచిదని తలపోయుదురు. వారు తాము నరకములో పడుచున్నామని తెలుసుకోరు.

గృహ్ణంతి యావతః పాంసూన్ క్రందతామశ్రుబిందవః ।
విప్రాణాం హృతవృత్తీనాం వదాన్యానాం కుటుంబినామ్ ॥ 37

రాజానో రాజకుల్యాశ్చ తావతోఽబ్దాన్నిరంకుశాః ।
కుంభీపాకేషు పచ్యంతే బ్రహ్మదాయాపహారిణః ॥ 38

హృతవృత్తీనామ్= అపహరించబడిన జీవిక కలిగినట్టియు, వదాన్యానామ్= ఉదారస్వభావులైనట్టియు, కుటుంబినామ్= కుటుంబము గల, విప్రాణామ్= బ్రాహ్మణులు, క్రందతామ్= దుఃఖించుచుండగా, అశ్రుబిందవః= కన్నీటి బొట్లు, యావతః= ఎన్ని, పాంసూన్= ధూళి కణములను, గృహ్ణంతి= తడుపునో, నిరంకుశాః= ధర్మమును ఉల్లంఘించు నట్టియు, బ్రహ్మదాయ-అపహారిణః= బ్రాహ్మణుని వాటాను అపహరించే, రాజానః= రాజులు, రాజకుల్యాః చ= రాజు వంశములోని వారు కూడ, తావతః= అన్ని, అబ్దాన్= సంవత్సరములను, కుంభీపాకేషు= కుంభీ పాకములనే నరకములయందు, పచ్యంతే= యాతనలననుభవించెదరు.

రాజులు ధర్మమునుల్లంఘించి కుటుంబీకులైన బ్రాహ్మణుల వాటాను అపహరించి వారి జీవికకు విఘాతమును కలిగించినచో, ఉదారస్వభావు లగు ఆ బ్రాహ్మణులు దుఃఖించెదరు. వారి కన్నీళ్లకు ఎన్ని ధూళి కణములు తడి యగునో అన్ని సంవత్సరముల కాలము ఆ రాజులు, వారి వంశీయులు కూడ నిరంతరముగా కుంభీపాకము (బానలలోని మరిగే నూనెలో పారవేసే)లనే నరకములయందు యాతనలననుభవించెదరు.

స్వదత్తాం పరదత్తాం వా బ్రహ్మవృత్తిం హరేచ్చ యః ।
షష్టివర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే కృమిః ॥ 39

యః= ఎవడైతే, బ్రహ్మవృత్తిమ్= బ్రాహ్మణుని జీవికను, స్వదత్తామ్= తనచే ఈయబడినదానిని గాని, పరదత్తాం వా= ఇతరులచే ఈయబడిన దానిని గాని, హరేత్= అపహరించునో, షష్టివర్షసహస్రాణి= అరవై వేల సంవత్సరములను, విష్ఠాయామ్= మలమునందు, కృమిః= క్రిమియై, జాయతే= పుట్టును.

ఎవడైతే తాను ఇచ్చినది గాని, ఇతరులు ఇచ్చినది గాని, బ్రాహ్మణుని జీవికను అపహరించునో, అట్టివాడు అరవై వేల సంవత్సరములు మలమునందు క్రిమియై పుట్టును.

న మే బ్రహ్మధనం భూయా ద్యద్గృద్ధ్వా ల్పాయుషో నరాః ।
పరాజితా శ్చ్యుతా రాజ్యాద్భవంత్యు ద్వేజినోహయః ॥ 40

మే= నాకు, బ్రహ్మధనమ్= బ్రాహ్మణుని సొత్తు, న భూయాత్= కలుగకుండు గాక!, యత్= దేనిని, గృద్ధ్వా= ఆశపడి, నరాః= మానవులు, అల్ప-ఆయుషః= అల్పమగు ఆయుషు గలవారు, పరాజితాః= పరాజయమును పొందువారు, రాజ్యాత్= రాజ్యమునుండి, చ్యుతాః= జారిపోయినవారు, ఉద్వేజినః= ఉద్వేగమును కలిగించే, అహయః= పాములై, భవంతి= అగుదురు.

బ్రాహ్మణుని సొత్తు నా సొత్తులోనికి రాకుండు గాక! బ్రాహ్మణుని సొత్తుకు ఆశపడే మానవులు అల్పాయుష్కులై పరాజయములను పొందెదరు. రాజులైతే రాజ్యమును కోల్పోయెదరు. మరణించి వారు ఇతరులకు భయమును కలిగించే విషసర్పములై పుట్టెదరు.

విప్రం కృతాగసమపి నైవ ద్రుహ్యత మామకాః ।
ఘ్నంతం బహు శపంతం వా నమస్కురుత నిత్యశః ॥ 41

మామకాః= ఆత్మీయులారా!, విప్రమ్= వేదవేత్తయైన బ్రాహ్మణుని, కృత-ఆగసం అపి= చేయబడిన అపరాధము గలవాడే అయిననూ, న ద్రుహ్యత ఏవ= ద్రోహము చేయనే వద్దు, ఘ్నంతమ్= కొట్టుచున్న వానిని గాని, వా= లేదా, బహు= అధికముగా, శపంతమ్= తిట్టుచున్నవానిని గాని, నిత్యశః= సర్వదా, నమస్కురుత= నమస్కరించుడు.

ఓ ఆత్మీయులారా! వేదవేత్తయైన బ్రాహ్మణుడు అపరాధమునే చేసినా, ఒకచో కొట్టినా, లేదా అధికముగా తిట్టినా, మీరాయనకు ద్రోహమును చేయనే వద్దు. పైగా, ఆయనకు సర్వదా నమస్కరించుడు.

యథాఽహం ప్రణమే విప్రాననుకాలం సమాహితః ।
తథా నమత యూయం చ యోఽన్యథా మే స దండభాక్ ॥42

యథా= ఏ విధముగానైతే, అహమ్= నేను, అనుకాలమ్= మూడు పూటలా, సమాహితః= ఏకాగ్రమగు చిత్తము గలవాడనై, ప్రణమే= నమస్కరించెదనో, తథా= అదే విధముగా, యూయం చ= మీరు కూడ, నమత= నమస్కరించుడు, యః= ఎవడైతే, అన్యథా= విరుద్ధముగా చేయునో, సః= అట్టివాడు, మే= నాయొక్క, దండభాక్= శిక్షకు పాత్రుడు.

నేను మూడు పూటలా ఏకాగ్రమగు చిత్తముతో వేదవేత్తలగు బ్రాహ్మణులకు నమస్కరించెదను. అదేవిధముగా, మీరు కూడ నమస్కరించుడు. దీనికి విరుద్ధముగా నమస్కరించనివానిని నేను శిక్షించెదను.

బ్రాహ్మణార్థో హ్యపహృతో హర్తారం పాతయత్యధః ।
అజానంతమపి హ్యేనం నృగం బ్రాహ్మణగౌరివ ॥ 43

బ్రాహ్మణ-అర్థః= బ్రాహ్మణుని సొత్తు, అపహృతః= అపహరిచ-బడినదై, హర్తారమ్= అపహరించినవానిని, హి= నిశ్చయముగా, అధః= క్రిందకు, పాతయతి= పడద్రోయును, హి= ఏలయన, ఏనమ్= ఈ, నృగమ్= నృగమహారాజును, అజానంతం అపి= తెలియనివాడే అయిననూ, బ్రాహ్మణగౌః ఇవ= బ్రాహ్మణుని గోవు వలె.

గోవు బ్రాహ్మణునిది అని తెలియక దానము చేసి ఈ నృగమహారాజు పతితుడైనాడు. అదేవిధముగా, బ్రాహ్మణుని సొత్తు తనను అపహరించు వానిని నిశ్చయముగా అధఃపతితుని చేయును.

ఏవం విశ్రావ్య భగవాన్ ముకుందో ద్వారకౌకసః ।
పావనస్సర్వలోకానాం వివేశ నిజమందిరమ్ ॥ 44

ఇతి శ్రీమద్భాగవతే దశమస్కంధే చతుష్షష్టితమోఽధ్యాయః ॥

ముకుందః= మోక్షప్రదాత, సర్వలోకానామ్= సకలలోకములకు, పావనః= పవిత్రము చేయువాడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ద్వారకా-ఓకసః= ద్వారకావాసులనుద్దేశించి, ఏవమ్= ఈ విధముగా, విశ్రావ్య= ఉపదేశించి, నిజమందిరమ్= తన నివాసమును, వివేశ= ప్రవేశించెను.

సకలలోకములను పావనము చేసి మోక్షమునిచ్చే శ్రీకృష్ణభగవానుడు ద్వారకావాసులకీ విధముగా ఉపదేశించి, తన మందిరములో ప్రవేశించెను.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
నృగమహారాజు వృత్తాంతమును వర్ణించే
అరువది నాల్గవ అధ్యాయము ముగిసినది (64).

* * *

అథ పంచషష్టితమోఽధ్యాయః

బలరాముడు వ్రజమునకు వెళ్లుట

శ్రీశుక ఉవాచ ।

బలభద్రః కురుశ్రేష్ఠ భగవాన్ రథమాస్థితః ।
సుహృద్దిదృక్షు రుత్కంఠః ప్రయయౌ నందగోకులమ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కురుశ్రేష్ఠ= కురువంశశ్రేష్ఠా!, సుహృద్-దిదృక్షుః= మిత్రుల (బంధువుల)ను చూడగోరే, భగవాన్ బలభద్రః= బలరామ భగవానుడు, ఉత్కంఠః= ప్రేమ గలవాడై, రథమ్= రథమును, ఆస్థితః= అధిష్ఠించినవాడై, నందగోకులమ్= నందుని గోకులమును గురించి, ప్రయయౌ= వెళ్లెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...కురువంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! మిత్రులను చూడాలనే కోరిక గల బలరామ భగవానుడు రథమునెక్కి ప్రేమతో నందుని గోకులమునకు వెళ్లెను.

పరిష్వక్తశ్చిరోత్కంఠైర్గోపైర్గోపీభిరేవ చ ।
రామోఽభివాద్య పితరావాశీర్భిరభినందితః ॥ 2

చిర-ఉత్కంఠైః= చాల కాలము ఆత్రముగా ఎదురు చూచుచున్న, గోపైః= గోపాలకులచే, గోపీభిః ఏవ చ= గోపికలచే కూడ, పరిష్వక్తః= కౌగిలించుకొనబడిన, రామః= బలరాముడు, పితరౌ= తల్లిదండ్రులను, అభివాద్య= నమస్కరించి, ఆశీర్భిః= ఆశీస్సులచే, అభినందితః= అభినందించబడినవాడు.

గోపాలకులు, గోపికలు కూడ చాల కాలమునుండి ఆత్రముగా బలరాముని చూచుటకై ఎదురుచూచిరి. వారు ఆయనను కౌగిలించుకొనిరి. ఆయన తల్లిదండ్రులగు యశోదానందులకు నమస్కరించగా, వారాయనను ఆశీర్వదించి అభినందించిరి.

చిరం నః పాహి దాశార్హ సానుజో జగదీశ్వరః ।
ఇత్యారోప్యాంకమాలింగ్య నేత్రై స్సిషిచతు ర్జలైః ॥ 3

దాశార్హ= దశార్హవంశీయుడా!, జగద్-ఈశ్వరః= జగన్నాథుడ-వైనట్టియు, స-అనుజః= తమ్మునితో కూడి నీవు, నః= మమ్ములను, చిరమ్= చాల కాలము, పాహి= రక్షించుము, ఇతి= అని, అంకమ్= ఒడిని, ఆరోప్య= కూర్చుండబెట్టుకొని, ఆలింగ్య= కౌగలించి, నేత్రైః= కళ్లతో, జలైః = జలములతో, సిషిచతుః= తడిపిరి.

ఓ జగన్నాథా! దశార్హవంశీయుడవగు నీవు తమ్ముడు శ్రీకృష్ణునితో గూడి మమ్ములను సర్వదా రక్షించుము. అంటూ ఆయనను ఒడిలో కూర్చుండబెట్టుకొని కౌగిలించి ప్రేమాశ్రువులతో తడిపివేసిరి.

గోపవృద్ధాంశ్చ విధివద్యవిష్ఠైరభివందితః ।
యథావయో యథాసఖ్యం యథాసంబంధమాత్మనః ॥ 4

గోపవృద్ధాన్ చ= గోపాలకులలో పెద్దలను కూడ, విధివత్= యథావిధిగా (నమస్కరించెను), యవిష్ఠైః= పిన్నలచే, ఆత్మనః= తన, యథావయః= వయస్సును అతిక్రమించకుండా, యథాసఖ్యమ్= మైత్రిని అతిక్రమించకుండా, యథాసంబంధమ్= సంబంధమునతిక్రమించకుండా, అభివందితః= నమస్కరించ బడినవాడు.

సముపేత్యాథ గోపాలన్ హాస్యహస్తగ్రహాదిభిః ।
విశ్రాంతం సుఖమాసీనం పప్రచ్ఛుః పర్యుపాగతాః ॥ 5

అథ= తరువాత, గోపాలాన్= గోపాలకులను, హాస్యహస్తగ్రహ-ఆదిభిః= పరిహాసములు చేతులను పట్టుకొనుట మొదలగువాటితో, సముపేత్య= సమీపించి, విశ్రాంతమ్= విశ్రమించినట్టియు, సుఖమ్= సుఖముగా, ఆసీనమ్= కూర్చున్న బలరాముని, పర్యుపాగతాః= చుట్టూ చేరిన గోపాలకులు, పప్రచ్ఛుః= ప్రశ్నించిరి.

తరువాత ఆయన గోపాలకుల దగ్గరకు వెళ్లి వారి చేతులను పట్టుకొని వారితో పరాచికములు, ఆలింగనము మొదలగువాటిని చేసెను. ఆయన విశ్రమించి సుఖముగా కూర్చుండగా వారు ఆయన చుట్టూ చేరి ప్రశ్నించిరి.

పృష్టాశ్చానామయం స్వేషు ప్రేమగద్గదయా గిరా ।
కృష్ణే కమలపత్రాక్షే సన్న్యస్తాఖిలరాధసః ॥ 6

కమలపత్ర-అక్షే= కలువ రేకులవంటి కన్నులు గల, కృష్ణే= శ్రీకృష్ణునియందు, సన్న్యస్త-అఖిలరాధసః= విడిచిపెట్టబడిన సకలములైన భోగములు గలవారు, ప్రేమగద్గదయా= ప్రేమతో గద్గదమైన, గిరా= వాక్కుతో, స్వేషు= తమవారి విషయమై, అనామయం చ= క్షేమమును గురించి కూడ, పృష్టాః= ప్రశ్నించబడిరి.

ఆ గోపాలకులు కలువ రేకులవంటి కన్నులు గల శ్రీకృష్ణుని కొరకై సకలభోగములను విడిచిపెట్టినవారు. బలరాముడు ప్రేమతో బొంగురు పోయిన కంఠముతో వారి బంధువుల క్షేమమును గురించి ప్రశ్నించెను.

కచ్చిన్నో బాంధవా రామ సర్వే కుశలమాసతే ।
కచ్చిత్ స్మరథ నో రామ యూయం దారసుతాన్వితాః ॥ 7

రామ= ఓ బలరామా!, సర్వే= అందరు, బాంధవాః= బంధువులు, కుశలమ్= క్షేమముగా, ఆసతే= ఉన్నారా?, రామ= ఓ రామా!, దారసుత-అన్వితాః= భార్యాపిల్లలతో కూడియున్న, యూయమ్= మీరు , నః= మమ్ములను, కచ్చిత్ స్మరథ= స్మరించుచున్నారా?

ఓ బలరామా! బంధువులందరు క్షేమముగా ఉన్నారా? భార్యా-పిల్లలతో కూడియుండే మీకు మేము గుర్తుకు వస్తున్నామా? (అని ఆ గోపాలకులు ప్రశ్నించిరి).

దిష్ట్యా కంసో హతః పాపో దిష్ట్యా ముక్తాస్సుహృజ్జనాః ।
నిహత్య నిర్జిత్య రిపూన్ దిష్ట్యా దుర్గం సమాశ్రితాః ॥ 8

పాపః= పాపియగు, కంసః= కంసుడు, హతః= సంహరించబడిన వాడు, దిష్ట్యా= సౌభాగ్యము, సుహృద్-జనాః= మిత్రులు బంధువులు, ముక్తాః= విముక్తులు, దిష్ట్యా= మంగళము, రిపూన్= శత్రువులను, నిహత్య= సంహరించి, నిర్జిత్య= జయించి, దుర్గమ్= ప్రవేశించ శక్యము కాని ద్వారకను, సమాశ్రితాః= ఆశ్రయించినవారు, దిష్ట్యా= మంగళము.

మీరు కంసుని సంహరించి మిత్రులకు, బంధువులకు విముక్తిని కలిగించిరి. మీరు శత్రువులను జయించి, సంహరించి, ఇతరులు ప్రవేవించ శక్యము కాని ద్వారకను నివాసముగా చేసుకొనిరి. ఇదంతా మంగళము.

గోప్యో హసంత్యః పప్రచ్ఛుః రామసందర్శనాదృతాః ।
కచ్చిదాస్తే సుఖం కృష్ణః పురస్త్రీజనవల్లభః ॥ 9

రామసందర్శన-ఆదృతాః= బలరాముని చూచుటయందు ప్రేమ గల, గోప్యః= గోపికలు, హసంత్యః= నవ్వుచున్నవారై, పప్రచ్ఛుః= ప్రశ్నించిరి, పురస్త్రీజనవల్లభః= నగరమునందలి యువతీజనమునకు ప్రియుడైన, కృష్ణః = శ్రీకృష్ణుడు, సుఖమ్= సుఖముగా, కచ్చిత్ ఆస్తే= ఉన్నాడా?

గోపికలకు బలరాముని చూచుట చాల ప్రీతికరము. వారు నవ్వుతూ, నగరమునందలి యువతీజనమునకు ప్రియుడైన శ్రీకృష్ణుడు క్షేమముగా ఉన్నాడా? అని ప్రశ్నించిరి.

కచ్చిత్ స్మరతి వా బంధూన్ పితరం మాతరం చ సః ।
అప్యసౌ మాతరం ద్రష్టుం సకృదప్యాగమిష్యతి ।
అపి వా స్మరతేఽస్మాకమను సేవాం మహాభుజః ॥ 10

సః= ఆ శ్రీకృష్ణుడు, బంధూన్ వా= బంధువులను గాని, పితరమ్= తండ్రిని, మాతరం చ= తల్లిని గాని, కచ్చిత్ స్మరతి= స్మరించునా?, అసౌ= ఈతడు, మాతరమ్= తల్లిని, ద్రష్టుమ్= చూచుటకు, సకృత్ అపి= ఒక్కసారైనా, అపి ఆగమిష్యతి= వచ్చునా?, మహాభుజః= బలిష్టమైన

భుజములు గల ఆతడు, అస్మాకమ్= మాయొక్క, అనుసేవాం వా= సేవనైనా, అపి స్మరతే= స్మరించుచున్నాడా?

ఆ శ్రీకృష్ణునకు బంధువులు గాని, తల్లిదండ్రులు గాని గుర్తున్నారా? ఈతడు తల్లిని చూచుటకు ఒక్కసారైనా వస్తాడా? బలిష్ఠమైన భుజములు గల ఆతనికి మేము చేసిన సేవయైనా గుర్తున్నదా?

మాతరం పితరం భ్రాతౄన్ పతీన్ పుత్రాన్ స్వసౄరపి ।
యదర్థే జహిమ దాశార్హ దుస్త్యజాన్ స్వజనాన్ ప్రభో ॥ 11

దాశార్హ= ఓ దశార్హవంశీయుడా!, ప్రభో= ఓ ప్రభూ!, యద్-అర్థే= ఎవని కొరకై, మాతరమ్= తల్లిని, పితరమ్= తండ్రిని, భ్రాతౄన్= అన్నదమ్ములను, పతీన్= భర్తలను, పుత్రాన్= పుత్రులను, స్వసౄః= అప్పచెల్లెళ్లను, దుస్త్యజాన్= విడువ శక్యము కాని, స్వజనాన్ అపి= మా బంధువులను కూడ, జహిమ= విడిచి పెట్టితిమో.

దశార్హవంశీయుడవగు ఓ ప్రభూ! మేము శ్రీకృష్ణుని కొరకై తల్లిదండ్రులను, అన్నదమ్ములను, అప్పచెల్లెళ్లెను, భర్తలను, సంతానమును, విడువ కష్టమైన మా బంధువులను కూడ విడిచిపెట్టితిమి.

తా నస్సద్యః పరిత్యజ్య గతస్సంఛిన్నసౌహృదః ।
కథం ను తాదృశం స్త్రీభిర్న శ్రద్ధీయేత భాషితమ్ ॥ 12

సంఛిన్నసౌహృదః= తెగగొట్టబడిన ప్రేమ గల శ్రీకృష్ణుడు, తాః= అట్టి, నః= మమ్ములను, సద్యః= వెంటనే, పరిత్యజ్య= విడిచి పెట్టి, గతః = వెళ్లినవాడు, తాదృశమ్= అట్టి, భాషితమ్= పలుకు, స్త్రీభిః= యువతులచే, కథం ను= ఏ విధముగా, న శ్రద్ధీయేత ను= విశ్వసించబడకుండును?

శ్రీకృష్ణుడు ప్రేమపాశమును తెగగొట్టి అట్టి మమ్ములను వెంటనే విడిచిపెట్టి వెళ్లిపోయినాడు. ఆతని తియ్యని పలుకులను స్త్రీలు ఏ విధముగా విశ్వసించకుందురు ? (మేము నమ్మి మోసపోతిమి).

కథం ను గృహ్ణంత్యనవస్థితాత్మనో
వచః కృతఘ్నస్య బుధాః పురస్త్రియః ।
గృహ్ణంతి వై చిత్రకథస్య సుందర
స్మితావలోకోచ్ఛ్వసితస్మరాతురాః ॥ 13

అనవస్థిత–ఆత్మనః= స్థిరము లేని బుద్ధి కలిగినట్టియు, కృతఘ్నస్య= చేసిన ఉపకారమును మరిచిపోయే శ్రీకృష్ణని, వచః= మాటను, బుధాః = తెలివితేటలు గల, పురస్త్రియః= నగరస్త్రీలు, కథం ను= ఏ విధముగా, గృహ్ణంతి= స్వీకరించెదరు?, చిత్రకథస్య= పలు విధముల కథలను చెప్పే శ్రీకృష్ణనియొక్క, సుందరస్మిత–అవలోక–ఉచ్ఛ్వసితస్మర–ఆతురాః= అందమైన చిరునగవుతోడి చూపులచే ఉద్దీపితమైన కామనచే వివశులై, వై= నిశ్చయముగా, గృహ్ణంతి= స్వీకరించెదరు.

నగరస్త్రీలు తెలివైనవారు. స్థిరము లేని చిత్తము కలిగి చేసిన ఉపకారమును మరిచిపోయే శ్రీకృష్ణని పలుకులను వారు ఎట్లు నమ్మెదరు? (నమ్మరు). కాని, ఆతడు పలు విధముల కథలను చెప్తూ అందమైన చిరుగవుతో చూచినప్పుడు కామన ఉద్దీపితమై వారు వివశులై ఆతని పలుకులను నిశ్చయముగా విశ్వసించి యుందురు.

కిం నస్తత్కథయా గోప్యః కథాః కథయతాపరాః ।
యాత్యస్మాభిర్వినా కాలో యది తస్య తథైవ నః ॥ 14

గోప్యః= ఓ గోపికలారా!, తత్–కథయా= ఆతని ప్రసంగముతో, నః= మనకు, కిమ్= ఏమి ప్రయోజనము?, అపరాః= ఇతరములైన, కథాః= కబుర్లను, కథయత= చెప్పుడు, తస్య= వానికి, అస్మాభిః వినా= మనము లేకున్నా, కాలః= కాలము, యది యాతి= గడచిపోవుచున్నచో, నః= మనకు, తథా ఏవ= అటులనే.

ఓ గోపికలారా! మనకు ఆతని ప్రసంగముతో పని యేమి? ఇంకో ప్రసంగమును చేయుడు. ఆతనికి మనము లేకుండానే కాలము గడిచిపోయే పక్షములో, మనకు కూడా అంతే.

ఇతి ప్రహసితం శౌరేర్జల్పితం చారు వీక్షితమ్ ।
గతిం ప్రేమపరిష్వంగం స్మరంత్యో రురుదుః స్త్రియః ॥ 15

ఇతి= ఈ విధముగా, శౌరేః= శ్రీకృష్ణుని యొక్క, ప్రహసితమ్= నవ్వును, జల్పితమ్= మాటను, చారు= అందమైన, వీక్షితమ్= చూపును, గతిమ్= నడకను, ప్రేమపరిష్వంగమ్= ప్రేమతోడి కౌగిలిని, స్మరంత్యః= గుర్తు చేసుకొనువారై, స్త్రియః= గోపికలు, రురుదుః= రోదించిరి.

ఈ విధముగా గోపికలు శ్రీకృష్ణుని నవ్వు, మాట, అందమైన చూపు, నడక, ప్రేమతోడి కౌగిలి అనువాటిని గుర్తు చేసుకొని రోదించిరి.

సంకర్షణస్తాః కృష్ణస్య సందేశైర్హృదయంగమైః ।
సాంత్వయామాస భగవాన్నానాఽనునయకోవిదః ॥ 16

నానా-అనునయకోవిదః= పలు విధములుగా అనునయించుటలో నిపుణుడైన, సంకర్షణః భగవాన్= బలరామ భగవానుడు, హృదయంగమైః = మనోహరములైన, కృష్ణస్య= శ్రీకృష్ణుని యొక్క, సందేశైః= సందేశములచే, తాః= వారిని, సాంత్వయామాస= ఓదార్చెను.

బలరామ భగవానుడు పలు విధములుగా అనునయించుటలో ఆయన వారిని శ్రీకృష్ణుని మనోహరములైన సందేశములతో ఓదార్చెను.

ద్వౌ మాసౌ తత్ర చావాత్సీన్మధుం మాధవమేవ చ ।
రామః క్షపాసు భగవాన్ గోపీనాం రతిమావహన్ ॥ 17

రామః భగవాన్= బలరామ భగవానుడు, క్షపాసు= రాత్రులయందు, గోపీనామ్= గోపికలకు, రతిమ్= ప్రేమను, ఆవహన్= వర్ధిల్ల జేయువాడై,

మధుమ్= చైత్రమును, మాధవం ఏవ చ= వైశాఖమును కూడ, ద్వౌ= రెండు, మాసౌ= మాసములను, తత్ర చ= అచటనే, అవాత్సీత్= నివసించెను.

బలరామ భగవానుడు రాత్రులయందు గోపికల ప్రేమను వర్ధిల్లజేస్తూ చైత్ర వైశాఖ మాసములు రెండూ అచటనే నిరంతరముగా నివసించెను.

పూర్ణచంద్రకలాఽఽమృష్టే కౌముదీగంధవాయునా ।
యమునోపవనే రేమే సేవితే స్త్రీగణైర్వృతః ॥ 18

పూర్ణచంద్రకలా-ఆమృష్టే= పూర్ణచంద్రుని వెన్నెలలచే ఉజ్జ్వల-మైనట్టియు, కౌముదీగంధవాయునా= కలువల సరస్సుల పరిమళము గల వాయువుచే, సేవితే= సేవించబడిన, యమునాయాఃఽ= యమునానది యొక్క, ఉపవనే= ఉద్యానవనమునందు, స్త్రీగణైఃఽ= గోపికల సమూహములతో, వృతఃఽ= చుట్టువారబడినవాడై, రేమే= విహరించెను.

యమునానది ఒడ్డున ఒక ఉద్యానము గలదు. పూర్ణచంద్రుని వెన్నెలలచే ఉజ్జ్వలముగా ప్రకాశించే ఆ ఉద్యానములో సరస్సులలోని కలువల పరిమళమును మోసుకువచ్చే గాలులు వీచుచుండును. బలరాముడు అచట గోపికల గణములు చుట్టువారియుండ విహరించెను.

వరుణప్రేషితా దేవీ వారుణీ వృక్షకోటరాత్ ।
పతంతీ తద్వనం సర్వం స్వగంధేనాధ్యవాసయత్ ॥ 19

వరుణేన= వరుణునిచే, ప్రేషితా= పంపబడిన, వారుణీ= మద్యమునకు అధిష్ఠాత్రియగు, దేవీ= దేవత, వృక్షకోటరాత్= చెట్టు తొర్రనుండి, పతంతీ= పడుచున్నదై, స్వగంధేన= తన పరిమళముతో, సర్వమ్= సకలమైన, తత్= ఆ, వనమ్= ఉద్యానమును, అధ్యవాసయత్= సుగంధభరితముగా చేసెను.

వరుణుడు మదిరాధిష్ఠానదేవతను పంపెను. ఆమె చెట్టు తొర్రనుండి ప్రవహించెను. ఆ మదిర యొక్క సుగంధము ఆ ఉద్యానమంతా నిండెను.

తం గంధం మధుధారాయా వాయునోపహృతం బలః ।
ఆఘ్రాయోపగతస్తత్ర లలనాభిస్సమం పపౌ ॥ 20

బలః= బలరాముడు, వాయునా= గాలిచే, ఉపహృతమ్= కొనిరాబడిన, మధుధారాయాఃః= మదిర యొక్క ధారయొక్క, తమ్= ఆ, గంధమ్= పరిమళమును, ఆఘ్రాయ= ఆఘ్రాణించి, లలనాభిః సమమ్= యువతులతో గూడి, తత్ర= అచటకు, ఉపగతః= చేరినవాడై, పపౌ= త్రాగెను.

గాలి మోసుకువచ్చిన మదిరాధారయొక్క ఆ సుగంధమును ఆఘ్రాణించి, బలరాముడు గోపికలతో సహా అచటకు చేరి దానిని త్రాగెను.

ఉపగీయమానచరితో వనితాభిర్హలాయుధః ।
వనేషు వ్యచరత్ క్షీబో మదవిహ్వలలోచనః ॥ 21

వనితాభిః= యువతులచే, ఉపగీయమానచరితః= కీర్తించబడుచున్న చరితము గలవాడు, హల-ఆయుధః = నాగలి ఆయుధముగా గల బలరాముడు, క్షీబఃః= మత్తెక్కినవాడై, మదవిహ్వలలోచనఃః= మత్తుతో వివశమైన కన్నులు గలవాడై, వనేషు= చెట్లయందు, వ్యచరత్= తిరిగెను.

గోపికలు నాగలి ఆయుధముగా గల బలరాముని చరితమును కీర్తించుచుండిరి. మత్తులో నున్న ఆయన కన్నులు మత్తుతో చలించుచుండగా, ఉద్యానమునందు విహరించెను.

ప్రగ్వేకకుండలో మత్తో వైజయంత్యా చ మాలయా ।
బిభ్రత్ స్మితముఖాంభోజం స్వేదప్రాలేయభూషితమ్ ॥ 22

వైజయంత్యా= మణులతో చేసిన, మాలయా= మాలతో, స్రగ్వీ చ= పూలమాల కూడ గలవాడు, ఏకకుండలః= ఒకే కుండలము గలవాడు, మత్తః= మత్తుగానున్నవాడు, స్వేదప్రాలేయభూషితమ్= మంచు బిందువులవంటి చెమట బిందువులచే అలంకరించబడినట్టియు, స్మితముఖ-అంభోజమ్= చిరునవ్వు గల పద్మమువంటి ముఖమును, బిభ్రత్= కలిగియున్నవాడు.

మత్తుగానున్న బలరాముడు మణులతో చేసిన మాలతో బాటుగా పూల మాలను కూడ ధరించెను. ఆయన పద్మమువంటి ముఖమునకు ఒకే కుండలము, మంచు బిందువులను పోలిన చెమట బిందువులు, చిరునవ్వు అలంకారములాయెను.

స ఆజుహావ యమునాం జలక్రీడార్థమీశ్వరః ।
నిజం వాక్యమనాదృత్య మత్త ఇత్యాపగాం బలః ।
అనాగతాం హలాగ్రేణ కుపితో విచకర్ష హ ॥ 23

ఈశ్వరః= శాసకుడగు, సః= ఆ, బలః= బలరాముడు, జలక్రీడా-అర్థమ్= నీటియందు విహరించుటకై, యమునామ్= యమునానదిని, ఆజుహావ= పిలిచెను, మత్తః= మత్తులోనున్నవాడు, ఇతి= అని, నిజమ్= తన, వాక్యమ్= మాటను, అనాదృత్య= లెక్క చేయక, అనాగతామ్= రాకున్న, ఆపగామ్= నదిని, కుపితః= కోపించినవాడై, హల-అగ్రేణ= నాగేటి చాలుతో, విచకర్ష హ= లాగి వేసెను.

సర్వమును శాసించే ఆ బలరాముడు నీటిలో విహారమునకై యమునానదిని దగ్గరకు రమ్మని పిలిచెను. కాని, ఈతడు మత్తులోనున్నాడని ఆ నది ఆయన మాటను లెక్క చేయలేదు, దగ్గరకు రాలేదు. అపుడాయనకు కోపము వచ్చి, నాగేటి చాలుతో ఆ నదిని లాగివేసెను.

పాపే త్వం మామవజ్ఞాయ యన్నాయాసి మయాఽఽహూతా ।
నేష్యే త్వాం లాంగలాగ్రేణ శతధా కామచారిణీమ్ ॥ 24

పాపే= ఓ పాపాత్మురాలా!, యత్= ఎందుచేతనైతే, మయా= నాచే, ఆహూతా= పిలువబడిన, త్వమ్= నీవు, మామ్= నన్ను, అవజ్ఞాయ= తిరస్కరించి, న ఆయాసి= రాకున్నావో అందువలన, కామచారిణీమ్= యథేచ్ఛగా ప్రవహించే, త్వామ్= నిన్ను, లాంగల-అగ్రేణ= నాగేటి చాలుతో, శతధా= వంద ముక్కలుగా, నేష్యే= చీల్చెదను.

ఓ పాపాత్మురాలా! నేను నిన్ను పిలిచినా, నీవు నన్ను తిరస్కరించి రాకుంటివి. యథేచ్ఛగా ప్రవహించే నిన్ను నేను నాగేటి చాలుతో వంద ముక్కలుగా చీల్చివేసెదను.

ఏవం నిర్భర్త్సితా భీతా యమునా యదునందనమ్ ।
ఉవాచ చకితా వాచం పతితా పాదయోర్నృప ॥ 25

నృప= ఓ రాజా!, ఏవమ్= ఈ విధముగా, నిర్భర్త్సితా= బెదిరించబడినది, భీతా= భయపడినది, చకితా= వణుకుచున్నది అగు, యమునా= యమున, పాదయోఃr= పాదములపై, పతితా= పడినదై, యదునందనమ్= యదువంశమును ఆనందింపజేసే బలరాముని ఉద్దేశించి, వాచమ్= మాటను, ఉవాచ= పలికెను.

ఓ పరీక్షిన్మహారాజా! యదువంశవర్ధనుడగు బలరాముడు ఈ విధముగా బెదిరించగా, యమున భయపడి వణికిపోయినది. ఆమె ఆయన పాదములపై పడి ఇట్లు పలికెను.

రామ రామ మహాబాహో న జానే తవ విక్రమమ్ ।
యస్యైకాంశేన విధృతా జగతీ జగతః పతే ॥ 26

రామ= ఓ బలరామా!, రామ= ఓ బలరామా!, మహాబాహో= గొప్ప బాహువులు గలవాడా!, తవ= నీ, విక్రమమ్= పరాక్రమమును

గురించి, న జానే= తెలియలేను, జగతః పతే= ఓ జగన్నాథా!, యస్య= ఏ నీయొక్క, ఏక-అంశేన= ఒక భాగముచే, జగతీ= భూమి, విధృతా= ధరించబడినదో.

ఓ బలరామా! రామా! గొప్ప బాహువులు గల నీవు జగన్నాథుడవు. నీ ఒక్క అంశచే ఈ భూమి ధరించబడియున్నది. కాని, నీ పరాక్రమమును నేను గుర్తించలేకపోతిని.

పరం భావం భగవతో భగవన్ మామజానతీమ్ ।
మోక్తుమర్హసి విశ్వాత్మన్ ప్రపన్నాం భక్తవత్సల ॥ 27

భగవన్= ఓ భగవానుడా!, విశ్వ-ఆత్మన్= జగత్తునకు ఆత్మయైన వాడా!, భక్తవత్సల= భక్తులయందు వాత్సల్యము గలవాడా!, భగవతః= పూజనీయుడవగు నీయొక్క, పరమ్= సర్వోత్కృష్టమైన, భావమ్= స్వరూపమును, అజానతీమ్= ఎరుగనట్టియు, ప్రపన్నామ్= శరణు జొచ్చిన, మామ్= నన్ను, మోక్తుమ్= విడిచి పెట్టుటకు, అర్హసి= తగుదువు.

ఓ భగవానుడా! ఈ జగత్తు యొక్క సారతత్త్వము నీవే. నీకు భక్తులయందు ప్రేమ మెండు. నేను పూజనీయుడవగు నీ స్వరూపమును తెలియలేకపోతిని. నిన్ను శరణుజొచ్చిన నన్ను విడిచిపెట్టుము.

తతో వ్యముంచద్యమునాం యాచితో భగవాన్ బలః ।
విజగాహ జలం స్త్రీభిః కరేణుభిరివేభరాట్ ॥ 28

యాచితః= కోరబడిన, బలః భగవాన్= బలరామ భగవానుడు, తతః= ఆ ప్రార్థననుబట్టి, యమునామ్= యమునను, వ్యముంచత్= విడిచిపెట్టెను, కరేణుభిః= ఆడు యేనుగులతో, ఇభరాట్ ఇవ= గజేంద్రుడు వలె, స్త్రీభిః= గోపికలతో గూడి, జలమ్= నీటిని, విజగాహ= విహరించెను.

యమునచే కోరబడిన బలరామ భగవానుడు ఆ ప్రార్థనను మన్నించి ఆమెను విడిచిపెట్టెను. అప్పుడాయన, ఆడు యేనుగులతో కూడిన గజేంద్రుడు వలె, గోపికలతో గూడి యమునాజలములలో క్రీడించెను.

కామం విహృత్య సలిలాదుత్తీర్ణాయాసితాంబరే ।
భూషణాని మహార్హాణి దదౌ కాంతిశ్శుభాం స్రజమ్ ॥ 29

కామమ్= యథేచ్ఛగా, విహృత్య= విహరించి, సలిలాత్= నీటినుండి, ఉత్తీర్ణాయ= ఒడ్డునకు వచ్చిన బలరాముని కొరకు, కాంతిః= లక్ష్మి, అసిత-అంబరే= నల్లని జంట వస్త్రములను, మహా-అర్హాణి= గొప్ప విలువైన, భూషణాని= ఆభరణములను, శుభామ్= శుభకరమైన, స్రజమ్= మాలను, దదౌ= ఇచ్చెను.

యథేచ్ఛగా విహరించి నీటినుండి బలరాముడు ఒడ్డునకు రాగానే, లక్ష్మి ఆయనకు నల్లని వస్త్రముల జతను, గొప్ప విలువ గల ఆభరణములను, శుభకరమైన మాలను సమర్పించెను.

వసిత్వా వాససీ నీలే మాలామాముచ్య కాంచనీమ్ ।
రేజే స్వలంకృతో లిప్తో మాహేంద్ర ఇవ వారణః ॥ 30

నీలే= నల్లని, వాససీ= జంట వస్త్రములను, వసిత్వా= ధరించి, కాంచనీమ్= బంగరు, మాలామ్= మాలను, ఆముచ్య= మెడలో వేసుకొని, సు-అలంకృతః= చక్కగా అలంకరించబడినవాడు, లిప్తః= అంగరాగమును రాసుకున్నవాడు అగు బలరాముడు, మాహేంద్రః= మహేంద్రునకు చెందిన, వారణః ఇవ= ఏనుగు వలె, రేజే= ప్రకాశించెను.

బలరాముడు నల్లని వస్త్రముల జతను ధరించి, బంగరు మాలను మెడలో వేసుకొని, బాగుగా అలంకరించుకొని చందనమునలదుకొనెను. ఆయన ఇంద్రుని వాహనమగు ఐరావతగజము వలె ప్రకాశించెను.

అద్యాపి దృశ్యతే రాజన్ యమునాఽఽకృష్టవర్త్మనా ।
బలస్యానంతవీర్యస్య వీర్యం సూచయతీవ హి ॥ 31

రాజన్= ఓ రాజా!, ఆకృష్టవర్త్మనా= త్రవ్వబడిన దారిచే, యమునా= యమున, అద్య అపి= ఈ నాటికి కూడా, దృశ్యతే= కనబడుచున్నది, అనంతవీర్యస్య= అనంతమగు పరాక్రమము గల, బలస్య= బలరాముని యొక్క, వీర్యమ్= పరాక్రమమును, సూచయతి ఇవ= సూచించుచున్నది వలె నున్నది, హి= నిశ్చయము.

ఓ రాజా! ఈ నాటికీ యమునానది నాగలిచే త్రవ్వబడిన దారిలో ప్రవహిస్తున్న వైనము కనబడును. ఆ ప్రవాహము నిశ్చయముగా అనంతమగు శక్తి గల బలరాముని పరాక్రమమును సూచిస్తున్నట్లున్నది.

ఏవం సర్వా నిశా యాతా ఏకేవ రమతో వ్రజే ।
రామస్యాక్షిప్తచిత్తస్య మాధుర్యైర్వ్రజయోషితామ్ ॥ 32

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే పంచషష్టితమోధ్యాయః ॥

ఏవమ్= ఈ విధముగా, వ్రజే= నందగోకులమునందు, రమతః= విహరించుచున్నట్టియు, వ్రజయోషితామ్= గోకులమునందలి యువతుల యొక్క, మాధుర్యైః= విలాసాలచే, ఆక్షిప్తచిత్తస్య= వశము చేసుకొనబడిన మనస్సు గల, రామస్య= బలరామునకు, సర్వాః= అన్ని, నిశాః= రాత్రులు, ఏకా ఇవ= ఒక్కటి వలె, యాతాః= గడచినవి.

బలరాముడీ విధముగా గోకులమునందు విహరించుచుండెను. ఆయన మనస్సు గోపికల విలాసాలకు వశమయ్యెను. ఆయనకు రాత్రులన్నీ ఒకే రాత్రిగా అయినట్లుండెను.

శ్రీమద్భాగవత మహాపురాణము పదవ స్కంధములో
బలరాముని వ్రజయాత్రను వర్ణించే
అరువది ఐదవ అధ్యాయము ముగిసినది (65).

అథ షట్పష్టితమోఽధ్యాయః

పౌండ్రకుని కాశిరాజుని ఉద్ధరించుట

శ్రీశుక ఉవాచ ।

నందవ్రజం గతే రామే కరూషాధిపతిర్నృప ।
వాసుదేవోఽహమిత్యజ్ఞో దూతం కృష్ణాయ ప్రాహిణోత్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, నృప= ఓ రాజా!, రామే= బలరాముడు, నందవ్రజమ్= నందుని గోకులమును గురించి, గతే= వెళ్లగా, అజ్ఞః= అజ్ఞాని, కరూష-అధిపతిః= కరూష దేశాధిపతియగు పౌండ్రకుడు, అహమ్= నేను, వాసుదేవః= వాసుదేవుడను, ఇతి= అని, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, దూతమ్= దూతను, ప్రాహిణోత్= పంపెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! బలరాముడు నందుని గోకులమునకు వెళ్లగా, అజ్ఞానియైన కరూషదేశాధిపతి పౌండ్రకుడు తానే వాసు దేవుడనని శ్రీకృష్ణుని వద్దకు దూతను పంపెను.

త్వం వాసుదేవో భగవానవతీర్ణో జగత్పతిః ।
ఇతి ప్రస్తోభితో బాలైర్మేన ఆత్మానమచ్యుతమ్ ॥ 2

త్వమ్= నీవు, వాసుదేవః భగవాన్= వాసుదేవ భగవానుడవు, అవతీర్ణః= అవతరించినవాడవు, జగత్-పతిః= జగన్నాథుడవు, ఇతి= అని, బాలైః= అవివేకులచే, ప్రస్తోభితః= ప్రోత్సహించబడినవాడై, ఆత్మానమ్= తనను, అచ్యుతమ్= శ్రీహరినిగా, మేనే= తలచెను.

భూమిపై అవతరించిన జగన్నాథుడగు వాసుదేవ భగవానుడవు నీవే, అని అవివేకులు ప్రోత్సహించగా, ఆతడు తానే శ్రీహరినని తలచెను.

దూతం చ ప్రాహిణోన్మందః కృష్ణాయావ్య క్తవర్మనే ।
ద్వారకాయాం యథా బాలో నృపో బాలకృతోఽబుధః ॥ 3

మందః= మూర్ఖుడగు ఆతడు, అవ్యక్తవర్మనే= తెలియబడని మహిమ కలిగిన, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, ద్వారకాయామ్= ద్వారకయందు, దూతం చ= దూతను కూడ, ప్రాహిణోత్= పంపెను, యథా= ఏ విధముగానైతే, అబుధః= ఏమీ తెలియని, బాలః= బాలుడు, బాలకృతః= బాలకులచే చేయబడిన, నృపః= రాజో.

పిల్లలు ఆటలో తమలో ఒకరిని రాజుగా కల్పించెదరు. వానికి రాజంటే ఏమీ తెలియదు. పౌండ్రకుడట్టి మూర్ఖుడు. ఆతనికి శ్రీకృష్ణుని మహిమ తెలియదు. ఆతడు ద్వారకయందున్న ఆయన వద్దకు దూతను-పంపెను.

దూతస్తు ద్వారకామేత్య సభాయామాస్థితం ప్రభుమ్ ।
కృష్ణం కమలపత్రాక్షం రాజసందేశమబ్రవీత్ ॥ 4

దూతః తు= దూతయైతే, ద్వారకామ్= ద్వారకను గురించి, ఏత్య= వచ్చి, సభాయామ్= సభయందు, ఆస్థితమ్= ఉన్నట్టియు, ప్రభుమ్= సర్వసమర్థుడైనట్టియు, కమలపత్ర-అక్షమ్= కలువరేకులవంటి కన్నులు గల, కృష్ణమ్= శ్రీకృష్ణుని ఉద్దేశించి, రాజసందేశమ్= పౌండ్రకరాజు యొక్క సందేశమును, అబ్రవీత్= చెప్పెను.

ఆ దూత ద్వారకకు వచ్చి సభలోనున్న శ్రీకృష్ణునకు పౌండ్రకరాజు యొక్క సందేశమును చెప్పెను. కలువ రేకులవంటి కన్నులు గల శ్రీకృష్ణుడు సర్వసమర్థుడు.

వాసుదేవోఽవతీర్ణోఽహమేక ఏవ న చాపరః ।
భూతానామనుకంపార్థం త్వం తు మిథ్యాభిధాం త్యజ ॥5

భూతానామ్= ప్రాణుల, అనుకంపా-అర్థమ్= అనుగ్రహించుట కొరకు, అవతీర్ణః= అవతరించిన, వాసుదేవః= వాసుదేవుడను, అహమ్=

నేను, ఏకః ఏవ= ఒక్కడిని మాత్రమే, అపరః చ= ఇంకొకడైతే, న= కాదు, త్వం తు= నీవైతే, మిథ్యా-అభిధామ్= తప్పు బిరుదును, త్యజ= విడువుము.

ప్రాణులను అనుగ్రహించుటకై అవతరించిన వాసుదేవుడను నేనొక్కడిని మాత్రమే; మరియొకడు కాదు. నీవు అసత్యమైన వాసుదేవుడనే బిరుదును విడిచి పెట్టుము.

యాని త్వమస్మచ్చిహ్నాని మౌఢ్యాద్బిభర్షి సాత్వత ।
త్యక్త్వైహి మాం త్వం శరణం నో చేద్దేహి మమాహవమ్ ॥ 6

సాత్వత= ఓ యదువంశీయుడా!, త్వమ్= నీవు, మౌఢ్యాత్= మోహము వలన, యాని= ఏ, అస్మత్-చిహ్నాని= మా చిహ్నములను, బిభర్షి= ధరించుచున్నావో వాటిని, త్యక్త్వా= విడిచిపెట్టి, త్వమ్= నీవు, మామ్= నన్ను, శరణం ఏహి= శరణు జొచ్చుము, నో చేత్= అట్లు కానిచో, మమ= నాకు, ఆహవమ్= యుద్ధమును, దేహి= ఇమ్ము.

ఓ యాదవా! నీవు మోహము వలన నా చిహ్నములను (చక్రము ఇత్యాదులు) ధరించుచున్నావు. నీవు వాటిని విడిచి పెట్టి నన్ను శరణు పొందుము. లేదా, నాతో యుద్ధమునకు సంసిద్ధుడవు కమ్ము.

శ్రీశుక ఉవాచ ।

కత్థనం తదుపాకర్ణ్య పౌండ్రకస్యాల్పమేధసః ।
ఉగ్రసేనాదయస్సభ్యా ఉచ్చకైర్జహసుస్తదా ॥ 7

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అల్పమేధసః= మందబుద్ధియగు, పౌండ్రకస్య= పౌండ్రకునియొక్క, తత్= ఆ, కత్థనమ్= బడాయి మాటను, ఉపాకర్ణ్య= విని, తదా= అప్పుడు, ఉగ్రసేన-ఆదయః = ఉగ్రసేనుడు మొదలుగా గల, సభ్యాః= సభాసదులు, ఉచ్చకైః= బిగ్గరగా, జహసుః= నవ్విరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను – మందబుద్ధియగు పౌండ్రకుని ఆ బడాయి మాటలను విని అప్పుడు ఉగ్రసేనుడు, సాత్యకి మొదలైన సభాసదులు బిగ్గరగా నవ్విరి.

ఉవాచ దూతం భగవాన్ పరిహాసకథామను ।
ఉత్రక్ష్యే మూఢ చిహ్నాని యైస్త్వమేవం వికత్థసే ॥ 8

పరిహాసకథాం అను= నవ్వుల ప్రసంగము తరువాత, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, దూతమ్= దూతనుద్దేశించి, ఉవాచ= పలికెను, మూడ= ఓరీ మూర్ఖా!, చిహ్నాని= చిహ్నములను, ఉత్రక్ష్యే= విడిచి పెట్టగలను, యైఃఁ= వేటిచే (ఎవరిచే), త్వమ్= నీవు, ఏవమ్= ఈ విధముగా, వికత్థసే= బడాయిలు పలుకుచున్నావో.

సభాసదుల పరిహాస ప్రసంగములైన పిదప శ్రీకృష్ణ భగవానుడు దూత ద్వారా పౌండ్రకునుద్దేశించి ఇట్లు పలికెను – ఓరీ మూఢా! నీవే ఏ చిహ్నములను (ఎవరి ఆసరా) చూసుకొని ఈ విధముగా బడాయిలు పలుకుతున్నావో, వాటిని నీపై (నీ అనుయాయులపై) విడిచిపెట్ట గలను.

ముఖం తదపిధాయాజ్ఞ కంకగృధ్రవటైర్వృతః ।
శయిష్యసే హతస్తత్ర భవితా శరణం శునామ్ ॥ 9

అజ్ఞ= ఓరీ మూర్ఖుడా!, హతఃఁ= వధించబడిన నీవు, తత్= ఆ, ముఖమ్= నోటిని, అపిధాయ= తెరిచి, కంకగృధ్రవటైఃఁ= రాబందులు గ్రద్దలు గవ్వ పక్షులచే, వృతఃఁ= చుట్టువారబడినవాడవై, తత్ర= అచట, శయిష్యసే= పడి యుండెదవు, శునామ్= కుక్కలకు, శరణమ్= శరణు, భవితా= కాగలవు.

ఓరీ మూర్ఖా! నేను నిన్ను వధించినప్పుడు బడాయిలు చెప్పిన ఆ నోటిని వెళ్లబెట్టి యుద్ధభూమిలో పడి యుండెదవు. అప్పుడు నీ చుట్టూ రాబందులు, గ్రద్దలు, గవ్వ పక్షులు చేరును. నీవు కుక్కలకు శరణు కాగలవు.

ఇతి దూతస్తదాక్షేపం స్వామినే సర్వమాహరత్ ।
కృష్ణోఽపి రథమాస్థాయ కాశీముపజగామ హ ॥ 10

ఇతి= ఈ విధమైన, తత్= ఆ, ఆక్షేపమ్= నిందావచనమును, సర్వమ్= అంతనూ, దూతః= దూత, స్వామినే= పౌండ్రకప్రభువు కొరకు, ఆహరత్= నివేదించెను, కృష్ణః అపి= శ్రీకృష్ణుడు కూడ, రథమ్= రథమును, ఆస్థాయ= అధిష్ఠించి, కాశీమ్= కాశీని గురించి, ఉపజగామ హ= వెళ్లెను.

ఈ విధమైన ఆ నిందావచనమునంతనూ దూత తన ప్రభువగు పౌండ్రకునికి నివేదించెను. శ్రీకృష్ణుడు కూడ రథమునెక్కి కాశీకి వెళ్లెను.

పౌండ్రకోఽపి తదుద్యోగముపలభ్య మహారథః ।
అక్షౌహిణీభ్యాం సంయుక్తో నిశ్చక్రామ పురాద్రుతమ్ ॥ 11

మహారథః= మహారథుడగు, పౌండ్రకః అపి= పౌండ్రకుడు కూడ, తద్-ఉద్యోగమ్= ఆ శ్రీకృష్ణుని యుద్ధప్రయత్నమును గురించి, ఉపలభ్య= తెలుసుకొని, అక్షౌహిణీభ్యామ్= రెండు అక్షౌహిణీలతో, సంయుక్తః= కూడినవాడై, పురాత్= నగరమునుండి, ద్రుతమ్= వేగముగా, నిశ్చక్రామ= నిష్క్రమించెను.

శ్రీకృష్ణుని యుద్ధప్రయత్నము తెలిసి మహారథుడగు పౌండ్రకుడు కూడ రెండు అక్షౌహిణీల సేనతో గూడి వెంటనే పురమునుండి నిష్క్రమించెను.

తస్య కాశిపతిర్మిత్రం పార్ష్ణిగ్రాహోఽన్వయాన్నృప ।
అక్షౌహిణీభిస్తిసృభిరపశ్యత్పౌండ్రకం హరిః ॥ 12

నృప= ఓ రాజా!, తస్య= వాని, మిత్రమ్= మిత్రుడైన, కాశిపతిః= కాశీరాజు, పార్ష్ణిగ్రాహః= వెనుకనుండి రక్షించువాడై, తిసృభిః= మూడు, అక్షౌహిణీభిః= అక్షౌహిణీలతో, అన్వయాత్= వెనుక వచ్చెను, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, పౌండ్రకమ్= పౌండ్రకుని, అపశ్యత్= చూచెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ పౌండ్రకుని మిత్రుడగు కాశీరాజు మూడు అక్షౌహిణులతో వెనుకనుండి రక్షిస్తూ అనుసరించెను. శ్రీకృష్ణ భగవానుడా పౌండ్రకుని చూచెను.

శంఖార్యసిగదాశార్ఙ్గ శ్రీవత్సాద్యుపలక్షితమ్ ।
బిభ్రాణం కౌస్తుభమణిం వనమాలావిభూషితమ్ ॥ 13

శంఖ–అరి–అసిగదాశార్ఙ్గశ్రీవత్స–ఆది–ఉపలక్షితమ్= శంఖము చక్రము కత్తి గద శార్ఙ్గధనుస్సు శ్రీవత్సము (వక్షఃస్థలముపై పుట్టుమచ్చ) మొదలగువాటిచే గుర్తు పట్టబడినట్టియు, కౌస్తుభమణిమ్= కౌస్తుభ–మాణిక్యమును, బిభ్రాణమ్= ధరించినట్టియు, వనమాలా విభూషితమ్= వనమాలచే అలంకరించబడిన (పౌండ్రకుని చూచెను).

శంఖము, చక్రము, కత్తి, శార్ఙ్గధనుస్సు, శ్రీవత్సము, కౌస్తుభ–మాణిక్యము (నకిలీవి), వనమాల, పించము మొదలగువాటిని అలంక–రించుకున్న పౌండ్రకుని శ్రీకృష్ణుడు ఆ చిహ్నములను బట్టి గుర్తు పట్టెను.

కౌశేయవాససీ పీతే వసానం గరుడధ్వజమ్ ।
అమూల్యమౌల్యాభరణం స్ఫురన్మకరకుండలమ్ ॥ 14

పీతే= పచ్చని, కౌశేయవాససీ= జత పట్టు వస్త్రములను, వసానమ్= ధరించినట్టియు, గరుడధ్వజమ్= గరుడుడు ధ్వజమునందు కలిగినట్టియు, అమూల్యమౌలి–ఆభరణమ్= చవకబారు కిరీటము కలిగినట్టియు, స్ఫురత్–మకరకుండలమ్= ప్రకాశించే మకర కుండలములు కలిగిన–

ఆ పౌండ్రకుడు జత పచ్చని పట్టు వస్త్రములను ధరించెను. ఆతని జెండాపై గరుడుడు (నకిలీ) ఉండెను. ఆతడు చవకబారు కిరీటమును, మకరాకృతి గల కుండలములను దాల్చెను.

దృష్ట్వా తమాత్మనస్తుల్యవేషం కృత్రిమమాస్థితమ్ ।
యథా నటం రంగగతం విజహాస భృశం హరిః ॥ 15

రంగగతమ్= రంగస్థలముపైనున్న, నటం యథా= నటుని వలె, కృత్రిమమ్= నకిలీయైన, ఆత్మనః= తనకు, తుల్యవేషమ్= సమానమైన వేషమును, ఆస్థితమ్= ధరించియున్న, తమ్= వానిని, దృష్ట్వా= చూచి, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, భృశమ్= అధికముగా, విజహాస= నవ్వెను.

రంగస్థలము పైనుండే నటుడు వలె తనను పోలిన నకిలీ వేషమును ధరించిన ఆ పౌండ్రకుని చూచి శ్రీకృష్ణ భగవానుడు విరగబడి నవ్వెను.

శూలైర్గదాభిః పరిఘైశ్చక్ర్యృష్టిప్రాసతోమరైః ।
అసిభిః పట్టిశైర్బాణైః ప్రాహరన్నరయో హరిమ్ ॥ 16

అరయః= శత్రువులు, శూలైః= శూలములతో, గదాభిః= గదలతో, పరిఘైః= గుదియలతో, శక్తి-ఋష్టిప్రాసతోమరైః= బల్లెములు, ఖడ్గములు, ఈటెలు చిల్లకోలలతో, అసిభిః= చురకత్తులతో, పట్టిశైః= అడ్డకత్తులతో, బాణైః= బాణములతో, హరిమ్= శ్రీకృష్ణ భగవానుని, ప్రాహరన్= కొట్టిరి.

శత్రువులు శ్రీకృష్ణ భగవానుని శూలములు, గదలు, గుదియలు, బల్లెములు, ఖడ్గములు, ఈటెలు, చిల్లకోలలు, చురకత్తులు, అడ్డకత్తులు, బాణములు అనువాటితో కొట్టిరి.

కృష్ణస్తు తత్పౌండ్రకకాశిరాజయోః
బలం గజస్యందనవాజిపత్తిమత్ ।
గదాఽసిచక్రేషుభిరార్దయద్భృశం
యథా యుగంతే హుతభుక్ పృథక్ప్రజాః ॥ 17

కృష్ణః తు= శ్రీకృష్ణుడైతే, యుగాంతే= ప్రళయకాలమునందు, హుతభుక్= అగ్ని, పృథక్-ప్రజాః యథా= వేర్వేరు ప్రాణులను వలె,

పౌండ్రకకాశిరాజయోఃపౌండ్రకుని కాశీరాజుయొక్క, గజస్యందనవాజిపత్తి మత్= ఏనుగులు రథముల గుర్రములు పదాతులు గల, బలమ్= సైన్యమును, గదా-అసిచక్ర-ఇషుభిఃగదలు కత్తులు చక్రము బాణములతో, భృశమ్= అధికముగా, ఆర్దయత్= పీడించెను.

ప్రళయకాలమునందు అగ్ని పలు రకముల ప్రాణులను వలె, శ్రీకృష్ణుడైతే ఆ పౌండ్రకకాశీరాజుల సైన్యమునకు గదలు, కత్తులు, చక్రము, బాణములతో అధికముగా పీడను కలిగించెను. ఆ సైన్యమునందు ఏనుగులు, రథములు, గుర్రములు, పదాతులు గలరు.

ఆయోధనం తద్రథవాజికుంజరద్విపత్ఖరోష్ట్రైరరిణాఽవఖండితైఃబభౌ చితం మోదవహం మన స్వినామాక్రీడనం భూతపతేరివోల్బణమ్.18

అరిణాఃచక్రముచే, అవఖండితైఃముక్కలు చేయబడిన, రథవాజికుంజరద్విపత్-ఖర-ఉష్ట్రైఃరథములు, గుర్రములు, ఏనుగులు, పదాతులు, గాడిదలు, ఒంటెలచే, చితమ్ = వ్యాపించడిన, తత్ = ఆ, ఆయోధనమ్= యుద్ధరంగము, భూతపతేఃభూతనాథుడగు రుద్రుని, ఉల్బణమ్= భయమును గొల్పే, ఆక్రీడనం ఇవ= ఆటల మైదానము వలె, మనస్వినామ్= శూరులకు, మోదవహమ్= హర్షమును కలిగించునదై, బభౌ= ప్రకాశించెను.

ఆ యుద్ధరంగము చక్రముచే ముక్కలుగా చేయబడిన రథములు, గుర్రములు, ఏనుగులు, పదాతులు, గాడిదలు, ఒంటెలతో వ్యాప్తమయ్యెను. భూతనాథుడగు రుద్రుని భయంకరమగు క్రీడాస్థలమును పోలిన ఆ యుద్ధస్థలము శూరులకు హర్షమును కలిగిస్తూ ప్రకాశించెను.

అథాహ పౌండ్రకం శౌరిర్భోభోఃపౌండ్రక యద్భవాన్ ।
దూతవాక్యేన మామాహ తాన్యస్త్రాణ్యుత్సృజామి తే ॥ 19

అథ= తరువాత, శౌరిః= శ్రీకృష్ణుడు, పౌండ్రకమ్= పౌండ్రకుని ఉద్దేశించి, ఆహ= పలికెను, భోః= ఓయీ!, భోః= ఓయీ!, పౌండ్రక= పౌండ్రకా!, భవాన్= నీవు, దూతవాక్యేన= దూతయొక్క వచనము ద్వారా, యత్= దేనిని గురించి, మామ్= నన్ను ఉద్దేశించి, ఆహ= పలికితివో, తాని= ఆ, అస్త్రాణి= అస్త్రములను, తే= నీ కొరకు, ఉత్సృజామి= విడిచి పెట్టుచున్నాను.

తరువాత శ్రీకృష్ణుడు పౌండ్రకునితో నిట్లు పలికెను - ఓయీ పౌండ్రకా! నీవు దూతవాక్యము ద్వారా వేటిని విడిచిపెట్టమని నాకు కబురు పెట్టితివో, ఆ అస్త్రములను నీపై విడిచి పెట్టుచున్నాను.

త్యాజయిష్యే ఽభిధానం మే యత్త్వయాజ్ఞ మృషా ధృతమ్ ।
ప్రజామి శరణం తే ఽద్య యది నేచ్ఛామి సంయుగమ్ ॥ 20

అజ్ఞ= ఓరీ మూర్ఖా!, మే= నా, అభిధానమ్= పేరును, త్యాజయిష్యే ఃఽ= విడుచునట్లు చేసెదను, యత్= ఏదైతే, త్వయా= నీచే, మృషా= కపటముగా, ధృతమ్= పెట్టుకొనబడినదో, సంయుగమ్= యుద్ధమును, యది న ఇచ్ఛామి= నేను కోరని పక్షములో, అద్య= ఈనాడు, తే= నీ, శరణమ్= శరణమును, ప్రజామి= పొందెదను.

ఓరీ మూర్ఖా! నీవు నా పేరును కపటముతో పెట్టుకుంటివి. ఇప్పుడు నీవా పేరును విడిచి పెట్టునట్లు చేసెదను. నాకు యుద్ధముపై ఇచ్ఛ లేకున్నచో, నిన్ను ఈనాడు శరణు వేడెదను.

ఇతి క్షిప్త్వా శితైర్బాణైర్విరథీకృత్య పౌండ్రకమ్ ।
శిరో ఽవృశ్చద్రథాంగేన వజ్రేణేంద్రో యథా గిరేః ॥ 21

ఇతి= అని, పౌండ్రకమ్= పౌండ్రకుని, క్షిప్త్వా= నిందించి, శితైః= వాడి, బాణైః= బాణములతో, విరథీకృత్య= రథము లేనివానినిగా చేసి, రథ-అంగేన= చక్రముతో, శిరః= తలను, గిరేః= పర్వతము యొక్క

(శిఖరమును), వజ్రేణ= వజ్రముతో, ఇంద్రః యథా= ఇంద్రుడు వలె, అవృశ్చత్= నరికెను.

శ్రీకృష్ణుడి విధముగా పౌండ్రకుని తిరస్కరించి వాడి బాణములతో రథహీనునిగా చేసెను. అపుడాయన, ఇంద్రుడు వజ్రముతో పర్వత-శిఖరమును వలె, చక్రముతో వాని తలను నరికెను.

తథా కాశిపతేః కాయాచ్ఛిర ఉత్కృత్య పత్రిభిః ।
న్యపాతయత్కాశిపుర్యాం పద్మకోశమివానిలః ॥ 22

తథా= అదే విధముగా, పత్రిభిః= రెక్కల బాణములతో, కాశిపతేః = కాశీరాజుయొక్క, శిరః= తలను, కాయాత్= మొండెమునుండి, ఉత్కృత్య= ఊడబెరకి, పద్మకోశమ్= పద్మపు మొగ్గను, అనిలః ఇవ= గాలి వలె, కాశిపుర్యామ్= కాశీనగరమునందు, న్యపాతయత్= పడునట్లు చేసెను.

అదే విధముగా ఆయన రెక్కల బాణములతో కాశీరాజు తలను మొండెమునుండి ఊడగొట్టి, పద్మపు మొగ్గను వాయువు వలె, కాశీ నగరములో పడునట్లు చేసెను.

ఏవం మత్సరిణం హత్వా పౌండ్రకం ససఖం హరిః ।
ద్వారకామావిశత్సిద్ధైర్గీయమానకథాఽమృతః ॥ 23

హరిః= శ్రీకృష్ణ భగవానుడు, మత్సరిణమ్= ఈర్ష్యాళువైనట్టియు, ససఖమ్= మిత్రునితో కూడిన, పౌండ్రకమ్= పౌండ్రకుని, ఏవమ్= ఈ విధముగా, హత్వా= సంహరించి, సిద్ధాః= సిద్ధులచే, గీయమానకథా-అమృతః= గానము చేయబడే అమృతమువంటి గాథలు గలవాడై, ద్వారకామ్= ద్వారకను, ఆవిశత్= ప్రవేశించెను.

శ్రీకృష్ణ భగవానుడీ విధముగా తన ఉత్కర్షను సహించలేని పౌండ్రకుని, వాని మిత్రుడగు కాశీరాజును సంహరించెను. ఆయన

అమృతమువంటి తన కీర్తిని సిద్ధులు గానము చేయుచుండగా, ద్వారకలో ప్రవేశించెను.

స నిత్యం భగవద్ధ్యానప్రధ్వస్తాఖిలబంధనః ।
బిభ్రాణశ్చ హరే రాజన్ స్వరూపం తన్మయోఽభవత్ ॥ 24

రాజన్= ఓ రాజా!, నిత్యమ్= ఎల్లవేళలా, భగవద్-ధ్యానప్రధ్వస్త-అఖిలబంధనః= భగవానుని ధ్యానముచే నశింపజేయబడిన సకల-బంధములు కలిగినట్టియు, హరేః= శ్రీకృష్ణ భగవానుని, స్వరూపం చ= రూపమును కూడ, బిభ్రాణః= ధరించుచున్న, సః= ఆ పౌండ్రకుడు, తత్-మయః= ఆ భగవన్మయుడు, అభవత్= ఆయెను.

ఓ రాజా! ఆ పౌండ్రకుడు ఎల్లవేళలా శ్రీకృష్ణ భగవానుని ధ్యానించుట వలన ఆతని సకలబంధములు ధ్వస్తమయ్యెను. పైగా, ఆతడు ఆయన రూపమునే ధరించెను. ఆతడు భగవంతునిలో విలీనమయ్యెను.

శిరః పతితమాలోక్య రాజద్వారే సకుండలమ్ ।
కిమిదం కస్య వా వక్త్రమితి సంశిశ్యిరే జనాః ॥ 25

రాజద్వారే= రాజద్వారమునందు, పతితమ్= పడిన, సకుండలమ్= కుండలములతో కూడిన, శిరః= తలను, ఆలోక్య= చూచి, జనాః= జనులు, ఇదమ్= ఇది, కిమ్= ఏమి?, కస్య= ఎవని, వక్త్రం వా= తల?, ఇతి= అని, సంశిశ్యిరే= సంశయమును పొందిరి.

రాజద్వారము పై కుండలములతో కూడిన తల పడెను. దానిని చూచి జనులకు, ఇది యేమి? ఇది ఎవని తల? అనే సంశయములు కలిగెను.

రాజ్ఞః కాశిపతేర్జ్ఞాత్వా మహిష్యః పుత్ర బాంధవాః ।
పౌరాశ్చ హా హతా రాజన్నాథ నాథేతి పారుదన్ ॥ 26

కాశిపతేఃకాశీని పాలించే, రాజ్ఞఃరాజుదని, జ్ఞాత్వా= తెలిసి, మహిష్యఃభార్యలు, పుత్ర బాంధవాఃపుత్రులు బంధువులు, పౌరాఃచ= పురజనులు కూడ, హా= అయ్యో!, హతాఃచంపబడితిమి, రాజన్= ఓ రాజా!, నాథ= ప్రభూ!, నాథ= ప్రభూ! ఇతి= అని, మరుదన్= బిగ్గరగా రోదించిరి.

ఆ తల కాశీరాజుదని తెలిసి ఆయన భార్యలు, పుత్రులు, బంధువులు, పురజనులు కూడ, అయ్యో! హతులమైతిమి, ఓ రాజా! ప్రభూ! ప్రభూ! అని బిగ్గరగా రోదించిరి.

సుదక్షిణస్తస్య సుతః కృత్వా సంస్థావిధిం పితుః ।
నిహత్య పితృహంతారం యాస్యామ్యపచితిం పితుః ॥ 27

సుదక్షిణఃసుదక్షిణుడనే, తస్యఆయనయొక్క, సుతఃపుత్రుడు, పితుఃతండ్రియొక్క, సంస్థావిధిమ్ప్రేతకృత్యమును, కృత్వా= చేసి, పితృహంతారమ్తండ్రిని చంపినవానిని, నిహత్య= సంహరించి, పితుఃతండ్రియొక్క, అపచితిమ్నిష్కృతిని, యాస్యామి= పొందగలను.

సుదక్షిణుడనే ఆయన పుత్రుడు తండ్రికి ప్రేతకార్యములను చేసెను. అపుడాతడు, తండ్రిని చంపినవానిని చంపి తండ్రి ఋణమును తీర్చుకొనెదను, అని సంకల్పించెను.

ఇత్యాత్మనాఽభిసంధాయ సోపాధ్యాయో మహేశ్వరమ్ ।
సుదక్షిణోఽర్చయామాస పరమేణ సమాధినా ॥ 28

సుదక్షిణఃసుదక్షిణుడు, ఇతి= అని, ఆత్మనా= బుద్ధితో, అభిసంధాయ= నిశ్చయించి, స-ఉపాధ్యాయఃపురోహితునితో గూడిన వాడై, మహా-ఈశ్వరమ్= మహేశ్వరుని, పరమేణ= అతిశయించిన, సమాధినా= చిత్తైకాగ్రతతో, అర్చయామాస= పూజించెను.

సుదక్షిణుడు బుద్ధితో ఈ విధముగా నిశ్చయించి పురోహితునితో గూడినవాడై మహేశ్వరుని అతిశయించిన చిత్తైకాగ్రతతో ఆరాధించెను.

ప్రీతోఽ విముక్తే భగవాంస్తస్మై వరమదాద్భవః ।
పితృహంతృవధోపాయం స వవ్రే వరమీప్సితమ్ ॥ 29

అవిముక్తే= కాశీక్షేత్రమునందు, తస్మై= వాని కొరకు, ప్రీతః= ప్రీతుడైన, భగవాన్ భవః= శివ భగవానుడు, వరమ్= వరమును, అదాత్= ఇచ్చెను, సః= ఆతడు, పితృహంతృవధ-ఉపాయమ్= తండ్రిని చంపిన వానిని వధించే ఉపాయమును, ఈప్సితమ్= అభీష్టమైన, వరమ్= వరమునుగా, వవ్రే= కోరెను.

కాశీ క్షేత్రములో ఆరాధించిన ఆతనిపై శివభగవానుడు ప్రీతిని జెంది వరమునిచ్చెను. ఆతడు తన తండ్రిని చంపినవానిని వధించే ఉపాయమును అభీష్టమైన వరమునుగా కోరుకొనెను.

దక్షిణాగ్నిం పరిచర బ్రాహ్మణైస్సమమృత్విజమ్ ।
అభిచారవిధానేన స చాగ్నిః ప్రమథైర్వృతః ॥ 30

సాధయిష్యతి సంకల్పమబ్రహ్మణ్యే ప్రయోజితః ।
ఇత్యాదిష్టస్తథా చక్రే కృష్ణాయాభిచరన్ వ్రతీ ॥ 31

బ్రాహ్మణైః సమమ్= బ్రాహ్మణులతో గూడి, ఋత్విజమ్= ఋత్విగ్రూపుడైన, దక్షిణ అగ్నిమ్= దక్షిణాగ్నిని, అభిచారవిధానేన= అభిచారప్రయోగముచే, పరిచర= ఆరాధించుము, సః= ఆ, అగ్నిః చ= అగ్ని కూడ, ప్రమథైః= ప్రమథగణములచే, వృతః= చుట్టువారబడినవాడై, అబ్రహ్మణ్యే= బ్రాహ్మణభక్తుడు కానివానియందు, ప్రయోజితః= ప్రయోగించ బడినవాడై, సంకల్పమ్= కామనను, సాధయిష్యతి= సంపాదించగలడు, ఇతి= అని, ఆదిష్టః= ఆదేశించబడినవాడై, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు,

అభిచరన్= అభిచారమును చేయువాడై, వ్రతీ= వ్రతనిష్ఠ గలవాడై, తథా= ఆ విధముగా, చక్రే= చేసెను.

బ్రాహ్మణులతో గూడి ఋత్విగ్రూపుడైన దక్షిణాగ్నిని అభిచార (శత్రువధ) ప్రయోగముతో ఆరాధించుము. ఆ అగ్ని ప్రమథగణములచే చుట్టువారబడి ప్రకటమగును. బ్రాహ్మణభక్తుడు కానివానియందు ప్రయోగించినచో, ఆ అగ్ని నీ సంకల్పమును సాధించిపెట్టును, అని శివుడు ఆదేశించెను. ఆతడు వ్రతనిష్ఠ గలవాడై అదే విధముగా శ్రీకృష్ణుని పై అభిచార ప్రయోగమును చేసెను.

తతోఽగ్నిరుత్థితః కుండాన్మూర్తిమానతిభీషణః ।
తప్తతామ్రశిఖాశ్మశ్రురంగారోద్గారిలోచనః ॥ 32

తతః= తరువాత, కుండాత్= అగ్నికుండమునుండి, అతిభీషణః= మిక్కిలి భయమును గొల్పునట్టియు, తప్తతామ్రశిఖాశ్మశ్రుః= కాల్చిన రాగివంటి జుట్టు మీసము గెడ్డము కలవాడు, అంగార-ఉద్గారిలోచనః= మండే కొరివిలను వెళ్లగ్రక్కే కన్నులు గలవాడు, మూర్తిమాన్= రూపు దాల్చిన, అగ్నిః= అగ్ని, ఉత్థితః= పైకి లేచినవాడు.

తరువాత అగ్నికుండమునుండి అగ్ని మిక్కిలి భయంకరమగు రూపుదాల్చి పైకి లేచెను. ఆయన జుట్టు, మీసము, గెడ్డము కాల్చిన రాగివలె నుండెను. ఆయన కళ్లనుండి మండే కొరివిలను వెళ్లగ్రక్కెను.

దంష్ట్రోగ్రభ్రుకుటీదండకఠోరాస్యస్స్వజిహ్వయా ।
ఆలిహన్ సృక్కిణీ నగ్నో విధున్వంస్త్రిశిఖం జ్వలన్ ॥ 33

దంష్ట్ర-ఉగ్రభ్రుకుటీదండకఠోర-ఆస్యః= కోరలతో భయంకరమైన కనుబొమలతో భయపెట్టుచున్న క్రూరమైన మోము గలవాడు, స్వజిహ్వయా= తన నాలుకతో, సృక్కిణీ= పెదవుల కొనలను, ఆలిహన్= ఆస్వాదించువాడు,

నగ్నః= దిగంబరుడు, త్రిశిఖమ్= త్రిశూలమును, విధున్వన్= త్రిప్పుచున్న వాడు, జ్వలన్= మండుచున్నవాడు.

ఆ అగ్నిదేవుడు కోరలతో భయంకరమైన, కనుబొమలతో భయపెట్టుచున్న క్రూరమైన ముఖమును కలిగియుండెను. ఆతడు తన నాలుకతో పెదవుల కొనలనాస్వాదిస్తూ మండుచుండెను. ఆతడు దిగంబరుడై త్రిశూలమును త్రిప్పుచుండెను.

పద్భ్యాం తాలప్రమాణాభ్యాం కంపయన్నవనీతలమ్ ।
సోఽభ్యధావద్వృతో భూతైర్ద్వారకాం ప్రదహన్ దిశః ॥ 34

తాలప్రమాణాభ్యామ్= తాటిచెట్టు పొడవు గల, పద్భ్యామ్= పాదములతో, అవనీతలమ్= భూతలమును, కంపయన్= కంపింప-జేయుచున్న, సః= ఆ అగ్నిదేవుడు, భూతైః= భూతములచే, వృతః= చుట్టువారబడినవాడై, దిశః= దిక్కులను, ప్రదహన్= అధికముగా కాల్చి-వేయుచున్నవాడై, ద్వారకామ్= ద్వారకను గురించి, అభ్యధావత్= అభిముఖముగా పరుగెత్తెను.

తాటి చెట్టు పొడవు గల పాదములతో ఆతడు భూతలమును కంపింపజేయుచుండెను. ఆతడు దిక్కులను అధికముగ దహిస్తూ, ప్రమథ గణములు చుట్టువారి రాగా, ద్వారక వైపునకు పరుగెత్తెను.

తమాభిచారదహనమాయాంతం ద్వారకౌకసః ।
విలోక్య తత్రసుస్సర్వే వనదాహే మృగా యథా ॥ 35

ఆయాంతమ్= వచ్చుచున్న, తమ్= ఆ, ఆభిచారదహనమ్= అభిచారమునకు చెందిన అగ్నిని, విలోక్య= చూచి, ద్వారకా-ఓకసః= ద్వారకావాసులు, సర్వే= అందరు, వనదాహే= కార్చిచ్చు రాగా, మృగాః యథా= జంతువులు వలె, తత్రసుః= భయపడిరి.

అభిచారమునకు చెందిన ఆ అగ్ని వచ్చుచుండగా చూచి ద్వారకా వాసులందరు, కార్చిచ్చును చూచిన జంతువులు వలె, భయపడిరి.

అక్షైస్సభాయాం క్రీడంతం భగవంతం భయాతురాః ।
త్రాహి త్రాహి త్రిలోకేశ వహ్నేః ప్రదహతః పురమ్ ॥ 36

భయ-ఆతురాః= భయము వలన కంగారుపడిన జనులు, అక్షైః= పాచికలతో, సభాయామ్= సభయందు, క్రీడంతమ్= ఆడుచున్న, భగవంతమ్= శ్రీకృష్ణ భగవానుని, త్రిలోక-ఈశ= ముల్లోకములకు ప్రభువా!, పురమ్= నగరమును, ప్రదహతః= కాల్చి వేయుచున్న, వహ్నేః = అగ్నినుండి, త్రాహి= రక్షించుము, త్రాహి= రక్షించుము.

ఆ సమయములో శ్రీకృష్ణ భగవానుడు సభలో పాచికలాడుచుండెను. భయముతో కంగారు పడిన జనులు ఆయన వద్దకు వెళ్లి, ముల్లోకములను శాసించే ఓ ప్రభూ! నగరమును కాల్చి వేయుచున్న అగ్నినుండి రక్షించుము, రక్షించుము, అని మొరపెట్టిరి.

శ్రుత్వా తజ్జనవైక్లవ్యం దృష్ట్వా స్వానాం చ సాధ్వసమ్ ।
శరణ్యస్సంప్రహస్యాహ మా భైష్టేత్యవితాఽస్మ్యహమ్ ॥ 37

తత్= ఆ, జనవైక్లవ్యమ్= జనుల వ్యాకులతను, శ్రుత్వా= విని, స్వానామ్= తనవారల, సాధ్వసం చ= భయమును కూడ, దృష్ట్వా= చూచి, శరణ్యః= శరణు పొందదగిన శ్రీకృష్ణుడు, సంప్రహస్య= గట్టిగా నవ్వి, మా భైష్ట= భయపడకుడు, అహమ్= నేను, అవితాస్మి= రక్షించగలను, ఇతి= అని, ఆహ= పలికెను.

జనులు పడుచున్న ఆ కంగారును విని, తనవారల భయమును కూడ చూచి శరణాగతవత్సలుడగు శ్రీకృష్ణుడు గట్టిగా నవ్వి ఇట్లు పలికెను - భయపడకుడు, నేను రక్షించెదను.

సర్వస్యాంతర్బహిస్సాక్షీ కృత్యాం మా హేశ్వరీం విభుః ।
విజ్ఞాయ తద్విఘాతార్థం పార్శ్వస్థం చక్రమాదిశత్ ॥ 38

సర్వస్య= సర్వమునకు, అంతః= లోపల, బహిః= బయట, సాక్షి= సాక్షి, విభుః= సర్వసమర్థుడు అగు శ్రీకృష్ణ భగవానుడు, మాహేశ్వరీమ్= మహేశ్వరునకు చెందిన, కృత్యామ్= సంహారకదేవతను, విజ్ఞాయ= తెలిసి, తద్-విఘాత-అర్థమ్= దాని వినాశము కొరకై, పార్శ్వస్థమ్= ప్రక్కనున్న, చక్రమ్= చక్రమును, ఆదిశత్= ఆదేశించెను.

శ్రీకృష్ణ విభుడు సర్వమునకు లోపల, బయట కూడ సాక్షియై తెలియును. ఆ అగ్ని మహేశ్వరుని సంహారకదేవతయని తెలిసి, ఆయన ప్రక్కనే ఉన్న చక్రమును దానిని నశింపజేయుమని ఆదేశించెను.

తత్సూర్యకోటిప్రతిమం సుదర్శనం
జాజ్వల్యమానం ప్రలయానలప్రభమ్ ।
స్వతేజసా ఖం ककుభోఽథ రోదసీ
చక్రం ముకుందాస్త్రమథాగ్నిమార్దయత్ ॥ 39

సూర్యకోటిప్రతిమమ్= కోటి సూర్యులను పోలినది, జాజ్వల్యమానమ్= ఉజ్జ్వలముగా ప్రకాశించునది, ప్రలయ-అనలప్రభమ్= ప్రళయకాలాగ్ని యొక్క కాంతి గలది, స్వతేజసా= తన తేజస్సుచే, ఖమ్= ఆకాశమును, ककుభః= దిక్కులను, అథ= మరియు, రోదసీ= ద్యులోకభూలోకములను (ప్రకాశింపజేయునది), ముకుంద-అస్త్రమ్= మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుని ఆయుధము అగు, తత్= ఆ, సుదర్శనమ్= సుదర్శనమనే, చక్రమ్= చక్రము, అథ= అప్పుడు, అగ్నిమ్= అగ్నిని, ఆర్దయత్= పీడించెను.

సుదర్శనమనే ఆ చక్రము మోక్ష ప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుని ఆయుధము. అది కోటి సూర్యులను పోలి ఉజ్జ్వలముగా ప్రకాశించెను.

ప్రళయకాలమునందలి అగ్నియొక్క తేజస్సువంటి తేజస్సు గల ఆ చక్రము తన తేజస్సుచే ఆకాశమును, దిక్కులను, ద్యులోక భూలోకములను ప్రకాశింప జేసెను. అది ఆ అభిచారాగ్నిని పీడించెను.

కృత్యానలః ప్రతిహతస్స రథాంగపాణేః
అస్త్రౌజసా స నృప భగ్నముఖో నివృత్తః ।
వారాణసీం పరిసమేత్య సుదక్షిణం తం
సర్త్విర్గ్జనం సమదహత్స్వకృతోఽభిచారః ॥ 40

నృప= ఓ రాజా!, సః= ఆ, కృత్య-అనలః= అభిచారాగ్ని, రథ= అంగపాణేః= చక్రపాణియగు శ్రీకృష్ణ భగవానునియొక్క, అస్త్ర-ఓజసా= ఆయుధమైన సుదర్శనము యొక్క బలముచే, ప్రతిహతః= కొట్టివేయ-బడినది, భగ్నముఖః= విరుగకొట్టబడిన ముఖము గల, సః= ఆ అగ్ని, తతః= అక్కడనుండి, నివృత్తః= వెనుకకు మళ్లినదై, వారాణసీమ్= కాశీని, పరిసమేత్య= చుట్టి వచ్చి, స-ఋత్విగ్-జనమ్= ఋత్విక్కుల సముదాయముతో కూడియున్న, సుదక్షిణమ్= సుదక్షిణుని, సమదహత్= తగులబెట్టెను, అభిచారః= అభిచారము, స్వకృతః= స్వయంకృతము.

ఓ రాజా! చక్రపాణియగు శ్రీకృష్ణ భగవానుని సుదర్శనాయుధము యొక్క బలము ఆ అభిచారాగ్నిని కొట్టి దాని ముఖమును విరుగకొట్టినది. ఆ అగ్ని అక్కడనుండి వెనుకకు మళ్లి కాశీ నగరమును చుట్టివచ్చి, సుదక్షిణుని, ఆతని ఋత్విక్కుల సమూహమును తగులబెట్టెను. ఎందుకంటే, ఆ అభిచారం వారిచే సృష్టించబడినదే గదా!

చక్రం చ విష్ణోస్తదనుప్రవిష్టం
వారాణసీం సాట్టసభాఽఽలయాపణామ్।
సగోపురాట్టాలకకోష్ఠసంకులాం
సకోశహస్త్యశ్వరథాన్నశాలామ్ ॥ 41

విష్ణోః= శ్రీకృష్ణ భగవానునియొక్క, తత్= ఆ, చక్రం చ= చక్రము కూడ, స-అట్టసభా-ఆలయ-ఆపమ్= వేదికలు సభలు ఆలయములు బజారులతో కూడినట్టియు, సగోపుర-అట్టాలకకోష్ఠ సంకులామ్= ఒకటికొకటి కలిసియున్న గోపురములు బురుజులు కొట్టములతో కూడినట్టియు, సకోశహస్తి-అశ్వరథ-అన్నశాలామ్= బొక్కసములు ఏనుగులు గుర్రములు రథములు అన్నక్షేత్రములతో కూడిన, వారాణసీమ్= కాశీనగరమును, అనుప్రవిష్టమ్= వెనుకనే ప్రవేశించినది.

ఆ విష్ణుచక్రము కూడ కృత్యాన్ని వెనుకనే కాశీపురములో ప్రవేశించెను. ఆ నగరములో ఒకటితోనొకటి కలిసి వేదికలు, సభలు, ఆలయములు, బజారులు, గోపురములు, బురుజులు, కొట్టములు, బొక్కసములు, ఏనుగులు, గుర్రములు, రథములు, అన్న క్షేత్రములు ఉండెను.

దగ్ధ్వా వారాణసీం సర్వాం విష్ణోశ్చక్రం సుదర్శనమ్ ।
భూయః పార్శ్వముపాతిష్ఠత్కృష్ణ స్యాక్లిష్ట కర్మణః ॥ 42

సుదర్శనమ్= సుదర్శనమనే, విష్ణోః చక్రమ్= విష్ణుచక్రము, సర్వామ్= సకలమైన, వారాణసీమ్= కాశీని, దగ్ధ్వా= దహించి, భూయః= మరల, అక్లిష్టకర్మణః= లీలగా క్రియలను చేసే, కృష్ణస్య= శ్రీకృష్ణ భగవానుని, పార్శ్వమ్= సమీపమును గురించి, ఉపాతిష్ఠత్= వచ్చి చేరెను.

సుదర్శనమనే విష్ణుచక్రము కాశీ నగరమునంతనూ తగులబెట్టి మరల లీలలను నెరపే (ఉదారచేష్టడగు) శ్రీకృష్ణ భగవానుని వద్ద వచ్చి చేరెను.

య ఏతద్ఖ్యాపయేన్మర్త్య ఉత్తమశ్లోకవిక్రమమ్ ।
సమాహితో వా శృణుయాత్సర్వపాపైః ప్రముచ్యతే ॥ 43

ఇతి శ్రీమద్భాగవతే దశమస్కంధే
ఉత్తరార్ధే షట్పష్టితఒమోధ్యాయః ॥

యః= ఏ, మర్త్యః= మానవుడైతే, సమాహితః= ఏకాగ్రచిత్తుడై, ఏతత్= ఈ, ఉత్తమశ్లోకవిక్రమమ్= గొప్ప కీర్తి గల శ్రీకృష్ణుని పరాక్రమమును, శ్రావయేత్= వినిపించునో, శృణుయాత్ వా= లేదా వినునో ఆతడు, సర్వపాపైః= సకలపాపములచే, ప్రముచ్యతే= పూర్తిగా విముక్తుడగును.

శ్రీకృష్ణ భగవానుని కీర్తి గొప్పది. ఏ మానవుడైతే ఆయన యొక్క ఈ పరాక్రమమును గురించి ఏకాగ్రచిత్తముతో వినిపించునో, లేదా వినునో, అట్టివాని సకలపాపములు నిశ్శేషముగా నశించును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధములో
పౌండ్రక కాశిరాజుల ఉద్ధారమును వర్ణించే
అరువది ఆరవ అధ్యాయము ముగిసినది (66).

* * *

అథ సప్తషష్టితమోఽధ్యాయః

ద్వివిదుని ఉద్ధరించుట

రాజోవాచ ।

భూయోఽహం శ్రోతుమిచ్ఛామి రామస్యాద్భుతకర్మణః ।
అనంతస్యాప్రమేయస్య యదన్యత్కృతవాన్ ప్రభుః ॥ 1

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, అద్భుతకర్మణః= ఆశ్చర్యమును గొల్పే చేష్టలు కలిగినట్టియు, అనంతస్య= వినాశము లేనట్టియు, అప్రమేయస్య= ఇంద్రియగోచరము కాని స్వరూపము గల, రామస్య= బలరాముని (చరితమును), భూయః= మరల, శ్రోతుమ్= వినుటకు, అహం= నేను, ఇచ్ఛామి= కోరుచున్నాను, ప్రభుః= సర్వసమర్థుడగు బలరాముడు, అన్యత్= ఇతరమును, యత్= దేనిని, కృతవాన్= చేసినవాడో.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...అవినాశియగు బలరాముడు ఇంద్రియగోచరము కాని స్వరూపము గలవాడు. సర్వసమర్థుడగు ఆయన ఆశ్చర్యకరములగు చేష్టలను చేయును. ఆయన ఇంకా ఏమి చేసినాడో, వాటిని వినగోరుచున్నాను.

శ్రీశుక ఉవాచ ।

నరకస్య సఖా కశ్చిద్ద్వివిదో నామ వానరః ।
సుగ్రీవసచివస్సోకథ భ్రాతా మైందస్య వీర్యవాన్ ॥ 2

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ద్వివిదః నామ= ద్వివిదుడని ప్రసిద్ధి గాంచిన, కశ్చిత్= ఒకానొక, వానరః= వానరుడు, నరకస్య= నరకుని, సఖా= మిత్రుడు, సుగ్రీవసచివః= సుగ్రీవుని మంత్రి, అథ= మరియు, సః= ఆతడు, మైందస్య= మైందుని, భ్రాతా= సోదరుడు, వీర్యవాన్= పరాక్రమశాలి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ద్వివిదుడని ప్రసిద్ధి గాంచిన వానరుడొకడు గలడు. పరాక్రమశాలియగు ఆతడు. నరకుని మిత్రుడు, సుగ్రీవుని మంత్రి, మైందుని సోదరుడు.

సఖ్యుస్సోఽపచితిం కుర్వన్ వానరో రాష్ట్రవిప్లవమ్ ।
పురగ్రామాకరాన్ ఘోషానదహద్వహ్నిముత్సృజన్ ॥ 3

సః= ఆ, వానరః= వానరుడు, సఖ్యుః= మిత్రుడగు నరకునకు, అపచితిమ్= నిష్కృతిని, కుర్వన్= చేయుచున్నవాడై, రాష్ట్రవిప్లవవ్ = దేశమునకు ఉపద్రవము కలుగునట్లుగా, పుర గ్రామ-ఆకరాన్= నగరములను గ్రామములను గనులను, ఘోషాన్= గొల్లపల్లెలను, వహ్నిమ్= అగ్నిని, ఉత్సృజన్= విడుచువాడై, అదహత్ = తగులబెట్టెను.

ఆ వానరుడు మిత్రుడగు నరకుని ఋణమును తీర్చుకొనుటకై దేశమునకు ఉపద్రవమును కలిగించెను. ఆతడు నగరములకు, గ్రామములకు, గనులకు, గొల్లపల్లెలకు నిప్పు పెట్టి తగులబెట్టెను.

క్వచిత్స శైలానుత్పాట్య తైర్దేశాన్ సమచూర్ణయత్ ।
ఆనర్తాన్ సుతరామేవ యత్రాస్తే మిత్రహా హరిః ॥ 4

క్వచిత్= ఒకప్పుడు, సః= ఆతడు, శైలాన్= పర్వతములను, ఉత్పాట్య= పెల్లగించి, తైః= వాటితో, దేశాన్= జనావాసములను, సమచూర్ణయత్= నుగ్గు నుగ్గు చేసెను, ఆనర్తాన్= ఆనర్తదేశమును, సుతరాం ఏవ= మరింత అధికముగా, యత్ర= ఎక్కడనైతే, మిత్రహా= మిత్రుడగు నరకుని వధించిన, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, ఆస్తే= ఉన్నాడో.

ఒకప్పుడు ఆతడు పర్వతశిఖరములను పెల్లగించి వాటితో జనావాసములను నుగ్గు నుగ్గు చేసెను. ఆతడు తన మిత్రుడగు నరకుని సంహరించిన శ్రీకృష్ణ భగవానుడు ఉన్న కారణంగా ఆనర్తదేశమునకు మరింత ఉపద్రవమును చేసెను.

క్వచిత్సముద్రమధ్యస్థో దోర్భ్యాముత్క్షిప్య తజ్జలమ్ ।
దేశాన్నాగాయుతప్రాణో వేలాకూలానమజ్జయత్ ॥ 5

నాగ-అయుతప్రాణః= పదివేల ఏనుగుల బలము గల ద్వివిదుడు, క్వచిత్= ఒకప్పుడు, సముద్రమధ్యస్థః= సముద్రమునకు మధ్యయందున్న వాడై, దోర్భ్యామ్= రెండు చేతులతో, తద్-జలమ్= దాని నీటిని, ఉత్క్షిప్య= పైకి లేపి, వేలాకూలాన్= సముద్రతీరమునందుండే, దేశాన్= జనావాస-ములను, అమజ్జయత్= మునుగునట్లు చేసెను.

పది వేల ఏనుగుల బలము గల ఆ ద్వివిదుడు ఒకప్పుడు సముద్రము మధ్యలో నిలబడి రెండు చేతులతో నీటిని పైకి లేపి, సముద్రతీరమునందలి జనావాసములను ముంచెడివాడు.

ఆశ్రమాన్ఋషి ముఖ్యానాం కృత్వా భగ్నవనస్పతీన్ ।
అదూషయచ్ఛకృన్మూత్రైరగ్నీన్ వైతానికాన్ ఖలః ॥ 6

ఖలః= దుష్టుడగు ద్వివిదుడు, ఋషిముఖ్యానామ్= మహర్షులయొక్క, ఆశ్రమాన్= ఆశ్రమములను, భగ్నవనస్పతీన్= విరుగకొట్టబడిన చెట్లు కలవాటినిగా, కృత్వా= చేసి, వైతానికాన్= యజ్ఞమునకు సంబంధించిన, అగ్నీన్= అగ్నులను, శకృత్-మూత్రైః= మలమూత్రములతో, అదూషయత్= కలుషితము చేసెను.

దుష్టుడగు ద్వివిదుడు మహర్షుల ఆశ్రమములలోని చెట్లను విరుగకొట్టి, యజ్ఞమునకు చెందిన అగ్నులను మలమూత్రాలతో కలుషితము చేసెను.

పురుషాన్ యోషితో దృప్తః క్ష్మాభృద్ద్రోణీగుహాసు సః ।
నిక్షిప్య చాప్యధాచ్ఛైలైః పేశస్కారీవ కీటకమ్ ॥ 7

దృప్తః= పొగరెక్కిన, సః= ఆ ద్వివిదుడు, పురుషాన్= మగవారిని, యోషితః చ= స్త్రీలను కూడ, క్ష్మాభృద్-ద్రోణీగుహాసు= పర్వతముల

లోయలయందలి గుహలయందు, నిక్షిప్య= ఉంచి, శైలైః= బండరాళ్లతో, పేశస్కారీ= భ్రమరము, కీటకం ఇవ= పురుగును వలె, అప్యధాత్= మూసివేసెను.

పొగరెక్కిన ఆ ద్వివిదుడు స్త్రీపురుషులను పర్వతముల లోయలలోని గుహలలో బంధించి వాటి ముఖములను బండరాళ్లతో మూసివేసి, భ్రమరము పురుగును గూడులో వలె, బంధించెడివాడు.

ఏవం దేశాన్ విప్రకుర్వన్ దూషయంశ్చ కులస్త్రియః ।
శ్రుత్వా సులలితం గీతం గిరిం రైవతకం యయౌ ॥ 8

ఏవమ్= ఈ విధముగా, దేశాన్= జనావాసములను, విప్రకుర్వన్= ఉపద్రవమును చేయుచున్నవాడు, కులస్త్రియః చ= కులస్త్రీలను కూడ, దూషయన్= చెడగొట్టువాడు, సులలితమ్= మిక్కిలి మధురమైన, గీతమ్= పాటను, శ్రుత్వా= విని, రైవతకం గిరిమ్= రైవతకపర్వతమును గురించి, యయౌ= వెళ్లెను.

ఈ విధముగా ఆతడు జనావాసములకు ఉపద్రవమును చేస్తూ, కులస్త్రీలను కూడ చెడగొట్టుచుండెను. ఆతడు మిక్కిలి శ్రావ్యమగు పాటను విని రైవతకపర్వతము పైకి వెళ్లెను.

తత్రాపశ్యద్యదుపతిం రామం పుష్కరమాలినమ్ ।
సుదర్శనీయసర్వాంగం లలనాయూథమధ్యగమ్ ॥ 9

తత్ర= అచట, యదుపతిమ్= యాదవ ప్రభుడైనట్టియు, పుష్కరమాలినమ్= పద్మముల మాల కలిగినట్టియు, సుదర్శనీయసర్వ-అంగమ్= మిక్కిలి అందమైన సకలావయవములు కలిగినట్టియు, లలనాయూథమధ్యగమ్= యువతుల సముదాయమునకు మధ్యనున్న, రామమ్= బలరాముని, అపశ్యత్= చూచెను.

అచట ఆతనికి యాదవప్రభుడగు బలరాముడు కనబడెను. మిక్కిలి అందమైన అన్ని అవయవములు గల బలరాముడు పద్మముల మాలను దాల్చి యువతుల సమూహము మధ్యలోనుండెను.

గాయంతం వారుణీం పీత్వా మదవిహ్వలలోచనమ్ ।
విభ్రాజమానం వపుషా ప్రభిన్నమివ వారణమ్ ॥ 10

వారుణీమ్= మదిరను, పీత్వా= త్రాగి, గాయంతమ్= పాడుచు-న్నట్టియు, మదవిహ్వలలోచనమ్= మత్తుచే స్వాధీనత లేని కన్నులు కలిగినట్టియు, వపుషా= దేహముతో, ప్రభిన్నమ్= మదించిన, వారణం ఇవ= ఏనుగువలె, విభ్రాజమానమ్= విశేషముగా ప్రకాశించుచున్న (బలరాముని చూచెను).

మదిరను త్రాగి పాడుచున్న ఆయన కన్నులు మత్తుచే స్వాధీనత తప్పెను. ఆయన దేహముచే మదించిన ఏనుగు వలె ప్రకాశించుచుండెను.

దుష్టశ్శాఖామృగశ్శాఖామారూఢః కంపయన్ద్రుమాన్ ।
చక్రే కిలకిలాశబ్దమాత్మానం సంప్రదర్శయన్ ॥ 11

దుష్టః= దుష్టమగు, శాఖామృగః= వానరమైన ద్వివిదుడు, శాఖామ్= కొమ్మను, ఆరూఢః= ఎక్కినవాడై, ద్రుమాన్= చెట్లను, కంపయన్= ఊపుచున్నవాడై, ఆత్మానమ్= తనను, సంప్రదర్శయన్= బాగుగా కనబడునట్లు చేయువాడై, కిలకిలాశబ్దమ్= కిలకిల ధ్వనిని, చక్రే= చేసెను.

ద్వివిదుడు దుష్టవానరుడు. ఆతడు చెట్టెక్కి చెట్లను ఊపుతూ తాను అందరికీ కనబడునట్లు కిలకిలధ్వనిని చేసెను.

తస్య ధార్ష్ట్యం కపేర్వీక్ష్య తరుణ్యో జాతిచాపలాః ।
హాస్యప్రియా విజహసుర్బలదేవపరిగ్రహాః ॥ 12

జాతిచాపలాఃⁿ చపలస్వభావము గలవారు, హాస్యప్రియాఃⁿ పరిహాసమునందు ప్రీతి గలవారు, బలదేవపరిగ్రహఃⁿ బలరాముని భార్యలు అగు, తరుణ్యఃⁿ యువతులు, తస్యⁿ ఆ, కపేఃⁿ వానరము యొక్క, ధార్ష్ట్యమ్ⁿ పొగరును, వీక్ష్యⁿ చూచి, విజహసుఃⁿ గట్టిగా నవ్విరి.

బలరాముని భార్యలు చపలస్వభావము, పరిహాసము నందు ప్రీతిగల యువతులు. వారా వానరము యొక్క పొగరు చూచి ఎక్కువగా నవ్విరి.

తా హేలయామాస కపిర్భ్రూక్షేపైస్సమ్ముఖాదిభిః ।
దర్శయన్ స్వగుదం తాసాం రామస్య చ నిరీక్షతః ॥ 13

కపిఃⁿ వానరుడు, రామస్యⁿ బలరాముడు, నిరీక్షతఃⁿ చⁿ చూచుచుండగనే, భ్రూక్షేపైఃⁿ కనుబొమల విరుచుటలచే, సమ్ముఖ–ఆదిభిఃⁿ = ఎదురుగా వచ్చుట మొదలగు వాటిచే, తాసామ్ⁿ ఆ యువతులకు, స్వగుదమ్ⁿ తన గుదమును, దర్శయన్ⁿ చూపువాడై, తాఃⁿ వారిని ఉద్దేశించి, హేలయామాసⁿ అవహేళనము చేసెను.

బలరాముడు చూస్తున్నా లెక్క చేయకుండా ఆ వానరుడు ఆ స్త్రీలకు యెదురుగా వచ్చి కనుబొమలను విరుచుట, పళ్లను ఇకిలించుట మొదలగు చేష్టలను చేసెను. వారికి తన గుదమును చూపి అవహేళనము చేసెను.

తం గ్రావ్ణా ప్రాహరత్క్రుద్ధో బలః ప్రహరతాం వరః ।
స వంచయిత్వా గ్రావాణం మదిరాకలశం కపిః ॥ 14

గృహీత్వా హేలయామాస ధూర్తస్తం కోపయన్ హసన్ ।
నిర్భిద్య కలశం దుష్టో వాసాంస్యాస్ఫాలయద్బలమ్ ॥ 15

కదర్థీకృత బలవాన్ విప్రచక్రే మదోద్ధతః ।

ప్రహరతామ్ⁿ యుద్ధవీరులలో, వరఃⁿ శ్రేష్ఠుడగు, బలఃⁿ బలరాముడు, క్రుద్ధఃⁿ కోపించినవాడై, తమ్ⁿ వానిని, గ్రావ్ణాⁿ రాతితో,

ప్రాహరత్= కొట్టెను, ధూర్తః= ధూర్తుడగు, సః= ఆ, కపిః= వానరుడు, హసన్= నవ్వుచున్నవాడై, గ్రావాణమ్= రాతిని, వంచయిత్వా= తప్పించుకొని, మదిరాకలశమ్= మద్యపాత్రను, గృహీత్వా= తీసుకొని, కలశమ్= పాత్రను, నిర్భిద్య= పగులగొట్టి, తమ్= ఆయనను, కోపయన్= కోపము కలిగించువాడు, దుష్టః= దుష్టుడు, బలవాన్= బలవంతుడు, మద-ఉద్ధతః= బలముచే గర్వించినవాడు, వాసాంసి= వస్త్రములను, ఆస్ఫాలయత్= చింపివేసెను, బలమ్= బలరాముని, కదర్థీకృత్య= తిరస్కరించి, విప్రచక్రే= అపకారము చేసెను.

యుద్ధవీరులలో శ్రేష్ఠుడగు బలరాముడు కోపించి ఆ ద్వివిదుని రాతితో కొట్టగా, ధూర్తుడైన ఆ వానరుడు నవ్వుతూ రాతిని తప్పించుకొని మద్యపాత్రను తీసుకొని పగులగొట్టెను. బలరామునకు కోపము వచ్చెను. ద్వివిదుడు బలవంతుడైన దుష్టుడు. బలముచే గర్వించియున్న ఆతడు వస్త్రములను లాగి చింపివేసెను. ఈ విధముగా ఆతడు బలరాముని తిరస్కరించి అపకారము చేసెను.

తం తస్యావినయం దృష్ట్వా దేశాంశ్చ తదుపద్రుతాన్ ॥
క్రుద్ధో ముసలమాదత్త హలం చారిజిఘాంసయా । 16

తస్య= వానియొక్క, తమ్= ఆ, అవినయమ్= పొగరును, తద్-ఉపద్రుతాన్= వానిచే ఉపద్రవము కలిగించబడిన, దేశాన్ చ= జనావాసములను కూడ, దృష్ట్వా= చూచి, క్రుద్ధః= కోపించినవాడై, అరిజిఘాంసయా= శత్రువును చంపాలనే కోరికతో, ముసలమ్= రోకలిని, హలం చ= నాగలిని కూడ, ఆదత్త= తీసుకొనెను.

ద్వివిదుని ఆ పొగరును, వాడు జనావాసములకు కలిగించిన ఉపద్రవమును చూచి బలరాముడు మండిపడెను. ఆ శత్రువును చంపగోరి ఆయన రోకలిని, నాగలిని కూడ తీసుకొనెను.

ద్వివిదోఽపి మహావీర్యశ్శాలముద్యమ్య పాణినా ॥ 17

అభ్యేత్య తరసా తేన బలం మూర్ధన్యతాడయత్ ।

మహావీర్యఃగొప్ప పరాక్రమము గల, ద్వివిదఃఅపి= ద్వివిదుడు కూడ, పాణినా= చేతితో, శాలమ్= చెట్టును, ఉద్యమ్య= పెకిలించి, తరసా= వేగముతో, అభ్యేత్య= ఎదురుగా వచ్చి, తేన= దానితో, బలమ్= బలరాముని, మూర్ధని= తలపై, అతాడయత్= కొట్టెను.

గొప్ప పరాక్రమము గల ద్వివిదుడు కూడ చేతితో చెట్టును పెకిలించి వేగముతో ఎదురుగా వచ్చి, దానితో బలరాముని తలపై కొట్టెను.

తం తు సంకర్షణో మూర్ధ్ని పతంతమచలో యథా ॥ 18

ప్రతిజగ్రాహ బలవాన్ సునందేనాహనచ్చ తమ్ ।

అచలఃయథా= పర్వతమా యన్నట్లు, బలవాన్= బలశాలియగు, సంకర్షణఃతు= బలరాముడైతే, మూర్ధ్ని= తలపై, పతంతమ్= పడుచున్న, తమ్= ఆ చెట్టును, ప్రతిజగ్రాహ= పట్టుకొనెను, తం చ= వానిని కూడ, సునందేన= సునందమనే రోకలితో, అహనత్= కొట్టెను.

బలశాలియగు బలరాముడు పర్వతము వలె అవిచలితుడై, తలపై పడుచున్న ఆ చెట్టును పట్టుకొని, సునందమనే రోకలితో వానిని కొట్టెను.

ముసలాహతమస్తిష్కో విరేజే రక్తధారయా ॥ 19

గిరిర్యథా గైరికయా ప్రహారం నానుచింతయన్ ।
పునరన్యం సముత్క్షిప్య కృత్వా నిష్పత్రమోజసా ॥ 20

తేనాహనత్సుసంక్రుద్ధస్తం బలశ్శతధాఽచ్ఛినత్ ।
తతోఽన్యేన రుషా జఘ్నేతం చాపి శతధాఽచ్ఛినత్ ॥ 21

ముసల-ఆహతమస్తిష్కుఃన రోకలిచే కొట్టబడిన తల గల ద్వివిదుడు, రక్తధారయా= రక్తముయొక్క ధారచే, గైరికయా= జేగురుచే, గిరిః యథా= పర్వతము వలె, విరేజే= విరాజిల్లెను, ప్రహారమ్= దెబ్బను, న అనుచింతయన్= లెక్క చేయనివాడై, ఓజసా= బలముచే, పునఃన మరల, అన్యమ్= మరియొక చెట్టును, సముత్క్షిప్య= ఊడబెరికి, నిష్పత్రమ్= ఆకులు లేనిదానినిగా, కృత్వా= చేసి, తేన= దానితో, అహనత్= కొట్టెను, సుసంక్రుద్ధఃన మిక్కిలి కోపించిన, బలఃన బలరాముడు, తమ్= దానిని, శతధా= వందగా, అచ్ఛినత్= ఛేదించెను, తతఃన తరువాత, రుషాన కోపముచే, అన్యేన= మరియొక దానితో, జఘ్నే= కొట్టెను, తం చ అపి= దానిని కూడ, శతధా= వందగా, అచ్ఛినత్= ఛేదించెను.

రోకలితో తలపై కొట్టబడిన ద్వివిదుడు జేగురుతో కూడిన పర్వతము వలె విరాజిల్లెను. ఆతడా దెబ్బను సరుకు చేయకుండా, బలముగా మరల ఇంకో చెట్టును ఊడబెరికి దాని ఆకులను దూసివేసి దానితో బలరాముని కొట్టెను. మిక్కిలి కోపించిన బలరాముడు ఆ చెట్టును వంద ముక్కలు చేసెను. ద్వివిదుడు తరువాత కోపముతో ఇంకో చెట్టుతో కొట్టెను. బలరాముడు దానిని కూడ వంద ముక్కలు చేసెను.

ఏవం యుధ్యన్ భగవతా భగ్నే భగ్నే పునఃన పునఃన ।
ఆకృష్య సర్వతో వృక్షాన్ నిర్వృక్షమకరోద్వనమ్ ॥ 22

ఏవమ్= ఈ విధముగా, భగవతా= బలరామ భగవానునితో, యుధ్యన్= యుద్ధము చేయువాడై, భగ్నే= విరిగిపోగా, పునఃన మరల, భగ్నే= విరిగిపోగా, పునఃన మరల, సర్వతఃన అన్ని వైపులనుండి, వృక్షాన్= చెట్లను, ఆకృష్యన ఊడలాగి, వనమ్= అడవిని, నిర్వృక్షమ్= చెట్లు లేనిదానినిగా, అకరోత్= చేసెను.

ఈ విధముగా ద్వివిదుడు బలరామ భగవానునితో యుద్ధము చేయుచుండెను. ఆతడు చెట్టుతో కొట్టుట, బలరాముడు దానిని ముక్కలు

చేయుట, ఈ తీరున మరల మరల యుద్ధము జరిగెను. ఆతడు అడవిలో అన్ని వైపులనుండీ చెట్లను ఊడలాగి ఆ అడవిలో చెట్లు లేకుండా చేసెను.

తతోఽముంచచ్ఛిలావర్షం బలస్యోపర్యమర్షితః ।
తత్సర్వం చూర్ణయామాస లీలయా ముసలాయుధః ॥ 23

తతః= తరువాత, అమర్షితః= కోపించిన ద్వివిదుడు, బలస్య= బలరాముని, ఉపరి= పైన, శిలావర్షమ్= రాళ్ల వానను, అముంచత్= విడిచిపెట్టెను, ముసల–ఆయుధః= రోకలి ఆయుధముగా గల బలరాముడు, తత్= దానిని, సర్వమ్= అంతనూ, లీలయా= అవలీలగా, చూర్ణయామాస= నుగ్గు నుగ్గు చేసెను.

తరువాత ద్వివిదుడు కోపించి బలరాముని పై రాళ్లవానను కురిపించెను. ఆయన రోకలి అనే ఆయుధముతో రాళ్లనన్నింటినీ పిండిగా చేసెను.

స బాహూ తాలసంకాశౌ ముష్టీకృత్య కపీశ్వరః ।
ఆసాద్య రోహిణీపుత్రం తాభ్యాం వక్షస్యరూరుజత్ ॥ 24

కపి–ఈశ్వరః= వానరశ్రేష్ఠుడగు, సః= ఆ ద్వివిదుడు, తాలసంకాశౌ= తాటి చెట్లవలె ప్రకాశించే, బాహూ= చేతులను, ముష్టీకృత్య= పిడికిలిగా చేసి, రోహిణీపుత్రమ్= రోహిణి పుత్రుడగు బలరాముని, ఆసాద్య= సమీపించి, తాభ్యామ్= ఆ రెండు చేతులతో, వక్షసి= వక్షఃస్థలముపై, అరూరుజత్= కొట్టెను.

వానరశ్రేష్ఠుడగు ఆ ద్వివిదుడు రెండు చేతులను పిడికిలిగా చేసి, రోహిణి పుత్రుడగు బలరాముని సమీపించి, ఆ రెండు చేతుల పిడికిలితో వక్షఃస్థలముపై కొట్టెను.

యాదవేంద్రోఽపి తం దోర్భ్యాం త్యక్త్వా ముసలలాంగలే ।
జత్రావభ్యర్దయత్క్రుద్ధ స్సోఽపతద్రుధిరం వమన్ ॥ 25

క్రుద్ధః= కోపించిన, యాదవ-ఇంద్రః అపి= యాదవశ్రేష్ఠుడగు బలరాముడు కూడ, ముసలలాంగలే= రోకలిని నాగలిని, త్యక్త్వా= విడిచిపెట్టి, దోర్భ్యామ్= చేతులతో, తమ్= వానిని, జత్రౌ= కొంకులయందు, అభ్యర్దయత్= కొట్టెను, సః= ఆతడు, రుధిరమ్= రక్తమును, వమన్= గ్రక్కుచున్నవాడై, అపతత్= పడెను.

యాదవశ్రేష్ఠుడగు బలరాముడు కూడ రోకలిని, నాగలిని విడిచి-పెట్టెను. ఆయన కోపముగా వానిని రెండు చేతులతో కొంకులయందు కొట్టగా, వాడు రక్తమును గ్రక్కుతూ నేల గూలెను.

చకంపే తేన పతతా సటంకస్సవనస్పతిః ।
పర్వతః కురుశార్దూల వాయునా నౌరివాంభసి ॥ 26

కురుశార్దూల= కురువంశశ్రేష్ఠా!, తేన= ఆతడు, పతతా= పడుచుండగా, సటంకః= రాళ్ల పలకలతో కూడినది, సవనస్పతిః= చెట్లతో కూడినది అగు, పర్వతః= పర్వతము, అంభసి= నీటియందు, వాయునా= వాయువుచే, నౌః ఇవ= పడవ వలె, చకంపే= కంపించెను.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! ఆతడు నేల గూలుచుండగా, రాళ్ల పలకలతో చెట్లతో సహా ఆ పర్వతము, గాలికి సరస్సులోని పడవవలె, కంపించెను.

జయశబ్దో నమశ్శబ్దస్సాధు సాధ్వితి చాంబరే ।
సురసిద్ధమునీంద్రాణా మాసీత్కుసుమవర్షిణామ్ ॥ 27

అంబరే= ఆకాశమునందు, కుసుమవర్షిణామ్= పూలను వర్షించే, సురసిద్ధముని-ఇంద్రాణామ్= దేవతల సిద్ధుల మహర్షుల, జయశబ్దః= జయము అనే శబ్దము, నమః-శబ్దః= నమస్కారము అనే శబ్దము, సాధు= బాగు, సాధు= బాగు, ఇతి చ= అని కూడ, ఆసీత్= ఆయెను.

ఆకాశమునందు దేవతలు, సిద్ధులు, మహర్షులు పూల వానను కురిపిస్తూ జయము, నమస్కారము, బాగు బాగు అనే శబ్దములను చేసిరి.

ఏవం నిహత్య ద్వివిదం జగద్వ్యతికరావహమ్ ।
సంస్తూయమానో భగవాన్ జనైస్స్వపురమావిశత్ ॥ 28

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే సప్తషష్టితమోధ్యాయః ॥

భగవాన్= బలరామ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, జగద్-వ్యతికర-ఆవహమ్= లోకమునకు ఉపద్రవమును కలిగించే, ద్వివిదమ్= ద్వివిదుని, నిహత్య= వధించి, జనైః= జనులచే, సంస్తూయమానః= కొనియాడబడుచున్నవాడై, స్వపురమ్= తన నగరమును, ఆవిశత్= ప్రవేశించెను.

లోకమునకు ఉపద్రవమును కలిగించే ద్వివిదుని బలరామ భగవానుడీ విధముగా సంహరించెను. జనులు కొనియాడుచుండగా ఆయన ద్వారకా నగరమునకు తిరిగి వచ్చెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
ద్వివిదుని ఉద్ధారమును వర్ణించే
అరువది ఏడవ అధ్యాయము ముగిసినది (67).

* * *

అథ అష్టషష్టితమోఽధ్యాయః

సాంబుని వివాహము

శ్రీశుక ఉవాచ ।

దుర్యోధనసుతాం రాజన్ లక్ష్మణాం సమితింజయః ।
స్వయంవరస్థామహర త్సాంబో జాంబవతీసుతః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, సమితింజయః= యుద్ధములో విజయమును పొందువాడు, జాంబవతీసుతః = జాంబవతి పుత్రుడు అగు, సాంబః= సాంబుడు, దుర్యోధనసుతామ్= దుర్యోధనుని కుమార్తెయైనట్టియు, స్వయంవరస్థామ్= స్వయంవరము-నందున్న, లక్ష్మణామ్= లక్ష్మణను, అహరత్= తీసుకుపోయెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! జాంబవతి పుత్రుడగు సాంబుడు యుద్ధములో జయించే స్వభావము గలవాడు. దుర్యోధనుని కుమార్తెయగు లక్ష్మణ స్వయంవరమునందుండగా, ఆయన ఆమెను తీసుకుపోయెను.

కౌరవాః కుపితా ఊచుర్దుర్వినీతోయమర్భకః ।
కదర్థీకృత్య నః కన్యా మకామామహరద్బలాత్ ॥ 2

కుపితాః= కోపించిన, కౌరవాః= కౌరవులు, ఊచుః= పలికిరి, అయమ్= ఈ, అర్భకః= బుడతడు, దుర్వినీతః= పొగరుమోతు, నః= మనలను, కదర్థీకృత్య= తిరస్కరించి, అకామామ్= ప్రేమ లేని, కన్యామ్= కన్యను, బలాత్= బలము వలన, అహరత్= తీసుకొని వెళ్లెను.

కౌరవులు కోపించి ఇట్లనిరి – ఈ బుడతడు పొగరుమోతు. మనలను తిరస్కరించి తనను ప్రేమించని కన్యను బలాత్కారముగా తీసుకు వెళ్లినాడు.

బధ్నీతేమం దుర్వినీతం కిం కరిష్యంతి వృష్ణయః ।
యేఽస్మత్ప్రసాదోపచితాం దత్తాం నో భుంజతే మహీమ్ ॥ 3

ఇమమ్= ఈ, దుర్వినీతమ్= పొగరుమోతును, బధ్నీత= బంధించుడు, వృష్ణయః= యాదవులు, కిమ్= దేనిని, కరిష్యంతి= చేయగలరు?, యే= ఎవరైతే, అస్మత్-ప్రసాద-ఉపచితామ్= మన అనుగ్రహముచే వర్ధిల్లజేయ- బడినట్టియు, నః= మనచే, దత్తామ్= ఈయబడిన, మహీమ్= రాజ్యమును, భుంజతే= అనుభవించుచున్నారో.

ఈ పొగరుమోతును బంధించుడు. యాదవులేమి చేయగలరు? వారు మనచే ఈయబడి మన అనుగ్రహముచే వర్ధిల్లజేయబడిన రాజ్యముననుభవించుచున్నారు.

నిగృహీతం సుతం శ్రుత్వా యద్యేష్యంతీహ వృష్ణయః ।
భగ్నదర్పాశమం యాంతి ప్రాణా ఇవ సుసంయతాః ॥ 4

నిగృహీతమ్= బంధించబడిన, సుతమ్= పుత్రుని గురించి, శ్రుత్వా= విని, వృష్ణయః= యాదవులు, ఇహ= ఇచటకు, యది ఏష్యంతి= వచ్చే పక్షములో, భగ్నదర్పాః= నశింపజేయబడిన పొగరు గలవారై, సుసంయతాః = బాగుగా నియంత్రించబడిన, ప్రాణాః ఇవ= ఇంద్రియములు వలె, శమమ్= శాంతిని, యాంతి= పొందెదరు.

తమ కొడుకు బంధించబడినాడని విని యాదవులు ఇక్కడకు వచ్చే పక్షములో మనము వారి గర్వమునడంచెదము. అప్పుడు వారు ప్రాణా యామాదులచే నియంత్రించబడిన ఇంద్రియములు వలె చల్లబడెదరు.

ఇతి కర్ణశ్శలో భూరిర్భజ్ఞకేతు స్సుయోధనః ।
సాంబమారేభిరే బద్ధుం కురువృద్ధానుమోదితాః ॥ 5

ఇతి= ఈ విధముగా, కర్ణః= కర్ణుడు, శలః= శలుడు, భూరిః= భూరిశ్రవసుడు, యజ్ఞకేతుః= యజ్ఞ కేతువు, సుయోధనః= దుర్యోధనుడు, కురువృద్ధ-అనుమోదితాః= కురువృద్ధులచే అనుమోదించబడినవారై, సాంబమ్= సాంబుని, బద్ధుమ్= బంధించుటకు, ఆరేభిరే= ఆరంభించిరి.

ఈ విధముగా తలచి కురువృద్ధుల అనుమతిని పొంది కర్ణుడు, శలుడు, భూరిశ్రవసుడు, యజ్ఞకేతువు, దుర్యోధనుడు సాంబుని బంధించే ప్రయత్నమునారంభించిరి.

దృష్ట్వాఽనుధావతస్సాంబో ధార్తరాష్ట్రాన్మహారథః ।
ప్రగృహ్య రుచిరం చాపం తస్థౌ సింహ ఇవైకలః ॥ 6

అనుధావతః= వెంట తరుముచున్న, ధార్తరాష్ట్రాన్= ధృతరాష్ట్ర పుత్రులను, దృష్ట్వా= చూచి, మహారథః= మహారథుడగు, సాంబః= సాంబుడు, రుచిరమ్= అందమైన, చాపమ్= ధనుస్సును, ప్రగృహ్య= పట్టుకొని, సింహః ఇవ= సింహము వలె, ఏకలః= ఒక్కడే, తస్థౌ= నిలిచెను.

ధృతరాష్ట్రుని పుత్రులు తన వెంట తరుముటను చూచి మహారథి-యగు సాంబుడొక్కడే అందమైన ధనుస్సును పట్టుకొని సింహము వలె నిలిచెను.

తం తే జిఘృక్షవః క్రుద్ధాస్తిష్ఠ తిష్ఠేతి భాషిణః ।
ఆసాద్య ధన్వినో బాణైః కర్ణాగ్రణ్యస్సమాకిరన్ ॥ 7

కర్ణ-అగ్రణ్యః= కర్ణుడు నాయకుడుగా గల, తే= ఆ, క్రుద్ధాః= కోపించిన, ధన్వినః= ధనుర్ధారులు, తమ్= ఆతనిని, జిఘృక్షవః= పట్టుకొనగోరువారై, తిష్ఠ= నిలుము, తిష్ఠ= నిలుము, ఇతి= అని, భాషిణః = పలుకువారై, ఆసాద్య= దగ్గరకు వచ్చి, బాణైః= బాణములతో, సమాకిరన్= ముంచెత్తిరి.

కోపించిన ఆ ధనుర్ధారులకు కర్ణుడు నాయకుడు. వారాతనిని బంధించగోరి, నిలు నిలు అంటూ దగ్గరకు వచ్చి బాణములతో ముంచెత్తిరి.

సోఽపవిద్ధః కురుశ్రేష్ఠ కురుభిర్యదునందనః ।
నామృష్యత్తదచింత్యార్భస్సింహః క్షుద్రమృగైరివ ॥ 8

కురుశ్రేష్ఠ= కురువులలో శ్రేష్ఠుడైనవాడా!, క్షుద్రమృగైః= అల్పములగు జంతువులచే, సింహః ఇవ= సింహము వలె, కురుభిః= కౌరవులచే, అపవిద్ధః= అన్యాయముగా కొట్టబడినవాడు, యదునందనః= యాదవ వంశమునానందింపజేయువాడు, అచింత్య–అర్భఃః= ఇంద్రియగోచరము కాని స్వరూపము గల శ్రీకృష్ణుని పుత్రుడు అగు, సః = ఆ సాంబుడు, తత్= దానిని, న అమృష్యత్= సహించలేదు.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! అల్పమృగములు సింహమును వలె, కౌరవులు ఆతనిని అన్యాయముగా కొట్టిరి. యాదవవంశమునానందింపజేసే ఆ సాంబుడు ఇంద్రియగోచరము కాని స్వరూపము గల శ్రీకృష్ణుని పుత్రుడు. ఆతడు వారి ఆ చేష్టను సహించి ఊరుకోలేదు.

విస్ఫూర్జ్య రుచిరం చాపం సర్వాన్ వివ్యాధ సాయకైః ।
కర్ణాదీన్ షడ్రథాన్ వీరాంస్తావద్భిర్యుగపత్పృథక్ ॥ 9

రుచిరమ్= అందమైన, చాపమ్= రథమును, విస్ఫూర్జ్య= టంకారము చేసి, కర్ణ–ఆదీన్= కర్ణుడు మొదలుగా గల, వీరాన్= వీరులను, సర్వాన్= అందరిని, షట్= ఆరు, రథాన్= రథములను, పృథక్= వేర్వేరుగా, యుగపత్= ఒకేసారి, తావద్భిఃః= అంతే, సాయకైఃః= బాణములతో, వివ్యాధ= కొట్టెను.

ఆతడు అందమైన ధనుస్సును టంకారము చేసి కర్ణుడు, భీష్ముడు మొదలైన వీరులందరిని, వారి ఆరు రథములను ఒకేసారి వేర్వేరుగా అంతే సంఖ్యలో బాణములతో కొట్టెను.

చతుర్భిశ్చతురో వాహానేకైకేన చ సారథీన్ ।
రథినశ్చ మ హేష్వాసాంస్తస్య తత్తేఽభ్యపూజయన్ ॥ 10

చతుర్భిః= నాలుగు బాణములతో, చతురః= నాలుగు, వాహాన్= గుర్రములను, ఏక-ఏకేన= ఒక్కొక్క బాణముతో, సారథీన్ చ= సారథులను కూడ, మహా-ఇషు-ఆసాన్= గొప్ప ధనుస్సులు గల, రథినః చ= రథికులను కూడ (కొట్టెను), తస్య= ఆతనియొక్క, తత్= ఆ పనిని, తే= వారు, అభ్యపూజయన్= కొనియాడిరి.

ఆతడు గొప్ప ధనుస్సు గల రథికులను, ఒక్కొక్క బాణముతో వారి సారథులను, నాలుగు బాణములతో నాలుగు గుర్రములను కొట్టెను. ఆతని ఆ చాతుర్యమును వారు కొనియాడిరి.

తం తు తే విరథం చక్రుశ్చత్వారశ్చతురో హయాన్ ।
ఏకస్తు సారథిం జఘ్నే చిచ్ఛేదాన్యశ్శరాసనమ్ ॥ 11

తే తు= వారైతే, తమ్= ఆ సాంబుని, విరథమ్= రథము లేనివానినిగా, చక్రుః= చేసిరి, చత్వారః= నలుగురు, చతురః= నాలుగు, హయాన్= గుర్రములను, ఏకః తు= ఒకడైతే, సారథిమ్= సారథిని, జఘ్నే= కొట్టెను, అన్యః= ఇతరుడు, శర-ఆసనమ్= ధనుస్సును, చిచ్ఛేద= విరుగకొట్టెను.

వారందరు కలిసి సాంబుని రథము లేనివానినిగా చేసిరి. వారిలో నలుగురు నాలుగు గుర్రములను, ఒకడు సారథిని కొట్టిరి. ఆరో వాడు ధనుస్సును విరుగకొట్టెను.

తం బద్ధ్వా విరథీకృత్య కృచ్ఛ్రేణ కురవో యుధి ।
కుమారం స్వస్య కన్యాం చ స్వపురం జయినోఽవిశన్ ॥ 12

జయినః= జయమును పొందిన, కురవః= కౌరవులు, కృచ్ఛ్రేణ= కష్టముతో, తమ్= ఆ, సాంబుని, యుధి= యుద్ధమునందు, విరథీకృత్య=

రథము లేనివానినిగా చేసి, కుమారమ్= సాంబకుమారుని, స్వస్య= తనయొక్క, కన్యాం చ= కన్యను కూడ, స్వపురమ్= తన నగరమును, అవిశన్= ప్రవేశించిరి.

యుద్ధములో కౌరవులు ఆ సాంబుని కష్టముతో రథహీనుని చేసి విజయమును పొందిరి. అప్పుడు దుర్యోధనుడు సాంబకుమారుని, తన కుమార్తెను కూడ తీసుకొని తన నగరమును ప్రవేశించెను.

తచ్ఛ్రుత్వా నారదోక్తేన రాజన్ సంజాతమన్యవః ।
కురూన్ ప్రత్యుద్యమం చక్రురుగ్రసేనప్రచోదితాః ॥ 13

రాజన్= ఓ రాజా!, నారద-ఉక్తేన= నారదుని మాటచే, తత్= దానిని గురించి, శ్రుత్వా= విని, సంజాతమన్యవః= కలిగిన కోపము గల, ఉగ్రసేన ప్రచోదితాః= ఉగ్రసేనమహారాజుచే ప్రేరితులైన యాదవులు, కురూన్ ప్రతి= కౌరవుల గురించి, ఉద్యమమ్= యుద్ధసన్నాహమును, చక్రుః= చేసిరి.

ఓ పరీక్షిన్మహారాజా! నారదుడు చెప్పగా సాంబుని ఆ వృత్తాంతమును విని యాదవులు చాల కోపించిరి. ఉగ్ర సేనమహారాజు చే ప్రేరితులై వారు కౌరవుల పై యుద్ధమునకు సన్నద్ధులైరి.

సాంత్వయిత్వా తు తాన్ రామస్సన్నద్ధాన్ వృష్ణిపుంగవాన్ ।
నైచ్ఛత్కురూణాం వృష్ణీనాం కలిం కలిమలాపహః ॥ 14

కలిమల-అపహః= కలిదోషమును పోగొట్టే, రామః తు= బలరాముడైతే, సన్నద్ధాన్= యుద్ధమునకు తయారైన, తాన్= ఆ, వృష్ణిపుంగవాన్= యాదవశ్రేష్ఠులను, సాంత్వయిత్వా= నచ్చజెప్పి, కురూణామ్= కౌరవులకు, వృష్ణీనామ్= యాదవులకు, కలిమ్= కలహమును, న ఐచ్ఛత్= ఇష్టపడలేదు.

కలిదోషమును పోగొట్టే బలరాముడైతే కౌరవయాదవకలహమును ఇష్టపడలేదు. ఆయన యుద్ధసంసిద్ధులైన ఆ యాదవశ్రేష్ఠులకు నచ్చజెప్పెను.

జగామ హస్తినపురం రథేనాదిత్యవర్చసా ।
బ్రాహ్మణైః కులవృద్ధైశ్చ వృతశ్చంద్ర ఇవ గ్రహైః ॥ 15

బ్రాహ్మణైః= బ్రాహ్మణులచే, కులవృద్ధైః చ= వంశములోని పెద్దలచే, గ్రహైః= గ్రహములచే, చంద్రః ఇవ= చంద్రుడు వలె, వృతః= చుట్టువార-బడిన బలరాముడు, ఆదిత్యవర్చసా= సూర్యప్రభవంటి ప్రభ గల, రథేన = రథముచే, హస్తినపురమ్= హస్తినాపురమును గురించి, జగామ= వెళ్లెను.

చంద్రుని గ్రహములు వలె, బ్రాహ్మణులు వంశములోని పెద్దలు చుట్టువారి రాగా, బలరాముడు సూర్యుడు వలె వెలిగిపోయే రథము పై హస్తినాపురమునకు వెళ్లెను.

గత్వా గజాహ్వయం రామో బాహ్యోపవనమాస్థితః ।
ఉద్ధవం ప్రేషయామాస ధృతరాష్ట్రం బుభుత్సయా ॥ 16

రామః= బలరాముడు, గజ ఆహ్వయమ్= హస్తినాపురమును గురించి, గత్వా= వెళ్లి, బాహ్య-ఉపవనమ్= బయట ఉన్న ఉద్యానమును, ఆస్థితః= ఆశ్రయించినవాడై, బుభుత్సయా= తెలియాలనే కోరికచే, ధృతరాష్ట్రమ్= ధృతరాష్ట్రుని ఉద్దేశించి, ఉద్ధవమ్= ఉద్ధవుని, ప్రేషయామాస= పంపెను.

బలరాముడు హస్తినాపురమునకు వెళ్లి నగరమునకు బయట ఉద్యానములో నుండెను. కౌరవుల అభిప్రాయమును తెలియగోరి ఆయన ఉద్ధవుని ధృతరాష్ట్రుని వద్దకు దూతగా పంపెను.

సోఽభివంద్యాంబికాపుత్రం భీష్మం ద్రోణం చ బాహ్లికమ్ ।
దుర్యోధనం చ విధివద్రామమాగతమబ్రవీత్ ॥ 17

సః= ఆ ఉద్ధవుడు, అంబికాపుత్రమ్= అంబికయొక్క పుత్రుడగు ధృతరాష్ట్రుని, భీష్మమ్= భీష్ముని, ద్రోణమ్= ద్రోణుని, బాహ్లికం చ= బాహ్లికుని, దుర్యోధనం చ= దుర్యోధనుని కూడ, విధివత్= యథావిధిగా, అభివంద్య= నమస్కరించి, ఆగతమ్= వచ్చిన, రామమ్= బలరాముని గురించి, అబ్రవీత్= చెప్పెను.

ఆ ఉద్ధవుడు అంబిక పుత్రుడగు ధృతరాష్ట్రునకు, భీష్మద్రోణ బాహ్లికులకు, దుర్యోధనునకు కూడ యథావిధిగా నమస్కరించి, బలరాముడు వచ్చియున్నాడని చెప్పెను.

తేఽతి ప్రీతాస్తమాకర్ణ్య ప్రాప్తం రామం సుహృత్తమమ్ ।
తమర్చయిత్వాఽభియయు స్సర్వే మంగలపాణయః ॥ 18

సుహృత్-తమమ్= అతిశయించి హితకారియగు, రామమ్= బలరాముని, ప్రాప్తమ్= వచ్చినవానినిగా, ఆకర్ణ్య= విని, తే= ఆ, సర్వే= కౌరవులందరు, అతి ప్రీతాః= అధికమగు ప్రీతి గలవారై, తమ్= ఆ ఉద్ధవుని, అర్చయిత్వా= పూజించి, మంగలపాణయః= మంగళద్రవ్యములు చేతులయందు గలవారై, అభియయుః= ఎదురేగిరి.

అతిశయించి హితకారియగు బలరాముడు వచ్చినాడని విని ఆ కౌరవులందరు గొప్ప ప్రీతిని పొందిరి. వారు ఆ ఉద్ధవుని సత్కరించి, మంగళద్రవ్యములను చేతబట్టుకొని బలరామునకు ఎదురేగిరి.

తం సంగమ్య యథాన్యాయం గామర్ఘం చ న్యవేదయన్ ।
తేషాం యే తత్ప్రభావజ్ఞాః ప్రణేయుశ్శిరసా బలమ్ ॥ 19

యథాన్యాయమ్= వయస్సు మొదలగు సందర్భములకు తగ్గట్లుగా, తమ్= ఆ బలరాముని, సంగమ్య= కలుసుకొని, గామ్= గోవును, అర్ఘ్యం చ= త్రాగు నీటిని కూడ, న్యవేదయన్= నివేదించిరి, తేషామ్= వారిలో,

యే= ఎవరైతే, తత్-ప్రభావజ్ఞాః= ఆయన మహిమ తెలిసినవారో వారు, బలమ్= బలరాముని, శిరసా= శిరస్సుతో, ప్రణేయుః= నమస్కరించిరి.

వారు బలరాముని వయస్సు మొదలైన సందర్భములకు తగ్గట్లుగా కలుసుకొని సత్కారముగా గోవును, స్వచ్ఛమగు జలమును నివేదించిరి. వారిలో ఆయన మహిమ తెలిసినవారు తల వంచి నమస్కరించిరి.

బంధూన్ కుశలినశ్శ్రుత్వా పృష్ట్వా శివమనామయమ్ ।
పరస్పరమథో రామో బభాషేఽవిక్లవం వచః ॥ 20

పరస్పరమ్= ఒకరినొకరు, బంధూన్= బంధువులను గురించి, కుశలినః= క్షేమముగా ఉన్నవారినిగా, శ్రుత్వా= విని, శివమ్= మంగళమును, అనామయమ్= ఆరోగ్యమును గురించి, పృష్ట్వా= అడిగి, అథో= తరువాత, రామః= బలరాముడు, అవిక్లవమ్= దైన్యము లేని, వచః= మాటను, బభాషే= పలికెను.

బంధువులు క్షేమముగా ఆరోగ్యముగా ఉన్నారని విని, ఒకరినొకరు మంగళకుశలప్రశ్నలను వేసిరి. తరువాత బలరాముడు దైన్యము లేని వచనమునిట్లు పలికెను.

ఉగ్రసేనః క్షితీశేశో యద్వ ఆజ్ఞాపయత్ప్రభుః ।
తదవ్యగ్రధియశ్శ్రుత్వా కురుధ్వం మా విలంబితమ్ ॥ 21

క్షితి-ఈశ-ఈశః= రాజులకు రాజు, ప్రభుః= సర్వసమర్థుడు అగు, ఉగ్రసేనః= ఉగ్రసేనుడు, వః= మిమ్ములను, యత్= దేనిని, ఆజ్ఞాపయత్= ఆజ్ఞాపించెనో, తత్= దానిని, అవ్యగ్రధియః= ఏకాగ్రమగు చిత్తము గలవారై, శ్రుత్వా= విని, మా విలంబితమ్= విలంబము లేకుండా, కురుధ్వమ్= చేయుడు.

సర్వసమర్థుడగు ఉగ్రసేనుడు రాజాధిరాజు. ఆయన మీకు దేనిని ఆజ్ఞాపించెనో దానిని ఏకాగ్రచిత్తు లై విని శీఘ్రముగా అమలు చేయుడు.

యద్యూయం బహవస్త్వేకం జిత్వాఽధర్మేణ ధార్మికమ్ ।
అబధ్నీతాథ తన్మృష్యే బంధూనామైక్యకామ్యయా ॥ 22

యూయమ్= మీరు, బహవః= చాలమంది, ధార్మికమ్= ధర్మాత్ముడైన, ఏకమ్= ఒక్కడిని, అధర్మేణ= అధర్మముగా, జిత్వా= జయించి, అబధ్నీత= బంధించిరి, యత్= అనేది యేది గలదో, అథ= అయినప్పటికీ, తత్= దానిని, బంధూనామ్= బంధువులయొక్క, ఐక్యకామ్యయా= ఐక్యమునందలి ఇచ్ఛచే, మృష్యే= సహించెదను.

మీరు చాలమంది ఒంటరియగు సాంబుని అధర్మముగా జయించి బంధించినారు. ఆతడు కన్యను తీసుకు వెళ్లుట క్షత్రియోచితధర్మమే. అయినప్పటికీ, బంధువులు కలిసి మెలిసి ఉండాలనే కోరికచే మీరు చేసిన ఆ పనిని సహించుచున్నాను.

వీర్యశౌర్యబలోన్నద్ధ మాత్మశక్తిసమం వచః ।
కురవో బలదేవస్య నిశమ్యోచుః ప్రకోపితాః ॥ 23

వీర్యశౌర్యబల–ఉన్నద్ధమ్= పరాక్రమము ఉత్సాహము బలములచే నిరంకుశమైనట్టియు, ఆత్మశక్తి సమమ్= తన శక్తికి తగి ఉన్న, బలదేవస్య= బలదేవునియొక్క, వచః= మాటను, నిశమ్య= విని, ప్రకోపితాః= చాల కోపించిన, కురవః= కౌరవులు, ఊచుః= పలికిరి.

బలదేవుని వచనము పరాక్రమము, ఉత్సాహము, బలములచే నిరంకుశమై తన శక్తికి తగ్గట్లుగానుండెను. దానిని విని కౌరవులు చాల కోపించి ఇట్లు పలికిరి.

అహో మహచ్చిత్రమిదం కాలగత్యా దురత్యయా ।
ఆరురుక్షత్యుపానద్వై శిరో ముకుట సేవితమ్ ॥ 24

అహో= ఆహా!, దురత్య(య)యా= దాట శక్యము కాని, కాలగత్యా= కాలము యొక్క నడకచే, ఇదమ్= ఇది, మహత్= గొప్ప, చిత్రమ్= చిత్రము,

ఉపానత్ = పాదరక్ష, ముకుట సేవితమ్ = కిరీటము చే సేవించబడిన, శిరః= తలను, ఆరురుక్షతి= అధిష్ఠించ గోరుచున్నది, వై= నిశ్చయము.

ఆహా! ఎంత పెద్ద చిత్రమో! కాలము యొక్క గతిని అతిక్రమించుట శక్యము కాదు. కిరీటముచే సేవించబడే తలను నిశ్చయముగా పాదరక్ష అధిష్ఠించ గోరుచున్నది.

ఏతే యౌనేన సంబద్ధాస్సహశయ్యాఽఽసనాశనాః ।
వృష్ణయస్తుల్యతాం నీతా అస్మద్దత్తనృపాసనాః ॥ 25

మౌనేన= వివాహముచే, సంబద్ధాః= సంబంధమేర్పడినవారు, సహశయ్యా-ఆసన-అశనాః= కలిసి పరుండుట కూర్చుండుట భుజించుట గలవారు, అస్మద్-దత్తనృప-ఆసనాః= మాచే ఈయబడిన రాజసింహాసనము గల, ఏతే= ఈ, వృష్ణయః= యాదవులు, తుల్యతామ్= సమానస్థాయిని, నీతాః= పొందించబడిరి.

కుంతీవివాహముతో మాకీ యాదవులతో సంబంధమేర్పడినది. మేము వారితో కలిసి భుజించి కూర్చుని నిద్రించితిమి. వీరికి రాజ-సింహాసనమును మేమే ఇచ్చితిమి. ఈనాడు వీరు మాతో సమానస్థాయిని పొందించబడిరి.

చామరవ్యజనే శంఖమాతపత్రం చ పాండురమ్ ।
కిరీటమాసనం శయ్యాం భుంజంత్యస్మదుపేక్షయా ॥ 26

చామరవ్యజనే= వింజామరల జంటను, శంఖమ్= శంఖమును, పాండురమ్= తెల్లని, ఆతపత్రమ్= గొడుగును, కిరీటమ్= కిరీటమును, ఆసనమ్= ఆసనమును, శయ్యాం చ= శయ్యను కూడ, అస్మద్-ఉపేక్షయా= మనము ఉపేక్షించుటచే, భుంజంతి= భోగించుచున్నారు.

మనము పట్టించుకోకపోవుటచేతనే వీరు వింజామరల జంట, శంఖము, తెల్లని గొడుగు, కిరీటము అనే రాజచిహ్నములను, మహారాజుకు తగ్గ ఆసనమును, శయ్యను ఉపభోగించుచున్నారు.

అలం యదూనాం నరదేవలాంఛనైః
దాతుః ప్రతీపైః ఫణినామివామృతమ్ ।
యేఽస్మత్ప్రసాదోపచితా హి యాదవా
ఆజ్ఞాపయంత్యద్య గతత్రపా బత ॥ 27

ఫణినామ్= పాములకు, అమృతం ఇవ= పాలు వలె, దాతుః= ఇచ్చువానికి, ప్రతీపైః= ప్రతికూలములైన, నరదేవలాంఛనైః= మహారాజ చిహ్నములతో, యదూనామ్= యాదవులకు, అలమ్= చాలును, హి= ఏలయన, అస్మత్–ప్రసాద–ఉపచితాః= మన అనుగ్రహముచే వర్ధిల్లజేయ–బడిన, యే= ఏ, యాదవాః= యాదవులైతే, గతత్రపాః= తొలగిన సిగ్గు గలవారై, అద్య= ఈనాడు, ఆజ్ఞాపయంతి= ఆజ్ఞాపించుచున్నారో, బత= ఆహా!

పాములకు పాలు పోస్తే అవి పోసేవానిపై పగపట్టును. అదే విధముగా, రాజచిహ్నములనిచ్చిన మనకు యాదవులు శత్రువులైనారు. మన అనుగ్రహముచే పైకి వచ్చిన యాదవులీనాడు సిగ్గు విడిచి మనలనాజ్ఞాపించుచున్నారు. ఏమి దురదృష్టము!

కథమింద్రోఽపి కురుభిర్భీష్మద్రోణార్జునాదిభిః ।
అదత్తమవరుంధీత సింహగ్రస్తమివోరణః ॥ 28

భీష్మద్రోణ–అర్జున–ఆదిభిః= భీష్ముడు ద్రోణుడు అర్జునుడు మొదలైన, కురుభిః= కౌరవులచే, అదత్తమ్= ఈయబడనిదానిని, ఇంద్రః అపి= ఇంద్రుడే అయినా, సింహగ్రస్తమ్= సింహముచే పట్టుకొనబడినదానిని, ఉరణః ఇవ= పొట్టేలు వలె, కథమ్= ఎట్లు, అవరుంధీత= భోగించును?

సింహము వేటాడినదానిని పొట్టేలు ఎట్లు తినగలదు? అదే విధముగా, భీష్ముడు, ద్రోణుడు, అర్జునుడు, కర్ణుడు మొదలైన కౌరవులు ఈయకుండా ఇంద్రుడైనా దేనినైననూ ఎట్లు ఉపభోగించగల్గును? (ఉపభోగించలేదు).

శ్రీశుక ఉవాచ ।

జన్మబంధుశ్రియోన్నద్ధమదాస్తే భరతర్షభ ।
ఆశ్రావ్య రామం దుర్వాచ్యమసభ్యాః పురమావిశన్ ॥ 29

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భరత-ఋషభ= భరతవంశశ్రేష్ఠా!, జన్మబంధుశ్రియా= పుట్టుకచే బంధువులచే సంపదచే, ఉన్నద్ధమదాః= ఉత్కటమైన గర్వము గల, తే= ఆ, అసభ్యాః= దుష్టులు, రామమ్= బలరాముని ఉద్దేశించి, దుర్వాచ్యమ్= పలుకకూడని మాటను, ఆశ్రావ్య= వినిపించి, పురమ్= నగరమును, ఆవిశన్= ప్రవేశించిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఆ దుష్టకౌరవులు తమది గొప్ప వంశమని, తమకు భీష్ముడు మొదలగు గొప్పవారు బంధువులని, తమకు సంపద గలదని ఉత్కటమైన గర్వము కలిగియుండిరి. వారు పలుకకూడని పలుకులను బలరామునకు వినిపించి తమ నగరమునకు తిరిగి వెళ్లిరి.

దృష్ట్వా కురూణాం దౌశ్శీల్యం శ్రుత్వాఽవాచ్యాని చాచ్యుతః ।
అవోచత్కోపసంరబ్ధో దుష్ప్రేక్ష్యః ప్రహసన్ముహుః ॥ 30

అచ్యుతః= బలరామ భగవానుడు, కురూణామ్= కౌరవులయొక్క, దౌశ్శీల్యమ్= దుష్టత్వమును, దృష్ట్వా= చూచి, అవాచ్యాని చ= పలుకకూడని పలుకులను కూడ, శ్రుత్వా= విని, కోపసంరబ్ధః= కోపముచే వ్యాపించబడిన వాడు, దుష్ప్రేక్ష్యః= చూడ శక్యము కానివాడు, ముహుః= పలుమార్లు, ప్రహసన్= గట్టిగా నవ్వుచున్నవాడై, అవోచత్= పలికెను.

బలరామ భగవానునకు కౌరవుల దుష్టత్వమును చూచి, పలుకరాని పలుకులను కూడ విని నిండా కోపము వచ్చెను. ఆయనను చూడ శక్యము కాకుండెను. ఆయన పలుమార్లు గట్టిగా నవ్వుతూ ఇట్లు పలికెను.

నూనం నానామదోన్నద్ధా శ్శాంతిం నేచ్ఛంత్యసాధవః ।
తేషాం హి ప్రశమో దండః పశూనాం లగుడో యథా ॥ 31

నానామద-ఉన్నద్ధాః= పలురకముల గర్వములచే పొగరెక్కిన, అసాధవః= దుష్టులు, శాంతిమ్= శాంతిని, న ఇచ్ఛంతి= కోరరు, నూనమ్= నిశ్చయము, తేషామ్= వారికి, పశూనామ్= పశువులకు, లగుడః యథా= కట్టె వలె, దండః= శిక్ష, హి= నిశ్చయముగా, ప్రశమః= శాంతికరము.

పలురకముల గర్వముతో పొగరెక్కిన దుష్టులు శాంతిని కోరరు. ఇది నిశ్చయము. పశువులకు కట్టె వలె, శిక్షయే వారి పొగరును శాంతింపజేయును.

అహో యదూన్ సుసంరబ్ధాన్ కృష్ణం చ కుపితం శనైః ।
సాంత్వయిత్వాఽహమేతేషాం శమమిచ్ఛన్నిహాగతః ॥ 32

అహో= ఆహా!, సుసంరబ్ధాన్= చాల కోపించిన, యదూన్= యాదవులను, కుపితమ్= కోపించిన, కృష్ణం చ= కృష్ణుని కూడ, శనైః= మెల్లగా, సాంత్వయిత్వా= నచ్చజెప్పి, అహమ్= నేను, ఏతేషామ్= వీరికి, శమమ్= శాంతిని, ఇచ్ఛన్= కోరువాడనై, ఇహ= ఇచటకు, ఆగతః= వచ్చినవాడను.

ఆహా! చాల కోపించిన యాదవులకు, కోపించిన కృష్ణునకు కూడ మెల్లగా నచ్చజెప్పి నేను వీరికి సుఖశాంతులను కోరి ఇక్కడకు వచ్చితిని.

త ఇమే మందమతయః కలహాభిరతాః ఖలాః ।
తం మామవజ్ఞాయ ముహుర్దుర్భాషాన్మానినోఽబ్రువన్ ॥ 33

తే= అట్టి, ఇమే= వీరు, మందమతయః= మందబుద్ధులు, కలహ-అభిరతాః= కలహమునందు ప్రీతి గలవారు, ఖలాః= దుష్టులు, మానినః = అహంకారులు, తమ్= అట్టి, మామ్= నన్ను, అవజ్ఞాయ= తిరస్కరించి, ముహుః= పలుమార్లు, దుర్భాషాన్= దుర్భాషలను, అబ్రువన్= పలికిరి.

అట్టి వీరు మందబుద్ధులు, కలహప్రియులైన దుష్టులు. అట్టి (శాంతికోరే) నన్నీ దురహంకారులు తిరస్కరించి పలుమార్లు దుర్భాషలాడిరి.

నోగ్రసేనః కిల విభుర్భోజవృష్ణ్యంధకేశ్వరః ।
శక్రాదయో లోకపాలా యస్యాదేశానువర్తినః ॥ 34

భోజవృష్ణి-అంధక-ఈశ్వరః= భోజవృష్ణి-అంధకవంశీయులగు యాదవులకు శాసకుడగు, ఉగ్రసేనః= ఉగ్రసేనుడు, విభుః న కిల= ప్రభుడు కాడా?, శక్ర-ఆదయః= ఇంద్రుడు మొదలైన, లోకపాలాః= లోకపాలకులు, యస్య= ఎవని, ఆదేశ-అనువర్తినః= ఆజ్ఞను పాలించెదరో.

భోజవృష్ణి-అంధకవంశీయులగు యాదవులకు శాసకుడగు ఉగ్రసేనుడు రాజాధిరాజు కాడా? (అవును). ఇంద్రుడు, అగ్ని మొదలైన లోకపాలకులు ఆయన ఆదేశమును పాలించెదరు.

సుధర్మాఽఽక్రమ్యతే యేన పారిజాతోమరాంఘ్రిపః ।
ఆనీయ భుజ్యతే సోఽసౌ న కిలాధ్యాసనార్హణః ॥ 35

యేన= ఎవనిచే, సుధర్మా= సుధర్మ అనే సభ, ఆక్రమ్యతే= స్వాధీనము చేసుకొనబడినదో, పారిజాతః. పారిజాతమనే, అమర-అంఘ్రిపః= స్వర్గమునందలి వృక్షము, ఆనీయ= తీసుకువచ్చి, భుజ్యతే= భోగించబడు చున్నదో, సః= అట్టి, అసౌ= ఈ శ్రీకృష్ణుడు, అధి-ఆసన-అర్హణః= రాజసింహాసనమునకు అర్హుడు, న కిల= కాడా?

శ్రీకృష్ణుడు సుధర్మ అనే దేవసభను స్వాధీనము చేసుకొని, పారిజాతమనే స్వర్గమునందలి వృక్షమును తెచ్చి భోగించుచున్నాడు. ఆతడు రాజసింహాసనమునకు అర్హుడు కాడా? (అర్హుడే).

యస్య పాదయుగం సాక్షాచ్ఛ్రీరుపాస్తేఽ ఖిలేశ్వరీ ।
స నార్హతి కిల శ్రీశో నరదేవపరిచ్ఛదాన్ ॥ 36

యస్య= ఎవ్వాని, పాదయుగమ్= పాదముల జంటను, సాక్షాత్= సాక్షాత్తుగా, అఖిల-ఈశ్వరీ= సర్వేశ్వరియగు, శ్రీః= లక్ష్మీదేవి, ఉపాస్తే= ఉపాసించునో, శ్రీ ఈశః= లక్ష్మీపతియగు, సః= ఆ శ్రీకృష్ణ భగవానుడు, నరదేవపరిచ్ఛదాన్= రాజునకు తగిన సామగ్రిని, న అర్హతి కిల= తగడా?

శ్రీకృష్ణ భగవానుని పాదముల జంటను సాక్షాత్తు సర్వేశ్వరియగు లక్ష్మీదేవి ఉపాసించును. ఆ లక్ష్మీపతి ఛత్రచామరాది రాజమర్యాదలకు తగడా? (అర్హుడే).

యస్యాంఘ్రిపంకజరజోఽ ఖిలలోకపాలైః
మౌల్యుత్తమైర్ధృతముపాసితతీర్థతీర్థమ్ ।
బ్రహ్మా భవోఽ హమపి యస్య కలాః కలాయాః
శ్రీశ్చోద్వహేమ చిరమస్య నృపాసనం క్వ ॥ 37

యస్య= ఎవ్వాని, అంఘ్రిపంకజరజః= పద్మములవంటి పాదముల ధూళి, అఖిలలోకపాలైః= సకలలోకపాలకులచే, మౌలి-ఉత్తమైః= కిరీటములతో కూడిన శిరస్సులచే, ధృతమ్= ధరించబడినదో, ఉపాసిత తీర్థతీర్థమ్= సేవించబడే తీర్థములకు తీర్థమో, యస్య= ఎవ్వాని, కలాయాః = అంశ (హిరణ్యగర్భుడు) యొక్క, కలాః= అంశలమగు, బ్రహ్మా= బ్రహ్మదేవుడు, భవః= శివుడు, అహం అపి= నేను కూడ, శ్రీః చ= లక్ష్మీదేవి కూడ, చిరమ్= చిరకాలము, ఉద్వహేమ= ధరించెదమో, అస్య= అట్టి ఈ శ్రీకృష్ణ భగవానునకు, నృప-ఆసనమ్= రాజసింహాసనము, క్వ= ఎక్కడ?

శ్రీకృష్ణ భగవానుని పద్మములవంటి పాదముల ధూళిని సకలలోక-పాలకులు కిరీటములతో కూడిన శిరస్సులపై ధరించెదరు. బ్రహ్మదేవుడు, శివుడు, నేను కూడ ఆయన అంశయగు హిరణ్యగర్భుని అంశలము. భక్తులచే సేవించబడే గంగాది తీర్థములను కూడ పావనము చేసే ఆ ధూళిని మేము, లక్ష్మీదేవి కూడ చిరకాలము ధరించెదము. అట్టి ఆయనకు తగిన రాజసింహాసనము ఎక్కడనున్నది? (లేనే లేదు).

భుంజతే కురుభిర్దత్తం భూఖండం వృష్ణయః కిల ।
ఉపానహః కిల వయం స్వయం తు కురవశ్శిరః ॥ 38

వృష్ణయః= యాదవులు, కురుభిః= కౌరవులచే, దత్తమ్= ఈయబడిన, భూఖండమ్= చిన్న రాజ్యమును, భుంజతే కిల= భోగించుచున్నారా?, వయమ్= మేము, ఉపానహః కిల= పాదరక్షలమా?, కురవః= కౌరవులు, స్వయమ్= స్వయముగా, శిరః తు= తలయా?

యాదవులు కౌరవులిచ్చిన చిన్న రాజ్యమునుపభోగించుచున్నారా? మేము పాదరక్షలమా? కౌరవులు స్వయముగా (మేము ఎక్కిన) శిరస్సా?

అహో ఐశ్వర్యమత్తానాం మత్తానామివ మానినామ్ ।
అసంబద్ధా గిరో రూక్షాః కస్సహేతానుశాసితా ॥ 39

అహో= ఆశ్చర్యము!, ఐశ్వర్యమత్తానామ్= సంపదచే గర్వించిన, మానినామ్= దురభిమానులయొక్క, అసంబద్ధాః= సందర్భశుద్ధి లేనట్టియు, రూక్షాః= పరుషములైన, గిరః= మాటలను, మత్తానాం ఇవ= నిషాలో ఉన్నవారి మాటలను వలె, అనుశాసితా= శాసించగల, కః= ఎవడు, సహేత= సహించును ?

ఆశ్చర్యము! సంపదచే గర్వించిన దురభిమానులు నిషాలో ఉన్నవారు వలె, సందర్భశుద్ధిలేని పరుషవచనములను పలికెదరు. శిక్షించే సామర్థ్యము గల ఎవడు అట్టి మాటలను సహించును? (సహించడు).

అద్య నిష్కౌరవీం పృథ్వీం కరిష్యామీత్యమర్షితః ।
గృహీత్వా హలముత్తస్థౌ దహన్నివ జగత్త్రయమ్ ॥ 40

అద్య= ఈనాడు, పృథ్వీమ్= భూమిని, నిష్కౌరవీమ్= కౌరవులు లేనిదిగా, కరిష్యామి= చేయగలను, ఇతి= అని, అమర్షితః= కోపించిన బలరాముడు, హలమ్= నాగలిని, గృహీత్వా= పట్టుకొని, జగత్–త్రయమ్= ముల్లోకములను, దహన్ ఇవ= దహించుచున్నాడా యన్నట్లు, ఉత్తస్థౌ= లేచి నిలబడెను.

ఈనాడీ భూమిపై కౌరవులు లేకుండా చేస్తాను, అంటూ బలరాముడు కోపముతో నాగలి పట్టి, ముల్లోకములను దహిస్తాడా యన్నట్లు లేచి నిలబడెను.

లాంగలాగ్రేణ నగరముద్విదార్య గజాహ్వయమ్ ।
విచకర్ష స గంగాయాం ప్రహరిష్యన్నమర్షితః ॥ 41

అమర్షితః= కోపించిన, సః= ఆ బలరాముడు, లాంగల–అగ్రేణ= నాగేటి చాలు కొనతో, గజ–ఆహ్వయమ్= హస్తినాపురమనే, నగరమ్= నగరమును, ఉద్విదార్య= ఊడబెరకి, గంగాయామ్= గంగయందు, ప్రహరిష్యన్= పారవేయబోవువాడై, విచకర్ష= లాగెను.

కోపించిన ఆ బలరాముడు నాగేటి చాలు కొనతో హస్తినాపురమనే నగరమును గంగలో పారవేయబోవువాడై ఊడబెరకి లాగెను.

జలయానమివాఘూర్ణం గంగాయాం నగరం పతత్ ।
ఆకృష్యమాణమాలోక్య కౌరవా జాతసంభ్రమాః ॥ 42

ఆకృష్యమాణమ్= లాగబడుచున్నట్టియు, జలయానం ఇవ= పడవవలె, ఆఘూర్ణమ్= అల్లల్లాడుచున్నట్టియు, గంగాయామ్= గంగ యందు, పతత్= పడుచున్న, నగరమ్= నగరమును, దృష్ట్వా= చూచి, కౌరవాః= కౌరవులు, జాతసంభ్రమాః= పుట్టిన కంగారు, భయము గలవారు.

బలరాముడు లాగుచుండగా ఆ నగరము పడవవలె అల్లల్లాడుతూ గంగలో పడుచుండెను. దానిని చూచి కౌరవులు కంగారుతో భయపడిరి.

తమేవ శరణం జగ్ముస్సకుటుంబా జిజీవిషవః ।
సలక్ష్మణం పురస్కృత్య సాంబం ప్రాంజలయః ప్రభుమ్ ॥ 43

సకుటుంబాః= కుటుంబములతో కూడినవారు, జిజీవిషవః= జీవించ గోరువారు, ప్రాంజలయః= చేతులు జోడించినవారు అగు కౌరవులు, సలక్ష్మణమ్= లక్ష్మణతో కూడియున్న, సాంబమ్= సాంబుని, పురస్కృత్య= ఎదురుగా నిడుకొని, ప్రభుమ్= సర్వసమర్థుడగు, తం ఏవ= ఆ బలరామునే, శరణం జగ్ముః= శరణు జొచ్చిరి.

వారు జీవించగోరి లక్ష్మణను, సాంబుని ఎదురుగా నిడుకొని కుటుంబములతో సహా సర్వసమర్థుడగు ఆ బలరామునే శరణు వేడిరి.

రామ రామాఖిలాధార ప్రభావం న విదామ తే ।
మూఢానాం నః కుబుద్ధీనాం క్షంతుమర్హస్యతిక్రమమ్ ॥ 44

రామ= ఓ బలరామా!, రామ= ఓ బలరామా!, అఖిల-ఆధార= సర్వమునకు ఆధారమైనవాడా!, తే= నీ, ప్రభావమ్= మహిమను, న విదామ= తెలియకున్నాము, మూఢానామ్= మోహితులమైనట్టియు, కుబుద్ధీనామ్= దుర్బుద్ధులమగు, నః= మాయొక్క, అతిక్రమమ్ అపరాధమును, క్షంతుమ్= క్షమించుటకు, అర్హసి= తగుదువు.

ఓ బలరామా! రామా! సర్వమునకు ఆధారము నీవే. మేము మోహమును పొందిన దుర్బుద్ధులము, నీ మహిమను తెలియలేకపోతిమి. మా అపరాధమును నీవు క్షమించ తగుదువు.

స్థిత్యుత్పత్త్యప్యయానాం త్వమేకో హేతురాశ్రయః ।
లోకాన్ క్రీడన కానీశ క్రీడతస్తే వదంతి హి ॥ 45

స్థితి–ఉత్పత్తి–అప్యయానామ్= సృష్టి స్థితిలయములకు, త్వమ్= నీవు, ఏకః= ఒకే ఒక, హేతుః= కారణము, నిరాశ్రయః= ఆధారము లేనివాడవు, హి= ఏలయన, ఈశ= ఓ ఈశ్వరా!, క్రీడతః= క్రీడించే, తే= నీకు, లోకాన్= లోకములను, క్రీడనకాన్= ఆట వస్తువులనుగా, వదంతి= చెప్పెదరు.

ఓ ఈశ్వరా! జగత్తుయొక్క సృష్టి స్థితిలయములకు ఏకైక హేతువు నీవే. కాని, నీకు వేరే ఆధారము లేదు. ఏలయన, క్రీడాపరుడవైన నీకు ఈ లోకములే ఆట వస్తువులని మహాత్ములు చెప్పెదరు.

త్వమేవ మూర్ధ్నీదమనంత లీలయా
భూమండలం బిభర్షి సహస్రమూర్ధన్ ।
అంతే చ యస్యాత్మని రుద్ధవిశ్వః
శేషేఽ ద్వితీయః పరిశిష్యమాణః ॥ 46

అనంత= ఓ అనంతా!, సహస్రమూర్ధన్= అనంతమగు తలలు గలవాడా!, త్వం ఏవ= నీవే, ఇదమ్= ఈ, భూమండలమ్= భూమండలమును, మూర్ధ్ని= తలపై, లీలయా= అవలీలగా, బిభర్షి= మోయుచున్నావు, యః= ఏ నీవు, అంతే చ= ప్రళయమునందు కూడ, స్వ–ఆత్మని= తన స్వరూపమునందు, రుద్ధవిశ్వః= విలీనమైన జగత్తు గలవాడవై, అద్వితీయః= రెండవది లేనివాడవుగా, పరిశిష్యమాణః= మిగిలియున్నవాడవై, శేషే= శయనించెదవు.

ఓ అనంతా! అనంతప్రాణుల రూపములోనున్న నీకు అనంత శిరస్సులు గలవు. ఈ భూమండలమును నీవే తలపై అవలీలగా మోయుచున్నావు. ప్రళయమునందు కూడ నీవు విశ్వమును నీ స్వరూపమునందు విలీనము చేసుకొని, రెండవది లేని పరబ్రహ్మగా మిగిలియుండి శయనించెదవు.

కోపస్తేఽఖిలశిక్షాఽర్థం న ద్వేషాన్న చ మత్సరాత్ ।
బిభ్రతో భగవన్ సత్త్వం స్థితిపాలనతత్పరః ॥ 47

భగవన్= ఓ భగవానుడా!, సత్త్వమ్= సత్త్వగుణమును, బిభ్రతః= స్వీకరించిన, తే= నీ, కోపః= కోపము, అఖిలశిక్షా-అర్థమ్= అందరికీ శిక్షణనిచ్చుటకై, ద్వేషాత్= ద్వేషము వలన, న= కాదు, మత్సరాత్ చ= ఈర్ష్య వలనైననూ, న= కాదు, స్థితిపాలనతత్పరః= స్థితియందు పాలించుట యందు తత్పరుడవు.

ఓ భగవానుడా! నీ కోపము సకలప్రాణులకు శిక్షణను గరపుటకే గాని, ద్వేషము వలన గాని, ఈర్ష్య వలన గాని కలిగేది కాదు. ఎందుకంటే, సత్త్వగుణప్రధానుడవగు నీవు జగత్తునకు మనుగడనిచ్చి పాలించుటయందు తత్పరుడవై యున్నావు.

నమస్తే సర్వభూతాత్మన్ సర్వశక్తిధరావ్యయ ।
విశ్వకర్మన్నమస్తేఽస్తు త్వాం వయం శరణం గతాః ॥ 48

సర్వభూత-ఆత్మన్= సకలప్రాణులలో ప్రత్యగాత్మరూపుడా!, సర్వశక్తిధర= సకలశక్తులను నిలబెట్టువాడా!, అవ్యయ= వినాశము లేనివాడా!, విశ్వకర్మన్= జగత్తును సృష్టించినవాడా!, తే= నీ కొరకు, నమః= నమస్కారము, అస్తు= అగుగాక!, వయమ్= మేము, త్వామ్= నిన్ను, శరణమ్= శరణును, గతాః= పొందినవారము.

ఓ దేవా! నీవే సకల ప్రాణులలో ప్రత్యగాత్మరూపుడవై సకలశక్తులను నిలబెట్టుచున్నావు. వినాశము లేని నీవు జగత్తును సృష్టించినావు. నీకు నమస్కారమగుగాక! మేము నిన్ను శరణు జొచ్చినాము.

శ్రీశుక ఉవాచ ।

ఏవం ప్రపన్నైస్సంవిగ్నై ర్వేపమానాయనైర్భలః ।
ప్రసాదితస్సుప్రసన్నో మా భైష్టేత్యభయం దదౌ ॥ 49

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ప్రపన్నైః= శరణు వేడినట్టియు, సంవిగ్నైః= భయపడినట్టియు, వేపమాన-అయనైః= కంపించు-చున్న నగరము గల వారిచే, ఏవమ్= ఈ విధముగా, ప్రసాదితః= ప్రసన్నుడుగా చేసుకొనబడిన, బలః= బలరాముడు, సుప్రసన్నః= మిక్కిలి ప్రసన్నుడై, మా భైష్ట= భయపడకుడు, ఇతి= అని, అభయమ్= అభయమును, దదౌ= ఇచ్చెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...నగరము కంపించుచుండుటచే భయపడి శరణుజొచ్చిన ఆ జనులు బలరాముని ఈ విధముగా ప్రసన్నుని చేసిరి. ఆయన చాల ప్రసన్నుడై, భయపడకుడని అభయమునిచ్చెను.

దుర్యోధనః పారిబర్హం కుంజరాన్ షష్టిహాయనాన్ ।
దదౌ చ ద్వాదశశతాన్యయుతాని తురంగమాన్ ॥ 50

దుర్యోధనః= దుర్యోధనుడు, పారిబర్హమ్= కట్నమునుగా, షష్టిహాయనాన్= అరవై యేళ్ల వయస్సు గల, ద్వాదశ= పన్నెండు, శతాని= వందల, కుంజరాన్= ఏనుగులను, అయుతాని= పది వేల, తురంగమాన్ చ= గుర్రములను కూడ, దదౌ= ఇచ్చెను.

దుర్యోధనుడు అరవై యేళ్ల వయస్సు గల పన్నెండు వందల ఏనుగులను, పది వేల గుర్రములను కూడ కట్నముగా ఇచ్చెను.

రథానాం షట్సహస్రాణి రౌక్మాణాం సూర్యవర్చసామ్ ।
దాసీనాం నిష్కకంఠీనాం సహస్రం దుహితృవత్సలః ॥ 51

దుహితృవత్సలః= కుమార్తెయందు వాత్సల్యము గల దుర్యోధనుడు, రౌక్మాణామ్= బంగరు, సూర్యవర్చసామ్= సూర్యుడు వలె వెలిగిపోయే, రథానామ్= రథములయొక్క, షట్= ఆరు, సహస్రాణి= వేలను, నిష్కకంఠీనామ్= హారము కంఠమునందు గల, దాసీనామ్= పరిచారికల యొక్క, సహస్రమ్= వేయిని (ఇచ్చెను).

కుమార్తెయందు మిక్కుటమగు ప్రేమ గల దుర్యోధనుడు సూర్యుడువలె వెలిగిపోయే ఆరు వేల బంగరు రథములను, మెడలో బంగరు హారములు గల వెయ్యి దాసీలను కూడ కట్నముగా ఇచ్చెను.

ప్రతిగృహ్య తు తత్సర్వం భగవాన్ సాత్వతర్షభః ।
ససుతస్సస్నుషః ప్రాగాత్సుహృద్భిరభినందితః ॥ 52

సాత్వత-ఋషభః= యాదవులలో శ్రేష్ఠుడైన, భగవాన్ తు= బలరామ భగవానుడైతే, తత్= ఆ, సర్వమ్= సర్వమును, ప్రతిగృహ్య= స్వీకరించి, ససుతః= పుత్రునితో కూడినవాడై, సస్నుషః= కోడలితో కూడినవాడై, సహృద్భిః= బంధువులగు కౌరవులచే, అభినందితః= అభినందించబడిన వాడై, ప్రాగాత్= వెళ్లెను.

యాదవశ్రేష్ఠుడగు బలరామ భగవానుడా సర్వమును స్వీకరించి, పుత్రునితో కోడలితో గూడి వెళ్లెను. ఆయనను బంధువులైన కౌరవులు అభినందించిరి.

తతః ప్రవిష్టస్స్వపురం హలాయుధః
సమేత్య బంధూననురక్తచేతసః ।
శశంస సర్వం యదుపుంగవానాం
మధ్యే సభాయాం కురుషు స్వచేష్టితమ్ ॥ 53

తతః= తరువాత, స్వపురమ్= తన నగరమును, ప్రవిష్టః= ప్రవేశించిన, హల-ఆయుధః= నాగలియే ఆయుధముగా గల బలరాముడు, అనురక్తచేతసః= ప్రేమగల మనస్సులు గల, బంధూన్= బంధువులను, సమేత్య= కలుసుకొని, సభాయామ్= సభయందు, యదుపుంగవానామ్= యాదవశ్రేష్ఠుల, మధ్యే= మధ్యయందు, కురుషు= కురుదేశమునందు, స్వచేష్టితమ్= తన చేష్టను, సర్వమ్= అంతనూ, శశంస= చెప్పెను.

తరువాత నాగలియే ఆయుధముగా గల బలరాముడు తన ద్వారకా నగరమును చేరెను. ఆయనపై బంధువులకు అనురాగము మెండు. ఆయన వారిని కలుసుకొనెను. యాదవశ్రేష్ఠుల మధ్యలో సభలో ఆయన కురుదేశములో తాను చేసిన కార్యములనన్నింటినీ వివరించి చెప్పెను.

అద్యాపి చ పురం హ్యేతత్సూచయద్రామవిక్రమమ్ ।
సమున్నతం దక్షిణతో గంగాయామనుదృశ్యతే ॥ 54

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే అష్టషష్టితమోఽధ్యాయః

అద్య అపి చ= ఈనాటికి కూడా, ఏతత్= ఈ, పురమ్= నగరము, గంగాయామ్= గంగాతీరమునందు, రామవిక్రమమ్= బలరాముని పరాక్రమమును, హి= నిశ్చయముగా, సూచయత్= సూచించుచున్నదై, దక్షిణతః= ఎడమ వైపున, సమున్నతమ్= బాగా ఎత్తు గలదియై, అనుదృశ్యతే= కానవచ్చును.

ఈనాటికీ ఈ హస్తినాపురము బలరాముని పరాక్రమానికి నిశ్చితమైన నిదర్శనంగా గంగానదీతీరమున ఎడమవైపు బాగా ఎత్తుగా గంగ వైపు వాలినట్లుగా కానవచ్చును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము
ఉత్తరార్ధములో సాంబుని వివాహమును వర్ణించే
అరువది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (68).

* * *

అథ ఏకోనసప్తతితమోఽధ్యాయః

నారదుడు శ్రీకృష్ణుని గార్హస్థ్యమును దర్శించుట

శ్రీశుక ఉవాచ ।

నరకం నిహతం శ్రుత్వా తథోద్వాహం చ యోషితామ్ ।
కృష్ణేనైకేన బహ్వీనాం తద్దిదృక్షుస్స్మ నారదః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, నిహతమ్= సంహరించ బడిన, నరకమ్= నరకుని గురించి, తథా= అదే విధముగా, ఏకేన= ఒక్క, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, బహ్వీనామ్= చాలమంది, యోషితామ్= రాజకుమార్తెలయొక్క, ఉద్వాహం చ= వివాహమును గురించి, శ్రుత్వా= విని, నారదః= నారదుడు, తత్= దానిని, దిదృక్షుః స్మ= చూడగోరువాడు ఆయెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...నరకుడు సంహరించబడినాడనియు, శ్రీకృష్ణుడొక్కడే చాలమంది రాజకుమార్తెలను వివాహమాడినాడనియు నారదుడు వినెను. ఆయన ఆ సందర్భమును చూడగోరెను.

చిత్రం బతైతదేకేన వపుషా యుగపత్పృథక్ ।
గృహేషు ద్వ్యష్టసాహస్రం స్త్రియ ఏక ఉదావహత్ ॥ 2

ఏతత్= ఇది, చిత్రం బత= అత్యాశ్చర్యము!, ఏకః= ఒక్కడు, ఏకేన= ఒక్క, వపుషా= దేహముతో, యుగపత్= ఒకేసారి, పృథక్= వేరుగా, గృహేషు= ఇళ్లయందు, ద్వి-అష్టసాహస్రమ్= పదునారు వేల, స్త్రియః= యువతులను, ఉదావహత్= వివాహమాడెను.

ఇది అత్యాశ్చర్యము! ఒక్క శ్రీకృష్ణుడు ఒకే దేహముతో ఒకేసారి వేర్వేరు ఇళ్లయందు పదునారు వేల యువతులను వివాహమాడెను.

ఇత్యుత్సుకో ద్వారవతీం దేవర్షిర్ద్రష్టుమాగమత్ ।
పుష్పితోపవనారామద్విజాలికులనాదితామ్ ॥ 3

ఇతి= ఈ విధముగా, ఉత్సుకః= ఉత్కంఠ గల, దేవ–ఋషిః= దేవర్షి నారదుడు, ద్రష్టుమ్= చూచటకు, పుష్పిత–ఉపవన– ఆరామద్విజ–అలికులనాదితామ్= పుష్పించిన ఉపవనములయందు ఉద్యానముల యందు పక్షుల తుమ్మెదల గుంపులచే నినదించే, ద్వారవతీమ్= ద్వారకను గురించి, ఆగమత్= వచ్చెను.

ఈ విధమైన ఉత్కంఠ గల నారదుడు (శ్రీకృష్ణుని గార్హస్థ్యమును) చూచుటకై ద్వారకకు వచ్చెను. అచట ఉపవనములయందు, ఉద్యానముల యందు పక్షుల మరియు తుమ్మెదల గుంపులు నినదించుచుండెను.

ఉత్ఫుల్లేందీవరాంభోజ కహ్లారకుముదోత్పలైః ।
ఛురితేషు సరస్సూచ్చైః కూజితాం హంససారసైః ॥ 4

ఉత్ఫుల్ల–ఇందీవర–అంభోజకహ్లారకుముద–ఉత్పలైః= వికసించిన నల్లకలువలు కమలములు చెంగలువలు ఎర్రదామరలు కలువలచే, ఛురితేషు= వ్యాపించబడిన, సరస్సు= సరస్సులయందు, హంససారసైః= రాజహంసలు బెగ్గురు పక్షులచే, ఉచ్చైః= బిగ్గరగా, కూజితామ్= నినదించ–బడిన (ద్వారకకు వచ్చెను).

ద్వారకలో నల్ల కలువలు, కమలములు, చెంగలువలు, ఎర్రదామరలు, కలువలతో నిండిన సరస్సులలో రాజహంసలు, బెగ్గురు పక్షులు బిగ్గరగా కూయుచుండెను.

ప్రాసాదలక్షైర్నవభిర్జుష్టాం స్ఫాటికరాజతైః ।
మహామరకతప్రఖ్యై స్స్వర్ణరత్నపరిచ్ఛదైః ॥ 5

స్ఫాటికరాజతైః= స్ఫటికము వెండిలతో చేసినట్టియు, మహామరకత ప్రఖ్యైః= గొప్ప పచ్చలతో ప్రకాశించునట్టియు, స్వర్ణరత్నపరిచ్ఛదైః= బంగరు రత్నములు పొదిగిన సామగ్రి గల, నవభిః= తొమ్మిది, ప్రాసాదలక్షైః= ప్రాసాదముల లక్షలతో, జుష్టామ్= కూడిన (పురమునకు వచ్చెను).

ఆ ద్వారకలో స్ఫటికముతో వెండితో నిర్మించిన తొమ్మిది లక్షల ప్రాసాదములు ఉండెను. అవి గొప్ప పచ్చలతో, రత్నములు పొదిగిన బంగరు సామగ్రితో ప్రకాశించెను.

విభక్తరథ్యాపథచత్వరాపణై శ్శాలాసభాభిః రుచిరాం సురాలయైః ।
సంసిక్తమార్గాంగణవీథిదేహలీం పతత్పతాకాధ్వజవారితాతపామ్॥6

విభక్తరథ్యాపథచత్వర-ఆపణైఃⁿ విభాగముగా చేయబడిన రథమార్గములు ఇతరమార్గములు కూడళ్లు అంగళ్లతో, శాలాసభాభిఃⁿ సత్రము (గుర్రాల శాల)లతో సభలతో, సుర-ఆలయైఃⁿ దేవతల మందిరములతో, రుచిరామ్ⁿ సుందరమైనట్టియు, సంసిక్తమార్గ-అంగణ వీథి దేహలీమ్ⁿ నీళ్లు చల్లబడిన మార్గములు అంగళ్లు చిన్న వీథులు ద్వారములు కలిగినట్టియు, పతత్-పతాకాధ్వజవారిత-ఆతపామ్ⁿ కదలాడే పతాకలచే టెక్కెములచే అడ్డుకొనబడే ఎండ గల (పురమునకు వచ్చెను).

ఆ నగరమునందు రథమార్గములు, ఇతరమార్గములు, కూడళ్లు, అంగళ్లు, విభాగముగా నిర్మించబడెను. సత్రములు, గుర్రాల శాలలు, సభలు, దేవతామందిరములతో ఆ నగరము అందముగా నుండెను. అక్కడి మార్గములు, అంగళ్లు, చిన్న వీథులు, ఇళ్ల ద్వారములయందు నీరు చల్లబడెను. రెపరెపలాడే పతాకలు, టెక్కెములు ఎండను వారించెను.

తస్యామంతఃపురం శ్రీమదర్చితం సర్వధిష్ణ్యైః ।
హరేస్స్వకౌశలం యత్ర త్వష్ట్రా కార్త్స్న్యేన దర్శితమ్ ॥ 7

తస్యామ్ⁿ ఆ ద్వారకయందు, శ్రీమత్ⁿ శోభతో కూడినది, సర్వధిష్ణ్యైఃⁿ సకలలోకపాలకులచే, అర్చితమ్ⁿ ఆదరించబడినది అగు, హరేఃⁿ శ్రీకృష్ణ భగవానునియొక్క, అంతఃపురమ్ⁿ అంతఃపురము, యత్రⁿ దేనియందైతే, త్వష్ట్రాⁿ విశ్వకర్మచే, స్వకౌశలమ్ⁿ తన నేర్పు, కార్త్స్న్యేనⁿ పూర్తిగా, దర్శితమ్ⁿ ప్రదర్శించబడినదో.

ఆ ద్వారకలో శోభాయుక్తమైన శ్రీకృష్ణభగవానుని అంతః (లోపలి) పురము గలదు. దానిని లోకపాలకులందరు ఆదరించెదరు. విశ్వకర్మ తన నేర్పును పూర్తిగా దానియందు ప్రదర్శించినాడు.

తత్ర షోడశభిస్సద్మసహస్రైస్సమలంకృతమ్ ।
వివేశైకతమం శౌరేః పత్నీనాం భవనం మహత్ ॥ 8

షోడశభిః= పదునారు, సద్మసహస్రైః= భవనముల వేయిలచే, సమలంకృతమ్= బాగుగా అలంకరించబడినది, తత్ర= వాటిలో, శౌరేః= శ్రీకృష్ణుని, పత్నీనామ్= భార్యలయొక్క (భవనములలో), ఏకతమమ్= ఒకటైన, మహత్= గొప్ప, భవనమ్= భవనమును, వివేశ= ప్రవేశించెను.

ఆ అంతఃపురమునకు పదహారు వేల భవనములే అలంకారము. అవి శ్రీకృష్ణుని భార్యల భవనములు. నారదుడు వాటిలో ఒక గొప్ప భవనమును ప్రవేశించెను.

విష్టబ్ధం విద్రుమస్తంభై ర్వైదూర్యఫలకోత్తమైః ।
ఇంద్రనీలమయైః కుడ్యైర్జగత్యా చాహతత్విషా ॥ 9

విద్రుమస్తంభైః= పగడాల స్తంభములతో, వైదూర్యఫలక-ఉత్తమైః = వైదూర్యములు పొదిగిన ఉత్తమమగు పలకలతో, ఇంద్రనీలమయైః= ఇంద్రనీలమాణిక్యములు పొదిగిన, కుడ్యైః= గోడలచే, అహతత్విషా= తిరస్కరించబడని కాంతి గల, జగత్యా చ= నేలచే కూడ, విష్టబ్ధమ్= నిలబెట్టబడిన (భవనమును ప్రవేశించెను).

ఆ భవనముయొక్క ఆధారస్తంభములపై పగడాలను, స్తంభములపై నుండే సెజ్జటకు వైదూర్యములను, గోడలకు ఇంద్రనీలములను పొదిగిరి. ఆ భవనములోని నేల కూడ సాటిలేని కాంతితో ప్రకాశించెను.

వితానైర్నిర్మితైస్త్వష్ట్రా ముక్తాదామవిలంబిభిః ।
దాంతైరాసనపర్యంకైర్మణ్యుత్తమపరిష్కృతైః ॥ 10

త్వష్ట్రా= విశ్వకర్మచే, నిర్మితైః= నిర్మించబడినట్టియు, ముక్తాదామ విలంబిభిః= ముత్యాల సరులు వ్రేలాడుట గల, వితానైః= మేలుకట్టులతో, దాంతైః= దంతములతో చేసినట్టియు, మణి- ఉత్తమపరిష్కృతైః= శ్రేష్ఠమైన మణులచే అలంకరించబడిన, ఆసనపర్యంకైః= ఆసనములతో శయ్యలతో (కూడిన భవనము).

ఆ భవనమునందు విశ్వకర్మ ముత్యాల సరులు వ్రేలాడే మేలుకట్టులను నిర్మించెను. దానియందు ఏనుగు దంతములతో చేసి శ్రేష్ఠమగు మణులచే అలంకరించబడిన ఆసనములు, శయ్యలు గలవు.

దాసీభిర్నిష్కకంఠీభిస్సువాసోభిరలంకృతమ్ ।
పుంభిస్సకంచుకోష్ణీషసువస్త్రమణికుండలైః ॥ 11

నిష్కకంఠీభిః= హారము మెడయందు కలిగినట్టియు, సువాసోభిః= మంచి వస్త్రములు గల, దాసీభిః= పరిచారికలతో, సకంచుక-ఉష్ణీషసువస్త్ర మణికుండలైః= చొక్కాతో కూడిన తలపాగ మంచి వస్త్రములు మణుల కుండలములు గల, పుంభిః= పురుషులతో (కూడిన భవనము).

ఆ భవనమునందలి పరిచారికలు మెడలో హారమును, మంచి వస్త్రములను ధరించిరి. పరిచారకులు చొక్కా, తలపాగ, మంచి వస్త్రములు, మణుల కుండలములను ధరించిరి.

రత్నప్రదీపనికరద్యుతిభిర్నిరస్త
ధ్వాంతం విచిత్రవలభీషు శిఖండినోంగ ।
నృత్యంతి యత్ర విహితాగురుధూపమన్నైః
నిర్యాంతమీక్ష్య ఘనబుద్ధయ ఉన్నదంతః ॥ 12

అంగ= ఓయీ! రత్నప్రదీపనికరద్యుతిభిః= రత్నముల దీపముల సమూహముల కాంతులచే, నిరస్తధ్వాంతమ్= పారద్రోలబడిన చీకట్లు గల (భవనమును ప్రవేశించెను), యత్ర= ఏ భవనమునందైతే, విచిత్రవలభీషు= రంగు రంగుల చంద్రశాలలయందు, శిఖండినః= నెమళ్లు, అక్షైః= కిటికీలగుండా, నిర్యాంతమ్= బయటకు వచ్చుచున్న, విహిత–అగరు ధూపమ్= ఏర్పాటు చేయబడిన అగరుబత్తుల పొగను, ఈక్ష్య= చూచి, ఘనబుద్ధయః= మేఘములనే భావన గలవియై, ఉన్నదంతః= బిగ్గరగా నాదము చేయుచున్న వై, నృత్యంతి= నాట్యమాడుచున్నవో.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ భవనమునందు రత్నదీపముల వరుసలు చీకట్లను పారద్రోలుచుండెను. కిటికీలయందు అగరుబత్తుల ధూపము–నేర్పాటు చేసిరి. బయటకు వచ్చే ఆ ధూపమును చూచి రంగు రంగుల చంద్రశాలలలోని నెమళ్లు మేఘములనే భావనతో బిగ్గరగా నాదము చేస్తూ నాట్యమాడుచుండెను.

తస్మిన్ సమానగుణరూపవయస్సువేష
దాసీసహస్రయుతయాఽనుసవం గృహిణ్యా ।
విప్రో దదర్శ చమరవ్యజనేన రుక్మ
దండేన సాత్వతపతిం పరివీజయంత్యా ॥ 13

విప్రః= నారదమహర్షి, తస్మిన్= ఆ భవనమునందు, అనుసవమ్= ఎల్ల వేళలా, సమానగుణరూపవయః– సువేషదాసీసహస్రయుతయా= సమానమైన గుణములు రూపము వయస్సు మంచి వస్త్రములు గల వేయి దాసీలతో కూడినట్టియు, రుక్మదండేన= బంగరు దండము గల, చమరవ్యజనేన= వింజామరతో, పరివీజయంత్యా= వీచుచున్న, గృహిణ్యా= భార్యతో కూడిన, సాత్వతపతిమ్= యాదవప్రభుడగు కృష్ణుని, దదర్శ= చూచెను.

ఆ భవనమునందు నారదమహర్షి బంగరు దండము గల వింజామరతో ఎల్లవేళలా వీచుచున్న భార్యతో గూడియున్న యాదవ ప్రభుడగు శ్రీకృష్ణుని చూచెను. ఆమె వద్ద తనతో సమానమైన రూపము, వయస్సు, మంచి వస్త్రములు గల దాసీలు వేయిమంది ఉండిరి.

తం సన్నిరీక్ష్య భగవాన్ సహసోత్థితశ్రీ
పర్యంకతస్సకలధర్మభృతాం వరిష్ఠః ।
ఆనమ్య పాదయుగలం శిరసా కిరీట
జుష్టేన సాంజలిరవీవిశదాసనే స్వే ॥ 14

సకలధర్మభృతామ్= ధర్మాత్ములందరిలో, వరిష్ఠః= శ్రేష్ఠుడైన, భగవాన్= శ్రీకృష్ణభగవానుడు, తమ్= ఆయనను, సన్నిరీక్ష్య= చూచి గుర్తుపట్టి, సహసా= వెంటనే, శ్రీపర్యంకతః= రుక్మిణీదేవియొక్క శయ్యనుండి, ఉత్థితః= లేచి నిలబడినవాడై, కిరీటజుష్టేన= కిరీటముచే అలంకరించ-బడిన, శిరసా= శిరస్సుతో, పాదయుగలమ్= పాదముల జంటను, ఆనమ్య= ప్రణమిల్లి, స-అంజలిః= దోసిలి యొగ్గినవాడై, స్వే= తన, ఆసనే= ఆసనమునందు, అవీవిశత్= కూర్చుండబెట్టెను.

ధర్మాత్ములందరిలో శ్రేష్ఠుడైన శ్రీకృష్ణభగవానుడు ఆ నారదుని చూచి గుర్తుపట్టి వెంటనే రుక్మిణీదేవి శయ్యనుండి లేచి నిలబడెను. ఆయన కిరీటముతో అలంకరించబడిన తలను వంచి ఆయన రెండు పాదములకు దోసిలి యొగ్గి నమస్కరించి తన ఆసనముపై కూర్చుండబెట్టెను.

తస్యావనిజ్య చరణౌ తదపస్స్పమూర్ధ్నా
బిభ్రజ్జగద్గురుతరోఽపి సతాం పతిర్హి।
బ్రహ్మణ్యదేవ ఇతి యద్గుణనామ యుక్తం
తస్యైవ యచ్చరణశౌచమశేషతీర్థమ్ ॥ 15

తస్య= ఆయనయొక్క, చరణౌ= కాళ్లను, అవనిజ్య= కడిగి, తద్–అపః= ఆ నీళ్లను, స్వమూర్ధ్నా= తన శిరస్సుచే, బిభ్రత్= ధరించువాడు, హి= ఏలయన, జగద్–గురుతరః అపి= జగత్తులో పూజనీయులలో శ్రేష్ఠుడైనప్పటికీ, సతామ్= సజ్జనులకు, పతిః= పాలకుడు, బ్రహ్మణ్యదేవః = బ్రాహ్మణులే దైవముగా గలవాడు, ఇతి= అనే, యత్= ఏ, గుణనామ= గుణము వలని పేరు, తస్య ఏవ= ఆయనకు మాత్రమే, యుక్తమ్= తగియున్నదో, యత్–చరణశౌచమ్= ఎవని పాదములను కడిగిన నీరు, అశేషతీర్థమ్= సర్వమును పావనము చేయునో.

శ్రీకృష్ణుడా నారదుని కాళ్లను కడిగి ఆ నీటిని తన శిరస్సుపై ధరించెను. ఎందుకంటే, ఆయన జగత్తులోని పూజనీయులలో ఉత్తముడే అయినా, సజ్జనులను పాలించేది. ఆయనయే. ఆయనకు మాత్రమే బ్రహ్మణ్యదేవుడు (బ్రాహ్మణుడు దైవముగా గలవాడు) అనేది సార్థక నామము. ఆయన పాదములనుండి పుట్టిన గంగ సర్వమును పావనము చేయును.

సంపూజ్య దేవఋషివర్యమృషిః పురాణో
నారాయణో నరసఖో విధినోదితేన ।
వాణ్యాఽభిభాష్య మితయాఽమృతమిష్టయా తం
ప్రాహ ప్రభో భగవతే కరవామ హే కిమ్ ॥ 16

పురాణః= పురాణపురుషుడు, నారాయణః= నారాయణుడనే, ఋషిః = మహర్షి, నరసఖుః= నరుని మిత్రుడు అగు శ్రీకృష్ణ భగవానుడు, దేవఋషి వర్యమ్= దేవర్షిశ్రేష్ఠుడగు నారదుని, ఉదితేన= శాస్త్రోక్తమైన, విధినా= విధానముచే, సంపూజ్య= చక్కగా పూజించి, మితయా= మితమైనట్టియు, అమృతమిష్టయా= అమృతము వలె మధురమైన, వాణ్యా= వాక్కుతో, అభిభాష్య= సంబోధించి, ప్రాహ= పలికెను, హే ప్రభో= ఓ ప్రభూ!,

భగవతే= పూజనీయుడవగు నీ కొరకు, కిమ్= దేనిని, కరవామ= చేసెదము?

పురాణపురుషుడగు శ్రీహరి నారాయణుడనే మహర్షిగా అవతరించి నరమహర్షికి సఖుడై ఇప్పుడు శ్రీకృష్ణుడై అవతరించెను. ఆయన దేవర్షి శ్రేష్ఠుడగు నారదుని శాస్త్రోక్తవిధానముచే చక్కగా పూజించెను. అప్పుడాయన మితమైన, అమృతమువలె మధురమైన వాక్కుతో సంబోధించి ఇట్లు పలికెను - ఓ ప్రభూ! పూజనీయుడవగు నీకు నేనేమి చేయవలెను?

నారద ఉవాచ ।

నైవాద్భుతం త్వయి విభోఽఖిలలోకనాథే
మైత్రీ జనేషు సకలేషు దమః ఖలానామ్ ।
నిశ్శ్రేయసాయ హి జగత్స్థితిరక్షణాభ్యాం
స్వైరావతార ఉరుగాయ విదామ సుష్ఠు ॥ 17

నారదః= నారద మహర్షి, ఉవాచ= పలికెను, విభో= ఓ ప్రభూ!, ఉరుగాయ= అధికముగా కీర్తించబడువాడా!, అఖిలలోకనాథే= సకలలోకములకు నాథుడవగు, త్వయి= నీయందు, సకలేషు= అందరు, జనేషు= జనులయందు, మైత్రీ= మైత్రి, ఖలానామ్= దుష్టుల, దమః= శిక్ష, అద్భుతమ్= విడ్డూరము, న ఏవ= కానే కాదు, హి= ఏలయనగా, స్వైర-అవతారః= స్వేచ్ఛచే అవతరించుట, జగత్స్థితి రక్షణాభ్యామ్= జగత్తుయొక్క మనుగడ రక్షణములతో బాటుగా, నిశ్శ్రేయసాయ= పరమకల్యాణము కొరకు అని, సుష్ఠు= బాగుగా, విదామ= ఎరుగుదుము.

నారద మహర్షి ఇట్లు పలికెను...ఓ ప్రభూ! నిన్ను భక్తులు అధికముగా కీర్తించెదరు. సకలలోకములకు నాథుడవగు నీవు సకలసజ్జనులయెడల మైత్రిని చూపి, దుష్టులను శిక్షించుట విడ్డూరము కానే కాదు. ఎందుకంటే, నీవు నీ ఇచ్ఛచే స్వీకరించిన ఈ అవతారమునకు ప్రయోజనములు

జగత్తుయొక్క మనుగడ, రక్షణ మాత్రమే గాక, సజ్జనులకు పరమ-కల్యాణమును కలిగించుట అని మేము బాగా యెరుగుదుము.

దృష్టం తవాంఘ్రియుగలం జనతాఽపవర్గం
బ్రహ్మాదిభిర్హృది విచింత్యమగాధబోధైః ।
సంసారకూపపతితోత్తరణావలంబం
ధ్యాయంశ్చరామ్యనుగృహాణ యథా స్మృతిస్స్యాత్ ॥18

జనతా-అపవర్గమ్= జనులకు విముక్తిని కలిగించునట్టియు, అగాధబోధైః= లోతైన జ్ఞానము గల, బ్రహ్మా-ఆదిభిః= బ్రహ్మదేవుడు మొదలగువారిచే, హృది= హృదయమునందు, విచింత్యమ్= ధ్యానించబడునట్టియు, సంసారకూపపతిత-ఉత్తరణ-అవలంబమ్= సంసారమనే నూతిలో పడినవారలకు పైకి వచ్చుటకై ఆలంబనమైన, తవ= నీ, అంఘ్రియుగలమ్= పాదముల జంట, దృష్టమ్= చూడబడినది, ధ్యాయన్= ధ్యానించువాడనై, చరామి= సంచరించెదను, యథా= ఏ విధముగానైతే, స్మృతిః= స్మృతి, స్యాత్= ఉండునో ఆ విధముగా, అనుగృహాణ= అనుగ్రహించుము.

సర్వజ్ఞులైన బ్రహ్మదేవుడు, ఇంద్రుడు మొదలగువారిచే హృదయమునందు ధ్యానించబడే నీ పాదముల జంట జనులకు విముక్తిని ఇచ్చును. సంసారమనే నూతిలో పడినవారు పైకి వచ్చుటకు ఆలంబనమయ్యే నీ పాదములను నేను కనుగొంటిని. నేను నీ పాదములనే ధ్యానిస్తూ సంచరించెదను. నాకు నీ స్మృతి ఉండేట్లు అనుగ్రహించుము.

తతోఽన్వదావిశద్దేహం కృష్ణపత్న్యాస్స నారదః ।
యోగేశ్వరేశ్వరస్యాంగ యోగమాయావివిత్సయా ॥ 19

అంగ= ఓయీ!, తతః= తరువాత, సః= ఆ, నారదః= నారదుడు, యోగ-ఈశ్వర-ఈశ్వరస్య= యోగేశ్వరులకు కూడ ప్రభుడగు శ్రీకృష్ణ

భగవానునియొక్క, యోగమాయావివిత్సయా= యోగమాయను తెలియాలనే కోరికతో, కృష్ణపత్న్యాః= శ్రీకృష్ణుని భార్యయొక్క, అన్యత్= మరియొక, గేహమ్= ఇంటిని, ఆవిశత్= ప్రవేశించెను.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత ఆ నారదుడు యోగేశ్వరులకు కూడ ప్రభుడగు శ్రీకృష్ణ భగవానుని యొగమాయను తెలియగోరి, శ్రీకృష్ణుని మరియొక భార్యయొక్క ఇంటిని ప్రవేశించెను.

దీవ్యంతమక్షైస్తత్రాపి ప్రియయా చోద్ధవేన చ ।
పూజితః పరయా భక్త్యా ప్రత్యుత్థానాసనాదిభిః ॥ 20

తత్ర అపి= అక్కడ కూడా, ప్రియయా= ప్రియురాలితో, ఉద్ధవేన చ= ఉద్ధవునితో కూడ, అక్షైః= పాచికలతో, దీవ్యంతమ్= జూదమాడుచున్న (శ్రీకృష్ణుని చూచెను), పరయా= అతిశయించిన, భక్త్యా= భక్తితో, ప్రతి-ఉత్థాన-ఆసన-ఆదిభిః= ఎదురేగుట ఆసనము మొదలగువాటిచే, పూజితః= పూజించబడినవాడు.

నారదునకు అక్కడ కూడ ప్రియురాలితో, ఉద్ధవునితో పాచికల జూదమునాడుచున్న శ్రీకృష్ణుడు కనబడెను. వారు అతిశయించిన భక్తితో ఆయనకు ఎదురేగి ఆసనము, అర్ఘ్యము మొదలగువాటినిచ్చి పూజించిరి.

పృష్టశ్చావిదుషేవాసౌ కదాఽఽయాతో భవానితి ।
క్రియతే కిం ను పూర్ణానామపూర్ణైరస్మదాదిభిః ॥ 21
అథాపి బ్రూహి నో బ్రహ్మన్ జన్మైతచ్ఛోభనం కురు ।

అవిదుషా ఇవ= తెలియనివానిచే వలె, అసౌ= ఈ నారదుడు, పృష్టః చ= ప్రశ్నించబడినవాడు కూడా, భవాన్= తమరు, కదా= ఎప్పుడు, ఆయాతః= వచ్చినవారు? పూర్ణానామ్= పూర్ణులగు తమకు, అపూర్ణైః= అపూర్ణులమగు, అస్మద్-ఆదిభిః= మావంటివారిచే, కిమ్= ఎయ్యది, క్రియతే

ను= చేయబడును? బ్రహ్మన్= ఓ మహర్షీ!, అథాపి= అయినప్పటికీ, బ్రూహి= చెప్పుడు, నః= మాయొక్క, ఏతత్= ఈ, జన్మ= పుట్టుకను, శోభనమ్= కల్యాణకరముగా, కురు= చేయుడు, ఇతి= అని.

శ్రీకృష్ణుడు తెలియనివాడు వలె ఈ నారదుని ఇట్లు ప్రశ్నించెను. తమరు ఎప్పుడు వచ్చితిరి? పూర్ణులు (విరక్తులు) అగు తమకు అపూర్ణుల-మగు నావంటివారితో పని యేమి ఉండును? ఓ మహర్షీ! అయినప్పటికీ మా వలన కాదగిన పనిని చెప్పుడు. తద్ద్వారా ఈ జన్మ కల్యాణకరమగునట్లు చేయుడు.

స తు విస్మిత ఉత్థాయ తూష్ణీమన్యదగాద్గృహమ్ ॥ 22

తత్రాప్యచష్ట గోవిందం లాలయంతం సుతాన్ శిశూన్ ।
తతోన్యస్మిన్ గృహేపశ్యన్మజ్జనాయ కృతోద్యమమ్ ॥ 23

సః తు= ఆ నారదుడైతే, విస్మితః= ఆశ్చర్యపడినవాడై, తూష్ణీమ్= మాటలాడకుండా, ఉత్థాయ= లేచి, అన్యత్= మరియొక, గృహమ్= భవమును గురించి, ఆగాత్= వెళ్లెను, తత్ర అపి= అక్కడ కూడ, శిశూన్= పిల్లలైన, సుతాన్= పుత్రులను, లాలయంతమ్= ముద్దాడుచున్న, గోవిందమ్= శ్రీకృష్ణుని, తతః= అక్కడనుండి, అన్యస్మిన్= మరియొక, గృహే= గృహమునందు, మజ్జనాయ= స్నానము కొరకు, కృత-ఉద్యమమ్= చేయబడిన ప్రయత్నము గలవానిని, అచష్ట= చూచెను.

ఆ నారదుడైతే మాటలాడకుండా లేచి మరియొక భవనమునకు వెళ్లెను. అక్కడ కూడ చిన్న పిల్లలైన పుత్రులను ముద్దాడుచున్న శ్రీకృష్ణుడు కనబడెను. అక్కడనుండి ఇంకో గృహమునకు వెళ్లగా, స్నానమునకు సంసిద్ధుడగుచున్న శ్రీకృష్ణుడు కనబడెను.

జుహ్వంతం చ వితానాగ్నీన్ యజంతం పంచభిర్మఖైః ।
భోజయంతం ద్విజాన్ క్వాపి భుంజానమవశేషితమ్ ॥ 24

వితాన-అగ్నీన్= యజ్ఞాగ్నులను, జుహ్వంతమ్= హోమము చేయుచున్నట్టియు, పంచభిః= అయిదు, మఖైః= యజ్ఞములతో, యజంతం చ= ఆరాధించుచున్నట్టియు, క్వ అపి= ఇంకొకచోట, ద్విజాన్= బ్రాహ్మణులను, భోజయంతమ్= భుజింపజేయుచున్నట్టియు, అవశేషితమ్= ప్రసాదమును, భుంజానమ్= భుజిస్తున్న (కృష్ణుని చూచెను).

ఆయన ఒక గృహములో ఆహవనీయము మొదలైన యజ్ఞాగ్నులను హోమము చేయుచుండెను. మరియొక గృహములో దేవపిత్రాది పంచ-యజ్ఞములతో దేవాదులను ఆరాధించుచుండెను. ఇంకో గృహములో బ్రాహ్మణసంతర్పణ చేయుచుండెను. మరో గృహములో బ్రాహ్మణ భోజనమైన పిదప తాను ప్రసాదమును భుజించుచుండెను.

క్వాపి సంధ్యాముపాసీనం జపంతం బ్రహ్మ వాగ్యతమ్ ।
ఏకత్ర చాసిచర్మభ్యాం చరంతమసివర్త్మసు ॥ 25

క్వ అపి= ఒక గృహమునందు, సంధ్యామ్= సంధ్యను, ఉపాసీనమ్= ఉపాసించుచున్నట్టియు, బ్రహ్మ= గాయత్రిని, జపంతమ్= జపించు-చున్నట్టియు, వాగ్-యతమ్= మౌనముగా నున్నట్టియు, ఏకత్ర చ= మరియొక గృహమునందైతే, అసిచర్మభ్యామ్= కత్తి డాలులతో, అసివర్త్మసు= కత్తి త్రిప్పుటలయందు, చరంతమ్= గెంతుచున్న (కృష్ణుని చూచెను).

ఆయన ఒక గృహములో సంధ్య వార్చుచుండెను. ఇంకో గృహములో గాయత్రిని జపించుచుండెను. మరో గృహములో మౌనియై ఉండెను. ఇంకొకచోట కత్తిని, డాలును పట్టి కత్తిని త్రిప్పుతూ గెంతుచుండెను.

అశ్వైర్గజై రథైః క్వాపి విచరంతం గదాగ్రజమ్ ।
క్వచిచ్ఛయానం పర్యంకేస్తూయమానం చ వందిభిః ॥ 26

క్వ అపి= ఒక గృహమునందు, అశ్వైః= గుర్రములతో, గజైః= ఏనుగులతో, రథైః= రథములతో, విచరంతమ్= వివిధముగా తిరుగు-చున్నట్టియు, క్వచిత్= ఒక గృహమునందు, పర్యంతే= శయ్యపై, శయానమ్= పరున్నట్టియు, వందిభిః= స్తోత్రపాఠకులచే, స్తూయమానం చ= స్తుతించబడుచున్న, గద-అగ్రజమ్= గదుని సోదరుని (చూచెను).

గదుని సోదరుడగు శ్రీకృష్ణుడు ఒకచోట గుర్రములను, ఇంకో చోట ఏనుగులను స్వారీ చేయుచుండెను. ఇంకో చోట రథముపై తిరుగుచుండెను. ఒక గృహములో ఆయన శయ్యపై పరుండెను. మరో గృహములో స్తోత్రపాఠకులాయనను స్తుతించుచుండిరి.

మంత్రయంతం చ కస్మింశ్చిన్మంత్రిభిశ్చోద్ధవాదిభిః ।
జలక్రీడారతం క్వాపి వారముఖ్యాబలావృతమ్ ॥ 27

కస్మింశ్చిత్ చ= ఒకానొక గృహమునందైతే, ఉద్ధవ-ఆదిభిః= ఉద్ధవుడు మొదలుగా గల, మంత్రిభిః= మంత్రులతో, మంత్రయంతమ్= సంప్రదించుచున్నట్టియు, క్వ అపి చ= మరియొక చోటనైతే, వారముఖ్య-అబలావృతమ్= వేశ్యలైన యువతులచే చుట్టువారబడినవాడై, జలక్రీడా-రతమ్= జలక్రీడయందు ప్రీతిగల (శ్రీకృష్ణుని చూచెను).

శ్రీకృష్ణుడు ఒక గృహమునందు ఉద్ధవుడు, సాత్యకి మొదలగు మంత్రులతో కలిసి సంప్రదించుచుండెను. ఇంకోచోట ఆయన వేశ్యా-యువతులు చుట్టువారియుండ జలక్రీడలాడుచుండెను.

కుత్రచిద్ద్విజముఖ్యేభ్యో దదతం గాస్సులంకృతాః ।
ఇతిహాసపురాణాని శృణ్వంతం మంగలాని చ ॥ 28

కుత్రచిత్= ఒకానొక చోట, సు-అలంకృతాః= చక్కగా అలంకరించ బడిన, గాః= గోవులను, ద్విజముఖ్యేభ్యః= శ్రేష్ఠ బ్రాహ్మణుల కొరకు,

దదతమ్= దానము చేయుచున్నట్టియు, మంగలాని= మంగళకరములగు, ఇతిహాసపురాణాని చ= ఇతిహాసములను పురాణములను కూడ, శృణ్వంతమ్= వినుచున్న (శ్రీకృష్ణుని చూచెను).

ఒక చోట శ్రీకృష్ణుడు గోవులను చక్కగా అలంకరించి శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు దానము చేయుచుండెను. ఇంకోచోట ఆయన మంగళ-కరములైన ఇతిహాసములను, పురాణములను వినుచుండెను.

హసంతం హాస్యకథయా కదాచిత్ప్రియయా గృహే ।
క్వాపి ధర్మం సేవమానమర్థకామౌ చ కుత్రచిత్ ॥ 29

కదాచిత్= ఒకానొకప్పుడు, గృహే= ఇంటియందు, ప్రియయా= ప్రియురాలితో గూడి, హాస్యకథయా= హాస్యప్రసంగముచే, హసంతమ్= నవ్వుచున్నట్టియు, క్వ అపి= ఒకచోట, ధర్మమ్= ధర్మమును, కుత్రచిత్= మరియొకచోట, అర్థకామౌ చ= అర్థకామములను కూడ, సేవమానమ్= సేవించుచున్న (శ్రీకృష్ణుని చూచెను).

శ్రీకృష్ణుడు ఒకప్పుడు ఒక భవనములో ప్రియురాలితో గూడి హాస్యప్రసంగము చేసి నవ్వుచుండెను. ఆయన ఒకచోట ధర్మమును, ఇంకో గృహములో (ధర్మసమ్మతములైన) అర్థకామములను సేవించుచుండెను.

ధ్యాయంతమేకమాసీనం పురుషం ప్రకృతేః పరమ్ ।
శుశ్రూషంతం గురూన్ క్వాపి కామైర్భోగైస్సపర్యయా ॥ 30

ఏకమ్= ఒంటరియై, ఆసీనమ్= కూర్చున్నట్టియు, ప్రకృతేః= ప్రకృతికి, పరమ్= అతీతుడైన, పురుషమ్= పరమాత్మను, ధ్యాయంతమ్= ధ్యానించుచున్నట్టియు, క్వ అపి= మరియొకచోట, గురూన్= పెద్దలను, కామైః= కోరబడే, భోగైః= భోగములతో, సపర్యయా= పరిచర్యతో, శుశ్రూషంతమ్= సేవ చేయుచున్న (శ్రీకృష్ణుని చూచెను).

ఒకచోట ఆయన ఏకాంతములో కూర్చుండి ప్రకృతికి అతీతుడగు పరమాత్మను ధ్యానించుచుండెను. మరియొకచోట ఆయన పెద్దలకు అభీష్టములైన భోగములనిచ్చి పరిచర్యలను చేస్తూ సేవ చేయుచుండెను.

కుర్వంతం విగ్రహం కైశ్చిత్సంధిం చాన్యత్ర కేశవమ్ ।
కుత్రాపి సహ రామేణ చింతయంతం సతాం శివమ్ ॥ 31

కైశ్చిత్= కొందరితో, విగ్రహమ్= కలహమును, అన్యత్ర చ= మరియొక చోట, సంధిం చ= సంధిని కూడ, కుర్వంతమ్= చేయుచున్నట్టియు, కుత్ర అపి= మరియొక చోట, రామేణ సహ= బలరామునితో గూడి, సతామ్= సత్పురుషులకు, శివమ్= యోగక్షేమమును, చింతయంతమ్= సంప్రదించుచున్న (శ్రీకృష్ణుని చూచెను).

శ్రీకృష్ణుడు ఒకచోట కొందరితో విభేదించుచూ, మరియొక చోట మరికొందరితో సంధిని చేయుచుండెను. ఇంకోచోట ఆయన బలరామునితో సత్పురుషుల యోగక్షేమముల గురించి సంప్రదించుచుండెను.

పుత్రాణాం దుహితౄణాం చ కాలే విధ్యుపయాపనమ్ ।
దారైర్వరైస్తత్సదృశైః కల్పయంతం విభూతిభిః ॥ 32

కాలే= సమయమునందు, పుత్రాణామ్= పుత్రులకు, తత్-సదృశైః = వారికి తగిన, దారైః= భార్యలతో, దుహితౄణాం చ= కుమార్తెలకు కూడ, వరైః= వరులతో, విధి-ఉపయాపనమ్= యథావిధిగా వివాహమును, విభూతిభిః= సంపదలతో, కల్పయంతమ్= ఏర్పాటు చేయుచున్న.

శ్రీకృష్ణుడు తగిన సమయములో పుత్రులకు వారికి తగ్గ భార్యలతో, కుమార్తెలకు కూడ వరులతో, యథావిధిగా వివాహమును వైభవోపేతముగా చేయుచుండెను.

ప్రస్థాపనోపానయనైరపత్యానాం మహోత్సవాన్ ।
వీక్ష్య యోగేశ్వరేశస్య యేషాం లోకా విసిస్మిరే ॥ 33

యోగ-ఈశ్వర-ఈశస్య= యోగేశ్వరులకు కూడ ప్రభుడైన శ్రీకృష్ణుని, యేషామ్= ఏ, అపత్యానామ్= సంతానములయొక్క, ప్రస్థాపన-ఉపానయనైః= పంపించుట తీసుకువచ్చుటలచే, మహా-ఉత్సవాన్= గొప్ప ఉత్సవములకు, వీక్ష్య= చూచి, లోకాః= జనులు, విసిస్మిరే= విస్మయమును చెందిరో.

యోగేశ్వరులగు సనకాదులు ప్రభుడగు శ్రీకృష్ణుడు తన పుత్రులను, పుత్రికలను పంపుట, తీసుకువచ్చుట అనే సందర్భములలో గొప్ప ఉత్సవములను చేయుచుండెను. వాటిని చూచి జనులు విస్మితులైరి.

యజంతం సకలాన్ దేవాన్ క్వాపి క్రతుభిరూర్జితైః ।
పూర్తయంతం క్వచిద్ధర్మం కూపారామమఠాదిభిః ॥ 34

క్వ అపి= ఒకానొకచోట, ఊర్జితైః= గొప్ప దక్షిణలు గల, క్రతుభిః = యజ్ఞములచే, సకలాన్ దేవాన్= సకలదేవతలను, యజంతమ్= పూజించుచున్నట్టియు, క్వచిత్= మరియొకచోట, కూప-ఆరామమఠ-ఆదిభిః= నూతులు సత్రములు మఠములు మొదలగువాటిచే, ధర్మం పూర్తయంతమ్= పూర్తధర్మమును అనుష్ఠించే (శ్రీకృష్ణుని చూచెను).

ఒకచోట ఆయన గొప్ప దక్షిణలు గల యజ్ఞములతో సకలదేవతల నారాధించుచుండెను. ఇంకోచోట ఆయన నూతులు, సత్రములు, మఠములు, ఆలయములు ఇత్యాది పూర్తధర్మముల ననుష్ఠించుచుండెను.

చరంతం మృగయాం క్వాపి హయమారుహ్య సైంధవమ్ ।
ఘ్నంతం తతః పశూన్మేధ్యాన్ పరీతం యదుపుంగవైః ॥ 35

క్వ అపి= ఒక చోట, సైంధవమ్= సింధు దేశమునందు పుట్టిన, హయమ్= గుర్రమును, ఆరుహ్య= ఎక్కి, యదుపుంగవైః= యాదవ శ్రేష్ఠులచే, పరీతమ్= చుట్టువారబడినవాడై, మృగయాం చరంతమ్= వేటాడుచున్నట్టియు, తతః= దానియందు, మేధ్యాన్= యోగ్యములగు, పశూన్= పశువులను, ఘ్నంతమ్= వధించుచున్న (శ్రీకృష్ణుని చూచెను).

ఒకచోట ఆయన యాదవ శ్రేష్ఠులు చుట్టువారి రాగా సింధుదేశీయ మగు గుర్రమునెక్కి వేటాడుతూ, దానిలో యోగ్యములైన పశువులను వధించెను.

అవ్యక్తలింగం ప్రకృతిష్వంతఃపురగృహాదిషు ।
క్వచిచ్చరంతం యోగేశం తత్తద్భావబుభుత్సయా ॥ 36

క్వచిత్= ఒకచోట, ప్రకృతిషు= అమాత్యులు మొదలగు వారి యందు, అంతఃపురగృహ-ఆదిషు= అంతఃపురములోని గృహములు మొదలగు వాటియందు, తత్-తద్-భావబుభుత్సయా= వారి వారి భావములను తెలియాలనే కోరికతో, అవ్యక్తలింగమ్= వ్యక్తము కాని చిహ్నములు కలిగినట్టియు, చరంతమ్= సంచరించే, యోగ-ఈశమ్= యోగేశ్వరుడగు -

యోగమాయను శాసించే శ్రీకృష్ణుడు ఒకచోట అమాత్యులు, సేనానాయకులు మొదలగు ప్రకృతులయందు, అంతఃపురములోని గృహములు ఇత్యాదులయందు జనుల ఆయా మనోభావములను అరయుటకై తన అసలు రూపము కనబడకుండా సంచరించుండగా నారదుడు కనుగొనెను.

అథోవాచ హృషీకేశం నారదః ప్రహసన్నివ ।
యోగమాయోదయం వీక్ష్య మానుషీమీయుషో గతిమ్ ॥ 37

అథ= తరువాత, మానుషీమ్= మానవులకు చెందిన, గతిమ్= దేహమును చేష్టను, ఈయుషః= పొందియున్న శ్రీకృష్ణుని, యోగమాయా-ఉదయమ్= యోగమాయయొక్క వైభవమును, వీక్ష్య= చూచి, నారదః= నారదుడు, ప్రహసన్ ఇవ= నవ్వుచున్నాడా యన్నట్లు, హృషీకేశమ్= శ్రీకృష్ణ భగవానుని ఉద్దేశించి, ఉవాచ= పలికెను.

మానవదేహమును పొంది మానవచేష్టలను చేయుచున్న ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుని యోగమాయయొక్కవైభవమును నారదుడు కళ్లారా చూచెను. తరువాత ఆయన నవ్వుతున్నాడా అన్నట్లు శ్రీకృష్ణునితో నిట్లనెను.

విదామ యోగమాయాస్తే దుర్దర్శా అపి మాయినామ్ ।
యోగేశ్వరాత్మన్ నిర్భాతా భవత్పాదనిషేవయా ॥ 38

యోగ-ఈశ్వర= సనకాది యోగులను పాలించువాడా!, మాయినాం అపి= మాయావులకు కూడ, దుర్దర్శాః= దర్శించ శక్యము కానట్టియు, భవత్-పాదనిషేవయా= నీ పాదములను సేవించుటచే, ఆత్మన్= హృదయమునందు, నిర్భాతాః= ప్రకాశించిన, తే= నీ, యోగమాయాః= యోగమాయలను, విదామ= తెలుసుకున్నాము.

ఓ యోగేశ్వరా! నీ యోగమాయలు మాయావులగు బ్రహ్మాదులకు కూడ దర్శించుట శక్యము కాదు. కాని, నీ పాదములను సేవించుటచే నాకు నీ యోగమాయలు హృదయములో ప్రకాశించి తెలిసినవి.

అనుజానీహి మాం దేవ లోకాంస్తే యశఽ ఉ సాప్లుతాన్ ।
పర్యటామి తవోద్గాయన్ లీలాం భువనపావనీమ్ ॥ 39

దేవ= ఓ దేవా!, తే= నీ, యశసా= కీర్తిచే, ఆప్లుతాన్= వ్యాపించ-బడిన, లోకాన్= లోకములను, భువనపావనీమ్= లోకములను పావనము చేసే, తవ= నీ, లీలామ్= లీలను, ఉద్గాయన్= గట్టిగా గానము

చేయుచున్నవాడనై, పర్యటామి= తిరిగెదను, అనుజానీహి= అనుమతించుము.

దేవా! నీ కీర్తి లోకములయందు వ్యాపించినది. లోకములను, పావనము చేసే నీ లీలను బిగ్గరగా కీర్తిస్తూ లోకములను పర్యటించటకు నాకు అనుజ్ఞనిమ్ము.

శ్రీభగవానువాచ ।

బ్రహ్మన్ ధర్మస్య వక్తాఽహం కర్తా తదనుమోదితా ।
తచ్ఛిక్షయల్లోకమిమమాస్థితః పుత్ర మా ఖిదః ॥ 40

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహర్షీ!, అహమ్= నేను, ధర్మస్య= ధర్మము యొక్క, వక్తా= చెప్పువాడను, కర్తా= చేయువాడను, తద్-అనుమోదితా= దానిని ప్రోత్సహించువాడను, ఇమమ్= ఈ, లోకమ్= లోకమును, శిక్షయన్= శిక్షణనిచ్చువాడనై, తత్= దానిని, ఆస్థితః= అనుష్ఠించువాడను, పుత్ర= ఓ పుత్రా!, మా ఖిదః= ఖేదమును పొందకుము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మహర్షీ! నేను ధర్మమును ఉపదేశించి, స్వయముగా ఆచరించి, ప్రోత్సహించెదను. ఈ మానవ లోకమునకు ఆ ధర్మములో శిక్షణనిచ్చుటకై నేను దానిని అనుష్ఠించుచున్నాను. ఓ పుత్రా! నా మాయ చే నీవు మోహపడవద్దు.

శ్రీశుక ఉవాచ ।

ఇత్యాచరంతం సద్ధర్మాన్ పావనాన్ గృహమేధినామ్ ।
తమేవ సర్వగేహేషు సంతమేకం దదర్శ హ ॥ 41

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, గృహమేధినామ్= గృహస్థులయొక్క, పావనాన్= పవిత్రము చేసే, సద్-ధర్మాన్= శాస్త్ర విహితకర్మలను, ఆచరంతమ్= అనుష్ఠించుచున్నట్టియు,

సర్వగేహేషు= సకలభవనముల యందు, సంతమ్= ఉన్న, ఏకం ఏవ= ఒక్కడే అయిన, తమ్= ఆ శ్రీకృష్ణుని, దదర్శ హ= చూచెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఈ విధముగా ఒకే శ్రీకృష్ణుడు ఒకే కాలములో సకలభవనములయందు ఉంటూ గృహస్థులు ఆచరించే పవిత్రమైన శాస్త్రోక్తకర్మలను చేస్తూండగా, నారదుడు చూచెను.

కృష్ణస్యానంతవీర్యస్య యోగమాయామహోదయమ్ ।
ముహుర్దృష్ట్వా ఋషిరభూద్విస్మితో జాతకౌతుకః ॥ 42

జాతకౌతుకః= పుట్టిన ఉత్కంఠ గల, ఋషిః= నారదమహర్షి, అనంతవీర్యస్య= అనంతశక్తి గల, కృష్ణస్య= శ్రీకృష్ణ భగవానుని, యోగమాయామహా-ఉదయమ్= యోగమాయయొక్క గొప్ప ప్రభావమును, ముహుః= పలుమార్లు, దృష్ట్వా= చూచి, విస్మితః= ఆశ్చర్యపడినవాడు, అభూత్= ఆయెను.

ఈ విధముగా ఉత్కంఠ కలిగిన నారద మహర్షి అనంతశక్తియగు శ్రీకృష్ణ భగవానుని యోగమాయయొక్క గొప్ప మహిమను పలుమార్లు చూచి ఆశ్చర్యపడెను.

ఇత్యర్థకామధర్మేషు కృష్ణేన శ్రద్ధితాత్మనా ।
సమ్యక్ సభాజితః ప్రీతస్తమేవానుస్మరన్ యయౌ ॥ 43

ఇతి= ఈ విధముగా, అర్థకామధర్మేషు= ధర్మార్థకామములయందు, శ్రద్ధిత-ఆత్మనా= శ్రద్ధతో కూడిన చిత్తము గల, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, సమ్యక్= బాగుగా, సభాజితః= సత్కరించబడినవాడై, ప్రీతః= ప్రీతి చెందిన నారదుడు, తం ఏవ= ఆయననే, అనుస్మరన్= స్మరించువాడై, యయౌ= వెళ్లెను.

ఈ తీరున ధర్మార్థకామములయందు శ్రద్ధ గల శ్రీకృష్ణుడు నారదుని బాగుగా సత్కరించెను. ఆయన ప్రీతిజెంది శ్రీకృష్ణుడినే స్మరిస్తూ వెళ్లెను.

ఏవం మనుష్యపదవీమనువర్తమానో
నారాయణోఽఖిలభవాయ గృహీతశక్తిః ।
రేమేంగ షోడశసహస్రవరాంగనానాం
సవ్రీడసౌహృదనిరీక్షణహాసజుష్టః ॥ 44

అంగ= ఓయీ!, ఏవమ్= ఈ విధముగా, మనుష్యపదవీమ్= మానవుల రీతిని, అనువర్తమానః= అనుకరించుచున్నవాడు, అఖిలభవాయ= సకలప్రాణుల అభ్యుదయము కొరకై, గృహీతశక్తిః= స్వీకరించబడిన మాయాశక్తి గలవాడు అగు, నారాయణః= నారాయణుడు, షోడశసహస్ర-వర-అంగనానామ్= పదునారు వేల గొప్ప యువతులయొక్క, సవ్రీడ-సౌహృదనిరీక్షణహాసజుష్టః= సిగ్గుతో కూడిన ప్రేమతో చూచుట నవ్వుటలచే సేవించబడినవాడై, రేమే= విహరించెను.

ఓ పరీక్షిన్మహారాజా! నారాయణుడీ విధముగా సకలప్రాణుల అభ్యుదయము కొరకై యోగమాయను స్వీకరించి మానవుల రీతిని అనుకరించుచుండెను. పదునారు వేల గొప్ప యువతులు సిగ్గుతో కూడిన ప్రేమతో చూస్తూ నవ్వుతూ సేవించగా, ఆయన విహరించెను.

యానీహ విశ్వవిలయోద్భవవృత్తిహేతుః
కర్మాణ్యనన్యవిషయాణి హరిశ్చకార ।
యస్త్వంగ గాయతి శృణోత్యనుమోదతే వా
భక్తిర్భవేద్భగవతి హ్యపవర్గమార్గే ॥ 45

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకోనసప్తతితమోఽధ్యాయః ॥

అంగ= ఓయీ!, విశ్వవిలయ-ఉద్భవవృత్తిహేతుఃహ= జగత్తుయొక్క ప్రళయము సృష్టి స్థితులకు కారణమైన, హరిఃహ= శ్రీకృష్ణ భగవానుడు, ఇహ= ఈ అవతారమునందు, అనన్యవిషయాణిహ= ఇతరులకు శక్యము కాని, యాని= ఏ, కర్మాణిహ= కర్మలను, చకార= చేసెనో వాటిని, యఃహ తు= ఏ మానవుడైతే, గాయతిహ= గానము చేయునో, శృణోతిహ= వినునో, వాహ= లేదా, అనుమోదతేహ= ప్రశంసించునో అట్టివానికి, హిహ= నిశ్చయముగా, అపవర్గమార్గేహ= మోక్షమును పొందించే, భగవతిహ= శ్రీకృష్ణ భగవానుని యందు, భక్తిఃహ= భక్తి, భవేత్హ= కలుగును.

ఓ పరీక్షిన్మహారాజా! ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు కారణము శ్రీహరి. ఆయన ఈ శ్రీకృష్ణావతారములో చేసిన లీలలు ఇతరులకు శక్యమైనవి కావు. వాటిని ఎవడైతే గానము చేయునో, లేదా వినునో, లేదా ప్రశంసించునో, అట్టివానికి భగవానునియందు మోక్షమునిచ్చే భక్తి కలుగును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో నారదుడు శ్రీకృష్ణుని గార్హస్థ్యమును దర్శించుటను వర్ణించే అరువది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (69).

* * *

అథ సప్తతితమోఽధ్యాయః

జరాసంధుని బందీలు శ్రీకృష్ణుని వద్దకు దూతను పంపుట

శ్రీశుక ఉవాచ ।

అథోషస్యుపవృత్తాయాం కుక్కుటాన్ కూజతోఽశపన్ ।
గృహీతకంఠ్యః పతిభిర్మాధవ్యో విరహాతురాః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అథ= తరువాత, ఉషసి= ప్రభాతవేళ, ఉపవృత్తాయామ్= సమీపించగా, పతిభిః= భర్తలగు శ్రీకృష్ణమూర్తులచే, గృహీతకంఠ్యః= కౌగిలించబడిన కంఠములు గలవారు, విరహ-ఆతురాః= విరహము వలని ఆదుర్దా గలవారు అగు, మాధవ్యః = శ్రీకృష్ణ భార్యలు, కూజతః= కూయుచున్న, కుక్కుటాన్= కోళ్లను, అశపన్= నిందించిరి.

శ్రీశుక మహర్షి పలికెను...తెల్లవారబోవుచుండగా శ్రీకృష్ణ మూర్తులచే కంటమునందు కౌగిలించబడిన శ్రీకృష్ణపత్నులు కూయుచున్న కోళ్లను నిందించిరి. వారు విరహము కలుగుచున్నదనే ఆదుర్దాను కలిగియుండిరి.

వయాంస్యరూరువన్ కృష్ణం బోధయంతీవ వందినః ।
గాయత్స్వలిష్వనిద్రాణి మందారవనవాయుభిః ॥ 2

మందారవనవాయుభిః= మందారవృక్షముల గాలుల నిమిత్తముగా, అలిషు= తుమ్మెదలు, గాయత్సు= గానము చేయుచుండగా, అనిద్రాణి= నిద్ర చెడిన, వయాంసి= పక్షులు, వందినః ఇవ= స్తోత్రపాఠకులు వలె, కృష్ణమ్= శ్రీకృష్ణుని, బోధయంతి ఇవ= నిద్ర లేపుచున్నవా యన్నట్లు, అరూరువన్= కూసినవి.

మందారవృక్షముల గాలి తగిలి తుమ్మెదలు గానము చేయుచుండ, పక్షులు నిద్ర చెడి శ్రీకృష్ణుని స్తోత్రపాఠకులు వలె నిద్ర లేపుచున్నవా యన్నట్లు కూసినవి.

ముహూర్తం తం తు వైదర్భీ నామృష్యదతిశోభనమ్ ।
పరిరంభణవిశ్లేషాత్ప్రియబాహ్వంతరం గతా ॥ 3

ప్రియబాహు-అంతరమ్= ప్రియుడగు శ్రీకృష్ణుని వక్షఃస్థలమును, గతా= చేరిన, వైదర్భీ తు= విదర్భరాజకుమారియైతే, పరిరంభణవిశ్లేషాత్= కౌగిలికి వియోగము నిమిత్తముగా, అతిశోభనమ్= మిక్కిలి సుందరమైన, తమ్= ఆ, ముహూర్తమ్= కాలమును, న అమృష్యత్= సహించలేదు.

ప్రియుడగు శ్రీకృష్ణుని వక్షఃస్థలమును కౌగిలించిన విదర్భరాజ కుమార్తెయగు రుక్మిణికి ఆ బ్రాహ్మముహూర్తము నచ్చలేదు. ఎందుకంటే, అప్పుడు కౌగిలికి వియోగము కలుగును.

బ్రాహ్మే ముహూర్తే ఉత్థాయ వార్యుపస్పృశ్య మాధవః ।
దధ్యౌ ప్రసన్నకరణ ఆత్మానం తమసః పరమ్ ॥ 4

మాధవః= శ్రీకృష్ణ భగవానుడు, బ్రాహ్మే ముహూర్తే= బ్రాహ్మ ముహూర్తమునందు, ఉత్థాయ= నిద్ర లేచి, వారి= నీటిని, ఉపస్పృశ్య= పాదములను కడుగుకొని ఆచమనము చేసి, ప్రసన్నకరణః= ప్రసన్నమైన ఇంద్రియములు గలవాడై, తమసః= ప్రకృతికి, పరమ్= అతీతమైన, ఆత్మానమ్= తన స్వరూపమును, దధ్యౌ= ధ్యానించెను.

శ్రీకృష్ణ భగవానుడు తెల్లవారు జామున లేచి నీటితో పాదములను కడుగుకొని ఆచమనము చేసి ప్రసన్నమగు ఇంద్రియములు గలవాడై ప్రకృతి (దేహేంద్రియములు) కి అతీతమైన ప్రత్యగాత్మను ధ్యానించెను.

ఏకం స్వయంజ్యోతిరనన్యమవ్యయం
స్వసంస్థయా నిత్యనిరస్తకల్మషమ్ ।
బ్రహ్మాఖ్యమస్యోద్భవనాశహేతుభిః
స్వశక్తిభిర్లక్షితభావనిర్వృతిమ్ ॥ 5

ఏకమ్= ఒక్కటియైనట్టియు, స్వయంజ్యోతిః= స్వయంప్రకాశమైనట్టియు, అనన్యమ్= తనకంటె భిన్నము కానట్టియు, అవ్యయమ్= వినాశము లేనట్టియు, స్వసంస్థయా= స్వరూపమునందుండుటచే, నిత్యనిరస్తకల్మషమ్= సర్వకాలములయందు నివృత్తమైన దోషములు కలిగినట్టియు, బ్రహ్మ-ఆఖ్యమ్= బ్రహ్మ అనే పేరు కలిగినట్టియు, అస్య= ఈ జగత్తుయొక్క, ఉద్భవనాశహేతుభిః= సృష్టిప్రళయములకు హేతువులైన, స్వశక్తిభిః= తన శక్తులచే, లక్షితభావనిర్వృతిమ్= సూచించబడిన సత్-చిత్-ఆనందమైన (ప్రత్యగాత్మను ధ్యానించెను).

ప్రత్యగాత్మకు బ్రహ్మ అనే పేరున్నా ధ్యాతకంటె వేరుగా లేదు. రెండవది లేని ఆత్మ వినాశము లేనిది. సాధకుని స్వరూపమైన ఆత్మయందు ఏ కాలమునందైననూ అవిద్యాదిదోషములు లేవు. ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు హేతువులైన సత్త్వరజస్తమోగుణాత్మకమైన మాయాశక్తిచే ఉపలక్షితమయ్యే ఆత్మ సచ్చిదానందఘనము.

అథాప్లుతోఽంభస్యమలే యథావిధి క్రియాకలాపం పరిధాయ వాససీ,
చకార సంధ్యోపగమాది సత్తమో హుతానలో బ్రహ్మ జజాప వాగ్యతః। 6

అథ= తరువాత, సత్తమః= శ్రీకృష్ణ భగవానుడు, అమలే= స్వచ్ఛమగు, అంభసి= నీటియందు, ఆప్లుత్య= స్నానము చేసి, వాససీ= జంట వస్త్రములను, పరిధాయ= ధరించి, సంధ్యా-ఉపగమ-ఆది= యథావిధి - యథావిధిగా, చకార= చేసెను, హుత-అనలః= హోమము చేయబడిన అగ్ని గలవాడై, వాగ్-యతః= మౌనియై, బ్రహ్మ= గాయత్రిని, జజాప= జపించెను.

తరువాత శ్రీకృష్ణ భగవానుడు స్వచ్ఛమగు నీటిలో స్నానము చేసి జంట వస్త్రములను ధరించి సంధ్యావందనము మొదలైన కర్మసమూహమును యథావిధిగా చేసి, అగ్నియందు హోమము చేసి, మౌనియై గాయత్రిని జపించెను.

ఉపస్థాయార్కముద్యంతం తర్పయిత్వాఽఽత్మనః కలాః ।
దేవానృషీన్ పితౄన్ వృద్ధాన్ విప్రానభ్యర్చ్య చాత్మవాన్ ॥ 7

ఆత్మవాన్= సావధానుడగు శ్రీకృష్ణుడు, ఉద్యంతమ్= ఉదయించుచున్న, అర్కమ్= సూర్యుని, ఉపస్థాయ= నిలబడి ప్రార్థించి, ఆత్మనః= తన, కలాః= అంశలైన, దేవాన్= దేవతలను, ఋషీన్= మహర్షులను, పితౄన్= పితరులను, తర్పయిత్వా= తర్పణములను చేసి, వృద్ధాన్= పెద్దలను, విప్రాన్= వేదవేత్తలను, అభ్యర్చ్య= పూజించి.

ఆయన సావధానుడై ఉదయిస్తున్న సూర్యుని యెదుట నిలబడి ప్రార్థించి, తన అంశలైన దేవతలకు, మహర్షులకు, పితృదేవతలకు తర్పణములనిచ్చి, పెద్దలను, వేదవేత్తలను పూజించెను.

ధేనూనాం రుక్మశృంగీణాం సాధ్వీనాం మౌక్తికస్రజామ్ ।
పయస్వినీనాం గృష్టీనాం సవత్సానాం సువాససామ్ ॥ 8

దదౌ రూప్యఖురాగ్రాణాం క్షౌమాజినతిలైస్సహ ।
అలంకృతేభ్యో విప్రేభ్యో బద్వం బద్వం దినే దినే ॥ 9

రుక్మశృంగీణామ్= బంగారము కొమ్ములయందు కలిగినట్టియు, సాధ్వీనామ్= మంచి స్వభావము కలిగినట్టియు, మౌక్తికస్రజామ్= ముత్యాల మాలలు కలిగినట్టియు, పయస్వినీనామ్= ఎక్కువ పాలనిచ్చునట్టియు, గృష్టీనామ్= మొదటి కాన్పు అయినట్టియు, సవత్సానామ్= దూడతో కూడినట్టియు, సువాససామ్= మంచి పస్త్రములు కలిగినట్టియు, రూప్యఖుర-అగ్రాణామ్= వెండి గిట్టల కొనలయందు గల, ధేనునామ్=

గోవుల, బద్వం బద్వమ్= మందను మందను చొప్పున, దినే దినే= ప్రతి దినమునందు, అలంకృతేభ్యః= అలంకరించబడిన, విప్రేభ్యః= వేదవేత్తల కొరకు, క్షౌమ-అజినతిలైః సహ= పట్టు వస్త్రములు కృష్ణమృగ చర్మము నువ్వులతో సహా, దదౌ= ఇచ్చెను.

ఆయన ప్రతిదినము వేదవేత్తలనలంకరించి వారికి మంద (సుమారు 13 వేలు) మొదటి కాన్పు గంగిగోవులను దూడలతో సహా ఇచ్చెను. ఎక్కువ పాలనిచ్చే ఆ గోవులకు కొమ్ములపై బంగారముతో, గిట్టల కొనలకు వెండితో తొడుగు వేయబడెను. వాటిపై మంచి వస్త్రములను కప్పి మొడలో ముత్యాల హారములు వేయబడెను. వీటికి తోడుగా ఆయన వారికి పట్టు వస్త్రములను, కృష్ణమృగచర్మలను, నువ్వులను కూడ యిచ్చెను.

గోవిప్రదేవతావృద్ధగురూన్ భూతాని సర్వశః ।
నమస్కృత్యాత్మసంభూతీర్మంగలాని సమస్పృశత్ ॥ 10

ఆత్మసంభూతీః= తన విభూతులైన, గోవిప్రదేవతావృద్ధగురూన్= గోవులను వేదవేత్తలను పెద్దలను తల్లిదండ్రులను, సర్వశః= సకలములైన, భూతాని= ప్రాణులను, నమస్కృత్య= నమస్కరించి, మంగలాని= మంగళద్రవ్యములను, సమస్పృశత్= స్పృశించెను.

ఆయన తన విభూతులే అయిన గోవులను, వేదవేత్తలను, పెద్దలను, తల్లిదండ్రులను నమస్కరించి, ఆవుపాలు మొదలైన మంగళ-ద్రవ్యములను స్పృశించెను.

ఆత్మానం భూషయామాస నరలోకవిభూషణమ్ ।
వాసోభిర్భూషణైస్స్వైస్వై ర్దివ్యస్రగనులేపనైః ॥ 11

నరలోకవిభూషణమ్= మానవలోకమునకు అలంకారమైన, ఆత్మానమ్= తనను, స్వైస్వైః= తనవైన, వాసోభిః= వస్త్రములతో, భూషణైః = అలంకారములతో, దివ్యస్రగ్-అనులేపనైః= ప్రకాశించే మాలలతో చందనాదులతో, భూషయామాస= అలంకరించుకొనెను.

శ్రీకృష్ణుడు తానే మానవలోకమునకు అలంకారము. ఆయన తనవైన (విలక్షణమైన) పీతాంబరములు, అలంకారములు, ప్రకాశించే మాలలు, చందనము మొదలైనవాటితో తనను తాను అలంకరించుకొనెను.

అవేక్ష్యాజ్యం తథాఽఽదర్శం గోవృషద్విజదేవతాః ।
కామాంశ్చ సర్వవర్ణానాం పౌరాంతఃపురచారిణామ్ ।
ప్రదాప్య ప్రకృతీః కామైః ప్రతోష్య ప్రత్యనందత ॥ 12

ఆజ్యమ్= నేతిని, తథా= అదే విధముగా, ఆదర్శమ్= అద్దమును, గోవృషద్విజదేవతాః= ఆవును ఎద్దును బ్రాహ్మణుని దేవతను, అవేక్ష్య= చూచి, పౌర-అంతఃపురచారిణామ్= నగరములోనున్నట్టియు అంతఃపురములో పని చేసే, సర్వవర్ణానామ్= అన్ని వర్ణముల వారికి, కామాన్ చ= కోరబడిన వస్తువులను కూడ, ప్రదాప్య= ఇప్పించి, ప్రకృతీః= అమాత్యులు మొదలగు రాజప్రకృతులను, ప్రతోష్య= సంతోష పెట్టి, ప్రత్యనందత= ఆనందించెను.

ఆయన కరిగిన నేతిలో మరియు అద్దములో ముఖము చూసుకొని, ఆవు, ఎద్దు, బ్రాహ్మణుడు, దేవత అనువాటిని మంగళము కొరకు చూచెను. ఆయన అంతఃపురములో పని చేయువారికి, పౌరులకు కూడ అన్ని వర్ణముల వారికి భోగ్యములగు వస్తువులనిప్పించి, అమాత్యులు మొదలైన రాజప్రకృతులను కూడ సంతోష పెట్టి తాను ఆనందించెను.

సంవిభజ్యాగ్రతో విప్రాన్ స్రక్తాంబూలానులేపనైః ।
సుహృదః ప్రకృతీర్దారానుపాయుంక్త తతస్స్వయమ్ ॥ 13

అగ్రతః= ముందుగా, విప్రాన్= వేదవేత్తలను, సుహృదః= మిత్రులను, ప్రకృతీః= అమాత్యులు మొదలైన రాజప్రకృతులను, దారాన్= భార్యలను, స్రక్-తాంబూల-అనులేపనైః= మాలలు తాంబూలము చందనము మొదలగువాటితో, సంవిభజ్య= ఇచ్చి, తతః= తరువాత, స్వయమ్= తాను, ఉపాయుంక్త= వినియోగించెను.

ఆయన మాలలు, తాంబూలము, చందనము మొదలైన వాటిని ముందుగా వేదవేత్తలకు, మిత్రులకు, అమాత్యులు మొదలైన రాజప్రకృతులకు, భార్యలకు ఇచ్చి, తరువాత తాను వినియోగించెను.

తావత్సూత ఉపానీయ స్యందనం పరమాద్భుతమ్ ।
సుగ్రీవాద్యైర్హయైర్యుక్తం ప్రణమ్యావస్థితోఽగ్రతః ॥ 14

తావత్= అంతలో, సూతః= రథసారథి, సుగ్రీవ-ఆద్యైః= సుగ్రీవము మొదలైన, హయైః= గుర్రములతో, యుక్తమ్= కూడిన, పరమ-అద్భుతమ్= మిక్కిలి అచ్చెరువును గొలిపే, స్యందనమ్= రథమును, అగ్రతః= ఎదురుగా, ఉపానీయ= దగ్గరకు తీసుకువచ్చి, ప్రణమ్య= నమస్కరించి, అవస్థితః = నిలబడినవాడు.

అంతలో రథసారథి సుగ్రీవము, మణిపుష్పకము మొదలైన గుర్రములతో కూడిన రథమును ఎదురుగా దగ్గరకు తీసుకువచ్చి నమస్కరించి నిలబడెను. ఆ రథము చాల అచ్చెరువు గొలుపుచుండును.

గృహీత్వా పాణినా పాణీ సారథేస్తమథారుహత్ ।
సాత్యుద్ధవసంయుక్తః పూర్వాద్రిమివ భాస్కరః ॥ 15

అథ= తరువాత, సాత్యకి-ఉద్ధవసంయుక్తః= సాత్యకి ఉద్ధవులతో కూడియున్న శ్రీకృష్ణుడు, సారథేః= సారథియొక్క, పాణీ= రెండు చేతులను, పాణినా= చేతితో, గృహీత్వా= పట్టుకొని, పూర్వ-అద్రిమ్= ఉదయ-పర్వతమును, భాస్కరః ఇవ= సూర్యుడు వలె, తమ్= ఆ రథమును, ఆరుహత్= ఎక్కెను.

తరువాత శ్రీకృష్ణుడు సారథి చేతులను చేతితో పట్టుకొని, తూర్పు పర్వతమును సూర్యుడు వలె, ఆ రథమునెక్కెను. సాత్యకి, ఉద్ధవులు ఆయన వెంట ఉండిరి.

ఈక్షితోఽంతఃపురస్త్రీణాం సవ్రీడప్రేమవీక్షితైః ।
కృచ్ఛ్రాద్విసృష్టో నిరగాజ్జాతహాసో హరన్మనః ॥ 16

అంతఃపురస్త్రీణామ్= అంతఃపురమునందలి యువతులయొక్క, సవ్రీడప్రేమవీక్షితైఃసిగ్గు ప్రేమలతో కూడిన చూపులచే, ఈక్షితఃచూడబడినవాడు, కృచ్ఛ్రాత్= కష్టముగా, విసృష్టఃవిడిచిపెట్టబడినవాడు, జాతహాసఃపుట్టిన నవ్వు గలవాడు అగు శ్రీకృష్ణుడు, మనఃమనస్సును, హరన్= హరించువాడై, నిరగాత్= వెళ్లెను.

అంతఃపురమునందలి యువతులు సిగ్గు ప్రేమలను కలబోసిన చూపులతో ఆయనను చూస్తూ విడిచిపెట్టకుండిరి. అయినా, ఆయన కష్టముతో వారిని విడిచి నవ్వుకుంటూ మనస్సును దోచి నిష్క్రమించెను.

సుధర్మాఖ్యాం సభాం సర్వైర్వృష్ణిభిః పరివారితః ।
ప్రావిశద్యన్నివిష్టానాం న సంత్యంగ షడూర్మయః ॥ 17

అంగ= ఓయీ!, సర్వైఃఅందరు, వృష్ణిభిఃయాదవులచే, పరివారితఃచుట్టువారబడియున్న శ్రీకృష్ణుడు, సుధర్మ-ఆఖ్యామ్= సుధర్మ అనే పేరు గల, సభామ్= సభను, ప్రావిశత్= ప్రవేశించెను, యత్-నివిష్టానామ్= దేనియందు కూర్చున్నవారలకు, షట్= ఆరు, ఊర్మయఃజీవితతరంగములు, న సంతి= ఉండవో.

ఓ పరీక్షిన్మహారాజా! యాదవులందరు చుట్టువారియుండ శ్రీకృష్ణుడు సుధర్మ అనే సభయందు ప్రవేశించెను. ఆ సభలో కూర్చున్న వారికి శరీరమును వృద్ధాప్య మరణములు, ప్రాణశక్తిని ఆకలి దప్పికలు, మనస్సును సుఖదుఃఖములు అనే ఆరు జీవనతరంగములు బాధించవు.

తత్రోపవిష్టఃపరమాసనే విభుర్బభౌ స్వభాసా కకుభోఽవభాసయన్,
వృతో నృసింహైర్యదుభి ర్యదూత్తమో యథోడురాజో దివి తారకాగణైః॥18

తత్ర= దానియందు, పరమ-ఆసనే= సింహాసనమునందు, ఉపవిష్టః= కూర్చున్న, విభుః= శ్రీకృష్ణ ప్రభుడు, స్వభాసా= తన కాంతిచే, కకుభః= దిక్కులను, అవభాసయన్= ప్రకాశింప జేయువాడై, బభౌ= ప్రకాశించెను, యదు-ఉత్తమః= యాదవశ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడు, నృసింహైః = పురుషశ్రేష్ఠులగు, యదుభిః= యాదవులచే, దివి= ద్యులోకమునందు, ఉడురాజః= చంద్రుడు, తారకాగణైః ఇవ= నక్షత్రముల గణములచేతను వలె, వృతః= చుట్టువారబడినవాడు.

ఆ సభలో శ్రీకృష్ణ ప్రభుడు సింహాసనముపై కూర్చుని తన కాంతిచే దిక్కులను ప్రకాశింపజేస్తూ ప్రకాశించెను. యాదవశ్రేష్ఠుడగు ఆయన పురుషశ్రేష్ఠులగు యాదవులచే, ద్యులోకమునందు చంద్రుడు నక్షత్ర-గణములచేతను వలె, చుట్టువారబడియుండెను.

తత్రోపమంత్రిణో రాజన్ నానాహాస్యరసై ర్విభుమ్ ।
ఉపతస్థు ర్నటాచార్యా నర్తక్యస్తాండవైః పృథక్ ॥ 19

రాజన్= ఓ రాజా!, తత్ర= అక్కడ, విభుమ్= శ్రీకృష్ణ ప్రభుని, ఉప మంత్రిణః= విదూషకులు, నానాహాస్యరసైః= పలువిధముల హాస్యవినోదములతో, నట-ఆచార్యాః= నాట్యాచార్యులు, నర్తక్యః= నాట్య భామలు, పృథక్= వేరుగా, తాండవైః= నాట్యములతో, ఉపతస్థుః= సేవించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ సభలో విదూషకులు పలువిధముల హాస్యవినోదములతో, నాట్యాచార్యులు మరియు నాట్యభామలు వేర్వేరుగా నాట్యములతో శ్రీకృష్ణ ప్రభుని సేవించిరి.

మృదంగవీణాముర జవేణుతాలదరస్వనైః ।
ననృతుర్జగుస్తుష్టువుశ్చ సూతమాగధవందినః ॥ 20

సూతమాగధవందినః= సూతులు మాగధులు వందులు, మృదంగ వీణాముర జవేణుతాలదరస్వనైః= మద్దెళ్లు వీణలు డోళ్లు పిల్లన గ్రోవులు

తాళములు శంఖముల ధ్వనులతో, ననృతుఃⴝ నాట్యమాడిరి, జగుఃⴝ పాడిరి, తుష్టువుఃⴝ చ స్తోత్రములను కూడ చేసిరి.

మద్దెళ్లు, వీణలు, డోళ్లు, పిల్లనగ్రోవులు, తాళములు మరియు శంఖముల ధ్వనులతో సూతులు, మాగధులు, వందులు పాడి, నాట్యమాడి, స్తోత్రములను కూడ చేసిరి.

తత్రాహుర్బ్రాహ్మణాః కేచిదాసీనా బ్రహ్మ వాదినః ।
పూర్వేషాం పుణ్యయశసాం రాజ్ఞాం చాకథయన్ కథాః ॥ 21

తత్రⴝ ఆ సభయందు, ఆసీనాఃⴝ కూర్చున్న, కేచిత్ⴝ కొందరు, వాదినఃⴝ పండితులగు, బ్రాహ్మణాఃⴝ బ్రాహ్మణులు, బ్రహ్మⴝ వేదమును, ఆహుఃⴝ వ్యాఖ్యానించిరి, పుణ్యయశసామ్ⴝ పవిత్రమగు కీర్తి గల, పూర్వేషామ్ⴝ పుర్వకాలమునందలి, రాజ్ఞమ్ⴝ రాజులయొక్క, కథాఃⴝ చ కథలను కూడ, అకథయన్ⴝ చెప్పిరి.

ఆ సభయందు కూర్చున్న కొందరు వ్యాఖ్యానకుశలురగు బ్రాహ్మణులు వేదమంత్రములను వ్యాఖ్యానించిరి. కొందరు పవిత్రమగు కీర్తి గల పూర్వమహారాజుల కథలను కూడ చెప్పిరి.

తత్రైకః పురుషో రాజన్నాగతోఽపూర్వదర్శనః ।
విజ్ఞాపితో భగవతే ప్రతీహారైః ప్రవేశితః ॥ 22

రాజన్ⴝ ఓ రాజా!, తత్రⴝ ఆ సభయందు, అపూర్వదర్శనఃⴝ ఇది వరలో చూడబడని, ఏకఃⴝ ఒక, పురుషఃⴝ వ్యక్తి, ఆగతఃⴝ వచ్చిన వాడు, ప్రతీహారైఃⴝ ద్వారపాలకులచే, భగవతేⴝ శ్రీకృష్ణ భగవానునికొరకు, విజ్ఞాపితఃⴝ విన్నవించబడినవాడు, ప్రవేశితఃⴝ ప్రవేశపెట్టబడిన వాడు.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ సభకు ఇదివరలో చూడబడని ఒక వ్యక్తి వచ్చెను. ద్వారపాలకులు ఆతనిని గురించి శ్రీకృష్ణ భగవానునకు విన్నవించి ప్రవేశపెట్టిరి.

స నమస్కృత్య కృష్ణాయ పరేశాయ కృతాంజలిః ।
రాజ్ఞామావేదయద్దుఃఖం జరాసంధనిరోధజమ్ ॥ 23

సః= ఆతడు, కృత-అంజలిః= దోసిలి యొగ్గినవాడై, పర-ఈశాయ= పరమేశ్వరుడగు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, నమస్కృత్య= నమస్కరించి, జరాసంధనిరోధజమ్= జరాసంధుడు బంధించుట వలన కలిగిన, రాజ్ఞామ్= రాజులయొక్క, దుఃఖమ్= దుఃఖమును గురించి, ఆవేదయత్= విన్నవించెను.

ఆతడు శ్రీకృష్ణ భగవానునకు చేతులు జోడించి నమస్కరించి, జరాసంధుడు బంధించుట వలన రాజులకు కలిగిన దుఃఖమును గురించి విన్నవించెను.

యే చ దిగ్విజయే తస్య సన్నతిం న యయుర్నృపాః ।
ప్రసహ్య రుద్ధాస్తేనాసన్నయుతే ద్వే గిరివ్రజే ॥ 24

తస్య= ఆ జరాసంధుని, దిగ్-విజయే= దిగ్విజయయాత్రయందు, యే= ఏ, నృపాః చ= రాజులైతే, సన్నతిమ్= వినమ్రతను, న యయుః = పొందలేదో, తేన= వానిచే, ప్రసహ్య= బలాత్కారముగా, గిరివ్రజే= గిరివ్రజమునందు, రుద్ధాః= బంధించబడిన రాజులు, ద్వే= రెండు, అయుతే= పది వేలు, ఆసన్= ఉండిరి.

జరాసంధుని దిగ్విజయయాత్రలో ఏ రాజులైతే తమ వినయమును ప్రకటించలేదో, వారిని ఇరవై వేలమందిని ఆతడు బలాత్కారముగా గిరివ్రజమునందు బంధించినాడు.

కృష్ణ కృష్ణాప్రమేయాత్మన్ ప్రపన్నభయభంజన ।
వయం త్వాం శరణం యామో భవభీతాః పృథగ్ధియః ॥ 25

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, అప్రమేయ-ఆత్మన్= ఇంద్రియములకు మనస్సునకు గోచరము కాని స్వరూపము గలవాడా!, ప్రపన్నభయభంజన= శరణు జొచ్చినవారి భయమును పారద్రోలువాడా!, భవభీతాః= సంసారము వలన భయపడినవారము, పృథగ్-ధియః= భేదబుద్ధి గలవారము అగు, వయమ్= మేము, త్వామ్= నిన్ను, శరణమ్= శరణును, యామః= పొందుచున్నాము.

ఓ శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! నీ స్వరూపము ఇంద్రియములకు, మనస్సునకు గోచరము కాదు. నీవు శరణు జొచ్చినవారి భయములను బాపెదవు. భేదబుద్ధి గల మేము సంసారమునకు భయపడి నిన్నే శరణు వేడినాము.

లోకో వికర్మనిరతః కుశలే ప్రమత్తః
కర్మణ్యయం త్వదుదితే భవదర్చనే స్వే ।
యస్తావదస్య బలవానిహ జీవితాశాం
సద్యశ్ఛినత్త్యనిమిషాయ నమోఽస్తు తస్మై ॥ 26

ఇహ= ఈ లోకమునందు, అయమ్= ఈ, లోకః= మానవుడు, వికర్మనిరతః= నిషిద్ధకర్మయందు ప్రీతి గలవాడు, త్వద్-ఉదితే= నీచే బోధించబడిన, భవద్-అర్చనే= నిన్ను అర్చించుట అనే, స్వే= తన ధర్మమైన, కుశలే= ఉద్ధరించే, కర్మణి= కర్మయందు, ప్రమత్తః= అసావధానుడు, తావత్= అంతలో, బలవాన్= బలవంతమైన, యః= ఏ కాలము, సద్యః = వెంటనే, అస్య= వీని, జీవిత-ఆశామ్= జీవించుననే ఆశను, ఛినత్తి= ఛేదించునో, తస్మై= అట్టి, అనిమిషాయ= నిత్యము సావధానము గానుండే కాలరూపుని కొరకు, నమః= నమస్కారము, అస్తు= అగుగాక!

ఈ లోకములో ఈ మానవుడు నిషిద్ధకర్మలపై ప్రీతి గలవాడై, నీవు బోధించిన నీ అర్చన అనే తనను ఉద్ధరించే ధర్మము విషయములో

అజాగ్రత్తగా నుండును. అంతలోనే బలవంతమైన కాలము వెంటనే వీని జీవితాశను వమ్ము చేయును. కాలమునకు అజాగ్రత్త లేదు. ఆ కాలము నీ రూపమే. నీకు నమస్కారమగుగాక!

లోకే భవాఞ్జగదినః కలయాఽవతీర్ణః
సద్రక్షణాయ ఖలనిగ్రహణాయ చాన్యః ।
కశ్చిత్త్వదీయమతియాతి నిదేశమీశ
కిం వా జనస్స్వకృతమృచ్ఛతి తన్న విద్మః ॥ 27

ఈశ= ఓ ఈశ్వరా!, జగద్-ఇనః= జగన్నాథుడవగు, భవాన్= నీవు, సద్-రక్షణాయ= సత్పురుషుల రక్షణ కొరకు, ఖలనిగ్రహణాయ చ= దుష్టులను శిక్షించుట కొరకు కూడ, లోకే= లోకమునందు, కలయా= అంశయగు బలరామునితో గూడి, అవతీర్ణః= అవతరించినవాడవు, కశ్చిత్= ఒకానొక, అన్యః చ= ఇతరుడైతే, త్వదీయమ్= నీదైన, నిదేశమ్= ఆదేశమును, కిం అతియాతి= ఉల్లంఘించుచున్నాడా?, వా= లేక, జనః= మానవుడు, స్వకృతమ్= తన ప్రారబ్ధమును, ఋచ్ఛతి= పొందుచున్నాడా?, తత్= ఆ విషయమును, న విద్మః= తెలియకున్నాము.

జగన్నాథుడవగు నీవు దుష్టులను శిక్షించి సత్పురుషులను రక్షించుటకై నీ అంశయగు బలరామునితో కూడి లోకమునం-దవతరించితివి కాని, మరియొక రాజు ఒకడు (జరాసంధుడు) నీ ఆదేశమునుల్లంఘించి మమ్ములను బంధించినాడా? లేక, మేము మా కర్మఫలముననుభవించుచున్నామా? ఈ సంగతి మాకు తెలియకున్నది.

స్వప్నాయితం నృపసుఖం పరతంత్రమీశ
శశ్వద్భయేన మృతకేన ధురం వహామః ।
హిత్వా తదాత్మని సుఖం త్వదనీహలభ్యం
క్లిశ్యామహేఽతికృపణాస్తవ మాయయేహ ॥ 28

ఈశ= ఓ ఈశ్వరా!, నృపసుఖమ్= రాజుల సుఖము, స్వప్నాయితమ్= స్వప్నమునందలి సుఖమును పోలినది, పరతంత్రమ్= పరాధీనమైనది, తవ= నీ, మాయయా= మాయచే, అతికృపణాః= మిక్కిలి దీనులమగు మేము, త్వత్= నీనుండి, అనీహలభ్యమ్= కామన లేనివారిచే పొందబడే, ఆత్మని= ఆత్మయందలి, సుఖమ్= సుఖము ఏది గలదో, తత్= దానిని, హిత్వా= విడిచిపెట్టి, శశ్వద్-భయేన= శాశ్వతమైన భయము గల, మృతకేన= మరణించినదానితో సమానమైన దేహముతో, ధురమ్= సంసారభారమును, వహామః= మోయుచున్నాము, ఇహ= ఈ లోకమునందు, క్లిశ్యామహే= కష్టపడుచున్నాము.

ఓ ఈశ్వరా! రాజ్యాధికారమునందలి సుఖము కల వంటిది, పరాధీనమైనది. ఆత్మానందము నిష్కాములచే నీనుండి పొందబడును. కాని, నీ మాయచే మోహితులమై మిక్కిలి దీనులమగు మేము దానిని విడిచి, నిత్యభయనిధానమగు శవమువంటి దేహముతో సంసార-భారమునుమోస్తూ ఈ లోకములో కష్టపడుచున్నాము.

తన్నో భవాన్ ప్రణతశోకహరాంఘ్రియుగ్మో
బద్ధాన్ వియుంక్ష్వ మగధాహ్వయ కర్మపాశాత్ ।
యో భూభుజోఽయుత మతంగజ వీర్యమేకో
బిభ్రద్ధురోధ భవనే మృగరాడివావీః ॥ 29

తత్= అందువలన, ప్రణతశోకహర-అంఘ్రియుగ్మః= ప్రణమిల్లిన వారి దుఃఖమును తొలగించే పాదముల జంట గల, భవాన్= నీవు, బద్ధాన్= బంధించబడిన, నః= మమ్ములను, మగధ- ఆహ్వాయకర్మ పాశాత్= మగధరాజు అనే పేరు గల కర్మబంధమునుండి, వియుంక్ష్వ= విడిపించుము, అయుతమతంగజవీర్యమ్= పది వేల ఏనుగల బలమును, బిభ్రత్= ధరించియున్న, యః= ఏ మగధరాజు, ఏకః= ఒక్కడే, భూభుజః

= రాజులను, భవనే= భవనమునందు, మృగరాట్= సింహము, అవీఃఇవ= గొర్రెలను వలె, రురోధ= బంధించెనో.

నీ పాదములకు ప్రణమిల్లినవారి దుఃఖములు దూరమగును. కావున, నీవు బంధించబడిన మమ్ములను మగధరాజనే పేరు గల కర్మబంధము నుండి విడిపించుము. పదివేల యేనుగుల బలము గల ఒక్క మగధరాజు రాజులను భవనమునందు, సింహము గొర్రెలను వలె, బంధించినాడు.

యో వై త్వయా ద్వినవకృత్వ ఉదాత్తచక్ర
భగ్నో మృధే ఖలు భవంతమనంతవీర్యమ్ ।
జిత్వా నృలోకనిరతం సకృదూఢదర్పో
యుష్మత్ప్రజా రుజతి నోఽజిత తద్విధేహి ॥ 30

ఉదాత్తచక్ర= సంసిద్ధముగానుండే సుదర్శనచక్రము గలవాడా!, అజిత= పరాజయము లేనివాడా!, ద్వినవకృత్వఃఁ= పద్దెనిమిది సార్లు, త్వయా= నీతో, మృధే= యుద్ధమునందు, యఃవై= ఏ జరాసంధుడైతే, భగ్నఃఁ= పరాజితుడైనాడో, అనంతవీర్యమ్= అనంతశక్తి కలిగినట్టియు, నృలోకనిరతమ్= మానవుల చేష్టను స్వీకరించిన, భవంతమ్= నిన్ను, సకృత్= ఒక్కసారి, జిత్వా= జయించి, ఊఢదర్పఃఁ= పొందబడిన గర్వము గలవాడై, యుష్మత్-ప్రజాఃఁ= నీ సంతానమైన, నఃఁ= మమ్ములను, రుజతి= పీడించుచున్నాడు, తత్= ఆ విషయమునందు, విధేహి= చేయుము.

ఓ శ్రీకృష్ణా! సంసిద్ధముగా నుండే సుదర్శనచక్రము గల నీకు పరాజయము లేదు. అనంతశక్తిమంతుడవగు నీవు జరాసంధుని యుద్ధములో పద్దెనిమిది సార్లు పరాజితుని చేసితివి. కాని, మానవుల చేష్టననుకరించే నిన్ను ఆతడు ఒక్కసారి జయించి గర్వమును పొంది నీ సంతానమగు మమ్ములను పీడించుచున్నాడు. ఆ విషయమై యోగ్యమగు చర్యను చేపట్టుము.

దూత ఉవాచ ।

ఇతి మాగధసంరుద్ధా భవద్దర్శనకాంక్షిణః ।
ప్రపన్నాః పాదమూలం తే దీనానాం శం విధీయతామ్ ॥ 31

దూతః= దూత, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, మాగధసంరుద్ధాః= మగధదేశరాజగు జరాసంధునిచే బంధించబడిన వారు, భవద్-దర్శనకాంక్షిణః= తమరి దర్శనమును కోరే, తే= ఆ రాజులు, పాదమూలమ్= పాదముల మూలమును, ప్రపన్నాః= శరణు జొచ్చినవారు, దీనానామ్= దీనులగు వారికి, శమ్= సుఖము, విధీయతామ్= చేయబడుగాక!

దూత ఇట్లు పలికెను...మగధదేశరాజగు జరాసంధునిచే బంధించ బడిన ఆ రాజులు దర్శనమును కోరి తమరి పాదముల మూలమును శరణు జొచ్చినారు. వారికి సుఖమును కలిగించుడు.

శ్రీశుక ఉవాచ ।

రాజదూతే బ్రువత్యేవం దేవర్షిః పరమద్యుతిః ।
బిభ్రత్పింగజటాభారం ప్రాదురాసీద్యథా రవిః ॥ 32

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజదూతే= రాజుల దూత, ఏవమ్= ఈ విధముగా, బ్రువతి= చెప్పుచుండగా, పరమద్యుతిః = గొప్ప కాంతి గలవాడు, పింగజటా-భారమ్= బంగరు వన్నెగల జటల ముడిని, బిభ్రత్= ధరించువాడు అగు, దేవ-ఋషిః= నారద మహర్షి, రవిః యథా= సూర్యుడు వలె, ప్రాదురాసీత్= ఆవిర్భవించెను.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను... రాజుల దూత ఈ విధముగా చెప్పుచుండగనే, నారదమహర్షి ఆవిర్భవించెను. ఆయన బంగరు వన్నె గల జటల ముడితో సూర్యుడు వలె గొప్పగా ప్రకాశించెను.

తం దృష్ట్వా భగవాన్ కృష్ణస్సర్వలోకేశ్వరేశ్వరః ।
ప్రవవంద ఉత్థితశ్శీర్ష్ణా ససభ్యస్సానుగో ముదా ॥ 33

సర్వలోక-ఈశ్వర-ఈశ్వరః= సకలలోకముల పాలకులకు కూడ ప్రభుడైన, భగవాన్ కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, తమ్= ఆ నారదుని, దృష్ట్వా= చూచి, ముదా= ఆనందముతో, ససభ్యః= సభాసదులతో కూడినవాడై, స-అనుగః= అనుచరులతో కూడినవాడై, ఉత్థితః= లేచి నిలబడినవాడై, శీర్ష్ణా= శిరస్సుతో, ववంద= నమస్కరించెను.

సకలలోకపాలకులకు పాలకుడైన శ్రీకృష్ణ భగవానుడా నారదుని చూచి, సభ్యులతో మరియు అనుచరులతో బాటుగా ఆనందముతో లేచి నిలబడి తల వంచి నమస్కరించెను.

సభాజయిత్వా విధివత్కృతాసనపరిగ్రహమ్ ।
బభాషే సూనృతైర్వాక్యై శ్రద్ధయా తర్పయన్మునిమ్ ॥ 34

కృత-ఆసనపరిగ్రహమ్= చేయబడిన ఆసనముయొక్క స్వీకారము గల, మునిమ్= నారద మహర్షిని, శ్రద్ధయా= శ్రద్ధతో, విధివత్= యథా విధిగా, సభాజయిత్వా= పూజించి, సూనృతైః= మధురములైన, వాక్యైః = వాక్యములతో, తర్పయన్= ప్రీతి కలిగించువాడై, బభాషే= పలికెను.

మహర్షి ఆసనమును స్వీకరించిన పిదప, శ్రీకృష్ణుడు శ్రద్ధతో యథావిధిగా పూజించి, మధురములైన మాటలతో ప్రీతిని కలిగిస్తూ ఇట్లు పలికెను.

అపి స్విదద్య లోకానాం త్రయాణామకుతోభయమ్ ।
నను భూయాన్ భగవతో లోకాన్ పర్యటతో గుణః ॥ 35

అద్య= ఇప్పుడు, త్రయాణామ్= మూడు, లోకానామ్= లోకములకు, అకుతఃభయమ్= దేనివలనైననూ భయము లేకుండుట, అపి స్విత్= ఉన్నదా?, లోకాన్= లోకములను, పర్యటతః= పర్యటించే, భగవతః= పూజనీయులైన తమరి వలన, భూయాన్= ఎక్కువ, గుణః నను= లాభము గదా!

ఇప్పుడు ముల్లోకములు అభయముగానున్నవా? లోకములను పర్యటించే తమరి వలన చాల లాభము (సంగతి తెలియుట) కలదు సుండీ!

న హి తేఽవిదితం కించిల్లోకేష్వీశ్వరకర్తృషు ।
అథ పృచ్ఛామహే యుష్మాన్ పాండవానాం చికీర్షితమ్ ॥ 36

హి= ఏలయన, ఈశ్వరకర్తృషు= ఈశ్వరుడు కర్తగా గల, లోకేషు= లోకములయందు, తే= నీకు, అవిదితమ్= తెలియబడనిది, కించిత్= ఏదీ, న= లేదు, అథ= కాబట్టి, పాండవానామ్= పాండవులయొక్క, చికీర్షితమ్= చేయగోరినదానిని గురించి, యుష్మాన్= మిమ్ములను, పృచ్ఛామహే= ప్రశ్నించుచున్నాము.

ఎందుకంటే, ఈశ్వరునిచే రచించబడిన ఈ ముల్లోకములలో మీకు తెలియనిది ఏదీ లేదు. కాబట్టి, పాండవులు ఏమి చేయగోరు చున్నారు? అని మేము తమరిని ప్రశ్నించుచున్నాము.

శ్రీనారద ఉవాచ ।

దృష్టా మయా తే బహుశో దురత్యయా
మాయా విభో విశ్వసృజశ్చ మాయినః ।
భూతేషు భూమంశ్చరత స్స్వశక్తిభిః
వహ్నేరివ చ్ఛన్నరుచో న మేఽద్భుతమ్ ॥ 37

శ్రీనారదః= శ్రీనారద మహర్షి, ఉవాచ= పలికెను, విభో= ఓ ప్రభూ!, విశ్వసృజః చ= జగత్తును సృష్టించిన బ్రహ్మకు కూడ, మాయినః= మోహపెట్టునట్టియు, భూతేషు= ప్రాణులయందు, చరతః= వ్యాపించి యున్నట్టియు, స్వశక్తిభిః= నీ శక్తులైన సత్త్వాదిగుణములచే, ఛన్నరుచః = కప్పివేయబడిన ప్రకాశము గల, వహ్నేః ఇవ= అగ్నివంటి, తే= నీయొక్క, దురత్యయా= అతిక్రమించ శక్యము కాని, మాయా= మాయ, మయా=

నాచే, బహుశః= పలుమార్లు, దృష్టా= చూడబడినది, మే= నాకు, అద్భుతమ్= వింత, న= కాదు.

శ్రీనారద మహర్షి ఇట్లు పలికెను...ఓ ప్రభూ! నీ మాయ జగత్తును సృష్టించిన బ్రహ్మదేవుని కూడ మోహపెట్టును. నీవు ప్రాణులలో వ్యాపించి యున్ననూ నీ శక్తులగు సత్త్వరజస్తమోగుణములు, బూడిద నిప్పును వలె, నీ ప్రకాశమును కప్పివేయును. నీ మాయను అతిక్రమించుట శక్యము కాదు. అట్టి నీ మాయను నేను పలుమార్లు చూచితిని. కావున, నాకు నీ ప్రశ్నలు వింత కాదు.

తవేహితం కోఽర్హతి సాధు వేదితుం ।
స్వమాయయేదం సృజతో నియచ్ఛతః ।
యద్విద్యమానాత్మతయాఽవభాసతే
తస్మై నమస్తే స్వవిలక్షణాత్మనే ॥ 38

స్వమాయయా= నీ మాయాశక్తిచే, ఇదమ్= ఈ జగత్తును, సృజతః = సృష్టించునట్టియు, నియచ్ఛతః= ఉపసంహరించే, తవ= నీ, ఈహితమ్= చేష్టను, సాధు= బాగుగా, వేదితుమ్= తెలియుటకు, కః= ఎవడు, అర్హతి= తగును?, యత్= ఏ జగత్తు, విద్యమాన-ఆత్మతయా= ఉంటూ ఉండుట స్వరూపము గలదిగా, అవభాసతే= ప్రకాశించుచున్నదో, స్వవిలక్షణ-ఆత్మనే= విలక్షణమైన స్వరూపము గల, తస్మై= అట్టి, తే= నీ కొరకు, నమః= నమస్కారము.

నీవు నీ మాయాశక్తిచే ఈ జగత్తును సృష్టించి ఉపసంహరించెదవు. నీ చేష్టను బాగుగా ఎవడు తెలియదగును? ఈ జగత్తు మిథ్యయే అయిననూ, యథార్థమా యన్నట్లు ప్రకాశించుచున్నది. కాని, నీ స్వరూపము కనబడే ఈ జగత్తుకంటె విలక్షణమైనది. అట్టి నీ కొరకు నమస్కారము.

జీవస్య యస్సంసరతో విమోక్షణం న జానతోఽనర్థవహాచ్ఛరీరతః,
లీలాఽవతారై స్స్వయశః ప్రదీపకం ప్రాజ్వాలయత్త్వా తమహం ప్రపద్యే।39

అనర్థవహాత్= ఆపదలను మోసుకువచ్చే, శరీరతః= శరీరముల నుండి, విమోక్షణమ్= విముక్తిని, న జానతః= తెలియనట్టియు, సంసరతః = సంసారములో పడి ఉన్న, జీవస్య= జీవునకు, యః= ఏ నీవు, లీలా-అవతారైః= లీల కొరకైన అవతారములచే, స్వయశఃప్రదీపకమ్= నీ కీర్తి అనే దీపమును, ప్రాజ్వాలయత్= వెలిగించినావో, తమ్= అట్టి, త్వామ్= నిన్ను, అహమ్= నేను, ప్రపద్యే= శరణు వేడుచున్నాను.

జీవుడు స్థూలసూక్ష్మశరీరములతో తాదాత్మ్యము వలన సంసారములో పడి దుఃఖములననుభవిస్తూ విముక్తిని పొందే ఉపాయమును తెలియ కున్నాడు. నీవు లీల కొరకై అవతారములనెత్తి, అట్టి జీవునికొరకు నీ కీర్తి అనే దీపమును వెలిగించినావు. అట్టి నిన్ను నేను శరణు వేడుచున్నాను.

అథాప్యాశ్రావయే బ్రహ్మ నరలోకవిడంబనమ్ ।
రాజ్ఞః పైతృష్వసేయస్య భక్తస్య చ చికీర్షితమ్ ॥ 40

అథాపి= అయినప్పటికీ, నరలోకవిడంబనమ్= మానవలోకమును అనుకరించుచున్న, బ్రహ్మ= పరబ్రహ్మవగు నిన్ను గురించి, పైతృష్వ-సేయస్య= తండ్రి సోదరి కుమారుడైనట్టియు, భక్తస్య చ= భక్తుడు కూడ అయిన, రాజ్ఞః= ధర్మరాజుయొక్క, చికీర్షితమ్= చేయగోరినదానిని, ఆశ్రావయే= వినిపించెదను.

పరబ్రహ్మవగు నీకు తెలియనిదేదీ లేనప్పటికీ, మానవజీవితము ననుకరిస్తున్న నీకు ధర్మరాజు చేయగోరినదానిని గురించి వినిపించెదను. ఆయన నీ తండ్రి సోదరి పుత్రుడు మాత్రమే మాత్రమే గాక, భక్తుడు కూడా.

యక్ష్యతి త్వాం మఖేంద్రేణ రాజసూయేన పాండవః ।
పారమేష్ఠ్యకామో నృపతి స్తద్భవాననుమోదతామ్ ॥ 41

పాండవః= పాండుపుత్రుడగు, నృపతిః= ధర్మరాజు, పారమేష్ఠ్య-కామః= బ్రహ్మపదమును (సర్వుల ప్రశంసను) కోరువాడై, త్వామ్= నిన్ను, మఖ-ఇంద్రేణ= యజ్ఞములలో శ్రేష్ఠమైన, రాజసూయేన= రాజసూయముతో, యక్ష్యతి= ఆరాధించగలడు, తత్= దానిని, భవాన్= నీవు, అనుమోదతామ్= అనుమోదించెదవు గాక!

పాండుపుత్రుడగు ధర్మరాజు బ్రహ్మపదము (సామ్రాజ్యము, సర్వుల ప్రశంస) ను కోరి నిన్ను యజ్ఞములలో శ్రేష్ఠమైన రాజసూయముతో ఆరాధించగలడు. ఆయన ఆకాంక్షను తమరు అనుమోదించుడు.

తస్మిన్ దేవ క్రతువరే భవంతం వై సురాదయః ।
దిదృక్షవస్సమేష్యంతి రాజానశ్చ యశస్వినః ॥ 42

దేవ= ఓ దేవా!, తస్మిన్= ఆ, క్రతువరే= గొప్ప యజ్ఞామునందు, భవంతమ్= నిన్ను, దిదృక్షవః= చూడగోరువారై, సుర-ఆదయః= దేవతలు మొదలగువారు, యశస్వినః= కీర్తిమంతులగు, రాజానః చ= రాజులు కూడ, వై= నిశ్చయముగా, సమేష్యంతి= విచ్చేయగలరు.

ఓ దేవా! నిన్ను చూడగోరి దేవతలు, సిద్ధులు మొదలగువారు, కీర్తిమంతులగు రాజులు కూడ నిశ్చయముగా ఆ యజ్ఞమునకు విచ్చేయగలరు.

శ్రవణాత్కీర్తనాద్ధ్యానా త్పూయంతేఽంతేవసాయినః ।
తవ బ్రహ్మమయస్యేశ కిముతేక్షాఽభిమర్శినః ॥ 43

బ్రహ్మమయస్య= పరబ్రహ్మరూపుడవగు, తవ= నీయొక్క, శ్రవణాత్= శ్రవణము వలన, కీర్తనాత్= కీర్తించుట వలన, ధ్యానాత్=

ధ్యానించుట వలన, అంతేవసాయినః= పతితులు కూడ, పూయంతే= పవిత్రులగుదురు, ఈశ= ఓ ఈశ్వరా!, ఈక్షా= అభిమర్శినః= చూచుట స్పృశించుట గలవారు, కిం ఉత= వేరుగా చెప్పవలయునా?

ఓ ఈశ్వరా! నీవు పరబ్రహ్మస్వరూపుడవు. నీ కీర్తిని విని, కీర్తించి, ధ్యానించి పతితులు కూడ పవిత్రులగుదురు. నిన్ను చూచి, స్పృశించు వారు పవిత్రులగుదురని వేరుగా చెప్పవలయునా?

యస్యామలం దివి యశః ప్రథితం రసాయాం
భూమౌ చ తే భువనమంగల దిగ్వితానమ్ ।
మందాకినీతి దివి భోగవతీతి చాధో
గంగేతి చేహ చరణాంబు పునాతి విశ్వమ్ ॥ 44

భువనమంగల= లోకములకు మంగళములను చేయువాడా!, యస్య= ఏ, తే= నీయొక్క, అమలమ్= స్వచ్ఛమైన, యశః= కీర్తి, దివి= స్వర్గమునందు, రసాయామ్= పాతాళమునందు, భూమౌ చ= భూమి యందు కూడ, దిగ్-వితానమ్= దిక్కులకు మేలుకట్టుయై, ప్రథితమ్= వినుతికెక్కినదియో, చరణ-అంబు= పాదముల జలము, దివి= స్వర్గమునందు, మందాకినీ= మందాకిని, ఇతి= అని, అధః చ= పాతాళమునందు కూడ, భోగవతీ= భోగవతి, ఇతి= అని, ఇహ చ= ఈ లోకమునందు కూడ, గంగా= గంగ, ఇతి= అని, విశ్వమ్= జగత్తును, పునాతి= పవిత్రము చేయుచున్నదో.

లోకములకు మంగళములనిచ్చే ఓ దేవా! నీ స్వచ్ఛమగు కీర్తి దిక్కులకు మేలుకట్టు వలె వ్యాపించి, స్వర్గపాతాళభూలోకములయందు వినుతికెక్కినది. నీ పాదములనుండి పుట్టిన నీరు స్వర్గమునందు మందాకిని, పాతాళమునందు భోగవతి, ఈ భూలోకమునందు గంగ అనే రూపములతో జగత్తును పావనము చేయుచున్నది.

శ్రీశుక ఉవాచ ।

తత్ర తేష్వాత్మపక్షే ష్వగృహ్ణత్సు విజిగీషయా ।
వాచఃపేశై స్స్మయన్ భృత్యముద్ధవం ప్రాహ కేశవః ॥ 45

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, తత్ర= ఆ సభయందు, తేషు= ఆ, ఆత్మపక్షేషు= తనవారైన యాదవులు, విజిగీషయా= జయించే కోరికతో, అగృహ్ణత్సు= స్వీకరించని వారు కాగా, స్మయన్= నవ్వుచున్న, కేశవః= శ్రీకృష్ణ భగవానుడు, వాచఃపేశైః= మధురమగు వచనములతో, భృత్యమ్= భక్తుడగు, ఉద్ధవమ్= ఉద్ధవుని ఉద్దేశించి, ప్రాహ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...జరాసంధుని జయించగోరే స్వపక్షీయులగు యాదవులు ఆ సభలో శ్రీకృష్ణుడు యజ్ఞమునకు వెళ్లుటను అంగీకరించలేదు. అపుడు శ్రీకృష్ణ భగవానుడు నవ్వుతూ మధుర వచనములతో భక్తుడగు ఉద్ధవునితో నిట్లనెను.

శ్రీభగవానువాచ ।

త్వం హి నః పరమం చక్షుస్సుహృన్మంత్రార్థతత్త్వవిత్ ।
తథాఽత్ర బ్రూహ్యనుష్ఠేయం శ్రద్ధధ్మః కరవామ తత్ ॥ 46

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, త్వమ్= నీవు, హి= నిశ్చయముగా, నః= మాకు, పరమమ్= గొప్ప, చక్షుః= చూపు, సుహృత్= హితకారివి, తథా= మరియు, మంత్ర– అర్థతత్త్వవిత్= రాజనీతియొక్క సాధ్యములయొక్క తత్త్వము తెలిసిన వాడవు, అత్ర= ఈ విషయమునందు, అనుష్ఠేయమ్= కర్తవ్యమును, బ్రూహి= చెప్పుము, శ్రద్ధధ్మః= శ్రద్ధను చూపెదము, తత్= దానిని, కరవామ= చేసెదముగాక!

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...నీవు నిశ్చయముగా మాకు గొప్ప చూపు (జ్ఞాననేత్రము). నీవు హితకారివి. రాజనీతి, దానిచే సాధించదగిన

లక్ష్యములు అనువాటి తత్త్వము నీకు తెలియును. ఈ విషయములో మా కర్తవ్యమును గురించి చెప్పుము. మేము శ్రద్ధతో దానిని చేసెదము.

ఇత్యుపామంత్రితో భర్త్రా సర్వజ్ఞేనాపి ముగ్ధవత్ ।
నిదేశం శిరసాఽఽధాయ ఉద్ధవః ప్రత్యభాషత ॥ 47

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే సప్తతితమోఽధ్యాయః ॥

ఇతి= ఈ విధముగా, సర్వజ్ఞేన అపి= సర్వము తెలిసినవాడే అయినా, ముగ్ధవత్= తెలియనివానిచే వలె, భర్త్రా= ప్రభువుచే, ఉపా-మంత్రితః= అడుగబడిన, ఉద్ధవః= ఉద్ధవుడు, నిదేశమ్= ఆదేశమును, శిరసా= శిరస్సుతో, ఆదాయ= స్వీకరించి, ప్రత్యభాషత= బదులిడెను.

శ్రీకృష్ణ ప్రభుడు సర్వము తెలిసినవాడే అయినా తెలియనివాడు వలె ఈ విధముగా అడిగెను. ఉద్ధవుడు ఆయన ఆదేశమును తల వంచి స్వీకరించి ఇట్లు బదులు చెప్పెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో జరాసంధుని బందీలు శ్రీకృష్ణుని వద్దకు దూతను పంపుటను వర్ణించే దెబ్బదియవ అధ్యాయము ముగిసినది (70).

* * *

అథ ఏకసప్తతితమోఽధ్యాయః

శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు విచ్చేయుట

శ్రీశుక ఉవాచ ।

ఇత్యుదీరితమాకర్ణ్య దేవర్షేరుద్ధవోఽబ్రవీత్ ।
సభ్యానాం మతమాజ్ఞాయ కృష్ణస్య చ మహామతిః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, దేవ-ఋషేః= దేవర్షి యగు నారదునియొక్క, ఇతి= ఈ విధమైన, ఉదీరితమ్= వచనమును, ఆకర్ణ్య= విని, మహామతిః= గొప్ప బుద్ధిశాలి యగు, ఉద్ధవః= ఉద్ధవుడు, సభ్యానామ్= సభాసదులయొక్క, కృష్ణస్య= శ్రీకృష్ణునియొక్క, మతం చ= అభిప్రాయమును కూడ, ఆజ్ఞాయ= తెలుసుకొని, అబ్రవీత్= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...గొప్ప బుద్ధిశాలియగు ఉద్ధవుడు దేవర్షియగు నారదుని ఈ వచనములను విని, సభ్యుల అభిప్రాయమును, శ్రీకృష్ణుని అభిప్రాయమును కూడ తెలుసుకొని ఇట్లు పలికెను.

ఉద్ధవ ఉవాచ ।

యదుక్తమృషిణా దేవ సాచివ్యం యక్ష్యతస్త్వయా ।
కార్యం పైతృష్వసేయస్య రక్షా చ శరణైషిణామ్ ॥ 2

ఉద్ధవః= ఉద్ధవుడు, ఉవాచ= పలికెను, దేవ= ఓ దేవా!, ఋషిణా= నారద మహర్షిచే, యక్ష్యతః= యాగము చేయబోయే, పైతృష్వసేయస్య= తండ్రిగారి సోదరి పుత్రునకు, సాచివ్యమ్= సాహాయ్యమును గురించి, యత్= ఏ మాట, ఉక్తమ్= చెప్పబడినదో అది, త్వయా= నీచే, కార్యమ్= చేయదగినది, శరణైషిణామ్= శరణు గోరువారల, రక్షా చ= రక్షణకూడ.

ఉద్ధవుడిట్లు పలికెను...దేవా! మీ తండ్రిగారి సోదరి కొడుకు ధర్మరాజు చేయబోయే యాగమునకు సాహాయ్యము చేయవలెనని నారద

మహర్షి చెప్పిన మాటను తమరు పాటించి, శరణు కోరువారిని రక్షించదగును.

యష్టవ్యం రాజసూయేన దిక్చక్రజయినా విభో ।
అతో జరాసుతజయ ఉభయార్థో మతో మమ ॥ 3

విభో= ఓ ప్రభూ!, దిక్-చక్రజయినా= దిక్కుల మండలమును జయించినవానిచే, రాజసూయేన యష్టవ్యమ్= రాజసూయయాగము చేయబడవలెను, అతః= ఇందువలన, జరాసుతజయః= జరాసంధుని జయించుట, ఉభయ-అర్థః= రెండు ప్రయోజనములు గలదని, మమ= నా, మతః= అభిప్రాయము.

ఓ ప్రభూ! దిక్కుల మండలమును జయించి రాజసూయ యాగమును చేయవలెను. కావున, జరాసంధుని జయించుట వలన రెండు ప్రయోజనములు (రాజసూయమును చేయుట, బందీలను రక్షించుట) సిద్ధించునని నా అభిప్రాయము.

అస్మాకం చ మహానర్థో హ్యేతేనైవ భవిష్యతి ।
యశశ్చ తవ గోవింద రాజ్ఞో బద్ధాన్ విముంచతః ॥ 4

ఏతేన ఏవ= దీనిచేతనే, అస్మాకం చ= మనకు కూడ, మహాన్= గొప్ప, అర్థః= ప్రయోజనము, భవిష్యతి= కలుగగలదు, గోవింద= ఓ గోవిందా!, బద్ధాన్= బందీలైన, రాజ్ఞః= రాజులను, విముంచతః= విడిపించే, తవ= నీకు, యశః చ= కీర్తి కూడా.

ఇట్లు చేయుటచే మనకు కూడ గొప్ప ప్రయోజనము కలుగగలదు. ఓ గోవిందా! బందీలైన రాజులను విడిపించిన కీర్తి కూడ నీకు కలుగును.

స వై దుర్విషహో రాజా నాగాయుతసమో బలే ।
బలినామపి చాన్యేషాం భీమం సమబలం వినా ॥ 5

బలే= బలమునందు, నాగ–అయుతసమః= పదివేల ఏనుగులతో సమానుడైన, సః= ఆ, రాజా= జరాసంధ మహారాజు, సమబలమ్= సమానమైన బలము గల, భీమం వినా= భీమును మినహాయించి, అన్యేషామ్= ఇతరులైన, బలినాం అపి చ= బలశాలురకు కూడ, దుర్విషహః= సహింప శక్యము కానివాడు, వై= నిశ్చయము.

ఆ జరాసంధ మహారాజు బలములో పది వేల ఏనుగులతో సమానుడు. ఆతనితో సమానమగు బలము గల భీమును మినహాయించి, మిగిలిన బలశాలురు కూడ ఆతనిని ఎదుర్కొని నిలబడలేరు. ఇతి నిశ్చయము.

ద్వైరథే స తు జేతవ్యో మా శతాక్షౌహిణీయుతః ।
బ్రహ్మణ్యోఽభ్యర్థితో విప్రై ర్న ప్రత్యాఖ్యాతి కర్హిచిత్ ॥ 6

సః తు= ఆ జరాసంధుడైతే, ద్వైరథే= ద్వంద్వయుద్ధమునందు, జేతవ్యః= జయించబడదగినవాడు, మా= కాదు, బ్రహ్మణ్యః= బ్రాహ్మణభక్తి గలవాడు, విప్రైః= వేదవేత్తలచే, అభ్యర్థితః= కోరబడినవాడై, కర్హిచిత్= ఏ కాలమునందైననూ, న ప్రత్యాఖ్యాతి= తిరస్కరించడు.

ఆ జరాసంధుని ద్వంద్వయుద్ధములో జయించవలెనే గాని, ఆతడు వంద అక్షౌహిణీలతో కూడియుండ జయించ శక్యము కాదు. ఆతడు బ్రాహ్మణభక్తుడు. ఏ కాలమునందైనా వేదవేత్తల కోరికను తిరస్కరించడు.

బ్రహ్మవేషధరో గత్వా తం భిక్షేత వృకోదరః ।
హనిష్యతి న సందేహో ద్వైరథే తవ సన్నిధౌ ॥ 7

వృక–ఉదరః= తోడేలు పొట్టవంటి పొట్ట గల భీముడు, బ్రహ్మ–వేషధరః= బ్రాహ్మణవేషమును ధరించినవాడై, గత్వా= వెళ్లి, తమ్= వానిని, భిక్షేత= కోరవలెను, తవ= నీ, సన్నిధౌ= సన్నిధియందు, ద్వైరథే=

ద్వంద్వయుద్ధమునందు, హనిష్యతి= సంహరించగలడు, సందేహః= సందేహము, న= లేదు.

భీముడు బ్రాహ్మణవేషమును దాల్చి వెళ్లి కోరవలెను. నీ సన్నిధిలో ద్వంద్వయుద్ధములో భీముడాతనిని నిస్సందేహముగా సంహరించగలడు.

నిమిత్తం పరమీశస్య విశ్వసర్గనిరోధయోః ।
హిరణ్యగర్భ శ్శర్వశ్చ కాలస్యారూపిణస్తవ ॥ 8

విశ్వసర్గనిరోధయోః= జగత్తుయొక్క సృష్టిప్రళయములయందు, హిరణ్యగర్భుఃః= బ్రహ్మదేవుడు, శర్వుః చ= రుద్రుడున్నూ, పరమ్= కేవలము, నిమిత్తమ్= నిమిత్తమే, ఈశస్య= శాసకుడవైనట్టియు, కాలస్య= కాలరూపుడవైనట్టియు, అరూపిణుఃః= రూపము లేని, తవ= నీకే.

జగత్తుయొక్క సృష్టికి బ్రహ్మదేవుడు, ప్రళయమునకు రుద్రుడు కేవలము నిమిత్తము మాత్రమే. వాస్తవములో రూపము లేని నీవే కాలరూపుడవై సర్వమును శాసించుచున్నావు.

గాయంతి తే విశదకర్మ గృహేషు దేవ్యో
రాజ్ఞాం స్వశత్రువధమాత్మవిమోక్షణం చ ।
గోప్యశ్చ కుంజరపతేర్జనకాత్మజాయాః
పిత్రోశ్చ లబ్ధశరణా మునయో వయం చ ॥ 9

రాజ్ఞమ్= రాజులయొక్క, గృహేషు= గృహములయందు, దేవ్యుః = రాణులు, స్వశత్రువధమ్= తమ శత్రువుయొక్క వధను, ఆత్మ-విమోక్షణమ్= ప్రియులైన భర్తల విముక్తిని, తే= నీయొక్క, విశదకర్మ= సత్కీర్తినిచ్చే కర్మను, గాయంతి= గానము చేయుచున్నారు, గోప్యుః చ= గోపికలు కూడ, మునయుఃః= మహర్షులు, లబ్ధశరణాుఃః= పొందబడిన శరణు గల, వయం చ= మేము కూడ, కుంజరపతేుఃః= గజేంద్రుని

(మోక్షమును), జనక-ఆత్మజాయాః= జానకియొక్క (విముక్తిని), పిత్రోః చ= తల్లిదండ్రులగు దేవకీవసుదేవుల (విముక్తిని).

జరాసంధునిచే బంధించబడిన రాజుల గృహములలో రాణులు నీవు తమ శత్రువును వధించి తమ ప్రియులను విముక్తులను చేసెదవని నీ స్వచ్ఛమగు కీర్తిని గానము చేయుచున్నారు. గోపికలు తమను నీవు శంఖచూడునినుండి విముక్తులను చేయుటను, నిన్ను శరణు వేడిన మేము నీవు నీ తల్లిదండ్రులగు దేవకీవసుదేవులను చెరనుండి విడిపించుటను, మహర్షులు గజేంద్రమోక్షమును, జానకిని చెరనుండి విడిపించుటను గురించి గానము చేయుచున్నారు.

జరాసంధవధః కృష్ణ భూర్యర్థాయోపకల్పతే ।
ప్రాయః పాకవిపాకేన తవ చాభిమతః క్రతుః ॥ 10

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, జరాసంధవధః= జరాసంధుని వధ, భూరి-అర్థాయ= గొప్ప ప్రయోజనము కొరకు, ఉపకల్పతే= సమర్థమగును, ప్రాయః= తరుచుగా, పాకవిపాకేన= కర్మ పరిపక్వమగుటచే, తవ చ= నీకు కూడ, క్రతుః= యజ్ఞము, అభిమతః= అభీష్టము.

ఓ శ్రీకృష్ణా! జరాసంధుని వధించుట వలన చాల గొప్ప ప్రయోజనములు సిద్ధించును. బహుశః జరాసంధుని పాపకర్మ పండుటచే, రాజుల పుణ్యకర్మ పరిపక్వమగుటచే నీవు కూడ యజ్ఞమునిష్టపడు-చున్నావు.

శ్రీశుక ఉవాచ ।
ఇత్యుద్ధవవచో రాజన్ సర్వతోభద్రమచ్యుతమ్ ।
దేవర్షిర్యదువృద్ధాశ్చ కృష్ణశ్చ ప్రత్యపూజయన్ ॥ 11

శ్రీశుకః= శ్రీశుకమహర్షి ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, సర్వతః-భద్రమ్= అన్ని విధములుగా కల్యాణమును చేయునట్టియు,

అచ్యుతమ్= జారిపోని ఫలము గల, ఇతి= ఈ విధమైన, ఉద్ధవవచః= ఉద్ధవుని వచనమును, దేవ-ఋషిః= నారద మహర్షి, యదువృద్ధాః చ యాదవులలో పెద్దలు, కృష్ణః చ= శ్రీకృష్ణుడు కూడ, ప్రత్యపూజయన్= కొనియాడిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! ఉద్ధవుని ఈ వచనము అన్ని విధములుగా కల్యాణమును చేయును. ఆ వచనమును పాటించినచో ఫలము చేజారిపోదు. ఆతని మాటలను నారద మహర్షి, యాదవవృద్ధులు మాత్రమే గాక, శ్రీకృష్ణుడు కూడ కొనియాడిరి.

అథాదిశత్ప్రయాణాయ భగవాన్ దేవకీసుతః ।
భృత్యాన్ దారుకజైత్రాదీననుజ్ఞాప్య గురూన్ విభుః ॥ 12

అథ= తరువాత, దేవకీసుతః= దేవకి పుత్రుడు, విభుః= సర్వసమర్థుడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, గురూన్= పెద్దలను, అనుజ్ఞాప్య= అనుమతి యిచ్చునట్లు చేసి, దారుకజైత్ర-ఆదీన్= దారుకుడు జైత్రుడు మొదలైన, భృత్యాన్= సేవకులను, ప్రయాణాయ= ప్రయాణము కొరకు, ఆదిశత్= ఆదేశించెను.

తరువాత దేవకీనందనుడు, సర్వసమర్థుడు అగు శ్రీకృష్ణ భగవానుడు పెద్దల అనుమతి తీసుకొనెను. అపుడాయన దారుకుడు, జైత్రుడు, ప్రబలుడు మొదలగు సైనికులను ప్రయాణమునకు ఆదేశించెను.

నిర్గమయ్యావరోధాన్ స్వాన్ ససుతాన్ సపరిచ్ఛదాన్ ।
సంకర్షణమనుజ్ఞాప్య యదురాజం చ శత్రుహన్ ।
సూతోపనీతం స్వరథమారుహద్గరుడధ్వజమ్ ॥ 13

శత్రుహన్= శత్రువులను జయించిన ఓ రాజా!, సంకర్షణమ్= బలరామ దేవుని, యదురాజం చ= యాదవప్రభుడగు ఉగ్రసేనుని,

అనుజ్ఞాప్య= అనుమతి యిచ్చునట్లు చేసి, ససుతాన్= పుత్రులతో కూడినట్టియు, సపరిచ్ఛదాన్= సామగ్రులతో కూడిన, స్వాన్= తనవైన, అవరోధాన్= అంతఃపురస్త్రీలను, నిర్గమయ్య= బయలు దేరునట్లు చేసి, సూత-ఉపనీతమ్= సారథిచే తీసుకురాబడినట్టియు, గరుడధ్వజమ్= గరుడుడు ధ్వజమునందు కలిగిన, స్వరథమ్= తన రథమును, ఆరుహత్= ఎక్కెను.

శత్రువులను జయించిన ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు బలరాముని వద్ద, యాదవప్రభుడగు ఉగ్రసేనుని వద్ద అనుమతి తీసుకొనెను. పుత్రులను, అంతఃపురస్త్రీలను సామగ్రితో సహా ముందు పంపించెను. తరువాత ఆయన సారథి తీసుకువచ్చిన తన రథమునెక్కెను. ఆ రథముపై గరుడధ్వజము రాజిల్లెను.

తతో రథద్విపభటసాదినాయకైః
కరాలయా పరివృత ఆత్మసేనయా,
మృదంగభేర్యానకశంఖగోముఖైః
ప్రఘోషఘోషితకకుభో నిరాక్రమత్ । 14

తతః= తరువాత, రథద్విపభటసాదినాయకైః= రథముల ఏనుగుల పదాతుల గుర్రపు రౌతుల నాయకులచే, కరాలయా= మిక్కిలి భయమును గొల్పే, ఆత్మసేనయా= తన సేనచే, పరివృతః= చుట్టువారబడినవాడు, మృదంగభేరీ-ఆనకశంఖగోముఖైః= మద్దెళ్లు భేరీలు తప్పెటలు శంఖములు కొమ్ము బూరాలచే, ప్రఘోషఘోషితకకుభః= పెద్ద ధ్వనిచే ధ్వనించునట్లు చేయబడిన దిక్కులు గల శ్రీకృష్ణుడు, నిరాక్రమత్= బయల్వెడలెను.

తరువాత శ్రీకృష్ణుడు తన సేన చుట్టువారి రాగా బయల్దేరెను. రథములు, ఏనుగులు, గుర్రములు, పదాతులతో కూడిన ఆ సేనను

నాయకులు నడిపించగా మిక్కిలి భయమును గొల్పెను. మద్దెళ్లు, భేరీలు, తప్పెటలు, శంఖములు, కొమ్ము బూరాల ధ్వనులతో దిక్కులు దద్దరిల్లెను.

నృవాజికాంచనశిబికాభి రచ్యుతం ।
సహాత్మజాః పతిమను సువ్రతా యయుః ।
వరాంబరాభరణవిలేపనస్రజః
సుసంవృతా నృభిరసిచర్మపాణిభిః ॥ 15

సహ-ఆత్మజాః= సంతానముతో కూడినవారు, వర-అంబర-ఆభరణ విలేపనస్రజః= శ్రేష్ఠమైన వస్త్రములు ఆభరణములు అంగరాగములు మాలలు గలవారు, అసిచర్మపాణిభిః= కత్తి డాలు చేతులయందు గల, నృభిః= భటులచే, సుసంవృతాః= బాగుగా రక్షించబడినవారు, సువ్రతాః = పతివ్రతలు అగు రుక్మిణి మొదలగువారు, నృవాజికాంచనశిబికాభిః = వేగముగా నడిచే వ్యక్తులు మోసే బంగరు శిబికలచే, పతిమ్= భర్తయగు, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, అను= అనుసరించి, యయుః = వెళ్లిరి.

రుక్మిణి మొదలగు పతివ్రతలు తమ సంతానముతో బాటుగా బంగరు శిబికలపై భర్తయగు శ్రీకృష్ణ భగవానుని వెంట వెళ్లిరి. ఆ శిబికలను వేగముగా నడిచే జనులు మోసిరి. శ్రేష్ఠమైన వస్త్రములు, ఆభరణములు, అంగరాగములు, మాలలు అనువాటిని ధరించిన ఆ యువతులను కత్తి, డాలు చేతులయందు పట్టుకున్న భటులు సమర్థముగా రక్షించుచుండిరి.

నరోష్ట్రగోమహిషఖరాశ్వతర్యనైః-
కరేణుభిః పరిజనవారయోషితః ।
స్వలంకృతాః కటకుటికంబలాంబరా-
ద్యుపస్కరా యయురధియుజ్య సర్వతః ॥ 16

సు-అలంకృతాఃఁ= బాగా అలంకరించబడినవారు, కటకుటి కంబల-అంబర-ఆది-ఉపస్కరాఃఁ= చాపల డేరాలు కంబళ్లు వస్త్రములు మొదలైన సంబారములు గల, పరిజనవారయోషితఃఁ= పరిచారికలు వారాంగనలు, నర-ఉష్ట్రగోమహిషఖర-అశ్వతరీ-అవఃకరేణుభిఃఁ= మనుష్యులు మోసే పల్లకీలు ఒంటెలు ఎద్దులు దున్నలు గాడిదలు కంచర గాడిదల బళ్లచే ఏనుగులచే, అధియుజ్యఁ= కట్టుకొని, సర్వతఃఁ= అన్ని విధములుగా, యయుఃఁ= వెళ్లిరి.

పరిచారికలు, వేశ్యాంగనలు చక్కగా అలంకరించుకొని అన్ని రకముల ప్రయాణసాధనములపై వెళ్లిరి. వారు మనుష్యులు మోసే పల్లకీలపై, అంబారీలపై వెళ్లిరి. వారు చాప డేరాలను, కంబళ్లను, వస్త్రములు, పాత్రలు మొదలైన సామగ్రిని గట్టిగా కట్టుకొని వెళ్లిరి.

బలం బృహద్ధ్వజపటఛత్రచామరై
ర్వరాయుధాభరణకిరీటవర్మభిఃఁ,
దివాఽంశుభి స్తుములరవం బభౌ రవే
ర్యథాఽర్ణవఃఁ క్షుభిత తిమింగిలోర్మిభిఃఁ. **17**

తుములరవమ్= సంకీర్ణమైన ధ్వనులు గల, బలమ్= సైన్యము, దివా= పగలు, బృహద్-ధ్వజపటఛత్ర చామరైఃఁ= పెద్ద జెండాల వస్త్రములు గొడుగులు వింజామరలతో, వర-ఆయుధ-ఆభరణకిరీట వర్మభిఃఁ= శ్రేష్ఠమైన ఆయుధములు ఆభరణములు కిరీటములు కవచములతో, రవేఃఁ= సూర్యునియొక్క, అంశుభిఃఁ= కిరణములతో, క్షుభితతిమింగిల-ఊర్మిభిఃఁ= కల్లోలితమైన తిమింగిలములతో కెరటములతో, అర్ణవఃఁ యథాఁ= సముద్రము వలె, బభౌఁ= ప్రకాశించెను.

సంకీర్ణమైన ధ్వనులు గల శ్రీకృష్ణ సైన్యములో పెద్ద జెండాల వస్త్రములు, గొడుగులు, వింజామరలు, శ్రేష్ఠమైన ఆయుధములు,

ఆభరణములు, కిరీటములు, కవచములు అనునవి సూర్యకిరణములు పడి ప్రకాశించినవి. అప్పుడా సైన్యము తిమింగిలములతో, కెరటములతో కల్లోలముగానుండే సముద్రమును పోలెను.

అథో మునిర్యదుపతినా సభాజితః
ప్రణమ్య తం హృది విదధద్విహాయసా ।
నిశమ్య తద్వ్యవసితమాహృతార్హణో
ముకుంద సందర్శన నిర్వృతేంద్రియః ॥ 18

అథో= తరువాత, యదుపతినా= యాదవప్రభుడగు శ్రీకృష్ణునిచే, సభాజితః= సత్కరించబడినవాడు, ఆహృత-అర్హణః= సమర్పించబడిన పూజాద్రవ్యములు శ్రీకృష్ణ భగవానుని దర్శనముచే సంతుష్టమైన ఇంద్రియములు గలవాడు అగు, మునిః= నారద మహర్షి, తద్-వ్యవసితమ్= ఆయనయొక్క నిశ్చయమును, నిశమ్య= విని, తమ్= ఆయనను, ప్రణమ్య= ప్రణమిల్లి, హృది= హృదయమునందు, విదధత్= ధ్యానించువాడై, విహాయసా= ఆకాశముచే (వెళ్లెను).

యాదవప్రభుడు, మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుని దర్శనముచే నారద మహర్షియొక్క ఇంద్రియములు సంతుష్టములాయెను. ఆయన శ్రీకృష్ణునిచే సమర్పించబడిన పూజాద్రవ్యములను స్వీకరించి ఆయన చేసిన సత్కారమును పొందెను. రాజసూయమునకు వెళ్లవలెననే ఆయన నిశ్చయమును విని, తరువాత ఆ మహర్షి ఆయనకు నమస్కరించి ఆయననే హృదయములో ధ్యానిస్తూ ఆకాశమార్గమున వెళ్లెను.

రాజదూతమువాచేదం భగవాన్ ప్రీణయన్ గిరా ।
మా భైష్ట దూత భద్రం వో ఘాతయిష్యామి మాగధమ్ ॥ 19

భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, రాజదూతమ్= రాజుల దూతను, గిరా= వాక్కుతో, ప్రీణయన్= ప్రీతిని కలిగించువాడై, ఇదమ్= ఈ

మాటను, ఉవాచ= పలికెను, దూత= ఓ దూతా!, మా భైష్ట= భయపడకుడు, వః= మీ కొరకు, భద్రమ్= మంగళమగు గాక!, మాగధమ్= మగధరాజును, ఘాతయిష్యామి= సంహరింప చేసెదను.

శ్రీకృష్ణ భగవానుడు రాజుల దూతకు ప్రీతిని కలిగిస్తూ ఇట్లు పలికెను...ఓ దూతా! భయపడకుడు. మీకు మంగళమగు గాక! నేను మగధరాజగు జరాసంధుని వధింప జేయగలను.

ఇత్యుక్తః ప్రస్థితో దూతో యథావదవదన్నృపాన్ ।
తేఽపి సందర్శనం శౌరేః ప్రత్యైక్షన్ యన్ముముక్షవః ॥ 20

ఇతి= ఇట్లు, ఉక్తః= చెప్పబడిన, దూతః= దూత, ప్రస్థితః= బయలు దేరినవాడు, నృపాన్= రాజులను గురించి, యథావత్= ఉన్నది ఉన్నట్లుగా, అవదత్= చెప్పెను, తే అపి= వారు కూడ, శౌరేః= శ్రీకృష్ణుని, సందర్శనమ్= దర్శనము గురించి, ప్రత్యైక్షన్= ఎదురు చూచిరి, యత్= ఏలయన, ముముక్షవః= విముక్తిని కోరువారు.

ఇట్లు చెప్పబడిన దూత వెనుకకు వెళ్లి రాజులకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పెను. వారు తమను కారాగారమునుండి విడిపించుననే ఆశతో శ్రీకృష్ణుని దర్శనమునకు ఎదురు చూచిరి.

ఆనర్తసౌవీరమరూంస్తీర్త్వా వినశనం హరిః ।
గిరీన్నదీరతీయాయ పురగ్రామవ్రజాకరాన్ ॥ 21

హరిః= శ్రీకృష్ణ భగవానుడు, ఆనర్తసౌవీరమరూన్= ఆనర్త సౌవీర మరు దేశములను, వినశనమ్= కురుక్షేత్రమును, తీర్త్వా= దాటి, గిరీన్= కొండలను, నదీః నదులను, పురగ్రామవ్రజ-ఆకరాన్= నగరములను గ్రామములను గొల్లపల్లెలను గనులను, అతీయాయ= అతిక్రమించెను.

శ్రీకృష్ణ భగవానుడు కొండలను, నదులను, నగరములను, గ్రామములను, గొల్లపల్లెలను, గనులను దాటుకుంటూ ఆనర్త సౌవీర మరు దేశములను, కురుక్షేత్రమును అతిక్రమించెను.

తతో దృషద్వతీం తీర్త్వా ముకుందోఽథ సరస్వతీమ్ ।
పంచాలానథ మత్స్యాంశ్చ శక్రప్రస్థమథాగమత్ ॥ 22

ముకుందః= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుడు, తతః= తరువాత, దృషద్వతీమ్= దృషద్వతీనదిని, అథ= తరువాత, సరస్వతీమ్= సరస్వతీ నదిని, అథ= తరువాత, పంచాలాన్= పంచాలదేశమును, మత్స్యాన్ చ= మత్స్యదేశమును కూడ, తీర్త్వా= దాటి, అథ= తరువాత, శక్రప్రస్థమ్= ఇంద్రప్రస్థమును, అగమత్= చేరెను.

మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుడు క్రమముగా దృషద్వతీనదిని, సరస్వతీ నదిని, పంచాల మత్స్యదేశములను దాటి ఇంద్రప్రస్థమును చేరెను.

తముపాగతమాకర్ణ్య ప్రీతో దుర్దర్శనం నృణామ్ ।
అజాతశత్రు ర్నిరగాత్సోపాధ్యాయ స్సుహృద్వృతః ॥ 23

ఉపాగతమ్= విచ్చేసినట్టియు, నృణామ్= మానవులకు, దుర్దర్శనమ్= దర్శించుట కష్టమైన, తమ్= ఆ శ్రీకృష్ణుని గురించి, ఆకర్ణ్య= విని, ప్రీతః= ప్రీతి జెందిన, అజాతశత్రుః= పుట్టని శత్రువులు గల ధర్మరాజు, స-ఉపాధ్యాయః= ఆచార్యులతో కూడినవాడై, సుహృద్-వృతః= బంధువులతో కూడినవాడై, నిరగాత్= నగరము బయటకు వచ్చెను.

మానవులకు శ్రీకృష్ణుని దర్శనము దుర్లభము. ఆయన వచ్చాడని విని శత్రువులు లేని ధర్మరాజు ఆనందముతో ఆచార్యులను, బంధువులను వెంట బెట్టుకొని నగరము బయటకు ఎదురేగెను.

గీతవాదిత్రఘోషేణ బ్రహ్మఘోషేణ భూయసా ।
అభ్యయాత్స హృషీకేశం ప్రాణాః ప్రాణమివాదృతః ॥ 24

ఆదృతః= ఆదరము గల, సః= ఆ ధర్మరాజు, భూయసా= అధికమగు, గీతవాదిత్రఘోషేణ= గానము వాద్యముల శబ్దముతో, బ్రహ్మఘోషేణ= వేదధ్వనితో, హృషీకేశమ్= ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానుని, ప్రాణాః= ఇంద్రియములు, ప్రాణం ఇవ= ముఖ్యప్రాణమును వలె, అభ్యయాత్= ఎదురేగెను.

ఆదరము గల ఆ ధర్మరాజు, ఇంద్రియములు ముఖ్యప్రాణమునకు వలె, ఇంద్రియాధిపతియగు శ్రీకృష్ణ భగవానునకు ఎదురేగెను. అధికమగు గానవాద్యముల ఘోష, వేదధ్వని ఆయన వెంట ఉండెను.

దృష్ట్వా విక్లిన్నహృదయః కృష్ణం స్నేహేన పాండవః ।
చిరాద్దృష్టం ప్రియతమం సస్వజేఽథ పునః పునః ॥ 25

చిరాత్= చాలకాలమునకు, దృష్టమ్= చూడబడినట్టియు, ప్రియతమమ్= మిక్కిలి ప్రియుడైన, కృష్ణమ్= శ్రీకృష్ణుని, దృష్ట్వా= చూచి, స్నేహేన= ప్రేమతో, విక్లిన్నహృదయః= ఆర్ద్రమైన హృదయము గల, పాండవః= పాండుపుత్రుడగు, ధర్మరాజు, అథ= అప్పుడు, పునః పునః = మరల మరల, సస్వజే= కౌగిలించెను.

మిక్కిలి ప్రియుడగు శ్రీకృష్ణుడు ధర్మరాజునకు చాల కాలమునకు కనబడెను. ఆయనను చూచి ధర్మరాజు హృదయము ప్రేమతో ఆర్ద్రమాయెను. ఆయనను ధర్మరాజు మరల కౌగిలించుకొనెను.

దోర్భ్యాం పరిష్వజ్య రమాఽమలాలయం
ముకుందగాత్రం నృపతిర్హతాశుభః ।
లేభే పరాం నిర్వృతిమశ్రులోచనో
హృష్యత్తనుర్విస్మృతలోకవిభ్రమః ॥ 26

రమా-అమల-ఆలయమ్= లక్ష్మికి స్వచ్ఛమగు నివాసమైన, ముకుంద గాత్రమ్- శ్రీకృష్ణ భగవానుని దేహమును, దోర్భ్యామ్= రెండు చేతులతో, పరిష్వజ్య- కౌగిలించి, హత-అశుభః= నశింపజేయబడిన అశుభములు గల, నృపతిః= ధర్మరాజు, అశ్రులోచనః= నీళ్లు నిండిన కన్నులు గలవాడు, హృష్యత్-తనుః= గగుర్పాటు చెందిన దేహము గలవాడు, విస్మృతలోకవిభ్రమః= విస్మరించబడిన లోకవ్యవహారము గలవాడు, పరామ్= నిరతిశయమగు, నిర్వృతిమ్= ఆనందమును, లేభే= పొందెను.

శ్రీకృష్ణ భగవానుని స్వచ్ఛమగు దేహము లక్ష్మీదేవికి నిలయము. ఆయనను కౌగిలించుటచే ధర్మరాజుయొక్క అశుభములు తొలగిపోయెను. ఆయన కన్నులు నీటితో నిండి శరీరము గగుర్పాటును చెందెను. ఆయన లోకవ్యవహారమును విస్మరించి నిరతిశయమగు ఆనందమును పొందెను.

తం మాతులేయం పరిరభ్య నిర్వృతో
భీమస్స్మయన్ ప్రేమజవాకులేంద్రియః ।
యమౌ కిరీటీ చ సుహృత్తమం ముదా
ప్రవృద్ధబాష్పాః పరిరేభిరేఽచ్యుతమ్ ॥ 27

ప్రేమజవ-ఆకుల-ఇంద్రియః= ప్రేమయొక్క వేగముచే తొట్రుపాటు జెందిన ఇంద్రియములు గల, భీమః= భీముడు, మాతులేయమ్= మేనమామ కొడుకగు, తమ్= ఆ శ్రీకృష్ణుని, స్మయన్= నవ్వుచున్నవాడై, పరిరభ్య= కౌగిలించి, నిర్వృతః= ఆనందించినవాడు, యమౌ= కవలలు, కిరీటీ చ= అర్జునుడు కూడ, ప్రవృద్ధబాష్పాః= ముంచుకొచ్చిన కన్నీళ్లు గలవారై, సుహృత్-తమమ్= మిక్కిలి ప్రియుడగు బంధువైన, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, ముదా= ఆనందముతో, పరిరేభిరే= కౌగిలించిరి.

భీముని ఇంద్రియములు ప్రేమయొక్క వేగముచే తొట్రుపాటు జెందెను. ఆయన నవ్వుతూ మేనమామ కొడుకగు శ్రీకృష్ణుని కౌగిలించి ఆనందించెను. కవలలగు నకుల సహదేవులకు, అర్జునునకు కూడ ప్రేమతో కన్నీళ్లు ముంచుకు వచ్చెను. వారు మిక్కిలి ప్రియమగు బంధువైన శ్రీకృష్ణభగవానుని ఆనందముతో కౌగిలించిరి.

అర్జునేన పరిష్వక్తో యమాభ్యామభివాదితః ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య వృద్ధేభ్యశ్చ యతాఽర్హతః ॥ 28

అర్జునేన= అర్జునునిచే, పరిష్వక్తః= కౌగిలించబడినవాడు, యమాభ్యామ్= కవలలచే, అభివాదితః= నమస్కరించబడినవాడు, బ్రాహ్మణేభ్యః= బ్రాహ్మణుల కొరకు, వృద్ధేభ్యః చ= పెద్దల కొరకు కూడ, యథా– అర్హతః= యోగ్యతకు తగ్గట్లుగా, నమస్కృత్య= నమస్కరించి.

శ్రీకృష్ణుని అర్జునుడు కౌగిలించగా, నకుల సహదేవులు నమస్కరించిరి. ఆయన బ్రాహ్మణులకు, పెద్దలకు వారి యోగ్యతకు తగ్గట్లుగా నమస్కరించెను.

మానితో మానయామాస కురుసృంజయకైకయాన్ ।
సూతమాగధగంధర్వా వందినశ్చోపమంత్రిణః ॥ 29

మృదంగశంఖపటహవీణాపణవగోముఖైః ।
బ్రాహ్మణాశ్చారవిందాక్షం తుష్టువుర్నృతుర్జగుః ॥ 30

మానితః= సమ్మానించబడిన శ్రీకృష్ణుడు, కురుసృంజయ కైకయాన్= కురుసృంజయకేకయరాజులను, మానయామాస= సమ్మానించెను, సూతమాగధగంధర్వాః= సూతులు మాగధులు గంధర్వులు, వందినః= వందులు, ఉపమంత్రిణః చ= విదూషకులు, బ్రాహ్మణాః చ= బ్రాహ్మణులు

కూడ, మృదంగశంఖపటహవీణా పణవగోముఖైఃమద్దెళ్లు శంఖములు తప్పెటలు వీణలు ఉడుక్కములు కొమ్ము బూరాలతో, అరవింద-అక్షమ్= పద్మములువంటి కన్నులు గల శ్రీకృష్ణుని, తుష్టువుఃస్తుతించిరి, ననృతుఃనాట్యమాడిరి, జగుఃగానము చేసిరి.

శ్రీకృష్ణుడు కురు-సృంజయ-కేకయదేశముల రాజులను సమ్మానించగా, వారాయనను సమ్మానించిరి. సూతులు, మాగధులు, వందులు, బ్రాహ్మణులు పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుని స్తుతించిరి. గంధర్వులు, విదూషకులు మద్దెళ్లను, శంఖములను, తప్పెటలను, వీణలను, ఉడుక్కములను, కొమ్ము బూరాలను వాయిస్తూ పాడి నాట్యమాడిరి.

ఏవం సుహృద్భిఃపర్యస్తఃపుణ్యశ్లోకశిఖామణిఃసంస్తూయమానోభగవాన్ వివేశాలంకృతం పురమ్ ॥ 31

పుణ్యశ్లోకశిఖామణిఃపావనము చేసే కీర్తి గలవారిలో శ్రేష్ఠుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, సుహృద్భిఃబంధువులచే, పర్యస్తఃచుట్టువారబడినవాడు, సంస్తూయమానఃబాగుగా స్తుతించబడుచున్నవాడు, అలంకృతమ్= అలంకరించబడిన, పురమ్= నగరమును, వివేశ= ప్రవేశించెను.

పావనము చేసే కీర్తి గలవారిలో శ్రీకృష్ణుడు ప్రప్రథముడు. బంధువులీ విధముగా చుట్టువారు స్తుతించుచుండగా ఆయన అలంకరించబడిన నగరమును ప్రవేశించెను.

సంసిక్తవర్త్మ కరిణాం మదగంధతోయైఃచిత్రధ్వజైఃకనకతోరణపూర్ణకుంభైఃమృష్టాత్మభిర్నవదుకూలవిభూషణస్రగ్-గంధైర్నృభిర్యువతిభిశ్చ విరాజమానమ్ ॥ 32

కరిణామ్= ఏనుగులయొక్క, మదగంధతోయైుఃక= మదముయొక్క పరిమళముతో కూడిన నీళ్లతో, సంసిక్తవర్త్మ= తడుపబడిన మార్గములు కలిగినట్టియు, చిత్రధ్వజైుఃక= రంగు రంగుల జెండాలతో, కనకతోరణపూర్ణ కుంభైుఃక= బంగరు తోరణములతో పూర్ణకుంభములతో, మృష్ట-ఆత్మభిఃక = పుష్టమైన దేహములు కలిగినట్టియు, నవదుకూలవిభూషణస్రగ్-గంధైుఃక = కొత్త వస్త్రములు అలంకారములు మాలలు గంధములు కలిగిన, నృభిఃక= పురుషులచే, యువతిభిఃక చ= యువతులచే కూడ, విరాజమానమ్ = ప్రకాశించుచున్న (నగరమును--).

ఆ నగరములో ఏనుగుల మదగంధముచే వ్యాప్తమైన వీథులలో నీళ్లు చల్లబడెను. రంగు రంగుల జెండాలు, బంగరు తోరణములు, పూర్ణకుంభములతో ఆ నగరము అధికముగా రాజిల్లెను. పరిపుష్టములైన దేహములు గల అచటి స్త్రీపురుషులు కొత్త వస్త్రములను, అలంకారములను, మాలలను, పరిమళద్రవ్యములను ధరించియుండిరి.

ఉద్దీప్తదీపబలిభిఃక ప్రతిసద్మ జాల-
నిర్యాతధూపరుచిరం విలసత్పతాకమ్ ।
మూర్ధన్యహేమకలశై రజతోరుశృంగైుఃక
జుష్టం దదర్శ భవనైుఃక కురురాజధామ ॥ 33

ప్రతిసద్మ= ప్రతి గృహమునందు, ఉద్దీప్తదీపబలిభిఃక= అధికముగా ప్రకాశించే దీపములచే పుష్పాదులచే, మూర్ధన్యహేమకలశైుఃక= పై భాగము నందు గల బంగరు కలశము కలిగినట్టియు, రజత-ఉరుశృంగైుఃక= వెండితో చేసిన పెద్ద కలశపీఠములు కలిగిన, భవనైుఃక= భవనములతో, జుష్టమ్= కూడినట్టియు, జాలనిర్యాతధూపరుచిరమ్= కిటికీలగుండా బయల్వెడలే ధూపములచే శోభిల్లినట్టియు, విలసత్-పతాకమ్=

ప్రకాశించే జెండాలు గల, కురురాజధామ= కురురాజగు ధర్మరాజుయొక్క అంతఃపురమును, దదర్శ= చూచెను.

శ్రీకృష్ణుడు కురురాజగు ధర్మరాజుయొక్క అంతఃపురమును చూచెను. జెండాలతో ప్రకాశించే ఆ అంతఃపురమునందు ప్రతి గృహము దీపములతో, పుష్పాదులతో అధికముగా ప్రకాశించెను. ఆ అంతఃపురమునందలి భవనముల పైభాగమునందు వెండితో చేసిన పెద్ద పీఠములపై బంగరు కలశములు ఉండెను. కిటికీల గుండా బయల్వెడలే ధూపములతో ఆ భవనములు ప్రకాశించెను.

ప్రాప్తం నిశమ్య నరలోచనపానపాత్రం
ఔత్సుక్యవిశ్లథితకేశదుకూలబంధాః ।
సద్యో విసృజ్య గృహకర్మ పతీంశ్చ తల్పే
ద్రష్టుం యయు ర్యువతయస్స్మ నరేంద్రమార్గే ॥ 34

నర-ఇంద్రమార్గే= రాజమార్గమునందు, ప్రాప్తమ్= విచ్చేసిన, నర లోచనపానపాత్రమ్= మానవుల కళ్లు ప్రేమతో చూచుటలో విషయమయ్యే శ్రీకృష్ణుని గురించి, నిశమ్య= విని, ఔత్సుక్యవిశ్లథిత కేశదుకూల బంధాః = ఉత్కంఠచే జారిన జుట్టు కోక ముడులు కల, యువతయః= యువతులు, సద్యః వెంటనే, గృహకర్మ= ఇంటి పనిని, తల్పే= శయ్యపై, పతీన్ చ= భర్తలను కూడ, విసృజ్య= విడిచి, ద్రష్టుమ్= చూచుటకు, యయుః స్మ= వెళ్లిరి.

శ్రీకృష్ణుని ఆనాటి మానవులు ప్రేమతో నిండిన కళ్లతో చూచెడి వారు. ఆయన రాజమార్గములో వెళ్లుచున్నాడని విని యువతులు ఇంటి పనిని, మరికొందరు శయ్యలపై భర్తలను కూడ వెంటనే విడిచి చూచుటకు వెళ్లిరి. ఉత్కంఠచే వారి జుట్టు కొప్పులు, కోక ముడులు జారిపోవు-చుండెను.

తస్మిన్ సుసంకుల ఇభాశ్వరథద్విపద్భిః
కృష్ణం సభార్యముపలభ్య గృహాధిరూఢాః ।
నార్యో వికీర్య కుసుమైర్మనసోపగుహ్య
సుస్వాగతం విదధురుత్స్మయవీక్షితేన ॥ 35

గృహ–అధిరూఢాః= ఇంటి పైభాగమునందెక్కిన, నార్యః= యువతులు, ఇభ–అశ్వరథద్విపద్భిః= ఏనుగులు గుర్రములు రథములు పదాతులతో, సుసంకులే= చాల రద్దీగానున్న, తస్మిన్= ఆ రాజమార్గము నందు, సభార్యమ్= భార్యలతో కూడియున్న, కృష్ణమ్= శ్రీకృష్ణుని, ఉపలభ్య= చూచి, కుసుమైః= పూలతో, వికీర్య= చల్లి, మనసా= మనస్సుతో, ఉపగుహ్య= కౌగిలించి, ఉత్స్మయవీక్షితేన= ఆదరముతో కూడిన చూపుతో, సుస్వాగతమ్= సుస్వాగతమును, విదధుః= చేసిరి.

ఏనుగులు, గుర్రములు, రథములు, పదాతులతో రాజమార్గము చాల రద్దీగానుండెను. యువతులు ఇళ్ల పై భాగములమీద యెక్కి భార్యలతో కూడియున్న శ్రీకృష్ణుని చూచిరి. వారాయనపై పూలను చల్లి మనస్సులో కౌగలించుకొని ఆదరముతో నిండిన చూపులతో సుస్వాగతము పలికిరి.

ఊచుః స్త్రియః పథి నిరీక్ష్య ముకుందపత్నీః ।
తారా యథోడుపసహాః కిమకార్యమూభిః ।
యచ్చక్షుషాం పురుషమౌలిరుదారహాస–
లీలాఽవలోక కలయోత్సవ మాతనోతి ॥ 36

స్త్రియః= స్త్రీలు, పథి= మార్గమునందు, ఉడుపసహాః= చంద్రునితో కూడిన, తారాః యథా= తారలవంటి, ముకుందపత్నీః= శ్రీకృష్ణ భగవానుని భార్యలను, నిరీక్ష్య= చూచి, ఊచుః= పలికిరి, అమూభిః=

వీరిచే, కిమ్= ఏమి, అకారి= చేయబడినది? యత్-చక్షుషామ్= ఎవరి కళ్లకైతే, పురుషమౌలిః= పురుషోత్తముడు, ఉదారహాసలీలా-అవలోక కలయా= ఔదార్యము నిండిన చిరునవ్వుతో కూడిన విలాసపు చూపు యొక్క లేశముచే, ఉత్సవమ్= సుఖమును, ఆతనోతి-విస్తరింప జేయునో.

స్త్రీలు మార్గములో చంద్రునితో కూడిన తారలను పోలిన శ్రీకృష్ణ భగవానుని భార్యలను చూచి ఇట్లు పలికిరి -- వీరు ఏమి పుణ్యమును చేసిరో? పురుషోత్తముడు ఔదార్యయుక్తమైన చిరునవ్వుతో, విలాసపు చూపుయొక్క లేశముతో వీరి కళ్లకు సుఖమును విస్తరింపజేయును.

తత్ర తత్రోపసంగమ్య పౌరా మంగలపాణయః ।
చక్రుస్సపర్యాం కృష్ణాయ శ్రేణీముఖ్యా హతైనసః ॥ 37

మంగలపాణయః= మంగళద్రవ్యములు చేతియందు గల, పౌరాః = పౌరులు, శ్రేణీముఖ్యాః= శిల్పజీవులు, తత్ర తత్ర= అక్కడక్కడ, ఉపసం గమ్య= దగ్గరకు వచ్చి, కృష్ణాయ= కృష్ణుని కొరకు, సపర్యామ్= పూజను, చక్రుః= చేసిరి, హత-ఏనసః= నశింపజేయబడిన పాపములు గలవారు.

అక్కడక్కడ పౌరులు, శిల్పజీవులు చేతులలో మంగళద్రవ్యములతో దగ్గరకు వచ్చి శ్రీకృష్ణుని పూజించిరి. దానిచే వారి పాపములు నశించెను.

అంతఃపురజనైః ప్రీత్యా ముకుందః ఫుల్లలోచనః ।
ససంభ్రమైరభ్యుపేతః ప్రావిశద్రాజమందిరమ్ ॥ 38

ముకుందః= శ్రీకృష్ణ భగవానుడు, ప్రీత్యా= ప్రేమచే, ఫుల్లలోచనైః = విప్పారిన కన్నులు కలిగినట్టియు, ససంభ్రమైః= కంగారు గల, అంతః పురజనైః= అంతఃపురస్త్రీలచే, అభ్యుపేతః= ఎదురుగా వచ్చి సత్కరించ-బడిన వాడై, రాజమందిరమ్= రాజమందిరమును, ప్రావిశత్= ప్రవేశించెను.

అంతఃపురస్త్రీలు కంగారు పడుతూ ప్రేమచే విప్పారిన కన్నులు గలవారై శ్రీకృష్ణ భగవానుని ఎదురు వచ్చి సత్కరించిరి. అప్పుడాయన రాజమందిరమును ప్రవేశించెను.

పృథా విలోక్య భ్రాత్రేయం కృష్ణం త్రిభువనేశ్వరమ్ ।
ప్రీతాత్మోత్థాయ పర్యంకాత్సస్నుషా పరిషస్వజే ॥ 39

ప్రీత–ఆత్మా= ప్రీతి జెందిన మనస్సు గలది, సస్నుషా= కోడలితో కూడియున్న, పృథా= కుంతి, పర్యంకాత్= శయ్యనుండి, ఉత్థాయ= పైకి లేచి, భ్రాత్రేయమ్= సోదరుని పుత్రుడైనట్టియు, త్రిభువన–ఈశ్వరమ్= ముల్లోకములకు ప్రభుడైన, కృష్ణమ్= శ్రీకృష్ణుని, పరిషస్వజే= కౌగిలించెను.

కోడలు ద్రౌపదితో కూడియున్న కుంతి సోదరుని పుత్రుని చూచి మనస్సులో ఆనందించెను. ఆమె శయ్యపైనుండి లేచి ముల్లోకములకు ప్రభువగు శ్రీకృష్ణుని కౌగిలించుకొనెను.

గోవిందం గృహమానీయ దేవదేవేశమాదృతః ।
పూజాయాం నావిదత్కృత్యం ప్రమోదోపహతో నృపః ॥ 40

ఆదృతః= ఆదరము గల, నృపః= ధర్మరాజూ, దేవదేవ–ఈశమ్= దేవతలకు ప్రభువులగు బ్రహ్మాదులకు ప్రభుడైన, గోవిందమ్= శ్రీకృష్ణ భగవానుని, గృహమ్= ఇంటిని గురించి, ఆనీయ= తీసుకువచ్చి, ప్రమోద–ఉపహతః= అతిశయించిన ఆనందముచే అభిభూతుడై, పూజాయామ్= పూజయందు, కృత్యమ్= కర్తవ్యమును, న అవిదత్= తెలియకుండెను.

దేవతలకు ప్రభువులగు బ్రహ్మాదులకు కూడ ప్రభుడగు శ్రీకృష్ణ భగవానుని ధర్మరాజు దోడ్కొని వచ్చెను. కాని, ఆయన అతిశయించిన ఆనందముచే పరవశుడై పూజాక్రమమునైననూ తెలియకుండెను.

పితృష్వసుర్గురుస్త్రీణాం కృష్ణశ్చక్రేఽభివాదనమ్ ।
స్వయం చ కృష్ణయా రాజన్ భగిన్యా చాభివందితః ॥ 41

రాజన్= రాజా!, కృష్ణః= కృష్ణుడు, పితృష్వసుః= తండ్రి సోదరియగు కుంతికి, గురుస్త్రీణామ్= పెద్దల భార్యలకు, అభివాదనమ్= నమస్కారమును, చక్రే= చేసెను, స్వయం చ= తాను కూడ, భగిన్యా= సోదరి సుభద్రచే, కృష్ణయా చ= ద్రౌపదిచే కూడ, అభివందితః= నమస్కరించబడినవాడు.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు తన తండ్రి సోదరియగు కుంతికి, పెద్దల భార్యలకు నమస్కారము చేసెను. సోదరి సుభద్ర, ద్రౌపది కూడ ఆయనకు నమస్కరించిరి.

శ్వశ్వా సంచోదితా కృష్ణా కృష్ణపత్నీశ్చ సర్వశః ।
ఆనర్చ రుక్మిణీం సత్యాం భద్రాం జాంబవతీం తథా ॥ 42

కాలిందీం మిత్రవిందాం చ శైబ్యాం నాగ్నజితీం సతీమ్ ।
అన్యాశ్చాభ్యాగతా యాస్తు వాసస్రస్జ్మండనాదిభిః ॥ 43

శ్వశ్వా= అత్తగారగు కుంతిచే, సంచోదితా= ప్రేరితురాలై, కృష్ణా= ద్రౌపది, కృష్ణపత్నీః చ= శ్రీకృష్ణుని భార్యలను, సర్వశః= అందరిని, రుక్మిణీమ్= రుక్మిణిని, సత్యామ్= సత్యభామను, భద్రామ్= భద్రను, తథా= మరియు, జాంబవతీమ్= జాంబవతిని, కాలిందీమ్= కాలిందిని, మిత్రవిందాం చ= మిత్రవిందను, శైబ్యామ్= లక్ష్మణను, సతీమ్= పతివ్రతయగు, నాగ్నజితీమ్= నగ్నజిత్తు కుమారైయగు సత్యను, యాః = తు= ఎవరైతే, అన్యాః చ= ఇతరులు కూడ, అభ్యాగతాః= విచ్చేసిరో వారిని, వాసః-స్రక్-మండన-ఆదిభిః= వస్త్రములు పుష్పమాలలు అలంకారములు మొదలగువాటితో, ఆనర్చ= పూజించెను.

రుక్మిణి, సత్యభామ, భద్ర, జాంబవతి, కాలింది, మిత్రవింద, లక్ష్మణ, పతివ్రత మరియు నగ్నజిత్తు కుమారై అగు సత్య అనే శ్రీకృష్ణుని భార్యలనందరిని, మరియు అచటకు విచ్చేసిన ఇతరస్త్రీలను కూడ, అత్తగారగు కుంతి ప్రేరేపించగా ద్రౌపది వస్త్రములు, పుష్పమాలలు, అలంకారములు, తాంబూలము మొదలగువాటితో సత్కరించెను.

సుఖం నివాసయామాస ధర్మరాజో జనార్దనమ్ ।
ససైన్యం సానుగామాత్యం సభార్యం చ నవం నవమ్ ॥ 44

ధర్మరాజః= ధర్మరాజు, ససైన్యమ్= సైన్యముతో కూడినట్టియు, స-అనుగ-అమాత్యమ్= అనుచరులతో మంత్రులతో కూడినట్టియు, సభార్యం చ= భార్యలతో కూడిన, జన-అర్దనమ్= దుష్టశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానుని, నవం నవమ్= కొత్త కొత్తగా, సుఖమ్= సుఖముగా, నివాసయామాస= నివాసమునేర్పాటు చేసెను.

దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానునకు, ఆయన సైన్యమునకు, అనుచరులకు, మంత్రులకు, భార్యలకు కూడ ధర్మరాజు ప్రతిదినము కొత్త కొత్త ఏర్పాట్లతో సుఖమగు నివాసమును కల్పించెను.

తర్పయిత్వా ఖాండవేన వహ్నిం ఫాల్గునసంయుతః ।
మోచయిత్వా మయం యేన రాజ్ఞే దివ్యా సభా కృతా ॥ 45

ఫాల్గునసంయుతః= అర్జునునితో కూడియున్న శ్రీకృష్ణుడు, ఖాండవేన= ఖాండవవనముచే, వహ్నిమ్= అగ్నిని, తర్పయిత్వా= తృప్తి పరచి, మయమ్= మయుని, మోచయిత్వా= విడిపించి, యేన= ఎవనిచే, రాజ్ఞే= ధర్మరాజు కొరకు, దివ్యా= ప్రకాశించే, సభా= సభ, కృతా= చేయబడెనో.

శ్రీకృష్ణుడు అర్జునునితో కూడి ఖాండవవనమును సమర్పించి అగ్నిదేవునకు తృప్తి కలిగించెను. మయుని అగ్నినుండి విడిపించగా, ఆయన ప్రకాశించే సభను నిర్మించి ధర్మరాజునకు సమర్పించెను.

ఉవాస కతిచిన్మాసాన్ రాజ్ఞః ప్రియచికీర్షయా ।
విహరన్ రథమారుహ్య ఫాల్గునేన భటైర్వృతః ॥ 46

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకసప్తతితమోఽధ్యాయః।

రాజ్ఞః= ధర్మరాజునకు, ప్రియచికీర్షయా= ప్రీతిని కలిగించే కోరికతో, ఫాల్గునేన= అర్జునునితో, రథమ్= రథమును, ఆరుహ్య= ఎక్కి, విహరన్= విహరించువాడై, భటైఃr= భటులచే, వృతః= చుట్టువారబడినవాడై, కతిచిత్= కొన్ని, మాసాన్= మాసములను, ఉవాస= నివసించెను.

శ్రీకృష్ణుడు ధర్మరాజునకు ప్రీతిని కలిగించగోరి అక్కడనే కొన్ని నెలలు నిరంతరముగా నివసించెను. ఆయన సేవకులు వెంట రాగా అర్జునునితో కలిసి రథమునెక్కి విహరిస్తూ కాలమును గడిపెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు విచ్చేయుటను వర్ణించే
డెబ్బది ఒకటవ అధ్యాయము ముగిసినది (71).

* * *

అథ ద్విసప్తతితమోఽధ్యాయః

ధర్మరాజు రాజసూయము – జరాసంధుని ఉద్ధారము

శ్రీశుక ఉవాచ ।

ఏకదా తు సభామధ్యే ఆస్థితో మునిభిర్వృతః ।
బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యై ర్భ్రాతృభిశ్చ యుధిష్ఠిరః ॥ 1

ఆచార్యైః కులవృద్ధైశ్చ జ్ఞాతిసంబంధిబాంధవైః ।
శృణ్వతామేవ చైతేషామాభాష్యేదమువాచ హ ॥ 2

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఏకదా తు= ఒకనాడైతే, యుధిష్ఠిరః= ధర్మరాజు, సభామధ్యే= సభయొక్క మధ్యయందు, ఆస్థితః= ఆసనమునధిష్ఠించినవాడు, మునిభిః= మహర్షులచే, బ్రాహ్మణైః = బ్రాహ్మణులచే, క్షత్రియైఃక్షత్రియులచే, వైశ్యైఃవైశ్యులచే, భ్రాతృభిః చ= సోదరులచే గూడ, ఆచార్యైఃఆచార్యులచే, కులవృద్ధైః చ= కులముయొక్క పెద్దలచే కూడ, జ్ఞాతి–సంబంధిబాంధవైఃజ్ఞాతులచే, సంబంధీకులచే, బంధువులచే, వృతఃచుట్టువారబడినవాడు, ఏతేషామ్= వీరు, శృణ్వతాం చ= వినుచుండగా, ఆభాష్య= సంబోధించి, ఇదమ్= ఈ మాటను, ఉవాచ హ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఒకనాడు ధర్మరాజు సభామధ్యము నందు ఆసనమునధిష్ఠించి యుండెను. ఆయన చుట్టూ మహర్షులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, సోదరులు, ఆచార్యులు, కులపెద్దలు, జ్ఞాతులు, సంబంధీకులు, బంధువులు ఉండిరి. వారు వినుచుండగా ఆయన శ్రీకృష్ణుని సంబోధించి ఇట్లు పలికెను.

యుధిష్ఠిర ఉవాచ ।

క్రతురాజేన గోవింద రాజసూయేన పావనీః
యక్ష్యే విభూతీర్భవతస్తత్సంపాదయ నః ప్రభో ॥ 3

యుధిష్ఠిరుఁ = ధర్మరాజు, ఉవాచ= పలికెను, గోవింద= ఓగోవిందా!, క్రతురాజేన= క్రతువులలో రాజైన, రాజసూయేన= రాజసూయముచే, పావనీఃం= పవిత్రము చేసే, భవతఃం= నీ, విభూతీఃం= విభూతులను, యక్ష్యే= ఆరాధించగలను, ప్రభో= ఓ ప్రభూ!, నఃం= మాకు, తత్= దానిని, సంపాదయ= సంపన్నముచేయుము.

ధర్మరాజు ఇట్లు పలికెను...ఓ గోవిందా! నేను యజ్ఞములలో రాజైన రాజసూయముచే పావనము చేసే నీ విభూతులగు దేవతల నారాధించెదను. ఓ ప్రభూ! నీవు మాకు దానిని సంపన్నము చేయుము.

త్వత్పాదుకే అవిరతం పరి యే చరంతి
ధ్యాయంత్యభద్రనశనే శుచయో గృణంతి ।
విందంతి తే కమలనాభ భవాపవర్గం
ఆశాసతే యది త ఆశిష ఈశ నాన్యే ॥ 4

కమలనాభ= ఓ పద్మనాభా!, శుచయఃం= శుద్ధాంతఃకరణము గల, యే= ఎవరైతే, అభద్రనశనే= అమంగళములను నాశము చేసే, త్వత్-పాదుకే= నీ పాదములను, అవిరతమ్= నిరంతరముగా, పరిచరంతి= సేవించెదరో, ధ్యాయంతి= ధ్యానించెదరో, గృణంతి= కీర్తించెదరో, తే= వారు, భవ-అపవర్గమ్= సంసారమునుండి విముక్తిని, విందంతి= పొందెదరు, ఈశ= ఓ ఈశ్వరా!, తే= వారు, ఆశిషఃం= కామనలను, యది ఆశాసతే= కోరినట్లైతే, అన్యే= ఇతరులు, న= కాదు.

ఓ పద్మనాభా! ఎవరైతే అమంగళములను నాశము చేసే నీ పాదములను శుద్ధాంతఃకరణముతో నిరంతరముగా కొలిచెదరో, ధ్యానించెదరో, కీర్తించెదరో, వారు సంసారమునుండి విముక్తిని పొందెదరు. ఓ ఈశ్వరా! వారు కామనలను కోరినచో, వాటిని కూడ పొందెదరు. ఇతరులు దేనినీ పొందరు.

తద్దేవదేవ భవతశ్చరణారవింద-
సేవాఽనుభావమిహ పశ్యతు లోక ఏషః ।
యే త్వాం భజంతి న భజంత్యుత వోభయేషాం
నిష్కాం ప్రదర్శయ విభో కురుసృంజయానామ్ ॥ 5

దేవదేవ= ఓ దేవదేవా!, తత్= అందువలన, ఇహ= ఈ లోకమునందు, ఏషః= ఈ, లోకః= మానవుడు, భవతః= నీ, చరణ-అరవింద సేవా-అనుభావమ్= పద్ములవంటి పాదముల సేవయొక్క మహిమను, పశ్యతు= చూచుగాక!, విభో= ఓ ప్రభూ!, కురుసృంజయానామ్= కురుసృంజయ వంశముల రాజులలో, యే= ఎవరైతే, త్వామ్= నిన్ను, భజంతి= సేవించెదరో, ఉత వా= లేదా, న భజంతి= సేవించరో, ఉభయేషామ్= ఇద్దరికి, నిష్కామ్= స్థితిని, ప్రదర్శయ= చూపించుము.

ఓ దేవదేవా! కావున, ఈ లోకమునందు నీ పాదసేవయొక్క మహిమనీ మానవుడు తెలియవలెను. ఓ విభూ! కురుసృంజయ వంశీయులలో ఎవరైతే నిన్ను సేవిస్తారో, లేదా నిన్ను సేవించరో, వారిద్దరికి కలిగే ఫలమును నీవు నిరూపించుము.

న బ్రహ్మణ స్స్వపరభేదమతి స్తవ స్యాత్
సర్వాత్మన స్సమదృశ స్స్వసుఖానుభూతేః ।
సంసేవతాం సురతరోరివ తే ప్రసాదః
సేవానురూపముదయో న విపర్యయోఽత్ర ॥ 6

బ్రహ్మణః= పరబ్రహ్మవైనట్టియు, సర్వ-ఆత్మనః= సర్వమునకు ఆత్మరూపుడవైనట్టియు, సమదృశః= సమదృష్టి కలిగినట్టియు, స్వసుఖ-అనుభూతేః= ఆత్మానందానుభవరూపుడవగు, తవ- నీకు, స్వపరభేద-మతిః= తనవారు పరాయివారు అనే భేదబుద్ధి, న స్యాత్= ఉండదు,

సంసేవతామ్= బాగుగా సేవించువారలకు, తే= నీయొక్క, ప్రసాదః= అనుగ్రహము, ఉదయః= ఫలము, సురతరోః-ఇవ= కల్పవృక్షమునకు వలె, సేవా-అనురూపమ్= సేవకు తగ్గది, అత్ర= దీనియందు, విపర్యయః = వ్యత్యాసము, న= లేదు.

పరబ్రహ్మవగు నీవు సర్వమునందు ఆత్మరూపుడవై ఉన్నావు. ఆత్మానందానుభవమే స్వరూపముగా గల నీకు సమదృష్టియే గాని, తనవారు పరాయివారు అనే భేదబుద్ధి ఉండదు. కాని, కల్పవృక్షమును వలె నిన్ను బాగుగా సేవించువారలకు నీ అనుగ్రహము కలుగును. వారికి కలిగే ఫలము కూడ వారి సేవకు తగ్గట్లుగనే ఉండును. దీని విషయములో నీయందు పక్షపాతబుద్ధి, కఠోరత మొదలగు దోషములకు తావులేదు.

శ్రీభగవానువాచ ।

సమ్యగ్వ్యవసితం రాజన్ భవతా శత్రుకర్శన ।
కల్యాణీ యేన తే కీర్తిర్లోకానను భవిష్యతి ॥ 7

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, శత్రుకర్శన= శత్రువులను కృశింపజేయు వాడా!, భవతా= నీచే, సమ్యక్= బాగుగా, వ్యవసితమ్= నిశ్చయించ బడినది, యేన= దేనిచేనైతే, తే= నీ, కల్యాణీ= మంగళప్రదమగు, కీర్తిః= కీర్తి, లోకాన్= లోకములను, అను భవిష్యతి= వ్యాపించగలదో.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...శత్రువులను కృశింపజేసే ఓ ధర్మరాజా! నీవు చాల చక్కని నిశ్చయమును చేసితివి. దానిచే నీ కీర్తి లోకములలో వ్యాపించగలదు.

ఋషీణాం పితృదేవానాం సుహృదామపి నః ప్రభో ।
సర్వేషామపి భూతానామీప్సితః క్రతురాడయమ్ ॥ 8

ప్రభో= ఓ రాజా!, అయమ్= ఈ, క్రతురాట్= యజ్ఞరాజము, ఋషీణామ్= మహర్షులకు, పితృదేవానామ్= పితృదేవతలకు, సుహృదామ్= బంధువులకు, నః అపి= మాకు కూడ, సర్వేషామ్= సకలములైన, భూతానాం అపి= ప్రాణులకు కూడ, ఈప్సితః= అభీష్టము.

ఓ ధర్మరాజా! యజ్ఞములలో రాజగు ఈ రాజసూయము మహర్షులకు, పితృదేవతలకు, బంధువులకు, మాకు, సకలప్రాణులకు కూడ అభీష్టము.

విజిత్య నృపతీన్ సర్వాన్ కృత్వా చ జగతీం వశే ।
సంభృత్య సర్వసంభారానాహరస్వ మహాక్రతుమ్ ॥ 9

సర్వాన్= అందరు, నృపతీన్= రాజులను, విజిత్య= జయించి, జగతీం చ= పృథివిని కూడ, వశే= వశమునందు, కృత్వా= చేసి, సర్వ-సంభారాన్= సకలసామగ్రులను, సంభృత్య= సంపాదించి, మహాక్రతుమ్= గొప్ప యజ్ఞమును, ఆహరస్వ= అనుష్ఠించుము.

రాజులనందరిని జయించి పృథివిని వశములోకి తెచ్చుకొని, సకల సామగ్రిని సంపాదించి గొప్ప యజ్ఞమైన రాజసూయమును చేయుము.

ఏతే తే భ్రాతరో రాజన్ లోకపాలాంశసంభవాః ।
జితోఽస్మ్యాత్మవతా తేఽహం దుర్జయో యోఽకృతాత్మభిః ॥10

రాజన్= ఓ రాజా!, ఏతే= ఈ, తే= నీ, భ్రాతరః= తమ్ములు, లోకపాల-అంశసంభవాః= లోకపాలకుల అంశలనుండి పుట్టినవారు, ఆత్మవతా= మనోనిగ్రహము గల, తే= నీచే, అహమ్= నేను, జితః= జయించబడిన వాడను, అస్మి= అగుదును, యః= ఏ నేను, అకృత-ఆత్మభిః= నిగ్రహించ బడని మనస్సు గలవారిచే, దుర్జయః= జయించ శక్యము కానివాడనో.

ఓ రాజా! ఈ నీ సోదరులు ఇంద్రాదిలోకపాలకుల అంశలచే జన్మించినవారు. జితేంద్రియులు కానివారిచే పొందబడని నేను జితేంద్రియుడవగు నీచే వశము చేసుకొనబడితిని.

న కశ్చిన్మత్పరం లోకే తేజసా యశసా శ్రియా ।
విభూతిభిర్వాఽభిభవేద్దేవోఽపి కిము పార్థివః ॥ 11

లోకే= లోకమునందు, కశ్చిత్= ఎవడైనా, దేవః అపి= దేవతయే అయినా, మత్-పరమ్= నన్ను శరణు జొచ్చినవానిని, తేజసా= తేజస్సుచే, యశసా= కీర్తిచే, శ్రియా= సంపదచే, విభూతిభిః వా= ప్రభావములచే గాని, న అభిభవేత్= తిరస్కరించలేడు, పార్థివః= రాజూ (తిరస్కరించలేడని), కిము= చెప్పవలెనా?

లోకములో ఎవడైనా దేవతయే అయినా నన్ను శరణు జొచ్చిన భక్తుని తేజస్సుచే గాని, కీర్తిచే గాని, సంపదచే గాని, ప్రభావములచే గాని తిరస్కరించలేడు. రాజు ఎవడైనా తిరస్కరించలేడని వేరుగా చెప్పవలెనా?

శ్రీశుక ఉవాచ ।

నిశమ్య భగవద్గీతం ప్రీతః ఫుల్లముఖాంబుజః ।
భ్రాతౄన్ దిగ్విజయేఽయుంక్త విష్ణుతేజోపబృంహితాన్ ॥ 12

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భగవద్-గీతమ్= శ్రీకృష్ణ భగవానునిచే చెప్పబడినదానిని, నిశమ్య= విని, ప్రీతః సంతోషించినవాడు, ఫుల్లముఖ-అంబుజః= వికసించిన పద్మమువంటి ముఖము గలవాడు అగు ధర్మరాజు, విష్ణుతేజః-ఉపబృంహితాన్= విష్ణువు యొక్క తేజస్సుచే వర్ధిల్లజేయబడిన, భ్రాతౄన్= తమ్ములను, దిగ్-విజయే= దిక్కులను జయించుటయందు, అయుంక్త= నియోగించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన మాటను విని ధర్మరాజు చాల సంతోషించెను. పద్మమువంటి ఆయన ముఖము వికసించెను. విష్ణువుయొక్క తేజస్సుచే వర్ధిల్లజేయబడిన తమ్ములనాయన దిక్కులను జయించుడని నియోగించెను.

సహదేవం దక్షిణస్యామాదిశత్సహ సృంజయైః ।
దిశి ప్రతీచ్యాం నకులముదీచ్యాం సవ్యసాచినమ్ ।
ప్రాచ్యాం వృకోదరం మత్స్యైః కేకయైస్సహ మద్రకైః ॥ 13

దక్షిణస్యామ్= దక్షిణదిక్కునందు, సృంజయైః సహ= సృంజయులతో బాటుగా, సహదేవమ్= సహదేవుని, ప్రతీచ్యామ్= పడమర, దిశి= దిక్కునందు, మత్స్యైః= మత్స్యదేశీయులతో, నకులమ్= నకులుని, ఉదీచ్యామ్= ఉత్తరమునందు, కేకయైఃః= కేకయదేశీయులతో, సవ్యసాచినమ్= అర్జునుని, ప్రాచ్యామ్= తూర్పునందు, మద్రకైఃః= సహ= మద్ర దేశీయులతో బాటుగా, వృక-ఉదరమ్= భీముని, ఆదిశత్= నియోగించెను.

ధర్మరాజు దక్షిణదిక్కునందు సృంజయదేశవీరులతో బాటు సహదేవుని, పడమర దిక్కునందు మత్స్యవీరులతో బాటు నకులుని, ఉత్తరమునందు కేకయులతో బాటు అర్జునుని, తూర్పునందు మద్రవీరులతో బాటు భీమసేనుని నియోగించెను.

తే విజిత్య నృపాన్ వీరా ఆజహ్రుర్దిగ్భ్య ఓజసా ।
అజాతశత్రవే భూరి ద్రవిణం నృప యక్ష్యతే ॥ 14

నృప= ఓ రాజా!, తే= ఆ, వీరాఃః= వీరులు, నృపాన్= రాజులను, ఓజసా= బలముతో, విజిత్య= జయించి, దిగ్భ్యఃః= దిక్కులనుండి, భూరి= అధికమగు, ద్రవిణమ్= ధనమును, యక్ష్యతే= యాగము చేయబోవు చున్న, అజాతశత్రవే= ధర్మరాజు కొరకు, ఆజహ్రుఃః= తీసుకువచ్చిరి.

ఓ రాజా! ఆ వీరులు బలముతో రాజులను జయించి దిక్కులనుండి చాల ధనమును యాగము చేయబోయే ధర్మరాజు కొరకు తీసుకు వచ్చిరి.

శ్రుత్వాఽజితం జరాసంధం సనృపతేర్ధ్యాయతో హరిః ।
ఆహోపాయం తమేవాద్య ఉద్ధవో యమువాచ హ ॥ 15

అజితమ్= జయించబడని, జరాసంధమ్= జరాసంధుని గురించి, శ్రుత్వా= విని, ధ్యాయతః= చింతిల్లుచున్న, నృపతేః= ధర్మరాజునకు, ఆద్యః= సర్వజగత్కారణుడగు, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, తమ్= ఆ, ఉపాయం ఏవ= ఉపాయమునే, ఆహ= చెప్పెను, యం హ= దేనినైతే, ఉద్ధవః= ఉద్ధవుడు, ఉవాచ= చెప్పెనో.

జరాసంధుడింకనూ జయించబడలేదని విని చింతిల్లుచున్న ధర్మరాజునకు సర్వజగత్కారణుడగు శ్రీకృష్ణభగవానుడు, ఇదివరలో ఉద్ధవుడు చెప్పిన ఉపాయమునే చెప్పెను.

భీమసేనోఽర్జునః కృష్ణో బ్రహ్మలింగధరాస్త్రయః ।
జగ్ముర్గిరివ్రజం తాత బృహద్రథసుతో యతః ॥ 16

తాత= వత్సా!, భీమసేనః= భీమసేనుడు, అర్జునః= అర్జునుడు, కృష్ణః= శ్రీకృష్ణుడు, త్రయః ముగ్గురు, బ్రహ్మలింగధరాః= బ్రాహ్మణ చిహ్నములను ధరించువారై, గిరివ్రజమ్= గిరివ్రజమును గురించి, జగ్ముః = వెళ్లిరి, యతః= ఎక్కడనైతే, బృహద్రథసుతః= బృహద్రథుని పుత్రుడగు జరాసంధుడు గలడో.

నాయనా! పరీక్షిత్తూ! భీమసేనుడు, అర్జునుడు, శ్రీకృష్ణుడు ముగ్గురు బ్రాహ్మణవేషములను దాల్చి, బృహద్రథుని పుత్రుడగు జరాసంధుడు ఉండే గిరివ్రజమునకు వెళ్లిరి.

తే గత్వాఽఽతిథ్యవేలాయాం గృహేషు గృహమేధినమ్ ।
బ్రహ్మణ్యం సమయాచేరన్ రాజన్యా బ్రహ్మలింగినః ॥ 17

బ్రహ్మలింగినః= బ్రాహ్మణవేషధారులగు, తే= ఆ, రాజన్యాః= క్షత్రియులు, గృహేషు= ఇంటియందు, ఆతిథ్యవేలాయామ్= ఆతిథ్యము–నిచ్చే వేళయందు, గృహమేధినమ్= గృహస్థుడైన, బ్రహ్మణ్యమ్= బ్రాహ్మణ–భక్తుడగు జరాసంధుని గురించి, గత్వా= వెళ్లి, సమయాచేరన్= సరియగు రీతిలో యాచించిరి.

గృహస్థులు అతిథులకు భోజనము పెట్టే మధ్యాహ్నవేళయందు ఆ ముగ్గురు క్షత్రియులు బ్రాహ్మణవేషముతో బ్రాహ్మణభక్తుడగు జరాసంధుని ఇంటికి వెళ్లి, యోగ్యమగు రీతిలో ఇట్లు యాచించిరి.

రాజన్ విద్ధ్యతిథీన్ ప్రాప్తానర్థినో దూరమాగతాన్ ।
తన్నః ప్రయచ్ఛ భద్రం తే యద్వయం కామయామహే ॥ 18

రాజన్= ఓ రాజా!, నః= మమ్ములను, దూరమ్= దూరము, ఆగతాన్= వచ్చినట్టియు, అర్థినః= కోరిక గలవారినిగను, ప్రాప్తాన్= విచ్చేసిన, అతిథీన్= అతిథులగను, విద్ధి= తెలియుము, తత్= దానిని, ప్రయచ్ఛ= ఇమ్ము, యత్= దేనిని, వయమ్= మేము, కామయామహే= కోరెదమో, తే= నీ కొరకు, భద్రమ్= మంగళమగు గాక!

రాజా! మేము దూరము పయనించి వచ్చిన అతిథులమని తెలియుము. మేము దేనిని కోరెదమో, దానిని మాకిమ్ము. నీకు మంగళమగు గాక!

కిం దుర్మర్షం తితిక్షూణాం కిమకార్యమసాధుభిః ।
కిం న దేయం వదాన్యానాం కః పరస్సమదర్శినామ్ ॥ 19

తితిక్షూణామ్= సహనశక్తి గలవారలకు, కిమ్= ఏది, దుర్మర్షమ్= సహింప శక్యము కానిది?, అసాధుభిః= దుష్టులచే, అకార్యమ్ చేయబడ–కూడనిది, కిమ్= ఏది?, వదాన్యానామ్= దాతలకు, కిమ్= ఏది, న

దేయమ్= ఈయబడరానిది?, సమదర్శినామ్= సమదృష్టి గలవారలకు, పరః = పరుడు, కః= ఎవడు?

సహనశక్తి గలవారికి సహింప శక్యము కానిది ఏది? (ఏదీ లేదు). దుష్టులు చేయలేనిది ఏది? (ఏదీ లేదు). దాతలు ఈయలేనిది ఏది? (ఏదీ లేదు). సమదృష్టి గలవారికి పరుడెవరు? (ఎవరూ లేరు).

యోఽనిత్యేన శరీరేణ సతాం గేయం యశో ధ్రువమ్ ।
నాచినోతి స్వయం కల్పస్స వాచ్యశ్శోచ్య ఏవ సః ॥ 20

యః = ఎవడైతే, స్వయమ్= తాను, కల్పః= సమర్థుడై, అనిత్యేన= అనిత్యమగు, శరీరేణ= శరీరముతో, సతామ్= సత్పురుషులచే, గేయమ్= గానము చేయబడునట్టియు, ధ్రువమ్= నిత్యమైన, యశః= కీర్తిని, న ఆచినోతి= సంపాదించడో, సః= అట్టివాడు, వాచ్యః= నిందించదగిన వాడు, సః= ఆతడు, శోచ్యః ఏవ= జాలిపడదగ్గవాడే.

ఎవడైతే తాను సమర్థుడై యుండి అనిత్యమగు శరీరముతో సత్పురుషులచే గానము చేయబడే నిత్యమైన కీర్తిని సంపాదించడో, అట్టివాడు నిందించదగినవాడు. ఆతడు నిశ్చయముగా శోచనీయుడు.

హరిశ్చంద్రో రంతిదేవ ఉంఛవృత్తిశ్శిబిర్బలిః ।
వ్యాధః కపోతో బహవో హ్యధ్రువేణ ధ్రువం గతాః ॥ 21

హి= ఏలయన, హరిశ్చంద్రః= హరిశ్చంద్రుడు, రంతిదేవః= రంతిదేవుడు, ఉంఛవృత్తిః= కల్లములోని గింజలనేరుకొని బ్రతికిన ముద్గలుడు, శిబిః= శిబి, బలిః= బలి, వ్యాధః= కిరాతుడు, కపోతః= పావురము, బహవః= అనేకులు, అధ్రువేణ= అనిత్యమగు జీవితముతో, ధ్రువమ్= నిత్యమగు మోక్షమును, గతాః= పొందినవారు.

ఏలయన, హరిశ్చంద్రుడు, రంతిదేవుడు, ముద్గలుడు, శిబి, బలి, కిరాతుడు, పావురము మొదలైన అనేకులు అనిత్యమగు జీవితమును

త్యాగము చేసి నిత్యమగు మోక్షమును పొందిరి. (ముద్గలుడు కల్లములో ఏరి సంపాదించిన గింజలతో వచ్చిన ఆహారమును దానము చేసెను. పావురము అతిథియగు కిరాతునకు తన మాంసమునీయగా, ఆ కిరాతుడు విరక్తుడై మహాప్రస్థానముచే జీవితమును త్యాగము చేసెను).

శ్రీశుక ఉవాచ ।

స్వరైరాకృతిభిస్తాంస్తు ప్రకోష్ఠైర్జ్ఞాహతైరపి ।
రాజన్యబంధూన్ విజ్ఞాయ దృష్టపూర్వానచింతయత్ ॥ 22

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, తాన్ తు= వారినైతే, స్వరైః= కంఠస్వరములచే, ఆకృతిభిః= ఆకారములచే, జ్ఞాహతైః= నారిత్రాడు తగిలి కాయలు కాచిన, ప్రకోష్ఠైః= ముంజేతులచే, రాజన్య-బంధూన్= నికృష్టులగు రాజులనుగా, దృష్టపూర్వాన్= ఇదివరలో చూడ-బడినవారినిగా, విజ్ఞాయ= తెలుసుకొని, అచింతయత్= తలపోసెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...వారి కంఠస్వరములు, ఆకారములు, నారిత్రాడు తగిలి కాయలు కాచిన ముంజేతులు అనువాటిని బట్టి వారు క్షత్రియులనియు, యాచనను బట్టి నికృష్టులనియు, తాను ఇదివరలో చూచినవారేననియు జరాసంధుడు గుర్తు పట్టి ఇట్లు తలపోసెను.

రాజన్యబంధవో హ్యేతే బ్రహ్మలింగాని బిభ్రతి ।
దదామి భిక్షితం తేభ్య ఆత్మానమపి దుస్త్యజమ్ ॥ 23

ఏతే= వీరు, హి= నిశ్చయముగా, రాజన్యబంధవః= రాజులు బంధువులుగా గలవారు, బ్రహ్మలింగాని= బ్రాహ్మణచిహ్నములను, బిభ్రతి= ధరించుచున్నారు, తేభ్యః= వారి కొరకు, భిక్షితమ్= కోరబడిన దానిని, దుస్త్యజమ్= విడువ శక్యము కాని, ఆత్మానం అపి= దేహము నైననూ, దదామి= ఇచ్చెదను.

వీరు నిశ్చయముగా నికృష్ట క్షత్రియులే. కాని, బ్రాహ్మణవేషములను వేసుకున్నారు. దేహమును విడిచిపెట్టుట చాల కష్టము. అయినా, వీరు కోరితే దేహమును కూడ ఇచ్చివేసెదను.

బలేర్ను శ్రూయతే కీర్తిర్వితతా దిక్ష్వకల్మషా ।
ఐశ్వర్యాద్భ్రంశితస్యాపి విప్రవ్యాజేన విష్ణునా ॥ 24

శ్రియ జిహీర్షతేంద్రస్య విష్ణవే ద్విజరూపిణే ।
జానన్నపి మహీం ప్రాదాద్వార్యమాణోఽపి దైత్యరాట్ ॥ 25

ఇంద్రస్య= ఇంద్రునకు, శ్రియమ్= సంపదను, జిహీర్షతా= లాగుకొనగోరే, విష్ణునా= విష్ణువుచే, విప్రవ్యాజేన= బ్రహ్మచారి అనే మిషతో, ఐశ్వర్యాత్= రాజ్యాధికారమునుండి సంపదనుండి, భ్రంశితస్య= జారిపోవునట్లు చేయబడినప్పటికీ, బలేః= బలయొక్క, అకల్మషా= స్వచ్ఛమైన, కీర్తిః= కీర్తి, దిక్షు= దిక్కులయందు, వితతా ను= నిశ్చయముగా వ్యాపించినదై, శ్రూయతే= వినవచ్చుచున్నది, ద్విజరూపిణే= బ్రాహ్మణ రూపమును కలిగియున్న, విష్ణవే= విష్ణువు కొరకు, దైత్యరాట్= రాక్షస చక్రవర్తియగు బలి, జానన్ అపి= తెలిసినవాడే అయినా, వార్యమాణః అపి= వారింపబడుచున్నవాడే అయినా, మహీమ్= భూమిని, ప్రాదాత్= దానము చేసెను.

ఇంద్రుని కొరకై సంపదను లాగుకొనగోరి విష్ణువు బ్రహ్మచారి వేషముతో బలిచక్రవర్తిని రాజ్యాధికారమునుండి, సంపదలనుండి జారిపోవునట్లు చేసెను. ఆ బలియొక్క స్వచ్ఛమైన కీర్తి దిక్కులలో నిశ్చయముగా వ్యాపించి ఈనాటికి వినవచ్చుచునే యున్నది. ఆ చక్రవర్తి ఈతడు విష్ణువు అని తెలిసినా, వద్దని శక్రుడు వారించుచున్నా, భుమిని బ్రాహ్మణరూపధారియగు విష్ణువునకు దానము చేసెను.

జీవతా బ్రాహ్మణార్థాయ కో న్వర్థః క్షత్రబంధునా ।
దేహేన పతమానేన నేహతా విపులం యశః ॥ 26

పతమానేన= పడిపోవుచున్న, దేహేన= దేహముతో, జీవతా= జీవించి ఉన్నట్టియు, బ్రాహ్మణ–అర్థాయ= బ్రాహ్మణుని ప్రయోజనము కొరకై, విపులమ్= విశాలమగు, యశః= కీర్తిని, న ఈహతా= కాంక్షించని, క్షత్రబంధునా= నికృష్ట క్షత్రియునిచే, అర్థః= ప్రయోజనము, కః ను= ఏమి గలదు?

ఈ దేహము ప్రతిక్షణము నశిస్తూనే ఉంది. దీనితో జీవించి–నందులకు వేదవేత్తలకు సేవ చేసి గొప్ప కీర్తిని సంపాదించవలెను. అట్లు చేయగోరని నికృష్ట క్షత్రియుడు జీవించి యేమి లాభము?

ఇత్యుదారమతిః ప్రాహ కృష్ణార్జునవృకోదరాన్ ।
హే విప్రా వ్రియతాం కామో దదామ్యాత్మశిరోఽపి వః ॥ 27

ఇతి= ఈ తీరున, ఉదారమతిః= ఉదారబుద్ధి గల జరాసంధుడు, కృష్ణ= అర్జునవృకోదరాన్= కృష్ణార్జునభీములనుద్దేశించి, ప్రాహ= పలికెను, హే విప్రాః= ఓ బ్రాహ్మణులారా!, కామః= కోరిక, వ్రియతామ్= కోరబడుగాక!, ఆత్మశిరః అపి= నా తలనైననూ, వః= మీ కొరకు, దదామి= ఇచ్చెదను.

ఈ విధమగు ఔదార్యముతో నిండిన బుద్ధి గల జరాసంధుడు శ్రీకృష్ణార్జునభీములతోనిట్లనెను – ఓ వేదవేత్తలారా! కోరికను కోరుడు. నేను నా తలనైననూ మీకు ఇచ్చెదను.

శ్రీభగవానువాచ ।

యుద్ధం నో దేహి రాజేంద్ర ద్వంద్వశో యది
మన్యసే । యుద్ధార్థినో వయం ప్రాప్తా రాజన్యా నాన్నకాంక్షిణః । 28

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, రాజ-ఇంద్ర= ఓ మహారాజా!, యది మన్యసే= నీవు ఇష్టపడినచో, నః= మా కొరకు, ద్వంద్వశః యుద్ధమ్= ద్వంద్వయుద్ధమును, దేహి= ఇమ్ము, యుద్ధమును కోరువారమై, ప్రాప్తాః= వచ్చినవారము, అన్నకాంక్షిణః= ఆహారమును కోరువారము, న= కాము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మహారాజా! నీకిష్టమైనచో మాకు ద్వంద్వయుద్ధమునిమ్ము. మేము యుద్ధమును కోరే క్షత్రియులమే కాని, ఆహారమును కోరువారము కాము.

అసౌ వృకోదరః పార్థస్తస్య భ్రాతాఽర్జునో హ్యయమ్ ।
అనయోర్మాతులేయం మాం కృష్ణం జానీహి తే రిపుమ్ ॥ 29

అసౌ= ఈతడు, పార్థః= కుంతీపుత్రుడగు, వృక-ఉదరః= భీముడు, అయం హి= ఈతడైతే, తస్య= ఆయనయొక్క, భ్రాతా= సోదరుడైన, అర్జునః= అర్జునుడు, మామ్= నన్ను, అనయోః= వీరిద్దరి, మాతులేయమ్= మేనమామ పుత్రుడైనట్టియు, తే= నీ, రిపుమ్= శత్రువైన, కృష్ణమ్= శ్రీకృష్ణుడనని, జానీహి= తెలియుము.

ఈతడు కుంతీపుత్రుడు భీముడు. ఈతడైతే భీముని తమ్ముడు అర్జునుడు. నేను వీరిద్దరి మేనమామ పుత్రుడను, నీ శత్రువును, కృష్ణుడనని తెలియుము.

ఏవమావేదితో రాజా జహాసోచ్చైస్స్మ మాగధః ।
ఆహ చామర్షితో మందా యుద్ధం తర్హి దదామి వః ॥ 30

ఏవమ్= ఈ విధముగా, ఆవేదితః= విన్నవించబడిన, మాగధః రాజా= మగధరాజగు జరాసంధుడు, ఉచ్చైః= బిగ్గరగా, జహాస స్మ= నవ్వెను, అమర్షితః= కోపము గలవాడై, ఆహ చ= మరియు పలికెను, మందాః= మూర్ఖులారా!, తర్హి= అట్లైనచో, వః= మీ కొరకు, యుద్ధమ్= యుద్ధమును, దదామి= ఇచ్చుచున్నాను.

ఈ విధముగా విన్నవించబడిన మగధరాజగు జరాసంధుడు బిగ్గరగా నవ్వెను. అప్పుడాతడు కోపముతో నిట్లనెను -- మూర్ఖులారా! అట్లైనచో, మీకు యుద్ధమునిచ్చెదను.

న త్వయా భీరుణా యోత్స్యే యుధి విక్లవచేతసా ।
మథురాం స్వపురీం త్యక్త్వా సముద్రం శరణం గతః ॥ 31

భీరుణా= భయస్వభావము కలిగినట్టియు, యుధి= యుద్ధము నందు, విక్లవచేతసా= వ్యాకులపడే మనస్సు గల, త్వయా= నీతో, న యోత్స్యే= యుద్ధము చేయను, స్వపురీమ్= నీ నగరమైన, మథురామ్= మథురను, త్యక్త్వా= విడిచిపెట్టి, సముద్రమ్= సముద్రమును, శరణమ్= నివాసమునుగా, గతః= పొందినవాడవు.

నీవు భయస్వభావుడవు. యుద్ధములో అస్థిరమైన మనస్సు గలవాడవు. నీవు నీ నగరమైన మథురను విడిచి సముద్రములో తల దాచుకొంటివి. నేను నీతో యుద్ధము చేయను.

అయం తు వయసాఽతుల్యో నాతిసత్త్వో న మే సమః ।
అర్జునో న భవేద్యోద్ధా భీమస్తుల్యబలో మమ ॥ 32

అయం= ఈ, అర్జునః తు= అర్జునుడైతే, వయసా= వయస్సుచే, అతుల్యః= సమానుడు కాడు, అతిసత్త్వః= అధికమగు బలము గలవాడు, న= కాదు, మే= నాకు, సమః= సముడు, న= కాడు, యోద్ధా= యుద్ధము చేయువాడు, న భవేత్= కాజాలడు, భీమః= భీముడు, మమ= నాకు, తుల్యబలః= సమానమైన బలము గలవాడు.

ఈ అర్జునుడైతే వయస్సులో నాతో సమానుడు కాదు. ఈతడు అధికబలము లేనివాడు. కావున, ఈతడు నాకు యుద్ధములో సమమైన ఉజ్జీ కాలేడు. భీముడు నాతో సమానమైన బలము గలవాడు.

ఇత్యుక్త్వా భీమసేనాయ ప్రాదాయ మహతీం గదామ్ ।
ద్వితీయాం స్వయమాదాయ నిర్జగామ పురాద్బహిః ॥ 33

ఇతి= అని, ఉక్త్వా= పలికి, భీమసేనాయ= భీమసేనుని కొరకు, మహతీమ్= పెద్ద, గదామ్= గదను, ప్రాదాయ= ఇచ్చి, ద్వితీయామ్= రెండవ గదను, స్వయమ్= తాను, ఆదాయ= తీసుకొని, పురాత్= నగరమునుండి, బహిః= బయటకు, నిర్జగామ= వెడలెను.

జరాసంధుడిట్లు పలికి పెద్ద గదనొకదానిని భీమునకిచ్చి, తాను మరో గదను తీసుకొని నగరము బయటకు వెళ్లెను.

తతస్సమే ఖలే వీరౌ సంయుక్తావితరేతరౌ ।
జఘ్నతుర్వజ్రకల్పాభ్యాం గదాభ్యాం రణదుర్మదౌ ॥ 34

తతః= తరువాత, సమే= చదునైన, ఖలే= యుద్ధరంగమునందు, వీరౌ= వీరులు, రణదుర్మదౌ= యుద్ధమునందు గర్వించినవారు అగు వారిద్దరు, సంయుక్తౌ= కలుసుకున్నవారై, వజ్రకల్పాభ్యామ్= వజ్రమును పోలిన, గదాభ్యామ్= గదలతో, ఇతర-ఇతరౌ= ఒకరినొకరు, జఘ్నతుః = కొట్టిరి.

తరువాత యుద్ధగర్వము గల ఆ వీరులిద్దరు చదునైన యుద్ధరంగము నందు కలుసుకొని ఒకరినొకరు వజ్రములవంటి గదలతో కొట్టుకొనిరి.

మండలాని విచిత్రాణి సవ్యం దక్షిణమేవ చ ।
చరతోశ్శుశుభే యుద్ధం నటయోరివ రంగిణోః ॥ 35

సవ్యమ్= ఎడమగా, దక్షిణం ఏవ చ= కుడిగా కూడ, విచిత్రాణి= పలు రకముల, మండలాని= గదాయుద్ధగతులను, చరతోః= చేయుచున్న వారిద్దరి, యుద్ధమ్= యుద్ధము, రంగిణోః= రంగస్థలమునందున్న, నటయోః ఇవ= నటులయొక్క వలె, శుశుభే= శోభిల్లెను.

రంగస్థలమునందలి నటులు వలె కుడి యెడమలయందు పలురకముల గదాయుద్ధగతులను చేస్తున్న వారిద్దరి ద్వంద్వయుద్ధము శోభిల్లెను.

తతశ్చటచటాశబ్దో వజ్రనిష్పేషసన్నిభః ।
గదయోః క్షిప్తయో రాజన్ దంతయోరివ దంతినోః ॥ 36

రాజన్= ఓ రాజా!, తతః= తరువాత, క్షిప్తయోః= విసరబడిన, గదయోః= రెండు గదలయొక్క, వజ్రనిష్పేషసన్నిభః= పిడుగుపాటును బోలిన, చటచటాశబ్దః= చటత్ చటత్ అనే శబ్దము, దంతినోః= ఏనుగులు, దంతయోః ఇవ= దంతముల (శబ్దము) వలె (ఉండెను).

ఓ పరీక్షిన్మహారాజా! అప్పుడు ఏనుగులు దంతములతో ఢీకొన్నట్లుగా వారు విసరుచున్న గదల చటచట ధ్వని పిడుగుపాటును పోలియుండెను.

తే వై గదే భుజజవేన నిపాత్యమానే
అన్యోన్యతోఽంసకటిపాదకరోరుజత్రూన్ ।
చూర్ణీబభూవతురుపేత్య యథాఽర్కశాఖే
సంయుధ్యతోర్విరదయోరివ దీప్తమన్యోః ॥ 37

అన్యోన్యతః= ఒకరిపైనొకరు, భుజజవేన= భుజములయొక్క వేగముచే, వై= నిశ్చయముగా, నిపాత్యమానే= విసరబడుచున్న, తే= ఆ, గదే= రెండు గదలు, అంసకటిపాదకర-ఈరుజత్రూన్= భుజ-స్కంధములు పార్శ్వములు కాళ్లు చేతులు తొడలు కొంకులను, ఉపేత్య= తగిలి, సంయుధ్యతోః= యుద్ధము చేయుచున్నట్టియు, దీప్తమన్యోః= ప్రజ్వరిల్లిన కోపము గల, విరదయోః= ఏనుగులయొక్క, అర్కశాఖే యథా= జిల్లేడు కొమ్మలు వలె, చూర్ణీబభూవతుః= చూర్ణమైనవి.

రెండు యేనుగులు రెట్టించిన కోపముతో జిల్లేడు కొమ్మలతో పోట్లాడినప్పుడు అవి ముక్కముక్కలగును. అదే విధముగా, వారిద్దరు ఒకరిపై నొకరు గదలను గట్టిగా విసరుచుండగా, అవి వారి భుజ-స్కంధములు, పార్శ్వములు, కాళ్లు, చేతులు, తొడలు, కొంకులకు తగిలి నుగ్గు నుగ్గైనవి.

ఇత్థం తయోః ప్రహృతయోర్గదయోర్నృవీరౌ ।
క్రుద్ధౌ స్వముష్టిభిరయస్పర్శైరపిష్టామ్ ।
శబ్దస్తయోః ప్రహరతోరిభయోరివాసీత్
నిర్ఘాతవజ్రపరుషస్తలతాడనోత్థః ॥ 38

ఇత్థమ్= ఈ విధముగా, తయోఃr= ఆ, గదయోఃr= గదలు రెండు, ప్రహృతయోఃr= విరిగిపోగా, క్రుద్ధౌ= కోపించిన, నృవీరౌ= మానవ వీరులగు భీమజరాసంధులు, అయఃస్పర్శైఃr= ఇనుముయొక్క తాకిడి గల, స్వముష్టిభిఃr= తమ పిడికిళ్లతో, అపిష్టామ్= కొట్టుకొనిరి, ఇభయోఃr ఇవ= ఏనుగులవంటి, తయోఃr= వారిద్దరు, ప్రహరతోఃr= కొట్టుకొను-చుండగా, తలతాడన-ఉత్థఃr= చరుపు వేసి కొట్టుట వలన పుట్టిన, శబ్దఃr = చప్పుడు, నిర్ఘాతవజ్రపరుషఃr= వర్షము లేని మేఘగర్జన పిడుగుపాటుల వలె కఠోరమైనది, ఆసీత్= ఆయెను.

ఈ విధముగా గదలు రెండు విరిగిపోగా, మానవులలోనే వీరులగు ఆ జరాసంధభీములు కోపముతో ఇనుముయొక్క తాకిడి గల తమ పిడికిళ్లతో కొట్టుకొనిరి. వారిద్దరు ఏనుగులవలె కొట్టుకుంటూ ఒకరినొకరు చరుపు వేసి కొట్టుట వలన పుట్టిన శబ్దము వర్షము లేని మేఘగర్జన, పిడుగుపాటుల వలె కఠోరముగా నుండెను.

తయోరేవం ప్రహరతోస్సమశిక్షాబలౌజసోః ।
నిర్విశేషమభూద్యుద్ధమక్షీణజవయోర్నృప ॥ 39

నృప= ఓ రాజా!, సమశిక్షాబల-ఓజసోఃసమానమైన శిక్షణ శరీరపాటవము మనశ్శక్తి కలిగినట్టియు, అక్షీణజవయోఃక్షీణించని వేగము గల, తయోఃవారిద్దరు, ఏవమ్ఈ విధముగా, ప్రహరతోఃకొట్టుకొనుచుండగా, నిర్విశేషమ్తేడా (సాటి) లేని, యుద్ధమ్యుద్ధము, అభూత్జరిగెను.

ఓ పరీక్షిన్మహారాజా! సమానమైన శిక్షణ, శరీరపాటవము, మనశ్శక్తి గల వారిద్దరు ఈ విధముగా కొట్టుకొనుచుండిరి. వారి వేగము క్షీణించలేదు. సాటిలేని ఆ యుద్ధములో గెలుపు-ఓటములు తేలకుండెను.

ఏవం తయోర్మహారాజ యుధ్యతోస్సప్తవింశతిః ।
దినాని నిరగంస్తత్ర సుహృద్వన్నిశి తిష్ఠతోః ॥ 40

మహారాజ= ఓ మహారాజా!, తత్ర= అక్కడ, తయోఃవారిద్దరు, నిశి= రాత్రియందు, సుహృద్-వత్మిత్రుల వలె, తిష్ఠతోఃఉంటున్న వారై, ఏవమ్ఈ విధముగా, యుధ్యతోఃయుద్ధము చేయుచుండగా, సప్తవింశతిఃఇరవై ఏడు, దినానిపగళ్లు, నిరగన్గడచినవి.

ఓ పరీక్షిన్మహారాజా! అక్కడ వారిద్దరు రాత్రి మిత్రుల వలె ఉంటూ ఈ తీరున యుద్ధము చేయుచుండగా, ఇరవై ఏడు దినములు గడచినవి.

ఏకదా మాతులేయం వై ప్రాహ రాజన్ వృకోదరః ।
న శక్తోఽహం జరాసంధం నిర్జేతుం యుధి మాధవ ॥ 41

రాజన్= ఓ రాజా!, ఏకదా వై= ఒకనాడైతే, వృకోదరఃభీముడు, మాతులేయమ్మేనమామ కొడుకగు శ్రీకృష్ణుని ఉద్దేశించి, ప్రాహపలికెను, మాధవ= హే శ్రీకృష్ణ భగవానుడా!, అహమ్నేను, యుధియుద్ధమునందు, జరాసంధమ్జరాసంధుని, నిర్జేతుమ్జయించుటకు, న శక్తఃసమర్థుడను కాను.

ఓ పరీక్షిన్మహారాజా! ఒకనాడు భీముడు మేనమామ కొడుకైన శ్రీకృష్ణునితో నిట్లనెను -ఓ భగవానుడా! యుద్ధములో జరాసంధుని జయించే శక్తి నాకు లేదు.

శత్రోర్జన్మమృతీ విద్వాన్ జీవితం చ జరాకృతమ్ ।
పార్థమాప్యాయయన్ స్వేన తేజసాఽచింతయద్ధరిః ॥ 42

శత్రోః= శత్రువగు జరాసంధుని, జన్మమృతీ= జన్మమరణములను, జరాకృతమ్= జర అనే రాక్షసిచే చేయబడిన, జీవితం చ= జీవితమును గురించి కూడ, విద్వాన్= తెలిసిన, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, పార్థమ్= పృథాపుత్రుడగు భీమని, స్వేన= తనదైన, తేజసా= తేజస్సుతో, ఆప్యాయయన్= వర్ధిల్లజేయువాడై, అచింతయత్= తలపోసెను.

శత్రువగు జరాసంధుని జన్మమరణములు, జర అనే రాక్షసి వానికి జీవితమునిచ్చిన విధి శ్రీకృష్ణ భగవానునకు తెలియును. ఆయన కుంతీపుత్రుడగు భీముని తన తేజస్సుతో వర్ధిల్లచేస్తూ ఆలోచించెను.

సంచింత్యారివధోపాయం భీమస్యామోఘదర్శనః ।
దర్శయామాస విటపం పాటయన్నివ సంజ్ఞయా ॥ 43

అరివధ-ఉపాయమ్= శత్రువును వధించే ఉపాయమును, సంచింత్య= బాగా ఆలోచించి, అమోఘదర్శనః= మొక్కవోని జ్ఞానము గల శ్రీకృష్ణుడు, భీమస్య= భీమునకు, సంజ్ఞయా= సైగచే, విటపమ్= కొమ్మను, పాటయన్ ఇవ= చీల్చుచున్నాడా యన్నట్లు, దర్శయామాస= చూపించెను.

శత్రువును వధించే ఉపాయమును గురించి లోతుగా ఆలోచించి, శ్రీకృష్ణుడు కొమ్మను చీలుస్తున్నాడా యన్నట్లు భీమునకు సైగ చేసెను.

తద్విజ్ఞాయ మహాసత్త్వో భీమః ప్రహరతాం వరః ।
గృహీత్వా పాదయోశ్శత్రుం పాతయామాస భూతలే ॥ 44

మహాసత్త్వుఁ= మహాబలశాలి, ప్రహరతామ్= శత్రువులను సంహరించు వారిలో, వరుఁ= శ్రేష్ఠుడు అగు, భీమఁ= భీముడు, తత్= దానిని, విజ్ఞాయ= తెలుసుకొని, శత్రుమ్= శత్రువును, పాదయోఁ= రెండు కాళ్లయందు, గృహీత్వా= పట్టుకొని, భూతలే= నేలపై, పాతయామాస= పడవైచెను.

మహాబలశాలియగు భీముడు శత్రువిజేతలలో దిట్ట. ఆయన ఆ సైగను అర్థము చేసుకొని శత్రువును రెండు కాళ్లతో పట్టుకొని నేలపై పడవైచెను.

ఏకం పాదం హదాఽఽక్రమ్య దోర్భ్యామన్యం ప్రగృహ్య సఁ ।
గుదతఁ పాటయామాస శాఖామివ మహాగజఁ ॥ 45

సఁ= ఆతడు, ఏకమ్= ఒక, పాదమ్= కాలిని, పదా= కాలితో, ఆక్రమ్య= తొక్కిపట్టి, అన్యమ్= మరో కాలిని, దోర్భ్యామ్= రెండు చేతులతో, ప్రగృహ్య= గట్టిగా పట్టుకొని, మహాగజఁ= పెద్ద యేనుగు, శాఖాం ఇవ= కొమ్మను వలె, గుదతఁ= గుదమునుండి, పాటయామాస= చీల్చివేసెను.

ఆ భీముడు జరాసంధుని ఒక కాలిని తన కాలితో తొక్కిపట్టి, రెండో కాలిని రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, పెద్ద యేనుగు కొమ్మను చీల్చినట్లుగా, గుదమునుండి చీల్చివేసెను.

ఏకపాదోరువృషణకటిపృష్ఠస్తనాంసకే ।
ఏకబాహ్వక్షిభ్రూకర్ణే శకలే దదృశుఁ ప్రజాఁ ॥ 46

ఏకపాద–ఊరువృషణకటిపృష్ఠస్తన–అంసకే= ఒకే కాలు తొడ–వృషణము పార్శ్వము స్తనము భుజము కలిగినట్టియు, ఏకబాహు–అక్షిభ్రూకర్ణే= ఒకే చేయి కన్ను కనుబొమ చెవి కలిగిన, శకలే= రెండు ముక్కలను, ప్రజాఁ= జనులు, దదృశుఁ= చూచిరి.

ఒకే కాలు, తొడ, వృషణము, పార్శ్వము, స్తనము, భుజము, చేయి, కన్ను, కనుబొమ, చెవి కల రెండు ముక్కలను జనులు చూచిరి.

హాహాకారో మహానాసీన్నిహతే మగధేశ్వరే ।
పూజయామాసతుర్భీమం పరిరభ్య జయాచ్యుతౌ ॥ 47

మగధ-ఈశ్వరే= మగధప్రభుడగు జరాసంధుడు, నిహతే= సంహరించబడగా, మహాన్= పెద్ద, హాహాకారః= హాహాకారము, ఆసీత్= ఆయెను, జయ-అచ్యుతౌ= అర్జునుడు శ్రీకృష్ణ భగవానుడు, భీమమ్= భీముని, పరిరభ్య= కౌగిలించి, పూజయామాసతుః= ప్రశంసించిరి.

మగధప్రభుడగు జరాసంధుడు సంహరించబడగా జనులు పెద్ద హాహాకారమును చేసిరి. శ్రీకృష్ణార్జునులు భీముని కౌగిలించి ప్రశంసించిరి.

సహదేవం తత్తనయం భగవాన్ భూతభావనః ।
అభ్యషించదమేయాత్మా మగధానాం పతిం ప్రభుః ।
మోచయామాస రాజన్యాన్ సంరుద్ధా మాగధేన యే ॥ 48

శ్రీమద్భాగవతమహాపురాణే దశమస్కంధే ద్విసప్తతితమోఽధ్యాయః ॥

భూతభావనః= ప్రాణులను కాపాడువాడు, అమేయ-ఆత్మా= ఇంద్రియ గోచరము కాని స్వరూపము గలవాడు, ప్రభుః= సర్వ శక్తిమంతుడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తత్-తనయమ్= ఆ జరాసంధుని పుత్రుడగు, సహదేవమ్= సహదేవుని, మగధానామ్= మగధదేశమునకు, పతిమ్= ప్రభువునుగా, అభ్యషించత్= అభిషేకించెను, రాజన్యాన్= క్షత్రియులను, మోచయామాస= విడిపించెను, యే= ఎవరైతే, మాగధేన= మగధప్రభుడగు జరాసంధునిచే, సంరుద్ధాః= బంధించబడిరో.

సర్వశక్తిమంతుడగు శ్రీకృష్ణ భగవానుడు ప్రాణులను కాపాడును. ఆయన స్వరూపము ఇంద్రియగోచరము కాదు. ఆయన ఆ జరాసంధుని పుత్రుడగు సహదేవుని మగధదేశమునకు రాజుగా అభిషేకించెను. మగధ రాజగు జరాసంధునిచే బంధించబడిన రాజులను ఆయన విడిపించెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధములో జరాసంధుని ఉద్ధారమును వర్ణించే డెబ్బది రెండవ అధ్యాయము ముగిసినది (72).

అథ త్రిసప్తతితమోఽధ్యాయః

శ్రీకృష్ణ భగవానుడు రాజులను బంధవిముక్తులను చేయుట

శ్రీశుక ఉవాచ ।

అయుతే ద్వే శతాన్యష్టౌ లీలయా యుధి నిర్జితః ।
తే నిర్గతా గిరిద్రోణ్యాం మలినా మలవాససః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, లీలయా= అవలీలగా, యుధి= యుద్ధమునందు, నిర్జితాః= జయించబడినవారు, గిరిద్రోణ్యామ్= కొండ పల్లమునందు, ద్వే= రెండు, అయుతే= పది వేలు, అష్టా= ఎనిమిది, శతాని= వందలు, తే= వారు, నిర్గతాః= బయటకు వచ్చినవారు, మలినాః = మురికిగా నున్నవారు, మలవాససః= మురికి వస్త్రములు గలవారు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...జరాసంధుడు అవలీలగా జయించి కొండ పల్లములో బంధించిన రాజులు ఇరవై వేల ఎనిమిది వందల మంది విముక్తిని పొందిరి. వారు మలినవస్త్రములతో మలినదేహములతో బందీనుండి బయటకు వచ్చిరి.

క్షుత్క్షామాశుష్కవదనా స్సంరోధపరికర్శితాః ।
దదృశుస్తే ఘనశ్యామం పీతకౌశేయవాససమ్ ॥ 2

క్షుత్క్షామాః= ఆకలితో కృశించినవారు, శుష్కవదనాః= ఎండిపోయిన మోములు గలవారు, సంరోధపరికర్శితాః= బంధించుటచే దేహమంతా కృశించిన, తే= వారు, ఘనశ్యామమ్= మేఘమువలె నల్లనైన, పీతకౌశేయ వాససమ్= పచ్చని పట్టు వస్త్రము గల శ్రీకృష్ణుని, దదృశుః= చూచిరి.

ఆ రాజులు ఆకలిచే మరియు బంధించి ఉంచుటచే దేహమంతా కృశించి ఉండిరి. వారి మోములు ఎండిపోయెను. వారు మేఘము వలె నల్లనైన పచ్చని పట్టు వస్త్రమును దాల్చిన శ్రీకృష్ణుని చూచిరి.

శ్రీవత్సాంకం చతుర్బాహుం పద్మగర్భారుణేక్షణమ్ ।
చారుప్రసన్నవదనం స్ఫురన్మకరకుండలమ్ ॥ 3

శ్రీవత్స-అంకమ్= వక్షఃస్థలముపై లక్ష్మీదేవియే స్వర్ణరేఖగా కలిగినట్టియు, చతుర్-బాహుమ్= నాలుగు చేతులు కలిగినట్టియు, పద్మగర్భ-అరుణ-ఈక్షణమ్= పద్మపు దుద్దుల వలె అరుణవర్ణము గల కన్నులు కలిగినట్టియు, చారుప్రసన్నవదనమ్= అందమైన ప్రసన్నమగు ముఖము కలిగినట్టియు, స్ఫురత్-మకరకుండలమ్= వెలిగిపోయే మకరకుండలములు కలిగిన (శ్రీకృష్ణుని చూచిరి).

నాలుగు చేతులు గల ఆయన వక్షఃస్థలముపై లక్ష్మీదేవి స్వర్ణరేఖయై రాజిల్లెను. ఆయన కన్నులు పద్మపు దుద్దులవలె అరుణవర్ణముతో నుండెను. మకరకుండలములతో వెలిగిపోవుచున్న ఆయన మోము అందముగా, ప్రసన్నముగా నుండెను.

పద్మహస్తం గదాశంఖ రథాంగై రుపలక్షితమ్ ।
కిరీటహారకటక కటిసూత్రాంగదాచితమ్ ॥ 4

పద్మహస్తమ్= పద్మము చేతియందు గలవాడు, గదాశంఖరథ-అంగైఃr= గద శంఖము చక్రములచే, ఉపలక్షితమ్= శోభిల్లినట్టియు, కిరీటహారకటకకటిసూత్ర-అంగద-ఆచితమ్= కిరీటము హారము హస్తాభరణము మేఖల బాహుపురులచే అలంకరించబడిన (శ్రీకృష్ణుని --).

చేతిలో పద్మము, గద, శంఖము, చక్రములతో శోభిల్లే ఆయన కిరీటము, హారము, కంకణములు, మేఖల, బాహుపురులనలంకరించుకొనెను.

భ్రాజద్వరమణిగ్రీవం నివీతం వనమాలయా ।
పిబంత ఇవ చక్షుర్భ్యాం లిహంత ఇవ జిహ్వయా ॥ 5

భ్రాజద్-వరమణిగ్రీవమ్= ప్రకాశించే శ్రేష్ఠమైన కౌస్తుభమణి మెడయందు కలిగినట్టియు, వనమాలయా= వనమాలచే, నివీతమ్=

మెడలో అలంకరించబడిన శ్రీకృష్ణుని, చక్షుర్భ్యామ్= కళ్లతో, పిబంతః ఇవ= పానము చేయుచున్నారా యన్నట్లు, జిహ్వయా= నాలుకతో, లిహంతః ఇవ= ఆస్వాదించుచున్నారా యన్నట్లు.

ఆయన మెడలో శ్రేష్ఠమైన కౌస్తుభమాణిక్యము, వనమాలలను అలంకరించుకొనెను. ఆయనను ఆ రాజులు కళ్లతో పానము చేయు-చున్నారా, నాలుకతో ఆస్వాదించుచున్నారా యన్నట్లు చూచిరి.

జిఘ్రంత ఇవ నాసాభ్యాం రంభంత ఇవ బాహుభిః ।
ప్రణేమురుత్తపాప్మానో మూర్ధభిః పాదయోర్హరేః ॥ 6

నాసాభ్యామ్= ముక్కు పుటములతో, జిఘ్రంతః ఇవ= ఆఘ్రాణించుచున్నారా యన్నట్లు, బాహుభిః= చేతులతో, రంభంతః ఇవ= కౌగిలించుచున్నారా యన్నట్లు, హతపాప్మానః= నశింపజేయబడిన పాపములు గల వారు, హరేః= శ్రీకృష్ణ భగవానునియొక్క, పాదయోః= పాదములయందు, మూర్ధభిః= శిరస్సులతో, ప్రణేముః= నమస్కరించిరి.

ఆ రాజులు ఆయనను ముక్కు పుటములతో ఆఘ్రాణించు చున్నారా, చేతులతో కౌగిలించుచున్నారా యన్నట్లు చూచిరి. ఆయనను చూచుటచే వారి పాపములు నశించెను. వారాయన కాళ్లకు తలలను వంచి మ్రొక్కిరి.

కృష్ణసందర్శనాహ్లాద ధ్వస్తసంరోధనక్లమాః ।
ప్రశశంసుర్హృషీ కేశం గీర్భిః ప్రాంజలయో నృపాః ॥ 7

కృష్ణసందర్శన-ఆహ్లాదధ్వస్తసంరోధనక్లమాః= శ్రీకృష్ణుని చూచుట వలని ఆనందముచే నశింపజేయ బడిన బంధముయొక్క క్లేశము గల, నృపాః= రాజులు, ప్రాంజలయః= దోసిలి యొగ్గినవారై, హృషీక-ఈశమ్= ఇంద్రియాంతర్యామియగు శ్రీకృష్ణుని, గీర్భిః= వచనములతో, ప్రశశంసుః= స్తుతించిరి.

శ్రీకృష్ణుని దర్శనముచే కలిగిన ఆనందము ఆ రాజుల బంధ-క్లేశమును నశింప జేసెను. వారు దోసిలి యొగ్గి ఇంద్రియాంతర్యామి యగు శ్రీకృష్ణుని వచనములతో స్తుతించిరి.

రాజాన ఊచుః ।

నమస్తే దేవదేవేశ ప్రపన్నార్తిహరావ్యయ ।
ప్రపన్నాన్ పాహి నః కృష్ణ నిర్విణ్ణాన్ ఘోరసంసృతేః ॥ 8

రాజాన= రాజులు, ఊచుః= పలికిరి, దేవదేవ-ఈశ= దేవనాయకులగు బ్రహ్మాదులను శాసించువాడా!, ప్రపన్న-ఆర్తిహర= శరణు జొచ్చినవారి దుఃఖములను బాపువాడా!, అవ్యయ= వినాశము లేనివాడా!, కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, తే= నీ కొరకు, నమః= నమస్కారము, ప్రపన్నాన్= శరణు జొచ్చినట్టియు, ఘోరసంసృతేః= భయంకరమగు సంసారము వలన, నిర్విణ్ణాన్= విరక్తులమైన, నః= మమ్ములను, పాహి= రక్షించుము.

రాజులు ఇట్లు పలికిరి...ఓ శ్రీకృష్ణా! అవినాశివగు నీవు దేవనాయకులగు బ్రహ్మాదులను కూడ శాసించెదవు. శరణు జొచ్చినవారి ఇడుముల బాపే నీకు నమస్కారము. మేము భయంకరమగు సంసారము వలన విరక్తులమై నిన్ను శరణు జొచ్చినాము. మమ్ములను కాపాడుము.

నైనం నాథాన్వసూయామో మాగధం మధుసూదన ।
అనుగ్రహో యద్భవతో రాజ్ఞాం రాజ్యచ్యుతిర్విభో ॥ 9

నాథ= ఓ ప్రభూ!, మధుసూదన= మధువనే రాక్షసుని సంహరించినవాడా!, విభో= సర్వశక్తిమంతుడా!, ఏనమ్= ఈ, మాగధమ్= మగధరాజగు జరాసంధుని, న అన్వసూయామః= తప్పు పట్టము, యత్= ఏలయన, రాజ్ఞామ్= రాజులకు, రాజ్యచ్యుతిః= రాజ్యభ్రంశము, భవతః = నీయొక్క, అనుగ్రహః= అనుగ్రహము.

ఓ ప్రభూ! సర్వశక్తిమంతుడవగు నీవు మధుకైటభులనే రాక్షసులను సంహరించితివి. మేమీ మగధరాజగు జరాసంధుని తప్పు పట్టము. ఎందుకంటే, రాజులు రాజ్యభ్రష్టులగుట కూడ నీ అనుగ్రహమే.

రాజ్యైశ్వర్యమదోన్నద్ధో న శ్రేయో విందతే నృపః ।
త్వన్మాయామోహితోఽనిత్యా మన్యతే సంపదోఽచలాః ॥ 10

రాజ్య–ఐశ్వర్యమద–ఉన్నద్ధః= రాజ్యాధికారమునందలి సంపదల వలన కలిగిన గర్వముచే ఉచ్ఛృంఖలుడగు, నృపః= రాజు, శ్రేయః= శ్రేయస్సును, న విందతే= పొందడు, త్వత్–మాయామోహితః= నీ మాయచే మోహితుడైనవాడు, అనిత్యాః= అనిత్యములగు, సంపదః= సంపదలను, అచలాః= నిత్యములనుగా, మన్యతే= తలపోయును.

రాజ్యాధికారమును బట్టి వచ్చిన సంపదలచే గర్వించి ఉచ్ఛృంఖలు డైన రాజు శ్రేయస్సును పొందడు. నీ మాయచే మోహితుడైన వాడు అనిత్యమగు సంపదలు నిత్యములని తలపోయును.

మృగతృష్ణాం యథా బాలా మన్యంత ఉదకాశయమ్ ।
ఏవం వైకారికీం మాయామయుక్తా వస్తు చక్షతే ॥ 11

యథా= ఓ విధముగానైతే, బాలాః= అవివేకులు, మృగతృష్ణామ్= ఎండమావిని, ఉదక–ఆశయమ్= జలాశయమునుగా, మన్యంతే= భావించెదరో, ఏవమ్= ఇదే విధముగా, అయుక్తాః= అవివేకులు, వైకారికీమ్= శబ్దాదులనుండి పుట్టే, మాయామ్= అసత్యమగు భోగమును, వస్తు= యథార్థమునుగా, చక్షతే= చూచెదరు.

అవివేకులు ఎండమావిని జలాశయమని భ్రమ పడెదరు. ఇదే తీరున అవివేకులు అసత్యమగు శబ్దాదిభోగప్రపంచము సత్యమని భ్రమించెదరు.

వయం పురా శ్రీమదనష్టదృష్టయో
జిగీషయాఽస్వా ఇతరేతరస్పృధః ।
ఘ్నంతః ప్రజాస్వా అతినిర్ఘృణాః ప్రభో
మృత్యుం పురస్త్వాఽవిగణయ్య దుర్మదాః ॥ 12

వయమ్= మేము, పురా= ఇదివరలో, శ్రీమదనష్టదృష్టయః= ధనగర్వముచే నష్టమైన వివేకబుద్ధి గలవారమై, అస్యాః= ఈ భూమియొక్క, జిగీషయా= జయించే కోరికతో, ఇతర-ఇతరస్పృధః= ఒకరితోనొకరు స్పర్ధ గలవారమై, అతినిర్ఘృణాః= మిక్కిలి నిర్దయులమై, స్వాః= మావారైన, ప్రజాః= జనులను, ఘ్నంతః= చంపువారము, పురః= ఎదుట, మృత్యుమ్= మృత్యురూపుడవగు, త్వా= నిన్ను, అవిగణయ్య= లెక్క చేయక, దుర్మదాః = ఉత్కటమగు గర్వము గలవారము.

ఇదివరలో మా వివేకబుద్ధి ధనగర్వముచే నష్టమై ఈ భూమిని జయించాలనే కోరికతో ఒకరితోనొకరు విరోధించెడివారము. మిక్కిలి నిర్దయులమై మా ప్రజలను మేమే చంపుతూ, మా యెదుట మృత్యు రూపుడవై నిలిచియున్న నిన్ను లెక్కచేయక ఉత్కటముగా గర్వించితిమి.

త ఏవ కృష్ణాద్య గభీరరంహసా
దురంతవీర్యేణ విచాలితాశ్రియః,
కాలేన తన్వా భవతోఽనుకంపయా
వినష్టదర్పాశ్చరణౌ స్మరామ తే ॥ 13

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, తే ఏవ= ఆ మేమే, అద్య= ఈనాడు, గభీరరంహసా= తెలియబడని వేగము కలిగినట్టియు, దురంతవీర్యేణ= అతిక్రమించ శక్యము కాని శక్తి కలిగినట్టియు, భవతః= నీ, తన్వా= రూపమైన, కాలేన= కాలముచే, శ్రియః= సంపదనుండి, విచాలితాః= జారిపోవునట్లు చేయబడినవారమై, తే= నీ, అనుకంపయా= దయచే, వినష్టదర్పాః= నశించిన గర్వము గలవారమై, చరణౌ= పాదములను, స్మరామ= స్మరించెదము గాక!

ఓ శ్రీకృష్ణా! కాలము నీ రూపమే. దాని వేగమును తెలియుట కాని, దాని శక్తిని దాటుట గాని శక్యము కాదు. ఆ కాలము మాకు సంపదలు లేకుండా చేసినది. కాని, నీ దయచే మా గర్వము నశించి నీ పాదములను స్మరించెదము గాక!

అతో న రాజ్యం మృగతృష్ణిరూపితం
దేహేన శశ్వత్పతతా రుజాం భువా ।
ఉపాసితవ్యం స్పృహయామహే విభో
క్రియాఫలం ప్రేత్య చ కర్ణరోచనమ్ ॥ 14

విభో= ఓ ప్రభూ!, అతో= అందువలన, మృగతృష్ణిరూపితమ్= ఎండమావిని పోలినట్టియు, శశ్వత్= సర్వదా, పతతా= క్షీణించు చున్నట్టియు, రుజామ్= రోగములకు, భువా= ఉత్పత్తి స్థానమైన, దేహేన= దేహముతో, ఉపాసితవ్యమ్= సేవించదగిన, రాజ్యమ్= రాజ్యమును, ప్రేత్య= మరణించి, కర్ణరోచనమ్= చెవులకింపైన, క్రియా ఫలం చ= కర్మఫలమగు స్వర్గాదులను, స్పృహయామహే= కోరము.

ఓ ప్రభూ! అందువలన, రాజ్యము ఎండమావిని పోలినది. రోగములకు ఉత్పత్తిస్థానమై సర్వదా క్షీణిస్తూ ఉన్న దేహముతో ఆ రాజ్యమును సేవించవలెను. మరణించిన తర్వాత కర్మఫలరూపముగా స్వర్గాదులు లభించునని చెప్పే మాటలు చెవులకు ఇంపుగానుండును. కాని, మేము ఈ రాజ్యమును గాని, ఆ స్వర్గమును గాని కోరుట లేదు.

తం నస్సమాదిశోపాయం యేన తే చరణాబ్జయోః ।
స్మృతిర్యథా న విరమేదపి సంసరతామిహ ॥ 15

నః= మాకు, తమ్= అట్టి, ఉపాయమ్= ఉపాయమును, సమాదిశ= ఉపదేశింపుము, యేన= దేనిచేనైతే, యథా= ఏ విధముగా, ఇహ= ఈ లోకమునందు, సంసరతాం అపి= సంసారములోనున్నవారికి

కూడ, తే= నీ, చరణ-అబ్జయోః= పద్మములవంటి పాదముల, స్మృతిః = స్మరణము, న విరమేత్= తొలగిపోదో.

మేము సంసారములోనున్ననూ నీ పద్మములవంటి పాదముల స్మరణము తొలగిపోరాదు. మాకు అట్టి ఉపాయమును ఉపదేశింపుము.

కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే ।
ప్రణతక్లేశనాశాయ గోవిందాయ నమో నమః ॥ 16

వాసుదేవాయ= వసుదేవపుత్రుడైనట్టియు, హరయే= శ్రీహరియైనట్టియు, పరమ-ఆత్మనే= వ్యక్తియొక్క అంతరతమమగు స్వరూపమైనట్టియు, ప్రణతక్లేశనాశాయ= ప్రణమిల్లినవారి చిత్తమలములను నశింపచేయునట్టియు, గోవిందాయ= గోవులను పాలించే, కృష్ణాయ= శ్రీకృష్ణ భగవానుని కొరకు, నమః నమః= పలు నమస్కారములు.

ప్రణమిల్లినవారి చిత్తమలములను నశింపజేసే శ్రీహరి వసుదేవ పుత్రుడగు శ్రీకృష్ణుడై గోవులను పాలించెను. ప్రాణులలో ప్రత్యగాత్మ రూపుడైయున్న ఆయన కొరకు పలు నమస్కారములు.

శ్రీశుక ఉవాచ ।

సంస్తూయమానో భగవాన్ రాజభిర్ముక్తబంధనైః ।
తానాహ కరుణస్తాత శరణ్యః శ్లక్ష్ణయా గిరా ॥ 17

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ముక్తబంధనైః= విడిపించబడిన బంధములు గల, రాజభిః= రాజులచే, సంస్తూయమానః = స్తుతించ బడుచున్నవాడు, కరుణః= దయాళువు, శరణ్యః= శరణు పొందదగినవాడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవనానుడు, శ్లక్ష్ణయా= మధురమైన, గిరా= వాక్కుతో, తాన్= వారిని ఉద్దేశించి, ఆహ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...బంధవిముక్తులైన రాజులు శరణు జొచ్చినవారిని రక్షించే దయాళువగు శ్రీకృష్ణ భగవానుని స్తుతించుచుండిరి. ఆయన మధురమగు వాక్కుతో వారితోనిట్లనెను.

శ్రీభగవానువాచ ।

అద్యప్రభృతి వో భూపా మయ్యాత్మన్యఖిలేశ్వరే ।
సుదృఢా జాయతే భక్తిర్బాఢమాశంసితం తథా ॥ 18

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, భూపాఃన= ఓ రాజులారా!, అద్యప్రభృతి= ఈనాటినుండి, ఆత్మని= ఆత్మస్వరూపుడ-నైనట్టియు, అఖిల-ఈశ్వరే= సర్వమును శాసించే, మయి= నాయందు, వః= మీకు, సుదృఢా= మిక్కిలి దృఢమైన, భక్తిః= భక్తి, జాయతే= కలుగును, బాఢమ్= నిశ్చితము, తథా= ఆ విధముగా, ఆశంసితమ్= కోరబడినది.

శ్రీకృష్ణ భగవానుడిట్లనెను...ఓ రాజులారా! ఆత్మస్వరూపుడనై సర్వమును శాసించే నాయందు మీకు మిక్కిలి దృఢమైన భక్తి కలుగవలెనని మీరు కోరినారు. నిశ్చితముగా అటులనే కాగలదు.

దిష్ట్యా వ్యవసితం భూపా భవంత ఋతభాషిణః ।
శ్రియైశ్వర్యమదోన్నాహం పశ్య ఉన్మాదకం నృణామ్ ॥ 19

భూపాఃన= ఓ రాజులారా!, వ్యవసితమ్= నిశ్చయము, దిష్ట్యా= మంగళము, భవంతఃన= మీరు, ఋతభాషిణఃన= సత్యమును పలుకువారు, శ్రియా= సంపదచే, ఐశ్వర్యమద-ఉన్నాహమ్= అధికారమదముయొక్క ఆధిక్యమును, నృణామ్= మానవులకు, ఉన్మాదకమ్= పిచ్చివారిని చేయునదిగా, పశ్యే= చూచుచున్నాను.

ఓ రాజులారా! మీ భక్తినిశ్చయము మంగళప్రదము. మీరు సత్యమును పలుకువారు. సంపద, అధికారములచే కలిగే ఉత్కటమగు గర్వము మానవులను పిచ్చివారిని చేయుట నాకు కనబడుచునే యున్నది.

హైహయో నహుషో వేనో రావణో నరకోఽపరే ।
శ్రీమదాద్భ్రంశితాః స్థానాద్దేవదైత్యనరేశ్వరాః ॥ 20

హైహయః= హైహయుడు, నహుషః= నహుషుడు, వేనః= వేనుడు, రావణః= రావణుడు, నరకః= నరకుడు, అపరే= ఇతరులైన, దేవదైత్యనర-ఈశ్వరాః= దేవతల రాక్షసుల మానవుల ప్రభువులు, శ్రీమదాత్= సంపద వలని గర్వము వలన, స్థానాత్= పదవినుండి, భ్రంశితాః= జారిపోవునట్లు చేయబడిరి.

హైహయుడు, నహుషుడు, వేనుడు, రావణుడు, నరకుడు, మరియు ఇతరులైన దేవదానవమానవుల ప్రభువులు సంపద వలన కలిగిన గర్వము వలన రాజ్యభ్రష్టులైరి.

భవంత ఏతద్విజ్ఞాయ దేహాద్యుత్పాద్యమంతవత్ ।
మాం యజంతోఽధ్వరైర్యుక్తాః ప్రజా ధర్మేణ రక్షథ ॥ 21

భవంతః= మీరు, ఏతత్= ఈ, ఉత్పాద్యమ్= పుట్టుక గల, దేహ-ఆది= దేహము మొదలైనది, అంతవత్= అంతము గలదని, విజ్ఞాయ= తెలుసుకొని, మామ్= నన్ను, అధ్వరైః= యజ్ఞములతో, యజంతః= ఆరాధించుచున్నవారై, యుక్తాః= సావధానులై, ప్రజాః= ప్రజలను, ధర్మేణ= ధర్ముతో, రక్షథ= రక్షించుడు.

శరీరము, దానితో సంబంధమున్నవి పుట్టేని, అనే ఈ సత్యమును మీరు తెలియుడు. నన్ను యజ్ఞములతో ఆరాధిస్తూ సావధానులై ప్రజలను ధర్మబద్ధముగా పాలించుడు.

సంతన్వంతః ప్రజాతంతూన్ సుఖం దుఃఖం భవాభవౌ ।
ప్రాప్తం ప్రాప్తం చ సేవంతో ముచ్చిత్తా విచరిష్యథ ॥ 22

ప్రజాతంతూన్= పుత్రపౌత్రాది సంతానములను, సంతన్వంతః = విస్తరించుచున్నవారై, సుఖమ్= సుఖమును, దుఃఖమ్= దుఃఖమును,

భవ-అభవౌ= వైభవదారిద్ర్యములను, ప్రాప్తం ప్రాప్తం చ= లభించిన ప్రతిదానిని, సేవంతః= సేవించుచున్నవారై, మత్-చిత్తాఃన= నాయందు మనస్సు గలవారై, విచరిష్యథ= కాలమును గడుపుడు.

పుత్రపౌత్రాదిసంతానమును విస్తరింపజేయుడు. సుఖదుఃఖములను, లాభనష్టములను, లభించిన ప్రతిదానిని సమదృష్టితో సేవించుడు. మనస్సును నాయందు నిలిపి కాలమును గడుపుడు.

ఉదాసీనాశ్చ దేహాదావాత్మారామా ధృతవ్రతాః ।
మయ్యావేశ్య మనస్సమ్యఙ్మామంతే బ్రహ్మ యాస్యథ ॥ 23

దేహ-ఆదౌ= దేహము మొదలగువాటియందు, ఉదాసీనాఃచ= ఉదాసీనులు, ఆత్మారామాఃన= ఆత్మయందు రమించువారు, ధృతవ్రతాఃన= దృఢమైన నియమనిష్ఠలు గలవారు, మయి= నాయందు, మనఃన= మనస్సును, సమ్యక్= బాగుగా, ఆవేశ్య= నిలబెట్టి, అంతే= అంతమునందు, బ్రహ్మ= పరబ్రహ్మనగు, మామ్= నన్ను, యాస్యథ= పొందగలరు.

మీరు దేహము, ఇంద్రియభోగములు మొదలగువాటియందు ఉదాసీనులై ఆత్మనిష్ఠలు కండు. దృఢమైన నియమనిష్ఠలతో మనస్సును నాయందు బాగుగా నిలుపుడు. సాధన సిద్ధించిన (మరణించిన) తరువాత పరబ్రహ్మనగు నన్ను మీరు పొందగలరు.

శ్రీశుక ఉవాచ ।

ఇత్యాదిశ్య నృపాన్ కృష్ణ భగవాన్ భువనేశ్వరః ।
తేషాం న్యయుంక్త పురుషాన్ స్త్రియో మజ్జనకర్మణి ॥ 24

శ్రీశుకఃన= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భువన-ఈశ్వరఃన= ముల్లోకములకు ప్రభుడగు, కృష్ణఃన భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, నృపాన్= రాజులను, ఇతి= ఈ విధముగా, ఆదిశ్య= ఉపదేశించి,

తేషామ్= వారికి, మజ్జనకర్మణి= స్నానమనే పనియందు, పురుషాన్= పురుషులను, స్త్రియః= స్త్రీలను, న్యయుంక్త= నియోగించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ముల్లోకములకు ప్రభుడగు శ్రీకృష్ణ భగవానుడు రాజులకీ విధముగా ఉపదేశించి, వారికి స్నానము చేయించుటకై స్త్రీపురుషులను నియోగించెను.

సపర్యాం కారయామాస సహదేవేన భారత ।
నరదేవోచితైర్వస్త్రై ర్భూషణై స్రగ్విలేపనైః ॥ 25

భారత= భరతవంశీయుడవగు ఓ రాజా!, సహదేవేన= సహదేవునిచే, నరదేవ-ఉచితైః= రాజులకు తగిన, వస్త్రైః= వస్త్రములతో, భూషణైః= ఆభరణములతో, స్రగ్-విలేపనైః= హారములతో అంగరాగములతో, సపర్యామ్= సపర్యను, కారయామాస= చేయించెను.

భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుడు సహదేవుని ద్వారా ఆ రాజులకు వారి హోదాకు తగిన వస్త్రములను, ఆభరణములను, హారములను, అంగరాగములను ఏర్పాటు చేయించెను.

భోజయిత్వా వరాన్నేన సుస్నాతాన్ సమలంకృతాన్ ।
భోగైశ్చ వివిధైర్యు క్తాంస్తాంబూలాద్యైర్న్యపోచితైః ॥ 26

సుస్నాతాన్= చక్కగా స్నానము చేసినట్టియు, సమలంకృతాన్= బాగుగా అలంకరించబడిన ఆ రాజులను, వర-అన్నేన= శ్రేష్ఠమగు ఆహారముతో, భోజయిత్వా= భుజింపజేసి, నృప-ఉచితైః= రాజులకు తగిన, వివిధైః= పలురకములు, భోగైః చ= భోగములతో, తాంబూల-ఆద్యైః= తాంబూలము మొదలగువాటితో (సత్కరించెను).

చక్కగా స్నానము చేసి బాగుగా అలంకరించుకున్న ఆ రాజులకు ఆయన శ్రేష్ఠమగు ఆహారముతో భోజనమునేర్పాటు చేసెను. తరువాత

వారి హోదాకు తగ్గట్లుగా తాంబూలము, శయ్య మొదలగు వివిధ భోగములనేర్పాటు చేయించెను.

తే పూజితా ముకుందేన రాజానో మృష్టకుండలాః ।
విరేజుర్మోచితాః క్లేశాత్ప్రావృడంతే యథా గ్రహాః ॥ 27

ముకుందేన= మోక్షప్రదాతయగు కృష్ణ భగవానునిచే, క్లేశాత్= కష్టమునుండి, మోచితాః= విడిపించబడినవారు, పూజితాః= పూజించ బడిన వారు, మృష్టకుండలాః= శుద్ధమైన కుండలములు గలవారు అగు, తే= ఆ, రాజానః= రాజులు, ప్రావృడ్-అంతే= శరత్కాలమునందు, గ్రహాః= యథా= చంద్రుడు మొదలగు మండలములు వలె, విరేజుః= గొప్పగా ప్రకాశించిరి.

మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుడా రాజులను కష్టమునుండి విడిపించి ఆదరించెను. వారు శుద్ధమగు కుండలములను దాల్చి, శరత్కాలము నందు చంద్రాది జ్యోతిర్మండలములు వలె విశేషముగా ప్రకాశించిరి.

రథాన్ సదశ్వానారోప్య మణికాంచనభూషితాన్ ।
ప్రీణయ్య సూనృతైర్వాక్యై స్స్వదేశాన్ ప్రత్యయాపయత్ ॥ 28

మణికాంచనభూషితాన్= మణులు బంగారములచే అలంకరించ-బడిన ఆ రాజులను, సద్-అశ్వాన్= మంచి గుర్రములు కల, రథాన్= రథములను, ఆరోప్య= ఎక్కించి, సూనృతైః= మధురమైన, వాక్యైః= వచనములతో, ప్రీణయ్య= ప్రీతిని కలిగించి, స్వదేశాన్= తమ దేశములను గురించి, ప్రత్యయాపయత్= పంపించెను.

ఆయన మణులు పొదిగిన బంగరు ఆభరణముల నలంకరించు-కున్న ఆ రాజులను మంచి గుర్రములు లాగే రథములనెక్కించెను. ఆయన వారికి మధురవచనములతో ప్రీతిని కలిగించి తమ తమ దేశములకు పంపెను.

త ఏవం మోచితాః కృచ్ఛ్రాత్కృష్ణేన సుమహాత్మనా ।
యయుస్తమేవ ధ్యాయంతః కృతాని చ జగత్పతేః ॥ 29

ఏవమ్= ఈ విధముగా, సుమహాత్మనా= పరమోదారుడైన, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, కృచ్ఛ్రాత్= ఆపదనుండి, మోచితాః= విడిపించ-బడిన, తే= వారు, తం ఏవ= ఆయననే, జగత్-పతేః= జగన్నాథుని యొక్క, కృతాని చ= లీలలను కూడ, ధ్యాయంతః= ధ్యానించుచున్నవారై, యయుః= వెళ్లిరి.

ఈ తీరున పరమోదారుడైన కృష్ణుడు వారిని ఆపదనుండి విడిపించెను. వారా జగన్నాథుని, ఆయన లీలలను మాత్రమే ధ్యానిస్తూ వెళ్లిరి.

జగదుః ప్రకృతిభ్యస్తే మహాపురుష చేష్టితమ్ ।
యథాఽన్వశాసద్భగవాంస్తథా చక్రురతంద్రితాః ॥ 30

తే= వారు, మహాపురుషచేష్టితమ్= పురుషోత్తముని లీలను, ప్రకృతిభ్యః= అమాత్యులు మొదలైన రాజప్రకృతుల కొరకు, జగదుః= చెప్పిరి, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, యథా= ఏ విధముగా, అన్వశాసత్= ఆదేశించెనో, తథా= ఆ విధముగా, అతంద్రితాః= సావధానులై, చక్రుః= చేసిరి.

వారు పురుషోత్తముని లీలను అమాత్యులు మొదలైన రాజప్రకృ-తులకు చెప్పిరి. శ్రీకృష్ణ భగవానుడే విధముగా ఆదేశించెనో, వారదే విధముగా సావధానులై అనుష్ఠించిరి.

జరాసంధం ఘాతయిత్వా భీమసేనేన కేశవః ।
పార్థాభ్యాం సంయుతః ప్రాయాత్సహదేవేన పూజితః ॥ 31

కేశవః= శ్రీకృష్ణ భగవానుడు, జరాసంధమ్= జరాసంధుని, భీమసేనేన= భీమునిచే, ఘాతయిత్వా= వధింపజేసి, సహదేవేన=

సహదేవునిచే, పూజితః= సత్కరించబడినవాడై, పార్థాభ్యామ్= భీమార్జునులతో, సంయుతః= కూడినవాడై, ప్రాయాత్= వెళ్లెను.

శ్రీకృష్ణ భగవానుడు భీమునిచే జరాసంధుని వధింపజేసెను. ఆయన సహదేవుని సత్కారమునందుకొని భీమార్జునులతో గూడి వెళ్లెను.

గత్వా తే ఖాండవప్రస్థం శంఖాన్ దధ్ముర్జితారయః ।
హర్షయంతస్స్వసుహృదో దుర్హృదాం చాసుఖావహాః ॥ 32

జిత-అరయః= జయించబడిన శత్రువులు గల, తే= వారు, ఖాండవప్రస్థమ్= ఇంద్రప్రస్థమును, గత్వా= చేరి, స్వసుహృదః= తమ బంధువులను, హర్షయంతః= హర్షము కలిగించువారై, దుర్హృదాం చ= శత్రువులకైతే, అసుఖ-ఆవహాః= దుఃఖమును కలిగించువారై, శంఖాన్= శంఖములను, దధ్ముః= పూరించిరి.

వారు శత్రువులను జయించి ఇంద్రప్రస్థమును చేరి శంఖములను పూరించి, బంధువులకు హర్షమును, శత్రువులకైతే దుఃఖమును కలిగించిరి.

తచ్ఛ్రుత్వా ప్రీతమనస ఇంద్రప్రస్థనివాసినః ।
మేనిరే మాగధం శాంతం రాజా చాప్తమనోరథః ॥ 33

తత్= ఆ శంఖధ్వనిని, శ్రుత్వా= విని, ప్రీతమనసః= ప్రీతి జెందిన మనస్సు గల, ఇంద్రప్రస్థనివాసినః= ఇంద్రప్రస్థమునందు నివసించే జనులు, మాగధమ్= మగధరాజగు జరాసంధుని, శాంతమ్= మరణించినవానినిగా, మేనిరే= తలచిరి, రాజా చ= ధర్మరాజు కూడ, ఆప్తమనోరథః= పొందబడిన మనోరథము గలవాడు.

ఆ శంఖధ్వనిని విని ఇంద్రప్రస్థములో నివసించే జనులు మనస్సులో ప్రీతి జెంది మగధరాజగు జరాసంధుడు మరణించి యుండు నని తలచిరి. ధర్మరాజు మనోరథము (రాజసూయము) కూడ పూర్తి ఆయెను.

అభివంద్యాథ రాజానం భీమార్జునజనార్దనాః ।
సర్వమాశ్రావయాంచక్రు రాత్మనా యదనుష్ఠితమ్ ॥ 34

అథ= తరువాత, భీమ-అర్జున జన-అర్దనాఃఁ= భీముడు అర్జునుడు శ్రీకృష్ణ భగవానుడు, రాజానమ్= ధర్మరాజును, అభివంద్య= నమస్కరించి, ఆత్మనా= తనచే, యత్= ఏది, అనుష్ఠితమ్= చేయబడినదో, సర్వమ్= ఆ సర్వమును, ఆశ్రావయాంచక్రుఃఁ= వినిపించిరి.

తరువాత భీముడు, అర్జునుడు, దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానుడు ధర్మరాజునకు నమస్కరించి, తాము నిర్వర్తించిన కృత్యము-నంతనూ వినిపించిరి.

నిశమ్య ధర్మరాజస్తత్కేశవేనానుకంపితమ్ ।
ఆనందాశ్రుకలాం ముంచన్ ప్రేమ్ణా నోవాచ కించన ॥ 35

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే త్రిసప్తతితమోఽధ్యాయః ॥

ధర్మరాజఃఁ= ధర్మరాజు, కేశవేన= శ్రీకృష్ణ భగవానునిచే, అనుకంపితమ్= దయచే సంపన్నము చేయబడిన, తత్= ఆ జరాసంధ వధను గురించి, నిశమ్య= విని, ఆనంద-అశ్రుకలామ్= ఆనందముతో కన్నీటి బిందువును, ముంచన్= విడిచిపెట్టువాడై, ప్రేమ్ణా= ప్రేమచే, కించన= దేనినీ, న ఉవాచ= పలుకలేదు.

శ్రీకృష్ణ భగవానుడు సంపన్నము చేసిన ఆ జరాసంధవధను గురించి విని ధర్మరాజు ఆనందముతో కన్నీటి బిందువును విడిచిపెట్టెను. ముంచుకొచ్చిన ప్రేమ కారణముగా ఆయన ఏమీ చెప్పలేకపోయెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణ భగవానుడు రాజులను బంధవిముక్తులను చేయుటను
వర్ణించే డెబ్బది మూడవ అధ్యాయము ముగిసినది (73).

* * *

అథ చతుస్సప్తతితమోఽధ్యాయః

శ్రీకృష్ణ భగవానుడు అగ్రపూజ – శిశుపాలుని ఉద్ధారము

శ్రీశుక ఉవాచ ।

ఏవం యుధిష్ఠిరో రాజా జరాసంధవధం విభోః ।
కృష్ణస్య చానుభావం తం శ్రుత్వా ప్రీతస్తమబ్రవీత్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఏవమ్= ఈ విధముగా, యుధిష్ఠిరః రాజా ధర్మరాజు, జరాసంధ-వధమ్= జరాసంధుని వధను గురించి, విభోః= సర్వసమర్థ డగు, కృష్ణస్య= శ్రీకృష్ణునియొక్క, తమ్= ఆ, అనుభావం చ= మహిమను గురించి కూడ, శ్రుత్వా= విని, ప్రీతః = సంతోషించినవాడై, తమ్= ఆయనను ఉద్దేశించి, అబ్రవీత్= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఈ విధముగా ధర్మరాజు జరాసంధుని వధను గురించి, సర్వసమర్థుడగు శ్రీకృష్ణుని మహిమను గురించి కూడ విని సంతోషించి ఆయనతో నిట్లనెను.

యుధిష్ఠిర ఉవాచ ।

యే స్యుస్త్రైలోక్యగురవస్సర్వే లోకమహేశ్వరాః ।
వహంతి దుర్లభం లబ్ధ్వా శిరసైవానుశాసనమ్ ॥ 2

యుధిష్ఠిరః = ధర్మరాజు, ఉవాచ= పలికెను, యే= ఎవరైతే, త్రైలోక్యగురవః= ముల్లోకములకు పూజనీయులు, లోకమహా-ఈశ్వరాః = లోకములకు గొప్ప శాసకులు, స్యుః= కలరో, సర్వే= వారందరు, దుర్లభమ్= పొంద శక్యము కాని, అనుశాసనమ్= ఆదేశమును, లబ్ధ్వా= స్వీకరించి, శిరసా ఏవ= శిరస్సుతోనే, వహంతి= వహించెదరో.

ధర్మరాజిట్లు పలికెను...నీనుండి ఆదేశమును పొందుటయే దుర్లభము. ముల్లోకములకు పూజనీయులగు బ్రహ్మాదులు, లోకపాలకు-

లగు ఇంద్రాదులు అందరు నీ ఆదేశమును నిశ్చయముగా శిరసా వహించెదరు.

స భవానరవిందాక్షో దీనానామీశమానినామ్ ।
ధత్తేఽనుశాసనం భూమంస్తదత్యంతవిడంబనమ్ ॥ 3

భూమన్= ఓ పరబ్రహ్మ!, తత్= అట్టి, అరవింద-అక్షః= పద్మముల వంటి కన్నులు గల, భవాన్= నీవు, దీనానామ్= దీనులమైనట్టియు, ఈశమానినామ్= శాసకులమని విర్రవీగే మాయొక్క, అనుశాసనమ్= ఆదేశమును, ధత్తే= పాలించుచున్నావు, తత్= అది, అత్యంత విడంబనమ్= సుతరాము అనుకరణము.

ఓ పరబ్రహ్మ! మేము దీనులము, పాలకులమని విర్రవీగువారము. కాని, పద్మములవంటి కన్నులు గల అట్టి నీవు మా ఆదేశమును పాలిస్తున్నావు. ఇది సుతరాము మానవుల చేష్టకు అనుకరణము మాత్రమే.

న హ్యేకస్యాద్వితీయస్య బ్రహ్మణః పరమాత్మనః ।
కర్మభిర్వర్ధతే తేజో హ్రసతే చ యథా రవేః ॥ 4

హి= ఏలయన, ఏకస్య= ఒక్కడైనట్టియు, అద్వితీయస్య= రెండవది లేనట్టియు, పరమ-ఆత్మనః= అంతరతమమగు స్వరూపమైన, బ్రహ్మణః = పరబ్రహ్మకు, రవేః యథా= సూర్యునకు వలె, కర్మభిః= కర్మలచే, తేజః= తేజస్సు, న వర్ధతే= వర్ధిల్లుట లేదు, న హ్రసతే చ= తగ్గుట లేదు.

ఏలయన, పరబ్రహ్మ ఒక్కడు, రెండవది లేనివాడు, వ్యక్తియొక్క అంతరతమమగు ఆత్మస్వరూపుడు. ఆ పరబ్రహ్మకు సూర్యునకు వలె కర్మలచే తేజస్సులో వృద్ధి గాని, తగ్గుదల గాని లేవు.

న వై తేఽజిత భక్తానాం మమాహమితి మాధవ ।
త్వం తవేతి చ నానాధీః పశూనామివ వైకృతా ॥ 5

అజిత= పరాజయము లేనివాడా!, మాధవ= ఓ లక్ష్మీపతీ!, తే= నీ, భక్తానామ్= భక్తులకు, మమ= నాది, అహమ్= నేను, ఇతి= అనియు, త్వమ్= నీవు, తవ= నీది, ఇతి చ= అని కూడ, వైకృతా= వికారము చెందే దేహమునకు చెందిన, నానాధీః= అనేకత్వబుద్ధి, పశూనాం ఇవ= పశువులకు వలె, న వై= నిశ్చయముగా లేదు.

పరాజయము లేని ఓ లక్ష్మీపతీ! నేను, నాది, నీవు, నీది అనే బుద్ధి వికారమును చెందే దేహముతోడి తాదాత్మ్యము వలన కలుగును. పశువులకుండే అట్టి భేదబుద్ధి నీ భక్తులకు నిశ్చయముగా లేదు.

శ్రీశుక ఉవాచ ।

ఇత్యు క్త్వా యజ్ఞయే కాలే వవ్రే యుక్తాన్ స ఋత్విజః ।
కృష్ణానుమోదితః పార్థో బ్రాహ్మణాన్ బ్రహ్మవాదినః ॥ 6

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= అని, ఉక్త్వా= పలికి, సః= ఆ, పార్థః= కుంతీపుత్రుడగు ధర్మరాజు, యజ్ఞయే= యజ్ఞమునకు యోగ్యమైన, కాలే= సమయము నందు, కృష్ణ-అనుమోదితః= శ్రీకృష్ణునిచే అనుజ్ఞ ఈయబడినవాడై, యుక్తాన్= యోగ్యులైనట్టియు, బ్రహ్మవాదినః= వేదవేత్తలగు, బ్రాహ్మణాన్= బ్రాహ్మణులను, ఋత్విజః= ఋత్విక్కులనుగా, వవ్రే= వరణము చేసెను.

శ్రీశుక మహర్షి పలికెను...ఇట్లు పలికి కుంతీపుత్రుడగు ఆ ధర్మరాజు యజ్ఞమునకు యోగ్యమగు సమయమునందు యోగ్యులైన వేదవేత్తలగు బ్రాహ్మణులను శ్రీకృష్ణుని అనుజ్ఞతో ఋత్విక్కులనుగా వరణము చేసెను.

ద్వైపాయనో భరద్వాజస్సుమంతుర్గౌతమోఽసితః ।
వసిష్ఠశ్చ్యవనః కణ్వో మైత్రేయః కవషస్త్రితః ॥ 7

విశ్వామిత్రో వామదేవస్సుమతిర్జైమినిః క్రతుః ।
పైలః పరాశరో గర్గో వైశంపాయన ఏవ చ ॥ 8

అథర్వా కశ్యపో ధౌమ్యో రామో భార్గవ ఆసురిః ।
వీతిహోత్రో మధుచ్ఛందా వీరసేనో.కృతవ్రణః ॥ 9

ద్వైపాయనః= వేదవ్యాసుడు, భరద్వాజః= భరద్వాజుడు, సుమంతుః= సుమంతుడు, గౌతమః= గౌతముడు, అసితః= అసితుడు, వసిష్ఠః= వసిష్ఠుడు, చ్యవనః= చ్యవనుడు, కణ్వః= కణ్వుడు, మైత్రేయః = మైత్రేయుడు, కవషః= కవషుడు, త్రితః= త్రితుడు, విశ్వామిత్రః= విశ్వామిత్రుడు, వామదేవః= వామదేవుడు, సుమతిః= సుమతి, జైమినిః = జైమిని, క్రతుః= క్రతువు, పైలః= పైలుడు, పరాశరః= పరాశరుడు, గర్గః= అథర్వణుడు, కశ్యపః= కశ్యపుడు, ధౌమ్యః= ధౌమ్యుడు, రామః = పరశు రాముడు, భార్గవః= శుక్రాచార్యుడు. ఆసురిః= ఆసురి, వీతిహోత్రః= వీతిహోత్రుడు, మధుచ్ఛందాః= మధుచ్ఛందసుడు, వీరసేనః = వీరసేనుడు, అకృతవ్రణః= అకృతవ్రణుడు.

వేదవ్యాసుడు, భరద్వాజుడు, సుమంతుడు, గౌతముడు, అసితుడు, వసిష్ఠుడు, చ్యవనుడు, కణ్వుడు, మైత్రేయుడు, కవషుడు, త్రితుడు, విశ్వామిత్రుడు, వామదేవుడు, సుమతి, జైమిని, క్రతువు, పైలుడు, పరాశరుడు, గర్గుడు, వైశంపాయనుడు, అథర్వణుడు, కశ్యపుడు, ధౌమ్యుడు, పరశురాముడు, శుక్రాచార్యుడు, ఆసురి, వీతిహోత్రుడు, మధుచ్ఛందసుడు, వీరసేనుడు, అకృతవ్రణుడు అనువారలు ఋత్విక్కులు.

ఉపహూతాస్తథా చాన్యే ద్రోణభీష్మకృపాదయః ।
ధృతరాష్ట్రస్సహసుతో విదురశ్చ మహామతిః ॥ 10

తథా= అదే విధముగా, అన్యే చ= ఇతరులైన, ద్రోణభీష్మకృప-ఆదయః= ద్రోణుడు భీష్ముడు కృపాచార్యుడు మొదలగువారు, సహసుతః

= బుద్ధిశాలి, విదురః చ= విదురుడు కూడ, ఉపహూతాః= ఆహ్వానించ-బడిరి.

ఇంతేగాక, ద్రోణుడు, భీష్ముడు, కృపాచార్యుడు, బాహ్లీకుడు మొదలగు ఇతరులను, ధృతరాష్ట్రుని, ఆతని పుత్రులను, గొప్ప బుద్ధిశాలి-యగు విదురుని కూడ ధర్మరాజు యజ్ఞమునకు ఆహ్వానించెను.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రా యజ్ఞదిదృక్షవః ।
తత్రేయుస్సర్వరాజానో రాజ్ఞాం ప్రకృతయో నృప ॥ 11

నృప= ఓ రాజా!, యజ్ఞదిదృక్షవః= యజ్ఞమును చూడగోరే, బ్రాహ్మణాః= బ్రాహ్మణులు, క్షత్రియాః= క్షత్రియులు, వైశ్యాః= వైశ్యులు, శూద్రాః= శూద్రులు, సర్వరాజానః= సకలరాజులు, రాజ్ఞామ్= రాజులయొక్క, ప్రకృతయః= అమాత్యులు మొదలైన ప్రకృతులు, తత్ర= అచటకు, ఈయుః= వెళ్లిరి.

తతస్తే దేవయజనం బ్రాహ్మణాస్స్వర్ణలాంగలైః ।
కృష్ట్వా తత్ర యథాఽఽమ్నాయం దీక్షయాంచక్రిరే నృపమ్ ॥ 12
పైమాః కిలోపకరణా వరుణస్య యథా పురా ।

తతః= తరువాత, తే= ఆ, బ్రాహ్మణాః= బ్రాహ్మణులు, స్వర్ణలాంగలైః= బంగరు నాగళ్లతో, దేవయజనమ్= యజ్ఞభూమిని, కృష్ట్వా= దున్ని, తత్ర= అచట, యథా-ఆమ్నాయమ్= వేదములో చెప్పిన విధానమును తప్పకుండా, నృపమ్= ధర్మరాజును, దీక్షయాంచక్రిరే= దీక్షను స్వీకరించునట్లు చేసిరి, పురా= పూర్వము, వరుణస్య యథా= వరుణునకు వలె, ఉపకరణాః= సామగ్రులు, పైమాః కిల= బంగారముతో చేసినవి సుమా!

తరువాత ఆ ఋత్విక్కులు బంగరు నాగళ్లతో యజ్ఞభూమిని దున్ని, అచట ధర్మరాజునకు యథావిధిగా యజ్ఞదీక్షను ఇచ్చిరి. పూర్వము వరుణుని యజ్ఞములో వలె ఆ యజ్ఞములో సామగ్రులు బంగారముతో చేసినవి.

ఇంద్రాదయో లోకపాలా విరించభవసంయుతాః । 13

సగణాస్సిద్ధగంధర్వా విద్యాధరమహోరగాః ।
మునయో యక్షరక్షాంసి ఖగకిన్నరచారణాః ॥ 14

రాజానశ్చ సమాహూతా రాజపత్న్యశ్చ సర్వశః ।
రాజసూయం సమీయుస్స్మ రాజ్ఞః పాండుసుతస్య వై ।
మేనిరే కృష్ణభక్తస్య సూపపన్నమవిస్మితాః । 15

ఇంద్ర-ఆదయః= ఇంద్రుడు మొదలుగా గల, లోకపాలాః= లోకపాలురులు, విరించభవసంయుతాః= బ్రహ్మదేవునితో శివునితో కూడినవారు, మునయః= మహర్షులు, యక్షరక్షాంసి= యక్షులు రాక్షసులు, ఖగకిన్నరచారణాః= పక్షులు కిన్నరులు చారణులు, రాజానః చ= రాజులు, రాజపత్న్యః చ= రాజపత్నులు కూడ, సర్వతః= అందరు, సమాహూతాః= ఆహ్వానించబడినవారై, పాండుసుతస్య= పాండు-మహారాజు పుత్రుడైన, రాజ్ఞః= ధర్మరాజుయొక్క, రాజసూయమ్= రాజసూయమును గురించి, సమీయుః స్మ= విచ్చేసిరి, అవిస్మితాః= ఆశ్చర్యపడని వారు, కృష్ణభక్తస్య= శ్రీకృష్ణుని భక్తుడగు ధర్మరాజునకు, సు-ఉపపన్నమ్= బాగుగా సంపన్నమైనదిగా, మేనిరే= తలచిరి.

ఇంద్రవరుణాదిలోకపాలకులు, బ్రహ్మదేవుడు, శివుడు, మహర్షులు, యక్షులు, రాక్షసులు, గరుడాది పక్షులు, కిన్నరులు, చారణులు పాండు-మహారాజుయొక్క పుత్రుడగు ధర్మరాజుయొక్క రాజసూయమునకు

విచ్చేసిరి. ఆయన ఆహ్వానమునందుకొని రాజులు, రాజపత్నులు కూడ అందరు విచ్చేసిరి. శ్రీకృష్ణ భక్తుడగు ధర్మరాజునకు రాజసూయము సుసంపన్నమగుటలో ఆశ్చర్యము లేదని వారు తలపోసిరి.

అయాజయన్ మహారాజం యాజకా దేవవర్చసః ।
రాజసూయేన విధివత్ప్రాచేతసమివామరాః ॥ 16

దేవవర్చసః= దేవతల తేజస్సు వంటి తేజస్సు గల, యాజకాః= ఋత్విక్కులు, మహారాజమ్= ధర్మరాజును, అమరాః= దేవతలు, ప్రాచేతసం ఇవ= వరుణుని వలె, విధివత్= యథావిధిగా, రాజసూయేన అయాజయన్= రాజసూయమును చేయించిరి.

దేవతలు వరుణుని వలె, దేవతల తేజస్సు గల ఋత్విక్కులు యథావిధిగా ధర్మరాజుచే రాజసూయయాగమును చేయించిరి.

సౌత్యేఽహన్యవనీపాలో యాజకాన్ సదసస్పతీన్ ।
అపూజయన్మహాభాగాన్ యథావత్సుసమాహితః ॥ 17

సౌత్యే= సోమరసమును దంచే, అహని= దినమునందు, సుసమాహితః= మిక్కిలి ఏకాగ్రమగు చిత్తము గల, అవనీపాలః= ధర్మరాజు, యాజకాన్= ఋత్విక్కులను, మహాభాగాన్= మహానుభావులైన, సదసస్పతీన్= యజ్ఞ పర్యవేక్షకులను, యథావత్= యథావిధిగా, అపూజయత్= పూజించెను.

సోమరసమును దంచే దినమునందు ధర్మరాజు మిక్కిలి ఏకాగ్రమగు చిత్తము గలవాడై ఋత్విక్కులను, యజ్ఞమును పర్యవేక్షించే మహాత్ములను యథావిధిగా పూజించెను.

సదస్యాగ్ర్యార్హణార్హం వై విమృశంతస్సభాసదః ।
నాధ్యగచ్ఛన్ననైకాంత్యాత్సహదేవస్తదాఽబ్రవీత్ ॥ 18

సభాసదః= సభాసదులు, విమృశంతః= చర్చించువారై, సదస్య-అగ్ర్య-అర్హణ-అర్హం వై= సభాసదులలో అగ్రపూజకు యోగ్యమైన వ్యక్తినైతే, అనైకాంత్యాత్= అభిప్రాయములలో ఏకత్వము లేకుండుట వలన, న అధ్యగచ్ఛన్= నిర్ణయించలేకపోయిరి, తదా= అప్పుడు, సహదేవః= సహదేవుడు, అబ్రవీత్= పలికేను.

సభాసదులలో అగ్రపూజకు అర్హుడెవరు? అని సభాసదులు చర్చించి కూడ, చాల అభిప్రాయములుండుటచే ఒక నిర్ణయమునకు రాలేకపోయిరి. అప్పుడు సహదేవుడిట్లు పలికెను.

అర్హతి హ్యచ్యుతశ్రేష్ఠం భగవాన్ సాత్వతాం పతిః ।
ఏష వై దేవతాస్సర్వా దేశకాలధనాదయః ॥ 19

సాత్వతామ్= యాదవులకు, పతిః= ప్రభుడు, అచ్యుతః= స్వరూపచ్యుతి లేనివాడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, శ్రైష్ఠ్యమ్= అగ్రస్థానమును, అర్హతి= తగును, సర్వాః= అందరు, దేవతాః= దేవతలు, దేశకాలధన-ఆదయః= దేశము కాలము ధనము మొదలైనవి, ఏషః= వై= ఈయనయే.

యాదవప్రభుడగు శ్రీకృష్ణ భగవానుడు సత్త్వగుణప్రధానులగు భక్తులకు పాలకుడు, స్వరూపచ్యుతి లేనివాడు. అగ్రపూజకు ఆయనే అర్హుడు. సకలదేవతలు, దేశకాలములు, ధనధాన్యములు ఇత్యాది సర్వము ఈయన రూపములే.

యదాత్మకమిదం విశ్వం క్రతవశ్చ యదాత్మకాః ।
అగ్నిరాహుతయో మంత్రస్సాంఖ్యం యోగశ్చ యత్పరః ॥20

ఇదమ్= ఈ, విశ్వమ్= జగత్తు, యద్-ఆత్మకమ్= ఎవడు ఆత్మగా గలదియో, క్రతవః చ= యజ్ఞములు కూడ, యద్-ఆత్మకాః= ఎవడు ఆత్మగా గలవియో, అగ్నిః= అగ్ని, ఆహుతయః= ఆహుతులు, మంత్రః

= మంత్రము, సాంఖ్యమ్= జ్ఞానయోగము, యోగః చ= కర్మయోగము కూడ, యత్-పరః= ఎవడు లక్ష్యముగా గలవియో.

ఈ జగత్తుయొక్క మరియు యజ్ఞములయొక్క సారతత్త్వము ఈయనయే. అగ్నులలో మంత్రపూర్వకముగా ఆహుతులనిచ్చేది (కర్మమార్గము), యోగమార్గము, జ్ఞానమార్గము కూడ ఈయనను చేరుటకే ఉద్దేశించబడినవి.

ఏక ఏవాద్వితీయోఽసావైతదాత్మ్యమిదం జగత్ ।
ఆత్మనాఽఽత్మాశ్రయస్సభ్యాస్సృజత్యవతి హంత్యజః ॥ 21

అసౌ= ఈయన, ఏకః ఏవ= ఒక్కడే, అద్వితీయః= రెండవది లేని వాడు, ఇదమ్= ఈ, జగత్= జగత్తు, ఏతదాత్మ్యమ్= ఈయనయే ఆత్మగా గలది, సభ్యాః= ఓ సభాసదులారా!, అజః= పుట్టుక లేని ఆయన, ఆత్మనా= తనచే, ఆత్మాశ్రయః= తానే ఆశ్రయముగా గలవాడై, సృజతి= సృష్టించుచున్నాడు, అవతి= పాలించుచున్నాడు, హంతి= సంహరించు చున్నాడు.

రెండవది లేని ఒకే పరబ్రహ్మ, ఈ జగత్తుయొక్క సార తత్త్వము ఈయనయే. ఓ సభ్యులారా! పుట్టుక లేని ఈయన తానే ఆశ్రయముగా గలవాడై తనచే ఈ జగత్తును సృష్టించి పాలించి ఉపసంహరించు చున్నాడు.

వివిధానీహ కర్మాణి జనయన్ యదవేక్షయా ।
ఈహతే యదయం సర్వశ్శ్రేయో ధర్మాదిలక్షణమ్ ॥ 22

యద్-అవేక్షయా= ఎవని ప్రేరణచే, అయమ్= ఈ, సర్వః= ప్రతివాడు, ఇహ= ఈ లోకమునందు, వివిధాని= పలు విధముల, కర్మాణి= కర్మలను, జనయన్= చేయువాడై, యత్= ఎవనినుండి, ధర్మ-ఆదిలక్షణమ్= ధర్మము మొదలైన రూపము గల, శ్రేయః= ఫలమును, ఈహతే= కోరుచున్నాడో.

ఈ లోకములో సకలమానవులు ఈ భగవానుని ప్రేరణచే వివిధ కర్మలను చేస్తూ, ఈయననుండియే ధర్మార్థకామములనే పురుషార్థములను పొందగోరుచున్నారు.

తస్మాత్కృష్ణాయ మహతే దీయతాం పరమార్హణమ్ ।
ఏవం చేత్సర్వభూతానామాత్మనశ్చార్హణం భవేత్ ॥ 23

తస్మాత్= అందువలన, మహతే= మహాత్ముడగు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, పరమ-అర్హణమ్= అగ్రపూజ, దీయతామ్= ఈయబడు గాక!, ఏవం చేత్= ఇట్లైనచో, సర్వభూతానామ్= సకలప్రాణులకు, ఆత్మనః చ= తనకు కూడ, అర్హణమ్= పూజ, భవేత్= అగును.

అందువలన, మహాత్ముడగు శ్రీకృష్ణునకు అగ్రపూజను చేయుడు. అట్లు చేసినచో, సకలప్రాణులకు తనకు కూడ పూజ చేసినట్లే యగును.

సర్వభూతాత్మభూతాయ కృష్ణాయానన్యదర్శినే ।
దేయం శాంతాయ పూర్ణాయ దత్తస్యానంత్యమిచ్ఛతా ॥ 24

దత్తస్య= దానమునకు, ఆనంత్యమ్= అనంతఫలమును, ఇచ్ఛతా= కోరువానిచే, సర్వభూత- ఆత్మభూతాయ= సకలప్రాణుల ఆత్మస్వరూపు-డైనట్టియు, అనన్యదర్శినే= భేదభావము లేనట్టియు, శాంతాయ= రాగద్వేషములు లేనట్టియు, పూర్ణాయ= పూర్ణుడగు, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, దేయమ్= ఈయబడవలెను.

తాను చేసిన దానము అనంతఫలమునీయవలెనని కోరువాడు ఆ దానమును పూర్ణుడగు శ్రీకృష్ణునకీయ వలెను. సకలప్రాణుల ఆత్మయగు ఆయనయందు భేదభావము, రాగద్వేషములు లేవు.

ఇత్యుక్త్వా సహదేవోఽభూత్తూష్ణీం కృష్ణానుభావవిత్ ।
తచ్ఛ్రుత్వా తుష్టువుస్సర్వే సాధు సాధ్వితి సత్తమాః ॥ 25

కృష్ణ-అనుభావవిత్= శ్రీకృష్ణుని మహిమ తెలిసిన, సహదేవః= సహదేవుడు, ఇతి= ఈ విధముగా, ఉక్త్వా= పలికి, తూష్ణీం అభూత్= మిన్నకుండెను, తత్= ఆ మాటను, శ్రుత్వా= విని, సత్తమాః= సత్పురుషులు, సర్వే= అందరు, సాధు= బాగు, సాధు= బాగు, ఇతి= అని, తుష్టువుః= స్తుతించిరి.

సహదేవుడు శ్రీకృష్ణుని మహిమ తెలిసినవాడు. ఆతడిట్లు పలికి మిన్నకుండెను. అచటి సత్పురుషులందురు ఆ వచనమును విని, బాగు బాగు అని ప్రశంసించిరి.

శ్రుత్వా ద్విజేరితం రాజా జ్ఞాత్వా హార్దం సభాసదామ్ ।
సమర్హయద్ధృషీకేశం ప్రీతః ప్రణయవిహ్వలః ॥ 26

ప్రీతః= ప్రీతి జెందిన, రాజా= ధర్మరాజు, ద్విజ-ఈరితమ్= మహర్షుల వచనమును, శ్రుత్వా= విని, సభాసదామ్= సభాసదుల, హార్దమ్= అభిప్రాయమును, జ్ఞాత్వా= తెలుసుకొని, ప్రణయవిహ్వలః= ప్రేమచే విహ్వలుడై, హృషీకేశమ్= ఇంద్రియాంతర్యామియగు శ్రీకృష్ణ భగవానుని, సమర్హయత్= బాగుగా పూజించెను.

ధర్మరాజు మహర్షుల ఆ అనుమోదనమును విని ప్రీతుడాయెను. ఆయన సభాసదుల అభిప్రాయము నెరింగి, ప్రేమతో విహ్వలుడై ఇంద్రియాంతర్యామియగు శ్రీకృష్ణ భగవానుని బాగుగా పూజించెను.

తత్పాదావవనిజ్యాప శిరసా లోకపావనీః ।
సభార్యస్సానుజామాత్య స్సకుటుంబోఽవహన్ముదా ॥ 27

సభార్యః= భార్యతో కూడినవాడు, స-అనుజ-అమాత్యః= తమ్ములతో అమాత్యులతో కూడినవాడు, సకుటుంబః= కుటుంబముతో కూడినవాడు అగు ధర్మరాజు, తత్-పాదౌ= ఆయన పాదములను, అవనిజ్య= కడిగి, ముదా= ఆనందముతో, లోకపావనీః= లోకములను

పవిత్రము చేసే, ఆపః= జలములను, శిరసా= శిరస్సుతో, అవహత్= ధరించెను.

ధర్మరాజు భార్య, తమ్ములు, అమాత్యులతో గూడి ఆయన పాదములను కడిగి, లోకములను పావనము చేసే ఆ నీటిని తలపై దాల్చెను.

వాసోభిః పీతకౌశేయైర్భూషణైశ్చ మహాధనైః ।
అర్హయిత్వాఽశ్రుపూర్ణాక్షో నాశకత్సమవేక్షితుమ్ ॥ 28

పీతకౌశేయైః= పచ్చని పట్టుతో చేసిన, వాసోభిః= వస్త్రములతో, మహాధనైః= మిక్కిలి విలువైన, భూషణైః చ= అలంకారములతో గూడ, అర్హయిత్వా= సమ్మానించి, అశ్రుపూర్ణ-అక్షః= నీళ్ళతో నిండిన కన్నులు గల వాడై, సమవేక్షితుమ్= సరిగ్గా చూచుటకు, న అశకత్= సమర్థుడు కాలేదు.

ధర్మరాజు శ్రీకృష్ణునకు పట్టుతో చేసిన పచ్చని వస్త్రములను, మిక్కిలి విలువైన ఆభరణములను కూడ యిచ్చి సమ్మానము చేసెను. కన్నులు ఆనందాశ్రువులతో నిండుటచే ఆయన సరిగ్గా చూడలేకపోయెను.

ఇత్థం సభాజితం వీక్ష్య సర్వే ప్రాంజలయో జనాః ।
నమో జయేతి నేముస్తం నిపేతుః పుష్పవృష్టయః ॥ 29

ఇత్థమ్= ఈ విధముగా, సభాజితమ్= సత్కరించబడిన శ్రీకృష్ణుని, దృష్ట్వా= చూచి, ప్రాంజలయః= దోసిలియొగ్గిన, జనాః= సర్వే= అందరు, నమః= నమస్కారము, జయ= సర్వోత్కర్షగానుండుము, ఇతి= అని, తమ్= ఆయనను, నేముః= నమస్కరించిరి, పుష్పవృష్టయః= పూల వానలు, పేతుః= పడినవి.

ఈ విధముగా సత్కరించబడిన ఆ శ్రీకృష్ణుని చూచి జనులందరు దోసిలి యొగ్గి, నమస్కారము, సర్వోత్కర్షగా నుండుము, అని నమస్కరించిరి. పూల వర్షము కురిసెను.

ఇత్థం నిశమ్య దమఘోషసుతస్స్వపీఠాత్ ।
ఉత్థాయ కృష్ణగుణవర్ణనజాతమన్యుఃఁ ।
ఉత్క్షిప్య బాహుమిదమాహ సదస్యమర్షీ
సంశ్రావయన్ భగవతే పరుషాణ్యభీతఃఁ ॥ 30

అమర్షీ= సహనము లేని, దమఘోషసుతఃఁ= దమఘోషుని పుత్రుడగు శిశుపాలుడు, ఇత్థమ్= ఈ విధముగా, నిశమ్య= విని, కృష్ణగుణవర్ణనజాత మన్యుఃఁ= శ్రీకృష్ణుని గుణములను వర్ణించుట వలన పుట్టిన కోపము గల వాడై, అభీతఃఁ= భయము లేనివాడై, సదసి= సభయందు, స్వపీఠాత్= తన ఆసనమునుండి, ఉత్థాయ= లేచి, బాహుమ్= చేతిని, ఉత్క్షిప్య= పైకి విసిరి, భగవతే= కృష్ణ భగవానుని కొరకు, పరుషాణి= పరుషవాక్కులను, సంశ్రావయన్= వినిపించువాడై, ఇదమ్= ఈ మాటను, ఆహ= పలికెను.

దమఘోషసుతుడగు శిశుపాలునకు సహనము లేదు. జనుల వచనములను, శ్రీకృష్ణుని గుణముల వర్ణనను విని ఆతనికి కోపము పుట్టెను. ఆతడు సభలో భయము లేకుండా తన ఆసనమునుండి పైకి లేచి చేతిని విసురుతూ, శ్రీకృష్ణ భగవానుని ఉద్దేశించి పరుషవచనముల నిట్లు పలికెను.

ఈశో దురత్యయఃఁ కాల ఇతి సత్యవతీ శ్రుతిఃఁ ।
వృద్ధానామపి యద్బుద్ధిర్బాలవాక్యైర్విభిద్యతే ॥ 31

ఈశఃఁ= సర్వమును శాసించే, కాలఃఁ= కాలము, దురత్యయఃఁ= అతిక్రమించ శక్యము కానిది, ఇతి= అనే, శ్రుతిఃఁ= వచనము, సత్యవతీ=

యథార్థము, యత్= ఏలయనగా, వృద్ధానామ్= పెద్దల, బుద్ధిః అపి= బుద్ధి కూడ, బాలవాక్యైఃr= కుర్రవాని మాటలచే, విభిద్యతే= భ్రాంతమగునో.

సర్వమును శాసించే కాలమును ఎవ్వరూ అతిక్రమించలేరనే శ్రుతివచనము యథార్థము. ఎందుకంటే, పెద్దల బుద్ధి కూడ కుర్రవాని మాటలను విని పెడద్రోవ పట్టినది.

యూయం పాత్రవిదాం శ్రేష్ఠా మా మంధ్వం బాలభాషితమ్ ।
సదసస్పతయస్సర్వే కృష్ణో యత్సమ్మతోఽర్హణే ॥ 32

సదసస్పతయఃr= యజ్ఞపర్యవేక్షకులారా!, పాత్రవిదామ్= పాత్ర తెలిసినవారిలో, యూయమ్= మీరు, సర్వేr= అందరు, శ్రేష్ఠాఃr= శ్రేష్ఠులు, కృష్ణఃr= శ్రీకృష్ణుడు, అర్హణే= పూజించుటయందు, సమ్మతఃr= యోగ్యుడు అనే, యత్= ఏ, బాలభాషితమ్= కుర్రవాని మాట గలదో దానిని, మా మంధ్వమ్= స్వీకరించకుడు.

ఓ యజ్ఞపర్యవేక్షకులారా! మీరందరు పాత్ర (దానమునకు యోగ్యుడు) తెలిసినవారిలో శ్రేష్ఠులు. కృష్ణుడు అగ్రపూజకు యోగ్యుడని కుర్రవాడు చెప్పిన మాటను స్వీకరించవద్దు.

తపోవిద్యావ్రతధరాన్ జ్ఞానవిధ్వస్తకల్మషాన్ ।
పరమర్షీన్ బ్రహ్మనిష్ఠాన్ లోకపాలైశ్చ పూజితాన్ ॥ 33

సదసస్పతీనతిక్రమ్య గోపాలః కులపాంసనః ।
యథా కాకః పురోడాశం సపర్యాం కథమర్హతి ॥ 34

తపఃr-విద్యావ్రతధరాన్= తపస్సును విద్యను నియమనిష్ఠలను కలిగినట్టియు, జ్ఞానవిధ్వస్తకల్మషాన్= ఉపాసనచే నశింపజేయబడిన మనోమాలిన్యము కలిగినట్టియు, బ్రహ్మనిష్ఠాన్= పరబ్రహ్మయందు నిలిచి ఉండునట్టియు, లోకపాలైఃr చ= లోకపాలకులచే కూడ, పూజితాన్=

పూజించబడినట్టియు, పరమ-ఋషీన్= మహర్షులైన, సదసస్పతీన్= యజ్ఞపర్యవేక్షకులను, అతిక్రమ్య= అతిక్రమించి, కులపాంసనః= వంశమును కళంకితము చేసే, గోపాలః= ఆవుల కాపరి, కాకః= కాకి, పూరోడాశం యథా= పురోడాశమును వలె, సపర్యామ్= అగ్రపూజను గురించి, కథమ్= ఏ విధముగా, అర్హతి= అర్హుడగును?

యజ్ఞమును పర్యవేక్షిస్తున్న మహర్షులు తపస్సు, విద్య, నియమనిష్ఠలు గలవారు. వారు ఉపాసనచే మనోమాలిన్యములను నశింపచేసి పరబ్రహ్మయందు నిలిచియుందురు. వారిని ఇంద్రాది లోకపాలకులు కూడ పూజింతురు. వారిని కాదని క్షత్రియవంశమునకు కళంకము తెచ్చిన ఈ పశుల కాపరి, కాకి పురోడాశమునకు వలె, అగ్రపూజకు ఎట్లు అర్హుడగును?

వర్ణాశ్రమకులాపేత స్సర్వధర్మబహిష్కృతః ।
స్వైరవర్తీ గుణైర్హీన స్సపర్యాం కథమర్హతి ॥ 35

వర్ణ-ఆశ్రమకుల-అపేతః= వర్ణము ఆశ్రమము కులములనుండి తొలగినవాడు, సర్వధర్మబహిష్కృతః= సకలధర్మములచే బహిష్కరించ-బడినవాడు, స్వైరవర్తీ= స్వైరముగా తిరుగువాడు, గుణైః= గుణములచే, హీనః= హీనుడు, సపర్యామ్= అగ్రపూజను గురించి, కథమ్= ఏ విధముగా, అర్హతి= అర్హుడగును?

ఈతనికి వర్ణము కాని, ఆశ్రమును కాని, కులము గాని, సద్గుణములు గాని లేవు. సకలధర్మములకు బయట స్వైరముగా తిరిగే ఈతడు అగ్రపూజకు ఎట్లు అర్హుడగును?

యయాతినైషాం హి కులం శప్తం సద్భిర్బహిష్కృతమ్ ।
వృథా పానరతం శశ్వ త్సపర్యాం కథమర్హతి ॥ 36

హి= ఏలయన, ఏషామ్= వీరి, కులమ్= కులము, యయాతినా= యయాతిచే, శప్తమ్= శపించబడినది, సద్భిః= సత్పురుషులచే, బహిష్కృతమ్= బహిష్కరించబడినది, శశ్వత్= ఎల్లవేళలా, వృథాపాన-రతమ్= మద్యపానమునందు రమించునది, సపర్యామ్= అగ్రపూజను గురించి, కథమ్= ఎట్లు, అర్హతి= అర్హుడగును?

ఎందుకంటే, వీరి కులమును యయాతి శపించినాడు. వీరి కులమువారు సర్వదా మద్యపానమునందు రమించెదరు గనుక ఆ కులమును సత్పురుషుల బహిష్కరించినారు. ఆ కులము వాడు అగ్రపూజకు అర్హుడెట్లగును?

బ్రహ్మర్షిసేవితాన్ దేశాన్ హిత్వైతేఽబ్రహ్మవర్చసమ్ ।
సముద్రం దుర్గమాశ్రిత్య బాధంతే దస్యవః ప్రజాః ॥ 37

ఏతే= ఈ, దస్యవః= బందిపోట్లు, బ్రహ్మ-ఋషిసేవితాన్= బ్రహ్మర్షులచే సేవించబడే, దేశాన్= ప్రాంతమును, హిత్వా= విడిచిపెట్టి, అబ్రహ్మవర్చసమ్= బ్రహ్మవర్చస్సును నశింపజేసే, సముద్రం దుర్గమ్= సముద్రదుర్గమును, ఆశ్రిత్య= ఆశ్రయించి, ప్రజాః= ప్రజలను, బాధంతే= పీడించుచున్నారు.

వీరు బందిపోట్లు, బ్రహ్మర్షులు సేవించే మథురదేశమును విడిచిపెట్టి వీరు బ్రహ్మవర్చస్సును నశింపజేసే (వేదసంబంధం లేని) సముద్రములో దుర్గము కట్టుకొని దానిని ఆశ్రయించి ప్రజలను పీడించుచున్నారు.

ఏవమాదీన్యభద్రాణి బభాషే నష్టమంగలః ।
నోవాచ కించిద్భగవాన్ యథా సింహశ్చిరుతమ్ ॥ 38

నష్టమంగలః= నశించిన కల్యాణములు గల శిశుపాలుడు, ఏవమాదీని= ఈ విధమైన, అభద్రాణి= అమంగళములను, బభాషే=

పలికెను, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, శివారుతమ్= నక్క కూతను గురించి, సింహః యథా= సింహము వలె, కించిత్= దేనినైననూ, న ఉవాచ= పలుకలేదు.

శిశుపాలుని కల్యాణములు నశించెను. ఆతడీ విధమైన అమంగళములను పలికెను. కాని, నక్క కూతను సింహము లక్ష్యపెట్ట-నట్లుగా, శ్రీకృష్ణ భగవానుడేమీ మాటలాడలేదు.

భగవన్నిందనం శ్రుత్వా దుస్సహం తత్సభాసదః ।
కర్ణౌ పిధాయ నిర్జగ్ముశ్శపంతశ్చేదిపం రుషా ॥ 39

సభాసదః= సభాసదులు, తత్=ఆ, దుస్సహమ్= సహింప శక్యము కాని, భగవత్=నిందనమ్= భగవానుని నిందను, శ్రుత్వా= విని, కర్ణౌ= రెండు చెవులను, పిధాయ= మూసుకొని, చేదిపమ్= చేదిరాజగు శిశుపాలుని, రుషా= కోపముతో, శపంతః= తిట్టుచున్నవారై, నిర్జగ్ముః = నిష్క్రమించిరి.

చేదిరాజగు శిశుపాలుడు చేసిన ఆ భగవానుని నిందను విన్న సభాసదులు చెవులను మూసుకొని, కోపముతో వానిని తిడుతూ నిష్క్రమించిరి.

నిందాం భగవతశ్శృణ్వంస్తత్పరస్య జనస్య వా ।
తతో నాపైతి యస్సోఽపి యాత్యధస్సుకృతాచ్చ్యుతః ॥ 40

యః= ఎవడైతే, భగవతః= భగవానునియొక్క, వా= లేదా, తత్-పరస్య= ఆ భగవానుని నమ్ముకున్న, జనస్య= భక్తజనునియొక్క, నిందామ్= నిందను, శృణ్వన్= వినుచున్నవాడై, తతః= అక్కడనుండి, న అపైతి= తొలగిపోడో, సః అపి= ఆతడు కూడ, సుకృతాత్= పుణ్యము నుండి, చ్యుతః= జారినవాడై, అధః= నరకమును, యాతి= పొందును.

భగవంతుని గాని, భగవంతుని నమ్ముకున్న భక్తజనుని గాని తిడుతూ ఉండే ఎవడేని అక్కడనుండి దూరంగా పోకుండా నిలబడి వినుచుండునో, ఆ వినేవాడు కూడ పుణ్యమునుండి భ్రష్టుడై నరకమును పొందును.

తతః పాండుసుతాః క్రుద్ధా మత్స్యకైకయసృంజయాః ।
ఉదాయుధాస్సముత్తస్థు శ్శిశుపాలజిఘాంసవః ॥ 41

తతః= అందువలన, క్రుద్ధాః= కోపించిన, పాండుసుతాః= పాండవులు, మత్స్యకైకయసృంజయాః= మత్స్యకేకయసృంజయ వంశీయులు, శిశుపాలజిఘాంసవః= శిశుపాలుని వధించ గోరువారై, ఉద్-ఆయుధాః= ఎత్తబడిన ఆయుధములు గలవారై, సముత్తస్థుః= లేచి నిలబడిరి.

పాండవులు, మత్స్యకేకసృంజయవంశీయులు ఆ నిందలకు కోపించి శిశుపాలుని వధించగోరి ఆయుధములను పైకెత్తి లేచి నిలబడిరి.

తతశ్చైద్యస్యసంభ్రాంతో జగృహే ఖడ్గచర్మణీ ।
భర్త్సయన్ కృష్ణపక్షీయాన్ రాజ్ఞస్సదసి భారత ॥ 42

భారత= భరతవంశీయుడవగు ఓ రాజా!, తతః= తరువాత, అసంభ్రాంతః= భయము లేని, చైద్యః తు= చేదిరాజగు శిశుపాలుడైతే, సదసి= సభయందు, కృష్ణపక్షీయాన్= శ్రీకృష్ణుని పక్షమునకు చెందిన, రాజ్ఞః= రాజులను, భర్త్సయన్= తిరస్కరించువాడై, ఖడ్గచర్మణీ= కత్తిని, డాలును, జగృహే= తీసుకొనెను.

భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! అప్పుడు చేదిరాజగు శిశుపాలుడైతే భయము లేకుండా శ్రీకృష్ణుని పక్షమునకు చెందిన రాజులను తిరస్కరించి, కత్తిని డాలును చేతిలోకిని తీసుకొనెను.

తావదుత్థాయ భగవాన్ స్వాన్నివార్య స్వయం రుషా ।
శిరః క్షురాంతచక్రేణ జహారాపతతో రిపోః ॥ 43

తావత్= అంతలో, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉత్థాయ= పైకి లేచి, స్వాన్= తనవారిని, నివార్య= నివారించి, స్వయమ్= తాను, రుషా= కోపముతో, ఆపతతః= మీదకు వచ్చుచున్న, రిపోః= శత్రువు యొక్క, శిరః= తలను, క్షుర-అంతచక్రేణ= చురకత్తియొక్క పదునువంటి పదును గల చక్రముతో, జహార= ఊడగొట్టెను.

అంతలో శ్రీకృష్ణ భగవానుడు స్వయముగా లేచి తన వారిని ఆపి, కోపముతో మీదకు వస్తున్న శత్రువు తలను చురకత్తి పదును గల చక్రముతో నరికెను.

శబ్దః కోలాహలోఽప్యాసీచ్ఛిశుపాలే హతే మహాన్ ।
తస్యానుయాయినో భూపా దుద్రువుర్జీవితైషిణః ॥ 44

శిశుపాలే= శిశుపాలుడు, హతే= సంహరించబడగా, మహాన్= పెద్ద, కోలాహలః శబ్దః అపి= కోలాహలశబ్దము కూడ, ఆసీత్= ఆయెను, తస్య= వాని, అనుయాయినః= అనుచరులైన, భూపాః= రాజులు, జీవితైషిణః= బ్రదుకునందు తీపి గలవారై, దుద్రువుః= పారిపోయిరి.

శిశుపాలుడు సంహరించబడగానే పెద్ద కోలాహలశబ్దము కలిగెను. ఆతని అనుచరులగు రాజులు బ్రదుకునందు తీపి గలవారై పారిపోయిరి.

చైద్యదేహోత్థితం జ్యోతిర్వాసుదేవముపావిశత్ ।
పశ్యతాం సర్వభూతానాముల్కేవ భువి ఖాచ్చ్యుతా ॥ 45

చైద్యదేహ-ఉత్థితమ్= చేదిరాజుయొక్క దేహమునుండి పైకి లేచిన, జ్యోతిః= జ్యోతి, ఖాత్= ఆకాశమునుండి, చ్యుతా= జారిన, ఉల్కా ఇవ=

ఉల్క వలె, సర్వభూతానామ్= సకలప్రాణులు, పశ్యతామ్= చూస్తుండగా, వాసుదేవమ్= వసుదేవపుత్రుడగు శ్రీకృష్ణుని, ఉపావిశత్= ప్రవేశించెను.

చేదిరాజగు శిశుపాలుని దేహమునుండి పైకి లేచిన జ్యోతి ఒకటి ఆకాసమునుండి రాలిపడిన ఉల్కను పోలియుండెను. సకలప్రాణులు చూచుచుండగా ఆ జ్యోతి శ్రీకృష్ణ భగవానునియందు ప్రవేశించెను.

జన్మత్రయానుగుణితవైరసంరబ్ధయా ధియా ।
ధ్యాయంస్తన్మయతాం యాతో భావో హి భవకారణమ్ ॥ 46

జన్మత్రయ-అనుగుణితవైరసంరబ్ధయా= మూడు జన్మలయందు అనువృత్తమైన వైరముచే ద్వేషముతో కూడిన, ధియా= బుద్ధితో, ధ్యాయన్= ధ్యానించువాడై, తత్-మయతామ్= ఆయనయందు విలీనమగుటను, యాతః= పొందినవాడు, హి= ఏలయనగా, భావః= భావన, భవకారణమ్= జన్మహేతువు.

ఆతడు మూడు జన్మలలో వైరము చేసి దానిచే ద్వేషముతో నిండిన బుద్ధితో ఆ భగవానుని గురించి మాత్రమే ధ్యానిస్తూ ఆయనయందు విలీన వయ్యెను. ఏలయన, జీవునకు భావన వలననే ఉత్తరగతి లభించును.

ఋత్విగ్భ్యస్ససదస్యేభ్యో దక్షిణాం విపులామదాత్ ।
సర్వాన్ సంపూజ్య విధివచ్చక్రేఽవభృథమేకరాట్ ॥ 47

ససదస్యేభ్యః= సభాసదులతో కూడిన, ఋత్విగ్భ్యః= ఋత్విక్కుల కొరకు, విపులామ్= అధికమగు, దక్షిణమ్= దక్షిణను, అదాత్= ఇచ్చెను, ఏకరాట్= చక్రవర్తియగు ధర్మరాజు, సర్వాన్= అందరిని, సంపూజ్య= చక్కగా సమ్మానించి, విధివత్= యథావిధిగా, అవభృథమ్= అవభృథ స్నానమును, చక్రే= చేసెను.

చక్రవర్తియగు ధర్మరాజు ఋత్విక్కులకు, సదస్యులకు అధికమగు దక్షిణలనిచ్చెను. ఆయన అందరిని చక్కగా సమ్మానించి యథావిధిగా అవభృథ స్నానమును చేసెను.

సాధయిత్వా క్రతుం రాజ్ఞః కృష్ణో యోగేశ్వరేశ్వరః ।
ఉవాస కతిచిన్మాసాన్ సుహృద్భిరభియాచితః ॥ 48

యోగ-ఈశ్వర-ఈశ్వరః= యోగేశ్వరులగు సనకాదులకు కూడ ప్రభుడగు, కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, రాజ్ఞః= ధర్మరాజునకు, క్రతుమ్= రాజసూయయాగమును, సాధయిత్వా= సంపన్నము చేసి, సుహృద్భిః= బంధువులచే, అభియాచితః= కోరబడినవాడై, కతిచిత్= కొన్ని, మాసాన్= మాసములను, ఉవాస= నివసించెను.

యోగేశ్వరులగు సనకాదులకు కూడ ప్రభుడగు శ్రీకృష్ణ భగవానుడీ విధముగా ధర్మరాజునకు రాజసూయయాగమును సంపన్నము చేసెను. బంధువుల కోరికపై ఆయన కొన్ని మాసములు అచటనే నివసించెను.

తతోఽనుజ్ఞాప్య రాజానమనిచ్ఛంతమపీశ్వరః ।
యయౌ సభార్య స్సామాత్య స్స్వపురం దేవకీసుతః ॥ 49

తతః= తరువాత, దేవకీసుతః= దేవకి పుత్రుడగు, ఈశ్వరః= శ్రీకృష్ణ భగవానుడు, రాజానమ్= ధర్మరాజును, అనిచ్ఛంతం అపి= ఇచ్చగించనివానిచే అయిననూ, కూడినవాడై, స-అమాత్యః= అమాత్యులతో కూడినవాడై, స్వపురమ్= తన నగరమును గురించి, యయౌ= వెళ్లెను.

తరువాత దేవకీపుత్రుడగు శ్రీకృష్ణ భగవానుడు ధర్మరాజు ఒప్పుకోకపోయినా ఒప్పించి, భార్యలతో అమాత్యులతో గూడి తన ద్వారకానగరమునకు వెళ్ళెను.

వర్ణితం తదుపాఖ్యానం మయా తే బహువిస్తరమ్ ।
వైకుంఠవాసినోర్జన్మ విప్రశాపాత్పునఃపునః ॥ 50

వైకుంఠవాసినోః= వైకుంఠవాసులగు జయవిజయులకు, విప్రశాపాత్= సనకాదుల శాపము వలన, పునఃపునః= మరల మరల, జన్మ= పుట్టుక యేది గలదో, తత్= ఆ, ఉపాఖ్యానమ్= వృత్తాంతము, మయా= నాచే, తే= నీకు, బహువిస్తరమ్= చాల విస్తారముగా, వర్ణితమ్= వర్ణించబడనది.

వైకుంఠవాసులగు జయవిజయులకు సనకాది మహర్షులు మరల మరల జన్మించుడని శాపమునిచ్చిరి. ఆ వృత్తాంతమును నేను నీకు చాల విస్తారముగా వర్ణించి యుంటిని.

రాజసూయావభృథ్యేన స్నాతో రాజా యుధిష్ఠిరః ।
బ్రహ్మక్షత్రసభామధ్యే శుశుభే సురరాడివ ॥ 51

రాజసూయ-అవభృథ్యేన స్నాతః= రాజసూయయాగమునకు సంబంధించిన అవభృథస్నానమును చేసిన, రాజా యుధిష్ఠిరః= ధర్మరాజు, బ్రహ్మక్షత్రసభామధ్యే= వేదవేత్తలు రాజుల సభయొక్క మధ్యయందు, సురరాట్ ఇవ= దేవేంద్రుడు వలె, శుశుభే= శోభిల్లెను.

ధర్మరాజు రాజసూయయాగమునకు చెందిన అవభృథస్నానమును చేసి బ్రాహ్మణుల, రాజుల సభ మధ్యలో దేవేంద్రుడు వలె శోభిల్లెను.

రాజ్ఞా సభాజితాస్సర్వే సురమానవఖేచరాః ।
కృష్ణం క్రతుం చ శంసంతస్స్వధామాని యయుర్ముదా ॥ 52

దుర్యోధనమృతే పాపం కలిం కురుకులామయమ్ ।

రాజ్ఞా= ధర్మరాజుచే, సభాజితాః= సమ్మానించబడిన, సురమానవ ఖేచరాః= దేవతలు మానవులు ఆకాశసంచారులగు గంధర్వులు మున్నగు

వారు, సర్వే= అందరు, పాపమ్= పాపియైనట్టియు, కలిమ్= కలహ స్వభావము కలిగినట్టియు, కురుకుల-ఆమయమ్= కురువంశమునకు వ్యాధివంటి, దుర్యోధనం ఋతే= దుర్యోధనుని తప్పించి, కృష్ణమ్= శ్రీకృష్ణుని, క్రతుం చ= యాగమును కూడ, శంసంతః= కొనియాడు-చున్నవారై, ముదా= ఆనందముతో, స్వదామాని= తమ నివాసములను గురించి, యయుః= వెళ్లిరి.

ధర్మరాజు దేవతలను, మానవులను, ఆకాశసంచారులగు గంధర్వాదులను సమ్మానించెను. దుర్యోధనుడు తప్ప వారందరు శ్రీకృష్ణుని, యాగమును కూడ కొనియాడుతూ ఆనందముగా తమ నివాసములకు వెళ్లిరి. దుర్యోధనుడు పాపి, కలహస్వభావుడు, కురు-వంశమునకు వ్యాధి వంటివాడు.

యో న సేహే శ్రియం స్ఫీతాం దృష్ట్వా పాండుసుతస్య తామ్ । 53

యః= ఏ దుర్యోధనుడైతే, పాండుసుతస్య= పాండుపుత్రుడగు ధర్మరాజుయొక్క, తామ్= ఆ, స్ఫీతామ్= ఉజ్జ్వలమైన, శ్రియమ్= సంపదను, దృష్ట్వా= చూచి, న సేహే= సహించలేదో.

దుర్యోధనుడు పాండుపుత్రుడగు ధర్మరాజుయొక్క ఆ ఉజ్జ్వలమగు సంపదను చూచి సహించలేకపోయెను.

య ఇదం కీర్తయేద్విష్ణోః కర్మ చైద్యవధాదికమ్ ।
రాజమోక్షం వితానం చ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 54

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
చతుస్సప్తతితమోఽధ్యాయః

యః= ఎవడైతే, ఇదమ్= ఈ, విష్ణోః= శ్రీకృష్ణ భగవానునియొక్క, చైద్యవధ-ఆదికమ్= చేదిరాజగు శిశుపాలుని వధ మొదలైన, కర్మ=

లీలను, రాజమోక్షమ్= రాజుల బంధవిముక్తిని, వితానం చ= రాజసూయయాగమును గురించి కూడ, కీర్తయేత్= కీర్తించునో అట్టివాడు, సర్వపాపైః= సకలపాపములనుండి, విముచ్యతే= విముక్తు డగును.

ఎవడైతే రాజుల బంధవిముక్తి, రాజసూయమును చేయించుట, చేదిరాజగు శిశుపాలుని వధ, అగ్రపూజ మొదలగు శ్రీకృష్ణ భగవానుని ఈ లీలలను కీర్తించునో, అట్టివాడు సకలపాపములనుండి విముక్తు డగును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణ భగవానుని అగ్రపూజ, శిశుపాలుని ఉద్ధారములను వర్ణించే
డెబ్బది నాల్గవ అధ్యాయము ముగిసినది (74).

* * *

అథ పంచసప్తతితమోఽధ్యాయః

రాజసూయము సమాప్తమగుట – దుర్యోధనునకు అవమానము

రాజోవాచ ।

అజాతశత్రోస్తం దృష్ట్వా రాజసూయమహోత్సవమ్ ।
సర్వే ముముదిరే బ్రహ్మన్ నృదేవా యే సమాగతాః ॥ 1

దుర్యోధనం వర్జయిత్వా రాజానస్సర్షయస్సురాః ।
ఇతి శ్రుతం నో భగవంస్తత్ర కారణముచ్యతామ్ ॥ 2

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, భగవన్= ఓ మహర్షీ!, అజాతశత్రోః= పుట్టని శత్రువులు గల ధర్మరాజుయొక్క, తమ్= ఆ, రాజసూయమహా-ఉత్సవమ్= రాజసూయ- యాగమునకు చెందిన గొప్ప ఉత్సవమును, దృష్ట్వా= చూచి, దుర్యోధనమ్= దుర్యోధనుని, వర్జయిత్వా= విడిచిపెట్టి, సమాగతాః= విచ్చేసిన, యే= ఏ, నృదేవాః= బ్రాహ్మణులు, స-ఋషయః= విచ్చేసిన, మహర్షులతో కూడిన, రాజానః = రాజులు, సురాః= దేవతలు గలరో, సర్వే= వారందరు, ముముదిరే= ఆనందించిరి, ఇతి= అని, నః= మాచే, శ్రుతమ్= వినబడినది, తత్ర= ఆ విషయమునందు, కారణమ్= కారణము, ఉచ్యతామ్= చెప్పబడుగాక!

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...ఓ శుక మహర్షీ! శత్రువులే లేని ధర్మరాజుయొక్క రాజసూయయాగము గొప్ప ఉత్సవమాయెను. దానికి విచ్చేసిన బ్రాహ్మణులు, మహర్షులు, దేవతలు అందరు సంతోషించిరి. దుర్యోదనుడు మాత్రమే సంతోషించలేదు. అని మేము వింటిమి. దానికి కారణమేమియో చెప్పుడు,

ఋషిరువాచ ।

పితామహస్య తే యజ్ఞే రాజసూయే మహాత్మనః ।
బాంధవాః పరిచర్యాయాం తస్యాసన్ ప్రేమబంధనాః ॥ 3

ఋషిః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, మహాత్మనః= మహాత్ముడగు, తే= నీ, పితామహస్య= తాతతగారగు ధర్మరాజుయొక్క, రాజసూయే యజ్ఞే= రాజసూయయాగమునందు, ప్రేమబంధనాః= ప్రేమబంధము గల, బాంధవాః= బంధువులు, తస్య= ఆయనయొక్క, పరిచర్యాయామ్= సేవయందు, ఆసన్= ఉండిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...నీ తాతగారు మహాత్ముడు ధర్మరాజు రాజసూయయాగమును చేసినప్పుడు ప్రేమబంధము గల బంధువులు ఆయనకు సేవలనందించిరి.

భీమో మహానసాధ్యక్షో ధనాధ్యక్షస్సుయోధనః ।
సహదేవస్తు పూజాయాం నకులో ద్రవ్యసాధనే ॥ 4

భీమః= భీముడు, మహానస-అధ్యక్షః= వంటశాలకు అధ్యక్షుడు, సుయోధనః= దుర్యోధనుడు, ధన-అధ్యక్షః= కోశమునకు అధ్యక్షుడు, సహదేవః తు= సహదేవుడైతే, పూజాయామ్= సమ్మానమునందు, నకులః = నకులుడు, ద్రవ్యసాధనే= సామగ్రీ సంపాదనమునందు.

భీముడు వంటశాలకు, దుర్యోధనుడు కోశాగారమునకు అధ్యక్షులు. సహదేవునకు అతిథిపూజ, నకులునకు సామగ్రిని సమకూర్చుట విధులు.

గురుశుశ్రూషణే జిష్ణుః కృష్ణః పాదావనేజనే ।
పరివేషనే ద్రుపదజా కర్ణో దానే మహామనాః ॥ 5

జిష్ణుః= అర్జునుడు, గురుశుశ్రూషణే= పెద్దల సేవయందు, కృష్ణః = శ్రీకృష్ణుడు, పాద-అవనేజనే= పాదముల కడుగుటయందు, ద్రుపదజా= ద్రౌపది, పరివేషణే= వడ్డనయందు, మహామనాః= పెద్ద మనస్సు గల, కర్ణః= కర్ణుడు, దానే= దానమునందు.

పెద్దల సేవలో అర్జునుడు, అతిథుల పాదములను కడుగుట అనే పనియందు శ్రీకృష్ణుడు, వడ్డనలో ద్రౌపది, దానమునందు పెద్ద మనస్సు గల కర్ణుడు నియుక్తులైరి.

యుయుధానో వికర్ణశ్చ హార్దిక్యో విదురాదయః ।
బాహ్లీకపుత్రా భూర్యాద్యా యే చ సంతర్దనాదయః ॥ 6

నిరూపితా మహాయజ్ఞే నానాకర్మసు తే తదా ।
ప్రవర్తంతే స్మ రాజేంద్ర రాజ్ఞః ప్రియచికీర్షవః ॥ 7

రాజ–ఇంద్ర= ఓ మహారాజా!, యుయుధానః= యుయుధానుడు, వికర్ణః చ= వికర్ణుడు, హార్దిక్యః= హార్దిక్యుడు, విదుర–ఆదయః= విదురుడు మొదలగువారు, బాహ్లీకపుత్రాః= బాహ్లీకుని పుత్రులైన, భూరి–ఆద్యాః = భూరిశ్రవసుడు మొదలైనవారు, సంతర్దన–ఆదయః చ= సంతర్దనుడు మొదలగువారు కూడ, యే= ఎవరు గులరో, తే= వారు, తదా= అప్పుడు, మహాయజ్ఞే= గొప్ప యజ్ఞమునందు, నానాకర్మసు= వివిధ కార్యముల యందు, నిరూపితాః= నియోగించబడినవారు, రాజ్ఞః= ధర్మరాజునకు, ప్రియచికీర్షవః= ప్రియమును చేయగోరువారై, ప్రవర్తంతే స్మ= పనులను చేసిరి.

ఓ పరీక్షిన్మహారాజా! యుయుధానుడు, వికర్ణుడు, హార్దిక్యుడు, విదురుడు, బాహ్లీకుని సంతానమైన భూరిశ్రవసుడు మొదలగువారు, సంతర్దనుడు, కృపాచార్యుడు మొదలైనవారు అప్పుడా గొప్ప యజ్ఞము నందు వివిధకార్యములలో నియోగించబడిరి. వారు ధర్మరాజునకు ప్రియమును చేయగోరి పనులను చేసిరి.

ఋత్విక్సదస్యబహువిత్సు సుహృత్తమేషు ।
స్విష్టేషు సూనృతసమర్హణదక్షిణాభిః ।
చైద్యే చ సాత్వతపతేశ్చరణం ప్రవిష్టే
చక్రుస్తతస్త్వవభృథస్నపనం ద్యునద్యామ్ ॥ 8

ఋత్విక్–సదస్యబహువిత్సు= ఋత్విక్కులు సభాసదులు పండితులు, సుహృత్–తమేషు= మిక్కిలి ప్రియులగు స్నేహితులు బంధువులు,

సూనృతసమర్హణదక్షిణాభిః= మధురమగు వచనములు సత్కారములు దక్షిణలతో, సు-ఇష్టేషు= బాగుగా ఆరాధించబడగా, చైద్యే చ= చేదిరాజగు శిశుపాలుడు కూడ, సాత్వతపతేః= భక్తపాలకుడగు శ్రీకృష్ణ భగవానుని, చరణమ్= పాదమును, ప్రవిష్టే= ప్రవిశించగా, తతః తు= తరువాతనైతే, ద్యునద్యామ్= గంగానదియందు, అవభృథ-స్నపనమ్= అవభృథస్నానమును, చక్రుః= చేసిరి.

ఋత్విక్కులు, సభాసదులు, పండితులు, మిక్కిలి ప్రియులగు స్నేహితులు, బంధువులు మధురమగు వచనములచే, సత్కారములచే, దక్షిణలచే బాగుగా ఆరాధించబడిరి. చేదిరాజగు శిశుపాలుడు కూడ భక్తపాలకుడగు శ్రీకృష్ణ భగవానునిలో విలీనమాయెను. తరువాత వారు గంగానదిలో అవభృథస్నానమును చేసిరి.

మృదంగశంఖపణవ ధుంధుర్యానకగోముఖాః ।
వాదిత్రాణి విచిత్రాణి నేదురావభృథోత్సవే ॥ 9

అవభృథ-ఉత్సవే= అవభృథస్నానమునకు చెందిన ఉత్సవము నందు, మృదంగశంఖపణవధుంధురీ-ఆనకగోముఖాః= మద్దెళ్లు, శంఖములు, డోళ్లు, నౌబత్తులు, తప్పెటలు, కొమ్ము బూరాలు, విచిత్రాణి= పలు రకములైన, వాదిత్రాణి= వాద్యములు, నేదుః= మ్రోగినవి.

అవభృథస్నానమహోత్సవమునందు మద్దెళ్లు, శంఖములు, డోళ్లు, నౌబత్తులు, తప్పెటలు, కొమ్ము బూరాలు మొదలైన పలు రకములు వాద్యములు మ్రోగినవి.

నర్తక్యో ననృతుర్హృష్టా గాయకా యూథశో జగుః ।
వీణావేణుతలోన్నాదస్తేషాం స దివమస్పృశత్ ॥ 10

నర్తక్యః= నాట్యకత్తెలు, ననృతుః= నాట్యమాడిరి, హృష్టాః= ఆనందించిన, గాయకాః= పాటగాళ్లు, యూథశః= గుంపులుగా, జగుః

= పాడిరి, తేషామ్ వారి, సః= ఆ, వీణావేణుతల-ఉన్నాదః= వీణలు వేణువులు చప్పట్ల పెద్ద శబ్దము, దివమ్= అంతరిక్షమును, అస్పృశత్= స్పృశించెను.

నాట్యకత్తెలు నాట్యమాడిరి. గాయకులు ఆనందముతో గుంపులుగా చేరి పాడిరి. వారి ఆ వీణల, వేణువుల, చప్పట్ల బిగ్గరయైన శబ్దము ఆకసమునంటెను.

చిత్రధ్వజపతాకాగ్రై రిభేంద్రస్యందనార్వభిః ।
స్వలంకృతై ర్భటై ర్భూపా నిర్యయూ రుక్మమాలినః ॥ 11

రుక్మమాలినః= బంగరు మాలలు గల, భూపాః= రాజులు, చిత్రధ్వజపతాకా-అగ్రైః= రంగు రంగుల ధ్వజములు టెక్కెముల కొనలు గల, ఇభ-ఇంద్రస్యందన-అర్వభిః= గొప్ప ఏనుగులు రథములు గుర్రములతో, సు-అలంకృతైః= బాగా అలంకరించబడిన, భటైః= భటులతో, నిర్యయుః= బయలు దేరిరి.

రాజులు బంగరు మాలలను ధరించి బయలు చేరిరి. వారితో పాటుగా రంగు రంగుల జెండాల, టెక్కెముల కొనలు గల గొప్ప ఏనుగులు, రథములు, గుర్రములు, బాగా అలంకరించుకున్న భటులు వెంట నడిచిరి.

యదుసృంజయకాంబోజ కురుకేకయకోసలాః ।
కంపయంతో భువం సైన్యై ర్యజమానపురస్సరాః ॥ 12

యజమానపురస్సరాః= యజ్ఞకర్తయగు ధర్మరాజు ముందుగా గల, యదుసృంజయకాంబోజ కురుకేకయకోసలాః= యదుసృంజయకాంబోజ కురుకేకయకోసలదేశముల రాజులు, భువమ్= భూమిని, సైన్యైః= సైన్యములతో, కంపయంతః= కంపింపజేయుచున్నవారై (వెళ్లిరి).

యదుసృంజయకాంబోజకురుకేకయకోసలదేశముల రాజులు యజ్ఞకర్త ధర్మరాజు వెనుక సైన్యములతో వెళ్లుచుండగా భూమి దడదడలాడెను.

సదస్యర్త్విగ్ద్విజశ్రేష్ఠా బ్రహ్మఘోషేణ భూయసా ।
దేవర్షిపితృగంధర్వా స్తుష్టువుః పుష్పవర్షిణః ॥ 13

సదస్య-ఋత్విగ్-ద్విజశ్రేష్ఠాః= సభాసదులు ఋత్విక్కులు బ్రాహ్మణ శ్రేష్ఠులు, భూయసా= అధికమైన, బ్రహ్మఘోషేణ= వేదఘోషతో (నడిచిరి), పుష్పవర్షిణః= పూలను వర్షించే, దేవ-ఋషిపితృగంధర్వాః= దేవతలు మహర్షులు పితరులు గంధర్వులు, తుష్టువుః= స్తుతించిరి.

సభాసదులు, ఋత్విక్కులు, బ్రాహ్మణశ్రేష్ఠులు అధికమగు వేధఘోషతో వెంట నడచిరి. దేవతలు, మహర్షులు, పితృదేవతలు, గంధర్వులు పూల వానను కురిపిస్తూ ప్రశంసించిరి.

స్వలంకృతా నరా నార్యో గంధస్రగ్భూషణాంబరైః ।
విలింపంత్యోఽభిషించంత్యో విజహ్రుర్వివిధై రసైః ॥ 14

గంధస్రగ్-భూషణ-అంబరైః= గంధము మాలలు భూషణములు వస్త్రములతో, సు-అలంకృతాః= చక్కగా అలంకరించుకున్న, నరాః= పురుషులు, నార్యః= స్త్రీలు, వివిధైః= పలు రకముల, రసైః= రసములను, విలింపంత్యః= చల్లుచున్నవారై, అభిషించంత్యః= పోయుచున్నవారై, విజహ్రుః= విహరించిరి.

గంధము, మాలలు, భూషణములు, వస్త్రములతో చక్కగా అలంకరించుకున్న స్త్రీపురుషులు పలు రసములను చల్లుతూ, ఇతరులపై పోస్తూ విహరించిరి.

తైలగోరసగంధోద హరిద్రాసాంద్రకుంకుమైః ।
పుంభిర్లిప్తాః ప్రలింపంత్యో విజహ్రుర్వారయోషితః ॥ 15

తైలగోరసగంధ–ఉదహరిద్రాసాంద్రకుంకుమైః= నూనె పాలు పెరుగు గంధోదకము పసుపు కుంకుమ ముద్దలతో, పుంభిః= పురుషులచే, లిప్తాః= అలదబడిన, వారయోషితః= వేశ్యాస్త్రీలు, ప్రలింపంత్యః= అలదుచున్నవారై, విజహ్రుః= విహరించిరి.

పురుషులు వేశ్యాస్త్రీలకు నూనె, పాలు, పెరుగు, గంధోదకము, పసుపు, కుంకుమ ముద్దలనలదగా, వారు కూడ వాటిని పురుషులకు అలదుచున్నవారై విహరించిరి.

గుప్తా నృభిర్నిరగమన్నుపలబ్ధుమేతద్ ।
దేవ్యో యథా దివి విమానవరైర్నృదేవ్యః ।
తా మాతులేయసఖిభిః పరిషిచ్యమానాః
సవ్రీడహాసవికసద్వదనా విరేజుః ॥ 16

ఏతత్= ఈ ఉత్సవమును, ఉపలబ్ధుమ్= చూచుటకు, యథా= ఏ విధముగానైతే, దివి= అంతరిక్షమునందు, దేవ్యః= దేవతాస్త్రీలు, విమానవరైః= గొప్ప విమానములచే, నిరగమన్= వచ్చిరో అదే విధముగా, నృదేవ్యః= మహారాణులు, నృభిః= భటులచే, గుప్తాః= రక్షించబడువారై (వచ్చిరి), తాః= వారు, మాతులేయసఖిభిః= మేనమామ కొడుకగు శ్రీకృష్ణునిచే మిత్రులచే, పరిషిచ్యమానాః= రంగులు చల్లబడిన–వారై, సవ్రీడహాసవికసద్–వదనాః= సిగ్గుతో కూడిన చిరునవ్వుచే వికసించే మోములు గలవారై, విరేజుః= ప్రకాశించిరి.

ఆ ఉత్సవమును చూచుటకు అంతరిక్షమునందు గొప్ప విమానములపై దేవతాస్త్రీలు వచ్చినట్లుగానే, భటులు రక్షించుచుండగా

పల్లకీలపై ద్రౌపది మొదలగు మహారాణులు కూడ వచ్చిరి. పాండవుల మేనమామ (వసుదేవుడు) పుత్రుడగు శ్రీకృష్ణుడు, ఆయనయొక్క మిత్రులు మొదలగువారు వారిపై రంగులను చల్లిరి. అప్పుడు వారి మోములు సిగ్గుతో కూడిన చిరునవ్వుతో వికసించి ప్రకాశించినవి.

తా దేవరానుత సఖీన్ సిషిచుర్ధృతీభిః ।
క్లిన్నాంబరా వివృతగాత్రకుచోరుమధ్యాః ।
ఔత్సుక్యముక్తకబరాచ్చ్యవమానమాల్యాః
క్షోభం దధుర్మలధియాం రుచిరైర్విహారైః ॥ 17

క్లిన్న–అంబరాః= తడిసిన వస్త్రములు గలవారు, వివృతగాత్రకుచ–ఊరుమధ్యాః= స్పష్టముగా కనబడుచున్న దేహము స్తనములు ఊరువులు గలవారు, ఔత్సుక్యముక్తకబరాత్= ఉత్సాహముచే ఊడిపోయిన జుట్టుముడినుండి, చ్యవమానమాల్యాః= జారిపోవుచున్న పూలు గలవారు అగు, తాః= ఆ యువతులు, ధృతీభిః= పిచికారీలతో, దేవరాన్= భర్తల సోదరులను, ఉత= మరియు, సఖీన్= మిత్రులను, సిషిచుః= చల్లిరి, రుచిరైః= అందమైన, విహారైః= విహారములతో, మలధియామ్= మలినమగు అంతఃకరణము గలవారలకు, క్షోభమ్= చిత్తక్షోభను, దధుః = కలిగించిరి.

ఆ యువతుల దేహములు తడిసి అవయవములు, స్తనములు, ఊరువులు స్పష్టముగా కానవచ్చుచుండెను. ఉత్సాహముచే వారి జుట్టుముడులు ఊడి పూలు జారుచుండెను. వారు పిచికారీలతో భర్తల సోదరులపై, మిత్రులపై రంగు నీళ్లను చల్లుతూ అందముగా విహరిస్తూ ఉంటే, మలినమైన అంతఃకరణము గలవారి చిత్తములు క్షోభిల్లెను.

స సమ్రాడ్ రథమారూఢ స్సదశ్వం రుక్మమాలినమ్ ।
వ్యరోచత స్వపత్నీభిః క్రియాభిః క్రతురాడివ ॥ 18

సద్-అశ్వమ్= మంచి గుర్రములు కలిగినట్టియు, రుక్మమాలినమ్= బంగరు మాలలు గల, రథమ్= రథమును, ఆరూఢః= అధిష్ఠించిన, సమ్రాట్= చక్రవర్తియగు, సః= ఆ ధర్మరాజు, స్వపత్నీభిః= తన భార్యలతో, క్రియాభిః= అంగములతో, క్రతురాట్ ఇవ= యజ్ఞరాజమగు రాజసూయము వలె, వ్యరోచత= విశేషముగా రాజిల్లెను.

చక్రవర్తియగు ఆ ధర్మరాజు మంచి గుర్రములను పూన్చి బంగరు మాలలు కట్టిన రథమును తన భార్యలతో గూడి అధిష్ఠించెను. ఆయన, వివిధ ప్రయాజారి అంగములతో కూడిన యజ్ఞరాజమగు రాజసూయము రూపు దాల్చినదా యన్నట్లు విశేషముగా భాసించెను.

పత్నీసంయాజావభృథ్యై శ్చరిత్వా తే తమృత్విజః ।
ఆచాంతం స్నాపయాంచక్రు ర్గంగాయాం సహ కృష్ణయా ॥19

తే= ఆ, ఋత్విజః= ఋత్విక్కులు, పత్నీసంయాజ-అవభృథ్యైఃం= పత్నీసంయాజము అవభృథము (యజ్ఞాంతస్నానము) నకు చెందిన కర్మలచే, చరిత్వా= అనుష్ఠించి, ఆచాంతమ్= చేయించబడిన ఆచమనము గల, తమ్= ఆయనను, కృష్ణయా సహ= ద్రౌపదితో సహా, గంగాయామ్= గంగయందు, స్నాపయాంచక్రుఃం= స్నానము చేయించిరి.

ధర్మరాజు పత్నీసంయాజమనే కర్మను, అవభృథమునకు చెందిన కర్మలను అనుష్ఠించెను. అప్పుడు ఆ ఋత్విక్కులు ఆయనను ఆచమనము చేయించి, ద్రౌపదితో సహా గంగానదిలో స్నానము చేయించిరి.

దేవదుందుభయో నేదు ర్నరదుందుభిభిస్సమమ్ ।
ముముచుః పుష్పవర్షాణి దేవర్షిపితృమానవాః ॥ 20

నరదుందుభిభిః సమమ్= మానవుల దుందుభులతో సమానముగా, దేవదుందుభయఃం= దేవతలు దుందుభులు, నేదుఃం= మ్రోగినవి, దేవ-

ఋషిపితృమానవాః= దేవతలు మహర్షులు పితరులు మానవులు, పుష్పవర్షాణి= పూల వానలను, ముముచుః= కురిపించిరి.

మానవుల దుందుభులతో సమానముగా దేవదుందుభులు కూడ మ్రోగినవి. దేవతలు, మహర్షులు, పితృదేవతలు, మానవులు పూల వానలను కురిపించిరి.

సస్నుస్తత్ర తతస్సర్వే వర్ణాశ్రమయుతా నరాః ।
మహాపాతక్యపి యతస్సద్యో ముచ్యేత కిల్బిషాత్ ॥ 21

తతః= తరువాత, వర్ణ-ఆశ్రమయుతాః= వర్ణాశ్రమములతో కూడిన, నరాః= జనులు, సర్వే= అందరు, తత్ర= అచట, సస్నుః= స్నానము చేసిరి, యతః= దేనివలనైతే, మహాపాతకీ అపి= మహాపాపి కూడ, సద్యః= వెంటనే, కిల్బిషాత్= పాపమునుండి, ముచ్యేత= విముక్తుడగునో.

తరువాత వర్ణాశ్రమవంతులగు జనులందరు ఆ గంగలో స్నానము చేసిరి. అట్టి (అవభృథమునకు చెందిన) స్నానము వలన మహాపాపి కూడ వెంటనే పాపవిముక్తుడగును.

అథ రాజాఽహతే క్షౌమే పరిధాయ స్వలంకృతః ।
ఋత్విక్సదస్యవిప్రాదీనా నర్చాభరణాంబరైః ॥ 22

అథ= తరువాత, రాజా= ధర్మరాజు, అహతే= కొత్త, క్షౌమే= జంట పట్టు వస్త్రములను, పరిధాయ= ధరించి, సు-అలంకృతః= బాగుగా అలంకరించబడినవాడై, ఋత్విక్-సదస్యవిప్ర-ఆదీన్= ఋత్విక్కులు సభాసదులు వేదవేత్తలు మొదలగువారిని, ఆభరణ-అంబరైః= ఆభరణములతో వస్త్రములతో, ఆనర్చ= పూజించెను.

తరువాత ధర్మరాజు కొత్త పట్టు వస్త్రముల జతను దాల్చి చక్కగా అలంకరించుకొనెను. ఋత్విక్కులు, సభాసదులు, వేదవేత్తలు, కళాకారులు మొదలగువారిని ఆయన వస్త్రాభరణములతో సత్కరించెను.

బంధుజ్ఞాతినృపాన్ మిత్రసుహృదోఽన్యాంశ్చ సర్వశః ।
అభీక్ష్ణం పూజయామాస నారాయణపరో నృపః ॥ 23

నారాయణపరః= శ్రీహరియందు అనన్యభక్తుడైన, నృపః= ధర్మరాజు, బంధుజ్ఞాతినృపాన్= బంధువులు జ్ఞాతులు అయిన రాజులను, మిత్రసుహృదః= ఇష్టులను ప్రియమిత్రులను, అన్యాన్ చ= ఇతరులను కూడ, సర్వశః= అన్ని విధములుగా, అభీక్ష్ణమ్= మరల మరల, పూజయామాస= పూజించెను.

శ్రీహరియొక్క అనన్యభక్తుడగు ధర్మరాజు బంధువులు జ్ఞాతులు అగు రాజులను, ఇష్టులను, ప్రియమిత్రులను, ఇతరులను కూడ పలుమార్లు పూజించెను.

సర్వే జనాస్సురరుచో మణికుండలస్ర-
గుష్ణీషకంచుకదుకూలమహార్ఘ్యహారాః ।
నార్యశ్చ కుండలయుగాలకవృందజుష్ట-
వక్త్రశ్రియః కనకమేఖలయా విరేజుః ॥ 24

సర్వే= అందరు, జనాః= జనులు, మణికుండలస్రగ్-ఉష్ణీషకంచుక దుకూలమహా-అర్ఘ్యహారాః= మణికుండలములు మాలలు తలపాగలు చొక్కాలు నాజూకు వస్త్రములు మిక్కిలి విలువైన హారములు గలవారై, సురరుచః= దేవతల కాంతివంటి కాంతి గలవారు, నార్యః చ= స్త్రీలు కూడ, కుండలయుగ- అలకవృందజుష్టవక్త్రశియః= కుండలముల జంటతో ముంగురుల గుంపులతో కూడియున్న ముకముయొక్క శోభ

గలవారై, కనకమేఖలయా= బంగరు మొలనూలుతో, విరేజుఃగ= ఎక్కువ ప్రకాశించిరి.

పురుషులందరు మణికుండలములను, మాలలను, తలపాగలను, చొక్కాలను, నాజూకు వస్త్రములను, మిక్కిలి విలువైన హారములను దాల్చి దేవతల వలె ప్రకాశించిరి. స్త్రీలు కూడ కుండలముల జంటతో, ముంగురుల గుంపులతో కూడి శోభిల్లే ముఖములు గలవారై బంగరు మొలనూలుతో విశేషముగా ప్రకాశించిరి.

అథర్త్విజో మహాశీలాస్సదస్యా బ్రహ్మవాదినః ।
బ్రహ్మక్షత్రియవిట్శూద్రా రాజానో యే సమాగతాః ॥ 25

దేవర్షిపితృభూతాని లోకపాలాస్సహానుగాః ।
పూజితాస్తమనుజ్ఞాప్య స్వధామాని యయుర్నృప ॥ 26

నృప= ఓ రాజా!, అథ= తరువాత, మహాశీలాఃగ= గొప్ప శీలము గల, ఋత్విజఃగ= ఋత్విక్కులు, సదస్యాఃగ= సభాసదులు, బ్రహ్మవాదినఃగ = వేదవేత్తలు, బ్రహ్మక్షత్రియవిట్-శూద్రాఃగ= బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు, సమాగతాఃగ= విచ్చేసిన, యేగ= ఏ, రాజానఃగ= రాజులు గలరో వారు, దేవ-ఋషిపితృభూతానిగ= దేవతలు మహర్షులు పితృదేవతలు ప్రాణులు, సహ-అనుగాఃగ= అనుచరులతో కూడిన, లోకపాలాఃగ= లోకపాలకులు, పూజితాఃగ= పూజించబడినవారై, తమ్= ఆయనను, అనుజ్ఞాప్యగ= అనుమతి యిచ్చునట్లు చేసి, స్వధామానిగ= తమ నివాసములను గురించి, యయుఃగ= వెళ్లిరి.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత గొప్ప శీలము గల ఋత్విక్కులు, సభాసదులు, వేదవేత్తలు, బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు, విచ్చేసిన రాజులు, దేవతలు, మహర్షులు, పితృదేవతలు, ఇతరప్రాణులు,

అనుచరులతో కూడిన లోకపాలకులు పూజలనందుకొని ఆయన సెలవు పొంది తమ నివాసములకు వెళ్లిరి.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత గొప్ప శీలము గల ఋత్విక్కులు, సభాసదులు, వేదవేత్తలు, బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రులు, విచ్చేసిన రాజులు, దేవతలు, మహర్షులు, పితృదేవతలు, ఇతరప్రాణులు, అనుచరులతో కూడిన లోకపాలకులు పూజలనందుకొని ఆయన సెలవు పొంది తమ నివాసములకు వెళ్లిరి.

హరిదాసస్య రాజర్షే రాజసూయమహోదయమ్ ।
నైవాతృప్యన్ ప్రశంసంతః పిబన్ మర్త్యోఽమృతం యథా ॥ 27

హరిదాసస్య= శ్రీహరి భక్తుడైనట్టియు, రాజ–ఋషేః= రాజ ఋషి అయిన ధర్మరాజుయొక్క, రాజసూయమహా–ఉదయమ్= రాజసూయము యొక్క గొప్ప ఉత్సవమును, ప్రశంసంతః= కొనియాడుచున్న జనులు, అమృతమ్= అమృతమును, పిబన్= త్రాగుచున్న, మర్త్యః ఇవ= మానవుడు వలె, న ఏవ అతృప్యన్= తృప్తిని చెందనే లేదు.

ధర్మరాజు రాజు మాత్రమే గాక శ్రీహరి భక్తుడు, ఋషి. జనులకు ఆయన చేసిన రాజసూయముయొక్క గొప్ప ఉత్సవమును ఎంత ప్రశంసిస్తున్నా, అమృతమును త్రాగే మానవునకు వలె, తృప్తి కలుగనే లేదు.

తతో యుధిష్ఠిరో రాజా సుహృత్సంబంధి బాంధవాన్ ।
ప్రేమ్ణా నివాసయామాస కృష్ణం చ త్యాగకాతరః ॥ 28

తతః= తరువాత, త్యాగకాతరః= వియోగము వలన భీతిల్లే, యుధిష్ఠిరః రాజా= ధర్మరాజు, సుహృత్–సంబంధిబాంధవాన్= మిత్రులను సంబంధీకులను బంధువులను, కృష్ణం చ= శ్రీకృష్ణుని కూడ, ప్రేమ్ణా= ప్రేమతో, నివాసయామాస= నివసించునట్లు చేసెను.

తరువాత ధర్మరాజు మిత్రులను, సంబంధీకులను, బంధువులను, శ్రీకృష్ణుని కూడ వెళ్లిపోకుండా నిలిపివేసెను. ఎందుకంటే, వారి వియోగమంటేనే ఆయనకు దుఃఖము కలిగెను.

భగవానపి తత్రాంగ న్యవాత్సీత్తత్ప్రియంకరః ।
ప్రస్థాప్య యదువీరాంశ్చ సాంబాదీంశ్చ కుశస్థలీమ్ ॥ 29

అంగ= ఓయీ!, తత్-ప్రియంకరః= ఆ ధర్మరాజునకు ప్రీతిని కలిగించే, భగవాన్ అపి= శ్రీకృష్ణ భగవానుడు కూడ, సాంబ-ఆదీన్= సాంబుడు మొదలుగా గల, యదువీరాన్ చ= యాదవవీరులనైతే, కుశస్థలీమ్= ద్వారకను గురించి, ప్రస్థాప్య= ప్రయాణము చేయించి, తత్ర= అచట, న్యవాత్సీత్= నివసించెను.

ఓ పరీక్షిన్మహారాజా! సాంబుడు, గదుడు మొదలైన యాదవవీరులను శ్రీకృష్ణ భగవానుడు ద్వారకకు పంపివేసెను. కాని, ఆ ధర్మరాజునకు ప్రీతిని కలిగించుటకై ఆయన తాను అచటనే నివసించెను.

ఇత్థం రాజా ధర్మసుతో మనోరథమహార్ణవమ్ ।
సుదుస్తరం సముత్తీర్య కృష్ణేనాసీద్గతజ్వరః ॥ 30

ధర్మసుతః= ధర్మపుత్రుడగు, రాజా= రాజు, ఇత్థమ్= ఈ విధముగా, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, సుదుస్తరమ్= మిక్కిలి దాట శక్యము కాని, మనోరథమహా-అర్ణవమ్= కోరికలనే మహాసముద్రమును, సముత్తీర్య= దాటివేసి, గతజ్వరః= పోయిన మనోవ్యథ గలవాడు, ఆసీత్= ఆయెను.

రాజసూయమును చేయాలనే కోరిక సముద్రము వలె మిక్కిలి దాట శక్యము కానిది. ఈ విధముగా ధర్మరాజునకు శ్రీకృష్ణుని అనుగ్రహము వలన ఆ మనోరథము పూర్ణమయ్యెను. ఆయన మనోవ్యథ దూరమాయెను.

ఏకదాంతఃపురే తస్య వీక్ష్య దుర్యోధనశ్శ్రియమ్ ।
అతప్యద్రాజసూయస్య మహిత్వం చాచ్యుతాత్మనః ॥ 31

ఏకదా= ఒకనాడు, అచ్యుత–ఆత్మనః= శ్రీకృష్ణ భగవానునియందు మనస్సు గల, తస్య= ఆయనయొక్క, అంతఃపురే= అంతఃపురమునందు, శ్రియమ్= సంపదను, రాజసూయస్య= రాజసూయముయొక్క, మహిత్వం చ= గొప్పదనమును కూడ, వీక్ష్య= చూచి, దుర్యోధనః= దుర్యోధనుడు, అతప్యత్= పరితాపమును చెందెను.

శ్రీకృష్ణ భగవానునియందు లగ్నమైన మనస్సు గల ఆ ధర్మరాజు యొక్క అంతఃపురములోని సంపదను దుర్యోధనుడొకనాడు చూచెను. పైగా, ఆయనకు రాజసూయము వలన కలిగిన గొప్పదనమును కూడ చూచి ఆతడు పరితాపమును చెందెను.

యస్మిన్నరేంద్ర దితిజేంద్ర సురేంద్రలక్ష్మీః ।
నానా విభాంతి కిల విశ్వసృజోపక్లుప్తాః ।
తాభిః పతీన్ ద్రుపదరాజసుతోపతస్థే
యస్యాం విషక్తహృదయః కురురాడతప్యత్ ॥ 32

యస్మిన్= ఏ అంతఃపురమునందైతే, విశ్వసృజా= మయునిచే, ఉపక్లుప్తాః= రచించబడిన, నానా= పలు రకములైన, నర–ఇంద్రదితిజ–ఇంద్రసుర–ఇంద్రలక్ష్మీః= మహారాజుల రాక్షసేశ్వరుల దేవేంద్రుని సంపదలు, విభాంతి కిల= విరాజిల్లెనో, తాభిః= ఆ సంపదలచే, ద్రుపదరాజసుతా= ద్రౌపది, పతీన్= భర్తలను, ఉపతస్థే= సేవించెనో, యస్యామ్= ఏ ద్రౌపదియందు, విషక్తహృదయః= తగుల్కున్న మనస్సు గల, కురురాట్= కౌరవరాజగు దుర్యోధనుడు, అతప్యత్= పరితపించెనో.

ఆ అంతఃపురమునందు మయుడు మహారాజులకు, రాక్షస ప్రభువులకు, దేవేంద్రునకు యోగ్యమైన పలు రకముల సంపదలను రచించెను. ద్రౌపది వాటితో భర్తలను సేవించెడిది. ద్రౌపదియందు

లగ్నమైన మనస్సు గల కౌరవరాజగు దుర్యోధనుడు ఆ అంతఃపురమును చూచి పరితపించెను.

యస్మింస్తదా మధుపతేర్మహిషీసహస్రం
శ్రోణీభరేణ శనకైః క్వణదంఘ్రిశోభమ్ ।
మధ్యే సుచారు కుచకుంకుమసోణహారం
శ్రీమన్ముఖం ప్రచలకుండలకుంతలాఢ్యమ్ ॥ 33

యస్మిన్= ఏ అంతఃపురమునందైతే, తదా= అప్పుడు, శ్రోణీభరేణ= శ్రోణీభారముచే, శనకైః= మెల్లగా, క్వణద్-అంఘ్రిశోభమ్= గణగణలాడే పాదముల శోభ కలిగినట్టియు, మధ్యే= నడుమునందు, సుచారు= చాల అందమైనట్టియు, కుచకుంకుమసోణహారమ్= స్తనములయందలి కుంకుమచే ఎర్రనైన హారములు కలిగినట్టియు, శ్రీమత్-ముఖమ్= శోభాయుక్తమైన మోములు కలిగినట్టియు, ప్రచలకుండలకుంతల-ఆఢ్యమ్= కదలాడే కుండలములతో ముంగురులతో సంపన్నమైన, మధుపతేః= శ్రీకృష్ణునియొక్క, మహిషీసహస్రమ్= భార్యల వేయి (ఉండెనో).

ఆ సమయములో ఆ అంతఃపురమునందు శ్రీకృష్ణునియొక్క భార్యలు వేయి మంది ఉండిరి. వారు శ్రోణీభారముచే మెల్లగా నడచు-చుండగా గణగణలాడే అందెలు పాదములకు శోభనిచ్చెను. మిక్కిలి అందమైన (సన్నని) నడుము గల ఆ యువతుల హారములు స్తనముల-యందలి కుంకుమచే ఎర్రనయ్యెను. కదలాడే కుండలములతో, ముంగురులతో సంపన్నమైన వారి మోములు గొప్పగా శోభిల్లెను.

సభాయాం మయక్లృప్తాయాం క్వాపి ధర్మసుతో.ధిరాట్ ।
వృతోఽనుజైర్బంధుభిశ్చ కృష్ణేనాపి స్వచక్షుషా ॥ 34

క్వ అపి= ఒకనాడు, మయక్లుప్తాయామ్= మయునిచే రచించ–బడిన, సభాయామ్= సభయందు, అధిరాట్= చక్రవర్తియగు, ధర్మసుతః = ధర్మరాజు, అనుజైఃౖ= సోదరులచే, బంధుభిః చ= బంధువులచే, స్వచక్షుషా= తనకు చూపైన (పరమహితైషి అయిన), కృష్ణేన అపి= శ్రీకృష్ణునిచే కూడ, వృతః= చుట్టువారబడినవాడు.

ఒకనాడు మయుడు రచించిన సభయందు ధర్మరాజ చక్రవర్తి చుట్టూ ఆయన సోదరులు, బంధువులు, ఆయనకు చూపైన శ్రీకృష్ణుడు ఉండిరి.

ఆసీనః కాంచనే సాక్షాదాసనే మఘువానివ ।
పారమేష్ఠ్యశ్రియా జుష్టః స్తూయమానశ్చ వందిభిః ॥ 35

కాంచనే= బంగరు, ఆసనే= ఆసనమునందు, సాక్షాత్= సాక్షాత్తుగా, మఘువాన్ ఇవ= ఇంద్రుడు వలె, ఆసీనః= కూర్చున్నవాడు, పారమేష్ఠ్యశ్రియా= చక్రవర్తియొక్క శోభతో, జుష్టః= కూడినవాడు, వందిభిః= స్తోత్రపాఠకులచే, స్తూయమానః చ= స్తుతించబడుచున్నవాడు.

ఆయన సాక్షాత్తు ఇంద్రుడు వలె బంగరు ఆసనములో చక్రవర్తి యొక్క శోభతో కూర్చునియుండగా, స్తోత్రపాఠకులు స్తుతించుచుండిరి.

తత్ర దుర్యోధనో మానీ పరీతో భ్రాతృభిర్నృప ।
కిరీటమాలీ న్యవిశదసిహస్తః క్షిపన్ రుషా ॥ 36

నృప= రాజా!, తత్ర= అచట, మానీ= గర్విష్ఠి, కిరీటమాలీ= కిరీటము మాల గలవాడు, అసిహస్తః= కత్తి చేతియందు గలవాడు, దుర్యోధనః= దుర్యోధనుడు, భ్రాతృభిః= సోదరులచే, పరీతః= చుట్టువార–బడినవాడై, రుషా= కోపముతో, క్షిపన్= నిరసించువాడై, న్యవిశత్= ప్రవేశించెను.

ఓ పరీక్షిన్మహారాజా! అదే సమయములో గర్విష్ఠియగు దుర్యోధనుడు సోదరులతో గూడి అచటకు వచ్చెను. కిరీటము, మాల, చేతిలో కత్తి గల ఆతడు కోపముతో (సేవకులను) తిట్టుచుండెను.

స్థలేఽభ్యగృహ్ణాద్వస్త్రాంతం జలం మత్వా స్థలేఽపతత్ ।
జలే చ స్థలవద్భ్రాంత్యా మయమాయావిమోహితః ॥ 37

మయమాయావిమోహితః= మయుని మాయచే వ్యామోహమును పొందిన ఆతడు, స్థలే= నేలపై, జలమ్= నీటిని, మత్వా= భావించి, స్థలే= నేలపై, వస్త్ర-అంతమ్= పంచె కొంగును, అభ్యగృహ్ణాత్= పైకి పట్టుకొనెను, జలే చ= నీటియందైతే, స్థలవత్= నేల వలె, భ్రాంత్యా= భ్రమచే, అపతత్= పడెను.

ఆతడు మయుని మాయచే వ్యామోహితుడై నేలను నీరని భ్రమపడి పంచె కొంగును పైకి పట్టుకొనెను; నేలయని భ్రమపడి నీటిలో పడెను.

జహాస భీమస్తం దృష్ట్వా స్త్రియో నృపతయోఽపరే ।
నివార్యమాణా అప్యంగ రాజ్ఞా కృష్ణానుమోదితాః ॥ 38

అంగ= ఓయీ!, భీమః= భీముడు, తమ్= ఆతనిని, దృష్ట్వా= చూచి, జహాస= నవ్వెను, స్త్రియః స్త్రీలు, అపరే= ఇతరులగు, నృపతయః = రాజులు, రాజ్ఞా= ధర్మరాజుచే, నివార్యమాణాః అపి= వారించబడుచున్ననూ, కృష్ణ-అనుమోదితాః= శ్రీకృష్ణునిచే అనుమోదించబడినవారు.

ఓ పరీక్షిన్మహారాజా! భీముడు, స్త్రీలు, ఇతరరాజులు ఆ దుర్యోధనుని చూచి నవ్విరి. వారిని ధర్మరాజు వారించినా, శ్రీకృష్ణుడు అనుమోదించెను.

స వ్రీడితోఽవాగ్వదనో రుషా జ్వలన్ ।
నిష్క్రమ్య తూష్ణీం ప్రయయౌ గజాహ్వయమ్ ।

హా హేతి శబ్దస్సుమహానభూత్సతా-
మజాతశత్రుర్విమనా ఇవాభవత్ ।
బభూవ తూష్ణీం భగవాన్ భువో భరం
సముజ్జిహీర్ష్ణుర్భ్రమతి స్మ యద్దృశా ॥ 39

వ్రీడితః= సిగ్గు పడినవాడు, అవాగ్-వదనః= దించబడిన తల గల వాడు, రుషా= రోషముతో, జ్వలన్= మండి పడుచున్నవాడు, తూష్ణీమ్= మౌనముగా, నిష్క్రమ్య= బయటకు వచ్చి, గజ-ఆహ్వయమ్= హస్తినాపురమును గురించి, ప్రయయౌ= వెళ్లెను, సతామ్= సత్పురుషుల యొక్క, సుమహాన్= చాల పెద్ద, హా= అయ్యో!, హా= అయ్యో!, ఇతి= అనే, శబ్దః= శబ్దము, అభూత్= కలిగెను, అజాతశత్రుః= పుట్టని శత్రువులు గల ధర్మరాజు, విమనాః ఇవ= మనస్సు చెడినవాడు వలె, అభవత్= ఆయెను, భువః= భూమియొక్క, భరమ్= భారమును, సముజ్జిహీర్షుః= తొలగించగోరే, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తూష్ణీం బభూవ= మిన్నకుండెను, యద్-దృశా= ఎవని చూపుచే, భ్రమతి స్మ= భ్రమించెనో.

దుర్యోధనుడు సిగ్గుతో తల దించుకొని కోపముతో మండి పడుతూ మౌనముగా బయటకు వచ్చి హస్తినాపురమునకు వెళ్లిపోయెను. సత్పురుషులు అయ్యో! అయ్యో! అంటూ బిగ్గరగా హాహాకారమును చేసిరి. అజాతశత్రువగు ధర్మరాజు మనస్సు చెడినట్లాయెను. భూభారమును తగ్గించగోరే శ్రీకృష్ణ భగవానుడు మిన్నకుండెను. ఆయన చూపు కారణముగానే దుర్యోధనుడు భ్రాంతి పడెను.

ఏతత్తేఽభిహితం రాజన్ యత్పృష్టోఽహమిహ త్వయా ।
సుయోధనస్య దౌరాత్మ్యం రాజసూయే మహాక్రతౌ ॥ 40

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే పంచసప్తతితమోఽధ్యాయః ॥

రాజన్= ఓ రాజా!, ఏతత్= ఇది, తే= నీ కొరకు, మయా= నాచే, అభిహితమ్= చెప్పబడినది, యత్= ఏదైతే, త్వయా= నీచే, అహమ్= నేను, పృష్టః= ప్రశ్నించబడితినో, ఇహ= ఈ, రాజసూయే మహాక్రతౌ= రాజసూయ మహాయజ్ఞమునందు, సుయోధనస్య= దుర్యోధనుని, దౌరాత్మ్యమ్= దుర్బుద్ధి.

ఓ పరీక్షిన్మహారాజా! ఈ రాజసూయ మహాయజ్ఞమునందు దుర్యోధనుని దుర్బుద్ధిని గురించి నీవు నన్ను ప్రశ్నించితివి. నేను నీ ప్రశ్నకు సమాధానమును చెప్పితిని.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో రాజసూయము సమాప్తమగుటను, దుర్యోధనుని అవమానమును వర్ణించే డెబ్బది ఐదవ అధ్యాయము ముగిసినది (75).

* * *

అథ షట్సప్తతితమోఽధ్యాయః

యాదవులకు శాల్వునితో యుద్ధము

శ్రీశుక ఉవాచ ।

అథాన్యదపి కృష్ణస్య శృణు కర్మాద్భుతం నృప ।
క్రీడానరశరీరస్య యథా సౌభపతిర్హతః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, నృప= ఓ రాజా!, అథ= తరువాత, క్రీడానరశరీరస్య= లీలకై మానవదేహము గల, కృష్ణస్య= శ్రీకృష్ణునియొక్క, అన్యత్= మరియొక, అద్భుతమ్= అద్భుతమైన, కర్మ అపి= లీలను గురించి కూడ, శృణు= వినుము, యథా= ఏ విధముగా–నైతే, సౌభపతిః= సౌభమనే విమానము యొక్క ప్రభువగు శాల్వుడు, హతః= వధించబడినవాడో.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! రాజసూయ వృత్తాంతమును విన్న పిదప, లీలకై మానవరూపముతో అవతరించిన శ్రీకృష్ణ భగవానుని మరియొక లీలను గురించి కూడ వినుము. ఆయన సౌభమనే విమానమునకు ప్రభువగు శాల్వుని వధించెను.

శిశుపాలసఖశ్శాల్వో రుక్మిణ్యుద్వాహ ఆగతః ।
యదుభిర్నిర్జితస్సంఖ్యే జరాసంధాదయస్తథా ॥ 2

శిశుపాలసఖః= శిశుపాలుని మిత్రుడగు, శాల్వః= శాల్వుడు, రుక్మిణీ–ఉద్వాహే= రుక్మిణి వివాహమునందు, ఆగతః= వచ్చినవాడు, సంఖ్యే= యుద్ధమునందు, యదుభిః= యాదవులచే, నిర్జితః= జయించ–బడినవాడు, తథా= అదే విధముగా, జరాసంధ–ఆదయః= జరాసంధుడు మొదలగువారలు.

శాల్వుడు శిశుపాలుని మిత్రుడు. రుక్మిణి వివాహానికి ఆతడు వచ్చి యుద్ధములో జరాసంధుడు, దంతవక్త్రుడు మొదలగువారితో బాటుగా యాదవుల చేతిలో పరాజయము పాలైనాడు.

శాల్వः ప్రతిజ్ఞామకరోచ్ఛృణ్వతాం సర్వభూభుజామ్ ।
అయాదవీం క్ష్మాం కరిష్యే పౌరుషం మమ పశ్యత ॥ 3

సర్వభూభుజామ్= సకలరాజులు, శృణ్వతామ్= వినుచుండగా, శాల్వఃశాల్వుడు, ప్రతిజ్ఞామ్= ప్రతిజ్ఞను, అకరోత్= చేసెను, క్ష్మామ్= భూమిని, అయాదవీమ్= యాదవులు లేనిదిగా, కరిష్యే= చేయగలను, మమ= నా, పౌరుషమ్= పౌరుషమును, పశ్యత= చూడుడు.

రాజులందరు వినుచుండగా శాల్వుడిట్లు ప్రతిజ్ఞ చేసెను -- ఈ భూమిపై యాదవులు లేకుండా చేసెదను. నా పౌరుషమును చూడుడు.

ఇతి మూఢः ప్రతిజ్ఞాయ దేవం పశుపతిం ప్రభుమ్ ।
ఆరాధయామాస నృప పాంసుముష్టిం సకృద్గసన్ ॥ 4

నృప= ఓ రాజా!, మూఢఃమూర్ఖుడగు శాల్వుడు, ఇతి= ఈ విధముగా, ప్రతిజ్ఞాయ= ప్రతిజ్ఞ చేసి, సకృత్= ఒక్కసారి, పాంసుముష్టిమ్= గుప్పెడు బూడిదను, గ్రసన్= మ్రింగువాడై, ప్రభుమ్ సర్వసమర్థుడై నట్టియు, పశుపతిమ్= ప్రాణులకు పాలకుడగు, దేవమ్= శివుని, ఆరాధయామాస= ఆరాధించెను.

ఓ పరీక్షిన్మహారాజా! మూర్ఖుడగు ఆ శాల్వుడు ఈ విధముగా ప్రతిజ్ఞ చేసి, దినములో ఒక్కసారి గుప్పెడు బూడిదను మాత్రమే తిని, సర్వశక్తిమంతుడు, ప్రాణులకు పాలకుడు అగు శివుని ఆరాధించెను.

సంవత్సరాంతే భగవానాశుతోష ఉమాపతిః ।
వరేణ చ్ఛందయామాస శాల్వం శరణమాగతమ్ ॥ 5

ఆశుతోషః= తొందరగా సంతోషించువాడు, ఉమాపతిః= పార్వతీపతి అగు, భగవాన్= శివభగవానుడు, సంవత్సర-అంతే= సంవత్సరము అయినప్పుడు, శరణమ్= శరణును, ఆగతమ్= పొందిన, శాల్వమ్= శాల్వుని, వరేణ= వరముచే, ఛందయామాస= కోరుకొనునట్లు చేసెను.

పార్వతీపతియగు శివభగవానుడు తొందరగా సంతోషించే దైవము. సంవత్సరము తరువాత ఆయన తనను శరణు జొచ్చిన శాల్వుని వరమును కోరుమని ప్రేరితుని చేసెను.

దేవాసురమనుష్యాణాం గంధర్వోరగరక్షసామ్ ।
అభేద్యం కామగం వవ్రే స యానం వృష్ణిభీషణమ్ ॥ 6

సః= ఆతడు, దేవ-అసురమనుష్యాణామ్= దేవతలకు అసురులకు మానవులకు, గంధర్వ-ఉరగ రక్షసామ్= గంధర్వులకు నాగులకు రాక్షసులకు, అభేద్యమ్= భేదింప శక్యము కానట్టియు, కామగమ్= యథేచ్ఛగా సంచరించునట్టియు, వృష్ణిభీషణమ్= యాదవులకు హడలు పుట్టించే, యానమ్= విమానము (ఎగిరే నగరము) ను, వవ్రే= కోరెను.

యథేచ్ఛగా సంచరిస్తూ దేవతలు, అసురులు, మానవులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు భేదించలేనిదై యాదవులకు హడలు పుట్టించే విమానము (ఎగిరే నగరము) ను ఆతడు వరముగా కోరెను.

తథేతి గిరిశాదిష్టో మయః పరపురంజయః ।
పురం నిర్మాయ శాల్వాయ ప్రాదాత్సౌభమయస్మయమ్ ॥ 7

తథా= సరే, ఇతి= అని, గిరిశ-ఆదిష్టః= కైలాసవాసిచే ఆదేశించ బడినవాడు, పరపురంజయః= శత్రువుల నగరములను జయించువాడు అగు, మయః= మయుడు, సౌభమ్= సౌభమనే, అయస్మయమ్= లోహమయమైన, పురమ్= నగరమును, నిర్మాయ= నిర్మించి, శాల్వాయ= శాల్వుని కొరకు, ప్రాదాత్= ఇచ్చెను.

కైలాసవాసియగు శివుడు సరేనని శత్రునగరములను జయించే మయుని ఆదేశించెను. ఆయన సౌభమనే లోహమయమైన (ఎగిరే) పురమును నిర్మించి శాల్వునకిచ్చెను.

స లబ్ధ్వా కామగం యానం తమోధామ దురాసదమ్ ।
యయౌ ద్వారవతీం శాల్వో వైరం వృష్ణికృతం స్మరన్ ॥ 8

సః= ఆ, శాల్వః= శాల్వుడు, కామగమ్= యథేచ్ఛగా పయనించు నట్టియు, తమః-ధామ= చీకటికి నిలయమైనట్టియు, దురాసదమ్= సమీపించుట శక్యము కాని, యానమ్= విమానమును, లబ్ధ్వా= పొంది, వృష్ణికృతమ్= యాదవులచే చేయబడిన, వైరమ్= వైరమును, స్మరన్= స్మరించువాడై, ద్వారవతీమ్= ద్వారకను గురించి, యయౌ= వెళ్లెను.

చీకటికి నిలయమై సమీపించుట శక్యము కానిదై యథేచ్ఛగా సంచరించే విమానము ఆ శాల్వునకు లభించెను. ఆతడు ఇదివరలో యాదవులతో కలిగిన వైరమును స్మరిస్తూ ద్వారకకు వెళ్లెను.

నిరుద్ధ్య సేనయా శాల్వో మహత్యా భరతర్షభ ।
పురీం బభంజోపవనాన్యుద్యానాని చ సర్వశః ॥ 9

సగోపురాణి ద్వారాణి ప్రాసాదాట్టాలతోలికాః ।
విహారాన్ స విమానాగ్ర్యాన్నిపేతుశ్చూర్ణవృష్టయః ॥ 10

శిలా ద్రుమాశ్చాశనయస్సర్వా ఆసారశర్కరాః ।

భరత-ఋషభ= భరతవంశశ్రేష్ఠా!, సః= ఆ, శాల్వః= శాల్వుడు, మహత్యా= పెద్ద, సేనయా= సేనతో, పురీమ్= ద్వారకా నగరమును, నిరుద్ధ్య= ముట్టడించి, ఉపవనాని= సమీపమునందలి అడవులను, ఉద్యానాని చ= ఉద్యానములను కూడ, సగోపురాణి= గోపురములతో కూడిన, ద్వారాణి= నగరద్వారములను, ప్రాసాద-అట్టాలతోలికాః=

భవనములను బురుజులను గోడలను, విహారాన్= క్రీడాస్థానములను, సర్వశః= అన్నింటిని, బభంజ= భగ్నము చేసెను, విమాన–అగ్ర్యాత్= శ్రేష్ఠమగు విమానమునుండి, శస్త్రవృష్టయః= ఆయుధముల వర్షములు, శిలాః= రాళ్లు, ద్రుమాః చ= చెట్లు కూడ, అశనయః= పిడుగులు, సర్పాః= పాములు, ఆసారశర్కరాః= ధారలైన వడగళ్లు, నిపేతుః= పడినవి.

భరతవంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! ఆ శాల్వుడు పెద్ద సేనతో ద్వారకానగరమును ముట్టడించి, నగరము చుట్టూ ఉండే అడవులను, నగరములోని ఉద్యానములను, గోపురములను, నగరద్వార–ములను, భవనములను, బురుజులను, గోడలను, క్రీడాస్థానములను అన్నింటినీ భగ్నము చేయజొచ్చెను. ఆ గొప్ప విమానమునుండి ఆయుధములు, రాళ్లు, చెట్లు, పిడుగులు, పాములు, వడగళ్లు ధారలుగా వర్షించెను.

ప్రచండశ్చక్రవాతోఽ భూద్రజసాఽ ఽ చ్ఛాదితా దిశః ॥ 11

ఇత్యర్ద్యమానా సౌభేన కృష్ణస్య నగరీ భృశమ్ ।
నాభ్యపద్యత శం రాజంస్త్రిపురేణ యథా మహీ ॥ 12

ప్రచండః= భయంకరమైన, చక్రవాతః= సుడిగాలి, అభూత్= కలిగెను, దిశః= దిక్కులు, రజసా= దుమ్ముతో, ఆచ్ఛాదితాః= కప్పివేయ బడినవి, రాజన్= ఓ రాజా!, ఇతి= ఈ విధముగా, సౌభేన= సౌభమనే విమానము చే, భృశమ్= అధికముగా, త్రిపురేణ= త్రిపురముచే, మహీ యథా= భూమి వలె, అర్ద్యమానా= పీడించబడుచున్న, కృష్ణస్య= శ్రీకృష్ణుని, నగరీ= ద్వారకా నగరము, శమ్= శాంతిని, న అభ్యపద్యత= పొందలేదు.

భయంకరమగు సుడిగాలి వీచి దిక్కులన్నీ దుమ్ముతో కప్పివేయ బడెను. ఓ రాజా! త్రిపురములు భూగోళమును వలె, సౌభమనే

విమానము శ్రీకృష్ణుని ద్వారకానగరమునీ విధముగా పీడించుచుండగా, అక్కడ ఎవరికైననూ శాంతి లభించలేదు.

ప్రద్యుమ్నో భగవాన్ వీక్ష్య బాధ్యమానా నిజాః ప్రజాః ।
మా భైష్టేత్యభ్యధాద్వీరో రథారూఢో మహాయశాః ॥ 13

వీరః= వీరుడు, మహాయశాః= గొప్ప కీర్తి గలవాడు అగు, ప్రద్యుమ్నః భగవాన్= ప్రద్యుమ్న భగవానుడు, బాధ్యమానాః= పీడించ-బడుచున్న, నిజాః= తనవారైన, ప్రజాః= జనులను, వీక్ష్య= చూచి, రథ-ఆరూఢః= రథమునధిష్ఠించినవాడై, మా భైష్ట= భయపడకుడు, ఇతి= అని, అభ్యధాత్= పలికెను.

గొప్ప కీర్తి గల ప్రద్యుమ్న భగవానుడు వీరుడు. తన ప్రజలు పీడించబడుచుండుటను గాంచి ఆయన రథమెక్కి, భయపడకుడు, అని పలికెను.

సాత్యకిశ్చారుదేష్ణశ్చ సాంబోఽక్రూరస్సహానుజః ।
హార్దిక్యో భానువిందశ్చ గదశ్చ శుకసారణౌ ॥ 14

అపరే చ మహేష్వాసా రథయూథపయూథపాః ।
నిర్యయుర్దంశితా గుప్తా రథేభాశ్వపదాతిభిః ॥ 15

మహా-ఇష్వాసాః= గొప్ప ధనుస్సులు గలవారు, రథయూథప యూథ పాః= రథనాయకులకు నాయకులు అగు, సాత్యకిః= సాత్యకి, చారుదేష్ణః చ= చారుదేష్ణుడు, సాంబఃసాంబుడు, సహ-అనుజఃసోదరులతో కూడిన, అక్రూరఃఅక్రూరుడు, హార్దిక్యఃహార్దిక్యుడు, భానువిందః చ= భానువిందుడు, గదః చ= గదుడు, శుకసారణౌ= శుకుడు సారణుడు, అపరే చ= ఇతరులు కూడ, దంశితాఃకవచమును వేసుకున్నవారై, రథ-ఇభ-అశ్వపదాతిభిఃరథములు ఏనుగులు

గుర్రములు కాలి భటులచే, గుప్తాః= రక్షించబడినవారై, నిర్యయుః= బయల్వెడలిరి.

సాత్యకి, చారుదేష్ణుడు, సాంబుడు, అక్రూరుడు, ఆతని సోదరులు, హార్దిక్యుడు, భానువిందుడు, గదుడు, శుకుడు, సారణుడు మరియు ఇతరులు గొప్ప ధనుర్ధారులు, రథనాయకులకు నాయకులు. వారు కవచమును వేసుకొని బయల్వెడలిరి. రథములు, ఏనుగులు, గుర్రములు, పదాతులతో కూడిన సైన్యము వారికి రక్షణగా వచ్చెను.

తతః ప్రవవృతే యుద్ధం శాల్వానాం యదుభిస్సహ ।
యథాఽసురాణాం విబుధైస్తుములం లోమహర్షణమ్ ॥ 16

తతః= తరువాత, శాల్వానామ్= శాల్వుని వారలకు, యదుభిః సహ= యాదవులతో కూడి, అసురాణామ్= రాక్షసులకు, విబుధైః= యథా= దేవతలతో వలె, లోమహర్షణమ్= గగుర్పాటును కలిగించే, తుములం యుద్ధమ్= దొమ్మి యుద్ధము, ప్రవవృతే= ప్రవర్తిల్లెను.

తరువాత శాల్వుని సైన్యమునకు యాదవులతో, రాక్షసులకు దేవతలతో వలె, గగుర్పాటును కలిగించే దొమ్మి యుద్ధము జరిగెను.

తాశ్చ సౌభపతేర్మాయా దివ్యాస్తై రుక్మిణీసుతః ।
క్షణేన నాశయామాస నైశం తమ ఇవోష్ణగుః ॥ 17

రుక్మిణీసుతః= రుక్మిణి పుత్రుడగు ప్రద్యుమ్నుడు, సౌభపతేః= సౌభ విమానమునకు ప్రభుడగు శాల్వుని, తాః= ఆ, మాయాః చ= మాయలను, ఉష్ణగుః= ఉష్ణకిరణుడగు సూర్యుడు, నైశమ్= రాత్రి ఉండే, తమః ఇవ= చీకటిని వలె, క్షణేన= క్షణకాలముచే, నాశయామాస= నశింపజేసెను.

రుక్మిణియొక్క పుత్రుడగు ప్రద్యుమ్నుడు సౌభమనే విమానమునకు అధిపతియగు శాల్వుని ఆ మాయలనైతే, ఉష్ణకిరణుడగు సూర్యుడు రాత్రియొక్క చీకట్లను వలె, క్షణకాలములో నశింపజేసెను.

వివ్యాధ పంచవింశత్యా స్వర్ణపుంఖైరయోముఖైః ।
శాల్వస్య ధ్వజినీపాలం శరైస్సన్నతపర్వభిః ॥ 18

స్వర్ణపుంఖైః= బంగరు తోక కలిగినట్టియు, అయోముఖైః= లోహపు ముఖములు కలిగినట్టియు, సన్నతపర్వభిః= నునుపైన కణుపులు గల, పంచవింశత్యా= ఇరవై ఐదు, శరైః= బాణములతో, శాల్వస్య= శాల్వుని యొక్క, ధ్వజినీపాలమ్= సేనానాయకుని, వివ్యాధ= కొట్టెను.

బంగరు తోక, లోహపు కొన, నునుపైన కణుపులు గల ఇరవై ఐదు బాణములతో ప్రద్యుమ్నుడు శాల్వుని సేనానాయకుని కొట్టెను.

శతేనాతాడయచ్ఛాల్వమేకైకేనాథ సైనికాన్ ।
దశభిర్దశభిర్నేతౄన్ వాహనాని త్రిభిస్త్రిభిః ॥ 19

శతేన= వందతో, శాల్వమ్= శాల్వుని, అథ= తరువాత, సైనికాన్= సైనికులను, ఏక-ఏకేన= ఒక్కొక్క బాణముతో, నేతౄన్= రథసారథులను, దశభిః దశభిః= పది పదితో, వాహనాని= రథములను, త్రిభిః త్రిభిః= మూడు మూడుతో, అతాడయత్= కొట్టెను.

తదద్భుతం మహత్కర్మ ప్రద్యుమ్నస్య మహాత్మనః ।
దృష్ట్వా తం పూజయామాసుస్సర్వే స్వపరసైనికాః ॥ 20

మహాత్మనః= మహామనస్వియగు, ప్రద్యుమ్నస్య= ప్రద్యుమ్నుని యొక్క, తత్= ఆ, మహత్= గొప్ప, అద్భుతమ్= ఆద్భుతమైన, కర్మ= పనిని, దృష్ట్వా చూచి, స్వపరసైనికాః= తమ మరియు శత్రువు సైనికులు, సర్వే= అందరు, తమ్= ఆయనను, పూజయామాసుః= ప్రశంసించిరి.

మహామనస్వియగు ప్రద్యుమ్నుడు చేసిన ఆ గొప్ప అద్భుత కార్యమును చూచి రెండు పక్షముల సైనికులు అందరు ఆయనను కొనియాడిరి.

బహురూపైకరూపం తద్దృశ్యతే న చ దృశ్యతే ।
మాయామయం మయకృతం దుర్విభావ్యం పరైరభూత్ ॥21

మాయామయమ్= మాయలతో నిండిన, మయకృతమ్= మయునిచే నిర్మించబడిన, తత్= ఆ విమానము, బహురూప-ఏకరూపమ్= అనేకరూపములు గలది ఒకే రూపము గలది, దృశ్యతే= కనబడునది, న చ దృశ్యతే= కనబడకుండా పోవునది, పరైఃశత్రువులచే, దుర్విభావ్యమ్= ఊహింప శక్యము కానిది, అభూత్= ఆయెను.

మయునిచే మాయలను నింపి చేయబడిన ఆ విమానము ఒకప్పుడు ఒకే రూపమును, మరియొకప్పుడు అనేకరూపములను కలిగియుండెను. ఒకప్పుడు కనబడి మరియొకప్పుడు మాయమయ్యే ఆ విమానము శత్రువుల ఊహకైననూ అందకుండెను.

క్వచిద్భూమౌ క్వచిద్వ్యోమ్ని గిరిమూర్ధ్ని జలే క్వచిత్ ।
అలాతచక్రవద్భ్రామ్యత్సౌభం తద్దురవస్థితమ్ ॥ 22

క్వచిత్= ఒకప్పుడు, భూమౌ= భూమిపై, క్వచిత్= ఒకప్పుడు, వ్యోమ్ని= ఆకాశమునందు, గిరిమూర్ధ్ని= పర్వతశిఖరముపై, క్వచిత్= ఒకప్పుడు, జలే= నీటియందు, అలాతచక్రవత్= కొరివి చక్రము వలె, భ్రామ్యత్= తిరిగే, తత్= ఆ, సౌభమ్= సౌభమనే విమానము, దురవస్థితమ్= నిలకడ లేనిది.

ఆ సౌభమనే విమానము కొరివి చక్రము వలె గిర గిర తిరుగుతూ ఒకప్పుడు నేలపై, ఒకప్పుడు ఆకాశములో, మరియొకసారి పర్వత శిఖరముపై, ఇంకో సమయములో నీటిలో, ఎక్కడైననూ నిలకడ లేకుండనుండెను.

యత్ర యత్రోపలక్ష్యేత ససౌభస్సహసైనికః ।
శాల్వస్తతస్తతోఽముంచన్ శరాన్ సాత్వతయూథపాః ॥ 23

ససౌభః= సౌభమనే విమానముతో కూడినవాడు, సహసైనికః= సైనికులతో కూడినవాడు అగు, శాల్వః= శాల్వుడు, యత్ర యత్ర= ఎక్కడెక్కడైతే, ఉపలక్ష్యేత= కొంచెము కనబడునో, తతః తతః= అక్కడక్కడ, సాత్వతయూథపాః= యాదవసేనానాయకులు, శరాన్= బాణములను, అముంచన్= విడిచిపెట్టిరి.

శాల్వుడు, వాని సైనికులు, సౌభవిమానము ఎక్కడెక్కడ కొంచెమైనా కనబడునో, అక్కడక్కడ యాదవసేనానాయకులు బాణములను విడిచిరి.

శరైరగ్న్యర్కసంస్పర్శైరాశీవిషదురాసదైః ।
పీడ్యమానపురానీకశ్శాల్వోఽముహ్యత్పరేరితైః ॥ 24

అగ్ని-అర్కసంస్పర్శైః= అగ్నిసూర్యుల స్పర్శ కలిగినట్టియు, ఆశీవిషదురాసదైః= విషసర్పములు వలె సహింప శక్యము కానట్టియు, పర-ఈరితైః= శత్రువులచే ప్రయోగించబడిన, శరైః= బాణములచే, పీడ్యమానపుర-అనీకః= పీడింపబడుచున్న పురము (విమానము) సైన్యము గల, శాల్వః= శాల్వుడు, అముహ్యత్= మోహమును పొందెను.

యాదవులు ప్రయోగించిన బాణములు అగ్నిసూర్యులవలె మండుతూ విషసర్పములు వలె సహించ శక్యము కాకుండెను. వాటిచే శాల్వుని విమానము, సైన్యము కూడ పీడింపబడుటయే గాక, ఆతడు మూర్ఛిల్లెను.

శాల్వానీకపశస్త్రౌఘైర్వృష్ణివీరా భృశార్దితాః ।
న తత్యజూ రణం స్వం స్వం లోకద్వయజిగీషవః ॥ 25

శాల్వ-అనీకపశస్త్ర-ఓఘైః= శాల్వుని సేనానాయకుల ఆయుధముల సమూహములచే, భృశ-అర్దితాః= అధికముగా పీడించబడిన, వృష్ణివీరాః = యాదవవీరులు, లోకద్వయజిగీషవః= ఇహపరములను రెండింటినీ జయించగోరువారై, స్వం స్వమ్= తమ తమ, రణమ్= యుద్ధభూమిని, న తత్యజుః= విడిచిపెట్టలేదు.

యాదవవీరులు గెలిస్తే ఇహమును, మరణిస్తే పరమును జయించాలనే ఆకాంక్ష గలవారు. శాల్వుని సేనాపతులు ఆయుధముల సమూహములతో పీడించిననూ వారు తమ తమ యుద్ధక్షేత్రమును విడిచిపెట్టలేదు.

శాల్వామాత్యో ద్యుమాన్నామ ప్రద్యుమ్నం ప్రాక్ ప్రపీడితః ।
ఆసాద్య గదయా మౌర్వ్యా వ్యాహత్య వ్యనదద్బలీ ॥ 26

ద్యుమాన్ నామ= ద్యుమంతుడని ప్రసిద్ధి గాంచిన, బలీ= బలశాలియగు, శాల్వ–అమాత్యః= శాల్వుని అమాత్యుడు, ప్రాక్= ముందుగా, ప్రపీడితః= అధికముగా పీడించబడినవాడై, ప్రద్యుమ్నమ్= ప్రద్యుమ్నుని, ఆసాద్య= సమీపించి, మౌర్వ్యా= లోహనిర్మితమైన, గదయా= గదతో, వ్యాహత్య= కొట్టి, వ్యనదత్= సింహనాదము చేసెను.

ద్యుమంతుడని ప్రసిద్ధి గాంచిన శాల్వుని అమాత్యుడు బలశాలి. వానిని ప్రద్యుమ్నుడు ముందుగా చాల పీడించెను. ఆతడు ఆయనను సమీపించి లోహపు గదతో కొట్టి సింహనాదము చేసెను.

ప్రద్యుమ్నం గదయా శీర్ణవక్షఃస్థలమరిందమమ్ ।
అపోవాహ రణాత్సూతో ధర్మవిద్దారుకాత్మజః ॥ 27

గదయా= గదచే, శీర్ణవక్షఃస్థలమ్= పగిలిన వక్షఃస్థలము కలిగిన, అరిందమమ్= శత్రువులను మట్టుబెట్టే, ప్రద్యుమ్నమ్= ప్రద్యుమ్నుని, ధర్మవిత్= ధర్మము తెలిసినవాడు, దారుక–ఆత్మజః= దారుకుని పుత్రుడు, సూతః= సారథి, రణాత్= యుద్ధమునుండి, అపోవాహ= తోడ్కొనిపోయెను.

దారుకుని పుత్రుడే శత్రుసంహారకుడగు ప్రద్యుమ్నుని సారథి. ఆతనికి యుద్ధధర్మము తెలియును. గదచే ప్రద్యుమ్నుని వక్షఃస్థలము పగులగా, ఆతడాయనను యుద్ధక్షేత్రమునుండి దూరముగా తీసుకు–పోయెను.

లబ్ధసంజ్ఞో ముహూర్తేన కార్ష్ణిస్సారథిమబ్రవీత్ ।
అహో అసాధ్విదం సూత యద్రణాన్మేఽపసర్పణమ్ ॥ 28

ముహూర్తేన= ముహూర్తకాలముచే, లబ్ధసంజ్ఞః= పొందబడిన తెలివి గల, కార్ష్ణిః= కృష్ణుని పుత్రుడగు ప్రద్యుమ్నుడు, సారథిమ్= సారథినుద్దేశించి, అబ్రవీత్= పలికెను, అహో= అయ్యో!, సూత= ఓ సారథీ!, రణాత్= యుద్ధమునుండి, మే= నాయొక్క, అపసర్పణమ్= దూరముగా తీసుకు పోవుట అనేది, యత్= ఏది గలదో, ఇదమ్= ఇది, అసాధు= తప్పు.

శ్రీకృష్ణపుత్రుడగు ప్రద్యుమ్నుడు ఘడియ కాలములో తెలివిని పొందెను. ఆతడు సారథితోనిట్లనెను -- అయ్యో! ఓ సారథీ! నన్ను యుద్ధభూమినుండి దూరముగా తీసుకుపోవుట అనేది తప్పు.

న యదూనాం కులే జాతశ్శ్రూయతే రణవిచ్యుతః ।
వినా మత్ క్లీబచిత్తేన సూతేన ప్రాప్తకిల్బిషాత్ ॥ 29

యదూనామ్= యాదవుల, కులే= కులమునందు, జాతః= పుట్టిన వాడు, రణవిచ్యుతః= యుద్ధమునుండి దూరమైనవాడు, న శ్రూయతే= వినబడుట లేదు, క్లీబచిత్తేన= పిరికి మనస్సు గల, సూతేన= సారథిచే, ప్రాప్తకిల్బిషాత్= పొందబడిన దోషము గల, మత్ వినా= నేను తప్ప.

నేను తప్ప యాదవుల కులములో పుట్టినవాడు యుద్ధమునుండి దూరమైనట్లుగా ఎన్నడూ వినలేదు. సారథి పిరికి మనస్సు వాడగుట వలన నాకీ దోషము (అపకీర్తి) ప్రాప్తించినది.

కిం ను వక్ష్యేఽభిసంగమ్య పితరౌ రామకేశవౌ ।
యుద్ధాత్సమ్యగపక్రాంతః పృష్టస్తత్రాత్మనః క్షమమ్ ॥ 30

యుద్ధాత్= యుద్ధమునుండి, సమ్యక్= క్షేమముగా, అపక్రాంతః = కొనిపోబడిన నేను, పితరౌ= తండ్రులగు, రామకేశవౌ= బలరామ శ్రీకృష్ణులను, అభిసంగమ్య= ఎదురుగా వెళ్లి, పృష్టః= ప్రశ్నించబడిన వాడనై, తత్ర= అప్పుడు, ఆత్మనః= నాకు, క్షమమ్= యోగ్యమైన, కిమ్= దేనిని, వక్ష్యే నుం= చెప్పగలను?

యుద్ధమునుండి క్షేమముగా కొనిరాబడిన నేను తండ్రులగు బలరామ శ్రీకృష్ణుల వద్దకు వెళ్లినప్పుడు, వారు నన్ను ప్రశ్నిస్తే, నాకు యోగ్యమైన ఉత్తరమును ఏమని చెప్పను?

వ్యక్తం మే కథయిష్యంతి హసంత్యో భ్రాతృజామయః ।
క్లైబ్యం కథం కథం వీర తవాన్యైః కథ్యతాం మృధే ॥ 31

మే= నా, భ్రాతృజామయః= సోదరుల భార్యలు, హసంత్యః= నవ్వుచున్నవారై, వ్యక్తమ్= నిశ్చితముగా, కథయిష్యంతి= చెప్పగలరు, వీర= ఓ వీరుడా!, మృధే= యుద్ధమునందు, అన్యైః= శత్రువులచే, తవ= నీకు, క్లైబ్యమ్= నపుంసకత్వము, కథమ్= ఎట్లు?, కథమ్= ఎట్లు?, కథ్యతామ్= చెప్పబడుగాక!

నా సోదరుల భార్యలు నవ్వుతూ నిశ్చితముగా నాతో ఇట్లు పలుకగలరు – ఓ వీరా! యుద్ధములో శత్రువుల యెదుట నీవు నపుంసకుడవెట్లైతివి? చెప్పుము, చెప్పుము.

సారథిరువాచ ।

ధర్మం విజానతాఽఽయుష్మన్ కృతమేతన్మయా విభో
సూతః కృచ్ఛ్రగతం రక్షేద్రథినం సారథిం రథీ ॥ 32

సారథిః= సారథి, ఉవాచ= పలికెను, ఆయుష్మన్= ఓ చిరంజీవీ!, ధర్మమ్= ధర్మమును, విజానతా= తెలిసిన, మయా= నాచే, ఏతత్=

ఇది, కృతమ్= చేయబడినది, విభో= ఓ సమర్థుడా!, సూతః= సారథి, కృచ్ఛ్రగతమ్= ఆపదను పొందిన, రథినమ్= రథికుని, రథీ= రథికుడు, సారథిమ్= సారథిని, రక్షేత్= రక్షించవలెను.

సారథి ఇట్లు పలికెను...ఓ చిరంజీవీ! ధర్మము తెలిసే నేనీ పనిని చేసితిని. నీవు సమర్థుడవు. ఆపదలోనున్న రథికుని సారథి, సారథిని రథికుడు రక్షించవలెను.

ఏతద్విదిత్వా తు భవాన్ మయాఽపోవాహితో రణాత్ ।
ఉపసృష్టః పరేణేతి మూర్ఛితో గదయా హతః ॥ 33

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే షట్సప్తతితమోఽధ్యాయః ॥

పరేణ= శత్రువుచే, గదయా= గదతో, హతః= కొట్టబడినవాడవై, మూర్ఛితః= మూర్ఛిల్లినవాడవు, ఉపసృష్టః= పీడను పొందినవాడవు, ఇతి= అని, ఏతత్= దీనిని, విదిత్వా తు= తెలిసియే, మయా= నాచే, రణాత్= యుద్ధమునుండి, అపోవాహితః= దూరముగా తీసుకుపోబడితివి.

శత్రువు నిన్ను గదతో కొట్టగా నీవు మూర్ఛిల్లి పీడను పొందితివి. ఈ విషయమును గుర్తించియే నేను నిన్ను యుద్ధరంగమునుండి దూరముగా తీసుకుపోతిని.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
యాదవులకు శాల్వునితో యుద్ధమును వర్ణించే
డెబ్బది ఆరవ అధ్యాయము ముగిసినది (76).

* * *

అథ సప్తసప్తతితమోఽధ్యాయః

శాల్వుని ఉద్ధారము

శ్రీశుక ఉవాచ ।

స తూపస్పృశ్య సలిలం దంశితో ధృతకార్ముకః ।
నయ మాం ద్యుమతః పార్శ్వం వీరస్యేత్యాహ సారథిమ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సః తు= ఆ ప్రద్యుమ్నుడైతే, సలిలమ్= నీటిని, ఉపస్పృశ్య= త్రాగి, దంశితః= కవచమును వేసుకున్నవాడై, ధృతకార్ముకః= పట్టుకొనబడిన ధనుస్సు గలవాడై, సారథిమ్= సారథిని ఉద్దేశించి, ఇతి= ఇట్లు, ఆహ= పలికెను, మామ్= నన్ను, వీరస్య= వీరుడగు, ద్యుమతః= ద్యుమంతుని యొక్క, పార్శ్వమ్= సమీపమును గురించి, నయ= తీసుకుపొమ్ము.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఆ ప్రద్యుమ్నుడైతే నీటిని త్రాగికవచము వేసుకొని ధనుస్సు పట్టుకొని సారథితో నిట్లనెను...నన్ను వీరుడగు ద్యుమంతుని సమీపమునకు తీసుకుపొమ్ము.

విధమంతం స్వసైన్యాని ద్యుమంతం రుక్మిణీసుతః ।
ప్రతిహృత్య ప్రత్యవిధ్యన్నారాచైరష్టభిస్స్మయన్ ॥ 2

రుక్మిణీసుతః= రుక్మిణి పుత్రుడగు ప్రద్యుమ్నుడు, స్వసైన్యాని= తన సైన్యములను, విధమంతమ్= చెల్లాచెదరు చేయుచున్న, ద్యుమంతమ్= ద్యుమంతుని, ప్రతిహృత్య= అడ్డుకొని, స్మయన్= చిరునవ్వు నవ్వుచున్న వాడై, అష్టభిః= ఎనిమిది, నారాచైః= బాణములతో, ప్రత్యవిధ్యత్= కొట్టెను.

రుక్మిణి పుత్రుడగు ప్రద్యుమ్నుడు తన సైన్యములను చెదరగొట్టు-చున్న ద్యుమంతుని అడ్డుకొని, చిరునవ్వుతో ఎనిమిది బాణములను వేసి కొట్టెను.

చతుర్భిశ్చతురో వాహాన్ సూతమేకేన చాహనత్ ।
ద్వాభ్యాం ధనుశ్చ కేతుం చ శరేణాన్యేన వై శిరః ॥ 3

చతుర్భిః= నాలుగింటితో, చతురః= నాలుగు, వాహాన్= గుర్రములను, ఏకేన= ఒకదానితో, సూతమ్= సారథిని, ద్వాభ్యామ్= రెండింటితో, ధనుః చ= ధనుస్సును, కేతుం చ= ధ్వజమును కూడ, అన్యేన= మరియొక, శరేణ= బాణముతో, శిరః వై= తలను, అహనత్= కొట్టెను.

ఆయన నాలుగు బాణములతో నాలుగు గుర్రములను, ఒక్కొక్క బాణముతో సారథిని, ధనుస్సును, ధ్వజమును కూడ కొట్టి, మరియొక బాణముతో తలను ఊడగొట్టెను. (వెరసి యెనిమిది).

గదసాత్యకిసాంబాద్యా జఘ్నుస్సౌభపతేర్బలమ్ ।
పేతుస్సముద్రే సౌభేయాస్సర్వే సంఛిన్నకందరాః ॥ 4

గదసాత్యకిసాంబ-ఆద్యాః= గదుడు సాత్యకి సాంబుడు మొదలైన వారు, సౌభపతేః= సౌభవిమానమునకు ప్రభుడగు సాల్వుని యొక్క, బలమ్= సైన్యమును, జఘ్నుః= మట్టుబెట్టిరి, సౌభేయాః= సౌభము నందున్నవారు, సర్వే= అందరు, సంఛిన్నకంధరాః= తెగగొట్టబడిన మెడలు గలవారై, సముద్రే= సముద్రమునందు, పేతుః= పడిరి.

గదుడు, సాత్యకి, సాంబుడు, చారుదేష్ణుడు మొదలైనవారు సౌభవిమానప్రభుడగు శాల్వుని సైన్యమును మట్టుబెట్టిరి. సౌభమునందలి వారు మెడలు తెగి సముద్రమునందు పడిరి.

ఏవం యదూనాం శాల్వానాం నిఘ్నతామితరేతరమ్ ।
యుద్ధం త్రినవరాత్రం తదభూత్తుములముల్బణమ్ ॥ 5

ఏవమ్= ఈ విధముగా, ఇతర-ఇతరమ్= పరస్పరము, నిఘ్నతామ్= సంహరించుకొనుచున్న, యదూనామ్= యాదవులకు, శాల్వానామ్= శాల్వపక్షీయులకు, ఉల్బణమ్= భయంకరమైన, తత్= ఆ, తుములం యుద్ధమ్= దొమ్మి యుద్ధము, త్రినవరాత్రమ్= ఇరవై ఏడు రోజులు, అభూత్= జరిగెను.

ఈ విధముగా పరస్పరము సంహరించుకొనుచున్న యాదవులకు, శాల్వపక్షీయులకు ఆ భయంకరమైన దొమ్మి యుద్ధము ఇరవై ఏడు రోజులు జరిగెను.

ఇంద్రప్రస్థం గతః కృష్ణ ఆహూతో ధర్మసూనునా ।
రాజసూయేఽథ నిర్వృత్తే శిశుపాలే చ సంస్థితే ॥ 6

కురువృద్ధాననుజ్ఞాప్య మునీంశ్చ ససుతాం పృథామ్ ।
నిమిత్తాన్యతిఘోరాణి పశ్యన్ ద్వారవతీం యయౌ ॥ 7

ధర్మసూనునా= ధర్మరాజుచే, ఆహూతః= ఆహ్వానించబడిన, కృష్ణః = శ్రీకృష్ణుడు, ఇంద్రప్రస్థమ్= ఇంద్రప్రస్థమును గురించి, గతః= వెళ్లినవాడు, అథ= తరువాత, రాజసూయే= రాజసూయము, నిర్వృత్తే= నిర్వర్తించబడగా, శిశుపాలే చ= శిశుపాలుడు కూడ, సంస్థితే= సంహరించబడగా, కురువృద్ధాన్= కురువంశమునందలి పెద్దలను, మునీన్= మహర్షులను, ససుతామ్= పుత్రులతో కూడిన, పృథాం చ= కుంతిని కూడ, అనుజ్ఞాప్య= అనుజ్ఞ యిచ్చునట్లు చేసి, అతిఘోరాణి= మిక్కిలి ఘోరములైన, నిమిత్తాని= శకునములను, పశ్యన్= చూచుచున్న వాడై, ద్వారవతీమ్= ద్వారకనగరమును గురించి, యయౌ= వెళ్లెను.

ధర్మరాజు ఆహ్వానమునందుకొని శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునకు వెళ్లెను. అచట రాజసూయము జరిగెను. దానిలో శిశుపాలుడు వధించ-

బడెను. తరువాత ఆయన కురువంశములోని పెద్దలు, మహర్షులు, పాండవులు, కుంతిల వద్ద సెలవు తీసుకొని ద్వారకకు వెళ్లెను. అపుడాయనకు ఘోరములైన శకునములు కనబడెను.

ఆహ చాహమిహాయాత ఆర్యమిశ్రాభిసంగతః ।
రాజన్యైశ్చైద్యపక్షీయా నూనం హన్యుః పురీం మమ ॥ 8

ఆహ చ= పలికెను కూడా, అహమ్= నేను, ఆర్యమిశ్ర-అభిసంగతః= పూజనీయులగు అన్నగారితో కూడినవాడనై, ఇహ= ఇచటకు, ఆయాతః= వచ్చినవాడను, చైద్యపక్షీయాః= చేదిరాజగు శిశుపాలుని పక్షమునకు చెందిన, రాజన్యాః= రాజులు, నూనమ్= నిశ్చయముగా, మమ= నాయొక్క, పురీమ్= నగరమును, హన్యుః= నాశము చేసెదరు.

ఆయన తనలో ఇట్లు తలపోసెను -- నేను పూజనీయులగు అన్నగారితో కూడి ఈ హస్తినాపురమునకు వచ్చితిని. చేదిరాజగు శిశుపాలుని పక్షమునకు చెందినవారు నిశ్చయముగా నా ద్వారకకు నష్టము కలిగించియుందురు.

వీక్ష్య తత్కదనం స్వానాం నిరూప్య పురరక్షణమ్ ।
సౌభం చ శాల్వరాజం చ దారుకం ప్రాహ కేశవః ॥ 9

కేశవః= శ్రీకృష్ణ భగవానుడు, స్వానామ్= తనవారలు, తత్= ఆ, కదనమ్= యుద్ధమును, సౌభం చ= సౌభవిమానమును, శాల్వరాజం చ= శాల్వరాజును కూడ, వీక్ష్య= చూచి, పురరక్షణమ్= నగరరక్షణను గురించి, నిరూప్య= నియోగించి, దారుకమ్= దారుకుని గురించి, ప్రాహ= పలికెను.

శ్రీకృష్ణ భగవానుడు తన వారు చేయుచున్న ఆ యుద్ధమును, సౌభవిమానమును, శాల్వరాజును చూచెను. ఆయన బలరాముని నగరరక్షణకు నియోగించి, సారథియగు దారుకునితో నిట్లనెను.

రథం ప్రాపయ మే సూత శాల్వస్యాంతికమాశు వై ।
సంభ్రమస్తే న కర్తవ్యో మాయావీ సౌభరాడయమ్ ॥ 10

సూత= ఓ సారథీ!, మే= నా, రథమ్= రథమును, వై= నిశ్చయముగా, ఆశు= శీఘ్రముగా, శాల్వస్య= శాల్వుని, అంతికమ్= సమీపమును గురించి, ప్రాపయ= పొందించుము, తే= నీచే, సంభ్రమః = భయము, న కర్తవ్యః= చేయబడరాదు. అయమ్= ఈ, సౌభరాట్= సౌభవిమానమునకు ప్రభుడగు శాల్వుడు, మాయావీ= మాయావి.

ఓ సారథీ! నా రథమును శీఘ్రమే నిశ్చయముగా శాల్వుని వద్దకు నడుపుము. నీవు భయపడవద్దు. సౌభవిమానాధిపతియగు ఈ శాల్వుడు మాయావి.

ఇత్యుక్తశ్చోదయామాస రథమాస్థాయ దారుకః ।
విశంతం దదృశుస్సర్వే స్వే పరే చారుణానుజమ్ ॥ 11

ఇతి= ఇట్లు, ఉక్తః= పలుకబడిన, దారుకః= దారుకుడు, రథమ్= రథమును, ఆస్థాయ= అధిష్ఠించి, చోదయామాస= నడిపెను, స్వే= తమవారు, పరే= శత్రువులు, సర్వే= అందరు, విశంతమ్= ప్రవేశించు-చున్న, అరుణ-అనుజమ్= అరుణుని సోదరుడగు గరుడుని, దదృశుః = చూచిరి.

ఆయన ఇట్లు పలుకగా, దారుకుడు రథమునెక్కి యుద్ధభూమి లోనికి నడిపెను. ధ్వజముపైనుండే అరుణుని సోదరుడగు గరుడుని చూచి శ్రీకృష్ణ పక్షీయులు, శాల్వపక్షీయులు అందరు శ్రీకృష్ణుని గుర్తించిరి.

శాల్వశ్చ కృష్ణమాలోక్య హతప్రాయబలేశ్వరః ।
ప్రాహరత్కృష్ణసూతాయ శక్తిం భీమరవాం మృధే ॥ 12

హతప్రాయబల-ఈశ్వరః= ఇంచుమించు నశించిన సైన్యమునకు ప్రభువైన, శాల్వః చ= శాల్వుడు కూడ, మృధే= యుద్ధమునందు, కృష్ణమ్= శ్రీకృష్ణుని, ఆలోక్య= చూచి, కృష్ణసూతాయ= శ్రీకృష్ణుని సారథి కొరకు, భీమరవామ్= భయమును గొల్పే శబ్దము గల, శక్తిమ్= బల్లెమును, ప్రాహరత్= ప్రయోగించెను.

శాల్వుని సైన్యము ఇంచుమించు నష్టమైనది. ఆతడు కూడ యుద్ధములో శ్రీకృష్ణుని చూచెను. ఆతడు శ్రీకృష్ణుని సారథిపై భయమును గొల్పే శబ్దమును చేయుచున్న బల్లెమును విసిరెను.

తామాపతంతీం నభసి మహోల్కామివ రంహసా ।
భాసయంతీం దిశశ్శౌరిస్సాయకైశ్శతధాఽచ్ఛినత్ ॥ 13

నభసి= ఆకాశమునందు, మహా-ఉల్కాం ఇవ= పెద్ద ఉల్క వలె, రంహసా= వేగముతో, ఆపతంతీమ్= వచ్చి పడుచున్నట్టియు, దిశః= దిక్కులను, భాసయంతీమ్= ప్రకాశింపజేయుచున్న, తామ్= ఆ బల్లెమును, శౌరిః= శ్రీకృష్ణుడు, సాయకైః= బాణములతో, శతధా= వంద ముక్కలుగా, అచ్ఛినత్= తెగగొట్టెను.

ఆకాశమునందు పెద్ద ఉల్కవలె దిక్కులను ప్రకాశింపజేస్తూ మీద వచ్చి పడుచున్న ఆ బల్లెమును కృష్ణుడు బాణములతో వంద ముక్కలు చేసెను.

తం చ షోడశభిర్విద్ధ్వా బాణైస్సౌభం చ ఖే భ్రమత్ ।
అవిధ్యచ్ఛరసందోహైః ఖం సూర్య ఇవ రశ్మిభిః ॥ 14

తం చ= ఆ శాల్వుని కూడ, షోడశభిః= పదహారు, బాణైః= బాణములతో, విద్ధ్వా= కొట్టి. ఖే= ఆకాశమునందు, భ్రమత్=

తిరుగుచున్న, సౌభం చ= సౌభవిమానమును కూడ, శరసందోహైః= బాణముల గుంపులతో, సూర్యః= సూర్యుడు, ఖమ్= ఆకాశమును, రశ్మిభిః ఇవ= కిరణములతో వలె, అవిధ్యత్= కొట్టెను.

ఆయన ఆ శాల్వుని కూడ పదహారు బాణములతో కొట్టెను. సూర్యుడు ఆకాశమును కిరణములతో నింపునట్లుగా ఆయన బాణముల గుంపులతో ఆకాశములో తిరుగుచున్న సౌభవిమానమును కొట్టెను.

శాల్వశ్చౌరేస్తు దోస్సవ్యం సశార్ఙ్గం శార్ఙ్గధన్వనః ।
బిభేద న్యపతద్ధస్తాచ్ఛార్ఙ్గమాసీత్తదద్భుతమ్ ॥ 15

శాల్వః తు= శాల్వుడైతే, శార్ఙ్గధన్వనః= శార్ఙ్గమనే ధనుస్సు గల, శౌరేః= శ్రీకృష్ణునియొక్క, సశార్ఙ్గమ్= శార్ఙ్గధనుస్సుతో కూడిన, సవ్యమ్= ఎడమ, దోః= చేతిని, బిభేద= కొట్టెను, హస్తాత్= చేతినుండి, శార్ఙ్గమ్= శార్ఙ్గధనుస్సు, న్యపతత్= క్రింద పడెను, తత్= ఇది, అద్భుతమ్= అద్భుతము, ఆసీత్= ఆయెను.

శాల్వుడైతే శార్ఙ్గమనే ధనుస్సు గల శ్రీకృష్ణుని ధనుస్సుతో కూడిన ఎడమ చేతిని బాణముతో కొట్టగా, ధనుస్సు చేతినుండి క్రింద పడెను. ఆ ఘటన ఆశ్చర్యమును కలిగించెను.

హాహాకారో మహానాసీద్భూతానాం తత్ర పశ్యతామ్ ।
వినద్య సౌభరాడుచ్చైరిదమాహ జనార్దనమ్ ॥ 16

తత్ర= అచట, పశ్యతామ్= చూచుచున్న, భూతానామ్= ప్రాణాలయొక్క, మహాన్= పెద్ద, హాహాకారః= హాహాకారము, ఆసీత్= కలిగెను, సౌభరాట్= సౌభమనే విమానమునకు ప్రభుడగు శాల్వుడు, ఉచ్చైఃబిగ్గరగా, వినద్య= సింహనాదము చేసి, జన-అర్దనమ్= దుష్టజన శిక్షకుడగు శ్రీకృష్ణుని ఉద్దేశించి, ఇదమ్= ఈ మాటను, ఆహ= పలికెను.

అచట యుద్ధమును తిలకించుచున్న ప్రాణులు పెద్ద హాహాకారమును చేసిరి. సౌభవిమానమునకు ప్రభుడగు శాల్వుడు బిగ్గరగా సింహనాదమును చేసి, దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణునితో నిట్లనెను.

యత్త్వయా మూఢ నస్సఖ్యుర్భ్రాతుర్భార్యా హృతేక్షతామ్ ।
ప్రమత్తస్స సభామధ్యే త్వయా వ్యాపాదితస్సఖా ॥ 17

మూఢ= మూర్ఖా!, యత్= ఎందువలనైతే, త్వయా= నీచే, నః= మేము, ఈక్షతామ్= చూచుచుండగా, సఖ్యుః= మిత్రుడైనట్టియు, భ్రాతుః = అన్నయైన శిశుపాలుని, భార్య= భార్య, హృతా= అపహరించబడినదో, ప్రమత్తః= సావధానముగా లేని, సః= ఆ, సఖా= మిత్రుడు, సభామధ్యే= సభయొక్క మధ్యయందు, త్వయా= నీచే, వ్యాపాదితః= చంపబడినాడో.

ఓ మూర్ఖా! రుక్మిణి మా మిత్రుడు, అన్న అగు శిశుపాలునకు భార్య కావలసియుండగా, నీవామెను మేము చూచుచుండగనే లెక్క చేయకుండా అపహరించితివి. పైగా, ఆ మా మిత్రుడు యుద్ధమునకు సంసిద్ధుడై లేని సమయములో, సభ మధ్యలో నీవాతనిని సంహరించితివి. అందువలన...

తం త్వాఽద్య నిశితైర్బాణైరపరాజితమానినమ్ ।
నయామ్యపునరావృత్తిం యది తిష్ఠేర్మమాగ్రతః ॥ 18

అపరాజితమానినమ్= పరాజయము లేనివాడనని గర్వించే, తమ్= అట్టి (మిత్రహంతకుడైన), త్వా= నిన్ను, అద్య= ఇప్పుడు, నిశితైః = వాడియైన, బాణైః= బాణములతో, అపునఃఆవృత్తిమ్= తిరిగి రాని స్థానమును గురించి, నయామి= పంపెదను, మమ= నాకు, అగ్రతః= ఎదుట, యది తిష్ఠేః= నీవు నిలబడినచో.

నాకు పరాజయము లేదని గర్వించే అట్టి (మిత్రహంతకుడవైన) నిన్ను ఇప్పుడు - నీవు నా యెదుట నిలబడే పక్షములో - వాడి బాణములతో తిరిగి రాని స్థానము (మృత్యువు) నకు పంపెదను.

శ్రీభగవానువాచ ।

వృథా త్వం కత్థసే మంద న పశ్యస్యంతికేఽంతకమ్ ।
పౌరుషం దర్శయంతి స్మ శూరా న బహుభాషిణః ॥ 19

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, మంద= ఓ మూఢా!, త్వమ్= నీవు, వృథా= వ్యర్థముగా, కత్థసే= వదరుచున్నావు, అంతికే= దగ్గరలోనున్న, అంతకమ్= మృత్యువును, న పశ్యసి= చూడకున్నావు, శూరాః= శూరులు, పౌరుషమ్= పురుష-కారమును, దర్శయంతి స్మ= చూపించెదరు సుమా!, బహుభాషిణః= అధికప్రసంగము చేయువారు, న= కాదు.

శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు పలికెను...ఓ మూఢా! నీవు వ్యర్థముగా వదరుచున్నావు. దగ్గరలోనున్న మృత్యువును చూడకున్నావు. శూరులు పురుషకారమును చూపెదరే గాని, అధికప్రసంగమును చేయరు.

ఇత్యుక్త్వా భగవాఞ్ఛాల్వం గదయా భీమవేగయా ।
తతాడ జత్రౌ సంరబ్ధస్స చకంపే వమన్నసృక్ ॥ 20

సంరబ్ధః= కోపించిన, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఇతి= అని, ఉక్త్వా= పలికి, భీమవేగయా= భయంకరమగు వేగము గల, గదయా= గదతో, శాల్వమ్= శాల్వుని, జత్రౌ= కొంకులపై, తతాడ= కొట్టెను, సః = ఆతడు, అసృక్= రక్తమును, వమన్= క్రక్కువాడై, చకంపే= వణికెను.

శ్రీకృష్ణ భగవానుడు కోపముతో నిట్లు పలికి భయంకరమగు వేగము గల గదతో శాల్వుని కొంకులపై కొట్టగా, ఆతడు రక్తమును క్రక్కుకుంటూ వణికిపోయెను.

గదాయాం సన్నివృత్తాయాం శాల్వస్త్వంతరధీయత ।
తతో ముహూర్త ఆగత్య పురుషశ్చిరసాఽచ్యుతమ్ ।
దేవక్యా ప్రహితోఽస్మీతి నత్వా ప్రాహ వచో రుదన్। 21

గదాయామ్= గద, సన్నివృత్తాయామ్= వెనుకకు తిరిగి రాగా, శాల్వఃతు= శాల్వుడైతే, అంతరధీయత= అంతర్ధానము చెందెను, తతః = తరువాత, ముహూర్తే= రెండు ఘడియల కాలము గడువగా, పురుషః = వ్యక్తి, ఆగత్య= వచ్చి, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, శిరసా= శిరస్సుతో, నత్వా= నమస్కరించి, దేవక్యా= దేవకీదేవిచే, ప్రహితఃఅస్మి= పంపబడినవాడను, అస్మి= అగుదును, ఇతి= అని, రుదన్= రోదించుచున్నవాడై, వచః= మాటను, ప్రాహ= పలికెను.

గద తిరిగి శ్రీకృష్ణుని వద్దకు రాగా, శాల్వుడైతే అంతర్ధానమాయెను. తరువాత రెండు ఘడియల సమయము గడిచెను. అంతలో ఒక వ్యక్తి వచ్చి శ్రీకృష్ణ భగవానునకు తల వంచి నమస్కరించి ఏడుస్తూ ఇట్లు పలికెను -- నన్ను దేవకీ దేవి పంపినది.

కృష్ణ కృష్ణ మహాబాహో పితా తే పితృవత్సల ।
బద్ధ్వాఽపనీతశ్శాల్వేన సౌనికేన యథా పశుః ॥ 22

కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, మహాబాహో= గొప్ప బాహువులు గలవాడా!, పితృవత్సల= తండ్రియందు గొప్ప ప్రేమ గలవాడా!, తే= నీ, పితా= తండ్రి, శాల్వేన= శాల్వునిచే, సౌనికేన= కసాయివానిచే, పశుఃయథా= పశువు వలె, బద్ధ్వా= కట్టి, అపనీతఃలాగుకొనిపోబడినవాడు.

ఓ శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! నీవు గొప్ప భుజశక్తి, తండ్రియందు అధికమగు ప్రేమ గలవాడవు. శాల్వుడు నీ తండ్రిని కట్టి, కసాయి పశువును వలె, లాగుకొని వెళ్లినాడు.

నిశమ్య విప్రియం కృష్ణో మానుషీం ప్రకృతిం గతః ।
విమనస్కో ఘృణీ స్నేహాద్బభాషే ప్రాకృతో యథా ॥ 23

కృష్ణుఁ= శ్రీకృష్ణుడు, విప్రియమ్= అప్రియమును, నిశమ్య= విని, స్నేహాత్= ప్రేమ వలన, మానుషీమ్= మానవులకు చెందిన, ప్రకృతిమ్= స్వభావమును, గతఁ= పొందినవాడై, విమనస్కఁ= చెడిన మనస్సు గలవాడు, ఘృణీ= దయ గలవాడై, ప్రాకృతఁ యథా= అజ్ఞాని వలె, బభాషే= పలికెను.

ఆ అప్రియవార్తను విని శ్రీకృష్ణుడు ప్రేమ కారణముగా మానవుల స్వభావమును పొందెను. వసుదేవునిపై దయచే ఆయన మనస్సు చెడిపోయెను. ఆయన ప్రాకృతమానవుడు వోలె ఇట్లు పలికెను.

కథం రామమసంభ్రాంతం జిత్వాఽజేయం సురాసురైఁ ।
శాల్వేనాల్పీయసా నీతఁ పితా మే బలవాన్ విధిఁ ॥ 24

అసంభ్రాంతమ్= అజాగ్రత్త లేనట్టియు, సుర–అసురైఁ= దేవతలచే రాక్షసులచే, అజేయమ్= జయింప శక్యము కాని, రామమ్= బలరాముని, జిత్వా= జయించి, కథమ్= ఏ విధముగా, అల్పీయసా= మిక్కిలి అల్పుడగు, శాల్వేన= శాల్వునిచే, మే= నా, పితా= తండ్రి, నీతఁ= తీసుకుపోబడినవాడు?, విధిఁ= విధి, బలవాన్= బలీయము.

బలరాముడు అజాగ్రత్తనెరుగడు. ఆయనను దేవతలు, రాక్షసులు కూడ జయించలేరు. మిక్కిలి అల్పుడగు శాల్వుడు ఆయనను ఎట్లు జయించి నా తండ్రిని చెరబట్టినాడు? విధి బలీయము.

ఇతి బ్రువాణే గోవిందే సౌభరాట్ ప్రత్యుపస్థితఁ ।
వసుదేవమివానీయ కృష్ణం చేదమువాచ సఁ ॥ 25

గోవిందే= శ్రీకృష్ణుడు, ఇతి= ఈ విధముగా, బ్రువాణే= పలుకుచుండగా, సౌభరాట్= సౌభవిమానమునకు ప్రభుడగు, సః= ఆ శాల్వుడు, ప్రత్యుపస్థితః= ఆవిర్భవించినవాడై, వసుదేవం ఇవ= వసుదేవునివంటి వానిని, ఆనీయ= తీసుకువచ్చి, కృష్ణం చ= శ్రీకృష్ణుని ఉద్దేశించి, ఇదమ్= ఈ మాటను, ఉవాచ= పలికెను.

శ్రీకృష్ణుడీ విధముగా పలుకుచుండగనే సౌభవిమానమునకు ప్రభుడగు శాల్వుడు ఆవిర్భవించెను. ఆతడు వసుదేవుని పోలినవానిని తీసుకువచ్చి శ్రీకృష్ణునితో నిట్లు పలికెను.

ఏష తే జనితా తాతో యదర్థమిహ జీవసి ।
వధిష్యే వీక్షతస్తేఽముమీశశ్చేత్పాహి బాలిశ ॥ 26

బాలిశ= ఓ మూర్ఖా!, ఏషః= ఈతడు, తే= నీకు, జనితా= జన్మనిచ్చిన, తాతః= తండ్రి, యద్-అర్థమ్= ఎవని కొరకై, ఇహ= ఈ లోకమునందు, జీవసి= జీవించియున్నావో, తే= నీవు, వీక్షతః= చూచు-చుండగా, అముమ్= ఈయనను, వధిష్యే= సంహరించగలను, ఈశః చేత్= సమర్థుడవైనచో, పాహి= కాపాడుము.

ఓ మూర్ఖా! ఈతడు నీకు జన్మనిచ్చిన తండ్రి. నీవు ఈయన కొరకే ఈ లోకములో జీవించుచున్నావు. నీవు చూచుచుండగనే నేను ఈయనను సంహరించెదను. శక్తి ఉన్నవాడవైనచో, కాపాడుము.

ఏవం నిర్భర్త్స్య మాయావీ ఖడ్గేనానకదుందుభేః ।
ఉత్కృత్య శిర ఆదాయ ఖస్థం సౌభం సమావిశత్ ॥ 27

మాయావీ= మాయావియగు శాల్వుడు, ఏవమ్= ఈ విధముగా, నిర్భర్త్స్య= తిరస్కరించి, ఖడ్గేన= కత్తితో, ఆనకదుందుభేః= వసుదేవుని యొక్క, శిరః= తలను, ఉత్కృత్య= నరికి, ఆదాయ= తీసుకొని, ఖస్థమ్= ఆకాశమునందున్న, సౌభమ్= సౌభవిమానమును, సమావిశత్= ప్రవేశించెను.

మాయావియగు శాల్వుడు శ్రీకృష్ణుని ఈ విధముగా నిరసించి, కత్తితో వసుదేవుని తలను నరికి, దానిని తీసుకొని ఆకాశమునందున్న సౌభవిమానమును ప్రవేశించెను.

తతో ముహూర్తం ప్రకృతావుపప్లుతః ।
స్వబోధ ఆస్తే స్వజనానుషంగతః ॥
మహాఽనుభావస్తదబుద్ధ్యదాసురీం
మాయాం స శాల్వప్రసృతాం మయోదితామ్ ॥ 28

తతః= తరువాత, స్వజన–అనుషంగతః= తనవారియందలి ఆసక్తి వలన, ముహూర్తమ్= మూహూర్తకాలము, ప్రకృతౌ= ప్రకృతికార్యమగు దేహభావమునందు, ఉపప్లుతః= నిమగ్నుడై, ఆస్తే= ఉన్నాడు, స్వబోధః = స్వయముగనే జ్ఞానము గలవాడు, మహా–అనుభావః= గొప్ప మహిమ గలవాడు అగు, సః= ఆ శ్రీకృష్ణుడు, తత్= దానిని, ఆసురీమ్= అసురులకు సంబంధించినట్టియు, శాల్వప్రసృతామ్= శాల్వునిచే ప్రసరింపజేయబడి నట్టియు, మయ–ఉదితామ్= మయునిచే నేర్పబడిన, మాయామ్= మాయనుగా, అబుద్ధ్యత్= తెలుసుకొనెను.

శ్రీకృష్ణుడు స్వయంసిద్ధ జ్ఞానస్వరూపుడు. కాని, తనవారియందలి ఆసక్తిచే ఆయన రెండు ఘడియల కాలము ప్రకృతికార్యమగు దేహ–భావమునందు మునిగి యుండెను. కాని, ఆ మహానుభావుడు అది శాల్వునిచే ప్రసరింపజేయబడిన అసురుల మాయయని గుర్తించెను. ఆ మాయ మయుడు నేర్పినది.

న తత్ర దూతం న పితుః కలేవరం ।
ప్రబుద్ధ ఆజౌ సమపశ్యదచ్యుతః ।
స్వాప్నం యథా చాంబరచారిణం రిపుం
సౌభస్థమాలోక్య నిహంతుముద్యతః ॥ 29

ప్రబుద్ధః= తెలివి తెచ్చుకున్న, అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, తత్ర= అక్కడ, ఆజౌ= యుద్ధమునందు, దూతమ్= దూతను, స్వాప్నం యథా= స్వప్నమునందలి దూతను వలె, న సమపశ్యత్= కనలేదు, పితుః= తండ్రియొక్క, కలేవరమ్= మొండెమును, న= కనలేదు, చ= మరియు, అంబరచారిణమ్= ఆకాశమునందు సంచరించునట్టియు, సౌభస్థమ్= సౌభమనే విమానమునందున్న, రిపుమ్= శత్రువును, ఆలోక్య= చూచి, నిహంతుమ్= సంహరించుటకు, ఉద్యతః= సంసిద్ధుడు (ఆయెను).

స్వప్నములో కనబడిన వస్తువులు నిద్ర లేచేక కనబడవు. అదే విధముగా, శ్రీకృష్ణ భగవానుడు తన సహజస్థితిని పొంది చూడగా అక్కడ యుద్ధభూమిలో దేవకి పంపిన దూత గాని, తండ్రి మొండెము గాని కనబడ లేదు. కాని, ఆకాశములో సంచరిస్తూ సౌభమనే విమానము నందు శత్రువు శాల్వుడు కనబడెను. అపుడాయన వానిని వధించుటకు ఉద్యుక్తుడాయెను.

ఏవం వదంతి రాజర్షే ఋషయః కే చ నాన్వితాః ।
యత్స్వవాచో విరుధ్యేత నూనం తే న స్మరంత్యుత ॥ 30

రాజర్షే= ఓ రాజర్షీ!, న-అన్వితాః= పూర్వాపరవిచారము లేని, కే చ= కొందరు, ఋషయః= మహర్షులు, ఏవమ్= ఈ విధముగా, వదంతి= చెప్పుచున్నారు, యత్= ఏదైతే, స్వవాచః= తమ వచనములు, విరుధ్యేత= విరుద్ధముగా నుండునో దానిని, తే= వారు, న స్మరంతి= గుర్తించరు సుమా!, నూనమ్= నిశ్చయము.

ఓ పరీక్షిన్మహారాజా! నీవు రాజువే గాక ఋషివి కూడా. పూర్వాపరవిచారము లేని కొందరు మహర్షులు ఈ పైన చెప్పిన విధముగా వర్ణించుచున్నారు. కాని, వారు తమ వచనములలోని విరోధమును గుర్తించలేకున్నారు సుమా! ఇది నిశ్చయము.

క్వ శోకమోహౌ స్నేహో వా భయం వా యేఽజ్ఞసంభవాః ।
క్వ చాఖండితవిజ్ఞానజ్ఞా నైశ్వర్యస్త్వఖండితః ॥ 31

శోకమోహౌ= శోకము మోహము, స్నేహః వా= ఆసక్తి గాని, భయం వా= భయము గాని, క్వ= ఎక్కడ?, యే= ఏవైతే, అజ్ఞసంభవాః = అజ్ఞానులయందు పుట్టునో, అఖండితవిజ్ఞానజ్ఞాన-ఐశ్వర్యః= ఖండితములు కాని జ్ఞానము విజ్ఞానము ఈశ్వరభావము గల, అఖండితః తు= పూర్ణుడైన శ్రీకృష్ణుడైతే, క్వ చ= ఎక్కడ?

అజ్ఞానులయందు ఉదయించే శోకము, మోహము, ఆసక్తి, భయము ఎక్కడ? ఖండితము కాని జ్ఞానము (శాస్త్రార్థపరిజ్ఞానము), విజ్ఞానము (అనుభవము), ఈశ్వరభావము గల పూర్ణుడగు శ్రీకృష్ణ భగవానుడెక్కడ?

యత్పాదసేవోర్జితయాఽఽత్మవిద్యయా
హిన్వంత్యనాద్యాత్మవిపర్యయగ్రహమ్ ।
లభంత ఆత్మీయమనంతమైశ్వరం
కుతో ను మోహః పరమస్య సద్గతేః ॥ 32

యత్-పాదసేవా-ఊర్జితయా= ఎవ్వాని పాదముల సేవచే వర్ధిల్ల-జేయబడిన, ఆత్మవిద్యయా= ఆత్మజ్ఞానముచే, అనాది-ఆత్మవిపర్య-యగ్రహమ్= అనాదియగు అనాత్మయందు ఆత్మభావమనే పిశాచమును, హిన్వంతి= నశింపజేయుచున్నారో, ఆత్మీయమ్= ఆత్మరూపుడైనట్టియు, లభంతే= పొందుచున్నారో, సద్-గతేః= సత్పురుషులచే పొందబడే, పరమస్య= పరమాత్మకు, మోహః= మోహము, కుతః ను= ఎక్కడనుండి వచ్చును?

శ్రీకృష్ణ భగవానుని పాదముల సేవచే ఆత్మజ్ఞానము వర్ధిల్లి సాధకులు అనాదియైన ఆత్మ-అనాత్మ-అవివేకమనే పిశాచమును పారద్రోలెదరు. వారు ఆ ఈశ్వరుని కాలాతీతమగు ఆత్మనుగా సాక్షాత్కరించు కొనెదరు. సత్పురుషులచే పొందబడే ఆ పరమాత్మకు మోహమెక్కడిది?

తం శస్త్రపూగైః ప్రహరంతమోజసా ।
శాల్వం శరైశ్శారిరమోఘవిక్రమః ।
విద్ధ్వాఽచ్ఛినద్వర్మ ధనుశ్శిరోమణిం
సౌభం చ శత్రోర్గదయా రురోజ హ ॥ 33

ఓజసా= బలముతో, శస్త్రపూగైః= ఆయుధముల గుంపులతో, ప్రహరంతమ్= కొట్టుచున్న, తమ్= ఆ, శాల్వమ్= శాల్వుని, అమోఘ-విక్రమః= మొక్కవోని పరాక్రమము గల, శౌరిః= శ్రీకృష్ణుడు, శరైః= బాణములతో, విద్ధ్వా= కొట్టి, వర్మ= కవచమును, ధనుః= ధనుస్సును, శిరః-మణిం చ= తలపైనుండే మణిని, అచ్ఛినత్= ఛిన్నాభిన్నము చేసెను, శత్రోః= శత్రువుయొక్క, సౌభం చ= సౌభ విమానమును కూడ, గదయా= గదతో, రురోజ హ= పగులగొట్టెను.

శాల్వుడు ఆయుధముల గుంపులతో బలముగా కొట్టుచుండెను. ఆతనిని మొక్కవోని పరాక్రమము గల శ్రీకృష్ణుడు బాణములతో కొట్టి కవచమును, ధనుస్సును, తలపైనుండే మణిని కూడ ఛిన్నాభిన్నము చేసెను. ఆయన ఆ శత్రువుయొక్క సౌభవిమానమును గదతో పగులగొట్టెను.

తత్కృష్ణహస్తేరితయా విచూర్ణితం
పపాత తోయే గదయా సహస్రధా ।
విసృజ్య తద్భూతలమాస్థితో గదాం
ఉద్యమ్య శాల్వోఽచ్యుతమభ్యగాద్ద్రుతమ్ ॥ 34

కృష్ణహస్త-ఈరితయా= శ్రీకృష్ణుని చేతిచే ప్రయోగించబడిన, గదయా= గదచే, సహస్రధా= వేయి ముక్కలుగా, విచూర్ణితమ్= నుగ్గు నుగ్గు చేయబడిన, తత్= ఆ విమానము, తోయే= నీటియందు, పపాత= పడెను, తత్= దానిని, విసృజ్య= విడిచిపెట్టి, భూతలమ్= భూమియొక్క ఉపరితలమును, ఆస్థితః= ఆశ్రయించిన, శాల్వః= శాల్వుడు, గదామ్= గదను, ఉద్యమ్య= పైకెత్తి, ద్రుతమ్= వేగముగా, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని ఉద్దేశించి, అభ్యగాత్= ఎదురుగా వెళ్లెను.

శ్రీకృష్ణుడు తన చేతినుండి ప్రయోగించిన గద ఆ విమానమును వేయి ముక్కలుగా చూర్ణము చేయగా, అది నీటిలో పడిపోయెను. శాల్వుడు దానిని వదిలిపెట్టి నేలపైకి దిగెను. ఆతడు గదను పైకెత్తి వేగముగా శ్రీకృష్ణ భగవానుని పైకి దూసుకు వెళ్లెను.

ఆధావతస్సగదం తస్య బాహుం
భల్లేన ఛిత్త్వాఽథ రథాంగమద్భుతమ్ ।
వధాయ శాల్వస్య లయార్కసన్నిభం
బిభ్రద్బభౌ సార్క ఇవోదయాచలః ॥ 35

ఆధావతః= మీదకు దూసుకు వచ్చుచున్న, తస్య= ఆ, శాల్వస్య= శాల్వునియొక్క, సగదమ్= గదతో కూడిన, బాహుమ్= చేతిని, భల్లేన= బల్లెమును పోలిన బాణముతో, ఛిత్త్వా= నరికి, అథ= తరువాత, వధాయ= వధించుటకై, అద్భుతమ్= అచ్చెరువును గొలుపునట్టియు, లయ-అర్కసన్నిభమ్= ప్రళయకాల సూర్యుని పోలిన, రథ-అంగమ్= చక్రమును, బిభ్రత్= ధరించిన శ్రీకృష్ణుడు, స-అర్కః= సూర్యునితో కూడిన, ఉదయ-అచలః= ఉదయపర్వతము వలె, బభౌ= ప్రకాశించెను.

మీదకు దూసుకువచ్చుచున్న ఆ శాల్వుని గదతో కూడిన చేతిని శ్రీకృష్ణుడు బల్లెమువంటి బాణముతో నరికెను. అపుడాయన వానిని

వధించుటకై ప్రళయకాలమునందలి సూర్యుని పోలియున్న చక్రమును చేతిలోనికి తీసుకొనెను. అచ్చెరువును గొలిపే ఆ చక్రముతో ఆయన, సూర్యునితో కూడియున్న ఉదయపర్వతము వలె ప్రకాశించెను.

జహార తేనైవ శిరస్సకుండలం
కిరీటయుక్తం పురుమాయినో హరిః ।
వజ్రేణ వృత్రస్య యథా పురందరో
బభూవ హా పేతి వచస్తదా నృణామ్ ॥ 36

హరిః= శ్రీకృష్ణ భగవానుడు, తేన ఏవ= దానితోనే, సకుండలమ్= కుండలములతో కూడినట్టియు, కిరీటయుక్తమ్= కిరీటముతో= కూడిన, పురుమాయినః= మహామాయావియగు శాల్వునియొక్క, శిరః= తలను, పురందరః= ఇంద్రుడు, వజ్రేణ= వజ్రముతో, వృత్రస్య యథా= వృత్రాసురుని (తలను) వలె, జహార= ఊడగొట్టెను, తదా= అప్పుడు, నృణామ్= మానవులయొక్క, హా= అయ్యో!, హా= అయ్యో!, ఇతి= అనే, వచః= వచనము, బభూవ= కలిగెను.

శ్రీకృష్ణ భగవానుడు అదే చక్రముతో, ఇంద్రుడు వజ్రముతో వృత్రాసురుని తలను వలె, కిరీటకుండలములతో కూడిన మహామాయా-వియగు శాల్వుని తలను నరికెను. అప్పుడు జనులు హాహాకారములను చేసిరి.

తస్మిన్నిపతితే పాపే సౌభే చ గదయా హతే ।
నేదుర్దుందుభయో రాజన్ దివి దేవగణేరితాః ।
సఖీనామపచితిం కుర్వన్ దంతవక్త్రో రుషాఽభ్యగాత్ ॥ 37

శ్రీమద్భాగవతమహాపురాణే దశమస్కంధే
సప్తసప్తతితమోఽధ్యాయః॥

రాజన్= ఓ రాజా!, తస్మిన్= ఆ, పాపే= పాపి, నిపతితే= నేల కూలగా, సౌభే చ= సౌభ విమానము కూడ, గదయా= గదచే, హతే= నష్టము చేయబడగా, దివి= అంతరిక్షమునందు, దేవగణ–ఈరితాః= దేవతల గణములచే వాయించబడిన, దుందుభయః= భేరీలు, నేదుః= మ్రోగినవి, సఖీనామ్= మిత్రులకు, అపచితిమ్= పగను తీర్చుటకై, దంతవక్త్రుః= దంతవక్త్రుడు, రుషా= కోపముతో, అభ్యగాత్= వచ్చెను.

ఓ పరీక్షిన్మహారాజా! పాపియగు ఆ శాల్వుడు నేలగూలెను. వాని సౌభమనే విమానము కూడ గదచే చూర్ణము చేయబడెను. అంతరిక్షములో దేవగణములు భేరీలను మ్రోగించిరి. మిత్రుల పగను తీర్చుటకై దంతవక్త్రుడు వచ్చెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శాల్వుని ఉద్ధారమును వర్ణించే
డెబ్బది ఏడవ అధ్యాయము ముగిసినది (77).

* * *

అథ అష్టసప్తతితమోఽధ్యాయః

దంతవక్త్ర విదూరథుల ఉద్ధారము

శ్రీశుక ఉవాచ ।

శిశుపాలస్య శాల్వస్య పౌండ్రకస్యాపి దుర్మతిః ।
పరలోకగతానాం చ కుర్వన్ పారోక్ష్యసౌహృదమ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, పరలోకగతానామ్= పరలోకమును పొందిన, శిశుపాలస్య= శిశుపాలునకు, శాల్వస్య= శాల్వునకు, పౌండ్రకస్య అపి= పౌండ్రకునకు కూడ, పారోక్ష్యసౌహృదమ్= పరోక్షమునందు మైత్రిని, కుర్వన్ చ= చేయువాడు, దుర్మతిః= దుర్బుద్ధియగు దంతవక్త్రుడు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...దుర్బుద్ధియగు దంతవక్త్రుడు పరలోకమును పొందిన శిశుపాల శాల్వ పౌండ్రకుల యెడల వారి పరోక్షములో మైత్రిని నెరపుచుండెను.

ఏకః పదాతిస్సంక్రుద్ధో గదాపాణిః ప్రకంపయన్ ।
పద్భ్యామిమాం మహారాజ మహాసత్త్వో వ్యదృశ్యత ॥ 2

మహారాజ= ఓ మహారాజా!, మహాసత్త్వః= గొప్ప బలము గల దంతవక్త్రుడు, సంక్రుద్ధః= బాగా కోపించినవాడై, ఏకః= ఒక్కడే, పదాతిః = పాదచారియై, గదాపాణిః= గద చేతియందు గలవాడై, ఇమామ్= ఈ భూమిని, పద్భ్యామ్= కాళ్లతో, ప్రకంపయన్= కంపింపజేయుచున్న వాడై, వ్యదృశ్యత= ప్రత్యక్షమయ్యెను.

ఓ పరీక్షిన్మహారాజా! గొప్ప బలము గల దంతవక్త్రుడు బాగా కోపించి ఒక్కడే పాదచారియై చేతిలో గదతో (ద్వారకలో) ప్రత్యక్షమయ్యెను. ఆతడు నడుస్తూంటే భూమి కంపించెను.

తం తథాఽఽయాంతమాలోక్య గదామాదాయ సత్వరః ।
అవప్లుత్య రథాత్కృష్ణ స్సింధుం వేలేవ ప్రత్యధాత్ ॥ 3

తథా= ఆ విధముగా, ఆయాంతమ్= వచ్చుచున్న, తమ్= ఆ దంతవక్త్రుని, ఆలోక్య= చూచి, కృష్ణః= శ్రీకృష్ణుడు, సత్వరః= వేగము గలవాడై, గదామ్= గదను, ఆదాయ= తీసుకొని, రథాత్= రథమునుండి, అవప్లుత్య= క్రిందకు దుమికి, సింధుమ్= సముద్రమును, వేలా ఇవ= చెలియలి కట్ట వలె, ప్రత్యధాత్= నిలువరించెను.

ఆ విధముగా వచ్చుచున్న దంతవక్త్రుని శ్రీకృష్ణుడు చూచెను. ఆయన వేగముగా గదను తీసుకొని రథమునుండి క్రిందకు దుమికి, చెలియలి కట్ట సముద్రమును వలె, వానిని నిలువరించెను.

గదాముద్యమ్య కారూషో ముకుందం ప్రాహ దుర్మదః ।
దిష్ట్యా దిష్ట్యా భవానద్య మమ దృష్టిపథం గతః ॥ 4

దుర్మదః= మిక్కిలి గర్వించియున్న, కారూషః= కరూషదేశప్రభుడగు దంతవక్త్రుడు, గదామ్= గదను, ఉద్యమ్య= పైకెత్తి, ముకుందమ్= శ్రీకృష్ణ భగవానుని ఉద్దేశించి, ప్రాహ= పలికెను, దిష్ట్యా= ఆనందము, దిష్ట్యా= ఆనందము, అద్య= ఈనాడు, భవాన్= నీవు, మమ= నా, దృష్టిపథమ్= చూపుయొక్క మార్గమును, గతః= పొందినవాడవు.

మిక్కిలి గర్వించియున్న కరూషదేశాధిపతియగు దంతవక్త్రుడు గదను పైకెత్తి శ్రీకృష్ణ భగవానునితో నిట్లెను...మహానందము! ఈ నాటికి నీవు నా కంట బడితివి.

త్వం మాతులేయో నః కృష్ణ మిత్రధ్రుజ్మాం జిఘాంససి ।
అతస్త్వాం గదయా మంద హనిష్యే వజ్రకల్పయా ॥ 5

కృష్ణ= ఓ కృష్ణా!, త్వమ్= నీవు, నః= మాకు, మాతులేయః= మేనమాన కొడుకువి, మిత్రధ్రుక్= మిత్రులకు ద్రోహమును చేసినవాడవు,

మామ్= నన్ను, జిఘాంససి= చంప గోరుచున్నావు, మంద= ఓ మూర్ఖుడా!, అతః= ఇందువలన, వజ్రకల్పయా= వజ్రముతో సమానమైన, గదయా= గదతో, త్వామ్= నిన్ను, హనిష్యే= సంహరించగలను.

ఓ కృష్ణా! నీవు మాకు మేనమామ కొడుకువి. కాని, నీవు నా మిత్రులకు ద్రోహము చేసి, నన్ను చంప గోరుచున్నావు. ఓ మూర్ఖా! కావుననే, నేను వజ్రమును పోలిన గదతో నిన్ను సంహరించగలను.

తర్హ్యనృణ్యముపైమ్యజ్ఞ మిత్రాణాం మిత్రవత్సలః ।
బంధురూపమరిం హత్వా వ్యాధిం దేహచరం యథా ॥ 6

అజ్ఞ= ఓ అజ్ఞానీ!, మిత్రవత్సలః= మిత్రులయందు గొప్ప ప్రేమ గల నేను, దేహచరమ్= దేహమునందు సంచరించే, వ్యాధిం యథా= వ్యాధిని వలె, బంధురూపమ్= బంధువు రూపములోనున్న, అరిమ్= శత్రువగు నిన్ను, హత్వా= సంహరించి, అర్హి= అప్పుడు, మిత్రాణామ్= మిత్రుల యొక్క, ఆనృణ్యమ్= ఋణమునుండి విముక్తిని, ఉపైమి= పొందెదను.

ఓ అజ్ఞానీ! దేహమునందు సంచరించే వ్యాధి వలె, నీవు బంధు రూపములోనున్న శత్రువు. మిత్రులయందు నాకు ప్రీతి మెండు. నేను నిన్ను సంహరించి, ఆ విధముగా మిత్రుల ఋణమును తీర్చుకొనెదను.

ఏవం రూక్షైస్తుదన్ వాక్యైః కృష్ణం తోత్త్రైరివ ద్విపమ్ ।
గదయాతాడయన్మూర్ధ్ని సింహవద్వ్యనదచ్చ సః ॥ 7

సః= ఆతడు, ఏవమ్= ఈ విధముగా, కృష్ణమ్= శ్రీకృష్ణుని, తోత్త్రైః = అంకుశము మొదలగువాటితో, ద్విపం ఇవ= ఏనుగును వలె, రూక్షైః = పరుషములైన, వాక్యైః= వచనములతో, తుదన్= బాధ పెట్టుచున్న వాడై, మూర్ధ్ని= తలపై, గదయా= గదతో, అతాడయత్= కొట్టెను, చ= మరియు, సింహవత్= సింహము వలె, వ్యనదత్= నాదము చేసెను.

ఆతడీ విధముగా శ్రీకృష్ణుని పరుషవచనములతో, అంకుశము మొదలగువాటితో ఏనుగును వలె, బాధపెడుతూ తలపై గదతో కొట్టి సింహము వలె నాదమును కూడ చేసెను.

గదయాఽభిహతోఽప్యాజౌ న చచాల యదూద్వహః ।
కృష్ణోఽపి తమహన్ గుర్వ్యా కౌమోదక్యా స్తనాంతరే ॥ 8

ఆజౌ= యుద్ధమునందు, గదయా= గదచే, అభిహతః అపి= కొట్టబడినవాడే అయినా, యదు-ఉద్వహః= యదువంశశ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడు, న చచాల= చలించలేదు, కృష్ణః అపి= శ్రీకృష్ణుడు కూడ, తమ్= వానిని, గుర్వ్యా= బరువైన, కౌమోదక్యా= కౌమోదకీ గదతో, స్తన-అంతరే= వక్షఃస్థలముపై, అహన్= కొట్టెను.

యదువంశశ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడు యుద్ధములో గదచే కొట్టబడి-ననూ చలించకుండా, బరువైన కౌమోదకీ గదతో వానిని వక్షఃస్థలముపై కొట్టెను.

గదానిర్భిన్నహృదయ ఉద్వమన్ రుధిరం ముఖాత్ ।
ప్రసార్య కేశబాహ్వంఘ్రీన్ ధరణ్యాం న్యపతద్వ్యసుః ॥ 9

గదానిర్భిన్నహృదయః= గదచే పగులగొట్టబడిన హృదయము గల దంతవక్త్రుడు, ముఖాత్= నోటినుండి, రుధిరమ్= రక్తమును, ఉద్వమన్= పైకి గ్రక్కుచున్నవాడై, కేశబాహు-అంఘ్రీన్= జుట్టును చేతులను కాళ్లను, ప్రసార్య= చాపి, వి-అసుః= పోయిన ప్రాణములు గలవాడై, ధరణ్యామ్= నేలపై, న్యపతత్= పడెను.

దంతవక్త్రుని హృదయము గద దెబ్బకు పగిలి ఆతడు నోటిగుండా రక్తమును గ్రక్కుతూ జుట్టు విరబోసుకొని, చేతులను కాళ్లను చాచి నేలపై పడి మరణించెను.

తతస్సూక్ష్మతరం జ్యోతిః కృష్ణమావిశదద్భుతమ్ ।
పశ్యతాం సర్వభూతానాం యథా చైద్యవధే నృప ॥ 10

నృప= ఓ రాజా!, తతః= తరువాత, సూక్ష్మతరమ్= మిక్కిలి సూక్ష్మమైనట్టియు, అద్భుతమ్= అద్భుతమైన, జ్యోతిః= తేజస్సు, సర్వభూతానామ్= సకలప్రాణులు, పశ్యతామ్= చూచుచుండగా, చైద్యవధే యథా= చేదిరాజగు శిశుపాలుని వధయందు వలె, కృష్ణమ్= శ్రీకృష్ణుని, ఆవిశత్= ప్రవేశించెను.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత మిక్కిలి సూక్ష్మమైన అద్భుతతేజస్సు, చేదిరాజగు శిశుపాలుని వధ సందర్భములో వలెనే, సకలప్రాణులు చూచుచుండగా శ్రీకృష్ణునియందు ప్రవేశించెను.

విదూరథస్తు తద్భ్రాతా భ్రాతృశోకపరిప్లుతః ।
ఆగచ్ఛదసిచర్మభ్యాముచ్ఛ్వసంస్తజ్జిఘాంసయా ॥ 11

తద్-భ్రాతా= వాని సోదరుడు, విదూరథః తు= విదూరథుడైతే, భ్రాతృ శోకపరిప్లుతః= సోదరుని గురించి శోకముచే ముంచెత్తబడినవాడై, ఉచ్ఛ్వసన్= నిట్టూర్పులు విడుస్తున్నవాడై, తద్-జిఘాంసయా= ఆ శ్రీకృష్ణుని చంపాలనే కోరికతో, అసిచర్మభ్యామ్= కత్తి డాలుతో, ఆగచ్ఛత్= వచ్చెను.

వాని సోదరుడు విదూరథుడు. ఆతడు తన సోదరుని వధచే శోకసముద్రములో మునిగిపోయెను. ఆతడు కత్తి డాలు పట్టుకొని నిట్టూర్పులు విడుస్తూ శ్రీకృష్ణుని వధించాలనే కోరికతో వచ్చెను.

తస్య చాపతతః కృష్ణశ్చక్రేణ క్షురనేమినా ।
శిరో జహార రాజేంద్ర సకిరీటం సకుండలమ్ ॥ 12

రాజ-ఇంద్ర= ఓ మహారాజా!, కృష్ణః= శ్రీకృష్ణుడు, ఆపతతః= మీదకు వచ్చుచున్న, తస్య= వానియొక్క, సకిరీటమ్= కిరీటముతో

కూడినట్టియు, సకుండలమ్= కుండలములతో కూడిన, శిరః చ= తలను కూడ, క్షురనేమినా= వాడియైన ధార గల, చక్రేణ= చక్రముతో, జహార= ఊడగొట్టెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ విదూరథుడు కుండలములను, కిరీటమును దాల్చి శ్రీకృష్ణుడి మీదకు వచ్చుచుండగా, ఆయన పదునైన ధారగల చక్రముతో వాని తలను కూడ నరికివేసెను.

ఏవం సౌభం చ శాల్వం చ దంతవక్త్రం సహానుజమ్ ।
హత్వా దుర్విషహాన్యైరీడితస్సురమానవైః ॥ 13

ఏవమ్= ఈ విధముగా, అన్యైః= ఇతరులచే, దుర్విషహాన్= సుతరాము సహించ శక్యము కాని, సౌభమ్= సౌభవిమానమును, శాల్వం చ= శాల్వుని, సహ–అనుజమ్= సోదరునితో కూడిన, దంతవక్త్రం చ= దంతవక్త్రుని కూడ, హత్వా= సంహరించి, సురమానవైః= దేవతలచే మానవులచే, ఈడితః= కొనియాడ బడినవాడు.

సౌభవిమానముతో కూడిన శాల్వుడు, దంతవక్త్రుడు, వాని సోదరుడగు విదూరథుడు అను వీరిని ఇతరులు సుతరాము సహించలేరు. వీరిని సంహరించి శ్రీకృష్ణుడు దేవతల, మానవుల ప్రశంసలనందుకొనెను.

మునిభిస్సిద్ధగంధర్వైర్విద్యాధరమహోరగైః ।
అప్సరోభిః పితృగణైర్యక్షైః కిన్నరచారణైః ॥ 14

ఉపగీయమానవిజయః కుసుమైరభివర్షితః ।
వృతశ్చ వృష్ణిప్రవరైర్వివేశాలంకృతాం పురీమ్ ॥ 15

మునిభిః= మహర్షులచే, సిద్ధగంధర్వైః= సిద్ధులు గంధర్వులచే, విద్యాధరమహా–ఉరగైః= విద్యాధరులు గొప్ప నాగులచే, అప్సరోభిః= అప్సరసలచే, పితృగణైః= పితృదేవతల గణములచే, యక్షైః= యక్షులచే,

కిన్నరచారణైః= కిన్నరులు చారణులచే, ఉపగీయమానవిజయః= కీర్తించబడుచున్న విజయము గల శ్రీకృష్ణుడు, కుసుమైః= పుష్పములచే, అభివర్షితః= వర్షించబడినవాడు, వృష్ణిప్రవరైః చ= యాదవశ్రేష్ఠులచే గూడ, వృతః= చుట్టువారబడినవాడై, అలంకృతామ్= అలంకరించబడిన, పురీమ్= ద్వారకానగరమును, వివేశ= ప్రవేశించెను.

మహర్షులు, సిద్ధులు, గంధర్వులు, విద్యాధరులు, మహోనాగులు, అప్సరసలు, పితృదేవతల గణములు, యక్షులు, కిన్నరులు, చారణులు శ్రీకృష్ణుని విజయమును కీర్తించి పూలను వర్షించిరి. యాదవశ్రేష్ఠులు చుట్టువారి రాగా ఆయన అలంకరించబడిన ద్వారకానగరమును ప్రవేశించెను.

ఏవం యోగేశ్వరః కృష్ణో భగవాన్ జగదీశ్వరః ।
ఈయతే పశుదృష్టీనాం నిర్జితో జయతీతి సః ॥ 16

యోగ-ఈశ్వరః= యోగులకు ప్రభువు, జగద్-ఈశ్వరః= జగత్తునకు పాలకుడు అగు, కృష్ణః భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, పశుదృష్టీనామ్= పశువుల దృష్టివంటి దృష్టి గలవారలకు, నిర్జితః ఇతి= జయించబడినవాడని, ఈయతే= తెలియబడును, సః= ఆయన, జయతి= సర్వోత్కృష్టుడుగా ఉన్నాడు.

శ్రీకృష్ణ భగవానుడు యోగులకు ప్రభువు, జగత్తునకు శాసకుడు. పశువుల వంటి అజ్ఞానుల దృష్టిలో ఆయన జయించబడినాడని కనబడును. కాని, ఆయన సర్వోత్కృష్టుడుగనే యున్నాడు.

శ్రుత్వా యుద్ధోద్యమం రామః కురూణాం సహ పాండవైః ।
తీర్థాభిషేకవ్యాజేన మధ్యస్థః ప్రయయౌ కిల ॥ 17

రామః= బలరాముడు, పాండవైః సహ= పాండవులతో పాటుగా, కురూణామ్= కౌరవుల, యుద్ధ- ఉద్యమమ్= యుద్ధమునకు

సన్నాహమును గురించి, శ్రుత్వా= విని, మధ్యస్థః= మధ్యస్థుడై, తీర్థ-అభిషేకవ్యాజేన= పుణ్యనదులయందు స్నానమనే మిషతో, ప్రయయౌ కిల= పయనించెను గదా!

కౌరవపాండవుల యుద్ధసన్నాహమును గురించి విని బలరాముడు ఉదాసీనుడుగా నుండెను. ఆయన పుణ్యనదులయందు స్నానమనే మిషతో పయనమయ్యెను.

స్నాత్వా ప్రభాసే సంతర్ప్య దేవర్షిపితృమానవాన్ ।
సరస్వతీం ప్రతిస్రోతం యయౌ బ్రాహ్మణసంవృతః ॥ 18

బ్రాహ్మణసంవృతః= బ్రాహ్మణులతో కూడియున్న బలరాముడు, ప్రభాసే= ప్రభాసక్షేత్రమునందు, స్నాత్వా= స్నానము చేసి, దేవ-ఋషి పితృమానవాన్= దేవతలు మహర్షులు పితృదేవతలు మానవులను, సంతర్ప్య= తృప్తి కలిగించి, ప్రతిస్రోతమ్= ప్రవాహమునకభిముఖముగా, సరస్వతీమ్= సరస్వతీనదిని గురించి, యయౌ= వెళ్లెను.

బలరాముడు బ్రాహ్మణులతో కూడి ప్రభాసక్షేత్రములో స్నానము చేసి, దేవతలకు పితృదేవతలకు మహర్షులకు తర్పణములనిచ్చి, జనులకు భోజనాదులచే తృప్తిని కలిగించెను. తరువాత ఆయన ప్రవాహమునకు అభిముఖముగా సరస్వతీనది ఉద్గమస్థానమునకు వెళ్లెను.

పృథూదకం బిందుసరస్త్రితకూపం సుదర్శనమ్ ।
విశాలం బ్రహ్మతీర్థం చ చక్రం ప్రాచీం సరస్వతీమ్ ॥ 19

పృథు-ఉదకమ్= పృథూదకమును, బిందుసరః= బిందుసరస్సును, త్రితకూపమ్= త్రితకూపమును, సుదర్శనమ్= సుదర్శనతీర్థమును, విశాలమ్= విశాలతీర్థమును, బ్రహ్మతీర్థమ్= బ్రహ్మతీర్థమును, చక్రం చ= చక్రతీర్థమును, ప్రాచీమ్= తూర్పువైపు ప్రవహించే, సరస్వతీమ్= సరస్వతీనదిని గురించి (వెళ్లెను).

ఆయన పృథూదకము, బిందుసరస్సు, త్రితకూపము, సుదర్శన తీర్థము, విశాలతీర్థము, బ్రహ్మతీర్థము, చక్రతీర్థము, తూర్పుగా ప్రవహించే సరస్వతీనది అనే తీర్థములను సందర్శించెను.

యమునామను యాన్యేవ గంగామను చ భారత ।
జగామ నైమిషం యత్ర ఋషయస్సత్రమాసతే ॥ 20

భారత= భరతవంశీయుడవగు ఓ రాజా!, యమునాం అను= యమునానదీతీరమునందు, గంగాం అను చ= గంగానదీతీరమునందు, యాని ఏవ= ఏ క్షేత్రములు గలవో వాటిని, నైమిషం చ= నైమిషక్షేత్రమును గురించి కూడ, జగామ= వెళ్లెను, యత్ర= ఎక్కడనైతే, ఋషయః= మహర్షులు, సత్రమ్= సత్రయాగమును, ఆసతే= అనుష్ఠించుచున్నారో.

భరతవంశీయుడవగు పరీక్షిన్మహారాజా! యమునాగంగానదుల తీరమునందలి క్షేత్రములను, నైమిషక్షేత్రమును కూడ బలరాముడు దర్శించెను. నైమిషములో అప్పుడు మహర్షులు సత్రయాగమును చేయుచుండిరి.

తమాగతమభిప్రేత్య మునయో దీర్ఘసత్రిణః ।
అభినంద్య యథాన్యాయం ప్రణమ్యోత్థాయ చార్చయన్ ॥ 21

దీర్ఘసత్రిణః= దీర్ఘకాలము చేసే సత్రయాగమును చేయుచున్న, మునయః= మహర్షులు, ఆగతమ్= విచ్చేసిన, తమ్= ఆ బలరాముని గురించి, అభిప్రేత్య= తెలుసుకొని, ఉత్థాయ= లేచి, ప్రణమ్య= ప్రణమిల్లి, అభినంద్య= అభినందించి, యథాన్యాయమ్= సముచితముగా, ఆర్చయన్ చ= పూజను కూడ చేసిరి.

దీర్ఘమగు సత్రయాగమును చేయుచున్న మహర్షులు ఆ బలరాముడు వచ్చినాడని తెలిసి లేచి నమస్కరించి వచ్చినందులకు అభినందించి ఆయనకు యథోచితమగు సత్కారమును కూడ చేసిరి.

సోఽర్చితస్సపరీవారః కృతాసనపరిగ్రహః ।
రోమహర్షణమాసీనం మహర్షేశ్శిష్యమైక్షత ॥ 22

సపరీవారః= పరిజనులతో కూడిన, సః= ఆ బలరాముడు, అర్చితః = పూజించబడినవాడు, కృత– ఆసనపరిగ్రహః= చేయబడిన ఆసన–స్వీకారము గలవాడు, ఆసీనమ్= కూర్చున్నట్టియు, మహర్షేః= వ్యాసమహర్షి యొక్క, శిష్యమ్= శిష్యుడైన, రోమహర్షణమ్= రోమహర్షణుని, ఐక్షత= చూచెను.

పరిజనులతో కూడియున్న ఆ బలరాముడు సత్కారములనందుకొని ఆసనముపై కూర్చుండెను. అపుడు వ్యాసమహర్షి శిష్యుడగు రోమ–హర్షణుడు కూర్చుని యుండగా ఆయన చూచెను.

అప్రత్యుత్థాయినం సూతమకృతప్రహ్వణాంజలిమ్ ।
అధ్యాసీనం చ తాన్ విప్రాంశ్చుకోపోద్వీక్ష్య మాధవః ॥ 23

అప్రతి–ఉత్థాయినమ్= లేచి ఎదురేగనట్టియు, అకృతప్రహ్వణ–అంజలిమ్= చేతులొగ్గి నమస్కరించ నట్టియు, తాన్= ఆ, విప్రాన్= వేదవేత్తలనుద్దేశించి, అధి–ఆసీనం చ= ఎత్తైన ఆసనముపై కూడ కూర్చున్న, సూతమ్= సూతజాతికి చెందిన ఆయనను, ఉద్వీక్ష్య= చూచి, చుకోప= కోపించెను.

సూతజాతికి చెందిన రోమహర్షణుడు లేచి ఎదురేగలేదు, చేతులొగ్గి నమస్కరించలేదు. పైగా, ఆయన ఆ వేదవేత్తలకంటె ఎత్తైన ఆసనముపై కూర్చుండెను. ఆయనను చూచి బలరాముడు కోపించెను.

కస్మాదసావిమాన్ విప్రానధ్యాస్తే ప్రతిలోమజః ।
ధర్మపాలాంస్తథైవాస్మాన్ వధమర్హతి దుర్మతిః ॥ 24

ప్రతిలోమజుఁ= అశాస్త్రీయమైన కలయిక వలన పుట్టిన, అసౌ= ఈతడు, ఇమాన్= ఈ, ధర్మపాలాన్= ధర్మమును పాలించే, విప్రాన్= వేదవేత్తలను, తథా= అదే విధముగా, అస్మాన్ ఏవ= మమ్ములను కూడ ఉద్దేశించి, కస్మాత్= ఎందువలన, అధి-ఆస్తే= ఎత్తైన ఆసనము నధిష్ఠించినాడు?, దుర్మతిఁ= దుర్బుద్ధి, వధమ్= వధను, అర్హతి= తగును.

అశాస్త్రీయమగు కలయికచే పుట్టిన ఈ దుర్బుద్ధి ధర్మరక్షకులగు ఈ వేదవేత్తలకంటె, మాకంటె కూడ ఎత్తైన ఆసనముపై కూర్చుండుటకు కారణమేమి? ఈతడు వధించ దగినవాడు.

ఋషేర్భగవతో భూత్వా శిష్యోఽధీత్య బహూని చ ।
సేతిహాసపురాణాని ధర్మశాస్త్రాణి సర్వశః ॥ 25

భగవతఁ= పూజనీయుడగు, ఋషేఁ= వ్యాసమహర్షియొక్క, శిష్యఁ = శిష్యుడు, భూత్వా= అయి, బహూని= అనేకములగు, స-ఇతిహాస పురాణాని= ఇతిహాసపురాణములతో కూడిన, ధర్మశాస్త్రాణి చ= ధర్మ శాస్త్రములను కూడ, సర్వశఁ= అన్నింటిని, అధీత్య= అధ్యయనము చేసి.

ఈయన పూజనీయుడగు వ్యాసమహర్షికి శిష్యుడై అనేకములగు ధర్మ శాస్త్రములను, ఇతిహాసములను, పురాణములను అన్నింటినీ చదివెను.

అదాంతస్యావినీతస్య వృథా పండితమానినఁ ।
న గుణాయ భవంతి స్మ నటస్యేవాజితాత్మనఁ ॥ 26

అదాంతస్య= ఉద్దండుడైనట్టియు, అవినీతస్య= వినయము లేనట్టియు, వృథా= వ్యర్థముగా, పండితమానినఁ= పండితుడనని విర్రవీగునట్టియు, అజిత-ఆత్మనఁ= జయించబడని మనస్సు గల వీనికి, నటస్య ఇవ= నటునకు వలె, గుణాయ= గునము కొరకు, న భవంతి స్మ= కావు సుమా!

ఈతడు ఉద్దండుడు, వినయము లేనివాడు, వ్యర్థముగా పండితుడనని విర్రవీగువాడు. మనోజయము లేని ఈతని విద్య, నటుని చేష్టలు వలె, అభినయమే గాని, ప్రయోజనకారి కాదు.

ఏతదర్థో హి లోకేఽస్మిన్నవతారో మయా కృతః ।
వధ్యా మే ధర్మధ్వజినస్తే హి పాతకినోఽధికాః ॥ 27

హి= ఏలయన, అస్మిన్= ఈ, లోకే= లోకమునందు, మయా= నాచే, ఏతద్-అర్థః= ఇదియే ప్రయోజనముగా గల, అవతారః= అవతారము, కృతః= స్వీకరించబడినది, ధర్మధ్వజినః= ధర్మాత్ములమని నమ్మజూపు వారు, మే= నాచే, వధ్యాః= వధించబడదగినవారు, హి= ఏలయన, తే= వారు, పాతకినః= పాపమును చేయువారిగా, అధికాః= అధికులు.

ఎందుకంటే, నేనీ లోకములో ఈ దుష్టశిక్షణము కొరకే అవతరించితిని. ధర్మమునాచరించకున్నా పైకి కపటముగా ధర్మమును ప్రకటించువారిని నేను వధించెదను. ఏలయన, వారు అధికపాపులు.

ఏతావదుక్త్వా భగవాన్ నివృత్తోఽసద్వధాదపి ।
భావిత్వాత్తం కుశాగ్రేణ కరస్థేనాహనత్ప్రభుః ॥ 28

ఏతావత్= ఇంతమాత్రమును, ఉక్త్వా= పలికి, ప్రభుః= సర్వసమర్థుడగు, భగవాన్= బలరామ భగవానుడు, అసద్-వధాత్= దుష్టుల వధనుండి, నివృత్తః అపి= విరమించుకున్నవాడే అయినా, భావిత్వాత్= భవితవ్యమగుట వలన, తమ్= ఆయనను, కరస్థేన= చేతియందున్న, కుశ-అగ్రేణ= దర్భ కొనతో, అహనత్= సంహరించెను.

సర్వసమర్థుడగు బలరాముడు తీర్థయాత్ర కారణముగా దుష్ట-సంహారమునుండి విరమించుకొనెను. అయినా, అది అట్లు జరుగవలసి-

యున్నది. కావుననే, ఆయన చేతియందలి దర్భ కొనతో ఆయనను సంహరించెను.

హా హేతి వాదినస్సర్వే మునయః ఖిన్నమానసాః ।
ఊచుస్సంకర్షణం దేవమధర్మస్తే కృతః ప్రభో ॥ 29

సర్వే= అందరు, మునయః= మహర్షులు, ఖిన్నమానసాః= ఖేదముతో కూడిన మనస్సు గలవారై, హా= అయ్యో!, హా= అయ్యో!, ఇతి= అని, వాదినః= పలుకువారు, సంకర్షణం దేవమ్= బలరామ దేవుని ఉద్దేశించి, ఊచుః= పలికిరి, ప్రభో= ఓ ప్రభూ!, తే= నీచే, అధర్మః= అధర్మము, కృతః= చేయబడినది.

మహర్షులందరి మనస్సులు ఖేదముతో నిండెను. వారు అయ్యో! అయ్యో! అంటూ బలరామదేవునితో నిట్లనిరి - ఓ ప్రభూ! నీవు అధర్మమును చేసితివి.

అస్య బ్రహ్మాఽఽసనం దత్తమస్మాభిర్యదునందన ।
ఆయుశ్చాత్మక్లమం తావద్యావత్సత్రం సమాప్యతే ॥ 30

యదునందన= యాదవవంశమును ఆనందింపజేయువాడా!, అస్మాభిః= మాచే, అస్య= వీనికి, యావత్= ఎంతవరకైతే, సత్రమ్= సత్రయాగము, సమాప్యతే= సమాప్తమగునో, తావత్= అంతవరకు, బ్రహ్మ-ఆసనమ్= బ్రాహ్మణుని ఆసనము, ఆత్మ-అక్లమమ్= దేహమునకు శ్రమ కలుగని, ఆయుః చ= ఆయుర్దాయము కూడ, దత్తమ్= ఈయబడినది.

యాదవవంశమునానందింపజేసే ఓ బలరామా! మేము సత్ర-యాగము పూర్తి అయ్యే వరకు ఈయనకు బ్రాహ్మణునకు యోగ్యమైన ఆసనమును, దేహమునకు అలుపు యెరుగని ఆయుష్షును ఇచ్చి-యున్నాము.

అజానతైవాచరితస్త్వయా బ్రహ్మవధో యథా ।
యోగేశ్వరస్య భవతో నామ్నాయోఽపి నియామకః ॥ 31

అజానతా ఏవ= తెలియకుండానే, త్వయా= నీచే, యథా= ఏ విధముగానైతే, బ్రహ్మవధః= బ్రాహ్మణుని వధ యగునో ఆ విధముగా, ఆచరితః= చేయబడినది, యోగ–ఈశ్వరస్య= యోగులకు ప్రభుడవగు, భవతః= నీకు, ఆమ్నాయః అపి= వేదము కూడ, న నియామకః= శాసించునది కాదు.

నీవు తెలియక బ్రాహ్మణవధను చేసినట్లే చేసినావు. యోగులకు ప్రభుడవగు నీవు వేదానుశాసనమునకు అతీతుడవు.

యద్యేతద్బ్రహ్మహత్యాయాః పావనం లోకపావన ।
చరిష్యతి భవాల్లోకసంగ్రహోఽనన్యచోదితః ॥ 32

లోకపావన= జనులను పవిత్రము చేయువాడా!, అనన్యచోదితః = ఇతరముచే శాసించబడని, భవాన్= తమరు, ఏతద్–బ్రహ్మహత్యాయాః = ఈ బ్రహ్మహత్యకు, పావనమ్= శుద్ధి చేసే ప్రాయశ్చిత్తమును, చరిష్యతి యది= చేయబోవువాడవైనచో, లోకసంగ్రహః= జనులకు ఆదర్శము సిద్ధించుట.

జనులను పావనము చేసే ఓ బలరామా! నిన్ను శాసించే ఇతరము లేదు. అయినా, నీవే స్వయముగా ఈ బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తము చేసి శుద్ధి చేసుకున్నచో, అది జనులకు ఆదర్శము అగును.

శ్రీభగవానువాచ ।
కరిష్యే వధనిర్వేశం లోకానుగ్రహకామ్యయా ।
నియమః ప్రథమే కల్పే యావాన్ స తు విధీయతామ్ ॥ 33

శ్రీభగవాన్= శ్రీబలరామ భగవానుడు, ఉవాచ= పలికెను, లోక–అనుగ్రహకామ్యయా= జనులను అనుగ్రహించే కోరికతో, వధనిర్వేశమ్=

వధకు ప్రాయశ్చిత్తమును, కరిష్యే= చేయగలను, ప్రథమే= ముఖ్యమైన, కల్పే= పక్షమునందు, యావాన్= ఎంతటి, నియమః= నియమము గలదో, సః తు= అదియే, విధీయతామ్= నిర్దేశించబడుగాక!

శ్రీబలరామ భగవానుడిట్లు పలికెను...ఆదర్శమును చూపించుట ద్వారా జనులను అనుగ్రహించ వలెననే కోరికతో నేను బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తమును చేయగలను. ముఖ్యపక్షములో ఎట్టి ప్రాయశ్చిత్త నియమము గలదో, దానినే తమరు ఉపదేశించుడు (నేను చేసెదను).

దీర్ఘమాయుర్బతైతస్య సత్త్వమింద్రియమేవ చ ।
ఆశాసితం యత్తద్బ్రూత సాధయే యోగమాయయా ॥ 34

బత= మరియు, ఏతస్య= ఈయనకు, దీర్ఘమ్= దీర్ఘమైన, ఆయుః = ఆయుష్షు, సత్త్వమ్= బలము, ఇంద్రియం ఏవ చ= ఇంద్రియముల పాటవము కూడ, యత్= ఏది, ఆశాసితమ్= అపేక్షించబడినదో, తత్= దానిని, బ్రూత= చెప్పుడు, యోగమాయయా= యోగమాయచే, సాధయే= సంపాదించెదను.

అంతేగాక, ఈయనకు దీర్ఘాయుర్దాయమును, బలమును, ఇంద్రియపాటవమును కూడ దేనిని మీరు అపేక్షించెదరో చెప్పుడు. నేను యోగమాయచే ఆ సర్వమును సంపన్నము చేసెదను.

ఋషయ ఊచుః ।

అస్త్రస్య తవ వీర్యస్య మృత్యోరస్మాకమేవ చ ।
యథా భవేద్వచస్సత్యం తథా రామ విధీయతామ్ ॥ 35

ఋషయః= మహర్షులు, ఊచుః= పలికిరి, రామ= ఓ బలరామా!, తవ= నీ, అస్త్రస్య= దర్భాస్త్రమునకు, వీర్యస్య= ప్రభావమునకు, మృత్యోః = మరణమునకు, యథా= ఏ విధముగానైతే, అస్మాకమ్= మాయొక్క,

వచః ఏవ చ= వచనము కూడ, సత్యమ్= యథార్థము, భవేత్= అగునో, తథా= ఆ విధముగా, విధీయతామ్= చేయబడుగాక!

మహర్షులిట్లు పలికిరి...ఓ బలరామా! నీవు ప్రయోగించిన అస్త్రము, నీ ప్రభావము, ఈతని మరణము వ్యర్థము కారాదు (అస్త్రవీర్యము లమోఘమగుట, మృతుడు తిరిగి బ్రదుకకుండుట). మరియు, మా మాట (ఈయనకు ఇచ్చిన వరము) కూడ సత్యము కావలెను. మీరు ఇట్టి ఉపాయమును చేయుడు.

శ్రీభగవానువాచ ।

ఆత్మా వై పుత్ర ఉత్పన్న ఇతి వేదానుశాసనమ్ ।
తస్మాదస్య భవేద్వక్తా ఆయురింద్రియసత్త్వవాన్ ॥ 36

శ్రీభగవాన్= శ్రీబలరామ భగవానుడు, ఉవాచ= పలికెను, ఆత్మా= తాను, వై= నిశ్చయముగా, పుత్రః= పుత్రుడై, ఉత్పన్నః= పుట్టినవాడు, ఇతి= అని, వేద-అనుసాసనమ్= వేదముయొక్క అనుశాసనము, తస్మాత్= అందువలన, అస్య= ఈయనయొక్క (పుత్రుడు), ఆయుః-ఇంద్రియ-సత్త్వవాన్= ఆయుర్దాయము ఇంద్రియపాటవము శరీరబలము గల, వక్తా= ప్రవక్త, భవేత్= అగును.

శ్రీబలరామ భగవానుడిట్లు చెప్పెను...వ్యక్తి తానే పుత్రుడై పుట్టునని వేదము బోధించుచున్నది. కాబట్టి, ఈయన పుత్రుడు ప్రవక్తయగును. ఆతనికి ఆయుష్షు, ఇంద్రియపాటవము, శరీరబలము ఉండును.

కిం వః కామో మునిశ్రేష్ఠా బ్రూతాహం కరవాణ్యథ ।
అజానతస్త్వపచితిం యథా మే చింత్యతాం బుధాః ॥ 37

మునిశ్రేష్ఠాః= ఓ గొప్ప మహర్షులారా!, వః= మీకు, కిమ్= దేనిని గురించి, కామః= కోరిక?, బ్రూత= చెప్పుడు, అహమ్= నేను, అథ=

వెంటనే, కరవాణి= చేసెదను, బుధాః= ఓ విద్వాంసులారా!, అపచితిం తు= ప్రాయశ్చిత్తమును గురించియైతే, అజానతః= తెలియని, మే= నాకు, యథా= యథార్థముగా, చింత్యతామ్= విచారించబడుగాక!

ఓ మహర్షులారా! మీరు గొప్ప విద్వాంసులు. మీ కోరిక యేమియో చెప్పుడు. నేను వెంటనే తీర్చెదను. నాకు ప్రాయశ్చిత్తము గురించి తెలియదు. మీరు విచారణ చేసి యథార్థమగు ప్రాయశ్చిత్తమును చెప్పుడు.

ఋషయ ఊచుః ।

ఇల్వలస్య సుతో ఘోరో బల్వలో నామ దానవః ।
స దూషయతి నస్సత్రమేత్య పర్వణి పర్వణి ॥ 38

ఋషయః= మహర్షులు, ఊచుః= పలికిరి, ఇల్వలస్య= ఇల్వలుని పుత్రుడు, ఘోరః= భయంకరుడు, బల్వలః నామ= బల్వలుడని ప్రసిద్ధి గాంచినవాడు, సః= ఆ, దానవః= రాక్షసుడు, పర్వణి పర్వణి= ప్రతి పర్వదినము (పూర్ణిమ, అమావాస్య) నాడు, ఏత్య= వచ్చి, సత్రమ్= సత్రయాగమును, దూషయతి= చెడగొట్టుచున్నాడు.

మహర్షులు ఇట్లు చెప్పిరి...ఇల్వలుని పుత్రుడు బల్వలుడని ప్రసిద్ధి గాంచెను. ఆ భయంకరుడగు రాక్షసుడు ప్రతి పూర్ణిమకు, అమావాస్యకు వచ్చి సత్రయాగమును చెడగొట్టుచున్నాడు.

తం పాపం జహి దాశార్హ తన్నశ్శుశ్రూషణం పరమ్ ।
పూయశోణితవిణ్మూత్రసురామాంసాభివర్షిణమ్ ॥ 39

దాశార్హ= దశార్హవంశీయుడవగు ఓ బలరామా!, పూయశోణితవిట్-మూత్రసురామాంస-అభివర్షిణమ్= చీము రక్తము మలము మూత్రము మద్యము మాంసములను వర్షింపజేసే, తమ్= ఆ, పాపమ్= పాపిని, జహి= సంహరించుము, తత్= అది, నః= మాకు, పరమ్= గొప్ప, శుశ్రూషణమ్= సేవ.

దశార్ణవంశీయుడవగు ఓ బలరామా! ఆ పాపి చీము, రక్తము, మలమూత్రములు, మద్యమాంసములను (అగ్నియందు) వర్షింప-జేయును. వానిని నీవు వధించుము. అదియే మాకు గొప్ప సేవ కాగలదు.

తతశ్చ భారతం వర్షం పరీత్య సుసమాహితః ।
చరిత్వా ద్వాదశ మాసాంస్తీర్థస్నాయీ విశుద్ధ్యసే ॥ 40

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే అష్టసప్తతితమోఽధ్యాయః ॥

తతః= తరువాత, సుసమాహితః= మిక్కిలి ఏకాగ్రమగు చిత్తము గలవాడవై, ద్వాదశ= పన్నెండు, మాసాన్= మాసములను, తీర్థస్నాయీ= తీర్థములయందు స్నానము చేయువాడవై, భారతం వర్షమ్= భరతఖండ-మును, పరీత్య= పరిక్రమణము చేసి, చరిత్వా= సంచారము చేసి, విశుద్ధ్యసే= శుద్ధిని పొందగలవు.

తరువాత నీవు మిక్కిలి ఏకాగ్రమగు చిత్తముతో పన్నెండు మాసములు నిరంతరముగా తీర్థములయందు స్నానమును చేస్తూ సంచరించుము. భారతఖండమును పరిక్రమణ చేసి నీవు శుద్ధిని పొందగలవు.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
దంతవక్త్ర విదూరథుల ఉద్ధారమును వర్ణించే
డెబ్బది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (78).

* * *

అథ ఏకోనాశీతితమోఽధ్యాయః

బల్వలుని ఉద్ధారము - బలరాముని తీర్థయాత్ర

శ్రీశుక ఉవాచ ।

తతః పర్వణ్యుపావృత్తే ప్రచండః పాంసువర్షణః ।
భీమో వాయురభూద్రాజన్ పూయగంధస్తు సర్వశః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, తతః= తరువాత, పర్వణి= పర్వదినము, ఉపావృత్తే= రాగా, ప్రచండః = ప్రచండమైనది, పాంసువర్షణః= దుమ్మును వర్షించునది, భీమః= భయమును గొల్పునది, వాయుః= గాలి, అభూత్= కలిగెను, సర్వశః= అంతటా, పూయగంధః తు= దుర్గంధము కూడ.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! తరువాత పర్వదినము రాగానే ప్రచండమైన వాయువు వీచి భయమును గొల్పెను. అంతటా దుమ్ము వర్షిస్తూ, దుర్గంధము కూడ నిండెను.

తతోఽమేధ్యమయం వర్షం బల్వలేన వినిర్మితమ్ ।
అభవద్యజ్ఞశాలాయాం సోఽన్వదృశ్యత శూలధృక్ ॥ 2

తతః= తరువాత, యజ్ఞశాలాయామ్= యజ్ఞశాలయందు, బల్వలేన= బల్వలునిచే, వినిర్మితమ్= నిర్మించబడిన, అమేధ్యమయమ్= మలముతో నిండిన, వర్షమ్= వర్షము, అభవత్= కలిగెను, శూలధృక్= శూలమును దాల్చిన, సః= ఆతడు, అను= తరువాత, అదృశ్యత= కనబడెను.

తరువాత బల్వలుడు యజ్ఞశాలలో మలముతో నిండిన వర్షమును కురిపించెను. వెంటనే శూలమును దాల్చి ఆతడు కూడ కానవచ్చెను.

తం విలోక్య బృహత్కాయం భిన్నాంజనచయోపమమ్ ।
తప్తతామ్రశిఖాశ్మశ్రుం దంష్ట్రోగ్రభ్రుకుటీముఖమ్ ॥ 3

బృహత్-కాయమ్= పెద్ద దేహము కలిగినట్టియు, భిన్న-అంజనచయ-ఉపమమ్= దట్టమైన కాటుక ప్రోగును పోలినట్టియు, తప్తతామ్రశిఖాశ్మశ్రుమ్= పుటము పెట్టిన రాగివంటి జుట్టు గడ్డము మీసములు కలిగినట్టియు, దంష్ట్రా-ఉగ్రభ్రుకుటీముఖమ్= కోరలతో భయంకరమైన కనుబొమలతో కూడిన ముఖము కలిగిన, తమ్= వానిని, విలోక్య= చూచి--.

ఆ బల్వలుడు దట్టమైన కాటుక ప్రోగును పోలిన పెద్ద దేహమును కలిగియుండెను. ఆతని జుట్టు, గెడ్డము, మీసములు పుటము పెట్టిన రాగివలె నుండెను. ఆతని ముఖము కోరలతో, కనుబొమలతో భయమును గొల్పెను. బలరాముడాతనిని చూచెను.

సస్మార ముసలం రామః పరసైన్యవిదారణమ్ ।
హలం చ దైత్యదమనం తే తూర్ణముపతస్థతుః ॥ 4

రామః= బలరాముడు, పరసైన్యవిదారణమ్= శత్రుసైన్యమును ఛిన్నాభిన్నము చేసే, ముసలమ్= రోకలిని, దైత్యదమనమ్= రాక్షసులను నియంత్రించే, హలం చ= నాగలిని కూడ, సస్మార= స్మరించెను, తే= అవి రెండు, తూర్ణమ్= శీఘ్రముగా, ఉపతస్థతుః= వచ్చి చేరినవి.

బలరాముడు శత్రుసైన్యమును ఛిన్నాభిన్నము చేసే ముసలమును, రాక్షసులను అదుపులో పెట్టే నాగలిని కూడ స్మరించగానే, అవి రెండు శీఘ్రముగా వచ్చి చేరినవి.

తమాకృష్య హలాగ్రేణ బల్వలం గగనేచరమ్ ।
ముసలేనాహనత్క్రుద్ధో మూర్ధ్ని బ్రహ్మద్రుహం బలః ॥ 5

క్రుద్ధః= కోపించిన, బలః= బలరాముడు, గగనేచరమ్= ఆకాశము నందు సంచరించునట్టియు, బ్రహ్మద్రుహమ్= బ్రాహ్మణులకు ద్రోహమును

చేసే, తమ్= ఆ, బల్వలమ్= బల్వలుని, హల-అగ్రేణ= నాగేటి చాలుతో, ఆకృష్య= లాగి, ముసలేన= రోకలితో, మూర్ధ్ని= తలపై, అహనత్= మోదెను.

బలరాముడు కోపించి, ఆకసములో సంచరిస్తూ బ్రాహ్మణులకు ద్రోహమును చేసే ఆ బల్వలుని నాగేటి చాలుతో లాగి, రోకలితో తలపై మోదెను.

సోఽపతద్భువి నిర్భిన్నలలాటిఽసృక్ సముత్సృజన్ ।
ముంచన్నార్తస్వరం శైలో యథా వజ్రహతోఽరుణః ॥ 6

నిర్భిన్నలలాటః= పగిలిన నుదురు గల, సః= ఆ బల్వలుడు, అసృక్= రక్తమును, సముత్సృజన్= అధికముగా విడిచిపెట్టుచున్నవాడై, అరుణః= ఎర్రనివాడై, ఆర్తస్వరమ్= ఆక్రోశధ్వనిని, ముంచన్= విడుచు-చున్నవాడై, వజ్రహతః= వజ్రముచే కొట్టబడిన, శైలః యథా= పర్వతము వలె, భువి= నేలపై, అపతత్= పడెను.

ఆ బల్వలుని నుదురు పగిలి రక్తము అధికముగా స్రవించి దేహమంతా ఎర్రనయ్యెను. ఆతడు ఆర్తనాదమును చేస్తూ, వజ్రముచే కొట్టబడిన పర్వతము వలె, నేలపై పడిపోయెను.

సంస్తుత్య మునయో రామం ప్రయుజ్యావితథాశిషః ।
అభ్యషించన్ మహాభాగా వృత్రఘ్నం విబుధా యథా ॥ 7

మహాభాగాః= మహాత్ములైన, మునయః= మహర్షులు, రామమ్= బలరాముని, సంస్తుత్య= బాగా కొనియాడి, అవితథ-ఆశిషః= వ్యర్థము కాని ఆశీస్సులను, ప్రయజ్య= ఇచ్చి, విబుధాః= దేవతలు, వృత్రఘ్నం యథా= వృత్రాసురుని వధించిన ఇంద్రుని వలె, అభ్యషించన్= అభిషేకించిరి.

మహాత్ములగు మహర్షులు బలరాముని బాగా కొనియాడి సఫలములయ్యే ఆశీస్సులనిచ్చి, దేవతలు వృత్రాసురుని సంహరించిన ఇంద్రుని వలె, అభిషేకించిరి.

వైజయంతీం దదుర్మాలాం శ్రీధామమ్లానపంకజామ్ ।
రామాయ వాససీ దివ్యే దివ్యాన్యాభరణాని చ ॥ 8

రామాయ= బలరాముని కృరకు, శ్రీధామ–అమ్లానపంకజామ్= శోభకు నివాసమై వాడని పద్మములు గల, వైజయంతీమ్= పలు రంగుల పుష్పములతో చేసిన, మాలామ్= మాలను, దివ్యే= ప్రకాశించే, వాససీ= వస్త్రముల జతను, దివ్యాని= ప్రకాశించే, ఆభరణాని చ= ఆభరణములను కూడ, దదుః= ఇచ్చిరి.

వారు బలరామునకు శోభకు నిలయమైవాడని పలు రంగుల పద్మములతో చేసిన విజయకరమగు మాలను, ప్రకాశించే జంట వస్త్రములను, ఉజ్జ్వలమైన ఆభరణములను కూడ యిచ్చిరి.

అథ తైరభ్యనుజ్ఞాతః కౌశికీమేత్య బ్రాహ్మణైః ।
స్నాత్వా సరోవరమగాద్యతస్సరయురాస్రవత్ ॥ 9

అథ= తరువాత, తైః= ఆ, బ్రాహ్మణైః= బ్రాహ్మణులచే, అభ్యనుజ్ఞాతః= అనుజ్ఞ ఈయబడిన బలరాముడు, కౌశికీమ్= కౌశికీ నదిని గురించి, ఏత్య= వచ్చి, స్నాత్వా= స్నానము చేసి, యతః= దేనినుండైతే, సరయుః= సరయూనది, ఆస్రవత్= ఉద్భవించినదో ఆ, సరోవరమ్= సరస్సును గురించి, అగాత్= వెళ్లెను.

తరువాత బలరాముడు ఆ బ్రాహ్మణుల అనుజ్ఞను పొంది కౌశికీ నదికి వచ్చి స్నానము చేసి, సరయూనది ఉద్భవించిన సరస్సునకు వెళ్లెను.

అనుస్రోతేన సరయూం ప్రయాగముపగమ్య సః ।
స్నాత్వా సంతర్ప్య దేవాదీన్ జగామ పులహాశ్రమమ్ ॥ 10

సః= ఆయన, సరయూం అనుస్రోతేన= సరయూనది ప్రవాహము వెంబడి దారిచే, ప్రయాగమ్= ప్రయాగను గురించి, ఉపగమ్య= వెళ్లి, స్నాత్వా= స్నానము చేసి, దేవ-ఆదీన్= దేవతలు మొదలగువారిని, సంతర్ప్య= తర్పణములనిచ్చి, పులహ-ఆశ్రమమ్= పులహ మహర్షి ఆశ్రమమును గురించి, జగామ= వెళ్లెను.

ఆయన సరయూనదీతీరము వెంట ప్రవాహదిశలో పయనించి ప్రయాగను చేరెను. అచట ఆయన స్నానము చేసి, దేవతలు, పితృ-దేవతలు మొదలగువారికి తర్పణములనిచ్చి పులహమహర్షి ఆశ్రమమునకు వెళ్లెను.

గోమతీం గండకీం స్నాత్వా విపాశాం శోణ ఆప్లుతః ।
గయాం గత్వా పితౄనిష్ట్వా గంగాసాగరసంగమే ॥ 11

ఉపస్పృశ్య మహేంద్రాద్రౌ రామం దృష్ట్వాఽభివాద్య చ ।

గోమతీమ్= గోమతీనదిని, గండకీమ్= గండకీనదిని, విపాశామ్= విపాశానదిని, స్నాత్వా= స్నానము చేసి, శోణే= శోణనదమునందు, ఆప్లుతః= స్నానము చేసినవాడై, గయామ్= గయను గురించి, గత్వా= వెళ్లి, పితౄన్= పితృదేవతలను, ఇష్ట్వా= ఆరాధించి, గంగాసాగరసంగమే= గంగ సముద్రములో కలిసిన స్థానమునందు, ఉపస్పృశ్య= స్నానము చేసి, మహా-ఇంద్ర-అద్రౌ= మహేంద్రపర్వతమునందు, రామమ్= పరశురాముని, దృష్ట్వా= చూచి, అభివాద్య చ= నమస్కారమును కూడ చేసి.

బలరాముడు గోమతీ గండకీ విపాశానదులలో మరియు శోణనదమునందు స్నానము చేసెను. తరువాత ఆయన గయ వెళ్లి

పితృదేవతలనారాధించెను. తరువాత ఆయన గంగాసాగర సంగమమునకు వెళ్లి స్నానము చేసి, పరశురాముని దర్శించి ప్రణమిల్లెను.

సప్తగోదావరీం వేణాం పంపాం భీమరథీం తతః ॥ 12

సప్తగోదావరీమ్= సప్తగోదావరిని, వేణామ్= వేణానదిని, పంపామ్= పంపానదిని, తతః= తరువాత, భీమరథీమ్= భీమరథీ నదిని.

తరువాత ఆయన క్రమముగా సప్తగోదావరి, వేణ, పంప, భీమరథీ నదులలో స్నానమును చేసెను.

స్కందం దృష్ట్వా యయౌ రామశ్శ్రీశైలం గిరిశాలయమ్ ।
ద్రవిడేషు మహాపుణ్యం దృష్ట్వాఽద్రిం వేంకటం ప్రభుః ॥ 13

ప్రభుః= సర్వసమర్థుడగు, రామః= బలరాముడు, స్కందమ్= కుమారస్వామిని, దృష్ట్వా= దర్శించి, ద్రవిడేషు= ద్రవిడదేశమునందు, మహాపుణ్యమ్= మిక్కిలి పావనమైన, గిరిశ-ఆలయమ్= కైలాసవాసియగు శివుని ధామమైన, శ్రీశైలమ్= శ్రీశైలమును, వేంకటం అద్రిమ్= వేంకటాద్రిని, దృష్ట్వా= దర్శించి.

సర్వసమర్థుడగు బలరాముడు కుమారస్వామిని దర్శించెను. ద్రవిడదేశములో కైలాసవాసియగు శివుని ధామమైన శ్రీశైలము మిక్కిలి పావనమైనది. ఆయన దానిని, వేంకటాద్రిని దర్శించెను.

కామకోష్ణీం పురీం కాంచీం కావేరీం చ సరిద్వరామ్ ।
శ్రీరంగాఖ్యం మహాపుణ్యం యత్ర సన్నిహితో హరిః ॥ 14

కామకోష్ణీమ్= కామాక్షిని, కాంచీం పురీమ్= కాంచీపురమును, సరిద్-వరామ్= నదులలో గొప్పదియగు, కావేరీం చ= కావేరిని కూడ, శ్రీరంగ-ఆఖ్యమ్= శ్రీరంగమనే పేరు గల, మహాపుణ్యమ్= గొప్ప పుణ్యక్షేత్రమును, యత్ర= ఎక్కడనైతే, హరిః= శ్రీహరి, సన్నిహితః= సన్నిధియో.

ఆయన కామాక్షిని, కాంచీపురమును, నదులలో గొప్పదియగు కావేరిని, శ్రీరంగమనే మహాపుణ్యక్షేత్రమును దర్శించెను. శ్రీరంగములో శ్రీహరి నిత్యసన్నిధియై యుండును.

ఋషభాద్రిం హరేః క్షేత్రం దక్షిణాం మథురాం తథా ।
సాముద్రం సేతుమగమన్మహాపాతకనాశనమ్ ॥ 15

హరేః= శ్రీహరియొక్క, క్షేత్రమ్= క్షేత్రమైన, ఋషభ-అద్రిమ్= ఋషభ పర్వతమును, తథా= అదే విధముగా, దక్షిణాం మథురామ్= దక్షిణ మథురను, మహాపాతకనాశనమ్= మహాపాపములను నశింపజేసే, సాముద్రమ్= సముద్రమునకు చెందిన, సేతుమ్= సేతువును, అగమత్= వెళ్లెను.

ఆయన శ్రీహరి క్షేత్రమగు ఋషభ పర్వతము, దక్షిణ మథుర, మహా పాపములను నశింపజేసే సముద్రమునందలి రామసేతువులకు వెళ్లెను.

తత్రాయుతమదాద్ధేనుర్బ్రాహ్మణేభ్య హలాయుధః ।
కృతమాలాం తామ్రపర్ణీం మలయం చ కులాచలమ్ ॥ 16

తత్ర= అచట, హల-ఆయుధః= నాగలి ఆయుధముగా గల బలరాముడు, బ్రాహ్మణేభ్యః= బ్రాహ్మణుల కొరకు, అయుతమ్= పదివేల, ధేనూః= పాడియావులను, అదాత్= ఇచ్చెను, కృతమాలామ్= కృతమాలా నదిని, తామ్రపర్ణీమ్= తామ్రపర్ణీనదిని, కుల-అచలమ్= కులపర్వతమగు, మలయం చ= మలయమును కూడ.

అచట నాగలి ఆయుధముగా గల బలరాముడు బ్రాహ్మణులకు పది వేల పాడియావులను దానము చేసెను. ఆయన కృతమాల, తామ్రపర్ణి అనే నదులలో స్నానము చేసి మలయమనే కులపర్వతమునకు వెళ్లెను.

తత్రాగస్త్యం సమాసీనం నమస్కృతాభివాద్య చ ।
యోజితస్తేన చాశీర్భిరనుజ్ఞాతో గతోఽర్ణవమ్ ।
దక్షిణం తత్ర కన్యాఽఽఖ్యాం దుర్గాం దేవీం దదర్శ సః। 17

తత్ర= అచట, సమాసీనమ్= చక్కగా కూర్చునియున్న, అగస్త్యమ్= అగస్త్యమహర్షిని, నమస్కృత్య= నమస్కరించి, అభివాద్య చ= అభివాదమును కూడ చేసి, తేన= ఆయనచే, ఆశీర్భిః= ఆశీస్సులచే, యోజితః= కూర్చబడినవాడై, అనుజ్ఞాతః= అనుజ్ఞ ఈయబడినవాడై, దక్షిణం అర్ణవమ్= దక్షిణసముద్రమును గురించి, గతః= వెళ్లినవాడు, సః= ఆయన, తత్ర= అచట, కన్యా-ఆఖ్యామ్= కన్య అనే పేరు గల, దుర్గాం దేవీమ్= దుర్గాదేవిని, దదర్శ= చూచెను.

బలరాముడు ఆ మలయపర్వతముపై నివసించుచున్న అగస్త్యమహర్షికి నమస్కారమును వాచా అభివాదమును కూడ చేసెను. అపుడా మహర్షి ఆయనను ఆశీర్వదించి అనుమతినిచ్చెను. అపుడాయన దక్షిణసముద్రమునకు వెళ్లి, అచట తీరమునందు కన్యాకుమారి అనే పేరు గల దూర్గాదేవిని దర్శించెను.

తతః ఫాల్గునమాసాద్య పంచాప్సరసముత్తమమ్ ।
విష్ణుస్సన్నిహితో యత్ర స్నాత్వాఽస్పర్శద్గవాయుతమ్ ॥ 18

తతః= తరువాత, ఫాల్గునమ్= ఫాల్గునక్షేత్రమును, ఆసాద్య= చేరి, ఉత్తమమ్= ఉత్తమమైన, పంచ-అప్సరసమ్= పంచాప్సరసతీర్థమును, స్నాత్వా= స్నానము చేసి, గవ-ఆయుతమ్= పదివేల గోవులను, అస్పర్శత్= దానము చేసెను, యత్ర= ఎక్కడనైతే, విష్ణుః= శ్రీహరి, సన్నిహితః= సన్నిధియై ఉండునో.

తరువాత ఆయన ఫాల్గున (అనంతశయన) క్షేత్రమును చేరి, పంచాప్సరసతీర్థములో స్నానము చేసి, పది వేల గోవులను దానము చేసెను. అచట శ్రీహరి సర్వదా సన్నిహితుడై యుండును.

తతోఽభివ్రజ్య భగవాన్ కేరలాంస్తు త్రిగర్తకాన్ ।
గోకర్ణాఖ్యం శివక్షేత్రం సాన్నిధ్యం యత్ర ధూర్జటేః ॥ 19

తతః= తరువాత, భగవాన్= బలరామ భగవానుడు, కేరలాన్= కేరళను, త్రిగర్తకాన్= త్రిగర్తదేశమును, అభివ్రజ్య= వెళ్లి, గోకర్ణ-ఆఖ్యమ్= గోకర్ణమనే పేరు గల, శివక్షేత్రమ్= శివక్షేత్రమును, యత్ర= ఎక్కడనైతే, ధూర్జటేః= శివునియొక్క, సాన్నిధ్యమ్= సాన్నిధ్యమో.

తరువాత బలరామ భగవానుడు కేరళ త్రిగర్త ప్రాంతములను చూచి, గోకర్ణమనే శివక్షేత్రమును దర్శించెను. అచట శివుడు సర్వదా సన్నిహితుడై యుండును.

ఆర్యాం ద్వైపాయనీం దృష్ట్వా శూర్పారకమగాద్బలః ।
తాపీం పయోష్ణీం నిర్వింధ్యాముపస్పృశ్యాథ దండకమ్ ॥ 20

బలః= బలరాముడు, ద్వైపాయనీమ్= ద్వీపవాసినియగు, ఆర్యామ్= ఆర్యాదేవిని, దృష్ట్వా= చూచి, శూర్పారకమ్= శూర్పారక క్షేత్రమును గురించి, అగాత్= వెళ్లెను, తాపీమ్= తాపీనదిని, పయోష్ణీమ్= పయోష్ణీనదిని, నిర్వింధ్యామ్= నిర్వింధ్యా నదిని, ఉపస్పృశ్య= స్నానము చేసి, అథ= తరువాత, దండకమ్= దండకారణ్యమును, ప్రవిశ్య= ప్రవేశించి, రేవామ్= నర్మదానదిని గురించి, అగమత్= వెళ్లెను, యత్ర= ఎక్కడనైతే, మాహిష్మతీ పురీ= మాహిష్మతీ నగరము గలదో.

బలరాముడు ద్వీపవాసినియగు దుర్గాదేవిని దర్శించి శూర్పారక క్షేత్రమునకు వెళ్లెను. ఆయన తరువాత తాపీ, పయోష్ణీ, నిర్వింధ్యా నదులలో స్నానము చేసి పిదప దండకారణ్యమును ప్రవేశించెను. అపుడాయన నర్మదానదికి వెళ్లి దాని తీరమునందలి మాహిష్మతీ నగరమును చేసెను.

మనుతీర్థముపస్పృశ్య ప్రభాసం పునరాగమత్ ॥ 21

మనుతీర్థమ్= మనుతీర్థమును, ఉపస్పృశ్య= స్నానము చేసి, పునః = మరల, ప్రభాసమ్= ప్రభాసక్షేత్రమును గురించి, ఆగమత్= వచ్చెను.

ఆయన మనుతీర్థములో స్నానము చేసి మరల ప్రభాసక్షేత్రమునకు వచ్చెను.

శ్రుత్వా ద్విజైః కథ్యమానం కురుపాండవసంయుగే ।
సర్వరాజన్యనిధనం భారం మేనే హృతం భువః ॥ 22

ద్విజైః= బ్రాహ్మణులచే, కథ్యమానమ్= చెప్పబడుచున్న, కురు పాండవసంయుగే= కౌరవపాండవ యుద్ధములో, సర్వరాజన్యనిధనమ్= సకలరాజుల మరణమును గురించి, శ్రుత్వా= విని, భువః= భూమియొక్క, భారమ్= బరువును, హృతమ్= తొలగినదానినిగా, మేనే= తలచెను.

కౌరవపాండవయుద్ధములో చాలమంది రాజులు మరణించినారని బ్రాహ్మణులు చెప్పగా విని, ఆయన బూభారము తగ్గినదని తలచెను.

స భీమదుర్యోధనయో ర్గదాభ్యాం యుధ్యతోర్మృధే ।
వారయిష్యన్ వినశనం జగామ యదునందనః ॥ 23

యదునందనః= యాదవవంశమునానందింపజేసే, సః= ఆ బలరాముడు, మృధే= యుద్ధము నందు, భీమదుర్యోధనయోః= భీముడు దుర్యోధనుడు, గదాభ్యామ్= గదలతో, యుధ్యతోః= యుద్ధము చేయు-చుండగా, వారయిష్యన్= తప్పించబోవువాడై, వినశనమ్= కురుక్షేత్రమును గురించి, జగామ= వెళ్లెను.

యుద్ధములో భీముడు, దుర్యోధనుడు గదలతో యుద్ధము చేయుచుండగా యదువంశనందనుడగు బలరాముడు వారిని ఆపబోవు వాడై కురుక్షేత్రమునకు వెళ్లెను.

యుధిష్ఠిరస్తు తం దృష్ట్వా యమౌ కృష్ణార్జునావపి ।
అభివాద్యాభవంస్తూష్ణీం కిం వివక్షురిహాగతః ॥ 24

యుధిష్ఠిరః తు= ధర్మరాజైతే, యమౌ= కవలలు, కృష్ణ-అర్జునౌ అపి= శ్రీకృష్ణార్జునులు కూడ, తమ్= ఆయనను, దృష్ట్వా= చూచి, అభివాద్య= నమస్కరించి, తూష్ణీం అభవన్= మిన్నకుండిరి, కిమ్= దేనిని, వివక్షుఃఁ= చెప్పగోరువాడై, ఇహ= ఇచటకు, ఆగతఃఁ= వచ్చినవాడు?

ధర్మరాజు, నకులసహదేవులు, శ్రీకృష్ణార్జునులు ఆయనను చూచి నమస్కరించి మిన్నకుండిరి. ఈయన ఇచటకు ఏమి చెప్పగోరి వచ్చి-యుండును? (ఈ విషయము వారికి అర్థము కాలేదు).

గదాపాణీ ఉభౌ దృష్ట్వా సంరబ్ధౌ విజయైషిణౌ ।
మండలాని విచిత్రాణి చరంతావిదమబ్రవీత్ ॥ 25

గదాపాణీ= గదలు చేతులయందు గలవారు, సంరబ్ధౌ= కోపముతోనున్నవారు, విజయైషిణౌ= విజయమును కోరువారు, విచిత్రాణి= పలు రకముల, మండలాని= విన్యాసములను, చరంతౌ= నిర్వర్తించుచున్న, ఉభౌ= ఇద్దరిని, దృష్ట్వా= చూచి, ఇదమ్= ఈ మాటను, అబ్రవీత్= పలికెను.

విజయమును కోరే భీమార్జునులిద్దరు కోపముతో గదలను చేతులతో పట్టుకొని పలు రకముల విన్యాసములను చేయుచుండిరి. వారిని చూచి బలరాముడిట్లు పలికెను.

యువాం తుల్యబలౌ వీరౌ హే రాజన్ హే వృకోదర ।
ఏకం ప్రాణాధికం మన్య ఉతైకం శిక్షయాఽధికమ్ ॥ 26

హే రాజన్= ఓ దుర్యోధన మహారాజా!, హే వృకోదర= ఓ భీమసేనా!, యువామ్= మీరిద్దరు, తుల్యబలౌ= సమానమైన బలము గల, వీరౌ= వీరులు, ఏకమ్= ఒకనిని, ప్రాణ-అధికమ్= ప్రాణశక్తిచే అధికునిగా, ఉత ఏకమ్= మరియొకనిని, శిక్షయా= శిక్షణచే, అధికమ్= అధికునిగా, మన్యే= తలచెదను.

ఓ దుర్యోధన మహారాజా! ఓ భీమసేనా! మీరిద్దరు సమానమైన బలము గల వీరులు. మీలో ఒకరు (భీముడు) ప్రాణశక్తిచే, రెండవవాడు శిక్షణచే అధికుడని నా అభిప్రాయము.

తస్మాదేకతరస్యేహ యువయోస్సమవీర్యయోః ।
న లక్ష్యతే జయోఽన్యో వా విరమత్వఫలో రణః ॥ 27

తస్మాత్= అందువలన, సమవీర్యయోః= సమానమైన శక్తి గల, యువయోః= మీ యిద్దరిలో, ఏకతరస్య= ఒకనికి, ఇహ= ఇక్కడ, జయః = విజయము, అన్యః వా= పరాజయము గాని, న లక్ష్యతే= కనబడుటు లేదు, అఫలః= ఫలితము లేని, రణః= యుద్ధము, విరమతు= ఆగిపోవు గాక!

కాబట్టి సమ ఉజ్జీలైన మీ యిద్దరిలో ఒకనికి జయము గాని, పరాజయము గాని కలిగే సూచనలు కానరావు. ఫలితము లేని ఈ యుద్ధమును ఆపివేయుడు.

న తద్వాక్యం జగృహతుర్బద్ధవైరౌ నృపార్థవత్ ।
అనుస్మరంతావన్యోన్యం దురుక్తం దుష్కృతాని చ ॥ 28

నృప= ఓ రాజా!, బద్ధవైరౌ= దృఢమైన వైరము కలిగినట్టియు, అన్యోన్యమ్= పరస్పరము దురుక్తమ్= చెడు మాటను, దుష్కృతాని చ= చెడు క్రియలను కూడ, అనుస్మరంతౌ= గుర్తు చేసుకొనువారు అగు వారిద్దరు, అర్థవత్= అర్థవంతమైన, తత్= ఆ, వాక్యమ్= వచనమును, న జగృహతుః= స్వీకరించలేదు.

ఓ పరీక్షిన్మహారాజా! వారిద్దరు పరస్పరము చేసుకున్న దూషణలను, అపకారములను గుర్తు చేసుకుంటూ దృఢమైన వైరము కలవారగుటచే, బలరాముడు చెప్పిన మాట అర్థవంతమే అయినా, వారు స్వీకరించలేదు.

దిష్టం తదనుమన్వానో రామో ద్వారవతీం యయౌ ।
ఉగ్రసేనాదిభిః ప్రీతైర్జ్ఞాతిభిస్సముపాగతః ॥ 29

తత్= దానిని, దిష్టమ్= ప్రారబ్ధమునుగా, అనుమన్వానః= తలపోయుచున్న, రామః= బలరాముడు, ద్వారవతీమ్= ద్వారకా-నగరమును గురించి, యయౌ= వెళ్లెను, ప్రీతైః= ప్రీతి జెందిన, ఉగ్రసేన-ఆదిభిః= ఉగ్రసేనుడు మొదలైన, జ్ఞాతిభిః= బంధువులతో, సముపాగతః = కలుసుకొనబడినవాడు.

ఆ యుద్ధము ప్రారబ్ధఫలమని తలపోస్తూ బలరాముడు ద్వారకకు వెళ్లెను. ఉగ్రసేనుడు సాంబుడు మొదలగువారాయనను ప్రీతితో స్వాగతించిరి.

తం పునర్నైమిషం ప్రాప్తమృషయోఽయాజయన్ముదా ।
క్వత్వంగం క్రతుభిస్సర్వైర్నివృత్తాఖిలవిగ్రహమ్ ॥ 30

పునః= మరల, నైమిషమ్= నైమిషమును, ప్రాప్తమ్= చేరుకున్న-ట్టియు, క్రతు-అంగమ్= క్రతుస్వరూపుడై నట్టియు, నివృత్త-అఖిలవిగ్రహమ్= తొలగిన సకలకలహములు గల, తమ్= ఆ బలరాముని, ఋషయః= మహర్షులు, ముదా= ఆనందముతో, సర్వైః = సకలములైన, క్రతుభిః అయాజయన్= క్రతువులను చేయించిరి.

యజ్ఞమూర్తియగు బలరాముడు సకలకలహములనుండి నివృత్తుడై మరల నైమిషమును చేరెను. మహర్షులాయనచే ఆనందముగా సకలక్రతువులను చేయించిరి.

తేభ్యో విశుద్ధవిజ్ఞానం భగవాన్ వ్యతరద్విభుః ।
యేనైవాత్మన్యదో విశ్వమాత్మానం విశ్వగం విదుః ॥ 31

విభుః= సర్వసమర్థుడగు, భగవాన్= బలరామ భగవానుడు, తేభ్యః = వారి కొరకు, విశుద్ధవిజ్ఞానమ్= పరిశుద్ధమగు ఆత్మజ్ఞానమును,

వ్యతరత్= ఇచ్చెను, యేన ఏవ= దేనిచే మాత్రమే, అతః= ఈ, విశ్వమ్= జగత్తును, ఆత్మని= తనయందు, ఆత్మానమ్= తనను, విశ్వగమ్= సర్వవ్యాపినిగను, విదుః= తెలుసుకొనిరో.

సర్వసమర్థుడగు బలరామ భగవానుడు వారికి పరిశుద్ధమగు ఆత్మజ్ఞాన మునుపదేశించెను. ఆత్మజ్ఞానముచే మాత్రమే వారీ జగత్తంతా తమయందున్నదని, తాము సకలజగత్తు వ్యాపించి ఉన్నామనియు తెలుసుకొనిరి.

స్వపత్న్యాఽవభృథస్నాతో జ్ఞాతిబంధుసుహృద్వృతః ।
రేజే స్వజ్యోత్స్నయేవేందు స్సువాసాస్సుష్ఠ్వలంకృతః ॥ 32

స్వపత్న్యా= తన ధర్మపత్నితో, అవభృథస్నాతః= అవభృథ-స్నానమును చేసినవాడు, జ్ఞాతిబంధుసుహృద్-వృతః= జ్ఞాతులు బంధువులు మిత్రులచే చుట్టువారబడినవాడు, సువాసాః= మంచి వస్త్రములు గలవాడు, సుష్ఠు= బాగుగా, అలంకృతః= అలంకరించబడిన వాడు అగు బలరాముడు, స్వజ్యోత్స్నయా= తన వెన్నెలతో, ఇందుః ఇవ= చంద్రుడు వలె, రేజే= ప్రకాశించెను.

జ్ఞాతులు, బంధువులు, మిత్రులు చుట్టువారియుండ బలరాముడు తన ధర్మపత్ని (రేవతి) తో గూడి, తన వెన్నెలతో గూడియున్న చంద్రుడు వలె ప్రకాశిస్తూ, అవభృథస్నానమును చేసెను. అపుడాయన మంచి వస్త్రములను దాల్చి చక్కగా అలంకరించుకొనెను.

ఈదృగ్విధాన్యసంఖ్యాని బలస్య బలశాలినః ।
అనంతస్యాప్రమేయస్య మాయామర్త్యస్య సంతి హి ॥ 33

బలశాలినః= బలముతో శోభిల్లునట్టియు, అనంతస్య= కాలాతీతుడైనట్టియు, అప్రమేయస్య= ప్రమాణములకు గోచరుడు కానట్టియు, మాయామర్త్యస్య= మాయచే మానవుడైన, బలస్య=

బలరాముని, ఈదృగ్-విధాని= ఇటువంటి, అసంఖ్యాని= లెక్కలేనన్ని, సంతి హి= కలవు సుమా!

అనంతము, ఇంద్రియగోచరము కానిది అగు పరబ్రహ్మయే మాయాశక్తిచే మానవరూపమును దాల్చి బలశాలియగు బలరాముడైనది. ఆయనయొక్క ఇటువంటి చరితములు లెక్కలేనన్ని గలవు.

యోఽనుస్మరేత రామస్య కర్మాణ్యద్భుతకర్మణః ।
సాయం ప్రాతరనంతస్య విష్ణోస్స దయితో భవేత్ ॥ 34

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకోనాశీతితమోఽధ్యాయః ॥

అద్భుతకర్మణః= అచ్చెరువును గొలిపే లీలలు కలిగినట్టియు, అనంతస్య= అనంతుడైన, రామస్య= బలరాముని యొక్క, కర్మాణి= లీలలను, యః= ఎవడైతే, సాయమ్= సాయంకాలము, ప్రాతః= ఉదయము, అనుస్మరేత= స్మరించునో, సః= అట్టివాడు, విష్ణోః= శ్రీహరికి, దయితః= ప్రీతిపాత్రుడు, భవేత్= అగును.

బలరాముడై అచ్చెరువును గొలిపే అనంతుని లీలలను ఎవడైతే ఉదయము, సాయంకాలము స్మరించునో, అట్టివాడు శ్రీహరికి ప్రీతి-పాత్రుడగును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
బల్వలుని ఉద్ధారమును, బలరాముని తీర్థయాత్రను వర్ణించే
డెబ్బది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (79).

* * *

అథ అశీతితమోఽధ్యాయః

కుచేలోపాఖ్యానము – శ్రీకృష్ణుడు సుదాముని స్వాగతించుట

రాజోవాచ ।

భగవన్ యాని చాన్యాని ముకుందస్య మహోఽఽత్మనః ।
వీర్యాణ్యనంతవీర్యస్య శ్రోతుమిచ్ఛామహే ప్రభో ॥ 1

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, భగవన్= ఓ పూజనీయా!, ప్రభో= ఓ ప్రభూ!, మహాత్మనః= మహాత్ముడైనట్టియు, అనంతవీర్యస్య= అనంతశక్తిసంపన్నుడైనట్టియు, ముకుందస్య= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ భగవానునియొక్క, యాని= ఏ, అన్యాని= ఇతరములైన, వీర్యాణి= మహిమను సూచించే లీలలు గలవో వాటిని, శ్రోతుమ్= వినుటకు, ఇచ్ఛామహే= కోరుచున్నాము.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...పూజనీయుడవగు ఓ మహర్షీ! మోక్షప్రదాతయగు శ్రీకృష్ణుడు అనంతమైన శక్తి గల మహాత్ముడు. ఓ ప్రభూ! ఆయన మహిమను సూచించే లీలలు ఇంకనూ ఏవి గలవో, వాటిని మేము వినగోరుచున్నాము.

కో ను శ్రుత్వాఽసకృద్బ్రహ్మన్నుత్తమశ్లోకసత్కథాః ।
విరమేత విశేషజ్ఞో విషణ్ణః కామమార్గణైః ॥ 2

బ్రహ్మన్= ఓ మహర్షీ!, విశేషజ్ఞః= వివేకము తెలిసినవాడు, కామమార్గణైః= కామనలనే బాణములచే, విషణ్ణః= విషాదమును పొందినవాడు, కః ను= ఎవ్వాడు, ఉత్తమశ్లోకసత్-కథాః= పవిత్రకీర్తియగు శ్రీహరియొక్క కల్యాణకరములగు గాథలను, అసకృత్= పలుమార్లు, శ్రుత్వా= విని, విరమేత= విరమించును?

ఓ మహర్షీ! కామనలచే బాణములచే విషాదమును పొంది వివేకమును తెలుసుకున్న ఎవ్వాడు శ్రీహరియొక్క కల్యాణకరగాథలనుండి

విరమించును? (ఎవ్వడైననూ విరమించడు). అట్టివాడు పవిత్రకీర్తియగు శ్రీహరియొక్క గాథలను పలుమార్లు వినును.

సా వాగ్యయా తస్య గుణాన్ గృణీతే కరౌ తత్కర్మకరౌ మనశ్చ ।
స్మరేద్వసంతం స్థిరజంగమేషు శృణోతి తత్పుణ్యకథాస్స కర్ణః ॥ 3

సా= అది, వాక్= వాగింద్రియము, యయా= దేనిచేనైతే, తస్య= ఆ శ్రీహరియొక్క, గుణాన్= గుణములను, గృణీతే= కీర్తించునో, కరౌ చ= చేతులు, తత్-కర్మకరౌ= ఆయన కొరకు కర్మను చేయునవి, మనః చ= మనస్సు కూడ, స్థిరజంగమేషు కదలని కదిలే ప్రాణులయందు, వసంతమ్= నివసించుచున్న శ్రీహరిని, స్మరేత్= స్మరించునో, సః= అది, కర్ణః= చెవి, తత్-పుణ్యకథాః= ఆయన పావనగాథలను, శృణోతి= వినునో.

ఆ శ్రీహరి గుణములను స్తుతించే వాక్కే వాక్కు ఆయన కొరకు కర్మలను చేసే చేతులే చేతులు. స్థావరజంగమములగు ప్రాణులలో ఆత్మరూపుడై నివసించే ఆ శ్రీహరిని స్మరించే మనస్సే మనస్సు. ఆయనయొక్క పావనగాథలను వినే చెవులే చెవులు.

శిరస్తు తస్యోభయలింగమానమేత్తదేవ యత్పశ్యతి తద్ధి చక్షుః ।
అంగాని విష్ణోరథ తజ్జనానాం పాదోదకం యాని భజంతి నిత్యమ్॥ 4

శిరః తు= తలయైతే, తస్య= ఆ శ్రీహరియొక్క, ఉభయలింగమ్= రెండు రూపములను, ఆనమేత్= నమస్కరించునో, యత్= ఎయ్యది, తత్ ఏవ= ఈ రెండు రూపములనే, పశ్యతి= చూచునో, తత్ హి= అదియే, చక్షుః= కన్ను, అథ= మరియు, అంగాని= అవయవములు, యాని= ఏవైతే, నిత్యమ్= నిత్యము, విష్ణోః= శ్రీహరియొక్క, తద్-జనానామ్= ఆయన భక్తులయొక్క, పాద-ఉదకమ్= పాదముల నీటిని, భజంతి= సేవించునో.

ఆ శ్రీహరికి ప్రతిమ మొదలైనది కదలని రూపము, భక్తులు కదిలే రూపము. ఈ రెండు రూపములకు నమస్కరించే తలయే తల. ఈ రెండు రూపములను చూచే కన్నులే కన్నులు. మరియు శ్రీహరియొక్క, ఆయన భక్తులయొక్క పాదోదకమును సేవించే అవయవములే అవయవములు.

సూత ఉవాచ ।

విష్ణురాతేన సంపృష్టో భగవాన్ బాదరాయణిః ।
వాసుదేవే భగవతి నిమగ్నహృదయోఽబ్రవీత్ ॥ 5

సూతః= సూత మహర్షి, ఉవాచ= పలికెను, భగవాన్= పూజనీయుడు, బాదరాయణిః= బాదరాయణుని పుత్రుడు అగు శుకుడు, విష్ణురాతేన= పరీక్షిత్తుచే, సంపృష్టః= ప్రశ్నించ బడినవాడై, వాసుదేవే భగవతి= వాసుదేవభగవానునియందు, నిమగ్న హృదయః= నిమగ్నమైన హృదయము గలవాడై, అబ్రవీత్= పలికెను.

సూత మహర్షి ఇట్లు పలికెను...పరీక్షిత్తు ప్రశ్నను విని పూజనీయుడు, వ్యాసపుత్రుడు అగు శుకుని హృదయము వాసుదేవ భగవానునియందు నిమగ్నమయ్యెను. ఆయన యిట్లు పలికెను.

శ్రీశుక ఉవాచ ।

కృష్ణస్యాసీత్సఖా కశ్చిద్బ్రాహ్మణో బ్రహ్మవిత్తమః ।
విరక్త ఇంద్రియార్థేషు ప్రశాంతాత్మా జితేంద్రియః ॥ 6

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కృష్ణస్య= శ్రీకృష్ణునకు, కశ్చిత్= ఒకానొక, బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, సఖా= మిత్రుడు, బ్రహ్మవిత్- తమః= బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు, ఇంద్రియ-అర్థేషు= ఇంద్రియభోగములయందు, విరక్తః= విరక్తి గలవాడు, ప్రశాంత-ఆత్మా= ప్రసన్నమైన చిత్తము గలవాడు, జిత- ఇంద్రియః= జయించబడిన ఇంద్రియములు గలవాడు.

శ్రీశుక మహర్షి పలికెను...కృష్ణునకు ఒక బ్రాహ్మణమిత్రుడు ఉండెను. బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడగు ఆతడు ఇంద్రియభోగములయందు విరక్తుడై, ఇంద్రియములను జయించి ప్రసన్నమగు మనస్సు కలిగి-యుండెను.

యదృచ్ఛయోపపన్నేన వర్తమానో గృహాశ్రమీ ।
తస్య భార్యా కుచేలస్య క్షుత్క్షామా చ తథావిధా ॥ 7

యదృచ్ఛయా= అనుకోకుండా, ఉపపన్నేన= లభించినదానితో, వర్తమానః= జీవితమును గడుపువాడు, గృహ-ఆశ్రమీ= గృహస్థుడు, కుచేలస్య= చివికిన వస్త్రములు గల, తస్య= ఆయనయొక్క, భార్యా= భార్య, క్షుత్క్షామా= ఆకలిచే కృశించినది, తథావిధా= అటులనే ఉండునది.

గృహస్థుడైన ఆ సుదాముడు అనుకోకుండా ఈశ్వరేచ్ఛచే లభించిన దానితో జీవికను గడుపుచుండెను. చివికిన వస్త్రములను ధరించే ఆయన భార్య ఆకలికి కృశించియుండును. ఆమె కూడ ఆయననే పోలి-యుండును.

పతివ్రతా పతిం ప్రాహ మ్లాయతా వదనేన సా ।
దరిద్రా సీదమానా సా వేపమానాఽభిగమ్య చ ॥ 8

దరిద్రా= దరిద్రురాలు, సా= ఆ, పతివ్రతా= పతివ్రత, సీదమానా= వ్యాకులమైన చిత్తము గలది, సా= ఆమె, వేపమానా= వణుకుచున్నదై, అభిగమ్య= ఎదురుగా వచ్చి, మ్లాయతా= ఎండిపోవుచున్న, వదనేన= ముఖముతో, పతిమ్= భర్తను ఉద్దేశించి, ప్రాహ= పలికెను.

దారిద్ర్యముచే వ్యాకులమైన చిత్తము గల ఆ పతివ్రత ముఖములో రక్తము లేదు. ఆమె వణుకుతూ భర్తకు ఎదురుగా వచ్చి ఇట్లు పలికెను.

నను బ్రహ్మన్ భగవతస్సఖా సాక్షాద్ధ్రియః పతిః ।
బ్రహ్మణ్యశ్చ శరణ్యశ్చ భగవాన్ సాత్వతర్షభః ॥ 9

బ్రహ్మన్= ఓ పూజనీయా!, భగవతః= పూజనీయులగు తమరి, సఖా= మిత్రుడు, సాత్వత-ఋషభః= యదుశ్రేష్ఠుడు అగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, సాక్షాత్= సాక్షాత్తుగా, శ్రియః= లక్ష్మీదేవికి, పతిః = భర్త, బ్రహ్మణ్యః చ= బ్రాహ్మణభక్తి గలవాడు, శరణ్యః చ ననుశరణాగతులను రక్షించువాడు కూడా గదా!

ఓ పూజనీయా! పూజనీయులగు తమరి మిత్రుడు యాదవశ్రేష్ఠుడగు శ్రీకృష్ణ భగవానుడు సాక్షాత్తుగా లక్ష్మీదేవికి భర్త. బ్రాహ్మణభక్తి గల ఆయన శరణాగతులకు రక్షకుడు గదా!

తముపైహి మహాభాగ సాధూనాం చ పరాయణమ్ ।
దాస్యతి ద్రవిణం భూరి సీదతే తే కుటుంబినే ॥ 10

మహాభాగ= ఓ మహాత్మా!, సాధూనామ్= సత్పురుషులకు, పర-అయనమ్= సర్వోత్కృష్టమగు ఆశ్రయమైన, తమ్= ఆయనను, ఉపైహి= దగ్గరకు వెళ్లుము, సీదతే= దుఃఖితుడవైనట్టియు, కుటుంబినే= కుటుంబీకుడవైన, తమరికి ఆయన అధికమగు ధనమునీయగలడు.

అసేఽధునా ద్వారవత్యాం భోజవృష్ణ్యంధకేశ్వరః ।
స్మరతః పాదకమలమాత్మానమపి యచ్ఛతి ।
కిం స్వర్థకామాన్ భజతో నాత్యభీష్టాఞ్జగద్గురుః ॥ 11

భోజవృష్ణి-అంధక-ఈశ్వరః= భోజ-వృష్ణి= అంధకవంశముల యాదవులకు ప్రభుడు, జగద్-గురుః= జగత్తునకు తండ్రి అగు శ్రీకృష్ణుడు, అధునా= ఇప్పుడు, ద్వారవత్యామ్= ద్వారకానగరమునందు, ఆస్తే= ఉన్నాడు, పాదకమలమ్= కలువవంటి పాదమును, స్మరతః= స్మరించు-

వానికి, ఆత్మానం అపి= తనను కూడ, యచ్ఛతి= ఇచ్చును, భజతః= భజించువానికి, న-అతి-అభీష్టాన్= మిక్కిలి అభీష్టములు కాని, అర్థకామాన్= అర్థకామములను గురించి, కిం ను= చెప్పనదేమున్నది?

భోజ-వృష్ణి= అంధకవంశముల యాదవులకు ప్రభుడగు శ్రీకృష్ణుడు జగత్తునకు తండ్రి. ఆయన ఇప్పుడు ద్వారకానగరము నందున్నాడు. ఆయనయొక్క కలువవంటి పాదమును స్మరించువానికి ఆయన తనను కూడ ఇచ్చివేయును. భజించువానికి మిక్కిలి అభీష్టములు కాని అర్థకామములనిచ్చునని వేరుగా చెప్పవలయునా?

స ఏవం భార్యయా విప్రో బహుశః ప్రార్థితో మృదు ।
అయం హి పరమో లాభ ఉత్తమశ్లోకదర్శనమ్ ॥ 12

సః= ఆ, విప్రః= బ్రాహ్మణుడు, భార్యయా= భార్యచే, ఏవమ్= ఈ తీరున, బహుశః= పలుమార్లు, మృదు= మెత్తగా, ప్రార్థితః= ప్రార్థించ-బడిన వాడు, ఉత్తమశ్లోకదర్శనమ్= ఉత్తమమగు కీర్తి గల శ్రీకృష్ణుని దర్శనమేది గలదో, అయం హి= ఇదియే, పరమః= గొప్ప, లాభః= లాభము.

ఆ బ్రాహ్మణుని భార్య ఈ తీరున పలుమార్లు మెత్తగా ప్రార్థించెను. ఉత్తమమగు కీర్తి గల శ్రీకృష్ణుని దర్శనమే గొప్ప లాభమని ఆయన తలచెను.

ఇతి సంచింత్య మనసా గమనాయ మతిం దధే ।
అప్యస్త్యుపాయనం కించిద్గృహే కల్యాణి దీయతామ్ ॥ 13

ఇతి= అని, మనసా= మనస్సుచే, సంచింత్య= బాగా ఆలోచించి, గమనాయ= వెళ్లుటకై, మతిమ్= బుద్ధిని, దధే= నిశ్చయించెను, కల్యాణి= ఓ కల్యాణీ!, గృహే= ఇంటియందు, ఉపాయనమ్= బహుమతి, కించిత్= ఏదైనా, అపి అస్తి= ఉన్నదా?, దీయతామ్= ఈయబడుగాక!

ఆయన ఈ విధముగా మనస్సులో బాగా ఆలోచించి వెళ్లుటకే నిశ్చయించుకొనెను. ఓ కల్యాణీ! ఇంటిలో బహుమతి ఈయదగ్గది ఏదైనా ఉందా? ఉంటే ఇమ్ము (అని భార్యను అడిగెను).

యాచిత్వా చతురో ముష్టీన్ విప్రాన్ పృథుకతండులాన్ ।
చైలఖండేన తాన్ బద్ధ్వా భర్త్రే ప్రాదాదుపాయనమ్ ॥ 14

విప్రాన్= బ్రాహ్మణులను, చతురః= నాలుగు, ముష్టీన్= పిడికిళ్ల, పృథుకతండులాన్= అటుకులను, యాచిత్వా= యాచించి, తాన్= వాటిని, చైలఖండేన= వస్త్రశకలముతో, బద్ధ్వా= కట్టి, భర్త్రే= భర్త కొరకు, ఉపాయనమ్= బహుమతినిగా, ప్రాదాత్= ఇచ్చెను.

ఆమె బ్రాహ్మణగృహములలో యాచించి నాలుగు పిడికిళ్ల అటుకులను సంపాదించి, వాటిని గుడ్డ ముక్కలో కట్టి బహుమతిగా ఇచ్చుటకై భర్తకు ఇచ్చెను.

స తానాదాయ విప్రాగ్ర్యః ప్రయయౌ ద్వారకాం కిల ।
కృష్ణసందర్శనం మహ్యం కథం స్యాదితి చింతయన్ ॥ 15

విప్ర–అగ్ర్యః= బ్రాహ్మణశ్రేష్ఠుడగు, సః= ఆ సుదాముడు, తాన్= వాటిని, ఆదాయ= తీసుకొని, మహ్యమ్= నా కొరకు, కృష్ణసందర్శనమ్= శ్రీకృష్ణుని దర్శనము, కథమ్= ఏ విధముగా, స్యాత్= కలుగును?, ఇతి= అని, చింతయన్= ఆలోచించుచున్నవాడై, ద్వారకామ్= ద్వారకానగరమును గురించి, ప్రయయౌ కిల= పయనించెను.

బ్రాహ్మణశ్రేష్ఠుడగు ఆ సుదాముడు వాటిని తీసుకొని, నాకు శ్రీకృష్ణుని దర్శనమెట్లు కలుగునో? అని ఆలోచిస్తూ ద్వారకకు పయన–మయ్యెను.

త్రీణి గుల్మాన్యతీయాయ తిస్రః కక్షాశ్చ స ద్విజః ।

సః= ఆ, ద్విజః= బ్రాహ్మణుడు, త్రీణి= మూడు, గుల్మాని= రాజమార్గము (రక్షకభట శిబిరము) లను, తిస్రః= మూడు, కక్షాః చ= ప్రహరీలను కూడ, అతీయాయ= అతిక్రమించెను.

ఆ బ్రాహ్మణుడు మూడు రాజమార్గములను (సేనానివేశములను), మూడు ప్రహరీలను కూడ దాటి ముందుకు వెళ్లెను.

విప్రోఽగమ్యాంధవృష్ణీనాం గృహేష్వచ్యుతధర్మిణామ్ ॥ 16

గృహం ద్వ్యష్టసహస్రాణాం మహిషీణాం హరేర్ద్విజః ।
వివేశైకతమం శ్రీమద్బ్రహ్మానందం గతో యథా ॥ 17

విప్రః= వేదవేత్తయగు, ద్విజః= ఆ బ్రాహ్మణుడు, అచ్యుతధర్మిణామ్= శ్రీకృష్ణ భగవానుని ఆరాధకులైనట్టియు, అగమ్య-అంధవృష్ణీనామ్= పొంద శక్యము కాని అంధకుల వృష్ణులయొక్క, ద్వ్యష్టసహస్రాణామ్= పదహారు వేల, మహిషీణామ్= భార్యలయొక్క, గృహేషు= గృహముల యందు, ఏకతమమ్= ఒకటి ఐనట్టియు, శ్రీమత్= శోభాయుక్తమైన, హరేః గృహం= శ్రీకృష్ణుని గృహమును, బ్రహ్మ-ఆనందమ్= బ్రహ్మానందమును, గతః యథా= పొందినవాడు వలె.

అంధకవృష్ణివంశీయులగు యాదవులు శ్రీకృష్ణ భగవానుని ఆరాధకులు. వారి గృహములను చేరుట దుర్ఘటము. వారి గృహములకు, పదహారు వేల శ్రీకృష్ణుని భార్యల గృహములకు మధ్యలో శ్రీకృష్ణుని (రుక్మిణి) గృహము గలదు. శోభాయుక్తమగు ఆ గృహములోనికి ప్రవేశించి, బ్రహ్మానందమును పొందినవాడు వలె ఆయెను.

తం విలోక్యాచ్యుతో దూరాత్ప్రియాపర్యంకమాస్థితః ।
సహసోత్థాయ చాభ్యేత్య దోర్భ్యాం పర్యగ్రహీన్ముదా ॥ 18

ప్రియాపర్యంకమ్= ప్రియురాలి శయ్యను, ఆస్థితః= అధిష్ఠించి యున్న, అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, తమ్= ఆయనను, దూరాత్= దూరమునుండి, విలోక్య= చూచి, సహసా= వెంటనే, ఉత్థాయ= లేచి నిలబడి, అభ్యేత్య చ= ఎదురుగా కూడ వచ్చి, ముదా= ఆనందముతో, దోర్భ్యామ్= రెండు చేతులతో, పర్యగ్రహీత్= కౌగిలించుకొనెను.

ప్రియురాలగు రుక్మిణియొక్క శయ్యను అధిష్ఠించియున్న శ్రీకృష్ణ భగవానుడు ఆయనను దూరమునుండి చూచెను. ఆయన వెంటనే లేచి నిలబడి ఎదురేగి ఆనందముతో రెండు చేతులను చాచి కౌగిలించు-కొనెను.

సఖ్యుః ప్రియస్య విప్రర్షే రంగసంగాతినిర్వృతః ।
ప్రీతో వ్యముంచదబ్బిందూన్నేత్రాభ్యాం పుష్కరేక్షణః ॥ 19

ప్రియస్య సఖ్యుః= ప్రియమిత్రుడైనట్టియు, విప్ర-ఋషేః= వేదవేత్త జ్ఞాని అగు సుదామునియొక్క, అంగసంగ-అతినిర్వృతః= శరీరముతోడి స్పర్శ వలన మహానందమును పొందినవాడు, ప్రీతః= ప్రీతుడు, పుష్కర-ఈక్షణః= పద్మములవంటి కన్నులు గలవాడు అగు శ్రీకృష్ణుడు, నేత్రాభ్యామ్= కన్నులనుండి, అబ్-బిందూన్= నీటి బిందువులను, వ్యముంచత్= విడిచిపెట్టెను.

వేదవేత్త, జ్ఞాని అగు సుదాముడు శ్రీకృష్ణుని ప్రియమిత్రుడు. ఆతని రాకకు ప్రీతుడైన శ్రీకృష్ణుడాతని శరీరముతోడి స్పర్శ వలన మహానందమును పొంది పద్మములవంటి కన్నులనుండి ఆనందాశ్రువులను విడిచెను.

అథోపవేశ్య పర్యంకే స్వయం సఖ్యుస్సమర్హణమ్ ।
ఉపహృత్యావనిజ్యాస్య పాదౌ పాదావనేజనీః ॥ 20

అగ్రహీచ్ఛిరసా రాజన్ భగవాంల్లోకపావనః ।
వ్యలింపద్దివ్యగంధేన చందనాగురుకుంకుమైః ॥ 21

రాజన్= ఓ రాజా!, అథ= తరువాత, లోకపావనః= లోకములను పవిత్రము చేసే, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, పర్యంకే= శయ్యపై, ఉపవేశ్య= కూర్చుండబెట్టి, స్వయమ్= స్వయముగా సమర్హణమ్= పూజాసామగ్రిని, ఉపహృత్య= తీసుకువచ్చి, సఖ్యుః= మిత్రుడగు, అస్య= ఈయనయొక్క, పాదౌ= పాదములను, అవనిజ్య= కడిగి, పాద-అవనేజనీః= పాదములను కడిగిన నీటిని, శిరసా= శిరస్సుతో, అగ్రహీత్= స్వీకరించెను, దివ్యగంధేన= దివ్యమగు గంధముతో, చందన-అగురు కుంకుమైః= చందనము అగురు కుంకుమలతో, వ్యలింపత్= అలదెను.

ఓ పరీక్షిన్మహారాజా! తరువాత లోకములను పవిత్రము చేసే శ్రీకృష్ణ భగవానుడు ఆయనను శయ్యపై కూర్చుండబెట్టి, స్వయముగా పూజకు సామగ్రిని తెచ్చి, ఆ మిత్రుని పాదములను కడిగి, ఆ నీటిని తలపై చల్లుకొని, దివ్యమగు పరిమళద్రవ్యములను, గంధమును, అగురును, కుంకుమను ఆయనకు అలదెను.

ధూపైస్సురభిభిర్మిత్రం ప్రదీపావలిభిర్ముదా ।
అర్చిత్వాఽఽవేద్య తాంబూలం గాం చ స్వాగతమబ్రవీత్ ॥22

సురభిభిః= పరిమళభరితములైన, ధూపైః= ధూపములతో, ప్రదీప-ఆవలిభిః= దీపముల పంక్తులతో, మిత్రమ్= మిత్రుని, ముదా= ఆనందముతో, అర్చిత్వా= పూజించి, తాంబూలమ్= తాంబూలమును, గాం చ= గోవును కూడ, ఆవేద్య= సమర్పించి, స్వాగతమ్= స్వాగతమును, అబ్రవీత్= పిలికెను.

శ్రీకృష్ణుడు మిత్రుని పరిమళభరితములైన ధూపములతో, దీపముల పంక్తులతో పూజించి, తాంబూలమును గోవును కూడ సమర్పించి, స్వాగతమును పలికెను.

కుచైలం మలినం క్షామం ద్విజం ధమనిసంతతమ్ ।
దేవీ పర్యచరత్సాక్షాచ్చామరవ్యజనేన వై ॥ 23

కుచైలమ్= చినిగిన వస్త్రము కలిగినట్టియు, మలినమ్= మలినముగానున్నట్టియు, క్షామమ్= కృశించినట్టియు, ధమనిసంతతమ్= నరములచే వ్యాపించబడి ఉన్న, ద్విజమ్= బ్రాహ్మణుని, సాక్షాత్= సాక్షాత్తు, దేవీ= రుక్మిణీదేవి, చామరవ్యజనేన= వింజామరను వీచుటచే, పర్యచరత్= పరిచర్య చేసెను.

చివికిన వస్త్రములను దాల్చిన ఆ బ్రాహ్మణుడు మురికిగా, శరీరమంతా నరములేనా యన్నట్లు కృశించియుండెను. సాక్షాత్తు రుక్మిణీదేవి ఆయనకు వింజామరను వీస్తూ పరిచర్య చేసెను.

అంతఃపురజనో దృష్ట్వా కృష్ణేనామలకీర్తినా ।
విస్మితోఽభూదతిప్రీత్యా అవధూతం సభాజితమ్ ॥ 24

అమలకీర్తినా= స్వచ్ఛమగు కీర్తి గల, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, అతిప్రీత్యా= అధికమగు ప్రీతితో, సభాజితమ్= సత్కరించబడిన, అవధూతమ్= మలినవేషధారియగు బ్రాహ్మణుని, దృష్ట్వా= చూచి, అంతఃపురజనఃపురజనః= అంతఃపురమునందలి జనము, విస్మితః= ఆశ్చర్యమును పొందినది, అభూత్= ఆయెను.

స్వచ్ఛమగు కీర్తి గల శ్రీకృష్ణుడు మలినవేషధారియగు బ్రాహ్మణుని మహానందముతో సత్కరించుటను చూచిన అంతఃపురజనులు చకితులైరి.

కిమనేన కృతం పుణ్యమవధూతేన భిక్షుణా ।
శ్రియా హీనేన లోకేఽస్మిన్ గర్హితేనాధమేన చ ॥ 25

అవధూతేన= మలినవేషధారియైనట్టియు, భిక్షుణా= భిక్షుకుడై-నట్టియు, శ్రియా= సంపదచే, హీనేన= హీనుడైనట్టియు, అస్మిన్= ఈ,

లోకే= లోక మునందు, గర్హితేన= ఏవగించుకొనబడే, అధమేన చ= అధముడైన, అనేన= ఈతనిచే, కిమ్= ఏ, పుణ్యమ్= పుణ్యము, కృతమ్= చేయబడినదో?

మలినవేషమును దాల్చిన ఈ బికారి వద్ద సంపద సున్న ఈ లోకములోని జనులు ఏవగించుకొనే ఈ అధముడు ఏమి పుణ్యమును చేసినాడో?

యోఽసౌ త్రిలోకగురుణా శ్రీనివాసేన సంభృతః ।
పర్యంకస్థాం శ్రియం హిత్వా పరిష్వక్తోఽగ్రజో యథా ॥ 26

యః= ఏ, అసౌ= ఈయన, త్రిలోకగురుణా= ముల్లోకములకు తండ్రియగు, శ్రీనివాసేన= శ్రీకృష్ణ భగవానునిచే, సంభృతః= సమ్మానించ బడినవాడో, పర్యంకస్థామ్= శయ్యపైనున్న, శ్రియమ్= రుక్మిణీదేవిని, హిత్వా= విడిచిపెట్టి, అగ్రజః యథా= అన్నగారు వలె, పరిష్వక్తః= కౌగిలించుకొనబడినవాడు.

ఎందుకంటే, ముల్లోకములకు గురువగు శ్రీకృష్ణ భగవానుడు శయ్యపైనున్న రుక్మిణీ (లక్ష్మీ) దేవిని విడిచిపెట్టి, అన్నగారిని వలె, ఈయనను కౌగిలించుకొనినాడు.

కథయాలంచక్రతుర్గాథాః పుర్వా గురుకులే సతోః ।
ఆత్మనోర్లలితా రాజన్ కరౌ గృహ్య పరస్పరమ్ ॥ 27

రాజన్= ఓ రాజా!, పరస్పరమ్= ఒకరినొకరు, కరౌ= చేతులను, గృహ్య= పట్టుకొని, గురుకులే= గురుకులమునందు, సతోః= ఉంటున్న, ఆత్మనోః= తమయొక్క, పూర్వాః= గడచిన, లలితాః= మనోహరములైన, గాథాః= గాథలను, కథయాంచక్రతుః= చెప్పుకొనిరి.

ఓ పరీక్షిమ్మహారాజా! వారిద్దరు ఒకరినొకరు చేతులను పట్టుకొని, తాము పూర్వము గురుకులములో ఉంటూండగా ఘటిల్లిన మనోహరము లైన వృత్తాంతములను చెప్పుకొనిరి.

శ్రీభగవానువాచ ।

అపి బ్రహ్మన్ గురుకులాద్భవతా లబ్ధదక్షిణాత్ ।
సమావృత్తేన ధర్మజ్ఞ భార్యోఢా సదృశీ న వా ॥ 28

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహాత్మా! ధర్మజ్ఞ= ధర్మము తెలిసినవాడా!, లబ్ధదక్షిణాత్= పొందబడిన దక్షిణ గల, గురుకులాత్= గురుకులము నుండి, సమావృత్తేన= సమావర్తనము చేసిన, భవతా= నీచే, సదృశీ= యోగ్యమగు, భార్యా= భార్య, అపి ఊఢా వా= వివాహమాడబడినదా?, న వా= లేదా?

శ్రీకృష్ణ భగవానుడు పలికెను...మహాత్మా! నీకు ధర్మము తెలియును. నీవు గురువునకు దక్షిణ ఇచ్చి గురుకులమునుండి ఇంటికి వచ్చి స్నాతక వ్రతమును చేసి యోగ్యమగు యువతిని వివాహమాడితివా? లేదా?

ప్రాయో గృహేషు తే చిత్తమకామవిహతం తథా ।
నైవాతిప్రీయసే విద్వన్ ధనేషు విదితం హి మే ॥ 29

విద్వన్= విద్వాంసుడా!, గృహేషు= గృహమునందు, తే= నీ, చిత్తమ్= మనస్సు, తథా= ఆ విధముగా (ఇతరులకు వలె), ప్రాయః= తరుచుగా, అకామవిహతమ్= కామనలచే ఆకర్షించబడేది కానిది, ధనేషు= సంపదల విషయములో, న ఏవ అతిప్రీయసే= అధికమగు ప్రీతిని నీవు పొందుట లేదు, మే= నాకు, హి= నిశ్చితముగా, విదితమ్= తెలియబడినది.

ఓ విద్వాంసుడా! గృహస్థుడవైననూ నీ మనస్సు ఇతరులకు వలె తరుచుగా కామనలచే ఆకర్షించబడదు. పైగా, నీవు సంపదల విషయములో అధికమగు సంతోషమును పొందుట లేదని నాకు తెలియును.

కేచిత్కుర్వంతి కర్మాణి కామైరహతచేతసః ।
త్యజంతః ప్రకృతీర్దైవీర్యథాఽహం లోకసంగ్రహమ్ ॥ 30

కేచిత్= కొందరు, కామైఃర= కామనలచే, అహతచేతసః= ఆకర్షించబడని మనస్సులు గలవారై, దైవీఃర= ఈశ్వరుని మాయాశక్తికి చెందిన, ప్రకృతీఃర= ప్రకృతికార్యములగు వాసనలను, త్యజంతఃర= విడిచి పెట్టువారై, కర్మాణి= కర్మలను, కుర్వంతి= చేసెదరు, యథా= ఏ విధముగానైతే, అహమ్= నేను, లోకసంగ్రహమ్= లోకమునకు ఆదర్శముగా.

నేను లోకమునకు ఆదర్శముగానుండుటకై కర్మలను చేయుదును. అదే విధముగా, కొందరు కామనల ఆకర్షణ లేకుండా ఈశ్వరీయప్రకృతి యొక్క కార్యములగు వాసనలను విడిచిపెట్టి కర్మలను చేయుదురు.

కచ్చిద్గురుకులే వాసం బ్రహ్మన్ స్మరసి నౌ యతః ।
ద్విజో విజ్ఞాయ విజ్ఞేయం తమసః పారమశ్నుతే ॥ 31

బ్రహ్మన్= ఓ మహాత్మా!, గురుకులే= గురుకులమునందు, నౌ= మనిద్దరి, వాసమ్= నివాసమును, కచ్చిత్ స్మరసి= స్మరించుచున్నావా?, యతఃర= దేనివలనైతే, ద్విజఃర= ఉపనీతుడు, విజ్ఞేయమ్= తెలియదగునో దానిని, విజ్ఞాయ= తెలుసుకొని, తమసఃర= అజ్ఞానముయొక్క, పారమ్= ఆవలి తీరమగు మోక్షమును, అశ్నుతే= పొందుచున్నాడో.

ఓ మహాత్మా! గురుకులములో మనిద్దరి నివాసము నీకు గుర్తున్నదా? ఉపనీతుడు గురుకులములో నివసిస్తూ, తెలియదగిన ధర్మాదులను తెలుసుకొని అజ్ఞానమునతిక్రమించి మోక్షమును పొందును.

స వై సత్కర్మణాం సాక్షాద్ద్విజాతేరిహ సంభవః ।
ఆద్యోఽంగ యత్రాశ్రమిణాం యథాఽహం జ్ఞానదో గురుః ॥ 32

అంగ= ఓయీ!, ఇహ= ఈ లోకమునందు, యత్ర= ఎవని నిమిత్తముగా, సంభవః= పుట్టుకయో, సః వై= ఆ తండ్రియైతే, ఆద్యః= మొదటి, గురుః= పూజనీయుడు, ద్విజాతేః= ఉపనీతునకు, యత్ర= ఎవని నిమిత్తముగా, సత్-కర్మణామ్= పవిత్రకర్మల, సంభవః= పుట్టుకయో ఆయన, గురుః= పూజనీయుడు, ఆశ్రమిణామ్= అన్ని ఆశ్రమములవారికి, జ్ఞానదః= జ్ఞానమునిచ్చే, గురుః= గురువు, అహం యథా= నేను వలె.

ఓయీ! ఈ లోకములో జన్మనిచ్చిన తండ్రి మొదటి గురువు. ఉపనయనమైన పిదప సత్కర్మల సంస్కారమునిచ్చే వేదాధ్యాపకుడు రెండవ గురువు. ఆశ్రమములవారికి ఆత్మజ్ఞానమునుపదేశించువాడు మూడవ గురువు. వీరు నావలె పూజనీయులు.

నన్వర్థకవిదా బ్రహ్మన్ వర్ణాశ్రమవతామిహ ।
యే మయా గురుణా వాచా తరంత్యంజో భవార్ణవమ్ ॥ 33

బ్రహ్మన్= ఓ మహాత్మా!, ఇహ= ఈ లోకమునందు, యే= ఎవరైతే, గురుణా= గురురూపుడనైన, మయా= నాచే, వాచా= ఉపదేశముచే, అంజః= తేలికగా, భవ-అర్ణవమ్= సంసారసముద్రమును, తరంతి= తరించుచున్నారో వారు, వర్ణ-ఆశ్రమవతామ్= వర్ణాశ్రమములు గలవారిలో, అర్థకోవిదాః నను= పరమార్థము బాగా తెలిసినవారు సుమా!

ఓ మహాత్మా! ఎవరైతే గురురూపములోనున్న నా ఉపదేశముచే సంసారమనే సముద్రమును దాటివేసెదరో, వారు వర్ణాశ్రమముల వారిలో పరమార్థము బాగా తెలిసినవారు సుమా!

నాహమిజ్యాప్రజాతిభ్యాం తపసోపశమేన వా ।
తుష్యేయం సర్వభూతాత్మా గురుశుశ్రూషయా యథా ॥ 34

సర్వభూత-ఆత్మా= సకలప్రాణుల ఆత్మయైన, అహమ్= నేను, ఇజ్యాప్రజాతిభ్యామ్= యజ్ఞముచే సంతానముచే, తపసా= తపస్సుచే, ఉపశమేన వా= ఉపరతిచే గాని, గురుశుశ్రూషయా యథా= గురు-శుశ్రూషచే వలె, న తుష్యేయమ్= సంతోషించను.

సకలప్రాణుల ఆత్మయైన నేను గురుశుశ్రూషచే సంతోషించి-నట్లుగా యజ్ఞముచే గాని, సంతానము (గృహస్థధర్మము) చే గాని, తపస్సుచే గాని, సర్వమునుండి తపస్సంహారము (సన్న్యాసధర్మము) చే గాని సంతోషించను.

అపి నస్స్మర్యతే బ్రహ్మన్ వృత్తం నివసతాం గురౌ ।
గురుదారైశ్చోదితానామింధనానయనే క్వచిత్ ॥ 35

బ్రహ్మన్= ఓ మహాత్మా!, గురౌ= గురువువద్ద, నివసతామ్= నివసించుచున్నట్టియు, క్వచిత్= ఒకనాడు, గురుదారైః= గురువుయొక్క భార్యచే, ఇంధన-ఆనయనే= పొయ్యిలోకి కట్టెలను తీసుకువచ్చుట యందు, చోదితానామ్= నియోగించబడిన, నః= మనయొక్క, వృత్తమ్= ఘటన, అపి స్మర్యతే= స్మరించబడుచున్నదా?

ఓ మహాత్మా! మనము గురువుగారివద్ద నివసిస్తుండగా జరిగిన ఘటన నీకు గుర్తున్నదా? ఒకనాడు గురువుగారి భార్య మనలను పొయ్యిలోకి కట్టెలను తెమ్మని నియోగించెను.

ప్రవిష్టానాం మహోఽరణ్యమపర్తౌ సుమహద్ద్విజ ।
వాతవర్షమభూత్తీవ్రం నిష్ఠురాః స్తనయిత్నవః ॥ 36

ద్విజ= ఓ బ్రాహ్మణా!, మహా-అరణ్యమ్= పెద్ద అడవిని, ప్రవిష్టానామ్= మనము ప్రవేశించగా, అప-ఋతౌ= వర్షాకాలము తొలగిపోయిన శీతకాలమునందు, సుమహత్= చాల పెద్ద, తీవ్రమ్= సహించ శక్యము కాని, వాతవర్షమ్= గాలి వాన, అభూత్= కలిగెను, నిష్ఠురాః= కఠోరములైన, స్తనయిత్నవః= గర్జించే మేఘములు.

ఓయీ బ్రాహ్మణా! మనము పెద్ద అడవిని ప్రవేశించితిమి. అప్పుడు వర్షాకాలము పోయి శీతకాలము వచ్చెను. కాని, అప్పుడు చాల పెద్ద సహించ శక్యము కాని గాలివాన వచ్చెను. మేఖములు కఠోరముగా గర్జించెను.

సూర్యశ్చాస్తం గతస్తావత్తమసా చావృతా దిశః ।
నిమ్నం కూలం జలమయం న ప్రాజ్ఞాయత కించన ॥ 37

తావత్= అంతలో, సూర్యః చ= సూర్యుడు కూడ, అస్తం గతః= అస్తమించినవాడు, దిశః చ= దిక్కులు కూడ, తమసా= చీకటిచే, ఆవృతాః = ఆవరించబడినవి, నిమ్నమ్= పల్లము, కూలమ్= ఎత్తు, జలమయమ్= నీటితో నిండినది, కించన= ఏదీ, న ప్రాజ్ఞాయత= తెలియబడలేదు.

అంతలో సూర్యుడస్తమించి దిక్కులు చీకటిచే ఆవరించబడెను. అంతా జలమయమై ఎత్తుపల్లములు తెలియకుండెను.

వయం భృశం తత్ర మహోఽనిలాంబుభిః ।
నిహన్యమానా ముహురంబుసంప్లవే ।
దిశోఽవిదంతోఽథ పరస్పరం వనే
గృహీతహస్తాః పరిబభ్రిమాతురాః ॥ 38

తత్ర= ఆ, వనే= అడవియందు, మహా-అనిల-అంబుభిః= పెద్ద గాలులచే నీటిచే, భృశమ్= గట్టిగా, నిహన్యమానాః= కొట్టబడుచున్న, వయమ్= మనము, అంబుసంప్లవే= జలప్రళయమునందు, దిశః= దిక్కులను, అవిదంతః= తెలియనివారమై, పరస్పరమ్= ఒకరినొకరు, గృహీత హస్తాః= పట్టుకొనబడిన చేతులు గలవారమై, ఆతురాః= వ్యాకులమైన మనస్సు గలవారమై, ముహుః= పలుమార్లు, పరిబభ్రిమ= తిరుగాడితిమి.

ఆ అడవిలో పెద్ద గాలివానచే గట్టిగా కొట్టబడుచున్న మనము జలప్రళయములో దిక్కు తోచక ఒకరినొకరు చేతులు పట్టుకొని వ్యాకుల మనస్కులమై పలుమార్లు పరిభ్రమించితిమి.

ఏతద్విదిత్వా ఉదితే రవౌ సాందీపనిర్గురుః ।
అన్వేషమాణో న శిష్యానాచార్యోఽపశ్యదాతురాన్ ॥ 39

గురుః= గురువైన, సాందీపనిః ఆచార్యః= సాందీపని ఆచార్యుడు, ఏతత్= ఈ సంగతిని, విదిత్వా= తెలుసుకొని, రవౌ= సూర్యుడు, ఉదితే= ఉదయించగా, అన్వేషమాణః= వెదుకుచున్నవాడై, ఆతురాన్= ఆపదలో నున్న, శిష్యాన్= శిష్యులమగు, నః= మనలను, అపశ్యత్= చూచెను.

మన గురువగు సాందీపని ఆచార్యుడు ఈ సంగతి తెలిసి సూర్యుడుదయించగానే మనలను వెదుకుతూ బయలుదేరెను. ఆపదలో-నున్న మనలను ఆయన కనుగొనెను.

అహో హే పుత్రకా యూయమస్మదర్థేఽతిదుఃఖితాః ।
ఆత్మా వై ప్రాణినాం ప్రేష్ఠస్తమనాదృత్య మత్పరాః ॥ 40

అహో= అయ్యో!, హే పుత్రకాః= ఓ పుత్రులారా!, యూయమ్= మీరు, అస్మద్-అర్థే= మా ప్రయోజనము విషయములో, అతిదుఃఖితాః

= చాల దుఃఖమును పొందినవారు, ఆత్మా= తన దేహము (ప్రాణము), ప్రాణినామ్= ప్రాణులకు, ప్రేష్ఠః= మిక్కిలి ప్రియమైనది, తమ్= దానిని, అనాదృత్య= లెక్క పెట్టకుండా, మత్-పరాః= నా సేవయందు లగ్నమైన వారు.

అయ్యో! ఓ పుత్రులారా! మీరు మా కొరకై చాల దుఃఖమును సహించినారు. ప్రాణులకు తమ దేహము, ప్రాణము చాల ప్రియమైనవి. మీరు వాటిని కూడ లెక్క పెట్టకుండా నా సేవయందు నిమగ్నమైనారు.

ఏతదేవ హి సచ్ఛిష్యైః కర్తవ్యం గురునిష్కృతమ్ ।
యద్వై విశుద్ధభావేన సర్వార్థాత్మార్పణం గురౌ ॥ 41

హి= ఏలయనగా, సత్-శిష్యైః= మంచి శిష్యులచే, గురు-నిష్కృతమ్= గురువునకు ఉపకారము, ఏతద్ ఏవ= ఇదియే, కర్తవ్యమ్= చేయబడవలెను, యత్= ఏదనగా, విశుద్ధభావేన= నిష్కపటమగు ప్రేమతో, గురౌ= గురువునందు, వై= నిశ్చయముగా, సర్వ-అర్థ-ఆత్మార్పణమ్= సకలపదార్థములను దేహమును అర్పించుట.

ఏలయన, శిష్యుడు నిష్కపటమగు ప్రేమతో సకలపదార్థములను, దేహమును కూడ గురువునకు సమర్పించవలెను. మంచి శిష్యులు గురువునకు నిశ్చయముగా ఇట్టి సేవను చేయవలెను.

తుష్టోఽహం భో ద్విజశ్రేష్ఠాస్సత్యాస్సంతు మనోరథాః ।
ఛందాంస్యయాతయామాని భవంత్విహ పరత్ర చ ॥ 42

ద్విజశ్రేష్ఠాః= ఉపనీతులలో శ్రేష్ఠులైన, భోః= నాయనలారా!, మనోరథాః= మనోరథములు, సత్యాః= సత్యములు, సంతు= అగుగాక!, ఛందాంసి= మంత్రములు, ఇహ= ఈ లోకమునందు, పరత్ర చ=

పరలోకమునందు కూడ, అయాతయామాని= తొలగిపోని సారము గలవి, భవంతు= అగుగాక!

నాయనలారా! బ్రహ్మచారులలో మీరు శ్రేష్ఠులు. మీకు మనోరథములు సత్యమగుగాక! మీరు అధ్యయనము చేసిన మంత్రములు ఇహపరములలో తొలగిపోని సారము గలవి (ఫలమునిచ్చే శక్తి గలవి) అగుగాక!

ఇత్థంవిధాన్యనేకాని వసతాం గురువేశ్మసు ।
గురోరనుగ్రహేణైవ పుమాన్ పూర్ణః ప్రశాంతయే ॥ 43

గురువుయొక్క గృహమునందు నివసించిన మనకు ఇటువంటి అనేకములగు అనుభవములు కలిగినవి. గురువుయొక్క అనుగ్రహముచే మాత్రమే మానవుడు పూర్ణుడై ప్రశాంతిని పొందును.

బ్రాహ్మణ ఉవాచ ।
కిమస్మాభిరనిర్వృతం దేవదేవ జగద్గురో ।
భవతా సత్యకామేన యేషాం వాసో గురావభూత్ ॥ 44

బ్రాహ్మణః= సుదాముడు, ఉవాచ= పలికెను, దేవదేవ= ఓ దేవాధిదేవా!, జగద్-గురో= జగత్తునకు తండ్రీ!, అస్మాభిః= మాచే, కిమ్= ఏది, అనిర్వృత్తమ్= పొందబడనిది?, యేషామ్= ఏ మాకైతే, సత్యకామేన= సత్యసంకల్పుడవగు, భవతా= నీతో గూడి, గురౌ= గురువు వద్ద, వాసః= నివాసము, అభూత్= ఆయెనో.

సుదాముడిట్లు పలికెను...ఓ దేవాధిదేవా! నీవు జగత్తునకు తండ్రివి. సత్యసంకల్పుడవగు నీతో గూడి మేము గురుకులవాసమును చేసితిమి. అట్టి మాకు పొందబడనిది ఏమి ఉండును? (ఏమీ లేదు).

యస్య ఛందోమయం బ్రహ్మ దేహ ఆవసనం విభో ।
శ్రేయసాం తస్య గురుషు వాసోఽత్యంతవిడంబనమ్ ॥ 45

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే అశీతితమోఽధ్యాయః ॥

విభో= ఓ ప్రభూ!, శ్రేయసామ్= కల్యాణములకు, ఆవపనమ్= జన్మభూమి, ఛందోమయమ్= వేదరూపమగు, బ్రహ్మ= బ్రహ్మ, యస్య= ఎవనికి, దేహః= దేహమో, తస్య= అట్టి నీకు, గురుషు= గురువుల వద్ద, వాసః= నివాసము, అత్యంతవిడంబనమ్= కేవలము అనుకరణమే.

ఓ ప్రభూ! కల్యాణములకు నిలయమగు శబ్ద (వేదరూపమగు) బ్రహ్మ నీకు దేహము. అట్టి నీవు గురుకులవాసము చేయుట కేవలము మానవులననుకరించే లీల మాత్రమే.

శ్రీమద్భాగవతము పదవ స్కందము ఉత్తరార్ధములో
కుచేలోపాఖ్యానములో శ్రీకృష్ణుడు సుదాముని స్వాగతించుటను
వర్ణించే ఎనుబదియవ అధ్యాయము ముగిసినది (80).

* * *

అథ ఏకాశీతితమోఽధ్యాయః

కుచేలోపాఖ్యానము – కుచేలుడు ఐశ్వర్యమును పొందుట

శ్రీశుక ఉవాచ ।

స ఇత్థం ద్విజముఖ్యేన సహ సంకథయన్ హరిః ।
సర్వభూతమనోఽభిజ్ఞ స్స్మయమాన ఉవాచ తమ్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సర్వభూతమనః –అభిజ్ఞః= సకలప్రాణుల మనస్సును తెలియు, సః= ఆ, హరిః= శ్రీకృష్ణ భగవానుడు, ఇత్థమ్= ఈ విధముగా, ద్విజముఖ్యేన= బ్రాహ్మణశ్రేష్ఠుడగు సుదామునితో, సంకథయన్= కబుర్లాడుచున్న వాడు, స్మయమానః= చిరునవ్వు నవ్వుచున్నవాడై, తమ్= ఆయనను ఉద్దేశించి, ఉవాచ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణ భగవానునకు సకల–ప్రాణుల అంతరంగము విదితమే. ఆయన ఈ విధముగా బ్రాహ్మణ శ్రేష్ఠుడగు సుదామునితో కబుర్లాడుతూ చిరునవ్వుతో ఆయనతో నిట్లనెను.

బ్రహ్మణ్యో బ్రాహ్మణం కృష్ణో భగవాన్ ప్రహసన్ ప్రియమ్ ।
ప్రేమ్ణా నిరీక్షణేనైవ ప్రేక్షన్ ఖలు సతాం గతిః ॥ 2

బ్రహ్మణ్యః= బ్రాహ్మణభక్తుడు, సతామ్= సత్పురుషులకు, గతిః= ఆశ్రయము అగు, కృష్ణః భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ప్రహసన్= నవ్వుచున్నవాడై, ప్రియమ్= ప్రియుడగు, బ్రాహ్మణమ్= బ్రాహ్మణుని, ప్రేమ్ణా= ప్రేమతోడి, నిరీక్షణేన ఏవ= చూపుతో మాత్రమే, ప్రేక్షన్= చూచుచున్నవాడు.

సత్పురుషులకు ఆశ్రయమగు శ్రీకృష్ణ భగవానుడు బ్రాహ్మణ భక్తుడు. ఆయన నవ్వుతూ ప్రేమ నిండిన కన్నులతో బ్రాహ్మణుడగు సుదాముని చూస్తూ ఇట్లు పలికెను.

శ్రీభగవానువాచ ।

కిమప్యుపాయనమానీతం బ్రహ్మన్ మే భవతా గృహాత్ ।
అణ్వప్యుపాహృతం భక్తైః ప్రేమ్ణా భూర్యేవ మే భవేత్ ।
భూర్యప్యభక్తోపహృతం న మే తోషాయ కల్పతే ॥ 3

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహాత్మా!, భవతా= నీచే, గృహాత్= ఇంటినుండి, మే= నా కొరకు, కిం అపి= ఏదేని, ఉపాయనమ్= ఉపహారము, ఆనీతమ్= తీసుకురా-బడినదా?, భక్తైః= భక్తులచే, ప్రేమ్ణా= ప్రేమతో, ఉపాహృతమ్= సమర్పించబడినది, అణు అపి= కొంచెమే అయిననూ, మే= నాకు, భూరి ఏవ= అధికమే, భవేత్= అగును, అభక్త-ఉపహృతమ్= భక్తుడు కానివానిచే సమర్పించబడినది. భూరి అపి= అధికమే అయిననూ, మే= నా, తోషాయ= సంతోషము కొరకు, న కల్పతే= సమర్థము కాదు.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మహాత్మా! నీవు ఇంటినుండి నాకై ఏదేని ఉపహారమును తెచ్చితివా? భక్తులు ప్రేమతో సమర్పించేది అల్పమే అయినా, నాకు అదే అధికము. భక్తి లేనివాడు సమర్పించేది అధికమే అయినా, నాకు ప్రీతిని కలిగించలేదు.

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥ 4

యః= ఎవడైతే, మే= నా కొరకు, భక్త్యా= భక్తితో, పత్రమ్= పత్రమును, పుష్పమ్= పుష్పమును, ఫలమ్= ఫలమును, తోయమ్= జలమును, భక్త్యా= భక్తితో, ప్రయచ్ఛతి= సమర్పించునో, ప్రయత-ఆత్మనః = విశుద్ధమగు అంతఃకరణము గల వానియొక్క, భక్తి-ఉపహృతమ్= భక్తిచే సమర్పించబడిన, తత్= దానిని, అహమ్= నేను, అశ్నామి= స్వీకరించుచున్నాను.

విశుద్ధమగు అంతఃకరణము గల ఏ భక్తుడైతే ప్రేమతో నాకు పత్రమును గాని, పుష్పమును గాని, ఫలమును గాని, నీటిని గాని సమర్పించునో, భక్తితో సమర్పించబడిన దానిని నేను ప్రేమతో స్వీకరించెదను.

ఇత్యుక్తోఽపి ద్విజస్తస్మై వ్రీడితః పతయే శ్రియః ।
పృథుకప్రసృతిం రాజన్ న ప్రాయచ్ఛదవాఙ్ముఖః ॥ 5

రాజన్= ఓ రాజా!, ఇతి= ఇట్లు, ఉక్తః అపి= చెప్పబడినవాడే అయిననూ, వ్రీడితః= సిగ్గు పడిన, ద్విజః= బ్రాహ్మణుడు, అవాఙ్-ముఖః = వంచబడిన ముఖము గలవాడై, శ్రియః పతయే= లక్ష్మీపతియగు, తస్మై= ఆ శ్రీకృష్ణ భగవానుని కొరకు, పృథుకప్రసృతిమ్= అటుకుల సగము దోసిలిని, న ప్రాయచ్ఛత్= ఈయలేదు.

ఓ పరీక్షిన్మహారాజా! లక్ష్మీపతియగు శ్రీకృష్ణ భగవానుడిట్లు చెప్పిననూ, ఆ బ్రాహ్మణుడు సిగ్గుతో తల వంచుకొని, గుప్పెడు మాత్రమే ఉన్న అటుకులను ఆయనకు ఈయలేదు.

సర్వభూతాత్మదృక్ సాక్షాత్తస్యాగమనకారణమ్ ।
విజ్ఞాయాచింతయన్నాయం శ్రీకామో మాఽభజత్పురా ॥ 6

సాక్షాత్= సాక్షియై, సర్వభూత-ఆత్మదృక్= సకలప్రాణులయందు బుద్ధిని దర్శించే శ్రీకృష్ణ భగవానుడు, తస్య= ఆతని, ఆగమనకారణమ్= వచ్చుటకు కారణమును, విజ్ఞాయ= తెలుసుకొని, అచింతయత్= తలపోసెను, అయమ్= ఈతడు, పురా= ఇదివరలో, మా= నన్ను, శ్రీకామః= సంపదను కోరువాడై, న అభజత్= సేవించలేదు.

సకలప్రాణుల అంతఃకరణసాక్షియగు శ్రీకృష్ణ భగవానునకు ఆతడు వచ్చిన కారణము ఎరుకయే. ఆయన ఇట్లు తలపోసెను -- ఈయన ఇదివరలో ఎన్నడూ సంపదను కోరి నాయందు భక్తిని చేయలేదు.

పత్న్యాః పతివ్రతాయాస్తు సఖా ప్రియచికీర్షయా ।
ప్రాప్తో మామస్య దాస్యామి సంపదోఽమర్త్యదుర్లభాః ॥ 7

సఖా తు= మిత్రుడైతే, పతివ్రతాయాఃపతివ్రతయగు, పత్న్యాఃభార్యకు, ప్రియచికీర్షయా= ప్రియమును చేసే కోరికతో, మామ్= నన్ను, ప్రాప్తఃచేరినవాడు, అస్య= ఈయనకు, అమర్త్యదుర్లభాఃదేవతలకు దొరకని, సంపదఃసంపదలను, దాస్యామి= ఈయగలను.

నా మిత్రుడైతే పతివ్రతయగు తన భార్యకు ప్రియమును చేయగోరి నా వద్దకు వచ్చినాడు. నేనీయనకు దేవతలకైనా దొరకని సంపదల-నిచ్చెదను.

ఇత్థం విచింత్య వసనాచ్చీరబద్ధాన్ ద్విజన్మనః ।
స్వయం జహార కిమిదమితి పృథుకతండులాన్ ॥ 8

ఇత్థమ్= ఈ విధముగా, విచింత్య= తలపోసి, ద్విజన్మనఃబ్రాహ్మణునియొక్క, వసనాత్= వస్త్రమునుండి, చీరబద్ధాన్= వస్త్ర శకలముచే కట్టబడిన, పృథుకతండులాన్= అటుకులను, స్వయమ్= తానే, ఇదమ్= ఇది, కిమ్= ఏమిటి?, ఇతి= అని, జహార= పైకి తీసెను.

ఆయనీ విధముగా తలపోసి, ఆ బ్రాహ్మణుని ఉత్తరీయమునుండి గుడ్డలో కట్టిన అటుకుల మూటను, ఇదేమిటి? అంటూ తానే పైకి తీసెను.

నన్వేతదుపనీతం మే పరమప్రీణనం సఖే ।
**తర్పయంత్యంగ మాం విశ్వమేతే పృథుకతండులాఃఃః

అటుకులు, మామ్= నన్ను, విశ్వమ్= జగత్తును (జగద్రూపుడనగు), తర్పయంతి= తృప్తిని కలిగించును.

అరే! మిత్రమా! ఇది నా కొరకు తెచ్చినదే. ఈ అటుకులంటే నాకు పరమప్రీతి. ఓయీ! ఇవి నాకు, జగత్తునకు (జగద్రూపుడనగు నాకు) తృప్తిని కలిగించును.

ఇతి ముష్టిం సకృజ్జగ్ధ్వా ద్వితీయాం జగ్ధుమాదదే ।
తావచ్ఛ్రీర్జగృహే హస్తం తత్పరా పరమేష్ఠినః ॥ 10

ఇతి= అని, ముష్టిమ్= గుప్పెడును, సకృత్= ఒకసారి, జగ్ధ్వా= తిని, ద్వితీయామ్= రెండవదానిని, జగ్ధుమ్= తినుటకు, ఆదదే= తీసుకొనెను, తావత్= అంతలో, తత్-పరా= ఆయనయే సర్వస్వమైన, శ్రీః= లక్ష్మీదేవి, పరమేష్ఠినః= పరమేశ్వరుని, హస్తమ్= చేతిని, జగృహే= పట్టుకొనెను.

అని పలికి ఆ పరమేశ్వరుడు ఒక గుప్పెడు అటుకులను ఒకేసారి తిని, రెండవ గుప్పెడును తినుటకై తీసుకొనెను. అంతలో లక్ష్మీదేవి చేతిని పట్టుకొనెను. ఆమెకు ఆయనయే సర్వస్వము.

ఏతావతాఽలం విశ్వాత్మన్ సర్వసంపత్సమృద్ధయే ।
అస్మింల్లోకేఽథవాఽముష్మిన్ పుంసస్త్వత్తోషకారణమ్ ॥ 11

విశ్వ-ఆత్మన్= జగత్తునకు ఆత్మయైనవాడా!, పుంసః= వ్యక్తికి, అస్మిన్= ఈ, లోకే= లోకమునందు, అథవా= లేదా, అముష్మిన్= పరలోకమునందు, సర్వసంపత్-సమృద్ధయే= సకలసంపదల సమృద్ధి కొరకు, ఏతావతా= ఇంత మాత్రముచే, అలమ్= చాలును, త్వత్-తోషకారణమ్= నీ సంతోషమునకు హేతువు.

జగత్తునకు ఆత్మయైన ఓ దేవా! నీ సంతోషమునకు కారణమై ఇహపరములయందు వ్యక్తికి సకలసంపదల సమృద్ధి కలుగుటకు నీవు ఇంతమాత్రము తీసుకున్నచో చాలును.

బ్రాహ్మణస్తాం తు రజనీముషిత్వాఽచ్యుతమందిరే ।
భుక్త్వా పీత్వా సుఖం మేనే ఆత్మానం స్వర్గతం యథా ॥ 12

బ్రాహ్మణః తు= బ్రాహ్మణుడైతే, భుక్త్వా= భుజించి, పీత్వా= నీటిని త్రాగి, తామ్= ఆ, రజనీమ్= రాత్రిని, సుఖమ్= సుఖముగా, అచ్యుత–మందిరే= శ్రీకృష్ణ భగవానుని మందిరమునందు, ఉషిత్వా= నివసించి, ఆత్మానమ్= తనను, స్వఃగతం యథా= స్వర్గమును పొందినవానినిగా, మేనే= తలచెను.

ఆ బ్రాహ్మణుడు భుజించి నీటిని త్రాగి ఆ రాత్రి శ్రీకృష్ణ భగవానుని మందిరములో నివసించెను. ఆయనకు స్వర్గములో ఉన్నట్లుగా తోచెను.

శ్వోభూతే విశ్వభావేన స్వసుఖేనాభివందితః ।
జగామ స్వాలయం తాత పథ్యనువ్రజ్య నందితః ॥ 13

తాత= వత్సా!, శ్వఃభూతే= మరునాడు కాగా, విశ్వభావేన= జగత్తును పాలించునట్టియు, స్వసుఖేన= తన ఆనందముచే పూర్ణుడైన శ్రీకృష్ణ భగవానునిచే, అభివందితః= సమస్కరించబడినవాడు, పథి= మార్గమునందు, అనువ్రజ్య= వెంట వచ్చి, నందితః= ఆనందింప జేయబడినవాడు అగు సుదాముడు, స్వఆలయమ్= తన యింటిని గురించి, జగామ– వెళ్లెను.

జగత్తును పాలించే స్వాత్మారాముడైన శ్రీకృష్ణ భగవానుడు మరునాడు ఆయనకు నమస్కరించి మార్గములో కొంత దూరము వెంట నడిచి ఆనందమును కలిగించెను. ఆప్పుడు సుదాముడు తన గృహమును చేరెను.

స చాలబ్ధ్వా ధనం కృష్ణాన్న తు యాచితవాన్ స్వయమ్ ।
స్వగృహాన్ వ్రీడితోఽగచ్ఛన్మహద్దర్శననిర్వృతః ॥ 14

సః చ= ఆ సుదాముడైతే, కృష్ణాత్= శ్రీకృష్ణునినుండి, ధనమ్= ధనమును, అలబ్ధ్వా= పొందక, స్వయం తు= తానైతే, న యాచితవాన్= కోరినవాడు కాదు, వ్రీడితః= సిగ్గు పడినవాడై, స్వగృహాన్= తన యింటిని గురించి, అగచ్ఛత్= వెళ్లెను, మహద్-దర్శననిర్వృతః= భగవానుని దర్శనముచే ఆనందించినవాడు.

ఆ సుదాముడైతే సిగ్గుపడి తానైతే శ్రీకృష్ణుని ధనమును కోరలేదు; ఆయన ధనమునీయలేదు. భగవానుని దర్శనముచే ఆనందించి ఆయన తన యింటికి వెళ్లెను.

అహో బ్రహ్మణ్యదేవస్య దృష్టా బ్రహ్మణ్యతా మయా ।
యద్దరిద్రతమో లక్ష్మ్మాశ్లిష్టో బిభ్రతోరసి ॥ 15

అహో= ఆహా!, బ్రహ్మణ్యదేవస్య= బ్రాహ్మణులను దైవముగా భావించే శ్రీకృష్ణునియొక్క, బ్రహ్మణ్యతా= బ్రాహ్మణభక్తి, మయా= నాచే, దృష్టా= చూడబడినది, యత్= ఏలయన, లక్ష్మ్మమ్= లక్ష్మీదేవిని, ఉరసి= వక్షఃస్థలమునందు, బిభ్రతా= ధరించే ఆయనచే, దరిద్రతమః= పరమ-దరిద్రుడనగు నేను, ఆశ్లిష్టః= కౌగిలించుకొనబడితినో.

ఆహా! బ్రాహ్మణులను ఇష్టదైవముగా భావించే శ్రీకృష్ణుని బ్రాహ్మణ భక్తిని నేను చూచితిని. ఎందుకంటే, వక్షఃస్థలముపై లక్ష్మీదేవిని ధరించే ఆయన పరమదరిద్రుడనగు నన్ను కౌగిలించుకొనెను.

క్వాహం దరిద్రః పాపీయాన్ క్వ కృష్ణశ్రీనికేతనః ।
బ్రహ్మబంధురితి స్మాహం బాహుభ్యాం పరిరంభితః ॥ 16

దరిద్రుఃడరిద్రుడను, పాపీయాన్= అధికపాపిని, అహమ్= నేను, క్వ= ఎక్కడ?, శ్రీనికేతనుఃడలక్ష్మీదేవికి నివాసమగు, కృష్ణుఃడశ్రీకృష్ణ భగవానుడు, క్వ-ఎక్కడ?, బ్రహ్మబంధుఃడబ్రాహ్మణుల బంధువు, ఇతి= అని, అహమ్= నేను, బాహుభ్యామ్= చేతులతో, పరిరంభితఃడస్మ= కౌగిలించుకొనబడినవాడను.

దరిద్రుడను, అధికపాపిని అగు నేనెక్కడ? లక్ష్మీదేవికి నివాసమగు శ్రీకృష్ణ భగవానుడెక్కడ? బ్రాహ్మణుల వంశములో పుట్టినవాడనగుటచే ఆయన నన్ను రెండు చేతులతో కౌగిలించుకొనినాడు.

నివాసితఃడప్రియాజుష్టే పర్యంకే భ్రాతరో యథా ।
మహిష్యా వీజితశ్రాంతో వాలవ్యజనహస్తయా ॥ 17

ప్రియాజుష్టే= ప్రియురాలిచే సేవించబడిన, పర్యంకే= శయ్యపై, భ్రాతరఃడయథా= సోదరుడు వలె, నివాసితఃడనివసింప జేయబడిన వాడను, శ్రాంతఃడఅలసిన నేను, వాలవ్యజనహస్తయా= వింజామర చేతియందు గల, మహిష్యా= భార్యచే, వీజితఃడవీచబడితిని.

ప్రియురాలు సేవించే శయ్యపై తన సోదరుడా యన్నట్లు ఆయన నన్ను విశ్రమింప జేసినాడు. అలసిన నాకు ఆయన భార్య వింజామరతో వీచినది.

శుశ్రూషయా పరమయా పాదసంవాహనాదిభిః ।
పూజితో దేవదేవేన విప్రదేవేన దేవవత్ ॥ 18

దేవదేవేన= దేవాధిదేవుడైనట్టియు, విప్రదేవేన= బ్రాహ్మణులే దైవముగా గల శ్రీకృష్ణునిచే, పరమయా= గొప్ప, శుశ్రూషయా= సేవతో, పాదసంవాహన-ఆదిభిఃడకాళ్లను నొక్కుట మొదలగువాటిచే, దేవవత్= దేవుడు వలె, పూజితఃడపూజించబడితిని.

దేవాధిదేవుడగు శ్రీకృష్ణ భగవానునకు బ్రాహ్మణులే దైవము. ఆయన కాళ్లను నొక్కుట, వీచుట మొదలగు గొప్ప సేవలతో నన్ను దేవతను వలె పూజించెను.

స్వర్గాపవర్గయోః పుంసాం రసాయాం భువి సంపదామ్ ।
సర్వాసామపి సిద్ధీనాం మూలం తచ్చరణార్చనమ్ ॥ 19

పుంసామ్= మానవులకు, స్వర్గ-అపవర్గయోఃమ్= స్వర్గమోక్షములకు, రసాయామ్= రసాతలమునందు, భువి= భూలోకమునందు, సంపదామ్= సంపదలకు, సర్వాసామ్= సకలములైన, సిద్ధీనాం అపి= సిద్ధులకు కూడ, తత్-చరణ-అర్చనమ్= ఆయన పాదములను పూజించుట, మూలమ్= కారణము.

మానవులకు స్వర్గమోక్షములు, భూలోకరసాతలములయందలి సంపదలు, సకలసిద్ధులు కలుగుటకు ఆయన పాదముల పూజయే హేతువు.

అథనోఽయం ధనం ప్రాప్య మాద్యన్నుచ్చైర్న మాం స్మరేత్ ।
ఇతి కారుణికో నూనం ధనం మేఽభూరి నాదదాత్ ॥ 20

అధనఃమ్= ధనము లేని, అయమ్= ఈతడు, ధనమ్= ధనమును, ప్రాప్య= పొంది, ఉచ్చైఃమ్= అధికముగా, మాద్యన్= గర్వించుచున్నవాడై, మామ్= నన్ను, న స్మరేత్= స్మరించకుండును, ఇతి= అని, కారుణికఃమ్= కరుణామయుడగు శ్రీకృష్ణుడు, మే= నా కొరకు, అభూరి= కొంచెము, ధనమ్= ధనమును, న అదదాత్= ఈయలేదు, నూనమ్= నిశ్చయము.

ధనము లేని ఈతడు ధనమును పొంది అధికముగా గర్వించి నన్ను స్మరించకుండునని తలచి ఆ దయామయుడు నాకు కొంచెమైననూ ధనమునీయలేదు. ఇదియే నిశ్చయము.

ఇతి తచ్చింతయన్నంతః ప్రాప్తో నిజగృహాంతికమ్ ।
సూర్యానలేందుసంకాశైర్విమానైస్సర్వతో వృతమ్ ॥ 21

అంతః= లోపల, ఇతి= ఈ విధముగా, తత్= విషయమును, చింతయన్= తలపోయుచున్నవాడై, సూర్య-అనల-ఇందుసంకాశైః= సూర్యుడు అగ్ని చంద్రుల వలె ప్రకాశించే, విమానైః= సౌధములతో, సర్వతః= అన్నివైపులా, వృతమ్= చుట్టువారబడియున్న, నిజగృహ-అంతికమ్= తన ఇంటి సమీపమును, ప్రాప్తః= చేరినవాడు.

ఈ విధముగా ఆయన ఆ విషయమునే తన మదిలో తలపోస్తూ తన ఇంటి వద్దకు చేరెను. ఆ ప్రదేశము అన్ని వైపులా సూర్యుడు, చంద్రుడు, అగ్నులవలె ప్రకాశించే సౌధములచే చుట్టువారబడియుండెను.

విచిత్రోపవనోద్యానైః కూజద్ద్విజకులాకులైః ।
ప్రోత్ఫుల్లకుముదాంభోజకహ్లారోత్పలవారిభిః ॥ 22

జుష్టం స్వలంకృతైః పుంభిః స్త్రీభిశ్చ హరిణాక్షిభిః ।

కూజద్-ద్విజకుల-ఆకులైః= కూసే పక్షుల గుంపులచే వ్యాపించ బడిన, విచిత్ర-ఉపవన-ఉద్యానైః= రంగు రంగుల ఉపవనములచే ఉద్యానములచే, ప్ర-ఉత్-ఫుల్లకుముద-అంభః-జ కహ్లార-ఉత్పలవారిభిః = బాగా వికసించిన ఎర్రదామరలు పద్మములు సౌగంధికపుష్పములు కలువలు గల జలములతో, సు-అలంకృతైః= బాగా అలంకరించబడిన, పుంభిః= పురుషులచే, హరిణ-అక్షిభిః= లేడి కన్నులవంటి కన్నులు గల, స్త్రీభిః చ= యువతులచే గూడ, జుష్టమ్= కూడియున్న (స్థానమును-).

ఆ స్థానమునందు కూసే పక్షుల గుంపులచే వ్యాపించబడిన రంగు రంగుల ఉపవనములు, ఉద్యానములు ఉండెను. అచటి సరస్సులలో ఎర్ర దామరలు, పద్మములు, సౌగంధికపుష్పములు, కలువలు బాగా

వికసించి ఉండెను. అచట బాగా అలంకరించుకున్న పురుషులు, లేడి కన్నులవంటి కన్నులు గల యువతులు ఉండిరి.

కిమిదం కస్య వా స్థానం కథం తదిదమిత్యభూత్ ॥ 23

ఏవం మీమాంసమానం తం నరా నార్యోఽమరప్రభాః ।
ప్రత్యగృహ్ణన్ మహాభాగం గీతవాద్యేన భూయసా ॥ 24

ఇదమ్= ఇది, కిమ్= ఏమిటి?, స్థానమ్= చోటు, కస్య వా= ఎవనిది?, తత్= అది, కథమ్= ఎట్లు, ఇదమ్= ఇది, ఇతి= ఈ రూపము గలది, అభూత్= ఆయెను?, ఏవమ్= ఈ విధముగా, మీమాంసమానమ్= విచారించుచున్న, తమ్= ఆ, మహాభాగమ్= మహాభాగ్యవంతుని, అమరప్రభాః= దేవతల కాంతి వంటి కాంతి గల, నరాః= పురుషులు, నార్యః= స్త్రీలు, భూయసా= అధికమగు, గీతవాద్యేన= పాటలతో వాద్యములతో, ప్రత్యగృహ్ణన్= సాదరముగా దోడ్కొని వెళ్లిరి.

ఇది యేమిటి? ఇది ఎవని చోటు? అది (ఇదివరకటి స్థానము) ఇదియై ఈ రూపముగా ఎట్లైనది? అని ఆ మహాభాగ్యవంతుడు విచారము చేయుచుండెను. ఇంతలో దేవతల కాంతివంటి కాంతి గల స్త్రీలు, పురుషులు ఆయనను పాటలతో, వాద్యములతో సాదరముగా దోడ్కొని వెళ్లిరి.

పతిమాగతమాకర్ణ్య పత్న్యుద్ధర్షాతిసంభ్రమా ।
నిశ్చక్రామ గృహాత్తూర్ణం రూపిణీ శ్రీరివాలయాత్ ॥ 25

ఆగతమ్= విచ్చేసిన, పతిమ్= భర్తను గురించి, ఆకర్ణ్య= విని, ఉద్-హర్ష-అతిసంభ్రమా= పుట్టిన హర్షముచే మిక్కిలి కంగారు పడుచున్న, పత్నీ= భార్య, ఆలయాత్= పద్మముల వనమునుండి, రూపిణీ= సుందరియగు, శ్రీః ఇవ= లక్ష్మీదేవి వలె, తూర్ణమ్= వెంటనే, గృహాత్= ఇంటినుంచీ, నిశ్చక్రామ= బయటకు వచ్చెను.

భర్త వచ్చినాడని విని ఆయన భార్య మహానందముతో వేగిరపడుతూ వెంటనే, పద్మముల వనమునుండి త్రిలోకసుందరియగు లక్ష్మీదేవి వలె, ఇంటినుంటి బయటకు వచ్చెను.

పతివ్రతా పతిం దృష్ట్వా ప్రేమోత్కంఠాశ్రులోచనా ।
మీలితాక్ష్యనమద్బుద్ధ్యా మనసా పరిషస్వజే ॥ 26

ప్రేమ–ఉత్కంఠ–అశ్రులోచనా= ప్రేమచే వేగిరపాటు నీరు నిండిన కన్నులు గల, పతివ్రతా= పతివ్రతయగు ఆమె, పతిమ్= భర్తను, దృష్ట్వా= చూచి, మీలిత–అక్షీ= మూయబడ్డ కన్నులు గలదై, బుద్ధ్యా= బుద్ధితో, అనమత్= ప్రణమిల్లెను, మనసా= మనస్సుతో, పరిషస్వజే= కౌగిలించెను.

ఆ పతివ్రతకు ప్రేమచే వేగిరపాటుతో బాటు కళ్లు నీటితో నిండెను. ఆమె భర్తను చూచి కన్నులు మూసుకొని బుద్ధితో ఆయనకు నమస్కరించి, మనస్సుతో కౌగిలించుకొనెను.

పత్నీం వీక్ష్య విస్ఫురంతీం దేవీం వైమానికీమివ ।
దాసీనాం నిష్కకంఠీనాం మధ్యే భాంతీం స విస్మితః ॥ 27

వైమానికీమ్= విమానమునెక్కిన, దేవీం ఇవ= దేవతలవలె, విస్ఫురంతీమ్= అధికముగా భాసించుచున్నట్టియు, నిష్కకంఠీనామ్= హారము కంఠమునందు గల, దాసీనామ్= పరిచారికలయొక్క, మధ్యే= మధ్యయందు, భాంతీమ్= ప్రకాశించుచున్న, పత్నీమ్= భార్యను, వీక్ష్య= చూచి, సః= ఆయన, విస్మితః= ఆశ్చర్యపడినవాడు.

ఆయన భార్య విమానమునధిష్ఠించిన దేవతాస్త్రీ వలె అధికముగా వెలిగిపోవుచుండెను. ఆమె కంఠములయందు హారములు గల పరిచారికల మధ్యలో ప్రకాశించెను. ఆమెను చూచి ఆయన ఆశ్చర్య–పోయెను.

ప్రీతస్స్వయం తయా యుక్తః ప్రవిష్టో నిజమందిరమ్ ।
మణిస్తంభశతోపేతం మహేంద్రభవనం యథా ॥ 28

స్వయమ్= తాను, ప్రీతః= ప్రీతి జెందినవాడు, తయా= ఆమెతో, యుక్తః= కూడినవాడై, మణిస్తంభశత-ఉపేతమ్= మణులు పొదిగిన స్తంభముల వందచే కూడిన, మహా-ఇంద్రభవనం యథా= మహేంద్రుని భవనమువంటి, నిజమందిరమ్= తన భవనమును, ప్రవిష్టః= ప్రవేశించిన వాడు.

ఆయన తాను కూడ చాల సంతోషించి ఆమెతో గూడి తన భవనములోనికి ప్రవేశించెను. ఆ భవనము మణులు పొదిగిన వంద స్తంభములతో మహేంద్రుని భవనమును పోలియుండెను.

పయఃఫేననిభాశ్శయ్యా దాంతా రుక్మపరిచ్ఛదాః ।
పర్యంకా హేమదండాని చామరవ్యజనాని చ ॥ 29

శయ్యాః= పరుపులు, పయఃఫేననిభాః= పాల నురుగును పోలినవి, పర్యంకాః= మంచములు, దాంతాః= దంతముతో చేసినవి, రుక్మపరి-చ్ఛదాః= వెండితో చేసిన పంకా మొదలైన పరికరములు గలవి, చామరవ్యజనాని చ= వింజామరలు గూడ, హేమదండాని= బంగరు దండములు గలవి.

ఆ భవనమునందు దంతముతో చేసిన వెండితో చేసిన పంకా మొదలైన పరికరములనమర్చిన మంచములపై పాలనురుగువంటి పరుపులు ఉండెను. వింజామరలకు బంగరు కడ్డీలు ఉండెను.

ఆసనాని చ హైమాని మృదూపస్తరణాని చ ।
ముక్తాదామవిలంబీని వితానాని ద్యుమంతి చ ॥ 30

ఆసనాని చ= కుర్చీలైతే, హైమాని= బంగరువి, మృదు-ఉపస్తరణాని చ= మెత్తని శయ్యలు, ముక్తాదామవిలంబీని= ముత్యాల హారములు

వ్రేలాడుట కలిగినట్టియు, ద్యుమంతి= ప్రకాశించే, వితానాని చ= మేలుకట్టులు.

ఆ భవనములో బంగరు కుర్చీలు, మెత్తని శయ్యలు, వ్రేలాడే ముత్యాల సరులతో ప్రకాశించే మేలుకట్టులు ఉండెను.

స్వచ్ఛస్ఫటికకుడ్యేషు మహామారకతేషు చ ।
రత్నదీపా భ్రాజమానా లలనారత్నసంయుతాః ॥ 31

మహామారకతేషు= గొప్ప మరకతమణులున్నట్టియు, స్వచ్ఛస్ఫటిక కుడ్యేషు= స్వచ్ఛమైన స్ఫటికములు పొదిగిన గోడలయందు, రత్నదీపాః = రత్నములే దీపములై, భ్రాజమానాః= ప్రకాశించుచున్నవి, లలనారత్న–సంయుతాః= గొప్ప యువతులతో కూడినవి.

ఆ భవనములలోని స్వచ్ఛమగు గోడలయందు గొప్ప మరకతమణులను, స్ఫటికములను పొదిగి, రత్నములనే దీపములుగా అమర్చిరి. ఆ భవనములతో గొప్ప యువతులు ఉండిరి.

విలోక్య బ్రాహ్మణస్తత్ర సమృద్ధీస్సర్వసంపదామ్ ।
తర్కయామాస నిర్వ్యగ్రస్స్వసమృద్ధిమహైతుకీమ్ ॥ 32

బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, తత్ర= అచట, సర్వసంపదామ్= సకలసంపదల, సమృద్ధీః= సమృద్ధులను, విలోక్య= చూచి, నిర్–వ్యగ్రః = సావధానుడై, అహైతుకీమ్= ఆకస్మికమైన, స్వసమృద్ధిమ్= తన సంపదను గురించి, తర్కయామాస= ఆలోచించెను.

ఆ బాపడు అచట సకలసంపదల సమృద్ధులను చూచెను. ఆయన సావధానచిత్తుడై ఆకస్మికముగా ప్రాప్తమైన సంపదను గురించి ఆలోచించెను.

నూనం బతైతన్మమ దుర్భగస్య శశ్వద్దరిద్రస్య సమృద్ధిహేతుః ।
మహావిభూతేరవలోకతోఽన్యో నైవోపపద్యేత యదూత్తమస్య ॥ 33

బత= ఆశ్చర్యము!, నూనమ్= నిశ్చయముగా, దుర్భగస్య= దురదృష్ట వంతుడనైనట్టియు, శశ్వత్= సర్వదా, దరిద్రస్య= దరిద్రుడనైన, మమ= నాకు, ఏతత్= ఈ విధముగా, సమృద్ధిహేతుః= సంపదకు కారణము, మహావిభూతేః= గొప్ప మహిమ గల, యదు-ఉత్తమస్య= యాదవ శ్రేష్ఠుడగు శ్రీకృష్ణ భగవానుని, అవలోకతః= కృపాదృష్టికంటె, అన్యః= మరియొకటి, న ఉపపద్యేత ఏవ= ఊహించుటకైననూ శక్యము కాదు.

ఆశ్చర్యము! నేను నిశ్చయముగా సర్వకాలదరిద్రుడను, దురదృష్టవంతుడను. నాకు ఈ విధమైన ఆకస్మిక సంపదకు హేతువు యాదవశ్రేష్ఠుడగు శ్రీకృష్ణ భగవానుని కృపాదృష్టికంటె మరియొకటి అని ఊహించుటయైననూ సంభవము కాదు. ఆయన మహిమ చాల గొప్పది.

నన్వబ్రువాణో దిశతే సమక్షం యాచిష్ణవే భూర్యపి భూరిభోజః ।
పర్జన్యవత్తత్స్వయమీక్షమాణో దాశార్హకాణామృషభస్సఖా మే ॥ 34

మే= నా, సఖా= మిత్రుడు, భూరిభోజః= గొప్ప భోగములు గలవాడు, దాశార్హకాణామ్= దశార్హవంశీయులలో, ఋషభః= శ్రేష్ఠుడు, సమక్షమ్= ఎదుట, అబ్రువాణాః= పలుకనివాడు, యాచిష్ణవే= కోరువాని కొరకు, భూరి అపి= అధికమును కూడ, నను= నిశ్చయముగా, దిశతే= ఇచ్చును, తత్= ఆ ఇచ్చినదానిని, స్వయమ్= తాను, పర్జన్యవత్= మేఘము వలె, ఈక్షమాణః= చూచువాడు.

దశార్హవంశీయులలో శ్రేష్ఠుడగు నా మిత్రుడు గొప్ప భోగములు గలవాడు. ఎదుట ఏమీ చెప్పకున్నా ఆయన యాచకునకు అధికమునే ఇచ్చును. మేఘము ఎంత వర్షించినా, తాను చాల వర్షించేనని అనుకోదు. అదే విధముగా, ఆయన కూడ తాను ఇచ్చినది అల్పమేనని భావించును.

కించిత్కరోత్యుర్వపి యత్స్వదత్తం సుహృత్కృతం ఫల్గ్వపి భూరికారీ,
మయోపనీతాం పృథుకైకముష్టిం ప్రత్యగ్రహీత్ప్రీతియుతో మహాత్మా॥ 35

స్వదత్తమ్= తనచే ఈయబడినది, ఉరు అపి= అధికమే అయిననూ, కించిత్= కొంచెమునుగా, కరోతి= చేయును, సుహృత్-కృతమ్= మిత్రునిచే చేయబడినది, ఫల్గు అపి= కొంచెమే అయిననూ, భూరికారీ= అధికముగా చేయును, మహాత్మా= ఆ మహాత్ముడు, మయా= నాచే, ఉప నీతామ్= సమర్పించబడిన, పృథుక-ఏకముష్టిమ్= అటుకుల ఒకే గుప్పెడును, ప్రీతియుతః= ప్రేమతో కూడినవాడై, ప్రత్యగ్రహీత్= స్వీకరించెను.

తానిచ్చినది ఎక్కువే అయినా కొంచెమే అన్నట్లు చేయును. మిత్రుడిచ్చినది కొంచెమే ఐనా, ఎక్కువే యన్నట్లు చేయును. నేను ఒకే గుప్పెడు అటుకులను సమర్పించగా, ఆ మహాత్ముడు ప్రేమతో స్వీకరించెను.

తస్యైవ మే సౌహృదసఖ్యమైత్రీ దాస్యం పునర్జన్మని జన్మని స్యాత్ ।
మహాఽనుభావేన గుణాలయేన విషజ్జతస్తత్పురుషప్రసంగః ॥ 36

మహా-అనుభావేన= గొప్ప మహిమ కలిగినట్టియు, గుణ-ఆలయేన= గుణనిధియగు శ్రీకృష్ణునితో, విషజ్జతః= విశేషమగు సంగమును పొందిన, మే= నాకు, తస్య ఏవ= ఆయనయొక్క మాత్రమే, సౌహృదసఖ్య మైత్రీ= ప్రేమ హితకారిత్వము ఉపకారకత్వము, దాస్యమ్= సేవకత్వము, తత్-పురుషప్రసంగః= ఆయనయొక్క భక్తులతోడి సత్సంగము, పునః= మరల, జన్మని జన్మని= ప్రతి జన్మయందు, స్యాత్= కలుగుగాక!

శ్రీకృష్ణుడు గొప్ప మహిమ గల గుణనిధి. ఆయనతో నాకు విశిష్టమగు చెలిమి కలిగినది. నాకు మరల ప్రతి జన్మయందు ఆయనతో

మాత్రమే ప్రేమ, ఆయన నాకు హితకారి యగుట, నాకు ఉపకారము చేయుట, నేనాయనకు సేవ చేయుట, ఆయన భక్తుల తోడి సత్సంగము కలుగుగాక!

భక్తాయ చిత్రా భగవాన్ హి సంపదో ।
రాజ్యం విభూతీర్న సమర్థయత్యజః ।
అదీర్ఘబోధాయ విచక్షణస్స్వయం
పశ్యన్నిపాతం ధనినాం మదోద్భవమ్ ॥ 37

అజః= పుట్టుక లేని, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, స్వయమ్= తాను, విచక్షణః= తెలిసినవాడు, ధనినామ్= ధనికులయొక్క, మద-ఉద్భవమ్= గర్వము వలన పుట్టే, నిపాతమ్= పతనమును, పశ్యన్= చూచువాడై, అదీర్ఘబోధాయ= దూరదృష్టి లేని, భక్తాయ= భక్తుని కొరకు, చిత్రాః= పలురకములైన, సంపదః= సంపదలను, రాజ్యమ్= రాజ్యాధి-కారమును, విభూతీః= ఐశ్వర్యములను, న సమర్థయతి= ఈయడు, హి= నిశ్చయము.

పుట్టుక లేని శ్రీకృష్ణ భగవానుడు స్వయముగా సంపదలలోని దోషము తెలిసినవాడు. ధనికులు గర్వము వలన పతనమగుటను ఆయన యెరుగును. కావుననే, ఆయన దూరదృష్టి లేని భక్తునకు పలు రకముల సంపదలను, రాజ్యాధికారమును, ఐశ్వర్యములను ఈయడు.

ఇత్థం వ్యవసితో బుద్ధ్యా భక్తోఽతీవ జనార్దనే ।
విషయాఞ్జాయయా త్యక్ష్యన్ బుభుజే నాతిలంపటః ॥ 38

బుద్ధ్యా= బుద్ధితో, ఏవమ్= ఈ విధముగా, వ్యవసితః= నిశ్చయించుకున్నవాడు, జన-అర్దనే దుష్టజనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానునియందు, అతీవ= అధికముగా, భక్తః= భక్తి గలవాడు అగు సుదాముడు, విషయాన్= ఇంద్రియభోగములను, త్యక్ష్యన్= మెల్లమెల్లగా

త్యాగమునభ్యసించువాడై, న-అతిలంపటుఁ= ఆసక్తి లేనివాడై, జాయయా= భార్యతో, బుభుజే= భోగించెను.

ఆ సుదాముడు బుద్ధితో ఈ విధముగా నిశ్చయించుకొని దుష్ట-జనశిక్షకుడగు శ్రీకృష్ణ భగవానునిపై అధికమగు భక్తిని కలిగియుండెను. ఆయన మెల్లమెల్లగా త్యాగమునభ్యసిస్తూనే ఆసక్తి లేకుండా భార్యతో గూడి ఇంద్రియభోగములననుభవించెను.

తస్య వై దేవదేవస్య హరేర్యజ్ఞపతేః ప్రభోః ।
బ్రాహ్మణాః ప్రభవో దైవం న తేభ్యో విద్యతే పరమ్ ॥ 39

దేవదేవస్య= దేవాధిదేవుడైనట్టియు, హరేః= దుఃఖమును పోగొట్టు-నట్టియు, యజ్ఞపతేః= యజ్ఞములకు ప్రభువైనట్టియు, ప్రభోః= సర్వశక్తి-మంతుడైన, తస్య= ఆ శ్రీకృష్ణ భగవానునకు, బ్రాహ్మణాఃఁ= బ్రాహ్మణులే, ప్రభవఃఁ= ప్రభువులు, తేభ్యఃఁ= వారికంటె, పరమ్= గొప్ప, దైవమ్= దైవము, న విద్యతే= లేదు, వై= నిశ్చయము.

దేవాధిదేవుడు, యజ్ఞములకు ప్రభువు, సర్వశక్తిమంతుడు అగు ఆ శ్రీకృష్ణ భగవానుడు దుఃఖములను హరించును. ఆయనకు ప్రభువులు నిశ్చయముగా బ్రాహ్మణులే. ఆయనకు వారిని మించిన దైవము లేదు.

ఏవం స విప్రో భగవత్సుహృత్తదా ।
దృష్ట్వా స్వభృత్యైరజితం పరాజితమ్ ।
తద్ధ్యానవేగోద్గ్రథితాత్మబంధనః
తద్ధామ లేభేఽచిరతస్తతాం గతిమ్ ॥ 40

భగవత్-సుహృత్= శ్రీకృష్ణ భగవానుని మిత్రుడగు, సఃఁ= ఆ, విప్రఃఁ= బ్రాహ్మణుడు, ఏవమ్= ఈ విధముగా, అజితమ్= పరాజయము లేని శ్రీకృష్ణుని, స్వభృత్యైఃఁ= తన భక్తులచే, పరాజితమ్= వశము చేసుకొనబడువానినిగా, దృష్ట్వాఁ= దర్శించి, తదా= అప్పుడు, తద్-

ధ్యానవేగ-ఉద్గ్రథిత-ఆత్మబంధనః= ఆయన యొక్క ధ్యానముయొక్క వేగముచే నిర్ముక్తమైన అహంకారబంధము గలవాడై, అచిరతః= విలంబములేకుండా, సతామ్= సత్పురుషులకు, గతిమ్= పొందబడే, తద్-ధామ= ఆ పరమాత్మస్వరూపమును, లేభే= పొందెను.

శ్రీకృష్ణ భగవానుడు పరాజయము లేనివాడే అయినా భక్తులకు వశమగును. ఈ సత్యమును ఆయన మిత్రుడగు ఆ సుదాముడు కనుగొనెను. అపుడాతడు ఆయనను తీవ్రముగా ధ్యానించి అహంకార బంధమును తొలగించుకొనెను. ఆతడు శీఘ్రముగనే సత్పురుషులచే పొందబడే ఆ పరమాత్మస్వరూపమును పొందెను.

ఏతద్బ్రహ్మణ్యదేవస్య శ్రుత్వా బ్రహ్మణ్యతాం నరః ।
లబ్ధభావో భగవతి కర్మబంధాద్విముచ్యతే ॥ 41

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకాశీతితమోఽధ్యాయః ॥

బ్రహ్మణ్యదేవస్య= బ్రాహ్మణులే దైవమైన శ్రీకృష్ణునియొక్క, ఏతత్= ఈ వృత్తాంతమును, బ్రహ్మణ్యతామ్= బ్రాహ్మణులయందు భక్తిని, శ్రుత్వా= విని, నరః= మానవుడు, భగవతి= భగవానునియందు, లబ్ధభావః= పొందబడిన భక్తి గలవాడై, కర్మబంధాత్= కర్మల బంధము నుండి, విముచ్యతే= విముక్తుడగును.

శ్రీకృష్ణ భగవానునకు బ్రాహ్మణులే దైవము. ఆయనయొక్క ఈ వృత్తాంతమును, బ్రాహ్మణభక్తిని వినే మానవునకు ఆ భగవానునియందు భక్తి ఉదయించి సంసారబంధమునుండి విముక్తి లభించును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
కుచేలోపాఖ్యానములో సుదామునకు సకలైశ్వర్యములు లభించుటను
వర్ణించే ఎనుబది ఒకటవ అధ్యాయము ముగిసినది (81).

అథ ద్వ్యశీతితమోఽధ్యాయః

బలరామ శ్రీకృష్ణులను గోపాలకులు గోపికలు కలుసుకొనుట

శ్రీశుక ఉవాచ ।

అథైకదా ద్వారవత్యాం వసతో రామకృష్ణయోః ।
సూర్యోపరాగస్సుమహానాసీత్కల్పక్షయే యథా ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి ఉవాచ= పలికెను, అథ= తరువాత, రామకృష్ణయోః= బలరామ శ్రీకృష్ణులు, ద్వారవత్యామ్= ద్వారకా నగరమునందు, వసతోః= నివసించుచుండగా, ఏకదా= ఒకనాడు, సుమహాన్= చాల పెద్ద, సూర్య-ఉపరాగః= సూర్య గ్రహణము, కల్పక్షయే= కల్పాంతమునందు వలె, ఆసీత్= కలిగెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...తరువాతి వృత్తాంతమును చెప్పుచున్నాను. బలరాముడు, శ్రీకృష్ణుడు ద్వారకా నగరములో నివసించుచుండిరి. ఒకనాడు కల్పాంతమునందు వలె సంపూర్ణ సూర్య గ్రహణము పట్టెను.

తం జ్ఞాత్వా మనుజా రాజన్ పురస్తాదేవ సర్వతః ।
సమంతపంచకం క్షేత్రం యయుశ్శ్రేయోవిధిత్సయా ॥ 2

రాజన్= ఓ రాజా!, మనుజాః= జనులు, పురస్తాత్ ఏవ= ముందుగానే, తమ్= దానిని గురించి, జ్ఞాత్వా= తెలుసుకొని, శ్రేయః= విధిత్సయా= మంగళమును చేయు కోరికతో, సర్వతః= అన్ని వైపులనుండి, సమంతపంచకమ్= సమంతపంచకమనే, క్షేత్రమ్= క్షేత్రమును గురించి, యయుః= వెళ్లిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ గ్రహణమును గురించి జనులకు ముందుగానే తెలిసెను. వారు ఈశ్వరుని ఆరాధించి తమకు మంగళమును

కలిగించుకొనే కోరికతో అన్ని ప్రాంతములనుండి సమంతపంచకమనే క్షేత్రమునకు వెళ్లిరి.

నిఃక్షత్రియం మహీం కుర్వన్ రామశ్శస్త్రభృతాం వరః ।
నృపాణాం రుధిరౌఘేన యత్ర చక్రే మహాహ్రదాన్ ॥ 3

శస్త్రభృతామ్= ఆయుధమును పట్టినవారిలో, వరః= శ్రేష్ఠుడగు, రామః= పరశురాముడు, మహీమ్= భూమిని, నిఃక్షత్రియామ్= క్షత్రియులు లేనిదానినిగా, కుర్వన్= చేయుచున్నవాడై, యత్ర= ఎక్కడనైతే, నృపాణామ్= రాజులయొక్క, రుధిర-ఓఘేన= రక్తధారచే, మహాహ్రదాన్= పెద్ద జలాశయములను, చక్రే= చేసెనో.

పరశురాముడు ఆయుధధారులలో దిట్ట. ఆయన భూమిపై క్షత్రియులు లేకుండా చేయగోరి, ఆ సమంతపంచకమునందు రాజుల రక్తధారలతో పెద్ద కుండములను తయారుచేసెను.

ఈజే చ భగవాన్ రామో యత్రాస్పృష్టోఽపి కర్మణా ।
లోకస్య గ్రాహయన్నీశో యథాఽన్యోఽఘపనుత్తయే ॥ 4

యత్ర= ఎక్కడనైతే, భగవాన్= పూజనీయుడు, ఈశః= సర్వసమర్థుడు అగు, రామః= పరశురాముడు, కర్మణా= కర్మచే, అస్పృష్టః అపి= స్పృశించబడనివాడే అయిననూ, లోకస్య= లోకమునకు, గ్రాహయన్= శిక్షణనిచ్చువాడై, అన్యః యథా= ఇతరుడు వలె, అఘ-అపనుత్తయే= పాపమును పోగొట్టుకొనుటకై, ఈజే చ= యజ్ఞమును కూడ చేసెనో.

అచటనే సర్వసమర్థుడగు పరశు రామ భగవానుడు యజ్ఞమును కూడ చేసెను. ఆయనకు పాపసంబంధము లేదు. అయినా, లోకమునకు శిక్షణనిచ్చుటకై ప్రాకృతజనుడు వలె పాపమును పోగొట్టుకొనుటకు అట్లు చేసెను.

మహత్యాం తీర్థయాత్రాయాం తత్రాగన్ భారతీః ప్రజాః ।
వృష్ణయశ్చ తథాఽక్రూరవసుదేవాహుకాదయః ॥ 5

మహత్యామ్= గొప్ప, తీర్థయాత్రాయామ్= తీర్థయాత్రయందు, భారతీః= భారతదేశమునందలి, ప్రజాః= జనులు, తత్ర= అచటకు, అగన్= వెళ్లిరి, తథా= అదే విధముగా, అక్రూరవసుదేవ-అహుక-ఆదయః= అక్రూరుడు వసుదేవుడు ఉగ్రసేనుడు మొదలగు, వృష్ణయః చ= యాదవులు కూడా.

ఆ గొప్ప తీర్థయాత్రాసందర్భములో భారతదేశములోని ప్రజలు అచటకు వెళ్లిరి. అక్రూరుడు, వసుదేవుడు, ఉగ్రసేనుడు మొదలగు యాదవులు కూడ వెళ్లిరి.

యయుర్భారత తత్ క్షేత్రం స్వమఘం క్షపయిష్ణవః ।
గదప్రద్యుమ్నసాంబాద్యాస్సుచంద్రశుకసారణైః ॥ 6

ఆస్తేఽనిరుద్ధో రక్షాయాం కృతవర్మా చ యూథపః ।

భారత= ఓ భరతవంశీయుడా!, గదప్రద్యుమ్నసాంబ-ఆద్యాః= గదుడు ప్రద్యుమ్నుడు సాంబుడు మొదలగువారు, స్వమ్= తమదైన, అఘమ్= పాపమును, క్షపయిష్ణవః= నశింపజేయు కోరిక గలవారై, తత్= ఆ, క్షేత్రమ్= క్షేత్రమును గురించి, యయుః= వెళ్లిరి, సుచంద్రశుక సారణైః= సుచంద్రుడు శుకుడు సారణులతో గూడి, అనిరుద్ధః అనిరుద్ధుడు, యూథపః= సేనానాయకుడగు, కృతవర్మా చ= కృతవర్మ కూడ, రక్షాయామ్= నగరరక్షణయందు, ఆస్తే= నిలిచియుండెను.

భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! గదుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు, చారుదేష్ణుడు మొదలగువారు తమ పాపములను పోగొట్టుకొన గోరి ఆ క్షేత్రమునకు వెళ్లిరి. గదుడు మరియు సేనానాయకుడగు కృతవర్మ సుచంద్రశుకసారణులతో గూడి ద్వారకారక్షణకై నిలిచియుండిరి.

తే రథైర్దేవధిష్ణ్యాభైర్వాయ్యశ్చ తరలప్లవైః । 7

గజైర్నదద్భిరభ్రాభైర్నృభిర్విద్యాధరద్యుభిః ।
వ్యరోచంత మహాతేజాః పథి కాంచనమాలినః ॥ 8

దివ్యస్రగ్వస్త్రసన్నాహాః కలత్రైః ఖేచరా ఇవ ।

తే= వారు, దేవధిష్ణ్య-ఆభైః= దేవతల విమానములను పోలిన, రథైః= రథములచే, తరలప్లవైః= కెరటములవలె సాగిపోయే, హయైః చ= గుర్రములచే కూడ, నదద్భిః= నాదము చేయునట్టియు, అభ్ర-ఆభైః = మేఘములను పోలిన, గజైః= ఏనుగులచే, విద్యాధరద్యుభిః= విద్యాధరుల కాంతివంటి కాంతి గల, నృభిః= మనుష్యులచే (వెళ్లిరి), మహాతేజాః= గొప్ప తేజశ్శాలురు, కాంచనమాలినః= బంగరు మాలలు గలవారు, దివ్యస్రగ్-వస్త్రసన్నాహాః= ప్రకాశించే మాలలు వస్త్రములు కవచములు గలవారు, కలత్రైః= భార్యలతో గూడి, పథి= మార్గమునందు, ఖేచరాః ఇవ= దేవతలు వలె, వ్యరోచంత= విశేషముగా ప్రకాశించిరి.

వారు దేవతల విమానములను పోలిన రథములపై, కెరటముల వలె సాగిపోయే గుర్రములపై, మేఘముల వలె నినదించే ఏనుగులపై, విద్యాధరులవలె ప్రకాశించే జనులు మోసే పల్లకీలపై భార్యలతో గూడి వెళ్లిరి. గొప్ప తేజశ్శాలురగు ఆ యాదవులు బంగరు మాలలు, ప్రకాశించే పుష్పమాలలు, వస్త్రములు, కవచములు గలవారై మార్గమునందు దేవతలు వలె విశేషముగా ప్రకాశించిరి.

తత్ర స్నాత్వా మహాభాగా ఉపోష్య సుసమాహితాః ॥ 9

బ్రాహ్మణేభ్యో దదుర్ధేనూర్వాసస్స్రగ్రుక్మమాలినీః ।
రామహ్రదేషు విధివత్పునరాప్లుత్య వృష్ణయః ॥ 10

మహాభాగాః= గొప్ప భాగ్యము గల, వృష్ణయః= యాదవులు, సుసమాహితాః= మిక్కిలి ఏకాగ్రమగు చిత్తము గలవారై, ఉపోష్య=

ఉపవాసము చేసి, విధివత్= యథావిధిగా, తత్ర= ఆ, రామహ్రదేషు= పరశురామకుండములయందు, స్నాత్వా= గ్రహణస్నానము చేసి, బ్రాహ్మణేభ్యః= బ్రాహ్మణుల కొరకు, వాసః-స్రగ్-రుక్మమాలినీః= వస్త్రము పుష్పమాల బంగరుమాల గల, ధేనూః= పాడియావులను, దదుః= ఇచ్చిరి, పునః= మరల, ఆప్లుత్య= స్నానము చేసి --.

గొప్ప భాగ్యవంతులైన యాదవులు మిక్కిలి ఏకాగ్రమగు చిత్తముతో ఉపవాసము చేసి యథావిధిగా ఆ పరశురామకుండములలో గ్రహణ-స్నానమును చేసిరి. వారు పాడియావులను వస్త్రము, పుష్పమాల, బంగరు మాలలతో అలంకరించి బ్రాహ్మణులకు దానము చేసిరి. తరువాత వారు మరల విముక్తిస్నానమును చేసిరి.

దదుస్సున్నం ద్విజాగ్ర్యేభ్యః కృష్ణే నో భక్తిరస్త్వితి ।
స్వయం చ తదనుజ్ఞాతా వృష్ణయః కృష్ణదేవతాః ॥ 11

కృష్ణదేవతాః= శ్రీకృష్ణుడే దైవముగా గల, వృష్ణయః= యాదవులు, నః= మాకు, కృష్ణే= శ్రీకృష్ణునియందు, భక్తిః= భక్తి, అస్తు= కలుగుగాక!, ఇతి= అని, ద్విజ-అగ్ర్యేభ్యః= బ్రాహ్మణశ్రేష్ఠులు కొరకు, సు-అన్నమ్= మంచి ఆహారమును, దదుః= ఇచ్చిరి, తద్-అనుజ్ఞాతాః= వారిచే అనుమతి ఈయబడినవారై, స్వయం చ= తాము కూడ.

యాదవులకు శ్రీకృష్ణుడే దైవము. మాకు శ్రీకృష్ణునియందు భక్తి కలుగుగాక! అని ప్రార్థించి, వారు బ్రాహ్మణశ్రేష్ఠులకు మంచి ఆహారము-నిచ్చి, వారి అనుమతితో తాము కూడ భుజించిరి.

భుక్త్వోపవివిశుః కామం స్నిగ్ధచ్ఛాయాఽంఘ్రిపాంఘ్రిషు ।
తత్రాగతాంస్తే దదృశుస్సుహృత్సంబంధినో నృపాన్ ॥ 12

భుక్త్వా= భుజించి, కామమ్= యథేచ్ఛగా, స్నిగ్ధచ్ఛాయా-అంఘ్రిప-అంఘ్రిషు= దట్టని నీడ గల చెట్ల మొదళ్లయందు, ఉపవివిశుః=

కూర్చుండిరి, తే= వారు, తత్ర= అచటకు, ఆగతాన్= వచ్చిన, సుహృత్-సంబంధినః= మిత్రులు బంధువులు అగు, నృపాన్= రాజులను, దదృశుః = చూచిరి.

వారు భుజించి దట్టని నీడ గల చెట్ల మొదళ్లయందు కూర్చుండిరి. వారచటకు వచ్చిన తమ బంధువులు, మిత్రులు అయిన రాజులను చూచిరి.

మత్స్యోశీనరకౌసల్యవిదర్భకురుసృంజయాన్ ।
కాంబోజకైకయాన్ మద్రాన్ కుంతీనానర్తకేరలాన్ ॥ 13

మత్స్య-ఉశీనరకౌసల్యవిదర్భకురుసృంజయాన్= మత్స్య ఉశీనర కౌసల్యవిదర్భకురుసృంజయ దేశరాజులను, కాంబోజకైకయాన్= కాంబోజ కేకయదేశరాజులను, మద్రాన్= మద్రదేశరాజును, కుంతీన్= కుంతి దేశరాజును, ఆనర్తకేరలాన్= ఆనర్తకేరలదేశముల రాజులను (చూచిరి).

వారు మత్స్య-ఉశీనర-కౌసల్య-విదర్భ-కురు-సృంజయ-కాంబోజ-కేకయ-మద్ర-కుంతి-ఆనర్త కేరళదేశముల రాజులను చూచిరి.

అన్యాంశ్చైవాత్మపక్షీయాన్ పరాంశ్చ శతశో నృప ।
నందాదీన్ సుహృదో గోపాన్ గోపీశ్చోత్కంఠితాశ్చిరమ్ ॥ 14

నృప= ఓ రాజా!, అన్యాన్ చ= ఇతరరాజులను కూడ, ఆత్మపక్షీ-యాన్= తమ పక్షమునకు చెందినవారిని, పరాన్ చ= పరపక్షీయులను కూడ, శతశః= వందలాదిగా, నంద-ఆదీన్-నందుడు మొదలుగా గల, సుహృదః= మిత్రులను, గోపాన్= గోపాలకులను, చిరమ్= చాలకాలము, ఉత్కంఠితాః= ఉత్కంఠ గల, గోపీః చ= గోపికలను కూడ (చూచిరి).

వారు ఇతరదేశముల రాజులను, తమ పక్షము (పాండవులు) వారిని, పర (దుర్యోధన) పక్షమువారిని వందల సంఖ్యలో చూచిరి. మరియు వారు నందుడు మొదలైన మిత్రులను, గోపాలకులను, చాలకాలము నుండి తహతహతో ఎదురు చూస్తున్న గోపికలను కూడ చూచిరి.

అన్యోన్యసందర్శనహర్షరంహసా ।
ప్రోత్ఫుల్లహృద్వక్త్రసరోరుహశ్రియః ।
ఆశ్లిష్య గాఢం నయనైస్రవజ్జలా
హృష్యత్త్వచో రుద్ధగిరో యయుర్ముదమ్ ॥ 15

అన్యోన్యసందర్శనహర్షరంహసా= ఒకరినొకరు చూచుట వలని హర్షముయొక్క వేగముచే, ప్ర–ఉత్ఫుల్లహృద్–వక్త్రసరః–రుహశ్రియః= బాగా వికసించిన హృదయములు పద్మములవంటి ముఖముల శోభ గలవారు, గాఢమ్= గట్టిగా, ఆశ్లిష్య= కౌగిలించుకొని, నయనైః= కన్నులచే, స్రవత్–జలాః= ప్రవహించుచున్న నీరు గలవారు, హృష్యత్–త్వచః= గగుర్పొడిచిన చర్మము గలవారు, రుద్ధగిరః= గద్గదమైన మాట గలవారు, ముదమ్= ఆనందమును, యయుః= పొందిరి.

ఒకరినొకరు చూచుటచే కలిగిన హర్షముయొక్క వేగముచే వారి హృదయములు, పద్మములవంటి ముఖములు బాగా విప్పారి శోభిల్లెను. వారు పరస్పరము గట్టిగా కౌగిలించుకున్నప్పుడు శరీరము గగుర్పాటును పొంది కన్నులగుండా ఆనందబాష్పములు ప్రవహించెను. ఆనందముతో వారి మాట గద్గదమాయెను.

స్త్రియశ్చ సంవీక్ష్య మిథోఽతిసౌహృద–।
స్మితామలాపాంగదృశోఽభిరేభిరే ।
స్తనైః స్తనాన్కుంకుమపంకరూషితాన్
నిహత్య దోర్భిః ప్రణయాశ్రులోచనాః ॥ 16

మిథః= పరస్పరము, సంవీక్ష్య= చూచి, అతిసౌహృదస్మిత-అమల-అపాంగదృశః= అతిశయించిన ప్రేమతోడి చిరునవ్వు స్వచ్ఛమైన కటాక్షములు గల కన్నులు గలవారు, ప్రణయ-అశ్రులోచనాః= ప్రేమచే నీరు నిండిన కన్నులు గలవారు అగు, స్త్రియః చ= స్త్రీలు కూడ, కుంకుమ పంకరూషితాన్= కుంకుమ ముద్దచే అలదబడిన, స్తనాన్= స్తనములను, స్తనైః= స్తనములతో, నిహత్య= నొక్కి, దోర్భిః= బాహువులతో, అభిరేభిరే= కౌగిలించుకొనిరి.

ఒకరినొకరు చూచినప్పుడు అతిశయించిన ప్రేమ వలన పుట్టిన చిరునవ్వు వారి కన్నుల స్వచ్ఛమగు కటాక్షములకు తోడాయెను. ఆ స్త్రీలు ప్రేమతో నీరు నిండిన కన్నులు గలవారై, కుంకుమ ముద్ద అలదిన స్తనములు నొక్కుకొనునట్లుగా బాహువులతో ఒకరినొకరు కౌగిలించుకొనిరి.

తతోఽభివాద్య తే వృద్ధాన్ యవిష్ఠైరభివాదితాః ।
స్వాగతం కుశలం పృష్ట్వా చక్రుః కృష్ణ కథా మిథః ॥ 17

తతః= తరువాత, తే= వారు, వృద్ధాన్= పెద్దలను, అభివాద్య= నమస్కరించి, యవిష్ఠైః= పిన్నలచే, అభివాదితాః= నమస్కరించబడిరి, మిథః= పరస్పరము, స్వాగతమ్= స్వాగతమును, కుశలమ్= క్షేమమును, పృష్ట్వా= అడిగి, కృష్ణకథాః= శ్రీకృష్ణుని గాథలను, చక్రుః= చేసిరి.

తరువాత ఆ యాదవులు పెద్దలకు నమస్కరించి పిన్నలచే నమస్కరించబడిరి. వారు పరస్పరము స్వాగతము పలికి, కుశలప్రశ్నలను వేసి, శ్రీకృష్ణుని గాథలను చెప్పుకుంటూ వినుచుండిరి.

పృథా భ్రాతౄన్ స్వసౄర్వీక్ష్య తత్పుత్రాన్ పితరావపి ।
భ్రాతృపత్నీర్ముకుందం చ జహౌ సంకథయా శుచః ॥ 18

పృథా= కుంతి, భ్రాతౄన్= సోదరులను, స్వస్రూఃర= చెల్లెళ్లను, తత్-పుత్రాన్= వారి పుత్రులను, పితరౌ అపి= తల్లిదండ్రులను కూడ, భ్రాతృపత్నీఃర= అన్నదమ్ముల భార్యలను, ముకుందం చ= శ్రీకృష్ణ భగవానుని కూడ, వీక్ష్య= చూచి, సంకథయా= ప్రేమపూర్వకమైన కబుర్లతో, శుచఃర= దుఃఖములను, జహౌ= విడిచిపెట్టెను.

కుంతి వసుదేవుడు మొదలగు పోదరులను, శ్రుతదేవి మొదలైన చెల్లెళ్లను, వారి పుత్రులైన బలరామాదులను, శూరుడు మొదలగు తల్లిదండ్రులను, దేవకి మొదలగు సోదరభార్యలను చూచి వారితో ప్రేమపూర్వకముగా కబుర్లాడి మనస్సులోని క్లేశములను విడిచిపెట్టెను.

కుంత్యువాచ ।

ఆర్యభ్రాతరహం మన్యే ఆత్మానమకృతాశిషమ్ ।
యద్వా ఆపత్సు మద్వార్తాం నానుస్మరథ సత్తమాఃర ॥ 19

కుంతిఃర= కుంతీదేవి, ఉవాచ= పలికెను, ఆర్యభ్రాతఃర= పెద్దన్నా!, అహమ్= నేను, ఆత్మానమ్= నన్ను, అకృత-ఆశిషమ్= చేయబడని పుణ్యము గలదానినిగా, మన్యే= తలచుచున్నాను, యత్= ఏలయన, సత్-తమాఃర= శ్రేష్ఠులగు మీరు, ఆపత్సు వా= ఆపదలయందైనా, మద్-వార్తామ్= నా వార్తను, న అనుస్మరథ= స్మరించకున్నారో.

కుంతి ఇట్లనెను... పెద్దన్నా! నేను పుణ్యము చేసినదానను కానని నా తలంపు. ఎందుకంటే, మీరు సత్పురుషులే అయినా, ఆపదలలోనైనా నన్ను స్మరించకుంటిరి.

సుహృదో జ్ఞాతయఃర పుత్రా భ్రాతరఃర పితరావపి ।
నానుస్మరంతి స్వజనం యస్య దైవమదక్షిణమ్ ॥ 20

సుహృదఃర= మిత్రులు, జ్ఞాతయఃర= జ్ఞాతులు, పుత్రాఃర= పుత్రులు, భ్రాతరఃర= అన్నదమ్ములు, పితరౌ అపి= తల్లిదండ్రులు కూడ, స్వజనమ్=

తమ వ్యక్తిని, న అనుస్మరంతి= గుర్తు చేసుకొనరు, యస్య= ఎవనికైతే, దైవమ్= దైవము, అదక్షిణమ్= ప్రతికూలమో.

ఎవనికి దైవము ప్రతికూలముగనుండునో, అట్టి తమ వ్యక్తిని మిత్రులు, జ్ఞాతులు, పుత్రులు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు కూడ మరచెదరు.

వసుదేవ ఉవాచ ।

అంబ మాఽస్మానసూయేథా దైవక్రీడనకాన్నరాన్ ।
ఈశస్య హి వశే లోకః కురుతే కార్యతేఽథవా ॥ 21

వసుదేవః= వసుదేవుడు, ఉవాచ= పలికెను, అంబ= అమ్మా!, దైవక్రీడనకాన్- దైవమునకు ఆటబొమ్మలైన, నరాన్= మానవులమగు, అస్మాన్= మమ్ములను, మా అసూయేథాః= తప్పు పట్టకుము, హి= ఏలయన, ఈశస్య= ఈశ్వరుని, వశే= వశము-నందలి, లోకః= మానవుడు, కురుతే= చేయును, అథవా= లేదా, కార్యతే= చేయించబడును.

వసుదేవుడిట్లు పలికెను...అమ్మా! మేము దైవము చేతిలో ఆట-బొమ్మలైన మానవులము. మమ్ము తప్పు పట్టకుము. మనిషి ఈశ్వరుని వశములోనుండి పని చయును; లేదా, ఈశ్వరునిచేతనే చేయించబడును.

కంసప్రతాపితాస్సర్వే వయం యాతా దిశం దిశమ్ ।
ఏతర్హ్యేవ పునః స్థానం దైవేనాసాదితాస్స్వసః ॥ 22

స్వసః= ఓ చెల్లీ!, కంసప్రతాపితాః= కంసునిచే పీడించబడిన, వయమ్= మేము, సర్వే= అందరము, దిశం దిశమ్= ప్రతి దిక్కును గురించి, యాతాః= వెళ్లినవారము, ఏతర్హి ఏవ= ఇప్పుడిప్పుడే, పునః= మరల, దైవేన= దైవముచే, స్థానమ్= స్వస్థానమును, ఆసాదితాః= పొందించబడితిమి.

ఓ చెల్లీ! కంసునిచే పీడించబడిన మేము పలు దిక్కులకు పారిపోతిమి. ఇప్పుడిప్పుడే దైవము మమ్ము మరల స్వస్థానమునకు తెచ్చినాడు.

శ్రీశుక ఉవాచ ।

వసుదేవోగ్రసేనాద్యైర్యదుభిస్తేఽర్చితా నృపాః ।
ఆసన్నచ్యుతసందర్శపరమానందనిర్వృతాః ॥ 23

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, వసుదేవ-ఉగ్రసేన-ఆద్యైఃః= వసుదేవుడు ఉగ్రసేనుడు మొదలగు వారిచే, అర్చితాఃః= సత్కరించబడిన, తే= ఆ, నృపాఃః= రాజులు, అచ్యుత-సందర్శపరమ-ఆనందనిర్వృతాఃః= శ్రీకృష్ణ భగవానుని దర్శనము వలని మహానందముచే సంతోషించినవారై, ఆసన్= ఉండిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...వసుదేవుడు, ఉగ్రసేనుడు, అక్రూరుడు మొదలగువారు అచటకు వచ్చిన రాజులను సత్కరించిరి. ఆ రాజులు శ్రీకృష్ణ భగవానుని దర్శనము వలన మహానందమును పొంది సంతోషముగా నుండిరి.

భీష్మో ద్రోణోఽంబికాపుత్రో గాంధారీ ససుతా తథా ।
సదారాః పాండవాః కుంతీ సృంజయో విదురః కృపః ॥ 24

కుంతిభోజో విరాటశ్చ భీష్మకో నగ్నజిన్మహాన్ ।
పురుజిద్ద్రుపదశ్శల్యో ధృష్టకేతుస్సకాశిరాట్ ॥ 25

దమఘోషో విశాలాక్షో మైథిలో మద్రకేకయౌ ।
యుధామన్యుస్సుశర్మా చ ససుతా బాహ్లికాదయః ॥ 26

రాజానో యే చ రాజేంద్ర యుధిష్ఠిరమనువ్రతాః ।
శ్రీనికేతం వపుశ్శ్రైస్స్త్రీకం వీక్ష్య విస్మితాః ॥ 27

రాజ-ఇంద్ర= ఓ మహారాజా!, భీష్మః= భీష్ముడు, ద్రోణః= ద్రోణుడు, అంబికాపుత్రః= అంబికయొక్క పుత్రుడగు ధృతరాష్ట్రుడు, తథా= అదే విధముగా, ససుతా= పుత్రులతో గూడిన, గాంధారీ= గాంధారి, సదారాః= భార్యలతో గూడిన, పాండవాః= పాండవులు, కుంతీ= కుంతి, సృంజయః= సృంజయుడు, విదురః= విదురుడు, కృపః = కృపాచార్యుడు, కుంతిభోజః= కుంతిభోజుడు, విరాటః చ= విరాటుడు, భీష్మకః= భీష్మకుడు, మహాన్= గొప్ప, నగ్నజిత్= నగ్నజిత్తు, పురుజిత్= పురుజిత్తు, ద్రుపదః= ద్రుపదుడు, శల్యః= శల్యుడు, సకాశిరాట్= కాశీరాజుతో గూడిన, ధృష్టకేతుః= ధృష్టకేతువు, దమఘోషః= దమఘోషుడు, విశాలాక్షః= విశాలాక్షుడు, మైథిలః= మిథిలానరేశుడు, మద్రకేకయౌ= మద్రరాజు కేకయరాజు, యుధామన్యుః= యుధామన్యువు, సుశర్మా చ= సుశర్మ, ససుతాః= పుత్రులతో కూడియున్న, బాహ్లిక-ఆదయః= బాహ్లికుడు మొదలగువారు, యే= ఏ, రాజానః చ= రాజులైతే, యుధిష్ఠిరమ్= ధర్మరాజును, అనువ్రతాః= అనుసరించువారో, శౌరేః= శ్రీకృష్ణునియొక్క, శ్రీనికేతమ్= శోభకు నిధానమైన, సస్త్రీకమ్= భార్యలతో గూడియున్న, వపుః= రూపమును, వీక్ష్య= చూచి, విస్మితాః= ఆశ్చర్య-చకితులు.

ఓ పరీక్షిన్మహారాజా! భీష్ముడు, ద్రోణుడు, అంబికాపుత్రుడగు ధృతరాష్ట్రుడు, దుర్యోధనాదులతో కూడిన గాంధారి, భార్యలతో కూడిన పాండవులు, కుంతి, సృంజయుడు, విదురుడు, కృపాచార్యుడు, కుంతిభోజుడు, విరాటుడు, భీష్మకుడు, గొప్పవాడగు నగ్నజిత్తు, పురుజిత్తు, ద్రుపదుడు, శల్యుడు, ధృష్టకేతువు, కాశీరాజు, దమఘోషుడు, విశాలాక్షుడు, మిథిలామద్రకేకయరాజులు, యుధామన్యువు, సుశర్మ, కొడుకులతో కూడిన బాహ్లికుడు, ఇతరరాజులు, ధర్మరాజు అనుయాయు లగు రాజులు అందాల రాశియగు శ్రీకృష్ణుని రూపమును, ఆయన భార్యలను చూచి ఆశ్చర్యచకితులైరి.

అథ తే రామకృష్ణాభ్యాం సమ్యక్ ప్రాప్తసమర్హణాః ।
ప్రశశంసుర్ముదా యుక్తా వృష్ణీన్ కృష్ణపరిగ్రహాన్ ॥ 28

అథ= తరువాత, రామకృష్ణాభ్యామ్= బలరామ శ్రీకృష్ణులచే, సమ్యక్= బాగుగా, ప్రాప్తసమర్హణాః= పొందబడిన సత్కారములు గల, తే= ఆ రాజులు, ముదా= ఆనందముతో, యుక్తాః= కూడినవారై, కృష్ణపరిగ్రహాన్= కృష్ణుని స్వజనులైన, వృష్ణీన్= యాదవులను, ప్రశశంసుః = కొనియాడిరి.

తరువాత బలరామ శ్రీకృష్ణులచే ఆ రాజులు సత్కరించబడిరి. వారానందముతో శ్రీకృష్ణునకు తనవారైన యాదవులను కొనియాడిరి.

అహో భోజపతే యూయం జన్మభాజో నృణామిహ ।
యత్పశ్యథాసకృత్కృష్ణం దుర్దర్శమపి యోగినామ్ ॥ 29

అహో= ఆహా!, భోజపతే= భోజరాజా!, ఇహ= ఈ లోకమునందు, నృణామ్= మానవులలో, యూయమ్= మీరు, జన్మభాజః= సఫలమైన జన్మ గలవారు, యత్= ఏలయన, యోగినాం అపి= యోగులకు కూడ, దుర్దర్శమ్= దర్శింప శక్యము కాని, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అసకృత్= సర్వదా, పశ్యథ= చూచెదరు.

ఆహా! భోజప్రభుడవగు ఓ ఉగ్రసేనా! ఈ లోకమునందు మానవులలో మీరే సఫలమైన జన్మ గలవారు. ఏలయన, యోగులకైననూ దర్శింప శక్యము కాని శ్రీకృష్ణుని మీరు సర్వదా చూచెదరు.

యద్విశ్రుతిశ్రుతినుతేదమలం పునాతి
పాదావనేజనపయశ్చ వచశ్చ శాస్త్రమ్ ।
భూః కాలభర్జితభగాఽపి యదంఘ్రిపద్మ-
స్పర్శోత్థశక్తిరభివర్షతి నోఽఖిలార్థాన్ ॥ 30

శ్రుతినుతా= వేదములచే కొనియాడబడిన, యద్-విశ్రుతిః= ఎవ్వాని కీర్తి, పాద-అవనేజనపయః చ= పాదములను కడిగిన నీరు, వచః= వాక్కు అయిన, శాస్త్రం చ= వేదము కూడ, ఇదమ్= ఈ జగత్తును, అలమ్= మిక్కిలి, పునాతి= పవిత్రము చేయునో, కాలభర్జితభగా అపి= కలికాలముచే నశింపజేయబడిన శక్తి గలదియే అయినా, భూః= భూమి, యద్-అంఘ్రిపద్మస్పర్శ-ఉత్థశక్తిః= ఎవ్వాని పద్మములవంటి పాదముల స్పర్శచే ఆవిర్భవించిన శక్తి గలదియై, నః= మనకు, అఖిల-అర్థాన్= సకలపురుషార్థములను, అభివర్షతి= వర్షించుచున్నదో.

వేదములచే కొనియాడబడిన శ్రీకృష్ణ భగవానుని కీర్తి, ఆయన పాదములను కడిగిన నీరు గంగ, ఆయన వాక్కు అయిన వేదము కూడ ఈ జగత్తును మిక్కిలి పవిత్రము చేయుచున్నవి. భూమియొక్క శక్తిని కలికాలము నశింపజేసినా, ఆయన పద్మములవంటి పాదముల స్పర్శచే శక్తి ఆవిర్భవించిన భూమి మనకు సకలపురుషార్థములను వర్షించుచున్నది.

తద్దర్శనస్పర్శనానుపథప్రజల్ప-
శయ్యాఽఽసనాశనసయౌనసపిండబంధః ।
యేషాం గృహే నిరయవర్త్మని వర్తతాం వః
స్వర్గాపవర్గవిరమస్స్వయమాస విష్ణుః ॥ 31

నిరయవర్త్మని= ప్రవృత్తిమార్గమునందు, వర్తతామ్= ఉంటున్న, యేషామ్= ఏ, వః= మీకు, తద్- దర్శనస్పర్శన- అనుపథప్రజల్పశయ్యా- ఆసన-ఆశనసయౌనసపిండబంధః= ఆయనను చూచుట స్పృశించుట కలిసి నడుచుట మాటలాడుట నిద్రించుట కూర్చుండుట తినుట వివాహబంధముతో కూడిన దేహసంబంధమో, స్వర్గ-అపవర్గవిరమః= స్వర్గమోక్షములనుండి విరమింప జేసే, విష్ణుః= శ్రీహరి, స్వయమ్= స్వయముగా, గృహే= ఇంటియందు, ఆస= ఉండెనో.

మీరు ప్రవృత్తిమార్గమునందున్నా శ్రీకృష్ణ భగవానుని చూచి స్పృశించెదరు;, ఆయనతో కబుర్లాడుతూ కలిసి నడిచెదరు; ఆయనతో కలిసి తిని కూర్చుండి నిద్రించెదరు; మీకు ఆయనతో వివాహబంధముతో కూడిన దైహికసంబంధము గలదు. స్వర్గమోక్షముల అన్వేషణను విరమింపజేసే ఆయన స్వయముగా మీ ఇంటిలో ఉన్నాడు.

శ్రీశుక ఉవాచ ।

నందస్తత్ర యదూన్ ప్రాప్తాన్ జ్ఞాత్వా కృష్ణపురోగమాన్ ।
తత్రాగమద్ధృతో గోపైరనస్థార్థైర్దిదృక్షయా ॥ 32

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, కృష్ణపురోగమాన్= శ్రీకృష్ణుడు మొదలుగా గల, యదూన్= యాదవులను, తత్ర= అచటకు, ప్రాప్తాన్= వచ్చినవారినిగా, జ్ఞాత్వా= తెలుసుకొని, నందః= నందుడు, అనస్థ-అర్థైః= బళ్లయందున్న సామగ్రి గల, గోపైః= గోపాలకులతో, వృతః= కూడినవాడై, దిదృక్షయా= చూచే కోరికతో, తత్ర= అచటకు, అగమత్= వెళ్లెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణుడు, బలరాముడు మొదలైన యాదవులు ఆ సమంతపంచకమునకు వచ్చిరని తెలిసి నందుడు వారిని చూడగోరెను. గోపాలకులు బళ్లపై సామగ్రిని సర్దుకొని బయలుదేరిరి. ఆయన వారితో గూడి అచటకు విచ్చేసెను.

తం దృష్ట్వా వృష్ణయో హృష్టాస్తన్వ్ః ప్రాణమివోత్థితాః ।
పరిషస్వజిరే గాఢం చిరదర్శనకాతరాః ॥ 33

తమ్= ఆయనను, దృష్ట్వా= చూచి, హృష్టాః= హర్షమును పొందిన, వృష్ణయః= యాదవులు, చిరదర్శనకాతరాః= చాల కాలము తరువాత కలిగిన దర్శనముచే వ్యాకులచిత్తులై, తన్వ్ః= అంగములు,

ప్రాణం ఇవ= ముఖ్యప్రాణమును వలె, ఉత్థితాః= లేచి నిలబడినవారై, గాఢమ్= గట్టిగా, పరిషస్వజిరే= కౌగిలించుకొనిరి.

ముఖ్యప్రాణము రాగానే అవయవముల చేష్టలు ఆరంభమగును. అదే విధముగా, ఆ నందుని చూచి యాదవులు హర్షముతో లేచి నిలబడిరి. చాల కాలము తరువాత చూచుటచే వ్యాకులమైన చిత్తము గల యాదవులాయనను గట్టిగా కౌగిలించుకొనిరి.

వసుదేవః పరిష్వజ్య సంప్రీతః ప్రేమవిహ్వలః ।
స్మరన్ కంసకృతాన్ క్లేశాన్ పుత్రన్యాసం చ గోకులే ॥ 34

సంప్రీతః= చాల ప్రీతి జెందినవాడు, ప్రేమవిహ్వలః= ప్రేమచే పరవశుడు అగు, వసుదేవః= వసుదేవుడు, పరిష్వజ్యః= కౌగిలించుకొని, కంసకృతాన్= కంసునిచే చేయబడిన, క్లేశాన్= కష్టములను, గోకులే= గోకులమునందు, పుత్రన్యాసం చ= పుత్రుడగు శ్రీకృష్ణుని అప్పజెప్పుటను కూడ, స్మరన్= స్మరించువాడు.

వసుదేవుడు చాల ప్రీతి జెంది ప్రేమకు పరవశుడై నందుని కౌగిలించుకొనెను. ఆయన కంసుడు పెట్టిన బాధలను, శ్రీకృష్ణుని నందగోకులములో దాచిపెట్టుటను కూడ గుర్తు చేసుకొనెను.

కృష్ణరామౌ పరిష్వజ్య పితరావభివాద్య చ ।
న కించనోచతుః ప్రేమ్ణా సాశ్రుకంఠౌ కురూద్వహ ॥ 35

కురు-ఉద్వహ= కురువంశశ్రేష్ఠా!, కృష్ణరామౌ= శ్రీకృష్ణుడు బలరాముడు, పితరౌ= తల్లిదండ్రులను, అభివాద్య= నమస్కరించి, పరిష్వజ్య చ= కౌగిలించుకొని, ప్రేమ్ణా= ప్రేమచే, స-అశ్రుకంఠౌ= కన్నీటితో కూడిన కంఠములు గలవారై, కించన= దేనినీ, న ఊచతుః= పలుకలేదు.

కురువంశశ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! బలరామ శ్రీకృష్ణులు తల్లిదండ్రులను నమస్కరించి కౌగిలించుకొనిరి. ప్రేమచే వారి కళ్లు నీటితో నిండి కంఠము గద్గదమగుటచే ఏమీ మాటలాడలేకపోయిరి.

తావాత్మాసనమారోప్య బాహుభ్యాం పరిరభ్య చ ।
యశోదా చ మహాభాగా సుతౌ విజహతుశ్శుచః ॥ 36

మహాభాగా= గొప్ప పుణ్యాత్ములరాలగు, యశోదా= యశోద, చ= నందుడు కూడ, తౌ= ఆ, సుతౌ= పుత్రులిద్దరిని, ఆత్మాసనమ్= తమ ఒడిని, ఆరోప్య= ఎక్కించుకొని, బాహుభ్యామ్= చేతులతో, పరిరభ్య చ= కౌగిలించుకొని, శుచః= దుఃఖముల (కన్నీళ్ల) ను, విజహతుః= విడిచిపెట్టిరి.

గొప్ప పుణ్యాత్ములరాలగు యశోద మరియు నందుడు ఆ కొడుకులిద్దరిని తమ ఒడిలో కూర్చుండబెట్టుకొని, చేతులతో కౌగిలించుకొని దుఃఖములను (కన్నీళ్లను) విడిచిపెట్టిరి.

రోహిణీ దేవకీ చాథ పరిష్వజ్య వ్రజేశ్వరీమ్ ।
స్మరంత్యౌ తత్కృతాం మైత్రీం బాష్పకంఠ్యౌ సమూచతుః ॥37

అథ= తరువాత, రోహిణీ= రోహిణి, దేవకీ చ= దేవకి కూడ, వ్రజ–ఈశ్వరీమ్= గోకులరాణియగు యశోదను, పరిష్వజ్య= కౌగిలించు–కొని, తత్–కృతామ్= ఆమేచే చేయబడిన, మైత్రీమ్= మైత్రిని, స్మరంత్యౌ= గుర్తు చేసుకొనువారై, బాష్పకంఠ్యౌ= కన్నీరుతో కూడిన కంఠములు గలవారై, సమూచతుః= పలికిరి.

రోహిణి మరియు దేవకి గోకులరాణియగు యశోదను కౌగిలించుకొనిరి. యశోద చూపిన మైత్రి (పుత్రుని రక్షించుట) గుర్తుకు వచ్చి, వారిద్దరి కళ్లలో నీరు ఉబికి కంఠములు రుద్ధములాయెను. వారామెతోనిట్లనిరి.

కా విస్మరేత వాం మైత్రీమనివృత్తాం వ్రజేశ్వరి ।
అవాప్యాప్యైంద్రమైశ్వర్యం యస్యా నేహ ప్రతిక్రియా ॥ 38

వ్రజ-ఈశ్వరి= ఓ గోకులరాణీ!, ఐంద్రమ్= ఇంద్రునకు చెందిన, ఐశ్వర్యమ్= సంపదను, అవాప్య అపి= పొంది కూడా, కా= ఎవతె, వామ్= మీ యిద్దరి, అనివృత్తామ్= ఋణము తీర్చుట లేని, మైత్రీమ్= ప్రేమను, విస్మరేత= మరచిపోవును?, యస్యాఃఏ ప్రేమకు, ప్రతిక్రియా= ప్రతిగా చేయదగినది, ఇహ= ఈ లోకమునందు, న= లేదో.

ఓ గోకులరాణీ! ఇంద్రైశ్వర్యము లభించినా మీ ఇద్దరి (యశోదా-నందుల) ప్రేమను ఎవతె మరువగలదు? మీ ప్రేమకు ప్రతిగా చేయదగ్గది ఈ లోకములో లేదు. మీ ఋణమును తీర్చుట శక్యము కాదు.

ఏతావదృష్టపితరౌ యువయోస్స్మ పిత్రోః
సంప్రీణనాభ్యుదయపోషణపాలనాని ।
ప్రాప్యోషతుర్భవతి పక్ష్మ హ యద్వదక్ష్ణోః
న్యస్తావకుత్ర చ భయౌ న సతాం పరస్స్వాః ॥ 39

భవతి= ఓ పూజనీయురాలా!, అదృష్టపితరౌ= కనబడని తల్లిదండ్రులు గలవారు, అక్ష్ణోఃకళ్లకు, పక్ష్మ యద్వత్= రెప్ప వలె, పిత్రోఃతల్లి దండ్రులైన, యువయోఃమీ యిద్దరివద్ద, న్యస్తౌ= అప్పజెప్పబడిన, ఏతౌ= వీరిద్దరు, సంప్రీణన-అభ్యుదయపోషణ పాలనాని= ప్రీతిని కలిగించుట అభ్యుదయము పోషించుట రక్షణలను, ప్రాప్య= పొంది, అకుత్ర చ భయౌ= ఎక్కడైననూ భయము లేనివారై, ఊషతుఃనివసించిరి, సతామ్= సత్పురుషులకు, పరఃపరాయివాడు, స్వఃతనవాడు, న= ఉండరు.

ఓ పూజనీయురాలా! ఈ బలరామ శ్రీకృష్ణులు కన్న తల్లిదండ్రుల-నెరుగరు. వారికి మీరే తల్లిదండ్రులు. వారిని మీకు అప్పజెప్పగా మీరే

వారిని కంటికి రెప్పలా పోషించి పాలించి ప్రేమను జూపి అభివృద్ధిని కలిగించితిరి. వారు మీ వద్ద ఎట్టి భయమైనా లేకుండా నివసించిరి. సత్పురుషులకు స్వపరభేదము ఉండదు.

శ్రీశుక ఉవాచ ।

గోప్యశ్చ కృష్ణముపలభ్య చిరాదభీష్టం
యత్ప్రేక్షణే దృశిషు పక్ష్మకృతం శపంతి
దృగ్భిర్హృదీకృతమలం పరిరభ్య సర్వాః
తద్భావమాపురపి నిత్యయుజాం దురాపమ్ ॥ 40

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సర్వాః= అందరు, గోప్యః చ= గోపికలు కూడ, అభీష్టమ్= ప్రియతముడగు, కృష్ణమ్= శ్రీకృష్ణుని, చిరాత్= చాలకాలమునకు, ఉపలభ్య= చూచి, యత్–ప్రేక్షణే= ఎవనిని చూచుటయందు, దృశిషు= కళ్లయందు, పక్ష్మకృతమ్= రెప్పపాటును పెట్టిన దైవమును, శపంతి= నిందించెదరో, దృగ్భిః= చూపులతో, హృదీకృతమ్= హృదయమునందు ప్రవేశపెట్టబడిన శ్రీకృష్ణుని, అలమ్= గట్టిగా, పరిరభ్య= కౌగిలించుకొని, నిత్యయుజాం అపి= నిత్యమైన యోగనిష్ఠ గలవారికి కూడ, దూరాపమ్= పొంద శక్యము కాని, తద్–భావమ్= ఆయనతోడి ఐక్యమును, ఆపుః= పొందిరి.

శ్రీశుకమహర్షి ఇట్లు పలికెను...గోపికలందరు కూడ చాలకాలము తరువాత ప్రియతముడగు శ్రీకృష్ణుని చూచిరి. ఆయనను చూచునప్పుడు కంటికి రెప్పపాటును పెట్టిన బ్రహ్మదేవుని వారు తిట్టుచుందురు. వారాయనను చూపులతో హృదయములో ప్రతిష్ఠించి గట్టిగా కౌగిలించుకొని ఆయనతో ఐక్యమును పొందిరి. అది సర్వదా యోగనిష్ఠ గలవారికైననూ పొంద శక్యము కాదు.

భగవాంస్తాస్తథాభూతా వివిక్త ఉపసంగతః ।
ఆశ్లిష్యానామయం పృష్ట్వా ప్రహసన్నిదమబ్రవీత్ ॥ 41

తథాభూతాః= ఆ స్థితిని పొందియున్న, తాః= ఆ గోపికలను, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, వివిక్తే= ఏకాంతమునందు, ఉపసంగతః = కలుసుకున్నవాడై, ఆశ్లిష్య= కౌగిలించి, అనామయమ్= ఆరోగ్యమును గురించి, పృష్ట్వా= ప్రశ్నించి, ప్రహసన్= నవ్వుచున్నవాడై, ఇదమ్= ఈ మాటను, అబ్రవీత్= పలికెను.

అట్టి భావైక్యమును పొందియున్న ఆ గోపికలను శ్రీకృష్ణ భగవానుడు ఏకాంతములో కలిసి కౌగిలించి కుశలప్రశ్నలను వేసి నవ్వుతూ ఇట్లనెను.

అపి స్మరథ నస్సఖ్యస్స్వానామర్థచికీర్షయా ।
గతాంశ్చిరాయితాఞ్ఛత్రుపక్షక్షపణచేతసః ॥ 42

సఖ్యః= ఓ చెలికత్తెలారా!, స్వానామ్= నావారలకు, అర్థచికీర్షయా= ప్రయోజనములను సాధించే కోరికతో, గతాన్= వెళ్లినట్టియు, చిరాయితాన్= విలంబము చేసినట్టియు, శత్రుపక్షక్షపణచేతసః= శత్రుపక్షమును నశింప-జేయుటయందు చిత్తము గల, నః= మమ్ములను, అపి స్మరథ= స్మరించు-చున్నారా?

ఓ చెలికత్తెలారా! శత్రుపక్షీయులను నశింపజేసి నా వారలకు ప్రయోజనములను చేకూర్చుటపై నా మనస్సు లగ్నమయ్యెను. అందు-కొరకై వెళ్లిన నేను విలంబమే చేసితిని. నేను మీకు గుర్తు ఉన్నానా?

అప్యవధ్యాయథాఽస్మాన్ స్విదకృతజ్ఞావిశంకయా ।
నూనం భూతాని భగవాన్ యునక్తి వియునక్తి చ ॥ 43

అకృతజ్ఞ-ఆవిశంకయా= కృతజ్ఞుడు కాదనే చిన్న శంకతో, అస్మాన్= మమ్ములను, అపి స్విత్ అవధ్యాయథాఃఁ= చెడుగా తలపోయుట లేదు గదా?, భగవాన్= భగవంతుడు, భూతాని= ప్రాణులను, యునక్తి= కలుపును, వియునక్తి చ= విడదీయును కూడ, నూనమ్= నిశ్చయము.

నేను కృతజ్ఞుడను కాననే చిన్న శంకతో మీరు నా గురించి చెడుగా తలపోయుట లేదు గదా? భగవంతుడు నిశ్చయముగా ప్రాణులను కలిపి విడదీయుచుండును.

వాయుర్యథా ఘనానీకం తృణం తూలం రజాంసి చ ।
సంయోజ్యాక్షిపతే భూయస్తథా భూతాని భూతకృత్ ॥ 44

యథా= ఏ విధముగా, వాయుఃఁ= గాలి, ఘన-అనీకమ్-మేఘముల గుంపును, తృణమ్= గడ్డిని, తూలమ్= దూదిని, రజాంసి చ= ధూళిని, సంయోజ్య= కలిపి, భూయఃఁ= మరల, ఆక్షిపతే= అంతటా విసిరివేయునో, తథా= అదే విధముగా, భూతకృత్= సృష్టికర్త, భూతాని= ప్రాణులను --.

గాలి మేఘముల గుంపును, గడ్డిని, దూదిని, ధూళిని కలిపి మరల అంతటా చెల్లాచెదరు చేయును. అదే విధముగా, సృష్టికర్త (కాలము) ప్రాణులను కలిపి విడదీయును.

మయి భక్తిర్హి భూతానామమృతత్వాయ కల్పతే ।
దిష్ట్యా యదాసీన్మత్స్నేహో భవతీనాం మదాపనః ॥ 45

భూతానామ్= ప్రాణులకు, మయి= నాయందు, భక్తిఃఁ= భక్తి, అమృతత్వాయ= మోక్షము కొరకు, కల్పతే= సమర్థమగుచున్నది, హి= నిశ్చయము, భవతీనామ్= పూజనీయలగు మీకు, మద్-ఆపనఃఁ= నన్ను

పొందించే, మత్-స్నేహః= నాయందలి ప్రేమ, ఆసీత్= కలిగెను, యత్= అనేది యేది గలదో అది, దిష్ట్యా= మంగళము.

నాయందలి భక్తి ప్రాణులకు మోక్షమునీయ సమర్థమగుచున్నది. ఇది నిశ్చయము. నన్ను పొందునట్లు చేసే నాయందలి భక్తి పూజనీయ-లగు మీకు కలుగుట అనేది మంగళము.

అహం హి సర్వభూతానామాదిరంతోఽంతరం బహిః ।
భౌతికానాం యథా ఖం వార్భూర్వాయుర్జ్యోతిరంగనాః ॥ 46

అంగనాః= ఓ యువతులారా!, హి= ఏలయన, సర్వభూతానామ్= సకలప్రాణులకు, ఆదిః= కారణము, అంతః= విలీనమయ్యే అధిష్ఠానము, అంతరమ్= లోపల, బహిః= బయట, యథా= ఏ విధముగానైతే, భౌతికానామ్= ప్రపంచములోని పదార్థములకు, ఖమ్= ఆకాశము, వాః = నీరు, భూః= పృథివి, వాయుః= వాయువు, జ్యోతిః= అగ్నియో.

యువతులారా! ఎందుకంటే, జగత్తులో సకలపదార్థములు పృథివి. జలము-అగ్ని-వాయువు-ఆకాశములనే పంచభూతములనుండి పుట్టి వాటిలోనే విలీనమగును. అదే విధముగా, సకలప్రాణులు నానుండి పుట్టి నాలో విలీనమగును. ప్రాణుల లోపల (అంతర్యామి), బయట (కాలము) నేనే.

ఏవం హ్యేతాని భూతాని భూతేష్వాత్మాఽఽత్మనా తతః ।
ఉభయం మయ్యథ పరే పశ్యతాభాతమక్షరే ॥ 47

ఏవమ్= ఈ విధముగా, ఏతాని= ఈ, భూతాని= భౌతిక పదార్థములు, భూతేషు= పంచభూతముల యందు, ఆత్మా= ఆత్మ, ఆత్మనా= భోక్తగా, తతః= వ్యాపించియున్నది, ఉభయమ్= రెండింటిని,

పరే= అతీతమైనట్టియు, అక్షరే= అవినాశియగు, మయి= నాయందు, ఆభాతమ్= ప్రకాశించుదానినిగా, పశ్యత= కనుడు.

ఈ విధముగా జగత్తులోని భౌతికపదార్థములు, ప్రాణుల దేహములు పంచభూతములయందు ప్రతిష్ఠ గలవి. పరమాత్మ వాటి-యందు భోక్తయగు జీవుడు రూపముగా వ్యాపించియున్నాడు. పాంచ-భౌతికదేహము, భోక్తయగు జీవుడు అనే రెండు వాటికి అతీతమైన అవినాశియగు నాయందు ప్రకాశించుచున్నవని తెలియుడు.

శ్రీశుక ఉవాచ ।

అధ్యాత్మశిక్షయా గోప్య ఏవం కృష్ణేన శిక్షితాః ।
తదనుస్మరణధ్వస్తజీవకోశాస్తమధ్యగన్ ॥ 48

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, గోప్యః= గోపికలు, ఏవమ్= ఈ విధముగా, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, అధ్యాత్మశిక్షయా= ఆత్మతత్త్వము నుపదేశించుటచే, శిక్షితాః= వివేక వతులుగా చేయబడిన వారు, తద్-అనుస్మరణధ్వస్తజీవకోశాః= ఆయనను నిరంతరముగా స్మరించుటచే నశింపజేయబడిన లింగశరీరరూపమైన బంధము గలవారై, తమ్= ఆయనను, అధ్యగన్= పొందిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఈ విధముగా శ్రీకృష్ణుడు గోపికలకు ఆత్మతత్త్వమునుపదేశించి వివేకవతులుగా చేసెను. వారాయననే నిరంతరముగా స్మరించుటచే వారిలోని పరిచ్ఛిన్నభావము నశించి, వారాయనను ఆత్మరూపముగా పొందిరి (జీవన్ముక్తులైరి).

ఆహుశ్చ తే నలిననాభ పదారవిందం
యోగేశ్వరైర్హృది విచింత్యమగాధబోధైః ।
సంసారకూపపతితోత్తరణావలంబం
గేహంజుషామపి మనస్యుదియాత్సదా నః ॥ 49

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ద్వ్యశీతితమోఽధ్యాయః

తే చ= వారైతే, ఆహుః= పలికిరి, నలిననాభ= ఓ పద్మనాభా!, అగాధబోధైః= లోతైన జ్ఞానము గల, యోగ-ఈశ్వరైః= యోగేశ్వరులచే, హృది= హృదయమునందు, విచింత్యమ్= ధ్యానించబడునది, సంసార-కూపపతిత-ఉత్తరణ-అవలంబమ్= సంసారమనే నూతిలో పడినవారలకు పైకి వచ్చుటకు ఆలంబనమైన, పద-అరవిందమ్= పద్మమువంటి పాదము, గేహం-జుషాం అపి= ఇంటి పనులయందు నిమగ్నులమే అయిననూ, నః= మాయొక్క, మనసి= మనస్సునందు, సదా= ఎల్లవేళలా, ఉదియాత్= ప్రకాశించు గాక!

ఆ గోపికలైతే ఇట్లు పలికిరి...ఓ పద్మనాభా! లోతైన జ్ఞానము గల సనకాది యోగీశ్వరులు కూడ నీ పాదపద్మమును హృదయములో ధ్యానించెదరు. సంసారమనే నూతిలో పడినవారలకు నీ పాదము పైకి వచ్చే ఆలంబనమగుచున్నది. అట్టి నీ పాదము ఇంటి పనులలో ఉన్నా మాకు మనస్సులో ఎల్లవేళలా ప్రకాశించు గాక!

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
బలరామ శ్రీకృష్ణులను గోపాలకులు గోపికలు కలుసుకొనుటను
వర్ణించే ఎనుబది రెండవ అధ్యాయము ముగిసినది (82).

* * *

అథ త్ర్యశీతితమోఽధ్యాయః

శ్రీకృషుని భార్యలతో ద్రౌపది సంతాపము

శ్రీశుక ఉవాచ ।

తథాఽనుగృహ్య భగవాన్ గోపీనాం స గురుర్గతిః ।
యుధిష్ఠిరమథాపృచ్ఛ త్సర్వాంశ్చ సుహృదోఽవ్యయమ్ ॥ 1

శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, గోపీనామ్= గోపికలకు, గురుః = ఉపదేశకుడు, గతిః= పరమలక్ష్యము అగు, సః= ఆ, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, తథా= ఆ విధముగా, అనుగృహ్య= అనుగ్రహించి, అథ= తరువాత, యుధిష్ఠిరమ్= ధర్మరాజును, సర్వాన్= అందరు, సుహృదః చ= మిత్రులను కూడ, అవ్యయమ్= క్షేమమును గురించి, అపృచ్ఛత్= అడిగెను.

శ్రీశుక మహర్షి ఇట్లు చెప్పెను...గోపికలకు ఉపదేష్ట, పరమలక్ష్యము శ్రీకృష్ణ భగవానుడే. ఆయన వారికి ఆ విధముగా ఆత్మతత్త్వమునుపదేశించి అనుగ్రహించెను. తరువాత ఆయన ధర్మరాజును, సకలమిత్రులను కుశలప్రశ్న వేసి పలకరించెను.

త ఏవం లోకనాథేన పరిపృష్టా స్సుసత్కృతాః ।
ప్రత్యూచు ర్ప్రహృష్టమనస స్తత్పాదేక్షాహతాంహసః ॥ 2

తే= వారు, ఏవమ్= ఈ విధముగా, లోకనాథేన= జగన్నాథుడగు శ్రీకృష్ణ భగవానునిచే, పరిపృష్టాః= అడుగబడినవారు, సుసత్కృతాః= బాగుగా సత్కరించబడినవారు, హృష్టమనసః= హర్షముతో నిండిన మనస్సు గలవారు, తత్-పాద-ఈక్షాహత-అంహసః= ఆయన పాదముల దర్శనముచే నశింపజేయబడిన పాపములు గలవారు, ప్రత్యూచుః= బదులు చెప్పిరి.

ఈ విధముగా జగన్నాథుడగు శ్రీకృష్ణ భగవానుడు వారిని కుశలప్రశ్న వేసి బాగుగా సత్కరించెను. వారి మనస్సులు హర్షముతో నిండెను. ఆయన పాదములను దర్శించుటచే వారి పాపములు నశించెను. వారు ఇట్లు బదులు చెప్పిరి.

కుతోఽశివం త్వచ్చరణాంబుజాసవం
మహన్మనస్తో ముఖనిస్సృతం క్వచిత్ ।
పిబంతి యే కర్ణపుటైరలం ప్రభో
దేహంభృతాం దేహకృదస్మృతిచ్ఛిదమ్ ॥ 3

ప్రభో= ఓ ప్రభూ!, మహత్-మనస్తః= మహాత్ముల మనస్సునుండి, ముఖనిస్సృతమ్= వాక్కు గుండా ప్రసరించునట్టియు, దేహంభృతామ్= దేహధారులకు, దేహకృద్-అస్మృతిచ్ఛిదమ్= దేహమును కలిగించే అజ్ఞానమును పోగొట్టే, త్వత్-చరణ-అంబుజ-ఆసవమ్= నీ పద్మముల వంటి పాదముల తేనెను, క్వచిత్= ఒకప్పుడు, యే= ఎవరైతే, కర్ణపుటైః = చెవులనే దొప్పలతో, అలమ్= నిండా, పిబంతి= పానము చేయుదురో వారికి, అశివమ్= అమంగళము, కుతః= ఎక్కడిది?

ఓ ప్రభూ! మహాత్ముల మనస్సునుండి వాగింద్రియము ద్వారా ప్రసరించే నీ పాదపద్మముల తేనె (కథామృతము) దేహధారులకు దేహమును కలిగించిన అజ్ఞానమును పటాపంచలు చేయును. ఆ కథామృతమునెవరైతే ఒకప్పుడైననూ నిండా పానము చేయుదురో, వారికి అమంగళమెక్కడిది? (ఉండదు).

హి త్వాఽఽత్మధామవిధుతాత్మకృతత్రయవస్థం
ఆనందసంప్లవమఖండమకుంఠబోధమ్ ।
కాలోపసృష్టనిగమావన ఆత్తయోగ-
మాయాఽఽకృతిం పరమహంసగతిం న ॥ 4

ఆత్మధామవిధుత-ఆత్మకృతత్రి-అవస్థమ్= స్వరూపమును ప్రకాశింపజేయుటచే త్రోసిపుచ్చబడిన బుద్ధి నిమిత్తముగా గల మూడు అవస్థలు కలిగినట్టియు, ఆనందసంప్లవమ్= ఆనందప్రవాహమైనట్టియు, అఖండమ్= రెండవది లేనట్టియు, అకుంఠబోధమ్= ప్రతిహతము కాని చైతన్యశక్తి కలిగినట్టియు, కాల-ఉపసృష్టనిగమ-అవనే= కాలముచే లుప్తము చేయబడిన వేదములను రక్షించుటయందు, ఆత్మయోగ-మాయా-ఆకృతిమ్= స్వీకరించబడిన యోగమాయచే ఆకారము కలిగినట్టియు, పరమహంసగతిమ్= పరమహంసలచే పొందబడే, త్వా హి= నిన్నే, (ఆత్మధామ= దేహమనే గృహమును, హిత్వా= విడిచిపెట్టి) నతాః స్మ= నమస్కరించు చున్నాము.

బుద్ధి నిమిత్తముగా ఆత్మయందు జాగ్రత్స్వప్నసుషుప్తులనే మూడు అవస్థలు ఆరోపించబడును. నీవు ఆనందఘనము, అద్వయము అగు స్వరూపప్రకాశముచే అట్టి ఆరోపమును త్రోసిపుచ్చినావు. అప్రతిహతమగు చిచ్ఛక్తిస్వరూపుడవగు నీవు కాలముచే లుప్తమైన వేదములను రక్షించుటకై నీ యోగమాయచే ఆకారమును స్వీకరించి అవతరించినావు. దేహమనే గృహమునందు ఆత్మాభిమానమును విడిచిపెట్టి పరమహంసలచే ఆత్మరూపముగా పొందబడే నిన్నే నమస్కరించెదము.

ఋషిరువాచ ।

ఇత్యుత్తమశ్లోకశిఖామణిం జనేష్వభిష్టవత్స్వంధకకౌరవస్త్రియః ।
సమేత్య గోవిందకథా మిథోఽగృణంస్త్రిలోకగీతాశ్శృణు వర్ణయామి తే॥ 5

ఋషిః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, ఉత్తమశ్లోకశిఖామణిమ్= పవిత్రమగు కీర్తి గలవారిలో సర్వాధికుడైన శ్రీకృష్ణ భగవానుని, జనేషు= జనులు, అభిష్టవత్సు= స్తుతించుచుండగా,

అంధకకౌరవస్త్రియః= యాదవుల మరియు కురువంశీయుల భార్యలు, సమేత్య= ఒకచో గూడి, మిథః= పరస్పరము, త్రిలోకగీతాః= ముల్లోకములయందు గానము చేయబడే, గోవిందకథాః= గోవిందుని గాథలను, అగృణన్= చెప్పుకొనిరి, తే= నీ కొరకు, వర్ణయామి= వర్ణించుచున్నాను, శృణు= వినుము.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఈ విధముగా జనులు పవిత్రమగు కీర్తి గలవారిలో సర్వాధికుడగు శ్రీకృష్ణ భగవానుని స్తుతించుచుండిరి. యాదవుల మరియు కురువంశీయుల భార్యలు ఒకచో గూడి, ముల్లోకములలో గానము చేయబడే గోవిందుని గాథలను ఒకరికొకరు చెప్పుకొనిరి. వాటిని నీకు వర్ణించి చెప్పెదను. వినుము.

ద్రౌపద్యువాచ ।

హే వైదర్భ్యచ్యుతో భద్రే హే జాంబవతి కౌసలే
హే సత్యభామే కాలింది శైబ్యే రోహిణి లక్ష్మణే ॥ 6

హే కృష్ణపత్న్య ఏతన్నోబ్రూత వో భగవాన్ స్వయమ్ ।
ఉపయేమే యథా లోకమనుకుర్వన్ స్వమాయయా ॥ 7

ద్రౌపదిః= ద్రౌపది, ఉవాచ= పలికెను, హే వైదర్భి= ఓ రుక్మిణీ!, భద్రే= ఓ భద్రా!, హే జాంబవతి= ఓ జాంబవతీ!, కౌసలే= ఓ సత్యా!, హే సత్యభామే= ఓ సత్యభామా!, కాలింది= ఓ కాలిందీ!, శైబ్యే= ఓ శైబ్యా!, రోహిణి= ఓ రోహిణీ!, లక్ష్మణే= లక్ష్మణా!, హే కృష్ణపత్న్యః= ఓ శ్రీకృష్ణపత్నులారా!, ఏతత్= ఈ విషయమును, నః= మాకు, బ్రూత= చెప్పుడు, అచ్యుతః= భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, స్వమాయయా= తన మాయాశక్తిచే, లోకమ్= మానవుని, అనుకుర్వన్= అనుకరించుచున్నవాడై, యథా= ఏ విధముగ నైతే, వః= మిమ్ములను, స్వయమ్= తాను, ఉపయేమే= వివాహమాడెనో.

ద్రౌపది ఇట్లు పలికెను...ఓ రుక్మిణీ! ఓ భద్రా! ఓ జాంబవతీ! ఓ సత్యా! ఓ సత్యభామా! ఓ కాలిందీ! ఓ శైబ్యా! ఓ రోహిణీ! (కృష్ణపత్నులలో ఒకామె) ఓ లక్ష్మణా! ఓ శ్రీకృష్ణ పత్నులారా! శ్రీకృష్ణ భగవానుడు తన మాయాశక్తిచే మానవులననుకరిస్తూ మిమ్ముల నేవిధముగా తాను వివాహమాడెను? ఈ విషయమును మాకు చెప్పుడు.

రుక్మిణ్యువాచ ।

చైద్యాయ మాఽర్పయితుముద్యతకార్ముకేషు
రాజస్వజేయభటశేఖరితాంఘ్రిరేణుః ।
నిన్యే మృగేంద్ర ఇవ భాగమజావియూథాత్
తచ్ఛ్రీనికేతచరణోఽస్తు మమార్చనాయ ॥ 8

రుక్మిణిః= రుక్మిణి, ఉవాచ= పలికెను, మా= నన్ను, చైద్యాయ= చేదిదేశరాజగు శిశుపాలుని కొరకు, అర్పయితుమ్= ఇచ్చి వివాహము చేయుటకు, రాజసు= రాజులు, ఉద్యతకార్ముకేషు= సిద్ధము చేయబడిన ధనుస్సులు గలవారగుచుండగా, అజేయభటశేఖరిత-అంఘ్రిరేణుః= జయించ శక్యము కాని రాజభటులచే తలలపై దాల్చబడిన పాదధూళి గల శ్రీకృష్ణుడు, అజ-అవియూథాత్= మేకల గొర్రెల గుంపునుండి, మృగ-ఇంద్రః= సింహము, భాగం ఇవ= తన భాగమును వలె, నిన్యే= తీసుకువెళ్లెను, తత్-శ్రీనికేతచరణః= ఆయనయొక్క శోభకు నిలయమైన పాదము, మమ= నా, అర్చనాయ= పూజ కొరకు, అస్తు= అగుగాక!

రుక్మిణి యిట్లు పలికెను...నన్ను చేదిరాజగు శిశుపాలునకిచ్చి వివాహము చేయుటకు ఆతని అనుయాయులగు రాజులు ధనుస్సులను సిద్ధము చేసుకొనిరి. అప్పుడు శ్రీకృష్ణుడు వచ్చి, సింహము మేకల గొర్రెల మందనుండి తన భాగమును వలె, నన్ను తీసుకువెళ్ళెను. జయించ శక్యము కాని రాజభటుల తలలపై ఆయన పాదధూళి అలంకారమాయెను. శోభకు నిలయమైన ఆయనయొక్క పాదమును పూజించెదను గాక!

సత్యభామోవాచ ।

యో మే సనాభివధతప్తహృదా తతేన
లిప్తాభిశాపమపమార్ష్టుమపాజహార ।
జిత్వర్క్షరాజమథ రత్నమదాత్స తేన
భీతః పితాఽదిశత మాం ప్రభవేఽపి దత్తామ్ ॥ 9

సత్యభామః= సత్యభామ, ఉవాచ= పలికెను, సనాభివధతప్తహృదా= తమ్ముని వధచే తాపమును పొందిన హృదయము గల, మే= నా, తతేన= తండ్రిచే, లిప్త-అభిశాపమ్= ఆపాదించబడిన అపకీర్తిని, అపమార్ష్టుమ్= తుడిచి వేయుటకై, యః= ఏ శ్రీకృష్ణుడు, ఋక్షరాజమ్= జాంబవంతుని, జిత్వా= జయించి, రత్నమ్= స్యమంతకమణిని, ఉపాజహార= తీసుకువచ్చెనో, అథ= తరువాత, అదాత్= ఇచ్చెనో, తేన= ఆ అపరాధముచే, భీతః= భయపడిన, సః= ఆ (నా), పితా= తండ్రి, మామ్= నన్ను, దత్తాం అపి= ఇతరునకు ప్రతిజ్ఞ చేయబడిన దాననే అయినా, ప్రభవే= శ్రీకృష్ణ ప్రభువు కొరకు, అదిశత= ఇచ్చెను.

సత్యభామ ఇట్లు పలికెను...నా తండ్రి సత్రాజిత్తు తన తమ్ముడు ప్రసేనుని మరణముచే హృదయములో పరితాపమును చెంది, శ్రీకృష్ణుడే తమ్ముని చంపించి మణిని అపహరించినాడనే నిందను ఆయనపై వేసెను. ఆయన ఆ అపకీర్తిని తుడిచివేయుటకై జాంబవంతుని జయించి మణిని తెచ్చెను. తరువాత నా తండ్రి ఆ అపరాధమునకు భయపడెను. ఆయన నన్ను ఇతరునకు ఇచ్చి వివాహము చేసెదనని ప్రతిజ్ఞ చేసియుండెను. అయిననూ, ఆయన నన్ను శ్రీకృష్ణునకిచ్చి వివాహము చేసెను.

జాంబవత్యువాచ ।

ప్రాజ్ఞాయ దేహకృదముం నిజనాథదేవం
సీతాపతిం త్రినవహాన్యమునాఽభ్యయుధ్యత్ ।
జ్ఞాత్వా పరీక్షిత ఉపాహరదర్హణం మాం
పాదౌ ప్రగృహ్య మణినాఽహమముష్య దాసీ ॥ 10

జాంబవతిః= జాంబవతి, ఉవాచ= పలికెను, దేహకృత్= తండ్రి, ఆయమ్= ఈ శ్రీకృష్ణుని, నిజనాథదేవమ్= తన ప్రభువు దైవము అగు, సీతాపతిమ్= సీతాపతినిగా, ప్ర-అజ్ఞాయ= సుతరాము గుర్తించక, అమునా= ఈయనతో, త్రినవహాని= ఇరవై ఏడు దినములను, అభ్యయుధ్యత్= యుద్ధము చేసెను, పరీక్షితః= పరీక్షకు పెట్టబడినవాడై, జ్ఞాత్వా= గుర్తించి, పాదౌ= పాదములను, ప్రగృహ్య= పట్టుకొని, మణినా= మణితో, మామ్= నన్ను, అర్హణమ్= ఉపహారమునుగా, ఉపాహరత్= సమర్పించెను, అహమ్= నేను, అముష్య= ఈయనకు, దాసీ= సేవకురాలను.

జాంబవతి ఇట్లు పలికెను...నా తండ్రి ఈ శ్రీకృష్ణుడు తన ప్రభువు, దైవము, సీతయొక్క భర్త అగు శ్రీరాముడేనని సుతరాము గుర్తించలేక, ఈయనతో ఇరవై ఏడు దినములు నిరంతరముగా యుద్ధము చేసెను. అది మా తండ్రి బలమునకు పరీక్షయే ఆయెను. అప్పుడాయన ఈయనను గుర్తించి కాళ్లను పట్టుకొని, స్యమంతక మణితో బాటుగా నన్ను కూడ ఉపహారముగా సమర్పించెను. నేనీయనకు సేవకురాలను.

కాళింద్యువాచ ।

తపశ్చరంతీమాజ్ఞాయ స్వపాదస్పర్శనాశయా ।
సఖ్యోపేత్యాగ్రహీత్పాణిం యోఽహం తద్గృహమార్జనీ ॥ 11

కాళిందిః= కాళింది, ఉవాచ= పలికెను, యః= ఏ శ్రీకృష్ణుడైతే, స్వపాదస్పర్శన-ఆశయా= తన పాదములను స్పృశించవలెననే కోరికతో, తపః= తపస్సును, చరంతీమ్= చేయుచున్న నన్ను, ఆజ్ఞాయ= తెలుసుకొని, సఖ్యా= మిత్రుడగు అర్జునునితో, ఉపేత్య= దగ్గరకు వచ్చి, పాణిం అగ్రహీత్= వివాహమాడెనో, అహమ్= నేను, తద్-గృహమార్జనీ= ఆయన ఇంటిని తుడుచుదానను.

కాళింది ఇట్లు పలికెను...తన పాదములను స్పృశించవలెననే కోరికతో నేను తపస్సు చేయుచున్నానని తెలిసి శ్రీకృష్ణుడు మిత్రుడగు అర్జునునితో నా వద్దకు వచ్చి నన్ను వివాహమాడెను. నేను ఆయన ఇల్లు తుడిచే సేవకురాలను.

మిత్రవిందోవాచ ।

యో మాం స్వయంవర ఉపేత్య విజిత్య భూపాన్
నిన్యే శ్వయూథగమివాత్మబలిం ద్విపారిః ।
భ్రాతౄంశ్చ మేఽపకురుతస్స్వపురం శ్రియౌకః
తస్యాస్తు మేఽనుభవమంఘ్ర్యవనేజనత్వమ్ ॥ 12

మిత్రవిందః= మిత్రవింద, ఉవాచ= పలికెను, యః= ఏ, శ్రియౌకః = లక్ష్మీపతియగు శ్రీకృష్ణుడైతే, స్వయంవరే= స్వయంవరమునందు, భూపాన్= రాజులను, అపకురుతః= అపకారము చేయుచున్న, మే= నా, భ్రాతౄన్ చ= సోదరులను కూడ, విజిత్య= జయించి, ఉపేత్య= దగ్గరకు వచ్చి, ద్విప-అరిః= ఏనుగునకు శత్రువగు సింహము, శ్వయూథగతమ్= కుక్కల గుంపునందున్న, ఆత్మ బలిం ఇవ= తన ఆహారమును వలె, మామ్= నన్ను, (శ్రియౌకః= సంపద లకు నివాసమగు), స్వపురమ్= తన నగరమును గురించి, నిన్యే= తీసుకు వెళ్లెనో, తస్య= ఆయనకు, అంఘ్రి-అవనేజనత్వమ్= పాదములను కడిగే స్థితి, మే= నాకు, అనుభవమ్= ప్రతి జన్మయందు, అస్తు= అగుగాక!

మిత్రవింద ఇట్లు పలికెను...లక్ష్మీపతియగు శ్రీకృష్ణుడు స్వయంవరములో రాజులను, నాకు అపకారము చేసే నా సోదరులను (విందాదులను) జియించెను. ఆయన దగ్గరగా వచ్చి, సింహము కుక్కల గుంపునుండి తన భాగమును వలె, నన్ను సంపదలకు నిలయమగు తన ద్వారకానగరమునకు తీసుకువెళ్లెను. నాకు జన్మజన్మలయందు ఆయన పాదములను కడిగే భాగ్యము కలుగుగాక!

సత్యోవాచ ।

సప్తోక్షణోఽతిబలవీర్యసుతీక్ష్ణశృంగాన్
పిత్రా కృతాన్ క్షితిపవీర్యపరీక్షణాయ ।
తాన్ వీరదుర్మ దహనస్తరసా నిగృహ్య
క్రీడన్ బబంధ హ యథా శిశవోఽజతోకాన్ ॥ 13

సత్యుఁ= సత్య, ఉవాచ= పలికెను, అతిబలవీర్యసుతీక్ష్ణశృంగాన్= అధికమగు బలము పరాక్రమము వాడి కొమ్ములు కలిగినట్టియు, క్షితిప–వీర్యపరీక్షణాయ= రాజుల పరాక్రమమును పరీక్షించుటకై, పిత్రా= తండ్రిచే, కృతాన్= ఏర్పాటు చేయబడినట్టియు, వీరదుర్మదహనుఁ= వీరుల పొగరును అణచివేసే, తాన్= ఆ, సప్త= ఏడు, ఉక్షణుఁ= ఎద్దులను, తరసా= వేగముగా, నిగృహ్య= అణచి పట్టి, క్రీడన్= ఆడుకొనుచున్నవాడై, శిశవుఁ = బాలురు, అజతోకాన్ యథా= మేక పిల్లలను వలె, బబంధ హ= కట్టివేసెను.

సత్య ఇట్లు పలికెను...మా తండ్రి నగ్నజిత్తు రాజుల పరాక్రమమును పరీక్షించుటకై ఏడు ఎద్దులను సంపాదించెను. అధికమగు బలము, పరాక్రమము, వాడి కొమ్ములు గల ఆ లోకప్రసిద్ధములైన ఎద్దులు వీరుల పొగరును అణచినవి. వాటిని శ్రీకృష్ణుడు వేగముగా అణచి పట్టి ఆడుకుంటూ, బాలురు మేకపిల్లలను వలె, కట్టివేసెను.

య ఇత్థం వీర్యశుల్కాం మాం దాసీభిశ్చతురంగిణీమ్ ।
పథి నిర్జత్య రాజన్యాన్ నిన్యే తద్దాస్యమస్తు మే ॥ 14

యుఁ= ఏ శ్రీకృష్ణుడైతే, ఇత్థమ్= ఈ విధముగా, వీర్యశుల్కామ్= పరాక్రమమే కట్నముగా కలిగినట్టియు, చతురంగిణీమ్= చతురంగ బలము గల, మామ్= నన్ను, దాసీభిుఁ= పరిచారికలతో కూడి, పథి= మార్గము నందు, రాజన్యాన్= రాజులను, నిర్జత్య= జయించి, నిన్యే= తీసుకువెళ్లెనో, మే= నాకు, తద్–దాస్యమ్= ఆయనయొక్క సేవ, అస్తు= కలుగుగాక!

శ్రీకృష్ణుడీ విధముగా పరాక్రమమే కట్నముగా గల నన్ను వివాహ-మాడెను. నాతో బాటు పరిచారికలు, చతురంగసైన్యము వచ్చుచుండెను. ఆయన మార్గమునందు అడ్డు వచ్చిన రాజులను జయించి నన్ను తీసుకువెళ్లెను. నాకు ఆయన సేవ చేసే భాగ్యము కలుగుగాక!

భద్రోవాచ ।

పితా మే మాతులేయాయ స్వయమాహూయ దత్తవాన్ ।
కృష్ణే కృష్ణాయ తచ్చిత్తామక్షౌహిణ్యా సఖీజనైః ॥ 15

భద్రః= భద్ర, ఉవాచ= పలికెను, కృష్ణే= ఓ ద్రౌపదీ!, మే= నా, పితా= తండ్రి, మాతులేయాయ= మేనమామ పుత్రుడైన, కృష్ణాయ= శ్రీకృష్ణుని కొరకు, స్వయమ్= స్వయముగా, ఆహూయ= ఆహ్వానించి, తత్-చిత్తామ్= ఆయనయందు మనస్సు గల నన్ను, అక్షౌహిణ్యా= అక్షౌహిణీ సేనతో, సఖీజనైః= చెలికత్తెలతో, దత్తవాన్= ఇచ్చినవాడు.

భద్ర ఇట్లు పలికెను...ఓ ద్రౌపదీ! నా తండ్రి మేనమామ కొడుకగు శ్రీకృష్ణుని తానే పిలిచి, ఆయనయందే మనస్సు గల నన్ను ఇచ్చి వివాహము చేసి, చెలికత్తెలతో బాటుగా అక్షౌహిణీ సేనను యిచ్చెను.

అస్య మే పాదసంస్పర్శో భవేజ్జన్మని జన్మని ।
కర్మభిర్భ్రామ్యమాణాయా యేన తచ్ఛ్రేయ ఆత్మనః ॥ 16

కర్మభిః= కర్మలచే, భ్రామ్యమాణాయాః= పరిభ్రమించుచున్న, మే= నాకు, జన్మని జన్మని= ప్రతి జన్మయందు, అస్య= ఈ శ్రీకృష్ణునియొక్క, పాదసంస్పర్శః= పాదముల స్పర్శ, భవేత్= కలుగుగాక!, యేన= దేనిచేతనగా, ఆత్మనః= నాకు, తత్= అది, శ్రేయః= పరమపురుషార్థము.

కర్మలచే సంసారములో పరిభ్రమించుచున్న నాకు ప్రతి జన్మలో ఈ శ్రీకృష్ణుని పాదముల స్పర్శ కలుగుగాక! ఎందుకంటే, దానిచే నాకు పరమపురుషార్థమగు మోక్షము లభించును.

లక్ష్మణోవాచ ।

మమాపి రాజ్ఞ్యచ్యుతజన్మకర్మ
శ్రుత్వా ముహుర్నారదగీతమాస హ ।

చిత్తం ముకుందే కిల పద్మహస్తయా
వృతస్సుసంమృశ్య విహాయ లోకపాన్ ॥ 17

లక్షణః= లక్షణ, ఉవాచ= పలికెను, రాజ్ఞి= ఓ మహారాణీ!, నారదగీతమ్= నారదునిచే గానము చేయబడిన, అచ్యుతజన్మకర్మ= శ్రీకృష్ణ భగవానుని అవతారమును లీలను, ముహుః= పలుమార్లు, శ్రుత్వా= విని, మమ అపి= నాకు కూడ, చిత్తమ్= చిత్తము, ముకుందే= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణునియందు, ఆస హ= కలిగెను, పద్మహస్తయా= పద్మము చేతియందు గల లక్ష్మీదేవిచే, సుసంమృశ్య= బాగా విచారించి, లోకపాన్= లోకపాలకులను, విహాయ= విడిచిపెట్టి, వృతః కిల= వరించబడినవాడు గదా!

లక్షణ ఇట్లు పలికెను...ఓ మహారాణీ! శ్రీకృష్ణ భగవానుని అవతారమును, లీలను నారదుడు గానము చేయగా పలుమార్లు విని, నా మనస్సు కూడ మోక్షప్రదాతయగు శ్రీకృష్ణునిపై లగ్నమయ్యెను. చేతియందు పద్మము గల లక్ష్మీదేవి బాగా విచారించి లోకపాలకులను విడిచిపెట్టి ఆయనను వరించెను గదా!

జ్ఞాత్వా మమ మతం సాధ్వి పితా దుహితృవత్సలః ।
బృహత్సేన ఇతి ఖ్యాత స్తత్రోపాయమచీకరత్ ॥ 18

సాధ్వి= ఓ పతివ్రతా!, దుహితృవత్సలః= కుమార్తెయందు అధికప్రేమ గలవాడు, బృహత్సేనః= బృహత్సేనుడు, ఇతి= అని, ఖ్యాతః = ప్రఖ్యాతి చెందినవాడు అగు, పితా= తండ్రి, మమ= నా, మతమ్= అభిమతమును, జ్ఞాత్వా= తెలుసుకొని, తత్ర= ఆ విషయమునందు, ఉపాయమ్= ఉపాయమును, అచీకరత్= చేయించెను.

పతివ్రతయగు ఓ ద్రౌపదీ! నా తండ్రి బృహత్సేనుడని ప్రసిద్ధి చెందినవాడు. ఆయనకు కుమారైనగు నాయందు ప్రేమ మెండు. ఆయన నా అభిమతమును తెలుసుకొని, నేను శ్రీకృష్ణుని చెట్టపట్టుట అనే విషయమై ఉపాయమును చేయించెను.

యథా స్వయంవరే రాజ్ఞి మత్స్యః పార్థేప్సయా కృతః ।
అయం తు బహిరాచ్ఛన్నో దృశ్యతే స జలే పరమ్ ॥ 19

రాజ్ఞి= ఓ మహారాణీ!, యథా= ఏ విధముగానైతే, స్వయంవరే= స్వయంవరమునందు, పార్థ-ఈప్సయా= అర్జునుని పొందవలెననే కోరికతో, మత్స్యః= మత్స్యయంత్రము, కృతః= చేయబడినదో, అయం తు= ఇదైతే, బహిః= బయట, ఆచ్ఛన్నః= కప్పబడినది, సః= అది, జలే పరమ్= నీటియందు మాత్రమే, దృశ్యతే= కనబడును.

ఓ మహారాణీ! ఏ విధముగానైతే నీ స్వయంవరములో అర్జునుని పొందే కోరికతో మత్స్యయంత్రము చేయబడినదో, అదే విధముగా నా స్వయంవరములో కూడ చేయబడినది. ఈ చేపైతే బయటనుండి కప్పివేయబడి, కేవలము నీటియందు మాత్రమే కనబడును.

శ్రుత్వైతత్సర్వతో భూపా ఆయయుర్మత్పితుః పురమ్ ।
సర్వాస్త్రశస్త్రతత్త్వజ్ఞా సోపాధ్యాయా సహస్రశః ॥ 20

ఏతత్= దీనిని గురించి, శ్రుత్వా= విని, సర్వ-అస్త్రశస్త్రతత్త్వజ్ఞాః = సకలములైన శస్త్రాస్త్రముల రహస్యములు తెలిసిన, భూపాః= రాజులు, స-ఉపాధ్యాయాః= ఆచార్యులతో గూడినవారై, సర్వతః= అన్ని వైపుల నుండి, సహస్రశః= వేలాదిగా, మత్-పితుః= నా తండ్రియొక్క, పురమ్= నగరమును గురించి, ఆయయుః= వచ్చిరి.

ఈ మత్స్యయంత్రమును గురించి విని సకలములైన శస్త్రాస్త్రముల రహస్యములు తెలిసిన రాజులు ఆచార్యులతో గూడి అన్ని వైపులనుండి వేల సంఖ్యలో మా తండ్రిగారి నగరమునకు విచ్చేసిరి.

పిత్రా సంపూజితాస్సర్వే యథావీర్యం యథావయః ।
ఆదదుస్సశరం చాపం వేద్ధుం పర్షది మద్ధియః ॥ 21

పిత్రా= తండ్రిచే, యథావీర్యమ్= పరాక్రమమునకు తగ్గట్లుగా, యథావయః= వయస్సుకు తగ్గట్లుగా, సంపూజితాః= చక్కగా పూజించ బడిన, సర్వే= అందరు, మద్-ధియః= నాయందు చిత్తము గలవారై, పర్షది= సభయందు, వేద్ధుమ్= కొట్టుటకు, సశరమ్= బాణముతో కూడిన, చాపమ్= ధనుస్సును, ఆదదుః= తీసుకొనిరి.

మా తండ్రి వారినందరిని వారి పరాక్రమమునకు, వయస్సుకు తగ్గట్లుగా బాగా ఆదరించిరి. వారు నాయందే చిత్తము గలవారై, సభలో మత్స్యమును కొట్టుటకు ధనుర్బాణములను తీసుకొనిరి.

ఆదాయ వ్యసృజన్ కేచిత్సజ్యం కర్తుమనీశ్వరాః ।
ఆకోటి జ్యాం సముత్కృష్య పేతురేకేఽమునా హతాః ॥ 22

కేచిత్= కొందరు, ఆదాయ= తీసుకొని, సజ్యమ్= నారిత్రాడుతో కూడినదానినిగా, కర్తుమ్= చేయుటకు, అనీశ్వరాః= శక్తి లేనివారై, వ్యసృజన్= విడిచిపెట్టిరి, సముత్కృష్య= గట్టిగా లాగి, అమునా= ఈ ధనుస్సుచే, హతాః= కొట్టబడినవారై, పేతుః= పడిరి.

కొందరు ధనుస్సును చేతిలోకి తీసుకొని నారిత్రాడును సంధించుటకు శక్తి లేక విడిచిపెట్టిరి. కొందరు నారిత్రాడును అగ్రము వరకు గట్టిగా లాగి, ఆ ధనుస్సుచే కొట్టబడి క్రింద బడిరి.

సజ్యం కృత్వాఽపరే వీరా మాగధాంబష్ఠచేదిపాః ।
భీమో దుర్యోధనః కర్ణో నావిందంస్తదవస్థితిమ్ ॥ 23

అపరే= ఇతరులైన, మాగధ-అంబష్ఠచేదిపాః= మగధరాజగు జరాసంధుడు అంబష్ఠదేశాధీశుడు చేదిదేశప్రభుడగు శిశుపాలుడు, భీమః = భీముడు, దుర్యోధనః= దుర్యోధనుడు, కర్ణః= కర్ణుడు అనే, వీరాః=

వీరులు, సజ్యమ్= నారిత్రాడుతో కూడినదానినిగా, కృత్వా= చేసి, తద్-అవస్థితిమ్= ఆ లక్ష్యము ఉన్నస్థానమును, న అవిందన్= తెలియరైరి.

జరాసంధుడు, అంబష్ఠనరేశుడు, చేదిరాజగు శిశుపాలుడు, భీముడు, దుర్యోధనుడు, కర్ణుడు అనే ఇతరవీరులు నారిత్రాడును ధనుస్సునకు తగిల్చిరే గాని, మత్స్యము ఉన్న చోటును కనుగొనలేక పోయిరి.

మత్స్యాభాసం జలే వీక్ష్య జ్ఞాత్వా చ తదవస్థితిమ్ ।
పార్థో యత్తోఽసృచద్బాణం నాచ్ఛినత్పస్పృశే పరమ్ ॥ 24

పార్థః= అర్జునుడు, మత్స్య-ఆభాసమ్= చేపయొక్క ప్రతిబింబమును, జలే= నీటియందు, వీక్ష్య= చూచి, తద్-అవస్థితిం చ= అది ఉన్నచోటును కూడ, జ్ఞాత్వా= గుర్తించి, యత్తః= సంసిద్ధుడై, బాణమ్= బాణమును, అసృజత్= విడిచిపెట్టెను, న అచ్ఛినత్= తెగగొట్ట లేదు, పరమ్= కేవలము, పస్పృశే= స్పృశించెను.

అర్జునుడు నీటిలో చేపయొక్క ప్రతిబింబమును చూచి, అది ఉన్న చోటును కూడ గుర్తించి, సంసిద్ధుడై బాణమును విడిచిపెట్టెను. ఆ బాణము చేపను స్పృశించెనే గాని, పడగొట్టలేదు.

రాజన్యేషు నివృత్తేషు భగ్నమానేషు మానిషు ।
భగవాన్ ధనురాదాయ సజ్యం కృత్వాఽథ లీలయా ॥ 25

మానిషు= గర్వము గల, రాజన్యేషు= రాజులు, భగ్నమానేషు= భగ్నమైన గర్వము గలవారై, నివృత్తేషు= వెనుదిరుగగా, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ధనుః= ధనుస్సును, ఆదాయ= తీసుకొని, అథ= తరువాత, లీలయా= అవలీలగా, సజ్యమ్= నారిత్రాడు గలదిగా, కృత్వా= చేసి--.

గర్విష్ఠులైన రాజులు గర్వభంగమును పొంది వెనుదిరిగిరి. అప్పుడు శ్రీకృష్ణ భగవానుడు ధనుస్సును తీసుకొని, అవలీలగా నారిని తగిల్చెను.

తస్మిన్ సంధాయ విశిఖం మత్సత్యం వీక్ష్య సకృజ్జలే ।
భిత్త్వేషుణాఽపాతయత్తం సూర్యే చాభిజితి స్థితే ॥ 26

సూర్యే= సూర్యుడు, అభిచితి స్థితే= నడినెత్తిన ఉండగా, తస్మిన్= ఆ ధనుస్సునందు, విశిఖమ్= బాణమును, సకృత్= ఒక్కసారి, వీక్ష్య= చూచి, ఇషుణా= బాణముతో, భిత్త్వా= తెగగొట్టి, తమ్= దానిని, అపాతయత్= పడగొట్టెను.

అది మిట్ట మధ్యాహ్నము. ఆయన ఆ ధనుస్సునందు బాణమును సంధించి చేపను నీటిలో ఒకేసారి చూచి బాణముతో కొట్టి పడగొట్టెను.

దివి దుందుభయో నేదు ర్జయశబ్దయుతా భువి ।
దేవాశ్చ కుసుమాసారాన్ ముముచు ర్హర్షవిహ్వలాః ॥ 27

జయశబ్దయుతాః= జయశబ్దముతో కూడిన, దుందుభయః= దుందుభులు, దివి= స్వర్గమునందు, నేదుః= మ్రోగినవి, హర్షవిహ్వలాః = ఆనందముతో పరవశులైన, దేవాః చ= దేవతలు, భువి= భూమిపై, కుసుమ-ఆసారాన్= పూల వానలను, ముముచుః= విడిచిపెట్టిరి.

జయశబ్దముతో బాటుగా దేవదుందుభులు మ్రోగినవి. దేవతలు ఆనందముతో పరవశులై భూమిపై పూల వానలను కురిపించిరి.

తద్రంగమావిశమహం కలనూపురాభ్యాం
పద్భ్యాం ప్రగృహ్య కనకోజ్జ్వలరత్నమాలామ్ ।
నూత్నే నివీయ పరిధాయ చ కౌశికాగ్ర్యే
సవ్రీడహాసవదనా కబరీధృతస్రక్ ॥ 28

తత్= అప్పుడు, సవ్రీడహాసవదనా= సిగ్గుతో కూడిన చిరునవ్వు గల ముఖము గల, కబరీధృతస్రక్= జుట్టుముడియందు ధరించబడిన మాల గల, అహమ్= నేను, కలనూపురాభ్యామ్= మధురముగా నినదించే

కాలి యందెలు గల, పద్భ్యామ్= పాదములతో, కనక- ఉజ్జ్వలరత్న మాలామ్= బంగారముతో గొప్పగా ప్రకాశించే రత్నముల మాలను, ప్రగృహ్య= పట్టుకొని, నూత్నే= కొత్త, కౌశిక-అగ్ర్యే= గొప్ప పట్టు వస్త్రముల జతను, నివీయ= కప్పుకొని, పరిధాయ చ= కట్టుకొని, రంగమ్= సభాస్థానమును, ఆవిశమ్= ప్రవేశించితిని.

అప్పుడు నేను సిగ్గు పడుతూ చిరునవ్వు ముఖముతో సభాస్థానమును ప్రవేశించితిని. జుట్టుముడిలో పూల మాలను తురుముకున్న నేను నడుస్తూ ఉంటే కాలియందెలు నినదించుచుండెను. గొప్ప కొత్త పట్టు వస్త్రముల జతను కట్టుకొని కప్పుకున్న నేను ఉజ్జ్వలముగా ప్రకాశించే బంగరు రత్నమాలను పట్టుకొనియుంటిని.

ఉన్నీయ వక్త్రమురుకుంతలకుండలత్విడ్-
గండస్థలం శిశిరహాసకటాక్షమోక్షైః ।
రాజ్ఞో నిరీక్ష్య పరితశ్శనకైర్మురారేః
అంసేఽనురక్తహృదయా నిదధే స్వమాలామ్ ॥ 29

అనురక్తహృదయా= ప్రేమ గల హృదయము గల నేను, ఉరుకుంతలకుండలత్విడ్-గండస్థలమ్= దట్టని ముంగురులు కలిగినట్టియు కుండలముల కాంతి గల చెక్కిళ్లు గల, వక్త్రమ్= మోమును, ఉన్నీయ= పైకెత్తి, శిశిరహాసకటాక్షమోక్షైః= చల్లని చిరునవ్వు గల చూపుల విడుచుటలచే, పరితః= చుట్టూ, రాజ్ఞః= రాజులను, నిరీక్ష్య= చూచి, శనకైః= మెల్లగా, ముర-అరేః= మురాసురుని సంహరించిన శ్రీకృష్ణ భగవానుని, అంసే= మెడయందు, స్వమాలామ్= నా మాలను, నిదధే= వేసితిని.

ప్రేమ నిండిన హృదయము గల నేను చల్లని చిరునవ్వుతో చుట్టూ ఉన్న రాజులపై చూపులను ప్రసరింప జేసి, మెల్లగా నా మాలను మురాసురుని సంహరించిన శ్రీకృష్ణ భగవానుని మెడలో వేసితిని. దట్టని

ముంగురులు, కుండలముల కాంతులు పడుచున్న చెక్కిళ్లు గల ముఖమును పైకెత్తి ఆయనను చూచితిని.

తావన్మదంగపటహా శ్శంఖభేర్యానకాదయః ।
నినేదుర్నటనర్తక్యో ననృతుర్గాయకా జగుః ॥ 30

తావత్= అంతలో, మృదంగపటహాః= మద్దెళ్లు డోళ్లు, శంఖభేరీ–ఆనక–ఆదయః= శంఖములు భేరీలు తప్పెటలు మొదలైనవి, నినేదుః = నినదించినవి, నటనర్తక్యః= నటులు నాట్యకత్తెలు, ననృతుః= నాట్యమాడిరి, గాయకాః= పాటగాళ్లు, జగుః= పాడిరి.

అంతలో మద్దెళ్లు, డోళ్లు, శంఖములు, భేరీలు, తప్పెటలు మొదలైన వాద్యములు మ్రోగినవి. పాటగాళ్లు పాడగా, నటులు నాట్యకత్తెలు నాట్యమాడిరి.

ఏవం వృతే భగవతి మయేశ నృపయూథపాః ।
న సేహిరే యాజ్ఞసేని స్పర్ధంతో హృచ్ఛయాతురాః ॥ 31

యాజ్ఞసేని= ఓ ద్రౌపదీ!, ఏవమ్= ఈ విధముగా, మయా= నాచే, ఈశే= ప్రభుడగు, భగవతి= శ్రీకృష్ణ భగవానుడు, వృతే= వరించబడగా, స్పర్ధంతః= అసూయ గల, నృపయూథపాః= రాజులైన సేనానాయకులు, హృచ్ఛయ–ఆతురాః= కామనచే వివశులై, న సేహిరే= సహించరైరి.

ఓ ద్రౌపదీ! నేనీ విధముగా శ్రీకృష్ణ భగవానుని భర్తగా వరించితిని. కాని, అసూయ గల రాజులైన సేనానాయకులు కామనచే వివశులై నేను శ్రీకృష్ణుని వరించుటను సహించరైరి.

మాం తావద్రథమారోప్య హయరత్నచతుష్టయమ్ ।
శార్ఙ్గముద్యమ్య సన్నద్ధస్తస్థావాజౌ చతుర్భుజః ॥ 32

తావత్= అంతలో, చతుర్భుజః= శ్రీకృష్ణ భగవానుడు, సన్నద్ధః= కవచధారియై, మామ్= నన్ను, హయరత్నచతుష్టయమ్= నాలుగు

శ్రేష్ఠమైన గుర్రములు గల, రథమ్= రథమును, ఆరోప్య= ఎక్కించి, శార్ఙ్గమ్= శార్ఙ్గధనుస్సును, ఉద్యమ్య= పైకెత్తి, ఆజౌ= యుద్ధమునందు, తస్థౌ= నిలిచెను.

అంతలో శ్రీకృష్ణ భగవానుడు కవచము వేసుకొని నాలుగు గొప్ప గుర్రములు పూన్చిన రథముపై నన్ను ఎక్కించెను. ఆయన శార్ఙ్గధనుస్సును పైకెత్తి యుద్ధమునందు నిలిచెను.

దారుకశ్చోదయామాస కాంచనోపస్కరం రథమ్ ।
మిషతాం భూభుజాం రాజ్ఞి మృగాణాం మృగరాడివ ॥ 33

రాజ్ఞి= ఓ మహారాణీ!, కాంచన-ఉపస్కరమ్= బంగరు సామగ్రి గల, రథమ్= రథమును, దారుకః= దారుకుడు, చోదయామాస= తోలెను, మృగాణామ్= లేళ్లు (చూచుచుండగా), మృగరాట్ ఇవ= సింహము వలె, భూభుజామ్= రాజులు, మిషతామ్= చూచుచుండగా --.

ఓ మహారాణీ! లేళ్లు చూచుచుండగా సింహము వలె, రాజులు చూచుచుండగా లెక్క చేయకుండా దారుకుడు బంగరు సామగ్రితో నిండిన రథమును తోలెను.

తేఽన్వసజ్జంత రాజన్యా నిషేద్ధుం పథి కేచన ।
సంయత్తా ఉద్ధృతేష్వాసా గ్రామసింహా యథా హరిమ్ ॥ 34

తే= ఆ, కేచన= కొందరు, రాజన్యాః= రాజులు, సంయత్తాః= ప్రయత్నము చేయువారు, ఉద్ధృత-ఇషు- ఆసాః= పైకెత్తబడిన ధనుస్సు, బాణములు గలవారై, గ్రామసింహాః= కుక్కలు, హరిం యథా= సింహమును వలె, పథి= మార్గమునందు, నిషేద్ధుమ్= అడ్డుకొనుటకు, అన్వసజ్జంత= వెనుక తరిమిరి.

ఆ రాజులలో కొందరు యుద్ధప్రయత్నమును చేసి ధనుస్సులను, బాణాలను పైకెత్తి పట్టుకొని దారిలో శ్రీకృష్ణుని, కుక్కలు సింహమును వలె, అడ్డుకొనుటకై వెనుకనుండి తరుముకు వచ్చిరి.

తే శార్ఙ్గచ్యుతబాణౌఘైః కృత్తబాహ్వంఘ్రికంధరాః ।
నిపేతుః ప్రధనే కేచిదేకే సంత్యజ్య దుద్రువుః ॥ 35

ప్రధనే= యుద్ధమునందు, శార్ఙ్గచ్యుతబాణా-ఓఘైఃః= శార్ఙ్గ ధనుస్సు నుండి విడిచిపెట్టబడిన బాణముల గుంపులచే, కృత్తబాహు-అంఘ్రి-కంధరాః= నరకబడిన చేతులు కాళ్లు మెడలు గల, తే= ఆ, కేచిత్= కొందరు, రాజులు, నిపేతుఃఃః

తరువాత యాదవప్రభుడగు శ్రీకృష్ణుడు ద్వారకానగరమును అచటి తన గృహమును, సూర్యుడు తన స్థానమైన అస్తపర్వతమును వలె, ప్రవేశించెను. భూలోకస్వర్గలోకములలో కొనియాడబడే ఆ నగరములో అలంకారములైన ధ్వజముల వస్త్రములు ఎండను ఆపుచున్నవి. అచట రంగు రంగుల తోరణములు కట్టబడెను.

పితా మే పూజయామాస సుహృత్సంబంధిబాంధవాన్ ।
మహాఽర్హవాసోఽలంకారైశ్శయ్యాఽఽసనపరిచ్ఛదైః ॥ 37

మే= నా, పితా= తండ్రి, సుహృత్-సంబంధిబాంధవాన్= మిత్రులను సంబంధీకులను బంధువులను, మహా-అర్హవాసః= అలంకారైః = గొప్ప విలువైన వస్త్రములతో భూషణములతో, శయ్యా-ఆసనపరిచ్ఛదైః = పర్యంకములు ఆసనములు సామగ్రులతో, పూజయామాస= సత్కరించెను.

నా తండ్రి బృహత్సేనుడు మిత్రులకు, సంబంధీకులకు, బంధువులకు గొప్ప విలువైన వస్త్రములను, భూషణములను, పర్యంకములు, ఆసనములు మొదలైన సామగ్రిని యిచ్చి సత్కరించెను.

దాసీభి స్సర్వసంపద్భి ర్భటేభరథవాజిభిః ।
ఆయుధాని మహాఽర్హాణి దదౌ పూర్ణస్య భక్తితః ॥ 38

దాసీభిః= పరిచారికలతో, సర్వసంపద్భిః= సకలసంపదలతో, భట-ఇభరథవాజిభిః= పదాతులు ఏనుగులు రథములు గుర్రములతో, మహా-అర్హాణి= గొప్ప విలువైన, ఆయుధాని= ఆయుధములను, పూర్ణస్య= పూర్ణుడగు శ్రీకృష్ణ భగవానునకు, భక్తితః= భక్తి వలన, దదౌ= ఇచ్చెను.

నా తండ్రి పూర్ణుడగు శ్రీకృష్ణ భగవానునకు భక్తితో పరిచారికలను, సకలసంపదలను, పదాతులను, ఏనుగులను, రథములను, గుర్రములను, గొప్ప విలువైన ఆయుధములను ఇచ్చెను.

ఆత్మారామస్య తస్యేమా వయం వై గృహదాసికాః ।
సర్వసంగనివృత్త్యాఽద్ధా తపసా చ బభూవిమ ॥ 39

ఆత్మారామస్య= తన స్వరూపమునందు రమించే, తస్య= ఆయనకు, ఇమాః= ఈ, వయమ్= మేము, సర్వసంగనివృత్త్యా= సకలము లైన ఆసక్తులనుండి వెనుదిరుగుటచే, తపసా చ= తపస్సుచే, వై= నిశ్చయముగా, అద్ధా= సాక్షాత్తుగా, గృహదాసికాః= ఇంటియందు పరిచారికలము, బభూవిమ= అయితిమి.

ఈ మేము సకలములైన ఆసక్తులనుండి విరక్తులమై తపస్సు చేసి ఆత్మారాముడగు ఆ శ్రీకృష్ణునకు సాక్షాత్తుగా ఇంటిలో పరిచారికల మైతిమి. ఇది నిశ్చయము.

మహిష్య ఊచుః ।

భౌమం నిహత్య సగణం యుధి తేన రుద్ధా
జ్ఞాత్వాఽథ నః క్షితిజయే జితరాజకన్యాః ।
నిర్ముచ్య సంసృతివిమోక్షమనుస్మరంతీః
పాదాంబుజం పరిణినాయ య ఆప్తకామః ॥ 40

మహిష్యః= రాణులు, ఊచుః= పలికిరి, ఆప్తకామః= పొందబడిన కామనలు గల, యః= ఏ శ్రీకృష్ణ భగవానుడు, యుధి= యుద్ధమునందు, సగణమ్= సైన్యముతో కూడిన, భౌమమ్= నరకాసురుని, నిహత్య= సంహరించి, తేన= వానిచే, క్షితిజయే= భూమియొక్క జయమునందు, రుద్ధాః= బంధించబడిన, జితరాజకన్యాః= జయించబడిన రాజుల కుమార్తెల మగు, నః= మా గురించి, జ్ఞాత్వా= తెలుసుకొని, అథ= అప్పుడు, నిర్ముచ్య= విడిపించి, సంసృతిమోక్షమ్= సంసారమునుండి విముక్తియగు, పాద-అంబుజమ్= పద్మమువంటి పాదమును, అనుస్మరంతీః= సర్వదా స్మరించుచున్న మమ్ములను, పరిణినాయ= వివాహమాడెనో.

రాణులు పలికిరి...శ్రీకృష్ణ భగవానుడు పొందబడిన సకలకామనలు గలవాడు (పూర్ణుడు). నరకాసురుడు దిగ్విజయము చేస్తూ అనేకరాజులను జయించి వారి కుమారైలగు మమ్ములను బందీలను చేసెను. ఆ విషయము తెలిసి శ్రీకృష్ణుడు సైన్యముతో సహా నరకాసురుని సంహరించి, పిదప మమ్ములను విడిపించెను. మేము సంసారమునుండి విముక్తినిచ్చే ఆయన పాదమునే సర్వదా స్మరించెదము. మమ్ములనాయన వివాహమాడెను.

న వయం సాధ్వి సామ్రాజ్యం స్వారాజ్యం భౌజ్యమప్యుత ।
వైరాజ్యం పారమేష్ఠ్యం చ ఆనంత్యం వా హరేః పదమ్ ॥ 41

కామయామహ ఏతస్య శ్రీమత్పాదరజశ్శ్రియః ।
కుచకుంకుమగంధాఢ్యం మూర్ధ్నా వోఢుం గదాభృతః ॥ 42

సాధ్వి= ఓ పతివ్రతా! వయమ్= మేము, సామ్రాజ్యమ్= సామ్రాజ్యమును, స్వారాజ్యమ్= ఇంద్రపదవిని, భౌజ్యం అపి= ఆ రెండు భోగములను గాని, వైరాజ్యమ్= అష్ఠసిద్ధులననుభవించే పదమును, పారమేష్ఠ్యం చ= బ్రహ్మపదమునైననూ, ఆనంత్యం వా= మోక్షమును గాని, హరేః= శ్రీహరి యొక్క, పదమ్= లోకమును గాని, న కామయామహే= కోరుటలేదు, గదాభృతః= గదాధారియగు, ఏతస్య= ఈ శ్రీకృష్ణ భగవానునియొక్క, శ్రియః= లక్ష్మీదేవియొక్క, కుచకుంకుమ గంధ-ఆఢ్యమ్= స్తనములయందలి కుంకుమయొక్క పరిమళముచే సంపన్నమైన, శ్రీమత్-పాదరజః= శోభాయుక్తమైన పాదముల ధూళిని (కోరెదము).

ఓ పతివ్రతా! మేము భూలోకసామ్రాజ్యమును గాని, ఇంద్రపదవిని గాని, ఆ రెండింటి భోగములను గాని, అష్టసిద్ధులను గాని, బ్రహ్మపదమును

గాని, మోక్షమును గాని, వైకుంఠమునైననూ కోరుట లేదు. గదాధారియగు ఈ శ్రీకృష్ణ భగవానుని పాదముల ధూళి లక్ష్మీదేవియొక్క స్తనముల యందలి కుంకుమయొక్క పరిమళముచే సంపన్నమై యుండును. మేమా ధూళిని మాత్రమే కోరుచున్నాము.

వ్రజస్త్రియో యద్వాంఛంతి పులింద్యస్తృణవీరుధః ।
గావశ్చారయతో గోపాః పాదస్పర్శం మహాత్మనః ॥ 43

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే త్ర్యశీతితమోఽధ్యాయః ॥

గావః= గోవులను, చారయతః= మేపుచున్నట్టియు, మహాత్మనః = పరబ్రహ్మస్వరూపుడైన శ్రీకృష్ణ భగవానునియొక్క, పాదస్పర్శమ్= పాదముల స్పర్శను, యత్= ఏ విధముగా, వ్రజస్త్రియః= గోపికలు, పులింద్యః= బోయ స్త్రీలు, తృణవీరుధః= గడ్డి తీగలు, గోపాః= గోపాలకులు, వాంఛంతి= కోరెదరో.

పరబ్రహ్మస్వరూపుడగు శ్రీకృష్ణ భగవానుడు గోవులను మేపుచుండగా ఆయన పాదముల స్పర్శను గోపాలకులు, గోపికలు, బోయ స్త్రీలు, గడ్డి, తీగలు ఏ విధముగా కోరుచుందురో, అదే విధముగా మేము కూడ కోరుచున్నాము.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణుని భార్యలతో ద్రౌపది సంలాపమును వర్ణించే
ఎనుబది మూడవ అధ్యాయము ముగిసినది (83).

* * *

అథ చతురశీతితమోఽధ్యాయః

వసుదేవుని యజ్ఞోత్సవము

శ్రీశుక ఉవాచ ।

శ్రుత్వా పృథా సుబలపుత్ర్యథ యాజ్ఞసేనీ
మాధవ్యథ క్షితిపపత్న్య ఉత స్వగోప్యః ।
కృష్ణేఽఖిలాత్మని హరౌ ప్రణయానుబంధం
సర్వా విసిస్మ్యురలమశ్రుకలాఽఽకులాక్ష్యః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అఖిల-ఆత్మని= సకలప్రాణులలో ఆత్మరూపుడైనట్టియు, హరౌ= పాపములను పోగొట్టే, కృష్ణే= శ్రీకృష్ణునియందు, ప్రణయ-అనుబంధమ్= ప్రేమతోడి పరతంత్రత్వమును గురించి, శ్రుత్వా= విని, పృథా= కుంతి, సుబలపుత్రీ= సుబలుని కుమార్తెయగు గాంధారి, యాజ్ఞసేనీ= ద్రౌపది, మాధవీ= సుభద్ర, అథ= మరియు, క్షితిపపత్న్యః= రాజపత్నులు, ఉత= మరియు, స్వగోప్యః= శ్రీకృష్ణుని భక్తురాండ్రగు గోపికలు, సర్వాః= అందరు, అశ్రుకలా-ఆకుల-అక్ష్యః= కన్నీటి బిందువులతో నిండిన కన్నులు గలవారై, అలమ్-మిక్కిలి, విసిస్మ్యుః= విస్మయమును చెందిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...సకలప్రాణులలో ఆత్మరూపుడైన శ్రీకృష్ణ భగవానుడు దుఃఖములను పోగొట్టును. ఆయనయందు ఆయన భార్యలకు ఉన్న సర్వస్వార్పణరూపమగు ప్రేమను గురించి విని కుంతి, సుబలపుత్రియగు గాంధారి, ద్రౌపది, ఇతరరాజుల భార్యలు, శ్రీకృష్ణుని భక్తురాండ్రగు గోపికలు కూడ మిక్కిలి విస్మయమును చెందిరి. వారి కన్నులు నీటితో నిండెను.

ఇతి సంభాషమాణాసు స్త్రీభిః స్త్రీషు నృభిర్నృషు ।
ఆయయుర్మునయస్తత్ర కృష్ణరామ దిదృక్షయా ॥ 2

ఇతి= ఈ విధముగా, స్త్రీభిః= స్త్రీలతో, స్త్రీషు= స్త్రీలు, నృభిః= పురుషులతో, నృషు= పురుషులు, సంభాషమాణాసు= సంభాషించు-చుండగా, కృష్ణరామదిదృక్షయా= శ్రీకృష్ణ బలరాములను చూడ కోరికతో, మునయః= మహర్షులు, తత్ర= అచటకు, ఆయయుః= వచ్చిరి.

ఆ విధముగా పురుషులు పురుషులతో స్త్రీలు స్త్రీలతో సంభాషించు-చుండగా, బలరామ శ్రీకృష్ణులను చూచుటకు మహర్షులు అచటకు వచ్చిరి.

ద్వైపాయనో నారదశ్చ చ్యవనో దేవలోఽసితః ।
విశ్వామిత్రశ్శతానందో భరద్వాజోఽథ గౌతమః ॥ 3

రామస్సశిష్యో భగవాన్ వశిష్ఠో గాలవో భృగుః ।
పులస్త్యః కశ్యపోఽత్రిశ్చ మార్కండేయో బృహస్పతిః ॥ 4

ద్వితస్త్రితశ్చైకతశ్చ బ్రహ్మపుత్రాస్తథాఽంగిరాః ।
అగస్త్యో యాజ్ఞవల్క్యశ్చ వామదేవాదయోఽపరే ॥ 5

ద్వైపాయనః= వ్యాసుడు, నారదః చ= నారదుడు, చ్యవనః= చ్యవనుడు, దేవలః= దేవలుడు, అసితః= అసితుడు, విశ్వామిత్రః= విశ్వామిత్రుడు, శతానందః= శతానందుడు, భరద్వాజః= భరద్వాజుడు, అథ= మరియు, గౌతమః= గౌతముడు, సశిష్యః= శిష్యులతో కూడిన, రామః= పరశు రాముడు, భగవాన్= పూజనీయుడగు, వశిష్ఠః= వశిష్ఠుడు, గాలవః= గాలవుడు, భృగుః= భృగువు, పులస్త్యః= పులస్త్యుడు, కశ్యపః = కశ్యపుడు, అత్రిః-చ= అత్రి, మార్కండేయః= మార్కండేయుడు, బృహస్పతిః= బృహస్పతి, ద్వితః= ద్వితుడు, త్రితః చ= త్రితుడు, ఏకతః చ= ఏకతుడు, బ్రహ్మపుత్రాః= బ్రహ్మదేవుని పుత్రులగు సనకాదులు, తథా= మరియు, అంగిరాః= అంగిరసుడు, అగస్త్యః= అగస్త్యుడు, యాజ్ఞవల్క్యః= యాజ్ఞవల్క్యుడు, వామదేవ-ఆదయః= వామదేవుడు మొదలుగా గల, అపరే= ఇతరులు (విచ్చేసిరి).

వ్యాసుడు, నారదుడు, చ్యవనుడు, దేవలుడు, అసితుడు, విశ్వామిత్రుడు, శతానందుడు, భరద్వాజుడు, గౌతముడు, శిష్యులతో కూడిన పరశు రాముడు, పూజనీయుడగు వశిష్ఠుడు, గాలవుడు, భృగువు, పులస్త్యుడు, కశ్యపుడు, అత్రి, మార్కండేయుడు, బృహస్పతి, ద్వితుడు, త్రితుడు, ఏకతుడు, బ్రహ్మదేవుని పుత్రులగు సనక సనందన సనాతన సనత్కుమారులు, అంగిరసుడు, అగస్త్యుడు, యాజ్ఞవల్క్యుడు, వామదేవుడు, ధౌమ్యుడు మొదలుగా గల ఇతర మహర్షులు విచ్చేసిరి.

తాన్ దృష్ట్వా సహసోత్థాయ ప్రాగాసీనా నృపాదయః ।
పాండవాః కృష్ణరామౌ చ ప్రణేముర్విశ్వవందితాన్ ॥ 6

ప్రాక్= అంతవరకు, ఆసీనాః= కూర్చునియున్న, నృప-ఆదయః = రాజులు మొదలైనవారు, పాండవాః= పాండవులు, కృష్ణరామౌ చ= శ్రీకృష్ణ బలరాములు కూడ, విశ్వవందితాన్= జగత్తుచే నమస్కరించబడే, తాన్= ఆ మహర్షులను, దృష్ట్వా= చూచి, సహసా= వెంటనే, ఉత్థాయ= లేచి నిలబడి, ప్రణేముః= నమస్కరించిరి.

అంతవరకు కూర్చున్న పాండవులు, బలరామ శ్రీకృష్ణులు, రాజులు మొదలగువారు జగత్తునకంతకూ వందనీయులైన ఆ మహర్షులను చూచి వెంటనే లేచి నిలబడి నమస్కరించిరి.

తానానర్చుర్యథా సర్వే సహరామోఽచ్యుతోఽర్చయత్ ।
స్వాగతాసనపాద్యార్ఘ్యమాల్యధూపానులేపనైః ॥ 7

సర్వే= అందరు, తాన్= వారిని, ఆనర్చుః= పూజించిరి, సహరామః = బలరామునితో కూడిన, అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, స్వాగత-ఆసనపాద్య-అర్ఘ్యమాల్యధూప-అనులేపనైః= స్వాగతవచనములు ఆసనము కాళ్లు కడుగుకొనే నీరు త్రాగే నీరు పుష్పమాలలు ధూపము అంగరాగములతో, యథా= యథావిధిగా, అర్చయత్= పూజించెను.

అందరు జనులు ఆ మహర్షులను పూజించిరి. బలరాముడు, శ్రీకృష్ణ భగవానుడు వారిని స్వాగతవచనములు, ఆసనము, కాళ్లు కడుగుకొనే నీరు, త్రాగే నీరు, పుష్పమాలలు, ధూపము, అంగరాగములతో యథావిధిగా పూజించిరి.

ఉవాచ సుఖమాసీనాన్ భగవాన్ ధర్మగుప్తనుః ।
సదసస్తస్య మహతో యతవాచోఽనుశృణ్వతః ॥ 8

యతవాచః= మౌనముగానున్న, తస్య= ఆ, మహతః= గొప్ప, సదసః= సభ, అనుశృణ్వతః= వినుచుండగా, ధర్మగుప్-తనుః= ధర్మమును రక్షించే దేహము గల, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, సుఖమ్= సుఖముగా, ఆసీనాన్= కుర్చున్న వారిని ఉద్దేశించి, ఉవాచ= పలికెను.

ఆ మహర్షులందరు మౌనముగా సభలో కూర్చుని వినుచుండగా, శ్రీకృష్ణభగవానుడు వారినుద్దేశించి ఇట్లు పలికెను. ఆయన అవతరించినది ధర్మపరిరక్షణకే కదా!

శ్రీభగవానువాచ ।

అహో వయం జన్మభృతో లబ్ధం కార్త్స్న్యేన తత్ఫలమ్ ।
దేవానామపి దుష్ప్రాపం యద్యోగేశ్వరదర్శనమ్ ॥ 9

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, అహో= ఆహా!, వయమ్= మేము, జన్మభృతః= సఫలమైన జన్మ గలవారము, తత్-ఫలమ్= దాని ఫలము, కార్త్స్న్యేన= పూర్తిగా, లబ్ధమ్= పొందబడినది, యత్= ఏదనగా, దేవానాం అపి= దేవతలకు కూడ, దుష్ప్రాపమ్= పొంద శక్యము కాని, యోగ-ఈశ్వరదర్శనమ్= యోగిపుంగవుల దర్శనము.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఆహా! మా జన్మ ధన్యమైనది. మాకు ఆ జన్మయొక్క ఫలము పూర్తిగా లభించినది. దేవతలకు కూడ పొంద శక్యము కాని యోగిపుంగవులను మేము దర్శించినాము.

కిం స్వల్పతపసాం నృణామర్చాయాం దేవచక్షుషామ్ ।
దర్శనస్పర్శనప్రశ్న ప్రహ్వపాదార్చనాదికమ్ ॥ 10

స్వల్పతపసామ్= అల్పమైన తపస్సు కలిగినట్టియు, అర్చాయామ్= అర్చామూర్తియందు, దేవచక్షుషామ్= దేవుడనే దృష్టి గల, నృణామ్= మానవులకు, దర్శనస్పర్శనప్రశ్నప్రహ్వపాద-అర్చన-ఆదికమ్= చూచుట స్పృశించుట ప్రశ్నించుట ప్రణమిల్లుట పాదములను పూజించుట అర్ఘ్యాదులను సమర్పించుట, కిమ్= ఎట్లు సంభవము?

కొంచెము తపస్సు చేసి దేవుని అర్చామూర్తియందు మాత్రమే దర్శించే మానవులకు మిమ్ములను చూచి స్పృశించి ప్రశ్నించుట, ప్రణమిల్లుట, పాదములను పూజించుట, అర్ఘ్యాదులనిచ్చుట సంభవ-మేనా?

న హ్యమ్మయాని తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః ।
తే పునంత్యురుకాలేన దర్శనాదేవ సాధవః ॥ 11

తీర్థాని= తీర్థములు, అప్-మయాని= జలాశయములు మాత్రమే, న= కావు, దేవాః= దేవతలు, మృత్-శిలామయాః= మట్టితో రాళ్లతో చేసినవారు మాత్రమే, న= కారు, తే= అవి, ఉరుకాలేన= చాల కాలముచే, పునంతి= పవిత్రుని చేయును, సాధవః= సత్పురుషులు, దర్శనాత్ ఏవ= చూచుట వలననే.

కేవలము జలాశయములు మాత్రమే తీర్థములనియు, మట్టితో రాళ్లతో చేసిన విగ్రహములు మాత్రమే దేవతలనియు అనుకోరాదు. అవి చాల కాలము సేవించినప్పుడు మాత్రమే పావనము చేయగా, సజ్జనులు దర్శనము వలననే పావనము చేయుదురు.

నాగ్నిర్న సూర్యో న చ చంద్రతారకా
న భూర్జలం ఖం శ్వసనోఽథ వాఙ్మనః ।
ఉపాసితా భేదకృతో హరంత్యఘం
విపశ్చితో ఘ్నంతి ముహూర్తసేవయా ॥ 12

ఉపాసితాః= ఉపాసించబడిన దేవతలు, భేదకృతః= భేదబుద్ధిని చేయువాని, అఘమ్= పాపమును, న హరంతి= పోగొట్టరు, అగ్నిః= అగ్ని, న= కాదు, సూర్యః చ= సూర్యుడైననూ, న= కాదు, చంద్రతారకాః = చంద్రుడు నక్షత్రములు, భూః= భూమి, బలమ్= నీరు, ఖమ్= ఆకాశము, శ్వసనః= వాయువు, అథ= లేదా, వాక్= వాగ్దేవి, మనః= మనస్సు, న= కాదు, మూహూర్తసేవయా= గంట సేపు సేవించుటచే, విపశ్చితః= మహాత్ములు, ఘ్నంతి= పోగొట్టెదరు.

భేదబుద్ధితో ఉపాసించినవాని పాపమును అగ్ని, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, పృథివి-జలము-వాయువు-ఆకాశముల అధిష్ఠానదేవతలు, వాగ్దేవి, మనస్సు అధిష్ఠాన దేవత పోగొట్టరు. కాని, గంట సేపు మహాత్ముల (అద్వయ-ఆత్మనిష్ఠుల) కు సేవ చేసినచో, పాపము నశించును.

యస్యాత్మబుద్ధిః కుణపే త్రిధాతుకే స్వధీః కలత్రాదిషు భౌమ ఇజ్యధీః,
యత్తీర్థబుద్ధిస్సలిలే న కర్హిచిజ్జనేష్వభిజ్ఞేషు స ఏవ గోఖరః ॥ 13

యస్య= ఎవనికైతే, త్రిధాతుకే= మూడు ధాతువులతో చేయబడిన, కుణపే= శవమునందు, ఆత్మబుద్ధిః= తాను అనే బుద్ధియో, కలత్ర-ఆదిషు= భార్య మొదలగువారియందు, ఇజ్యధీః= దేవత అనే బుద్ధియో, యత్= ఎవనికి, సలిలే= నీటియందు, తీర్థబుద్ధిః= తీర్థమనే బుద్ధియో, అభిజ్ఞేషు= ఆత్మతత్త్వము తెలిసిన, జనేషు= జనులయందు, కర్హిచిత్= ఎప్పుడైననూ, న= ఉండవు, సః= అట్టివాడు, గోఖరః ఏవ= ఎద్దు గాడిద మాత్రమే.

ఎవడైతే వాతపిత్తశ్లేష్ములతో నిర్మాణమైన శవప్రాయమగు దేహము ఆత్మయని, భార్య-పుత్రుడు మొదలగువారు తనవారని, మట్టితో చేసిన ప్రతిమ మాత్రమే దేవతయని, జలాశయము మాత్రమే తీర్థము (పావనము) అని తలపోయునో, అట్టివాడు ఏనాడైననూ ఆత్మతత్త్వనిష్ఠులగు మహాత్ములయందు ఆత్మ-స్వీయ-పూజనీయ-పావనబుద్ధిని చేయడు. అట్టి వాడు ఎద్దు, గాడిదలవంటి వాడు మాత్రమే.

శ్రీశుక ఉవాచ ।

నిశమ్యేత్థం భగవతః కృష్ణస్యాకుంఠమేధసః ।
వచో దురన్వయం విప్రా స్తూష్ణీమాసన్ భ్రమద్ధియః ॥ 14

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇత్థమ్= ఈ విధముగా, అకుంఠమేధసః= మొక్కవోని బుద్ధిశక్తి గల, భగవతః= శ్రీకృష్ణ భగవానుని, దురన్వయమ్= అన్వయింప శక్యము కాని, వచః= మాటను, నిశమ్య= విని, విప్రాః= వేదవేత్తలు, భ్రమద్- ధియః= భ్రమించే బుద్ధులు గలవారై, తూష్ణీం ఆసన్= మిన్నకుండిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...మొక్కవోని బుద్ధిశక్తి గల శ్రీకృష్ణ భగవానుని ఈ వచనములను వేదవేత్తలగు మహర్షులు కూడ తెలియలేక పోయిరి. వారా మాటను విని బుద్ధి భ్రమించుట వలన మిన్నకుండిరి.

చిరం విమృశ్య మునయ ఈశ్వరస్యేశితవ్యతామ్ ।
జనసంగ్రహ ఇత్యూచుస్స్మయంతస్తం జగద్గురుమ్ ॥ 15

మునయః= మహర్షులు, ఈశ్వరస్య= శ్రీకృష్ణ భఘవానునియొక్క, ఈశితవ్యతామ్= మునులకు విధేయుడై యుండుట గురించి, చిరమ్= చాలసేపు, విమృశ్య= చర్చించి, జనసంగ్రహః= జనులకు ఆదర్శమును చూపుట, ఇతి= అని, స్మయంతః= నవ్వుచున్నవారై, జగద్-గురుమ్= జగత్తునకు తండ్రియగు, తమ్= ఆయనను ఉద్దేశించి, ఊచుః= పలికిరి.

సర్వేశ్వరుడగు శ్రీకృష్ణ భగవానుడు తాను మహర్షులకు విధేయుడై ఉండుటను గురించి మహర్షులు చాల సేపు విచారించి, జనులకు ఆదర్శము కొరకు ఆయన అట్లు చేయుచున్నాడని నిశ్చయించిరి. జగత్తునకు తండ్రియగు ఆయనతో వారిట్లనిరి.

మునయ ఊచుః ।

యన్మాయయా తత్త్వవిదుత్తమా వయం
విమోహితా విశ్వసృజామధీశ్వరాః ।
యదీశితవ్యాయతి గూఢ ఈహయా
అహో విచిత్రం భగవద్విచేష్టితమ్ ॥ 16

మునయః= మహర్షులు, ఊచుః= పలికిరి, తత్త్వవిద్–ఉత్తమాః = తత్త్వవేత్తలలో శ్రేష్ఠులము, విశ్వసృజామ్= ప్రజాపతులలో, అధి–ఈశ్వరాః= శాసకులము అగు, వయమ్= మేము, యత్–మాయయా= ఎవ్వాని మాయచే, విమోహితాః= మోహమును పొందితిమో, ఈహయా= చేష్టచే, గూఢః= దాగియున్న, యత్= ఏ భగవానుడు, ఈశితవ్యాయతి= సేవ చేయువాడు వలె ఆచరించుచున్నాడో, అహో= ఆహా!, భగవద్–విచేష్టితమ్= భగవానుని లీల, విచిత్రమ్= చాల చిత్రమైనది.

మహర్షులు ఇట్లు పలికిరి...తత్త్వవేత్తలలో శ్రేష్ఠులమై దక్షాది ప్రజాపతులను శాసించే మేము కూడ ఆ భగవానుని మాయచే మోహితులమగుచున్నాము. ఆ భగవానుడు మానవరూపములో గూఢముగా నుండి మానవుల చేష్ఠలననుకరిస్తూ మనకు సేవ చేయుచున్నాడు. ఆహా! ఆయన లీల చాల చిత్రమైనది.

అనీహ ఏతద్బహుధైక ఆత్మనా
సృజత్యవత్యత్తి న బధ్యతే యథా ।
భూమైర్హి భూమిర్బహుమానరూపిణీ
అహో విభూమ్నశ్చరితం విడంబనమ్ ॥ 17

అనీహః= నిష్కాముడు, ఏకః= ఒక్కడు, ఆత్మనా= తనచే, ఏతత్-ఈ జగత్తును, బహుధా= అనేక ప్రకారములుగా, సృజతి= సృష్టించు-చున్నాడు, అవతి= పాలించుచున్నాడు, అత్తి= ఉపసంహరించుచున్నాడు, న బధ్యతే= బంధించబడుట లేదు, యథా= ఏ విధముగానైతే, భౌమైః = మట్టియొక్క వికారములచే, బహునామరూపిణీ= చాల నామరూపములు గల, భూమిః= భూమియే, అహో= ఆహా!, విభూమ్నః= పరబ్రహ్మయొక్క, చరితమ్= అవతార వృత్తాంతము, విడంబనం హి= అనుకరణ మాత్రమే.

పరబ్రహ్మ నిష్కాముడు, అద్వితీయుడు. ఆ బ్రహ్మ తానే ఉపాదానమై అనేకప్రకారములుగా ఈ జగత్తును సృష్టించి, పాలించి, ఉపసంహరించుచున్నాడు. అయిననూ, జగత్తు బ్రహ్మను బంధించుట లేదు. కుండ, బాన మొదలైన మట్టియొక్క వికారములచే ఒకే పృథివి అనేకనామరూపములను కలిగియుండుట దీనికి దృష్టాంతము. ఆహా! పరబ్రహ్మ అవతరించి చేసిన సాధుసేవాది కృత్యములు కేవలము అనుకరణము మాత్రమే.

అథాపి కాలే స్వజనాభిగుప్తయే బిభర్షి సత్త్వం ఖలనిగ్రహాయ చ,
స్వలీలయా వేదపథం సనాతనం వర్ణాశ్రమాత్మా పురుషః పరో భవాన్।18

భవాన్= నీవు, పరః= ప్రకృతికి అతీతమైన, పురుషః= పూర్ణబ్రహ్మవు, అథ అపి= అయినప్పటికి, స్వజన-అభిగుప్తయే= తన భక్తులను రక్షించుట కొరకు, ఖలనిగ్రహాయ చ= దుష్టులను శిక్షించుట కొరకు కూడ, కాలే= సమయమునందు, సత్త్వమ్= సత్త్వగుణప్రధానమైన రూపమును, బిభర్షి= ధరించెదవు, వర్ణ-ఆశ్రమ-ఆత్మా= వర్ణాశ్రమముల అభిమానము గలవాడవై, స్వలీలయా= నీ లీల ద్వారా, సనాతనమ్= పురాతనమైన, వేదపథమ్= వేదధర్మమును, బిభర్షి= నిలబెట్టెదవు.

నీవు ప్రకృతికి అతీతమైన పరబ్రహ్మవు. అయినప్పటికీ, నీవు దుష్టులను శిక్షించి నీ భక్తులను రక్షించుటకై సమయము వచ్చినప్పుడు సత్త్వగుణప్రధానమగు రూపమును దాల్చెదవు. నీవు వర్ణాశ్రమముల అభిమానముతో నీ లీల ద్వారా పురాతనమగు వేదధర్మమును నిలబెట్టెదవు.

బ్రహ్మ తే హృదయం శుక్లం తపస్స్వాధ్యాయసంయమైః ।
యత్రోపలబ్ధం సద్వ్యక్తమవ్యక్తం చ తతః పరమ్ ॥ 19

బ్రహ్మ= వేదము, శుక్లమ్= శుద్ధమైన, తే= నీ, హృదయమ్= హృదయము, యత్ర= దేనియందైతే, తపః= స్వ-అధ్యాయసంయమైః= తపస్సు స్వాధ్యాయము ఇంద్రియనిగ్రహములచే, వ్యక్తమ్= కార్యము, అవ్యక్తమ్= కారణము, తతః= వాటికంటె, పరమ్= అతీతమైన, సత్ చ= సద్ఘనమగు పరబ్రహ్మ, ఉపలబ్ధమ్= సాక్షాత్కరించుకొనబడునో.

వేదము నీ శుద్ధమైన హృదయము. సాధకుడు తపస్సు, స్వాధ్యాయము, ఇంద్రియనిగ్రహముల ద్వారా ఆ వేదమునందు కారణ కార్యములను, వాటికి అతీతమైన సద్ఘన బ్రహ్మను సాక్షాత్కరించుకొనును.

తస్మాద్బ్రహ్మకులం బ్రహ్మన్ శాస్త్రయోనేస్త్వమాత్మనః ।
సభాజయసి సద్ధామ తద్బ్రహ్మణ్యాగ్రణీర్భవాన్ ॥ 20

బ్రహ్మన్= ఓ పరబ్రహ్మా!, తస్మాత్= అందువలన, త్వమ్= నీవు, శాస్త్రయోనేః= వేదమే ప్రమాణముగా గల, ఆత్మనః= పరమాత్మకు, సత్= శ్రేష్ఠమైన, ధామ= ఉపలబ్ధిస్థానమగు, బ్రహ్మకులమ్= బ్రాహ్మణత్వమును, సభాజయసి= పూజించుచున్నావు, తత్= అందువలన, భవాన్= నీవు, బ్రహ్మణ్య-అగ్రణీః= బ్రాహ్మణభక్తులలో అగ్రేసరుడవు.

ఓ పరబ్రహ్మా! కావున, శాస్త్రమే ప్రమాణముగా గల పరమాత్మకు శ్రేష్ఠమైన ఉపలబ్ధిస్థానమగు బ్రాహ్మణత్వమును నీవు పూజించుచున్నావు. కావుననే, నీవు బ్రాహ్మణభక్తులలో అగ్రేసరుడవు.

అద్య నో జన్మసాఫల్యం విద్యాయాస్తపసో దృశః ।
త్వయా సంగమ్య సద్గత్యా యదంతశ్శ్రేయసాం పరః ॥ 21

సద్-గత్యా= సత్పురుషులచే పొందబడే, త్వయా= నీతో, సంగమ్య= కలుసుకొని, నః= మాకు, అద్య= ఈనాడు, జన్మసాఫల్యమ్= పుట్టుక సఫలమగుట, విద్యాయాః= విద్యకు, తపసః= తపస్సునకు, దృశః= చూపుకు, యత్= ఏలయన, శ్రేయసామ్= కల్యాణములకు, పరః= అంతిమమైన, అంతః= అవధియో.

సత్పురుషులు పొందేది నిన్నే. ఈనాడు నిన్ను కలుసుకొనుటచే మా పుట్టుక, విద్య, తపస్సు, చూపు కూడ సఫలములైనవి. ఎందుకంటే, నీవు కల్యాణములకు పరమావధివి.

సమస్తస్మై భగవతే కృష్ణాయాకుంఠమేధసే ।
స్వయోగమాయాచ్ఛన్నమహిమ్నే పరమాత్మనే ॥ 22

అకుంఠమేధసే= మొక్కవోని విజ్ఞానశక్తి కలిగినట్టియు, స్వయోగ-మాయాచ్ఛన్నమహిమ్నే= తన యోగమాయచే కప్పివేయబడిన మహిమ (స్వరూపము) కలిగినట్టియు, పరమ-ఆత్మనే= వ్యక్తికి అంతరతమ స్వరూపమైన, తస్మై= ఆ, కృష్ణాయ భగవతే= శ్రీకృష్ణ భగవానుని కొరకు, నమః= నమస్కారము.

మొక్కవోని విజ్ఞానశక్తి గల శ్రీకృష్ణ భగవానుని మహిమ (స్వరూపము) ఆయన యోగమాయచే కప్పివేయబడినది. వ్యక్తియొక్క అంతరతమ చైతన్యస్వరూపుడైన ఆ శ్రీకృష్ణ భగవానుని కొరకు నమస్కారము.

న యం విదంత్యమీ భూపా ఏకారామాశ్చ వృష్ణయః ।
మాయాజవనికాచ్ఛన్నమాత్మానం కాలమీశ్వరమ్ ॥ 23

మాయాజవనికాచ్ఛన్నమ్= మాయ అనే తెరచే కప్పివేయబడిన, ఆత్మానమ్= ఆత్మస్వరూపుడైనట్టియు, కాలమ్= కాలస్వరూపుడైన, యమ్= ఏ, ఈశ్వరమ్= శ్రీకృష్ణ భగవానుని, అమీ= ఈ, భూపాఃా= రాజులు, ఏక-ఆరామాఃా= ఒకే చోట నివాసము గల, వృష్ణయఃా చ= యాదవులు కూడ, న విదంతి= తెలియరు.

శ్రీకృష్ణ భగవానుడు (లోపల) ఆత్మస్వరూపుడు, (బయట) కాలస్వరూపుడు. కాని, ఈ రాజులు గాని, ఆయనతో కలిసి ఒకే చోట నివసించే యాదవులు గాని, ఆయన స్వరూపమునెరుగరు.

యథా శయానఃా పురుష ఆత్మానం గుణతత్త్వదృక్ ।
నామమాత్రేంద్రియాభాతం న వేద రహితం పరమ్ ॥ 24

యథా= ఏ విధముగానైతే, గుణతత్త్వదృక్= గుణకార్యములగు రూపములను సత్యవస్తువుగా దర్శించే, పురుషఃా= వ్యక్తి, శయానఃా= నిద్రిస్తున్నవాడై, నామమాత్ర-ఇంద్రియ-ఆభాతమ్= కేవలము పేరు మాత్రమే అయి మనస్సుచే తెలియబడే రూపమును, ఆత్మానమ్= తననుగా, వేద= తెలియునో, రహితమ్= ఆ రూపము లేని, పరమ్= అతీతమగు తత్త్వమును, న వేద= తెలియడో.

నిద్రించే వ్యక్తి స్వప్నములో గుణకార్యములగు పదార్థములను సత్యములని దర్శించును. ఆతడు పేరు మాత్రమే అయి (మిథ్యాభూతము) మనస్సుచే తెలియబడే రూపము తానే యని భ్రమ పడును. తాను ఆ రూపముకంటె అతీతమైన జాగ్రద్వ్యక్తినని ఆతడు తెలియడు.

ఏవం త్వా నామమాత్రేషు విషయేష్వింద్రియేహయా ।
మాయయా విభ్రమచ్చిత్తో న వేద స్మృత్యుపప్లవాత్ ॥ 25

ఏవమ్= ఇదే విధముగా, విషయేషు= భోగ్యములయందు, ఇంద్రియ-ఈహయా= ఇంద్రియముల ప్రవృత్తి అనే, మాయయా=

అజ్ఞానముచే, విభ్రమత్-చిత్తః= పరిభ్రమించే చిత్తము గల జనుడు, స్మృతి-ఉపప్లవాత్= వివేకము నష్టమగుట వలన, నామమాత్రేషు= పేరు మాత్రమే అయినవాటియందు, త్వా= నిన్ను, న వేద= తెలియడు.

ఇదే ప్రకారముగా, భోగ్యములయందు ఇంద్రియముల ప్రవృత్తిచే మనిషి చిత్తము వ్యాకులమై వివేకము నష్టమగును. అట్టివాడు కేవలము నామరూపాత్మకమగు జగత్తునందు సద్ఘనమైన నిన్ను తెలియలేడు.

తస్యాద్య తే దదృశిమాంఘ్రిమఘౌఘమర్ష-
తీర్థాస్పదం హృది కృతం సువిపక్వయోగైః ।
ఉత్సిక్తభక్త్యుపహతాశయజీవకోశా
ఆపుర్భవద్గతిమథోఽనుగృహాణ భక్తాన్ ॥ 26

అద్య= ఈనాడు, తస్య= అట్టి, తే= నీయొక్క, అఘ-ఓఘమర్ష తీర్థ-ఆస్పదమ్= పాపముల సమూహమును నశింపజేసే తీర్థమైన గంగకు పుట్టినిల్లైనట్టియు, సుపక్వయోగైః= పరిపక్వమైన చిత్తైకాగ్రత గల యోగులచే, హృది= హృదయమునందు, కృతమ్= చేయబడిన, అంఘ్రిమ్= పాదమును, దదృశిమ= దర్శించితిమి, ఉత్సిక్తభక్తి-ఉపహత-ఆశయజీవకోశాః= వర్ధిల్లిన భక్తిచే నివృత్తమైన అంతఃకరణమనే జీవాత్మకమగు బంధము గలవారు, భవద్-గతిమ్= నిన్ను లక్ష్యమునుగా, ఆపుః= పొందిరి, అథో= అందువలన, భక్తాన్= భక్తులను, అనుగృహాణ= అనుగ్రహించుము.

నీ పాదము పాపముల గుట్టలను నశింపజేసే గంగాతీర్థమునకు పుట్టినిల్లు. పరిపక్వమైన చిత్తైకాగ్రత గల యోగులు నీ పాదమును హృదయములో నిలిపెదరు. మేము అట్టి నీ పాదమును దర్శించితిమి. వర్ధిల్లిన భక్తిచే సాధకుని అంతఃకరణ (లింగశరీర) రూపమైన పరిచ్ఛిన్న జీవభావము నశించి నీయందు ఐక్యమై జీవన్ముక్తి లభించును. కావున, మమ్ములను భక్తులను చేసి అనుగ్రహించుము.

శ్రీశుక ఉవాచ ।

ఇత్యనుజ్ఞాప్య దాశార్హం ధృతరాష్ట్రం యుధిష్ఠిరమ్ ।
రాజర్షే స్వాశ్రమాన్ గంతుం మునయో దధిరే మనః ॥ 27

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజ–ఋషి= ఓ రాజర్షీ!, మునయః= మహర్షులు, ఇతి= ఈ విధముగా, దాశార్హమ్= దశార్హవంశీయు డగు శ్రీకృష్ణుని, ధృతరాష్ట్రమ్= ధృతరాష్ట్రుని, యుధిష్ఠిరమ్= ధర్మరాజును, అనుజ్ఞాప్య= అనుమతి యిచ్చునట్లు చేసి, స్వ–ఆశ్రమాన్= తమ ఆశ్రమములను గురించి, గంతుమ్= వెళ్లుటకు, మనః= దధిరే= నిశ్చయించిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! నీవు రాజువైనా ఋషివి. మహర్షులీ విధముగా శ్రీకృష్ణుడు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజుల వద్ద సెలవు తీసుకొని, తమ ఆశ్రమములకు వెళ్లుటకు నిశ్చయించుకొనిరి.

తద్వీక్ష్య తానుపవ్రజ్య వసుదేవో మహాయశాః ।
ప్రణమ్య చోపసంగృహ్య బభాషేదం సుయంత్రితః ॥ 28

మహాయశాః= గొప్ప కీర్తి గల, వసుదేవః= వసుదేవుడు, తత్= దానిని, వీక్ష్య= చూచి, తాన్= వారిని, ఉపవ్రజ్య= సమీపించి, ప్రణమ్య చ= ప్రణమిల్లి, ఉపసంగృహ్య= పాదములను పట్టుకొని, సుయంత్రితః = ఏకాగ్రచిత్తము గలవాడై, ఇదమ్= ఈ మాటను, బభాషే= పలికెను.

ఆ మహర్షుల ప్రయాణసన్నాహమును చూచి గొప్ప కీర్తిమంతుడగు వసుదేవుడు వారి వద్దకు వెళ్లి పాదములను పట్టుకొని ప్రణమిల్లి ఏకాగ్రమగు చిత్తముతో నిట్లు పలికెను.

వసుదేవ ఉవాచ ।

నమో వస్సర్వదేవేభ్య ఋషయశ్శ్రోతుమర్హథ ।
కర్మణా కర్మనిర్హారో యథా స్యాన్నస్తదుచ్యతామ్ ॥ 29

వసుదేవః= వసుదేవుడు, ఉవాచ= పలికెను, ఋషయః= ఓ మహర్షులారా!, సర్వదేవేభ్యః= సకలదేవతలు గల, వః= మీ కొరకు, నమః= నమస్కారము, శ్రోతుమ్= వినుటకు, అర్హ్థ= తగుదురు, కర్మణా= కర్మచే, కర్మనిర్హారః= కర్మనాశము, యథా= ఎట్లు, స్యాత్= అగునో, నః = మాకు, తత్= అది, ఉచ్యతామ్= చెప్పబడుగాక!

వసుదేవుడిట్లు పలికెను...ఓ మహర్షులారా! సకలదేవతలు మీయందే గలరు. నా మాట వినుడు. కర్మచే కర్మవాసనల పూర్తి నాశము ఎట్లు కలుగును? ఆ విషయమును మాకు చెప్పుడు.

నారద ఉవాచ ।

నాతిచిత్రమిదం విప్రా వసుదేవో బుభుత్సయా ।
కృష్ణం మత్వాఽర్భకం యన్నః పృచ్ఛతి శ్రేయ ఆత్మనః ॥ 30

నారదః= నారద మహర్షి, ఉవాచ= పలికెను, విప్రాః= ఓ వేదవేత్త-లారా!, ఇదమ్= ఇది, అతివిచిత్రమ్= పెద్ద విడ్డూరము, న= కాదు, యత్= ఏదనగా, కృష్ణమ్= శ్రీకృష్ణుని, అర్భకమ్= పిల్లవానినిగా, మత్వా= తలచి, వసుదేవః= వసుదేవుడు, ఆత్మనః= తనకు, శ్రేయః= శ్రేయస్సును, బుభుత్సయా= తెలియ గోరికతో, నః= మనలను, పృచ్ఛతి= ప్రశ్నించుచున్నాడో.

నారద మహర్షి ఇట్లు పలికెను...ఓ వేదవేత్తలారా! శ్రీకృష్ణుడు బుడతడని తలచిన వసుదేవుడు తనకు శ్రేయస్సును గురించి తెలియగోరి మనలను ప్రశ్నించుట అనే ఈ సందర్భము పెద్ద విడ్డూరము కాదు.

సన్నికర్షో హి మర్త్యానామనాదరణకారణమ్ ।
గాంగం హిత్వా యథాఽన్యాంభ స్తత్రత్యో యాతి శుద్ధయే ॥ 31

హి= ఏలయన, మర్త్యానామ్= మానవులకు, సన్నికర్షః= దగ్గరగా నుండుట, అనాదరణకారణమ్= ఆదరించకుండుటకు కారణము,

యథా= ఏ విధముగానైతే, తత్రత్యః= అక్కడ ఉన్నవాడు, శుద్ధయే= శుద్ధి కొరకు, గాంగమ్= గంగానదికి చెందిన నీటిని, హిత్వా= విడిచిపెట్టి, అన్య–అంభః= మరియొక నీటిని గురించి, యాతి= వెళ్లుచున్నాడో.

ఏలయనగా, దగ్గరగానున్నదానిని మానవులు అనాదరము చేసెదరు. ఉదాహరణకు, గంగ ఒడ్డున ఉన్నవాడు శుద్ధి కొరకు ఇంకో నదికి వెళ్లును.

యస్యానుభూతిః కాలేన లయోత్పత్త్యాదినాఽస్య వై ।
స్వతోఽన్యస్మాచ్చ గుణతో న కుతశ్చన రిష్యతి ॥ 32

యస్య= ఏ, అస్య= ఈ ఈశ్వరునియొక్క, అనుభూతిః= స్వరూప–చైతన్యము (జ్ఞానము), కాలేన= కాలముచే, లయ–ఉత్పత్తి–ఆదినా= ప్రళయము సృష్టి మొదలైనవాటిచే, స్వతః= తనంత తానుగా, అన్యస్మాత్ చ= ఇతరము వలన కూడ, గుణతః= గుణముల వలన, కుతశ్చన= దేనివలనైననూ, వై= నిశ్చయముగా, న రిష్యతి= నశించదో.

ఆ ఈ ఈశ్వరుని స్వరూపచైతన్యము కాలముచే గాని, జగత్తుయొక్క సృష్టిస్థితిలయములచే గాని, తనంత తానుగా గాని, ఇతరము వలన గాని, సత్త్వాదిగుణముల వలన గాని, దేనివలనైనా నశించదు. ఇది నిశ్చయము.

తం క్లేశకర్మపరిపాకగుణప్రవాహైః
అవ్యాహతానుభవమీశ్వరమద్వితీయమ్ ।
ప్రాణాదిభిస్స్వవిభవైరుపగూఢమన్యో
మన్యేత సూర్యమివ మేఘుహిమోపరాగైః ॥ 33

క్లేశకర్మపరిపాకగుణప్రవాహైః= చిత్తమలములచే కర్మలచే వాటి ఫలములచే గుణముల ప్రవాహములచే, అవ్యాహత–అనుభవమ్= ఖండితము కాని జ్ఞానము కలిగినట్టియు, అద్వితీయమ్= రెండవది లేని, ఈశ్వరమ్= ఈశ్వరుని, అన్యః= ఇతరుడు, స్వవిభవైః= తన

కార్యములైన, ప్రాణ-ఆదిభిః= ప్రాణము మొదలగువాటిచే, మేఘహిమ-ఉపరాగైః= మేఘములు మంచు గ్రహణములచే, సూర్యం ఇవ= సూర్యుని వలె, ఉపగూఢమ్= కప్పివేయబడినవానినిగా, మన్యేత= తలపోయును.

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము (మృత్యుభయము) అనే చిత్తమలములు గాని, పుణ్యపాపకర్మలు గాని, సుఖదుఃఖరూపమైన కర్మఫలములు గాని, సత్త్వరజస్తమోగుణముల ప్రవాహములైన దేహాదులు గాని, రెండవది లేని ఈశ్వరుని జ్ఞానమును ఖండించలేవు. మేఘములు, మంచు, గ్రహణము సూర్యుని కప్పివేయునని ఖండించలేవు. మేఘములు, మంచు, గ్రహణము సూర్యుని కప్పివేయునని అజ్ఞాని తలచును. అదే విధముగా, ఈశ్వరునినుండియే ప్రకటమైన ప్రాణము, బుద్ధి మొదలగునవి ఈశ్వరుని కప్పివేయునని అజ్ఞాని తలపోయును. (వాస్తవముగా సూర్యుడు గాని, ఆత్మ గాని దేనితోనూ కప్పివేయబడదు).

అథోచుర్మునయో రాజన్నాభాష్యానకదుందుభిమ్ ।
సర్వేషాం శృణ్వతాం రాజ్ఞాం తథైవాచ్యుతరామయోః ॥ 34

రాజన్= రాజా!, అథ= పిదప, మునయః= మునులు, ఆనకదుందుభిమ్= వసుదేవుని, ఆభాష్య= సంబోధించి, సర్వేషామ్= అందరు, రాజ్ఞామ్= రాజులు, తథా ఏవ= అదే విధముగా, అచ్యుతరామయోః= శ్రీకృష్ణుడు బలరాముడు, శృణ్వతామ్= వినుచుండగా, ఊచుః= పలికిరి.

పరీక్షిన్మహారాజా! తరువాత, సకలరాజులు, శ్రీకృష్ణ భగవానుడు, బలరాముడు వినుచుండగా, మహర్షులు వసుదేవుని సంబోధించి ఇట్లు పలికిరి.

కర్మణా కర్మనిర్హార ఏష సాధు నిరూపితః ।
యచ్ఛ్రద్ధయా యజేద్విష్ణుం సర్వయజ్ఞేశ్వరం మఖైః ॥ 35

ఏషః= ఈ, కర్మణా= కర్మచే, కర్మనిర్హారః= కర్మనాశము, సాధు= బాగుగా, నిరూపితః= నిర్ణయించ బడినది, యత్= ఏదనగా, సర్వయజ్ఞ-ఈశ్వరమ్= సకలయజ్ఞములకు పాలకుడగు, విష్ణుమ్= శ్రీహరిని, శ్రద్ధయా= శ్రద్ధతో, మఖైః= యజ్ఞములచే, యజేత్= ఆరాధించవలెను.

సకలయజ్ఞములకు పాలకుడగు శ్రీహరిని శ్రద్ధతో యజ్ఞములను చేసి ఆరాధించవలెను. కర్మచే కర్మవాసనల వినాశమునకు ఇదియే చక్కని ఉపాయమని నిర్ధారించబడినది.

చిత్తస్యోపశమోఽయం వై కవిభిశ్శాస్త్రచక్షుషా ।
దర్శితస్సుగమో యోగో ధర్మశ్చాత్మముదావహః ॥ 36

చిత్తస్య= మనస్సునకు, ఉపశమః= శాంతిని కలిగించునది, ఆత్మముదావహః= అంతఃకరణమునకు ఆనందమును కలిగించునది, ధర్మః= ధర్మము, కవిభిః= మహాత్ములచే, శాస్త్రచక్షుషా= వేదమనే చూపుతో, సుగమః= తేలికగా పొందదగిన, యోగః= ఉపాయము, దర్శితః= చూపబడినది.

ఇదియే అంతఃకరణమునకు సుఖశాంతులనిచ్చే తేలికయైన ఉపాయము, ధర్మము అని జ్ఞానమే చూపుగా గల మహాత్ములు నిరూపించిరి.

అయం స్వస్త్యయనః పంథా ద్విజాతేర్గృహమేధినః ।
యచ్ఛ్రద్ధయాఽఽప్తవిత్తేన శుక్లేనేజ్యేత పూరుషః ॥ 37

ద్విజాతేః= ఉపనయనసంస్కారము గల, గృహమేధినః= గృహస్థునకు, అయమ్= ఇది, స్వస్తి-అయనః= శ్రేయస్సును పొందించే, పంథాః= మార్గము, యత్= ఏదనగా, శుక్లేన= తెల్లని, ఆప్తవిత్తేన= పొందబడిన ధనముతో, శ్రద్ధయా= శ్రద్ధతో, పూరుషః= పూర్ణుడగు శ్రీహరి, ఇజ్యేత= ఆరాధించబడునో.

ఉపనయనసంస్కారము గల గృహస్థుడు న్యాయార్జితమైన తెల్ల (శుద్ధ) ధనముతో పూర్ణుడగు శ్రీహరిని శ్రద్ధతో యజ్ఞము చేసి ఆరాధించవలెను. ఇదియే శ్రేయస్సును పొందించే ఉపాయము.

విత్తైషణాం యజ్ఞదానైర్గృహైర్దారసుతైషణామ్ ।
ఆత్మలోకైషణాం దేవ కాలేన విసృజేద్బుధః ।
గ్రామే త్యక్తైణస్సర్వే యయుర్ధీరాస్తపోవనమ్ ॥ 38

దేవ= ఓ వసుదేవా!, బుధః= వివేకి, యజ్ఞదానైః= యజ్ఞదానములచే, విత్త-ఏషణామ్= ధనమునందలి కామనను, గృహైః= ఇంటియందలి భోగములచే, దారసుత-ఏషణామ్= భార్య పిల్లలయందలి ఇచ్ఛను. ఆత్మలోక-ఏషణామ్= తన స్వర్గాదులయందలి ఇచ్ఛను, కాలేన= కాలముచే, విసృజేత్= విడిచిపెట్టవలెను, ధీరాః= వివేకులు, సర్వే= అందరు, గ్రామే= గ్రామమునందు, త్యక్త-ఏషణాః= విడిచిపెట్టబడిన కామనలు గలవారై, తపఃవనమ్= తపస్సు కొరకు వనమును గురించి, యయుః= వెళ్లిరి.

ఓ వసుదేవా! వివేకి యజ్ఞదానముల ద్వారా ధనమునందలి ఇచ్ఛను, ఇంటియందలి భోగముల ద్వారా భార్య, సంతానము అనువాటి యందలి ఇచ్ఛను, కాలముచే సర్వము నశించునని భావించుటచే స్వర్గాది లోకములయందలి తన కామనను విడిచిపెట్టవలెను. వివేకులందరు గృహస్థులుగా ఉండి ఈ కామనలను విడిచి తపస్సుకై అడవికి వెళ్లెడివారు.

ఋణైస్త్రిభిర్ద్విజో జాతో దేవర్షిపితౄణాం ప్రభో ।
యజ్ఞాధ్యయనపుత్రైస్తాన్యనిస్తీర్య త్యజన్ పతేత్ ॥ 39

ప్రభో= ఓ వసుదేవా!, ద్విజః= బ్రాహ్మణుడు, దేవ-ఋషి-పితౄణామ్= దేవతలకు మహర్షులకు పితృదేవతలకు, త్రిభిః= మూడు, ఋణైః= ఋణములతో, జాతః= పుట్టినవాడు, తాని= వాటిని, యజ్ఞ-

అధ్యయనపుత్రైః= యజ్ఞము అధ్యయనము పుత్రులచే, అనిస్తీర్య= తీర్చకుండా, త్యజన్= విడిచిపెట్టువాడు, పతేత్= పతితుడగును.

ఓ ప్రభూ! బ్రాహ్మణుడు దేవతలకు, ఋషులకు, పితృదేవతలకు ఋణముతో పుట్టును. ఈ మూడు ఋణములను క్రమముగా యజ్ఞము, అధ్యయనము, సంతానములచే తీర్చకుండా సన్న్యసించువాడు పతితుడగును.

త్వం త్వద్య ముక్తో ద్వాభ్యాం వై ఋషిపిత్రోర్మహామతే ।
యజ్ఞైర్దేవర్ణమున్మ్యచ్య నిర్ఋణోఽశరణో భవ ॥ 40

మహామతే= ఓ గొప్ప బుద్ధి గలవాడా!, త్వం తు= నీవైతే, అద్య= ఇప్పటికి, ఋషిపిత్రోః= ఋషుల పితృదేవతల, ద్వాభ్యాం వై= రెండు ఋణములనుండైతే, ముక్తః= విముక్తుడవు, యజ్ఞైః= యజ్ఞములచే, దేవ-ఋణమ్= దేవతల ఋణమును, ఉన్ముచ్య= తీర్చి, నిర్-ఋణః= ఋణములు లేనివాడవై, అశరణః= సన్న్యాసివి, భవ= అగుము.

గొప్ప బుద్ధి గల ఓ వసుదేవా! నీవైతే ఇప్పటికి పితృదేవతల, మహర్షుల ఋణములు రెండింటినుండి విముక్తిని పొందితివి. యజ్ఞముల ద్వారా దేవతల ఋణమును కూడ తీర్చి సన్న్యసించుము.

వసుదేవ భవాన్నూనం భక్త్యా పరమయా హరిమ్ ।
జగతామీశ్వరం ప్రార్చ్చస్స యద్వాం పుత్రతాం గతః ॥ 41

వసుదేవ= ఓ వసుదేవా!, భవాన్= నీవు, నూనమ్= నిశ్చయముగా, పరమయా భక్త్యా= పరమభక్తితో, జగతామ్= జగత్తులకు, ఈశ్వరమ్= అంతర్యామియగు, హరిమ్= శ్రీహరిని, ప్రార్చ్చః= అర్చించితివి, యత్= దేనివలన, వామ్= మీ ఇద్దరికి, పుత్రతాం గతః= పుత్రుడైనాడో.

ఓ వసుదేవా! నీవు నిశ్చయముగా ప్రేమభక్తితో బ్రహ్మాణ్డములకు అంతర్యామియగు శ్రీహరిని అర్చించితివి. కావుననే, ఆయన మీ దంపతులకు పుత్రుడై జన్మించినాడు.

శ్రీశుక ఉవాచ ।

ఇతి తద్వచనం శ్రుత్వా వసుదేవో మహామనాః ।
తానృషీనృత్విజో వవ్రే మూర్ధ్నాఽఽనమ్య ప్రసాద్య చ ॥ 42

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, మహామనాః= పెద్ద మనసు గల, వసుదేవః= వసుదేవుడు, ఇతి= ఈ విధమైన, తద్-వచనమ్= ఆ మహర్షుల మాటను, శ్రుత్వా= విని, తాన్= ఆ, ఋషీన్= మహర్షులను, మూర్ధ్నా= శిరస్సుతో, ఆనమ్య= ప్రణమిల్లి, ప్రసాద్య చ= ప్రసన్నులనుగా కూడ చేసి, ఋత్విజః= ఋత్విక్కులనుగా, వవ్రే= వరించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను... పెద్ద మనసు గల వసుదేవుడు ఆ మహర్షుల వచనమును విని, వారికి తల వంచి నమస్కరించి, ప్రసన్నులను చేసుకొని, వారినే ఋత్విక్కులుగా వరించెను.

త ఏనమృషయో రాజన్ వృతా ధర్మేణ ధార్మికమ్ ।
తస్మిన్నయాజయన్ క్షేత్రే మఖైరుత్తమకల్పకైః ॥ 43

రాజన్= ఓ రాజా!, ధర్మేణ= ధర్మముచే, వృతాః= వరించబడిన, తే= ఆ, ఋషయః= మహర్షులు, ధార్మికమ్= ధార్మికుడగు, ఏనమ్= ఈ వసుదేవుని, తస్మిన్= ఆ, క్షేత్రే= క్షేత్రమునందు, ఉత్తమకల్పకైః= ఉత్తమమైన సామగ్రులు గల, మఖైః= యజ్ఞములచే, అయాజయన్= చేయించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ధర్మపూర్వకముగా వరించబడిన ఆ మహర్షులు ధర్మాత్ముడగు ఈ వసుదేవునిచే ఆ సమంతపంచకక్షేత్రము నందు ఉత్తమమైన మంత్రద్రవ్యాదులు గల యజ్ఞములను చేయించిరి.

తద్దీక్షాయాం ప్రవృత్తాయాం వృష్ణయః పుష్కరస్రజః ।
స్నాతాస్సువాససో రాజన్ రాజానస్సుష్ఠ్వలంకృతాః ॥ 44

రాజన్= ఓ రాజా!, తద్-దీక్షాయామ్= ఆ వసుదేవుని యజ్ఞదీక్ష, ప్రవృత్తాయామ్= కొనసాగుచుండగా, వృష్ణయః= యాదవులు, పుష్కర-

స్రజః= పద్మముల మాలలు గలవారు, స్నాతాః= స్నానము చేసినవారు, సువాససః= మంచి వస్త్రములు గలవారు, రాజానః= రాజులు, సుష్ఠు= బాగుగా, అలంకృతాః= అలంకరించుకున్నవారు.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ వసుదేవుని యజ్ఞదీక్ష సాగుచుండెను. యాదవులు స్నానము చేసి పద్మ(బీజముల)మాలలను, మంచి వస్త్రములను ధరించిరి. రాజులు బాగుగా అలంకరించుకొనిరి.

తన్మహిష్యశ్చ ముదితా నిష్కకంఠ్యస్సువాససః ।
దీక్షాశాలాముపాజగ్మురాలిప్తా వస్తుపాణయః ॥ 45

తత్-మహిష్యః చ= ఆ వసుదేవుని భార్యలు కూడ, ముదితాః= ఆనందించినవారు, నిష్కకంఠ్యః= హారములు మెడలయందు గలవారు, సువాససః= మంచి వస్త్రములు గలవారు, ఆలిప్తాః= చందనాదుల నలదుకున్నవారు, వస్తుపాణయః= వస్తువులు చేతులయందు గలవారు, దీక్షాశాలామ్= యజ్ఞదీక్షయొక్క శాలను గురించి, ఉపాజగ్ముః= వచ్చిరి.

ఆ వసుదేవుని భార్యలు కూడ మంచి వస్త్రములను దాల్చి, మెడలో హారములను వేసుకొని, చందనాదులనలదుకొని, మంగళద్రవ్యములను పట్టుకొని ఆనందముతో యజ్ఞశాలకు విచ్చేసిరి.

నేదుర్మృదంగపటహశంఖభేర్యానకాదయః ।
ననృతుర్నటనర్తక్యస్తుష్టువు స్సూతమాగధాః ।
జగుస్సుకంఠ్యో గంధర్వ్య స్సంగీతం సహభర్తృకాః। 46

మృదంగపటహశంఖభేరీ-ఆనక-ఆదయః= మద్దెళ్లు డోళ్లు శంఖములు భేరీలు తప్పెటలు మొదలైనవి, నేదుః= మ్రోగినవి, నటనర్తక్యః= నటులు నాట్యకత్తెలు, ననృతుః= నాట్యమాడిరి, సూతమాగధాః= సూతులు మాగధులు, తుష్టువుః= స్తుతించిరి, సుకంఠ్యః

= మంచి కంఠము గల, గంధర్వ్యః= అప్సరసలు, సహభర్తృకాః= భర్తలతో కూడినవారై, సంగీతమ్= సంగీతమును, జగుః= పాడిరి.

మద్దెళ్లు, డోళ్లు, శంఖములు, భేరీలు, తప్పెటలు, కొమ్ము బూరాలు మొదలైనవి మ్రోగినవి. నటులు, నాట్యకత్తెలు నాట్యమాడిరి. సూతులు, మాగధులు స్తుతించిరి. గంధర్వులు, మంచి కంఠము గల వారి భార్యలు కలిసి పాడిరి.

తమభ్యషించన్ విధివదక్తమభ్యక్తమృతిజః ।
పత్నీభిరష్టాదశభిస్సోమరాజమివోడుభిః ॥ 47

అక్తమ్= కాటుక పెట్టబడినట్టియు, అభ్యక్తమ్= దేహమంతా వెన్నను రాసుకున్నట్టియు, అష్టాదశభిః= పదునెనిమిది, పత్నీభిః= భార్యలతో, ఉడుభిః= నక్షత్రములతో, సోమరాజం ఇవ= చంద్రునివలె నున్న, తమ్= ఆ వసుదేవుని, ఋత్విజః= ఋత్విక్కులు, విధివత్= యథావిధిగా, అభ్యషించన్= అభిషేకించిరి.

దీక్షితుడైన వసుదేవుడు కాటుక పెట్టుకొని, దేహమునకు వెన్న రాసు కొనెను (దీక్షానియమములు). ఆయన పదునెనిమిది భార్యలతో, నక్షత్రములతో కూడిన చంద్రుని పోలియుండెను. ఋత్విక్కులాయనను యథావిధిగా అభిషేకించిరి.

తాభిర్దుకూలవలయైర్హారనూపురకుండలైః ।
స్వలంకృతాభిర్విబభౌ దీక్షితోఽజినసంవృతః ॥ 48

దీక్షితః= యజ్ఞదీక్షయందున్నవాడు, అజినసంవృతః= కృష్ణమృగ చర్మను కప్పుకున్నవాడు అగు వసుదేవుడు, దుకూలవలయైుః= వస్త్రములతో కంకణములతో, హారనూపురకుండలైుః= హారములతో కాలియందెలతో కుండలములతో, సు-అలంకృతాభిః= చక్కగా అలంక-రించబడిన, తాభిః= ఆ భార్యలతో, విబభౌ= విశేషముగా ప్రకాశించెను.

యజ్ఞదీక్షయందున్న వసుదేవుడు మృగచర్మను కప్పుకొనెను. వస్త్రములు, కంకణములు, హారములు, కాలియందెలు, కుండలములతో బాగా అలంకరించుకున్న ఆ భార్యలతో గూడి ఆయన గొప్పగా రాజిల్లెను.

తస్యర్త్విజో మహారాజ రత్నకౌశేయవాససః ।
ససదస్యా విరేజుస్తే యథా వృత్రహణోఽధ్వరే ॥ 49

మహారాజ= ఓ మహారాజా!, రత్నకౌశేయవాససః= రత్నములు పొదిగిన పట్టు వస్త్రములు కలిగిన, తస్య= ఆ వసుదేవుని, తే= ఆ, ఋత్విజః= ఋత్విక్కులు, ససదస్యాః= సభాసదులతో గూడినవారై, వృత్రహణః= వృత్రాసురుని వధించిన ఇంద్రునియొక్క, అధ్వరే యథా= యజ్ఞమునందు వలె, విరేజుః= విశేషముగా ప్రకాశించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ వసుదేవుని ఆ ఋత్విక్కులు రత్నములు పొదిగిన పట్టు వస్త్రములను దాల్చి సభాసదులతో గూడి, వృత్రాసురుని వధించిన ఇంద్రుని యజ్ఞమునందు వలె, విశేషముగా ప్రకాశించిరి.

తదా రామశ్చ కృష్ణశ్చ స్వైస్వైర్బంధుభిరన్వితౌ ।
రేజతుస్స్వసుతైర్దారైర్జీవేశౌ స్వవిభూతిభిః ॥ 50

తదా= అప్పుడు, స్వైః స్వైః= తమ తమ, బంధుభిః= బంధువులతో, అన్వితౌ= కూడియున్నవారు, జీవ-ఈశౌ= జీవులకు ప్రభువులు అగు, రామః చ= బలరాముడు, కృష్ణః చ= శ్రీకృష్ణుడు కూడ, స్వవిభూతిభిః= తమ విభూతులు (అంశలు) అయిన, స్వసుతైః= తమ పుత్రులతో, దారైః= భార్యలతో, రేజతుః= ప్రకాశించిరి.

జీవులకు ప్రభువులగు బలరామ శ్రీకృష్ణులు అప్పుడు తమ తమ బంధువులతో, తమ విభూతులు (అంశలు) అయిన పుత్రులతో, భార్యలతో కూడి ప్రకాశించిరి.

ఈజేఽనుయజ్ఞం విధినా అగ్నిహోత్రాదిలక్షణైః ।
ప్రాకృతైర్వైకృతైర్యజ్ఞైర్ద్రవ్యజ్ఞానక్రియేశ్వరమ్ ॥ 51

ప్రాకృతైః= జ్యోతిష్టోమము మొదలగు ప్రకృతయాగములచే, వైకృతైః= సౌరము మొదలైన వికృతయాగములచే, అగ్నిహోత్ర-ఆదిలక్షణైః = అగ్ని హోత్రము మొదలగు పేర్లు గల, యజ్ఞైః= యజ్ఞములతో, ద్రవ్య-జ్ఞానక్రియా-ఈశ్వరమ్= ద్రవ్యము మంత్రము కర్మలకు ప్రభువగు శ్రీహరిని, అనుయజ్ఞమ్= ప్రతి యజ్ఞమునందు, విధినా= విధిచే, ఈజే= ఆరాధించెను.

పురోడాశాది ద్రవ్యములు, మంత్రములు, కర్మలకు ప్రభువు శ్రీహరియే. జ్యోతిష్టోమము మొదలైన ప్రకృతియాగములచే, సౌరము మొదలైన వికృతియాగములచే, అగ్నిహోత్రము మొదలైన పేర్లు గల యాగములచే వసుదేవుడు ఆయనను ప్రతియజ్ఞమునందు యథావిధిగా ఆరాధించెను.

అథర్త్విగ్భ్యోఽదదాత్కాలే యథాఽఽమ్నాతం స దక్షిణాః ।
సువలంకృతేభ్యోఽలంకృత్య గోభూకన్యా మహాధనాః ॥ 52

అథ= తరువాత, సః= ఆ వసుదేవుడు, కాలే= సమయమునందు, సు-అలంకృతేభ్యః= బాగుగా అలంకరించుకున్న, ఋత్విగ్భ్యః= ఋత్విక్కుల కొరకు, అలంకృత్య= అలంకరించి, యథా-ఆమ్నాతమ్= వేదములో చెప్పబడినదానిని అతిక్రమించకుండా, దక్షిణాః= దక్షిణలను, మహాధనాః= గొప్ప సంపద గల, గోభూకన్యాః= గోవులను భూమిని కన్యలను, అదదాత్= ఇచ్చెను.

తరువాత ఆ వసుదేవుడు తగిన సమయములో బాగుగా అలంకరించుకున్న ఋత్విక్కులకు తాను కూడ అలంకరించి యథావిధి దక్షిణలనిచ్చెను. మరియు, అలంకరించిన గోవులను, భూమిని, కన్యలను చాల ధనముతో బాటు యిచ్చెను.

పత్నీసంయాజావభృథ్యైశ్చరిత్వా తే మహర్షయః ।
సస్నూ రామహ్రదే విప్రా యజమానపురస్సరాః ॥ 53

విప్రాఃⁿ వేదవేత్తలైన, తే= ఆ, మహా-ఋషయఃⁿ మహర్షులు, పత్నీసంయాజ-అవభృథ్యైఃⁿ పత్నీసంయాజయాగముచే అవభృథ-స్నానమునకు చెందిన కర్మలచే, చరిత్వాⁿ అనుష్ఠించి, యజమాన పురస్సరాఃⁿ యజమానుని ముందిడుకున్నవారై, రామహ్రదేⁿ పరశు-రామకుండమునందు, సస్నుఃⁿ స్నానము చేసిరి.

వేదవేత్తలైన ఆ మహర్షులు పత్నీసంయాజయాగమును, అవభృథ స్నానమునకు చెందిన కర్మలను అనుష్ఠించిరి. అపుడు వారు యజమాను డగు వసుదేవుని ముందిడుకొని పరశురామకుండములో స్నానము చేసిరి.

స్నాతోఽలంకారవాసాంసి వందిభ్యోఽదాత్తథా స్త్రియః ।
తతస్సులంకృతో వర్ణానాశ్వభ్యోఽన్నేన పూజయత్ ॥ 54

స్నాతఃⁿ స్నానము చేసిన వసుదేవుడు, తథాⁿ అదే విధముగా, స్త్రియఃⁿ భార్యలు, వందిభ్యఃⁿ స్తోత్రపాఠకుల కొరకు, అలంకార వాసాంసిⁿ భూషణములను వస్త్రములను, అదాత్ⁿ ఇచ్చెను, తతఃⁿ తరువాత, సు-అలంకృతఃⁿ బాగుగా అలంకరించుకున్నవాడై, వర్ణాన్ⁿ వర్ణముల వారిని, ఆశ్వభ్యఃⁿ కుక్కల వరకు, అన్నేన-ఆహారముతో, పూజయత్ⁿ పూజించెను.

వసుదేవుడు, ఆతని భార్యలు స్నానము చేసి వస్త్రములను, భూషణములను స్తోత్రపాఠకులకు ఇచ్చిరి. తరువాత వసుదేవుడు బాగుగా అలంకరించుకొని, సకలవర్ణముల వారికి, కుక్కలవరకు ప్రాణులకు ఆహారమును సమర్పించెను.

బంధూన్ సదారాన్ ససుతాన్ పారిబర్హేణ భూయసా ।
విదర్భకోసలకురూన్ కాశికేకయసృంజయాన్ ॥ 55

సదారాన్= భార్యలతో కూడిన, ససుతాన్= పిల్లలతో కూడిన, బంధూన్= బంధువులను, విదర్భకోసల కురూన్= విదర్భకోసలకురు దేశముల రాజులను, కాశికేకయసృంజయాన్= కాశికేకయసృంజయ దేశముల రాజులను, భూయసా= అధికమగు, పారిబర్హేణ= పూజా సామగ్రితో.

ఆయన బంధువులను, వారి భార్యలను, పిల్లలను, విదర్భ కోసల కురుకాశి కేకయ సృంజయదేశముల రాజులను, అధికముగు పూజా సామగ్రిని సమర్పించి, పూజించెను.

సదస్యర్త్విక్సురగణాన్ నృభూతపితృచారణాన్ ।
శ్రీనికేతమనుజ్ఞాప్య శంసంతః ప్రయయుః క్రతుమ్ ॥ 56

సదస్య-ఋత్విక్-సురగణాన్= సభాసదులను ఋత్విక్కులను దేవతల గణములను, నృభూతపితృ చారణాన్= మానవులను ఇతర ప్రాణులను పితృదేవతలను చారణులను (పూజించెను), శ్రీనికేతమ్= శ్రీనివాసుడగు శ్రీకృష్ణ భగవానుని, అనుజ్ఞాప్య= అనుమతి యిచ్చునట్లు చేసి, క్రతుమ్= యజ్ఞమును, శంసంతః= కొనియాడుచున్నవారై, ప్రయయుః= వెళ్లిరి.

వసుదేవుడు సభాసదులను, ఋత్విక్కులను, దేవతల గణములను, మానవులను, ఇతరప్రాణులను, పితృదేవతలను, చారణులను పూజించెను. వారు శ్రీనివాసుడగు శ్రీకృష్ణ భగవానుని అనుమతి తీసుకొని, యజ్ఞమును కొనియాడుతూ వెళ్లిరి.

ధృతరాష్ట్రోఽనుజః పౌర్వా భీష్మో ద్రోణః పృథా యమౌ ।
నారదో భగవాన్ వ్యాసస్సుహృత్సంబంధిబాంధవాః ॥ 57

బంధూన్ పరిష్వజ్య యదూన్ సౌహృదాత్ క్లిన్నచేతసః ।
యయుర్విరహకృచ్ఛ్రేణ స్వదేశాంశ్చాపరే జనాః ॥ 58

ధృతరాష్ట్రః= ధృతరాష్ట్రుడు, అనుజః= తమ్ముడు విదురుడు, పార్థాః = కుంతీపుత్రులగు ధర్మరాజు భీముడు అర్జునుడు, భీష్మః= భీష్ముడు, ద్రోణః= ద్రోణుడు, పృథా= కుంతి, యమౌ= కవలలగు నకుల సహదేవులు, నారదః= నారదుడు, భగవాన్= పూజనీయుడగు, వ్యాసః = వ్యాసుడు, సుహృత్-సంబంధి బాంధవాః= మిత్రులు సంబంధీకులు బంధువులు, బంధూన్= బంధువులైనట్టియు, సౌహృదాత్= ప్రేమ వలన, క్లిన్నచేతసః= ఆర్ద్రమైన మనస్సు గల, యదూన్= యాదవులను, పరిష్వజ్య= కౌగిలించుకొని, విరహకృచ్ఛ్రేణ= విరహము వలన కష్టముగా, యయుః= వెళ్లిరి, అపరే= ఇతరులైన, జనాః చ= జనులు కూడ, స్వదేశాన్= తమ దేశమును గురించి (వెళ్లిరి).

ధృతరాష్ట్రుడు, ఆయన తమ్ముడు విదురుడు, కుంతీపుత్రులగు ధర్మరాజభీమార్జునులు, భీష్ముడు, ద్రోణుడు, కుంతి, కవలలు నకులసహదేవులు, పూజనీయులగు నారద వ్యాసులు, మిత్రులు, సంబంధీకులు, బంధువులు తమ బంధువులైన యాదవులను కౌగిలించుకొనిరి. ప్రేమ వలన యాదవుల మనస్సులు ఆర్ద్రములాయెను. వారందరు విరహము వలన కష్టముగా వెళ్లిరి. ఇతర జనులు కూడ తమ దేశములకు వెళ్లిరి.

నందస్తు సహ గోపాలైర్బృహత్యా పూజయాఽర్చితః ।
కృష్ణరామోగ్రసేనాద్యైర్న్యవాత్సీద్బంధువత్సలః ॥ 59

కృష్ణరామ-ఉగ్రసేన-ఆద్యైయుః= శ్రీకృష్ణుడు బలరాముడు ఉగ్రసేనుడు మొదలగువారిచే, బృహత్యా= పెద్ద, పూజయా= సత్కారముచే, అర్చితః= పూజించబడిన, బంధువత్సలః= బంధువులయందు గొప్ప

ప్రేమ గల, నందః తు= నందుడైతే, గోపాలైః సహ= గోపాలకులతో కూడి, న్యవాత్సీత్= నివసించెను.

శ్రీకృష్ణుడు, బలరాముడు, ఉగ్రసేనుడు, వసుదేవుడు మొదలగు వారు నందుని పెద్ద సత్కారముతో పూజించిరి. బంధువులయందు మిక్కుటమైన ప్రేమ గల ఆయన గోపాలకులతో గూడి అక్కడ కొంత కాలము ఉండెను.

వసుదేవోఽంజసోత్తీర్య మనోర్థమహోఽర్ణవమ్ ।
సుహృద్వృతః ప్రీతమనా నందమాహ కరే స్పృశన్ ॥ 60

వసుదేవః= వసుదేవుడు, మనః-రథమహా-అర్ణవమ్= కోరిక అనే పెద్ద సముద్రమును, అంజసా= తేలికగా, ఉత్తీర్య= దాటివేసి, సుహృద్-వృతః= బంధువులతో కూడినవాడై, ప్రీతమనాః= ప్రీతి జెందిన మనస్సు గలవాడు, నందమ్= నందుని, కరే= చేతియందు, స్పృశన్= స్పృశించుచున్నావాడై, ఆహ= పలికెను.

వసుదేవుడు యజ్ఞమును చేయాలనే కోరిక అనే పెద్ద సముద్రమును తేలికగా దాటివేసెను. ఆయన ప్రీతి జెందిన మనస్సుతో బంధువులతో కూడియుండెను. ఆయన నందుని చేయి పట్టుకొని ఇట్లు పలికెను.

వసుదేవ ఉవాచ ।

భ్రాతరీశకృతః పాశో నృణాం యస్స్నేహసంజ్ఞితః
తం దుస్త్యజమహం మన్యే శూరాణామపి యోగినామ్ ॥ 61

వసుదేవః= వసుదేవుడు, ఉవాచ= పలికెను, భ్రాతః= అన్నా!, నృణామ్= మానవులకు, ఈశకృతః= ఈశ్వరునిచే చేయబడిన, స్నేహ-సంజ్ఞితః= ఆసక్తి అనే పేరు గల, యః= ఏ, పాశః= బంధము గలదో,

తమ్= దానిని, శూరాణామ్= శూరులకు, యోగినాం అపి= యోగులకు కూడ, దుస్త్యజమ్= విడువ శక్యము కానిదిగా, అహమ్= నేను, మన్యే= తలచుచున్నాను.

వసుదేవుడిట్లు పలికెను...అన్నా! దేవుడు మానవులకు ఆసక్తి అనే పేరుతో బంధమును పెట్టినాడు. దానిని విడిచిపెట్టుట శూరులకు, యోగులకు కూడ చాల కష్టమని నేను తలచుచున్నాను.

అస్మాస్వప్రతికల్పేయం యత్కృతాజ్ఞేషు సత్తమైః ।
మైత్ర్యర్పితాఽఫలా వాఽపి న నివర్తేత కర్హిచిత్ ॥ 62

యత్= ఏలయన, సత్-తమైఃలు= ఉత్తమోత్తములైన మీచే, కృత-అజ్ఞేషు= చేసిన ఉపకారమును మరిచిపోయే, అస్మాసు= మాయందు, అప్రతికల్పా= సాటి లేని, ఇయమ్= ఈ, మైత్రీ= ప్రేమ, అర్పితా= చేయబడినది, అఫలా వా అపి= ప్రత్యుపకారము లేనిదే అయినా, కర్హిచిత్= ఏ నాడైననూ, న నివర్తేత= నివృత్తి కాదు.

మీరు ఉత్తమోత్తములు. చేసిన ఉపకారమును మరచే మాయందు మీరు సాటి లేని ఈ ప్రేమను చేసినారు. ఆ ప్రేమకు ప్రత్యుపకారము లేదు. అయినా, అది ఎన్నటికీ నివృత్తము కాదు.

ప్రాగకల్పాచ్చ కుశలం భ్రాతర్వో నాచరామ హి ।
అధునా శ్రీమదాంధాక్షా న పశ్యామః పురస్సతః ॥ 63

భ్రాతఃలు= అన్నా!, ప్రాక్ చ= ఇదివరలోనైతే, అకల్పాత్= శక్తి లేకపోవుట వలన, వః= మీకు, కుశలమ్= ప్రియమును, న ఆచరామ హి= చేయలేదు గదా!, అధునా= ఇప్పుడు, శ్రీమద-అంధ-అక్షాఃలు= ధనగర్వముచే గ్రుడ్డివైన కన్నులు గలవారమై, పురఃలు= ఎదుట, సతఃలు= ఉన్నవారిని, న పశ్యామఃలు= కానరాము.

అన్నా! ఇదివరలోనైతే శక్తి లేక మీకు ప్రియమును చేయలేదు. ఇప్పుడు ధనగర్వముచే గ్రుడ్డివారమై ఎదురుగా ఉన్న మిమ్ములను చూచుట లేదు.

మా రాజ్యశ్రీరభూత్పుంస శ్శ్రేయస్కామస్య మానద ।
స్వజనానుత బంధూన్ వా న పశ్యతి యయాఽధదృక్ ॥ 64

మానద= మర్యాదనిచ్చువాడా!, శ్రేయస్-కామస్య= శ్రేయస్సును కోరే, పుంసః= మానవునకు, రాజ్యశ్రీః= రాజ్యసంపద, మా అభూత్= కలుగరాదు, యయా= దేనిచేనైతే, అంధదృక్= గ్రుడ్డియైన చూపు గలవాడై, స్వజనాన్= తనవారిని, ఉత= మరియు, బంధూన్ వా= బంధువులను, న పశ్యతి= చూడడో.

మర్యాదనిచ్చే ఓ నందా! శ్రేయస్సును కోరే వ్యక్తికి రాజ్యసంపద కలుగరాదు. ఎందుకంటే, దానిచే వ్యక్తి గ్రుడ్డివాడై తన వారిని, బంధువులను కన్నెత్తి చూడడు.

శ్రీశుక ఉవాచ ।

ఏవం సౌహృదశైథిల్యచిత్త ఆనకదుందుభిః ।
రురోద తత్కృతాం మైత్రీం స్మరన్నశ్రువిలోచనః ॥ 65

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సౌహృదశైథిల్యచిత్తః = ప్రేమచే శిథిలమైన మనస్సు గలవాడు, అశ్రువిలోచనః= నీరు కన్నులయందు గలవాడు, ఆనకదుందుభిః= వసుదేవుడు, ఏవమ్= ఈ విధముగా, తత్-కృతామ్= ఆ నందునిచే చేయబడిన, మైత్రీమ్= ప్రేమను, స్మరన్= స్మరించువాడై, రురోద= ఏడ్చెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ప్రేమచే శిథిలమైన మనస్సు గల వసుదేవుడీ విధముగా ఆ నందుని ప్రేమను గుర్తు చేసుకొని కళ్ల నీళ్లు పెట్టుకొని యేడ్చెను.

నందస్తు సఖ్యుః ప్రియకృత్ప్రేమ్ణా గోవిందరామయోః ।
అద్య శ్వ ఇతి మాసాంస్త్రీన్ యదుభిర్మానితోఽవసత్ ॥ 66

యదుభిః= యాదవులచే, మానితః= సమ్మానించబడిన, నందః తు= నందుడైతే, సఖ్యుః= మిత్రునకు, ప్రియకృత్= ప్రియమును చేయువాడై, గోవిందరామయోః= శ్రీకృష్ణ బలరాముల, ప్రేమ్ణా= ప్రేమచే, అద్య= ఈనాడు, శ్వః= రేపు, ఇతి= అని, త్రీన్= మూడు, మాసాన్= మాసములను, అవసత్= నివసించెను.

యాదవులు నందుని సమ్మానించిరి. ఆయన మిత్రుడగు వసుదేవునకు ప్రీతిని కలిగించువాడై, బలరామ శ్రీకృష్ణుల ప్రేమకు కట్టుబడి, ఈ వేళ రేపు అంటూ మూడు నెలలు నివసించెను.

తతః కామైః పూర్యమాణ స్సవ్రజస్సహబాంధవః ।
పరార్ధ్యాభరణక్షౌమనానాఽనర్ఘ్యపరిచ్ఛదైః ॥ 67

తతః= తరువాత, సవ్రజః= గోకులవాసులతో కూడినవాడు, సహబాంధవః= బంధువులతో కూడినవాడు, పర-అర్ధ్య-ఆభరణ క్షౌమనానా-అనర్ఘ్యపరిచ్ఛదైః= చాల విలువైన ఆభరణములు పట్టు వస్త్రములు పలు రకముల విలువ కట్టలేని సామగ్రులతో, కామైః= కామనలచే, పూర్యమాణః= పూరించబడువాడు.

తరువాత గోకలవాసులకు, నందునకు, ఆయన బంధువులకు యాదవులు చాల విలువైన ఆభరణములను, పట్టు వస్త్రములను, పలు రకముల వెల కట్టలేని సామగ్రిని ఇచ్చి సకలకామనలనీడేర్చిరి.

వసుదేవోగ్రసేనాభ్యాం కృష్ణోద్ధవబలాదిభిః ।
దత్తమాదాయ పారిబర్హం యాపితో యదుభిర్యయౌ ॥ 68

వసుదేవ-ఉగ్రసేనాభ్యామ్= వసుదేవ ఉగ్రసేనులచే, కృష్ణ-ఉద్ధవబల-ఆదిభిః= శ్రీకృష్ణుడు బలరాముడు ఉద్ధవుడు మొదలగువారిచే, దత్తమ్= ఈయబడిన, పారిబర్హమ్= బహుమతిని, ఆదాయ= తీసుకొని, యదుభిః= యాదవులచే, యాపితః= పంపబడినవాడై, యయౌ= వెళ్లెను.

వసుదేవుడు, ఉగ్రసేనుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు, ఉద్ధవుడు, సాత్యకి మొదలగువారిచ్చిన బహుమతులను తీసుకొని నందుడు వెళ్లెను. యాదవులాయనను సాగనంపిరి.

నందో గోపాశ్చ గోప్యశ్చ గోవిందచరణాంబుజే ।
మనః క్షిప్తం పునర్హర్తుమనీశా మథురాం యయుః ॥ 69

నందః= నందుడు, గోపాః చ= గోపాలకులు, గోప్యః చ= గోపికలు కూడ, గోవిందచరణ-అంబుజే= శ్రీకృష్ణుని పద్మమువంటి పాదముపై, క్షిప్తమ్= లగ్నమైన, మనః= మనస్సును, పునః= తిరిగి, హర్తుమ్= తీసుకొనుటకు, అనీశాః= శక్తి లేనివారై, మథురామ్= మథురామండలమును గురించి, యయుః= వెళ్లిరి.

నందుడు, గోపాలకులు, గోపికలు కూడ శ్రీకృష్ణుని పద్మమువంటి పాదముపై తగుల్కొన్న మనస్సును వెనుకకు తీసుకొనలేకపోయిరి. వారు మథురామండలమునందలి గోకులమునకు వెళ్లిరి.

బంధుషు ప్రతియాతేషు వృష్ణయః కృష్ణదేవతాః ।
వీక్ష్య ప్రావృషమాసన్నాం యయుర్ద్వారవతీం పునః ॥ 70

బంధుషు= బంధువులు, ప్రతియాతేషు= తిరిగి వెళ్లగా, కృష్ణ-దేవతాః= శ్రీకృష్ణుడే దైవముగా గల, వృష్ణయః= యాదవులు, ఆసన్నామ్= దగ్గర పడిన, ప్రావృషమ్= వర్షకాలమును, వీక్ష్య= గమనించి, పునః= తిరిగి, ద్వారవతీమ్= ద్వారకను గురించి, యయుః= వెళ్లిరి.

బంధువులు తిరిగి వెళ్లిరి. వర్షకాలము దగ్గర పడిన సంగతిని గమనించిన యాదవులు తిరిగి ద్వారకకు వెళ్లిరి. వారికి శ్రీకృష్ణుడే దైవము.

జనేభ్యః కథయాంచక్రుర్యదుదేవమహోత్సవమ్ ।
యదాసీత్తీర్థయాత్రాయాం సుహృత్సందర్శనాదికమ్ ॥ 71

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే చతురశీతితమోఽధ్యాయః ॥

తీర్థయాత్రాయామ్= తీర్థయాత్రయందు, యత్= ఏ, యదుదేవ మహా-ఉత్సవమ్= యాదవప్రభుడగు వసుదేవుని యజ్ఞమహోత్సవము, సుహృత్-సందర్శన-ఆదికమ్= బంధువులను దర్శించుట మొదలైనది, ఆసీత్= ఆయెనో దానిని, జనేభ్యః= జనుల కొరకు, కథయాంచక్రుః= చెప్పిరి.

యాదవప్రభుడగు వసుదేవుని యజ్ఞమహోత్సవము, బందువులను దర్శించుట మొదలగు తీర్థయాత్రా విశేషములను వారు ద్వారకలోని జనులకు చెప్పిరి.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
వసుదేవుని యజ్ఞోత్సవమును వర్ణించే
ఎనుబది నాల్గవ అధ్యాయము ముగిసినది (84).

* * *

అథ పంచాశీతితమోఽధ్యాయః

శ్రీకృష్ణుడు వసుదేవునకు బ్రహ్మజ్ఞానమునుపదేశించి మృతులైన అన్నలను బ్రదికించుట

శ్రీబాదరాయణిరువాచ ।

అథైకదాఽఽత్మజౌ ప్రాప్తౌ కృతపాదాభివందనౌ ।
వసుదేవోఽభినంద్యాహ ప్రీత్యా సంకర్షణాచ్యుతౌ ॥ 1

శ్రీబాదరాయణుఁ= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, అథ= తరువాత, ఏకదా= ఒకనాడు, వసుదేవుఁ= వసుదేవుడు, ఆత్మజౌ= పుత్రులైన, ప్రాప్తౌ= వచ్చిన, కృతపాద–అభివందనౌ= చేయబడిన పాద–నమస్కారము గల, సంకర్షణ–అచ్యుతౌ= బలరామ శ్రీకృష్ణ భగవానులను, ప్రీత్యా= ప్రేమతో, అభినంద్య= అభినందించి, ఆహ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...తరువాత ఒకనాడు బలరామ శ్రీకృష్ణ భగవానులు వసుదేవుని వద్దకు వచ్చి పాదములకు నమస్కరించిరి. ఆయన పుత్రులనిద్దరిని ప్రేమతో అభినందించి ఇట్లు పలికెను.

మునీనాం స వచఃశ్రుత్వా పుత్రయోర్ధామసూచకమ్ ।
తద్వీర్యైర్జాతవిశ్రంభఃపరిభాష్యాభ్యభాషత ॥ 2

సఁ= ఆ వసుదేవుడు, పుత్రయోఁ= పుత్రులిద్దరియొక్క, ధామసూచ–కమ్= ప్రభావమును సూచించే, మునీనామ్= మహర్షుల యొక్క, వచఁ= మాటను, శ్రుత్వా= విని, తద్–వీర్యైఁ= వారి పరాక్రమములచే, జాతవిశ్రంభఁ= కలిగిన నమ్మకము గలవాడై, పరిభాష్య= సంబోధించి, అభ్యభాషత= పలికెను.

ఆ వసుదేవుడు పుత్రులిద్దరి ప్రభావమును సూచించే మహర్షుల వచనమును వినెను. వారిద్దరి పరాక్రమమును చూచి ఆయనకు నమ్మకము కలిగెను. ఆయన వారిద్దరిని పిలిచి ఇట్లు పలికెను.

కృష్ణ కృష్ణ మహాయోగిన్ సంకర్షణ సనాతన ।
జానే వామస్య యత్సాక్షాత్ప్రధానపురుషౌ పరౌ ॥ 3

కృష్ణ= ఓ శ్రీకృష్ణ!, కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, మహాయోగిన్= ఓ గొప్ప యోగీ!, సంకర్షణ= ఓ సంకర్షణా!, సనాతన= ఓ సనాతనా!, వామ్= మీ యిద్దరిని, అస్య= ఈ జగత్తునకు, పరౌ= కారణరూపులైన, యత్= ఏ, ప్రధానపురుషౌ= ప్రధానమైన పురుషులు గలరో, సాక్షాత్= సాక్షాత్తుగా వారినిగా, జానే= తెలియుచున్నాను.

ఓ శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! నీవు మహాయోగివి. ఓ బలరామా! నీవు సనాతనుడవగు సంకర్షణుడవు. మీరిద్దరు సాక్షాత్తు ఈ జగత్తునకు కారణరూపులైన మాయాశక్తి, పూర్ణబ్రహ్మలని నాకు తెలియును.

యత్ర యేన యతో యస్య యస్మై యద్యద్యథా యదా ।
స్యాదిదం భగవాన్ సాక్షాత్ప్రధానపురుషేశ్వరః ॥ 4

ఇదమ్= ఈ జగత్తు, యత్ర= దేనియందు, యేన= దేనిచే, యతః = దేనివలన, యస్య= ఎవనియొక్క, యస్మై= ఎవని కొరకు, యత్ యత్= ఏది ఏది, యథా= ఏ ప్రకారముగా, యదా= ఎప్పుడు, స్యాత్= ఉండునో అది, సాక్షాత్= సాక్షాత్తుగా, ప్రధానపురుష-ఈశ్వరః= మాయాశక్తిని. జీవులను శాసించే, భగవాన్= భగవానుడవగు నీవే.

ఈ జగత్తు ఏయే రూపములో ఏ ప్రకారముగా ఉన్నదో ఆ సర్వము సాక్షాత్తుగా నీవే. ఈ జగత్తునకు ఆధారము, ఈ జగన్నిర్మాణమునకు కరణము (సాధనము) నీవే. నీకు చెందిన ఈ జగత్తు నీ లీల కొరకే ఉన్నది. ఇది ఉన్న కాలము కూడ నీవే. మాయాశక్తిని, జీవులను శాసించే భగవానుడవీవే.

ఏతన్నానావిధం విశ్వమాత్మసృష్టమధోక్షజ ।
ఆత్మనాఽనుప్రవిశ్యాత్మన్ ప్రాణో జీవో బిభర్ష్యజః ॥ 5

అధోక్షజ= ప్రత్యక్షాదిప్రమాణములకు గోచరము కానివాడా!, అజః = పుట్టుక లేని నీవు, ఆత్మసృష్టమ్= నీచే సృష్టించబడిన, నానావిధమ్= అనేకప్రకారములైన, ఏతత్= ఈ, విశ్వమ్= జగత్తును, ఆత్మనా= నీచే, అనుప్రవిశ్య= ప్రవేశించి, ప్రాణః= ప్రాణమువై, జీవః= జీవుడవై, ఆత్మన్= నీయందు, బిభర్షి= ధరించుచున్నావు.

ప్రత్యక్షాది ప్రమాణములకు గోచరము కాని ఓ దేవా! పుట్టుక లేని నీవు నీచే సృష్టించబడిన అనేకప్రకారములగు ఈ జగత్తును నీవు నీచే సృష్టించి, దానిలో నీవు క్రియాశక్తిగా, జ్ఞానశక్తిగా ప్రవేశించి నీయందే నిలబెట్టుచున్నావు.

ప్రాణాదీనాం విశ్వసృజాం శక్తయో యాః పరస్య తాః ।
పారతంత్ర్యాద్వైసాదృశ్యాద్ద్వయోశ్చేష్టైవ చేష్టతామ్ ॥ 6

ప్రాణ-ఆదీనామ్= సమష్టి ప్రాణతత్త్వము మొదలుగా గల, విశ్వసృజామ్= జగత్కారణములైన సూక్ష్మతత్వములయొక్క, యాః= ఏ, శక్తయః= శక్తులు గలవో, తాః= అవి, పారతంత్ర్యాత్= పరతంత్రము-లగుట వలన, ద్వయోః= ప్రకృతిపురుషులయొక్క, వైసాదృశ్యాత్= విలక్షణములగుట వలన, పరస్య= పరమాత్మకు చెందినవి, చేష్టతామ్= చేష్ట చేసే వాటికి, చేష్టా ఏవ= చేష్ట మాత్రమే.

సమష్టి ప్రాణతత్త్వము మొదలైన జగత్కారణతత్త్వముల శక్తులేవి గలవో అవి పరమాత్మవే. ఎందుకంటే, ఈ తత్త్వములు పరమాత్మ తంత్రములే గాని, స్వతంత్రములు కావు. పైగా, పరమాత్మ చేతనుడు కాగా, ఇవి జడములు. చేష్ట చేసే వాటికి చేష్ట మాత్రమే గలదు గాని, చేష్ట వెనుక ఉండే శక్తి పరమాత్మదే.

కాంతిస్తేజః ప్రభా సత్తా చంద్రాగ్న్యర్కర్క్షవిద్యుతామ్ ।
యత్ స్థైర్యం భూభృతాం భూమేర్వృత్తిర్గంధోఽర్థతో భవాన్ ॥ 7

చంద్ర–అగ్ని–అర్క–ఋక్షవిద్యుతామ్= చంద్రుడు అగ్ని సూర్యుడు నక్షత్రములు మెరుపులయొక్క, కాంతిః= కాంతి, తేజః= తేజస్సు, ప్రభా= ప్రభ, సత్తా= ఉనికి, భూభృతామ్= పర్వతములయొక్క, యత్= ఏ, స్థైర్యమ్= స్థిరత్వము గలదో అది, భూమేః= భూమియొక్క, వృత్తిః= ఉండుట, గంధః= గంధము, అర్థతో= పరమార్థముగా, భవాన్= నీవే.

చంద్రుని కాంతి, అగ్నియొక్క తేజస్సు, సూర్యుని ప్రభ, నక్షత్రముల మెరుపుల స్ఫురణరూపమగు ఉనికి, పర్వతముల స్థిరత్వము, భూమి సర్వాధారమై యుండుట, భూమియొక్క గంధము పరమార్థముగా నీవే.

తర్పణం ప్రాణనమపాం దేవత్వం తాశ్చ తద్రసః ।
ఓజస్సహో బలం చేష్టా గతిర్వాయోస్తవేశ్వర ॥ 8

ఈశ్వర= ఈశ్వరా!, అపామ్= జలములయొక్క, తర్పణమ్= తృప్తిని కలిగించుట, ప్రాణనమ్= ప్రాణములను నిలబెట్టుట, దేవత్వమ్= పవిత్రము చేయుట, తాః చ= అవి కూడ, తద్–రసః= వాటియందలి రసము, వాయోః= ప్రాణవాయువుయొక్క, ఓజః= ఇంద్రియశక్తి, సహః = అంతఃకరణశక్తి, బలమ్= దేహశక్తి, చేష్టా= కదలిక, గతిః= గమనము, తవ= నీవి.

ఓ ఈశ్వరా! జలములలోని తృప్తినిచ్చే శక్తి, ప్రాణములను నిలబెట్టే శక్తి, పావనము చేసే శక్తి, ఆ జలములు, వాటి రసము నీవే. ఇంద్రియములలో, అంతఃకరణములో, దేహములో ప్రకటమయ్యే ప్రాణవాయువుయొక్క శక్తి, కదిలే శక్తి, నడిచే శక్తి కూడ నీ శక్తులే.

దిశాం త్వమవకాశోఽసి దిశః ఖం స్ఫోట ఆశ్రయః ।
నాదో వర్ణస్త్వమోంకార ఆకృతీనాం పృథక్కృతిః ॥ 9

దిశామ్= దిక్కులయొక్క, అవకాశః= అవకాశము, దిశః= దిక్కులు, ఖమ్= ఆకాశము, ఆశ్రయః= ఆశ్రయమగు, స్ఫోటః= శబ్దతన్మాత్ర,

త్వమ్= నీవు, నాదః= నాదము, వర్ణః= అక్షరము, ఓంకారః= ఓంకారము, ఆకృతీ నామ్= పదార్థముల, పృథక్-కృతిః= విభాగించే నామము, త్వమ్= నీవు.

దిక్కుల ఖాళీ, దిక్కులు, ఆకాశము, దానికి ఆశ్రయమగు శబ్దతన్మాత్ర (సూక్ష్మాకాశము), నాదము, అక్షరము, ఓంకారము, పదార్థములలో భేదమును కలిగించే నామము నీవే.

ఇంద్రియం త్వింద్రియాణాం త్వం దేవాశ్చ తదనుగ్రహః ।
అవబోధో భవాన్ బుద్ధే ర్జీవస్యానుస్మృతిస్సతీ ॥ 10

ఇంద్రియాణామ్= ఇంద్రియములయొక్క, ఇంద్రియం తు= విషయములను ప్రకాశింప జేసే శక్తి, దేవాః చ= అధిష్ఠాన దేవతలు, తద్-అనుగ్రహః= వారి ఇంద్రియానుగ్రహము, త్వమ్= నీవు, బుద్ధేః= బుద్ధియొక్క, అవబోధః= నిశ్చయశక్తి, జీవస్య= జీవునియొక్క, సతీ= వాస్తవమైన, అనుస్మృతిః= ఆత్మానుసంధానము, భవాన్= నీవు.

ఇంద్రియముల విషయప్రకాశనశక్తి, అధిష్ఠానదేవతలు, వారి అనుగ్రహము నీవే. బుద్ధియొక్క నిశ్చయశక్తి, జీవుని ఆత్మానుసంధానము నీవే.

భూతానామసి భూతాదిరింద్రియాణాం చ తైజసః ।
వైకారికో వికల్పానాం ప్రధానమనుశాయినామ్ ॥ 11

భూతానామ్= పంచభూతములకు, భూత-ఆదిః= భూతములకు కారణమగు తామసాహంకారము, ఇంద్రియాణాం చ= ఇంద్రియములకు కూడ, తైజసః= రాజసాహంకారము, వికల్పానామ్= వివిధ జ్ఞానములకు ఆశ్రయమగు ఇంద్రియదేవతలకు, వైకారికః= సాత్త్వికాహంకారము, అనుశాయినామ్= కర్మవాసనలతో సంసరించే జీవులకు, ప్రధానమ్= మాయాశక్తి, అసి= అగుచున్నావు.

పంచభూతములలో వాటి కారణమగు తామసాహంకారము, ఇంద్రియ శక్తులలో వాటి కారణమగు రాజసాహంకారము, వివిధ-జ్ఞానములకు ఆశ్రయమగు దేవతలలో వారికి కారణమగు సాత్త్వికాహం-కారము, కర్మవాసనలతో సంసరించే జీవులకు ఆశ్రయమగు మాయాశక్తి నీవే.

నశ్వరేష్విహ భావేషు తదసి త్వమనశ్వరమ్ ।
యథా ద్రవ్యవికారేషు ద్రవ్యమాత్రం నిరూపితమ్ ॥ 12

ఇహ= ఈ లోకములో, నశ్వరేషు= నశించే స్వభావము గల, భావేషు= పదార్థములయందు, అనశ్వరమ్= నశించని, తత్= ఆ సత్త, త్వమ్= నీవు, అసి= అగుచున్నావు, యథా= ఏ విధముగానైతే, ద్రవ్యవికారేషు= ద్రవ్యముయొక్క కార్యములయందు, ద్రవ్యమాత్రమ్= కేవల ద్రవ్యము, నిరూపితమ్= నిర్ధారించబడినదో.

మట్టి మొదలగు ద్రవ్యముతో చేసిన కుండ మొదలగు వికారములలో వాస్తవముగా నశించని తత్త్వము మట్టి మొదలగు ద్రవ్యమే. అదే విధముగా, ఈ లోకములో నశించే స్వభావము గల సకలపదార్థములలో నశించని ఆ కారణసత్త నీవే.

సత్త్వం రజస్తమ ఇతి గుణాస్తద్వృత్తయశ్చ యాః ।
త్వయ్యద్ధా బ్రహ్మణి పరే కల్పితా యోగమాయయా ॥ 13

సత్త్వమ్= సత్త్వము, రజః= రజస్సు, తమః= తమస్సు, ఇతి= అనే, గుణాః= గుణములు, తద్-వృత్తయః చ= వాటి వృత్తులు కూడ, యాః= ఏవి గలవో అవి, అద్ధా= సాక్షాత్తుగా, పరే బ్రహ్మణి= పరబ్రహ్మవగు, త్వయి= నీయందు, యోగమాయయా= యోగమాయచే, కల్పితాః= కల్పించబడినవి.

సత్త్వరజస్తమోగుణములు, వాటి వృత్తులగు సుఖదుఃఖమోహములు కూడ (జీవరూపముగా ప్రకటమైన) సాక్షాత్తు పరబ్రహ్మవగు నీయందు యోగమాయచే కల్పించబడినవి.

తస్మాన్న సంత్యమీ భావా యర్హి త్వయి వికల్పితాః ।
త్వం చామీషు వికారేషు హ్యన్యదావ్యావహారికః ॥ 14

తస్మాత్= కావున, అమీ= ఈ, భావాః= సుఖదుఃఖాది వికారములు, త్వయి= నీయందు, న సంతి= లేవు, యర్హి= ఎందువలనైతే, వికల్పితాః= కల్పితములో, అమీషు= ఈ, వికారేషు= వికారముల యందు, త్వం చ= నీవు ఉండెదవో, అన్యదా= ఇతర (జ్ఞాన) కాలము నందు, అవ్యావహారికః= వ్యవహారసంబంధము లేనివాడవు, హి= నిశ్చయము.

ఈ సుఖదుఃఖాది వికారములు జీవరూపుడవగు నీయందు కల్పించబడినవి. కావున, అవి నీయందు యథార్థముగా లేవు. అవి కల్పించబడిన కాలములో, నీవు వాటియందు అనువృత్తుడవై యుండెదవు. జ్ఞానముచే కల్పన అంతమైనప్పుడు నీవు వీటి సంబంధము లేని శుద్ధసచ్చిత్స్వరూపుడవై యుండెదవు.

గుణప్రవాహ ఏతస్మిన్నబుధాస్త్వఖిలాత్మనః ।
గతిం సూక్ష్మామబోధేన సంసరంతీహ కర్మభిః ॥ 15

గుణప్రవాహే= గుణముల ప్రవాహమైన, ఏతస్మిన్= ఈ దేహమునందు, అఖిల-ఆత్మనః= సకలప్రాణుల ఆత్మవగు నీయొక్క, సూక్ష్మామ్= సూక్ష్మమైన, గతిమ్= స్వరూపమును, అబుధాః= తెలియని వారలు, అబోధేన= అజ్ఞానముచే, కర్మభిః= కర్మలచే, ఇహ= ఈ లోకమునందు, సంసరంతి= తిరుగాడుచున్నారు.

ఈ దేహేంద్రియాదులు సత్త్వరజస్తమోగుణముల ప్రవాహము. సకలప్రాణులకు ఆత్మవగు నీవు వీటియందు సూక్ష్మమైన సచ్చిద్రూపుడవై ఉన్నావు. కాని, నిన్ను తెలియని వారు అజ్ఞానముచే కర్మల ద్వారా ఈ జననమరణప్రవాహములో పరిభ్రమించుచున్నారు.

యదృచ్ఛయా నృతాం ప్రాప్య సుకల్పామిహ దుర్లభామ్ ।
స్వార్థే ప్రమత్తస్య వయో గతం త్వన్మాయయేశ్వర ॥ 16

ఈశ్వర= ఓ ఈశ్వరా!, ఇహ= లోకమునందు, సుకల్పామ్= మిక్కిలి సమర్థమైనట్టియు, దుర్లభామ్= దుర్లభమైన, నృతామ్= మానవ-జన్మను, యదృచ్ఛయా= అనుకోకుండా, ప్రాప్య= పొంది, త్వత్-మాయయా= నీ మాయచే, స్వ-అర్థే= స్వార్థమునందు, ప్రమత్తస్య= ఒళ్లు మరిచియున్నవానికి, వయః= వయస్సు, గతమ్= వెళ్లినది.

ఓ ఈశ్వరా! ఈ లోకములో మానవజన్మ పురుషార్థమును సాధించుటలో సమర్థమైనది, దుర్లభము. కాని, నేను అనుకోకుండా ఈశ్వరేచ్ఛచే దానిని పొందితిని. కాని, నీ మాయచే స్వార్థమునందు తగుల్కొని నేను అసావధానుడనై యుండగనే, వయస్సు వెళ్లిపోయినది.

అసావహం మమైవైతే దేహే చాస్యాన్వయాదిషు ।
స్నేహపాశైర్నిబధ్నాతి భవాన్ సర్వమిదం జగత్ ॥ 17

దేహే= దేహమునందు, అసౌ= ఇది, అహమ్= నేను, చ= మరియు, అస్య= ఈ దేహముయొక్క, అన్వయ-ఆదిషు= అనుసరించి వచ్చే భార్యాదులయందు, ఏతే= వీరు, మమ ఏవ= నావారే అనే, స్నేహపాశైః= ఆసక్తి అనే త్రాళ్లతో, భవాన్= నీవు, ఇదమ్= ఈ, సర్వమ్= సకలమైన, జగత్= జగత్తును, నిబధ్నాతి= గట్టిగా బంధించుచున్నావు.

దేహమునందు ఇది నేను అనే అహంకారము, దేహమును బట్టి వచ్చే భార్యాదులయందు వీరు నావారే అనే మమకారము అనే ఆసక్తిరూపమైన త్రాళ్లతో నీవు సకలజగత్తును గట్టిగా బంధించుచున్నావు.

యువాం న నస్సుతౌ సాక్షాత్ప్రధానపురుషేశ్వరౌ ।
భూభారక్షత్రక్షపణ అవతీర్ణౌ తథాఽఽత్థ హ ॥ 18

యువామ్= మీరిద్దరు, నః= మా, సుతౌ= పుత్రులు, న= కారు, సాక్షాత్= సాక్షాత్తుగా, ప్రధానపురుష-ఈశ్వరౌ= ప్రకృతిని జీవులను శాసించే ప్రభువులు, భూభారక్షత్రక్షపణే= భూమికి బరువైన రాజుల వినాశమునందు, అవతీర్ణౌ= అవతరించినవారు, తథా= ఆ విధముగా, ఆత్థ హ= చెప్పితివి గదా!

మీరిద్దరు మా పుత్రులు కారు. మీరు సాక్షాత్తు ప్రకృతిని జీవులను శాసించే ప్రభువులు. భూమికి బరువైన రాజులను వినాశము చేసే నిమిత్తమై అవతరించినారని నీవే చెప్పియుండివి.

తత్తే గతోఽస్మ్యరణమద్య పదారవింద-
మాపన్నసంసృతిభయాపహమార్తబంధో ।
ఏతావతాఽలమలమింద్రియలాలసేన
మర్త్యాత్మదృక్ త్వయి పరే యదపత్యబుద్ధిః ॥ 19

ఆర్తబంధో= ఆపన్నులకు బంధువా!, తత్= అందువలన, అద్య= ఈనాడు, ఆపన్నసంసృతిభయ- అపహమ్= ఆపద గొన్నవాని సంసార-భయమును పోగొట్టే, తే= నీ, పద-అరవిందమ్= పద్మమువంటి పాదమును, అరణమ్= శరణమును, గతః= పొందినవాడను, అస్మి= అగుచున్నాను, ఇంద్రియలాలసేన= ఇంద్రియభోగములయందలి తృష్ణచే, అలం అలమ్= చాలు చాలు, యత్= ఏలయన, ఏతావతా= దీని కారణముగానే, మర్త్య-ఆత్మదృక్= మరణించే దేహమునందు ఆత్మ అనే

బుద్ధి గలవాడనై, పరే= పరబ్రహ్మవగు, త్వయి= నీయందు, అపత్యబుద్ధిః = పుత్రుడనే బుద్ధి గలవాడను.

ఆపన్నులను రక్షించే బంధువా! అందువలన నేనీనాడు ఆపద గొన్నవాని సంసారభయమును పోగొట్టే నీ పద్మమువంటి పాదమును శరణు పొందుచున్నాను. ఇంద్రియభోగములయందలి తృష్ణ ఇక చాలును. దీని కారణముగానే నేను మరణించే దేహమునందు ఆత్మ అనే బుద్ధిని, పరబ్రహ్మవగు నీయందు పుత్రుడనే బుద్ధిని కలిగియుంటిని.

సూతీగృహే ననుు జగాద భవానజో నౌ ।
సంజజ్ఞ ఇత్యనుయుగం నిజధర్మగుప్త్యై ।
నానాతనూర్గగనవద్విదధజ్జహాసి
కో వేద భూమ్ను ఉరుగాయ విభూతిమాయామ్ ॥20

సూతీగృహే= ప్రసవగృహమునందు, భవాన్= నీవు, నౌ= మా యిద్దరిని ఉద్దేశించి, ననుు= నిశ్చయముగా, జగాద= చెప్పితివి, అజఃు= పుట్టుక లేని నేను, అనుయుగమ్= ప్రతి యుగమునందు, నిజధర్మగుప్త్యై= నా ధర్మమును రక్షించుటకై, సంజజ్ఞే= జన్మించెదను, ఇతి= అని, గగనవత్= ఆకాశము వలె, నానాతనూఃు= అనేకములగు దేహములను, విదధత్= స్వీకరించువాడవై, జహాసి= విడిచిపెట్టుచున్నావు, ఉరుగాయ= అధికముగా కీర్తించబడువాడా!, భూమ్నఃు= పరబ్రహ్మవగు నీ, విభూతి మాయామ్= విభూతుల మహిమను, కఃు= ఎవడు, వేద= తెలియును?

అధికముగా కీర్తించబడే ఓ దేవా! పుట్టుక లేని నేను ప్రతియుగమునందు నా ధర్మమును రక్షించుటకై అవతరించెదనని నీవు మా యిద్దరికి ప్రసవగృహములో నిశ్చయముగా చెప్పితివి. ఆకాశము వలె అసంగుడవగు నీవు అనేకరూపములను దాల్చి విడిచిపెట్టుచుందువు. పరబ్రహ్మవగు నీ విభూతుల మహిమను ఎవడు తెలియగల్గును?

శ్రీశుక ఉవాచ ।

ఆకర్ణ్యేత్థం పితుర్వాక్యం భగవాన్ సాత్వతర్షభః
ప్రత్యాహ ప్రశ్రయానమ్రః ప్రహసన్ శ్లక్ష్ణయా గిరా ॥ 21

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇత్థమ్= ఈ విధముగా, పితుః= తండ్రియొక్క, వాక్యమ్= మాటను, ఆకర్ణ్య= విని, సాత్వత-ఋషభః= యాదవశ్రేష్ఠుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ప్రశ్రయ-ఆనమ్రః= వినయముచే కొంచెము వంగినవాడై, ప్రహసన్ నవ్వుచున్నవాడై, శ్లక్ష్ణయా= మధురమైన, గిరా= వాక్కుతో, ప్రతి-ఆహ= బదులు చెప్పెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...యాదవశ్రేష్ఠుడగు శ్రీకృష్ణ భగవానుడు తండ్రియొక్క ఈ మాటను విని వినయముతో కొంచెము వంగి నమస్కరించెను. ఆయన నవ్వుతూ మధురమైన వాక్కుతో ఇట్లు బదులు చెప్పెను.

శ్రీభగవానువాచ ।

వచో వస్సమవేతార్థం తాతైతదుపమన్మహే ।
యన్నః పుత్రాన్ సముద్దిశ్య తత్త్వగ్రామ ఉదాహృతః ॥ 22

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, తాత= తండ్రీ!, వః= మీ, ఏతత్= ఈ, వచః= మాటను, సమవేత-అర్థమ్= యుక్తియుక్తమైన అర్థము గలదిగా, ఉపమన్మహే= భావించుచున్నాము, యత్= ఏ మాటచే, పుత్రాన్= పుత్రులమగు, నః= మమ్ములను, సముద్దిశ్య= ఉద్దేశించి, తత్త్వగ్రామః= తత్త్వసమూహము, ఉదాహృతః= చక్కగా వివరించబడినదో.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...తండ్రీ! మీ ఈ వచనము యుక్తియుక్తమైన అర్థము గలదని నేను తలచెదను. మీరు పుత్రులమగు మాకు తత్త్వసమూహమును చక్కగా వివరించి చెప్పితిరి.

అహం యూయమసావార్య ఇమే చ ద్వారకౌకసః ।
సర్వేఽప్యేవం యదుశ్రేష్ఠ విమృశ్యాస్సచరాచరమ్ ॥ 23

యదుశ్రేష్ఠ= యాదవులలో శ్రేష్ఠుడైనవాడా!, అహమ్= నేను, యూయమ్= మీరు, అసౌ= ఈ, ఆర్యః= అన్నగారు, ఇమే= ఈ, ద్వారకా-ఓకసః చ= ద్వారకావాసులు కూడ, సర్వే అపి= అందరు కూడ, సచర-అచరమ్= కదిలే మరియు కదలని ప్రాణులతో కూడిన జగత్తు, ఏవమ్= ఈ విధముగా, విమృశ్యాః= తెలియదగినవారు.

యాదవులలో శ్రేష్ఠుడవైన ఓ తండ్రీ! నేను, మీరు, ఈ అన్నగారు, ఈ ద్వారకానగరవాసులు, అందరు, కదిలే మరియు కదలని ప్రాణులు ఈ విధముగా బ్రహ్మరూపముగనే తెలియబడవలెను.

ఆత్మా హ్యేకస్స్వయంజ్యోతి ర్నిత్యోఽన్యో నిర్గుణో గుణైః ।
ఆత్మసృష్టైస్తత్కృతేషు భూతేషు బహుధేయతే ॥ 24

హి= ఏలయన, ఆత్మా= ఆత్మ, ఏకః= ఒక్కటి, స్వయంజ్యోతిః= స్వయంప్రకాశము, నిత్యః= నిత్యము, అన్యః= దేహాదులకంటె విలక్షణము, నిర్గుణః= గుణములు లేనిది, ఆత్మసృష్టైః= తనచే (తననుండి) సృష్టించ-బడిన, గుణైః= గుణముల ద్వారా, తత్-కృతేషు= వాటిచే చేయబడిన, భూతేషు= ప్రాణులయందు, బహుధా= అనేకప్రకారములుగా, ఈయతే= ప్రతీయమానమగుచున్నది.

ఏలయనగా, అద్వితీయము, స్వయంప్రకాశము, నిత్యము, నిర్గుణము అగు ఆత్మ దేహాదులకంటె విలక్షణమైనది. ఆత్మ తనచే తననుండి సృష్టించబడిన గుణములు నిమిత్తముగా ఆ గుణములచే చేయబడే ప్రాణులయందు అనేకమా యన్నట్లుగా ప్రతీయమానమగు చున్నది.

ఖం వాయుర్జ్యోతిరాపో భూ స్తత్కృతేషు యథాశయమ్ ।
ఆవిస్తిరోఽల్పభూర్యేకో నానాత్వం యాత్యసావపి ॥ 25

ఖమ్= ఆకాశము, వాయుఃవాయువు, జ్యోతిఃఅగ్ని, ఆపఃజలములు, భూఃభూమి, తత్-కృతేషుఃవాటిచే చేయబడినవాటి యందు వలె, ఏకఃఒక్క, అసౌ అపి= ఈ ఆత్మ కూడా, యథాశయమ్= వ్యాప్యమైన ఉపాధులకు తగ్గట్లుగా, ఆవిఃఆవిర్భావమును, తిరఃతిరోభావమును, అల్పభూరి తక్కువ యెక్కువలను, నానాత్వమ్= అనేకత్వమును, యాతిపొందును.

ఆకాశము, వాయువు, అగ్ని, జలములు, పృథివి అనే పంచభూతములు వాటిచే చేయబడే ఘటాదులను బట్టి హెచ్చుతగ్గులు కలవి వలె కన్పట్టును. అదే విధముగా, ఈ అద్వితీయమగు ఆత్మ కూడ ఒక్కటియే అయిననూ, అది వ్యాపించియుండే ప్రాణుల బహుత్వమును బట్టి అనేకముగను, మనుష్యాదులయందు ఆవిర్భావమును, వృక్షాదుల యందు తిరోభావమును, ప్రాణిదేహముయొక్క పరిమాణమునకు తగ్గట్లుగా హెచ్చుతగ్గులను పొందినట్లుగా కన్పట్టును.

శ్రీశుక ఉవాచ ।

ఏవం భగవతా రాజన్ వసుదేవ ఉదాహృతమ్ ।
శ్రుత్వా వినష్టనానాధీస్తూష్ణీం ప్రీతమనా అభూత్ ॥ 26

శ్రీశుకఃశ్రీశుకమహర్షి, ఉవాచపలికెను, రాజన్రాజా!, భగవతాకృష్ణ భగవానునిచే, ఏవమ్ఈ తీరున, ఉదాహృతమ్= వర్ణించబడిన దానిని, శ్రుత్వావిని, వసుదేవఃవసుదేవుడు, వినష్టనానాధీఃనశింపజేయబడిన తనేకత్వబుద్ధి గలవాడై, ప్రీతమనాఃప్రీతి జెందిన మనస్సు గలవాడై, తూష్ణీం అభూత్మిన్నకుండెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...రాజా! శ్రీకృష్ణ భగవానుడీ విధముగా వర్ణించిన తత్త్వమును విని, సత్యము అనేకమనే వసుదేవుని

ధారణ పటాపంచలయ్యెను. ప్రీతి జెందిన మనస్సుతో ఆయన మిన్న-కుండెను.

అథ తత్ర కురుశ్రేష్ఠ దేవకీ సర్వదేవతా ।
శ్రుత్వాఽఽనీతం గురోఃపుత్రమాత్మజాభ్యాం సువిస్మితా ॥27

కురుశ్రేష్ఠ= కురువంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ రాజా!, అథ= తరువాత, సర్వదేవతా= సకలదేవతా స్వరూపురాలగు, దేవకీ= దేవకి, తత్ర= అప్పుడు, ఆత్మజాభ్యామ్= పుత్రులిద్దరిచే, ఆనీతమ్= తీసుకు-రాబడిన, గురోః= గురువుయొక్క, పుత్రమ్= పుత్రుని గురించి, శ్రుత్వా= విని, సువిస్మితా= చాల ఆశ్చర్యమును పొందినది.

కురువంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ రాజా! తరువాత తన పుత్రులిద్దరు గురువగు సాందీపుని పుత్రుని యమలోకమునుండి తీసుకువచ్చినారని అప్పుడు విని సకలదేవతాస్వరూపురాలగు దేవకి చాల ఆశ్చర్యపడెను.

కృష్ణరామౌ సమాశ్రావ్య పుత్రాన్ కంసవిహింసితాన్ ।
స్మరంతీ కృపణం ప్రాహ వైక్లవ్యాదశ్రులోచనా ॥ 28

కంసవిహింసితాన్= కంసునిచే సంహరించబడిన, పుత్రాన్= పుత్రులను, స్మరంతీ= స్మరించుచున్నదై, కృష్ణరామౌ= శ్రీకృష్ణ బలరాములను, సమాశ్రావ్య= సంబోధించి, వైక్లవ్యాత్= శోకము వలన, అశ్రులోచనా= నీరు కన్నులయందు గలదియై, కృపణమ్= దీనముగా, ప్రాహ= పలికెను.

కంసునిచే సంహరించబడిన పుత్రులు గుర్తుకు వచ్చి దేవకికి శోకముతో కన్నులలో నీరు నిండెను. ఆమె శ్రీకృష్ణ బలరాములను సంబోధించి, దీనముగా నిట్లనెను.

దేవక్యువాచ ।
రామ రామాప్రమేయాత్మన్ కృష్ణ యోగేశ్వరేశ్వర ।
వేదాహం వాం విశ్వసృజామీశ్వరావాదిపూరుషౌ ॥ 29

దేవకిః= దేవకి, ఉవాచ= పలికెను, రామ= ఓ బలరామా!, రామ= ఓ బలరామా!, అప్రమేయ- ఆత్మన్= ప్రమాణగోచరము కాని స్వరూపము గలవాడా!, కృష్ణ= ఓ శ్రీకృష్ణా!, యోగ-ఈశ్వర-ఈశ్వర= యోగేశ్వరులగు సనకాదులను కూడ శాసించువాడా!, అహమ్= నేను, వామ్= మిమ్ములనిద్దరినీ, వేద= ఎరుగుదును, విశ్వసృజామ్= సృష్టిని చేసిన ప్రజాపతులకు, ఈశ్వరౌ= ప్రభువులగు, ఆదిపూరుషౌ= జగత్కారణ మగు పురుషోత్తములు.

దేవకి ఇట్లు పలికెను...ఓ బలరామా! రామా! నీ స్వరూపము ప్రమాణములకు గోచరము కాదు. ఓ శ్రీకృష్ణా! నీవు యోగేశ్వరులగు సనకాదులకు కూడ ఈశ్వరుడవు. నేను మిమ్ములనిద్దరినీ ఎరుగుదును. మీరు సృష్టిని చేసే ప్రజాపతులకు కూడ ఈశ్వరులు, జగత్కారణమగు పురుషోత్తములు.

కాలవిధ్వస్తసత్త్వానాం రాజ్ఞాముచ్ఛాస్త్రవర్తినామ్ ।
భూమేర్భారాయమాణానామవతీర్ణౌ కిలాద్య మే ॥ 30

కాలవిధ్వస్తసత్త్వానామ్= కాలముచే నశింపజేయబడిన సాధుత్వము కలిగినట్టియు, ఉచ్ఛాస్త్రవర్తినామ్= శాస్త్రమునుల్లంఘించి ప్రవర్తిల్లు-నట్టియు, భూమేః= భూమికి, భారాయమాణానామ్= బరువగుచున్న, రాజ్ఞామ్= రాజుల (వినాశమునకై), మే= నాకు, అద్య= ఈ కాలములో, అవతీర్ణౌ కిల= అవతరించితిరి గదా!

కాలప్రభావముచే సాధుత్వము నశించుట వలన కొందరు రాజులు శాస్త్రమునుల్లంఘించి ప్రవర్తిస్తూ భూమికి బరువగుచున్నారు. వారిని మట్టుబెట్టుటకై మీరిద్దరు నాకు పుత్రులై ఈ కాలములో అవతరించినారు.

యస్యాంశాంశభాగేన విశ్వోత్పత్తిలయోదయాః ।
భవంతి కిల విశ్వాత్మంస్తం త్వాఽఽద్యాహం గతిం గతా ॥31

విశ్వ–ఆత్మన్= ఓ జగద్రూపా!, ఆద్య= ఓ జగత్కారణా!, యస్య= ఏ నీ, అంశ–అంశ–అంశభాగేన= అంశయైన మాయాశక్తియొక్క అంశలైన గుణముల చిన్న అంశచే, విశ్వ–ఉత్పత్తిలయ–ఉదయాః= జగత్తుయొక్క సృష్టి లయము స్థితి, భవంతి కిల= కలుగుచున్నవో, తమ్= అట్టి, త్వా= నిన్ను, అహమ్= నేను, గతిమ్= శరణును, గతా= పొందినదానను.

ఓ జగత్కారణా! జగద్రూపుడవు నీవే (జగత్తుయొక్క సారతత్త్వము నీవే). మాయాశక్తి నీ అంశ. సత్త్వాదిగుణములు ఆ శక్తియొక్క అంశలు. ఆ గుణముల చిన్న అంశనుండి ఈ జగత్తుయొక్క సృష్టిస్థితిలయములు ఘటిల్లుచున్నవి. అట్టి నిన్ను నేను శరణు పొందుచున్నాను.

చిరాన్మృతసుతాదానే గురుణా కిల చోదితౌ ।
ఆనిన్యథుః పితృస్థానాద్గురవే గురుదక్షిణామ్ ॥ 32

చిరాత్= చాలకాలము, మృతసుత–ఆదానే= మరణించిన పుత్రుని తీసుకువచ్చుటయందు, గురుణా= గురువుచే, చోదితౌ= ప్రేరేపించబడిన వారై, పితృస్థానాత్= యముని నివాసమునుండి, గురవే= గురువు కొరకు, గురుదక్షిణామ్= గురుదక్షిణను, ఆనిన్యథుః కిల= తీసుకువచ్చితిరి గదా!

చాల కాలము క్రితం మరణించిన పుత్రుని తీసుకురండని గురువు కోరగా, మీరిద్దరు యముని భవనమునుండి గురువు కొరకు గురుదక్షిణగా ఆ బాలుని తీసుకువచ్చితిరి గదా!

తథా మే కురుతం కామం యువాం యోగేశ్వరేశ్వరౌ ।
భోజరాజహతాన్ పుత్రాన్ కామయే ద్రష్టుమాహృతాన్ ॥ 33

యోగ–ఈశ్వర–ఈశ్వరౌ= యోగేశ్వరులగు సనకాదులకు కూడ శాసకులారా!, యువామ్= మీరిద్దరు, మే= నాయొక్క, కామమ్=

కోరికను, తథా= అదేవిధముగా, కురుతమ్= నెరవేర్చుడు, భోజరాజ హతాన్= భోజ రాజగు కంసునిచే సంహరించబడినట్టియు, ఆహృతాన్= తీసుకురాబడిన, పుత్రాన్= పుత్రులను, ద్రష్టుమ్= చూచుటకు, కామయే= కోరుచున్నాను.

పుత్రులారా! మీరిద్దరు యోగేశ్వరులకు కూడ ఈశ్వరులు. నా కోరికను కూడ అదే విధముగా నెరవేర్చుడు. భోజరాజగు కంసుడు చంపిన పుత్రులను తీసుకురండు. నాకు వారిని చూడాలని కోరిక గలదు.

ఋషిరువాచ ।

ఏవం సంచోదితౌ మాత్రా రామః కృష్ణశ్చ భారత ।
సుతలం సంవివిశతుర్యోగమాయాముపాశ్రితౌ ॥ 34

ఋషిః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, భారత= ఓ భరత-వంశీయుడా!, మాత్రా= తల్లిచే, ఏవమ్= ఈ విధముగా, సంచోదితౌ= ప్రేరేపించబడిన, రామః= బలరాముడు, కృష్ణః చ= శ్రీకృష్ణుడు కూడ, యోగమాయామ్= యోగమాయను, ఉపాశ్రితౌ= ఆశ్రయించినవారై, సుతలమ్= సుతలమును, సంవివిశతుః= ప్రవేశించిరి.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! తల్లి ఇట్లు ప్రేరేపించగా, బలరామ శ్రీకృష్ణులు యోగమాయనాశ్రయించి సుతలలోకమును ప్రవేశించిరి.

తస్మిన్ ప్రవిష్టావుపలభ్య దైత్యరాడ్
విశ్వాత్మదైవం సుతరాం తథాఽఽత్మనః ।
తద్దర్శనాహ్లాదపరిప్లుతాశయః
సద్యస్సముత్థాయ ననామ సాన్వయః ॥ 35

తస్మిన్= దానియందు, ప్రవిష్టౌ= ప్రవేశించినట్టియు, విశ్వ-ఆత్మదైవమ్= సకలప్రాణులకు దైవమైనట్టియు, తథా= అదే విధముగా,

ఆత్మనః= తనకు, సుతరామ్= సుతరాము దైవమైన బలరామ శ్రీకృష్ణులను, ఉపలభ్య= చూచి, దైత్యరాట్= రాక్షసరాజగు బలి, తద్–దర్శన–ఆహ్లాద పరిప్లుత–ఆశయః= వారిని చూచుట వలని ఆనందముచే ముంచెత్తబడిన హృదయము గలవాడై, సద్యః= వెంటనే, సముత్థాయ= లేచి నిలబడి, స–అన్వయః= పరివారముతో కూడినవాడై, ననామ= నమస్కరించెను.

సకలప్రాణులకు దైవము, తనకు సుతరాము దైవము అగు బలరామ శ్రీకృష్ణులు ఆ సుతలమునందు ప్రవేశించుటను రాక్షసరాజగు బలి చూచెను. వారిని చూచుటచే కలిగిన ఆనందముతో ఆయన హృదయము నిండిపోయెను. ఆయన పరివారముతో కూడి వెంటనే లేచి నిలబడి నమస్కరించెను.

తయోస్సమానీయ వరాసనం ముదా
నివిష్టయోస్తత్ర మహాఽఽత్మనోస్తయోః ।
దధార పాదావవనిజ్య తజ్జలం
సవృంద ఆబ్రహ్మ పునద్యదంబు హ ॥ 36

తయోః= వారిద్దరికి, ముదా= ఆనందముతో, వర–ఆసనమ్= శ్రేష్ఠమగు ఆసనమును, సమానీయ= తీసుకువచ్చి, మహాత్మనోః= మహాత్ములగు, తయోః= వారిద్దరు, తత్ర= దానియందు, నివిష్టయోః= కూర్చుండగా, పాదౌ= పాదములను, అవనిజ్య= కడిగి, తద్–జలమ్= ఆ నీటిని, సవృందః= పరివారముతో కూడినవాడై, దధార= ధరించెను, హ= ఎందుకంటే, యత్= ఏ, అంబు= నీరు, ఆబ్రహ్మ= బ్రహ్మదేవుని సహా జగత్తును, పునత్= పవిత్రము చేయునదియో.

ఆయన వారిద్దరికి ఆనందముతో ఆసనమునిచ్చెను. దానియందు వారిద్దరు కూర్చుండగా, ఆయన వారి పాదములను కడిగి ఆ నీటిని పరివారముతో కూడి తలపై దాల్చెను. ఎందుకంటే, ఆ నీరు బ్రహ్మదేవునితో సహా సకలజగత్తును పావనము చేయును.

సమర్హయామాస స తౌ విభూతిభి ర్మహార్హవస్త్రాభరణానులేపనైః ।
తాంబూలదీపామృతభక్షణాదిభి స్స్వగోత్రవిత్తాత్మసమర్పణేన చ ॥ 37

సః= ఆతడు, తౌ= వారిద్దరిని, విభూతిభిః= పుష్కలమైన, మహా-అర్హవస్త్ర-ఆభరణ-అనులేపనైః= మిక్కిలి విలువైన వస్త్రములు ఆభరణములు అంగరాగములతో, తాంబూలదీప-అమృతభక్షణ-ఆదిభిః= తాంబూలము దీపము అమృతనైవేద్యము మొదలగువాటితో, స్వగోత్రవిత్త-ఆత్మసమర్పిణేన చ= తన పరివారము ధనము దేహములను సమర్పించుటచే కూడ, సమర్హయామాస= బాగుగా పూజించెను.

ఆయన వారిద్దరికి మిక్కిలి విలువైన వస్త్రములు, ఆభరణములు, అంగరాగములు, తాంబూలము, ధూపదీపములు, అమృతనైవేద్యము మొదలగువాటిని పుష్కలముగా ఇచ్చి బాగుగా పూజించెను. ఆయన పరివారమును, ధనమును, దేహమును కూడ వారికి సమర్పించెను.

స ఇంద్రసేనో భగవత్పదాంబుజం
బిభ్రన్ముహుః ప్రేమవిభిన్నయా ధియా ।
ఉవాచ హానందజలాకులేక్షణః
ప్రహృష్టరోమా నృప గద్గదాక్షరమ్ ॥ 38

నృప= రాజా!, ఆనందజల-ఆకుల-ఈక్షణః= ఆనందాశ్రువులచే వ్యాపించబడిన కళ్లు గలవాడు, ప్రహృష్టరోమా= రోమాంచము గలవాడు, సః= ఆ, ఇంద్రసేనః= బలి, ప్రేమవిభిన్నయా= ప్రేమతో ఆర్ద్రమైన, ధియా= బుద్ధితో, భగవత్-పద-అంబుజమ్= శ్రీకృష్ణ భగవానుని పద్మము వంటి పాదమును, ముహుః= పలు మార్లు, బిభ్రత్= ధరించువాడై, గద్గద-అక్షరమ్-= గద్గదమైన అక్షరములు కల్గునట్లు, ఉవాచ హ= పలికెను.

ఓ పరీక్షిన్మహారాజా! ఆ బలి కళ్లు ఆనందాశ్రువులతో నిండి దేహమంతా రోమాంచము కలిగెను. బుద్ధి ప్రేమతో ఆర్ద్రము కాగా,

ఆయన శ్రీకృష్ణ భగవానుని పద్మమువంటి పాదమును పలుమార్లు ధరించెను. ఆయన గద్గదమైన స్వరముతో ఇట్లు పలికెను.

బలిరువాచ ।

నమోఽనంతాయ బృహతే నమః కృష్ణాయ వేధసే ।
సాంఖ్యయోగవితానాయ బ్రహ్మణే పరమాత్మనే ॥ 39

బలిః= బలి, ఉవాచ= పలికెను, అనంతాయ= కాలపరిచ్ఛేదము లేనట్టియు, బృహతే= దేవపరి–చ్ఛేదము లేనట్టియు, వేధసే= సృష్టికర్త యైనట్టియు, సాంఖ్యయోగ వితానాయ= జ్ఞానమును యోగమును ప్రవర్తిల్ల జేయునట్టియు, బ్రహ్మణే= పరబ్రహ్మయైనట్టియు, కృష్ణాయ పరమాత్మనే= శ్రీకృష్ణ పరమాత్మ కొరకు, నమః నమః= అనేక నమస్కారములు.

బలి ఇట్లు పలికెను...దేశకాలపరిచ్ఛేదములు లేని పరబ్రహ్మ పరమాత్మ శ్రీకృష్ణుడే. ఆయనయే సృష్టికర్త. సాంఖ్యయోగ కర్మయోగ ములను ప్రవర్తిల్ల జేసినది ఆయనయే. ఆయనకు అనేక నమస్కారములు.

దర్శనం వాం హి భూతానాం దుష్ప్రాపం చాప్యదుర్లభమ్ ।
రజస్తమస్స్వభావానాం యన్నః ప్రాప్తౌ యదృచ్ఛయా ॥ 40

వామ్= మీ యిద్దరి, దర్శనమ్= దర్శనము, భూతానామ్= ప్రాణులకు, దుష్ప్రాపం అపి= పొంద శక్యము కానిదియే అయినా, అదుర్లభమ్= తేలికగా పొందబడేది, హి= నిశ్చయము, యత్= ఏలయన, రజః–తమః–స్వభావానామ్= రజోగుణతమోగుణస్వభావము గల, నః = మాకు, యదృచ్ఛయా= ఈశ్వరకృపచే, (దర్శనం) ప్రాప్తౌ= దర్శనమైతిరో.

ప్రాణులకు మీ యిద్దరి దర్శనము దుర్లభమే. అయినా, ఈశ్వరకృపచే మీ దర్శనము తేలికగా లభించుననుట నిశ్చయము. ఎందుకంటే, రజోగుణ తమోగుణ స్వభావము గల మాకు మీ యిద్దరి దర్శనమైనది.

దైత్యదానవగంధర్వాస్సిద్ధవిద్యాధ్రచారణాః ।
యక్షరక్షఃపిశాచాశ్చ భూతప్రమథనాయకాః ॥ 41

విశుద్ధసత్త్వధామ్న్యద్ధా త్వయి శాస్త్రశరీరిణి ।
నిత్యం నిబద్ధవైరాస్తే వయం చాన్యే చ తాదృశాః ॥ 42

దైత్యదానవగంధర్వాః= దైత్యులు దానవులు గంధర్వులు, సిద్ధవిద్యాధ్ర చారణాః= సిద్ధులు విద్యాధరులు చారణులు, యక్షరక్షః పిశాచాః చ= యక్షులు రాక్షసులు పిశాచములు, భూతప్రమథనాయకాః = భూతములు ప్రమథగణముల నాయకులు, అద్ధా= సాక్షాత్తుగా, విశుద్ధసత్త్వధామ్ని= శుద్ధసత్త్వగుణమయ మైన మూర్తి కలిగిన, శాస్త్రశరీరిణి= వేదమే శరీరముగా గల, త్వయి= నీయందు, నిత్యమ్= సర్వదా, నిబద్ధవైరాః= కట్టబడిన వైరము గల, తే= అట్టి, వయమ్= మేము, అన్యే చ= ఇతరులు కూడ, తాదృశాః= అట్టివారు.

నీ మూర్తి రజస్తమోగుణముల సంసర్గము లేని సత్త్వగుణమయ-మైనది. వేదమే సాక్షాత్తుగా నీ శరీరము. దితి పుత్రులు, దను పుత్రులు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, చారణులు, యక్షులు, రాక్షసులు, పిశాచములు, భూతములు, ప్రమథగణనాయకులు, మేము, మావంటి మరికొందరు అట్టి నీయందు సర్వదా గట్టి వైరమును పూనియుందురు.

కేచనోద్బద్ధవైరేణ భక్త్యా కేచన కామతః ।
న తథా సత్త్వసంరబ్ధా స్సన్నికృష్టా స్సురాదయః ॥ 43

కేచన= కొందరు, ఉద్బద్ధవైరేణ= గట్టి వైరముతో, కేచన= కొందరు, కామతః= ప్రేమ వలని, భక్త్యా= భక్తితో, సన్నికృష్టాః= దగ్గర అయినవారు, తథా= ఆ విధముగా, సత్త్వసంరబ్ధాః= సత్త్వగుణముచే ఆవేశించబడినవారై, సుర-ఆదయః= దేవతలు మొదలగువారు, న= కారు.

కొందరు (కంసాదులు) నీయందు గట్టి వైరముతో, కొందరు (గోపికలు) ప్రేమపూర్వకమగు భక్తితో నిన్ను చేరుకొనిరి. వారు పొందినట్లుగా, సత్త్వగుణప్రధానులగు దేవతలు, మహర్షులు మొదలగు వారు నిన్ను పొందలేకపోయిరి.

ఇదమిత్థమితి ప్రాయస్తవ యోగేశ్వరేశ్వర ।
న విదంత్యపి యోగేశా యోగమాయాం కుతో వయమ్ ॥44

యోగ–ఈశ్వర–ఈశ్వర= యోగేశ్వరులకు కూడ ఈశ్వరుడా!, యోగ, ఈశాః అపి= యోగేశ్వరులు కూడ, ప్రాయః= తరుచుగా, తవ= నీ, యోగ మాయామ్= యోగమాయను, ఇదమ్= ఇది, ఇత్థమ్= ఇట్టిది, ఇతి= అని, న విదంతి= తెలియకున్నారు, వయమ్= మేము, కుతః= ఎక్కడనుండి?

యోగేశ్వరులకు కూడ ఈశ్వరుడవైన ఓ శ్రీకృష్ణా! (నారదాది) యోగేశ్వరులు కూడ తరుచు నీ యోగమాయ (స్వరూపమహిమ) ను ఇదమిత్థముగా తెలియకున్నారు. ఇక మా గురించి వేరుగా చెప్పవలెనా?

తన్నః ప్రసీద నిరపేక్షవిమృగ్యయుష్మత్–
పాదారవిందధిషణాన్యగృహాంధకూపాత్ ।
నిష్క్రమ్య విశ్వశరణాంఘ్ర్యుపలబ్ధవృత్తిః
శాంతో యథైక ఉత సర్వసఖైశ్చరామి ॥ 45

నిరపేక్షవిమృగ్యయుష్మత్–పాద–అరవిందధిషణ–అన్యగృహ–అంధకూపాత్= కోరికలు లేనివారిచే అన్వేషించబడే నీ పద్మములవంటి పాదములచే ఆశ్రయముకంటె భిన్నమైన ఇల్లు అనే చీకటి నూతినుండి, నిష్క్రమ్య= బయటపడి, విశ్వశరణ–అంఘ్రి–ఉపలబ్ధవృత్తిః= జగత్తును రక్షించే చెట్ల మొదళ్ల (జగద్రక్షకుడవగు నీ పాదముల) యందు పొందబడిన జీవిక గల నేను, శాంతః= శాంతుడను, ఏకః= ఒంటరిని,

ఉత= లేదా, సర్వసఖైఃసర్వసఖైఃసర్వసఖైఃస

ఊర్ణాయామ్= ఊర్ణయందు, షట్= ఆర్గురు, దేవాఃా= దేవతలైన, పుత్రాఃా = పుత్రులు, ఆసన్= కలిగిరి, సుతామ్= కుమారైను, యభితుమ్= కామించుటకు, ఉద్యతమ్= సంసిద్ధుడైన, కమ్= బ్రహ్మదేవుని, వీక్ష్య= చూచి, జహసుఃా= నవ్విరి.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...స్వాయంభువ మన్వంతరములో మరీచి ప్రజాపతికి ఊర్ణయందు ఆర్గురు పుత్రులు కలిగిరి. వారు దేవతలు. వారు కుమారైను కామిస్తున్న బ్రహ్మదేవుని చూచి నవ్విరి.

తేనాసురీమగన్ యోనిమధునాఽవద్యకర్మణా ।
హిరణ్యకశిపోర్జాతా నీతాస్తే యోగమాయయా ॥ 48

దేవక్యా ఉదరే జాతా రాజన్ కంసవిహింసితాఃా ।

తేన= ఆ, అవద్యకర్మణా= తప్పు పనిచే, తే= వారు, అధునా= వెంటనే, ఆసురీమ్= రాక్షసులకు చెందిన, యోనిమ్= జన్మను, అగన్= పొందిరి, హిరణ్యకశిపోఃా= హిరణ్యకశిపునినుండి, జాతాఃా= పుట్టినవారు, రాజన్= ఓ రాజా!, యోగమాయయా= యోగమాయచే, నీతాఃా= కొనిపోబడినవారై, దేవక్యాఃా= దేవకియొక్క, ఉదరే= గర్భమునందు, జాతాఃా= పుట్టినవారు, కంసవిహింసితాఃా= కంసునిచే చంపబడినవారు.

ఓ బలి చక్రవర్తీ! ఆ తప్పు పని కారణముగా వారు వెంటనే రాక్షసజన్మను పొంది హిరణ్యకశిపుని పుత్రులై జన్మించిరి. వారిని యోగమాయ కొనిపోయి దేవకి గర్భములో ప్రవేశపెట్టగా వారు ఆమె పుత్రులుగా జన్మించి కంసునిచే సంహరించబడిరి.

సా తాన్‌శోచత్యాత్మజాన్ స్వాంస్త ఇమేఽధ్యాసతేఽంతికే ॥ 49

ఇత ఏతాన్ ప్రణేష్యామో మాతృశోకాపనుత్తయే ।
తతశ్శాపాద్వినిర్ముక్తా లోకం యాస్యంతి విజ్వరాఃా ॥ 50

సా= ఆమె, తాన్= ఆ, స్వాన్= తన, ఆత్మజాన్= పుత్రులను గురించి, శోచతి= దుఃఖించుచున్నది, తే= ఆ, ఇమే= వీరు, అంతికే= సమీపము నందు, అధ్యాసతే= నివసించుచున్నారు, మాతృశోక-అపనుత్తయే= తల్లియొక్క శోకమును తొలగించుటకై, ఏతాన్= వీరిని, ఇతః= ఇక్కడనుండి, ప్రణేష్యామః= తీసుకుని వెళ్లగలము, తతః= తరువాత, శాపాత్= శాపమునుండి, వినిర్ముక్తాః= విముక్తులై, విజ్వరాః = దుఃఖము లేనివారై, లోకమ్= దేవలోకమును గురించి, యాస్యంతి= వెళ్లగలరు.

ఆమె ఆ తన పుత్రులను గురించి శోకించుచున్నది. వారే వీరు నీ వద్ద నివసించుచున్నారు. తల్లి దుఃఖమును పోగొట్టుటకై వీరిని మేము ఇక్కడనుండి తీసుకువెళ్లెదము. తరువాత వీరు శాపవిముక్తిని పొంది దుఃఖము లేనివారై దేవలోకమునకు వెళ్లగలరు.

స్మరోద్గీథః పరిష్వంగః పతంగః క్షుద్రభృద్ఘృణీ ।
షడిమే మత్ప్రసాదేన పునర్యాస్యంతి సద్గతిమ్ ॥ 51

స్మర-ఉద్గీథః= స్మరునితో కూడిన ఉద్గీథుడు, పరిష్వంగః= పరిష్వంగుడు, పతంగః= పతంగుడు, క్షుద్రభృత్= క్షుద్రభృత్తు, ఘృణీ= ఘృణి, ఇమే= ఈ, షట్= ఆర్గురు, మత్-ప్రసాదేన= నా అనుగ్రహముచే, పునః= మరల, సద్-గతిమ్= సత్పురుషుల గతిని, యాస్యంతి= పొందగలరు.

స్మరుడు, ఉద్గీథుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభృత్తు, ఘృణి అనే ఈ ఆర్గురు నా అనుగ్రహముచే మరల సత్పురుషులు పొందే నా ధామము (మోక్షము) ను పొందగలరు.

ఇత్యుక్త్వా తాన్ సమాదాయ ఇంద్రసేనేన పూజితౌ ।
పునర్ద్వారవతీమేత్య మాతుః పుత్రానయచ్ఛతామ్ ॥ 52

ఇతి= అని, ఉక్త్వా= పలికి, ఇంద్రసేనేన= బలిచే, పూజితౌ= పూజించబడిన శ్రీకృష్ణ బలరాములు, తాన్= వారిని, సమాదాయ= తీసుకొని, పునః= మరల, ద్వారవతీమ్= ద్వారకా నగరమును గురించి, ఏత్య= వచ్చి, మాతుః= తల్లికి, పుత్రాన్= పుత్రులను, అయచ్ఛతామ్= సమర్పించిరి.

శ్రీకృష్ణ బలరాములు ఇట్లు పలికి బలి చక్రవర్తి పూజలనందుకొని వారిని తీసుకొని మరల ద్వారకకు వచ్చి తల్లికి పుత్రులనప్పజెప్పిరి.

తాన్ దృష్ట్వా బాలకాన్ దేవీ పుత్రస్నేహస్నుతస్తనీ ।
పరిష్వజ్యాంకమారోప్య మూర్ధ్న్యజిఘ్రదభీక్ష్ణశః ॥ 53

తాన్= ఆ, బాలకాన్= పిల్లలను, దృష్ట్వా= చూచి, పుత్రస్నేహ స్నుతస్తనీ= పుత్రులయందలి ప్రేమచే స్రవించే స్తనములు, గల, దేవీ= దేవకీ దేవి, పరిష్వజ్య= కౌగిలించి, అంకమ్= ఒడిని, ఆరోప్య= కూర్చుండ బెట్టుకుని, మూర్ధ్ని= తలపై, అభీక్ష్ణశః= పలుమార్లు, అజిఘ్రత్= ఆఘ్రాణించెను.

ఆ పిల్లలను చూడగానే దేవకీదేవికి పుత్రులయందలి ప్రేమచే స్తనములు పాలను స్రవించెను. ఆమె వారిని ఒడిలో కూర్చుండబెట్టుకొని నుదుటిపై పలుమార్లు మూద్దాడెను.

అపాయయత్ స్తనం ప్రీతా సుతస్పర్శపరిప్లుతా ।
మోహితా మాయయా విష్ణోర్యయా సృష్టిః ప్రవర్తతే ॥ 54

ప్రీతా= ప్రీతిల్లినది, సుతస్పర్శపరిప్లుతా= పుత్రుల స్పర్శచే స్రవించే స్తనములు గల దేవకి, స్తనమ్= స్తనమున, అపాయయత్= త్రావించెను, విష్ణోః= విష్ణువుయొక్క, మాయయా= మాయచే, మోహితా= మోహితురాలు, యయా= దేనిచే, సృష్టిః= జగత్తు, ప్రవర్తతే= ప్రవర్తిల్లుచున్నదో.

దేవకి చాల సంతోషించెను. పుత్రులయందలి ప్రేమచే ఆమె స్తనములు పాలను స్రవించెను. విష్ణుమాయచే మోహితురాలైన ఆమె వారికి పాలను త్రావించెను. జగత్తు విష్ణుమాయచేతనే ప్రవర్తిల్లుచున్నది.

పీత్వాఽమృతం పయస్తస్యాః పీతశేషం గదాభృతః ।
నారాయణాంగసంస్పర్శప్రతిలబ్ధాత్మదర్శనాః ॥ 55

గదాభృతః= గదాధారియగు శ్రీకృష్ణ భగవానుని, పీతశేషమ్= త్రావగా మిగిలిన, అమృతమ్= అమృతమైన, తస్యాః= ఆమెయొక్క, పయః= పాలను, పీత్వా= త్రావి, నారాయణ-అంగసంస్పర్శ ప్రతిలబ్ధ-ఆత్మదర్శనాః= శ్రీకృష్ణ భగవానుని దేహముయొక్క స్పర్శవలన పొందబడిన స్వరూపజ్ఞానము గలవారు.

వారు గదాధారియగు శ్రీకృష్ణ భగవానుడు త్రావగా మిగిలిన ఆ దేవకియొక్క పాలను త్రాగిరి. వారికి శ్రీకృష్ణ భగవానుని దేహముయొక్క స్పర్శ వలన స్వరూపజ్ఞానము కలిగెను.

తే నమస్కృత్య గోవిందం దేవకీం పితరం బలమ్ ।
మిషతాం సర్వభూతానాం యయుర్ధామ దివౌకసామ్ ॥ 56

తే= వారు, గోవిందమ్= గోవిందుని, దేవకీమ్= దేవకిని, పితరమ్= తండ్రి వసుదేవుని, బలమ్= బలరాముని, నమస్కృత్య= నమస్కరించి, సర్వభూతానామ్= సకలప్రాణులు, మిషతామ్= చూచు-చుండగా, దివౌకసామ్= స్వర్గవాసులయొక్క, ధామ= నివాసమును, యయుః= పొందిరి.

వారు శ్రీకృష్ణ బలరాములకు, దేవకీ వసుదేవులకు నమస్కరించి, సకలప్రాణులు చూచుచుండగా స్వర్గవాసుల సరసన చేరిరి.

తం దృష్ట్వా దేవకీ దేవీ మృతాగమననిర్గమమ్ ।
మేనే సువిస్మితా మాయాం కృష్ణస్య రచితాం నృప ॥ 57

నృప= ఓ రాజా!, దేవకీ దేవీ= దేవకీదేవి, తమ్= ఆ, మృత-ఆగమననిర్గమమ్= మరణించిన పిల్లలు వచ్చి వెళ్లుటను, దృష్ట్వా= చూచి, సువిస్మితా= చాల ఆశ్చర్యపడినదై, కృష్ణస్య= శ్రీకృష్ణునియొక్క, రచితామ్= రచించబడిన, మాయామ్= మహిమనుగా, మేనే= తలచెను.

ఓ పరీక్షిన్మహారాజా! మరణించిన పిల్లలు తిరిగి వచ్చుట, స్వర్గమునకు వెళ్లుట అనే ఈ సందర్భమును చూచి దేవకీదేవి చాల ఆశ్చర్యపడెను. ఇది శ్రీకృష్ణుడు రచించిన మాయయని ఆమె తలపోసెను.

ఏవంవిధాన్యద్భుతాని కృష్ణస్య పరమాత్మనః ।
వీర్యాణ్యనంతవీర్యస్య సంత్యనంతాని భారత ॥ 58

భారత= ఓ భరతవంశీయుడా!, అనంతవీర్యస్య= అనంతమగు శక్తి గల, కృష్ణస్య పరమాత్మనః= శ్రీకృష్ణ పరమాత్మయొక్క, ఏవంవిధాని= ఇటువంటి, అద్భుతాని= అద్భుతములగు, వీర్యాణి= పరాక్రమములు, అనంతాని= అనంతములు, సంతి= కలవు.

భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! అనంతమగు శక్తి గల శ్రీకృష్ణ పరమాత్మయొక్క ఇటువంటి అద్భుతములగు పరాక్రమములు అనంతముగా గలవు.

సూత ఉవాచ ।
య ఇదమనుశృణోతి శ్రావయేద్వా మురారేః
చరితమమృతకీర్తేర్వర్ణితం వ్యాసపుత్రైః ।
జగదఘభిదలం తద్భక్తసత్కర్ణపూరం
భగవతి కృతచిత్తో యాతి తత్క్షేమధామ ॥ 59

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే పంచాశీతితమోఽధ్యాయః ॥

సూతః= సూత మహర్షి, ఉవాచ= పలికెను, వ్యాసపుత్రైః= వ్యాసుని పుత్రుడగు శుకమహర్షిచే, వర్ణితమ్= వర్ణించబడినట్టియు, జగద్-అఘుభిద్ -అలమ్= లోకముల పాపములను పోగొట్టుటలో సమర్థమైనట్టియు, తద్-భక్తసత్-కర్ణపూరమ్= ఆయన భక్తులగు సత్పురుషుల చెవులకు పరమానందమునిచ్చే, అమృతకీర్తేః= అమృతమైన కీర్తి, గల, మురా-అరేః = మురాసురసంహారకుడగు శ్రీకృష్ణ భగవానుని, ఇదమ్= ఈ, చరితమ్= వృత్తాంతమును, యః= ఎవడైతే, అనుశృణోతి= వినునో, వా= లేదా, శ్రావయేత్= వినిపించునో అట్టివాడు, భగవతి= భగవానునిపై, కృతచిత్తః = చేయబడిన చిత్తము గలవాడై, తత్-క్షేమధామ= ఆయనయొక్క భయము లేని పదమును, యాతి= పొందును.

సూత మహర్షి ఇట్లు పలికెను...మురాసురుని సంహరించిన శ్రీకృష్ణ భగవానుని కీర్తి అమృతము. లోకముల పాపములను నిశ్శేషముగా పోగొట్టే ఆ కీర్తిని వ్యాసపుత్రుడగు శుకమహర్షి వర్ణించినాడు. అది భగవద్భక్తులైన సజ్జనుల చెవులకు పరమానందమునిచ్చును. దానిని ఎవడైతే వినునో, లేదా వినిపించునో, అట్టివాని మనస్సు ఆ భగవానునిపై లగ్నమగును. ఆతడు భగవానుని అభయస్వరూపమును పొందును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణుడు వసుదేవునకు బ్రహ్మజ్ఞానమునుపదేశించి
మృతులైన అన్నలను బ్రదికించుటను వర్ణించే
ఎనుబది ఐదవ అధ్యాయము ముగిసినది (85).

* * *

అథ షడశీతితమోఽధ్యాయః

సుభద్రాహరణ వృత్తాంతము

శ్రీకృష్ణుడు బహులాశ్వ శ్రుతదేవుల పూజలనందుకొనుట

రాజోవాచ ।

బ్రహ్మన్ వేదితుమిచ్ఛామస్స్వసారం రామకృష్ణయోః ।
యథోపయేమే విజయో యా మమాసీత్పితామహీ ॥ 1

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహర్షీ!, విజయః= అర్జునుడు, రామకృష్ణయోః= బలరామ శ్రీకృష్ణుల, స్వసారమ్= సోదరియగు సుభద్రను, యథా= ఏ విధముగా, ఉపయేమే= వివాహ–మాడెనో, వేదితుమ్= తెలియుటకు, ఇచ్ఛామః= కోరుచున్నాము, యా= ఏ సుభద్ర, మమ= నాకు, పితామహీ= నాయనమ్మ, ఆసీత్= ఆయెనో.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...ఓ మహర్షీ! బలరామ శ్రీకృష్ణుల సోదరియగు సుభద్రను అర్జునుడే విధముగా వివాహమాడెనో తెలియ–గోరుచున్నాను. ఆమె నాకు నాయనమ్మ అగును.

శ్రీశుక ఉవాచ ।

అర్జునస్తీర్థయాత్రాయాం పర్యటన్నవనీం ప్రభుః ।
గతః ప్రభాసమశృణోన్మాతులేయాం స ఆత్మనః ॥ 2
దుర్యోధనాయ రామస్తాం దాస్యతీతి న చాపరే।

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ప్రభుః= సమర్థుడగు, అర్జునః= అర్జునుడు, తీర్థయాత్రాయామ్= తీర్థయాత్రయందు, అవనీమ్= భూమిని, పర్యటన్= పర్యటించుచున్న వాడై, ప్రభాసమ్= ప్రభాసక్షేత్రమును గురించి, గతః= వెళ్లినవాడు, సః= ఆతడు, ఆత్మనః= తనకు, మాతులే–యీమ్= మేనమామ కుమారైను, రామః= బలరాముడు, దుర్యోధనాయ=

దుర్యోధనుని కొరకు, దాస్యతి= ఈయగలడు, తామ్= ఆమెను, అపరే చ= ఇతరులైతే, న= కాదు, ఇతి= అని, అశృణోత్= వినెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...అర్జునుడు గొప్ప సమర్థుడు. ఆయన తీర్థయాత్రలో భాగముగా భూమిని పర్యటిస్తూ ప్రభాసక్షేత్రమునకు వెళ్లెను. తన మేనమామయగు వసుదేవుని కుమారై సుభద్రను బలరాముడు దుర్యోధనునకిచ్చి వివాహము చేయబోవుచున్నాడని. ఆమెను ఆతనికిచ్చుట ఇతరులైన శ్రీకృష్ణాదులకు అంగీకారము కాదనియు వినెను.

తల్లిప్సుస్స యతిర్భూత్వా త్రిదండీ ద్వారకామగాత్ ॥ 3

తత్ర వై వార్షికాన్ మాసానవాత్సీత్స్వార్థసాధకః ।
పౌరైస్సభాజితోఽభీక్ష్ణం రామేణాజానతా చ సః ॥ 4

తత్-లిప్సుః= ఆమెను పొందగోరే, సః= ఆ అర్జునుడు, త్రిదండీ యతిః= త్రిదండి సన్న్యాసి, భూత్వా= అయి, ద్వారకామ్= ద్వారకను గురించి, అగాత్= వెళ్లెను, తత్ర వై= అచటనైతే, స్వ-అర్థసాధకః= తన ప్రయోజనమును సాధించుకునే, సః= ఆతడు, పౌరైః= పురజనులచే, అజానతా= తెలియని, రామేణ చ= బలరామునిచే కూడ, అభీక్ష్ణమ్= అధికముగా, సభాజితః= సమ్మానించబడినవాడై, వార్షికాన్= వర్షకాల-మునకు చెందిన, మాసాన్= నెలలను, అవాత్సీత్= నివసించెను.

ఆమెను పొందగోరి అర్జునుడు త్రిదండి సన్న్యాసి వేషముతో ద్వారకకు వెళ్లెను. అర్జునునకు తన ప్రయోజనమును సాధించుకొనుట బాగా తెలియును. పురజనులు, ఈ సంగతి తెలియని బలరాముడు కూడ ఆయనను అధికముగా సమ్మానించిరి. ఆయన అచటనే వర్షకాలము నాల్గు నెలలు నివసించెను.

ఏకదా గృహమానీయ ఆతిథ్యేన నిమంత్ర్య తమ్ ।
శ్రద్ధయోపహృతం భైక్ష్యం బలేన బుభుజే కిల ॥ 5

ఏకదా= ఒకనాడు, బలేన= బలరాముని చే, ఆతిథ్యేన= అతిథి సత్కారముతో, నియంత్ర్య= ఆహ్వానించి, గృహమ్= ఇంటిని గురించి, తమ్= ఆ అర్జునుని, ఆనీయ= తీసుకువచ్చి, శ్రద్ధయా= శ్రద్ధతో, ఉపహృతమ్= సమర్పించబడిన, భైక్ష్యమ్= భిక్షాన్నమును, బుభుజే కిల= భుజించెను.

ఒకనాడు బలరాముడు అతిథి సత్కారము నిమిత్తమై ఆ అర్జునుని ఆహ్వానించి ఇంటికి తీసుకువచ్చి భిక్షాన్నమును సమర్పించెను. అర్జునుడు దానిని భుజించెను.

సోఽపశ్యత్తత్ర మహతీం కన్యాం వీరమనోహరామ్ ।
ప్రీత్యుత్ఫుల్లేక్షణస్తస్యాం భావక్షుబ్ధం మనో దధే ॥ 6

సః= ఆతడు, తత్ర= అచట, వీరమనః= హరామ్= వీరుల మనస్సును హరించే, మహతీమ్= యుక్తవయస్సు వచ్చిన, కన్యామ్= కన్యను, అపశ్యత్= చూచెను, ప్రీత్యా= ప్రేమతో, ఉత్-ఫుల్ల-ఈక్షణః= వికసించిన కన్నులు గలవాడై, భావక్షుబ్ధమ్= ప్రేమచే క్షోభ గల, మనః = మనస్సును, దధే= ధరించెను.

ఆతనికక్కడ వీరుల మనస్సును దోచే యుక్తవయస్సు వచ్చిన కన్య కనబడెను. ఆయన కన్నులు ప్రేమతో వికసించి మనస్సు ప్రేమచే విచలితమాయెను.

సాఽపి తం చకమే వీక్ష్య నారీణాం హృదయంగమమ్ ।
హసంతీ వ్రీడితాపాంగీ తన్న్యస్తహృదయేక్షణా ॥ 7

హసంతీ= నవ్వుచున్నది, వ్రీడిత-అపాంగీ= సిగ్గుతో కూడిన ప్రక్కచూపులు గలది, తత్-న్యస్తహృదయ- ఈక్షణా= ఆయనయందు సమర్పించబడిన చూపులు మనస్సు గలది అగు, సా అపి= ఆమె కూడ,

నారీణామ్= స్త్రీలకు, హృదయంగమమ్= మనోహరుడైన, తం= ఆతనిని, వీక్ష్య= చూచి, చకమే= ఇష్టపడెను.

ఆమె నవ్వుతూ సిగ్గుతో ప్రక్క చూపులు చూస్తూ చూపులను, మనస్సును ఆయనకు సమర్పించివేసెను. స్త్రీలకు మనోహరుడైన ఆ అర్జునుని చూచి ఆమె కూడ ఇష్టపడెను.

తాం పరం సమనుధ్యాయన్నంతరం ప్రేప్సురర్జునః ।
న లేభే శం భ్రమచ్చిత్తః కామేనాతిబలీయసా ॥ 8

అర్జునః= అర్జునుడు, తాం పరమ్= ఆమెను మాత్రమే, సమనుధ్యాయన్= తలపోయుచున్నవాడు, అంతరమ్= అవకాశమును, ప్రేప్సుః= పొందగోరువాడు, అతిబలీయసా= మిక్కిలి దృఢమైన, కామేన= ప్రేమచే, భ్రమత్-చిత్తః= తిరుగుచున్న మనస్సు గలవాడై, శమ్= సుఖమును, న లేభే= పొందలేదు.

అర్జునుడు ఆమెను మాత్రమే ధ్యానించుచుండెను. ఆమెను హరించే అవకాశము కొరకు ఆతడు ఎదురుచూచుచుండెను. మిక్కిలి దృఢమైన ప్రేమచే ఆతని మనస్సు భ్రమించెను. ఆతనికి మనశ్శాంతి కరువాయెను.

మహత్యాం దేవయాత్రాయాం రథస్థాం దుర్గనిర్గతామ్ ।
జహారానుమతః పిత్రోః కృష్ణస్య చ మహారథః ॥ 9

పిత్రోః= తల్లిదండ్రులకు, కృష్ణస్య చ= శ్రీకృష్ణునకు కూడ, అనుమతః= అంగీకారమైనవాడు, మహారథః= గొప్ప రథికుడు అగు అర్జునుడు, మహత్యామ్= గొప్ప, దేవయాత్రాయామ్= దేవయాత్రయందు, దుర్గనిర్గతామ్= దుర్గమునుండి బయటకు వచ్చినట్టియు, రథస్థామ్= రథమునందున్న సుభద్రను, జహార= తీసుకువెళ్లెను.

సుభద్ర తల్లిదండ్రులగు దేవకీవసుదేవులకు, శ్రీకృష్ణునకు కూడ అర్జునుడు సుభద్రను వివాహమాడుట అంగీకారము. సుభద్ర దేవయాత్ర సందర్భముగా దుర్గమునుండి బయటకు వచ్చెను. గొప్ప రథికుడగు అర్జునుడు రథమునందున్న ఆమెను తీసుకువెళ్లెను.

రథస్థో ధనురాదాయ శూరాంశ్చారుంధతో భటాన్ ।
విద్రావ్య క్రోశతాం స్వానాం స్వభాగం మృగరాడివ ॥ 10

రథస్థః= రథమునందున్నవాడై, ధనుః= ధనుస్సును, ఆదాయ= తీసుకొని, శూరాన్= శూరులైనట్టియు, ఆరుంధతః= అంతటా అడ్డుకొనుచున్న, భటాన్= భటులను, విద్రావ్య= పారద్రోలి, స్వానామ్= బంధువులు, క్రోశతామ్= ఆక్రోశించుచుండగా, స్వభాగమ్= తన భాగమును, మృగరాట్ ఇవ= సింహము వలె.

రథమునందున్న అర్జునుడు ధనుస్సు పట్టుకొని, అన్ని వైపుల-నుండియు అడ్డు పడుచున్న శూరులైన భటులను పారద్రోలెను. సుభద్ర బంధువులు ఆక్రోశించుచుండగా ఆతడు, సింహము తన భాగమును వలె, సుభద్రను తీసుకువెళ్లెను.

తచ్ఛ్రుత్వా క్షుభితో రామః పర్వణీవ మహాఽర్ణవః ।
గృహీతపాదః కృష్ణేన సుహృద్భిశ్చాన్వశామ్యత ॥ 11

తత్= ఆ విషయమును, శ్రుత్వా= విని, రామః= బలరాముడు, పర్వణి= పూర్ణిమ నాడు, మహా-అర్ణవః ఇవ= మహాసముద్రము వలె, క్షుభితః= కల్లోలితుడు, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, సుహృద్భిః= బంధువులచే కూడ, గృహీతపాదః= పట్టుకొనబడిన కాళ్లు గలవాడు, అను= తరువాత, అశామ్యత= శాంతించెను.

ఆ విషయమును విని బలరాముడు, పూర్ణిమనాడు మహా-సముద్రము వలె, కల్లోలపడెను. శ్రీకృష్ణుడు, బంధువులు కూడ ఆయన కాళ్లు పట్టుకొని శాంతింపజేసిరి.

ప్రాహిణోత్పారిబర్హాణి వరవధ్వోర్ముదా బలః ।
మహాధనోపస్కరేభరథాశ్వనరయోషితః ॥ 12

బలః= బలరాముడు, ముదా= ఆనందముతో, వరవధ్వోఃః= వరునకు వధువునకు, మహాధన-ఉపస్కర-ఉభరథ-ఇభరథ-అశ్వనర యోషితః= చాల ధనము సామగ్రి ఏనుగులు రథములు గుర్రములు పరిచారకులు పరిచారికలు అనే, పారిబర్హాణి= కానుకలను, ప్రాహిణోత్= పంపెను.

బలరాముడు ఆనందముతో వధూవరులగు సుభద్రార్జునులకు చాల ధనమును, సామగ్రిని, ఏనుగులను, రథములను, గుర్రములను, పరిచారకులను, పరిచారికలను పెళ్లికానుకగా పంపెను.

శ్రీశుక ఉవాచ ।

కృష్ణస్యాసీద్ద్విజశ్రేష్ఠ శ్రుతదేవ ఇతి శ్రుతః ।
కృష్ణైకభక్త్యా పూర్ణార్థ శ్శాంతః కవిరలంపటః ॥ 13

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, శ్రుతదేవఃః= శ్రుతదేవుడు, ఇతి= అని, శ్రుతఃః= ప్రసిద్ధికెక్కిన, ద్విజశ్రేష్ఠఃః= బ్రాహ్మణశ్రేష్ఠుడు, కృష్ణస్య= శ్రీకృష్ణునకు (భక్తుడు), ఆసీత్= ఉండెను, కృష్ణ-ఏకభక్త్యా= శ్రీకృష్ణుని యందలి ఏకాంతభక్తిచే, పూర్ణ-అర్థఃః= పూర్ణమైన మనోరథము గలవాడు, శాంతఃః= శాంతుడు, కవిఃః= వివేకి, అలంపటఃః= విరక్తుడు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణునకు శ్రుతదేవుడని ప్రసిద్ధి గాంచిన బ్రాహ్మణశ్రేష్ఠుడు భక్తుడుగా నుండెను. శ్రీకృష్ణునియందలి ఏకాంతభక్తిచే పూర్ణమైన మనోరథములు గల ఆయన శాంతుడు, వివేకి, విషయభోగములయందు ఆసక్తి లేనివాడు.

స ఉవాస విదేహేషు మిథిలాయాం గృహాశ్రమీ ।
అనీహయాఽఽగతాహార్యనిర్వర్తితనిజక్రియః ॥ 14

గృహ–ఆశ్రమీ= గృహస్థుడగు, సః= ఆయన, విదేహేషు= విదేహదేశమునందు, మిథిలాయామ్= మిథిలానగరమునందు, ఉవాస= నివసించెను, అనీహయా= అప్రయత్నముగా, ఆగత–ఆహార్యనిర్వర్తితనిజ క్రియః= వచ్చి భోజ్యముతో నిర్వర్తించబడిన తన పనులు గలవాడు.

విదేహదేశములోని మిథిలానగరమునందు ఆ గృహస్థుడు నివసించెను. ఆయన అప్రయత్నముగా లభించిన ఆహారముతో జీవికను నడిపెడివాడు.

యాత్రామాత్రం త్వహరహర్దైవాదుపనమత్యుత ।
నాధికం తావతా తుష్టః క్రియాశ్చక్రే యథోచితాః ॥ 15

యాత్రామాత్రం తు= దేహయాత్ర మాత్రమైతే, దైవాత్= ప్రారబ్ధము వలన, అహః–అహః= ప్రతిదినము, ఉపనమతి ఉత= దగ్గరకు వచ్చి తీరును, అధికం= అధికము, న= రాదు, తావతా= దానిచే, తుష్టః= సంతోషించువాడై, యథా–ఉచితాః= యోగ్యములైన, క్రియాః= పనులను, చక్రే= చేసెను.

ప్రారబ్ధము వలన ఆయనకు ప్రతిదినము దేహయాత్రకు మాత్రము తప్పనిసరిగా లభించెడిది. కాని, అధికము వచ్చెడిది కాదు. ఆయన లభించినదానితో సంతోషిస్తూ యోగ్యములైన కర్మలను (అతిథి సత్కారము ఇత్యాది) చేసెడివాడు.

తథా తద్రాష్ట్రపాలోఽంగ బహులాశ్వ ఇతి శ్రుతః ।
మైథిలో నిరహంమాన ఉభావప్యచ్యుతప్రియౌ ॥ 16

అంగ= ఓయీ!, తథా= అదే విధముగా, తద్–రాష్ట్రపాలః= ఆ దేశమును పాలించే రాజు, బహులాశ్వః= బహులాశ్వుడు, ఇతి= అని, శ్రుతః= ప్రసిద్ధి చెందినవాడు, మైథిలః= జనకుని వంశమువాడు,

నిరహంమానః= అహంకారము లేనివాడు, ఉభౌ అపి= వీరిద్దరు కూడ, అచ్యుతప్రియౌ= శ్రీకృష్ణ భగవానుని ప్రీతికి పాత్రులు.

ఓ పరీక్షిన్మహారాజా! అదే విధముగా, ఆ దేశమును పాలించే జనకవంశీయుడగు రాజు, బహులాశ్వుడని ప్రసిద్ధి జెందినవాడు, అహంకారము లేనివాడు. వీరిద్దరు కూడ శ్రీకృష్ణ భగవానుని ప్రీతికి పాత్రులు.

తయోః ప్రసన్నో భగవాన్ దారుకేణాహృతం రథమ్ ।
ఆరుహ్య సాకం మునిభిర్విదేహాన్ ప్రయయౌ ప్రభుః ॥ 17

తయోః= వారిద్దరియందు, ప్రసన్నః= ప్రసన్నుడైన, ప్రభుః= సర్వసమర్థుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, దారుకేణ= దారుకునిచే, ఆహృతమ్= తీసుకురాబడిన, రథమ్= రథమును, మునిభిః= సాకమ్= మహర్షులతో గూడి, ఆరుహ్య= ఎక్కి, విదేహాన్= విదేహదేశమును గురించి, ప్రయయౌ= పయనమయ్యెను.

సర్వసమర్థుడగు శ్రీకృష్ణ భగవానుడు వారిద్దరిపై ప్రసన్నుడాయెను. ఆయన మహర్షులతో గూడి, దారుకుడు తెచ్చిన రథమునెక్కి, విదేహ-దేశమునకు పయనమాయెను.

నారదో వామదేవోఽత్రిః కృష్ణో రామోఽసితోఽరుణిః ।
అహం బృహస్పతిః కణ్వోమైత్రేయశ్చ్యవనాదయః ॥ 18

నారదః= నారదుడు, వామదేవః= వామదేవుడు, అత్రిః= అత్రి, కృష్ణః= వ్యాసమహర్షి, రామః= పరశురాముడు, అసితః= అసితుడు, అరుణిః= అరుణి, అహమ్= నేను, బృహస్పతిః= బృహస్పతి, కణ్వః= కణ్వుడు, మైత్రేయః= మైత్రేయుడు, చ్యవన-ఆదయః= చ్యవనుడు మొదలైనవారు.

నారదుడు, వామదేవుడు, అత్రి, వ్యాసుడు, పరశురాముడు, అసితుడు, అరుణుడు, నేను (శుకమహర్షి) బృహస్పతి, కణ్వుడు, మైత్రేయుడు, చ్యవనుడు మొదలైన మహర్షులు ఆయనతో పాటు ఉండిరి.

తత్ర తత్ర తమాయాంతం పౌరా జానపదా నృప ।
ఉపతస్థుస్సార్ఘ్యహస్తా గ్రహైస్సూర్యమివోదితమ్ ॥ 19

నృప= ఓ రాజా!, ఆయాంతమ్= వచ్చుచున్న, తమ్= ఆ శ్రీకృష్ణుని, పౌరాః= పురజనులు, జానపదాః= పల్లెల జనులు, తత్ర తత్ర= అక్కడక్కడ, స-అర్ఘ్యహస్తాః= పూజాసామగ్రితో కూడిన చేతులు గలవారై, గ్రహైః= గ్రహములతో కూడి, ఉదితమ్= ఉదయించిన, సూర్యం ఇవ= సూర్యుని వలె, ఉపతస్థుః= నమస్కరించిరి.

ఓ పరీక్షిన్మహారాజా! అక్కడక్కడ పురజనులు, పల్లెవాసులు చేతులలో పూజాసామగ్రిని పట్టుకొని, వచ్చుచున్న ఆ శ్రీకృష్ణునకు, గ్రహములతో సహా ఉదయించిన సూర్యుని వలె, నమస్కరించిరి.

ఆనర్తధన్వకురుజాంగలకంకమత్స్య-
పాంచాలకుంతిమధుకేకయకోసలార్ణాః ।
అన్యే చ తన్ముఖసరోజముదారహాస-
స్నిగ్ధేక్షణం నృప పపుర్దృశిభిర్నృనార్యః ॥ 20

నృప= ఓ రాజా!, ఆనర్తధన్వకురుజాంగలకంకమత్స్య పాంచాల-కుంతి మధుకేకయకోసల-అర్ణాః= ఆనర్త ధన్వ కురుజాంగల కంక మత్స్య పాంచాల కుంతి మధు కేకయ కోసల అర్ణ దేశములకు చెందినవారు, అన్యే చ= ఇతరులు కూడ, నృనార్యాః= పురుషులు స్త్రీలు, దృశిభిః= కళ్లతో, ఉదార హాసస్నిగ్ధ-ఈక్షణమ్= ఔదార్యముతో కూడిన నవ్వు ప్రేమ నిండిన చూపు గల, తత్-ముఖసరః-జమ్= ఆయనయొక్క పద్మమువంటి ముఖమును, పపుః= పానము చేసిరి.

ఓ పరీక్షిన్మహారాజా! ఆనర్త ధన్వ కురుజాంగల కంక మత్స్య పాంచాల కుంతి మధు కేకయ కోసల అర్ణ దేశములకు చెందినవారు ఇతరులు పురుషులు స్త్రీలు కూడ ఆయనయొక్క పద్మమువంటి ముఖమును కళ్లతో పానము చేసిరి. ఆయన ముఖముపై ఔదార్యముతో కూడిన నవ్వు, ప్రేమతో నిండిన చూపులు గలవు.

తేభ్యస్స్వవీక్షణవినష్టతమిస్రదృగ్భ్యః
క్షేమం త్రిలోకగురురర్థదృశం చ యచ్ఛన్ ।
శృణ్వన్ దిగంతధవలం స్వయశోఽశుభఘ్నం
గీతం సురైర్నృభిరగాచ్ఛనకైర్విదేహాన్ ॥ 21

త్రిలోకగురుః= ముల్లోకములకు తండ్రియగు శ్రీకృష్ణ భగవానుడు, స్వవీక్షణవినష్టతమిస్రదృగ్భ్యః= తనను చూచుటచే నశింపజేయబడిన అజ్ఞానము గల బుద్ధులు కల, తేభ్యః= వారి కొరకు, అర్థదృశమ్= తత్త్వజ్ఞానమును, క్షేమం చ= అభయమును కూడ, యచ్ఛన్= ఇచ్చుచున్న వాడై, దిగంతధవలమ్= పది దిక్కులయందు వ్యాపించిన స్వచ్ఛమైన, అశుభఘ్నమ్= అశుభములను పోగొట్టే, సురైః= దేవతలచే, నృభిః= మానవులచే, గీతమ్= గానము చేయబడిన, స్వయశః= తన కీర్తిని, శృణ్వన్= వినుచున్నవాడై, శనకైః= మెల్లగా, విదేహాన్= విదేహ దేశమును గురించి, అగాత్= వెళ్లెను.

ముల్లోకములకు తండ్రియగు శ్రీకృష్ణ భగవానుడు మెల్లగా విదేహదేశమునకు వెళ్లెను. ఆయనను చూచుటచే జనుల బుద్ధియందలి అజ్ఞానము నశించి అభయము కలుగుచుండెను. పది దిక్కులయందు వ్యాపించిన ఆయనయొక్క స్వచ్ఛమైన కీర్తిని దేవతలు, మానవులు గానము చేయుచుండగా ఆయన వినుచుండెను. ఆ కీర్తి అశుభములను పోగొట్టును.

తేఽచ్యుతం ప్రాప్తమాకర్ణ్య పౌరా జానపదా నృప ।
అభీయుర్ముదితాస్తస్మై గృహీతార్హణపాణయః ॥ 22

నృప= ఓ రాజా!, ప్రాప్తమ్= విచ్చేసిన, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని గురించి, ఆకర్ణ్య= విని, తే= ఆ, పౌరాః= పురజనులు, జానపదాః= పల్లెవాసులు, ముదితాః= ఆనందించినవారై, తస్మై= ఆయన కొరకు, గృహీత-అర్హణపాణయః= తీసుకొనబడిన చేతులయందలి పూజాసామగ్రి గలవారై, అభి-ఈయుః= ఎదురేగిరి.

ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణ భగవానుడు వచ్చినాడని విని ఆ పురజనులు, పల్లెవాసులు ఆనందముతో ఆయన కొరకు పూజాసామగ్రులను చేతులలో పట్టుకొని ఎదురేగిరి.

దృష్ట్వా త ఉత్తమశ్లోకం ప్రీత్యుత్ఫుల్లాననాశయాః ।
కైర్ధృతాంజలిభిర్నేముఃశ్రుతపూర్వాంస్తథా మునీన్ ॥ 23

ఉత్తమశ్లోకమ్= పవిత్రకీర్తియగు శ్రీకృష్ణ భగవానుని, దృష్ట్వా= చూచి, ప్రీత్యా= ప్రేమతో, ఉత్ఫుల్ల- ఆనన-ఆశయాః= బాగా వికసించిన ముఖములు అంతఃకరణములు గల, తే= వారు, ధృత-అంజలిభిః= కట్టబడిన దోసిలి గల, కైః= తలలతో, నేముః= నమస్కరించిరి, తథా= మరియు, శ్రుతపూర్వాన్= ఇదివరలో వినియున్న, మునీన్= మహర్షులను.

పవిత్రకీర్తియగు శ్రీకృష్ణ భగవానుని చూచి వారి ముఖములు, హృదయములు ఆనందముతో వికసించెను. వారు చేతులు జోడించి తలలు వంచి ఆయనకు, మహర్షులకు కూడ నమస్కరించిరి. ఆ మహర్షుల గురించి వారిదివరలో వినియుంటిరి.

స్వానుగ్రహాయ సంప్రాప్తం మన్వానౌ తం జగద్గురుమ్ ।
మైథిలశ్రుతదేవశ్చ పాదయోః పేతతుః ప్రభోః ॥ 24

జగద్-గురుమ్= జగత్తునకు తండ్రియగు, తమ్= ఆ శ్రీకృష్ణ భగవానుని, స్వ-అనుగ్రహాయ= తమను అనుగ్రహించుటకై, సంప్రాప్తమ్= వచ్చినవానినిగా, మన్వానౌ= తెలుసుకున్న, మైథిలః= మిథిలానరేశుడగు బహులాశ్వుడు, శ్రుతదేవః చ= శ్రుతదేవుడు కూడ, ప్రభోః= శ్రీకృష్ణ ప్రభునియొక్క, పాదయోః= పాదములపై, పేతుః= పడిరి.

జగత్తునకు తండ్రియగు ఆ శ్రీకృష్ణ భగవానుడు తమను అనుగ్రహించుటకై వచ్చినాడని తెలిసి మిథిలానరేశుడగు బహులాశ్వుడు, శ్రుతదేవుడు కూడ ఆ ప్రభుని పాదములపై పడిరి.

న్యమంత్రయేతాం దాశార్హమాతిథ్యేన సహ ద్విజైః ।
మైథిలశ్శ్రుతదేవశ్చ యుగపత్సంహతాంజలీ ॥ 25

మైథిలః= మిథిలానరేశుడగు బహులాశ్వుడు, శ్రుతదేవః చ= శ్రుతదేవుడు కూడ, సంహత-అంజలీ= కట్టబడిన దోసిలి గలవారై, దాశార్హమ్= దశార్హవంశీయుడగు శ్రీకృష్ణుని, ద్విజైః సహః మహర్షులతో బాటుగా, ఆతిథ్యేన= అతిథి మర్యాదచే, యుగపత్= ఒకేసారి, న్యమంత్రయేతామ్= ఆహ్వానించిరి.

మిథిలానరేశుడగు బహులాశ్వుడు, శ్రుతదేవుడు కూడ ఒకే సారి దోసిలియొగ్గి దశార్హవంశీయుడగు శ్రీకృష్ణుని, మహర్షులతో బాటుగా, ఆతిథ్యమునకు ఆహ్వానించిరి.

భగవాంస్తదభిప్రేత్య ద్వయోః ప్రియచికీర్షయా ।
ఉభయోరావిశద్గేహముభాభ్యాం తదలక్షితః ॥ 26

తత్= దానిని, అభిప్రేత్య= స్వీకరించి, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉభయోః= ఇద్దరికి, ప్రియచికీర్షయా= ప్రియమును చేసే కోరికతో, తద్-అలక్షితః= వారిచే కనబడనివాడై, ఉభయోః= ఇద్దరి,

గేహమ్= ఇంటిని, ఉభాభ్యామ్= రెండు రూపములతో, ఆవిశత్= ప్రవేశించెను.

వారి ఆ ఆహ్వానమునంగీకరించి శ్రీకృష్ణ భగవానుడు ఇద్దరికి ప్రీతిని కలిగించ గోరెను. ఆయన వారికి తెలియకుండా ఇద్దరి యింటిని రెండు వేర్వేరు రూపములతో ప్రవేశించెను.

శ్రోతుమప్యసతాం దూరాన్ జనకస్స్వగృహాగతాన్ ।
ఆనీతేష్వాసనాగ్ర్యేషు సుఖాసీనాన్మహామనాః ॥ 27

ప్రవృద్ధభక్త్యా ఉద్ధర్షహృదయాస్రావిలేక్షణః ।
నత్వా తదంఘ్రీన్ ప్రక్షాల్య తదపో లోకపావనీః ॥ 28

సకుటుంబో వహన్మూర్ధ్నా పూజయాంచక్ర ఈశ్వరాన్ ।
గంధమాల్యాంబరాకల్పధూపదీపార్ఘ్యగోవృషైః ॥ 29

మహామనాః= గొప్ప మనస్సు గల, జనకః= జనకుడు, అసతామ్= దుష్టులకు, శ్రోతుం అపి= వినుటకైననూ, దూరాన్= దూరులైనట్టియు, స్వగృహ-ఆగతాన్= తన యింటిని గురించి వచ్చినట్టియు, ఆనీతేషు= తీసుకురాబడిన, ఆసన-అగ్ర్యేషు= శ్రేష్ఠమగు ఆసనములయందు, సుఖ-ఆసీనాన్= సుఖముగా కూర్చున్న, ఈశ్వరాన్= ఈశ్వరుని మహర్షులను, నత్వా= నమస్కరించి, ప్రవృద్ధభక్త్యా= బాగా వర్ధిల్లిన భక్తిచే, ఉద్-హర్షహృదయ-అస్ర-ఆవిల-ఈక్షణః= పైకి వచ్చిన ఆనందము గల హృదయము నీటిచే వ్యాపించబడిన కన్నులు గలవాడై, తద్-అంఘ్రీన్= వారి పాదములను, ప్రక్షాల్య= కడిగి, లోకపావనీః= జనులను పవిత్రము చేసే, తద్-అపః= ఆ పాదముల నీటిని, సకుటుంబః = పరివారముతో కూడినవాడై, మూర్ధ్నా= శిరస్సుచే, వహన్= ధరించువాడై, గంధమాల్య-అంబర-ఆకల్పధూపదీప-అర్ఘ్యగోవృషైః=

గంధము మాలలు వస్త్రములు అలంకారములు ధూపము దీపము ఇతరపూజాద్రవ్యములు ఆవు ఎద్దులచే, పూజయాంచక్రే= పూజించెను.

శ్రీకృష్ణుడు, ఆ మహర్షులు దుష్టులకు కూతవేటు దూరములో నుండెదరు. తన గృహమునకు వచ్చిన వారికి పెద్ద మనస్సు గల జనకుడు శ్రేష్ఠమగు ఆసనములను సమర్పించెను. వారు సుఖముగా కూర్చుండగా ఆయనకు భక్తి బాగా వర్ధిల్లి హృదయములో ఆనందోద్రేకము కలిగి, కళ్లు నీటితో నిండిపోయెను. ఆయన వారికి నమస్కరించి పాదములను కడిగి పరివారముతో సహా, జనులను పవిత్రము చేసే ఆ నీటిని తలపై చల్లుకొనెను. ఆ మహాత్ములను ఆయన గంధము, మాలలు, వస్త్రములు, భూషణములు, ధూపము, దీపము, ఇతరపూజాసామగ్రి, ఆవు, ఎద్దులనిచ్చి పూజించెను.

వాచా మధురయా ప్రీణన్నిదమాహాన్నతర్పితాన్ ।
పాదావంకగతౌ విష్ణోస్సంస్పృశఞ్ఛనకైర్ముదా ॥ 30

అన్నతర్పితాన్= ఆహారముతో తృప్తి జెందిన వారిని, మధురయా= మధురమైన, వాచా= మాటతో, ప్రీణన్= ప్రీతి కలిగించువాడై, అంకగతౌ= ఒడిని పొందిన, విష్ణోః= శ్రీకృష్ణ భగవానునియొక్క, పాదౌ= పాదములను, ముదా= ఆనందముతో, శనకైఃr= మెల్లగా, సంస్పృశన్= నొక్కుచున్నవాడు.

ఆహారముతో సంతృప్తి జెందిన వారికి ఆ రాజు మధురమగు వాక్కుతో కూడ ప్రీతిని కలిగించెను. ఆయన శ్రీకృష్ణ భగవానుని పాదములను ఒడిలో ఉంచుకొని ఆనందముతో మెల్లగా నొక్కెను.

రాజోవాచ ।

భవాన్ హి సర్వభూతానామాత్మా సాక్షీ స్వదృగ్ విభో ।
అథ నస్త్వత్పదాంభోజం స్మరతాం దర్శనం గతః ॥ 31

రాజుఃⳆ బహులాశ్వమహారాజు, ఉవాచⳆ పలికెను, విభోⳆ ఓ ప్రభూ!, భవాన్Ⳇ నీవు, హిⳆ నిశ్చయముగా, సర్వభూతానామ్Ⳇ సకలప్రాణులకు, ఆత్మాⳆ ఆత్మవు, సాక్షీⳆ సాక్షివి, స్వదృక్Ⳇ స్వయంప్రకాశుడవు, అథⳆ కాబట్టి, త్వత్-పద-అంభోజమ్Ⳇ నీ పద్మమువంటి పాదమును, స్మరతామ్Ⳇ స్మరించే, నఃⳆ మాకు, దర్శనమ్Ⳇ దర్శనమును, గతఃⳆ పొందినవాడవు.

బహులాశ్వమహారాజు ఇట్లు పలికెను...ఓ ప్రభూ! నీవు నిశ్చయముగా సకలప్రాణులలో మనస్సాక్షివగు సాక్షిచైతన్యమవు, ఆత్మస్వరూపుడవు. కావుననే, నిన్ను స్మరించే మాకు దర్శనమిచ్చినావు.

స్వవచస్తదృతం కర్తుమస్మద్దృగ్గోచరో భవాన్ ।
యదాత్థైకాంతభక్తాన్మే నానంతశ్శ్రీరజఃప్రియఃⳆⳆ 32

మేⳆ నాకు, ఏకాంతభక్తాత్Ⳇ అనన్యభక్తునికంటె, అనంతఃⳆ సంకర్షణుడు, శ్రీఃⳆ లక్ష్మీదేవి, అజఃⳆ బ్రహ్మదేవుడు, న ప్రియఃⳆ ప్రియుడు కాదు అని, యత్Ⳇ ఏ మాటను, ఆత్థⳆ పలికితివో, తత్Ⳇ ఆ, స్వవచఃⳆ నీ మాటను, ఋతమ్Ⳇ సత్యమునుగా, కర్తుమ్Ⳇ చేయుటకు, భవాన్Ⳇ నీవు, అస్మద్-దృగ్-గోచరఃⳆ మా చూపులకు విషయమైన వాడవు.

నాకు అనన్యభక్తునికంటె సంకర్షణుడు గాని, లక్ష్మీదేవి గాని, బ్రహ్మదేవుడు గాని ఎక్కువ ప్రియులు కాదు అని నీవు చెప్పితివి. నీ ఆ మాటను సత్యము చేయుటకై నీవు మాకు దర్శనమిచ్చితివి.

కో ను త్వచ్చరణాంభోజమేవంవిద్విసృజేత్పుమాన్ ।
నిష్కించనానాం శాంతానాం మునీనాం యస్త్వమాత్మదఃⳆⳆ33

ఏవంవిత్Ⳇ ఈ విధముగా తెలుసుకున్న, కఃⳆ ఏ, పుమాన్ వైⳆ వ్యక్తియైతే, త్వత్-చరణ-అంభఃⳆ-జమ్Ⳇ నీ పద్మమువంటి పాదమును,

విసృజేత్ ను= విడిచిపెట్టును?, యః= ఏ, త్వమ్= నీవు, నిష్కించనానామ్= ఏమీ లేనట్టియు, శాంతానామ్= శాంతులైన, మునీనామ్= మహర్షులకు, ఆత్మదః= తనను ఇచ్చువాడవో.

సర్వస్వమును విడిచిపెట్టి శాంతముగా ఉండే మునులకు నీవు నిన్నే సమర్పించెదవు. ఈ సత్యమును తెలుసుకున్న ఏ వ్యక్తి నీ పద్మమువంటి పాదమును విడిచిపెట్టును?

యోఽవతీర్య యదోర్వంశే నృణాం సంసరతామిహ ।
యశో వితేనే తచ్ఛాంత్యై త్రైలోక్యవృజినాపహమ్ ॥ 34

యః= ఏ నీవు, యదోః= యదువుయొక్క, వంశే= వంశమునందు, అవతీర్య= అవతరించి, ఇహ= ఈ లోకమునందు, సంసరతామ్= సంసారములోనున్న, నృణామ్= మానవులకు, తత్-శాంత్యై= ఆ సంసారము యొక్క ఉపశాంతి కొరకు, త్రైలోక్యవృజిన-అపహమ్= ముల్లోకముల పాపమును పోగొట్టే, యశః= కీర్తిని, వితేనే= విస్తరింప-జేసితివో.

నీవు యదువంశములో అవతరించి ముల్లోకముల పాపమును పోగొట్టే నీ కీర్తిని విస్తరింపజేసితివి. నీ కీర్తి ఈ లోకములో సంసార-బద్ధులైన జనులకు సంసారమునుపశమింప జేయును.

నమస్తుభ్యం భగవతే కృష్ణాయాకుంఠమేధసే ।
నారాయణాయ ఋషయే సుశాంతం తప ఈయుషే ॥ 35

కృష్ణాయ భగవతే= శ్రీకృష్ణ భగవానుడవైనట్టియు, అకుంఠమేధసే= మొక్కవోని విజ్ఞానశక్తి కలిగినట్టియు, సుశాంతమ్= మిక్కిలి శాంతమైన, తపః= తపస్సును, ఈయుషే= చేసే, నారాయణాయ ఋషయే= నారాయణ మహర్షివైన, తుభ్యమ్= నీ కొరకు, నమః= నమస్కారము.

ఓ శ్రీకృష్ణ భగవానుడా! మొక్కవోని విజ్ఞానశక్తి గల నీకు నమస్కారము. నీవు నారాయణ మహర్షివై మిక్కిలి శాంతమగు తపస్సును చేసితివి.

దినాని కతిచిద్భూమన్ గృహాన్నో నివస ద్విజైః ।
సమేతః పాదరజసా పునీహీదం నిమేః కులమ్ ॥ 36

భూమన్= ఓ పరబ్రహ్మ!, కతిచిత్= కొన్ని, దినాని= దినములను, నః= మా, గృహాన్= ఇంటిని, ద్విజైః= మహర్షులతో, సమేతః= కూడిన వాడవై, నివస= నివసించుము, ఇదమ్= ఈ, నిమేః= నిమియొక్క, కులమ్= వంశమును, పాదరజసా= పాదధూళితో, పునీహి= పవిత్రము చేయుము.

ఓ పరబ్రహ్మ! మహర్షులతో కూడినవాడవై కొన్ని రోజులు మా ఇంటిలో నివసించి, పాదధూళితో నిమియొక్క వంశమును పవిత్రము చేయుము.

ఇత్యుపామంత్రితో రాజ్ఞా భగవాంల్లోకభావనః ।
ఉవాస కుర్వన్ కల్యాణం మిథిలానరయోషితామ్ ॥ 37

లోకభావనః= ప్రాణులను రక్షించే, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, రాజ్ఞా= రాజుచే, ఇతి= ఈ విధముగా, ఉపామంత్రితః= ఆహ్వానించబడిన వాడై, మిథిలానరయోషితామ్= మిథిలానగరవాసులగు పురుషులకు స్త్రీలకు, కల్యాణమ్= మంగళమును, కుర్వన్= చేయుచున్నవాడై, ఉవాస= నివసించెను.

ప్రాణులను కాపాడే శ్రీకృష్ణ భగవానుడు బహులాశ్వమహారాజుచే ఈ విధముగా ఆహ్వానించబడి అక్కడే నివసిస్తూ మిథిలా నగరమునందలి స్త్రీపురుషులకు మంగళమును చేసెను.

శ్రుతదేవోఽచ్యుతం ప్రాప్తం స్వగృహాన్ జనకో యథా ।
నత్వా మునీన్ సుసంహృష్టో ధున్వన్ వాసో ననర్త హ ॥ 38

జనకః యథా= బహులాశ్వుడు వలె, శ్రుతదేవః= శ్రుతదేవుడు, స్వగృహాన్= తన యింటిని, ప్రాప్తమ్= చేరుకున్న, అచ్యుతమ్= శ్రీకృష్ణ భగవానుని, మునీన్= మహర్షులను, నత్వా= నమస్కరించి, సుసంహృష్టః = చాల ఆనందించినవాడై, వాసః= వస్త్రమును, ధున్వన్= త్రిప్పుచున్న వాడై, ననర్త హ= నాట్యము చేసెను.

బహులాశ్వుడు లాగానే శ్రుతదేవుడు కూడ తన ఇంటికి వచ్చిన శ్రీకృష్ణ భగవానునకు, మహర్షులకు నమస్కరించి మహానందముతో వస్త్రమును చుట్టూ త్రిప్పుతూ నాట్యము చేసెను.

తృణపీఠబృసీష్వేతానానీతేషూపవేశ్య సః ।
స్వాగతేనాభినంద్యాంఘ్రీన్ సభార్యోఽవనిజే ముదా ॥ 39

సభార్యః= భార్యతో కూడిన, సః= ఆ శ్రుతదేవుడు, ఏతాన్= వీరిని, ఆనీతేషు= తీసుకురాబడిన, తృణపీఠబృసీషు= తుంగచాపలు పీటలు దర్భాసనములయందు, ఉపవేశ్య= కూర్చుండబెట్టి, స్వాగతేన= స్వాగతవచనముచే, అభినంద్య= అభినందించి, ముదా= ఆనందముతో, అంఘ్రీన్= పాదములను, అవనిజే= కడిగెను.

ఆ శ్రుతదేవుడు భార్యతో గూడి తుంగచాపలను, పీటలను, దర్భాసనములను తెచ్చి వాటిపై వారిని కూర్చుండబెట్టెను. ఆయన స్వాగత వచనములతో వారిని అభినందించి, ఆనందముతో పాదములను కడిగెను.

తదంభసా మహాభాగ ఆత్మానం సగృహాన్వయమ్ ।
స్నాపయాంచక్ర ఉద్ధర్షో లబ్ధసర్వమనోరథః ॥ 40

మహాభాగః= గొప్ప పుణ్యము గల, ఉద్-హర్షః= ఉప్పొంగిన ఆనందము గల ఆతడు, తద్-అంభసా= ఆ నీటితో, సగృహ-అన్వయమ్= ఇంటితో కుటుంబముతో కూడిన, ఆత్మానమ్= తనను, స్నానపయాంచక్రే= స్నానము చేయించెను, లబ్ధసర్వమనః-రథః= పొందబడిన సకలకామనలు గలవాడు.

గొప్ప సౌభాగ్యము గల ఆ శ్రుతదేవుడు ఆ నీటిని తనపై, ఇంటిలో, కుటుంబములోనివారిపై చల్లి మహానందమును పొందెను. ఆయన మనోరథములన్నియు ఈడేరెను.

ఫలార్హణోశీరశివామృతాంబుభిర్మృదా సురభ్యా తులసీకుశాంబుజైః ।
ఆరాధయామాస యథోపపన్నయా సపర్యయా సత్త్వవివర్ధనాంధసా॥ 41

ఫల-అర్హణ-ఉశీంశివ-అమృత-అంబుభిః= పళ్లు పూజాద్రవ్యములు వట్టివ్రేళ్లచే చల్లనైన అమృతము వంటి నీళ్లతో, సురభ్యా= పరిమళము గల, మృదా= మట్టితో, తులసీకుశ-అంబుజైః= తులసి దర్భలు పద్మములతో, సత్త్వవివర్ధన-అంధసా= సత్త్వగుణమును పెంపొందించే ఆహారముతో, యథా-ఉపపన్నయా= తేలికగా లభించిన, సపర్యయా= సామగ్రితో, ఆరాధయామాస= ఆరాధించెను.

ఆయన పళ్లు, పూజాద్రవ్యములు, వట్టివ్రేళ్లతో చల్లనైన అమృతము వంటి జలములు, పరిమళము గల మట్టి, తులసి, దర్భలు, పద్మములతో, సత్త్వగుణమును వర్ధిల్లజేసే ఆహారముతో, తేలికగా లభించే పూజాసామగ్రితో వారిని ఆరాధించెను.

స తర్కయామాస కుతో మమాన్వభూత్ ।
గృహాంధకూపే పతితస్య సంగమః ।
యస్సర్వతీర్థాస్పదపాదరేణుభిః
కృష్ణేన చాస్యాత్మనికేతభూసురైః ॥ 42

సః= ఆయన, తర్కయామాస= తలపోసెను, గృహ-అంధకూపే= ఇల్లు అనే చీకటి నూతిలో, పతితస్య= పడిన, మమ= నాకు, సర్వతీర్థ-ఆస్పద పాదరేణుభిః= సకలతీర్థములకు ఆశ్రయమైన పాదధూళి కలిగినట్టియు, అస్య= ఈ శ్రీకృష్ణుని, ఆత్మనికేతభూసురైః= స్వరూపమునకు నివాసమైన మహర్షులతో, కృష్ణేన చ= శ్రీకృష్ణునితో గూడ, యః= ఏ, సంగమః= సమాగమము గలదో అది, కుతః= ఎందువలన, అన్వభూత్= కలిగెను?

ఇల్లు అనే చీకటి నూతిలో పడియున్న నాకు శ్రీకృష్ణునితో, మరియు ఆయన స్వరూపమునకు నివాసమైన మహర్షులతో సమాగమము కలిగెను. ఈ మహర్షుల పాదధూళియందు సకలతీర్థములు నివాస-ముండును. ఇట్టి సమాగమము నాకెట్లు కలిగినదో? అని ఆ శ్రుతదేవుడు తలపోసెను.

సూపవిష్టాన్ కృతాతిథ్యాన్ శ్రుతదేవ ఉపస్థితః ।
సభార్యస్వజనాపత్య ఉవాచాంఘ్ర్యభిమర్శనః ॥ 43

కృత-ఆతిథ్యాన్= చేయబడిన అతిథిసత్కారము కలిగినట్టియు, సు-ఉపవిష్టాన్= చక్కగా కూర్చున్న వారిని, ఉపస్థితః= దగ్గరగా కూర్చున్న వాడు, సభార్యస్వజన-అపత్యః= భార్య బంధువులు సంతానముతో కూడిన, శ్రుతదేవః= శ్రుతదేవుడు, అంఘ్రి-అభిమర్శనః= పాదములను నొక్కువాడై, ఉవాచ= పలికెను.

శ్రుతదేవుడు భార్య, పిల్లలు, బంధువులతో గూడి వారికి అతిథి సత్కారమును చేసెను. వారు విశ్రాంతిగా కూర్చున్నప్పుడు దగ్గరగా కూర్చుండి వారికి పాదములను నొక్కుతూ ఆయన ఇట్లు పలికెను.

శ్రుతదేవ ఉవాచ ।

నాద్య నో దర్శనం ప్రాప్తః పరం పరమపూరుషః ।
యర్హీదం శక్తిభిస్సృష్ట్వా ప్రవిష్టో హ్యాత్మసత్తయా ॥ 44

శ్రుతదేవః= శ్రుతదేవుడు, ఉవాచ= పలికెను, పరమపూరుషః= పురుషోత్తముడవగు నీవు, అద్య పరమ్= ఈనాడు మాత్రమే, నః= మాకు, దర్శనమ్= చూచుటను, ప్రాప్తః= పొందినవాడవు, న= కావు, హి= ఏలయనగా, యర్హి= ఎప్పుడైతే, ఇదమ్= ఈ జగత్తును, శక్తిభిః= శక్తులతో, సృష్ట్వా= సృష్టించి, ఆత్మసత్తయా= నీ ఉనికిచే, ప్రవిష్టః= ప్రవేశించినవాడవో.

శ్రుతదేవుడిట్లు పలికెను...పురుషోత్తముడవగు నీవు మాకు ఈనాడు మాత్రమే దర్శనమీయలేదు. ఎందుకంటే, ఎప్పుడైతే నీవీ జగత్తును నీ శక్తులతో సృష్టించి సత్తాస్ఫూర్తిరూపముగా ప్రవేశించినావో, అప్పుడే దర్శనమిచ్చినావు.

యథా శయానః పురుషో మనసైవాత్మమాయయా ।
సృష్ట్వా లోకం పరం స్వాప్నమనువిశ్యావభాసతే ॥ 45

యథా= ఏ విధముగానైతే, శయానః= నిద్రించుచున్న, పురుషః = వ్యక్తి, ఆత్మమాయయా= తన అజ్ఞానముచే, మనసా ఏవ= మనస్సు చేతనే, పరమ్= మరియొక, స్వాప్నమ్= స్వప్నమునకు చెందిన, లోకమ్= ప్రపంచమును, సృష్ట్వా= సృషించి, అనువిశ్య= ప్రవేశించి, అవభాసతే= ప్రకాశించుచున్నాడో.

అదెల్లాగంటే, నిద్రిస్తున్న వ్యక్తి తన అజ్ఞానమునకు వశుడై మనస్సుతో జాగ్రదవస్థకంటె విలక్షణమైన మరియొక స్వప్నప్రపంచమును సృష్టించి, దాని సత్తాస్ఫూర్తులుగా తానే ప్రవేశించి తాను అనేకముగా భాసించును.

శృణ్వతాం గదతాం శశ్వదర్చతాం త్వాఽభివందతామ్ ।
నృణాం సంవదతామంతర్హృద భాస్యమలాత్మనామ్ ॥ 46

శశ్వత్= సర్వదా, త్వా= నిన్ను గురించి, శృణ్వతామ్= శ్రవణము చేయునట్టియు, గదతామ్= కీర్తించునట్టియు, అర్చతామ్= పూజించు-

నట్టియు, అభివందతామ్= నమస్కరించునట్టియు, సంవదతామ్= సంవాదము చేయునట్టియు, అమల-ఆత్మనామ్= స్వచ్ఛమగు అంతఃకరణము గల, నృణామ్= మానవులకు, హృది హృదయమునందు, అంతఃలోపల, భాసి= ప్రకాశించుచున్నావు.

సర్వదా నీ గురించి శ్రవణము చేస్తూ, కీర్తిస్తూ, పూజిస్తూ, నమస్కరిస్తూ, చర్చిస్తూ ఉండే స్వచ్ఛమైన అంతఃకరణము గల వ్యక్తులకు నీవు హృదయము లోపల ప్రకాశించుచున్నావు.

హృదిస్థోఽప్యతిదూరస్థః కర్మవిక్షిప్తచేతసామ్ ।
ఆత్మశక్తిభిరగ్రాహ్యోఽప్యంత్యుపేతగుణాత్మనామ్ ॥ 47

కర్మవిక్షిప్తచేతసామ్= కర్మలచే చెల్లాచెదరయ్యే మనస్సు గలవారలకు, హృదిస్థః అపి= హృదయము నందున్నవాడవే అయిననూ, అతిదూరస్థః = చాల దూరమునందున్నవాడవు, ఆత్మశక్తిభిఃమనస్సు యొక్క శక్తులైన వృత్తులచే, అగ్రాహ్యఃఅపి= గ్రహించ శక్యము కానివాడవే అయిననూ, ఉపేతగుణ-ఆత్మనామ్= పొందబడిన సంస్కారము గల మనస్సు గలవారలకు, అంతి= సమీపమునందు (ఉన్నావు).

కర్మలచే చెల్లాచెదరైన మనస్సు గలవారలకు నీవు హృదయము-నందే ఉన్నా చాల దూరములోనున్నావు. మనస్సుయొక్క వృత్తులతో నిన్ను తెలియుట శక్యము కాదు. అయినా, సంస్కృతమైన మనస్సు గలవారలకు నీవు దగ్గరలో (ఆత్మరూపముగా) ఉన్నావు.

నమోఽస్తు తేఽధ్యాత్మవిదాం పరాత్మనే
అనాత్మనే స్వాత్మవిభక్తమృత్యవే ।
సకారణాకారణలింగమీయుషే
స్వమాయయాఽసంవృతరుద్ధదృష్టయే ॥ 48

అధ్యాత్మవిదామ్= ఆత్మజ్ఞానులకు, పర–ఆత్మనే= అంతరతమమగు ఆత్మయైనట్టియు, అనాత్మనే= దేహాభిమానికి, స్వ–ఆత్మవిభక్తమృత్యవే= తననుండి ఈయబడే మృత్యువు కలిగినట్టియు, సకారణ– అకారణలింగమ్= మహత్తత్త్వము మొదలైన కారణతత్త్వములతో కూడిన అవ్యక్తమాయా శక్తిని, ఈయుషే= పొందినట్టియు, స్వమాయయా= తన మాయాశక్తిచే, అసంవృతరుద్ధదృష్టయే= తనకు కప్పబడని అజ్ఞానులకు కప్పబడే వివేకము గల, తే= నీ కొరకు, నమః= నమస్కారము, అస్తు= అగుగాక!

నీవు ఆత్మజ్ఞానులకు అంతరతమమగు ఆత్మవు. కాని, దేహాభిమానికి నీవు నీ నుండి మృత్యువును పంపెదవు. మహత్తత్త్వము మొదలైన కారణతత్త్వములు, అవ్యక్తమాయాశక్తి నీకు ఉపాధులు. మాయాశక్తి నీకు ఆవరకము కాకున్ననూ, సంసారుల వివేకదృష్టిని కప్పివేయును. అట్టి నీకు నమస్కారము.

స త్వం శాధి స్వభృత్యాన్నః కిం దేవ కరవామహే ।
ఏతదంతో నృణాం క్లేశో యద్భవానక్షిగోచరః ॥ 49

సః= అట్టి, త్వమ్= నీవు, స్వభృత్యాన్= నీ సేవకులమగు, నః= మమ్ములను, శాధి= ఆదేశించుము, దేవ= ఓ దేవా!, కిమ్= దేనిని, కరవామహే= చేసెదము?, నృణామ్= మానవులకు, క్లేశః= దుఃఖము, ఏతద్–అంతః= ఇదియే అంతముగా గలది, యత్= ఏదనగా, భవాన్= నీవు, అక్షిగోచరః= చూపుకు విషయమగుట.

ఓ దేవా! అట్టి (మాయాశక్తిని) శాసించే) నీవు నీ సేవకులమగు మమ్ము ఆదేశించుము. మేము ఏమి చేయవలెను? మానవులకు ఏ క్షణములో నీవు కంటబడెదవో, అదే క్షణములో దుఃఖములు అంతమగును.

శ్రీశుక ఉవాచ ।

తదుక్తమిత్యుపాకర్ణ్య భగవాన్ ప్రణతార్తిహా ।
గృహీత్వా పాణినా పాణిం ప్రహసంస్తమువాచ హ ॥ 50

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇతి= ఈ విధముగా, ఉక్తమ్= చెప్పబడిన, తత్= ఆ మాటను, ఉపాకర్ణ్య= విని, ప్రణత- ఆర్తిహా= ప్రణమిల్లినవారి దుఃఖములను పోగొట్టె, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, పాణినా= చేతితో, పాణిమ్= చేతిని, గృహీత్వా= పట్టుకొని, ప్రహసన్= నవ్వుచున్నవాడై, తమ్= ఆయనను ఉద్దేశించి, ఉవాచ హ = పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రుతదేవుడు చెప్పిన ఈ మాటను విని, ప్రణమిల్లినవారి దుఃఖములను బాపే శ్రీకృష్ణ భగవానుడు చేతితో చేతిని పట్టుకొని నవ్వుతూ ఆయనతో నిట్లనెను.

శ్రీభగవానువాచ ।

బ్రహ్మంస్తేఽనుగ్రహార్థాయ సంప్రాప్తాన్ విద్ధ్యమూన్ మునీన్ ।
సంచరంతి మయా లోకాన్ పునంతః పాదరేణుభిః ॥ 51

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహాత్మా!, అమూన్= ఈ, మునీన్= మహర్షులను, తే= నీ, అనుగ్రహ-అర్థాయ= అనుగ్రహము కొరకు, సంప్రాప్తాన్= విచ్చేసిన వారినిగా, విద్ధి= తెలియుము, లోకాన్= జనులను, పాదరేణుభిః= పాదముల ధూళితో, పునంతః= పావనము చేయువారై, మయా= నాతో, సంచరంతి= సంచరించుచున్నారు.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...ఓ మహాత్మా! ఈ మహర్షులు నిన్ను అనుగ్రహించుటకే వచ్చినారని తెలియుము. వీరు నన్ను హృదయములో నిలిపి సంచరిస్తూ పాదధూళితో జనులను పవిత్రము చేయుదురు.

దేవాః క్షేత్రాణి తీర్థాని దర్శనస్పర్శనార్చనైః ।
శనైః పునంతి కాలేన తదప్యర్హత్తమేక్షయా ॥ 52

దేవాః= దేవతలు, క్షేత్రాణి= క్షేత్రములు, తీర్థాని= తీర్థములు, దర్శనస్పర్శన-అర్చనైః= చూచుట స్పృశించుట పూజించుటలచే, శనైః = మెల్లగా, కాలేన= కాలముచే, పునంతి= పావనము చేయును, తత్ అపి= ఆ పవిత్రము చేయుట కూడ, అర్హత్-తమ-ఈక్షయా= మహాత్ములను చూచుటచే (మహాత్ముల చూపుచే).

దేవతలు, క్షేత్రములు, తీర్థములు చూచి స్పృశించి అర్చించినచో మెల్లగా చాల కాలమునకు పవిత్రము చేయును. వాటి పావన శక్తి కూడ మహాత్ముల దృష్టిచేతనే వాటికి వచ్చినది. కాని, మహాత్ములను చూచినంత మాత్రాన మానవుడు పవిత్రుడగును.

బ్రాహ్మణో జన్మనా శ్రేయాన్ సర్వేషాం ప్రాణినామిహ ।
తపసా విద్యయా తుష్ట్యా కిము మత్కలయా యుతః ॥ 53

ఇహ= ఈ లోకమునందు, సర్వేషామ్= సకలమైన, ప్రాణినామ్= ప్రాణులలో, బ్రాహ్మణః= బ్రాహ్మణుడు, జన్మనా= పుట్టుకచే, తపసా= తపస్సుచే, విద్యయా= విద్యచే, తుష్ట్యా= సంతోషముచే, శ్రేయాన్= శ్రేష్ఠుడు, మత్-కలయా= నా ఉపాసనచే, యుతః= కూడినవాడు, కిము= చెప్పునదేమున్నది?

ఈ లోకములోనీ సకలప్రాణులలో బ్రాహ్మణుడు పుట్టుకచే, తపస్సుచే, విద్యచే, సంతోషముచే శ్రేష్ఠుడు. నా ఉపాసన కూడ గల బ్రాహ్మణుడు శ్రేష్ఠుడని వేరుగా చెప్పవలయునా?

న బ్రాహ్మణాన్మే దయితం రూపమేతచ్చతుర్భుజమ్ ।
సర్వవేదమయో విప్ర స్సర్వదేవమయో హ్యహమ్ ॥ 54

ఏతత్= ఈ, చతుర్-భుజమ్= నాల్గు భుజములు గల, రూపమ్= రూపము, మే= నా కొరకు, బ్రాహ్మణాత్= బ్రాహ్మణునికంటె, దయితమ్= ప్రియమైనది, న= కాదు, హి= ఏలయన, విప్రః= బ్రాహ్మణుడు, సర్వవేదమయః= సకలవేదరూపుడు, అహమ్= నేను, సర్వదేవమయః = సకలదేవతారూపుడను.

ఈ నాల్గు భుజముల రూపము నాకు బ్రాహ్మణునికంటె ఎక్కువ ప్రియమైనది కాదు. ఎందుకంటే, బ్రాహ్మణుడు సకలవేదరూపుడు కాగా, నేను సకలదేవతారూపుడను.

దుష్ప్రజ్ఞా అవిదిత్వైవమవజానంత్యసూయవః ।
గురుం మాం విప్రమాత్మానమర్చాఽఽదావిజ్యదృష్టయః ॥55

దుష్ప్రజ్ఞాః= దుర్బుద్ధులు, ఏవమ్= ఈ విధముగా, అవిదిత్వా= తెలుసుకోకుండా, అసూయవః= దోషదృష్టి గలవారై, అర్చా-ఆదౌ= ప్రతిమ మొదలగువాటియందు, ఇజ్యదృష్టయః= పూజనీయమనే బుద్ధి గలవారై, ఆత్మానమ్= ఆత్మయైనట్టియు, గురుమ్= గురువైన, మామ్= నేనే అగు, విప్రమ్= బ్రాహ్మణుని, అవజానంతి= అవమానించెదరు.

దుర్బుద్ధులు ఈ విధముగా తెలుసుకోకుండా దోషములను వెదికెదరు. ప్రతిమ, తీర్థము మొదలైనవి మాత్రమే పూజనీయములనే భావనతో వారు ఆత్మరూపుడు, పూజనీయుడు, నా స్వరూపుడు అగు బ్రాహ్మణుని అవమానించెదరు.

చరాచరమిదం విశ్వం భావా యే చాస్య హేతవః ।
మద్రూపాణీతి చేతస్యాధత్తే విప్రో మదీక్షయా ॥ 56

మద్-ఈక్షయా= నన్ను దర్శించుటచే, విప్రః= బ్రాహ్మణుడు, చర-అచర-ఆత్మకమ్= స్థావరజంగ మాత్మకమగు, ఇదమ్= ఈ, విశ్వమ్= జగత్తును, చ= మరియు, అస్య= దీనికి, హేతవః= కారణములగు,

యే= ఏ, భావాః= తత్త్వములు గలవో అవి, మద్- రూపాణి= నా రూపములు, ఇతి= అని, చేతసి= బుద్ధియందు, ఆధత్తే= నిలుపును.

బ్రాహ్మణుడు సర్వమునందు నన్నే చూచును. స్థావరజంగమాత్మకమగు ఈ జగత్తు, దానికి కారణములగు మహత్తత్త్వము మొదలైనవి నా రూపములేనని ఆతడు మనస్సులో అనుసంధానము చేయును.

తస్మాద్బ్రహ్మఋషీనేతాన్ బ్రహ్మన్ మచ్ఛ్రద్ధయార్చయ ।
ఏవం చేదర్చితోఽస్మ్యద్ధా నాన్యథా భూరిభూతిభిః ॥ 57

బ్రహ్మన్= ఓ మహాత్మా!, తస్మాత్= అందువలన, ఏతాన్= ఈ, ఋషీన్= మహర్షులను, మత్-శ్రద్ధయా= నాయందలి శ్రద్ధచే, అర్చయ= పూజించుము, ఏవం చేత్= ఈ విధముగానైనచో, అద్ధా= సాక్షాత్తుగా, అర్చితః= పూజించబడినవాడను, అస్మి= అగుదును, అన్యథా= అట్లు గానిచో, భూరిభూతిభిః= అధికమైన ఉపచారములచే, న= కాను.

ఓ మహాత్మా! కావున, ఈ మహర్షులను నాయందు చూపే శ్రద్ధతో పూజించుము. అట్లైనచో, సాక్షాత్తుగా నన్నే అర్చించినట్లగును. లేనిచో, పుష్కలమైన ఉపచారములను చేసినా నన్ను పూజించినట్లు కాదు.

శ్రీశుక ఉవాచ ।

స ఇత్థం ప్రభుణాఽఽదిష్ట స్సహకృష్ణాన్ ద్విజోత్తమాన్
ఆరాధ్యైకాత్మభావేన మైథిలశ్చాన సద్గతిమ్ ॥ 58

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఇత్థమ్= ఈ విధముగా, ప్రభుణా= శ్రీకృష్ణ ప్రభునిచే, ఆదిష్టః= ఆదేశించబడిన, సః = ఆ శ్రుతదేవుడు, మైథిలః చ= మిథిలాధిపతి బహులాశ్వుడు కూడ, సహకృష్ణాన్= శ్రీకృష్ణునితో కూడియున్న, ద్విజ- ఉత్తమాన్= గొప్ప మహర్షులను, ఏక-ఆత్మభావేన= ఒకే ఆత్మ అనే భావనతో, ఆరాధ్య= ఆరాధించి, సద్-గతిమ్= సత్పురుషుల గతిని, ఆప= పొందెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీకృష్ణ ప్రభునిచే ఈ విధముగా ఆదేశించబడిన ఆ శ్రుతదేవుడు, మిథిలాధిపతియగు బహులాశ్వుడు కూడ శ్రీకృష్ణుని, ఆ గొప్ప మహర్షులను ఒకే ఆత్మ అనే భావముతో ఆరాధించి, సత్పురుషుల గతి (మోక్షము) ని పొందిరి.

ఏవం స్వభక్తయో రాజన్ భగవాన్ భక్తభక్తిమాన్ ।
ఉషిత్వాఽఽదిశ్య సన్మార్గం పునర్ద్వారవతీమగాత్ ॥ 59

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే షడశీతితమోఽధ్యాయః ॥

రాజన్= ఓ రాజా!, భక్తభక్తిమాన్= భక్తులయందు ప్రేమ గల, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఏవమ్= ఈ విధముగా, భక్తయోఃఽ= భక్తులిద్దరి వద్ద, ఉషిత్వా= నివసించి, సత్-మార్గమ్= సాధుపురుషుల మార్గమును, ఆదిశ్య= ఉపదేశించి, పునఃఽ= మరల, ద్వారవతీమ్= ద్వారకా నగరమును గురించి, అగాత్= వెళ్లెను.

ఓ పరీక్షిన్మహారాజా! భక్తులయందు ప్రేమ గల శ్రీకృష్ణ భగవానుడీ విధముగా భక్తులిద్దరి వద్ద నివసించి, వారికి సాధుపురుషుల మార్గము-నుపదేశించి, మరల ద్వారకా నగరమునకు తిరిగి వచ్చెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో సుభద్రాహరణ
వృత్తాంతమును, శ్రీకృష్ణుడు బహులాశ్వ శ్రుతదేవుల
పూజలనందుకొనుటను వర్ణించే
ఎనుబది ఆరవ అధ్యాయము ముగిసినది (86).

* * *

అథ సప్తాశీతితమోఽధ్యాయః

వేదస్తుతి

పరీక్షిదువాచ ।

బ్రహ్మన్ బ్రహ్మణ్యనిర్దేశ్యే నిర్గుణే గుణవృత్తయః ।
కథం చరంతి శ్రుతయస్సాక్షాత్సదసతః పరే ॥ 1

పరీక్షిత్తుః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ మహర్షీ!, అనిర్దేశ్యే= పదములచే నిర్దేశింప శక్యము కానట్టియు, నిర్గుణే= గుణములు లేనట్టియు, సద్–అసతః= కార్య– కారణములకంటె, పరే= అతీతమైన, బ్రహ్మణి= పరబ్రహ్మయందు, గుణవృత్తయః= గుణములను బట్టి ప్రవర్తిల్లే, శ్రుతయః= శ్రుతులు, సాక్షాత్= సాక్షాత్తుగా, కథమ్= ఏ విధముగా, చరంతి= ప్రవర్తిల్లుచున్నవి?

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...ఓ మహర్షీ! పరబ్రహ్మను పదములతో ఇదమిత్థముగా నిర్దేశించుట సంభవము కాదు. పరబ్రహ్మ నిర్గుణము, కార్యకారణములకు అతీతమైనది. అట్టి పరబ్రహ్మను గుణములను బట్టి ప్రవర్తిల్లే శ్రుతులు సాక్షాత్తుగా ఎట్లు బోధించగల్గును?

శ్రీశుక ఉవాచ ।

బుద్ధీంద్రియమనఃప్రాణాన్ జనానామసృజత్ప్రభుః ।
మాత్రాఽర్థం చ భవార్థం చ ఆత్మనోఽకల్పనాయ చ ॥ 2

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ప్రభుః= సర్వశక్తి–మంతుడు, జనానామ్= జీవులయొక్క, మాత్రా–అర్థం చ= విషయభోగము కొరకు, భవ–అర్థం చ= మోక్షము కొరకు కూడ, ఆత్మనః= తనకు, అకల్పనాయచ= కల్పనల నివృత్తి అనే మోక్షముకొరకు కూడా, బుద్ధి–ఇంద్రియమనఃప్రాణాన్= బుద్ధి ఇంద్రియములు మనస్సు ప్రాణములను, అసృజత్= సృష్టించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు చెప్పెను...సర్వశక్తిమంతుడగు భగవానుడు జీవుల విషయభోగముల (అర్థము) జన్మకు కారణమైన కర్మ (ధర్మము) కొరకు, తనకు ఆయా లోకముల భోగము (కామము) కొరకు, కల్పనల నివృత్తి అనే మోక్షము కొరకు కూడ బుద్ధి, ఇంద్రియములు, మనస్సు, ప్రాణములను సృష్టించెను.

సైషా హ్యుపనిషద్బ్రాహ్మీ పూర్వేషాం పూర్వజైర్ధృతా ।
శ్రద్ధయా ధారయేద్యస్తాం క్షేమం గచ్ఛేదకించనః ॥ 3

సా= ఆ, ఏషా= ఈ, బ్రాహ్మీ= బ్రహ్మను ప్రతిపాదించే, ఉపనిషత్= ఉపనిషత్తు, పూర్వేషామ్= పూర్వీకులకు, పూర్వజైః= పూర్వమునందు పుట్టినవారిచే, ధృతా= ధారణ చేయబడినది, యః= ఎవడు, శ్రద్ధయా= శ్రద్ధతో, తామ్= దానిని, ధారయేత్= ధరించునో అట్టివాడు, అకించనః = దేహాభిమానము లేనివాడై, క్షేమమ్= క్షేమమును, గచ్ఛేత్= పొందును.

బ్రహ్మను ప్రతిపాదించే ఆ ఈ ఉపనిషత్తును పూర్వీకులకు పూర్వమునందు పుట్టిన సనకాదులు ధరించిరి. ఎవడైతే దానిని శ్రద్ధగా ధరించునో, అట్టివాడు దేహాభిమానము లేనివాడై మోక్షమును పొందును.

అత్ర తే వర్ణయిష్యామి గాథాం నారాయణాన్వితామ్ ।
నారదస్య చ సంవాదమృషేర్నారాయణస్య చ ॥ 4

అత్ర= ఈ విషయమునందు, తే= నీ కొరకు, నారాయణ-అన్వితామ్= నారాయణునితో కూడియున్న, గాథామ్= వృత్తాంతమును, ఋషేః= నారాయణస్య చ= నారాయణ మహర్షికి, నారదస్య చ= నారదునకు, సంవాదమ్= సంవాదమును, వర్ణయిష్యామి= వర్ణించగలను.

ఈ విషయములో నీకు నారాయణునితో కూడిన వృత్తాంతమును, నారాయణ మహర్షితో నారదుని సంవాదమును వర్ణించి చెప్పెదను.

ఏకదా నారదో లోకాన్ పర్యటన్ భగవత్ప్రియః ।
సనాతనమృషిం ద్రష్టుం యయౌ నారాయణాశ్రమమ్ ॥ 5

ఏకదా= ఒకనాడు, భగవత్-ప్రియః= భగవానునకు ప్రియుడైన, నారదః= నారదుడు, లోకాన్= లోకములను, పర్యటన్= పర్యటించువాడై, సనాతనమ్= సనాతనుడగు, ఋషిమ్= నారాయణ మహర్షిని, ద్రష్టుమ్= చూచుటకు, నారాయణ-ఆశ్రమమ్= నారాయణాశ్రమమును గురించి, యయౌ= వెళ్లెను.

ఒకనాడు భగవానునకు ప్రియుడగు నారదుడు లోకములను పర్యటిస్తూ సనాతనుడగు నారాయణ మహర్షిని చూచుటకై నారాయణాశ్రమమునకు వెళ్లెను.

యో వై భారతవర్షేఽస్మిన్ క్షేమాయ స్వస్తయే నృణామ్ ।
ధర్మజ్ఞానశమోపేతమాకల్పాదాస్థితస్తపః ॥ 6

యః వై= ఏ నారాయణమహర్షియైతే, అస్మిన్= ఈ, భారతవర్షే= భారతదేశమునందు, నృణామ్= మానవుల, క్షేమాయ= క్షేమము కొరకు, స్వస్తయే= కల్యాణము కొరకు, ఆకల్పాత్= కల్పము ఆరంభమునుండి, ధర్మజ్ఞానశమ-ఉపేతమ్= ధర్మము జ్ఞానము ఇంద్రియనిగ్రహములతో కూడిన, తపః= తపస్సును, ఆస్థితః= అనుష్ఠించినవాడో.

ఆ నారాయణ మహర్షి ఈ భారతదేశమునందలి జనుల ఐహిక-ఆముష్మికశుభముల కొరకై కల్పాదినుండి, ధర్మము జ్ఞానము ఇంద్రియనిగ్రహములతో కూడిన తపస్సును చేసెను.

తత్రోపవిష్టమృషిభిః కలాపగ్రామవాసిభిః ।
పరీతం ప్రణతోఽపృచ్ఛదిదమేవ కురూద్వహ ॥ 7

కురు-ఉద్వహ= కురువంశ శ్రేష్ఠా!, తత్ర= అక్కడ, ఉపవిష్టమ్= కూర్చున్నట్టియు, కలాపగ్రామవాసిభిః= కలాపమనే గ్రామమునందు

నివసించే, ఋషిభిః= మహర్షులచే, పరీతమ్= చుట్టువారబడియున్న నారాయణ మహర్షిని, ప్రణతః= ప్రణమిల్లిన నారద మహర్షి, ఇదం ఏవ= ఈ విషయమునే, అపృచ్ఛత్= ప్రశ్నించెను.

కురువంశములో శ్రేష్ఠుడవగు ఓ పరీక్షిన్మహారాజా! నారాయణ మహర్షి ఆ ఆశ్రమములో కూర్చునియుండెను. కలాపగ్రామమునందు నివసించే మహర్షులు ఆయన చుట్టూ చేరిరి. నారద మహర్షి ఆయనకు ప్రణమిల్లి ఇదే విషయము (శ్రుతులు బ్రహ్మను ప్రతిపాదించుట) ను ప్రశ్నించెను.

తస్మై హ్యవోచద్భగవానృషీణాం శృణ్వతామిదమ్ ।
యో బ్రహ్మవాదః పూర్వేషాం జనలోకనివాసినామ్ ॥ 8

భగవాన్= నారాయణ మహర్షి, ఋషీణామ్= మహర్షులు, శృణ్వతామ్= వినుచుండగా, తస్మై= ఆ నారదుని కొరకు, ఇదమ్= దీనిని, అవోచత్= చెప్పెను, యః హి= ఏదైతే, జనలోకనివాసినామ్= జనలోకమునందు నివసించే, పూర్వేషామ్= పూర్వీకులయొక్క, బ్రహ్మవాదః= బ్రహ్మను గురించి ప్రసంగమో.

నారాయణ మహర్షి నారదుని కొరకు మహర్షులు వినుచుండగా దీనిని చెప్పెను. పూర్వము జనలోకవాసులు బ్రహ్మను గురించి చేసిన ప్రసంగమే యిది.

శ్రీభగవానువాచ ।

స్వాయంభువ బ్రహ్మసత్రం జనలోకేఽభవత్పురా
తత్రస్థానాం మానసానాం మునీనామూర్ధ్వరేతసామ్ ॥ 9

శ్రీభగవాన్= నారాయణ భగవానుడు, ఉవాచ= పలికెను, స్వాయంభువ= బ్రహ్మపుత్రుడవగు నారదా!, పురా= పూర్వము, జనలోకే= జనలోకమునందు, తత్రస్థానామ్= అక్కడ ఉన్న, మానసానామ్=

బ్రహ్మమానసపుత్రులైన, ఊర్ధ్వరేతసామ్= నైష్ఠికబ్రహ్మచారులగు, మునీనామ్= మహర్షుల, బ్రహ్మసత్రమ్= బ్రహ్మసత్రము, అభవత్= ఆయెను.

నారాయణ భగవానుడిట్లు పలికెను...బ్రహ్మదేవుని పుత్రుడవగు ఓ నారదా! పూర్వము జనలోకములో అక్కడ ఉండే బ్రహ్మమానస పుత్రులగు సనకాది మహర్షుల మధ్య బ్రహ్మసత్రము (అందరు కలిసి చేసే బ్రహ్మవిచారము) జరిగెను. ఆ మహర్షులు నైష్ఠిక బ్రహ్మచారులు.

శ్వేతద్వీపం గతవతి త్వయి ద్రష్టుం తదీశ్వరమ్ ।
బ్రహ్మవాదస్సుసంవృత్త శ్శ్రుతయో యత్ర శేరతే ।
తత్ర హాయమభూత్ప్రశ్నస్త్వం మాం యమనుపృచ్ఛసి ॥ 10

త్వయి= నీవు, శ్వేతద్వీపమ్= శ్వేతద్వీపమును గురించి, తద్–ఈశ్వరమ్= దాని ప్రభువగు అనిరుద్ధుని, ద్రష్టుమ్= చూచుటకు, గతవతి= వెళ్లినవాడవు కాగా, బ్రహ్మవాదః= బ్రహ్మవాదము, సుసంవృత్తః= బాగుగా జరిగునది, యత్ర= దేనియందైతే, శ్రుతయః= వేదములు, శేరతే= మౌనముగానుండునో, తత్ర= దానియందు, అయమ్= ఈ, ప్రశ్నః= ప్రశ్న, అభూత్ హ= ఆయెను, యమ్= దేనినైతే, త్వమ్= నీవు, మామ్= నన్ను, అనుపృచ్ఛసి= అడుగుచున్నావో.

నీవు శ్వేతద్వీపాధిపతియగు అనిరుద్ధుని చూచుటకై అచటకు వెళ్లిన సమయములో బ్రహ్మవాదము చక్కగా జరిగెను. బ్రహ్మ విషయములో శ్రుతులు మౌనము దాల్చును. దానియందు నీవు ఇప్పుడే నన్ను అడిగిన ఈ ప్రశ్న వచ్చెను.

తుల్యశ్రుతతపశ్శీలాస్తుల్యస్వీయారిమధ్యమాః ।
అపి చక్రుః ప్రవచనమేకం శుశ్రూషవోఽపరే ॥ 11

తుల్యశ్రుతతపః–శీలాః= సమానమైన అధ్యయనము తపస్సు శీలము గలవారు, తుల్యస్వీయ–అరిమధ్యమాః= సమానమైన తనవారు

శత్రువులు ఉపేక్షణీయులు గలవారు, అపి= అయినా, ఏకమ్= ఒకనిని, ప్రవచనమ్= ప్రవక్తగా, చక్రుః= చేసిరి, అపరే= ఇతరులు, శుశ్రూషవః = వినగోరువారు.

వారందరు సమానమైన అధ్యయనము, తపస్సు, శీలము గలవారే. వారి దృష్టిలో తనవారు, శత్రువులు, ఉదాసీనులు అందరు సమానమే. అయినప్పటికీ, వారిలో ఒకనిని ప్రవక్తనుగా చేసి, మిగిలినవారు వినగోరిరి.

సనందన ఉవాచ ।

స్వసృష్టమిదమాపీయ శయానం సహ శక్తిభిః ।
తదంతే బోధయాంచక్రు స్తల్లింగైశ్శ్రుతయః పరమ్ ॥ 12

సనందనః= సనందనుడు, ఉవాచ= పలికెను, స్వసృష్టమ్= తనచే సృష్టించబడిన, ఇదమ్= ఈ జగత్తును, శక్తిభిఃసహ= శక్తులతో సహా, ఆపీయ= ఉపసంహరించి, శయానమ్= పరున్న, పరమ్= పరమాత్మను, తద్-అంతే= ఆ ప్రళయముయొక్క అంతమునందు, శ్రుతయః= వేదములు, తత్-లింగైః= ఆయనను ప్రతిపాదించే వాక్యములతో, బోధయాంచక్రుః= నిద్ర లేపినవి.

సనందనుడిట్లు పలికెను...పరమాత్మ, తనచే సృష్టించబడిన ఈ జగత్తును కారణశక్తులగు మహత్తత్త్వము మొదలగువాటితో సహా ఉపసంహారము చేసి యోగనిద్రను పొందెను. ఆ ప్రళయము అంతమైన తరువాత (ఆయన నిశ్శ్వాసనుండి పుట్టిన) వేదాధిష్ఠానదేవతలు ఆ పరమాత్మను ప్రతిపాదించే వాక్యములతో ఆయనను నిద్ర లేపినవి.

యథా శయానం సమ్రాజం వందినస్తత్పరాక్రమైః ।
ప్రత్యూషేఽభ్యేత్య సుశ్లో కైర్బోధయంత్యనుజీవినః ॥ 13

యథా= ఏ విధముగానైతే, శయానమ్= నిద్రిస్తున్న, సమ్రాజమ్= చక్రవర్తిని, అనుజీవినః= ఆశ్రయించి బ్రతికే, వందినః= స్తోత్రపాఠకులు,

ప్రత్యూషే= తెల్లవారు జామునందు, అభ్యేత్య= వచ్చి, తత్-పరాక్రమైుః = ఆయనయొక్క పరాక్రమములు గల, సుశ్లోకైుఃా= మంచి శ్లోకములతో, బోధయంతి= నిద్ర లేపెదరో.

చక్రవర్తిని ఆశ్రయించి బ్రతికే స్తోత్రపాఠకులు తెల్లవారు జామున వచ్చి ఆయన పరాక్రమమును చెప్పే మంచి శ్లోకములతో, నిద్రిస్తున్న ఆయనను నిద్ర లేపెదరు. అదే విధముగా శ్రుతులు చేసినవి.

శ్రుతయ ఊచుఃా ।

జయ జయ జహ్యజామజిత దోషగృభీతగుణాం
త్వమసి యదాత్మనా సమవరుద్ధసమస్తభగఃా ।
అగజగదోకసామఖిలశక్త్యవబోధక తే
క్వచిదజయాఽఽత్మనా చ చరతోఽనుచరేన్నిగమఃా ॥14

శ్రుతయఃా= శ్రోతలు, ఊచుఃా= పలికిరి, అజిత= పరాజయము లేనివాడా!, జయ= సర్వోత్కృష్టుడవగుము, జయ= జయమగు గాక, దోషగృభీతగుణామ్= దోషము కొరకై స్వీకరించబడిన గుణములు గల, అజామ్= అనాదియగు మాయను, జహి= నశింప జేయుము, యత్= ఏలయనగా, త్వమ్= నీవు, ఆత్మనా= స్వరూపముచే, సమవరుద్ధసమస్త-భగఃా= కదలని కదిలే ప్రాణులయొక్క, అఖిలశక్తి-అవబోధక= సకల-శక్తులను నిద్ర లేపువాడా!, క్వచిత్= ఒకప్పుడు, అజయాఽ= అనాదిమాయచే, చరతఃా= ప్రవర్తిల్లునట్టియు, ఆత్మనా చ= స్వరూపముచే కూడ ఉండే, తే= నీకు, నిగమఃా= వేదము, అనుచరేత్= ప్రతిపాదించునో.

శ్రోతలు ఇట్లు పలికిరి...పరాజయమునెరుగని ఓ దేవా! నీవు సర్వోత్కృష్టుడవు కమ్ము. నీకు జయమగుగాక! స్థావరజంగమము లైన ప్రాణులయొక్క అనాది మాయను నశింప జేయుము. జీవుని స్వరూపమును కప్పివేయుటకే ఈ మాయ సత్త్వాదిగుణములను స్వీకరించినది. ఎందుకంటే, నీవు స్వరూపముచేతనే సకలైశ్వర్యములను

పొందియున్నావు. చరాచర ప్రాణులలోని క్రియాజ్ఞాన శక్తులను ఉద్బుద్ధము చేసేది నీవే. లేదా, నీ స్వరూపమునందే ఉండే నీవు ఒకప్పుడు (సృష్ట్యాదియందు) మాయచే అవిచ్ఛిన్నుడవై యుందువు. అప్పుడు నిన్ను వేదము ప్రతిపాదించును.

బృహదుపలబ్ధమేతదవయంత్యవశేషతయా
యత ఉదయాస్తమయౌ వికృతేర్మృది వాఽవికృతాత్ ।
అత ఋషయో దధుస్త్వయి మనోవచనాచరితం
కథమయథా భవంతి భువి దత్తపదాని నృణామ్ ॥15

అవశేషతయా= మిగిలేది అగుటచే, ఏతత్= ఈ, ఉపలబ్ధమ్= తెలియబడే జగత్తు, బృహత్= బ్రహ్మ అని, ఋషయః= మహర్షులు (శ్రుతులు), అవయంతి= తెలియుచున్నారు, యతః= ఏ, అవికృతాత్= వికారములు లేని బ్రహ్మనుండి, వికృతేః= వికారమగు ఘటమునకు, మృది వా= మట్టియందు వలె, ఉదయ-అస్తమయౌ= పుట్టుక గిట్టుటలో, అతః= ఇందువలన, మనః-వచన-ఆచరితమ్= మనస్సుచే వాక్కుచే ఆచరించబడినదానిని, త్వయి= నీయందు, దధుః= ధరించిరి, నృణామ్= మానవులయొక్క, భువి= భూమిపై, దత్తపదాని= ఉంచబడిన పాదములు, కథమ్= ఏ విధముగా, అయథా భవంతి= అట్లు గానివి అగును?

ఈ తెలియబడే జగత్తు నిరంతరపరిణామశీలి (వికారము). ఇది వికారములు లేని పరబ్రహ్మనుండి పుట్టి, పరబ్రహ్మయందే విలీనమగును. మట్టినుండి పుట్టిన కుండ మట్టిలో కలిసిపోయి మట్టియే మిగులును. అదే విధముగా జగత్తు విలీనము కాగా మిగిలేది బ్రహ్మయే. కావున, ఈ సర్వము బ్రహ్మయేనని మంత్రములు, మహర్షులు నిర్ధారించు-చున్నారు. కావుననే మంత్రములు, మహర్షులు మనస్సుచే సంకల్పించ-బడేది (రూపము), వాక్కుచే వర్ణించబడేది (నామము) సర్వము నీయందే పర్యవసించునని నిశ్చయించిరి. మానవులు ఎక్కడ కాళ్లను పెట్టినా, అవి భూమిపై మోపినట్లే యగును గాని, మరియొకచోట కాదు గదా!

ఇతి తవ సూరయస్త్రయ్యధిపతేఽఖిలలోకమల-
క్షపణకథాఽమృతాబ్ధిమవగాహ్య తపాంసి జహుః ।
కిముత పునస్స్వధామవిధుతాశయకాలగుణాః
పరమ భజంతి యే పదమజస్రసుఖాభవమ్ ॥ 16

త్రి-అధిపతే= ముల్లోకముల (మూడు గుణముల)కు అధీశుడా!, ఇతి= ఈ కారణముగా, సూరయః= మహాత్ములు, తవ= నీ, అఖిల లోకమలక్షపణ కథా-అమృత-అబ్ధిమ్= సకలజనుల పాపములను పోగొట్టే గాథలనే అమృతసముద్రమును, అవగాహ్య= మునక వేసి, తపాంసి= దుఃఖ(పాప)ములను, జహుః= విడిచిపెట్టిరి, పరమ= ఓ పరమాత్మా!, యే పునః= ఎవరైతే, స్వధామవిధుత-ఆశయకాలగుణాః = స్వరూపమును సాక్షాత్కరించుటచే విడిచిపెట్టబడిన అంతఃకరణధర్మములు కాలధర్మములు గల వారో, అజస్రసుఖ-అనుభవమ్= నిత్యమైన ఆనంద-చిద్ఘనమగు, పదమ్= స్వరూపమును, భజంతి= సేవించెదరో, కిం ఉత= వేరుగా చెప్పవలెనా?

ముల్లోకములను మూడు గుణములను శాసించే ఓ దేవా! ఈ కారణము (నామరూపముల సారము పరబ్రహ్మ) చేతనే మహాత్ములు సకలజనుల పాపములను పోగొట్టే నీ గాథలనే అమృతసముద్రమును సేవిస్తూ దుఃఖ(పాప)ములను తప్పించుకొనెదరు. ఓ పరమాత్మా! జ్ఞానులు తమ స్వరూపమును సాక్షాత్కరించుకొని జరామృత్యువులను విడిచిపెట్టెదరు. వారు సర్వకాలము ఆనందచిద్ఘనమగు స్వరూపమును సేవించెదరు. వారు దుఃఖములను తప్పించుకొనెదరని వేరుగా చెప్పవలయునా?

దృతయ ఇవ శ్వసంత్యసుభృతో యది తేఽనువిధా
మహదహమాదయోఽండమసృజన్ యదనుగ్రహతః ।
పురుషవిధోఽన్వయోఽత్ర చరమోఽన్నమయాదిషు యః
సదసతః పరం త్వమథ యదేష్వవశేషమృతమ్ ॥17

అసుభృతః= మానవులు, తే= నీ, అనువిధాః= భక్తులు, యది ను= అయినచో, శ్వసంతి= శ్వాసక్రియను చేయుచున్నారు, ధృతయః ఇవ= తోలుతిత్తులు వలె, యద్-అనుగ్రహతః= ఏ నీ అనుగ్రహము వలన, మహద్-అహమ్-ఆదయః= మహత్తత్త్వము అహంకారము మొదలైనవి, అండమ్= బ్రహ్మాండమును, అసృజన్= సృష్టించినవో, యః = ఏ నీవు, అత్ర= ఈ, అన్నమయ-ఆదిషు= అన్నమయము మొదలగు కోశములయందు, పురుషవిధః= మనిషి ఆకారము గలవాడవై, అన్వయః = అనువృత్తి చేయుచున్నావో, చరమః= అఖరి ఆనందబ్రహ్మవగు, యః= ఏ, త్వమ్= నీవు, సద్-అసతః= స్థూలసూక్ష్ముల (కార్య-కారణముల) కంటె, పరమ్= అతీతుడవో, ఏషు= వీటియందు, అవశేషమ్= నిషేధించ శక్యము కానివాడవో, అథ= ఇందువలననే, ఋతమ్= సత్యమవో.

మానవులు నీ భక్తులైనచో శ్వాసక్రియను చేసే జీవులు. అట్లు కానిచో, మానవులు కేవలము తోలుతిత్తులవంటి వారు మాత్రమే (వారి జీవితము వ్యర్థము). మహత్తు, అహంకారము, సూక్ష్మభూతములు మొదలైనవి నీవు వాటియందు ప్రవేశించి అనుగ్రహించుటవలననే సామర్థ్యమును పొంది ఈ బ్రహ్మాండమును సృష్టించగల్గినవి. నీవు అన్నమయ-ప్రాణమయ-మనోమయ-విజ్ఞానమయ-ఆనందమయ కోశములలో మనుష్యాకారము కలిగి నేను-రూపములో ప్రకటమవుతూ వాటికి సత్తాస్ఫూర్తులనిచ్చుచున్నావు. కాని, స్థూలసూక్ష్ములకు, కార్యకారణములకు అతీతమైన నీవు ఐదు కోశములకు అంతరమగు ఆఖరి ఆనందబ్రహ్మవు. ఈ అనాత్మలనన్నింటినీ నిషేధించగా మిగిలి-యుండే బ్రహ్మవు నీవే. కాబట్టి సత్యవస్తువు నీవు మాత్రమే (ఈ అన్నమయాది సర్వము మిథ్యయే).

ఉదరముపాసతే య ఋషివర్త్మసు కూర్పదృశః
పరిసరపద్ధతిం హృదయమారుణయో దహరమ్ ।
తత ఉదగాదనంత తవ ధామ శిరః పరమం
పునరిహ యత్సమేత్య న పతంతి కృతాంతముఖే ॥18

ఋషివర్త్మసు= మహర్షుల సంప్రదాయములయందు, యే= ఎవరైతే, కూర్పదృశః= ఇసుక కళ్లయందు గలవారో వారు, ఉదరమ్= మణిపూరక చక్రమును, ఆరుణయః= అరుణవంశీయులు (కొద్ది వెలుతురు గలవారు), పరిసరపద్ధతిమ్= నాడుల ప్రసరించే స్థానమైనట్టియు, హృదయమ్= హృదయమైన, దహరమ్= సూక్ష్మమగు ఆకాశమును, ఉపాసతే= ఉపాసించెదరు, అనంత= అనంతుడా!, తతః= అక్కడనుండి, తవ= నీ, ధామ= ధామము, పరమమ్= సర్వోత్కృష్టమైన, శిరః= సహస్రారము, ఉదగాత్= పైకి వచ్చెను, యత్= దేనిని, సమేత్య= చేరి, పునః= మరల, ఇహ= ఇక్కడ, కృతాంతముఖే= మృత్యువు నోట, న పతంతి= పడరో.

మహర్షుల సంప్రదాయములనేకములు. వారిలో శర్కరాక్ష వంశీయులు (ఇసుక కళ్లలో పడినవారు, అనగా స్థూలదృష్టి గలవారు) మణిపూరక చక్రమునందు నిన్ను అగ్నిరూపముగా ఉపాసించెదరు. అరుణవంశీయులగు మహర్షులు (కొంచెము వెలుతురు, అనగా కొంత సూక్ష్మదృష్టి గలవారు) నిన్ను నాడుల ప్రసారకేంద్రమైన హృదయములో సూక్ష్మమగు ఆకాశము (చైతన్యము) గా ఉపాసించెదరు. ఆ హృదయము నుండియే సహస్రారమును చేరే సుషుమ్నానాడి పైకి వచ్చినది. ఓ అనంతా! శిరస్సు నందలి సహస్రారచక్రమే నీ సర్వోత్కృష్ట మైన ధామము (స్వరూపము). ఎవరైతే ఆ బ్రహ్మస్థానమును (ఉపాసన, జ్ఞానముల ద్వారా) చేరెదరో, వారు మరల ఈ లోకములో పుట్టి మృత్యువు వాత బడుట ఉండదు.

స్వకృతవిచిత్రయోనిషు విశన్నివ హేతుతయా
తరతమతశ్చకాస్స్యనలవత్స్వకృతానుకృతిః ।
అథ వితథాస్వమూష్వవితథం తవ ధామ సమం
విరజధియోఽన్వయంత్యభివిపణ్యవ ఏకరసమ్ ॥19

స్వకృతవిచిత్రయోనిషు= తన చేతనే చేయబడిన రకరకముల యోనులయందు, హేతుతయా= ఉపాదానముగా, విశన్ ఇవ= ప్రవేశించుచున్నాడా అన్నట్లు ఉన్నవాడవు, స్వకృత-అనుకృతిః= నీచే చేయబడిన యోనులను అనుకరించువాడవు, అనలవత్= అగ్నివలె, తరతమతః= తగ్గు హెచ్చులుగా, చకాస్సి= ప్రకాశించుచున్నావు, అథ= ఇందువలన, వితథాసు= మిథ్యలగు, అమూషు= ఈ యోనులయందు, అవితథమ్= సత్యము, సమమ్= సమము, ఏకరసమ్= ఏకరూపము అగు, తవ= నీ, ధామ= ఆత్మచైతన్యమును, విరజధియః= నిష్కల్మషమైన అంతఃకరణము గలవారు, అభివిపణ్యవః= సర్వమునుండి నివృత్తులైన వారు, అన్వయంతి= తెలియుదురు.

నీవు నీనుండియే (నీవే ఉపాదానముగా) రకరకముల ప్రాణి-దేహములను సృష్టించి వాటిలో సచ్చిద్రూపుడవై ప్రవేశించుచున్నావా యన్నట్లున్నావు (కార్యములగు దేహములు కారణమగు సచ్చిదాత్మ లేకుండా లేవు గనుక, ప్రవేశము కల్పితమే గాని యథార్థము కాదు). నీచే రచించబడిన ఆ దేహములలో నీవు దేవత-పశువు మొదలైన హెచ్చుతగ్గులననుకరిస్తూ ప్రకాశించుచున్నావు. తరతమ భావముతో విభిన్నరూపములు గల ఈ దేహములు మిథ్య. కాని, వాటిలో ప్రకాశించే సచ్చిదాత్మ సత్యము, సమము, ఏకరూపము. అదియే నీ స్వరూపము. సకలవ్యవహారములనుండి నివృత్తులై శుద్ధమగు అంతఃకరణము గల మహాత్ములు నిన్ను ఆత్మరూపముగా తెలియుదురు.

స్వకృతపురేష్వమీష్వబహిరంతరసంవరణం
తవ పురుషం వదంత్యఖిలశక్తిధృతోఽశకృతమ్ ।
ఇతి నృగతిం వివిచ్య కవయో నిగమావపనం
భవత ఉపాసతేఽంఘ్రిమభవం భువి విశ్వసితాః ॥20

అమీషు= ఈ, స్వకృతపురేషు= తనచే చేయబడిన దేహముల యందు, అబహిః-అంతః= బయట లోపల లేనట్టియు, అసంవరణమ్= ఆవరణము లేని, పురుషమ్= జీవుని, అఖిలశక్తిధృతః= సకలశక్తులను ధరించే, తవ= నీ, అంశకృతమ్= అంశగా చేయబడినవానినిగా, వదంతి= చెప్పెదరు, ఇతి= అని, నృగతిమ్= జీవతత్త్వమును, వివిచ్య= నిశ్చయించి, భువి= భూలోకమునందు, కవయః= మహాత్ములు, విశ్వసితాః= విశ్వాసము గలవారై, నిగమ-ఆవపనమ్= వేదములకు క్షేత్రమగు, అభవమ్= పుట్టుక లేని, భవతః= నీ, అంఘ్రిమ్= పాదమును, ఉపాసతే= ఉపాసించెదరు.

జీవుల తమ కర్మల ద్వారా తమకై ఈ దేహములను తయారు చేసుకొనెదరు. ఆ దేహముల వలన వచ్చే బయట-లోపల అనే విభాగము గాని, కార్యకారణవిభాగము గాని జీవునకు కల్పితములే గాని యథార్థములు కావు. వాస్తవములో జీవుడు సకలశక్తులను కలిగియుండే నీ స్వరూపమే. కాని దేహాధ్యాసను బట్టి నీ అంశ అనియు, కర్మలచే చేయబడినవాడనియు చెప్పెదరు. ఈ లోకములో మహాత్ములు జీవుని యొక్క ఈ యథార్థస్థితిని వివేచించి విశ్వాసముతో నీ పాదమును ఉపాసించెదరు. వేదవిహితములైన సకలకర్మలను సమర్పించవలసినది నీ పాదముల మ్రోలనే. నీ పాదమే మోక్షస్వరూపము.

దురవగమాత్మతత్త్వనిగమాయ తవాత్తతనోః
చరితమహాఽమృతాబ్ధిపరివర్తపరిశ్రమణాః ।
న పరిలషంతి కేచిదపవర్గమపీశ్వర తే
చరణసరోజహంసకులసంగవిసృష్టగృహాః ॥ 21

ఈశ్వర= ఓ ఈశ్వరా!, దురవగమ-ఆత్మతత్త్వనిగమాయ= తెలియ శక్యము కాని ఆత్మతత్త్వమును తెలుపుటకై, ఆత్తతనోః= స్వీకరించబడిన దేహము గల, తవ= నీయొక్క, చరితమహా-అమృత-అబ్ధిపరివర్తపరి శ్రమణాః= చరితము అనే గొప్ప అమృతసముద్రమునందు మునుగుటచే తొలగిన క్లేశము గలవారు (మునుగుటయందు చేయబడిన పరిశ్రమ గలవారు), తే= నీ, చరణసరః-జ హంసకులసంగవిసృష్టగృహాః= పద్మములవంటి పాదములయందు హంసలైన భక్తుల సమూహముతోడి సంగముచే విడువబడిన గృహములు గలవారు, కేచిత్= కొందరు, అపవర్గం అపి= మోక్షమును కూడ, న పరిలషంతి= కోరరు.

ఓ ఈశ్వరా! ఆత్మతత్త్వమును తెలియుట చాల కష్టము. దానిని తెలుపుటకై నీవు అవతరించితివి. నీ చరితము గొప్ప అమృత సముద్రము. దానిలో మునకలు వేయుటలో పరిశ్రమ చేసిన భక్తులకు క్లేశములు తొలగిపోవును. అరుదైన అట్టి భక్తులు నీ పాదపద్మముల యందు హంసల వలె రమించే భక్తుల సమూహముతో సంగమును నెరపి విరక్తులై సన్న్యసించెదరు. అట్టి మహాభక్తులు మోక్షమును కూడ కోరరు.

త్వదనుపథం కులాయమిదమాత్మసుహృత్ప్రియవత్ ।
చరతి తథోన్ముఖే త్వయి హితే ప్రియ ఆత్మని చ ।
న బత రమంత్యహో అసదుపాసనయాఽఽత్మహనో
యదనుశయా భ్రమంత్యురుభయే కుశరీరభృతః ।22

త్వద్-అనుపథమ్= నీ మార్గముననుసరించే (జీవుడనే నీ అంశతోడి సంబంధమును కలిగిన, నీ సేవకు ఉపయోగించే), ఇదమ్= ఈ, కులాయమ్= గూడు (శరీరము), ఆత్మసుహృత్-ప్రియవత్= తాను వలె హితకారి వలె ప్రియము వలె, చరతి= వ్యవహరించుచున్నది,

తథా చ= అయినప్పటికీ, ఉత్-ముఖే= నిత్యసిద్ధమైనట్టియు, హితే= హితమును చేయునట్టియు, ప్రియే= ప్రియుడవైనట్టియు, ఆత్మని= ఆత్మవగు, త్వయి= నీయందు, న రమంతి= రమించరు, బత= కష్టము! అహో= ఆహా!, అసద్-ఉపాసనయా= మిథ్యయగు దేహాదుల ఉపాసనచే, ఆత్మహనః= ఆత్మహత్యకు పాల్పడువారు, యద్-అనుశయాః ఏ ఉపాసనయొక్క వాసన గలవారు, కుశరీరభృతః= చెడు దేహములను ధరించువారై, ఉరుభయే= అధికభయము గల సంసారమునందు, భ్రమంతి= తిరుగాడెదరో.

ఈ గూడువంటి దేహము ఆత్మరూపుడవగు నీతో సంబంధమును కలిగి ఉన్న కారణముచేతనే తానే ఆత్మయా అన్నట్లు, హితకారి యన్నట్లు, ప్రియమన్నట్లు ఆచరించుచున్నది. ఆత్మరూపుడవగు నీవైతే నిత్యసిద్ధమై హితమును చేస్తూ ప్రియుడవై ఉన్నావు. కాని, అయ్యో! ఎంత కష్టము! జనులు మిథ్యయగు దేహాదులనుపాసిస్తూ నిన్ను తెలియలేకున్నారు. ఆ కారణముగా పశ్వాదిజన్మలను పొందుతూ ఆత్మహత్యయే చేసుకొనుచున్నారా యన్నట్లున్నారు. వారు అధికమగు భయము గల ఈ సంసారములో పరిభ్రమించుచున్నారు.

నిభృతమరున్మనోఽక్షదృఢయోగయుజో హృది యన్
మునయ ఉపాసతే తదరయోఽపి యయుస్స్మరణాత్।
స్త్రియ ఉరగేంద్రభోగభుజదండవిషక్తధియో
వయమపి తే సమాస్సమదృశోఽంఘ్రిసరోజసుధాః ॥ 23

నిభృతమరుత్-మనః-అక్షదృఢయోగయుజః= నియమించబడిన శ్వాస, మనస్సు, ఇంద్రియములు గల దృఢమైన యోగమును అభ్యసించే, మునయః= మహర్షులు, హృది= హృదయమునందు, యత్= దేనిని, ఉపాసతే= ఉపాసించుచున్నారో, తత్= దానిని, అరయః అపి= శత్రువులు

కూడ, స్మరణాత్= స్మరించుట వలన, యయుః= పొందిరి, ఉరగ-ఇంద్ర భోగభుజదండవిషక్తధియఃశేషనాగుని దేహమువంటి భుజదండముల యందు లగ్నమైన బుద్ధి గల, స్త్రియఃగోపికలు, అంఘ్రిసరోజసుధాః = పద్మములవంటి పాదములను బాగా ధ్యానించే, వయం అపి= మేము కూడ, సమదృశఃసమదృష్టి గల, తే= నీకు, సమాఃసమానులము.

శ్వాస, మనస్సు, ఇంద్రియములను నియమించి దృఢముగా యోగము నభ్యసించే మహర్షులు ఏ తత్త్వమును హృదయములో ధ్యానించెదరో, అదే తత్త్వమును నీ శత్రువులు కూడ నిన్ను స్మరించి పొందిరి. శేషనాగుని దేహమును పోలిన దండమువంటి నీ భుజములపై తగుల్కొన్న చిత్తము గల గోపికలు, నీ పద్మమువంటి పాదములను బాగా ధారణ చేసే మేము (శ్రుతిదేవతలు) కూడ సమదర్శనము గల నీకు సమానులమే.

క ఇహ ను వేద బతావరజన్మలయోఽగ్రసరం
యత ఉదగాదృషిర్యమను దేవగణా ఉభయే ।
తర్హి న సన్న చాసదుభయం న చ కాలజవః
కిమపి న తత్ర శాస్త్రమవకృష్య శయీత యదా ॥24

బత= ఆహా!, అగ్రసరమ్= అగ్రేసరుడవగు నిన్ను, ఇహ= ఈ జగత్తునందు, అవరజన్మలయఃతరువాత పుట్టి గిట్టే, కఃను= ఎవడు, వేద= తెలియును?, యతఃఏ నీనుండి, ఋషిఃబ్రహ్మదేవుడు, ఉదగాత్= ఆవిర్భవించెనో, యం అను= ఎవనిని అనుసరించి, దేవగణాః = దేవగణములు, ఉభయే= రెండు, యదా= ఎప్పుడైతే, అవకృష్య= ఉపసంహరించి, శయీత= నిద్రించెదవో, తర్హి= అప్పుడు, సత్= స్థూలము, న= ఉండదు, అసత్ చ= సూక్ష్మము కూడ, న= ఉండదు, ఉభయమ్= స్థూలసూక్ష్మములనుండి పుట్టిన దేహము, కాలజవఃచ=

కాలముయొక్క వేగము కూడ, న= ఉండవు, తత్ర= ఆ ప్రళయమునందు, కిం అపి= ఏదీ కూడ, శాస్త్రమ్= వేదము, న= ఉండదు.

ఆహా! జగత్తు (సృష్టి) నకు పూర్వమే నీవు సిద్ధించి యున్నావు. సృష్టి తరువాత ఈ జగత్తులో పుట్టి గిట్టే ఎవడు నిన్ను తెలియగల్గును? నీనుండి బ్రహ్మదేవుడు ఆవిర్భవించెను. ఆయననుండి నివృత్తిప్రధానులగు సనకాదులు, ప్రవృత్తి ప్రధానులగు మరీచ్యాదులు అనే రెండు దేవగణములు ఆవిర్భవించినవి. ఎప్పుడైతే నీవు సర్వమును ఉపసంహరించి నిద్రించెదవో, అప్పుడు స్థూల పంచభూతములు గాని, సూక్ష్మములగు మహదాది తత్త్వములు గాని, ఆ రెండింటి కలయికయగు దేహము గాని, కాలము యొక్క వేగము గాని, ఏదీ లేదు. అప్పుడు వేదము కూడ ఉండదు.

జనిమసతస్తో మృతిముతాత్మని యే చ భిదాం
విపణమృతం స్మరంత్యుపదిశంతి తే ఆరుపిత్రైః ।
త్రిగుణమయః పుమానితి భిదా యదబోధకృతా
త్వయి న తతః పరత్ర స భవేదవబోధరసే ॥ 25

యే చ= ఎవరైతే, అసతః= లేనిదాని, జనిమ్= పుట్టుకను, సతః = ఉన్నదాని, మృతిమ్= మరణమును, ఆత్మని= ఆత్మయందు, భిదామ్= భేదమును, ఉత= మరియు, విపణమ్= వ్యవహారమును, ఋతమ్= సత్యమునుగా, స్మరంతి= బోధించెదరో, తే= వారు, ఆరుపిత్రైః= భ్రమలచే, ఉపదిశంతి= ఉపదేశించుచున్నారు, యత్= ఎందువలనైతే, పుమాన్= జీవుడు, త్రిగుణమయః= సత్త్వరజస్తమోగుణాత్మకుడు, ఇతి= అనే కారణముగా, త్వయి= నీయందు, భిదా= భేదము, అబోధకృతా= అజ్ఞాన కల్పితము, తతః= ఆ అజ్ఞానము కంటె, పరత్ర= అతీతమైన, అవబోధరసే= చిదానందస్వరూపమునందు, సః= ఆ అజ్ఞానము, న భవేత్= ఉండదు.

ఎవరైతే సృష్టికి ముందు లేని జగత్తునకు పుట్టుకను (వైశేషికులు), ఉన్న జగత్తుయొక్క వినాశమును (నైయాయికులు), ఆత్మయందు భేదమును (సాంఖ్యులు), వ్యవహారమునందు సత్యత్వమును (కర్మవాదులు) బోధించెదరో, వారు భ్రమలచే మాత్రమే ఉపదేశించుచున్నారు. జీవుడు సత్త్వరజస్తమోగుణాత్మకుడు గావున ఆత్మయందు భేదము గలదు అనే కల్పన అజ్ఞానమునుండి పుట్టినది. నీవు అజ్ఞానమునకు అతీతమైన చిదానందఘనుడవు. నీయందు ఆ అజ్ఞానమునకు ఉనకి లేదు.

సదివ మనస్త్రివృత్త్వయి విభాత్యసదామనుజాత్ ।
సదభిమృశంత్యశేషమిదమాత్మతయాఽఽత్మవిదః ।
న హి వికృతిం త్యజంతి కనకస్య తదాత్మతయా
స్వకృతమనుప్రవిష్టమిదమాత్మతయాఽవసితమ్ ॥26

ఇదమ్= ఈ, ఆ మనుజాత్= మానవుని వరకు ఉన్న, త్రివృత్= సత్త్వ రజస్తమోగుణాత్మకమగు జగత్తు, అసత్= మిథ్య, మనః= మనస్సే, త్వయి= నీయందు, సత్ ఇవ= ఉన్నది వలె, విభాతి= ప్రకాశించుచున్నది, ఆత్మ విదః= ఆత్మజ్ఞానులు, ఇదమ్= ఈ, అశేషమ్= సర్వమును, ఆత్మతయా= ఆత్మరూపముగా, సత్= ఉన్నది అని, అభిమృశంతి= తెలియుదురు, హి= ఏలయన, కనకస్య= బంగారముయొక్క, వికృతిమ్= వికారమును, తద్-ఆత్మతయా= అది స్వరూపమగుటచే, న త్యజంతి= విడిచిపెట్టరు, స్వకృతమ్= నీచే చేయబడిన, ఇదమ్= ఈ జగత్తు, అనుప్రవిష్టమ్= ప్రవేశించిన జీవరూపము, ఆత్మతయా= ఆత్మరూపముగా, అవసితమ్= నిశ్చితము.

సత్త్వరజస్తమోగుణాత్మకమగు ఈ జగత్తు (దృశ్యము), మానవుని వరకు దీనిని తెలుసుకొనే జీవుడు (అహంకారము, ద్రష్ట) అనే భేదము కేవలము మనోవిలాసము మాత్రమే. ఈ భేదము వాస్తవముగా

లేకున్ననూ, (అధిష్ఠానమైన) సద్వస్తువగు నీయందు ఉన్నది వలె భాసించుచున్నది. ఆత్మజ్ఞానులు ఈ సర్వము (ద్రష్ట-దృశ్యము) ను ఆత్మరూపముగా తెలియుదురు. జనులు బంగరు నగను అది వాస్తవములో బంగారము కనుకనే విడిచిపెట్టరు. నీచే చేయబడిన దృశ్యజగత్తు, దానిలో జీవరూపముగా ప్రవేశించి భాసించే ద్రష్ట అనే సర్వము ఆత్మయేనని జ్ఞానులు నిశ్చయించిరి.

తవ పరి యే చరంత్యఖిలసత్త్వనికేతతయా
త ఉత పదాఽఽక్రమంత్యవిగణయ్య నిరృతేః ।
పరివయసే పశూనివ గిరా విబుధానపి తాన్
త్వయి కృతసౌహృదాః ఖలు పునంతి న యే విముఖాఃII 27

యే= ఎవరైతే, అఖిలసత్త్వనికేతతయా= సకలప్రాణులకు నివాసస్థానము గలవాని రూపముగా, తవ= నీకు, పరిచరంతి= సేవించెదరో, తే ఉత= వారు మాత్రమే, నిరృతేః= మృత్యువుయొక్క, శిరః= తలను, అవిగణయ్య= లెక్క చేయకుండా, పదా= కాలితో, ఆక్రమంతి= ఆక్రమించెదరు, తాన్= ఆ, విబుధాన్ అపి= పండితులను కూడ, గిరా= విధిరూపమైన వాక్కుతో, పశూన్ ఇవ= పశువులను వలె, పరివయసే= బంధించుచున్నావు, త్వయి= నీయందు, కృతసౌహృదాః = చేయబడిన ప్రేమ గలవారు, పునంతి ఖలు= పావనము చేయుదురు గదా!, యే= ఎవరైతే, విముఖాః= ప్రేమ లేనివారో వారు, న= చేయరు.

సకలప్రాణులు (పదార్థములు) నీయందే మనుగడను కలిగియున్నవి. అట్టి నిన్ను ఎవరైతే (సర్వాత్మభావముతో) సేవించెదరో, వారు లెక్క లేకుండా మృత్యువుయొక్క తలపై పాదమును పెట్టెదరు (మృత్యువును జయించెదరు). నిన్ను ప్రేమించని వారు విద్వాంసులే కావచ్చును. నీవు వారిని విధివాక్యములతో పశువులను వలె (కర్మసూత్రముచే) బంధించె

దవు. కాని, నిన్ను ప్రేమించువారు ఇతరులను కూడ పావనము చేయుదురు. నీయందు ప్రేమ లేనివారు పావనము చేయుట అసంభవము.

త్వమకరణస్స్వరాధఖిలకారకశక్తిధరః
తవ బలిముద్వహంతి సమదంత్యజయాఽనిమిషాః ।
వర్షభుజోఽఖిలక్షితిపతేరివ విశ్వసృజో
విదధతి యత్ర యే త్వధికృతా భవతశ్చకితాః ॥ 28

స్వరాట్= స్వయంప్రకాశుడవైన, త్వమ్= నీవు, అకరణః= ఇంద్రియములు లేనివాడవు, అఖిలకారక శక్తిధరః= సకలప్రాణుల ఇంద్రియశక్తులను నిలబెట్టువాడవు, అజయా= పుట్టుక లేని మాయా-శక్తిచే, విశ్వసృజః= ప్రజాపతులు, అనిమిషాః= దేవతలు, అఖిలక్షితిపతేః = మహామండలేశ్వరునకు, వర్షభుజః ఇవ= మండలాధిపతులు వలె, తవ= నీకు, బలిమ్= పూజను, ఉద్వహంతి= సమర్పించెదరు, సమదంతి= భుజించెదరు, యత్ర= దేనియందు, యే తు= ఎవరైతే, అధికృతాః= నియోగించబడినవారో వారు, భవతః= నీవలన, చకితాః = భయపడిన వారై, విదధతి= నిర్వర్తించెదరు.

స్వయంప్రకాశుడవగు నీకు ఇంద్రియములు లేకున్ననూ, సకల ప్రాణుల ఇంద్రియశక్తులను నిలబెట్టేది నీవే. మాయాశక్తికి పశువైయుండే ప్రజాపతులు, దేవతలు, మహామండలేశ్వరునకు మండలాధిపతులు వలె, నీకు పూజను సమర్పించెదరు. మానవులు అర్పించే హవ్యాదులను వారు తాము కూడ భోగించెదరు. ఆయా జగత్కార్యములయందు నియోగించ బడిన సూర్యాదులు నీకు భయపడి తమ కార్యములను అనుష్ఠించెదరు.

స్థిరచరజాతయస్స్వరజయోత్థనిమిత్తయుజో
విహర ఉదీక్షయా యది పరస్య విముక్త తతః ।
న హి పరమస్య కశ్చిదపరో న పరశ్చ భవేద్
వియత ఇవాపదస్య తవ శూన్యతులాం దధతః ॥29

విముక్త= ఓ నిత్యముక్తా!, తతః= ఆ మాయాశక్తికంటె, పరస్య= అతీతుడవగు నీకు, అజయా= మాయాశక్తిచే, విహరః యది= విహారము కలిగినచో, ఉదీక్షయా= సంకల్పముచే, ఉత్థనిమిత్తయుజః= పుట్టిన లింగశరీరములు గల, స్థిరచరజాతయః= అచర చర ప్రాణులు, స్యుః= కలుగును, వియతః ఇవ= ఆకాశమునకు వలె, అపదస్య= గోచరము కానట్టియు, శూన్యతులామ్= శూన్యముతో పోలికను, దధతః= కలిగియుండే, పరమస్య= పరమాత్మవగు, తవ= నీకు, కశ్చిత్= ఎవ్వడైననూ, అపరః= తనవాడు, న హి= లేడు గదా!, పరః చ= పరాయి వాడైననూ, న భవేత్= ఉండడు.

ఓ దేవా! నీవు నిత్యముక్తుడవు, మాయాశక్తికి ఆతీతుడవు. మాయాశక్తితోడి సంసర్గముచే నీకు విహరించే యిచ్ఛ కలిగినప్పుడు, సంకల్ప మాత్రముచే లింగశరీరములు (సుప్తములైన కర్మవాసనలు) ఉద్బుద్ధములై, చరాచరప్రాణులు ఉత్పన్నమగును. ఆకాశము వలె నీవు వాక్కునకు, మనస్సునకు గోచరము కావు గనుక, నీకు శూన్యముతో పోలిక మాత్రము గలదు. పరమాత్మవగు నీకు నీవాడు గాని, పరాయివాడు గాని లేడు.

అపరిమితా ధ్రువాస్తనుభృతో యది సర్వగతాః
తర్హి న శాస్యతేతి నియమో ధ్రువ నేతరథా ।
అజని చ యన్మయం తదవిముచ్య నియంతృ భవేత్
సమమనుజానతాం యదమతం మతదుష్టతయా ॥30

ధ్రువ= నిత్యుడా!, తనుభృతః= దేహధారులు, అపరిమితాః= సర్వవ్యాపకులు (అసంఖ్యాకులు), ధ్రువాః= నిత్యులు, యది= అయ్యే పక్షములో, తర్హి= అప్పుడు, శాస్యతా= శాసించబడుట, ఇతి= అనే, నియమః= నియమము, న= ఉండదు, ఇతరథా= అట్లు గానిచో, న=

కాదు, యత్-మయమ్= ఏది ఉపాదానముగా, అజని= పుట్టినదో, తత్= ఆ కారణము, అవిముచ్య= విడిచి పెట్టకుండా, నియంతృ= నియామకము, భవేత్= అగును, యత్= ఏ కారణము, సమమ్= సమమో, అనుజాన-తామ్= తెలిసినవారికి, మతదుష్టతయా= తెలియబడేది అవస్తువు అగుటచే, అమతమ్= తెలియబడలేదు.

ఓ దేవా! నీవు నిత్యుడవు. అసంఖ్యాకులగు జీవులు సర్వవ్యాపకులు, నిత్యులు అయ్యే పక్షములో, వారిని ఈశ్వరుడు శాసించుననే నియమము పొసగదు. జీవులు పరిచ్ఛిన్నులు, పుట్టి గిట్టువారు అనే పక్షములో మాత్రమే వారు ఈశ్వరునిచే శాసించబడెదరు. కార్యము కారణముతో నిండియే పుట్టును. కారణము కార్యములో అనువృత్తమై కార్యమును శాసించును. అదే విధముగా, పరబ్రహ్మ జగత్తులో అనుస్యూతమై జగత్తును నియమించును. ఈ విధముగా సర్వజగత్తునందు సమమై యున్న పరబ్రహ్మ బుద్ధిగోచరము కాదు. ఏది బుద్ధిగోచరమో అది సత్యవస్తువు కాదు. కావున, మేము బ్రహ్మను తెలిసితిమని తలపోయు వారు తెలిసినవారు కారు.

న ఘటత ఉద్భవః ప్రకృతిపూరుషయోరజయోః
ఉభయయుజా భవంత్యసుభృతో జలబుద్బుదవత్ ।
త్వయి త ఇమే తతో వివిధనామగుణైః పరమే
సరిత ఇవార్ణవే మధుని లిల్యురశేషరసాః ॥ 31

అజయోః= పుట్టుక లేని, ప్రకృతిపూరుషయోః= ప్రకృతిపురుషులకు, ఉద్భవః= పుట్టుక, న ఘటతే= ఘటిల్లదు, ఉభయయుజా= రెండింటి కలయికచే, అసుభృతః= ప్రాణులు, జలబుద్బుదవత్= నీటి బుడగలు వలె, భవంతి= పుట్టుచున్నవి, తతః= అందువలన, తే= ఆ, ఇమే= ఈ జీవులు, వివిధనామగుణైః= వేర్వేరు నామములతో గుణములతో, పరమే=

పరమకారణమగు, త్వయి= నీయందు, సరితః= నదులు, అర్ణవే= సముద్రమునందు, అశేషరసాః= సకలరసములు, మధుని ఇవ= తేనెయందు వలె, లిల్యుః= విలీనమైనవి.

ప్రకృతికి పుట్టుక లేదు, పురుషునకు పుట్టుక లేదు. కాని, ఆ రెండింటి కలయిక (అన్యోన్యాధ్యాస) చే ప్రాణులు, నీరు గాలితో కలిసి బుడగలు పుట్టినట్లుగా, వివిధములైన పేర్లతో గుణములతో పుట్టుచున్నవి. అందు వలన ఆ ఈ ప్రాణులు, పరమకారణమగు నీయందు, నదులు సముద్రము నందు వలె, సకలపుష్పరసములు తేనెయందు వలె, విలీన-మగును.

నృషు తవ మాయయా భ్రమమమీష్వవగత్య భృశం
త్వయి సుధియోఽభవే దధతి భావమనుప్రభవమ్ ।
కథమనువర్తతాం భవభయం తవ యద్భ్రుకుటిః
సృజతి ముహుస్త్రినేమిరభవచ్ఛరణేషు భయమ్ ॥32

అమీషు= ఈ, నృషు= మానవులయందు, తవ= నీ, మాయయా= మాయచే, భృశమ్= అధికమైన, (అనుప్రభవమ్ – ప్రతిక్షణము వర్ధిల్లే,) భ్రమమ్= భ్రమను, అవగత్య= గుర్తించి, సుధియః= మంచి వివేకము గలవారు, అభవే= పుట్టుక లేని, త్వయి= నీయందు, అనుప్రభవమ్= ప్రతిక్షణము వర్ధిల్లే, భావమ్= ప్రేమను, దధతి= చేయుదురు, అనువర్తతామ్= శరణు జొచ్చినవారలకు, భవభయమ్= సంసార భయము, కథమ్= ఎట్లు?, యత్= ఏలయన, తవ= నీ, భ్రుకుటిః= కనుబొమల ముడియైన, త్రినేమిః= మూడు ధారలు గల కాలము, అభవత్-శరణేషు= నిన్ను శరణు వేడనివారియందు, ముహుః= మరల మరల, భయమ్= భయమును, సృజతి= కలిగించుచున్నది.

ఈ మానవులలో నీ మాయచే అధికమైన భ్రమ ఉన్నది. ఆ భ్రమ నిరంతరముగా పెరుగుచుండును. మంచి వివేకము గలవారు ఈ విషయమును గుర్తించి, పుట్టుక లేని నీయందు ప్రతి క్షణము వర్ధిల్లే ప్రేమను చేసెదరు. నిన్ను శరణు జొచ్చువారలకు సంసారభయమెట్లు ఉండును? (ఉండదు). ఏలయన, చలి, వేడి, వర్షము అనే మూడు భాగములు గల సంవత్సరరూపియగు కాలము నీ కనుబొమల విలాస మాత్రమే. అట్టి కాలము నిన్ను శరణాగతి చేయనివారికి మాత్రమే మరల మరల భయమును కలిగించును.

విజితహృషీకవాయుభిరదాంతమనస్తురగం
య ఇహ యతంతి యంతుమతిలోలముపాయఖిదః ।
వ్యసనశతాన్వితా స్సమవహాయ గురోశ్చరణం
వణిజ ఇవాజ సంత్యకృతకర్ణధరా జలధౌ ॥ 33

అజ= పుట్టుక లేనివాడా!, గురోః= గురువుయొక్క, చరణమ్= పాదమును, సమవహాయ= ఆశ్రయించకుండా, యే= ఎవరైతే, అతిలోలమ్= మిక్కిలి చంచలమైనట్టియు, విజితహృషీకవాయుభిః= జయించబడిన ఇంద్రియములు శ్వాస గల యోగులచే, అదాంతమ్= నిగ్రహించబడని, ఇంద్రియములు శ్వాస గల యోగులచే, అదాంతమ్= నిగ్రహించబడని, మనః-తురగమ్= మనస్సునే గుర్రమును, యంతుమ్= నిగ్రహించుటకు, యతంతి= ప్రయత్నించెదరో వారు, ఉపాయఖిదః= ఉపాయములయందు ఖేదమును పొందువారు, వ్యసనశత-అన్వితాః= వందలాది దుఃఖములతో కూడినవారు, ఇహ= ఈ సంసారమునందు, జలధౌ= సముద్రమునందు, అకృతకర్ణధరాః= స్వీకరించబడని నావికుడు గల, వణిజః ఇవ= వర్తకులు వలె, సంతి= ఉండెదరు.

మనస్సనే గుర్రము చాల చంచలమైనది. ఇంద్రియములను, శ్వాసను జయించిన యోగులు కూడ దానిని నిగ్రహించుట కష్టము. ఎవరైతే గురువును ఆశ్రయించకుండా, అట్టి మనస్సును నిగ్రహించుటకు ప్రయత్నిస్తారో, అట్టివారు సాధనలయందు ఖేదమునే పొందెదరు. వారీ సంసారములో, నావికుని స్వీకరించని వర్తకులు సముద్రమునందు వలె, వందలాది దుఃఖములను పొందుచుందురు.

స్వజనసుతాత్మదారధనధామధరాఽసురథైః
త్వయి సతి కిం నృణాం శ్రయత ఆత్మని సర్వరసే ।
ఇతి సదజానతాం మిథునతో రతయే చరతాం
సుఖయతి కో న్విహ స్వవిహతే స్వనిరస్తభగే ॥ 34

నృణామ్= మానవులలో, శ్రయతః= ఆశ్రయించువానికి, సర్వరసే= సకలసుఖములు కలిగిన, ఆత్మని= ఆత్మయగు, త్వయి= నీవు, సతి= ఉంటూండగా, స్వజనసుత-ఆత్మదారధనధామధరా-అసురథైః= తన బంధువులు సంతానము దేహము భార్య ధనము ఇల్లు భూమి ప్రాణములు రథములతో, కిమ్= పని యేమి?, ఇతి= అనే, సత్= సత్యమును, అజానతామ్= తెలియని వారలకు, మిథునతః= జత గట్టుట వలన, రతయే= భోగము కొరకు, చరతామ్= ప్రవర్తిల్లు వారికి, స్వవిహతే= స్వతః వినాశశీలము కలిగినట్టియు, స్వనిరస్తభగే= స్వతః తొలగిన భాగ్యము గల, ఇహ= ఈ సంసారమునందు, కః ను= ఎయ్యది, సుఖయతి= సుఖమునిచ్చును?

నీవు సకలసుఖముల నిధియగు ఆత్మవు. మానవులలో ఎవరైతే నిన్ను ఆశ్రయించెదరో, వారికి నీవే తోడై ఉండగా, తన వారు, సంతానము, దేహము, భార్య, ధనము, ఇల్లు, భూమి, ప్రాణములు, భోగసాధనములు అనువాటితో పని యేమి గలదు? (ఏమీ లేదు).

జనులీ సత్యమును తెలియలేక స్త్రీపురుషుల జతగట్టుటలో సుఖము గలదని భావించి భోగలాలసులై ప్రవర్తిల్లెదరు. ఈ సంసారము తనంత తానే నశించును. దానిలో స్వతహాగానే భాగ్యము లేదు. అట్టి సంసారములో ఎయ్యది వారికి సుఖమునీయగల్గును? (ఏదీ ఈయలేదు).

భువి పురుపుణ్యతీర్థసదనాన్యృషయో విమదాః
త ఉత భవత్పదాంబుజహృదోఽఘభిదంఘ్రిజలాః ।
దధతి సకృన్మనస్త్వయి య ఆత్మని నిత్యసుఖే
న పునరుపాసతే పురుషసారహరావసథాన్ ॥ 35

ఋషయః= మహర్షులు, విమదాః= తొలగిన గర్వము గలవారు, భవత్-పద-అంబుజహృదః= నీ పద్ములవంటి పాదములయందు హృదయము గలవారు, అఘభిద్-అంఘ్రిజలాః= పాపములను పోగొట్టే పాదజలములు గలవారు, తే ఉత= వారు కూడా, భువి= భూలోకము నందు, పురుపుణ్యతీర్థసదనాని= గొప్ప పవిత్రములైన తీర్థములు క్షేత్రములు, యే= ఎవరైతే, ఆత్మని= ఆత్మవైనట్టియు, నిత్యసుఖే= నిత్యానందుడవగు, త్వయి= నీయందు, సకృత్= ఒక్కసారి, మనః= మనస్సును, దధతి= నిలిపెదరో, తే= వారు, పునః= మరల, పురుష సారహర-ఆవసథాన్= వ్యక్తియొక్క సారమును హరించివేసే గృహమును, న ఉపాసతే= సేవించరు.

గర్వము తొలగిన మహర్షులు నీ పద్ములవంటి పాదములనే హృదయములో ధ్యానించెదరు. వారి పాదముల నీరు పాపములను పోగొట్టును. భూలోకములో వారు కూడ గొప్ప పవిత్రమైన తీర్థములు, క్షేత్రములు వంటివారే. నీవు నిత్యానందమగు ఆత్మవు. ఎవరైతే ఒక్కసారి మనస్సును నీపై నిలిపెదరో వారు మరల గృహములయందలి (దేహము వలని) భోగములను సేవించరు. ఆ భోగములు వ్యక్తియొక్క సారము (వివేకము) ను హరించి వేయును.

సత ఇదముత్థితం సదితి చేన్నను తర్కహతం
వ్యభిచరతి క్వ చక్వ చ మృషా న తథోభయయుక్ ।
వ్యవహృతయే వికల్ప ఇషితోఽధపరంపరయా
భ్రమయతి భారతీ త ఉరువృత్తిభిరుక్థజడాన్ ॥ 36

సతః= ఉన్నదానినుండి, ఉత్థితమ్= పుట్టిన, ఇదమ్= ఈ జగత్తు, సత్= ఉన్నది, ఇతి చేత్= అన్నచో, నను= నిశ్చయముగా, తర్కహతమ్= విచారముచే బాధితము, క్వ చ= అక్కడక్కడ, వ్యభిచరతి= విరుద్ధముగా నున్నది, క్వ చ= ఇంకో చోట, మృషా= మిథ్య, తథా= మరియు, ఉభయయుక్= రెండింటితో కూడినది, న= కాదు, వ్యవహృతయే= వ్యవహారము కొరకు, అంధపరంపరయా= అజ్ఞానుల పరంపరచే, వికల్పః = భ్రమ, ఇషితః= సమ్మతమే, తే= నీ, భారతీ= వాక్కు, ఉరువృత్తిభిః= అనేకములగు వృత్తులచే, ఉక్థజడాన్= కర్మజడులను, భ్రమయతి= భ్రమింప జేయుచున్నది.

జగత్కారణమగు బ్రహ్మ సత్ (ఉన్నది). బంగారమునుండి పుట్టిన నగ బంగరుదే. అదే విధముగా, సద్బ్రహ్మనుండి పుట్టిన జగత్తు కూడ సత్. ఈ జగత్సత్యత్వవాదము విచారము ముందు నిలబడదు. ఈ వాదమునకు విరోధములు అనేకము గలవు. ఉదాహరణకు, తండ్రినుండి పుట్టినవాడు తండ్రికంటె భిన్నుడు. ఇంతేగాక, త్రాడును చూచి పాము అని భ్రమపడిన సందర్భములో పాము త్రాడునుండి ఆవిర్భవించినా, పాము అసత్ (మిథ్య), త్రాడు సత్యము. మరియు, జగత్తు సద్-అసత్ అని చెప్పుట పొసగదు. ఎందుకంటే, సత్, అసత్ లు పరస్పర విరుద్ధములు ఒకే చోట సమావేశమగుట అసంభవము. వ్యవహారము సిద్ధించుచున్నది గనుక జగత్తు సత్యమని చెప్పుటయు పొసగదు. ఎందుంకటే, వ్యవహారము భ్రమ వలన కూడ సిద్ధించును. సత్యము కాని సినిమా వినోదమునిచ్చుచున్నది గదా! పూర్వపూర్వమగు అజ్ఞానము

(భ్రమ) ఉత్తరోత్తర భ్రమకు హేతువగుచుండును. ఈ విధముగా అజ్ఞాన పరంపరచే భ్రమ సిద్ధించును. కాబట్టి, ఇవి జగత్తునకు సత్యత్వమునీయ గలిగే హేతువులు కాదు. ఓ ఈశ్వరా! నీ వేదరూపమగు వాక్కు ముఖ్యార్థము-అముఖ్యార్థము మొదలగు విభిన్నములైన అర్థనిర్ణయ ప్రక్రియలతో జనులను భ్రమింపజేయుచున్నది. స్వరాదిఫలములనిచ్చే కర్మల బరువు క్రింద నలిగే జనులు జడులై ఆత్మతత్త్వమును తెలియకున్నారు.

న యదిదమగ్ర ఆస న భవిష్యదతో నిధనాత్ ।
అను మితమంతరా త్వయి విభాతి మృషైకరసే ।
అత ఉపమీయతే ద్రవిణజాతివికల్పపథైః
వితథమనోవిలాసమృతమిత్యవయంత్యబుధాః ॥ 37

యత్-ఎందువలనైతే, ఇదమ్= ఈ జగత్తు, అగ్రే= సృష్టికి ముందు, న ఆస= లేకుండెనో, నిధనాత్ అను= ప్రళయముకంటె తరువాత, న భవిష్యత్= ఉండబోదో, అతః= ఇందువలన, అంతరా= స్థితియందు, ఏకరసే= ఏకరూపుడవగు, త్వయి= నీయందు, మృషా= లేకున్ననూ, విభాతి= భాసించుచున్నదని, మితమ్= నిశ్చయించబడినది, అతః= ఇందువలన, ద్రవిణజాతివికల్పపథైః= ద్రవ్యజాతులయొక్క భేదముల ప్రకారములతో, ఉపమీయతే= పోల్చబడుచున్నది, వితథమనః-విలాసమ్= మిథ్యను మనస్సుయొక్క కల్పనను, ఋతమ్= సత్యము, ఇతి= అని, అబుధాః= అజ్ఞానులు, అవయంతి= తలపోయుచున్నారు.

ఈ జగత్తు సృష్టికి పూర్వమునందు లేదు, ప్రళయము తరువాత ఉండదు. కాబట్టి, స్థితికాలమునందు కూడ ఇది అద్వితీయుడవగు నీయందు లేకున్ననూ ఉన్నట్లు భాసించుచున్నదనేది నిశ్చితము. ఇందు-వలననే, మట్టియందు కుండ, బంగారమునందు ఆభరణము, లోహము-నందు పనిముట్టు మొదలగునవి ఆయా ద్రవ్యములయందు కల్పించ-బడిన నామరూపములు మాత్రమేనని వాటిని జగన్మిథ్యాత్వమునకు

దృష్టాంతములుగా శ్రుతులు నిరూపించుచున్నవి. మిథ్య, మనస్సుయొక్క కల్పన అగు ఈ జగత్తును అజ్ఞానులు సత్యమని తలపోయుదురు.

స యదజయా త్వజామనుశయీత గుణాంశ్చ జుషన్
భజతి సరూషతాం తదను మృత్యుమపేతభగః ।
త్వముత జహాసి తామహిరివ త్వచమాత్తభగో
మహసి మహీయసేఽష్టగుణితేఽపరిమేయభగః ॥38

యత్= ఎందువలనైతే, సః తు= ఆ జీవుడైతే, అజయా= అవిద్య (మాయ) చే, అజామ్= అవిద్యను, అనుశయీత= ఆలింగనము చేసుకొనునో, గుణాన్ చ= గుణకార్యములను, జుషన్= సేవించువాడై, సరూపతామ్= వాటి ధర్మములతో సంయోగమును, తదను= తరువాత, అపేతభగః= తొలగిన జ్ఞానానందములు గలవాడై, మృత్యుమ్= సంసారమును, భజతి= పొందునో, త్వం ఉత= నీవైతే, ఆత్తభగః= నిత్యసిద్ధమైన జ్ఞానానందములు గలవాడవై, అపరిమేయభగః= పరిచ్ఛిన్నము కాని షడ్గుణసంపద గలవాడవు, తామ్= ఆ మాయను, అహిః= పాము, త్వచం ఇవ= కుబుసమును వలె, జహాసి= విడిచెదవు, అష్టగుణితే= అణిమ మొదలైన అష్టసిద్ధులు గల, మహసి= ఆనంద స్వరూపమునందు, మహీయసే= విరాజిల్లుచున్నావు.

ఆ జీవుడైతే అజ్ఞానముచే (మాయచే మోహితుడై) అవిద్యాకార్యములగు దేహాదులతో తాదాత్మ్యమును పొంది, గుణకార్యములగు దేహాదులతో తాదాత్మ్యమును పొంది, గుణకార్యములగు దేహాదులయందు రమించును. అందువలన, జీవుడు జ్ఞానానందములను కోల్పోయి దేహాదుల ధర్మములైన జన్మమరణములను పొంది సంసారమును పొందును. కాని, నీవు నిత్యసిద్ధమైన జ్ఞానానందములు, అనంతమైన ఐశ్వర్య-వీర్య-యశః-శ్రీ-జ్ఞాన-వైరాగ్యములు గలవాడవు. పాము

కుబుసమును వలె నీవు మాయను విడిచిపెట్టి అణిమ మొదలైన అష్టసిద్ధులతో కూడిన ఆనందస్వరూపమునందు విరాజిల్లుచున్నావు.

యది న సముద్ధరంతి యతయో హృది కామజటా
దురధిగమోఽసతాం హృది గతోఽస్మృతకంఠమణిః ।
అసుతృపయోగినాముభయతోఽప్యసుఖం భగవన్
అనపగతాంతకాదనధిరూఢపదాద్భవతః ॥ 39

భగవన్= ఓ భగవానుడా!, యతయః= సాధకులు, హృది= హృదయమునందలి, కామజటాః= కోరికల గుట్టలను, యది న సముద్ధరంతి= పెకిలించి పారవేయకపోయినచో, అసతామ్= ఆ అయోగ్యులకు, హృది= హృదయమునందు, గతః= ఉన్నవాడవు, దురధిగమః= పొంద శక్యము కానివాడవు, అస్మృతకంఠమణిః= విస్మరించబడిన కంఠమునందలి మణివి, అసుతృపయోగినామ్= ఇంద్రియభోగములయందు రమించే సాధకులకు, ఉభయతః అపి= రెండు వైపులనుండి కూడ, అసుఖమ్= దుఃఖము, అనపగత-అంతకాత్= తొలగిపోని మృత్యువునుండి, అనధిరూఢపదాత్= పొందబడని స్వరూపము గల, భవతః= నీనుండి.

ఓ భగవానుడా! సాధకులు హృదయమునందలి కామవాసనల గుట్టలను పెకిలించి పారవేయవలెను. వారు అట్లు చేయనిచో, నీవు హృదయమునందే ఉన్ననూ, విస్మరించబడిన మెడయందలి మణి వలె, పొంద శక్యము కానివాడవగుదువు. ఇంద్రియభోగములయందు రమించే సాధకులకు ఒకవైపు మృత్యుభయము తొలగిపోకుండుటయే గాక, రెండవ వైపు నీ స్వరూపమును తెలియకుండుటచే, నీనుండి కూడ పాపములకు శిక్ష అనే భయము (దుఃఖము) నిలిచియే యుండును.

త్వదవగమీ న వేత్తి భవదుత్థశుభాశుభయోః
గుణవిగుణాన్వయాంస్తర్హి దేహభృతాం చ గిరః ।
అనుయుగమన్వహం సగుణ గీతపరంపరయా
శ్రవణభృతో యతస్త్వమపవర్గగతిర్మనుజైః । 40

సగుణ= ఓ గుణములు గలవాడా!, త్వద్–అవగమీ= నిన్ను తెలుసుకున్నవాడు, భవద్–ఉత్థశుభ– అశుభయోఃౖ= నీనుండి పుట్టే మంచి చెడులయొక్క, గుణవిగుణ–అన్వయాన్= సుఖదుఃఖసంబంధములను, న వేత్తి= తెలియడు, తర్హి= అప్పుడు, దేహభృతామ్= దేహధారులయొక్క, గిరః చ= మాటలను కూడ, యతః= ఏలయన, అనుయుగమ్= ప్రతి యుగమునందు, గీతపరంపరయా= ఉపదేశముల పరంపరచే, మనుజైః = మానవులచే, అన్వహమ్= ప్రతిదినము, శ్రవణభృతః= శ్రవణముచే ధరించబడిన, త్వమ్= నీవు, అపవర్గగతిః= మోక్షమనే గతివి.

ఓ కల్యాణగుణాకరా! నిన్ను తెలుసుకున్న జ్ఞాని నీవు కర్మఫల రూపముగా ఇచ్చే సుఖదుఃఖముల భోగమును గాని, దేహాభిమానము గలవారికి ఉద్దేశించిన విధినిషేధములను గాని పట్టించుకోడు. అజ్ఞానుల నిందాస్తుతులతో ఆతనికి సంబంధము లేదు. ప్రతియుగమునందు నీ (జ్ఞానుల) ఉపదేశముల పరంపరను ప్రతిదినము శ్రవణము చేస్తూ నిన్ను హృదయమునందు నిలుపుకునే మానవులు మోక్షరూపముగా నిన్నే పొందెదరు.

ద్యుపతయ ఏవ తే న యయురంతమనంతతయా
త్వమపి యదంతరాండనిచయా నను సావరణాః ।
ఖ ఇవ రజాంసి వాంతి వయసా సహ యచ్ఛ్రుతయః
త్వయి హి ఫలంత్యతన్నిరసనేన భవన్నిధనాః ॥ 41

ద్యుపతయః ఏవ= స్వర్గాధిపతులు కూడ, తే= నీయొక్క, అంతమ్= స్వరూపమును, న యయుఃన= తెలియకుండిరి, అనంతతయా= అనంతమగుట వలన, త్వం అపి= నీవు కూడ, నను= ఆహా!, యద్-అంతరా= ఏ నీ మధ్యయందు, స-ఆవరణాఃన= ఆవరణలతో కూడిన, అండనిచయాఃన= బ్రహ్మాండముల సమూహములు, వయసాన= కాలముచే, ఖేన= ఆకాశమునందు, రజాంసి ఇవ= ధూళి కణములు వలె, సహ= కలిసియే, వాంతి= పరిభ్రమించుచున్నవో, యత్= ఎందువలనైతే, భవత్-నిధనాఃన= నీవే పర్యవసానముగా గల, శ్రుతయఃన= శ్రుతులు, అతత్-నిరసనేన= అనాత్మలను నిషేధించుటచే, త్వయి హి= నీయందే, ఫలంతి= సార్థకములగుచున్నవి.

స్వర్గాధిపతులు కూడ నీ అంతమును తెలియలేరు. అనంతుడవగుటచే నీవు కూడ నీ అంతమును తెలియలేవు. ఆహా! నీ మధ్యయందు పృథివీజలాది ఆవరణలతో కూడిన బ్రహ్మాండముల సమూహములు, ఆకాశములో ధూళికణములు వలె, కాలవేగముచే కలిసియే పరిభ్రమించుచున్నవి. నీవు అనంతుడవగుట వలననే, నీవే పర్యవసానముగా గల శ్రుతులు సాక్షాత్తుగా కాకుండా, అనాత్మలను నిషేధించి, నీయందు సఫలములగుచున్నవి.

శ్రీభగవానువాచ ।

ఇత్యేతద్బ్రహ్మణఃన పుత్రా ఆశ్రుత్యాత్మానుశాసనమ్ ।
సనందనమథానర్చుస్సిద్ధా జ్ఞాత్వాఒ ఒత్మనో గతిమ్ ॥ 42

శ్రీభగవాన్= శ్రీనారాయణ మహర్షి, ఉవాచ= పలికెను, బ్రహ్మణఃన= బ్రహ్మదేవుని, పుత్రాఃన= పుత్రులగు సనకాదులు, ఇతి= ఈ విధముగా, ఏతత్= ఈ, ఆత్మానుశాసనమ్= ఆత్మతత్త్వోపదేశమును, ఆశ్రుత్య= విని,

ఆత్మనః= ఆత్మయొక్క, గతిమ్= తత్త్వమును, జ్ఞాత్వా= సనందనుని, ఆనర్చుః= పూజించిరి.

శ్రీ నారాయణ మహర్షి ఇట్లు పలికెను...బ్రహ్మదేవుని పుత్రులగు సనకాదులు ఈ విధముగా ఈ ఆత్మతత్త్వోపదేశమును వినిరి. వారు ఆత్మతత్త్వమునెరింగి కృతార్థులై, అప్పుడు సనందనుని పూజించిరి.

ఇత్యశేషసమామ్నాయపురాణోపనిషద్రసః ।
సముద్ధృతః పూర్వజాతైర్వ్యోమయానైర్మహాత్మభిః ॥ 43

ఇతి= ఈ విధముగా, పూర్వజాతైః= పూర్వకాలీనులైనట్టియు, వ్యోమయానైః= ఆకాశమునందు సంచరించే, మహాత్మభిః= మహాత్ములచే, అశేషసమామ్నాయపురాణ-ఉపనిషద్-రసః= సకలవేదముల పురాణముల ఉపనిషత్తుల సారము, సముద్ధృతః= పైకి తీయబడినది.

ఈ విధముగా సృష్టికి ఆరంభములో పుట్టిన ఆకాశసంచారము చేసే సనకాది మహాత్ములు సకలవేదముల, పురాణముల, ఉపనిషత్తుల సారమును పైకి తీసి ఈ స్తుతిని అందించిరి.

త్వం చైతద్బ్రహ్మదాయాద శ్రద్ధయ్యాఽఽత్మానుశాసనమ్ ।
ధారయంశ్చర గాం కామం కామానాం భర్జనం నృణామ్ ॥44

బ్రహ్మదాయాద= బ్రహ్మపుత్రా!, త్వం చ= నీవైతే, నృణామ్= మానవుల, కామానామ్= కామనలకు, భర్జనమ్= దాహకమైన, ఏతత్= ఈ, ఆత్మానుశాసనమ్= ఆత్మతత్త్వోపదేశమును, ధారయన్= ధరించు వాడవై, కామమ్= యథేచ్ఛగా, గామ్= భూమిని, చర= సంచరించుము.

బ్రహ్మపుత్రుడవగు ఓ నారదా! ఈ ఆత్మతత్త్వోపదేశము మానవుల కామవాసనలను దహించివేయును. నీవు దీనిని బుద్ధియందు ధారణ చేసి యథేచ్ఛగా భూలోకమునందు సంచరించుము.

శ్రీశుక ఉవాచ ।

ఏవం స ఋషిణాఽఽదిష్టం గృహీత్వా శ్రద్ధయాత్మవాన్ ।
పూర్ణశ్రుతధరో రాజన్నాహ వీరవ్రతో మునిః ॥ 45

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, ఆత్మవాన్= ఆత్మనిష్ఠ గలవాడు, పూర్ణః= ఆప్తకాముడు, శ్రుతధరః= విన్నదానిని ధారణ చేయువాడు, వీరవ్రతః= దృఢమైన నియమనిష్ఠలు గలవాడు అగు, సః= ఆ, మునిః= నారద మహర్షి, ఏవమ్= ఈ విధముగా, ఋషిణా= నారాయణ మహర్షిచే, ఆదిష్టమ్= ఉపదేశించబడినదానిని, శ్రద్ధయా= శ్రద్ధతో, గృహీత్వా= స్వీకరించి, ఆహ= పలికెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! నారద మహర్షి ఆత్మనిష్ఠ గలవాడగుటచే ఆప్తకాముడు. దృఢమైన నియమనిష్ఠలు గల ఆ మహర్షి విన్నదానిని మరువడు. ఆయన నారాయణ మహర్షియొక్క ఈ ఉపదేశమును శ్రద్ధతో స్వీకరించి, ఇట్లు పలికెను.

నారద ఉవాచ ।

నమస్తస్మై భగవతే కృష్ణాయామలకీర్తయే ।
యో ధత్తే సర్వభూతానామభవాయోశతీః కలాః ॥ 46

నారదః= నారదుడు, ఉవాచ= పలికెను, అమలకీర్తయే= స్వచ్ఛమగు కీర్తి గల, తస్మై= ఆ, భగవతే కృష్ణాయ= శ్రీకృష్ణ భగవానుని కొరకు, నమః= నమస్కారము, యః= ఎవడైతే, సర్వభూతానామ్= సకలప్రాణులయొక్క, అభవాయ= సంసారదుఃఖశాంతికై, ఉశతీః= మనోహరమైన, కలాః= మూర్తులను, ధత్తే= స్వీకరించుచున్నాడో.

నారదుడిట్లు పలికెను...స్వచ్ఛమైన కీర్తిగల ఆ శ్రీకృష్ణ భగవానునకు నమస్కారము. ఆయన సకల ప్రాణులకు సంసారదుఃఖము ఉపశమించుటకై మనోహరమైన మూర్తులను స్వీకరించుచుండును.

ఇత్యాద్యమృషిమానమ్య తచ్ఛిష్యాంశ్చ మహాత్మనః ।
తతోఽగాదాశ్రమం సాక్షాత్పితుర్ద్వైపాయనస్య మే ॥ 47

ఇతి= ఈ విధముగా, ఆద్యమ్= సనాతనుడగు, ఋషిమ్= నారాయణ మహర్షిని, మహాత్మనః= మహాత్ములగు, తత్–శిష్యాన్ చ= ఆయనయొక్క శిష్యులను కూడ, ఆనమ్య= నమస్కరించి, తతః= అక్కడనుండి, సాక్షాత్= సాక్షాత్తుగా, మే= నా, పితుః= తండ్రియగు, ద్వైపాయనస్య= వ్యాస మహర్షియొక్క, ఆశ్రమమ్= ఆశ్రమమును గురించి, అగాత్= వెళ్లెను.

ఈ విధముగా ఆయన సనాతనుడగు నారాయణ మహర్షికి, ఆయన శిష్యులకు నమస్కరించెను. నారదుడు అక్కడనుండి తాను (సాక్షాత్తు) నా తండ్రియగు వ్యాసమహర్షి ఆశ్రమమునకు వెళ్లెను.

సభాజితో భగవతా కృతాసనపరిగ్రహః ।
తస్మై తద్వర్ణయామాస నారాయణముఖాచ్ఛ్రుతమ్ ॥ 48

భగవతా= పూజనీయుడగు వ్యాసునిచే, సభాజితః= సత్కరించ–బడినవాడు, కృత–ఆసనపరిగ్రహః= చేయబడిన ఆసన స్వీకారము గలవాడు అగు నారదుడు, తస్మై= ఆయన కొరకు, నారాయణముఖాత్= నారాయణ మహర్షి నోటినుండి, శ్రుతమ్= విన్న, తత్= ఆ వేదస్తోత్రమును, వర్ణయామాస= వివరించి చెప్పెను.

పూజనీయుడగు వ్యాసుడు నారదుని సత్కరించెను. నారదుడు ఆసనమును స్వీకరించి, తాను నారాయణ మహర్షి నోటినుండి విన్న వేదస్తుతిని ఆయనకు వివరించి చెప్పెను.

ఇత్యేతద్వర్ణితం రాజన్ యన్నః ప్రశ్నః కృతస్త్వయా ।
యథా బ్రహ్మణ్యనిర్దేశ్యే నిర్గుణేఽపి మనశ్చరేత్ ॥ 49

రాజన్= ఓ రాజా!, ఇతి= ఈ విధముగా, ఏతత్= ఇది, వర్ణితమ్= వర్ణించబడినది, యత్= ఏదనగా, త్వయా= నీచే, నః= మా కొరకు, ప్రశ్నః= ప్రశ్న, కృతః= వేయబడినదో, యథా= ఏ విధముగా, నిర్గుణే= నిర్గుణుడైనట్టియు, అనిర్దేశ్యే= వాక్కుచే నిర్దేశించ శక్యము కాని, బ్రహ్మణి= పరబ్రహ్మయందు, మనః= మనస్సు, చరేత్= ప్రసరించునో.

ఓ పరీక్షిన్మహారాజా! పరబ్రహ్మ నిర్గుణుడు గాన, పరబ్రహ్మను వాక్కుచే నిర్దేశించ శక్యము కాదు, మనస్సుచే ఊహించ శక్యము కాదు. అట్టి పరబ్రహ్మయందు మనస్సు ఎట్లు ప్రసరించునో, శ్రుతులు ఎట్లు వర్ణించునో, ఆ విషయమై నీవు వేసిన ప్రశ్నకు నేనీ విధముగా వర్ణించి చెప్పితిని.

యోఽస్యోత్ప్రేక్షక ఆదిమధ్యనిధనే యోఽవ్యక్తజీవేశ్వరో
యస్సృష్ట్వేదమనుప్రవిశ్య ఋషిణా చక్రే పురశ్శాస్తి తాః,
యం సంపద్య జహాత్యజామనుశయీ సుప్తః కులాయం యథా
తం కైవల్య నిరస్తయోనిమభయం ధ్యాయేదజస్రం హరిమ్ ॥ 50

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే సప్తాశీతితమోఽధ్యాయః ॥

యః= ఎవడు, అస్య= ఈ జగత్తునకు, ఉత్ప్రేక్షకః= సంకల్పము చేసినవాడో, ఆదిమధ్యనిధనే= ఆది మధ్యము నిధానమో, యః= ఎవడు, అవ్యక్తజీవ-ఈశ్వరః= ప్రకృతిని జీవులను శాసించువాడో, యః= ఎవడు, ఇదమ్= ఈ జగత్తును, సృష్ట్వా= సృష్టించి, అను= తరువాత, ఋషిణా= ద్రష్ట రూపముగా, ప్రవిశ్య= ప్రవేశించి, పురః= దేహములను, చక్రే= చేసెనో, తాః= వాటిని, శాస్తి= పాలించుచున్నాడో, యమ్= ఎవనిని, సంపద్య= ఉపాసించి (పొంది), అనుశయీ= జీవుడు, అజామ్=

మాయను, సుప్తః= నిద్రించినవాడు, కులాయం యథా= శరీరమును వలె, జహాతి= విడిచిపెట్టునో, కైవల్యనిరస్తయోనిమ్= అద్వితీయ స్వరూపముచే తిరస్కరించబడిన మాయ కలిగినట్టియు, అభయమ్= భయమును పోగొట్టే, తమ్= ఆ, హరిమ్= శ్రీహరిని, అజస్రమ్= నిరంతరము, ధ్యాయేత్= ధ్యానించవలెను.

శ్రీహరి ఈ జగత్తును సృష్టించవలెనని సంకల్పించి జగత్తుయొక్క సృష్టిస్థితిలయములు తానే అయినాడు. మాయాశక్తిని, జీవులను శాసించే ఆ శ్రీహరి ఈ జగత్తును సృష్టించి, తరువాత దానిలో ద్రష్టయగు జీవుని రూపముగా ప్రవేశించినాడు. ఆయనయే ఈ దేహములను నిర్మించి వాటిని పాలించుచున్నాడు. కర్మఫలభోక్త యగు జీవుడు ఆయనను ఉపాసించి పొంది, నిద్రించినవాడు దేహమును వలె, అవిద్యను విడిచి-పెట్టును. ఆయన తన అద్వితీయస్వరూపస్థితిచే మాయను అధిగ-మించినవాడు. భయమును పోగొట్టే అట్టి శ్రీహరిని నిరంతరము ధ్యానము చేయవలెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
వేదస్తుతిని వర్ణించే ఎనుబది
ఏడవ అధ్యాయము ముగిసినది (87).

* * *

అథ అష్టాశీతితమోఽధ్యాయః

వృకాసురుని వృత్తాంతము

రాజోవాచ ।

దేవాసురమనుష్యేషు యే భజంత్యఽశివం శివమ్ ।
ప్రాయస్తే ధనినో భోజా న తు లక్ష్మ్యాః పతిం హరిమ్ ॥ 1

రాజః= పరీక్షిన్మహారాజు, ఉవాచ= పలికెను, దేవ-అసురమను-ష్యేషు= దేవతలు రాక్షసులు మానవులలో, యే= ఎవరైతే, అశివమ్= అమంగళ వేషము గల, శివమ్= శివుని, భజంతి= సేవించెదరో, తే= వారు, ప్రాయః= తరచుగా, ధనినః= ధనవంతులు, భోజాః= భోగ-పరాయణులు, తు= దీనికి భిన్నముగా, లక్ష్మ్యాః= లక్ష్మీదేవి యొక్క, పతిమ్= భర్తయగు, హరిమ్= శ్రీహరిని (సేవించువారు), న= కాదు.

పరీక్షిన్మహారాజు ఇట్లు పలికెను...దేవతలు, రాక్షసులు, మానవులలో ఎవరైతే అమంగళ వేషధారి (విరాగి) యగు శివుని భజింతురో, వారు తరుచుగా ధనవంతులు, భోగపరాయణులు అగుచున్నారు. కాని, దీనికి భిన్నముగా, లక్ష్మీపతియగు శ్రీహరిని సేవించువారు అట్లు లేరు.

ఏతద్వేదితుమిచ్ఛామ స్సందేహోఽత్ర మహాన్ హి నః ।
విరుద్ధశీలయోః ప్రభ్వోర్విరుద్ధా భజతాం గతిః ॥ 2

ఏతత్= దీనిని, వేదితుమ్= తెలియుటకు, ఇచ్ఛామః= కోరుచున్నాము, హి= ఏలయన, అత్ర= ఈ విషయమునందు, నః= మాకు, మహాన్= పెద్ద, సందేహః= సందేహము, విరుద్ధశీలయోః= విరుద్ధ స్వభావములు గల, ప్రభ్వోః= ప్రభువులిద్దరియొక్క, భజతామ్= భక్తులకు, గతిః= ఫలము, విరుద్ధా= విరుద్ధము.

ఈ విషయమును మేము తెలియగోరుచున్నాము. ఎందుకంటే, ఈ విషయములో మాకు పెద్ద సందేహము గలదు. విరుద్ధమగు స్వభావములు (త్యాగభోగములు) గల ప్రభువులిద్దరి భక్తులకు లభించే ఫలము (భోగత్యాగములు) విరుద్ధముగా ఉండుటకు కారణమేమి?

శ్రీశుక ఉవాచ ।

శివశ్శక్తియుత శ్శశ్వత్త్రిలింగో గుణసంవృతః ।
వైకారికస్తైజసశ్చ తామసశ్చేత్యహం త్రిధా ॥ 3

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, శశ్వత్= సర్వదా, శక్తియుతః= శక్తితో కూడియుండే, శివః= శివుడు, త్రిలింగః= మూడు గుణములు ఉపాధిగా గలవాడు, గుణసంవృతః= గుణములచే కప్పి-వేయబడువాడు, వైకారికః= వైకారికము, తైజసః చ= తైజసము, తామసః = తామసము, ఇతి= అని, అహమ్= అహంకారము, త్రిధా= మూడు ప్రకారములుగా నున్నది.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శివుడు సర్వదా శక్తి (త్రిగుణా-త్మకము) తో కూడి సమష్టి-అహంకార రూపుడై యుండును. ఆ మూడు గుణములు ఆయనకు ఉపాధులు. అవి ఆయన యథార్థస్వరూపమును కప్పివేయును. ఆ అహంకారము వైకారికము, తైజసము, తామసము అని మూడు రకములు.

తతో వికారా అభవన్ షోడశామీషు కంచన ।
ఉపధావన్ విభూతీనాం సర్వాసామశ్నుతే గతిమ్ ॥ 4

తతః= వాటినుండి, షోడశ= పదునారు, వికారాః= కార్యములు, అభవన్= పుట్టినవి, అమీషు= వీటియందు, కంచన= ఏ దేవతనైననూ, ఉపధావన్= భజించువాడు, సర్వాసామ్= సకలమైన, విభూతీనామ్= సంపదలలో, గతిమ్= ఫలమును, అశ్నుతే= పొందును.

వైకారిక (సాత్త్విక) అహంకారమునుండి మనస్సు, తైజస (రాజస) అహంకారమునుండి పది ఇంద్రియములు (కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు), తామసాహంకారమునుండి పంచభూతములు, వెరసి పదహారు కార్యములు పుట్టినవి. సాధకుడు వీటిలో ఏ అధిష్ఠాన దేవతను ఉపాసించినా, సకలసంపదలను ఫలముగా పొందును.

హరిర్హి నిర్గుణస్సాక్షాత్పురుషః ప్రకృతేః పరః ।
స సర్వదృగుపద్రష్టా తం భజన్నిర్గుణో భవేత్ ॥ 5

హరిః హి= శ్రీహరియైతే, నిర్గుణః= నిర్గుణుడు, సాక్షాత్= సాక్షాత్తుగా, పురుషః= పూర్ణబ్రహ్మ, ప్రకృతేః= ప్రకృతికి, పరః= అతీతుడు, సః= ఆయన, సర్వదృక్= సర్వజ్ఞుడు, ఉపద్రష్టా= సాక్షి, తమ్= ఆయనను, భజన్= భజించువాడు, నిర్గుణః= ముక్తుడు, భవేత్= అగును.

శ్రీహరియైతే నిర్గుణుడు, సాక్షాత్తు పూర్ణబ్రహ్మ. ప్రకృతికి అతీతుడగు ఆయన సర్వజ్ఞుడు, సాక్షి. ఆయనను భజించువాడు ముక్తుడగును.

నివృత్తేష్వశ్వమేధేషు రాజా యుష్మత్పితామహః ।
శృణ్వన్ భగవతో ధర్మానపృచ్ఛదిదమచ్యుతమ్ ॥ 6

అశ్వమేధేషు= అశ్వమేధయాగములు, నివృత్తేషు= సమాప్తము కాగా, యుష్మత్-పితామహః= మీ తాతగారు, భగవతః= శ్రీకృష్ణ భగవానునినుండి, ధర్మాన్= ధర్మములను, శృణ్వన్= వినుచున్నవాడై, అచ్యుతమ్= ఆ అచ్యుతుని, ఇదమ్= దీనిని, అపృచ్ఛత్= అడిగెను.

అశ్వమేధయాగములు పూర్తి అయిన పిదప మీ తాతగారు ధర్మరాజు శ్రీకృష్ణ భగవానునినుండి ధర్మములను వినుచుండెను. ఆయన ఆ అచ్యుతుని ఇట్లు ప్రశ్నించెను.

స ఆహ భగవాంస్తస్మై ప్రీతశ్శుశ్రూషవే ప్రభుః ।
నృణాం నిశ్శ్రేయసార్థాయ యోఽవతీర్ణో యదోః కులే ॥ 7

ప్రభుః= సర్వసమర్థుడగు, సః= ఆ, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, శుశ్రూషవే= వినగోరిన, తస్మై= ఆ ధర్మరాజు కొరకై, ప్రీతః= ప్రీతి జెందినవాడై, ఆహ= పలికెను, యః= ఎవడైతే, నృణామ్= మానవుల యొక్క, నిశ్రేయస-అర్థాయ= మోక్షము కొరకై, యదోః= యదువుయొక్క, కులే= వంశమునందు, అవతీర్ణః= అవతరించినవాడో.

మానవులకు మోక్షధర్మమునుపదేశించుటకై యదువంశములో అవతరించిన సర్వసమర్థుడగు ఆ శ్రీకృష్ణ భగవానునకు ధర్మములను వినగోరిన ధర్మరాజుపై ప్రీతి కలిగి ఇట్లు పలికెను.

శ్రీభగవానువాచ ।

యస్యాహమనుగృహ్ణామి హరిష్యే తద్ధనం శనైః ।
తతోఽధనం త్యజంత్యస్య స్వజనా దుఃఖదుఃఖితమ్ ॥ 8

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, యస్య= ఎవనికి, అహమ్= నేను, అనుగృహ్ణామి= అనుగ్రహించెదనో, తద్-ధనమ్= వాని ధనమును, శనైః= మెల్లగా, హరిష్యే= హరించెదను, తతః= దాని వలన, అధనమ్= ధనము లేనట్టియు, దుఃఖదుఃఖితమ్= దుఃఖముల పరంపరచే పీడితుడైన ఆతనిని, అస్య= వీని, స్వజనాః= బంధువులు, త్యజింతి= విడిచిపెట్టెదరు.

శ్రీకృష్ణ భగవానుడిట్లు పలికెను...నేను ఎవనిని అనుగ్రహించెదనో, వాని ధనమును మెల్లగా హరించెదను. ఆతడు నిర్ధనుడై దుఃఖముల పరంపరతో పీడితుడగును. అప్పుడు వీనిని బంధువులు విడిచిపెట్టెదరు.

స యదా వితథోద్యోగో నిర్విణ్ణస్స్యాద్ధనేహయా ।
మత్పరైః కృతమైత్రస్య కరిష్యే మదనుగ్రహమ్ ॥ 9

సః= ఆతడు, యదా= ఎప్పుడైతే, వితథ-ఉద్యోగః= విఫలమైన ప్రయత్నము గలవాడై, ధన-ఈహయా= ధనము కొరకైన చేష్టచే, నిర్విణ్ణః

= విరక్తుడు, స్యాత్= అగునో, మత్-పరైః= నా ఏకాంతభక్తులతో, కృతమైత్రస్య= చేయబడిన మైత్రి గల ఆతనికి, మద్-అనుగ్రహమ్= నా అనుగ్రహమును, కరిష్యే= చేయగలను.

ఎప్పుడైతే ఆతని ప్రయత్నములు విఫలమై ధనమును పొందుటకై చేసే ప్రయత్నమునుండి విరక్తుడగునో, అప్పుడాతడు నా ఏకాంత భక్తులతో మైత్రిని నెరపును. అప్పుడు నేనాతనిని అనుగ్రహించెదను.

తద్బ్రహ్మ పరమం సూక్ష్మం చిన్మాత్రం సదనంతకమ్ ।
అతో మాం సుదురారాధ్యం హిత్వాఽన్యాన్ భజతే జనః ॥10

తత్= ఆ, బ్రహ్మ, పరమమ్= ప్రకృతికి అతీతమైనది,సూక్ష్మమ్= ఇంద్రియగోచరము కానిది, చిత్- మాత్రమ్= చిద్ఘనము, సత్= సద్ఘనము, అనంతకమ్= దేశకాలపరిచ్ఛేదములు లేనిది, అతః= ఇందువలన, సుదురారాధ్యమ్= ఆరాధించుట చాల కష్టమైన, మామ్= నన్ను, హిత్వా= విడిచి, జనః= మానవుడు, అన్యాన్= ఇతరులను, భజతే= సేవించును.

వేదములయందు ప్రసిద్ధమైనది, ప్రకృతికి అతీతమైనది, ఇంద్రియగోచరము కానిది, చిద్ఘనము, సద్ఘనము, దేశకాలపరిచ్ఛేదములు లేనిది అగు బ్రహ్మను ఆతడు ఆత్మరూపముగా తెలుసుకొని విముక్తుడగును. ఈ విధముగా నన్ను ఆరాధించుట చాల కష్టము. కావుననే, మానవులు నన్ను విడిచి ఇతరదేవతలనారాధించు చుందురు.

తతస్త ఆశుతోషేభ్యో లబ్ధరాజ్యశ్రియోద్ధతాః ।
మత్తాః ప్రమత్తా వరదాన్ విస్మరంత్యవజానతే ॥ 11

తతః= తరువాత, ఆశుతోషేభ్యః= శీఘ్రముగా సంతోషించే దేవతల నుండి, లబ్ధరాజ్యశ్రియా= పొందబడిన రాజ్యముయొక్క సంపదచే, ఉద్ధతాః= ధర్మమునుల్లంఘించువారు, మత్తాః= గర్వించినవారు, ప్రమత్తాః

= అసావధానులై, వరదాన్= వరములనిచ్చినవారిని, విస్మరంతి= మరచెదరు, అవజానతే= అవమానించెదరు.

ఆ విధముగా ఆరాధించిన తరువాత వారు తొందరగా సంతోషించే ఆ దేవతలనుండి రాజ్యము ఇత్యాది సంపదలను పొంది ధర్మమును తప్పెదరు. వారు అసావధానులై గర్వించి వరములనిచ్చిన వారినే మరిచెదరు, లేదా అవమానించెదరు.

శ్రీశుక ఉవాచ ।

శాపప్రసాదయోరీశా బ్రహ్మవిష్ణుశివాదయః ।
సద్యశ్శాపప్రసాదోఽంగ శివో బ్రహ్మా న చాచ్యుతః ॥ 12

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, బ్రహ్మవిష్ణుశివ-ఆదయః= బ్రహ్మదేవుడు విష్ణువు శివుడు మొదలగువారు, శాపప్రసా-దయోః= శాపవరములయందు, ఈశాః= సమర్థులు, అంగ= ఓయీ!, శివః= శివుడు, బ్రహ్మా= బ్రహ్మదేవుడు, సద్యః-శాపప్రసాదః= వెంటనే శాపము వరము గలవాడు, అచ్యుతః చ= శ్రీహరియైతే, న= కాదు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...ఓ పరీక్షిన్మహారాజా! బ్రహ్మదేవుడు, శ్రీహరి, శివుడు, ఇంద్రుడు మొదలగువారు శపించుటకు, వరముల-నిచ్చుటకు సమర్థులు. బ్రహ్మదేవుడు, శివుడు వెంట వెంటనే శాపములను, వరములను ఈయగా, శ్రీహరి మాత్రము అట్లు కాదు.

అత్ర చోదాహరంతీమమితిహాసం పురాతనమ్ ।
వృకాసురాయ గిరిశో వరం దత్త్వాఽఽప సంకటమ్ ॥ 13

అత్ర= ఈ విషయమునందు, ఇమమ్= ఈ, పురాతనమ్= ప్రాచీన మైన, ఇతిహాసమ్= వృత్తాంతమును, ఉదాహరంతి= ఉటంకించెదరు, గిరిశః= కైలాసవాసియగు శివుడు, వృక-అసురాయ= వృకుడనే

రాక్షసునకు, వరమ్= వరమును, దత్వా= ఇచ్చి, సంకటమ్= ఆపదను, ఆప= పొందెను.

ఈ సందర్భములో మహాత్ములు ఈ ప్రాచీనమగు వృత్తాంతము-నుటంకించెదరు. కైలాసవాసియగు శివుడు వృకాసురునకు వరమునిచ్చి ఆపదలో పడెను.

వృకో నామాసురః పుత్రశ్శకునేః పథి నారదమ్ ।
దృష్ట్వాఽఽశుతోషం పప్రచ్ఛ దేవేషు త్రిషు దుర్మతిః ॥ 14

వృకః= వృకుడని, నామ= ప్రసిద్ధి చెందిన, అసురః= రాక్షసుడు, శకునేః= శకునియొక్క, పుత్రః= పుత్రుడు, దుర్మతిః= దుర్బుద్ధి, పథి= మార్గమునందు, నారదమ్= నారదుని, దృష్ట్వా= చూచి, త్రిషు= ముగ్గురు, దేవేషు= దేవులయందు, ఆశుతోషమ్= శీఘ్రముగా ప్రసన్నుడగువాని గురించి, పప్రచ్ఛ= ప్రశ్నించెను.

వృకుడని ప్రసిద్ధి చెందిన రాక్షసుడు, శకుని పుత్రుడు ఉండెను. ఆ దుర్బుద్ధి మార్గములో నారదుని ఇట్లు ప్రశ్నించెను...త్రిమూర్తులలో శీఘ్రముగా ప్రసన్నమయ్యే దేవుడు యెవరు?

స ఆహ దేవం గిరిశముపాధావాశు సిద్ధ్యసి ।
యోఽల్పాభ్యాం గుణదోషాభ్యామాశు తుష్యతి కుప్యతి ॥ 15

సః= ఆ నారదుడు, ఆహ= పలికెను, గిరిశమ్= కైలాసవాసియగు, దేవమ్= దేవుని, ఉపాధావ= ఆరాధించుము, ఆశు= శీఘ్రముగా, సిద్ధ్యసి= సిద్ధిని పొందగలవు, యః= ఏ శివుడు, అల్పాభ్యామ్= చిన్నవైన, గుణదోషాభ్యామ్= గుణదోషములచే, ఆశు= శీఘ్రముగా, తుష్యతి= సంతోషించునో, కుప్యతి= కోపించునో.

ఆ నారదుడిట్లు చెప్పెను...నీవు కైలాసవాసియగు దేవుని ఆరాధించుము. శీఘ్రముగా సిద్ధిని బడయగలవు. ఆ దేవుడు తక్కువ గుణముచే శీఘ్రముగా ప్రీతుడగును, చిన్న తప్పుచే వెంటనే కోపించును.

దశాస్యబాణయోస్తుష్టః స్తువతోర్వందినోరివ ।
ఐశ్వర్యమతులం దత్త్వా తత ఆప సుసంకటమ్ ॥ 16

వందినోః ఇవ= స్తోత్రపాఠకుల వలె, స్తువతోః= స్తుతించుచున్న, దశ–ఆస్యబాణయోః= రావణ బాణాసురులపై, తుష్టః= సంతోషించిన వాడు, అతులమ్= సాటి లేని, ఐశ్వర్యమ్= సంపదను, దత్త్వా= ఇచ్చి, తతః= అట్లు యిచ్చుట వలన, సుసంకటమ్= పెద్ద ఆపదను, ఆప= పొందెను.

రావణాసుర బాణాసురులు స్తోత్రపాఠకుల వలె స్తుతించగా శివుడు సంతోషించి, వారికి సాటిలేని సంపదనిచ్చి, పెద్ద ఆపదలను (కైలాసమును రావణుడు పెల్లగించు, బాణుని నగరమునకు శివుడు కాపలా కాయుట) కొని తెచ్చుకొనెను.

ఇత్యాదిష్టస్తమసుర ఉపాధావత్స్వగాత్రతః ।
కేదార ఆత్మక్రవ్యేణ జుహ్వానోఽగ్నిముఖం హరమ్ ॥ 17

ఇతి= ఈ విధముగా, ఆదిష్టః= ఉపదేశించబడిన, అసురః= రాక్షసుడు, అగ్నిముఖమ్= అగ్నియే ముఖముగా గల, తమ్= ఆ, హరమ్= శివుని, కేదారే= కేదారమునందు, స్వగాత్రతః= తన దేహమునుండి, ఆత్మక్రవ్యేణ= తన మాసంముతో, జుహ్వానః= హోమము చేయువాడై, ఉపాధావత్= ఆరాధించెను.

నారదుడీ విధముగా ఉపదేశించెను. అప్పుడా రాక్షసుడు కేదారక్షేత్రమునందు తన దేహమునుండి మాంసమును కోసి హోమము చేస్తూ అగ్నియే ముఖముగా గల శివుని ఆరాధించెను.

దేవోపలబ్ధిమప్రాప్య నిర్వేదాత్సప్తమేఽహని ।
శిరోఽవృశ్చత్స్వధితినా తత్తీర్థక్లిన్నమూర్ధజమ్ ॥ 18

దేవ-ఉపలబ్ధిమ్= దేవదర్శనమును, అప్రాప్య= పొందక, నిర్వేదాత్= నిస్పృహ వలన, సప్తమే= ఏడవ, అహని= దినమునందు, స్వధితినా= కత్తితో, తత్-తీర్థక్లిన్నమూర్ధజమ్= ఆ తీర్థమునందలి నీటిచే తడిసిన జుట్టు గల, శిరః= తలను, అవృశ్చత్= నరికెను.

ఆతనికి దేవదర్శనము కాలేదు. ఏడవ నాడు ఆతడు నిస్పృహ చెంది, ఆ కేదారతీర్థములో స్నానము చేసి, కత్తితో తడి జట్టుతోనున్న తలను నరికి హోమము చేయబోయెను.

తదా మహాకారుణికస్య ధూర్జటిః
యథా వయం చాగ్నిరివోత్థితోఽనలాత్ ।
నిగృహ్య దోర్భ్యాం భుజయోర్న్యవారయత్
తత్స్పర్శనాద్భూయ ఉపస్కృతాకృతిః ॥ 19

తదా= అప్పుడు, మహాకారుణికః= గొప్ప దయామయుడగు, సః= ఆ, ధూర్జటిః= శివుడు, వయం యథా= మనము వలె, అనలాత్= అగ్నిహోత్రమునుండి, అగ్నిః ఇవ= అగ్నిదేవుడు వలె, ఉత్థితః= పైకి లేచినవాడై, దోర్భ్యామ్= రెండు చేతులతో, భుజయోః= భుజముల యందు, నిగృహ్య= గట్టిగా పట్టుకొని, న్యవారయత్= నివారించెను, తత్-స్పర్శనాత్= ఆయనయొక్క స్పర్శ వలన, భూయః= మరల, ఉపస్కృత- ఆకృతిః= గాయములు లేని దేహము గలవాడు.

అప్పుడు గొప్ప దయామయుడగు శివుడు అగ్నిహోత్రమునుండి అగ్నిదేవుడు వలె పైకి లేచి, చేతులతో వాని భుజములను గట్టిగా పట్టుకొని (తలను నరికే ప్రయత్నమునుండి) నివారించెను. ఎవరైనా ఆత్మహత్య చేసుకోబోతూ ఉంటే, మనము కూడ అట్లే చేసి ఉందుము. ఆయనయొక్క స్పర్శచే వృకుని గాయములన్నీ మానిపోయెను.

తమాహ చాంగాలమలం వృణీష్వ మే
యథాఽభికామం వితరామి తే వరమ్ ।
ప్రీయేయ తోయేన నృణాం ప్రపద్యతాం
అహో త్వయాఽఽత్మా భృశమర్ద్యతే వృథా ॥ 20

తమ్= వానిని ఉద్దేశించి, ఆహ= పలికెను, అంగ= ఓయీ!, అలమ్= చాలును, అలమ్= చాలును, మే= నానుండి, యథా-అభికామమ్= కోరికకు తగ్గట్లుగా, వృణీష్వ= కోరుకొనుము, తే= నీ కొరకు, వరమ్= వరమును, వితరామి= ఇచ్చెదను, ప్రపద్యతామ్= శరణాగతి చేసే, నృణామ్= మానవులకు, తోయేన= నీటితో, ప్రీయేయ= ప్రీతి జెందదను, త్వయా= నీచే, ఆత్మా= దేహము, వృథా= వ్యర్థముగా, భృశమ్= అధికముగా, అర్ద్యతే= పీడించబడుచున్నది.

వానితో శివుడిట్లనెను...ఓయీ! చాలు, చాలు. నీ కోరికకు తగ్గట్లుగా వరమును కోరుకొనుము. నీకు వరమునిచ్చెదను. శరణాగతి చేసే మానవులు సమర్పించే నీటితో నేను ప్రీతి జెందెదను. నీవు వ్యర్థముగా దేహమునకు అధికమగు పీడను కలిగించుకొనుచున్నావు.

దేవం స వవ్రే పాపీయాన్ వరం భూతభయావహమ్ ।
యస్య యస్య కరం శీర్ష్ణి ధాస్యే స మ్రియతామితి ॥ 21

పాపీయాన్= మహాపాపియగు, సః= ఆ వృకాసురుడు, భూతభయ-ఆవహమ్= ప్రాణులకు భయమును కలిగించే, వరమ్= వరమును, దేవమ్= శివుని, వవ్రే= కోరెను, యస్య యస్య= ఎవని ఎవని, శీర్ష్ణి= తలపై, కరమ్= చేతిని, ధాస్యే= ఉంచగలనో, సః= వాడు, మ్రియతామ్= మరణించుగాక!, ఇతి= అని.

ఆ మహాపాపి శివునినుండి సకలప్రాణులకు భయమును కలిగించే వరమును కోరెను. నేను ఏయే వ్యక్తుల తలపై నా చేతిని పెడతానో, ఆయా వ్యక్తులు మరణించెదరు గాక! అని కోరెను.

తచ్ఛ్రుత్వా భగవాన్ రుద్రో దుర్మనా ఇవ భారత ।
ఓమితి ప్రహసంస్తస్మై దదేఽహేరమృతం యథా ॥ 22

భారత= భరతవంశీయుడవగు ఓ రాజా!, తత్= ఆ మాటను, శ్రుత్వా= విని, భగవాన్ రుద్రః= శివ భగవానుడు, దుర్మనాః ఇవ= చెడిన మనస్సు గలవాడా యన్నట్లు, ప్రహసన్= నవ్వుచున్నవాడై, ఓమ్= సరే, ఇతి= అని, తస్మై= వాని కొరకు, అహేః= పామునకు, అమృతం యథా= పాలను వలె, దదే= ఇచ్చెను.

ఆ మాటను విని శివ భగవానునకు మనస్సు చెడిపోయినదా అన్నట్లు ఆయెను. ఆయన నవ్వుతూ సరే అని, పామునకు పాలను వలె, వానికి వరమునిచ్చెను.

ఇత్యుక్తస్సోఽసురో నూనం గౌరీహరణలాలసః ।
స తద్వరపరీక్షాఽర్థం శంభోర్మూర్ధ్ని కిలాసురః ॥ 23

ఇతి= అని, ఉక్తః= పలుకబడిన, సః= ఆ, అసురః= రాక్షసుడు, నూనమ్= నిశ్చయముగా, గౌరీహరణలాలసః= గౌరీదేవిని అపహరించుట యందు అభిలాష గలవాడు, సః= ఆ, అసురః= రాక్షసుడు, తద్-వర పరీక్షా-అర్థమ్= ఆ వరమును పరీక్షించుటకై, శంభోః= శివుని యొక్క, మూర్ధ్ని= తలపై, స్వహస్తమ్= తన చేతిని, ధాతుమ్= ఉంచుటకు, ఆరేభే కిల= ఆరంభించెను, సః= ఆ, శివః= శివుడు, స్వకృతాత్= తాను చేసిన పని వలన, అబిభ్యత్= భయపడెను.

శివుడిట్లు పలుకగా, ఆ రాక్షసునకు గౌరీదేవిని అపహరించవలెననే అభిలాష కలిగెను. ఆ రాక్షసుడా వరమును పరీక్షించుటకై శివుని తలపై చేతిని పెట్టుటకు కూడ సంసిద్ధుడాయెను. శివునకు తాను చేసిన పని వలన భయము సంప్రాప్తమయ్యెను.

తేనోపసృష్టస్సంత్రస్తః పరాధావన్ సవేపథుః ।
యావదంతం దివో భూమేః కాష్ఠానాముదగాదుదక్ ॥ 24

తేన= ఆ రాక్షసునిచే, ఉపసృష్టః= తరుమబడినవాడు, సంత్రస్తః = అధికముగా భయపడినవాడు, సవేపథుః= వణుకుతో కూడినవాడు అగు శివుడు, దివః= స్వర్గమునకు, భూమేః= భూమికి, యావత్= ఎంతవరకైతే, అంతమ్= అంతమో అంతవరకు, పరాధావన్= వెనుదిరిగి పారిపోవువాడై, కాష్ఠానామ్= దిక్కులలో, ఉదక్= ఉత్తరముగా, ఉదగాత్= పరుగెత్తెను.

శివుడు అధికమగు భయముతో వణికిపోయెను. ఆయన ఆ రాక్షసుడు తరుముచుండగా వెనుదిరిగి, ద్యులోక భూలోకముల అంతము వరకు, ఉత్తరదిక్కు వైపు పరుగెత్తెను.

అజానంతః ప్రతివిధిం తూష్ణీమాసన్ సురేశ్వరాః ।
తతో వైకుంఠమగమద్భాస్వరం తమసః పరమ్ ॥ 25

ప్రతివిధిమ్= ప్రతిక్రియను, అజానంతః= తెలియని, సుర–ఈశ్వరాః= దేవనాయకులు, తూష్ణీం ఆసన్= మిన్నకుండిరి, తతః= తరువాత, భాస్వరమ్= ఉజ్జ్వలమైనట్టియు, తమసః= చీకటికి, పరమ్= ఆవల ఉండే, వైకుంఠమ్= వైకుంఠమును గురించి, అగమత్= వెళ్లెను.

ఈ ఆపదను నివారించే ఉపాయము తెలియక దేవనాయకులు మిన్నకుండిరి. అప్పుడు శివుడు చీకటికి ఆవల ఉజ్జ్వలముగా ప్రకాశించే వైకుంఠమునకు వెళ్లెను.

యత్ర నారాయణస్సాక్షాన్న్యాసినాం పరమా గతిః ।
శాంతానాం న్యస్తదండానాం యతో నావర్తతే గతః ॥ 26

యత్ర= ఎక్కడనైతే, న్యాసినామ్= సర్వసంగపరిత్యాగులైనట్టియు, శాంతానామ్= మనోనిగ్రహము కలిగినట్టియు, న్యస్తదండానామ్=

విడిచిపెట్టబడిన ప్రాణిహింసగల సన్న్యాసులకు, పరమా= సర్వాతిశాయి యగు, గతిః= ఫలమైన, నారాయణః= నారాయణుడు, సాక్షాత్= సాక్షాత్తుగా నుండునో, గతః= చేరినవాడు, యతః= ఎక్కడనుండి, న ఆవర్తతే= తిరిగి రాడో.

ప్రాణిహింసను విడిచి మనస్సును నిగ్రహించి సర్వసంగపరిత్యాగు లైన మహాత్ములు పొందే పరమఫలము నారాయణుడు. సాక్షాత్తు ఆయనయే అక్కడనుండును. అక్కడకు చేరినవారికి మరల జన్మ ఉండదు.

తం తథావ్యసనం దృష్ట్వా భగవాన్ వృజినార్దనః ।
దూరాత్ప్రత్యుదియాద్భూత్వా వటుకో యోగమాయయా ॥27

వృజిన-అర్దనః= దుఃఖములను పోగొట్టే, భగవాన్= నారాయణ భగవానుడు, తథావ్యసనమ్= అటువంటి దుఃఖము గల, తమ్= ఆ శివుని, దృష్ట్వా= చూచి, యోగమాయయా= యోగమాయచే, వటుకః= బ్రహ్మచారి, భూత్వా= అయి, దూరాత్= దూరమునుండి, ప్రత్యుదియాత్= ఎదురేగెను.

భయములను పోగొట్టే నారాయణ భగవానుడు ఆ విధముగా కష్టముపాలైన శివుని చూచి, యోగమాయచే బ్రహ్మచారియై దూరము నుండి యెదురేగెను.

మేఖలాఽజినదండాక్షై స్తేజసాఽగ్నిరివ జ్వలన్ ।
అభివాదయామాస చ తం కుశపాణిర్వినీతవత్ ॥ 28

మేఖలా-అజినదండ-అక్షైః= మేఖల కృష్ణమృగచర్మ దండము జపమాలలతో, తేజసా= తేజస్సుచే, అగ్నిః ఇవ= అగ్ని వలె, జ్వలన్= గొప్పగా ప్రకాశించుచున్నవాడు, కుశపాణిః= దర్భలు చేతియందు గలవాడు, తం చ= ఆ రాక్షసునైతే, వినీతవత్= వినయము గలవాడు వలె, అభివాదయామాస= నమస్కరించెను.

మేఖల, కృష్ణమృగచర్మ, దండము, జపమాలలతో కూడిన ఆ బ్రహ్మచారి తేజస్సుతో అగ్ని వలె గొప్పగా ప్రకాశించెను. ఆతడు వినయముతో ఆ రాక్షసునకు నమస్కరించెను.

శ్రీభగవానువాచ ।

శాకునేయ భవాన్ వ్యక్తం శ్రాంతః కిం దూరమాగతః ।
క్షణం విశ్రమ్యతాం పుంస ఆత్మాఽయం సర్వకామధుక్ ॥29

శ్రీభగవాన్= నారాయణ భగవానుడు, ఉవాచ= పలికెను, శాకునేయ= ఓ శకునిపుత్రా!, భవాన్= నీవు, వ్యక్తమ్= స్పష్టముగా, శ్రాంతః= అలసినవాడవు, దూరమ్= దూరమును, కిం ఆగతః= వచ్చిన-వాడవా యేమి?, క్షణమ్= క్షణకాలమును, విశ్రమ్యతామ్= విశ్రమించ-బడుగాక!, పుంసః= వ్యక్తికి, అయమ్= ఈ, ఆత్మా= దేహము, సర్వకామ-ధుక్= సకలకామనలను పితుకునది.

నారాయణ భగవానుడిట్లు పలికెను...శకునిపుత్రా! నిన్ను చూస్తే అలిసినావని తెలుస్తూనే ఉంది. దూరమునుండి వచ్చినావా యేమి? క్షణకాలము విశ్రమించుము. వ్యక్తికి ఈ దేహము సకలకామనలను తీర్చే కామధేనువు.

యది నశ్శ్రవణాయాలం యుష్మద్వ్యవసితం విభో ।
భణ్యతాం ప్రాయశః పుంభిర్ధృతైస్స్వార్థాన్ సమీహతే ॥ 30

విభో= ఓ ప్రభూ!, యుష్మద్-వ్యవసితమ్= మీచే నిశ్చయించబడిన కార్యము, నః= మాకు, శ్రవణాయ= వినుట కొరకు, యది అలమ్= యోగ్యమైనచో, భణ్యతామ్= చెప్పబడుగాక!, ధృతైః= స్వీకరించబడిన, పుంభిః= వ్యక్తులతో కలిసి, ప్రాయశః= తరుచుగా, స్వ-అర్థాన్= తన ప్రయోజనములను, సమీహతే= సాధించును.

ఓ ప్రభూ! నేను వినుటకు యోగ్యమైనచో మీరు చేయదలచుకున్న పనిని గురించి చెప్పుడు. వ్యక్తి తరుచుగా ఇతరులను సహాయులుగా కలుపుకుని తన ప్రయోజనమును సాధించగల్గును.

శ్రీశుక ఉవాచ ।

ఏవం భగవతా పృష్టో వచసాఽమృతవర్షిణా ।
గతక్లమోబ్రవీత్తస్మై యథాపూర్వమనుష్ఠితమ్ ॥ 31

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, ఏవమ్= ఈ విధముగా, భగవతా= భగవానునిచే, అమృతవర్షిణా= అమృతమును వర్షించే, వచసా= వాక్కుతో, పృష్టః= ప్రశ్నించబడినవాడై, గతక్లమః= తొలగిన క్లేశము గలవాడై, తస్మై= ఆయన కొరకు, అనుష్ఠితమ్= చేయబడినదానిని, యథాపూర్వమ్= ముందునుండి క్రమమును తప్పకుండా, అబ్రవీత్= చెప్పెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...భగవానుడు అమృతమును వర్షించే వాక్కుతో ఇట్లు ప్రశ్నించగా, ఆతడు జరిగిన వృత్తాంతమును ముందునుండి క్రమమును తప్పకుండా చెప్పెను.

శ్రీభగవానువాచ ।

ఏవం చేత్తర్హి తద్వాక్యం న వయం శ్రద్దధీమహి ।
యో దక్షశాపాత్పైశాచ్యం ప్రాప్తః ప్రేతపిశాచరాట్ ॥ 32

శ్రీభగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఉవాచ= పలికెను, ఏవం చేత్= ఇట్లైనచో, తర్హి= అప్పుడు, వయమ్= మేము, తద్ వాక్యమ్= ఆయన మాటను, న శ్రద్ధధీమహి= విశ్వసించము, యః= ఏ శివుడైతే, దక్షశాపాత్= దక్షుని శాపము వలన, పైశాచ్యమ్= పిశాచస్థితిని, ప్రాప్తః = పొందినాడో, ప్రేతపిశాచరాట్= ప్రేతముల పిశాచముల రాజో.

శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు పలికెను, శివుడు నీకు వరమునిచ్చినాడా? అట్లైనచో, మేము ఆయన మాటను నమ్ముటలేదు. ఆయనకు దక్షుని శాపముచే పిశాచభావము వచ్చి, పిశాచములకు ప్రేతములకు రాజైనాడు.

యది వస్తత్ర విశ్రంభో దానవేంద్ర జగద్గురౌ ।
తర్హ్యంగాశు స్వశిరసి హస్తం న్యస్య ప్రతీయతామ్ ॥ 33

దానవ-ఇంద్ర= ఓ రాక్షసరాజా!, జగద్-గురౌ= జగత్తునకు తండ్రియగు, తత్ర= ఆ శివునిపై, వః= మీకు, విశ్రంభః యది= నమ్మక-మున్నచో, తర్హి= అప్పుడు, అంగ= ఓయీ!, ఆశు= వెంటనే, స్వశిరసి= నీ తలపై, హస్తమ్= చేతిని, న్యస్య= ఉంచి, ప్రతీయతామ్= పరీక్షించుము.

ఓ రాక్షసరాజా! ఆ శివుడు జగద్గురువని ఆయన మాట సత్యమని నీకు నమ్మకమున్నదా? ఓయీ వెంటనే చేతిని నీ తలపై పెట్టి పరీక్షించుము.

యద్యసత్యం వచశ్శంభోః కథంచిద్దానవర్షభ ।
తదైనం జహ్యసద్వాచం న యద్వ క్తాఽనృతం పునః ॥ 34

దానవ-ఋషభ= ఓ రాక్షసశ్రేష్ఠా!, శంభోః= శివుని, వచః= మాట, యది అసత్యమ్= అసత్యమైనచో, తదా= అప్పుడు, అసద్- వాచమ్= అసత్యమును పలికే, ఏనమ్= వీనిని, కథంచిత్= ఏ విధముగానైననూ, జహి= సంహరించుము. యత్= ఎందువలనైతే, పునః= మరల, అనృతమ్= అసత్యమును, న వక్తా= చెప్పబోడో.

ఓ రాక్షసశ్రేష్ఠా! శివుని మాట అసత్యమని తేలినచో, అసత్యమును పలికే ఈయనను ఏ విధముగానైననూ సంహరించుము. అప్పుడు మరల అసత్యమును చెప్పబోడు.

ఇత్థం భగవతశ్చిత్రై ర్వచోభిస్స సుపేశలైః ।
భిన్నధీర్విస్మృతశ్రీర్ష్ణి స్వహస్తం కుమతిర్వ్యధాత్ ॥ 35

ఇత్థమ్= ఈ విధముగా, భగవతః= భగవానుని, చిత్రైః= భ్రమ పెట్టే, సుపేశలైః= మిక్కిలి మధురమైన, వచోభిః= మాటలచే, భిన్నధీః= జారిపోయిన బుద్ధి గలవాడు, విస్మృతః= మరిచిపోయినవాడు, కుమతిః = ఆ దుర్బుద్ధి, స్వహస్తమ్= తన చేతిని, శీర్ష్ణి= తలపై, వ్యధాత్= ఉంచెను.

ఈ విధముగా నారాయణ భగవానుని మిక్కిలి మధురములై భ్రమను కలిగించే మాటలచే బుద్ధి జారిపోయి, ఆతడు వరముయొక్క అర్థమును మరిచెను. ఆ దుర్బుద్ధి తన చేతిని తలపై పెట్టుకొనెను.

అథాపతద్భిన్నశిరా వజ్రాహత ఇవ క్షణాత్ ।
జయశబ్దో నమశ్శబ్ద స్సాధుశబ్దోఽ భవద్దివి ॥ 36

అథ= అప్పుడు, భిన్నశిరాః= పగిలిన తల గలవాడు, వజ్ర-ఆహతః ఇవ= వజ్రముచే కొట్టబడినవాడు వలె, క్షణాత్= క్షణకాలములో, అపతత్= పడెను, జయశబ్దః= జయధ్వానము, నమః-శబ్దః= నమస్కారము అనే శబ్దము, సాధుశబ్దః= బాగు అనే శబ్దము, దివి= స్వర్గమునందు, అభవత్= కలిగెను.

అప్పుడాతని తల వెంటనే పగిలి, వజ్రపు దెబ్బ తిన్నవాడు వలె నేలగూలెను. స్వర్గమునందు జయధ్వానములు, నమస్కారశబ్దములు, బాగు బాగు అనే శబ్దములు బయలుదేరినవి.

ముముచుః పుష్పవర్షాణి హతే పాపే వృకాసురే ।
దేవర్షిపితృగంధర్వా మోచితస్సంకటాచ్ఛివః ॥ 37

పాపే= పాపియగు, వృక-అసురే= వృకాసురుడు, హతే= వధించ-బడగా, దేవ-ఋషిపితృగంధర్వాః= దేవతలు మహర్షులు పితరులు గంధర్వులు, పుష్పవర్షాణి= పూల వానలను, ముముచుః= విడిచిపెట్టిరి. శివః= శివుడు, సంకటాత్= ఆపదనుండి, మోచితః= విడిపించబడిన వాడు.

పాపియగు వృకాసురుడు వధించబడగా దేవతలు, మహర్షులు, పితరులు, గంధర్వులు పూల వానలను కురిపించిరి. శివుడు ఆపదనుండి గట్టెక్కించబడెను.

ముక్తం గిరిశమభ్యాహ భగవాన్ పురుషోత్తమః ।
అహో దేవ మహాదేవ పాపోఽయం స్వేన పాప్మనా ॥ 38

హతః కో ను మహత్తీశ జంతుర్వై కృతకిల్బిషః ।
క్షేమీ స్యాత్కిము విశ్వేశే కృతాగస్కో జగద్గురౌ ॥ 39

ముక్తమ్= విముక్తుడైన, గిరిశమ్= కైలాసవాసియగు శివుని ఉద్దేశించి, పురుష-ఉత్తమః భగవాన్= పురుషోత్తమ భగవానుడు, అభ్యాహ= పలికెను, అహో= ఆహా!, దేవ= ఓ దేవా!, మహాదేవ= ఓ మహాదేవా!, అయమ్= ఈ, పాపః= పాపి, స్వేన= తన, పాప్మనా= పాపముచే, హతః= సంహరించబడినవాడు, ఈశ= ఓ ఈశ్వరా!, మహత్సు= మహాత్ముల యెడల, కృతకిల్బిషః= చేయబడిన పాపము గల, కః ను= ఏ, జంతుః వై= ప్రాణి, క్షేమీ= క్షేమము గలది, స్యాత్= అగును, జగద్-గురౌ= జగత్తునకు తండ్రియగు, విశ్వ-ఈశే= సర్వేశ్వరుని యందు, కృత-ఆగస్కః= చేయబడిన పాపము గలవాడు, కిము= చెప్పేదేమున్నది?

విముక్తుడైన కైలాసవాసియగు శివునితో పురుషోత్తమ భగవానుడిట్లు పలికెను...ఆహా! ఓ దేవా! మహాదేవా! ఈ పాపిని తన పాపమే మట్టుబెట్టినది. ఓ ఈశ్వరా! మహాత్ముల యెడల పాపమును చేసిన ఏ ప్రాణి క్షేమముగా నుండును? (ఏదీ ఉండదు). నీవు జగత్తునకు తండ్రివి, సర్వేశ్వరుడవు. నీయందు పాపము చేసినవాడు క్షేమముగా నుండలేడని వేరుగా చెప్పవలెనా? (అక్కరలేదు).

య ఏవమవ్యాకృతశక్త్యుదన్వతః పరస్య సాక్షాత్పరమాత్మనో హరేః ।
గిరిత్రమోక్షం కథయేచ్ఛృణోతి వా విముచ్యతే సంసృతిభిస్తథాఽరిభిః॥ 40

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే అష్టాశీతితమోఽధ్యాయః ॥

అవ్యాకృతశక్తి-ఉదన్వతః= ఇంద్రియగోచరము కాని శక్తులకు సముద్రమైనట్టియు, పరస్య= ప్రకృతికి అతీతుడైనట్టియు, పరమ-ఆత్మనః = అంతరతమమగు ఆత్మయైన, హరేః= శ్రీహరియొక్క, ఏవమ్= ఈ విధమైన, సాక్షాత్ గిరిత్రమోక్షమ్= సాక్షాత్తు కైలాసపాలకుడగు శివుని విడిపించుటను, యః= ఎవడైతే, కథయేత్= చెప్పునో, వా= లేదా, శృణోతి= వినునో అట్టివాడు, సంసృతిభిః= సంసారబంధములచే, తథా= అదే విధముగా, అరిభిః= శత్రువులచే, విముచ్యతే= విడిచిపెట్టబడును.

ప్రకృతికి అతీతుడగు శ్రీహరి ఇంద్రియగోచరము కాని శక్తులకు సముద్రమువంటి వాడు. ఆయన ప్రాణులలో ఆత్మరూపుడై ఉన్నాడు. ఆయన సాక్షాత్తు కైలాసపాలకుడగు శివుని విముక్తుని చేసిన వృత్తాంతమును ఎవడు ప్రవచించునో, లేదా వినునో అట్టివాడు సంసారబంధములనుండి, మరియు శత్రుబాధనుండి విముక్తుడగును.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
భస్మాసురుని వృత్తాంతమును వర్ణించే
ఎనుబది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (88).

* * *

అథ ఏకోనవతితమోఽధ్యాయః

భృగువు త్రిమూర్తులను పరీక్షించుట - మరణించిన బ్రాహ్మణ బాలకులను శ్రీకృష్ణుడు మరల బ్రతికించుట

శ్రీశుక ఉవాచ ।

సరస్వత్యాస్తటే రాజన్ఋషయ స్సత్రమాసత ।
వితర్కస్సమభూత్తేషాం త్రిష్వధీశేషు కో మహాన్ ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, రాజన్= ఓ రాజా!, ఋషయః= మహర్షులు, సరస్వత్యాః= సరస్వతీనదియొక్క, తటే= ఒడ్డునందు, సత్రమ్= సత్రయాగమును, ఆసత= అనుష్ఠించిరి, తేషామ్= వారికి, వితర్కః= వివాదము, సమభూత్= కలిగెను, త్రిషు= ముగ్గురు, అధి-ఈశేషు= జగన్నాథులలో, కః= ఎవరు, మహాన్= గొప్పవాడు?

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...పరీక్షిన్మహారాజా! మహర్షులు సరస్వతీ నదీతీరమునందు సత్రయాగమును చేసిరి. అప్పుడు వారిలో, ముగ్గురు జగన్నాథులలో గొప్పవారు ఎవరు? అనే విషయమై వివాదము కలిగెను.

తస్య జిజ్ఞాసయా తే వై భృగుం బ్రహ్మసుతం నృప ।
తజ్జ్ఞప్త్యై ప్రేషయామాసుస్సోఽభ్యగాద్బ్రహ్మణస్సభామ్ ॥ 2

నృప= ఓ రాజా!, తస్య= ఆ మహత్త్వముయొక్క, జిజ్ఞాసయా= తెలియాలనే కోరికతో, తే వై= ఆ మహర్షులైతే, బ్రహ్మసుతమ్= బ్రహ్మదేవుని పుత్రుడగు, భృగుమ్= భృగువును, తద్-జ్ఞప్త్యై= ఆ మహత్త్వమును తెలియుటకై, ప్రేషయామాసుః= పంపించిరి, సః= ఆయన, బ్రహ్మణః= బ్రహ్మదేవుని, సభామ్= సభను గురించి, అభ్యగాత్= వెళ్లెను.

ఓ పరీక్షిన్మహారాజా! వారికి ఎవరు గొప్పయో తెలియాలనే కోరిక కలిగెను.వారి మహత్త్వమునరయుటకై వారు బ్రహ్మదేవుని పుత్రుడగు భృగువును పంపించిరి. ఆ భృగువు బ్రహ్మదేవుని సభకు వెళ్లెను.

న తస్మై ప్రహ్వణం స్తోత్రం చక్రే సత్త్వపరీక్షయా ।
తస్మై చుక్రోధ భగవాన్ ప్రజ్వలన్ స్వేన తేజసా ॥ 3

సత్త్వపరీక్షయా= సత్త్వగుణపరీక్ష కొరకై, తస్మై= ఆయన కొరకు, ప్రహ్వణమ్= నమస్కారమును, స్తోత్రమ్= స్తోత్రమును, న చక్రే= చేయలేదు, భగవాన్= బ్రహ్మదేవుడు, స్వేన= తన, తేజసా= తేజస్సుచే, ప్రజ్వలన్= మండిపడువాడై, తస్మై= ఆయన కొరకు, చుక్రోధ= కోపించెను.

బ్రహ్మదేవుని సత్త్వగుణమును పరీక్షించుటకై భృగువు ఆయనకు నమస్కారమును గాని, స్తోత్రమును గాని చేయలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు తన తేజస్సుతో మండిపడుతూ భృగువుపై కోపించెను.

స ఆత్మన్యేత్థితం మన్యుమాత్మజాయాత్మనా ప్రభుః ।
అశీశమద్యథా వహ్నిం స్వయోన్యా వారిణాఽఽత్మభూః ॥ 4

సః= ఆ, ఆత్మభూః= స్వయంభువుడగు, ప్రభుః= బ్రహ్మదేవుడు, ఆత్మని= మనస్సునందు, ఆత్మజాయ= పుత్రుని కొరకు, ఉత్థితమ్= పైకి లేచిన, మన్యుమ్= కోపమును, ఆత్మనా= వివేకబుద్ధిచే, వహ్నిమ్= అగ్నిని, స్వయోన్యా= తానే కారణముగా గల, వారిణా యథా= నీటితో వలె, అశీశమత్= చల్లార్చెను.

అగ్నిని అగ్నినుండే పుట్టిన నీటితో చల్లారునట్లు చేయుదురు. అదే విధముగా, స్వయంభువుడగు ఆ బ్రహ్మదేవుడు వివేకబుద్ధిచే మనస్సులో తన పుత్రుడగు భృగువుపై పుట్టిన కోపమును శమింపజేసెను.

తతః కైలాసమగమత్స తం దేవో మహేశ్వరః ।
పరిరబ్ధుం సమారేభే ఉత్థాయ భ్రాతరం ముదా ॥ 5

తతః= తరువాత, సః= ఆయన, కైలాసమ్= కైలాసమును గురించి, అగమత్= వెళ్లెను, మహా-ఈశ్వరః దేవః= మహేశ్వరదేవుడు, ముదా= ఆనందముతో, ఉత్థాయ= లేచి నిలబడి, భ్రాతరమ్= తమ్ముడైన, తమ్= ఆ భృగువును, పరిరబ్ధుమ్= కౌగిలించుటకు, సమారేభే= ఆరంభించెను.

తరువాత ఆ భృగువు కైలాసమునకు వెళ్లెను. మహేశ్వర దేవుడానందముతో లేచి నిలబడి తమ్ముడు భృగువును కౌగిలించుట-కుద్యుక్తుడాయెను.

నైచ్ఛత్త్వమస్యుత్పథగ ఇతి దేవశ్చుకోప హ ।
శూలముద్యమ్య తం హంతుమారేభే తిగ్మలోచనః ॥ 6

త్వమ్= నీవు, ఉత్-పథగః= మర్యాదలనుల్లంఘించువాడవు, అసి= అగుచున్నావు, ఇతి= అని, న ఐచ్ఛత్= ఇష్టపడలేదు, దేవః= శివప్రభుడు, చుకోప హ= కోపించెను, తిగ్మలోచనః= ఎర్రని కన్నులు గలవాడు, శూలమ్= శూలమును, ఉద్యమ్య= పైకెత్తి, తమ్= ఆ భృగువును, హంతుమ్= సంహరించుటకు, ఆరేభే= ఆరంభించెను.

నీవు మర్యాదలనుల్లంఘించువాడవు, అంటూ భృగువు శివప్రభుని కౌగిలికి ఇష్టపడలేదు. కోపముతో కన్నులు ఎరుపెక్కిన శివుడు శూలమును పైకెత్తి ఆ భృగువును సంహరించుటకుద్యుక్తుడాయెను.

పతిత్వా పాదయోర్దేవీ సాంత్వయామాస తం గిరా ।
అథో జగామ వైకుంఠం యత్ర దేవో జనార్దనః ॥ 7

దేవీ= పార్వతీదేవి, పాదయోః= పాదములపై, పతిత్వా= పడి, తమ్= ఆ శివుని, గిరా= వాక్కుతో, సాంత్వయామాస= అనునయించెను, అథో= తరువాత, వైకుంఠమ్= వైకుంఠమును గురించి, జగామ= వెళ్లెను, యత్ర= ఎక్కడనైతే, జన-అర్దనః= దుష్టజనశిక్షకుడగు, దేవః= శ్రీహరి (కలడో).

పార్వతీదేవి ఆ శివుని పాదములపై పడి అనునయవాక్యములతో శాంతింపజేసెను. తరువాత భృగువు దుష్టజనశిక్షకుడగు శ్రీహరి దేవుడు ఉండే వైకుంఠమునకు వెళ్లెను.

శయానం శ్రియ ఉత్సంగే పదా వక్షస్యతాడయత్ ।
తత ఉత్థాయ భగవాన్ సహ లక్ష్మ్యా సతాం గతిః ॥ 8

శ్రియః= లక్ష్మీదేవియొక్క, ఉత్సంగే= ఒడియందు, శయానమ్= పరుండియున్న శ్రీహరిని, పదా= కాలితో, వక్షసి= వక్షఃస్థలమునందు, అతాడయత్= తన్నెను, తతః= అప్పుడు, సతామ్= సత్పురుషులకు, గతిః= గమ్యమైన, భగవాన్= శ్రీహరి భగవానుడు, లక్ష్మ్యా సహ= లక్ష్మీదేవితో సహా, ఉత్థాయ= పైకి లేచి...

లక్ష్మీదేవి ఒడిలో పరుండియున్న శ్రీహరిని భృగువు కాలితో వక్షఃస్థలముపై తన్నెను. సత్పురుషులచే ఆత్మరూపముగా పొందబడే శ్రీహరి భగవానుడు అప్పుడు లక్ష్మీదేవితో సహా లేచి నిలబడెను.

స్వతల్పాదవరుహ్యేథ ననామ శిరసా మునిమ్ ।
ఆహ తే స్వాగతం బ్రహ్మన్నిషీదాత్రాసనే క్షణమ్ ।
అజానతామాగతాన్ వః క్షంతుమర్హథ నః ప్రభో ॥ 9

అథ= అప్పుడు, స్వతల్పాత్= తన శయ్యనుండి, అవరుహ్య= దిగి, మునిమ్= భృగు మహర్షిని, శిరసా= శిరస్సుతో, ననామ= నమస్కరించెను, ఆహ= పలికెను, తే= నీ కొరకు, స్వాగతమ్= స్వాగతము, బ్రహ్మన్= ఓ మహర్షీ!, అత్ర= ఈ, ఆసనే= ఆసనముపై, క్షణమ్= క్షణకాలము, నిషీద= కూర్చుండుము, ప్రభో= ఓ ప్రభూ!, ఆగతాన్= వచ్చిన, వః= మిమ్ములను, అజానతామ్= గమనించని, నః = మమ్ములను, క్షంతుమ్= క్షమించుటకు, అర్హథ= తగుదువు.

అప్పుడు శ్రీహరి తన శయ్యపైనుండి దిగి భృగు మహర్షికి తల వంచి నమస్కరించి ఇట్లు పలికెను...ఓ మహర్షీ! తమరికి స్వాగతము. ఈ ఆసనముపై క్షణకాలము కూర్చుండుడు. ఓ ప్రభూ! మీ రాకను మేము గమనించలేదు. మమ్ములను తమరు క్షమించ దగును.

అతీవ కోమలా తాత చరణౌ తే మహామునే ।
ఇత్యుక్త్వా విప్రచరణౌ మర్దయన్ స్వేన పాణినా ॥ 10

తాత= తండ్రీ!, మహామునే= ఓ మహర్షీ!, తే= నీ, చరణౌ= పాదములు, అతీవ= మిక్కిలి, కోమలౌ= సుకుమారములు, ఇతి= అని, ఉక్త్వా= పలికి, స్వేన= తన, పాణినా= చేతితో, విప్రచరణౌ= మహర్షి పాదములను, మర్దయన్= నొక్కువాడు.

ఓ తండ్రీ! మహర్షీ! నీ పాదములు మిక్కిలి సుకుమారములు అని పలికి శ్రీహరి తన చేతితో ఆ మహర్షి పాదములను నొక్కెను.

పునీహి సహలోకం మాం లోకపాలాంశ్చ మద్గతాన్ ।
పాదోదకేన భవతస్తీర్థానాం తీర్థకారిణా ॥ 11

తీర్థానామ్= తీర్థములకు, తీర్థకారిణా= తీర్థత్వమును కలిగించే, భవతః= నీయొక్క, పాద-ఉదకేన= పాదజలముతో, సహలోకమ్= వైకుంఠలోకముతో కూడిన, మామ్= నన్ను, మద్-గతాన్= నాయందున్న, లోకపాలాన్ చ= లోకపాలకులను కూడ, పునీహి= పావనము చేయుము.

నీ పాదజలము గంగాది తీర్థములకు పావనము చేసే శక్తినిచ్చును. దానితో నన్ను, నా వైకుంఠలోకమును, నాయందున్న లోకపాలకులను కూడ పవిత్రము చేయుము.

అద్యాహం భగవంల్లక్ష్మ్యా ఆసమేకాంతభాజనమ్ ।
వత్స్యత్యురసి మే భూతిర్భవత్పాదహతాంహసః ॥ 12

భగవన్= ఓ పూజనీయా!, అద్య= ఈనాడు, అహమ్= నేను, లక్ష్మ్యాః = లక్ష్మీదేవికి, ఏకాంతభాజనమ్= ఒకే ఒక ఆశ్రయమును, ఆసమ్= అయితిని, భవత్-పాదహత-అంహసః= తమరి పాదముచే నశింపజేయ బడిన దోషములు గల, మే= నాయొక్క, ఉరసి= వక్షఃస్థలమునందు, భూతిః = లక్ష్మీదేవి, వత్స్యతి= నివసించగలదు.

ఓ పూజనీయా! ఈనాడు నేను లక్ష్మీదేవికి ఏకాంతమగు ఆశ్రయమునైతిని. తమరి పాదముయొక్క స్పర్శ నాలోని దోషములను నశింపజేసినది. లక్ష్మీదేవి నా వక్షఃస్థలముపై నిత్యనివాసము చేయగలదు.

శ్రీశుక ఉవాచ ।

ఏవం బ్రువాణే వైకుంఠే భృగుస్తన్మంద్రయా గిరా ।
నిర్వృతస్తర్పితస్తూష్ణీం భక్త్యుత్కంఠోఽశ్రులోచనః ॥ 13

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, వైకుంఠే= శ్రీహరి, ఏవమ్= ఈ విధముగా, బ్రువాణే= పలుకుచుండగా, తత్-మంద్రయా= ఆయనయొక్క మధురమైన, గిరా= వాక్కుచే, నిర్వృతః= సుఖితుడు, తర్పితః= తృప్తి జెందినవాడు, భక్తి-ఉత్కంఠః= భక్తిచే విహ్వలుడు, అశ్రులోచనః= నీళ్ల నిండిన కన్నులు గలవాడు అగు, భృగుః= భృగువు, తూష్ణీమ్= మిన్నకుండెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...శ్రీహరి ఇట్లు పలుకుచుండగా ఆయన యొక్క మధురమైన వాక్కుచే భృగుమహర్షికి సుఖము, తృప్తి కలిగెను. ఆయన భక్తిచే విహ్వలుడై, కన్నుల నీరు నిండగా, మిన్నకుండెను.

పునశ్చ సత్రమావ్రజ్య మునీనాం బ్రహ్మవాదినామ్ ।
స్వానుభూతమశేషేణ రాజన్ భృగురవర్ణయత్ ॥ 14

రాజన్= ఓ రాజా!, భృగుః= భృగువు, పునః చ= మరల, సత్రమ్= సత్రయాగమును గురించి, ఆవ్రజ్య= వచ్చి, బ్రహ్మవాదినామ్=

వేదవేత్తలగు, మునీనామ్= మునులకు, స్వ-అనుభూతమ్= తన అనుభవమును, అశేషేణ= నిశ్శేషముగా, అవర్ణయత్= వర్ణించెను.

ఓ పరీక్షిన్మహారాజా! భృగుమహర్షి సత్రయాగమునకు తిరిగి వచ్చి, వేదవేత్తలగు మహర్షులకు తన అనుభవమును నిశ్శేషముగా వర్ణించెను.

తన్నిశమ్యాథ మునయో విస్మితా ముక్తసంశయాః ।
భూయాంసం శ్రద్దధుర్విష్ణుం యతశ్శాంతిర్యతోఽభయమ్ ॥ 15

తత్= దానిని, నిశమ్య= విని, మునయః= మహర్షులు, అథ= అప్పుడు, విస్మితాః= విస్మయము గలవారు, ముక్తసంశయాః= తొలగించ బడిన సంశయము గలవారు, విష్ణుమ్= శ్రీహరిని, భూయాంసమ్= గొప్పవానినిగా, శ్రద్దధుః= విశ్వసించిరి, యతః= ఏ శ్రీహరినుండి, శాంతిః = శాంతియో, యతః= ఏ శ్రీహరినుండి, అభయమ్= ఆభయమో.

ఆ వృత్తాంతమును విని మహర్షులు అప్పుడు చకితులైరి. వారి సంశయములు తొలగిపోయెను. శ్రీహరియే గొప్పవాడని వారు విశ్వసించిరి. శ్రీహరి వలననే శాంతి, అభయము సిద్ధించును.

ధర్మస్సాక్షాద్యతో జ్ఞానం వైరాగ్యం చ తదన్వితమ్ ।
ఐశ్వర్యం చాష్టధా యస్మాద్యశశ్చాత్మమలాపహమ్ ॥ 16

యతః= ఎవని వలన, ధర్మః= ధర్మమో, సాక్షాత్= సాక్షాత్కార రూపమైన, జ్ఞానమ్= జ్ఞానమో, తద్-అన్వితమ్= దానితో కూడిన, వైరాగ్యం చ= వైరాగ్యము కూడానో, యస్మాత్= ఎవని వలన, అష్టధా= ఎనిమిది ప్రకారములుగా, ఐశ్వర్యమ్= ఐశ్వర్యమో, ఆత్మమల-అపహమ్= అంతఃకరణమాలిన్యమును పోగొట్టే, యశః చ= కీర్తియో.

శ్రీహరి వలన ధర్మము, సాక్షాత్కారరూపమైన జ్ఞానము, ఆ జ్ఞానముతో కూడిన వైరాగ్యము, అణిమాద్యష్టైశ్వర్యములు కలుగును. శ్రీహరి కీర్తి అంతఃకరణమాలిన్యమును పోనాడును

మునీనాం న్యస్తదండానాం శాంతానాం సమచేతసామ్ ।
అకించనానాం సాధూనాం యమాహుః పరమాం గతిమ్ ॥ 17

న్యస్తదండానామ్= విడిచిపెట్టబడిన భూతహింస కలిగినట్టియు, శాంతానామ్= శాంతులైనట్టియు, సమచేతసామ్= సమదృష్టి కలిగినట్టియు, అకించనానామ్= సర్వస్వమును త్యాగము చేసినట్టియు, సాధూనామ్= పరోపకారమును చేసే, మునీనామ్= మహర్షులకు, యమ్= ఏ శ్రీహరిని, పరమామ్= సర్వాతిశాయియగు, గతిమ్= మోక్షఫలమునుగా, ఆహుః= చెప్పెదరో.

భూతహింసను, సర్వస్వమును విడిచిపెట్టి శాంతులై సమచిత్తులై పరోపకారమును చేసే మహర్షులు పొందే మోక్షఫలము ఆ శ్రీహరియేనని చెప్పెదరు.

సత్త్వం యస్య ప్రియా మూర్తి ర్బ్రాహ్మణాస్త్విష్టదేవతాః ।
భజంత్యనాశిషశ్శాంతా యం వా నిపుణబుద్ధయః ॥ 18

యస్య= ఎవనికి, సత్త్వమ్= సత్త్వగుణము, ప్రియా= ప్రియమైన, మూర్తిః= మూర్తియో, ఇష్టదేవతాః తు= ఇష్టదైవములైతే, బ్రాహ్మణాః= బ్రాహ్మణులో, యం వా= ఎవనినైతే, అనాశిషః= కామన లేనివారు, శాంతాః= శాంతులు, నిపుణబుద్ధయః= వివేకపూర్ణమగు బుద్ధి గలవారు, భజంతి= భజించెదరో.

శ్రీహరికి సత్త్వప్రధానమగు మూర్తి ప్రియము. ఆయనకు బ్రాహ్మణులే ఇష్టదైవము. ఆయనను నిష్కాములు, శాంతులు, వివేకపూర్ణ-మగు బుద్ధి గలవారు అగు సాధకులు భజించెదరు.

త్రివిధాకఋతయస్తస్య రాక్షసా అసురాస్సురాః ।
గుణిన్యా మాయయా సృష్టాస్తత్త్వం తత్తీర్థసాధనమ్ ॥ 19

తస్య= ఆ శ్రీహరికి, గుణిన్యా= త్రిగుణాత్మికయగు, మాయయా= మాయాశక్తిచే, సృష్టాః= సృష్టించబడిన, రాక్షసాః= రాక్షసులు, అసురాః = అసురులు, సురాః= దేవతలు అనే, త్రివిధ-ఆకృతయః= మూడు రకముల ఆకారములు, తత్= ఆయనయొక్క, సత్త్వమ్= సత్త్వగుణ ప్రధానమగు మూర్తి, తీర్థసాధనమ్= పురుషార్థ హేతువు.

ఆ శ్రీహరికి సత్త్వరజస్తమోగుణాత్మికయగు మాయాశక్తిచే రాక్షసులు (క్రూరస్వభావులు, తామసులు), అసురులు (భోగపరాయణులు, రాజసులు), దేవతలు (చిన్మయులు, సాత్త్వికులు) అనే మూడు రూపములు సృష్టించబడినవి. ఆయనయొక్క సత్త్వగుణప్రధానమగు మూర్తి పురుషార్థ హేతువు.

శ్రీశుక ఉవాచ ।

ఏవం సారస్వతా విప్రా నృణాం సంశయనుత్తయే ।
పురుషస్య పదాంభోజసేవయా తద్గతిం గతాః ॥ 20

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, సారస్వతాః= సరస్వతీ నదీతీరమునందు నివసించే, విప్రాః= వేదవేత్తలు, నృణామ్= మానవుల, సంశయనుత్తయే= సంశయమును పోగొట్టుటకై, ఏవమ్= ఈ విధముగా (నిశ్చయించి), పురుషస్య= పూర్ణుడగు శ్రీహరియొక్క, పద-అంభః -జసేవయా= పద్మములవంటి పాదములసేవచే, తద్-గతిమ్= ఆయన స్వరూపమును, గతాః= పొందినవారు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...సరస్వతీనదీతీరవాసులగు వేదవేత్తలు ఈ విధముగా మానవుల సంశయమును నివారణ చేసిరి. వారు పూర్ణుడగు శ్రీహరియొక్క పద్మములవంటి పాదములను సేవించి ఆయన స్వరూపమును పొందిరి.

సూత ఉవాచ ।

ఇత్యేతన్మునితనయాస్యపద్మగంధ-
పీయూషం భవభయభిత్పరస్య పుంసః ।
సుశ్లోకం శ్రవణపుటైః పిబత్యభీక్ష్ణం
పాంథోఽధ్వభ్రమణపరిశ్రమం జహాతి ॥ 21

సూతః= సూత మహర్షి ఉవాచ= పలికెను, మునితనయ-ఆస్య-పద్మగంధపీయూషమ్= వ్యాసపుత్రుడగు శుకమహర్షియొక్క పద్మమువంటి ముఖముయొక్క పరిమళము గల అమృతమైనట్టియు, భవభయభిత్= సంసారభయమును పోగొట్టునట్టియు, పరస్య పుంసః= పురుషోత్తముని యొక్క, సుశ్లోకమ్= కొనియాడదగిన మహిమను, శ్రవణపుటైః= చెవులనే దొప్పలతో, అభీక్ష్ణమ్= మరల మరల, పాంథః= జీవనయాత్ర చేసే వ్యక్తి, పిబతి= పానము చేయును, అధ్వభ్రమణపరిశ్రమమ్= మార్గము నందు తిరుగాడుటచే కలిగిన శ్రమను, జహాతి= విడిచిపెట్టును.

సూతమహర్షి ఇట్లు పలికెను...పురుషోత్తమునియొక్క మహిమ సంసారభయమును పోగొట్టునది, కొనియాడదగినది. వ్యాసపుత్రుడగు శుకమహర్షియొక్క ముఖపద్మమునుండి జాలువారే ఆ మహిమ పరిమళభరితమైన అమృతమువంటిది. సంసారయాత్ర చేసే సాధకుడు దానిని మరల మరల చెవులనే దొప్పలతో పానము చేసినచో, సంసారము నందు తిరుగుటచే కలిగే శ్రమ దూరమగును.

శ్రీశుక ఉవాచ ।

ఏకదా ద్వారవత్యాం తు విప్రపత్న్యాః కుమారకః ।
జాతమాత్రో భువం స్పృష్ట్వా మమార కిల భారత ॥ 22

శ్రీశుకః= శ్రీశుకమహర్షి ఉవాచ= పలికెను, భారత= భరత-వంశీయుడవగు ఓ రాజా!, ఏకదా తు= ఒకప్పుడైతే, ద్వారవత్యామ్=

ద్వారకయందు, విప్రపత్న్యాఃక బ్రాహ్మణుని భార్యయొక్క, కుమారకఃక శిశువు, జాతమాత్రఃక పుట్టినవాడు మాత్రమే, భువమ్క భూమిని, స్పృష్ట్వాక స్పృశించి, మమార కిలక మరణించెను.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...భరతవంశీయుడవగు ఓ పరీక్షిన్మహారాజా! ఒకప్పుడు ద్వారకా- నగరములో ఒక బ్రాహ్మణపత్నికి ప్రసవమాయెను. శిశువు పుట్టి నేలపై పడుటతోడనే మరణించెను.

విప్రో గృహీత్వా మృతకం రాజద్వార్యుపధాయ సఃక
ఇదం ప్రోవాచ విలపన్నాతురో దీనమానసఃక క క క 23

విలపన్క ఏడ్చుచున్నవాడు, ఆతురఃక వ్యాకులమైన చిత్తము గలవాడు, దీనమానసఃక దీనమైన మనస్సు గలవాడు అగు, సఃక ఆ, విప్రఃక బ్రాహ్మణుడు, మృతకమ్క మరణించిన శిశువును, గృహీత్వాక తీసుకొని, రాజద్వారిక రాజద్వారమునందు, ఉపధాయక ఉంచి, ఇదమ్క ఈ మాటను, ప్రోవాచక పలికెను.

వ్యాకులమైన చిత్తము గల ఆ బ్రాహ్మణుడు ఏడ్చుచుండెను. దీనమైన మనస్సు గల ఆతడు మరణించిన శిశువును తీసుకువెళ్లి రాజద్వారము వద్ద పెట్టి ఇట్లు పలికెను.

బ్రహ్మద్విషశ్శఠధియో లుబ్ధస్య విషయాత్మనఃక
క్షత్రబంధోఃక కర్మదోషాత్పంచత్వం మే గతోఽర్భకఃక క క 24

బ్రహ్మద్విషఃక బ్రాహ్మణులను ద్వేషించునట్టియు, శఠధియఃక మోసపూరితమైన బుద్ధి కలిగినట్టియు, లుబ్ధస్యక లోభియైనట్టియు, విషయ-ఆత్మనఃక భోగములయందు మనస్సు కలిగినట్టియు, క్షత్రబంధోఃక అధముడగు క్షత్రియుని కర్మదోషాత్క కర్మయందలి దోషము వలన, మేక నా, అర్భకఃక పిల్లవాడు, పంచత్వం గతఃక మరణించినవాడు.

ఈ రాజు బ్రాహ్మణులను ద్వేషించే అధముడు. ఈతని బుద్ధి మోసపూరితము. ఈ లోభి మనస్సు భోగములయందు లగ్నమైయున్నది. వీని కర్మయందలి దోషము వలన నా పిల్లవాడు మరణించెను.

హింసావిహారం నృపతిం దుశ్శీలమజితేంద్రియమ్ ।
ప్రజా భజంత్యస్సీదంతి దరిద్రా నిత్యదుఃఖితాః ॥ 25

హింసావిహారమ్= హింసయందు విహరించునట్టియు, దుశ్శీలమ్= దుష్టమైన శీలము కలిగినట్టియు, అజిత-ఇంద్రియమ్= జయించబడని ఇంద్రియములు కల, నృపతిమ్= రాజును, భజంత్యః= సేవించే, ప్రజాః= ప్రజలు, దరిద్రాః= దరిద్రులై, నిత్యదుఃఖితాః= నిత్యము దుఃఖము గలవారై, సీదంతి= కష్టపడెదరు.

రాజు చెడు శీలము గలవాడై హింసయందు విహరిస్తూ ఇంద్రియ జయము లేనివాడైనచో, అట్టి రాజును సేవించే ప్రజలు దరిద్రులై నిత్యము దుఃఖములననుభవిస్తూ ఇడుముల పాలగుదురు.

ఏవం ద్వితీయం విప్రర్షిస్తృతీయం త్వేవమేవ చ ।
విసృజ్య స నృపద్వారి తాం గాథాం సమగాయత ॥ 26

సః= ఆ, విప్ర-ఋషిః= వేదవేత్తయగు మహర్షి, ద్వితీయమ్= రెండవ శిశువును, ఏవమ్= ఈ విధముగా, తృతీయం చ= మూడవ శిశువును కూడ, ఏవం ఏవ= ఇదే విధముగా, నృపద్వారి= రాజద్వారము నందు, విసృజ్య= విడిచిపెట్టి, తామ్= ఆ, గాథామ్= వాక్యమును, సమగాయత= బిగ్గరగా చెప్పెను.

వేదవేత్తయగు ఆ మహర్షియొక్క రెండవ, మూడవ శిశువులు కూడ ఇదే విధముగా మరణించగా, ఆయన రాజద్వారము వద్ద మృతశిశువును ఉంచి, అదే విధముగా బిగ్గరగా పలికెను.

తామర్జున ఉపశ్రుత్య కర్హిచిత్కేశవాంతికే ।
పరేతే నవమే బాలే బ్రాహ్మణం సమభాషత ॥ 27

కర్హిచిత్= ఒకనాడు, నవమే= తొమ్మిదవ, బాలే= పిల్లవాడు, పరేతే= మరణించగా, కేశవ-అంతికే= శ్రీకృష్ణ భగవానుని సమీపమునందు, అర్జునః= అర్జునుడు, తామ్= ఆ మాటను, ఉపశ్రుత్య= విని, బ్రాహ్మణమ్= బ్రాహ్మణుని ఉద్దేశించి, సమభాషత= పలికెను.

ఒకనాడు అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని వద్దనుండెను. అప్పుడు మరల ఆ బ్రాహ్మణుని తొమ్మిదవ పిల్లవాడు మరణించెను. ఆ బ్రాహ్మణుడు పలికిన పలుకులను అర్జునుడు విని ఆయనతో నిట్లనెను.

కిం స్విద్బ్రహ్మంస్త్వన్నివాసే ఇహ నాస్తి ధనుర్ధరః ।
రాజన్యబంధురేతే వై బ్రాహ్మణాస్సత్ర ఆసతే ॥ 28

బ్రహ్మన్= ఓ మహర్షీ!, త్వత్-నివాసే= నీ నివాసస్థానమైన, ఇహ= ఈ ద్వారకయందు, ధనుః-ధరః= ధనుస్సు పట్టిన, రాజన్యబంధుః= అధమ క్షత్రియుడు, కిం స్విత్ న అస్తి= లేడాయేమి?, ఏతే వై= వీరైతే, బ్రాహ్మణాః= బ్రాహ్మణులు, సత్రే= సత్రయాగమునందు, ఆసతే= ఉన్నారు.

ఓ మహర్షీ! నీవు నివసించే ఈ ద్వారకయందు ధనుస్సు పట్టిన అధమ క్షత్రియుడు కూడ లేడా యేమి? ఈ యదువంశక్షత్రియులు బ్రాహ్మణులుగా మారి పాలనను విడిచి యాగములో కూర్చుండినారు కాబోలు!

ధనదారాత్మజాపృక్తా యత్ర శోచంతి బ్రాహ్మణాః ।
తే వై రాజన్యవేషేణ నటా జీవంత్యసుంభరాః ॥ 29

యత్ర= ఎక్కడనైతే, బ్రాహ్మణాః= బ్రాహ్మణులు, ధనదార-ఆత్మజ-అపృక్తాః= ధనము భార్య పుత్రులనుండి వియోగమును పొందినవారై,

శోచంతి= దుఃఖించెదరో, తే వై= ఆ క్షత్రియులు, రాజన్యవేషేణ= రాజు యొక్క వేషముతో, నటాఃా= నటులు, అసుంభరాఃా= పొట్ట పోసుకొను వారు, జీవంతి= జీవించుచున్నారు.

ఏ రాజ్యమునందైతే బ్రాహ్మణులు ధనమును, భార్యను, సంతానమును కోల్పోయి దుఃఖించెదరో, ఆ పాలకులు రాజు వేషములో నున్న నటులు వారు రాజ్యాధికారముతో పొట్ట పోసుకొని జీవించువారు మాత్రమే.

అహం ప్రజా వాం భగవన్ రక్షిష్యే దీనయోరిహ ।
అనిస్తీర్ణప్రతిజ్ఞోఽగ్నిం ప్రవేక్ష్యే హతకల్మషః ॥ 30

భగవన్= ఓ పూజనీయా!, దీనయోఃా= దీనులగు, వామ్= మీ యిద్దరి, ప్రజాఃా= పిల్లలను, ఇహ= ఇక్కడ (ఇప్పుడు), అహమ్= నేను, రక్షిష్యే= రక్షించగలను, అనిస్తీర్ణప్రతిజ్ఞఃా= తీర్చబడని ప్రతిజ్ఞ గలవాడనై, అగ్నిమ్= అగ్నిని, ప్రవేక్ష్యే= ప్రవేశించగలను, హతకల్మషఃా= నశింపజేయ-బడిన పాపములు గలవాడను.

ఓ పూజనీయా! దీనులగు మీ దంపతుల పిల్లలను నేను ఇప్పుడు ఇక్కడ రక్షించెదను. ప్రతిజ్ఞ నెరవేర్చకపోయినచో, నేను అగ్నిలో ప్రవేశించెదను. దానిచే, నా పాపములన్నియు నశించగలవు.

బ్రాహ్మణ ఉవాచ ।

సంకర్షణో వాసుదేవః ప్రద్యుమ్నో ధన్వినాం వరః ।
అనిరుద్ధోఽప్రతిరథో న త్రాతుం శక్నువంతి యత్ ॥ 31

బ్రాహ్మణఃా= బ్రాహ్మణుడు, ఉవాచ= పలికెను, డు, ఉవాచ= పలికెను, సంకర్షణఃా= బలరాముడు, వాసుదేవఃా= శ్రీకృష్ణుడు, ధన్వినామ్= ధనుర్ధారులలో, వరఃా= శ్రేష్ఠుడగు, ప్రద్యుమ్నఃా= ప్రద్యుమ్నుడు, అప్రతిరథఃా

= సమ ఉజ్జీ లేని, అనిరుద్ధః= అనిరుద్ధుడు, యత్= ఏ సంతానమును, త్రాతుమ్= రక్షించుటకు, న శక్నువంతి= సమర్థులు కారో.

బ్రాహ్మణుడిట్లు పలికెను...బలరాముడు, శ్రీకృష్ణుడు, ధనుర్ధారులలో శ్రేష్ఠుడగు ప్రద్యుమ్నుడు, సమ ఉజ్జీ లేని అనిరుద్ధుడు నా సంతానమును కాపాడలేకపోయిరి.

తత్కథం ను భవాన్ కర్మ దుష్కరం జగదీశ్వరైః ।
చికీర్షసి త్వం బాలిశ్యాత్తన్న శ్రద్దధ్మహే వయమ్ ॥ 32

జగద్-ఈశ్వరైః= జగన్నాథులచే, దుష్కరమ్= చేయ శక్యము కాని, తత్= ఆ, కర్మ= పనిని, భవాన్ ను= నీవైతే, కథమ్= ఎట్లు?, త్వమ్= నీవు, బాలిశ్యాత్= తెలివి తక్కువదనముచే, తత్= ఆ పనిని, చికీర్షసి= చేయగోరుచున్నావు, వయమ్= మేము, న శ్రద్ధధ్మహే= విశ్వసించము.

జగన్నాథులు చేయలేకపోయిన ఆ పనిని నీవు ఎట్లు చేసెదవు? నీవు తెలివి తక్కువదనముచే ఆ పనిని చేయగోరుచున్నావు. నిన్ను మేము విశ్వసించము.

అర్జున ఉవాచ ।

నాహం సంకర్షణో బ్రహ్మన్న కృష్ణః కార్ష్ణి రేవ చ ।
అహం వా అర్జునో నామ గాండీవం యస్య వై ధనుః ॥ 33

అర్జునః= అర్జునుడు, ఉవాచ= పలికెను, బ్రహ్మన్= ఓ బ్రాహ్మణుడా!, అహమ్= నేను, సంకర్షణః= బలరాముడను, న= కాను, కృష్ణః= శ్రీకృష్ణుడను, కార్ష్ణిః ఏవ చ= శ్రీకృష్ణుని పుత్రుడగు ప్రద్యుమ్నుడను కాని, న= కాను, అహం వై= నేనైతే, అర్జునః= అర్జునుడని, నామ= ప్రసిద్ధి చెందినవాడను, యస్య వై= ఎవనికైతే, ధనుః= ధనుస్సు, గాండీవమ్= గాండీవమో.

అర్జునుడిట్లు పలికెను...ఓ బ్రాహ్మణుడా! నేను బలరాముడను గాని, శ్రీకృష్ణుడను గాని, ఆయన పుత్రుడగు ప్రద్యుమ్నుడను గాని కాను. నేను అర్జునుడని ప్రసిద్ధి చెందినవాడను. నా ధనుస్సైతే గాండీవము.

మావమంస్థా మమ బ్రహ్మన్ వీర్యం త్ర్యంబకతోషణమ్ ।
మృత్యుం విజిత్య ప్రధన ఆనేష్యే తే ప్రజాం ప్రభో ॥ 34

బ్రహ్మన్= ఓ బ్రాహ్మణా!, త్రి-అంబకతోషణమ్= ముక్కంటిని సంతోషపెట్టిన, మమ= నాయొక్క, వీర్యమ్= పరాక్రమమును, మా అవమంస్థాః= అవమానించకుము, ప్రభో= ఓ ప్రభూ!, ప్రధనే= యుద్ధము నందు, మృత్యుమ్= మృత్యువును, విజిత్య= జయించి, తే= నీ, ప్రజామ్= సంతానమును, ఆనేష్యే= తీసుకువచ్చెదను.

ఓ బ్రాహ్మణా! ముక్కంటిని సంతోషపెట్టిన నా పరాక్రమము-నవమానించకుము. ఓ ప్రభూ! నేను యుద్ధములో యమధర్మరాజును జయించి నీ సంతానమును తీసుకురాగలను.

ఏవం విశ్రంభితో విప్రః ఫాల్గునేన పరంతప ।
జగామ స్వగృహం ప్రీతః పార్థవీర్యం నిశామయన్ ॥ 35

పరంతప= శత్రువులను తపింపజేయువాడా!, ఏవమ్= ఈ విధముగా, ఫాల్గునేన= అర్జునునిచే, విశ్రంభితః= నమ్మకము కల్గించబడిన, విప్రః= బ్రాహ్మణుడు, ప్రీతః= ప్రీతి జెందినవాడై, స్వగృహమ్= తన యింటిని గురించి, జగామ= వెళ్లెను, పార్థవీర్యమ్= అర్జునుని పరాక్రమమును గురించి, నిశామయన్= వినుచున్నవాడు.

శత్రువులను తపింపజేసే పరీక్షిన్మహారాజా! అర్జునుడీ విధముగా ఆ బ్రాహ్మణునకు నమ్మకము కలిగించెను. ఆయన సంతోషిస్తూ తన యింటికి వెళ్లెను. ఆయన అర్జునుని పరాక్రమమును గురించి వినుచుండెను.

ప్రసూతికాల ఆసన్నే భార్యాయా ద్విజసత్తమః ।
పాహి పాహి ప్రజాం మృత్యోరిత్యాహార్జునమాతురః ॥ 36

భార్యాయాఃⁿ= భార్యకు, ప్రసూతికాలే= ప్రసవించే సమయము, ఆసన్నే= దగ్గరపడగా, ఆతురఃⁿ= దుఃఖముతో కంగారు పడుచున్న, ద్విజసత్తమఃⁿ= బ్రాహ్మణశ్రేష్ఠుడు, ప్రజామ్= సంతానమును, మృత్యోఃⁿ= మృత్యువునుండి, పాహి= కాపాడుము, పాహి= కాపాడుము, ఇతి= అని, అర్జునమ్= అర్జునుని ఉద్దేశించి, ఆహ= పలికెను.

భార్యకు ప్రసూతి కాలము వచ్చెను. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు దుఃఖముతో కంగారు పడుతూ, సంతానమును మృత్యువునుండి కాపాడుము, కాపాడుము, అని అర్జునునితో చెప్పెను.

స ఉపస్పృశ్య శుచ్యంభో నమస్కృత్య మహేశ్వరమ్ ।
దివ్యాన్యస్త్రాణి సంస్మృత్య సజ్యం గాండీవమాదదే ॥ 37

సఃⁿ= ఆ అర్జునుడు, శుచిⁿ= స్వచ్ఛమైన, అంభఃⁿ= నీటిని, ఉపస్పృశ్యⁿ= త్రాగి, మహా–ఈశ్వరమ్= మహేశ్వరుని, నమస్కృత్యⁿ= నమస్కరించి, దివ్యానిⁿ= దేవతలనుండి పొందబడిన, అస్త్రాణిⁿ= అస్త్రములను, సంస్మృత్యⁿ= స్మరించి, సజ్యమ్= నారిత్రాడుతో కూడిన, గాండీవమ్= గాండీవమును, ఆదదేⁿ= తీసుకొనెను.

ఆ అర్జునుడు స్వచ్ఛమైన నీటిని త్రాగి, మహేశ్వరునకు నమస్కరించి, దేవతలిచ్చిన అస్త్రములను స్మరించి, నారిత్రాడు తగిల్చిన గాండీవమును తీసుకొనెను.

న్యరుణత్సూతికాగారం శరైర్నానాఽస్త్రయోజితైః ।
తిర్యగూర్ధ్వమధఃⁿ పార్థశ్చకార శరపంజరమ్ ॥ 38

పార్థః= అర్జునుడు, సూతికాగారమ్= ప్రసవగృహమును, నానా-అస్త్రయోజితైః= అనేకములైన అస్త్రములతో సంధించబడిన, శరైః= బాణములతో, న్యరుణత్= చుట్టూ కట్టివేసెను, తిర్యక్= అడ్డముగా, ఊర్ధ్వమ్= పైన, అధః= క్రింద, శరపంజరమ్= బాణముల పంజరమును, చకార= చేసెను.

అర్జునుడు అనేకములైన అస్త్రములను సంధానము చేసిన బాణములతో ప్రసవగృహమును చుట్టూ కట్టివేసెను. అడ్డముగా, పైన, క్రింద బాణముల పంజరమును చేసెను.

తతః కుమారస్సంజాతో విప్రపత్న్యా రుదన్ముహుః ।
సద్యోఽదర్శనమాపేదే సశరీరో విహాయసా ॥ 39

తతః= తరువాత, విప్రపత్న్యాః= బ్రాహ్మణుని భార్యకు, ముహుః = మరల మరల, రుదన్= ఏడ్చుచున్న, కుమారః= పిల్లవాడు, సంజాతః = పుట్టినవాడు, సద్యః= వెంటనే, సశరీరః= శరీరముతో కూడినవాడై, విహాయసా= ఆకాశముచే, అదర్శనం ఆపేదే= కనబడకుండా పోయెను.

తరువాత బ్రాహ్మణుని భార్య పిల్లవాడిని కనెను. ఆ పిల్లవాడు మరల మరల యేడుస్తూనే వెంటనే ఆకాశమార్గము గుండా శరీరముతో సహా కనబడకుండా పోయెను.

తదాఽఽహ విప్రో విజయం వినిందన్ కృష్ణసన్నిధౌ ।
మౌఢ్యం పశ్యత మే యోఽహం శ్రద్దధే క్లీబకత్థనమ్ ॥ 40

తదా= అప్పుడు, విప్రః= బ్రాహ్మణుడు, కృష్ణసన్నిధౌ= శ్రీకృష్ణుని సన్నిధియందు, విజయమ్= అర్జునుని, వినిందన్= నిందించువాడై, ఆహ= పలికెను, మే= నా, మౌఢ్యమ్= మూర్ఖత్వమును, పశ్యత= చూడుడు, యః= ఏ, అహమ్= నేను, క్లీబకత్థనమ్= నపుంసకుని బడాయిని, శ్రద్దధే= నమ్మితినో.

అప్పుడు బ్రాహ్మణుడు అర్జునుని శ్రీకృష్ణుని సన్నిధిలోనే నిందిస్తూ ఇట్లు పలికెను...నా మూర్ఖత్వమును చూడుడు. నపుంసకుని బడాయి కబుర్లను నేను నమ్మితిని.

న ప్రద్యుమ్నో నానిరుద్ధో న రామో న చ కేశవః ।
యస్య శేకుః పరిత్రాతుం కోఽన్యస్తదవితేశ్వరః ॥ 41

ప్రద్యుమ్నుఃన= ప్రద్యుమ్నుడు, న= కాడు, అనిరుద్ధుఃన= అనిరుద్ధుడు, న= కాడు, రామఃన= బలరాముడు, న= కాడు, కేశవఃచ= శ్రీకృష్ణ భగవానుడు కూడ, న= కాడు, యస్య= ఎవని (సంతానమును), పరిత్రాతుమ్= రక్షించుటకు, న శేకుఃన= సమర్థులు కాలేదో, తత్= ఆ విషయమునందు, అవితా= రక్షించే, ఈశ్వరఃన= సమర్థుడు, కఃన= ఎవడు?

ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, బలరాముడు, శ్రీకృష్ణ భగవానుడు కూడ నా సంతానమును రక్షించలేక పోయినారు. అట్టి స్థితిలో రక్షించగల మొనగాడు ఎవడు ఉండును? (ఉండడు).

ధిగర్జునం మృషావాదం ధిగాత్మశ్లాఘినో ధనుః ।
దైవోపసృష్టం యో మౌఢ్యాదావినీషతి దుర్మతిః ॥ 42

మృషావాదమ్= అసత్యమును పలికే, అర్జునమ్= అర్జునుని గురించి, ధిక్= నింద యగుగాక!, ఆత్మశ్లాఘినఃన= తన గొప్పలు చెప్పుకునే అర్జునుని, ధనుఃన= ధనుస్సు గురించి, ధిక్= నింద యగుగాక!, దుర్మతి= దుర్బుద్ధియగు, యఃన= ఏ అర్జునుడు, దైవ-ఉపసృష్టమ్= దైవముచే తీసుకుపోబడిన సంతానమును, మౌఢ్యాత్= మూర్ఖత్వము వలన, అవినీషతి= తీసుకురా గోరుచున్నాడో.

అసత్యమును పలికే అర్జునునకు, తన గొప్పలు చెప్పుకునే అర్జునుని ధనుస్సునకు నింద యగుగాక! అర్జునుడు దుర్బుద్ధి, మూర్ఖుడు, కావుననే, దైవము తీసుకుపోయిన నా సంతానమును తీసుకురా గోరుచున్నాడు.

ఏవం శపతి విప్రర్షౌ విద్యామాస్థాయ ఫాల్గునః ।
యయౌ సంయమనీమాశు యత్రాస్తే భగవాన్ యమః ॥ 43

విప్ర–ఋషౌ= వేదవేత్తయగు మహర్షి, ఏవమ్= ఈ విధముగా, శపతి= తిట్టుచుండగా, ఫాల్గునః= అర్జునుడు, విద్యామ్= యోగవిద్యను, ఆస్థాయ= స్వీకరించి, ఆశు= వెంటనే, సంయమనీమ్= సంయమనీ నగరమును గురించి, యయౌ= వెళ్లెను, యత్ర= ఎక్కడనైతే, యమః భగవాన్= యమ భగవానుడు, ఆస్తే= ఉన్నాడో.

వేదవేత్తయగు మహర్షి ఈ విధముగా తిట్టుచుండెను. అర్జునుడు యోగవిద్యనాశ్రయించి వెంటనే యమభగవానుడు నివసించే సంయమనీ నగరమునకు వెళ్లెను.

విప్రాపత్యమచక్షాణస్తత ఐంద్రీమగాత్పురీమ్ ।
ఆగ్నేయీం నైరృతీం సౌమ్యాం వాయవ్యాం వారుణీమథ ।
రసాతలం నాకపృష్ఠం ధిష్ణ్యన్యన్యాన్యుదాయుధః ॥ 44

ఉదాయుధః= పైకెత్తబడిన ఆయుధము గల అర్జునుడు, విప్ర–అపత్యమ్= బ్రాహ్మణుని పుత్రుని, అచక్షాణః= కానరానివాడై, తతః= అక్కడనుండి, ఐంద్రీమ్= ఇంద్రునకు చెందిన, పురీమ్= నగరమును గురించి, ఆగ్నేయీమ్= అగ్నియొక్క పురమును గురించి, నైరృతీమ్= నిరృతి యొక్క పురమును గురించి, సౌమ్యామ్= సోముని పురమును గురించి, వాయవ్యామ్= వాయువుయొక్క పురమును గురించి, అథ= తరువాత, వారుణీమ్= వరుణుని పురమును గురించి, రసాతలమ్= పాతాళమును గురించి, నాకపృష్ఠమ్= స్వర్గముయొక్క పైభాగమును గురించి, అన్యాని= ఇతరములైన, ధిష్ణ్యాని= ధామములను గురించి, అగాత్= వెళ్లెను.

అక్కడ అర్జునుడికి బ్రాహ్మణుని పుత్రుడు కనబడలేదు. ఆయన శస్త్రధారియై అక్కడనుండి ఇంద్ర–అగ్ని– నిరృతి–సోమ–వాయు–వరుణ

దేవతల పురములకు, పాతాళమునకు, స్వర్గముయొక్క పైభాగమునకు ఇతరములగు యక్షపురి మొదలైన ధామములకు వెళ్లెను.

తతోఽలబ్ధద్విజసుతో హ్యనిస్తీర్ణప్రతిశ్రుతః ।
అగ్నిం వివిక్షుః కృష్ణేన ప్రత్యుక్తః ప్రతిషేధతా ॥ 45

తతః= అప్పుడు, అలబ్ధద్విజసుతః= పొందబడని బ్రాహ్మణుని పుత్రుడు గలవాడు, అనిస్తీర్ణప్రతిశ్రుతః= నిలబెట్టుకొనబడని ప్రతిజ్ఞ గలవాడు అగు అర్జునుడు, అగ్నిమ్= అగ్నిని, హి= నిశ్చయముగా, వివిక్షుః= ప్రవేశించగోరువాడు, ప్రతిషేధతా= నిషేధించుచున్న, కృష్ణేన= శ్రీకృష్ణునిచే, ప్రత్యుక్తః= నివారించబడినవాడు.

అర్జునునకు బ్రాహ్మణుని పుత్రుడు లభించలేదు. ఆయన తాను చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనలేక పోయెను. అప్పుడాయన అగ్నిలో ప్రవేశించగోరగా, శ్రీకృష్ణుడు వద్దని నివారిస్తూ ఇట్లు పలికెను.

దర్శయే ద్విజసూనూంస్తే మాఽవజ్ఞాత్మానమాత్మనా ।
యే తే నః కీర్తిం విమలాం మనుష్యాః స్థాపయిష్యంతి ॥ 46

తే= నీకు, ద్విజసూనూన్= బ్రాహ్మణుని పుత్రులను, దర్శయే= చూపించెదను, ఆత్మానమ్= నిన్ను, ఆత్మనా= నీచే, మా అవజ్ఞ= అవమానించుకొనకుము, యే= ఏ, మనుష్యాః= మానవులో, తే= వారే, నః= మనయొక్క, విమలామ్= స్వచ్ఛమైన, కీర్తిమ్= కీర్తిని, స్థాపయిష్యంతి= స్థాపించగలరు.

నీకు బ్రాహ్మణుని పుత్రులను చూపించెదను. నిన్ను నీవే అవమానించుకొనకుము. ఏ మానవులు నిన్ను తిట్టినారో, వారే మనకు స్వచ్ఛమైన కీర్తిని నిలబెట్టగలరు.

ఇతి సంభాష్య భగవానర్జునేన సహేశ్వరః ।
దివ్యం స్వరథమాస్థాయ ప్రతీచీం దిశమావిశత్ ॥ 47

ఈశ్వరః= సర్వశక్తిమంతుడగు, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, ఇతి= ఈ విధముగా, సంభాష్య= పలికి, అర్జునేన సహ= అర్జునునితో బాటుగా, దివ్యమ్= ప్రకాశించే, స్వరథమ్= తన రథమును, ఆస్థాయ= అధిష్ఠించి, ప్రతీచీం దిశమ్= పడమటి దిక్కును, ఆవిశత్= ప్రవేశించెను.

సర్వశక్తిమంతుడగు శ్రీకృష్ణుడీ విధముగా పలికి, అర్జునునితో కలిసి తన ప్రకాశించే రథమునెక్కి పడమటి దిక్కును ప్రవేశించెను.

సప్త ద్వీపాన్ సప్త సింధూన్ సప్తసప్తగిరీనథ ।
లోకాలోకం తథాఽతీత్య వివేశ సుమహత్తమః ॥ 48

సప్తసప్తగిరీన్= ఏడేడు మర్యాదాపర్వతములు గల, సప్త= ఏడు, ద్వీపాన్= ద్వీపములను, అథ= మరియు, సప్త= ఏడు, సింధూన్= సముద్రములను, తథా= అదే విధముగా, లోక-అలోకమ్= లోకాలోక పర్వతమును, అతీత్య= దాటి, సుమహత్= చాల దట్టని, తమః= చీకటిని, వివేశ= ప్రవేశించెను.

ఏడేసి మర్యాదాపర్వతములుండే ఏడు ద్వీపములను, ఏడు సముద్రములను, తరువాత లోకాలోక పర్వతమును కూడ దాటి, వారు చాల దట్టని చీకటిని ప్రవేశించిరి.

తత్రాశ్వాశ్శైబ్యసుగ్రీవమేఘపుష్పబలాహకాః ।
తమసి భ్రష్టగతయో బభూవుర్భరతర్షభ ॥ 49

భరత-ఋషభ= భరతవంశీయులలో శ్రేష్ఠుడా!, శైబ్యసుగ్రీవమేఘపుష్పబలాహకాః= శైబ్యము సుగ్రీవము మేఘపుష్పము బలాహకము అనే, అశ్వాః= గుర్రములు, తత్ర= ఆ, తమసి= చీకటియందు, భ్రష్టగతయః= తప్పిన గమనము గలవి, బభూవుః= అయినవి.

భరతవంశీయులలో శ్రేష్ఠుడవగు ఓ రాజా! శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, బలాహకము అనే గుర్రములు ఆ చీకటిలో దారి తప్పినవి.

తాన్ దృష్ట్వా భగవాన్ కృష్ణో మహాయోగేశ్వరేశ్వరః ।
సహస్రాదిత్యసంకాశం స్వచక్రం ప్రాహిణోత్పురః ॥ 50

మహాయోగ-ఈశ్వర-ఈశ్వరః= గొప్ప యోగమునకు ప్రభువులైన సనకాదులకు కూడ ఈశ్వరుడైన, భగవాన్ కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, తాన్= వాటిని, దృష్ట్వా= చూచి, సహస్ర-ఆదిత్యసంకాశమ్= వేయి సూర్యుల కాంతి గల, స్వచక్రమ్= తన చక్రమును, పురః= ఎదుట, ప్రాహిణోత్= పంపెను.

శ్రీకృష్ణ భగవానుడు యోగేశ్వరులగు సనకాదులకు కూడ పరమేశ్వరుడు. గుర్రములు దారి తప్పుటను గాంచిన ఆయన వేయి సూర్యుల కాంతి గల తన చక్రమును ముందు పంపెను.

తమస్తు ఘోరం గహనం కృతం మహద్ ।
విదారయద్భూరితరేణ రోచిషా ।
మనోజవం నిర్వివిశే సుదర్శనం
గుణచ్యుతో రామశరో యథా చమూః ॥ 51

మనః-జవమ్= మనోవేగము గల, సుదర్శనమ్= సుదర్శనచక్రము, సుఘోరమ్= మిక్కిలి భయమును గొల్పునట్టియు, గహనమ్= ప్రవేశించ శక్యము కానట్టియు, కృతమ్= చేయబడినట్టియు, మహత్= అపారమైన, తమః= చీకటిని, భూరితరేణ= అంతకంటె పెద్ద, రోచిషా= కాంతితో, విదారయత్= చీల్చివేయుచున్నదై, గుణచ్యుతః= నారిత్రాడునుండి విడిచిపెట్టబడిన, రామశరః= శ్రీరాముని బాణము, చమూః యథా= సైన్యములను వలె, నిర్వివిశే= ప్రవేశించెను.

ప్రవేశింప శక్యము కాకుండా సృష్టికర్తచే చేయబడిన ఆ చీకటి మిక్కిలి భయమును గొల్పుచుండెను. మనోవేగము గల సుదర్శనచక్రము అంతకంటె పెద్ద కాంతితో చీల్చి వేస్తూ, రాముని ధనుస్సు నుండి విడిచిపెట్టబడిన బాణము సైన్యములను వలె, ఆ చీకటిని ప్రవేశించెను.

ద్వారేణ చక్రానుపథేన తత్తమఃపరం పరం జ్యోతిరనంతపారమ్ ।
సమశ్నువానం ప్రసమీక్ష్య ఫాల్గునః ప్రతాడితాక్షో పిదధేఽక్షిణీ ఉభే ॥52

చక్ర-అనుపథేన= చక్రముననుసరించి వెళ్లే, ద్వారేణ= రంధ్రముచే, తత్-తమఃపరమ్= ఆ చీకటికంటె ఆవలనుండునట్టియు, అనంతపారమ్= అంతమయ్యే హద్దు లేనట్టియు, సమశ్నువానమ్= వ్యాపించునట్టియు, పరమ్= సర్వాతిశాయియగు, జ్యోతిః= తేజస్సును, ప్రసమీక్ష్య= చూచి, ప్రతాడిత-అక్షః= గట్టిగా కొట్టబడిన కన్నులు గల, ఫాల్గునః= అర్జునుడు, ఉభే= రెండు, అక్షిణీ= కళ్లను, పిదధే= మూసుకొనెను.

చక్రము ఆ చీకటిలో ఏర్పరచిన దారి గుండా ఆ చీకటికి ఆవలనుండే తేజస్సును వారు చేరిరి. సర్వాతిశాయియగు ఆ తేజస్సు అంతమయ్యే హద్దు ఏదీ లేదు. సర్వమును వ్యాపించియున్న ఆ తేజస్సుచే కళ్లలో పొడిచినట్లు కాగా అర్జునుడు రెండు కళ్లను మూసుకొనెను.

తతః ప్రవిష్టస్సలిలం నభస్వతా
బలీయసైజద్బృహదూర్మిభూషణమ్ ।
తత్రాద్భుతం వై భవనం ద్యుమత్తమం
భ్రాజన్మణిస్తంభసహస్రశోభితమ్ ॥ 53

తతః= ఆ చీకటికి ఆవల, బలీయసా= మిక్కిలి బలమైన నభస్వతా= గాలిచే, ఏజద్-బృహద్- ఊర్మిభూషణమ్= పైకి లేచే పెద్ద కెరటములే అలంకారములుగా కలిగిన, సలిలమ్= నీటిని, ప్రవిష్టః= ప్రవేశించినది, తత్ర వై= దానియందైతే, అద్భుతమ్= అచ్చెరువును గొల్పునట్టియు, ద్యుమత్-తమమ్= అతిశయించిన ప్రకాశము కలిగినట్టియు, భ్రాజత్-మణిస్తంభసహస్రశోభితమ్= ప్రకాశించే మణులు పొదిగిన స్తంభముల వేయితో శోభిల్లే, భవనమ్= భవనము.

ఆ చీకటికి ఆవల రథము జలాశయములో ప్రవేశించెను. మిక్కిలి బలమైన గాలిచే పైకి లేచిన పెద్ద కెరటములే ఆ జలాశయమునకు అలంకారములాయెను. ఆ జలాశయములో అచ్చెరువును గొలిపే పెద్ద భవనము ఉండెను. అతిశయముగా ప్రకాశించే ఆ భవనమునందు వెలిగిపోయే మణులతో పొదిగిన స్తంభములు వేయి ఉండెను.

తస్మిన్మహాభీమమనంతమద్భుతం సహస్రమూర్ధన్యఫణామణిద్యుభిః ।
విభ్రాజమానం ద్విగుణోల్బణేక్షణం సితాచలాభం శితికంఠజిహ్వమ్ ॥ 54

తస్మిన్= దానియందు, మహాభీమమ్= చాల భయమును గొల్పునట్టియు, అద్భుతమ్= విస్మయమును కలిగించునట్టియు, సహస్రమూర్ధన్యఫణామణిద్యుభిః= వేయి తలలయందలి పడగలయందలి మణుల కాంతులచే, విభ్రాజమానమ్= ప్రకాశించుచున్నట్టియు, ద్విగుణ-ఉల్బణ-ఈక్షణమ్= రెండు రెట్లు భయంకరములగు కన్నులు కలిగినట్టియు, సిత-అచల-అభమ్= తెల్లని కొండయొక్క కాంతులు కలిగినట్టియు, శితికంఠజిహ్వమ్= నల్లని కంఠము నాలుకలు గల, అనంతమ్= అనంతుని (చూచెను).

ఆ జలాశయమునందు వారు చాల భయమును, విస్మయమును గొల్పే అనంతుని చూచిరి. ఆయనయొక్క వేయి తలలయందలి పడగలలో మణులు ప్రకాశించుచుండెను. రెండు వేల కన్నులు భయంకరముగా నుండెను. తెల్లని కొండ వలె ప్రకాశించే ఆ అనంతుడు నల్లని కంఠములను, నాలుకలను కలిగియుండెను.

దదర్శ తద్భోగసుఖాసనం విభుం
మహాఽనుభావం పురుషోత్తమోత్తమమ్ ।
సాంద్రాంబుదాభం సుపిశంగవాससం
ప్రసన్నవక్త్రం రుచిరాయతేక్షణమ్ ॥ 55

తద్-భోగసుఖ-ఆసనమ్= ఆ అనంతుని పడగలే సుఖమైన ఆసనముగా కలిగినట్టియు, విభుమ్= సర్వవ్యాపకుడైనట్టియు, మహా-అనుభామ్= గొప్ప మహిమ కలిగినట్టియు, సాంద్ర-అంబుద-ఆభమ్= దట్టని మేఘముయొక్క కాంతివంటి కాంతి కలిగినట్టియు, సుపిశంగ-వాససమ్= మంచి పచ్చని వస్త్రము కలిగినట్టియు, ప్రసన్నవక్త్రమ్= ప్రసన్నమైన ముఖము కలిగినట్టియు, రుచిర-ఆయత-ఈక్షణమ్= అందమైన నిడివి కన్నులు గల, పురుష-ఉత్తమ-ఉత్తమమ్-సర్వాతిశాయి పురుషోత్తముని= సర్వవ్యాపకుడు, సర్వాతిశాయి అగు పురుషోత్తమ భగవానుడు మంచి పచ్చని వస్త్రమును దాల్చి ఆ అనంతుని పడగలనే సుఖకరమగు ఆసనముపై కూర్చుండెను. గొప్ప మహిమ గల ఆయన దట్టని మేఘము వలె ప్రకాశించెను. అందమైన నిడివి కన్నులు గల ఆయన ముఖము ప్రసన్నముగా నుండెను.

సర్వవ్యాపకుడు, సర్వాతిశాయి అగు పురుషోత్తమ భగవానుడు మంచి పచ్చని వస్త్రమును దాల్చి ఆ అనంతుని పడగలనే సుఖకరమగు ఆసనముపై కూర్చుండెను. గొప్ప మహిమ గల ఆయన దట్టని మేఘము వలె ప్రకాశించెను. అందమైన నిడివి కన్నులు గల ఆయన ముఖము ప్రసన్నముగా నుండెను.

మహామణివ్రాతకిరీటకుండల-
ప్రభాపరిక్షిప్తసహస్రకుంతమ్ ।
ప్రలంబచార్వష్టభుజం సకౌస్తుభం
శ్రీవత్సలక్ష్మం వనమాలయా వృతమ్ ॥ 56

మహామణివ్రాతకిరీటకుండలప్రభాపరిక్షిప్తసహస్రకుంతలమ్= గొప్ప మణుల సమూహములు గల కిరీటము కుండలముల కాంతులచే అంతటా వెలిగిపోయే వేలాది ముంగురులు కలిగినట్టియు, ప్రలంబచారు-

అష్టభుజమ్= పొడవాటి అందమైన ఎనిమిది చేతులు కలిగినట్టియు, సకౌస్తుభమ్= కౌస్తుభ మాణిక్యముతో కూడినట్టియు, వనమాలచే, వృతమ్= కూడిన (నారాయణుని చూచెను).

గొప్ప మణుల సమూహములు పొదిగిన కిరీటము, కుండలముల కాంతులచే వేలాది ముంగురులు అంతటా వెలిగిపోవుచుండెను. ఆయన పొడవాటి అందమైన ఎనిమిది భుజములు కలిగియుండెను. ఆయన మెడలో కౌస్తుభ మాణిక్యమును, వక్షఃస్థలముపై శ్రీవత్సమనే చిహ్నమును, వనమాలను కలిగియుండెను.

సునందనందప్రముఖైస్స్వపార్శ్వదైః
చక్రాదిభిర్మూర్తిధరైర్నిజాయుధైః ।
పుష్ట్యా శ్రియా కీర్త్యజయాఽఖిలర్ద్ధిభిః
నిషేవ్యమాణం పరమేష్ఠినాం పతిమ్ ॥ 57

స్వపార్శ్వదైః= తన అనుచరులగు, సునందనందప్రముఖైః= సునందుడు నందుడు మొదలగువారిచే, మూర్తిధరైః= రూపు దాల్చిన, నిజ-ఆయుధైః= తన ఆయుధములైన, చక్ర-ఆదిభిః= చక్రము మొదలగువాటిచే, పుష్ట్యా= పుష్టిచే, శ్రియా= శ్రీచే, కీర్తి-అజయా= కీర్తితో కూడిన మాయాశక్తిచే, అఖిల-బుద్ధిభిః= సకలసిద్ధులచే, నిషేవ్యమాణమ్= సేవించబడుచున్నట్టియు, పరమేష్ఠినామ్= లోకపాలకులకు, పతిమ్= ప్రభుని (చూచెను).

బ్రహ్మాది లోకపాలకులకు ప్రభుడగు ఆ నారాయణుని సునందుడు-నందుడు మొదలగు పార్శ్వదులు, పుష్టి-శ్రీ-కీర్తి-మాయ అనే శక్తులు, చక్రము-గద మొదలగు ఆయుధములు, అణిమ మొదలైన అష్టసిద్ధులు రూపు దాల్చి సేవించుచుండెను.

వవంద ఆత్మానమనంతమచ్యుతో
జిష్ణుశ్చ తద్దర్శనజాతసాధ్వసః ।
తావాహ భూమా పరమేష్ఠినాం ప్రభుః
బద్ధాంజలి సస్మితమూర్జయా గిరా ॥ 58

అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, ఆత్మానమ్= తానే అయిన, అనంతమ్= అనంతుని, వవంద= నమస్కరించెను, తద్-దర్శనజాత సాధ్వసః= ఆయనయొక్క దర్శనముచే కలిగిన భయము గల, జిష్ణుః చ= అర్జునుడు కూడ, పరమేష్ఠినామ్= లోకపాలకులకు, ప్రభుః ప్రభుడు, భూమా= సర్వస్వరూపుడు అగు పురుషోత్తముడు, బద్ధ-అంజలీ= కట్టబడిన దోసిలి గల, తౌ= వారిద్దరిని, ఊర్జయా= గంభీరమగు, గిరా= వాక్కుతో, సస్మితమ్= చిరునవ్వుతో కూడునట్లుగా, ఆహ= పలికెను.

శ్రీకృష్ణ భగవానుడు తన రూపమే అయిన అనంతునకు నమస్కరించెను. ఆయనను చూచుటచే భయము కలిగిన అర్జునుడు కూడ నమస్కరించెను. బ్రహ్మాది లోకపాలకులకు ప్రభుడు, సర్వస్వరూపుడు అగు పురుషోత్తముడు దోసిలి యొగ్గిన వారిద్దరిని ఉద్దేశించి చిరునవ్వుతో గంభీరమగు వాక్కుతో నిట్లనెను.

ద్విజాత్మజా మే యువయోర్దిదృక్షుణా
మయోపనీతా భువి ధర్మగుప్తయే ।
కలాఽవతీర్ణావనేర్భరాసురాన్
హత్వేహ భూయస్త్వరయేతమంతి మే ॥ 59

యువయోః= మీ యిద్దరికి (ని), దిదృక్షుణా= చూడగోరే, మే= నాచే, ద్విజ-ఆత్మజాః= బ్రాహ్మణ పుత్రులు, ఉపనీతాః= తీసుకురాబడిన వారు, భువి= భూలోకమునందు, ధర్మస్య= ధర్మముయొక్క, గుప్తయే= రక్షణ కొరకై, కలా-అవతీర్ణౌ= అంశచే అవతరించివారు (వారలారా!),

అవనేః= భూమికి, భర-అసురాన్= బరువైన రాక్షసులను, హత్వా= సంహరించి, ఇహ= ఇచటకు, మే= నా, అంతి= సమీపమునకు, త్వరయా= వేగముగా, భూయః= మరల, ఇతమ్= రండు.

మీ యిద్దరిని చూడగోరి నేను బ్రాహ్మణుని పుత్రులను తీసుకువచ్చినాను. భూలోకమునందు ధర్మరక్షణకై మీరిద్దరు నా అంశచే అవతరించినారు. భూమికి బరువైన రాక్షసులను సంహరించి ఇచట నా సమీపమునకు మీరిద్దరు తొందరగా మరలి రండు.

పూర్ణకామావపి యువాం నరనారాయణావృషీ ।
ధర్మమాచరతాం స్థిత్యై ఋషభౌ లోకసంగ్రహమ్ ॥ 60

నరనారాయణౌ= నరనారాయణులు, ఋషీ= మహర్షులు, ఋషభౌ= శ్రేష్ఠులు అగు, యువామ్= మీరిద్దరు, పూర్ణకామౌ అపి= పూర్ణమైన కామనలు గలవారే అయిననూ, స్థిత్యై= లోకరక్షణ కొరకై, లోకసంగ్రహమ్= జనులకు ఆదర్శమయ్యే, ధర్మమ్= ధర్మమును, ఆచరతామ్= ఆచరించెదరు గాక!

మీరిద్దరు గొప్ప మహర్షులైన నరనారాయణులు. మీరు ఆప్తకాములే అయినా, లోకరక్షణకై జనులకు ఆదర్శముగా ధర్మమును ఆచరించుడు.

ఇత్యాదిష్టౌ భగవతా తౌ కృష్ణౌ పరమేష్ఠినా ।
ఓమిత్యానమ్య భూమానమాదాయ ద్విజదారకాన్ ॥ 61

న్యవర్తతాం స్వకం ధామ సంప్రహృష్టౌ యథాగతమ్ ।
విప్రాయ దదతుః పుత్రాన్ యథారూపం యథావయః ॥ 62

పరమేష్ఠినా= పరమేశ్వరుడైన, భగవతా= పురుషోత్తమ భగవానునిచే, ఇతి= ఈ విధముగా, ఆదిష్టౌ= ఆదేశించబడిన, తౌ=

ఆ, కృష్ణౌ= శ్రీకృష్ణార్జునులు, ఓమ్= అటులనే, ఇతి= అని, భూమానమ్= సర్వవ్యాపకుడగు పురుషోత్తముని, ఆనమ్య= ప్రణమిల్లి, ద్విజదారకాన్= బ్రాహ్మణపుత్రులను, ఆదాయ= తీసుకొని, సంప్రహృష్టౌ= చాల ఆనందించినవారై, స్వకమ్= తమదైన, ధామ= స్థానమును గురించి, యథాగతమ్= వెళ్లినదారిని అతిక్రమించకుండా, న్యవర్తతామ్= తిరిగి వచ్చిరి, విప్రాయ= బ్రాహ్మణుని కొరకు, యథారూపమ్= రూపము-నతిక్రమించకుండా, యథావయః= వయస్సు నతిక్రమించకుండా, పుత్రాన్= పుత్రులను, దదతుః= సమర్పించిరి.

పరమేశ్వరుడైన పురుషోత్తమ భగవానునిచే ఈ విధముగా ఆదేశించబడిన ఆ శ్రీకృష్ణార్జునులు అటులనే అని పలికి ఆయనకు ప్రణమిల్లిరి. అప్పుడు వారు బ్రాహ్మణపుత్రులను తీసుకొని వెళ్లిన దారినే తమ స్థానము (ద్వారక) నకు మరలి వచ్చిరి. వారు బ్రాహ్మణునకు పుత్రులను సమర్పించిరి. ఆ పిల్లవాండ్ర వయస్సు, రూపములలో తేడా ఏమీ లేదు.

నిశామ్య వైష్ణవం ధామ పార్థః పరమవిస్మితః ।
యత్కించిత్పౌరుషం పుంసాం మేనే కృష్ణానుకంపితమ్ ॥ 63

పార్థః= అర్జునుడు, వైష్ణవమ్= శ్రీహరికి చెందిన, ధామ= ధామమును, నిశామ్య= చూచి, పరమవిస్మితః= అత్యాశ్చర్యమును పొందినవాడు, పుంసామ్= మానవులయొక్క, కించిత్= కొంచెము, పౌరుషమ్= పురుషకారము, యత్= ఏది గలదో అది, కృష్ణ-అనుకంపితమ్= శ్రీకృష్ణుని అనుగ్రహమునుగా, మేనే= తలచెను.

శ్రీహరియొక్క వైకుంఠధామమును చూచి అర్జునునకు అత్యాశ్చర్యము కలిగెను. మానవులలో ఏ కొంచెము పురుషకారము ఉన్నా, అది శ్రీకృష్ణ భగవానుని అనుగ్రహము మాత్రమేనని ఆతడు తలపోసెను.

ఇతీదృశాన్యనేకాని వీర్యాణీహ ప్రదర్శయన్ ।
బుభుజే విషయాన్ గ్రామ్యానీజే చాత్యూర్జితైర్మఖైః ॥ 64

ఇహ= ఈ లోకమునందు, ఇతి= ఈ విధముగా, ఈదృశాని= ఇటువంటి, అనేకాని= అనేకములైన, వీర్యాణి= పరాక్రమములను, ప్రదర్శయన్= ప్రదర్శించువాడై, గ్రామ్యాన్= లౌకికములైన, విషయాన్= ఇంద్రియభోగములను, బుభుజే= భోగించెను, చ= మరియు, అతి-ఊర్జితైః= మిక్కిలి సమృద్ధములైన, మఖైః= యజ్ఞములచే, ఈజే= ఆరాధించెను.

శ్రీకృష్ణ భగవానుడీ విధముగా ఈ లోకములో ఇటువంటి అనేకములగు పరాక్రమములను ప్రదర్శించెను. ఆయన లౌకికములైన భోగములను భోగించుటయే గాక, మిక్కిలి సమృద్ధములగు యజ్ఞములతో పరమేశ్వరునారాధించెను.

ప్రవర్షాఖిలాన్ కామాన్ ప్రజాసు బ్రాహ్మణాదిషు ।
యథాకాలం యథైవేంద్రో భగవాంశ్ఛ్రైష్ఠ్యమాస్థితః ॥ 65

శ్రైష్ఠ్యమ్= శ్రేష్ఠత్వము (గృహస్థుగా) ను, ఆస్థితః= అనుష్ఠించిన, భగవాన్= శ్రీకృష్ణ భగవానుడు, బ్రాహ్మణ-ఆదిషు= బ్రాహ్మణులు మొదలుగా గల, ప్రజాసు= ప్రజలయందు, అఖిలాన్= సకలములైన, కామాన్= కామనలను, యథాకాలమ్= కాలమునతిక్రమించకుండా, ఇంద్రః యథా ఏవ= ఇంద్రుడు వలెనే, ప్రవవర్ష= అధికముగా వర్షించెను.

శ్రేష్ఠమగు గృహస్థధర్మాచరణ గల శ్రీకృష్ణ భగవానుడు, సకాలములో ఇంద్రుడు వర్షించినట్లుగా, ఆయా కాలములలో బ్రాహ్మణులు మొదలైన ప్రజలకు సకలములైన కామనలను అధికముగా పూర్ణము చేసెను.

హత్వా నృపానధర్మిష్ఠాన్ ఘాతయిత్వాఽర్జునాదిభిః ।
అంజసా వర్తయామాస ధర్మం ధర్మసుతాదిభిః ॥ 66

ఇతి శ్రీమద్భాగవతే మహాపురాణే దశమస్కంధే
ఉత్తరార్ధే ఏకోననవతితమోఽధ్యాయః ॥

అధర్మిష్ఠాన్= అధర్మనిష్ఠులైన, నృపాన్= రాజులను, హత్వా= సంహరించి, అర్జున-ఆదిభిః= అర్జునుడు మొదలగువారిచే, ఘాతయిత్వా= సంహరింపజేసి, ధర్మమ్= ధర్మమును, ధర్మసుత-ఆదిభిః= ధర్మరాజు మొదలగువారిచే, అంజసా= తేలికగా, వర్తయామాస= అనుష్ఠింపజేసెను.

శ్రీకృష్ణ భగవానుడు అధర్మాత్ములగు రాజులలో కొందరిని తాను సంహరించెను. ఆయన ఇతరులను అర్జునుడు, భీముడు మొదలగువారిచే సంహరింపజేసెను. ఆయన ధర్మరాజు, ఉగ్రసేనుడు మొదలగువారిచే ధర్మమును తేలికగా అనుష్ఠింపజేసెను.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
భృగువు త్రిమూర్తులను పరీక్షించుటను, మరణించిన బ్రాహ్మణ
బాలకులను శ్రీకృష్ణుడు మరల బ్రతికించుటను వర్ణించే
ఎనుబది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (89).

* * *

అథ నవతితమోఽధ్యాయః

శ్రీకృష్ణ భగవానుని లీలా విహారము

శ్రీశుక ఉవాచ ।

సుఖం స్వపుర్యాం నివసన్ ద్వారకాయాం శ్రియః పతిః ।
సర్వసంపత్సమృద్ధాయాం జుష్టాయాం వృష్ణిపుంగవైః ॥ 1

శ్రీశుకః= శ్రీశుకమహర్షి, ఉవాచ= పలికెను, శ్రియః= లక్ష్మీదేవి యొక్క, పతిః= భర్తయగు శ్రీకృష్ణ భగవానుడు, స్వపుర్యామ్= తన నగరమైనట్టియు, సర్వసంపత్-సమృద్ధాయామ్= సకలసంపదలతో సమృద్ధమైనట్టియు, వృష్ణిపుంగవైః= యాదవశ్రేష్ఠులచే, జుష్టాయామ్= సేవించబడిన, ద్వారకాయామ్= ద్వారకయందు, సుఖమ్= సుఖముగా, నివసన్= నివసించుచున్న వాడు.

శ్రీశుక మహర్షి ఇట్లు పలికెను...లక్ష్మీపతియగు శ్రీకృష్ణభగవానుడు తన ద్వారకానగరమునందు సుఖముగా నివసించుచుండెను. సకల సంపదలతో సమృద్ధమైన ఆ నగరమును యాదవశ్రేష్ఠులు సేవించిరి.

స్త్రీభిశ్చోత్తమవేషాభి ర్నవయౌవనకాంతిభిః ।
కందుకాదిభిర్హర్మ్యేషు క్రీడంతీభిస్తడిద్ద్యుభిః ॥ 2

ఉత్తమవేషాభిః= ఉత్తమమైన వేషము కలిగినట్టియు, నవయౌవన కాంతిభిః= నూతనయౌవనముయొక్క కాంతి కలిగినట్టియు, హర్మ్యేషు= ప్రాసాదములయందు, కందుక-ఆదిభిః= బంతి మొదలగువాటితో, క్రీడంతీభిః= క్రీడించునట్టియు, తడిద్-ద్యుభిః= మెరుపుయొక్క కాంతి వంటి కాంతి గల, స్త్రీభిః చ= స్త్రీలచే కూడ.

నూతనయౌవనముయొక్క కాంతి గల ఆ నగరస్త్రీలు ఉత్తమ వేషములను దాల్చి ప్రాసాదములయందు బంతి, పాటలు మొదలగు వాటితో క్రీడించెడివారు. ఆ స్త్రీలు మెరుపు వలె ప్రకాశించెడివారు.

నిత్యం సంకులమార్గాయాం మదచ్యుద్భిర్మతంగజైః ।
స్వలంకృతైర్భటైరశ్వై రథైశ్చ కనకోజ్జ్వలైః ॥ 3

మదచ్యుద్భిః= మదమును స్రవించే, మతంగజైః= ఏనుగులచే, నిత్యమ్= నిత్యము, సంకుల మార్గాయామ్= రద్దీగా ఉండే మార్గములు కలిగిన (నగరమునందు), సు-అలంకృతైః= బాగా అలంకరించబడిన, భటైః= భటులతో, అశ్వైః= గుర్రములతో, కనక-ఉజ్జ్వలైః= బంగారముతో మెరిసిపోయే, రథైః చ= రథములతో (కూడిన ఆ నగరము).

ఆ నగరములోని మార్గములు నిత్యము మదమును స్రవించే ఏనుగులతో రద్దీగానుండును. అచట బాగా అలంకరించుకున్న భటులు, గుర్రములు, బంగారము వలె మెరిసిపోయే రథములు ఉండెను.

ఉద్యానోపవనాఢ్యాయాం పుష్పితద్రుమరాజిషు ।
నిర్విశద్భృంగవిహగైర్నాదితాయాం సమంతతః ॥ 4

ఉద్యాన-ఉపవన-ఆఢ్యాయామ్= ఉద్యానములతో ఉపవనములతో సంపన్నమైనట్టియు, పుష్పితద్రుమరాజిషు= పుష్పించిన చెట్ల వరుసల యందు, నిర్విశద్-భృంగవిహగైః= ప్రవేశిస్తున్న తుమ్మెదలచే పక్షులచే, సమంతతః= అంతటా, నాదితాయామ్= నినదించుచున్న (నగరమునందు శ్రీకృష్ణుడు నివసించెను).

ఉద్యానములతో, ఉపవనములతో సంపన్నమైన ఆ నగరము పుష్పించిన చెట్ల వరుసలలో ప్రవేశించే తుమ్మెదలచే, పక్షులచే అంతటా నినదింప జేయబడెను.

రేమే షోడశసాహస్రపత్నీనామేకవల్లభః ।
తావద్విచిత్రరూపోఽసా తద్గృహేషు మహర్ద్ధిషు ॥ 5

ప్రోత్ఫుల్లోత్పలకహ్లారకుముదాంభోజరేణుభిః ।
వాసితామలతోయేషు కూజద్విజకులేషు చ ॥ 6

షోడశసాహస్రపత్నీనామ్= పదునారు వేల భార్యలకు, ఏకవల్లభః = ఒకే ఒక ప్రియభర్తయగు, అసౌ= ఈ శ్రీకృష్ణుడు, తావద్-విచిత్రరూపః = అన్ని అద్భుతమగు రూపములు గలవాడై, మహా-బుద్ధిషు= గొప్ప సంపదలు కలిగినట్టియు, ప్ర-ఉత్పుల్లకహ్లారకుముద-అంభః-జ రేణుభిః = పూర్తిగా వికసించిన సౌగంధిక పుష్పములు ఎర్ర దామరలు పద్మముల పుప్పొడులచే, వాసిత-అమలతోయేషు= సువాసితమైన స్వచ్ఛమగు జలములు కలిగినట్టియు, కూజద్-ద్విజకులేషు= కూతలు కూసే పక్షుల గుంపులు కల, తద్-గృహేషు= వారి గృహాలయందు, రేమే= రమించెను.

పదునార వేల భార్యలకు ఈ శ్రీకృష్ణుడు ఒకే ఒక ప్రియుడగు భర్త. గొప్ప సంపదలు గల వారి గృహములయందు ఆయన అన్ని అద్భుతమగు రూపములను దాల్చి రమించెను. ఆ గృహములకు ఆనుకొని ఉన్న జలాశయములలోని జలములు పూర్తిగా వికసించిన సౌగంధిక పుష్పములు, ఎర్రదామరలు, పద్మముల పుప్పొడులతో సువాసితములైయుండెను. ఆ గృహములలో కూతలు కూసే పక్షుల గుంపులు ఉండెను.

విజహార విగాహ్యాంభో హ్రదినీషు మహోదయః ।
కుచకుంకుమలిప్తాంగః పరిరబ్ధశ్చ యోషితామ్ ॥ 7

మహా-ఉదయః= గొప్ప వైభవము గల శ్రీకృష్ణుడు, హ్రదినీషు= స్త్రీలచే, పరిరబ్ధః చ= కౌగిలించు కొనబడినవాడై, కుచకుంకుమలిప్త-అంగః= స్తనములయందలి కుంకుమచే అలదబడిన అవయవములు గలవాడై, విజహార= విహరించెను.

గొప్ప వైభవము గల శ్రీకృష్ణుడు నదుల నీటిలో ప్రవేశించి విహరించెను. ఆయనను యువతులు కౌగిలించగా వారి స్తనముల యందలి కుంకుమ ఆయన అవయవములకు అలదుకొనెను.

ఉపగీయమానో గంధర్వైర్ముదంగపణవానకాన్ ।
వాదయద్భిర్ముదా వీణాం సూతమాగధవందిభిః ॥ 8

గంధర్వైః= గంధర్వులచే, ముదా= ఆనందముతో, మృదంగపణవ-ఆనకాన్= మద్దెళ్లను డోళ్లను తప్పెటలను, వీణామ్= వీణను, వాదయద్భిః = వాయించే, సూతమాగధవందిభిః= సూతులు మాగధులు వందుల (వ్యక్తిని, వంశపురుషులను స్తుతించువారు) చే, ఉపగీయమానః= కీర్తించబడువాడు.

గంధర్వులు, సూతులు, మాగధులు, వందులు మద్దెళ్లను, డోళ్లను, తప్పెటలను, వీణను వాయిస్తూ ఆయన కీర్తిని గానము చేసెడివారు.

సిచ్యమానోఽచ్యుతస్తాభిర్హసంతీభిస్స్మ రేచకైః ।
ప్రతిషించన్ విచిక్రీడే యక్షీభిర్యక్షరాడివ ॥ 9

హసంతీభిః= నవ్వుచున్న, తాభిః= ఆ యువతులచే, రేచకైః= పిచికారీలతో, సిచ్యమానః= తడుపబడుచున్న, అచ్యుతః= శ్రీకృష్ణ భగవానుడు, ప్రతిషించన్= తిరిగి తడుపుచున్నవాడై, యక్షీభిః= యక్షస్త్రీలతో, యక్షరాట్ ఇవ= యక్షులకు ప్రభువగు కుబేరుడు వలె, విచిక్రీడే స్మ= క్రీడించెను.

శ్రీకృష్ణ భగవానుని పత్నులు నవ్వుతూ ఆయనపై పిచికారీలతో నీళ్లను పోసి తడిపెడివారు. ఆయన కూడ వారిపై నీళ్లను పోసి తడుపుతూ, యక్ష ప్రభుడగు కుబేరుడు యక్షస్త్రీలతో వలె, క్రీడించెను.

తాః క్లిన్నవస్త్రవివృతోరుకుచప్రదేశాః ।
సించంత్య ఉద్ధృతబృహత్కబరప్రసూనాః ।
కాంతం స్మ రేచకజిహీరషయోపగుహ్య
జాతస్మరోత్సవలసద్వదనా విరేజుః ॥ 10

క్లిన్నవస్త్రవివృత-ఊరుకుచప్రదేశాఃⁿ తడిసిన వస్త్రములచే ప్రకటము చేయబడిన ఊరువులు స్తనముల భాగములు గలవారు, సించంత్యఃⁿ తడుపుచున్నవారు, ఉద్ధృతబృహత్-కబరప్రసూనాఃⁿ జారిపోయిన పెద్ద కొప్పులు పువ్వులు గలవారు, రేచకజిహీరషయాⁿ పిచికారీని లాగుకొనే కోరికచే, కాంతమ్ⁿ ప్రియుని, ఉపగుహ్యⁿ కౌగిలించుకొని, జాతస్మర-ఉత్సవలసద్-వదనాఃⁿ పుట్టిన ప్రేమచే కలిగిన ఉత్సాహముచే ప్రకాశించుచున్న ముఖములు గల, తాఃⁿ ఆ శ్రీకృష్ణ పత్నులు, విరేజుఃⁿ స్మⁿ విశేషముగా ప్రకాశించిరి.

శ్రీకృష్ణ పత్నుల వస్త్రములు తడియుటచే ఊరువులు, స్తనముల భాగములు ప్రకటమగుచుండెను. వారు నీటిని ఆయనపై చల్లుచుండగా పెద్ద కొప్పులలోని పువ్వులు జారిపోవుచుండెను. ఆయన చేతిలోని పిచికారీని లాగుకొనగోరి ఆయనను వారు కౌగిలించుచుండిరి. ఆ సమయములో పుట్టిన ప్రేమచే కలిగిన ఉత్సాహముచే ముఖముల శోభ ఇనుమడించి వారు విశేషముగా ప్రకాశించిరి.

కృష్ణస్తు తత్స్తనవిషజ్జితకుంకుమస్రక్
క్రీడాభిషంగధుతకుంతలవృందబంధఃⁿ ।
సించన్ముహుర్యువతిభిఃⁿ ప్రతిషిచ్యమానో
రేమే కరేణుభిరివేభపతిఃⁿ పరీతఃⁿ ॥ 11

తత్స్తనవిషజ్జితకుంకుమస్రక్ⁿ వారి స్తనములనుండి తగుల్కొన్న కుంకుమ గల మాల గలవాడు, క్రీడా-అభిషంగధుతకుంతలవృందబంధఃⁿ = ఆటయందలి పట్టుదలచే కంపించబడిన ముంగురుల సమూహము యొక్క బంధము గలవాడు, ముహుఃⁿ పలు మార్లు, సించన్ⁿ నీటిని చల్లువాడు, యువతిభిఃⁿ యువతులచే, ప్రతిషిచ్యమానఃⁿ తిరిగి నీరు చల్లబడువాడు అగు, కృష్ణఃⁿ తుⁿ శ్రీకృష్ణుడైతే, కరేణుభిఃⁿ ఆడు

యేనుగులచే, పరీతః= చుట్టువారబడిన, ఇభపతిః ఇవ= గజేంద్రుడు వలె, రేమే= రమించెను.

శ్రీకృష్ణుడా యువతులపై పలుమార్లు నీటిని చల్లగా, వారాయనపై తిరిగి నీటిని చల్లుచుండిరి. ఆయన మెడలోని మాలకు వారి స్తనముల కుంకుమ తగుల్కొనెను. ఆటయందలి పట్టుదలచే ముంగురుల సమూహమును కట్టిన బంధము కదిలిపోవుచుండెను. ఆడు యేనుగులచే చుట్టువారబడిన గజేంద్రుడు వలె, ఆయన వారితో కూడి రమించెను.

నటానాం నర్తకీనాం చ గీతవాద్యోపజీవినామ్ ।
క్రీడాఽలంకారవాసాంసి కృష్ణోఽదాత్తస్య చ స్త్రియః ॥ 12

కృష్ణః= శ్రీకృష్ణుడు, గీతవాద్య-ఉపజీవినామ్= గానవాద్యములపై జీవించే, నటానామ్= నటులకు, నర్తకీనాం చ= నాట్యకత్తెలకు కూడ, క్రీడా-అలంకారవాసాంసి= విహారము కొరకైన అలంకారములను వస్త్రములను, అదాత్= ఇచ్చెను, తస్య= ఆయనయొక్క, స్త్రియః చ= భార్యలు కూడ (ఇచ్చిరి).

శ్రీకృష్ణుడు, ఆయన భార్యలు తాము విహారము కొరకై దాల్చిన వస్త్రములను, అలంకారములను గానవాద్యములపై జీవించే నటులకు నాట్యకత్తెలకు ఇచ్చిరి.

కృష్ణస్యైవం విహరతో గత్యాలాపేక్షితస్మితైః ।
నర్మక్ష్వేలిపరిష్వంగైః స్త్రీణాం కిల హృతా ధియః ॥ 13

ఏవమ్= ఈ విధముగా, విహరతః= విహరించుచున్న, కృష్ణస్య= శ్రీకృష్ణునియొక్క, గతి-ఆలాప- ఈక్షితస్మితైః= నడక కబుర్లు చూపులు చిరునవ్వులచే, నర్మక్ష్వేలిపరిష్వంగైః= సున్నితమైన హాస్యవచనములు గడుసైన హాస్యము కౌగిలింతలచే, స్త్రీణామ్= భార్యలయొక్క, ధియః= మనస్సులు, హృతాః కిల= దోచివేయబడినవి సుమా!

ఆ విధముగా విహరిస్తూ శ్రీకృష్ణుడు తన నడక, కబుర్లు, చూపులు, చిరునవ్వులు, సున్నితమైన హాస్యోక్తులు, గడుసైన హాస్యములు, కౌగిలింతలతో ఆ యువతుల హృదయములను దోచివేసెను సుమా!

ఊచుర్ముకుందైకధియోఽగిర ఉన్మత్తవజ్జడమ్ ।
చింతయంత్యోఽరవిందాక్షం తాని మే గదతశ్శృణు ॥ 14

ముకుంద-ఏకధియః= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణునిపై ఏకాగ్రమైన చిత్తము గలవారు, అగిరః= మౌనము గలవారు, అరవింద-అక్షమ్= పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుని, చింతయంత్యః= ధ్యానించు వారు, ఉన్మత్తవత్= పిచ్చివారు వలె, జడమ్= ఆలోచన లేకుండా, ఊచుః = పలికిరి, గదతః= చెప్పుచున్న, మే= నానుండి, తాని= ఆ వచనములను, శృణు= వినుము.

ఆ యువతుల చిత్తము మోక్షప్రదాతయగు శ్రీకృష్ణునిపై ఏకాగ్రమయ్యెను.వారు మౌనముగా ఆయననే ధ్యానించెడివారు. తరువాత వారు పిచ్చివారు వలె ఆలోచన లేకుండా మాటలాడెడివారు. వారి పలుకులను నేను చెప్పెదను. వినుము.

మహిష్య ఊచుః ।

కురరి విలపసి త్వం వీతనిద్రా న శేషే
స్వపితి జగతి రాత్ర్యామీశ్వరో గుప్తబోధః ।
వయమివ సఖి కచ్చిద్గాఢనిర్భిన్నచేతా
నలిననయనహాసోదారలీలేక్షితేన ॥ 15

మహిష్యః= శ్రీకృష్ణపత్నులు, ఊచుః= పలికిరి, కురరి= ఓ లకుముకి పిట్టా!, జగతి= జగత్తునందు, రాత్ర్యామ్= రాత్రియందు, వీతనిద్రా= తొలగిన నిద్ర గల, త్వమ్= నీవు, విలపసి= రోదిస్తున్నావు,

న శేషే= నిద్రించవేమి?, గుప్తబోధః= విలీనము చేసుకొన-బడిన జ్ఞానము గల, ఈశ్వరః= శ్రీకృష్ణ భగవానుడు, స్వపితి= నిద్రిస్తున్నాడు, సఖి= ఓ మిత్రురాలా!, వయం ఇవ= మేము వలె, నలిననయనహాస-ఉదారలీలా-ఈక్షితేన= పద్మములవంటి కన్నులు గల శ్రీకృష్ణుని చిరునవ్వుచే అంగీకరసూచకమగు విలాసపు చూపుచే, కచ్చిత్ గాఢనిర్భిన్నచేతాః= లోతుగా గాయపరచబడిన హృదయము గలదానవా యేమి?

శ్రీకృష్ణపత్నులు ఇట్లు పలికిరి...ఓ (ఆడు) లకుముకీ! ఈ జగత్తులో ఈ రాత్రివేళ నీవు నిద్ర మాని రోదిస్తున్నావు. నిద్రించవేమి? శ్రీకృష్ణ భగవానుడు సర్వమును మరచి (సర్వజ్ఞతను ఉపసంహరించి) నిద్రిస్తున్నాడు. ఓ మిత్రురాలా! ఒకచో నీ హృదయము కూడా మాకు వలెనే పద్మములవంటి కన్నులు గల ఆయన చిరునవ్వుతో స్వీకార-సూచకముగా విలాసముతో చూసే చూపుచే లోతుగా గాయపడలేదు గదా!

నేత్రే నిమీలయసి నక్తమదృష్టబంధుః
త్వం రోరవీషి కరుణం బత చక్రవాకి ।
దాస్యం గతా వయమివాచ్యుతపాదజుష్టాం
కిం వా స్రజం స్పృహయసే కబరేణ వోఢుమ్ ॥ 16

చక్రవాకి= ఓ చక్రవాకమా! బత= అయ్యో!, నక్తమ్= రాత్రియందు, త్వమ్= నీవు, నేత్రే= కళ్లను, నిమీలయసి= మూసుకొనెదవు, కరుణమ్= కరుణముగా, రోరవీషి= బిగ్గరగా విలపించెదవు, అదృష్టబంధుః= కానరాని భర్త గలదానవా?, వా= లేక, వయం ఇవ= మేము వలె, దాస్యమ్= దాస్యమును, గతా= పొందినదానవై, అచ్యుతపాదజుష్టామ్= శ్రీకృష్ణ భగవానుని పాదములచే సేవించబడిన, స్రజమ్= మాలను, కబరేణ= కేశపాశముచే, వోఢుమ్= ధరించుటకు, స్పృహయసే కిం= కోరుచున్నావా యేమి?

ఓ చక్రవాకీ! (ఆడు జక్కవ పక్షి) అయ్యో! రాత్రి నీవు కళ్లు మూసుకొని కరుణముగా బిగ్గరగా విలపించెదవు. భర్త కనబడడా యేమి? లేక, నీవు కూడ మా వలెనే శ్రీకృష్ణ భగవానునకు దాసివై ఆయన పాదములను సేవించిన పూలమాలను కేశపాశముపై ధరించ గోరుచున్నావా యేమి?

భో భోస్సదా నిష్టనసే ఉదన్వన్
అలబ్ధనిద్రోఽధిగతప్రజాగరః ।
కిం వా ముకుందాపహృతాత్మలాంఛనః
ప్రాప్తాం దశాం త్వం చ గతో దురత్యయామ్ ॥ 17

భోః= ఓయీ!, భోః= ఓయీ! ఉదన్వన్= సముద్రుడా!, అలబ్ధనిద్రః = పొందబడని నిద్ర గలవాడవు, అధిగతప్రజాగరః= పొందబడిన జాగారము గలవాడవు, సదా= ఎల్లవేళలా, నిష్టనసే= ఆక్రోశించెదవు, త్వం చ= నీవు కూడ, ముకుంద-అపహృతలాంఛనః= శ్రీకృష్ణ భగవానునిచే అపహరించబడిన కౌస్తుభము మొదలైన చిహ్నములు గలవాడవై, ప్రాప్తామ్= (మాచే) పొందబడినట్టియు, దురత్యయామ్= అతిక్రమించ శక్యము కాని, దశామ్= దశను, కిం వా గతః= పొందినవాడవా యేమి?

ఓయీ! ఓయీ! సముద్రుడా! నీకు నిద్ర పట్టదా? నీ అవస్థ జాగారమేనా? నీవు ఎల్లవేళలా ఆక్రోశిస్తూనే ఉంటావు. నీవు కూడ మా వలెనే శ్రీకృష్ణ భగవానుడు కౌస్తుభాది లాంఛనములనపహరించగా అతిక్రమించ శక్యము కాని అవస్థను పొందియున్నావా యేమి?

త్వం యక్ష్మణా బలవతాఽసి గృహీత ఇందో
క్షీణస్తమో న నిజదీధితిభిః క్షిణోషి ।
కచ్చిన్ముకుందగదితాని యథా వయం త్వం
విస్మృత్య భోః స్థగితగీరుపలక్ష్యసే నః ॥ 18

ఇందో= ఓ చంద్రుడా!, త్వమ్= నీవు, బలవతా= బలము గల, యక్ష్మణా= వ్యాధిచే, గృహీతః= పట్టుకొనబడినవాడవు, అసి= అగుచున్నావు, నిజదీధితిభిః= నీ కిరణములచే, తమః= చీకటి, న క్షీణః = తగ్గలేదు, క్షిణోషి= తగ్గిపోవుచున్నావు, భోః= ఓయీ!, వయం యథా= మేము వలె, త్వమ్= నీవు ముకుందగదితాని= శ్రీకృష్ణ భగవానుని వచనములను, విస్మృత్య= మరచి, కచ్చిత్ స్థగితగీః= కట్టుబడిన వాక్కు గలవాడవా యేమి?, నః= మాకు, ఉపలక్ష్యసే= కానవచ్చుచున్నావు.

ఓయీ చంద్రుడా! నీకు పెద్ద రోగము పట్టుకున్నది. నీ కిరణములకు చీకటి తగ్గేది లేదు గాని, నీవు క్షీణించిపోతున్నావు. నీవు కూడ మాలాగే శ్రీకృష్ణ భగవానుని మాటలను మరచినావా యేమి? నీకు నోరు మూసుకుపోయినదా? నిన్ను చూస్తే అదే అయి ఉండునని మాకు తోచుచున్నది.

కిం త్వాచరితమస్మాభి ర్మలయానిల తేఽప్రియమ్ ।
గోవిందాపాంగనిర్భిన్నే హృదీరయసి నస్స్మరమ్ ॥ 19

మలయ-అనిల= ఓ మలయమారుతమా!, అస్మాభిః= మాచే, తే= నీ కొరకు, కిమ్= ఏ, అప్రియమ్= అపకారము, ఆచరితమ్= చేయబడినది?, గోవింద-అపాంగనిర్భిన్నే= గోవిందుని ప్రక్క చూపులచే గాయపడిన, నః= మాయొక్క, హృది= హృదయమునందు, స్మరమ్= కాముని, ఈరయసి= ప్రేరేపించు చున్నావు.

ఓ మలయమారుతమా! గోవిందుని ప్రక్క చూపులచే గాయపడిన మా హృదయమునందు కాముని ఉద్దీపింపజేయుచున్నావు. మేము నీకు ఏమి అపకారమును చేసితిమి?

మేఘ శ్రీమంస్త్వమసి దయితో యాదవేంద్రస్య నూనం
శ్రీవత్సాంకం వయమివ భవాన్ ధ్యాయతి ప్రేమబద్ధః ।
అత్యుత్కంఠశ్శబలహృదయోఽస్మద్విధో బాష్పధారాః
స్మృత్వా స్మృత్వా విసృజసి ముహుర్దుఃఖదస్తత్ప్రసంగః ॥20

మేఘ= ఓ మేఘుమా!, శ్రీమన్= శోభ గలవాడా!, త్వమ్= నీవు, యాదవ-ఇంద్రస్య= యాదవప్రభుడగు శ్రీకృష్ణునకు, నూనమ్= నిశ్చయముగా, దయితః= ప్రియుడవు, భవాన్= నీవు, వయం ఇవ= మేము వలె, ప్రేమబద్ధః= ప్రేమచే కట్టబడినవాడవై, శ్రీవత్స-అంకమ్= శ్రీవత్సమనే పుట్టుమచ్చ గల శ్రీకృష్ణ భగవానుని, ధ్యాయతి= ధ్యానించెదవు, అస్మద్-విధః= మావంటి వాడవు, అతి-ఉత్కంఠః= అధికమగు ఉత్కంఠ గలవాడవు, శబలహృదయః= బేల హృదయము గలవాడవు, ముహుః = మాటిమాటికీ, స్మృత్వా స్మృత్వా= స్మరించి స్మరించి, బాష్పధారాః= కన్నీటి ధారలను, విసృజసి= విడిచిపెట్టుచున్నావు, తత్-ప్రసంగః= ఆతని ప్రసంగము, దుఃఖదః= దుఃఖమును కలిగించును.

శోభతో కూడిన ఓ మేఘుడా! నీవు యాదవప్రభుడగు శ్రీకృష్ణునకు నిశ్చయముగా ప్రియుడవు. నీవు మావలెనే ప్రేమకు కట్టుబడి శ్రీవత్సమనే పుట్టుమచ్చ గల శ్రీకృష్ణ భగవానుని ధ్యానించెదవు. ఆయనను మాటిమాటికీ స్మరించి స్మరించి ఉత్కంఠ పెరిగి బేల హృదయముతో నీవు కూడ మావలెనే కన్నీటి ధారలను విడిచిపెట్టుచున్నావు. ఆయన యొక్క ప్రసక్తియే దుఃఖమును కలిగించును.

ప్రియరావపదాని భాషసే మృతసంజీవికయాఽనయా గిరా ।
కరవాణి కిమద్య తే ప్రియం వద మే వల్గితకంఠ కోకిల ॥21

ప్రియరావ= ప్రియమైన ధ్వని గలదానా!, వల్గితకంఠ= రమణీయ మైన కంఠము గలదానా!, కోకిల= ఓ కోకిలా!, మృతసంజీవికయా= మృతుని బ్రతికించే, అనయా= ఈ, గిరా= వాక్కుతో, పదాని=

శబ్దములను, భాషసే= పలుకుచున్నావు, అద్య= ఈనాడు, తే= నీ కొరకు, కిమ్= ఏమి, ప్రియమ్= ప్రియమును, కరవాణి= చేసెదను?, మే= నాకు, వద= చెప్పుము.

ఓ కోకిలా! నీవు రమణీయమగు కంఠముతో ప్రియమగు ధ్వనిని చేసెదవు. నీ శబ్దములు మృతునైననూ బ్రతికించును. ఈనాడు నీకు నేను ఏమి ప్రియమును చేయవలెనో నాకు చెప్పుము.

న చలసి న వదస్యుదారబుద్ధే
క్షితిధర చింతయసే మహాంతమర్థమ్ ।
అపి బత వసుదేవనందనాంఘ్రిం
వయమివ కామయసే స్తనైర్విధర్తుమ్ ॥ 22

ఉదారబుద్ధే= ఉదారమైన బుద్ధి గలదానా!, క్షితిధర= పర్వతమా!, న చలసి= ఉలుకవు, న వదసి= పలుకవు, మహాంతమ్= గొప్ప, అర్థమ్= అర్థమును, చింతయసే= ధ్యానించుచున్నావా?, బత= చెప్పుమా!, వయమ్= మేము, స్తనైః ఇవ= స్తనములచే వలె, వసుదేవనందన-అంఘ్రిమ్= వాసుదేవుని పాదమును, విధర్తుమ్= ధరించుటకు,అపి కామయసే= కోరుచున్నావా?

పెద్ద మనసు గల ఓ పర్వతమా! ఉలుకు పలుకు లేకుండా ఉన్నావు. ఏదో గొప్ప విషయాన్ని ధ్యానిస్తున్నావా యేమి? మేము స్తనములచే వలె నీవు శిఖరముతో వాసుదేవుని పాదమును ధరించ గోరుచున్నావా యేమి?

శుష్యద్ద్రుదాః కర్శితా బత సింధుపత్న్యః
సంప్రత్యపాస్తకమలశ్రియ ఇష్టభర్తుః ।
యద్వద్వయం మధుపతేః ప్రణయావలోక-
మప్రాప్య ముష్టహృదయాః పురుకర్శితాస్మ ॥ 23

సింధుపత్న్యః= సముద్రుని భార్యలగు ఓ నదులారా!, బత= అయ్యో!, సంప్రతి= ఇప్పుడు, ఇష్టభర్తుః= ఇష్టుడైన భర్త (సముద్రుడు, శ్రీకృష్ణుడు) యొక్క, ప్రణయ-అవలోకమ్= ప్రేమతోడి చూపు (మేఘము ద్వారా)ను, అప్రాప్య= పొందక, శుష్యద్-హ్రదాః= ఎండిపోవుచున్న జలాశయములు గలవారు, కర్శితాః= కృశించినవారు, అపాస్తకమలశ్రియః= తొలగిన కలువల శోభ గలవారు, యద్వత్= ఏ విధముగానైతే, వయమ్= మేము, మధుపతేః= మథురానగరాధిపతియగు శ్రీకృష్ణుని (ప్రేమతోడి చూపును పొందక), ముష్టహృదయాః= అపహరించబడిన హృదయములు గలవారమై, పురుకర్శితాః స్మ= అధికముగా కృశించినామో.

సముద్రపత్నులగు ఓ నదులారా! ప్రియభర్త, మథురాధిపతి అగు శ్రీకృష్ణుని ప్రేమతోడి చూపు లభించక ఆయనచే దోచివేయబడిన హృదయములు గల మేము చాల చిక్కిపోతిమి. మా వలెనే మీకు కూడ, అయ్యో!, ప్రియభర్తయగు సముద్రుని అనుగ్రహము మేఘము ద్వారా లభించలేదు. ఈ వేసవిలో జలాశయములు ఎండి, కలువల శోభ తొలగి మీరు కూడ మావలెనే కృశించి యున్నారు.

హంస స్వాగతమాస్యతాం పిబ పయో బ్రూహ్యంగ శౌరేః కథాం
దూతం త్వాం ను విదామ కచ్చిదజితస్స్వస్త్యాస్త ఉక్తం పురా ।
కిం వా నశ్చలసౌహృదస్స్మరతి తం కస్మాద్భజామో వయం
క్షౌద్రాలాపయ కామదం శ్రియమృతే సైవైకనిష్ఠా స్త్రియామ్ ॥ 24

హంస= ఓ హంసా!, స్వాగతమ్= స్వాగతము, ఆస్యతామ్= కూర్చుండబడుగాక!, పయః= పాలను, పిబ= త్రాగుము, అంగ= ఓయీ!, శౌరేః= శూరవంశీయుడగు శ్రీకృష్ణుని, కథామ్= వృత్తాంతమును, బ్రూహి= చెప్పుము, త్వాం ను= నిన్నైతే, దూతమ్= దూతనుగా, విదామ= ఎరుగుదుము, అజితః= పరాజయమునెరుగని శ్రీకృష్ణుడు, స్వస్తి=

సుఖముగా, కచ్చిత్ ఆస్తే= ఉన్నాడా?, చలసౌహృదః= అస్థిరమైన ప్రేమ గల ఆయన, పురా= ఇదివరలో, నః= మాకు, ఉక్తమ్= చెప్పబడిన మాటను, కిం వా స్మరతి= స్మరించుచున్నాడా?, క్షౌద్ర= క్షుద్రుని దూతవగు ఓ హంసా!, వయమ్= మేము, తమ్= వానిని, కస్మాత్= ఎందువలన, భజామః= ప్రేమించుచున్నాము?, శ్రియం ఋతే= లక్ష్మీదేవిని మినహాయించి, కామదమ్= కోరికలను తీర్చే ఆయనను, ఆలాపయ= పిలువుము, స్త్రియామ్= యువతులలో, ఏకనిష్ఠా= అనన్యప్రేమ గలది, సా ఏవ= ఆమెయేనా యేమి?

ఓ హంసా! స్వాగతము, కూర్చుండి పాలను త్రాగుము. ఓయీ! శూరవంశీయుడగు శ్రీకృష్ణుని వృత్తాంతమును చెప్పుము. నీవు ఆయన దూతవని మాకు తెలుసు. పరాజయమునెరుగని శ్రీకృష్ణుడు సుఖముగా ఉన్నాడా? ఆయన ప్రేమ స్థిరము కాదు. మాకు చెప్పిన మాటలు ఆయనకు గుర్తులో ఉన్నాయా? మేమాయనను ఎందువలన ప్రేమిస్తున్నామో? క్షుద్రుని దూతవగు ఓ హంసా! కోరికలను తీర్చే ఆయనను ఇచ్చటకు పిలువుము. కాని, లక్ష్మిని మాత్రం తీసుకురావద్దు. స్త్రీలలో అనన్యప్రేమ గలది లక్ష్మి ఒక్కతెయేనా? (కాదు).

ఇతీదృశేన భావేన కృష్ణే యోగేశ్వరేశ్వరే ।
క్రియమాణేన మాధవ్యో లేభిరే పరమాం గతిమ్ ॥ 25

ఇతి= ఈ విధముగా, యోగ-ఈశ్వర-ఈశ్వరే= యోగిపుంగవులకు కూడ ప్రభువగు, కృష్ణే= శ్రీకృష్ణ భగవానునియందు, క్రియమాణేన= చేయబడుచున్న, ఈదృశేన= ఇటువంటి, భావేన= ప్రేమచే, మాధవ్యః= శ్రీకృష్ణ పత్నులు, పరమామ్= సర్వోత్కృష్టమైన, గతిమ్= గతియగు మోక్షమును, లేభిరే= పొందిరి.

ఈ విధముగా యోగిపుంగవులకు ప్రభుడగు శ్రీకృష్ణ భగవానునిపై ఇటువంటి (అనన్య) ప్రేమను చేసి, ఆయన పత్నులు సర్వోత్కృష్టమగు మోక్షఫలమును పొందిరి.

శ్రుతమాత్రోఽపి యః స్త్రీణాం ప్రసహ్యాకర్షతే మనః ।
ఉరుగాయోరుగీతో వా పశ్యంతీనాం కుతః పునః ॥ 26

ఉరుగాయ-ఉరుగీతః= అనంతములగు గానములచే అనేక విధములుగా కీర్తించబడిన, యః= ఏ శ్రీకృష్ణుడు, శ్రుతమాత్రః అపి= వినబడినవాడే అయిననూ, స్త్రీణామ్= స్త్రీలయొక్క, మనః= మనస్సును, ప్రసహ్య= బలముగా, ఆకర్షతే= ఆకర్షించునో, పశ్యంతీనాం పునః= చూచేవారికైతే, కుతః వా= చెప్పునదేమున్నది?

అనంతములగు గానములు శ్రీకృష్ణుని అనేకవిధములుగా కీర్తించినవి. ఆయన గురించి విన్నంత మాత్రాన స్త్రీల మనస్సులు బలముగా ఆకర్షించబడును. ఆయనను చూస్తూ ఉండే ఆయన భార్యల మనస్సులు ఆకర్షించబడునని వేరుగా చెప్పవలయునా?

యాస్సంవర్యచరన్ ప్రేమ్ణా పాదసంవాహనాదిభిః ।
జగద్గురుం భర్తృబుద్ధ్యా తాసాం కిం వర్ణ్యతే తపః ॥ 27

జగద్-గురుమ్= జగత్తునకు గురువగు శ్రీకృష్ణుని, యాః= ఏ శ్రీకృష్ణపత్నులు, భర్తృబుద్ధ్యా= భర్త అనే భావనతో, ప్రేమ్ణా= ప్రేమతో, పాదసంవాహన-ఆదిభిఃఁ= పాదములను నొక్కుట మొదలగువాటిచే, సంపర్యచరన్= చక్కగా పరిచర్య చేసిరో, తాసామ్= వారియొక్క, తపః = తపస్సు, కిమ్= ఏమి, వర్ణ్యతే= వర్ణించబడును?

జగద్గురువగు శ్రీకృష్ణుని భార్యలు ఆయనకు భర్త అనే భావనతో ప్రేమతో చక్కగా పాదములను నొక్కుట మొదలగు పరిచర్యలను చేసిరి. వారి తపస్సును ఏమని వర్ణించవలెను?

ఏవం వేదోదితం ధర్మమనుతిష్ఠన్ సతాం గతిః ।
గృహం ధర్మార్థకామానాం ముహుశ్చాదర్శయత్పదమ్ ॥ 28

సతామ్= సత్పురుషులకు, గతిః= గతియగు శ్రీకృష్ణ భగవానుడు, వేద-ఉదితమ్= వేదవిహితమైన, ధర్మమ్= ధర్మమును, ముహుః= పలుమార్లు, అనుతిష్ఠన్= అనుష్ఠించువాడై, గృహమ్= ఇంటిని, ధర్మ-అర్థకామానామ్= ధర్మార్థకామములకు, పదమ్= స్థానమునుగా, అదర్శయత్= చూపించెను.

సత్పురుషులకాశ్రయమగు శ్రీకృష్ణ భగవానుడీ విధముగా నిరంతరముగా వేదవిహితమైన ధర్మమునాచరిస్తూ, గృహమే ధర్మార్థకామములకు నిలయమని లోకమునకు ప్రదర్శించెను.

ఆస్థితస్య పరం ధర్మం కృష్ణస్య గృహమేధినామ్ ।
ఆసన్ షోడశసాహస్రం మహిష్యశ్చ శతాధికమ్ ॥ 29

గృహమేధినామ్= గృహస్థులయొక్క, పరమ్= గొప్ప, ధర్మమ్= ధర్మమును, ఆస్థితస్య= అనుష్ఠించిన, కృష్ణస్య చ= శ్రీకృష్ణునకైతే, శత-అధికమ్= వంద యెక్కువగా, షోడశసాహస్రమ్= పదునారు వేలు, మహిష్యః= భార్యలు, ఆసన్= ఉండిరి.

గొప్పదైన గృహస్థధర్మముననుష్ఠించిన శ్రీకృష్ణునకు పదునారు వేల ఒక వంద (ఎనిమిది) మంది భార్యలు ఉండిరి.

తాసాం స్త్రీరత్నభూతానామష్టౌ యాః ప్రాగుదాహృతాః ।
రుక్మిణీప్రముఖా రాజంస్తత్పుత్రాశ్చానుపూర్వశః ॥ 30

రాజన్= ఓ రాజా!, స్త్రీరత్నభూతానామ్= స్త్రీలలో శ్రేష్ఠలైన, తాసామ్= వారిలో, రుక్మిణీప్రముఖాః= రుక్మిణి మొదలుగా గల, అష్టౌ= ఎనమండుగురు, యాః= ఎవరు గలరో వారు, తత్-పుత్రాః చ= వారి

పుత్రులు కూడ, అనుపూర్వశః= క్రమముగా, ప్రాక్= ఇదివరలో, ఉదాహృతాః= చెప్పబడినవారు.

ఓ పరీక్షిన్మహారాజా! యువతీలలామలగు వారిలో రుక్మిణి మొదలగువారు ఎనమండుగురు ప్రముఖులు. వారు, వారి పుత్రుల వివరములు ఇదివరలో చెప్పబడినవి.

ఏకైకస్యాం దశ దశ కృష్ణోఽజీజనదాత్మజాన్ ।
యావత్య ఆత్మనో భార్యా అమోఘగతిరీశ్వరః ॥ 31

అమోఘగతిః= మొక్కవోని సంకల్పము కలిగినట్టియు, ఈశ్వరః = జగన్నాథుడైన, కృష్ణః= శ్రీకృష్ణ భగవానుడు, ఆత్మనః= తనకు, యావత్యః = ఎందరు, భార్యాః= భార్యలు గలరో, ఏక-ఏకస్యామ్= ఒక్కొక్క భార్య యందు, దశ దశ= పది పది, ఆత్మజాన్= పుత్రులను, అజీజనత్= కనెను.

జగన్నాథుడగు శ్రీకృష్ణుని సంకల్పము అమోఘము. తనకు ఎంతమంది భార్యలు గలరో వారియందు ఆయన ఒక్కొక్క భార్యయందు పదేసి పుత్రులను కనెను.

తేషాముద్దామవీర్యాణామష్టాదశ మహారథాః ।
ఆసన్నుదారయశసస్తేషాం నామాని మే శృణు ॥ 32

ఉద్దామవీర్యాణామ్= భయమును గొల్పే పరాక్రమము గల, తేషామ్= వారిలో, అష్టాదశ= పద్దెనిమిది మంది, మహారథాః= మహారథులు, ఆసన్= ఉండిరి, ఉదారయశసః= విపులమగు కీర్తి గలవారు, తేషామ్= వారియొక్క, నామాని= పేర్లను, మే= నానుండి, శృణు= వినుము.

భయంకరమగు పరాక్రమము గల వారిలో పద్దెనిమిది మహారథులు విపులమగు కీర్తిని గడించిరి. వారి పేర్లను నేను చెప్పెదను. వినుము.

ప్రద్యుమ్నశ్చానిరుద్ధశ్చ దీప్తిమాన్ భానురేవ చ ।
సాంబో మధుర్బృహద్భానుశ్చిత్రభానుర్వృకోఽరుణః ॥ 33

పుష్కరో వేదబాహుశ్చ శ్రుతదేవస్సునందనః ।
చిత్రబాహుర్విరూపశ్చ కవిర్న్యగ్రోధ ఏవ చ ॥ 34

ప్రద్యుమ్నః చ= ప్రద్యుమ్నుడు, అనిరుద్ధః చ= అనిరుద్ధుడు, దీప్తిమాన్= దీప్తిమంతుడు, భానుః ఏవ చ= భానుడు, సాంబః= సాంబుడు, మధుః= మధువు, బృహద్భానుః= బృహద్భానుడు, చిత్రభానుః = చిత్రభానుడు, వృకః= వృకుడు, అరుణః= అరుణుడు, పుష్కరః= పుష్కరుడు, వేదబాహుః చ= వేదబాహుడు, శ్రుతదేవః= శ్రుతదేవుడు, సునందనః= సునందనుడు, చిత్రబాహుః= చిత్రబాహుడు, విరూపః చ= విరూపుడు, కవిః= కవి, న్యగ్రోధః ఏవ చ= న్యగ్రోధుడు.

ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు (మనుమడు), దీప్తిమంతుడు, భానుడు, సాంబుడు, మధువు, బృహద్భానుడు, చిత్రభానుడు, వృకుడు, అరుణుడు, పుష్కరుడు, వేదబాహుడు, శ్రుతదేవుడు, సునందనుడు, చిత్రబాహుడు, విరూపుడు, కవి, న్యగ్రోధుడు అనునవి వారి పేర్లు.

ఏతేషామపి రాజేంద్ర తనుజానాం మధుద్విషః ।
ప్రద్యుమ్న ఆసీత్ప్రథమః పితృవద్రుక్మిణీసుతః ॥ 35

రాజ-ఇంద్ర= ఓ మహారాజా!, మధుద్విషః= మధువును సంహరించిన శ్రీకృష్ణ భగవానుని, తనుజానామ్= పుత్రులైన, ఏతేషాం అపి= వీరిలో కూడ, ప్రథమః= మొదటి, రుక్మిణీసుతః= రుక్మిణియొక్క పుత్రుడగు, ప్రద్యుమ్నః= ప్రద్యుమ్నుడు, పితృవత్= తండ్రివలె, ఆసీత్= ఉండెను.

మహారాజా! మధువును వధించిన శ్రీకృష్ణ భగవానుని పుత్రులగు వీరిలోనున్నూ రుక్మిణి పెద్దకొడుకు ప్రద్యుమ్నుడు తండ్రిని పోలియుండెను.

స రుక్మిణో దుహితరముపయేమే మహారథః ।
తస్మాత్సుతోఽనిరుద్ధోఽభూన్నాగాయుతబలాన్వితః ॥ 36

మహారథుడగు, సః= ఆతడు, రుక్మిణః= రుక్మియొక్క, దుహితరమ్= కుమార్తెను, ఉపయేమే= వివాహమాడెను, తస్మాత్= ఆతని వలన, నాగ-అయుతబల-అన్వితః= పది వేల ఏనుగుల బలముతో కూడిన, అనిరుద్ధః= అనిరుద్ధుడనే, సుతః= పుత్రుడు, అభూత్= కలిగెను.

మహారథుడగు ఆ ప్రద్యుమ్నుడు రుక్మియొక్క కుమార్తెను వివాహమాడెను. వారికి పదివేల ఏనుగుల బలము గల అనిరుద్ధుడనే పుత్రుడు కలిగెను.

స చాపి రుక్మిణః పౌత్రీం దౌహిత్రో జగృహే తతః ।
వజ్రస్తస్యాభవద్యస్తు మౌసలాదవశేషితః ॥ 37

దౌహిత్రుః= రుక్మియొక్క కూతురు కొడుకైన, సః చ అపి= ఆ అనిరుద్ధుడు కూడ, తస్య= ఆయనయొక్క, పౌత్రీమ్= పుత్రుని కుమార్తెను, జగృహే= వివాహమాడెను, తతః= ఆయన వలన, వజ్రుః= వజ్రుడు, అభవత్= కలిగెను, యుః తు= ఎవడైతే, మౌసలాత్= ముసలకాండనుండి, అవశేషితుః= మిగులునట్లు చేయబడినవాడో.

రుక్మికి కూతురు కొడుకైన అనిరుద్ధుడు రుక్మి కొడుకు కూతురుని వివాహమాడెను. వారికి పుట్టినవాడు వజ్రుడు. ముసలము నిమిత్తముగా యదువంశము నాశనము కాగా, వజ్రుడు మాత్రమే మిగిలెను.

ప్రతిబాహురభూత్తస్మాత్సుబాహుస్తస్య చాత్మజుః ।
సుబాహోశ్శాంతసేనోఽభూచ్ఛతసేనస్తు తత్సుతుః ॥ 38

తస్మాత్= వాని వలన, ప్రతిబాహుుః= ప్రతిబాహుడు, అభూత్= కలిగెను, తస్య చ= వానికి కూడ, ఆత్మజుః= పుత్రుడు, సుబాహుుః=

సుబాహుడు, 'సుబాహోఃసుబాహునకు, శాంతసేనఃశాంతసేనుడు, అభూత్= కలిగెను, తత్-సుతఃఆయన పుత్రుడైతే, శతసేనఃశతసేనుడు.

వజ్రుని పుత్రుడు ప్రతిబాహుడు. ఆయన పుత్రుడు సుబాహుడు. ఆయన పుత్రుడు శాంతసేనుడు. ఆయన పుత్రుడు శతసేనుడు.

న హ్యేతస్మిన్ కులే జాతా అధనా అబహుప్రజాఃl
అల్పాయుషోఽల్పవీర్యాశ్చ అబ్రహ్మణ్యాశ్చ జజ్ఞిరే ॥ 39

అస్మిన్= ఈ, కులే= వంశమునందు, జాతాఃపుట్టినవారు, అధనాఃధనము లేనివారు, అబహుప్రజాఃఅధికసంతానము లేనివారు, అల్ప-ఆయుషఃతక్కువ ఆయుర్దాయము గలవారు, అల్పవీర్యాఃచతక్కువ పరాక్రమము గలవారు, అబ్రహ్మణ్యాఃచబ్రాహ్మణభక్తి లేనివారు, నజజ్ఞిరేపుట్టలేదు, హినిశ్చయము.

ఈ వంశమునందు దరిద్రులు అధికసంతానము లేనివారు, తక్కువ ఆయుర్దాయము గలవారు, తక్కువ పరాక్రమము గలవారు, బ్రాహ్మణభక్తి లేనివారు పుట్టలేదు. ఇది నిశ్చయము.

యదువంశప్రసూతానాం పుంసాం విఖ్యాతకర్మణామ్l
సంఖ్యా న శక్యతే కర్తుమపి వర్షాయుతైర్నృప ॥ 40

నృపఓ రాజా!, యదువంశప్రసూతానామ్= యదువంశములో పుట్టినట్టియు, విఖ్యాతకర్మణామ్= ప్రసిద్ధి గాంచిన క్రియలు గల, పుంసామ్= వ్యక్తుల, సంఖ్యా= సంఖ్య, వర్ష-అయుతైఃఅపి= కొన్ని పదివేల సంవత్సరములచేనైనననూ, కర్తుమ్= చేయుటకు, నశక్యతే= శక్యము కాదు.

ఓ పరీక్షిన్మహారాజా! యదువంశములో పుట్టి లోకప్రసిద్ధమైన కర్మలను చేసిన వ్యక్తుల సంఖ్యను నిర్ధారించుట కొన్ని వేల సంవత్సరముల చేనైననూ సంభవము కాదు.

తిస్రః కోట్యస్సహస్రాణామష్టాశీతిశతాని చ ।
ఆసన్ యదుకులాచార్యాః కుమారాణామితి శ్రుతమ్ ॥ 41

కుమారాణామ్= బాలకులకు, తిస్రః= మూడు, కోట్యః= కోట్లు, సహస్రాణామ్= వేలయొక్క, అష్ట- అశీతిశతాని చ= ఎనభై ఎనిమిది వందలు కూడ, యదుకుల-ఆచార్యాః= యదువంశముయొక్క ఆచార్యులు, ఆసన్= ఉండిరి, ఇతి= అని, శ్రుతమ్= వినికిడి.

యదువంశములోని బాలకులకు శిక్షణను గరపిన ఆచార్యుల సంఖ్య మూడు కోట్ల ఎనభై ఎనిమిది లక్షలు అని వినికిడి.

సంఖ్యానం యాదవానాం కః కరిష్యతి మహాఽత్మనామ్ ।
యత్రాయుతానామయుతలక్షేణాస్తే స ఆహుకః ॥ 42

మహాత్మనామ్= మహాత్ములగు, యాదవానామ్= యాదవులయొక్క, సంఖ్యానమ్= లెక్కను, కః= ఎవడు, కరిష్యతి= చేయగలడు?, యత్ర= ఎవరియందైతే, సః= ఆ, ఆహుకః= ఉగ్రసేనుడు, అయుతానామ్= పదివేలయొక్క, అయుతలక్షేణ= పదివేల లక్షతో, ఆస్తే= ఉన్నాడో.

యాదవులు మహాత్ములు. వారి సంఖ్యను ఎవడు లెక్కించగలడు? ఆ ఉగ్రసేనుని రాజ్యములో 1 00 00 00 00 00 000 (పది లక్షల కోట్ల) మంది జనులు ఉండిరి.

దేవాసురాహవహతా దైతేయా యే సుదారుణాః ।
తే చోత్పన్నా మనుష్యేషు ప్రజా దృప్తా బబాధిరే ॥ 43

దేవ-అసుర-ఆహవహతాఃⁿ దేవాసురసంగ్రామమునందు సంహరించబడిన, సుదారుణాఃⁿ మిక్కిలి భయంకరులైన, యేⁿ ఏ, దైతేయాఃⁿ రాక్షసులు గలరో, తే చⁿ వారు కూడ, మనుష్యేషుⁿ మనుష్యులయందు, ఉత్పన్నాఃⁿ పుట్టినవారై, దృప్తాఃⁿ గర్వించినవారై, ప్రజాఃⁿ ప్రజలను, బబాధిరేⁿ పీడించిరి.

దేవాసురసంగ్రామములో మరణించిన భయంకరులగు రాక్షసులు మానవులై పుట్టి గర్వముతో ప్రజలను పీడించిరి.

తన్నిగ్రహాయ హరిణా ప్రోక్తా దేవా యదోఃⁿ కులే ।
అవతీర్ణాఃⁿ కులశతం తేషామేకాధికం నృప ॥ 44

నృపⁿ ఓ రాజా!, తత్-నిగ్రహాయⁿ వారిని శిక్షించుటకై, హరిణాⁿ శ్రీహరిచే, ప్రోక్తాఃⁿ ఆదేశించబడిన, దేవాఃⁿ దేవతలు, యదోఃⁿ యదువుయొక్క, కులేⁿ వంశమునందు, అవతీర్ణాఃⁿ జన్మించినవారు, తేషామ్ⁿ వారియొక్క, ఏక-అధికమ్ⁿ ఒకటి ఎక్కువగా గల, కులశతమ్ⁿ కులముల వంద.

ఓ పరీక్షిన్మహారాజా! వారిని శిక్షించుటకై శ్రీహరి దేవతలనాదేశించగా, వారు యదువంశములో జన్మించిరి. వారియొక్క వృష్ణి-అంధక-ఇత్యాది కులము (మానవ సముదాయము)లు నూట ఒకటి ఉండెను.

తేషాం ప్రమాణం భగవాన్ ప్రభుత్వేనాభవద్ధరిః ।
యే చానువర్తినస్తస్య ववృధుస్సర్వయాదవాః ॥ 45

తేషామ్ⁿ ఆ యాదవులకు, హరిఃⁿ పాపములను, పోగొట్టే, భగవాన్ⁿ శ్రీకృష్ణ భగవానుడు, ప్రభుత్వేనⁿ స్వామిభావముచే, ప్రమాణమ్ⁿ ఆదర్శము, అభవత్ⁿ ఆయెను, యేⁿ ఎవరైతే, తస్యⁿ ఆయనయొక్క, అనువర్తినఃⁿ ఆజ్ఞను పాలించువారో, సర్వయాదవాఃⁿ సకలయాదవులు, ववृధుఃⁿ వర్ధిల్లిరి.

ఆ యాదవులకు పాపములను పోగొట్టే శ్రీకృష్ణ భగవానుడే ప్రభువు, ఆదర్శము ఆయెను. సకలయాదవులు ఆయన ఆజ్ఞను పాలించి వర్ధిల్లిరి.

శయ్యాఽఽసనాటనాలాపక్రీడాస్నానాదికర్మసు ।
న విదుస్సంతమాత్మానం వృష్ణయః కృష్ణచేతసః ॥ 46

కృష్ణచేతసః= శ్రీకృష్ణునియందు మనస్సు గల, వృష్ణయః= యాదవులు, శయ్యా-ఆసన-అటన-ఆలాప క్రీడాస్నాన-ఆదిషు= నిద్ర కూర్చుండుట తిరుగుట కబుర్లు ఆటలు స్నానము మొదలగువాటియందు, సంతమ్= ఉన్న, ఆత్మానమ్= దేహమును, న విదుః= ఎరుగరు.

శ్రీకృష్ణునియందు లగ్నమైన చిత్తము గల యాదవులు పరుండుట, కూర్చుండుట, తిరుగుట, మాటలాడుట, క్రీడించుట, స్నానము, భోజనము ఇత్యాది క్రియలలో తమ దేహమును కూడ విస్మరించిరి.

తీర్థం చక్రే నృపోనం యదజని యదుషు స్వస్సరిత్పాదశౌచం
విద్విట్స్నిగ్ధాస్స్వరూపం యయురజితపరా శ్రీర్యదర్థేఽన్యయత్నాః ।
యన్నామామంగలఘ్నం శ్రుతమథ గదితం యత్కృతో గోత్రధర్మః
కృష్ణస్యైతన్న చిత్రం క్షితిభరహరణం కాలచక్రాయుధస్య ॥47

నృప= ఓ రాజా!, యదుషు= యాదువులయందు, యత్= ఏ కృష్ణుని కీర్తి, అజని= కలిగెనో అది, పాదశౌచమ్= పాదములను కడిగిన, స్వఃసరిత్= దేవనదియగు గంగను, ఊనమ్= తక్కువదైన, తీర్థమ్= తీర్థమునుగా, చక్రే= చేసెను, విద్విట్-స్నిగ్ధాః= ద్వేషించువారు ప్రేమించువారు, స్వరూపమ్= స్వరూపమును,యయుః= పొందిరి, శ్రీః= లక్ష్మీదేవి, అజితపరా= పరాజయమునెరుగని శ్రీకృష్ణ భగవానుడే ఆశ్రయముగా గలది, యద్-అర్థే= ఏ లక్ష్మి విషయమై, అన్యయత్నాః= ఇతరుల ప్రయత్నమో, యత్-నామ= ఏ శ్రీకృష్ణుని పేరు, శ్రుతమ్= వినబడినదై, అథ= లేదా, గదితమ్= పలుకబడినదై, అమంగలఘ్నమ్= అమంగళములను,

పోగొట్టునదియో, గోత్రధర్మః= ఋషివంశములయందలి ధర్మము, యత్-కృతః= ఏ శ్రీకృష్ణునిచే చేయబడినదియో, కాలచక్ర-ఆయుధస్య= కాలమనే చక్రమే ఆయుధముగా గల, కృష్ణస్య= శ్రీకృష్ణునకు, ఏతత్= ఈ, క్షితిభరహరణమ్= భూభారమును పోగొట్టుట, చిత్రమ్= ఆశ్చర్యము, న= కాదు.

శ్రీకృష్ణుడు యదువంశములో అవతరించి విస్తరింపజేసిన కీర్తిచే, ఆయన పాదములను కడిగిన దేవనది గంగ కూడ తక్కువ తీర్థముగా చేయబడినది. ఆయనను విద్వేషించినవారు, ప్రేమించినవారు కూడ ఆయన స్వరూపమును పొందిరి. ఇతరులు లక్ష్మీదేవికొరకై పాట్లు పడుచుండగా, ఆమె ఆయన సేవలో నిమగ్నమయ్యెను. ఆయన పేరు నుడివినా, విన్నా అమంగళములను పోగొట్టును. ఋషుల వంశములలో ధర్మమునాయన నిలబెట్టెను. కాలమనే చక్రమే ఆయుధముగా గల అట్టి శ్రీకృష్ణుడు భూమి బరువును తగ్గించుట ఆశ్చర్యమేమీ కాదు.

జయతి జననివాసో దేవకీజన్మవాదో
యదువరపరషత్స్వై ర్దోర్భిరస్యన్నధర్మమ్ ।
స్థిరచరవృజినఘ్నస్సుస్మితశ్రీముఖేన
వ్రజపురవనితానాం వర్ధయన్ కామదేవమ్ ॥ 48

జననివాసః= ప్రాణులకు ఆశ్రయమైనవాడు, దేవకీజన్మవాదః= దేవకియందు పుట్టినాడనే వాదము గలవాడు, యదువరపరషత్= యాదవ వీరులు అనుచరులుగా గలవాడు, స్వైః= తన, దోర్భిః= భుజములతో, అధర్మమ్= అధర్మమును, అస్యన్= పారద్రోలువాడు, స్థిరచరవృజినఘ్నుః = స్థావర జంగములగు ప్రాణుల దుఃఖమును పోనాడువాడు, సుస్మిత శ్రీముఖేన= చక్కని చిరునవ్వుతో శోభిల్లే ముఖముతో, వ్రజపుర వనితానామ్= గొల్లపల్లెయందు నగరములయందు యువతులకు, కామదేవమ్= మన్మథుని, వర్ధయన్= వర్ధిల్లజేయువాడు, జయతి= సర్వోత్కర్షగానున్నాడు.

ప్రాణులకు ఆశ్రయమైన శ్రీకృష్ణ భగవానుడు దేవకికి కొడుకై పుట్టినాడనేది మాట వరుసకు చెప్పే మాట మాత్రమే. ఆయన పుట్టుక లేనివాడు. యాదవవీరులు ఆయన సేవకులు. ఆయన తన భుజబలముతో (అనుచరులే భుజములు కాగా) అధర్మమును పారద్రోలెను. చరాచర-ప్రాణుల దుఃఖమును పోనాడే ఆయన చక్కని చిరునవ్వుతో శోభిల్లే ముఖముచే బృందావనము లోనే గాక మథురాది నగరముల యందు కూడ యువతులకు ప్రేమభావమును వర్ధిల్ల జేసెను. అట్టి శ్రీకృష్ణుడు సర్వోత్కర్షగానున్నాడు.

ఇత్థం పరస్య నిజవర్త్మరిరక్షయాఽఽత్త
లీలాతనోస్తదనురూపవిడంబనాని ।
కర్మాణి కర్మకషణాని యదూత్తమస్య
శ్రూయాదముష్య పదయోరనువృత్తిమిచ్ఛన్ ॥ 49

ఇత్థమ్= ఈ విధముగా, నిజవర్త్మరిరక్షయా= తన వేదమార్గమును రక్షించే కోరికతో, ఆత్తలీలాతనోఃస్వీకరించబడిన విలాస కొరకైన దేహము కలిగినట్టియు, యదు-ఉత్తమస్య= యాదవులలో శ్రేష్ఠుడైన, పరస్య= పరమేశ్వరుడగు, అముష్య= ఈ శ్రీకృష్ణునియొక్క, పదయోఃపాదములయందు, అనువృత్తిమ్= ఆసక్తిని, ఇచ్ఛన్= కోరువాడు, తద్-అనురూపవిడంబనాని= ఆ అవతారమునకు తగిన లీలానుకరణముల లైన, కర్మకషణాని= పాపములను పోగొట్టే, కర్మాణి= లీలలను, శ్రూయాత్= వినవలెను.

ఈ విధముగా పరమాత్మ తన వేదమార్గమును రక్షించగోరి విలాసగా దేహమును స్వీకరించి యాదవులలో శ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడాయెను. ఆయన ఆ అవతారమునకు తగిన లీలలను చేసెను. ఈ పరమాత్మయొక్క పాదములయందాసక్తిని కోరే భక్తుడు పాపములను పోగొట్టే ఈ లీలలను శ్రవణము చేయవలెను.

మర్త్యస్తయాఽనుసవమేధితయా ముకుంద-
శ్రీమత్కథాశ్రవణకీర్తనచింతయైతి ।
తద్ధామ దుస్తరకృతాంతజవాపవర్గం
గ్రామాద్వనం క్షితిభుజోఽపి యయుర్యదర్థాః ॥ 50

॥ దశమ స్కంధస్య ఉత్తరార్ధస్సమాప్తః ॥

మర్త్యః= మానవుడు, అనుసవమ్= ప్రతిక్షణము, ఏధితయా= వర్ధిల్లజేయబడిన, తయా= అట్టి, ముకుందశ్రీమత్-కథాశ్రవణకీర్తన చింతయా= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణ భగవానుని శోభాయుక్తమైన గాథలను వినుట కీర్తించుట వలని ఆసక్తిచే, దుస్తరకృత-అంతజవ-అపవర్గమ్= అతిక్రమించ శక్యము కాని కాలముయొక్క వేగముయొక్క నివృత్తి గల, తద్-ధామ= ఆ పరమేశ్వరుని స్వరూపమును, ఏతి= పొందును, క్షితిభుజః అపి= మహారాజులు కూడ, యద్-అర్థాః= దేనిని కోరివారై, గ్రామాత్= గ్రామమునుండి, వనమ్= అడవిని గురించి, యయుః= వెళ్లిరో.

మోక్షప్రదాతయగు శ్రీకృష్ణునియొక్క శోభాయుక్తమగు గాథలను విని కీర్తించుటచే వాటియందు ఆసక్తి కలుగును. అట్టి ఆసక్తిని ప్రతిక్షణము వర్ధిల్లజేసుకొనే మానవుడు ఆ పరమేశ్వర స్వరూపమును పొంది, అతిక్రమించ శక్యము కాని కాలముయొక్క వేగమునుండి నివృత్తుడగును (అమృతత్వమును పొందును). ఆ మోక్షమును కోరియే మహారాజులు కూడ రాజ్యాదికమును విడిచిపెట్టి తపస్సుకై అడవికి వెళ్లిరి.

శ్రీమద్భాగవతము పదవ స్కంధము ఉత్తరార్ధములో
శ్రీకృష్ణ భగవానుని లీలావిహారమును వర్ణించే
తొంబదియవ అధ్యాయము ముగిసినది (90).
దశమ స్కంధము ఉత్తరార్ధము ముగిసినది.
హరిః ఓమ్, తత్సత్, శ్రీకృష్ణార్పణమస్తు.